

శ్రీ యోగవాసిష్ఠము
Vol
7

ఓమ్

వాసిష్ఠ రామాయణము

అను

శ్రీయోగవాసిష్ఠము

(తాత్పర్యప్రకాశికయను ఆంధ్రానువాద సహితము)

మహర్షి వాల్మీకి ప్రణీతము

ఉత్తరార్ధము - తృతీయ సంపుటము

అనువాదకులు :

శ్రీ పూర్ణానంద స్వాములవారు

సంపాదకులు - ప్రకాశకులు :

శ్రీ వ్యాసాశ్రమము

వ్యాసాశ్రమము పోస్టు, (మార్గము) ఏర్పేడు, చిత్తూరు జిల్లా. (ఆ.ప్ర.)

పిన్ : 517 621 ఫోన్ నెం. 08574 - 68528

2009

★

ప్రథమ ముద్రణ 1948 సం॥ము	1000	ప్రతులు
ద్వితీయ మద్రణ 1969 సం॥ము	1000	ప్రతులు
తృతీయ ముద్రణ 1997 సం॥ము	2000	ప్రతులు
చతుర్థ ముద్రణ 2009 సం॥ము	1000	ప్రతులు

మొత్తము	5000	ప్రతులు

వెల : రూ.

ప్రకాశకులు :

శ్రీవ్యాసాశ్రమమువారు

ప్రతులకు :

మేనేజరు, శ్రీ వ్యాసాశ్రమము,

(వయా) ఏర్పేడు - 517 621, చిత్తూరు (జిల్లా)


ఆం.ప్ర. ఫోన్ నెం. 08578 - 287528

ముద్రణ :

శ్రీ పారాశర్య ప్రెస్ - శ్రీవ్యాసాశ్రమము

(వయా) ఏర్పేడు - 517 621, చిత్తూరు (జిల్లా)

ఆం.ప్ర. ఫోన్ నెం. 08578 - 287528



నివేదన

శ్రీవ్యాసాశ్రమం వారు ప్రకటించిన ఆధ్యాత్మిక గ్రంథాలు ఆంధ్రదేశంలో విస్తృతప్రచారం పొందాయి. వాటిలో తలమానికంగా ఎన్నదగినది యోగవాసిష్ఠం. దీన్ని 'వాసిష్ఠ రామాయణం', 'వసిష్ఠగీత' అని కూడా వ్యవహరిస్తారు.

వాల్మీకి కృతిగా ప్రసిద్ధమైన ఈ గ్రంథంలో ముప్పది రెండువేల శ్లోకా లున్నాయి. వైరాగ్య - ముముక్షు - ఉత్పత్తి - స్థితి - ఉపశమ - నిర్వాణ ప్రకరణా లన్న పేరుతో ఆరు విభాగా లున్నాయి. అద్వైతవేదాంతం ఈ పుస్తకంలో అత్యద్భుతంగా ప్రతిపాదింపబడింది. వసిష్ఠ మహర్షి శ్రీరామ చంద్రుణ్ణి ఉద్దేశించి చేసిన తత్త్వోపదేశమే ఇందలి విషయం.

"మహాగ్రంథాలలో ఒకటైన యోగ వాసిష్ఠం నాదృష్టిలో ప్రపంచంలో వ్రాయబడిన గ్రంథాలన్నింటిలోనూ అత్యాశ్చర్యకరమైనది"(One of the greatest books, the most wonderful according to me ever written under the sun, is Yogavasistha.) అని శ్రీ స్వామి రామతీర్థులవారు ఈ గ్రంథాన్ని ప్రశంసించి వున్నారు.

దీన్ని మహర్షి సద్గురు శ్రీమలయాళస్వాములవారు సమగ్రంగా ఆంధ్రతాత్పర్యంతో సహా నలుబదేండ్ల క్రితం ముద్రింపజేశారు. అంతకు ముందెవరూ దీన్ని తెలుగులో సంపూర్ణంగా ముద్రించలేదు. శ్రీ సద్గురు స్వాములవారి ప్రోత్సాహంతో శ్రీపూర్ణానందేత్యవర నామధేయ శ్రీనిర్వికల్పానంద స్వాములవారు ఈ గ్రంథానికి చెందిన పూర్వార్థాన్ని అనువదించారు. తరువాతి భాగాన్ని శ్రీ సద్గురు దేవుల ముఖ్య శిష్యులు శ్రీ విద్యా ప్రకాశానంద స్వాములవారు తెనిగించారు. 1936 లో ప్రారంభమైన దీని ముద్రణ 1954 లో పూర్తి అయింది. నాల్గువేల పుటలకు పైబడిన ఈ పుస్తకం మొదట నాలుగు సంపుటాలుగా రాయల్ సైజులో ప్రచురింపబడింది.

జిజ్ఞాసువులైన పాఠకుల ప్రీతికి పాత్రమై మూడుసార్లు ముద్రితమయింది.

ఇటీవల చాలాకాలం నుండి దుర్లభంగా వుండిపోయిన ఈ గ్రంథరత్నం కావాలంటూ ఆశ్రమానికి పలువురు లేఖలు వ్రాసేవారు. భగవదనుగ్రహం వల్ల, గురుకరుణవల్ల ఈ మహాగ్రంథాన్ని ఇప్పుడు మళ్లీ ప్రచురించే సదవకాశం లభించింది. పాఠకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని దీని నిప్పుడు డెమ్మీ 1/8 సైజులో ఎనిమిది సంపుటాలుగా ప్రచురిస్తున్నాము.

ఈ గ్రంథగౌరవాన్ని గుర్తించి తిరుమల తిరుపతి దేవస్థానం వారు దీని పునర్ముద్రణకు ఉదారంగా ఆర్థిక సహాయం అందించారు. ఇందుకు దేవస్థానం పాలకమండలికి ఎంతో కృతజ్ఞులము. ఈ విషయంలో సహకరించిన ఆశ్రమపూర్వ విద్యార్థి, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీ సముద్రాల లక్ష్మణయ్యగారిని అభినందిస్తున్నాము.

ఈ ఉద్గ్రంథం ఇంకా విస్తృత వ్యాప్తి చెంది పాఠకులకు ఆత్మానందాన్ని ప్రసాదించుగాక!

శ్రీ వ్యాసాశ్రమం — ప్రకాశకులు

22-8-1997.

శ్రీ యోగవాసిష్ఠము

(ఉత్తరార్ధము)

విషయానుక్రమణిక

నిర్వాణ ప్రకరణము, (ఉత్తరార్ధము)

ఓమ్ తత్ సత్.

షష్టితమః సర్గః

[సమాధౌ శబ్దకారిణ్యాః స్త్రియో దర్శనమీర్యతే
తామనాదృత్య భూయోఽపి విచిత్రజగదీక్షణమ్.

ఆ శబ్ద మొనర్చిన స్త్రీని వసిష్ఠుఁడు సమాధియందు దర్శించుట, ఆమె నుపేక్షించి మరల యనేక విచిత్రములైన జగంబులఁ జూచుట, మున్నగు విషయము లిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

తతోఽహమభితో భ్రాన్తస్తాదృశం ప్రవిచారయన్
బహుకాలమసంరుద్ధ సంవిదాకాశతాం గతః. 1

శ్రీ వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! ఆ ప్రకారముగ శబ్దకారణము నన్వేషించుచు నలుదెసల వెతకుచున్న వాఁడనై చాల కాలము అపరిచ్ఛిన్నమైన చిదాకాశరూపత్వమును బొందియుంటిని.

శబ్దం పశ్చాత్తమశ్రౌషమహం వీణాస్వనోపమమ్
క్రమాత్స్ఫుటపదం జాతం తత ఆర్యాత్వమాగతమ్. 2

తదుపరి యా శబ్దమును వీణానాదమువలె వింటిని. అటుపిమ్మటఁ గ్రమముగ నయ్యది సుస్పష్టమై 'ఆర్య'* అను ఛందస్సుయొక్క రూపమును బడసెను.

శబ్దదేశపతద్దృష్టిర్దృష్టవాన్స్మితామహమ్
పార్శ్వే కనకనిష్పన్నప్రభయా భాసితామ్బరామ్. 3

ఆ శబ్దము కలుగు ప్రదేశమున నా (యోగ) దృష్టి పడఁగనే, ప్రక్కననే సువర్ణ ప్రకాశమువంటి దీప్తిచే నాకాశమును ప్రకాశిత మొనర్చుచున్నట్టి యొక స్త్రీని గాంచితిని.

ఆలోలమాల్యవసనామలకాకులలోచనామ్
లోలద్ధమ్మిల్లవలనామన్యాం శ్రియమివాగతామ్. 4

కాన్తకాఞ్చనగౌరాఙ్గీం మార్గస్థనవయౌవనామ్
వనదేవీమివామోదిసర్వావయవసున్దరీమ్. 5

సా పూర్ణచన్ద్రవదనా పుష్పప్రకరహాసినీ
యౌవనోద్దామవదనా పద్మలక్షణశాలినీ. 6

ఆకాశకోశసదనా శశాఙ్కకరసున్దరీ
ముక్తాకలాపరచనా కాన్తా మగను సాంగణీ. 7

* ప్రథమ తృతీయ పాదములందు 12 మాత్రలు, ద్వితీయపాదమందు 18 మాత్రలు, చతుర్థపాదమందు 15 మాత్రలు గలది 'ఆర్య' ఛందస్సనఁబడును.

ఆమె చంచలములైన వస్త్రములను, ఆభరణములను ధరించియున్నదియు, నేత్రముల వఱకు వ్యాపించిన కేశములు గలదియు, చంచలమైన కేశబంధనముతోఁ గూడియున్నదియు, రెండవ లక్ష్మియేతెంచినదా యన్నట్లున్నదియు, అతిరమణీయమగు సువర్ణమువలె గౌరవర్ణములైన అవయవములు గలదియు, నవయౌవనముతో గూడియున్నదియు, వనదేవివలెఁ బ్రసన్న మొనర్చునదియు, సుందరమైన సర్వావయవములతోగూడి యొప్పునదియు, పూర్ణచంద్రునివంటి ముఖము గలదియు, పుష్పసమూహమువలె హాస్యయుక్తయు యౌవన శోభితమగు ముఖముచే నలరారుచున్నదియు, తెప్పవెంద్రుకల లక్షణములచే మిగుల శోభాయమానమై యున్నదియు, భూతాకాశమందు వసించునదియు, చంద్రకిరణములవలె సుందరమైనదియు, ముత్యాలహారమును ధరించి యున్నదియు, నన్ననుసరించి యేతెంచుచున్నదియునైయుండెను.

స్వరేణ మధురేణైవమార్యామార్యవిలాసినీ
పపాఠా కఠినం వామా మత్పార్శ్వే మృదుహాసినీ. 8

ఉత్తమ విలాసవతియు, మందహాసమొనర్చుచున్నదియు నగు ఆ స్త్రీ నా సమీపమున మృదుమధురస్వరముతో ఈ 'ఆర్య'(ఛందస్సు)ను బఠించెను.

అసదుచితరిక్తచేతన సంసృతిసరితి ప్రముహ్యమానానామ్
అవలమ్బనతటవిటపిన మఖినౌమి భవన్తమేవ మునే. 9

'దుష్టులచే సేవింపఁబడునవైన రాగ, ద్వేష, కామ, క్రోధాది దోషము లెవ్వియు లేనట్టి చిత్తము గలవాఁడవును, సంసారమను నదియందు మునుఁగుచున్నవారికి అవలంబనార్థము తీర మందలి వృక్షమువంటివాడవు నగు నో మునీంద్రా! మిమ్ములనే సర్వశ్రేష్ఠులుగ నెఱిఁగి నమస్కరించుచున్నాను!

శ్రీవసిష్ఠ ఉవాచ:—

ఇత్యాకర్ణ్యాహమాలోక్య తాం చారువదనస్వనామ్
లలనేయం కిమనయేత్యనాదృత్యైవ తాం గతః. 10

శ్రీ వసిష్ఠుఁడు:— రామచంద్రా! అది విని నేనా యుత్తమ శబ్ద సహితమైన ముఖము గల స్త్రీని గాంచి, 'ఈమె స్త్రీయై యున్నది, స్త్రీతో నాకేమి ప్రయోజనమ'ని తలంచి యామె నుపేక్షించి వెడలితిని.

తతో జగద్వ్యాప్తమయీ మాయాం సంప్రేక్ష్య విస్మితః
అనాదృత్యైవ తాం వ్యోమ్ని విహర్తుమహముద్యతః. 11

పిదప అనేకజగత్సమూహములచేఁ బూర్ణమగు మాయ నవలోకించి యాశ్చర్యమొందితిని. అత్తఱి యా మాయనుగూడ నుపేక్షించి యాకసమున సంచరించుట కుద్యుక్తుఁడనైతి.

తతస్తాం తత్కృతాం చిన్తామలముత్సృజ్య ఖే స్థితామ్
జగన్మాయాం కలయితుం వ్యోమాత్మాహం ప్రవృత్తవాన్. 12

తదుపరి యా మాయాజనితమగు చింతనుగూడఁ బారద్రోలి చిదాకాశమున నున్న జగన్మాయ నెఱుఁగుటకై చిదాకాశరూపుఁడనైతిని.

యావత్తాని తథోగ్రాణి జగన్తి సకలాని ఖమ్
శూన్యమేవ యథా స్వప్నే సంకల్పే కథనే తథా. 13

ఇంతలో ఆ ప్రపంచములన్నియు స్వప్న, సంకల్ప, కథా జగత్తులవలె శూన్యరూపముగనే గన్పట్టినవి

న పశ్యన్తి న శృణ్వన్తి కదాచిత్కానిచిత్క్వచిత్
తాని కల్పమహా కల్పమహాజన్మైకతాన్యథ. 14

శూన్యరూపములే యగుటచే పరమార్థమున ఆ జగంబు లెవ్వియు నెచటను దేనిని గాంచుటలేదు, వినుటలేదు.

ప్రమత్త పుష్కరావర్తానున్మత్తోత్పాతమారుతాన్
స్ఫుటితాద్రీన్ద్రఘోరాకారఘటిత బ్రహ్మమణ్డపాన్. 15

జ్వలత్కల్పాగ్నివిస్ఫోటచటద్వైడవిడాస్పదాన్
ప్రతపద్ద్వాదశాకారకన్దు మార్తణ్డమణ్డలాన్. 16

లుఠత్సురపుర వ్రాత వితతాక్రన్దఘర్ఘరాన్
రణసర్వాద్రి కటకశ్రేణీనిగిరణోద్ధృతాన్. 17

కల్పాగ్నిజ్వలనోల్లాస పతత్పట పటారవాన్
అత్మభ్రంశ బృహత్క్షోభ క్షుబ్ధామ్బర మహార్ణవాన్. 18

దేవాసురనరాగారఘర్ఘరాక్రన్దకర్కశాన్
సప్తార్ణవమహాపూరపూరితార్కేన్దుమణ్డలాన్. 19

ప్రమత్తపుష్కర, ఆవర్తములను మేఘములతోఁ గూడినవియు, నాశకరమగు ప్రచండ వాయుసహితములును, ప్రేలుచున్న మహాపర్వతములయొక్క భయంకర శబ్దములచే బ్రహ్మాండ మండపమును బూరించునవియు నగు యా (జగంబులయొక్క) కల్పాంతములు పరస్పర మొకదాని నొకటి యఱుఁగుటలేదు. అట్లే జ్వలించు ప్రళయాగ్నిచే, కుబేరుని భవనములను చటచటాశబ్దములచే భస్మమొనర్చునవియు, మహాప్రదీప్తములైన బంతులవంటి యాకృతిగల ద్వాదశాదిత్యులయొక్క మండలములచేఁ బూర్ణములై యున్నవియు, ఇటు నటు దొరలుచున్న దేవతల నగరసమూహములయొక్క మహారోదనములచే గలిగిన ఘర్ఘరధ్వనులతోఁ గూడినవియు, శబ్దమొనర్చుచున్న సమస్తపర్వతశ్రేణులను కబళించుటయందుఁ దత్పరములును, ప్రళయాగ్నిజ్వాలలయొక్క విలాసములచే మత్పన్నములైన స్పష్టములగు పటపటాశబ్దములచేఁ బూర్ణములును, ఆత్మజ్ఞానములేని దేవతలయొక్క క్షోభచే క్షుభితమైనట్టి యాకాశమను సముద్రములు గలవియు, దేవ, అసుర, మనుజులయొక్క నివాసస్థానముల ఘర్ఘరరోదనములచే కర్కశములై యున్నవియు, వృద్ధినొందిన సప్తసముద్రములయొక్క మహాప్రవాహములచే సూర్యచంద్రమండలములనుగూడఁ బూర్ణమొనర్చునవియు నగు ఆ మహాకల్పాంతములు పరస్పరమొకదాని వృత్తాంతమును మఱియొకటి యెఱుఁగుటలేద..

న విచేతన్తి కల్పాన్తాన్సర్వాణ్యేవ పరస్పరమ్
ఏకమన్దిరసంసుప్తాః స్వప్నే రణరయానివ. 20

ఓ రామచంద్రా! ఒకే మందిరమున నిదురించుచున్న మనుజులు తమతమ స్వప్నములందొకరి సంగ్రామశబ్దములను మఱియొకరు వినజాలఁనట్లు, ఆ యనేక బ్రహ్మాండములయొక్క కల్పాంతము లన్నియు పరస్పర మొకదాని వృత్తాంతమును మఱియొకటి యెఱుఁగకయున్నవి.

తత్ర రుద్రసహస్రాణి బ్రహ్మకోటిశతాని చ
దృష్టాని విష్ణులక్షాణి కల్పవృన్దాన్యలం మయా. 21

పరస్పర మొకదాని దృష్టియందు మఱియొకటి శూన్యమైనట్టి యా బ్రహ్మాండములందు వేలకొలఁది. రుద్రులను, కోట్లకొలఁది బ్రహ్మదేవులను లక్షలకొలఁది విష్ణువులను, అనేక కల్పసమూహములను నేను బాగుగ వీక్షించితిని.

తత్ర క్వచిదనాదిత్యే నిరహోరాత్రభూతలే
అకల్పయుగవర్షాన్తే జగత్స్యాహైః క్షయోదయః. 22

ఆ పలువిధములగు జగత్తులందొకానొకచోట సూర్యరహితమై, రాత్రిందినవర్జితమై, కల్పయుగ, వత్సరాంతశూన్యమైనట్టి చిద్వస్తునందు, సంకల్పవికల్పముల ఊహామాత్రముచేతనే సమస్తము యొక్క క్షయోత్పత్తులు సంభవించుట నేను గాంచితిని.

చితి సర్వం చితః సర్వం చిత్సర్వం సర్వతశ్చ చిత్
చిత్సత్సర్వాత్మికేత్యేతద్దృష్టం తత్ర మయాఖిలమ్. 23

ఓ రామచంద్రా! సమస్తము చైతన్యముననేగలదు; చైతన్యమునుండియే సమస్తము కలుగుచున్నది. చైతన్యమే సమస్తమున్నునైయున్నది. అంతట చైతన్యమే వ్యాపించియున్నది. వెయ్యేల సన్మాత్రమగు చైతన్య మెద్దిగలదో యది సర్వాత్మకమైయున్నదని నేనచట (యోగదృష్టిచే) సర్వము పరీక్షించి చూచితిని.

త్వం కించిదితి చేద్వక్షి తత్ర కించిదివాఙ్గ చిత్
సా హి శూన్యతమా వ్యోమ్నో న చ నామ న కించన. 24

ప్రియుఁడవగు రామచంద్రా! ఘటపటాది నామములచే నీవు దేనినైన చెప్పునపుడు అట, ఆయా నామరూపములచే చైతన్యమే చెప్పఁబడుచున్నదగును. అట్లు చైతన్యమొకింత నామరూపాత్మకముగ నగుట యేదిగలదో, అదియే పదార్థముల యుత్పత్తియగును. ఎపుడా చైతన్యమే ఆకాశముకంటె శూన్యతమమైనట్టి రూపముఁచే జెప్పఁబడునో, అపుడిది నామరూప రహితమగుటఁ బట్టి అట్టి దశయే పదార్థముల క్షయమగును.

తదాకాశమిదం భాతి జగదిత్యభిశబ్దితమ్
తేనైవ శబ్దనభసా సర్వం హి పరమం నభః. 25

చిదాకాశరూపమగు ఆ శూన్యమైన యాకాశమే వాయ్వాది క్రమమువలన జగత్తని చెప్పఁబడుచున్నది. అదియే శబ్దతన్మాత్ర రూపమగుటచే సర్వ వస్తువులయొక్క నామ మగుచున్నది. మఱియు 'అహం బ్రహ్మాస్మి' 'తత్త్వమసి' 'నేహ నానాస్తి కించన' (నేను బ్రహ్మము, నీవు బ్రహ్మము, ఇట ననేక మేమియులేదు) - ఈ మున్నగు శబ్దరూపములందు పరిణతమగు యాకాశముచే సర్వము చిదాకాశముగనే భాసించుచున్నది. ఇదియే ప్రపంచముయొక్క పూర్ణ క్షయమగును.

దృశ్యదృష్టిరియం భ్రాన్తిరాకాశతరుమఞ్జరీ
చిద్వ్యోమైకమేవేతి తత్రాహమనుభూతవాన్. 26

ప్రియుఁడవగు రామచంద్రా! ఆకాశ వృక్షముయొక్క పూగుత్తివలె, ఈ దృశ్య దృష్టి కేవలము భ్రాంతిమాత్రమైయున్నది. శేషించిన చిదాకాశమెద్ది గలదో, అదియే నిరతిశయ సుఖ రూపమని నేను సమాధికాలమున ననుభవించితిని.

బుద్ధ్యాకాశైకరూపేణ వ్యాపినా బోధరూపిణా
తత్రానన్తేన సంకల్పమనుభూతమిదం మయా. 27

బ్రహ్మవ్యోమ జగజ్జాలం బ్రహ్మవ్యోమ దిశో దశ
బ్రహ్మవ్యోమ కలాకాలదేశద్రవ్యక్రియాదికమ్. 28

ఆ సమాధియందు, అంతిమ సాక్షాత్కార వృత్తిరూపమగు ఆకాశమున నావిర్భూతమైన చిదాకాశముతోటి యేకత్వమొందినవాఁడనై, సర్వవ్యాపినై, అనంతరూపుఁడనైన నే నపుడు నిస్సంకల్ప పూర్వకముగ - ఈ సమస్త బ్రహ్మాండ సమూహమున్ను, తదంతర్గతమగు దశదిశలున్ను, దేశకాల ద్రవ్య క్రియా కల్పనయు, సమస్తము బ్రహ్మకాశరూపమే యను ననుభవమును బొందితిని.

తత్రాహమివ సంసారశతే భాతే మునీశ్వరాః
దృష్టా వసిష్ఠనామానో బ్రహ్మపుత్రాః సదుత్తమాః. 29

యుగ భేదములతోఁగూడి ప్రకాశించు ఆ యనేక జగంబులందు నావంటి రూపము గలవారును, వసిష్ఠుఁడను పేరుగలవారును, బ్రహ్మపుత్రులును, మిగుల యుత్తములునగు అనేక మునీశ్వరులను గాంచితిని.

బ్రహ్మన్ద్వ్యాసప్తతి స్త్రేతాః సర్వా ఏవ సరాఘవాః
తత్ర దృష్టం కృతశతం ద్వాపరాణాం శతం తథా. 30

ఓ రామచంద్రా! రామావతార సహితములగు డెబ్బదిరెండు త్రేతాయుగములను, - నూఱు కృతయుగములను, నూఱు ద్వాపరయుగములను గూడ నేనచటఁ జూచితిని.

భేదోదయేన వై దృష్టాస్తాస్తాః సర్గదశాస్తథా
బోధేన చేత్తదత్యచ్ఛమేకం బ్రహ్మ నభస్తతమ్. 31

భేదవాసనోద్బోధముచే నేనా యా సృష్టి దశల నన్నింటిని అవ్విధమున వీక్షించితిని కాని, బ్రహ్మజ్ఞానముచే నద్దానినంతయు అతి నిర్మలమై, ఏకమై, సర్వవ్యాపకమైనట్టి చి[దాకాశ] మాత్రముగనే గాంచితిని.

నేదం బ్రహ్మణి నామాస్తి జగద్బ్రహ్మణ్యథ త్విదమ్
బ్రహ్మైవాజమనాద్యన్తం తత్సర్వం తత్పదాదికమ్. 32

నామరూపదృష్టిచేఁ జగత్తు బ్రహ్మమందులేదు. అధిష్ఠానచైతన్యదృష్టిచేఁ గలదు. అట్టి చైతన్యదృష్టియందీజగత్తంతయు అజమై, అనాదియై, అనంతమైనట్టి బ్రహ్మపదరూపమేయైయున్నది.

పాషాణమౌనప్రతిమం న కించిదభిశబ్దితమ్
యత్తత్కించిదితి ద్యోతరూపం బ్రహ్మ జగత్స్మృతమ్. 33

శిలవలె మౌనరూపమై, నామరూపవర్జితమై జ్యోతిస్వరూపమైనట్టి బ్రహ్మమే యిట్లు జగద్రూపముగ నున్నదని చెప్పఁబడినది

విభాత్యచేత్యం చిద్వ్యోమ్ని స్వసత్తైవ జగత్తయా
నిరాకారే నిరాకారా స్వప్నానుభవసంనిభా. 34

నిరాకారమగు చిదాకాశమున వాస్తవముగ చేత్యము (విషయము) లేకయే నిరాకారమగు చైతన్యము స్వసత్తచే స్వప్నచందమున ఈ జగద్రూపముగ భాసించుచున్నది.

అనన్యమాత్మనో బ్రహ్మ సర్వం భామాత్రరూపకమ్
ప్రకాశనమివాలోకః కరోతి న కరోతి చ. 35

జ్యోతి ప్రకాశనము చేయునట్లును, కాని, తనకంటె వేఱుగ ప్రకాశనమును జేయకయునుండునట్లును ప్రకాశమాత్రరూపమగు బ్రహ్మమున్ను ఈ జగత్తును తనకంటె వేఱుకాని రూపమున రచించుచున్నది. వేఱగు రూపమున రచించుటయు లేదు.

తేషు నామానుభూయన్తే జగల్లక్షేషు తత్ర వై
ఉష్ణాని చన్ద్రబిమ్బాని సూర్యాః శీతలమూర్తయః. 36

బ్రహ్మముయొక్క వివర్తరూపములగు ఆ యనేకజగత్తులందుఁ గొన్ని చోట్ల చంద్రబింబము లుష్ణములుగను, సూర్యబింబములు శీతలములుగను అనుభూతములగుచుండెను.

ప్రజాస్తమసి పశ్యన్తి పశ్యన్త్యేవ న తేజసి
ఉలూకస్య సమాచారస్తస్యైవ సదృశస్వరాః. 37

గుడ్లగూబలవంటి స్వరము గలవారును, వానివలె దర్శనాది వ్యవహారములు గలిగియున్నవారునై (ఆ జగంబులందు) కొందఱు జనులు చీఁకటియందు జూచుచుండిరి. ప్రకాశమందుఁ జూచుటలేదు.

ఇతః శుభేన నశ్యన్తి యాన్తి పాపైస్తథా దివమ్
విషాశనేన జీవన్తి మ్రియన్తేఽమృతభోజనైః. 38

అట్లే కొందఱు శుభకర్మలచే నశించుచుండిరి. అశుభకర్మలచే స్వర్గమునకుఁ జనుచుండిరి. కొందఱు విషభక్షణముచే జీవించుచుండిరి. కొందఱు అమృతభక్షణముచే మరణించుచుండిరి. (మనఃకల్పనయొక్క నిరంకుశత్వము దీనివలన [ఊ]హింపనగును.)

యద్యథా బుధ్యతే బోధే యథోదేత్యథహా స్వతః
తథాశు స్ఫుటతామేతి సద్వాసద్వా తదేవ తత్. 39

సత్తుగాని, అసత్తుగాని యగు ఏ వస్తువు చిరకాల దృఢాభ్యాసముచే హితముగగాని, అహితముగగాని యెట్లు నిశ్చయింపఁబడుచున్నదో, అది కర్మవశముచే భోగకాలమున శీఘ్రముగ ఆ రూపముగనే స్పష్టముగఁ బ్రకటమగుచున్నది.

విటపాకారమూలౌఘదర్శనాద్వజ్రశోభిభిః
ఘూర్ణతే పత్రపుష్పాఢ్యైః పాదపైర్వ్యోమ్ని కాననమ్. 40

ఆ బ్రహ్మాండములందుఁ గొన్నిచోట్ల, శాఖలవంటి యాకృతిగల మూలసమూహము యొక్క దర్శనముచే వజ్రమువలె దృఢముగ శోభించుచున్నవియు, పత్ర పుష్పాదులతోఁ గూడి యున్నవియు నగు వృక్షములు గల వనము లాకసమునఁ దిరుగుచుండెను.

సికతాః పీడితాః సత్యః స్రవన్తి స్నేహజం రసమ్
శిలాఫలకకేభ్యశ్చ జాయన్తే కమలాన్యలమ్. 41

దారుణ్యశ్మని భిత్తౌ చ చఞ్చలాః శాలభఞ్జికాః
దేవాఙ్గనాభిః సహితం గాయన్తి కథయన్తి చ. 42

మేఘాన్పరిదధత్యుచ్చైర్భూతాన్యుచ్చైః పటానివ
ప్రతివర్షం విజాతీయాన్యుత్పద్యన్తేఫలాన్యగే. 43

సంనివేశైర్న నియతైరఙ్గానాం వివిధాఙ్గకైః
శిరోభిః సర్వభూని పరిక్రామన్తి భూమిగైః. 44

శాస్త్రవేదవిహీనాని నిర్ధర్మాణ్యేవ కానిచిత్
యత్కించనైకకారీణి తిర్యగ్వన్తి జగన్త్యధః. 45

కామసంవిత్తిహీనాని నిఃస్త్రీజాతాని కానిచిత్
భూతైః సంశుష్కహృదయైర్వ్యాప్తాన్యశ్మమయైరివ. 46

పవనాశనభూతాని సమరత్నాశ్మకాని చ
అజాతార్థాన్యలుబ్ధాని నిగర్వాణీవ కాని చ. 47

క్వచిత్ప్రత్యేకమాత్మానం పశ్యత్యాప్నోతి నేతరత్
బహుభూతకమప్యస్తి జగదిత్యేకభూతకమ్. 48

నఖకేశాదికే యద్వత్తద్వదన్యత్ర సంస్థితః
ఆత్మవత్సర్వభూతానామేకీభూతాత్మభావనా. 49

ఆ బ్రహ్మాండములందుఁ గొన్నిచోట్ల తైలయంత్రములచే పిండఁబడుటచే ఇసుకనుండికూడ తైలము వచ్చుచుండెను. అట్లే శిలాఫలకమునుండి కమలములున్ను బాగుగ జనించుచుండెను. కాష్ఠ, శిలా, భిత్తులందును జంచలములైన విగ్రహములు దేవతాస్త్రీలతో గలసి గాన మొనర్చుచుండెను.

సంభాషణమున్ను గావించుచుండెను. పెక్కురు గొప్పగొప్ప మేఘములనుగూడ వస్త్రములవలె ధరించుచుండిరి. ప్రతి సంవత్సరము వృక్షములందు విజాతీయఫలము లుత్పన్నములగుచుండెను. ఎన్నియో ప్రాణుల అవయవములయొక్క స్థానములున్ను, రచనయున్ను అనియతమైయుండెను. మఱియు నెందఱో జీవులు తమ శిరస్సులచే నడచుచుండిరి. అధోలోకములు పశ్వాది ప్రాణి మాత్ర పూర్ణములై వేద, శాస్త్రవిహీనములై, ధర్మరహితములై తమ యిచ్చవొప్పున వర్తించు జీవులతోఁ గూడియుండెను. కొందఱు కామవేదనారహితులై యుండుటచే స్త్రీకి జనింపనివారైయుండిరి. కొన్నిలోకములు, శిలవలె దయాశూన్యులై, మహా శుష్కహృదయులైనట్టి జీవులచే వ్యాప్తములై యుండెను. మఱికొన్ని లోకములు కేవలము వాయుభక్షకులగు సర్పములచే బూర్ణములై యుండెను. కొన్నిచోట్ల శిలలు, రత్నములు సమానముగనే యుండెను. ఎందఱోజనులు ధనవ్యవహారరహితులై, నిగర్వులైయుండిరి. కొన్నిజగత్తులందు వ్యష్ట్యహంభావభేదములేకయే సమష్టి విరాడహంభావముచేతనే సర్వదేహముల వ్యవహారము జరుగుచుండెను. ఏల యనఁగా, నఖ, కేశాదుల యుత్పత్తి ఛేదనములను జీవుఁడు తనశరీరమున కాంచునట్లు, ఆ బ్రహ్మాండములందలి జీవులు తక్కిన యనేకజీవుల దేహములందును తమ జన్మాదులను వీక్షించు వారును, ఏకాత్మభావనచే సర్వభూతములను తమవలెనే గాంచువారులైయుండిరి. కొన్నిజగంబులనేక విధములగు ప్రాణులతోడను, మఱికొన్ని యొకేవిధమగు జీవులతోడను గూడియుండెను.

అనన్తాపారపర్యన్తం శూన్యమేవ బహు క్వచిత్
యత్నతః సంవిదాప్నోతి తస్యాన్తే న జగత్పునః. 50

ఒకానొకచోట సృష్టినిగూర్చిన భేదవాసన మఱుఁగుపడుటచే అనంతమై, అపారమై, శూన్యమైనట్టి అవ్యాకృతాకాశమే అనుభూతమగుచుండెను. మరల సృష్టివాసనారూపమగు యత్నముచే ఆ శూన్యత్వము తిరస్కరింపబడి జగత్తు గాంచఁబడు చుండెను.

అత్యన్తాబుద్ధబుద్ధాని మోక్షశబ్దార్థ దృష్టిషు
దారు యన్త్రమయా శేషభూతౌఘానీవ కానిచిత్. 51

నిర్విశేష బ్రహ్మభావన దృష్టులందు ఆలోకములన్నియు అత్యంత మిథ్యారూపములై యొప్పుచుండెను. మఱియు, చైతన్యమును వేఱుచేసి చూచినచో ఆలోకములందలి ప్రాణిసమూహమంతయు, కాష్ఠనిర్మిత గజ, అశ్వాదులవలె గానుపించుచుండెను.

ఋక్షచక్రవిహీనాని నిష్కాలకలనాని చ
మూకసంకేతసారాణి భూతజాలాని కానిచిత్. 52

కానిచిద్వర్జితాన్యేవ నేత్రశబ్దార్థసంవిదా
వ్యర్థదీప్తాత్మతేజాంసి భూతానీత్యేక చిన్తయా. 53

ఓరామచంద్రా! కొన్నిలోకములు జ్యోతిశ్చక్రవిహీనములై యుండుటచే కాలకల్పనారహితములై వెలయుచుండెను. మఱికొన్నిలోకములు సంకేతమాత్రముచే వ్యవహరించునట్టి మూఁగజీవులతోఁగూడియుండెను. అట్లే కొన్ని జగత్తులందలి జీవులు నేత్రేంద్రియమున్ను, తజ్జనితజ్ఞానమున్ను లేనివారై యుండుటచే నట సూర్యాదుల ప్రకాశము వ్యర్థమైయుండును! ఈ ప్రకారముగ ఆ యా జగత్తులయొక్క స్థితిని ఏకాగ్రచిత్తుఁడగు యోగియొక్క కల్పనచే నేను నీకుఁ దెలియఁజేసితిని.

ప్రాణసంవిద్విహీనాని వ్యర్థామోదాని కానిచిత్
మూకాని శబ్దవైయర్థ్యాచ్ఛ్రుతిహీనాని కానిచిత్. 54
వాక్యసంవిద్విహీనత్వాన్మూకాన్యన్యాని కానిచిత్
స్పర్శసంవిద్విహీనత్వాదశ్మాఙ్గానీవ కానిచిత్. 55
సంవిన్మాత్ర మయాన్యేవ దృష్టాన్యపి చ కానిచిత్
వ్యవహారిణ్యపగ్రాహ్యాణ్యేవ నిత్యం పిశాచవత్. 56

మఱికొన్ని లోకములందలి జీవులు ఘ్రాణేంద్రియమున్ను తజ్జనిత జ్ఞానమున్ను లేక యుండుటచే సుగంధదుర్గంధములట వ్యర్థమేయగుచుండెను. అట్లే కొన్నిచోట్లమూఁగవారును, చెవిటివారును మాత్రముండుటచే నచట శబ్దము వ్యర్థత్వముఁ జెందుచుండిరి. కొన్నిలోకములందు వాక్య జ్ఞానవిహీనులగు మూఁగ జీవులు మాత్రము వసించుచుండెను. ఇంకకొన్ని ప్రదేశములందలి జీవులు స్పర్శేంద్రియ రహితులగుటచే శిలవంటి అవయవములు గలిగియుండిరి. గొందఱు జీవులు కేవలము మనోరాజ్యసదృశులుగను యుండిరి. మఱికొందఱు వ్యహారయుక్తులైయున్నను, ఇంద్రియములచే అగ్రాహ్యులగుటచే నిత్యము పిశాచములవలె వెలయుచుండిరి.

భూమయాన్యేకనిష్ఠాని నిష్పిణ్డాన్యేవ కానిచిత్
కానిచిద్వారిపూర్ణాని వహ్నిపూర్ణాని కానిచిత్ 57
కానిచిద్వాతపూర్ణాని సర్వాకారాణి కానిచిత్

కొన్నిలోకములు కేవలము పృథివీమయములై యుండెను. కొన్ని ఘనత్వశూన్యములై వర్తించుచుండెను. అట్లే కొన్ని జలమయములై, కొన్ని అగ్నిమయములై, కొన్నివాయుమయములై, యొప్పుచుండెను. ఇంకకొన్ని, సర్వకార్యసమర్థములగు సర్వవస్తువులతోఁ గూడియుండెను.

జగన్తివ్యోమరూపాణి బత తత్ర కచన్తి ఖే. 58

ఓ రామచంద్రా! ఆశ్చర్యము! చిదాకాశమున చిదాకాశరూపములేయగు ఇట్టి యనేక జగంబులు భాసించుచున్నవి.

ధరాపీఠైక పూర్ణేషు తిష్ఠన్త్యన్యేషు దేహినః
భేకా ఇవ శిలాకోశే కీటా ఇవ ధరోదరే. 59
జలైకపరిపూర్ణేషు తిష్ఠన్త్యుర్వీవనాద్రిషు
భ్రమన్త్యన్యేషు భూతాని నిత్యమేవోగ్రమీనవత్. 60
అన్యేష్వగ్న్యేకపూర్ణేషు జలాదిరహితాన్యపి
భూతాన్యగ్నిమయాన్యేవ స్ఫురన్త్యలమలాతవత్. 61
అన్యేష్వనిల పూర్ణేషు భూతాన్యన్తేతరాణ్యపి
వాతమాత్రమయాఙ్గాని స్ఫురన్త్యర్జునవాతవత్. 62
అన్యేషు వ్యోమమాత్రాత్మదేహేషు వ్యోమరూపిణః
ప్రాణినః సన్తి సర్గేషు దర్శనవ్యవహారిణః. 63

శిలయందు కప్పలవలెను, భూమియందు కీటకములవలెను, కేవలము పృథివీమయములగు కొన్ని లోకములందు జీవులు వసించుచున్నారు. అట్లె జలైకపరిపూర్ణములగు ఇతరలోకములందు పృథివీ, వన, పర్వతాదులందు, జలమందుఁ బెద్దచేపవలె జీవులు నిత్యము సంచరించుచున్నారు. ఆవిధముగనే జలాదిరహితములై, కేవలము అగ్నిమయములైనట్టి కొన్ని లోకములందు అగ్నిమయములగు జీవులు, ఆలాత (కొఱవి) చక్రమువలె స్ఫురించుచున్నారు. ఆరీతిగనే యితర భూతములులేక, కేవలము వాయువు పూరితములైనట్టి లోకములందు వాయుమయులగు జీవులు, వాతరోగవాయువువలె సంచరించుచున్నారు. అట్లే కేవలము ఆకాశమయములైనట్టి లోకములందు ఆకాశమాత్రదేహధారులగు జీవులు దర్శనాది వ్యవహారములఁ గావించుచున్నారు.

పాతాలపాతిషు తథామ్బరముత్పతత్సు
తిష్ఠత్సు విభ్రమపదేష్వథ దిఙ్ముఖేషు
నానాజగత్సు కిమివాస్తి మయా న దృష్టం
యన్నామ చిజ్జలధిచఞ్చలబుద్బుదేషు. 64

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే జగజ్జాలవర్ణనం
నామ షష్టితమః సర్గః ॥ 60 ॥

ఓ రామచంద్రా! చిదాకాశమునఁ గల్పింపఁబడినట్టి దిక్కులందంతటఁ పరిభ్రమించుచున్నవియు, పాతాళమునఁబడుచు, ఆకాశమున కెగయుచున్నవియు, అనేక విభ్రమములకు స్థానభూతమైనవియు, చైతన్యమను సముద్రముయొక్క చంచలబుద్బుదములవంటివియునగు ఆ యనేక బ్రహ్మాండములందు నేను గాంచని దేది గలదు? (సర్వజ్ఞుఁడును, సాక్షియు నగుటచే సర్వము గాంచెనని భావము).

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున
నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున జగజ్జాలవర్ణన
మను నఱువదవ సర్గము ॥ 60 ॥

ఏకషష్టితమః సర్గః

[అజ్ఞాతబ్రహ్మహృదయం జగన్నాశేప్యనశ్వరమ్
జ్ఞాతే తు బ్రహ్మణి జగన్నాసీదస్తి భవిష్యతి.

బ్రహ్మము నెఱుఁగనిచో జగత్తు నశించినను నశించనిదేయగును, ఎఱిఁగినచో భూతభవిష్యద్వర్తమానములందును జగత్తు లేనిదే యగునను విషయ మిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచః—

చిదాకాశాచ్చిదాకాశే పయసీవ పయోరయాః
చిత్త్వాజ్జీవాః స్ఫురన్త్యేతే ఏత ఏవ మనాంసి నః.

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! చిత్స్వరూపమునుగూర్చిన అజ్ఞానముచే చిదాకాశమున, ప్రాణరూపోపాధిచే పరిచ్ఛిన్నులగు చైతన్యరూపజీవులు జలమందు జలవేగములవలె, స్ఫురించుచున్నారు. ఆ పరిచ్ఛిన్న చైతన్యరూపములే ఉత్తరోత్తరము అనేకసంకల్పవికల్పములచే తమయందు కరణభావమును బొందినవై మనయొక్క మనంబు లనఁబడుచున్నవి.

విశదాకాశరూపాణి తాన్యేవ చ మనాంసి నః
జగన్తి తాన్యనన్తాని సంపన్నాన్యభితః స్వయమ్. 2

నిర్మల చిదాకాశ రూపములగు యీ మన మనస్సులే తమయందలి జగద్వాసనలచే స్వయముగ అనంత జగదాకారమునఁ బరిణతములైనవి.

శ్రీరామ ఉవాచ:—

సర్వభూతగణే మోక్షం మహాకల్పక్షయే గతే
పునః కస్య కథం సర్గసంవిత్తిరుపజాయతే. 3

శ్రీరాముఁడు:— ఓ మునీంద్రా! మహాకల్పము క్షయమైనపుడు హిరణ్యగర్భుఁడున్ను, అతనిచే నుత్పన్నము గావింపఁబడిన సమస్తప్రాణి సమూహమున్ను ముక్తి నొంద, మరల సృష్టిని గూర్చిన జ్ఞాన మెవనికి నెట్లు కలుగును?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

మహాప్రలయపర్యన్తే క్షితిజలపవనహుతాశాకాశాశేష విశేషవినాశే ఆబ్రహ్మస్థావరాన్తేషు ముక్తౌ పరిణతేషు భూయో యథేదం జగదనుభూయతే తథా శృణు అవ్యపదేశ్యం యత్పరమార్థఘనం బ్రహ్మ చిన్మాత్రమిత్యాచక్షతే మునయః తస్య హృదయమిదం జగత్తస్మాదవ్యతిరిక్తమేవ, స ఏవ చ దేవస్తదాత్మీయం హృదయం స్వభావం జగదిత్యవగచ్ఛతి చ వినోదేనైవ నతు వాస్తవేన రూపేణ జగదితి కించిదుపలభామహే విచారయన్తస్తస్మాత్కిమివ నశ్యతే కిమవ జాయతే యథా పరమకారణమవినాశి తథా తద్ధృదయమవినాశ్యం చ మహాకల్పాదయశ్చ తదవయవా ఏవ, అపరిజ్ఞానమాత్రమత్ర కేవలం భేదాయైవ తదపి ప్రేక్ష్యమాణం న లభ్యత ఏవ. 4

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! మహాకల్పాంతమునఁ బృథివి, జలము, అగ్ని, యువు, ఆకాశములున్ను, తదంతర్గతములగు సమస్తపదార్థములున్ను నశింప, బ్రహ్మ మొదలుకొని స్థావరమువఱకు గల సమస్తప్రాణికోట్లున్ను ముక్తి నొంద, ఈ జగత్తెవ్విధమున ననుభూతమగునో చెప్పెద వినుము. సమస్తము నశింప, వాక్కునకు అవిషయమనియు, పరమార్థ ఘనమనియు, చిన్మాత్రబ్రహ్మమనియు నెద్దానిని మునులు పేర్కొనుచున్నారో, అదియే శేషించు ఆ బ్రహ్మముయొక్క హృదయరూపమగు ఈ జగత్తు, అద్దానికంటె వేఱుకానిదైయున్నది. ఆ పరమాత్మదేవుఁడే తన హృదయరూపమును జగత్తుగ ఎఱుఁగుచున్నాఁడు. మా (జీవన్ముక్తుల) దృష్టియం దీజగత్తు బాధితమై, మిథ్యారూపమైయున్నది. గావున (దగ్ధవస్త్రమువలె) వినోదమాత్రముకొఱకే మేము

దాని ననుభవింతుము, వాస్తవముగ, ఈ జగత్తునకు రూపమెద్దియునులేదు. కావున విచారించినచో నేది నశించుచున్నది? ఏది యుత్పన్నమగుచున్నది? మఱియు, పరమకారణమగు బ్రహ్మ మెట్లు నాశరహితమై యున్నదో, అట్లే, యద్దాని హృదయమగు జగత్తున్ను నాశరహితమైయున్నది. మహాకల్పాదు లద్దాని కల్పితములగు అవయవములేయగును. అజ్ఞానమాత్రముచే నిట కేవలము భేదముకొఱకే కల్పమహాకల్పాదులు కల్పింపబడినవైయున్నవి, ఏలయనిన, నిత్యమగు బ్రహ్మమునకు అనిత్యములగు మహాకల్పాదులు అవయవము లెన్నఁటికిని గానేరవు. కాఁబట్టి నశించిన కల్పభేదములు మరల మరల రాశక్యములై యున్నవి. కాన. బ్రహ్మస్వరూపము విద్యమానమైయుండ, కల్పముల పరివర్తనము జపమాలయొక్క అవయవములవలె, గాలచక్రరూపమున సంభవించుచున్నది. కాని, విచారించినచో వాస్తవముగ నది యెద్దియు లేనిదైయున్నది.

తస్మాన్న కస్యచిత్కించిత్కదాచిన్నశ్యతి క్వచిత్
న చైవ జాయతే బ్రహ్మశాన్తం దృశమజం స్థితమ్. 5

కాఁబట్టి యెచటను నెపుడును దేనికిని నేదియు నశించుటలేదు, ఉత్పన్నమగుటలేదు. ఈదృశ్య మంతయు వాస్తవముగ అజమై, శాంతమైనట్టి బ్రహ్మముగనే స్థితినొందియున్నది.

ఆకాశపరమాణు సహస్రాంశమాత్రేఽపి యా శుద్ధచిన్మాత్రసత్తా విద్యతే. 6

ఆకాశమందును, పరమాణువుయొక్క సహస్రాంశమందును గూడ ఏశుద్ధ చిన్మాత్ర సత్త గలదో, అదియే యీ పరబ్రహ్మము.

వపుర్జగదిదం తస్యా నను నామ మహాచితేః
కథం నస్యత్యనష్టాయాం తస్యాం సా చ న నశ్యతి. 7

ఎపుడీ జగత్తు మహాచైతన్యముయొక్క శరీరమైయున్నదో, అపుడిఁక నది విద్యమానమైయుండ, ఈ జగత్తెట్లు నశించును?

సంవిదో హృదయం స్వప్నే యథా భాతి జగత్తయా
వ్యోమాత్మైక తథైవాది సర్గాత్ప్రభృతి భాసతే. 8

సంవిత్తు (చైతన్యము) యొక్క స్వరూపమే స్వప్నమందు జగద్రూపముగ భాసించునట్లు, చిదాకాశమే సృష్ట్యాది సమస్తపదార్థరూపములుగ భాసించుచున్నది.

చిద్వ్యోమావయవః సర్గః సర్గస్యైతాదృశాః క్షయాః
ఉదయాశ్చేతి ఖం సర్వం కిం నాశి కిమనాశి చ. 9

చిదాకాశముయొక్క అవయవమే యీ సృష్టి, యీ సృష్టియొక్క అవయవములే నాశోత్పత్తులు, ఇవ్విధమున సర్వము చిదాకాశమే యైయుండ నిఁక నశించునదేది. నశింపనిదేది?

ఏషా హి పరమార్థసంవిదచ్ఛేద్యా అదాహ్యాఽక్లేద్యాఽశోష్యా, సాహ్యతద్విదామదృశ్యా తస్యా యద్ధృదయం తత్తదేవ భవతి యథాసా న నశ్యతి తదన్తర్వర్తి జగదాద్యనుభవో న జాయతే న నశ్య త్యేవేతి కేవలం స్మరణవిస్మరణ వశేన స్వభావరూపేణానుభవానను భవౌ కల్పయతీవ. 10

ఈ పరమార్థచైతన్యము ఛేదింపఁబడనిదియు, దహింపఁబడనిదియు, తడుపఁబడనిదియు, ఎండింపఁబడనిదియు నైయున్నది. దీని హృదయయే యీ జగత్తు. కావున, ఈ చైతన్య మెట్లు నశించుటలేదో, అట్లే తదంతర్గతమగు జగత్తుయొక్క ఆజగత్తుయొక్క కారణమగు అజ్ఞానము యొక్కయు అనుభవమున్ను, వాస్తవముగ జనించుటలేదు, నశించుటలేదు. కేవలము వానిస్మరణ విస్మరణముల వశముచేతనే స్వభావరూపముగ ఆచైతన్యము జగదాదుల అనుభవమును అనుభవము లేమిని కల్పించుచున్నది.

యద్యదాత్మకం తత్త్వం తద్వినాశం వినాఽక్షయి
తస్మాద్బ్రహ్మాత్మకం దృశ్యం విద్ధి బ్రహ్మవదక్షయమ్. 11

ఓ రామచంద్రా! ఏది ఏ వస్తువుయొక్క స్వరూపమైయున్నదో, ఆవస్తువు నాశరహితమై యున్నపుడదియు నాశరహితమైయున్నదేయగును కాన, బ్రహ్మస్వరూపమగు ఈ దృశ్యమున్ను బ్రహ్మవలె నక్షయమైనదనియే యెఱుఁగుము.

మహాప్రళయాదయస్తదవయవా ఏవ. 12

మహాప్రళయాదులు ఆబ్రహ్మముయొక్క అవయవములే యైయున్నవి.

చిన్మాత్రే పరమే వ్యోమ్ని కుత ఏవ భవాభవౌ
కుతో భావవికారాదిః కథం వ్యోమ్ని నిరాకృతే. 13

చిన్మాత్రమగు పరమచిదాకాశమున నాశోత్పత్తులెచట? నిరాకారమగు చిదాకాశమున పదార్థముల యుత్పత్త్యాది వికారము లెట్లుండగలవు?

మహాకల్పాదయో భావా నామైతాని జగన్తి చ
బ్రహ్మాత్మకతయైవాస్మిన్సంవిద్బ్రహ్మణి సంస్థితమ్. 14

స్ఫటికశిలయందలి విచిత్రప్రతిబింబ భేదములన్నియు తత్స్ఫటిక శిలారూపముగనే యుండునట్లు, మహాకల్పాదులున్ను, ఈ వివిధజగత్తులున్ను చైతన్యరూప బ్రహ్మమందు తద్బ్రహ్మ రూపముగనే నెలకొనియున్నవి.

నిరాకృత్యచ్ఛచిన్మాత్రం దృశ్యం సంకల్ప్య తద్వశమ్
యాతి యేనైవ ఘటితో యక్షస్తద్ధృదయే కిల. 15

మనస్సుచేఁ గల్పింపఁబడిన యక్ష, గంధర్వనగరాదులు మనోరూపమునే పొందునట్లు చైతన్యముయొక్క సంకల్పమాత్రముచే నుత్పన్నమగు ఈ జగద్దృశ్యమున్ను నిరాకారమై, నిర్మల మైనట్టి చిన్మాత్రరూపమునే పొందుచున్నది.

యథావయవినో వృక్షస్య శాఖావిటపఫలపల్లవపుష్పాదయోఽవయ
వాస్తథా పరమార్థ ఘనస్యాకాశాదప్యచ్ఛరూపస్యావ్యపదేశ్యస్య ప్రలయమహా
ప్రలయనాశోద్భవభావాభావసుఖదుఃఖ జననమరణసాకారనిరాకారత్వాదయో
ఽవయవాః, యథైవ చాసావవయవ్యనాశోఽవ్యపదేశ్యశ్చ తథైవ ఇతి. 16

అవయవియగు వృక్షమునకెట్లు శాఖా, మూల, ఫల, పత్ర, పుష్పాదులన్నియు అవ యవములగునో, అట్లే పరమార్థఘనమై, ఆకాశముకంటెను, అతినిర్మలమై, సూక్ష్మమై, వాక్కునకు విషయము కానిదైనట్టి బ్రహ్మమను అవయవికి, ప్రళయ, మహాప్రళయ, నాశ, ఉత్పత్తిభావ అభావ, సుఖ, దుఃఖ, జన్మ, మరణ, సాకార నిరాకారాదులన్నియు అవయవములైయున్నవి. కాఁబట్టి, అవయవి యగు బ్రహ్మమెట్లు వాక్కునకు అవిషయమై, నాశరహితమై యున్నదో, అట్లే యద్దాని అవయవములగు సృష్ట్యాదులున్ను పరమార్థదృష్టియందు నాశరహితములేయైయున్నవని యెఱుఁగనగును.

అవయవావయవినోర్దృశ్యయోర్వాప్యదృశ్యయోః
ఏకాత్మనోరేవసదా భేదోఽస్తి న కదాచన. 17

ఏకస్వరూపములే యగు దృశ్య, అదృశ్యములకును, అవయవి అవయవములకు భేద మెన్నటికి నుండఁజాలదు.

యథా తరోః సంవిన్మూలం తథా పరమార్థఘనశ్య క్వచిత్కించిత్త్వం క్వచిత్సర్గస్తమ్భః క్వచిల్లోకాన్తరవిటపాః క్వచిద్ద్వీపవస్థాః శాఖాః క్వచిత్పదార్థ పల్లవాః క్వచిత్ప్రకాశకుసుమమ్ క్వచిదన్ధకారకార్ష్ణ్యం క్వచిన్నభఃకోటరం క్వచి త్ప్రలయగుల్మాః క్వచిన్మహాప్రలయగుల్మాః క్వచిద్ధరిహరాదిగులుచ్ఛకాః క్వచిజ్జా డ్యత్వక్ ఏవమనాకారం వ్యోమరూపమేవ సంవిదాత్మని బ్రహ్మణి బ్రహ్మసదృశ భావాదవ్యతిరిక్తమేవై తత్స్థితమ్. 18

వృక్షముయొక్క యునికికి వృక్షచైతన్యమే మూలమైయున్నట్లు, పరమార్థఘనమగు ఈ జగత్తుయొక్క యునికికి చైతన్యమే మూలమైయున్నది. బ్రహ్మమను వృక్షమందొకచోట సృష్టియను మధ్యస్తంభమున్ను ఒకచోట లోకాంతరములను శాఖలున్ను, వేఱొకచోట జంబుద్వీపాది యుప శాఖలున్ను, ఇంకొకచోట పర్వతనదీజనపదాది పదార్థములను పల్లవములున్ను, ఒకచోట చంద్ర సూర్యాదులను ప్రకాశవంతములగు పుష్పములున్ను, మఱియొకచోట అంధకారమను ఆకుల పచ్చదనమున్ను, ఒకచోట ఆకాశమను తొఱ్ఱయు, ఒకచోట ప్రళయ మహాప్రళయములను గనుపు లున్ను, ఇంకొకచోట హరిహరాదులను పూగుత్తులున్ను. ఒకచోట జడత్వమను చర్మమున్ను గలిగి యున్నవి: ఈ ప్రకారముగ నిరాకారమై చిదాకాశరూపమేయైనట్టి జగత్తు (కల్పిత ఆకారభేదము లతో) చైతన్యరూపమగు బ్రహ్మమందు ఆ బ్రహ్మసదృశమగు నిర్మలరూపముకంటె వేఱుగాక స్థితి నొందియున్నది.

ఇతో భావ్య ఇతో భావ ఇతః సర్గ ఇతః క్షయః
స్వభావ ఏవానుభవ ఇతి బ్రహ్మాచలం స్థితమ్. 19

ఒక చోట భవిష్యత్కాలరూపముగను, ఒకచోట వర్తమానకాలరూపముగను, ఒకచోట భూతకాలరూపముగను ఒకచోట సృష్టిగను, ఒకచోట ప్రళయముగను, ఇట్లు వివిధకల్పనారూప ములచే ఆత్మయగు బ్రహ్మమే నిశ్చలముగ స్థితి నొందియున్నది.

ఏవంమయేఽపి పరమే బ్రహ్మకాశే న రఞ్జనాః
కాశ్చిదేవాఙ్గ సన్తీన్దుబిమ్బే విమలతా యథా. 20

ప్రియుఁడవగు రామచంద్రా! చంద్రబింబమందు నిష్కళంకత్వములేని చందమున ఈ ప్రకారముగ నిర్మలమగు పరబ్రహ్మాకాశమున సృష్టి ప్రళయాది రంజనము లెవ్వియును వాస్తవముగ లేవు.

నిర్మలే పరమాకాశే క్వ భావాభావరఞ్జనాః
క్వాదిమధ్యాన్తకలనాః క్వ లోకాన్తరవిభ్రమాః. 21

నిర్మలమగు చిదాకాశమున భావాభావములఁగూర్చిన రంజనములెచట? ఆదిమధ్యాంతములఁగూర్చిన కల్పనలెచట? లోకాంతరములఁగూర్చిన విభ్రమములెచట?

అపరిజ్ఞానమేవైకం తత్ర దోషవదుత్థితమ్
కేవలం తత్పరావృత్య ప్రేక్షణాత్పరిశామ్యతి. 22

ఈ సమస్తజగద్భ్రమలకును, ఆత్మజ్ఞానము లేకపోవుటయే కారణమైయున్నది. దృశ్యమునుండి మరలించి సాక్షిచైతన్యమగు ఆత్మవైపునకు దృష్టిని బఱపినంతమాత్రముచే ఈ జగద్భ్రమ యంతయు శమించిపోవుచున్నది.

అజ్ఞానం జ్ఞప్తిబోధేన పరామృష్టం ప్రణశ్యతి
యేనైవాభ్యుదితస్తేన పవనేనేవ దీపకః. 23

వాయువునుండి యుత్పన్నమైన దీపము తిరిగి వాయువుచేతనే నశించునట్లు, ఆత్మస్వరూపమువలన సత్తగల్గియున్న అజ్ఞానము తిరిగి ఆత్మజ్ఞానము(తత్త్వవిచారము)చేతనే నశించుచున్నది.

అజ్ఞానం సంపరిజ్ఞాతని నాసీదేవేతి బుధ్యతే
అబద్ధమోక్షం బ్రహ్మైవ సర్వమిత్యవగమ్యతే. 24

అజ్ఞానము జ్ఞానముచే నశింపఁబడినపుడు అది (అజ్ఞానము) యేకాలమందును నుండియుండలేదను బోధ గలుగును. మఱియు సర్వమున్ను బంధమోక్షరహితమగు బ్రహ్మమే యను జ్ఞానమున్ను నపుడుదయించును.

ఏవం బోధాదయో రామ మోక్ష ఉక్తాః స్వసంవిదా
విచారయత్నో లభతే నాత్ర కశ్చన సంశయః. 25

ఓ రామచంద్రా! ఈ ప్రకారముగ మోక్షముకొఱకై ఆత్మజ్ఞానాద్యుపాయములను నేను నీకుఁ జెప్పితిని. ఆత్మవిచారమున నిరంతరము యత్నించుకృతుఁడగు అధికారి నిక్కముగ వీనిఁ బొందగల్గును.

ఇదం జగజ్జాలమనాద్యజాతం
బ్రహ్మార్థమాభాత మితీహ దృష్ట్వా
విచారదృష్ట్యాఽష్టగుణేశ్వరత్వం
వశ్యం తృణం స్వాత్మని జీవ ఆస్తే. 26

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే జగదాకాశైకబోధో నామ ఏకషష్ఠితమః సర్గః ॥ 61 ॥

ఓ రామచంద్రా! ఈ యనాదియగు జగజ్జాలమెపుడును నుత్పన్నము కానిదేయగును. బ్రహ్మమే జగజ్జీవాదుల రూపమునఁ బ్రకాశించుచు స్వస్వరూపమునుగూర్చి అజ్ఞానముచే భోగమోక్షములఁ బ్రార్థించుచున్నదగును. ఈ ప్రకారముగ వివేకదృష్టిచే నిశ్చయించి అధికారియగు జీవుఁడు అణిమాద్యష్టసిద్ధి సహితమగు ఈశ్వరత్వమునుగూడ మాయామాత్రమని యెఱిఁగి యద్దానిని తృణమువలెఁ జూచుచు నిరతిశయానందయుక్తుఁడై స్వాత్మయందే సుస్థిరుఁడైయుండును.

ఇది శ్రీ వాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున జగదాకాశైకబోధ యను నఱువదియొకటవ సర్గము ॥ 61 ॥

◆◆◆◆◆◆◆◆◆◆

ద్విషష్ఠితమః సర్గః

[దేహవజ్జగతాం వీక్షా వర్ణతేఽత్ర మునే స్త్రియా
సంభాషా వ్యోమరూపస్య స్వప్నవద్వ్యోమరూపయా.

చిదాకాశరూపుఁడగు వసిష్ఠమునీంద్రుఁడు బ్రహ్మాండములన్నింటిని తన దేహమువలె గాంచుట స్వప్నసదృశయైన ఆకాశరూపిణియగు స్త్రీతోటి సంభాషించుట, ఇచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీరామ ఉవాచః—

యదేతద్భవతా దృష్టం చిద్వ్యోమవపుషా తదా
తదేకదేశసంస్థేన కిముత భ్రమతామ్బరే. 1

శ్రీరాముఁడు:— ఓ మునీంద్రా! చిదాకాశ శరీరులై తామపుడేయే జగత్సమూహములను వీక్షించిరో, వానిని ఆకసమునఁ బక్షివలె సంచరించుచు గాంచితిరా, లేక నొకే ప్రదేశమున స్థిరముగ నుండి గాంచితిరా?

శ్రీవసిష్ఠ ఉవాచః—

సంపన్నోఽహమనన్తాత్మా వ్యాపి వ్యోమ తదా కిల
స్యాతాం తస్యామవస్థాయాం కీదృశౌ తౌ గమాగమౌ. 2

శ్రీ వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! ఎపుడు నేనంతమై, సర్వవ్యాపకమైనట్టి చిదాకాశమే యైతినో, అపుడిఁక నట్టి స్థితియందు గమనాగమనములెట్లు సంభవించును?

నైకస్థానస్థితమయో నాహం గతిమయోఽభవమ్
తదనేన స్వ ఏవాస్మిన్దృష్టమేతన్మయాత్మని. 3

ఓ రామచంద్రా! కావున నేనపుడు గమనశీలుఁడనై యుండలేదు, ఏకదేశమున స్థితి నొందియుండలేదు, ఈ అపరిచ్ఛిన్నమైన నిత్యాపరోక్షమగు నాయొక్క ఆత్మయందే యా జగత్తులను గాంచితిని.

యథాఙ్గాని శరీరస్థే పశ్యామ్యాపాదమస్తకమ్
చినే।తే నాప్యనేత్రేణ తథైతద్దృష్టవానహమ్. 4

దేహాత్మబుద్ధియందు, అపాదమస్తకము సమస్తావయవములను నెటుల నా స్వరూపమునఁ జూచుదునో, అట్లే చర్మనేత్రము లేకున్నను, చిద్రూపనేత్రముచే నేనపుడనేకజగంబులను నాయందు (స్వాత్మయందు) చూచితిని.

అనాకృతేర్నిరవయవస్థితే స్తదా
తథా ఖవద్విమలచిదమ్బరాత్మనః
జగన్తితాన్యవయవజాలకాని మే
యథా స్వతో న విగలితా న వస్తుతా. 5

అపుడాసమాధి స్థితియందు నిరాకారముగను, నిరవయవముగను, నిర్మల చిదాకాశరూపముగను నేను స్థితి నొందియుండ, ఆ జగంబులన్నియు నాయొక్క అవయవముల చందముననాయెను. ఎట్లనఁగా, వాస్తవముగ ఆ జగత్తులయొక్క వస్తుత్వము నశింపలేదు, విద్యమానమై యుండలేదు. నాయొక్క సత్తచేతనే యవి సత్తగలవగుటచే వస్తుత్వము నశింపనివై నా అవయవముల పగిదియాయెను. మఱియు స్వతః సత్తలేనివగుటచే వస్తుత్వము లేనివియునైయున్నవి.

ప్రమాణమత్ర తే స్వప్నదృష్టోఽభువన విభ్రమః
స్వప్నేఽను భూయతే దృశ్యం న చ కించిత్ఖమేవ తత్. 6

ఓ రామచంద్రా! ఇవ్విషయమున స్వప్నమందు గాంచఁబడిన జగద్భ్రమయే నీకు దృష్టాంతము. స్వప్నమున అనుభూతమగు దృశ్యము చిదాకాశముకంటె వేఱుగ నొకింతైనను లేదుకదా!

యథా పశ్యతి వృక్షః స్వం పత్రపుష్పఫలాదికమ్
స్వసంవేదననేత్రేణ తథైతద్దృష్టవానహమ్. 7

వృక్షాభిమానియగు జీవుఁడెట్లు పత్రపుష్పఫలాదులను దన యంగములుగ గాంచునో, అట్లే స్వకీయ జ్ఞాననేత్రముచే నేనాజగంబుల నన్నింటిని నా అవయవములుగఁ గాంచితిని.

యథామ్బుధిరనన్తాత్మా వేత్తి సర్వాఞ్జలేచరాన్
తరఙ్గావర్తఫేనాశ్చ తథైతద్బుద్ధవానహమ్. 8

అనంత - సముద్రాభిమానియగు జీవుఁడు సమస్తజలచర జీవులను, తరంగ, ఫేన, ఆవర్తాదులను దన స్వరూపమందున్నట్లెఱుఁగునో, అట్లే నేనున్ను, ఆ యనేకబ్రహ్మాండములను నాయందున్నట్లెఱిఁగితిని.

అవయవాన్స్వానవయవీ యథా వేత్తి నిజాత్మని
అనన్యానాత్మనః సర్గాం స్తథైతాన్బుద్ధవానహమ్. 9

అవయవి యెట్లు తన అవయవములను తనయందెఱుఁగునో, అట్లే యా సృష్టులను నేను నాకంటె వేఱుగ లేనట్లెఱిఁగితిని.

అద్యాపి తానహం దేహే వ్యోమ్ని శైలే జలే స్థలే
తథైవ సర్గాన్పశ్యామి రామ బోధైకతాం గతః. 10

ఓ రామచంద్రా! బోధరూపమగు ఆత్మతోటి యేకత్వమొందిన నేనిపుడును, ఆ యనేకసృష్టుల నదేవిధముగ దేహ, ఆకాశ, పర్వత, జల, స్థలములందును గాంచుచున్నాను.

పురోఽస్మాకమిదం విశ్వం గృహస్యాన్తర్బహిస్తథా
పూర్ణమేతజ్జగద్వృన్దైర్వేద్మి బోధైకతాం గతః. 11

మన యెదుట ఈ విశ్వమున్నట్లే బోధరూపమగు ఆత్మతోటి యేకత్వమొందిన నేను ఈ గృహముయొక్క బాహ్యాభ్యంతరములనుగూడ అనేకజగంబులచేఁ బూర్ణములై యున్నట్లెఱుఁగుచున్నాను.

యథామ్భో రసతాం వేత్తి శైత్యం వేత్తి యథా హిమమ్
స్పన్దం వేత్తి యథా వాయుస్తథైతద్వేత్తి శుద్ధధీః. 12

జలము రసమును, మంచు శీతలత్వమును, వాయువు చలనమును దనయందెఱుఁగునట్లు శుద్ధబుద్ధియగు జ్ఞానియు ఈ జగంబును తనయందెఱుఁగును.

యోయో నామ వివేకాత్మా శుద్ధబోధైకతాం గతః
సమ ఏవ మయైకాత్మా వేద్మి స్వాత్మానమీదృశమ్. 13

నేనే కాదు; బోధస్వరూపమగు ఆత్మతోటి యేకత్వమొందిన వివేకులందఱును నాతోటి సమముగనే (ఏకాత్మరూపులై) యుందురు. 'నేనున్ను' ఈ ప్రకారముగ నా యాత్మను వారియందఱి ఆత్మరూపముగ నెఱుఁగుచున్నారు.

అస్యా దృష్టేః పరిణతేర్వేత్తృవేదన వేద్యధీః
న కాచిద స్త్యభ్యుదితా విజ్ఞానాత్మైకతా యతః. 14

ఇట్టి సర్వాత్మస్వరూపదృష్టి పరిపక్వముకాఁగా నిఁక వేత్తృవేదన వేద్యాది త్రిపుటి యెద్దియును నుదయింపకుండును. ఏలయనఁగా నపుడు విజ్ఞానస్వరూపమగు ఆత్మతో సమస్తముయొక్క ఏకత్వము సంభవించును.

దివ్యా దృగద్రిసంస్థస్య తథా యోజనకోటిగాన్
భావాన్వేత్తి బహిశ్చాన్తరేవం తద్బుద్ధవానహమ్. 15

యోగాదులచే సిద్ధులఁ బడసిన మనుజుఁడు పర్వతముపైనుండి తన దివ్యదృష్టిచే కోట్లకొలఁది యోజనముల దూరమున నున్న బాహ్యాభ్యంతర పదార్థములను నెఱుఁగఁ గల్గునట్లు, నేనున్ను సమస్తలోకములను నెఱిఁగితిని.

యథా భూమణ్డలం భావాన్నిధిధాతురసాదికాన్
వేత్త్యేవం తన్మయా బుద్ధమనన్యద్దృశ్యమాత్మనః. 16

భూమండలాభిమానియగు దేవత భూమియందలి సమస్తధాతు, రసాదులను దనయందెఱుఁగునట్లు, దృశ్యమంతటిని నేను నాకంటె వేఱుగ లేనట్లెఱిఁగితిని.

శ్రీరామ ఉవాచ:—

బ్రహ్మన్ననుభవత్యేవం త్వయి తామరసేక్షణ
సా కిం కృతవతీ బ్రూహి కాన్తాఽర్యాపాఠపాఠినీ. 17

శ్రీరాముఁడు:— కమల నేత్రుఁడవగు మహాత్మా! ఇది యంతయు తమకు సంభవమే యైయున్నది. అయితే, ఆ 'ఆర్యా' ఛందమును బఠించిన వనిత యేమి గావించెనో వచింపగోరెద.

శ్రీవసిష్ఠ ఉవాచ:—

తామేవార్యాం పఠన్తీ సా తథైవానునయాన్వితా
మత్సమీపే నభోదేహా వ్యోమ్ని దేవీవ సంస్థితా. 18

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! అట్లు 'ఆర్య'ను బఠించుచు, ప్రశంసాది ప్రీతి జనక కార్యములఁ గావించుచు, చిదాకాశ శరీరధారిణియైన యా స్త్రీ ఆకసమున దేవివలె నా సమీపమున నుండెను.

యథాహమాకాశవపుస్తథైవాసా స్వరూపిణీ
తేన దృష్టా న సా పూర్వం దేహేన లలనా మయా. 19

నేనెట్లు చిదాకాశ శరీరుఁడనై యుంటినో, ఆమెయు, చిదాకాశమయమగు శరీరమే గల్గియుండెను. అందుచే సమాధికిఁ బూర్వపు దేహముచే నేనామెను గాంచలేదు.

అహమాకాశమాత్రాత్మా సా ఖమాత్రశరీరిణీ
జగజ్జాలం ఖమాత్రం తదితి తత్ర తదా స్థితమ్. 20

ఆ సమాధికాలమున, ఆ చిదాకాశమున నేనున్ను, ఆ స్త్రీయు, జగత్సమూహమంతయును చిదాకాశమాత్రముగనే యుండియుండెను.

శ్రీరామ ఉవాచ:—

శరీరస్థానకరణ ప్రయత్నప్రాణసంభవైః
యదుదేతి వచో వర్ణైస్తత్కుతస్తాదృశాకృతేః. 21

శ్రీరాముడు:— ఓ మునీంద్రా! శరీరస్థములగు జిహ్వా, తాలు ఓష్ఠాదికరణముల యొక్క ప్రయత్నములచేతను, ప్రాణవాయువుల చేష్టలచేతను నుత్పన్నమగు వర్ణములచే జనించునట్టి వాక్యము, నిరాకారమైన చిదాకాశ శరీరధారిణియగు యా స్త్రీనుండి యెట్లుద్భవమైనది?

రూపాలోకమనస్కారః కుతో నామాత్మనామితి
బ్రూహి మే భగవంస్తత్త్వం యథావృత్తశ్చ నిశ్చయమ్. 22

మహాత్మా! బాహ్యరూపాదుల యొక్కయు, అభ్యంతర మానసిక వ్యాపారముల యొక్కయు, అనుభవము నిరాకారమై, శుద్ధమై, చిదాకాశరూపమైనట్టి ఆత్మయందెట్లు సంభవించును? కావున ఆ చిదాకాశమున జగద్దర్శన, పర్యాలోచనాదులను తామెట్లు గావించిరో యతత్త్వమంతయు నిశ్చయముగ వచింప వేడెద.

శ్రీవసిష్ఠ ఉవాచ:—

రూపాలోకమనస్కారాః శబ్దపాఠవచాంసి చ
యథా స్వప్నే నభస్యేవ సన్తి తత్ర తథామ్బరే. 23

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! స్వప్నమందెట్లు బాహ్యాభ్యంతర విషయములు, శబ్దపాఠములు, వచనములు మున్నగునవి సంభవించునో, అట్లే చిదాకాశముననను సమస్తము సంభవించును.

రూపాలోకమనస్కారైః స్వప్నే చిన్నభ ఏవ తే
యథోదేతి తథా తత్ర తద్దృశ్యం ఖాత్మకం స్థితమ్. 24

స్వప్నమందు చిదాకాశమే బాహ్యాభ్యంతర పదార్థరూపముగ నుదయించునట్లు, ఆ సమాధియందా దృశ్యమంతయు చిదాకాశరూపముగనే యుండియుండెను.

న కేవలం తు తద్దృశ్యం యావత్తు విషయం వయమ్
జగచ్చేదం ఖమేవాచ్ఛం యథా తన్నస్తథాఖిలమ్. 25

కేవల మాదృశ్యమేకాదు, మన బుద్ధికి గోచరమగు ఈ సమస్త జగత్తున్నుగూడ నిర్మలమగు చిదాకాశరూపమే యైయున్నది.

పరమార్థమహాధాతుర్వేద్యనిర్ముక్తచిద్వపుః
ఏవం నామ స్వయం భాతి స్వభావస్యేవ నిశ్చయః. 26

ఈ జగత్తు నిశ్చయముగ పరమార్థ చిన్మయమై, విషయవర్జితమై, చిత్స్వభావము యొక్క స్వరూపమై స్వయముగనే భాసించుచున్నది.

శరీరస్థానకరణసత్తాయాం కా తవ ప్రమా
యుష్మత్యేవ తేషాం దేహాది తథాస్మాకమిదం స్థితమ్. 27

ఓ రామచంద్రా! స్వప్నశరీరముయొక్క స్థాన (జిహ్వాది) కరణములయొక్క సత్తయందు నీకేమి ప్రమాణముగలదు? స్వప్నమందు దేహాదుల సత్త (ఉనికి) యెట్లుగలదో, అట్లే మన యీ జగత్తుయొక్క సత్తయున్నుగలదు.

యథైవ తత్తథైవేదం తథైవేదం యథైవ తత్
అసత్సత్తామివ గతం సచ్చాసదివ చ స్థితమ్. 28

స్వప్నమందలి దేహాదుల సత్త యెట్లు గలదో, అట్లే యీ జగత్తుయొక్కయు సత్తగలదు ఇది యెట్లో, అదియు నట్లేయగును. అజ్ఞానకారణమున, అసత్తగు నామరూపాదులు సత్తను బొందినట్లున్ను, సత్తగు నిర్విశేషాత్మతత్త్వము అసత్తుగ (అప్రసిద్ధముగ) నైనట్లున్ను తోచుచున్నది.

యథా స్వప్నే ధరాధ్యాద్రిపృష్ఠవ్యవహృతిర్నభః
తథా హ్యహం చ త్వం సా చ తదిదం చ తథా నభః. 29

స్వప్నమందలి భూమిపైని కృష్యాదులు, మార్గముపైని గమనాదులు, పర్వత, గృహాదుల పైనిశయనాదులు మున్నగు సమస్త వ్యవహారములు చిదాకాశరూపములే యైనట్లు, నీవు, నేను, ఆ స్త్రీ, ఈ జగత్తు సమస్తము చిదాకాశరూపమే యైయున్నది.

యథా స్వప్నే నృభిర్యుద్ధకోలాహలగమాగమాః
అసన్తోఽప్యనుభూయన్తే సంసారనికరాస్తథా. 30

స్వప్నమందు యుద్ధ కోలాహలములు, గమనాగమనములు వాస్తవముగ లేకున్నను మనుజులచే నెట్లనుభవింపఁబడుచున్నవో, అట్లే యీ జగత్సమూహము లన్నియుగూడ ననుభవింపబడుచున్నవి.

వశి. చేత్స్వప్నదృశ్యశ్రీః కస్మాత్తదసమఞ్జసమ్
అవాచ్యమేతద్ధేతుర్హి నాన్యోఽస్త్యనుభవస్థితేః. 31

స్వప్నమందలి దృశ్యవైచిత్ర్యము దేనివలన కలుగునని యడిగినచో, ఆ వాక్యము అసమంజసమే యగును. ఏలయనఁగా స్వప్నానుభవస్థితి తప్ప యిట నన్యమగు కారణము అవాచ్యమైయున్నది.

కథమాలక్ష్యతే స్వప్న ఇతి ప్రష్టుః ప్రకథ్యతే
యథైవం పశ్యసీత్యేవ హేతురత్రాస్తి నేతరః. 32

స్వప్న మెట్లు గాంచఁబడుచున్నదని ప్రశ్నించువానికి, 'నీవెట్లు గాంచుచున్నావో, అట్లే' అను ప్రత్యుత్తరమే యొసంగఁబడుచున్నది. ఆ విధముగనే యీ ప్రపంచముయొక్క విషయమందును (అనుభవము తప్ప) అన్యమగు హేతువెద్దియును లేదు.

స్వప్నజన్తురివ వ్యోమ్ని భాతి ప్రథమసర్గతః
ప్రభృత్యేవ విరాడాత్మా ఖే ఖమేవ పరస్పరే. 33

సుషుప్తిరూపమగు ప్రళయమైన పిదప ప్రథమ సృష్టిమొదలుకొని ఆకసమున స్వప్న జీవునివలె కల్పనారూపుఁడగు విరాడాత్మ చిదాకాశమున చిదాకాశముగనే (విషయ విషయత్వము వలన పరస్పరసాపేక్షరూపముచే - భాసించుచున్నాఁడు.

స్వప్నశబ్దేన బోధార్థం తవ వ్యవహరామ్యహమ్
దృశ్యం త్విదం న సన్నాసన్న స్వప్నో బ్రహ్మ కేవలమ్. 34

నీకు బోధించుటకొఱకే 'స్వప్న' శబ్దముచే నిటవ్యవహరించుచున్నాను. వాస్తవముగ ఈ దృశ్యము సత్తుకాదు, అసత్తుకాదు, స్వప్నముకాదు, కేవలము బ్రహ్మమేయగును.

అథ రాఘవ సా కాన్తా మయా కాన్తానుషఙ్గిణీ
సంవిదం తన్మయీం కృత్వా పృష్టేదం దృశ్యరూపిణీ. 35

ఓ రామచంద్రా! అటుపిదప, అనురాగవతియు, దృశ్యరూపిణియు నగు ఆ స్త్రీ యొక్క యభిప్రాయము నెఱుఁగగోరునట్టి సంకల్పసంవిత్తు గావించి నే నామె నడిగితిని.

వ్యవహారో యథోదేతి స్వప్నే స్వప్నజనైః సహ
తథా తదా తయా సార్ధం వ్యవహారో మమోదితః. 36

స్వప్నమందు స్వప్నజనులతోటి వ్యవహార ముదయించునట్లు. అపుడామెతో నాకు వ్యవహారము ప్రవృత్తమాయెను.

యథైవ స్వప్నసంకాశో వ్యవహారః ఖమేవ సః
తథైవ త్వమిమం విద్ధి మామాత్మానం జగచ్ఛుభమ్. 37

ఓ రామచంద్రా! స్వప్నమందలి వ్యవహారము చిదాకాశరూపమే యగునట్లు, నా యీ వ్యవహారమును, నన్ను, ఈ జగత్తును చిదాకాశరూపములుగనే యెఱుఁగుము.

యథా స్వప్నజగద్రూపం ఖమేవైవమిదం జగత్
జాగ్రదాదౌ స హి స్వప్నః సర్గాదౌ జగదుద్భవః. 38

స్వప్నజగత్తు చిదాకాశరూపమే యైయున్నట్లు, ఈ జగత్తున్ను చిదాకాశరూపమే యై యున్నది. కావున రెండును సమములేయగును. జాగ్రత్తుయొక్క ఆదియందు భాసించునది స్వప్నమనియు సృష్టియొక్క యాదియందు భాసించునది జగత్తనియుఁ జెప్పఁబడును- ఇంతమాత్రమే భేదము.

స్వప్నోఽయం జగదాభోగో న కించిద్వా ఖమేవ చ
నిర్మలం జ్ఞప్తిమాత్రమిత్థం సన్మాత్రసంస్థితమ్. 39

ఈ జగత్తు ఆత్మకు స్వప్నమే యగును. ఇది యధిష్ఠానరూపముచే కేవలము చిదాకాశమాత్రమై, నిజ (దృశ్య) రూపముచే అసత్తైయున్నది. వాస్తవముగ నిర్మలమై, జ్ఞప్తిమాత్రమై, సన్మాత్రమైనట్టి బ్రహ్మమే యీ జగద్రూపముగ స్థితినొందియున్నదగును.

స్వప్నస్య విద్యతే ద్రష్టా సాకారో యుష్మదాదికః
ద్రష్టా తు సర్గ స్వప్నస్య చిద్వ్యోమైవామలం స్వతః. 40

స్వప్నముయొక్క ద్రష్ట సాకారులగు మీరందఱునైయున్నారు. సృష్టియను స్వప్నముయొక్క ద్రష్ట స్వయముగ నిర్మలచిదాకాశమే యైయున్నది.

యథా ద్రష్టామలం వ్యోమ దృశ్యం తద్వద్గతం తథా
స్వప్నరూపజగత్యుచ్చైర్జగత్త్వేనామలం నభః. 41

స్వప్నమందలి ద్రష్టృదర్శనదృశ్యములన్నియు నిర్మల చిదాకాశరూపములే యైయున్నట్లు ఈ గొప్ప జగద్రూపస్వప్నమున్ను నిర్మలచిదాకాశమే యైయున్నది.

చిద్వ్యోమ్నోఽనాకృతేః స్వప్నో హృది స్ఫురతి యః స్వతః
సర్గస్తస్య కుతస్తేన సాకృతిత్వం కథం భవేత్. 42

నిరాకారమగు చిదాకాశమున ఏ జగద్రూపస్వప్నము స్వయముగ స్ఫురించుచున్నదో, అద్దానియొక్క యుత్పత్తియు, సాకారత్వమున్ను నెట్లు సంభవించును?

సాకారస్యైవ యత్స్వప్న జగత్తద్వ్యోమ నిర్మలమ్
నిరాకారస్య చిద్వ్యోమ్నః సర్గః స్వప్నః కథం న ఖమ్. 43

సాకారులగు జీవులయొక్క స్వప్నజగత్తే నిర్మల చిదాకాశమైయుండ నిఁక నిరాకారమగు బ్రహ్మముయొక్క స్వప్నరూపమగు ఈ జగత్తు చిదాకాశమని వేఱు చెప్పవలెనా?

నిరుపాదానసంభారమభిత్తావేవ చిన్నభః
పశ్యత్యకృతమేవేమం జగత్స్వప్నం కృతం యథా. 44

ఉపాదానాది సామగ్రియు, భిత్త్యాది ఆధారమున్ను లేకయే చిదాకాశమే స్వప్నరూపమగు జగత్తును, వాస్తవముగ రచింపఁబడకయున్నను రచింపఁబడిన దానిని వలెఁగాంచుచున్నది.

మృద్వ్యా చిదాకాశమృదా బ్రహ్మణా బ్రహ్మణేన ఖే
కృతోఽపి న కృతః సర్గమణ్డపోఽక్షగవాక్షకః. 45

చిదాకాశమను కోమలమైన మృత్తికచే హిరణ్యగర్భుఁడను బ్రాహ్మణుఁడు ఇంద్రియాదులను గవాక్షములచే శోభితమగు దేహాదిసృష్టియను మండపమును నిర్మించినను వాస్తవముగ నది నిర్మింపఁబడనిదేయగును.

నో కర్తృతా న చ జగన్తి న భోక్తృతాస్తి
నాస్తీతి నాస్తి న చ కించిదతో బుధః సన్
పాషాణమౌనమవలమ్బ్య యథాప్రవాహ
మాచారమాచర శరీరమిహాస్తు మావా. 46

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే చిదైక్యం నామ
ద్విషష్టితమః సర్గః ॥ 62 ॥

ఓ రామచంద్రా! వాస్తవముగ కర్తృత్వముగాని, భోక్తృత్వముగాని, జగత్తులుగాని, తదితర ద్వైతభావముగాని, యెవ్వియులేవు. (ఇట్లు సర్వదృశ్యమార్జనముచే శేషించు) తత్సాక్షియగు చిద్రూపమగు బ్రహ్మమే గలదు. కావున నీవు అభ్యంతరమున శిలవంటి మౌనభావము నవలంబించి బాహ్యమున యథాప్రాప్తములగు ప్రవాహపతితకర్మల నాచరింపుము. ఇట ఈ శరీరము ప్రారబ్ధశేషపర్యంత ముండినను, పిదప లేకుండినను సరియే, ఇందు విశేష మేమియును లేదు.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున
నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున చిదైక్యమను
నఱువదిరెండవ సర్గము ॥ 62 ॥

త్రిషష్టితమః సర్గః

[అజ్ఞపక్షేఽన్తరస్తః సన్త్యనన్తాః సర్గసంపదః
బ్రహ్మైవ బ్రహ్మవిత్పక్షే చిదేకఘనమీర్యతే,

అజ్ఞాని దృష్టియందొకదానిలో మఱియొకటి ఈ ప్రకారముగ అనంతములైన సృష్టులు గలవు. జ్ఞాని దృష్టియందు చిద్ఘనమాత్రమైన యేకమగు బ్రహ్మమేగలదు — అను విషయము లిచటఁ బొందుపఱుపఁబడుచున్నవి.]

శ్రీరామ ఉవాచః—

తవ స్త్రియాఽస్వరూపేణ దేహేనాభూత్తయా కథమ్
కథముచ్చారితాస్తత్ర వర్ణా కచటతాదయః. 1

శ్రీరాముఁడు:— ఓ మునీంద్రా! ఆ స్త్రీతోటి నిరాకారమగు దేహముచేఁ దమకు వ్యవహార మెట్లు సంభవించెను? మఱియు నట్టి స్థితియందు జిహ్వ లేకయే క, చ, ట, త, పాది వర్ణముల, దామెట్లుచ్చరింపఁ గలిగితిరి?

శ్రీవసిష్ఠ ఉవాచః—

వర్ణేషు ఖశరీరాణాం వర్ణాః కచటతాదయః
కదాచనాపి నోద్యన్తి శవానామివ కేన చ. 2

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! చిదాకాశమే శరీరముగా గల్గినట్టి జ్ఞానులయొక్క మతమందు కచటతపాది వర్ణముల యుచ్చారణ లేదు. ఏలయనఁగా నవి కల్పనామాత్రములై యున్నవి. మఱియు, వర్ణోచ్చారణమున శరీరావశ్యకత లేదు. ఎట్లనిన, స్వప్నమున శరీరాదులు లేకనే వచనాది వ్యవహారము సంభవించుచున్నది. మఱియు మృతునకు శరీరమున్నప్పటికిని వచనాదులు సంభవింపకయే యున్నవి.

వర్ణోచ్చారో భవిష్యచ్చేత్సకలార్థస్తతః క్వచిత్
స్వప్నేష్వన్యభవిష్యత్తం వినిద్రః పార్శ్వగో జనః. 3

స్వప్నమందలి వర్ణోచ్చారణము సత్యమగుచో, ఆ స్వప్నము గాంచువాని సమీపమున నున్న జాగ్రత్ జనులుగూడ దానిని వినవలసియుండును. (అట్లు లేదుకదా!)

తస్మాన్న కించిత్స్వప్నేషు తత్సత్యం భ్రాన్తిరేవ సా
చిన్మాత్రాకాశకచనం తత్తథా ఖే స్వభావజమ్. 4

కావున స్వప్నమందలి యాయుచ్చారణము కొంచమైనను సత్యముకాదు. భ్రాంతిమాత్రమేయైయున్నది. నిద్రాస్వభావబలముచేఁ గల్పితమగు చిదాకాశమాత్రముయొక్క స్ఫురణమే యవ్విధమున స్వప్నమున భాసించుచున్నది.

తదేన్దుకార్ష్ణ్యఖతనుశిలాగేయాదితాం గతాః
ఇవాభాన్తి చిదాకాశాస్తథా దేహరవాదయః. 5

భ్రాంతిచే చంద్రునియందు నలుపుదనము, ఆకాశమందు సాకారత్వము శిలాప్రతిమయందు గానాదుల ప్రవృత్తి భాసించువిధమున స్వప్నదేహములందు చిదాకాశమే శబ్దాది రూపమును బొందుచున్నది.

తచ్చిదాకాశకచనం యన్నామ స్వప్నవేదనే
ఆకాశమేవ నభసః కచనం విద్ధినేతరత్.

ఆకాశముయొక్క సాకారత్వస్ఫురణము ఆకాశముకంటె భిన్నముగానట్లు స్వప్నానుభవమునందలి జగదాకారరూపమగు చిదాకాశస్ఫురణము ఆ చిదాకాశముకంటె భిన్నము కానిదై యున్నది,

యథా స్వప్నస్తథైవేదం జాగ్రదగ్రే వ్యవస్థితమ్
ఆకాశమప్యనాకాశం యథైవేదం తథైవ తత్. 7

స్వప్నమందలి జగత్తువలె, ఈ మనయెదుటనున్న జాగ్రజ్జగత్తున్ను చిదాకాశరూపమేయై యున్నది. ఈ యాకాశాది భూతములెట్లు చిదాకాశరూపములో అట్లే నా సమాధియందు గాంచఁబడినదియు చిదాకాశరూపమేయై యున్నది.

యథా కచతి తచ్చారు చేతనం చతురం తథా
యథాస్థితం తదేవేదం సత్యం స్థిరమివ స్ఫురత్. 8

సత్యముగను, స్థిరముగను, మనోహరముగను భాసించు ఏయీ జగత్తుగలదో అది నిపుణమై, చేతనమైనట్టి బ్రహ్మమే యవ్విధమున స్థితినొంది యున్నదగును.

శ్రీరామ ఉవాచ:—

భగవన్స్వప్న ఏవేదం కథం జాగ్రదవస్థితమ్
అసత్యమేవ సత్యత్వమివ యాతం కథం భవేత్. 9

శ్రీరాముఁడు:— మహాత్మా ! స్వప్నరూపమైన యీ జగత్తు జాగ్రత్స్వరూప మెట్లాయెను. మఱియు, అసత్యమైనను సత్యముగ (నేత్రాదులకు విషయమై) యేల భాసించుచున్నది?

శ్రీవసిష్ఠ ఉవాచ:—

శృణు స్వప్నమయాన్యేవ కథం సన్తి జగన్త్యలమ్
నాన్యాని నచ సత్యాని న స్థిరాణి స్థితాని చ. 10

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా ! ఈ జగత్తులన్నియు నిక్కముగ స్వప్నరూపము లెట్లగునో యా విషయమునుగూర్చి వినుము. స్వప్నమువలె నియ్యవి ఆత్మకంటె భిన్నములుకావు. పరమార్థ సత్యరూపములుగావు, స్థిరములుగావు, అనిర్వచనీయములై ప్రతిభాసరూపమున ఆత్మశక్తిచే స్థితినొందియున్నవగును.

అనుభూతాని బీజాని బీజరాశావివామ్బరే
అన్యాన్యన్యాని తాన్యేవ సమాని న సమాని చ. 11

బీజరాశియందనుభూతములగు బీజములవలె ఈ జగత్తులు చిదాకాశమున ప్రళయానంతరము కొన్ని పూర్వము వలెనే యుండును. కొన్ని వేఱ్వేఱుగనుండును. అట్లే కొన్ని సమములుగను కొన్ని అసమములుగను నుండును.

ప్రత్యేకమన్తరన్యాని తథైవాభ్యుదితాని చ
పరస్పరమదృష్టాని బహూని వివిధాని చ 12

స్వప్నమునందు మరల స్వప్నములు గలుగునట్లు ప్రతి యొక్కొక్క జగంబులోపలను మరల పరస్పరము అదృష్టములైనట్టి వివిధ ప్రకారములగు జగంబులుత్పన్నములగు చున్నవి.

అన్యోన్యం తాని సర్వాణి న పశ్యన్త్యేవ కించన
జడానీవైకరాశీని బీజానీవ గలన్త్యపి. 13

ఈ జగత్తులన్నియుఁ బరస్పర మొకదానినొకటి గాంచకయున్నవి. మఱియు, ధాన్యపుకొట్టునందలి జడములైన బీజరాసులందలి బీజములవలె నశించుచును నున్నవి.

వ్యోమాత్మత్వాన్న గగనం న విదన్తి పరస్పరమ్
అపి చేతనరూపాణి సుప్తానీవ నిరన్తరమ్. 14

అట్లు నశించినను, వాస్తవముగ చిదాకాశ రూపములగుటఁబట్టి, అయ్యవి చేతన రూపములుగనే యుండునుగాని శూన్యరూపత్వము నెన్నఁటికిని బొందనేరవు. మఱియు, పరస్పర మొకదాని నొకటి యెఱుఁగనులేవు. అజ్ఞానావృతమగు చేతన రూపములగుటచే నవి నిరంతరము నిద్రించుచున్నవి వలె స్వప్నముననే యనుభవించుచున్నవి.

సుప్తాః స్వప్నజగజ్జాలమహని వ్యవహారిణః
అసురా నిహతా దేవైస్తే స్వప్నజగతి స్థితాః. 15

అజ్ఞానాన్న గతాముక్తిం న జాడ్యాజ్జడతామితాః
న దేహవన్తః కిం సన్తు వినా స్వప్నజగత్స్థితేః. 16

అట నిద్రించు జీవులు స్వప్నజగజ్జాలమును బొంది యచటఁ గల్పింపఁబడిన పగటియందు సర్వ వ్యవహారముల నాచరించుచున్నారు. ఆ స్వప్నజగత్తునందున్న అసురులు తత్స్వప్నమందలి దేవతలచే హతులుకాఁగా, అజ్ఞానకారణమున ముక్తిఁ బొందకయు, జడత్వముతోటి శిలారూపత్వమును బడయకయు, దేహసహితులు గాకయు నున్నారు. అట్టి దశయందున్న వారికి స్వప్నజగత్స్థితి తప్ప వేరేమి స్థితియుండఁ గలదు?

సుప్తా స్వప్నజగజ్జాలే స్వాచారవ్యవహారిణః
పురుషా నిహతాః పుంభిస్తే తథైవ వ్యవస్థితాః. 17

అట్లే నిద్రించు మనుష్యులున్ను వారివారి స్వప్న జగజ్జాలమందు స్వకీయ ఆచార, వ్యవహారములఁ గావించుచున్నారు. వారు వారి స్వప్న మనుజులచే హతులైనచోఁ బైనఁ దెల్పఁబడిన అసురలవలె స్వప్నపరంపరయందే స్థితులైయుందురు.

నిర్మోక్షా నిఃశరీరాస్తే చేతనావాసనాన్వితాః
దృష్టం స్వప్నజగజ్జాలం వినా చ క్వ వసన్తు తే. 18

మోక్ష రహితులున్ను, శరీర శూన్యులును, చేతనాయుక్తులును, వాసనా సహితులును, జాగ్రత్తును బొందజాలనివారునగు ఆ జీవులు స్వప్నజగత్తునందుఁ దప్ప మఱియెచట నివసింపగలరు?

సుప్తాః స్వప్నజగజ్జాలవ్యవస్థాచారచారిణః

యే హతా రాక్షసా దేవైస్తే యథైవ వ్యవస్థితాః. 19

నిద్రించు రాక్షసులున్ను వారివారి స్వప్నజగజ్జాలముయొక్క వ్యవస్థననుసరించి యట వ్యవహార మాచరించుచున్నారు. వారు వారి స్వప్నమందలి దేవతలచే హతులైనచో, పైనఁ దెల్పిన యసురులవలె స్వప్నమందే వ్యవస్థితులైయుందురు.

ఏవం యే నిహతా రామ కిం తే కుర్వన్తి కథ్యతామ్

అజ్ఞత్వాన్న గతా ముక్తిం చేతనాన్న దృషత్త్వితాః. 20

ఓ రామచంద్రా! ఈ ప్రకారముగ స్వప్నమందు హతులైన వారేమి చేయుచున్నారో చెప్పుము! అజ్ఞానవశమున ముక్తిఁ బొందకయు, చేతనులగుటచే శిలాత్వముఁ జెందకయు నున్నారు.

సాద్ర్యబ్ధ్యుర్వీజనం దృశ్యమిదం సర్వం యథాస్థితమ్

చిరాయానుభవన్త్యేతే యథేమే వయమాదృతాః. 21

మనము జాగ్రత్తు ననుభవించునట్లుగనే వారు తమ స్వప్నమందలి పర్వత, సముద్ర, పృథివీ, జన సముదాయ సహితమైనట్టి యథాస్థితమగు సమస్త దృశ్యమును చిరకాలము సత్యముగ నమ్మి యనుభవించుచున్నారు. కావున వారి స్వప్నము యీ మన జాగ్రద్రూపమే యగుచున్నది.

తేషాం కల్పజగత్సంస్థా యథాస్మాకం తథైవ తాః

అస్మాకం జగతీసంస్థా యథా తేషాం తథైవ చ. 22

వారి కల్పమున్ను, జగత్స్థితియు మనకు వలెనేయున్నవి. మన జగత్స్థితియు వారికి వలెనేయున్నది.

ఏతేషాం స్వప్నపురుషాస్త ఏవేమే వయం స్థితాః

యే చ తే నామ సంసారాస్తేభ్య ఏకమిమం విదుః. 23

మనచే ననుభూతమగు ఈ జగత్తున్ను, తదంతర్గతులగు మనమందఱమున్ను వారి స్వప్నమున గాంచఁబడినచో నపుడు వారి స్వప్న ప్రపంచములలో మన యీ ప్రపంచ మొకటి యగును. మఱియు మనమందఱమున్ను వారి స్వప్నపురుషుల మగుదుము.

తే స్వప్నపురుషాస్తేషాం సత్యా ఏవానుభూతితః

ఆత్మనోఽపి పరస్యాపి సర్వగత్వాచ్చిదాత్మనః. 24

తమయొక్కయు, ఇతరుల యొక్కయు అనుభవమునందు సత్యులగుటచేతను, తత్స్వప్న సత్తానిమిత్తమగు అధిష్ఠానచిదాత్మ సర్వగామి యగుటచేతను, వారి కా స్వప్నమనుజులు సత్యముగనే యున్నారు,

యథా తే స్వప్నపురుషాః సత్యమాత్మన్యథాపరే

తథాపి స్వప్నపురుషాః సత్యమేవ తథైవ తే. 25

ఆ స్వప్నపురుషు లెట్లు వారి వారి దృష్టియందు సత్యమైయున్నారో, అట్లే నా చేతను నీ చేతను ప్రతిస్వప్నమందు ననుభూతులగు మనుజులున్ను సత్యమై యున్నారు.

స్వస్వప్నపురపౌరా యే త్వయా దృష్టాస్తథైవ తే

స్థితాస్తత్ర తథాద్యాపి బ్రహ్మ సర్వాత్మకం యతః. 26

నీ స్వప్నమందు ఏ నగరములను, నగర నివాసులను నీవేవిధమున గాంచితివో, వారా విధమున నిపుడున్ను నచటనేయున్నారు. ఏలయనిన, బ్రహ్మము సర్వరూపమైయున్నది.

ప్రబోధేఽపి హి భిద్యన్తే స్వప్నభావా యథా స్థితాః

తథాస్థిత్యానుభూయన్తే పరబ్రహ్మతయాథవా. 27

ఎట్లు స్వప్నపదార్థములు జాగ్రత్తునందు నశించినట్లను భూతమగుచున్నవో, అట్లే, అయ్యవి స్వప్నమందు స్థితిగల్గియున్న ట్లున్ను ననుభూతమగుచున్నవి. జాగ్రత్తునందలి వానిబాధవలె స్వప్నమందలి వానిస్థితి (సత్తయు) దొలగింపఁబడఁ జాలదు, లేక, సమస్తసత్తయు బ్రహ్మసత్తామత్రమగుటచే నెద్దాని సత్తయు దొలగింపఁబడఁజాలదు.

సర్వం సర్వాత్మ సర్వత్ర సర్వదాస్తి తథా పరే

యథా న కించిన్నాకాశం న క్వచిన్న చ హన్యతే. 28

ఈ సమస్త జగత్తున్ను ఆకాశముయొక్క కార్యమగుటచే ఆకాశరూపమేయగుచు తద్రూపమున నెచటను నొకింతైనను నెట్లు నశింపఁబడక యున్నదో, అట్లే సర్వము, సర్వత్ర, సర్వదా పరమాత్మరూపమే యగుచు, తద్రూపమున నొకింతైనను నశింపఁబడక యున్నది.

నిరన్తరే పరాకాశే నిరన్తే చ వినోదయే

నిరన్తే చిత్తసంఘాతే నిరన్తే జగతాం గణే. 29

ప్రత్యాకాశకలాకోశం ప్రతిసంసారమణ్డలమ్

ప్రతిలోకాన్తరాకారం ప్రతిద్వీపం గిరిం ప్రతి. 30

ప్రతిమణ్డలవిస్తారం ప్రతిగ్రామం పురం ప్రతి

ప్రతిజన్తు ప్రతిగృహం ప్రతివర్షం యుగం ప్రతి. 31

ఉత్పత్తిశూన్యమై, ఆదిమధ్యాంతరహితమై, అనంతమైనట్టి చిదాకాశరూపమైన పరబ్రహ్మమందు అనంతములైన చిత్తసమూహములుగలవు. ఆ ప్రతియొక్క చిత్తమందును అసంఖ్యాతమైన జగత్సమూహములుగలవు. అప్రతియొక్క జగత్తుయొక్క యాకాశమందును అనేక ప్రపంచ మండలములు గలవు. ఆ ప్రతిప్రపంచ మండలమందును అనేక లోకములుగలవు, ఆ ప్రతిలోకమునందును అందలి ప్రతిద్వీప, పర్వత, ప్రాంత, పుర, గ్రామ, గృహమందును, అగృహములందలి ప్రతిజీవియందును, ప్రతివత్సర, యుగాదికాలములందును అసంఖ్యాతములైన జగంబులు గలవు.

యావన్తో యే మృతాః కేచిజ్జీవా మోక్షవివర్జితాః

స్థితాస్తే తత్ర తావన్తః సంసారాః పృథగక్షయాః. 32

మరణించినను, జీవించియున్నను, మోక్షవర్జితులై యుండునంతవఱకు జీవులకి అనంతములైన జగంబులు అక్షయముగను, వేర్వేఱుగను నుండుచునేయుండును.

తేషామన్తర్జనాః సన్తి జనం ప్రతి పునర్మనః
పునర్మనః ప్రతి జగజ్జగత్ప్రతి పునర్జనః. 33

ఆ జీవుల వాసనలయందును అసంఖ్యులగు జీవులు గలరు. ఆ యొక్కొక్క జీవుని మనంబునందును అసంఖ్యాతములైన జగత్తులు గలవు. ఆ యొక్కొక్క జగత్తునందలి ప్రతి యొక్కొక్క జీవుని మనస్సునందును మరల యనేక బ్రహ్మాండములు గలవు,

ఇత్థమాద్యన్తరహిత ఏష దృశ్యమయో భ్రమః
బ్రహ్మైవ బ్రహ్మవిత్పక్షే నాత్రేయత్తాస్తి కాచన. 34

ఇవ్విధముగ, ఈ దృశ్యభ్రమ అద్యంత రహితముగ కొనసాగుచునే యున్నది, దీనికి హద్దుయేమియును లేదు. కాని బ్రహ్మజ్ఞానియొక్క దృష్టియం దిదియంతయు బ్రహ్మరూపమే యైయున్నది.

కుడ్యే నభస్యుపలకే సలిలే స్థలేఽన్త
శ్చిన్మాత్రమస్తి హి యతస్తదశేషవిశ్వమ్
తద్వ్యత్ర తత్ర జగదస్తి కుతోఽత్ర సంఖ్యా
తజ్జ్ఞేషు తత్పరమథాజ్ఞమనఃసు దృశ్యమ్. 35

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే జగత్తత్త్వైక్య
ప్రతిపాదనం నామ త్రిషష్టితమః సర్గః ॥ 63 ॥

ఓ రామచంద్రా! భిత్తి (గోడ)యందును, ఆకాశమందును, శిలయందును, జలమందును, స్థలమందును, చిన్మాత్రమగు పరబ్రహ్మమే గలదు. అదియే యీ జగత్తంతయునై యున్నది, జగత్తను వస్తువు వేఱుగలేదు. ఆ చైతన్యము సర్వవ్యాపకమగుటచే సర్వత్ర యనేకజగత్తులుండియే యున్నవగును. వానిని లెక్కింపఁ దరముకాదు. జ్ఞానియొక్క దృష్టియందీజగత్తులన్నియు నిర్విశేషమై, నిరతిశయానంద రూపమైనట్టి బ్రహ్మమే యగును. అజ్ఞానియొక్క మనస్సునకో, అవి యుత్తమదృశ్యరూపములై యున్నవి. కావుననే యాతని అనర్థ పరంపర శమింపకనే యున్నది.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణ ప్రకరణమున
నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున జగత్తత్త్వైక్యప్రతిపాదనమను
నఱువదిమూఁడవ సర్గము ॥ 63 ॥

చతుఃషష్టితమః సర్గః

[పృష్టయేహ వసిష్ఠేన విద్యాధర్యా హి విస్తరాత్
స్వగేహ జన్మకర్మాద్యా నిర్వేదాన్తా నిరూపితాః

వసిష్ఠ మునీంద్రుఁడడుగ, విద్యాధరి తమ గృహ, జన్మ కర్మాదులు మొదలుకొని వైరాగ్య పర్యంతము సమస్త వృత్తాంతమును విస్తారముగ నిరూపించుట యిచట, గాననగును.]

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

తతస్తత్కువలోల్లాసి మాలతీ మాల్యలోచనా
లలనా లలితాలోక్య లీలయా లపితా మయా. 1

శ్రీ వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! అటుపిదప, కమలములవలె విలాసయుక్తములును మాలతీమాలలవలె విస్తారములైనవియునగు నేత్రములుగలవియు స్త్రీనిజూచి వినోదపూర్వకముగ నే నిట్లడిగితిని.

కా త్వం కమలగర్భాభే కిమర్థం మాముపాగతా
కస్యాసి కిం ప్రార్థయసే క్వ గతాసి కిమాస్పదా. 2

కమలగర్భమువంటి శోభగల యో మానినీ! నీ వెవతెవు? ఇటకేల చనుదెంచితివి? ఎవరి కొమరితవు (లేక భార్యవు)? ఏమి ప్రార్థించుచున్నావు? ఎచటి కేగితివి? నీ నివాసస్థలమెద్ది?

విద్యాధర్యువాచ:—

మునే శృణు యథావత్త్వమాత్మోదన్తం వదామ్యహమ్
ప్రష్టుమర్హసి విస్రబ్ధమార్తాం కరుణయార్థినీమ్. 3

విద్యాధరి:— ఓ మునీంద్రా! నేను నా వృత్తాంతమంతయు ఉన్నది యున్నట్లుగ వచించుచున్నాను వినుడు. సంసారదుఃఖముచేఁ బీడితయై తద్దుఃఖశమనోపాయము నర్థించుటకై తమవద్దకేతెంచినట్టి నన్ను విశ్వసించి, కరుణతో నా వృత్తాంతమునుగూర్చి యడుగుట తమకుఁ దగియేయున్నది.

పరమాకాశకోశస్య కస్మిశ్చిత్కోణకోటరే
యుష్మాకం సంస్థితం కించిదిదం తావజ్జగద్గృహమ్. 4

ఓ మునీంద్రా! చిదాకాశముయొక్క యొకానొక కోణమందు యీ తమ జగద్రూప గృహము అతిస్వల్పమై వర్తించుచున్నది.

పాతాలభూతలస్వర్గా ఇహాపవరకాస్త్రయః
కల్పనైకా కుమార్యత్ర కృతా ధాతృత్వమాయయా. 5

ఈ తమ జగద్రూపగృహమున, పాతాళ, భూలోక, స్వర్గములను మూఁడు లోపలి గదులు కలవు. ఇట్టి గృహమున హిరణ్యగర్భత్వరూపిణియగు మాయ సృష్ట్యాదివైచిత్ర్యకల్పన యను నొక కన్యను సృజించెను.

తత్ర ద్వీపైః సముద్రైశ్చ వలితం వలయైరివ
పాటలోత్థం జగల్లక్ష్మ్యాః ప్రకోష్ఠమివ భూతలమ్. 6

ఆ గృహమున ద్వీపములచేతను, సముద్రములచేతను, వలయములవలెఁ జుట్టబడినదియు, తద్వర్ణములచే నొకింత యెఱుపురంగు గలిగియున్నదియు ఉన్నతమైనదియునగు భూతలము జగల్లక్ష్మియొక్క హస్తమూలమువలె శోభించుచున్నది.

అన్తే ద్వీపసముద్రాణాం సర్వదిక్కమవస్థితా
యోజనానాం సహస్రాణి దశ హేమమయీ మహీ. 7

సప్తద్వీపములయొక్కయు, సముద్రములయొక్కయు అంతమున సర్వదిశలను వ్యాపించి పదివేల యోజనముల విస్తీర్ణముగల్గిన సువర్ణమయమగు భూప్రదేశముగలదు.

స్వయంప్రకాశ సంకల్పఫలదామ్బర నిర్మలా
చిన్తామణిమయీ స్వచ్ఛా స్వచ్ఛాయాజితవిష్టపా. 8

ఆ భూప్రదేశము రాత్రియందును స్వయముగఁ బ్రకాశించునదియు, కోర్కెలన్నిఁటిని ఈడేర్చునదియు, ఆకాశమువలె నిర్మలమైనదియు, చింతామణిమయమైనదియు, ధూళిమున్నగునవి లేనిదై యతిస్వచ్ఛమై యలరునదియు, తన శోభచే స్వర్గాదిలోకములఁగూడ జయించినదియునై యొప్పుచున్నది.

సాప్సరోమరసిద్ధానాం లీలావిహరణావనిః
సంకల్పమాత్రసంపన్న సర్వసంభోగసున్దరీ. 9

మఱియు, ఆ భూమి సంకల్పమాత్రముచే సమస్తభోగములను గలుగఁజేయునదియు, మిగుల సుందరమైనదియు, అప్సరససహితులగు దేవతలకును, సిద్ధులకును, లీలావిహారస్థానమైనదియునై వెలయుచున్నది.

అన్తే తస్యా భువః శైలో లోకాలోకోఽస్తి విశ్రుతః
భూపీఠస్య ప్రకోష్ఠస్య వలయావలనాం దధత్. 10

ఆ పృథివియొక్క యంతమున జగల్లక్ష్మియొక్క హస్తమను భూమండలమునకుఁ గడియమువలె సంతత శోభించుచున్నట్టి లోకాలోకమను బ్రసిద్ధమగు పర్వత మొండుగలదు.

క్వచిన్నిత్యం తమోవ్యాప్తో మూఢబుద్ధేరివాశయః
క్వచిన్నిత్యం ప్రకాశాత్మా మనః సత్త్వవతామివ. 11

క్వచిదాహ్లాదజనకః సాధూనామివ సంగమః
క్వచిదుద్వేగజనకో మూర్ఖైరివ సమాగమః. 12

క్వచిత్ప్రకటసర్వార్థో మనో మతిమతామివ
క్వచిదత్యన్తగహనో మూర్ఖశ్రోత్రియ చిత్తవత్. 13
క్వచిదప్రాప్తసోమాంశుః క్వచిదప్రాప్తసూర్యభాః

క్వచిల్లోకమయస్తేన క్వచిదాశూన్యదిక్తటః. 14
క్వచిద్దేవపురవ్యాప్తః క్వచిద్దైత్యపురాన్వితః
క్వచిత్పాతాలగహనః క్వచిచ్ఛృఙ్గోర్ధ్వకన్ధరః. 15
క్వచిచ్ఛ్వభ్రభ్రమద్గృధ్రః క్వచిత్సానుమనోహరః
క్వచిచ్ఛృఙ్గశిఖాక్రాన్తవైరిఞ్చనగరాన్తరః. 16

ఆ పర్వత మొకచోట మూర్ఖుని హృదయమువలె నంధకారముచే వ్యాప్తమైయున్నది. ఒకచోట సజ్జనుల మనంబువలె నిత్యము ప్రకాశమానమై యలరుచున్నది. వేఱొకచోట సాధుసాంగత్యమువలె నాహ్లాదజనకమై యొప్పుచున్నది. ఇంకొకచోట మూర్ఖుల సహవాసమువలె దుఃఖప్రదమైయున్నది. మఱియొకచోట బుద్ధిమంతుల చిత్తమువలె సర్వప్రయోజన పరిపూర్ణమై వర్తించుచున్నది. ఇంకొకచోట మూర్ఖుఁడగు శ్రోత్రియుని (కేవల వేదపాఠియొక్క) చిత్తమువలె అతిగహనమైయున్నది. మఱియు నయ్యది యొకచోట చంద్రప్రకాశవర్జితమై, మఱియొకచోట సూర్యప్రకాశరహితమై, ఒకచోటఁ మనుష్యులచేఁ బూర్ణమై, వేఱొకచోట కేవలము జనశూన్యమైనట్టి దిగ్భాగములు గలదై, ఒకచోట దేవతల నగరములచే వ్యాప్తమై, ఒకచోట అసురుల పురములతోఁ గూడినదై, ఒకచోట పాతాళమువలె, బ్రవేశింప నశక్యమై, మఱియొకచోట మహాశిఖరమను నున్నతకంఠముగలదై, ఒకచోట గోతులందు సంచరించుచున్న గృధ్రములతోఁ గూడియున్నదై, వేఱొకచోట శిఖరములచే మనోహరమై, ఒకచోట నెత్తైన శిఖరముల పైభాగముచే బ్రహ్మదేవుని నగరమును గూడ నాక్రమించుచున్నట్లున్నదై వెలయుచున్నది.

క్వచిచ్ఛూన్యమహారణ్య వహత్కల్పాన్తమారుతః
క్వచిత్పుష్పవనోద్యాన గాయద్విద్యాధరీగణః. 17

క్వచిత్పాతాలగమ్భీర గుహాకుష్మాణ్డభీషణః
క్వచిన్నన్దన సోదర్యమున్యాశ్రమమనోరమః. 18

క్వచిదక్షయమత్తాభ్రః క్వచిద్దుర్లభవారిదః
క్వచిద్గర్భగుహాశ్వభ్రగహనోపాన్తమణ్డలః. 19

క్వచిత్క్షుబ్ధజనాః క్షేపసముత్పాదిత భూతభూః
క్వచిద్వాస్తవ్యజనతా సౌజన్య జితవిష్టపః. 20

క్వచిన్నిత్యం వహద్వాతా జాతస్థావరజఙ్గమః
క్వచిత్సర్వక్షయోన్ముక్తస్థిరస్థావరజఙ్గమః. 21

క్వచిన్మహామరుమరున్ముక్త భాంకారభీషణః
క్వచిత్క్వణత్కమలినీమత్తసారసభూషణః 22

క్వచిత్సలిలకల్లోలజలదోల్లాసఘర్ఘరః
క్వచిన్మత్తాప్సరోదోలావిలాస జనితస్మరః. 23

క్వచిత్పిశాచ కుమ్మాణ్డవేష్టితాచేష్టదిక్తటః
క్వచిద్విద్యాధరీసిద్ధనృత్యగీత సరిత్తటః. 24

మఱియు, ఆ పర్వత మొకచోట శూన్యమైన మహారణ్యములందుఁ బ్రళయకాలప్రచండ వాయువుఁతో గూడినదై, ఒకచోట పుష్పవాటికలందును, ఉద్యానములందును గానమొనర్చుచున్న విద్యాధరీగణ సహితమై, మఱియొకచోట పాతాళమువలె గంభీరమైనట్టి గుహలందు 'కుంభాండు' లను రాక్షసులచే మిగుల భయంకరమై, ఇంకొకచోట నందనవనమును బోలిన మునుల యాశ్రమములచే మనోహరమై, వేఱొకచోట గర్జించు మహామేఘములతో నిరంతరము గూడియున్నదై, ఒకచోట గుహలందు భయంకరములైన గర్తప్రదేశములు గల్గియున్నదై, మఱియొకచోట సంక్రుద్ధులగు మనుజుల ఖడ్గాదుల ప్రహారములచే నశింపఁజేయఁబడిన రాక్షస, పిశాచాది నివాసులుగలదై, ఇంకొకచోట తన్నివాసుల సౌజన్యముచే స్వర్గమునుగూడ జయించునదై, ఒకచోట నిరంతరము వాయువు వీచుటచే స్థావరజంగమముల యుత్పత్తిలేనిదై, ఒకచోట శస్త్రాగ్ని రోగాది సర్వక్షయరహితమగుటచే స్థావరజంగమముల స్థిరత్వముతోఁ గూడియున్నదై, ఒకచోటగొప్ప మరుస్థలముయొక్క ప్రచండవాయువుచే జనించిన ఝాంకారశబ్దములచే నతిభయంకరమై, ఒకచోట తుమ్మెదల శబ్దములతోఁ గూడిన కమలసరోవరములచేతను, మదించిన హంస సారసాది పక్షులచేతను మనోహరమైనదై. ఒకచోట జలకల్లోలములచేతను, మేఘముల యుల్లాసముచేతను ఘర్ఘరశబ్దసహితమై, మఱియొకచోట ప్రమత్తులగు అప్సరసల డోలావిలాసములచే కామదేవుని జనింపఁజేయునదై, ఒకచోట పిశాచ, రాక్షసాదులచే పరివేష్టితమైయుండుటచే చేష్టాసహితములైన దిక్కులతో గూడియున్నదై, ఒకచోట విద్యాధరీ సిద్ధాంగనల నృత్యగానసహితమగు నదీతీరము గల్గియున్నదై వెలయుచున్నది.

క్వచిదుద్వర్షదమ్భోదసరిద్బాహులుఠత్తటః
క్వచిత్ప్రతతగానీత నీతనానాభ్రసత్పటః. 25

క్వచిత్కమలినీకోశవక్త్రస్థావ్యనమణ్డలః
క్వచిత్స్వర్గాఙ్గనాసిద్ధసున్దరీదన్తమణ్డనః. 26

క్వచిత్తపద్దినకరజనతాచారసున్దరః
క్వచిన్నైశతమో గేహనృత్యన్మత్తనిశాచరః. 27

క్వచిదుత్పత దుత్పాతతయా నశ్యజ్జనావనిః
క్వచిత్సారాజ్యసంపత్త్యా ప్రోద్భవత్పురమణ్డలః. 28

క్వచిదత్యన్తని శ్శూన్యః క్వచిజ్జనపదావృతః
క్వచిచ్ఛ్వభ్రా న్తగమ్భీరః క్వచిత్పాతాలభీషణః. 29

క్వచిద్బృహత్కల్పతరుః క్వచిన్నిర్జలజఙ్గమః
క్వచిన్మహాకరికులః క్వచిన్మత్తహరివ్రజః. 30

క్వచిన్నిర్భూతముద్యాతః క్వచిదున్మత్తరాక్షసః
క్వచిత్కణ్టకగహనః క్వచిత్తాలమహావనః. 31

క్వచిద్వ్యోమోపమసరాః క్వచిద్దీర్ఘమరుస్థలః
క్వచిన్నిత్యభ్రమత్పాంసుః క్వచిత్సర్వర్తుకాననః. 32

మఱియు, ఆ (లోకాలోక) పర్వత మొకచోట వర్షించుచున్న మేఘముల యొక్క నదీరూప బాహువులచే భగ్నమొనర్పఁబడిన తటములుగలదియు, ఒకచోట వాయువుచే, గొనిరాబడిన వివిధ మేఘములను వస్త్రములచే శోభించుచున్నదియు, ఒకచోట తుమ్మెదలతోఁగూడిన కమలసరోవరములచే మనోహరమైనదియు, మఱియొకచోట అప్సరసలయొక్కయు, సిద్ధాంగనలయొక్కయు దంతముల నలంకరించునట్టి తాంబూల వనముతోఁగూడియున్నదియు, ఒకచోట దేదీప్యమానముగఁ బ్రకాశించు సూర్యునిచేతను, జనుల యాచారములచేతను సుందరమైయున్నదియు, ఇంకొకచోట రాత్రియందలి యంధకారమును గృహమున నృత్యమొనర్చుచున్న మదించిన నిశాచరులచేఁ బూర్ణమైయున్నదనియు, ఒకచోట భీకరమైన యుత్పాతములచే నశించుచున్న జనపదముగలదియు, మఱియొకచోట ఉత్తమరాజ్యసంపత్తిచే నుద్భవించిన నూతన నగరముచే శోభితమై నదియునై వెలయుచున్నది. మఱియు నయ్యది యొకచోట కేవలము జనశూన్యమై, ఒకచోట ననేక రాజ్యములచేఁ బూర్ణమై ఒకచోట జలపూరితములగుగర్తములచే గంభీరమై, ఒకచోట శుష్కగర్తములచే, పాతాళమువలె భయంకరమై, వేఱొకచోట గొప్పకల్పవృక్షములు గలదై, ఒకచోట నిర్జలస్థాన యుక్తమై, ఒకచోట మహాగజసమూహసహితమై, ఇంకొకచోట మదించిన సింహవానరసమూహముతోఁ గూడియున్నదై, ఒకచోట ప్రాణి శూన్యమై యుండుటచే వ్యర్థమగు ఉన్నతిగలదై, ఒకచోట ఉన్మత్తులగు రాక్షసులు గల్గియున్నదై, ఒకచోట కంటకయుక్తములగు వృక్షములచే నతిభయంకరమై, ఒకచోట గొప్ప తాళవనముచేఁ బరిపూర్ణమై, ఒకచోట నాకాశమువలె విశాలములై, నిర్మలములైనట్టి సరస్సులు గలదై, ఒకచోట దీర్ఘమరుస్థలములతోఁ గూడినదై, ఒకచోట నిరంతరము ఎగురుచున్నట్టి ధూళిచేఁ బూర్ణమై, ఒకచోట సర్వఋతుసంయుక్తమగు వనములచే శోభితమైయలరుచున్నది.

శిఖరేషు శిఖాస్తస్య సామాన్యాచలసంనిభాః
సన్తి సుస్థితకల్పాభ్రా రత్నమయ్యోఽమ్బరామలాః. 33

ఓ మునీంద్రా! అట్టి లోకాలోకపర్వతముయొక్క శిఖరములపై సహ్యమలయాది పర్వతములందువలె సుస్థిరకల్పమేఘములవంటివియు, ఆకాశమువలె నిర్మలములును నగు అనేక రత్నమయములైన శిలలుగలవు.

క్షీరోదకార్కగౌరీణాం వనస్కన్ధౌకసామివ
విశ్రామ్యన్త్యనిశం యాసు హరయోహరియోనయః. 34

క్షీరమువలెను, ఉదకమువలెను, సూర్యునివలెను దెల్లనైనట్టి యా శిలలపై, వనమందలి మహావృక్షశాఖలపైవలె సింహవానరాదులు సదా విశ్రమించుచుండును.

తాసాముత్తరదిగ్భాగే పూర్వశృఙ్గశిలోదరే
నివసామ్యహమక్షీణవజ్రసారసమత్వచి. 35

ఆ శిలలందు తత్పర్వతముయొక్క యుత్తరదిగ్భాగమునఁ బూర్వదిశయందున్న శిఖరముపైగల, నాశరహితమై, వజ్రమువలె దృఢమైనట్టి శిలయొక్క యుదరభాగమున నేను వసించుచున్నాను.

విధినా తత్ర బద్ధాస్మి వసామ్యుపలయన్త్రకే
అత్రాసంఖ్యా మునే యాతామన్యే యుగగణా మమ. 36

బ్రహ్మదేవుని నియతిచే ఆ శిలాయంత్రమునఁ బంధింపఁబడి నేనచట నివసించుచున్నాను. ఓ మునీంద్రా! ఆట వసించుచు నాకిప్పటికి అసంఖ్యాతములైన యుగసమూహములు గడచినవని యెంచెద.

న కేవలమహం బద్ధా యావద్భర్త్రాపి తత్ర మే
బద్ధః సాయంతనే పద్మకుడ్మలే షట్పదో యథా. 37

కేవలము నేనే కాదు. నా భర్తయు నట సాయంకాలమున కమలకోశమున భ్రమరమువలె బద్ధుఁడైయున్నాఁడు.

తేన సార్ధం మయా భర్త్రా శిలాకోటరసంకటే
అనుభూతా చిరం కాలమత్ర వర్షగణా గతాః. 38

ఆ నా పతితోఁగూడ నేనాశిలాకోటరసంకటమునఁ జిరకాలమనేకవత్సరసమూహములఁ గడిపితిని.

అధ్యాత్మైకదోషేణ నహి మోక్షం లభావహే
చిరం తత్రైవ తిష్ఠావ స్తథైవాబద్ధభావనౌ. 39

ఇప్పటికిని కామదోషముచే మేమిరువురమును మోక్షమును బొందకయే యున్నవారమే అట్లే మమత్వముచే బద్ధులమై చిరకాలమచటనే వసించుచున్నాము.

పాషాణసంకటే తస్మిన్బద్ధావావాం న కేవలమ్
బద్ధోయావదశేషేణ పరివారోఽపి తత్ర నౌ. 40

ఆ శిలాసంకటమున మేమిరువురమే కాదు. మా పరివారమంతయునుగూడ నచట బద్ధమైయేయున్నది.

పురాణపురుషో బద్ధో ద్విజస్తత్రాస్తి మే పతిః
ఏకస్థానాన్న చలతి జీవన్యుగశతాన్యసౌ. 41

పురాతన పురుషుఁడైన బ్రాహ్మణుఁడగు నా పతి యట ననేకయుగములు జీవించియున్నప్పటికి నొకే స్థానమున నున్నవాడై మఱియొక స్థానమునకు బోవకయే యున్నాఁడు.

ఆబాల్యాద్బ్రహ్మచారీ చ శ్రోత్రియః పాఠకోఽలసః
ఏకాన్త ఏక ఏవాస్తేఽజిహ్మవృత్తిరచాపలః. 42

ఆ నా పతి బాల్యకాలమునుండియు బ్రహ్మచారియై యున్నవాఁడును, వేదముల నెఱిఁగినవాఁడును, అలసుఁడును, కపటవర్జితుఁడును, ఇంద్రియచాపల్యరహితుఁడునై యేకాంతముననే వసించుచున్నాఁడు.

అహం వ్యసనినీ భార్యా తస్య దేదవిదాంవర
న నిమేషం సమర్థాస్మి తం వినా దేహధారణే. 43

వేదవేత్తలలో శ్రేష్ఠుఁడవగు ఓ మునీంద్రా! ఆతని వ్యసనురాలైన భార్యనగు నేనాతఁడు లేకున్న యొక నిమిషమైనను దేహమును ధరింపఁజాలకయున్నాను.

శృణు తేన కథం బ్రహ్మన్భార్యాహం సముపార్జితా
కథం వృద్ధిమయం యాతః స్నేహోఽస్మాకమకృత్రిమః. 44

మహాత్మా! అతఁడు నన్నెట్లు తనభార్యగా గ్రహించెనో, యా యిరువురకును ఈ స్వభావికమగు స్నేహమెట్లు వృద్ధినొందెనో వచించెద వినుఁడు.

తేన జాతేన మద్భర్త్రా బాలేనైవ సతా పురా
కించిజ్జ్ఞేన సతైకేన తిష్ఠతాత్మాలయేఽమలే. 45

శ్రోత్రియత్వానురూపేణ జాయా మే జన్మశాలినీ
కుతః సంభవతీత్యేవ నిర్ణీయ చిరచిన్తయా. 46

స్వయమేవానవద్యాఙ్గీ తేన తామరసేక్షణ
ఉత్పాదితాస్మి నాథేన జ్యోత్స్నేవ శశినాఽమలా. 47

మానసా మనసీభార్యా మన్దరోత్తమ సున్దరీ
తతో వృద్ధిం ప్రయాతాస్మి వసన్త ఇవ మఞ్జరీ. 48

కమలనేత్రుఁడవగు మునీంద్రా! ఉత్తమ కులమందు జనించినవాఁడును, బాల్యావస్థాసహితుడును, సజ్జనుఁడును, యొకింత జ్ఞానసంపన్నుఁడునగు నా భర్త పూర్వకాలమునఁ దన నిర్మలస్థానమున వసించుచు నా వేదజ్ఞత్వమునకుఁ దగినదియు, యుత్తమ కులవతియు, సౌందర్యాది గుణములు గలదియునగు స్త్రీ యెట్లు జనింపఁగలదని చిరకాలము చింతింప అనిందిత శరీరము గలదాన నగు నేనపుడా నా భర్తచే (అతని మనస్సుచే) చంద్రునినుండి నిర్మలచంద్రికవలె జనింపఁజేయఁబడితిని. కల్పవృక్ష లతవలె సౌందర్యవతినియు పతియొక్క మనస్సుచే జనింపఁజేయఁబడినదానను నగు అతని మానసిక భార్యనైన నేనపుడు వసంత ఋతువునందు లతవలె వృద్ధిబొందితిని.

సహజామ్బరసంఛన్నా భూతానాం చిత్తహారిణీ
పూర్ణేన్దుబిమ్బవదనా ద్యౌరివామలతారకా. 49

కోరకోచ్చస్తనభరా సమగ్రరసశాలినీ
లతావరవనేనేవ కరపల్లవశాలినీ. 50

సర్వస్య జన్తుజాతస్య నిత్యం హృదయహారిణీ
హారిణీ తారనయనా మదనోన్మాదదాయినీ. 51

స్వాభావిక వస్త్రమును ధరించుదాననై, సర్వజీవుల చిత్తమును హరించుచు పూర్ణచంద్రునివంటి ముఖముగల్గి నిర్మల నక్షత్ర సమూహ యుక్తమగు నాకసమును బోలినదాననై

నేను క్రమముగ వృద్ధినొందితిని. మఱియు, పూ మొగ్గలవంటి యెత్తైయిన స్తనములచే శోభించుచు, శ్రేష్ఠవనమువలె, పల్లవములను హస్తములతోఁగూడిన లత భూషితమగునట్లు, సమస్త గుణములచే నేను భూషితనైతిని. మఱియు, నేను హరిణివంటి దీర్ఘ నేత్రములు గలదానను, మన్మథునకుఁ గూడ ఉన్మాదము కలుగఁజేయుదానను, సర్వజీవుల హృదయమును నిరంతరము హరించుదాననునై యున్నాను.

లీలావిలాసైకరతా హేలావలితలోచనా
గేయవాద్య ప్రియా నిత్యం న చ తృప్తాను రాగిణీ. 52

ఇంకను, నేను లీలావిలాసములందు మిగుల ప్రీతిగలదానను. కౌతుకముచే కటాక్షము (కడకన్ను) ధరించుదానను, గాన వాద్యములందు నిరంతర మపేక్షగల్గి యుండుదాననునై యున్నాను. కాని భోగములందనురాగము గల్గియున్న నే నింతవఱకును దృప్తిఁబొందకున్నాను.

సౌభాగ్యభోగపరమా లక్ష్మ్యలక్ష్మ్యోః క్రియా సఖీ
అనన్యా మోహజాలానామఖిన్నా సంపదాపదోః. 53

మఱియు, నేను సౌభాగ్యమను భోగమును ముఖ్యముగ దలంచుదానను, సమదర్శియగు పతియొక్క మనోమయరూపిణినగుటచే నాతని ప్రియ సఖివలె సంపదను, దారిద్ర్యమును సమముగఁ జూచుదానను, కావుననే మోహజాలములందు బడియున్నను సంపదలందును విపత్తులందును ఖేదరహితయై యున్నదానను నైయొప్పుచున్నాను.

న కేవలమహం గేహం ధారయామి ద్విజన్మనః
యావత్త్రైలోక్యసదనమిద మఙ్గ బిభర్మ్యహమ్. 54

ప్రియుడవగు మునీంద్రా! నేను కేవలము బ్రాహ్మణుఁడగు నా పతియొక్క గృహమునే ధరించుటలేదు. పతియొక్క మనోమయరూపిణినగుటచే నాతనిచే గల్పితమగు త్రైలోక్యమునుగూడ ధరించుచున్నాను.

అహం కులకరీ భార్యా కలత్రభరణక్షమా
త్రైలోక్యగృహ సంభారధారణైకధురోద్వహా. 55

నేను పుత్రపౌత్రాదిరూప కులమును స్థాపింపజేయఁ గలదానను, పోష్యవర్గమును బాలింప సమర్థురాలను. ముల్లోకములను గృహముయొక్క భారమును వహింప శక్తిగలదానను నైయున్నాను.

అథాహం తరుణీజాతా సముద్భిన్నోన్నత స్తనీ
లతోల్లలద్గులుచ్ఛేవ విలాసరసశాలినీ. 56

వికసించిన పుష్ప ఫల గుచ్ఛములతో గూడిన రసయుక్తమగు లతవలె నేనిపుడు ఉన్నత స్తనములతోఁ గూడినదాననై యౌవనావస్థఁ జెందితిని.

పతిర్మాం దీర్ఘసూత్రత్వాద్బ్రహ్మైకనియత్వాత్తపోరతః
కయాప్యపేక్షయాద్యాపి న వివాహితవానిమమ్. 57

నా పతి దీర్ఘసూత్రి (అలసుఁడు) అగుటచేతను, వేదజ్ఞుఁడును, తపోనిరతుఁడును నగుటవలనను, నేనిట్టి గుణలక్షణములతో గూడి యున్నప్పటికిని మోక్షాపేక్షవలన నన్నింకను వివాహము చేసికొనకయేయున్నాఁడు.

తేన యౌవనసంపన్నవిలాసరసశాలినీ
తం వినా వ్యసనేనాహ దహ్యేఽగ్నావివ పద్మినీ. 58

అతనితోటి యౌవనసంపన్న భోగములను ననుభవింప నిచ్ఛగల నేనాతనిని స్వయముగనే నా భర్తగ వరించితిని. అతనిని భోగవ్యసన రహితునిగఁ జూచి నేనగ్నియందుఁ గమలమువలె సంతప్తనగుచున్నాను.

శీతానిలవిలోలాసు నలినీషు నిరన్తరమ్
అఙ్గదాహమవాప్నోమి పూతాఙ్గారస్థలీష్వివ. 59

ఉద్యానావనయః సర్వాః పూర్ణాః కుసుమవర్షణైః
సంపన్నాస్తప్తసికతాః శూన్యా మే మరుభూమయః. 60

జలకల్లోల కహ్లారకమలోత్కరకోమలాః
సరస్యః సారసారావసరసా మమ నీరసాః. 61

అహం పుష్కరమన్దారకుముదోత్కరమాలితా
భృశం దాహమవాప్నోమి కణ్టకేష్వివ దోలితా. 62

కుముదోత్పలకహ్లార కదలీతల్పపాలయః
మదఙ్గసఙ్గమాద్గ్రీష్మమర్మరా యాన్తి భస్మతామ్. 63

యత్కాన్తముచితం స్వాదు విచిత్రం చిత్తహారి చ
తదాలోక్యభవామ్యన్తర్బాష్పపూర్ణాయతేక్షణా. 64

వ్యసనానలసన్తప్తాః పతన్తో బాష్పబిన్దవః
ఛమచ్ఛమితి మజ్జన్తి కమలోత్పలపఙ్క్తిషు. 65

ఇక్కారణమున శీతవాయువుచే చలించు కమలములందును, భస్మరహితములగు అగ్నికణములు గల స్థలములందువలె నిరంతరము అవయవముల దాహమును బొందుచున్నాను. మఱియు, పుష్పవర్షములచేఁ బూర్ణములగు ఉద్యానవనములన్నియు నాకు తపించిన యిసుకతోఁ గూడిన శూన్యములైన మరుభూములవలె గోచరించుచున్నవి. జలకల్లోలములతోడను, పలువిధ కమలసమూహములతోడను గూడి కోమలములై యలరుచు, సారసాది పక్షుల శబ్దములచే సరసములై యొప్పుచున్న సరోవరములున్ను నాకు నీరసములుగఁ దోఁచుచున్నవి. దాహశాంతికొఱకై సఖిజనులెపుడు నన్ను కమలమందారాది పుష్పమయములైన డోలాశయ్యలపైఁ బరుండఁబెట్టి యూగించుదురో, అపుడు కంటకములందువలె మిక్కిలి బాధ నొందుదును. కుముద, నీలకమలఁ రక్తకమల, కదలీశయ్యలు నా అవయవముల తాపస్పర్శచే శుష్కించి భస్మీభూతములగుచున్నవి. అతిసుందరమై, యోగ్యమై, స్వాదయుక్తమై, విచిత్రమై, మనోహరమైనట్టి పదార్థమును జూచి నపుడు లోన అశ్రుపూరితలోచన యగుచున్నాను. దుఃఖమను అగ్నిచే సంతప్తములై, ఛమ ఛమ ధ్వనితోడఁ బడుచుండు నా కన్నీటిబిందువులుఁ కమలములయొక్కయు, కలువలయొక్కయు సమూహములను శుష్కింపఁజేసి స్వయముగ శుష్కించిపోవుచున్నవి.

కదలీకన్దలీస్కన్ధదోలాన్దోలనలీలయా
లాలితోద్యానఖణ్డేషు ముఖమాచ్ఛాద్య రోదిమి. 66

తుషారనికరాకీర్ణం కదలీదలమణ్డపమ్
పశ్యామ్యూష్మాణముత్క్షిప్తం ఖదిరాఙ్గారభీషణమ్. 67
నలినీనాలదోలాసు సారం సారసాశ్రితామ్
దీనాననా విలోక్యాన్తర్నిన్దామి నిజయౌవనమ్. 68
రమ్యే రోదిమి మధ్యస్థే పదార్థే యామి సౌమ్యతామ్
హృష్యామ్యశోభనే దీనా న జానే కిమహం స్థితా. 69
దృష్టాని కున్దమన్దారకుముదాని హిమాని చ
మయా కామాగ్నిదగ్ధానాం భస్మానీవ దిశం ప్రతి. 70

మఱియు, ఓ మునీంద్రా! కదళీస్తంభములచే నిర్మింపఁబడిన యూయెలయందు లీలచే సఖీజనులెపుడు నన్నూఁగించుదురో, అపుడు నా దుఃఖమును వారికెఱుకపఱచజాలక లజ్జచే ముఖము గప్పుకొని యేడ్చుచుందును. మంచుచేఁ గప్పబడిన కదళీదళమండపమును ఉష్ణత్వమును వెలిగ్రక్కుచున్నదిగను, ఖదిరవృక్షపు నిప్పుకణికలవలె భయంకరముగను గాంచుచున్నాను. కమలనాళములను ఊయెలలపై భర్తృసహితముగ నున్నట్టి సారసపక్షిని జూచి దీనముఖినై నిజ యౌవనమును లోలోన నిందించుకొనుచుందును. దీనురాలగు నేను మిగుల రమణీయమగు పదార్థమును గాంచి యేడ్చుదును. మధ్యమ పదార్థమును గాంచి సౌమ్యత్వము నొందుదును. మూర్ఛా జడీభావాది అశుభదశలందు సంతోషమొందుదును. ఏలయనఁగా నట్టి స్థితులందు నేనెట్లుందునోఁ నాకుఁ దెలియదు. (అహంకార విలయముచే దుఃఖానుభవము లేమి యపుఁడు విశ్రాంతి నొందును.) మఱియు నెల్లెడల, కుంద, మందార, కుముద, హిమాది శీతల పదార్థములను, కామాగ్నిదగ్ధులగు జీవుల భస్మమువలె గాంచుచున్నాను.

ఆనీల పల్లవమృణాలలతోత్పలానాం
కహ్లారకున్దకదలీదలమాలతీనామ్
శయ్యా మమాఙ్గ చలనేన విశోషయన్త్యా
వ్యర్థం గతాని నవయౌవనవాసరాణి. 71

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే విద్యాధరీవ్యసన
వర్ణనం నామ చతుఃషష్టితమః సర్గః ॥ 64 ॥

మిగుల పచ్చనైనట్టి తమాలాది వృక్షపల్లవములచేతను, కమలదండములచేతను, లతలచేతను, నీల, రక్త, శ్వేతకమలములచేతను, కుంద, కదలీదళ, మాలతీ పుష్పాదులచేతను నిర్మితములైన శయ్యలను నిజదేహసంయోగముచే శుష్కింపఁజేయుచున్నట్టి నాకు నవయౌవనదినములు వ్యర్థముగనే గడచిపోయినవి.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
పాషాణోపాఖ్యానమున విద్యాధరీ వ్యసనవర్ణనమను
నఱువదినాల్గవ సర్గము ॥ 64 ॥

పఞ్చషష్టితమః సర్గః

[ఇహ కాలేన సంప్రాప్తే స్వానురాగే విరాగతామ్
సంసిద్ధా ధారణాభ్యాసై తాసుః సాన్యవేదయత్.

కాలక్రమమున విషయానురాగమందు, తాను వైరాగ్యమును బొందెననియు, ధారణాభ్యాసముచే బ్రాణమును జయించెననియు విద్యాధరి యిట వర్ణించుచున్నది.]

విద్యాధర్యువాచః—

అథ కాలేన మహతా సోఽనురాగో విరాగతామ్
ప్రాప్తో మమ శరచ్ఛాన్తౌ విరసః పల్లవో యథా. 1

విద్యాధరి— ఓ మునీంద్రా! అటుపిమ్మట చాలకాలమునకు, శరత్కాలాంతమున పల్లవము రసహీనమగునట్లు, నాయొక్క విషయానురాగము వైరాగ్యదశను బొందెను.

వృద్ధఏకాన్తరసికో నీరసః స్నేహవర్జితః
భర్తాఽజిహ్మమతిర్మౌనీ కిం మన్యే జీవితేన మే. 2

మొట్టమొదట నా చిత్తమున ఈ విచారము జనించినది. నా భర్త వృద్ధుఁడును, ఏకాంతప్రియుఁడును, నీరసుఁడును, స్నేహవర్జితుఁడును, సరళబుద్ధియు, మౌనియునైయున్నాఁడు. కావున నాకు జీవితముచే నేమిప్రయోజనము?

వరం వైధవ్యమాబాల్యాద్వరం మరణమేవ చ
వరం వ్యాధిరథాపద్వా నాహృద్యప్రకృతిః పతిః. 3

బాల్యకాలమునుండి వైధవ్యమునొందుటయు నుత్తమమే; మరణమున్ను శ్రేష్ఠమే; వ్యాధిచేఁ బీడితయగుటయు నుత్తమమే; సదా ఆపదయందు నిమగ్నయైయుండుటయు నుత్తమమే; కాని అరసికుఁడగు భర్తగల్గియుండుట స్త్రీకి యుత్తమము కాదు.

ఏతావజ్జన్మ సాఫల్యం సౌభాగ్యమవిఖణ్డితమ్
రసికః పేశలాచారో యన్నార్యాస్తరుణః పతిః. 4

రసికుఁడును, కోమల ప్రకృతిగలవాఁడును, యువకుఁడునగు భర్త లభించుటయే స్త్రీకి జన్మసాఫల్యమున్ను, అఖండ సౌభాగ్యమున్ను అగును.

హతా నీరసనాథా స్త్రీ హతాఽసంస్కారిణీ చ ధీః
హతా దుర్జనభుక్తా శ్రీర్హృతా వేశ్యాహృతా చ హ్రీః. 5

అరసికుఁడగు భర్తగల స్త్రీయు, ఉత్తమ సంస్కారరహితమగు బుద్ధియు, దుర్జనులచే ననుభవింపఁబడిన సిరియు, వేశ్యలచే హరింపబడిన సత్కులాచార్య యోగ్యమగు పురుషుల లజ్జయు వ్యర్థములైయున్నవి.

సా స్త్రీ యానుగతా భర్త్రా సా శ్రీర్యానుగతా సతా
సా ధీర్యా మధురోదారా సాధుతా సమదృష్టితా. 6

పతి ననుసరించునటువంటి స్త్రీయే స్త్రీ; సజ్జనులచే ననుభవింపఁబడు సంపదయే సంపద; శమదమాది సంపత్తిచే మధురమై గంభీరమైనట్టి బుద్ధియే బుద్ధి; సమదృష్టి సహితమైనట్టి సాధుత్వమే సాధుత్వము.

నాధయో వ్యాధయో నైవ నాపదో న దురీతయః
కుర్వన్తి మనసో బాధాం దంపత్యోరనురక్తయోః. 7

పరస్పరము అనురాగము గల్గియున్న దంపతుల మనస్సునకు, అధివ్యాధులుగాని, ఆపదలుగాని, అతివృష్టి, అనావృష్ట్యాది దుష్టములగు ఉపద్రవములుగాని బాధను గలిగింపఁజాలవు,

ఉత్ఫుల్లాః కుసుమస్థల్యో నన్దనోద్యాన భూమయః.
ధన్వాయన్తే కునాథానాం వినాథానాం చ యోషితామ్. 8

వికసించిన పుష్పములుగల స్థలములున్ను, నందనోద్యాన భూములున్ను, దుష్టపతి గల్గినట్టియు లేక పతిహీనులైనట్టియు స్త్రీలకు మరుభూమివలె సంతాపమును గలుగఁజేయును.

సర్వ ఏవ జగద్భావా యథేచ్ఛం గుణలేశతః
సంత్యజ్యన్తే ప్రమాదాత్తు వర్జయిత్వా పరంస్త్రియా. 9

ప్రపంచమందలి గృహ, క్షేత్ర. ధనాది సమస్త పదార్థములను అల్పగుణత్వ కారణమున, యథేచ్ఛగ స్త్రీ త్యజించివేయును: లేక ప్రమాదవశముననైన త్యజించునుగాని పతినిమాత్ర మెన్నడును త్యజింపఁజాలదు.

స్థిరయౌవనయా దుఃఖాన్యేతాని మునినాయక
భుక్తాని వర్షవృన్దాని పశ్య దౌర్భాగ్యజృమ్భితమ్. 10

ఓ మునినాయకా! నా దౌర్భాగ్యముయొక్క విలాసమును జూడుఁడు. స్థిరమగు యౌవనముతో గూడియుండి నేననేక వత్సరము లీ దుఃఖములన్నింటి ననుభవించితిని.

అథ క్రమేణ తేనైవ సరాగో మే విరాగతామ్
ఆయయౌ హిమదగ్ధాయా నలిన్యా ఇవ నీరసః. 11

మంచుచే శిథిలమొనర్పఁబడిన కమలము నీరసమగునట్లు, తదుపరి నాయొక్క భోగములందలి యనురాగము క్రమముగ విరాగత్వముఁ జెందెను.

విరాగవాసనాస్తేన సర్వభావానురఞ్జనా
తవోపదేశేనేచ్ఛామి మునే నిర్వాణమాత్మనః. 12

ఓ మునీంద్రా! ఈ ప్రకారముగ వైరాగ్యవాసనను బొంది సమస్త పదార్థములయెడల విరాగము గలదాననై యిపుడు తమ యుపదేశముచే నాయొక్క ముక్తిని గోరుచున్నాను.

అప్రాప్తాభిమతార్థానామవిశ్రాన్తధియాం పరే
మరణై రుహ్యమానానాం జీవితాన్మరణం వరమ్. 13

ఇష్టపదార్థమును బొందనివారికిని, పరబ్రహ్మమందు విశ్రాంతి నొందని బుద్ధి గలవారికిని, మరణతుల్యములగు దుఃఖప్రవాహములందుఁ గొట్టుకొనిపోవువారికిని జీవితముకంటె మరణమే శ్రేష్ఠమైయున్నది.

స మద్భర్తాద్య నిర్వాణమీహమానో దివానిశమ్
రాజా రాజ్ఞేవ మనసా మనో జేతుం ప్రబుధ్యతే. 14

బ్రహ్మంస్తస్య చ మద్భర్తుర్మమ చాజ్ఞానశాన్తయే
న్యాయోపపన్నయా వాచా కురు స్మరణమాత్మనః. 15

రాజు రాజుయొక్క సహాయముచేతనే మఱియొక రాజును జయించుటకుఁ బ్రవృత్తుఁడగునట్లు, ఆ నా పతియు నిపుడు రాత్రిందినములు నిర్వాణమునుగూర్చిన చేష్టయందే తత్పరుఁడై మనస్సుచేతనే మనస్సును జయించుటకు ఉద్యుక్తుఁడగుచున్నాడు!

యదా మామనపేక్ష్యైవ స మద్భర్తాత్మని స్థితః
తదా విరాగో వైరస్యమనయన్మే జగత్స్థితిమ్. 16

నా పతి యెపుడు నన్నపేక్షింపక ఆత్మయందే స్థితి గల్గియుండెనో, అపుడు నాకున్ను జగత్స్థితియెడల వైరాగ్యము కలిగెను.

సంసారవాసనావేశవర్జితాస్మి తతోఽవసమ్
నిబధ్యాభిమతాం తీవ్రాం వ్యోమసంచారధారణామ్. 17

అప్పటినుండియు నేను సంసారవాసనయొక్క ఆవేశము లేకయుంటిని. మఱియు, ఆకాశగమనసిద్ధి నొసంగునట్టి ఖేచరీముద్రయను అభిమతమైన ధారణను దృఢముగ నవలంబించితిని

అర్జయిత్వా తథా వ్యోమ్ని గతిం ధారణయా మయా
అభ్యస్తా ధారణా భూయః సిద్ధసఙ్గఫలప్రదా. 18

అట్టి ధారణచే ఆకాశగమనశక్తిని సముపార్జించి, పిమ్మట సిద్ధులతోటి సంభాషణాదుల గలిగింపఁజేయునట్టి ధారణ నభ్యసించితిని.

తతః స్వజగదాధారపూర్వాపరనిరీక్షయా
స్థితాహం ధారణాం బద్ధ్వా సాపి సిద్ధిం సమాగతా. 19

ఆ పిమ్మట, పూర్వాపర విభాగ సహితముగ నిజబ్రహ్మాండమంతటిని యోగదృష్టిచే. గరతలామలకముగ గాంచుచు, తదాకారమగు దృఢభావన యొనర్చియుండ, క్రమముగ నట్టి ధారణయు నాకు సిద్ధించెను.

అథ స్వజగతో దృష్ట్వా హృదయం తస్య బాహ్యగా
అహం దృష్టవతీ స్థూలాం లోకాలోకగిరేః శిలామ్. 20

పిమ్మట ఆ బ్రహ్మాండముయొక్క యంతర్గతములగు సమస్తపదార్థములను దర్శించి యద్దాని బాహ్యమున కెపుడు నేనేతెంచితినో, అపుడు స్వజగన్నిలయమైనట్టి యీ స్థూలమైన లోకాలోక పర్వతశిలను జూచితిని.

ఏతావతాపి కాలేన దంపత్యోరావయోర్మునే
పరం ద్రష్టుమభూదిచ్ఛా న కాచన కదాచన. 21

ఓ మునీంద్రా! ఇంతకాలమువఱకు దంపతులమగు మా యిరువురికిని ఈ బ్రహ్మాండమును గాంచునట్టి యిచ్ఛయేదియు నెపుడును గలుగలేదు.

మద్భర్తా కేవలం శుద్ధవేదార్థైకాన్తచిన్తయా
న చ యాతం న చాయాతం వేత్త్యహో విగతైషణః. 22

నా భర్తయే కోర్కెలు లేనివాఁడై, కేవలము వేద ప్రతిపాద్యమైనట్టి శుద్ధమైన ధర్మము యొక్కయు, పరమాత్మయొక్కయు అనన్య చింతవలన భూత, భవిష్యద్వర్తమానకాలములను, తదంతర్గత పదార్థములను నెఱుఁగకయున్నాఁడు. కాని యింతవఱకు నాతఁడు బ్రహ్మతత్త్వమును వాస్తవముగఁ దెలిసికొనకయే యున్నాడు.

తేనాసౌ మత్పతిర్విద్వానపి న ప్రాప్తవాన్పదమ్
అద్య సోఽహం చ వాఞ్ఛావః ప్రయత్నేన పరం పదమ్. 23

ఇక్కారణమున విద్వాంసుఁడైనను నా పతి బ్రహ్మపదమును బొందక యున్నాఁడు. కావున, మేమిరువురము నిపుడు ప్రయత్నముచేఁ దమ యుపదేశమువలన పరమపదము (బ్రహ్మము)ను వాంఛించుచున్నారము.

తదేతామర్థితాం బ్రహ్మన్సఫలాం కర్తుమర్హసి
మహతామర్థినో వ్యర్థా న కదాచన కేచన. 24

కాఁబట్టి, ఓ మహాత్మా! ఈ నాప్రార్థనను తాము సఫలమొనర్పవలసినది. మహనీయుల సన్నిధిని అర్థించువారెవరును నెపుడును నిష్ఫలు రవరుగదా!

భ్రమన్తీ సిద్ధసేనాసు సదా నభసి మానద
త్వదృతేనేహ పశ్యామి ఘనాజ్ఞానదవానలమ్. 25

మానప్రదుఁడవగు మహాత్మా! ఆకసమున సిద్ధుల సేనలం సంచరించుచుండు నేను, తమ్ముదప్ప ఘనీభూతమగు అజ్ఞానారణ్యమునకు దావాగ్నివంటివారిని మఱెవరిని గాంచలేదు.

బ్రహ్మన్వినైవ కరుణాకరకారణేన
సన్తో యతోఽర్థిజనవాఞ్ఛితపూరణాని
కుర్వన్తి తేన శరణాగతతాముపేతాం
మామర్హసీహ న తిరస్కరణేన యోక్తుమ్. 26

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే విద్యాధరీజన్మవ్యవహార
వర్ణనం నామ పఞ్చషష్టితమః సర్గః ॥ 65 ॥

మహాత్మా! తమవంటి సజ్జనులు కారణము లేకయే, అర్థించువారి యభీష్టమును బూర్ణమొనర్తురు. కావున, తమ్ము శరణు బొందిన నన్ను పేక్షింపఁదగదు.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణ ప్రకరణమున నుత్తరార్ధమున
పాషాణోపాఖ్యానమున విద్యాధరీ జన్మవ్యవహార వర్ణనమను
నఱువదియైదవ సర్గము ॥ 65 ॥

షట్ షష్టితమః సర్గః

[కథం స్థితిరనాకాశే గృహం వా తే శిలోదరే
పృష్టయేతి తయా తత్ర జగద్విస్తార ఈర్యతే.

'అవకాశములేని శిల లోపల నీవెట్లుంటివి? అట నీగృహమెట్లు వర్తించినది?' అని వసిష్ఠుఁడు విద్యాధరిని బ్రశ్నింపనంత యామె యచటి జగద్విస్తారమునుగూర్చి వర్ణించుట యిటఁ గాననగును.]

శ్రీ వసిష్ఠ ఉవాచః—

అథేత్యుక్తవతీ పృష్టా సా మయా కల్పితాసనా
సంకల్పితాసనస్థేన స్థితేన నభసి స్థితా. 1
కథం శిలోదరే బాలే త్వద్విధానాం భవేత్స్థితిః
కథం సంచలనం తత్ర కిమర్థం తత్ర చాస్పదమ్. 2

శ్రీ వసిష్ఠుఁడు:- ఓ రామచంద్రా! ఇవ్విధమున, ఆ బ్రహ్మాండాకాశమునఁ గల్పింపబడిన యాసనముపై నున్న యా విద్యాధరి నాతోఁ బల్క, ఆ యాకాశముననే కల్పితమైనట్టి యాసనముపై నున్న నేనామె నంత నిట్లడిగితిని. బాలా! నీవంటి దేహధారులకు ఆ శిల లోపల స్థితి యెట్లు సంభవించును? మఱియు నచట సంచలనాదులెట్లు? అచట గృహమున్న నెందుకొఱకు?

విద్యాధర్యువాచ:—

మునే యథేదం భవతాం జగత్స్ఫారం విరాజతే
తథాస్మాకం జగత్తత్ర సర్గసంసారయుక్ స్థితమ్. 3

విద్యాధరి:- ఓ మునీంద్రా! తమయొక్క యీ విశాలమగు జగత్తెట్లు విరాజిల్లుచున్నదో అట్లే యా శిలయందు సంసారయుక్తమగు మాయొక్క జగత్తున్ను విరాజిల్లుచున్నది.

స్ఫురన్తి నాగాః పాతాలే తిష్ఠన్తి భువి పర్వతాః
అపశ్చలచలాయన్తే వహన్తి వ్యోమ్ని వాయవః. 4
అర్ణవా అర్ణసా భాన్తి యాన్త్యనః శనకైః ప్రజాః
భూతాన్యజస్రం జాయన్తే మ్రియన్తేఽవిరతం యథా. 5
వాన్తి వాతా వహన్త్యాపో భాన్తి చాభాన్తి ఖే సురాః

తిష్ఠన్త్యగాః సముద్యన్తి గ్రహాయాన్తి మహీనృపాః. 6
దేవాసురమనుష్యాణాం వ్యవహారపరమ్పరాః
లోలాః ప్రవృత్తా అకల్పమాసముద్రమివాపగాః. 7
దినపద్మాని భూలోకసరస్యాకల్పమానభః
లోలాభ్రాళీని ఫుల్లాని మీలితోన్మీలితాన్యలమ్. 8

అచటను పాతాళమున నాగములున్ను, భూమిపైఁ బర్వతములున్ను స్ఫురించుచున్నవి. జలము ఛలఛలమని ప్రవహించుచున్నది. ఆకాశమున వాయువు వీచుచున్నది. సముద్రములు జలపూర్ణములై శోభించుచున్నవి. ప్రజలు గమనాగమనాది వ్యవహారములు గావించుచున్నారు. సమస్తభూతములు క్రమముగ నిరంతరము జననమరణములను బొందుచున్నవి. వాయువు వీచుచున్నది. జలము ప్రవహించుచున్నది. ఆకాశమున దేవతలు ప్రకాశించుచున్నారు. నక్షత్రములు వెలుగుచున్నవి. పర్వతములు స్థిరముగ నున్నవి. గ్రహములు చలించుచున్నవి. రాజులు భూమిని బాలించుచున్నారు. నదులు సముద్రమువఱకుఁ బ్రవహించుచున్నట్లు, దేవతలయొక్కయు, అసురులయొక్కయు, మనుష్యులయొక్కయు, చంచలములైన వ్యవహార పరంపరలు కల్పములవఱకుఁ బ్రవృత్తములైయున్నవి. కల్పపర్యంతకాలమందును, ఆకాశపర్యంతదేశమందును, చంచలమేఘములను భ్రమరములతోఁ గూడిన దివసములను కమలములు భూలోకమను సరోవరమున నొకపుడు బాగుగ వికసించుచున్నవి. ఒకపుడు బాగుగ ముకుళించుకొనిపోవుచున్నవి.

చన్ద్రశ్చర్చాశ్చతుర్దిక్కం చన్దనేనాత్మతేజసా
రచయన్రాత్రిరోహిణ్యోస్తమో హన్త్యపి హృద్గతమ్. 9
స్వదశాస్వాదనరతా వాతయన్త్రసుచారితా
రోదఃసద్మని సూర్యాఖ్యా దీప్యతే దివి దీపికా. 10
బ్రహ్మసంకల్పితో రుద్ధో వాతసంచారచారిభిః
ఖేఽనిశం చక్రమృక్షాణాం గుణావర్తో వివర్తతే. 11
భూతతణ్డులమాస్పృష్టేః పినష్టి ధ్రువకీలకః
నియత్యా చలితో రోదఃకపాటామ్భోదఘర్ఘరః. 12

చంద్రుఁడు తన తేజోరూపమగు చంద్రిక యను చందనముచే నలుదెసల వేపన మొనర్చుచు రాత్రియొక్కయు, స్వపత్నియగు రోహిణియొక్కయు హృదయమందలి యంధకారమును నశింపఁజేయుచున్నాఁడు. స్వకీయదశ దిగ్రూపమగు వత్తియొక్క ద్రవత్వమను తైలము ననుభవించుటయందుఁ దత్పరమైనదియు వాయువను యంత్రముచేఁ జలింపఁజేయఁబడునదియు నగు సూర్యుఁడను దీపము భూమ్యాకాశములను గృహమునఁ బ్రజ్వలించుచున్నది. బ్రహ్మదేవుఁడను శిల్పిచే నిర్మితమై, వాయువందు సంచరించు కిరణములను త్రాళ్లచేఁ జుట్టబడినదై, ధ్రువుఁడను కీలమునఁ బంధింపఁబడినదై నియతిచేఁ జలింపఁజేయఁబడుచున్నదై, భూమ్యాకాశములందుఁ దలుపులవలె నున్నట్టి మేఘములయొక్క ఘర్ఘరశబ్దమను ధ్వనితోఁగూడినదై, సృష్ట్యారంభమునుండి ప్రాణులను తండులములను (బియ్యమును) బిండి చేయుచున్నదై నక్షత్రచక్రమను యంత్రము (పిండిమర) నిరంతరమాకాశమున పరిభ్రమించుచున్నది.

ద్వీపాబ్ధిశైలైర్వ్యాపీతం విమాననగరైర్నభః
దైత్యదానవనాగౌఘైః పూర్ణం పాతాలమణ్డలమ్. 13
కుణ్డలం త్రిజగల్లక్ష్మ్యా నీలం భూతలమణ్డలమ్
స్థితం చఞ్చలమాచారచఞ్చలాయాః స్ఫురన్మణి. 14
బుద్ధ్యాదిరహితాం స్పన్దసంవిదం వాయువీమివ
స్థావరం జంగమంచైవ సూక్ష్మమాదాయ జాయతే. 15
మునిర్మౌనైర్ధరా వార్భిమారుతైః కపిచాపలమ్
ఆకాశైరవకాశిత్వం తేజోభిర్భాసనం శ్రితమ్. 16

అట్లే యిచటను ద్వీప, సముద్ర, పర్వతములచే భూతలమున్ను, విమాన, గంధర్వ నగరములచే నాకాశమున్ను, దైత్య, దానవ, నాగసమూహములచే, బాతాళమండలమున్ను బూర్ణములైయున్నవి. మఱియు, ఆచారములచే చంచలమగు త్రైలోక్యమను లక్ష్మియొక్క ప్రకాశమానమగు మణిఁబోలిన చంచలమైన కుండలమువలె నీలమగు భూమండలము శోభించుచున్నది. ఇచటవలె నచటనున్ను స్థావరజంగమ ప్రాణిసమూహము బుద్ధ్యాదిరహితమగు బాహ్యవాయు క్రియనువలె అభ్యంతరమైన సూక్ష్మమగు ప్రాణస్పందసంవిత్తును గ్రహించి జన్మాది వికారములఁ బొందుచున్నారు. మఱియు ఆ శిలయందిచటవలెనే మనన మౌనాది క్రియలు మునుల నాశ్రయించియున్నవి. అట్లే సముద్రాదుల జలము పృథివిని, వాయువు కోతివంటి చంచలత్వమును, ఆకాశము అవకాశత్వమును, తేజము ప్రకాశత్వమును ఆశ్రయించియున్నవి.

వృక్షోర్వ్యబ్ధ్యద్రిఖచరాః ప్రాణినోన్తఃస్ఫురన్త్యలమ్
మృతిజన్మోన్ముఖాః కీటసురాసురజలౌకసః. 17
ససురాసురగన్ధర్వాః కాలః కలయతి ప్రజాః
దోర్భిః కల్పయుగాబ్దైశ్చ స్వపశూనివ పాలకః. 18

అనన్తవిపులాగాధగమ్భీరే కాలసాగరే
ఉత్పత్యోత్పత్య లీయన్తే తే త్వావర్తవివర్తయా. 19
చతుర్దశవిధా వాతవేల్లితా భూతపాంసవః
నాశాకాశే విలీయన్తే శరదమ్భోదలీలయా. 20

ఆ శిలయందును వృక్ష, పృథివీ, సముద్ర, పర్వత, ఆకాశచారులగు వానర, మనుష్య, మత్స్య, మృగ, పక్షి, కీట, జలచరాదులున్ను, సురాసురులున్ను జననమరణోన్ముఖులై బాగుగ స్ఫురించుచున్నారు. మఱియు, పశుపాలకుఁడు పశువుల ననుభవించునట్లు, సుర, అసుర, గంధర్వ మనుష్యాది ప్రజలను, కాలమను పురుషుఁడు వత్సర, యుగ, కల్పాది భుజములచే పాలనాదుల ద్వారా యనుభవించుచున్నాఁడు. అనంతమై, విశాలమై, గంభీరమై, అగాధమైనట్టి కాలమను సముద్రమున దేవతాదులు జలచరజీవులవలె, కాలగతిచే మరల మరల పుట్టుచు, నశించుచున్నారు. వాయువుచే, బరివేష్టితమైన, పదునాల్గు విధములైన ప్రాణులను ధూళి నాశరూపమగు అవ్యాకృతాకాశమున, శరత్కాలమందు మేఘమువలె విలీనమగుచున్నది.

భువనం బోధయన్తీ ద్యౌశ్చన్ద్రార్కకరచామరైః
స్థితాకాశాంశుకాకల్పతారకోత్కర శేఖరా. 21

స్థితాః పవనభూకమ్పమేఘతాపసహిష్ణవః
స్వం ప్రదేశమనుజ్ఝన్త్యః కకుభః స్తమ్భితా ఇవ. 22

ఉత్పాతమేఘ నిర్హ్రాద భూమికమ్పగ్రహగ్రహైః
అజ్ఞాతైరపి విజ్ఞాతైర్భూతానాం జాయతే గతిః. 23

సప్తానాం జలమబ్ధీనామౌర్వాగ్నిః పిబతి జ్వలన్
లోకాన్తరాణామాకల్పం కాలో భూతగణం యథా. 24

ఆకాశమను వస్త్రమును ధరించినదియు, కల్పమువఱకు వెలయునట్టి నక్షత్రసమూహమును శిరోభూషణము గలదియు నగు స్వర్గలోకము చంద్రసూర్యులను చమరములచే వీచుచు నిద్రించు ప్రపంచమును మేలుకొలుపు చున్నట్లున్నది. దిక్కులు స్తంభితములైన స్థావరప్రాణుల వలె వాయు, భూకంప, వర్ష, ఆతపములను సహించుచుఁ దమ తమ స్థానములను వీడకయున్నవి. జ్యోతిశ్శాస్త్రజ్ఞులచే నెఱుఁగఁబడునవియు, ఇతరులచే నెఱుఁగఁబడనివియు నగు ఉత్పాత మేఘ శబ్ద, భూకంప, గ్రహాది హేతువులచేఁ బ్రాణులయొక్క యిష్టానిష్టదశలచటఁగూడ నెఱుఁగఁబడుచున్నవి. పదునాల్గు లోకములందలి ప్రాణి సమూహమును కాలము త్రాగివేయునట్లు, సప్తసముద్రముల జలమును నచటనున్న ప్రజ్వలితమైన బడబాగ్ని త్రాగివేయుచున్నది.

పాతాలమావిశతి యాతి నభోఽఖిలం చ
దిఙ్మణ్డలం భ్రమతి భూతగణః సమన్తాత్
పర్యేతి పర్వతమహార్ణవమణ్డలాని
ద్వీపాన్తరాణి చ మరుత్సరణక్రమేణ. 25

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే శిలాన్తరవర్ణనం
నామ షట్‌షష్టితమః సర్గః ॥ 66 ॥

అట్లే పాతాళయోగ్యులగు జీవులు పాతాళమును బ్రవేశించుచున్నారు. ఆకాశచారులాకాశమును జేరుచున్నారు. తక్కినవారు దిక్కులందంతట పరిభ్రమించుచున్నారు. మఱియు నచటను వాయువుయొక్క సంచారక్రమమువలె పర్వత, మహాసముద్ర, ద్వీపాంతర సమూహములన్నియునుగూడఁ దిరుగుచున్నవి. (ఇచటి వ్యవహారములన్నియు నచటఁగూడ జరుగుచున్నవని భావము.)

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
పాషాణోపాఖ్యానమున శిలాంతరవర్ణనమను
నఱువదియాఱవ సర్గము ॥ 66 ॥

సప్తషష్టితమః సర్గః

[కౌతుకాత్తాం శిలాం గత్వాప్యదృష్ట్వా మునినా జగత్
పృష్టయాభ్యాసమాహాత్మ్యం విద్యాధర్యాత్ర వర్ణ్యతే.

కౌతుకముచే ఆ శిలవద్దకేగి చూచినను నట జగత్తు గాంచమి వసిష్ఠుఁడందులగూర్చి యడుగ విద్యాధరి అభ్యాసమాహాత్మ్యమును గూర్చివచించుట యిచట, గాననగును.]

విద్యాధర్యువాచః—

యావత్త్వం సర్గమాగచ్ఛ ప్రసాదః క్రియతాం మునే
ఆశ్చర్యేషూపపన్నేషు మహాన్తో హ్యతికౌతుకాః. 1

విద్యాధరి:— ఓ మునీంద్రా! దీనినంతయు నాశ్చర్యముగఁ దలంచుచో, తామే దయచేసి, యటకేగి యా శిలాంతర్గత జగంబును బ్రత్యక్షముగ వీక్షించుడు. ఏలయనిన ఆశ్చర్యకరములగు పదార్థములు తటస్థించునపుడు మహాత్ములు వాని నెఱుఁగుటకై మిగుల కుతూహలము గలిగియుందురు.

తథేత్యుక్తే మయా సార్ధం గన్తుమారబ్ధమమ్బరే
వాత్యయా సౌరభేణేవ శూన్యే శూన్యేన శూన్యయా. 2

ఓ రామచంద్రా! ఆమె యిట్లు వచింప నేనందులకు సమ్మతించి, శూన్యమగు ఆకాశమున శూన్యమగు గొప్ప ఝంఝామారుతము వెంట శూన్యమగు సుగంధము జనువిధమున, ఆమెతో సహా యాకసమున నేగుట కారంభించితిని.

అథాహం దూరమధ్వానం శూన్యముల్లఙ్ఘ్య నాభసమ్
నభఃస్థం భూతసంఘాతం తయా సార్ధమవాప్తవాన్. 3

తముల్లఙ్ఘ్య చిరేణాత్ర భూతసంచారమమ్బరే
లోకాలోకశిరోవ్యోమ ప్రాప్తోఽస్మి ధవలామ్బుదమ్. 4

ఉత్తరాంశేన్దుశుభ్రాభ్రపీఠాన్నిర్గత్య తాం శిలామ్
ఆనీతోస్మి తయోత్తుఙ్గాం తప్తకాఞ్చనకల్పితామ్. 5

అట్లామెతోగూడ నాకాశముయొక్క దూరమార్గమును దాటి యటనున్నదేవాది భూతసమూహమునుఁ బొందితిని. వారిఁగూడ దాటి చిరకాలమునకు తెల్లనిమేఘమును బోలియున్న లోకాలోక పర్వతముపైగల యాకాశమును జేరితిని. పిమ్మట నట నుత్తరదిశయొక్క పూర్వభాగముననున్న చంద్రసమానమగు శుభ్రమేఘపీఠమునుండి క్రిందకు దిగి, తప్తసువర్ణమువలెఁ బ్రకాశమానమైన యొక యెత్తైన శిలవద్ద కామచేఁ గొనిరాఁబడితిని.

యావత్పశ్యామ్యహం శుభ్రాం శిలాం తాం నచ తజ్జగత్
కలధౌతమయీముచ్చైరగ్నిలోకతటీమివ. 6

తదా మయోక్తా సా కాన్తా క్వ భవత్సర్గభూరితి
క్వరుద్రార్కాగ్నితారాది క్వలోకాన్తరసప్తకమ్. 7

క్వార్ణవాకాశకకుభః క్వోన్మజ్జననిమజ్జనే
క్వ మహామ్భోదసంభారః క్వ తారామ్బర డమ్బరమ్. 8
క్వ శైలశిఖరశ్రేణ్యః క్వ మహార్ణవలేఖికాః
క్వ ద్వీపవలయాః సప్త క్వ తప్తకనకావనిః. 9
క్వ కార్యకాలకలనాః క్వ భూతభువనభ్రమః
క్వ విద్యాధరగన్ధర్వాః క్వ నరామరదానవాః. 10
క్వర్షిభూపాలమునయః క్వ నయాపనయక్రమః
క్వ పఞ్చయామయామిన్యః క్వ స్వర్గనరకభ్రమః. 11
క్వ పుణ్యపాపకలనా క్వ కలాకాలకేలయః
క్వ సురాసురవైరాణి క్వ ద్వేషస్నేహరీతయః. 12

అపుడు, సువర్ణమయమై, యున్నతమైనట్టి మేరుపర్వత తటమువలె భాసించుచున్న యానిర్మలమగు శిల నంతయు జూచితినిగాని యట నామెచేఁ జెప్పఁబడిన జగత్తేమియును గానఁబడలేదు. అత్తఱి విద్యాధరిని నే నిట్లడిగితిని — 'నీవు వర్ణించినట్టి సృష్టియంతయు నెచట? రుద్ర, సూర్య, అగ్ని, నక్షత్రాదు లెచట! సప్తలోకాంతరము లెచట? సముద్ర, ఆకాశ దిక్కు లెచట? ప్రాణుల జనన మరణము లెచట? గొప్ప మేఘమండలమెచట? నక్షత్ర, ఆకాశముల యాడంబరమెచట? పర్వత శిఖరసమూహము లెచట? మహాసముద్రము లెచట? సప్తద్వీప వలయము లెచట? తప్తసువర్ణమయమగు భూమి యెచట? కార్య, కాల కల్పన లెచట? ప్రాణి కోట్లెచట? భూరాదిలోకములెచట? దేవదానవ గంధర్వ, విద్యాధర, మనుష్యాదు లెచట? ఋషి, ముని, భూపాలు లెచట? న్యాయ, అన్యాయ క్రమమెచట? హేమంతరాత్రులెచట? స్వర్గనరకాది రూప భ్రమ యెచట? పుణ్యపాపకల్పన యెచట? కాల కళల క్రీడలెచట? సురాసురుల వైరు లెచట? స్నేహ, ద్వేషముల రీతులెచట?

వదత్యేవం మయి వచః సోవాచ వరవర్ణినీ
విస్మయాకులమాలోక్య శిలామలవిలోచనా. 13

నే నిట్లడుగ నంత ఆ శ్రేష్ఠవర్ణవతియు, భ్రమరనేత్రధారిణియునగు విద్యాధరి యాశ్చర్యముచే వ్యాకులత్వమొంది యా శిలఁగాచి యిట్లు వచించెను.

విద్యాధర్యువాచ :—

పశ్యామ్యఖిలమాత్మీయమహం సర్వమిహోపలే
ముకురప్రతిబిమ్బస్థపురాన్యపురవజ్జనమ్. 14

విద్యాధరి:— ఓ మునీంద్రా! దేవమనుష్యాది ప్రాణిసమూహముతోడను, నగరాదులతోడను గూడిన యా నాజగంబు నంతటిని, అద్దమునందుఁ బ్రతిబింబించిన పురమువలెనే నీ శిలయందుఁ గాంచుచున్నాను.

నిత్యానుభవ ఏవాత్ర దర్శనే కారణం మమ
తదభావో మునే మన్యే తే కారణమదర్శనే. 15

కావున నో మునీంద్రా! నిత్యానుభవమే యీ నా దర్శనమునకుఁ గారణమైయున్నది. అద్దాని అభావమే తమ అదర్శనమునకు హేతువగును.

అన్యచ్చ చిరకాలైకద్వైత సంకథయానయా
శుద్ధాతివాహికైకాత్మదేహతా విస్మృతావయోః. 16

మఱియు, చిరకాల ప్రవృత్తములగు కేవలద్వైతవృత్తాంతములచే, సర్వసూక్ష్మపదార్థములను గ్రహింప సమర్థమైనట్టి మనయొక్క విశుద్ధమనోమాత్రదేహత్వము మఱువఁబడుటయు, తమయొక్క దాని (శిలాజగత్తుయొక్క) అదర్శనమునకున్ను, నాయొక్కదాని అస్పష్టదర్శనమునకున్ను హేతువైయున్నది.

మమాపి సచిరాభ్యస్తమపి వ్యోమ లతామివ
గతం నిజం జగదిదం యతః పశ్యామి న స్ఫుటమ్. 17

చిరకాలము అభ్యస్తమైనను, ఈ స్వకీయమగు జగత్తు నా దృష్టియందును నశించినదాని చందముననే యున్నది. ఏలయనిన, చిరాభ్యస్తమగు ఆకాశలతవలె దీనిని నేను స్పష్టముగఁ గాంచుటలేదు.

అభూద్యత్స్వ జగత్పూర్వమతిప్రకటమేవ మే
తత్పశ్యామీదమాదర్శ ఇవ బిమ్బితమస్ఫుటమ్. 18

ఏ నా యీ జగత్తు పూర్వము స్పష్టముగ నాకీశిలయందుఁ బ్రకటమైయుండెనో, అద్దానిని నేనిపుడద్దమునందలి ప్రతిబింబమువలె అస్పష్టముగఁ జూచుచున్నాను.

చిరవ్యర్థోత్థయా నాథ సంకథావ్యథయా మిథః
స్వాస్థ్యం విస్మృతమాత్మీయమవదాతతమం తతమ్. 19

చిరకాలము వ్యర్థముగఁ బ్రవృత్తమైన పతికథాజనితబాధచే, అతిస్వచ్ఛమై, వ్యాపకమైనట్టి నా సూక్ష్మజ్ఞానము మఱువఁబడినది.

యోఽభ్యాసః ప్రకచత్యన్తః శుద్ధచిన్నభసో రసాత్
భవేత్తన్మయమేవాన్తరాబాలమివ లక్ష్యతే. 20

శుద్ధచిదాకాశముయొక్క స్ఫురణచే అంతఃకరణమున యే దృఢాభ్యాసజనిత సంస్కారము ప్రకాశించునో, అద్దానితో చిత్తము తన్మయమగుట ఆబాలవృద్ధులందంతటను గాంచబడుచున్నది.

న సచ్ఛాస్త్రేణ సా విద్ధి న సన్న్యాయేన సా కలా
అస్తి నాస్త్యమితోద్యోగాద్యదభ్యాసాన్న సిద్ధ్యతి. 21

ఏ కళ (సూక్ష్మజ్ఞానము లేక బ్రహ్మవిజ్ఞానము) అభ్యాసముచే సిద్ధించునో, అయ్యది సచ్ఛాస్త్రములచేగాని, ఉత్తమతర్కముచేగాని సిద్ధింపదు. మఱియు నిరంతర ప్రయత్నరూపమగు అభ్యాసముచే సిద్ధింపని వస్తువేదియును లేదు.

స్వజగత్సంతతాభ్యాసవశతో మాం కథాభ్రమః
నూనమాక్రాన్తవానేష ద్వయోర్హి బలవాఞ్ఛయా. 22

తమతోటి సంవాదమును ఈ భ్రమ స్వీయజగత్తుయొక్క నిరంతరాభ్యాసవశమున తజ్జగ ద్భ్రమ గల్గియున్న నన్ను జయించివైచినది. ఏలయనగా, రెంటిలో నేది బలవత్తరముగ నుండునో, అదియే విజయమొందును.

ఇష్టవస్త్వర్థినాం తజ్జ్ఞసూపదిష్టేన కర్మణా
పౌనఃపున్యేన కరణాన్నేతరచ్ఛరణం మునే. 23

కావున నో మునీంద్రా! ఇష్టవస్తువుల నభిలషించువారికి ఆ వస్తువుల నెఱిఁగినట్టి యుత్తమగురువుయొక్క యుపదేశానుసారము మరల మరల యభ్యసించుట తప్ప మఱి యే యితర మగు ఉపాయమున్ను శరణ్యము కానేరదు.

అయమిత్థమిహాజ్ఞానభ్రమః ప్రౌఢోఽహమాత్మకః
శామ్యతి జ్ఞాన చర్చాభిః పశ్యాభ్యాస విజృమ్భితమ్. 24

ఓ మునీంద్రా! దృఢమైన అహంభావరూపమగు అనాదియైన అజ్ఞానభ్రమయు శ్రవణ మననాది జ్ఞానవిచారరూపమగు అభ్యాసముచే శమించిపోవుచున్నది. కావున అభ్యాసముయొక్క ప్రభావమును వీక్షించుఁడు!

అహం శిలాబలా బాలా పశ్యామి త్వం నపశ్యసి
సర్వజ్ఞోఽపి శిలాసర్గం పశ్యాభ్యాసవిజృమ్భితమ్. 25

నేను తమ శిష్యురాలను, అబలను, బాలనైయున్నప్పటికిని, అభ్యాసవశముచే నీ శిలాం తర్గతమగు జగత్తును గాంచుచున్నాను. తాము సర్వజ్ఞులగు గురువులైనప్పటికిని, అభ్యాసములేమి యద్దానిని గాంచుటలేదు. కావున, అభ్యాసముయొక్క ప్రభావమును దిలకింపుడు!

అజ్ఞోఽపి తజ్జ్ఞతామేతి శనైః శైలోఽపి చూర్ణ్యతే
బాణో ప్యేతి మహాలక్ష్యం పశ్యాభ్యాసవిజృమ్భితమ్. 26

అభ్యాసపాటవముచే అజ్ఞానియు జ్ఞానియగుచున్నాఁడు; పర్వతమున్ను మెల్లగ పిండి చేయఁబడుచున్నది; అచేతనమగు బాణమున్ను అతిసూక్ష్మమైన లక్ష్యమును బొందుచున్నది. చూడుఁడు అభ్యాసప్రభావము!

ఇత్థం నామ పరిప్రౌఢా మిథ్యాజ్ఞానవిషూచికా
శామ్యత్యేవ విచారేణ పశ్యాభ్యాసవిజృమ్భితమ్. 27

మహాదృఢమై, మిథ్యయైనట్టి ఈ అజ్ఞానమను మహామారియు, తత్త్వవిచారరూపమగు అభ్యాసముచే శమించిపోవుచున్నది. కావున అభ్యాసప్రాభవమును వీక్షించుఁడు!

అభ్యాసేన కటుద్రవ్యం భవత్యభిమతం మునే
అన్యస్మై రోచతే నిమ్బ స్త్వన్యస్మై మధు రోచతే. 28

ఓ మునీంద్రా! అభ్యాసముచేతనే కొందఱికి కారపువస్తువున్ను ఇష్టమగుచున్నది. అట్లే మఱికొందఱికి చేదున్ను, ఇంక కొందఱికి తీపున్ను రుచించుచున్నది.

అబన్ధుర్బన్ధుతామేతి నైకట్యాభ్యాసయోగతః
యాత్యనభ్యాసతో దూరాత్స్నేహో బన్ధుషు తానవమ్. 29

సమీపమున వసించుటబట్టి అభ్యాసవశముచే బందువుకానివాడును బంధువగుచున్నాఁడు. అట్లే దూరమున వసించుటఁబట్టి అభ్యాసాభావముచే బంధువులందున్ను స్నేహము తగ్గుచున్నది.

ఆతివాహికదేహోఽయం శుద్ధచిద్వ్యోమ కేవలమ్
అధిభౌతికతామేతి భావనాభ్యాసయోగతః. 30

[illegible]ము శుద్ధచిదాకాశరూపమగు ఈ సూక్ష్మ శరీరమున్ను భావనాభ్యాసవశముచే [illegible]త్వమును జెందుచున్నది.

అధిభౌతికదేహోఽసౌ ధారణాభ్యాసభావనాత్
విహంగవత్ఖమభ్యేతి పశ్యాభ్యాసవిజృమ్భితమ్. 31

అభ్యాసముయొక్క ప్రభావమును జూడుఁడు! ఈ స్థూల శరీరమున్ను ధారణయొక్క అభ్యాసముచే పక్షివలె నాకాశమున నెగురుచున్నది!

పుణ్యాని యాన్తి వైఫల్యం వైఫల్యం యాన్తి మాతరః
భాగ్యాని యాన్తి వైఫల్యం నాభ్యాసస్తు కదాచన. 32

గొప్ప పుణ్యమున్ను నిష్ఫలము కావచ్చును; సొంత తల్లియు కోపముజెందవచ్చును, భాగ్యములున్ను విఫలములు కావచ్చును; కాని అభ్యాసమెపుడును నిష్ఫలముకానేరదు.

దుస్సాధ్యాః సిద్ధిమాయాన్తి రిపవో యాన్తి మిత్రతామ్
విషాణ్యమృతతాం యాన్తి సంతతాభ్యాసయోగతః. 33

నిరంతరాభ్యాసయోగముచే, దుస్సాధ్యములగు కార్యములున్ను సాధింపఁబడుచున్నవి. శత్రువులున్ను మిత్రులగుచున్నారు; విషమున్ను అమృతమగుచున్నది.

యేనాభ్యాసః పరిత్యక్త ఇష్టే వస్తుని సోఽధమః
కదాచిన్న తదాప్నోతి వన్ధ్యా స్వతనయం యథా. 34

కావున, ఇష్టవస్తుప్రాప్తియందు అభ్యాసమును త్యజించువాఁడు అధముఁడేయగును. మఱియు వంధ్య తన పుత్రుని బడయఁజాలనట్లు, అట్టివాఁడు తన యాయిష్టవస్తువు నెన్నఁటికిని బొందఁజాలడు.

యదప్యభిమతం వస్తు స్వభ్యాసేన తదర్జనాత్
తద్యుక్తిపూర్వకం త్యాజ్యమామృత్యోర్జీవితం యథా. 35

మృత్యుపర్యంతము జీవితము అభిమతమై యున్నప్పటికిని యోగులద్దానిని యుక్తి పూర్వకముగఁ ద్యజించునట్లు, అనేక ప్రయత్నములచే సముపార్జించిన అభిమతవస్తువులగు ధన దారాదులఁగూడ వైరాగ్యాభ్యాసాది యుక్తిపూర్వకముగఁ ద్యజింపవలయును.

ఇష్టే వస్తుని నాభ్యాసం యః కరోతి నరాధమః
సోఽనిష్టేఽనిష్టమాప్నోతి నరకాన్నరకాన్తరమ్. 36

ఇష్టవస్తువగు ఆత్మజ్ఞానమున అభ్యాసమును త్యజించు మనుజాధముఁడు దేహాదులందలి అహంభావమను అనిష్టమందు అనిష్టమునే పొందుచు, ఒకనరకమునుండి మఱియొక నరకమున కేగుచునుండును.

తరన్తి సరితం స్ఫీతాం సంసారాసారసేవినః
త ఏవాత్మవిచారాఖ్యమభ్యాసం న త్యజన్తియే. 37

'సంసారము అసారమైనది' అనునిట్టి వివేకమును సేవించు వారును, ఆత్మ విచారమను అభ్యాసమును త్యజింపనివారు నగు మనుజులే యీ విశాలమైన మాయానదిని దాటుదురు.

అభ్యాసభాసోఽభిమతం వస్తు ప్రకటయన్త్యలమ్
ప్రాపయన్తి చ నిర్విఘ్నం ఘటం దీపప్రభా యథా. 38

దీపపుకాంతిఘటార్థికి ఘటమును బొందింపఁజేయునట్లు, శ్రవణ, మననాద్యభ్యాసరూపమగు ప్రకాశము అభిమతమైనట్టి ఆత్మవస్తువును బాగుగఁ బ్రకటమొనర్చి సాధకున కద్దానిని నిర్విఘ్నముగ బొందింపజేయును.

యథా కల్పద్రుమలతాః సచ్చిన్తామణయో యథా
ఫలన్తి శరదశ్చైత్రాస్తథైవాభ్యాసభూమయః. 39

కల్పవృక్షలతలు, చింతామణులు మున్నగునవి మనోరథముల నీడేర్చునట్లు అభ్యాసస్థితులున్ను అభిలషిత పదార్థముల నొసంగును.

ఇష్టవస్తు చిరాభ్యాసభాస్వాన్భానయతి ప్రజాః
తథేన్ద్రియాఖ్యాం దేహోర్వ్యాం రాత్రిం పశ్యన్తి నో యథా. 40

దేహమను భూమిపై, ఇష్టవస్తువగు ఆత్మవిచారముయొక్క చిరకాలాభ్యాసమను సూర్యుఁడు ప్రకాశింప అత్తఱి యింద్రియ జనితమగు రాగద్వేషాదిరూప నిద్రనుగల్గఁ జేయునదైన రాత్రిని ఉత్తమాధికారులు గాంచకయుందురు.

సర్వస్య జన్తుజాతస్య సర్వవస్త్వవభాసనే
సర్వదైవైక ఏవోచ్చైర్జయత్యభ్యాసభాస్కరః. 41

సర్వజీవులయొక్క సమస్తవస్తువులను బ్రకాశింపఁజేయుటయందు, అభ్యాసమను సూర్యుఁడొకఁడే సదా సర్వోత్తముఁడై జయించుచున్నాఁడు.

చతుర్దశవిధాయాస్తు భూతజాతేర్న కస్యచిత్
సిధ్యత్యభిమతం వస్తు వినాభ్యాసమకృత్రిమమ్. 42

పదునాల్గులోకములందున్న ప్రాణి సమూహమధ్యమం దేప్రాణియొక్క అభిమత వస్తువున్ను సహజమగు అభ్యాసము లేక సిద్ధింపనేరదు.

పౌనఃపున్యేన కరణమభ్యాస ఇతి కథ్యతే
పురుషార్థః స ఏవేహ తేనాస్తి న వినా గతిః. 43

మరల మరల ఆత్మవిచారము గావించుటయే అభ్యాసమనఁబడును. దానినే పురుషప్రయత్నమనియు నందురు. అది తప్ప ముక్తికి వేఱుగతిలేదు.

దృఢాభ్యాసాభిధానేన యత్ననామ స్వకర్మణా
నిజవేదనజేనేవ సిద్ధిర్భవతి నాన్యథా. 44

దృఢాభ్యాసమను స్వప్రయత్నరూపకర్మచే జనితమగు స్వవివేకముచేతనే మోక్షసిద్ధి గలుగును గాని మఱియొక విధముగ కాదు.

అభ్యాసభాస్వతి తపత్యవనౌ వనే చ
నీరస్య సిద్ధ్యతి న యన్న తదస్తి కించిత్
అభ్యాసతో భువి భయాన్యభయాభవన్తి
సర్వాసు పర్వతగుహాస్వపి నిర్జనాసు. 45

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే అభ్యాసప్రశంసా నామ సప్తషష్టితమః సర్గః ॥ 67 ॥

ఓ మునీంద్రా! అభ్యాసమను సూర్యుఁడు ప్రకాశింప, జితేంద్రియుఁడగు వీరునకిఁక భూమిపైగాని, వనమందుగాని, జలమందుగాని, ఆకాశాదులందుగాని సిద్ధింపని అభిలషిత పదార్థమెయ్యదియు నుండదు. ఇట్టి యభ్యాసముచేతనే సమస్తనిర్జనపర్వతగుహాదులందలి భయహేతువులగు సింహసర్పాదులన్నియుగూడ అభయరూపమును జెందును.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున అభ్యాసప్రశంస యను నఱువదియేడవ సర్గము ॥ 67 ॥

అష్టషష్టితమః సర్గః

[ఇహాధిభౌతికభ్రాన్తినిరాసేన సమాధినా
ఆతివాహికభావస్య స్థితిః సత్యా సమర్థ్యతే.

స్థూలదేహమునుగూర్చిన భ్రాంతిని నశింపఁజేయునట్టి సమాధిచే సత్యమగు సూక్ష్మశరీరముయొక్క స్థితి యిచట సమర్థింపఁబడుచున్నది.]

విద్యాధర్యువాచ :—

తతః ప్రాచీనమభ్యాసం బోధధారణయామలే
కుర్వః ప్రకటతాం తేన జగదేష్యతి శైలగమ్. 1

విద్యాధరి:— ఓ మునీంద్రా! సమాధియొక్క దృఢమైన యభ్యాసము లేనిచో దేహాదులందలి స్థూలత్వభ్రమ నశింపదు; మఱియు, సూక్ష్మభావమున్ను గలుగనేరదు. కావున, నిర్మల

మగు పరమాత్మయందు. సర్వజ్ఞత్వమును గలుగఁజేయునట్టి సమాధిరూపధారణచే మన పూర్వాభ్యాసమును మనమిరువురమున్ను మరల గావించెదము. దానిచే ఈ శిలయందలి జగత్తు ప్రకటము కాఁగలదు.

శ్రీవసిష్ఠ ఉవాచః—

యుక్తియుక్తే తథేత్యుక్తే విద్యాధర్యా ధరోరసి
బద్ధపద్మాసనోఽథాహం సమాధావుదితోఽభవమ్. 2

శ్రీ వసిష్ఠుఁడు:– ఓ రామచంద్రా! ఆ పర్వతముపై విద్యాధరి యిట్లు యుక్తియుక్తములగు వచనములఁ బల్క, అపుడు నేను బద్మాసనము వైచికొని సమాధికై యుద్యుక్తుఁడనైతి.

సర్వార్థభావనాత్యాగే చిన్మాత్రైకాన్తభావితః
అత్యజం తమహం పూర్వకథార్థకలనామలమ్. 3

సమస్తపదార్థములఁగూర్చిన భావనను త్యజించి, చిన్మాత్రమొకదానినే భావించుచు, పూర్వకథాసంబంధమగు స్థూలదేహాది భావనను, తత్సంస్కారమలమును బూర్ణముగఁ దొలగించి వైచితిని.

అద్య చిద్వ్యోమతాం ప్రాప్తః పరాం దృష్టిమహం గతః
శరత్సమయసంప్రాప్తో వ్యోమనిర్మలతామివ. 4

పిమ్మట చిదాకాశరూపత్వమును బొందుటచే, శరత్కాలమందాకాశము నిర్మలత్వమును బడయునట్లు నేను దివ్యదృష్టిని బడసితిని.

తతః సత్యావధానైకఘనాభ్యాసేన దేహకే
మమాధిభౌతికభ్రాన్తిర్న్యూనమస్తముపాగతా. 5

అటుపిదప సత్యమగు యొక పరమాత్మయొక్కయే దృఢాభ్యాసముచే దేహమందలి ఆధిభౌతిక (స్థూలత్వ) భ్రాంతి నాకు నిక్కముగ నస్తమించినదాయెను.

ఉదయాస్తమయోన్ముక్తా సతతోదయమయ్యపి
మహాచిద్వ్యోమతా స్వచ్ఛా ప్రోదితేవ తదాభవత్. 6

అత్తఱి యుదయాస్తమయరహితమై, నిత్యస్వప్రకాశరూపమై, నిర్మలమైనట్టి మహాచిదాకాశరూపత్వము నాకు ప్రకటమయ్యెను.

అథ పశ్యామ్యహం యావత్స్వస్యైవామలతేజసా
వస్తుతస్తు న చాకాశం నోపలః పరమేవ తత్. 7

తదుపరి నిజసాక్షి చైతన్యముయొక్క నిర్మలతేజముచే నట్లు గాంచినంతనే వాస్తవముగ ఆ యాకాశముగాని, ఆ శిలగాని లేకుండెను. అంతయు పరమాత్మమయముగఁ గానుపించెను.

పరమార్థఘనం స్వచ్ఛం తత్తథా భాతి తాదృశమ్
తథా భావనయా హ్యాత్మా మదీయో దృష్టవాంస్తథా. 8

పరమార్థఘనమగు నిర్మల పరతత్త్వమైన నా ఆత్మయే యా శిలారూపమున భాసించుచుండెను. మఱియు నదియే తచ్ఛిలాభావనచే నట్లు యా శిలను గాంచినది.

యథా స్వప్నే సుమహతీ దృష్టా గేహగతా శిలా
వ్యోమైవ కేవలం తద్వత్సుశుద్ధం చిన్నభఃశిలా. 9

స్వప్నమందు నిజ గృహమున గాంచబడిన గొప్పశిల స్వప్నద్రష్టయొక్క చైతన్యరూపమే యగునట్లు, మిగుల శుద్ధమైనట్టి చిదాకాశమే యట శిలారూపమున స్ఫురించుచుండెను,

స్వయం స్వప్నాన్వితోఽన్యస్య స్వప్నపుంస్త్వం గతో నరః
స్వప్నే జ్ఞానప్రబుద్ధస్య యాదృక్తాదృక్స్వరూపతః. 10

స్వప్నమందే యున్నవాఁడై, అజ్ఞానవశమున 'నేను మేల్కొంటినని' తలంచుచు ఆ స్వప్నమందే మఱియొకని రూపమును బొందినవాని స్థితి ఎట్టిదో, అట్టిదే అజ్ఞాన నిద్రయందుండియు, దాను ప్రబుద్ధుఁడాయెనని తలంచువాని స్థితియునగును.

స్వప్నస్థానాం శిరశ్ఛిన్నం యేషాం తే సంసృతౌ స్థితాః
కాలేన జ్ఞానలాభేన వినా కుర్వన్తు కిం కిల. 11

స్వప్నమందు శిరస్సు ఛేదింపఁబడినవారు ఆ స్వప్నసంసారముననే యున్నవారై జాగరణోపాయ దేహము లేనందుచేతను, జ్ఞానప్రాప్తి లేనందువలనను నేమి చేయుదురు? (స్వప్నమందే స్థితిగల్గియుందురని భావము)

బోధః కాలేన భవతి మహామోహవతామసి
యస్మాన్న కించనాప్యస్తి బ్రహ్మతత్త్వాదృతేఽక్షయమ్. 12

ఘనమగు అజ్ఞానరూప నిద్రయందున్నవారికిఁగూడ కాలక్రమమున మూలాజ్ఞాననాశముచే జ్ఞానరూప జాగ్రత్తు కలుగును, (అదియే ముఖ్యజాగ్రత్తు, తదితరము స్వప్నమందే వ్యర్థజాగరాభిమానము గల్గియుండుట యగును.) ఏలయనగా, వాస్తవముగ అక్షయమగు బ్రహ్మతత్త్వము తప్ప జాగ్రత్స్వప్నములం దన్యమగునది యొకింతైనను లేదు.

అతస్తచ్చిద్ఘనం స్వచ్ఛం బ్రహ్మాకాశం శిలాకృతి
దృష్టం మయా తథా తత్ర న తు పృథ్వ్యాది సత్క్వచిత్. 13

ఇక్కారణమున నేనచట నిర్మలమై, చిద్ఘనమైనట్టి చిదాకాశమునే శిలాకారమున, గాంచితినిగాని పృథ్వ్యాది వికారరూపమును గాదు.

భూతానామాదిసర్గే యచ్ఛుద్ధం యత్పారమార్థికమ్
వపుస్తదేవ హ్యేతేషాం ధ్యానలభ్యమవస్థితమ్. 14

సృష్ట్యాదియందు, బ్రాహ్మణులయొక్క యేశుద్ధ పారమార్థిక బ్రహ్మస్వరూపము గలదో, అదియే తత్త్వజ్ఞులకు ధ్యానలభ్యమగు ఈ సమస్త పదార్థములయొక్క రూపమైయున్నది.

బ్రాహ్మం వపుర్హి భూతానామాత్మీయం యత్పురాతనమ్
తదేవాద్య మనోరాజ్యం సంకల్ప ఇతి కథ్యతే. 15

అనాదియై, శాశ్వతమైనట్టి బ్రహ్మస్వరూపమే ఈ సమస్త ప్రాణులయొక్క యథార్థమగు రూపమైయున్నది. అదియే యిపు డజ్ఞానులచే మనోరాజ్యమనియు, సంకల్పమనియు, జగత్తనియు జెప్పఁబడుచున్నది.

సత్తాతివాహికో దేహస్తత్పరం పరమార్థతః
ప్రత్యక్షం పరమం యత్తత్తదాద్యం కచనం చితః. 16

మాయాశబలితమగు బ్రహ్మచైతన్యముయొక్క జగత్సంస్కార సహితమగు పరమార్థ సత్తయే సూక్ష్మ శరీరమనఁబడును. మఱియు, నిత్యాపరోక్షమగు శుద్ధచిదంశమే ఆదియగు చిత్ స్వరూప ప్రకాశమని చెప్పఁబడును.

ఉద్యత్ప్రథమధ్యక్షం జీవస్య ప్రథమం వపుః
మనః ప్రత్యక్షమిత్యుక్తం తత్తేనాద్యైవ దుర్ధియా. 17

అ చైతన్య సత్తారూపమే సృష్ట్యాకారమున నుదయించుచున్న దానివలెనున్నదై ప్రథమమున అధ్యక్షరూపమగు హిరణ్యగర్భ (సమష్టి జీవుని మనస్సుయొక్క శరీరమగుచున్నది, మరల యదియే దుర్బుద్ధిచే తన సమష్టిభావమును మఱచుటచే వ్యష్టిత్వమును బొందినదై సర్వజీవుల ప్రత్యక్షమైన మనస్సని చెప్పఁబడుచున్నది.

యోగి ప్రత్యక్షమిత్యుక్తం మనఃప్రత్యక్షమిత్యసి
తత్స్వమేవ చితోరూపం గత మేవాన్యతాం ముధా. 18

ఈ ప్రకారముగ అ చిత్స్వరూపమ స్వయముగ అజ్ఞానముచే మరియొక రూపమును బొందినట్లున్నదై సమష్టిరూపముచే యోగిప్రత్యక్షమనియు, వ్యష్టిరూపముచే సామాన్యజనమనః ప్రత్యక్షమనియుఁ జెప్పఁబడుచున్నది.

ఇదమద్యతనం నామ ప్రత్యక్షమసదుత్థితమ్
అసత్ప్రత్యక్షమేవేతి విద్ధి ప్రత్యక్షమగ్ర్య తత్ 19

ప్రియుఁడవగు రామచంద్రా! అందు వ్యష్టిస్థూల శరీరాది మనః ప్రత్యక్షమేదిగలదో, అద్దానిని అసద్రూపముగనే యెఱుఁగుము. సమష్టి సూక్ష్మశరీరాది యోగి ప్రత్యక్షమేదిగలదో దానిని ముఖ్యప్రత్యక్షమని యెఱుఁగుము.

అహో ను చిత్రా మాయేఽయం ప్రాక్ప్రత్యక్షే పరోక్షతా
నిర్ణీతాస్మిం స్త్వసధ్యక్షే ప్రత్యక్షకలనాగతా. 20

ఆహా! పరమాత్మయొక్క మాయ యెంత విచిత్రమైనది? ముఖ్యమైనట్టి సమష్టి మనస్సుయొక్క ప్రత్యక్షమందు పరోక్షత్వమున్ను, కల్పితమైనట్టి వ్యష్టి మనస్సుయొక్క ప్రత్యక్షమందు ప్రత్యక్షత్వమున్ను సర్వజనులకు గలుగుచున్నదే!

ఆతివాహికదేహత్వం ప్రత్యక్షం ప్రథమోదితమ్
సత్యం సర్వగతం విద్ధి మాయైవ త్వాధిభౌతికమ్. 21

ఓ రామచంద్రా! ప్రథమమున చైతన్యమున స్ఫురించుటబట్టి సూక్ష్మశరీరమే ప్రత్యక్షమైనదగును. దానినే నీవు సత్యముగను, సర్వవ్యాపకముగను నెఱుఁగుము. భౌతికమగు స్థూలశరీరము మిథ్యయైయున్నది.

అనుభూతాపి నాస్త్యేవ హేమ్నః కటకతా యథా
తథాతివాహితస్యాధిభౌతికత్వం న విద్యతే. 22

అనుభూతమైనప్పటికిని సువర్ణముయొక్క కటకత్వ (ఆభరణత్వ) మెట్లులేనిదగునో అట్లే సూక్ష్మశరీరముయొక్క అధిభౌతిక (స్థూలశరీర) త్వమున్ను లేనిదేయగును.

భ్రమమభ్రమతాం యాతమభ్రమం భ్రమతాం గతమ్
వేత్తి జీవో విచారేణ వినాహోను విమూఢతా. 23

ఆహా! జనుల మూఢత్వమేమని చెప్పవచ్చును! తత్త్వవిచారము లేమి జీవుఁడు భ్రమను అభ్రమగను అభ్రమను భ్రమగను నెఱుఁగుచున్నాఁడు.

అధిభౌతికదేహోఽయం విచారేణ న లభ్యతే
ఆతివాహికదేహస్తు కిల లోకద్వయేఽక్షయః. 24

తత్త్వవిచారముచే ఈ స్థూలశరీరము లభించనేరదు. సూక్ష్మశరీరమో మోక్ష పర్యంతమిహపరలోకములందును నక్షయమైయున్నదగును.

అధిభౌతికచిద్రూఢా హ్యాతివాహికదేహకే
మరౌ మరీచికాస్వేవ యథా మిథ్యైవ వారిధీః. 25

సూక్ష్మశరీరోపహితచైతన్యమం దేస్థూలరూపత్వము ప్రకటితమైనదో, అది మరు భూమియొక్క మృగతృష్ణయందలి జలబుద్ధివలె మిథ్యయైనది.

జాతాధిభౌతికీ సంవిదాతివాహిక చిత్క్రమే
దేహదృష్టివశాత్ప్రౌఢా స్థాణౌ పురుషధీరివ. 26

స్థాణువునందు పురుషబుద్ధివలె, సూక్ష్మశరీరోపహితచైతన్యమందు, స్థూలశరీరమును గూర్చిన దృఢసంస్కారముచే స్థూలబుద్ధి ప్రౌఢత్వముఁ జెందినది.

శుక్తౌ రజతతా తాపే జలతేన్దౌ యథా ద్వితా
అధిభౌతికతా తద్వన్మాయయైవాతివాహికే. 27

శుక్తి యందలి రజతత్వమువలెను, మృగతృష్ణ యందలి జలత్వమువలెను, చంద్రుని యందలి ద్విచంద్రత్వమువలెను, సూక్ష్మశరీరమందలి స్థూలశరీరత్వము మిథ్యయై, మాయాజనితమైయున్నది.

యదసత్తత్కృతం సత్యం యత్సత్యం తదసత్కృతమ్
అహోను మోహమాహాత్మ్యం జీవస్యాస్యావిచారజమ్. 28

ఆహా! అవివేకముచే నుత్పన్నమగు జీవుని మోహముయొక్క మాహాత్మ్యమెట్టిదై యున్నది! అతఁడు. అసత్తును సత్తుగను, సత్తు నసత్తుగను గావించియున్నాఁడు.

యోగిప్రత్యక్షమేవాస్తి కించిదస్తి తు మానసమ్
యస్మాల్లోకద్వయాచారస్తాభ్యామేవ ప్రసిధ్యతి. 29

వాస్తవముగ యోగుల సూక్ష్మ ప్రత్యక్షమే సత్యమైనది. మానసస్పందమున్ను నొకింత సత్యమైనది. ఏలయనఁగా, ఉభయలోకముల యొక్క వ్యవహారసిద్ధి యీ రెంటి (సూక్ష్మ శరీర స్ఫూర్తి. మానసికచేష్ట) చేతనే యగుచున్నది.

అద్యం ప్రత్యక్షముత్సృజ్య యః సత్యేఽస్మిన్కృతస్థితిః
ప్రత్యక్షే మృగతృష్ణామ్బు పీత్వా స సుఖమాస్థితః. 30

ఎవఁడీ ఆదియగు సూక్ష్మశరీర 'ప్రత్యక్షమును' వదలి స్థూలశరీర 'ప్రత్యక్ష' మందు సత్యత్వబుద్ధి గలిగియుండునో, అతఁడు మృగతృష్ణాజలమును ద్రాగి సుఖముగ నున్నవాఁడేయగును.

యత్సుఖం దుఃఖమేవాహుః క్షణనాశానుభూతిభిః
అకృత్రిమమనాద్యన్తం యత్సుఖం తత్సుఖం విదుః. 31

క్షణకాలములోనే నశించునదగుటచే వివేకులు విషయసుఖమును దుఃఖమనియే వచించిరి. మఱియు, సహజమై, అనాదియై, అనంతమైనట్టి ఆత్మజ్ఞానజనిత సుఖమునే వారువాస్తవముగ సుఖమనిరి.

ప్రత్యక్షేణైవమధ్యక్షం ప్రత్యక్షం ప్రవిచార్యతామ్
యదాద్యం తత్సదధ్యక్షం తత్ప్రత్యక్షేణ దృశ్యతామ్. 32

ఓ రామచంద్రా! సూక్ష్మశరీర ప్రత్యక్షముచేతనే అధ్యక్షరూపమగు సాక్షిచైతన్య 'ప్రత్యక్షము'ను గూర్చి విచారింపుము. సమస్తమునకు ఆదియైనట్టి సద్రూపమగు ఆ సాక్షిచైతన్యమును శుద్ధమగు సూక్ష్మశరీర ప్రత్యక్షముచేతనే వీక్షింపుము.

లోకత్రయానుభవదం త్యక్త్వా ప్రత్యక్షమైహికమ్
మాయాత్మకం యో గృహ్ణాతి నాస్తి మూఢతమస్తతః. 33

ముల్లోకముల యనుభవము నొసంగునట్టి సూక్ష్మ శరీర ప్రత్యక్షమును వదలి, ఐహికమై, మాయాస్వరూపమైనట్టి స్థూలశరీరాది ప్రత్యక్షము నెవఁడు గ్రహించునో, అతనికంటె గొప్ప మూఢుఁడు మఱెవఁడును నుండఁజాలడు.

ఆతివాహికమేవైషాం భూతానాం విద్యతే వపుః
అత్రాధిభౌతికవ్యాప్తిరసత్యైవ పిశాచికా. 34

వాస్తవముగ ఈ జీవులకు సూక్ష్మశరీరమే గలదు. అందుస్థూల శరీరమును గూర్చిన వ్యాప్తి అసత్యమైన పిశాచమువంటిదే యగును.

అజాతసంకల్పమయం ప్రత్యక్షం సత్కథం భవేత్
స్వయమేవ న యత్సత్యం తత్స్యాత్కార్యకరం కథమ్. 35

సర్వథా యుత్పత్తిరహితమై, సంకల్పమయమైనట్టి ప్రత్యక్షము సత్యమెట్లగును? మఱియు నట్లు స్వయముగనే అసత్యమైనది అర్థక్రియా సమర్థమెట్లగును?

యత్ర ప్రత్యక్షమేవాసదన్యత్కిం తత్ర సద్భవేత్
క్వ తత్సత్యం భవేద్వస్తు యదసిద్ధేన సాధ్యతే 36

'ప్రత్యక్షము'యొక్క సాధకములగు స్థూలనేత్రాదులే యోగుల దృష్టియందు అసత్యములైయుండ నిఁక వానిచే సాధ్యములగు అన్యపదార్థములెట్లు సత్యములగును? అసత్యమగుదానిచే సిద్ధింపఁజేయఁబడు వస్తువు సత్యమెన్నఁడైన యగునా?

ప్రత్యక్ష ఏవ భావత్వే నష్టే క్వేవానుమాదయః
ఉహ్యన్తే వారణా యత్ర తత్రోర్ణాయుషు కా కథా 37

ఇవ్విధమున ప్రత్యక్షముయొక్క సత్తయే సిద్ధింపనపుడిఁక తదధీనములగు 'అనుమానా'దులఁగూర్చి వేఱు చెప్పనేల? ఎచట పెద్ద పెద్ద యేనుఁగులే కొట్టుకొనిపోవుచున్నవో, అచట నిఁక పొట్టేళ్లనుగూర్చి వేఱు చెప్పవలెనా?

అతః ప్రమాణసంసిద్ధం దృశ్యం నాస్త్యేవ కుత్రచిత్
అనన్యదిదమస్తీవ తత్త్వబ్రహ్మ ఘనం ఘనమ్ 38

కావున, ప్రమాణసిద్ధమగు దృశ్యమెచటను లేనిదైయున్నది. ఏది భాసించుచున్నదో, అది సద్రూపముకంటె వేఱుకానిదై. మహాచిద్ఘనమగు బ్రహ్మమేయైయున్నది.

స్వప్నే ద్రష్టుః ఖమేవాద్రిర్గృహే నాన్యస్య వైయథా
తథా తద్భావనవతోరావయోః సాశిలైవ చిత్. 39

స్వప్నమందు పర్వతమును గాంచువానికయ్యది సత్యముగా దోచినను వాస్తవముగ శూన్యమేయైయున్నది. ఏలయనిన, తత్కాలమున ఆ గృహమున మేల్కొనినట్టిగాని, నిద్రించినట్టి గాని యన్యమనుజునకది లేకయున్నది. అట్లే శిలాభావనతో గూడియున్న మన యిరువురికిని శిలారూపమున గానుపించినప్పటికిని నది వాస్తవముగ చిద్రూపమేయైయున్నది.

అయం శైల ఇదం వ్యోమ జగదేతదిదం త్వహమ్
ఇతి చిన్మయ ఆత్మాన్తః ఖం చమత్కురుతే స్వయమ్ 40

'ఇది పర్వతము, ఇది యాకాశము, ఇది జగత్తు, ఇది నేను' ఈ మున్నగు రూపములతోటి చిదాకాశమైన చిన్మయమగు ఆత్మయే స్వయముగఁ దనయందు భాసించుచున్నదగును.

పశ్యత్యేతత్ప్రబుద్ధాత్మా నాప్రబుద్ధః కదాచన
శ్రోతుః కథార్థసంవిత్తిర్నాశ్రోతుర్భవతి క్వచిత్ 41

దీని నంతయు ప్రబుద్ధమగు చైతన్యమే గాంచుచున్నది గాని అప్రబుద్ధమగు మఱేదియు నెచటను గాంచుటలేదు. కథార్థజ్ఞానము వినువానికే కలుగును. గాని విననివానికెచటను గలుగదుకదా!

అప్రబుద్ధమితి భ్రాన్తిరేవేయం సత్యతాం గతా
క్షీబస్య సుస్థిరా ఏవ నృత్యన్తి తరుపర్వతాః 42

మద్యము త్రావినవానికి వృక్షపర్వతాదుల నృత్యము సత్యముగనే యుండునట్లు, అజ్ఞానికిజగద్భ్రాంతి సత్యత్వమును బొందినది.

సర్వత్రాప్రతిహతమేకరూపబోధం
ప్రత్యక్షం శివమనుబుధ్య చిత్స్వరూపమ్
ప్రత్యక్షాన్తరమిహ పేలవం శ్రయన్తే
యే మూఢాస్తృణతనుభిః శఠైరలం తైః 43

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే ప్రమాణాప్రతిసిద్ధ్యా
దృశ్యానుపపత్తివర్ణనం నామాష్టషష్టితమః సర్గః ॥ 68 ॥

యోగులకు బ్రత్యక్షమై, సర్వత్ర అనిరుద్ధమై, ఏకమై, బోధరూపమైనట్టి పూర్ణానందైకరసమగు చిత్స్వరూపము నెఱుఁగక, తుచ్ఛమగు 'జగద్రూప ప్రత్యక్షము' నెవరాశ్రయించుదురో, అట్టి మూఢులు తృణప్రాయులున్ను, ఆత్మవంచకులున్ను నగుదురు. వారివలన నేప్రయోజనమున్ను లేదు.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
పాషాణోపాఖ్యానమున ప్రమాణాప్రతిసిద్ధ్యాదృశ్యానుపపత్తి
వర్ణనమను నఱువది యెనిమిదవ సర్గము ॥ 68 ॥

ఏకోనసప్తతితమః సర్గః

[శిలాసర్గ ప్రవేశోఽత్ర తత్రత్య విధిదర్శనమ్
స్వాసితస్య మునేస్తేన సంభాషా చాత్రవర్ణ్యతే.

శిలయందలి బ్రహ్మాండమునఁ బ్రవేశించుట, అచట బ్రహ్మదేవుని దర్శించుట, ఆసీనుడైన వసిష్ఠమునీంద్రునితోటి బ్రహ్మదేవుఁడు సంభాషించుట యిట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీవసిష్ఠ ఉవాచః—

జగదఙ్గమనాభాసమదృశ్యం దృశ్యవత్స్థితమ్
పరయా దృశ్యతే దృష్ట్యా తద్బ్రహ్మైవ నిరామయమ్ 1

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! సమస్తబ్రహ్మాండములున్ను తన అవయవములుగా గలదియు, సూర్య చంద్ర నేత్రాదుల ప్రకాశముచే అప్రకాశితమును, వాస్తవముగ అదృశ్యమైనను దృశ్యమువలె నున్నదియుఁ నగు నిరామయమైన బ్రహ్మము సమాధియొక్క దివ్యదృష్టిచే గానుపించును.

తత్ర శైలసరిత్స్రోతో లోకాలోకాన్తరభ్రమాః
భాన్తి తే పరమాదర్శే మహావ్యోమని బిమ్బితాః. 2

ఆ చిదాకాశమను గొప్పయద్దమున ప్రతిబింబితములై ఈ పర్వత, నదీ, లోక, లోకాంతర రూపభ్రమలన్నియు భాసించుచున్నవి.

సా ప్రవిష్టా తతః సర్గం తమనర్గలచేష్టితా
అహమప్యవిశం తత్ర సంకల్పాత్మా తయా సహ. 3

అనిరుద్ధమైన చేష్టగల యా విద్యాధరి అంత నా శిలాంతర్గమగు సృష్టియందు బ్రవేశింప, నేనున్ను సంకల్పరూపముతోటి యప్పుడందుఁ బ్రవేశించితిని.

యావత్సా తత్ర వైరిఞ్చం లోకమాసాద్య సోద్యమా
ఉపవిష్టా విరిఞ్చస్య పురః పరమశోభనా. 4

శిలయందు, నన్ను బొందింపఁజేయుటయందు ప్రయత్నవతియు, మిగుల శోభాయుక్తయునగు విద్యాధరి యపుడా శిలయందలి బ్రహ్మలోకమును బొంది యట బ్రహ్మదేవుని యెదుట, గూరుచుండి నాతో నిట్లనెను.

వక్త్ర్యయం మునిశార్దూల పతిర్మే పాతి మామిమామ్
వివాహార్థమనేనాహం జనితా మనసా పురా. 5
పురాణః పురుషోఽప్యేష మామప్యద్య జరాగతామ్
న వివాహితవాంస్తేన విరాగమహమాగతా. 6
విరాగమేషోఽప్యాయాతో గన్తుమిచ్ఛతి తత్పదమ్
యత్ర న ద్రష్టృతా నైవ దృశ్యతా న తు శూన్యతా. 7
మహాప్రలయ ఆసన్నో జగత్యస్మింశ్చ సంప్రతి
ధ్యానాన్న చలత్యేష శైలమౌనాదివాచలః. 8

ఓ మునిశ్రేష్ఠా! ఈతఁడే నా భర్త. ఈతఁడే వివాహముకొఱకుఁ బూర్వకాలమున నన్ను జనింపఁజేసెను. పురాతన పురుషుఁడగు యీతఁడిపుడు వృద్ధావస్థఁ బొందినను నింకను వివాహమాడకయే యున్నాఁడు. కావున నాకు వైరాగ్యము జనించినది! ఈ నాపతియు నిపుడు వైరాగ్యమును బొందినవాఁడై, ద్రష్టగాని, దృశ్యత్వముగాని, శూన్యత్వముగాని లేని నిర్మలపదమును బొంద నభిలషించుచున్నాఁడు. ఇపుడీ జగత్తునందు మహాప్రళయము దాపించినను నీతఁడు తన ధ్యానమందే మౌనముగ నున్నవాఁడై, పర్వతమువలెఁ జలింపక యున్నాఁడు.

తస్మాన్మామేనమపి చ బోధయిత్వా మునీశ్వర
ఆ మహాసర్గకల్పాదౌ పరమే పథి యోజయ. 9

కావున ఓ మునీశ్వరా! నన్ను, ఈ నాపతిని తత్త్వోపదేశముచే ప్రబోధమొనర్చి మహాకల్పము వఱకుఁగల సమస్త సృష్టులయొక్క మూలభూతమైనట్టి బ్రహ్మమను మార్గమున మమ్ముల నియోగింపుఁడు.

ఇత్యుక్త్వా మామసౌ తస్య బోధాయేదమువాచ హ
నాథాయం మునినాథోఽద్య సద్మ సంప్రాప్త వానిదమ్ 10
ఏషోఽన్యస్మిఞ్జగద్గేహే బ్రహ్మణస్తనయో మునిః
పూజయైనం గృహాయాతం గృహస్తగృహపూజయా. 11
బుద్ధ్యతామర్ఘ్యపాద్యేన పూజతాం మునిపుఙ్గవః
మహన్మహత్సపర్యాభిర్మహాత్మభ్యో హి రోచతే. 12

ఓ రామచంద్రా! ఇట్లు నాతోపచించి యా విద్యాధరి తనపతిని సమాధినుండి లేపుట కొఱకై యీ వాక్యముల బలికెను — నాథా! ఈ మునిశ్రేష్ఠులగు వసిష్ఠులు నేఁడు మన గృహమునకు విచ్చేసియున్నారు. ఇమ్మునీంద్రుఁడు మఱియొక బ్రహ్మాండమను గృహమునకు ప్రభువైనట్టి బ్రహ్మదేవుని కొమరుఁడు. కావున మన గృహమున కేతెంచిన వీరిని గృహస్థోచితరీతినిఁ బూజింపుఁడు. మఱియు వీరిని బూజ్యులుగ నెఱిఁగి, అర్ఘ్యపాద్యాదులఁజే బూజసల్పుఁడు. ఏలయనిన, మహనీయుల నిట్లు మహత్తర పూజాదులచే సత్కరించుటవలన గలుగు ఫలము తమవంటి మహాత్ములకే రుచించును.

తయేత్యుక్తే మహాబుద్ధిస్ప్రబుధే స సమాధితః
స్వసంవిత్తిద్రవాత్మత్వాదావర్త ఇవ వారిధౌ. 13

ఆమె యిట్లు పలుక, అంత, స్వకీయ జ్ఞానము ద్రవీభూతమగుటవలన ఆ మహాబుద్ధి యగు బ్రహ్మ సముద్రమందావర్తముపలె సమాధినుండి లేచెను.

శనైరున్మీలయామాస నయనే నయకోవిదః
మధుః శిశిరసంశాన్తావవనౌ కుసుమే యథా. 14

శిశిరఋతువస్తమింప, భూమిపై వసంతర్తువు తన పుష్పరూప నేత్రములను దెఱచునట్లు, అపుడా నీతినిపుణుఁడగు బ్రహ్మ తన నేత్రద్వయమును మెల్లగఁదెఱచెను.

శనైః ప్రకటయామాసుస్తాన్యఙ్గాన్యస్య సంవిదమ్
మధుపల్లవజాలాని నవానీవ నవం రసమ్. 15

అత్తఱి, వసంతకాలపు నూతన పల్లవసమూహము తన నూతన రసమును బ్రకటమొనర్చునట్లు, ఆతని అవయవములన్నియు మెల్లగ నాతని జ్ఞానమును బ్రకటమొనర్చెను.

సురసిద్ధాప్సరఃసఙ్ఘాః సమాజగ్ముః సమన్తతః
యథా హంసాలయో లోలాః ప్రాతర్వికసితం సరః. 16

ప్రాతఃకాలమున వికసించిన కమలములుగల సరస్సువద్దకు చంచలమగు హంససమూహము లేతెంచునట్లు, అపుడు నలువైపులనుండియు దేవ, సిద్ధ, అప్సరసాది సమూహము లచటికి నేతెంచెను.

దదర్శాసౌ పురః ప్రాప్తం మాం చ తాం చ విలాసినీమ్
ఉవాచాథ వచో వేధాః ప్రణవస్వరసున్దరమ్. 17

అంత ఆ బ్రహ్మదేవుఁడు నన్నును, ఆ విలాసినిని దనయెదుటఁ గాంచి బ్రణవసహితమగు సుందర స్వరముతో నిట్లు పలికెను.

అన్యజగద్బ్రహ్మోవాచః—

కరామలకవద్దృష్టసంసారాసారసార హే
జ్ఞానామృతమహామ్భోద మునే స్వాగతమస్తు తే. 18

అన్యజగద్బ్రహ్మః— అసారమగు సంసారముయొక్క సారభూతమగు ఆత్మను కరతలామలకముగఁ గాంచినట్టి యో మునీంద్రా! జ్ఞానామృత మహాసముద్రుఁడవగు నో మహాత్మా! తమకు స్వాగతము!

పదవీమసి సంప్రాప్త ఇమామతిదవీయసీమ్
దూరాద్వసుపరిశ్రాన్త ఇదమాసన మాస్యతామ్. 19

ఓ మునీంద్రా! తాము చాలదూరమునుండి యేతెంచుటవలన శ్రమనొంది యున్నారు. కావున ఈ యాసనముపై వేంచేయుఁడు.

ఇత్యుక్తే తేన భగవన్నభివాదయ ఇత్యహమ్
వదన్మణిమయే పీఠే నివిష్టో దృష్టిదర్శితే. 20

ఓ రామచంద్రా! ఆతఁడిట్లు వచింపనంత మహాత్మా! తమకు వందనములని చెప్పుచు దృష్టిచేఁ జూపఁబడిన మణిమయమైన యాసనముపై నేను గూర్చుంటిని.

అథామరర్షిగన్ధర్వముని విద్యాధరోదితాః
ప్రస్తుతాః స్తుతయః పూజా నతయః స్థితినీతయః 21
తతో ముహూర్తమాత్రేణ సర్వభూతగణోదితే
శాన్తే ప్రణతిసంరమ్భే తస్యోక్తం బ్రహ్మణో మయా. 22

తదనంతరము దేవ, ఋషి, గంధర్వ, ముని, విద్యాధరాదులచేఁ గావింపఁబడిన యనేక స్తుతి పూజా, వ్యవహారనీతులు ప్రవృత్తములయ్యెను. అట్లా భూతగణమంతటిచే గావింపఁబడిన స్తుతి ప్రణామాది సంరంభమంతయు శమింప, అంతటనే నా బ్రహ్మదేవునితో నిట్లంటిని.

కిమిదం భూతభవ్యేశ యదియం మాముపాగతా
వక్తి జ్ఞానగిరాస్మాంస్త్వం బోధయేతి ప్రయత్నతః. 23

భూతభవిష్య ద్వర్తమానములకుఁ బ్రభువగు నో మహాత్మా! ఈ విద్యాధరి నన్ను సమీపించి 'జ్ఞానయుక్తములగు వచనములచే మా యిరువురిని ప్రబోధ మొనర్పుఁడని' ప్రయత్నపూర్వకముగ వచించుచున్నది. ఇది యుక్తమా!

భవాన్భూతేశ్వరో దేవ సకలజ్ఞానపారగః
ఇయం తు కామమూర్ఖా కిం బ్రూతే బ్రూహి జగత్పతే. 24

ఏలయనిన, దేవా! జగదీశ్వరా! తాము సకలజ్ఞాన పారంగతులై, సర్వభూతములకు ప్రభువైయున్నారు. ఈమెయో కామాంధయై, అనధికారిణియై యున్నది. కాఁబట్టి యీమె యొక్క యుపదేశ ప్రార్థన యనుచితమేయగును. కావున నీమె యిట్లెందులకు పచించుచున్నదో కారణమును దెలియజేయఁగోరెద.

కథమేషా త్వయా దేవ జాయార్థం జనితా సతీ
నేహం జాయాపదం నీతా నీతా విరసతాం కథమ్. 25

మహాత్మా! భార్య కొఱకీమెను దాము జనింపఁజేసియు మరల భార్యాపదమున నేల స్థాపింపకయుంటిరి? మఱియు నీమెకు వైరాగ్యదశ నెట్లు పొందింపఁజేసితిరి.

అన్య జగద్బ్రహ్మోవాచ :—

మునే శృణు యథావృత్తమిదం తే కథయామ్యహమ్
యథావృత్తమశేషేణ కథనీయం యతః సతామ్. 26

అన్యజగద్బ్రహ్మ:— ఓ మునీశ్వరా! ఈ వృత్తాంత మంతయు యథార్థముగ వచించుచున్నాను వినుము. ఏలయనిన. సజ్జనులకు వృత్తాంతమంతయు యథార్థముగనే వచింప వలయును.

అస్తి తావదజం శాన్తమజరం కించిదేవ సత్
తతశ్చిత్కచనైకాన్తరూపిణఃక చితోఽస్మ్యహమ్. 27

ఓ మునీంద్రా! అజమై, శాంతమై, అజరమైనట్టి చిద్రూపమగు సత్పదముగలదు. అట్టి కేవల చిత్ప్రకాశరూపమునుండి నేను ప్రకటమైతిని.

ఆకాశరూప ఏవాహం స్థిత ఆత్మని సర్వదా
భవిష్యతి స్థితే సర్గే స్వయంభూరితి నామ మే. 28

నేనుచిదాకాశరూపుఁడనేయై, సదా ఆత్మయందే నెలకొనియున్నాను. ప్రజాసృష్టివిద్యమానమై యున్నపుడు నేను వారిదృష్టియందు స్వయంభువను బేరు గలవాఁడ నగుదును.

వస్తుతస్తు న జాతోఽస్మి నచ పశ్యామి కించన
చిదాకాశశ్చిదాకాశే తిష్ఠామ్యహమనావృతః. 29

యథార్థముగ నేను నెపుడునుత్పన్నుఁడను గాకయేయున్నాను. మఱియు దేనిని గాంచుటయులేదు. ఆవరణరహితుఁడను, చిదాకాశరూపుఁడనునై చిదాకాశమందే స్థితిగల్గియున్నాను.

యదయం త్వం మమాహం తే యదిదం కథనం మిథః
తత్తరఙ్గస్తరఙ్గాగ్రే రణతీ వేతి మే మతిః. 30

'వీఁడు నీవు, నేను నాది, వారు. మున్నగునవియు, ఈ మన పరస్పర సంభాషణయు. ఏకమగు సముద్రమందు తరంగ భేదములచే జనించిన శబ్దమువంటిదే యని నా మతము,

ఏవం రూపస్య మే కాలవశతోఽ విశదాకృతేః
సా కుమార్యాశ్చిదాభాస మాత్రస్యాన్తః స్వభావతః. 31
మమానన్యా తవాన్యస్య చాన్యే వేహవిభాతి యా
సోదితానుదితేవాన్తర్మమాహమితి వాసనా. 32

ఈ ప్రకారముగ సముద్రమునుండి తరంగమువలె నొకింత కల్పితమైనట్టి రూపము గలవాఁడను కాలవశమున నొకింత స్వరూపవిస్మరణముచే అశుద్ధమైన ఆకృతి గలవాఁడను, చిదాభాసరూపుఁడును నగు నాయొక్క అంతఃకరణమున స్వభావముగ, ఏ 'నాది, నేను' యను వాసన యుదయించినదో, అది యీ కుమారికి, మీకు, తదితరులకు చైతన్యముకంటె భిన్నముగ భాసించుచున్నది. గాని నా దృష్టియందు అభిన్నముగనే యున్నది. కావున నది యితరుల దృష్టియం దుదయించినదియు, నా దృష్టియం దుదయించనిదియు నైయున్నది.

అనాశసత్తానుదిత స్త్వహమాత్మాత్మనిస్థితః
స్వాత్మావాదచ్యుతాకారః స్వాత్మారామః స్వయంప్రభుః. 33

నేను నాశరహితమైన సత్తాస్వరూపుఁడను, దృశ్యరూపమున నుదయింపనివాఁడను, ఆత్మ స్వభావమునుండి చ్యుతి నొందని యాకృతి గలవాఁడను, స్వాత్మారాముఁడను, స్వయంప్రభువును, ఆత్మస్వరూపుఁడనునై ఆత్మయందే నెలకొనియున్నాను.

తస్యాఅహమితి భ్రాన్తేర్వాసనాయా జగత్స్థితేః
సంపన్నేయమధిష్ఠాతృదేవతా దేహరూపిణీ. 34

పూర్వ పూర్వ అహంకార స్మృతిరూపమగు 'అహం' (నేను) అను భ్రాంతియొక్కయు, జగత్స్థితియొక్కయు, వాసనయొక్కయు, అధిష్ఠాత్రియైన దేవతయగు యీమె నా సంకల్పముచే దేహరూపిణియై వెలయుచున్నది.

వాసనాయా అదిష్ఠాతృదేవతైవమియం స్థితా
నతు మే గృహిణీ నాపి గృహిణ్యర్థేన సత్కృతా. 35

ఈ ప్రకారముగ నీమె వాసనయొక్క అధిష్ఠాన దేవతయే యైయున్నది గాని నాయొక్క గృహిణియు కాదు. గృహిణికొఱకీమెను నేను సృజింపలేదు.

స్వవాసనావేశవశేన భావం
గృహిణ్యహం బ్రహ్మణ ఇత్యుపేత్య
ఏషా స్వయం వ్యర్థమితాతిదుఃఖం
యస్మాత్కిలైవైష హి వాసనాన్తః 36

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే సర్గప్రాప్తిర్నామ ఏకోన సప్తతితమః సర్గః ॥ 69 ॥

ఈమెయే అంతరంగమున సర్వజగద్వాసన యగుటచే, స్వవాసనావేశవశముచే 'నేను బ్రహ్మదేవుని గృహిణి' నను భావమును గల్పించుకొని స్వయముగనే వ్యర్థముగ నతి దుఃఖమును బొందుచున్నది.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణ ప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున స్వర్గప్రాప్తియను నఱువదితొమ్మిదవ సర్గము ॥ 69 ॥

సప్తతితమః సర్గః

[వర్ణ్యతే వాసనా దేవ్యా ఇహ నిర్వేదకారణమ్
ప్రలయో జగతశ్చాథ మిథ్యా విభ్రమమాత్రతా.

వాసనాదేవియొక్క వైరాగ్యకారణము, జగత్తుయొక్క ప్రళయము, మిథ్యాభ్రమత్వము మున్నగు విషయము లిచట వర్ణింపఁబడుచున్నవి.]

అన్యజగద్బ్రహ్మోవాచ :—

అథాహం చిన్మయాకాశ స్త్వన్యాకాశమయీం స్థితిమ్
పరాం గ్రహీతుమిచ్ఛామి తేనేహోపస్థితః క్షయః 1

అన్యజగద్బ్రహ్మ:— ఓ మునీంద్రా! ఇపుడు (స్వసంకల్పకల్పితమగు ద్విపదార్థము వలనైన నా యాయువు పూర్తియగుచున్నది గాన) చిద్వివర్తరూపమై, చిన్మయమైనట్టి చిత్తాకాశ రూపము గల్గియున్న నేను పరమై, నిరతిశయానందరూపమై, చిదాకాశమయమైనట్టి, కైవల్యస్థితిని బొందఁదలంచుచున్నాను. గాన స్వవాసనాకల్పితమగు ఈ జగంబున ప్రళయము సంభవింప నున్నది.

మహాప్రలయకాలేఽస్మిం స్త్యక్తుమేషా మయాధునా
మునీన్ద్ర నూనమారబ్ధా తేన వైరస్యమాగతా. 2

ఓ మునీశ్వరా! ఇపుడే మహాప్రళయకాలమున ఈమెను నేను త్యజింపమొదలిడితిని, కావుననే యీమె వైరాగ్యమును బొందినది.

ఆకాశత్వాద్యదాద్యోఽయం పరాకాశో భవామ్యహమ్
తదా మహాప్రలయతా వాసనాయాశ్చ సంక్షయః. 3

ఈ చిత్తాకాశత్వమును వీడి బ్రహ్మకాశత్వము నెపుడు నేను బొందుదునో, అపుడు మహాప్రళయమున్ను, వాసనాక్షయమున్ను సంభవించును.

తేనైషా విరసీభూతా మన్మార్గం పరిధావతి
నానుగచ్ఛతి కో నామ నిర్మాతారముదారధీః 4

ఇక్కారణమున నీమె విరక్తయై నా మార్గము (బ్రహ్మజ్ఞానము) వైపునకుఁ బరుగిడుచున్నది. తన్ను నిర్మించినట్టివాని ననుసరింపని యుదారబుద్ధి యెవఁడుండును!

ఇహాద్యాయం కలేర న్తశ్చతుర్యుగవిపర్యయః
ప్రజామన్విన్ద్రదేవానామద్యైవాన్తోఽయమాగతః. 5

అద్యైవ చాయం కల్పాన్తో మహాకల్పాన్త ఏవ చ
మమాయం వాసనాన్తోఽద్య దేహవ్యోమాన్త ఏవచ. 6

ఇపుడు కలియుగముయొక్కయు, చతుర్యుగములయొక్కయు, ప్రజా, మను, ఇంద్ర, దేవాదులయొక్కయు, కల్పముయొక్కయు, మహాకల్పముయొక్కయు, నా వాసనయొక్కయు, దేహాకాశముయొక్కయు అంతము (క్షయము) ఏతెంచినది.

తేనేయం వాసనా బ్రహ్మన్త్వయం గన్తుం సముద్యతా
క్వేవ పద్మాకరాశోషే గన్ధలేఖావతిష్ఠతామ్. 7

కావున, మహాత్మా! ఈ నా వాసన యిపుడు క్షయమొందఁబోవుచున్నది. కమలముల సరస్సెండిపోవ నిఁక గంధసమూహమెచట?

యథా జడాబ్ధిలేఖాయా జాయతే లహరీ చలా
వాసనాయా స్తథైవేచ్ఛా ముధోదేత్యపకారణమ్. 8

[illegible]మానికదేహాయా వాసనాయాః స్వభావతః
అస్యా ఆత్మావలోకేచ్ఛా స్వయమేవోపజాయతే. 9

జడమైన సముద్రమున చంచలమైన తరంగము జనించునట్లు, అభిమానముచే దేహములు ధరించునట్టి యీ వాసనయందు, ఆత్మ దర్శనమునుగూర్చి యిచ్ఛ కారణాంతరములేక స్వభావవశముగనే స్వయముగ జనించుచున్నది.

ఆత్మతత్త్వం ను పశ్యన్త్యా ధారణాభ్యాసయోగతః
దృష్టోఽనయా భవత్సర్గో వర్గవ్యగ్రనిరర్గలః. 10

ఆత్మతత్త్వమును దర్శించుటకుఁ బ్రవృత్తురాలైన యీమె ధారణాభ్యాసయోగముచే, ధర్మార్థకామమోక్షములను చతుర్విధ పురుషార్థములను సాధించుటయందు వ్యగ్రులైనట్టి ప్రజలు గల మీ బ్రహ్మండమును గాంచగల్గినది.

అనయామ్బరసంచారపరయాద్రిశిరఃశిలా
దృష్టా స్వజగదాధారభూతాస్మాకం తు ఖాత్మికా. 11

ఆకాశగమనమున తత్పరయగు యీమె స్వజగంబున కాధారభూతమగు లోకాలోక పర్వతశిలను గాంచినది. మా దృష్టియందాశిల కేవలము చిదాకాశరూపమేయైయున్నది.

ఏతదస్మిన్జగద్యత్ర తద్దృషత్త్వం జగద్గిరౌ
అస్మజ్జగత్పదార్థేషు సంత్యన్యాని జగన్త్యపి. 12

ఏ పర్వతముయొక్క శిలయందీజగత్తుగలదో, ఆ పర్వతముయొక్క యితరశిలలందును పెక్కు జగత్తులు గలవు. అట్లే మా యీ జగత్తుయొక్క పదార్థములందును నితరములగు యనేక జగత్తులు గలవు.

వయం తాని న పశ్యామో భేదదృష్టా స్థితా ఇమే
బోధైకతాం గతాస్త్వాశు పశ్యామస్తాని వీక్షణాత్. 13

ఆ యనేకబ్రహ్మండములన్నింటిని భేదదృష్టి (వ్యుత్థానదశ) యందున్నపుడు మనము గాంచలేము. సమాధిచే బోధైకత్వమును బొందునపుడు యోగదృష్టిచే శీఘ్రముగ గాంచగలము.

ఘటే పటే వటే కుడ్యే ఖేఽనలేఽమ్భసి తేజసి
జగన్తి సన్తి సర్వత్ర శిలాయామివ సర్వదా. 14

ఈ శిలయందువలెనే ఘటమందును, పట(వస్త్ర)మందును, పటవృక్షమందును, ఆకాశమందును, వాయువందును, అగ్నియందును, జలమందును సర్వత్ర సదా యనేక జగత్తులు గలవు.

జగన్నామ ముధా భ్రాన్తిః కిల స్వప్నపురోపమా
మిథ్యైవేయం క్వ నామాసౌ చిద్రూపాన్త్వథ నాస్తి చ. 15

స్వప్నసగరమును బోలినట్టి యీ జగత్తు మిథ్యయై, భ్రాంతిరూపమైయున్నది. కావున నిది యెచట గలదు? (లేనిదేయైయున్నది) అధిష్ఠానచిద్రూపముచే నిది సత్యమైయు, తదితర దృశ్యాదిరూపములచే అసత్యమైయునున్నది.

పరిజ్ఞాతా సతీ యేషామేషా చిన్నభసైకతామ్
గతా తే న విముహ్యన్తి శిష్టాస్తు భ్రమభాజనమ్. 16

ఎవరీజగన్మాయను 'అసత్తని' యెఱుఁగుదురో, వారికిది (జగత్తు) చిదాకాశరూపత్వమునే పొందినది యగును. అట్టివారెపుడును మోహమొందరు. తక్కినవారందఱును భ్రమ భాజనులే యగుదురు.

అథాన్యధారణాభ్యాసాత్స్వవిరాగవశోదితమ్
సాధయన్త్యర్థమాత్మీయం దృష్టాస్త్వమనయా మునే. 17

ఓ మునీంద్రా! నిజవైరాగ్యవశమున తత్త్వజ్ఞానమును బొంద నభిలాష జనింప, తజ్జ్ఞానానుకూలములగు శ్రవణమననాదులను తమ యుపదేశముచే సాధింపనెంచి, ఖేచరీముద్రయొక్క ధారణాభ్యాసముచే ఆకాశమున సంచరించుచు నామె మిమ్ములఁ గాంచినది.

ఇతి మాయేవ దుష్పారా చిచ్ఛక్తిః పరిజృమ్భతే
ఇత్థమాద్యన్తరహితా బ్రాహ్మీశక్తిరనామయా. 18

ఈ ప్రకారముగ చిత్‌శక్తియే, దాటుటకుఁ గష్టసాధ్యమైనట్టి మాయయొక్క రూపమున అజ్ఞానికి విజృంభించుచున్నది; కాని జ్ఞానికిసమస్తమును ఆద్యంతరహితమై, నిరామయమైనట్టి బ్రహ్మముయొక్క శక్తిగనే తోఁచును.

ప్రవర్తన్తే నివర్తన్తే నేహ కార్యాణి కానిచిత్
ద్రవ్యకాలక్రియాద్యోతా చితిస్తపతి కేవలమ్. 19

యథార్థముగ నిట నేకార్యములును నుత్పన్నములగుటలేదు. నశించుటలేదు. దేశ, కాల, క్రియా, ద్రవ్యాదిరూపములచే చిత్‌శక్తియే స్ఫురించుచున్నది.

దేశకాలక్రియాద్రవ్యమనోబుద్ధ్యాదికం త్విదమ్
చిచ్ఛిలాఙ్గకమేవైకం విద్ధ్యనస్తమయోదయమ్. 20

ఓ మునీంద్రా! ఈ దేశ, కాల, క్రియా, ద్రవ్య, మనో, బుద్ధ్యాదుల నన్నింటిని ఉదయాస్తమయరహితమగు చిద్రూపశిలయొక్క ప్రతిమయనియే యెఱుఁగుము.

చిదేవేయం శిలాకారమవతిష్ఠతి విభ్రతి
అఙ్గామస్యా జగజ్జాలం మరుతః స్పన్దనం యథా. 21

చిత్-శక్తియే యీ శిలాకారమును ధరించు నిట విద్యమానమైయున్నది. వాయువునకు చలనమువలె, జగత్సమూహములన్నియు దీని అవయవములై వర్తించుచున్నది..

విజ్ఞానఘనమాత్మానం జగదిత్యవబుద్ధ్యతే
అనాద్యన్తాపి సాద్యన్తా చిత్త్వాదితి గతాపి చిత్. 22

ఆద్యంతరహిత (అపరిచ్ఛిన్న) మైనను, పరిచ్ఛిన్నత్వమొందినదానివలె నున్నదై, ఈ విజ్ఞానఘనమగు చైతన్యము తన్ను జగద్రూపముగ నెఱుఁగుచున్నది.

చిచ్ఛిలేయమనాద్యన్తా సాద్యన్తాస్తీతి బోధతః
సాకారాపి నిరాకారా జగదఙ్గేతి సంస్థితా. 23

ఆద్యంతరహితమైనను, ఈ చైతన్యము శిలాదుల రూపమున ఆద్యంతసహితముగఁ దోఁచుచున్నది. మఱియు నిరాకారమైనను, జగత్తులే అవయవములుగా గల్గిన సాకారరూపమునఁ జెన్నొందుచున్నది.

యద్వత్స్వప్నే చిదేవ స్వం రూపం వ్యోమైవ పత్తనమ్
వేత్తి తద్వదిదం వేత్తి పాషాణం జగదఙ్గకమ్. 24

స్వప్నమందు చిదాకాశమే తన స్వరూపమును నగరాదులుగఁ గాంచునట్లు, జాగ్రత్తు నందును,చిదాకాశమే తన స్వరూపమును జగదంగములగు పర్వత, శిలాదులుగఁ గాంచుచున్నది.

న సరన్తీహ సరితో న చక్రం పరివర్తతే
నార్థాః పరిణమన్త్యన్తః కచత్యేతచ్చిదమ్బరమ్. 25

ఓ మునీంద్రా! వాస్తవముగ నిట ఈ నదులు ప్రవహించుటలేదు; ఈ నక్షత్ర చక్రము తిరుగుటలేదు; ఏ పదార్థమున్ను పరిణామమొందుటయులేదు; చిదాకాశమే తనయందీ పదార్థముల రూపమున వివర్తితమగుచున్నది.

న మహాకల్పకల్పాన్తసంవిదః సంవిదమ్బరే
సంభవన్తి పృథగ్రూపాః పయసీవ పయోన్తరమ్. 26

కల్ప, మహాకల్పములఁ గూర్చిన జ్ఞానములున్ను వాస్తవముగ లేనివేయగును. సముద్రమునఁ దరంగములవలె నివియన్నియు చిదాకాశమున వేఱుగానున్నట్లు భాసించుచున్నవి.

జగన్తి సన్త్యేవ న సన్తి శాన్తే చిదమ్బరే సర్వగతైకమూర్తౌ
నభోన్తరాణీవ మహానభోన్తశ్చిత్సన్తి సత్తాని పరామ్బరాణి. 27

ఘటాకాశాదులు మహాకాశ సత్తచే విద్యమానములై యుండునట్లును, తద్భిన్నమగు నిజదృశ్య రూపముచే లేక యుండునట్లును, అధ్యారోపదృష్టిచే చిత్-సత్తవలన చిద్రూపములై జగత్తులన్నియుసర్వత్ర విద్యమానములైయున్నవి. కాని, అపవాదదృష్టిచే చైతన్యమునకు భిన్నమగు రూపమున నెచట నేమియు లేదు.

వసిష్ఠ తద్గచ్ఛ మునే జగత్త్వం
త్వం చాసనే సంప్రతి శాన్తిమేహి
బుద్ధ్యాదిరూపాణి పరం ప్రజన్తు
వయం బృహద్బ్రహ్మపదం ప్రయామః. 28

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే శిలాన్తర్జగత్పితామహవాక్యాని నామ సప్తతితమః సర్గః ॥ 70 ॥

ఇక్కారణమున, ఓ వసిష్ఠమునీంద్రా! మీ రిపుడు మీ బ్రహ్మాండమునకుఁ బొండు! అట నేకాంతమునఁ బూర్వము కల్పింపఁబడిన నిజాసనమున సమాధిద్వారా విక్షేపరహితమగు ఆత్మసుఖము ననుభవింపుడు. నాచేఁ గల్పితములగు ఈ బుద్ధ్యాది జగద్రూపము లిపుడు ప్రళయముచే అవ్యక్తరూపమును బొందుగాక! మేమైతే యిపుడు పరబ్రహ్మపదమగు కైవల్యమును బొందఁబోవుచున్నాము.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున 'శిలాంతర్జగత్పితా మహవాక్యాని' యను డెబ్బదవ సర్గము ॥ 70 ॥

ఏకసప్తతితమః సర్గః

[కల్పనాహేవైధాత్రసంకల్పోపశమక్రమాత్
తత్కల్పినాం భూతానాం వర్ణ్యతే ప్రలయక్రమః

బ్రహ్మదేవుని సంకల్పశాంతివలన నాతనిచే గల్పితములగు భూతములయొక్క ప్రళయము సంభవించుట యిట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఇత్యుక్త్వా భగవాన్బ్రహ్మా బ్రహ్మలోకజనైః సహ
బద్ధపద్మాసనోఽనన్త సమాధానగతోఽభవత్. 1

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! భగవంతుఁడగు బ్రహ్మదేవుఁడిట్లు వచించి బ్రహ్మలోక నివాసులతోసహా బద్మాసనము వైచికొని మరల వ్యుత్థానము లేనట్టి సమాధియందుఁ దత్పరుఁడయ్యెను.

ఓంకారార్థోఽర్ధమాత్రాన్తః శాన్తనిశ్శేషమానసః
లిపికర్మార్పితాకార ఆసీదాశాన్తవేదనః. 2

ఓంకారముయొక్క యుత్తరార్ధమగు అర్ధమాత్రయందు చిత్తమును బూర్ణముగ లయింపఁజేయుటచే శాంతమానసుడై, సమస్తేంద్రియజ్ఞానరహితుడై, అతఁడపుడు చిత్తమందు లిఖింపఁబడినవాని చందమున నాయెను.

తమేవానుసరన్తీ సా తథైవ ధ్యానగా సతీ
వాసనాసీదశేషాంశా శాన్తా చాకాశరూపిణీ 3

ఆ బ్రహ్మదేవుని ననుసరించుచు, ఆ విద్యాధరి యను వాసనయు ఆ ప్రకారముగనే ధ్యానతత్పరయై పూర్ణముగ శమించిన రూపము గలదగుటచే ఆకాశరూపిణియైయుండెను.

పరమేష్ఠిన్యసంకల్పే తస్మింస్తానవమేయుషి
సర్వగానన్త చిద్వ్యోమరూపోఽ పశ్యమహం యదా 4

బ్రహ్మదేవుఁడు తన శరీరేంద్రియాది సమస్తమును ప్రణవముయొక్క అర్ధమాత్రయందుఁ గ్రమముగ లయింపఁజేసి, సంకల్పరహితుఁడై, సూక్ష్మభావమును బొందియుండ నంత నేనున్ను సమాధిచే సర్వవ్యాపకమై, అనంతమైనట్టి చిదాకాశరూపుఁడనై యా రహస్యమంతయుఁ గాంచితిని.

యావత్సంకల్పనం తస్య విరసీ భవతి క్షణాత్
తథైవాశు తథైవోర్వ్యాః సాద్రిద్వీపపయోనిధేః. 5

తృణగుల్మలతాశాలినముద్భవనశక్తితా
సమస్తైవాస్తమాగన్తుమారబ్ధా చ శనైః శనైః. 6

ఆ క్షణము మొదలుకొని బ్రహ్మదేవుని సంకల్పమే యే రీతి క్షీణము కాఁజొచ్చెనో ఆయా రీతి పర్వత, ద్వీప, సముద్రాది సహితమగు పృథివియొక్క సమస్తతృణ, లతా, ధాన్యాదుల యుత్పత్తిశక్తియు మెల్లమెల్లగ క్షీణింపఁదొడఁగెను.

కిల తస్య విరాడాత్మరూపస్యాఙ్గైకదేశతామ్
సా బిభర్తి మహీ తేన తదసంవేదనోదయాత్. 7

విచేతనా సా విరసా బభూవ పరిజర్జరా
మార్గశీర్షాన్తవల్లీవ జరావిధురతాం గతా. 8

పృథివి, విరాడ్రూపుఁడగు ఆ బ్రహ్మదేవుని అవయవముయొక్క ఏకదేశమగుటఁబట్టి, అతని సంకల్పము శమింప నారంభించినంతనే యదియుఁ జేతనరహితమై, మార్గశిర మాసాంతమందు శుష్కించి, శిథిలమైపోవు లతవలె, రసహీనమై, జర్జరీభూతమయ్యెను.

యథాస్మాకమసంవిత్తేరఙ్గాలీ విరసా భవేత్
తథా విరించిసంవిత్తేర్ధరా వైధుర్యమాగతా. 9

చైతన్యస్ఫురణ లేనపుడు మన అవయవ సమూహము నీరసమగునట్లు, బ్రహ్మదేవుడు సమాధియందు నిశ్చలుఁడైయుండ, పృథివియు నీరసమయ్యెను.

సంపన్నా సంహతానేకమహోత్పాత భరావృతా
దుష్కృతాఙ్గారనిర్దగ్ధనరకోన్ముఖమానవా. 10
దుర్భిక్షాకాణ్డదౌస్థిత్యదైన్యదారిద్ర్య దుర్భగా

దుశ్శీలాశేషవనితా నిర్మర్యాదనరావృతా. 11

పాంసుప్రమన్దనీహార ధూలి ధూసరసూర్యకా
ద్వన్ద్వమూర్ఖమహాదుఃఖివ్యసనివ్యాధితాకులా. 12

అగ్నిదాహ జలాపూరయుద్ధప్రోచ్ఛిన్నమణ్డలా
అవృష్ట్యవగ్రహోన్నష్టకష్టచేష్టితపామరా. 13

అశఙ్కితమహోత్పాతపతత్పర్వతపత్తనా
శిశుశ్రోత్రియమున్యార్యగుణినాశరుదజ్జనా. 14

అశఙ్కిత స్థలీమధ్యసంజాతాగాధకూపకా
వర్ణసంకరనారీణామాసక్తజనభూమిపా. 15

అట్టశూలాఖిలజనా శివశూలచతుష్పథా
కేశైకశూలవనితా పాత్రశూలజనేశ్వరా. 16

అత్తఱి యేకకాలముననే పృథివి యనేకదుశ్శకునములచేఁ బూర్ణమై, పాపాగ్నిచే భస్మీభూతమై, నరకోన్ముఖులగు మనుజులతోఁ గూడినదై, క్షామములచేతను, ఆకస్మికముగ సంభవించిన రాజు చోరాదుల యుపద్రవములచేతను దీనత్వ దారిద్ర్యాదులచేతను దుర్భాగ్యవతియై, దుష్టశీలము గల స్త్రీలచేఁ బరిపూర్ణమై, మర్యాదాహీనులగు మనుజులచే నావృతమై, ధూళివలె మలినమైనట్టి మంచుచేతను, ధూళిచేతను ధూసరమైనట్టి సూర్యుఁడు గలదై, శీతోష్ణాది ద్వంద్వములను నిరసింపలేని మూర్ఖులచేతను, మహాదుఃఖులచేతను, దుర్వ్యసనశీలురచేతను, రోగులచేతను వ్యాకులమై, అగ్ని దాహ, జల ప్రవాహ, యుద్ధాదులచే నుచ్ఛిన్నములైన ప్రదేశములు గలదై, అతివృష్టి, అనావృష్టులచే నశించినవారును, కష్టమైనట్టి చేష్టలతోఁ గూడినవారునగు పామరజనులతోఁగూడినదై, ఆకస్మికమగు గొప్ప యుత్పాతముచేఁ గ్రిందఁబడినట్టి పర్వత, నగరాదులు గలదై, శిశువుల యొక్కయు, శ్రోత్రియులయొక్కయు, మునులయొక్కయు, విద్వాంసులయొక్కయు, గుణవంతుల యొక్కయు నాశముచే నేడ్చుచున్నట్టి జనులు గలిగియున్నదై అకస్మాత్తుగ స్థలమధ్యమున నేర్పడిన యగాధకూపములచే వ్యాప్తమై, వర్ణసంకరులగు స్త్రీలయందాసక్తులైనట్టి రాజులతోఁ గూడినదై, వర్ణాశ్రమధర్మముల నుల్లంఘించు సర్వప్రజలచేఁ బరిపూర్ణమై, సుంకము తీసికొని [illegible] మొదలుగాగల మార్గచతుష్టయముతోఁ గూడిన జనులు గలదై, వ్యభిచారిణులగు స్త్రీలచేఁ బూర్ణమై, పన్ను తీసికొని జీవించెడి రాజులచే వ్యాప్తమై యొప్పెను.

దుఃఖశూలసమాచారా ద్వన్ద్వశూలాఖిలప్రజా
అధర్మశూలవనితా పానశూలజనేశ్వరా. 17

అధర్మశూలవలితా కుశాస్త్రశతశాలినీ
దుర్జనాఖిలవిత్తాఢ్యా విపద్విహతసజ్జనా. 18

అనార్యవసుధాపాలా తదనాదృతపణ్డితా
[illegible]మోహభయద్వేషరాగరోగరజోరతా. 19

అప్యన్యగామిపురుషా రుషాభిహతసద్విజా
అనారతపరాక్రన్ద ఖరాపర్యన్త పామరా. 20

దస్యూత్పన్నపురగ్రామదేవద్విజసమాశ్రయా
ఆపాతమధురారమ్భదుఃఖదోదరభఙ్గురా. 21

అలసోల్లాసవిలసత్కార్యవైధుర్యధర్మిణీ
సర్వాపదుపతాపాన్తా క్రమేణోత్పన్నదిగ్గణా. 22

భస్మశేషపురగ్రామా నిర్జనాఖిలమణ్డలా
రోరూయమాణభస్మాభ్ర కుణ్డలోడ్డామరామ్బరా. 23

దుర్భగాడమ్బరారమ్భరోదనోరురవోదరీ
ముష్టిప్రమాణజనతా జనతాపానుషఙ్గిణీ. 24

మఱియు నపుడు పృథివి దుఃఖములచే రోదనము గల్గించు సమాచారములచేఁ బూర్ణమైఁ శీతోష్ణాదిద్వంద్వములచే, బీడితులగు జనులుగలదై అధర్మముచే జీవిక యొనర్చు స్త్రీలతోఁగూడినదై మద్యపానముచే బాధితులగు రాజులు గల్గియున్నదై, అధర్మముచే నాక్రందనతత్పరులగు ప్రజలు గలదై, సర్వుల ధనాపహరణముచే ధనవంతులైనట్టిచోరాది దుర్జనులతోఁ గూడినదై, విపత్తులచే నశించిన సజ్జనులుగలదై, అనార్యులగు రాజులచే వ్యాప్తమై, అట్టి దుష్టరాజులచే అనాదరింపఁబడిన పండితులు గల్గియున్నదై, రాగద్వేషలోభమోహభయాది రోగములచేఁ బీడితులగు జనులతోఁ గూడినదై, స్వధర్మమును త్యజించి పరధర్మమును గ్రహించు మనుజులచేఁ బూర్ణమై, క్రోధముచే నుత్తమద్విజులను అనాదరించునట్టి దుర్జనులుగలదై, ఎల్లపుడితరుల నేడ్పించుటయందు ప్రీతిగొను పామరులచే, బరిపూరితమై, చోరాదులచే భిన్నభిన్న మొనర్పబడిన నగర, గ్రామ, దేవాలయ, బ్రాహ్మణ నిలయములుగలదై, అన్యాయార్జిత ధనముచేఁ గుటుంబపోషణ యొనర్చుచు ప్రారంభమున నల్పసుఖమునొంది పరిణామమందును, పరలోకమందును దుఃఖమనుభవించు అల్పాయువు గల మనుజులచేఁ బూర్ణమై, సోమరితనముయొక్క విలాసముచే సంధ్యావందనాది కర్మలను మానినట్టి ధార్మికులతోఁ గూడినదై, చివర కనేక ఆపదలను, రోగములను బొందునట్టి జనులుగలదై, క్రమముగ ఛిన్నమైనట్టి దిఙ్మండలములచేఁ బూర్ణమై భస్మము మాత్రము శేషించినట్టి పుర, గ్రామములు గల్గియున్నదై. నిర్జనములైన సమస్తమండల ప్రదేశములుగలదై, నిరంతరరోదన తత్పరులగు ప్రజలతోఁ గూడినదై, భస్మమయములగు మేఘములచే భయంకరమైనట్టి యాకాశము గలదై, అభాగ్యులగు మనుజులయొక్క రోదనముచేఁ బరిపూర్ణమై, చౌర్యమందుఁ బ్రవీణులగు జనసమూహములచే వ్యాప్తమై, మనుజుల సంతాపముతోఁగూడినదై యుండెను.

నీరసాశేషదేశాన్తా సర్వర్తుగుణవర్జితా
ఇత్యస్య పార్థివే ధాతౌ బ్రహ్మణో గతవేదనే. 25

పృథివీ పృథువైధుర్యా సంపన్నాసన్ననాశతః
అథ తత్సంవిదున్ముక్తో జలధాతుః క్షయోన్ముఖః 26

ఈ ప్రకారముగ బ్రహ్మదేవుని విరాట్ - దేహమందలి చైతన్యము ఉపసంహరింపబడుటచేతను, ప్రళయ మేతెంచుటచేతను, పృథివి రసహీనమై, సర్వబుతు గుణవర్జితమై యొప్పెను. పిదప జలధాతువున్ను చైతన్యము గోల్పోవుచు క్షయోన్ముఖమయ్యెను.

యదా విక్షుభితాత్మాసీత్తదా నియతిలఙ్ఘనాత్
సముత్సార్యార్యమర్యాదామర్ణవా వివృతార్ణసః. 27

ప్రవృత్తా వికృతిం గన్తుమున్మత్తా ఇవ రావిణః
వీచివిక్షోభవిన్యాసైర్వేలావిపినలావకాః. 28

కల్లోలవలనావర్త వివర్తోద్వర్తితాశ్రయాః
మహాభ్రభ్రమ దుత్తుఙ్గతరఙ్గాత్తనభోదిశః. 29

బృహద్గులుగులావర్తగర్జనోద్రవకన్దరాః
సీకరౌఘమహారమ్భఘనసంవలితాచలాః. 30

చలచ్చల చలద్వీరమకరాఘూర్ణితాన్తరాః
ఉల్లసన్మకరాక్రాన్తద్రుమకాననితోదరాః. 31

దరీవిదారణభ్రష్టసింహాహతజలేచరాః
ఊర్మ్యుదస్తమహారత్నఖరతారకితామ్బరాః. 32

ఉత్ఫాలమకరచ్ఛన్ననభశ్చరబృహద్ఘనాః
పస్పరోర్మిసంఘట్టఝాంకారకటుటాంకృతాః. 33

తరత్తరలమాతఙ్గఫూత్కారాధౌతభాస్కరాః
అన్యోన్యవేల్లనవ్యగ్రప్రవిదీర్ణాద్రిభిత్తయః. 34

అత్తఱి చైతన్యాభావముచే జలధాతువు విక్షుబ్ధముకాఁగా సముద్రములన్నియు నియతియొక్క యుల్లంఘనముచే హద్దునువీడి విశాలరూపముఁ జెందును. మఱియు, అపుడా సముద్రములు, వికారమునొందఁ బ్రవృత్తములై, ఉన్మత్తులవలె శబ్దమొనర్చుచు, తమ తరంగ విక్షోభ విలాసములచే తీరమందలి యరణ్యములను ఛేదింపఁజొచ్చెను. అయ్యవి తరంగ వేష్టనములచేతను, ఆవర్తముల చేతను జలచర జీవులను గలవరపెట్టఁ దొడఁగెను. మహామేఘములచేతను, చలించు యెత్తైన తరంగములచేతను నాకాశమును, దశదిశలను వ్యాప్తమొనర్పసాగెను. మఱియు, ఆ సముద్రములపుడు గుడగుడా శబ్ద మొనర్చు గొప్ప యావర్తముల గర్జనలచే పర్వతగుహలను శబ్దసహితములుగఁ జేయునవియు జలధారలను వర్షింప నారంభించు మహామేఘములచేఁ బర్వతములను ముంచునవియు, చంచల తరంగముల కంటెను ముందుగఁబోవు బలవంతములైన మొసళ్ళచే సంక్షుబ్ధములైనట్టి లోభాగములుగలవియు, ఉల్లాసముతో గూడిన మొసళ్ళచే గొప్ప యరణ్య మధ్యప్రదేశములఁగూడ నాక్రమించునవియు, విచ్ఛిన్నములైన గుహలనుండి బయల్వెడలిన సింహములచేఁ జంపఁబడిన జలచరజీవులు గలదియు, తరంగములచేఁ బైకెగుర గొట్టఁబడిన రత్నములచే నాకాశమును నక్షత్రములచేవలె శోభిత మొనర్చునవియు, పైకెగరుచున్న మకరాదులచే నాకాశచారులను, మహామేఘములను గప్పునవియు తరంగముల పరస్పర సంఘట్టనముచే గలిగిన

ఝాంకారరవములచే కఠోరశబ్దయుక్తములైనవియు, చంచలములైన గజములఁ బోలిన గొప్ప మకరాదుల పూత్కారముచే సూర్యమండలములఁగూడ కడుగునవియు, పరస్పర వేష్టనమును గూర్చిన వ్యగ్రత్వముచేఁ బర్వతములను గోడలఁగూడఁ బగులఁగొట్టునవియునై యొప్పుచుండెను.

తటపర్వతలుణ్ఠాకతరఙ్గకరమణ్డలా
గర్జద్గిరిదరీగేహవిశదున్మత్తవారయః. 35

భూపాః పరపురాక్రాన్తా లగ్నా ఇవ హతారయః
తారారవరణద్గేహవిద్రావితనభశ్చరాః. 36

ప్రలుణ్ఠితవనవ్యూహలూనకానవితామ్బరాః
సపక్షపర్వతాకారతరఙ్గాపూరితామ్బరాః. 37

మహారవమరుచ్ఛిన్నకల్లోలాచలచాలితాః
చఞ్చత్తీరగిరివ్రాతపతత్తటరటజ్జలాః. 38

ఉల్లసద్విపులావర్తప్రోక్షిప్తమకరోత్కరాః
విమజ్జన్నిస్తలావర్తనిగీర్ణగిరికన్దరాః. 39

దరీదలనసంప్రాప్తధృషద్దశనదన్తురాః
శృఙ్గలమ్బిదరీప్రాప్తమగ్నవీచిజలేభకాః. 40

మఱియు, ఆ సముద్రములపుడు తీరస్థపర్వతములను దోచుకొనిపోవుటకై ఉన్మత్తజలములతో గూడి తత్పర్వతగుహలను గృహములందుఁ బ్రవేశించునవియు రాజులవలె నితరుల నగరములను నాక్రమించునవియు, తమ విరోధియగు దావాగ్నిని నశింపఁజేయునవియు, గొప్ప శబ్దముగలిగిన తరంగములచే దేవలోకమునుండి దేవతలను బరువిడఁజేయునవియు, తరంగములచే బైకితేఁబడిన వనసమూహములచే నాకాశమును ఛిన్నారణ్యమువలె గావించునవియు ఱెక్కలుగల్గిన పర్వతములవంటి యెత్తైన తరంగములచే నాకసమును బూర్ణమొనర్చునవియు, గొప్ప శబ్దముతోఁ గూడిన వాయువుచే ఛిన్న భిన్నములైన యున్నత తరంగములను బర్వతములచేఁ జలింపఁబడునవియు, రత్నాదుల ప్రకాశముచేఁ బ్రకాశింపఁబడిన తీరమందలి పర్వతసమూహములనుండి పడుచున్న శిఖరములచే శబ్దితమైనట్టి జలము గలవియు ఉల్లాసయుక్తములగు గొప్ప యావర్తములచే మకరాది జీవసమూహములను విసరునవియు, అగాధములగు ఆవర్తములచే ననేక పర్వతగుహలను మ్రింగునవియు, గుహలయొక్క ఖండనముచే లభించిన స్ఫటికమణులను దంతములతో గూడి నవ్వుచున్నట్లున్నవియు, పర్వతశిఖరములందలి విశాల గుహలందుఁ బ్రవేశించిన తరంగజలచరజీవులు గలవియునై వర్తించుచుండెను.

వ్యాలోలవలనాక్రాన్తవిటపిప్రోతకచ్ఛపాః
యమేన్ద్ర పసుధావాహ్లాదయత్కర్ణైర్భయవిహ్వలైః. 41

క్రోశాయమాణపతచ్ఛైలతటీకటకటారవాః
మత్స్యపుచ్ఛచ్ఛటాచ్ఛిన్నమగ్నోన్మగ్నద్రుతాద్రయః. 42

లీలాలూనవనవ్యూహశీతలాసారవారయః
ప్రజ్వలద్వడవావహ్నిజ్వాలావలిమిలజ్జలాః. 43
సరసేన విభోర్నాశైర్విశజ్కితమహానలాః
మిలచ్ఛిఖరిమాలాగ్రగజలమాతఙ్గయోధినః. 44
నృత్యన్తీవ తరఙ్గౌఘైర్జలావలనవేధినః
జలాచలాచలాన్యోన్యసంఘట్టస్ఫోటపణ్డితాః. 45
బృహద్గిరి వనవ్రాతప్రాణిమణ్డలమణ్డితాః
ఉడ్డామరవసేభేన్ద్రభేరీవాదనఖాసురైః. 46
అసురైరివ పాతాలం కల్లోలైరలమాకులాః

ఇఁకను, ఆ సముద్రములపుడు చంచలతరంగములను వేష్టనములచే నాక్రమింపఁబడిన వృక్షములందుఁ దగుల్కొని నట్టి తాబేళ్లుగలవియు, భయముచే వ్యాకులములై చెవులను బైకెత్తినట్టి యమ, ఇంద్ర, వసుధలయొక్క వాహనములగు మహిష, ఐరావత, దిగ్గజములతో గూడియున్నవియు, పడుచున్న పర్వత తటములవలన వినఁబడుచున్న కటకటా శబ్దములచేఁ బూర్ణమైనవియు, మత్స్యముల పుచ్ఛసమూహములచే ఛిన్నమైమునుఁగుచు, పైకెగయుచు, వేగముగ జను బర్వతములు గలవియు, సులభముగ ఛేదించివైచినట్టి వనసమూహములందు విశ్రాంతిగొను శీతలజల ధారలు గల్గియున్నవియు, దేదీప్యమాన మగు బడబాగ్నియొక్క జ్వాలలందు మిశ్రితమైనట్టి జలముతోఁ గూడియున్నవియు, జలముచే తన ఆశ్రయమగు ఇంధనమును నశింపఁజేయఁబడుటచే భీతిల్లినట్టి బడబాగ్నిగలవియు, పర్వత సమూహముల యగ్రభాగములపై స్థల - గజములతో గలియుచున్న యుద్ధాభిలాషులగు జల – గజములచే వ్యాప్తమైయున్నవియు, జలములయొక్కయు, పర్వతములయొక్కయు, బరస్పరసంఘట్టన, స్ఫోటనశబ్దములందుఁ బ్రవీణములై తరంగ సమూహములచే నృత్యమొనర్చుచున్నవియు, గొప్ప గొప్ప పర్వతములచేతను, వనములచేతను, ప్రాణి సమూహములచేతను శోభాయమానములై యున్నవియు, నీటి పైకి తేల్చఁబడిన మరణించిన వనగజములయొక్క శరీరములను భేరీలపైఁ దరంగాగ్రములయొక్క తాడనములచే జనించిన వాదనములచే మనోహరమైనవియు, గొప్పతరంగములను ఆసురులచేఁ బాతాళమువలె మిగుల కలఁత నొందినవియునై యొప్పుచుండెను.

అథోదపతదున్నాసదిఙ్నాగవదనధ్వనిః. 47
పాతాలతలతాల్వన్తర్విస్ఫోటామోటనోద్భటః
చఞ్చలాచలకీలోర్వీ చచాల క్షణచాలితా. 48
లోలా శైవాలవల్లీవ వ్యాలోలామ్భోఖిలక్షితా
అథ దుర్వార నిర్ఘోష నిర్వాణాడమ్బరాన్వితా. 49
పుష్పోటేవ పతన్తి ద్యౌర్దిశాం పతిరవారవైః
ఆవర్తవలనాకారాః కేతవః పేతురమ్బరాత్. 50

హేమరత్నమయా ముక్తాః సిన్దూరభుజగా ఇవ
కకుభ్యో నభసో భూమేరుదగుర్దగ్ధదిక్తటాః 51
చలజ్జ్వాలాజటాటోపా వివిధోత్పాతపఙ్క్తయః

సముద్రములయొక్క సంక్షోభానంతర మచటఁ గొట్టుకొనిపోవుచు, తొండములఁ బైకెత్తినట్టి దిగ్గజములయొక్క శబ్దము వినిపించెను. ఆధ్వని పాతాళమను తాలుప్రదేశమును భేదించుటచేతను, ఏకరూపమై వెలువడుటచేతను, నతిగంభీరమై యుండెను. అత్తఱి, దిగ్గజములచే ధరింపఁ బడునట్టి పృథివి చంచలములైన, మేరుపర్వతాది కీలము (చీల) లు గలదై, క్షణకాలములోనే స్వస్థానమునుండి చలింపఁబడినదై, చంచలసముద్రములచేఁ నాక్రమింపఁబడినదై, నాచుతీఁగెవలె, జనించుచుండెను. తదుపరి యాకాశము దుర్వారములగు ప్రళయకాల మేఘశబ్దముల యాడంబరములతోఁ గూడినదై, దిక్కుల ప్రతిధ్వనులచే విరిగిపడుచున్నదా యనిపించుచుండెను. పిదప అవర్తములవంటి యాకృతిగలవియు, నాశహేతువులునగు ధూమకేతువు (తోకచుక్క) లాకసము నుండి పడఁజొచ్చెను. మఱియు, సువర్ణ, రత్నములవంటి వర్ణముగలవియు, రక్తవర్ణపుసర్పములఁ బోలినవియు, దిక్కులను భస్మీభూత మొనర్చునవియు, దేదీప్యమానములగు మహాజ్వాలాయుక్తములు నగు పలువిధ ఉత్పాత అగ్నిసమూహములు సర్వదిక్కులనుండియు, అకసమునుండియు భూమినుండియు, బయల్వెడలెను.

పృథ్వ్యాదీనిసురాదీని బ్రహ్మోన్ముక్తాని సర్వతః. 52
ద్వివిధాని మహాభూతాన్యలం సంక్షోభమాయయుః
చన్ద్రార్కానిలశక్రాగ్నియమాః కోలాహలాకులాః. 53
పరిపాతపరా ఆసన్బ్రహ్మలోకగతేశ్వరాః
కమ్పైః కటకటారావపతత్పాదపపఙ్క్తయః. 54
భూమేరన్వభవన్భూరిదోలాన్దోలనమద్రయః
భూకమ్పలోలకైలాసమేరుమన్దరకన్దరాః
పేతుః కల్పతరూన్ముక్తా రక్తస్తబకవృష్టయః. 55

ఈ ప్రకారముగ బ్రహ్మదేవుని సంకల్పోపసంహారముచే నుపేక్షింపఁబడిన పృథ్వ్యాదులు, అసురాదులను నిరువిధములగు మహాభూతములున్ను నంతట మిగుల సంక్షోభమును బొందినవాయెను. చంద్ర, సూర్య, వాయు, ఇంద్ర, అగ్ని, యమాది దేవతలున్ను, ఆకోలాహలముచే వ్యాకులత్వమొందిరి. బ్రహ్మలోకమును బొందిన యీశ్వరుఁడే తమతమ అధికార నిర్వాహకమగు ప్రభావముగాఁ గల్గిన దేవతలును అధఃపతనమునఁ దత్పరులైరి. కంపనములతోడను, కటకటాశబ్దములతోడను వృక్షసమూహములు క్రిందఁబడసాగెను. భూకంపముచేఁ జంచలములైన కైలాస, మేరు, మందరాది పర్వతములు భూమియొక్క తీవ్రఆందోళనముల ననుభవించెను.

లోకాన్తరాద్రి పురావారిధికాననాన్త
ముత్పాతకల్పపవనేన మిథో హతానామ్
కోలాహలైర్జగదభూత్ప్రవికీర్ణశీర్ణం
పూర్ణార్ణవే త్రిపురపూర ఇవాఖిపాతీ. 56

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే
మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే
కల్పక్షోభవర్ణనం నామ ఏకసప్తతితమః సర్గః ॥ 71 ॥

ఓ రామచంద్రా! రుద్రుని బాణాగ్నిచే నంతటను పతనశీలములై మెలఁగిన త్రిపురములందలి దైత్యులవలె, అపుడా ప్రలయకాలపు పూర్ణమహాసముద్రమున లోకలోకాంతర. పర్వత, నగర, జల అరణ్యాదియుక్తమగు సమస్త జగత్తున్ను నాశకరమగు కల్పాంతవాయువుచేఁ బరస్పరము హతులగుచున్న ప్రాణుల కోలాహలములతోఁగూడి ఛిన్నభిన్నమై, శైథిల్యమొందినదాయెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున
నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున కల్పక్షోభ
వర్ణనమను డెబ్బదియొకటవ సర్గము ॥ 71 ॥

ద్విసప్తతితమః సర్గః

[ధాతుః ప్రాణనిరోధేన వాతస్కంధస్థితిక్షయః
తత్రప్రసఙ్గాత్పునః పృష్టా వర్ణ్యతేఽగ్రే విరాట్స్థితిః.,

బ్రహ్మదేవుని ప్రాణనిరోధముచే వాయుసమూహస్థితియొక్క క్షయమగుట, అ ప్రసంగమునఁ బ్రశ్నించిన మీదట విరాట్స్థితినిగూర్చి వర్ణించుట యిటఁగాననగును.]

శ్రీవసిష్ఠ ఉవాచః—

అథాకృష్టవతి ప్రాణాన్స్వయంభువి నభోభువః
విరాడాత్మని తత్యాజ వాతస్కన్ధస్థితిః స్థితిమ్. 1

తే హి తస్య కిల ప్రాణాస్తేన క్రాన్తేషు తేష్వపి
ఋక్షచక్రేస్థితిం కోఽన్యో ధత్తే భూతైకధారిణీమ్. 2

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! పిమ్మట విరాడ్రూపుఁడగు బ్రహ్మదేవుఁడు తన ప్రాణముల నుపహరింప, అపుడు వాయువు గ్రహనక్షత్ర విమానాదులను ధరించునట్టి నియతిని వీడెను. ఏలయనిన, ఆ వాయువులు ఆ బ్రహ్మదేవుని ప్రాణములైయున్నవి. గావుననయ్యవి యుపసంహరింపఁబడ నిఁక సమస్తభూతములను ధరించునట్టి నక్షత్రమండలముయొక్క స్థితి నెవరు ధరింపఁగలరు?

వాతస్కన్ధే సమాక్రాన్తే బ్రహ్మణా ప్రాణమారుతే
సమం గన్తుం పరిత్యజ్య సంస్థితిం క్షోభమాగతే. 3

ఇక్కారణమున, ప్రాణవాయు స్వరూపమగు వాతస్కంధము (వాయుసమూహము) ను బ్రహ్మదేవుఁ డెపుడుగసంహరించునో, అపుడు తోడనే సంక్షోభ ముడయించుటచే సర్వులు తమ తమ స్థితిని గోల్పోవ నారంభించిరి.

నిరాధారాః సవాతాగ్నిదాహోల్మకవదాపతన్
వ్యోమ్నస్తారాస్తరోః పుష్పనికరా ఇవ భూతలే. 4

కాలపాకచలన్మూలా జగత్ఖణ్డ ఫలాలయాః
ప్రశాన్తపవనాధారా విమానావలయోఽపతన్. 5

ప్రలయోన్ముఖతాం యాతే బ్రాహ్మే సంకల్పనేన్ధనే
సిద్ధానాం గతయః శేమురిద్ధానామర్చిషామివ. 6

ప్రభ్రమన్త్యోఽమ్బరే కల్పమారుతైస్తనుతూలవత్
స్వశక్త్యపచయే మూకాః సిద్ధసంతతయోఽపతన్. 7

సంకల్పద్రుమజాలాని సేన్ద్రాదినగరాణి చ
హేతుర్భూకమ్పలోలస్య శిరాంస్యమరభూభృతః. 8

ఆ తఱి వాయుసహితమగు అగ్నిదాహ మారంభముకాఁగా, ఎగురుచున్న కొఱవులఁ బోలిన నిరాధారములగు నక్షత్రములు, వృక్షమునుండి పుష్పసమూహమువలెఁ గ్రిందఁ బడ దొడఁగెను. మఱియు జగత్తునందు సంపాదించిన సుకృతఫలముయొక్క భోగస్థాన భూతములగు విమానపంక్తులు కాలవిపాకముచే విచ్ఛిన్నమైన భోగమూలమగు కర్మగలవై క్రిందఁ బడఁజొచ్చెను. బ్రహ్మదేవుని సంకల్పరూపమగు ఇంధనము ప్రళయాభిముఖమగుటచే, ఇంధనముల అభావముచే ప్రదీప్తమగు అగ్నిజ్వాలవలె సిద్ధుల గతి శమించిపోయెను. తమ తమ శక్తులు నశింప సిద్ధ సమూహములు ప్రళయ వాయువులచే దూదివలె నాకసమున పరిభ్రమించుచు వచనవ్యాపారమందునుగూడ నశక్తులై క్రిందఁబడఁ దొడఁగిరి. మరియు నపుడు భూకంపముచేఁ జంచలమైనట్టి సుమేరు పర్వతముయొక్క కల్పవృక్ష సమూహముల తోడను, ఇంద్రాదుల నగరములతోడను గూడిన శిఖరములు పడఁజొచ్చెను.

శ్రీరామ ఉవాచః—

చితి సంకల్పమాత్రాత్మా విరాడ్ బ్రహ్మా జగద్వపుః
కిమఙ్గం యస్య భూలోకః కిం స్వర్గః కిం రసాతలమ్. 9

శ్రీరాముడు:— మహాత్మా! విరాట్టున్ను, బ్రహ్మాండశరీరకుఁడునగు బ్రహ్మదేవుఁడు చైతన్యముయొక్క సంకల్పమాత్ర స్వరూపుఁడని ప్రసిద్ధమైయున్నది. అట్టిసంకల్పమాత్రమై, నిరాకారమైనట్టి శరీరముగలవానికి సాకారములైన భూరాదిలోకములు అవయవములెట్లగును? ఒకవేళ యట్లు సంభవించినచో, భూలోక మాతని ఏఅవయవము? స్వర్గ, రసాతలములు ఏ అవయవములు?

కథమేతాని చాఙ్గాని బ్రహ్మంస్తస్య స్థితాని చ
కథం వా సోఽన్తరే తస్య స్వస్యైవ వపుషః స్థితః. 10

ఈవిశాలమైన సమస్తలోకములను అవయవము లాతనియందెట్లున్నవి? మఱియు నాతఁడున్ను బ్రహ్మాండమను దన శరీరములోపల సత్యలోకమున యెట్లు స్థితిఁగల్గియున్నాఁడు?

బ్రహ్మా సంకల్పమాత్రాత్మా నిరాకృతిరిదం స్థితమ్
జగదిత్యేవ జాతో మే నిశ్చయః కథయేతరత్. 11

మహాత్మా ! బ్రహ్మదేవుఁడు సంకల్పమాత్రుడనియు, నిరాకారుఁడనియు, ఈ జగత్తు సాకారమనియు నానిశ్చయమైయున్నది. అట్లుగాక మఱియొక ప్రకారమేదైనయున్నచో సెలవిందు

శ్రీవసిష్ఠ ఉవాచః—

ఆదౌ తావదిదం నాసన్న సదాస్తే నిరామయమ్
చిన్మాత్రపరమాకాశ మాశాకోశైకపూరకమ్. 12

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా ! సృష్ట్యాదియం దీ జగత్తు సత్తుకాదు, అసత్తుకాదు, సర్వదిశలను బరిపూర్ణ మొనర్చునట్టి నిరామయమైన పరమాకాశ రూపమగు చిన్మాత్రమైన బ్రహ్మమే యైయున్నది.

తత్స్వమాకాశతాం చైతచ్చేత్యమిత్యవబుధ్యతే
స్వరూపమత్యజన్నిత్యం చిత్త్వాద్భవతి చేతనమ్. 13

ఆ పరమాకాశము తన స్వరూప మెపుడును ద్యజింపకయే, చంద్రుఁడు ద్వితీయ చంద్రుని యెఱుఁగునట్లు, తన చిదాకాశత్వమును తనకంటె వేఱుగనున్న వస్తువు (చేత్యము, లేక దృశ్యము) వలె నెఱుఁగుచున్నది. కావున అదియువాస్తవముగ చైతన్యరూపమేయగుటచే, చేతనమనఁబడుచున్నది.

విద్ధి తచ్చేతనం జీవం సఘనత్వాన్మనః స్థితమ్
ఏతావతి స్థితిజాలే న కించిత్సాకృతి స్థితమ్. 14

ఓ రామచంద్రా ! చిదాకాశమున జ్ఞాతృజ్ఞానజ్ఞేయ రూపమగు త్రిపుటియొక్క మననముచే ఘనీభావము వలన మనోరూపముగ స్థితినొందియున్న యా చేతనమును జీవుఁడని యెఱుఁగుము. కాని యింత త్రిపుటీసమూహము యొక్క యధ్యాసము సంభవించినను, ఆ చిదాకాశమందు వాస్తవముగ సాకారత్వ మేమియు లేకయేయున్నది.

శుద్ధం వ్యోమైవ చిద్వ్యోమ స్థితమాత్మని పూర్వవత్
యదేతత్ప్రతిభాతం తు తదన్యన్న శివాత్తతః. 15

త్రిపుటి జనింపక పూర్వమువలె, జనించినపిదపయు ఆ చిదాకాశము తనయందు చిదాకాశముగనే నెలకొనియున్నది. ఈ భాసించునదియంతయు శివరూపమగు పరమాత్మకంటె వేఱుకాదు.

అథ తన్మన ఆభోగి భావితాహంకృతి స్ఫురత్
సంకల్పాత్మకమాకాశమాస్తే స్తిమితమక్షయమ్. 16

పిమ్మట, ఆ విశాలమగు సంకల్పరూపమైన మనస్సునందు, అభిమానరూపమగు భావనచే 'అహంకారము' స్ఫురించుచున్నది. కాని వాస్తవముగ నది నిశ్చలమై, నాశరహితమైనట్టి చిదాకాశమేయైయున్నది.

తత్సంకల్ప చిదాభాసనభోఽహమితి భావితమ్
అసత్తమేవానుభవత్సంనివేశం ఖమేవ ఖే. 17
వేత్తి భావితమాకారం పశ్యత్యనుభవత్యపి
సంకల్పకాత్మకం శూన్యమేవ దేవ ఇతి స్థితమ్. 18

తదుపరి యా సంకల్పరూపుఁడగు చిదాభాసుఁడు 'నేనాకాశ రూపుఁడనని' భావించుటచే, చిదాకాశమే చిదాకాశమున, ఆ అసత్తగు అకారము ననుభవించుచున్నది. అట్లే యా సంకల్ప రూపుఁడగు చిదాభాసుఁడు శూన్యమునే దేహాకారముగ భావించుటచే నట దేహమును జూచుచు, ఎఱుఁగుచు, ననుభవించుచున్నాఁడు.

శూన్యమేవ యథాకారి సంకల్పనగరంభవాన్
పశ్య త్యేవమజో దేవం ఖే ఖమేవానుభూతవాన్. 19

ఓ రామచంద్రా ! శూన్యమునే సంకల్పనగరాదులుగ నీవెట్లుగాంచుచున్నావో, అట్లే చిదాకాశరూపమగు జన్మాదిరహితమైన బ్రహ్మమున్ను శూన్యమగు యాకాశమునే దేహరూపముగఁ గాంచుచున్నది. కాని వాస్తవముగ నది చిదాకాశమున చిదాకాశమునే యనుభవించుచున్నదగును.

సంవిదో నిర్మలత్వాత్స యావదిత్తం తథావిధమ్
అనుభూయానుభవనం స్వేచ్ఛయైవోపశామ్యతి. 20

జ్ఞానముయొక్క నిర్మలత్వముచే ఆ పరమాత్మ స్వసంకల్పిత జగత్తుననుభవించి, పిమ్మట తన యిచ్ఛచేతనే యద్దానిని శమింపఁ జేయుచున్నాఁడు.

యదా తత్త్వపరిజ్ఞానమస్మదాదేస్తదాతతమ్
ఇదం నంవరణం విద్ధి శూన్యం సత్యమివ స్థితమ్. 21

ఓ రామచంద్రా ! మనయందెవరికి ఎపుడు బ్రహ్మతత్త్వముయొక్క వాస్తవపరిజ్ఞానము కలుగునో, అపుడాతనికి జగత్తు దృశ్యశూన్యముగను, వ్యాప్తమై సత్యమైనట్టి చిదాకాశ మాత్రముగను గన్పించునని యెఱుఁగుము.

యథా భూతపరిజ్ఞానాదత్ర శామ్యతి వాసనా
అద్వైతాన్నిరహంకారాత్తతో మోక్షోఽవశిష్యతే. 22

అద్వైత తత్త్వమువలనను, అహంకార రాహిత్యమువలనను. యథార్థ పరిజ్ఞానము వలనను మనుజునకిజన్మయందే వాసన శమించిపోవుచున్నది. అ పిదప మోక్షరూపమగు ఆత్మయే శేషించుచున్నది.

ఏవమేష స యో బ్రహ్మా స ఏవేదం జగత్స్థితమ్
విరాట్ బ్రహ్మణో నామ దేహో యస్తదిదం జగత్. 23

ఓ రామచంద్రా ! ఈ ప్రకారముగ, చిత్స్వరూపమగు బ్రహ్మమేదిగలదో, అదియే యీ జగత్తైయున్నది. మఱియు విరాడ్రూపమగు బ్రహ్మముయొక్క దేహమే యీ జగత్తగును.

సంకల్పాకాశరూపస్య తస్యయా భ్రాన్తిరుత్థితా
తదిదం జగదాభాతి తద్బ్రహ్మాణ్డముదాహృతమ్. 24

సంకల్పాకాశ రూపత్వముఁజెందిన యా చిన్మాత్రబ్రహ్మమునకు స్థూలశరీరమును గూర్చిన భ్రాంతి ఎయ్యది యుదయించినదో, అదియే యీ జగదాకారముగ భాసించుచున్నది. మఱియు నదియే బ్రహ్మాండమని వచింపఁబడుచున్నది.

సర్వమాకాశమేవేదం సంకల్పకలనాత్మకమ్
వస్తుతస్త్వస్తి న జగత్త్వత్తామత్తే చ న క్వచిత్. 25

ఈ జగత్తంతయు బ్రహ్మముయొక్క సంకల్ప కల్పనారూపమై అధిష్ఠానదృష్టిచే చిదాకాశ మాత్రమేయైయున్నది. కావున, యథార్థముగ నామరూపాత్మకమగు దృశ్య జగత్తుగాని, 'త్వం'త్వ, 'అహం'త్వాదులు (నీవు నేను మున్నగు భావములు) గాని లేనివేయైయున్నవి.

క్వచిన్మాత్రేఽమలే వ్యోమ్ని కథం వా కేన వా జగత్
కిం జాయతే కిమత్రాస్తి కారణం సహకారి యత్. 26

చిన్మాత్రమై, నిర్మలమై వికారమైనట్టి చిదాకాశమున సాకారమగు ఈ జగత్తెట్లు దేనిచే నెవ్విధమున జనింపఁగలదు? మఱియు నియ్యది జనించుటకు సహకారి కారణమేమి గలదు?

అతోఽలీకమిదం జాతమలీకం పరిదృశ్యతే
అలీకం స్వదతేఽలోకమేవం పశ్యతి శూన్యకమ్. 27

కావున, ఈ జగత్తు మిథ్యగనే జనించినది, మిథ్యగనే కానుపించుచున్నది; మిథ్యగనే ప్రియాప్రియభావములతోటి యనుభూత మగుచున్నది. నిష్ప్రపంచమగు బ్రహ్మమే తన యిచ్ఛచే జగచ్ఛూన్యమగు చిదాకాశమును జగద్రూపముగఁ గాంచుచున్నది.

జగదాదికయా భాసా చిన్మాత్రం స్వదతే స్వతః
ఆత్మనాత్మామ్బరేద్వైతే స్పన్దనేనేవ మారుతః. 28

చలనరూపముతోటి వాయువు భాసించునట్లు, చిన్మాత్రమగు బ్రహ్మము తన అద్వితీయ మగు చిదాకాశమున స్వయముగనే జగదాదిరూపములతోటి భాసించుచున్నది.

ఇదం కించిన్న కించిద్వాద్వైతాద్వైతవివర్జితమ్
చిదాకాశం జగద్విద్ధి శూన్యమచ్ఛం నిరామయమ్. 29

ఓ రామచంద్రా! ఈ జగత్తు వాస్తవముగ ద్వైతాద్వైతవర్జితమై, అధిష్ఠానరూపముచే సత్యమై, నిజ (దృశ్య) రూపముచే అసత్యమైయున్నది. కావున, పరమార్థముగ నిద్దానిని దృశ్య శూన్యమై, నిర్మలమై, నిర్వికారమైనట్టి చిదాకాశముగనే యెఱుఁగుము,

శాన్తాశేషవిశేషోఽహం తేన రాఘవ సంస్థితః
సన్నేవాసన్నివాతస్త్వమేవమేవాస్స్వనిర్మమః. 30

ఇక్కారణమున, ఓ రామచంద్రా! నావలె నీవున్ను సర్వవిశేషములు శమించినవాఁడవై, మమత్వరహితుఁడవై పరమార్థమున సచ్చిద్రూపుఁడవుగను, వ్యవహారమున దేహధారివలెను నుండుము.

నిర్వాసనః శాన్తమనా మౌనీ విగతచాపలః
సర్వం కురు యథాప్రాప్తం కురు మా వాత్ర కిం గ్రహః. 31

ఓ రాఘవా! నీవు వాసనారహితుఁడవును, శాంతచిత్తుఁడవును, మౌనివియు, చపలత్వ వర్జితుఁడవునై సమాధినుండి లేచి సర్వవ్యవహారములఁ చేయుము. లేక సమాధిస్థుఁడవై యే వ్యవహారములు చేయకయును నుండుము. అందొకదానియందు బట్టుదలయేమి?

అనాది నిత్యానుభవో య ఏకః
స ఏవ దృశ్యం నతు దృశ్యమన్యత్
సత్యానుభూతేఽననుభూతయో యాః
సువిస్తృతా దృశ్యమహాదృశస్తాః. 32

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే నిర్వాణవర్ణనం నామ ద్విసప్తతితమః సర్గః ॥ 72 ॥

ఓ రామచంద్రా! సత్యమగు పరమాత్మ అనుభూతముకాఁగా, అనాదియై, నిత్యానుభవ రూపమై, ఏకమైనట్టి పరబ్రహ్మమేది గలదో, అదియే యీ దృశ్యమనియు, దృశ్యమనునది వేఱుగ లేదనియుఁ దెలియును. అట్టి పరమాత్మనుగూర్చిన యనుభవము లేమియే యీ విశాలమైనట్టి నామ రూపాత్మకమగు దృశ్యమహాదృష్టియగును.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున నిర్వాణవర్ణనమను డెబ్బదిరెండవ సర్గము ॥ 72 ॥

త్రిసప్తతితమః సర్గః

[ఇహారోపక్రమో భూయో బోధదార్ఢ్యాయ వర్ణ్యతే
కథమేతస్య చాఙ్గానీత్యాది ప్రశ్నోత్తరం తతః.

బోధయొక్క దృఢత్వము కొఱకై మరల ఆరోపక్రమము వర్ణింపఁబడుట. భూరాదిలోకములు బ్రహ్మదేవుని అవయవము లెట్లగునను ప్రశ్నకుత్తరము వచింపఁబడుట యిటఁ గాననగును.]

శ్రీరామ ఉవాచః—

బన్ధమోక్షజగద్బుద్ధిర్న శూన్యా నాపి సన్మయీ
నాస్తమేతి న చోదేతి కిమప్యాద్యమసౌ కిల. 1
ఉపదిష్టమిదం బ్రహ్మంస్త్వయా బుద్ధమలం మయా
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్. 2

శ్రీరాముఁడు:— మహాత్మా! బంధ, మోక్ష, జగదాదులు శూన్యముగాని సత్తుగాని కాననియు, వాఙ్మనంబుల కగోచరమై, ఉదయాస్తమయ రహితమై, అదిభూతమైనట్టి పరబ్రహ్మమే యనియుఁ దాముపదేశించినది నేను బాగుగ నెఱిఁగితిని. కాని, ఇవ్విషయమును మరల తెలియఁ జేయుఁడు. ఏలయనిన, అమృత సమానములగు తమ వచనములను వినుటలో నాకుఁదృప్తి కలుగకున్నది.

సర్గాది సంభ్రమదృశః శూన్యతాదిదృశస్తథా
న కాశ్చన విభో సత్యా అసత్యాశ్చ న కాశ్చన. 3

ఏవం స్థితే తు యత్సత్యం తత్సర్వం బుద్ధవానహమ్
తథాపి భూయో బోధాయ సర్గానుభవ ఉచ్యతామ్. 4

ప్రభూ! సృష్ట్యాది సంభ్రమముల దృష్టులున్ను, శూన్యత్వాదుల దృష్టులున్ను నెవ్వియు సత్యములుగాని, అసత్యములుగాని కావనియు నేనెఱిఁగితిని. ఈ ప్రకారముగ, మాయాశబలిత బ్రహ్మమునువలె, నిత్యయుక్తమగు సత్యమైన శుద్ధబ్రహ్మమునుగూడఁ దమ యనుగ్రహముచే నేను దెలిసికొంటిని. కాని బోధయొక్క దృఢత్వముకొఱకై ప్రపంచముయొక్క అధ్యారోపక్రమమును మరల తెలియఁజేయ ప్రార్థన.

శ్రీవసిష్ఠ ఉవాచ:—

యదిదం దృశ్యతే కించిజ్జగత్స్థావరజఙ్గమమ్
సర్వం సర్వప్రకారాఢ్యం దేశకాలక్రియాదిమత్. 5

తస్య నాశే మహానాశే మహాప్రలయనామని
బ్రహ్మోపేన్ద్రమరుద్రుద్రమహేన్ద్రపరిణామిని. 6

శిష్యతే శాన్తమత్యచ్ఛం కిమప్యజమనాది సత్
యతో వాచో నివర్తన్తే కిమన్యదవగమ్యతే. 7

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! సర్వప్రకారములచేఁ బూర్ణమై, దేశకాల క్రియాసహితమైనట్టి యీ కానుపించు స్థావరజంగమాత్మకమగు ప్రపంచమంతటి యొక్క, స్థూలభూతములు సూక్ష్మభూతములందు లయించుటయను నాశమున్ను, సూక్ష్మభూతములు అవ్యాకృతమందు లయించుటయను మహాప్రళయమను బేరుగల మహానాశమున్ను సంభవింప, బ్రహ్మ, ఉపేంద్ర, మరుత్, రుద్ర, మహేంద్రాదుల దేహములయొక్క అంతిమభావవికారము తటస్థింప, శాంతమై, అతినిర్మలమై, అనిర్వచనీయమై, అజమై, అనాదియై, సన్మాత్రమైనట్టి బ్రహ్మమే శేషించుచున్నది అద్దానినుండి వాక్కులన్నియు నివర్తించుచున్నవి. కాన నిక అన్యమగు ఎయ్యది దానిఁ దెలిసికొనఁగలదు? (స్వయముగ తానే తన్ను అనుభవించుకొనుచున్నదని భావము.)

సర్షపాపేక్షయా మేరుర్యథాతివితతాకృతిః
తథాకాశమపి స్థూలం శూన్యం సద్యదపేక్షయా. 8

ఆవగింజకంటె మేరుపర్వతము అతిస్థూలమైయున్నట్లు, పరమసూక్ష్మమై శూన్యమైనట్టి యాకాశమున్ను బ్రహ్మముకంటె అతిస్థూలమైయున్నది.

శైలేన్ద్రాపేక్షయా సూక్ష్మా యథేమే త్రసరేణవః
తథా సూక్ష్మతరం స్థూలం బ్రహ్మాణ్డం యదపేక్షయా. 9

మహాపర్వతముకంటె త్రసరేణువులు అతిసూక్ష్మములైయున్నట్లు, స్థూలమైనట్టి బ్రహ్మాండమున్ను బ్రహ్మముకంటె అతి సూక్ష్మమైయున్నది.

అమానకలితే సౌమ్యే కాలే పరిణతే చిరమ్
శాన్తే తస్మిన్పరే వ్యోమన్యాద్యే హ్యనుభవాత్మని. 10

అసంకల్పో మహాశాన్తో దిక్కాలైరమితాకృతిః
అన్తర్మహాంశ్చిదాకాశో వేత్తీవ పరమాణుతామ్. 11

అసత్యామేవ తామన్తర్భావయన్స్వప్నవత్స్వతః
తతః స బ్రహ్మశబ్దార్థం వేత్తి చిద్రూపతాం తతామ్. 12

కాలప్రమాణహేతువగు సూర్యాదులు విలయమొందుటచే ప్రమాణరహితమైనట్టి ప్రళయకాలము చిరకాలమునకుగడువగా, సౌమ్యమై, అనుభవాత్మకమై, ఆదిభూతమైనట్టి యాచిదాకాశము శాంతముగ స్థితినొందియుండ, అపుడు వాస్తవముగ సంకల్పరహితమై, మహత్తరమై, దేశకాలములచే, పరిచ్ఛిన్నముకానట్టి అయ్యదీ స్వప్నమువైపున కభిముఖమైనదానివలె తన స్వరూపమందు జగత్సంస్కారరూపమగు పరమాణుత్వము ననుభవించుచున్నది. మఱియు, అసత్యమైనను తత్పరమాణుత్వమును స్వప్నమువలెఁ దనయందు భావించుచు, అటుపిమ్మట 'వృద్ధియొనర్చుటఁబట్టి బ్రహ్మమున'ని నేను యిట్లు బ్రహ్మశబ్దార్థమును, సర్వత్ర వ్యాప్తమగు నిజచిద్రూపత్వమును నెఱుఁగుచున్నది.

చిద్భావోఽనుభవత్యన్తశ్చిత్త్వాచ్చిదణుతాం నిజామ్
తామేవ పశ్యతీవాథ తతో ద్రష్టేవ తిష్ఠతి. 13

చిత్స్వరూపమగు బ్రహ్మము చిద్రూపమగుటవలనఁ దనయందు నిజచిద్రూపమైన అణుత్వము ననుభవించుచున్నది. మఱియు నద్దానినే గాంచుచు ద్రష్టవలె స్థితినొందుచున్నది.

యథా స్వప్నే మృతం పశ్యత్యేక ఏవాత్మనాత్మని
మృత ఏవ మృతేర్ద్రష్టా తథా చిదణురాత్మని. 14

స్వప్నమందొకేజీవాత్మ తనస్వరూపముననే తన్ను మృతునిగఁ గాంచునట్లును, అట మృతుఁడే మృతునియొక్క ద్రష్టయై యాతనిని భిన్నరూపముగ వీక్షించునట్లును, చిదాకాశమున్ను నిజస్వరూపముననే తనకంటె భిన్నముగఁ గాంచుచున్నది.

తతశ్చిద్భావ ఏషోఽన్తరేక ఏవ ద్వితామివ
పశ్యన్స్వరూప ఏవాస్తే ద్రష్టృదృశ్యమివ స్థితః. 15

ఈ చిదాకాశము తన అద్వైతస్వరూపమును ద్వైతరూపమువలెగాంచుచు ద్రష్టృదృశ్యాదులవలె స్థితినొంది యున్నప్పటికిని, తన యథార్థమగు యేకరూపముగనే వర్తించుచున్నది.

చిద్భావశూన్య ఏవాతినిరాకారోఽవ్యయణుం తనుమ్
పశ్యన్దృశ్యమివోదేతి ద్రష్టేవ చ తదా ద్వితామ్. 16

చిదాకాశము సర్వదా మూర్తిశూన్యమై, నిరాకారమై, ఏకమైయున్నను, నిజసూక్ష్మస్వరూపమును గాంచుచు ద్రష్టృదృశ్యములవలె నద్వైతభావమును ధరించుచున్నది.

ప్రకాశమణుమాత్మానం పశ్యంస్తదనుభావతః
ఉచ్ఛూనతాం చేతయతే బీజమఙ్కురతామివ. 17

ఆ దృష్టమాయాబలముచేఁ దనప్రకాశరూపమగు ఆత్మను పరిచ్ఛిన్నముగ, గాంచుచు, అద్దానిని ననుసరించి భావనచేయుటచే బీజము అంకురత్వము ననుభవించునట్లు, దానియొక్క వృద్ధిననుభవించుచున్నది.

దేశకాలక్రియాద్రవ్యద్రష్టృదర్శనదృగ్దృశః
అర్థాన్తరస్వభావేన తిష్ఠన్త్యనుదితాభిధాః. 18

దేశ, కాల, క్రియా, ద్రవ్య, ద్రష్టృ, దర్శన, దృశ్య, దృష్టులన్నియు పదార్థాంతర స్వభావముచే ఆత్మయందు అనిర్వచనీయ రూపమున స్థితినొందియున్నవి.

చిదణుర్యత్ర భాతోఽసౌ దేశో మితిముపాగతః
యదా భాతస్తదా కాలో యద్భానం తత్క్రియాస్మృతా. 19

చైతన్యమెచట భాసించుచున్నదో యది దేశమనియు, ఎపుడు భాసించుచున్నదో యది కాలమనియు, భాసించుట యేదిగలదో యది క్రియయనియు, జెప్పఁబడుచున్నది.

ఉపలబ్ధం విదుర్ద్రవ్యం ద్రష్టృతాప్యుపలబ్ధతా
ఆలోకనం దర్శనతా దృగాలోకనకారణమ్. 20

అట్లే, లబ్ధమైనది ద్రవ్యమనియు, దానిని జూచువాఁడు ద్రష్టయనియు, చూచుట దర్శనమనియు, చూచుటకుఁ గల కారణము 'దృక్' అనియును జెప్పఁబడుచున్నది.

ఏవముచ్ఛూనతా భాతి మితానన్తాథ వా క్రమాత్
అసత్యైవ నభస్యేవ నభోరూపైవ నిష్క్రమా. 21

ఈ ప్రకారముగ దేశకాలవస్తు పరిచ్ఛేదములచే పరిమితిగలదియు, లేక సంఖ్యాపరిమాణములచే అనంతమైనదియు. త్రిపుటీ భేదములతోఁ గూడినది నగు ఈ జగద్రూపమైన వృద్ధి అసత్యమే యగుచు చిదాకాశమున క్రమరహితముగ భాసించుచున్నది. కాని వాస్తవముగ నిదియంతయు చిదాకాశరూపమే యైయున్నది.

చిదణోర్భాసనం భాతం తత్ప్రదేశేన దేహగమ్
యేన పశ్యతి తచ్చక్షుః సంగ్రహోఽక్షదృశామితి. 22

చేతనరూపుఁడగు జీవునకు దేహమందలి యే గోళక - ఛిద్రముద్వారా సూర్యాదుల ప్రకాశము గోచరించునో, మఱియు ఏ యింద్రియముచే నాతఁడు గాంచునో, యా రెంటిని నేత్రేంద్రియ మందురు. అదేరీతిగ శ్రోత్రాదీంద్రియములన్నింటిని గూర్చియు సంక్షేపముగ నెఱుఁగనగును.

చిదణుప్రతిభాసేఽన్తః ప్రథమం నామవర్జితమ్
తన్మాత్రశబ్దమేతేషామేతదాకాశరూపి తత్ 23

ఈ శ్రోత్రాదీంద్రియములయొక్క నామరూప భేదకల్పనకుఁ బూర్వపు స్థితిని తన్మాత్రమని యందురు. అది అత్యంత సూక్ష్మమై, ఆకాశరూపమై యున్నది.

చిదణుప్రతిభాకాశపిణ్డ ఏవ ఘనస్థితిః
అనుసంధానవివశశ్చేతతీన్ద్రియపఞ్చకమ్. 24

ఈ ప్రకారముగ చైతన్యాణువగు జీవునియొక్క ప్రతిభారూపమగు ఆకాశమే ఘనస్థితిని బొంది స్థూలదేహ మగుచున్నది. మఱియు నట రూపాదుల అనుసంధాన వశముచే పంచేంద్రియముల యనుభవమును బొందుచున్నది.

ఏవం చిదణుసంధానం దృశ్యపోషముపైత్యలమ్
తదేవ జ్ఞానమిత్యుక్తం బుద్ధిరిత్యభిధీయతే. 25

ఇట్లు జీవుఁడు శబ్దాదివిషయములను మరల మరల యనుభవించుట ద్వారా దృశ్యముయొక్క పుష్టిని పూర్ణముగఁ బడయుచున్నాఁడు. అచట, ఇంద్రియములచే గ్రహింపఁబడిన విషయములయొక్క స్మృతిదశయందలి జ్ఞానము చిత్తమనియు, నిశ్చయదశయందలి జ్ఞానము బుద్ధియనియుఁ జెప్పఁబడును.

తతో మనస్తదారూఢమహంకారపదం గతమ్
దేశకాలపరిచ్ఛేద ఇత్యఙ్గీకృత ఆత్మనా. 26

అట్లే, సంకల్పవికల్పములచే మనస్సును, అభిమానముచే 'అహంకార'పదమునుజీవుఁడు బొందుచున్నాఁడు. మఱియు దేశకాల పరిచ్ఛేదమును ఈ వచింపఁబోవురీతి యాతఁడంగీకరించెను.

చిదణోరస్య భావస్య ప్రత్యగ్రం యత్ర వేదనమ్
స తత్రోత్తరకాలేన పూర్వాభిఖ్యాం కరిష్యతి. 27

ఏ జీవునకే దేశకాలములందు మొదట శబ్దాదివిషయముల జ్ఞానము కలుగునో, ఆదేశ, కాలముల కాజీవుఁడు ఉత్తరదేశకాలములను బట్టి 'పూర్వ' దేశకాలములను పేరుకల్పించును.

అన్యస్మిన్నేకదేశే సా ఊర్ధ్వాభిఖ్యాం కరిష్యతి
ఏవం దిగభిధానాది కల్పయిష్యతి సక్రమాత్. 28

వాని కన్యమగు వానికి 'ఉత్తరదేశకాలములను' నామ మొసంగును. అట్లే క్రమముగ దేశమునకు, పూర్వ. పశ్చిమాది దిశలను నామముల నాతడు కల్పించును.

దేశకాలక్రియాద్రవ్యశబ్దానామర్థవేదనమ్
భవిష్యతి స్వయమసావాకాశవిశదోఽపి సన్. 29

చైతన్యరూపమగు ఆత్మస్వయముగ ఆకాశమువలె నిర్మలమై, అపరిచ్ఛిన్నమైనప్పటికి, ఈ ప్రకారముగ దేశ, కాల, క్రియా, ద్రవ్యాదుల నామములను గల్పించి, వాని అర్థజ్ఞానరూపమును బడయుచు పరిచ్ఛిన్నమగుచున్నది.

ఇత్థం స్వానుభవేనైష వ్యోమ్న్యేవ వ్యోమరూపభృత్
ఆతివాహితనామాస్తద్దేహః సంపద్యతే చితేః. 30

ఇట్లు చైతన్యము స్వయముగనే మొదట సూక్ష్మశరీరముగను పిమ్మట దేశకాలక్రియా వస్తువిభాగముగను, క్రమముగ సర్వజగచ్ఛరీరముగను నగుచున్నది. కాని, వాస్తవముగ చిదాకాశమే చిదాకాశరూపముతోటి జగత్తును ధరించుచున్నదగును.

ఏష ఏవ చిరం కాలం తత్ర భావనయా తయా
గృహ్ణాతి నిశ్చయం పూర్ణమాదిభౌతికమాత్మనః. 31

ఈ చైతన్యరూపుఁడగు జీవుఁడే సూక్ష్మశరీరమున చిరకాలము స్థూలత్వమునుగూర్చి భావించుచు క్రమముగ తత్స్థూలరూపముయొక్క పూర్ణనిశ్చయమును గ్రహించుచున్నాఁడు.

వ్యోమ్నా వ్యోమ్న్యేవ రచితో నిర్మలేనేతి విభ్రమః
అసతా సత్వమాస్తీర్ణస్తాపనద్యా జలంయథా; 32

నిర్మలమగు చిదాకాశమే నిజస్వరూపమున ఈ జగత్తును రచించినది. ఈ నామ రూపాత్మకమగు జగత్తు భ్రమాత్మకమైయున్నది. వాస్తవముగ సద్రూపమేయైనను చిదాకాశము మృగతృష్ణానదీ జలమువలె, అసత్తగు జగద్రూపముగ భాసించుచున్నది.

సంకల్ప నాముపాదత్తే స్వదేహే గగనాకృతిః
శిరశ్శబ్దార్థదాం కాంచిత్పాదశబ్దార్థదాంక్వచిత్. 33
ఉరఃపార్శ్వాదిశబ్దార్థమయీం క్వచిదనావిలామ్
భావాభావగ్రహోత్సర్గ శబ్దాద్యర్థమయీమపి. 34

నిర్మల చిదాకాశరూపుఁడగు జీవుఁడు క్రమముగ తన దేహమున నొకచోట శిరశ్శబ్దార్థ మొసంగునట్టియు, మఱియొకచోట పాదశబ్దార్థ మొసంగునట్టియు కల్పనగావించుచున్నాఁడు. అట్లే వేఱొకచోట వక్షస్థలము యొక్కయు, పార్శ్వాదులయొక్కయు శబ్దార్థమయమగు కల్పనఁయొనర్చుఁ చున్నాడు. ఆ విధముననే భావాభావగ్రహణత్యాగాదుల కల్పనగూడ గావించుచున్నాడు.

నియతా కాల కలనాం దేశకాలాదియన్త్రితామ్
విషయోన్ముఖతాం యాతామిన్ద్రియవ్రాతవేధితామ్. 35

పిమ్మట, ఇదిగోవు, ఇది అశ్వము, ఇత్యాది నియతాకారములతోఁ గూడినదియు, దేశ కాలాదులచే నియమితమైనదియు, విషయోన్ముఖమైనదియు, ఇంద్రియసమూహముచే వేదితమైన దియునగు కల్పనను జీవుఁడు ధరించుచున్నాఁడు.

సోఽణుః పశ్యత్యథాకారమాత్మనః స్వాత్మకల్పితమ్
హస్తపాదాదికలితం చిత్తాదికలనాన్వితమ్. 36

తదుపరి యాచైతన్యాణువగు జీవుఁడు హస్తపాదాది సహితమై, చిత్తాదుల కల్పనతోఁ గూడినట్టి స్వయంకల్పితమగు ఆకృతిని వీక్షించుచున్నాఁడు.

ఏవం సంపద్యతే బ్రహ్మా తథా సంపద్యతే హరిః
ఏవం సంపద్యతే రుద్ర ఏవం సంపద్యతే కృమిః. 37

ఈ ప్రకారముగ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాదులకును, కృమికీటకాదులకుఁగూడ సంకల్పవశముచేతనే దేహాదికల్పన సిద్ధించుచున్నది.

నచ కించన సంపన్నం యథాస్థితమవస్థితమ్
శూన్యంశూన్యే విలసితం జ్ఞప్తిర్జ్ఞప్తావిజృమ్భితా. 38

కాని యథార్థముగ నేమియు నుత్పన్నమగుటలేదు. అంతయు నున్నదినున్నట్లే సద్రూప ముగ వెలయుచున్నది. ఈ సమస్తమున్ను శూన్యమందు శూన్యమున్ను, చైతన్యమున చైతన్యమున్ను విజృంభించినదేయగును.

ప్రతికన్దః శరీరాణాం బీజం త్రైలోక్యవీరుధామ్
సర్గార్గలప్రదో ముక్తేః సంసారాసారవారిదః. 39
కారణం సర్వకార్యాణాం నేతా కాలక్రియాదిషు
సర్వాద్యః పురుషః స్వైరమిత్యనుత్థితఉత్థితః. 40

వ్యష్టిశరీరములయొక్క మూలమున్ను, త్రైలోక్యమను లతయొక్క బీజమున్ను, ముక్తి ద్వారమున విషయసృష్టియను ప్రతిబంధము (గడియ) నొసంగువాఁడును, సంసారమను జలధార లకు మేఘమువంటివాఁడును, సర్వకార్యములకు గారణమున్ను, దేశకాల క్రియాదుల నాయ కుఁడును, సమస్తమునకు ఆదియునగు విరాట్-పురుషుఁడును, వ్యష్టిజీవునివలె స్వయముగ సంకల్పమాత్రముచేతనే ఆవిర్భవించినవాఁడగును. కాని యథార్థముగ నట్లావిర్భవింపకయే యున్నవాఁడై చిత్స్వరూపుఁడేయై వెలయుచున్నాడు.

నాస్య భూతమయో దేహో నాస్యాస్థినిశరీరకే
అవష్టబ్ధుమసౌ ముష్ట్యా శక్యతే నతు కేనచిత్. 41

ఈతని దేహము భౌతికముకాదు; ఈతని శరీరమున అస్థులున్నులేవు. కావుననే యెవఁడును నీతనిని జేతితోఁ బట్టుకొనుటకు శక్యుఁడు కానేరఁడు.

తేనాబ్ధిమేఘసంగ్రామసింహగర్జోర్జితాత్మనా
అపి సుప్తనరేణేవ నూనం మౌనవతా స్థితమ్. 42

మనుజుఁడు స్వప్నమందు సముద్రములయొక్కయు, మేఘములయొక్కయు, యుద్ధ ములయొక్కయు, సింహములయొక్కయు, గర్జనలతో గూడియున్నవాఁడైనప్పటికి, వాస్తవముగ మౌనముగనే యున్నవాఁడెట్లగునో, అట్లే యా విరాట్పురుషుఁడున్ను చిత్స్వరూపమున ప్రపంచ రహితుఁడై స్థితిగల్గియున్నాఁడు.

జాగ్రతః స్వప్నసందృష్టయోద్ధ్రరభటివేదనమ్
యథాస్మృతి గతం నాసన్న సత్తద్వదసౌ స్థితః. 43

స్వప్నమందుఁ గాంచఁబడిన సైనికుల కోలాహలమునుగూర్చిన జ్ఞానము జాగ్రత్తునందు స్మరణదశను బొందినదై సర్వథా అసత్తుగాకయు, సత్తున్నుగాకయు నెట్లుండునో, అట్లే యీ ప్రపంచముయొక్క స్థితియునైయున్నది.

బహుయోజనలక్షౌఘప్రమాణోఽపి బృహద్వపుః
పరమాణ్వన్తరే భాతి శోమాన్తస్థజగత్త్రయః. 44

అనేకలక్షల యోజన సమూహములవఱకు విస్తృతమైనట్టి ప్రమాణముగలదియు, మహాశరీరమునగు త్రైలోక్యమున్ను మాయచే, రోమముయొక్క చివరిభాగమునగల పరమాణువు నందును భాసింపగలదు.

కులశైలగుణౌఘాత్మా జగద్వృన్దాత్మకోఽపి సన్
కులాయం ధానకామాత్రమపి నో పూరయత్యజః. 45

సప్తమహాకుల పర్వతములయొక్కయు, గుణసమూహములయొక్కయు ఆధారమై యున్నను, అనేక బ్రహ్మాండసమూహమయుఁడై యున్నప్పటికిని బ్రహ్మదేవుఁడు వటబీజ మాత్రపు ఛిద్రమునైన పూరింపఁజాలడు.

జగత్కోటి శతాభోగవిస్తీర్ణోఽప్యణుమాత్రకమ్
వస్తుతో వ్యాప్తవానేష న దేశం స్వప్నశైలవత్. 46

అనేకకోట్ల జగత్తులను బూర్ణమొనర్చునంతటి విశాలాకారము గలవాఁడైనను బ్రహ్మదేవుఁడు, అణుమాత్రస్వరూపుఁడే యగును. వాస్తవముగ స్వప్నపర్వతములవలె నాతఁడు ప్రదేశమును వ్యాపింపకయే యున్నాఁడు.

స్వయంభూరేష కథితో విరాడేష స ఉచ్యతే
బ్రహ్మాణ్డాత్మా జగద్దేహో వస్తుతస్తు నభోమయః. 47

ఈతనినే స్వయంభువనియు, విరాట్టనియు, బ్రహ్మాండాత్మయనియు, జగచ్ఛరీరుఁడనియు నందురు. కాని, వాస్తవముగ నీతఁడు చిదాకాశమయుఁడే యగును.

సనాతన ఇతిప్రోక్తో రుద్ర ఇత్యపి సంజ్ఞితః
ఇన్ద్రోపేన్ద్రమరుర్మేఘశైలజాలాదిదేహకః. 48

మఱియు నీతఁడే సనాతనపురుషుఁడనియు, రుద్రుఁడనియు గూడఁజెప్పఁబడును. ఇంద్ర, ఉపేంద్ర, మరుత్, మేఘ, పర్వతసమూహాదులయొక్క దేహమీతఁడే యైయున్నాఁడు.

తేజోఽణుమాత్రం ప్రథితం చేతిత్వాత్ప్రథమం వపుః
క్రమేణ స్ఫారసంవిత్తిర్మహానహమితి స్థితః. 49

పరమసూక్ష్మమగు చైతన్యము ప్రథమమున, చేతిత (ప్రకాశిత) మొనర్చుటఁబట్టి చిత్తశరీరమాయెను. పిమ్మట, ఆ చిత్తశరీరమే క్రమముగ విశాలజ్ఞానయుక్తమై 'మహత్తరమైన బ్రహ్మాండదేహమే నేను' అని యివ్విధమునఁ జింతించి జగచ్ఛరీరమయ్యెను.

స్పన్దసంవేదనాత్తేన స్పన్ద ఇత్యనుభూయతే
యః స ఏవానిలాఖిఖ్యో వాతస్కన్దాత్మనా స్థితః. 50

స్పందజ్ఞానముచే ఆ బ్రహ్మదేవుఁడు ప్రాణాదుల సంచలనము ననుభవించుచున్నాఁడు. మఱియు నాతని ప్రాణము లెవ్వి గలవో, అవియే వాతస్కంధ (వాయుసమూహ) రూపముగ నెలకొనియున్నవి.

ప్రాణాపానపరిస్పన్దో వేదనాదనుభూయతే
తేన యః సోఽయమాకాశే వాతస్కన్ద ఉదాహృతః. 51

స్పందజ్ఞానముచేఁ బ్రాణాపానముల స్పందమెయ్యది బ్రహ్మదేవుఁ డనుభవించుచున్నాఁడో, దానినే యీ బ్రహ్మాండాకాశమున మనము వాయుసమూహమని పేర్కొనుచున్నాము.

చిత్తాద్వై కల్పితాస్తేన బాలేనేవ పిశాచికాః
తేజఃకణా అసన్తోఽపి త ఏతే ధిష్ణతాం గతాః. 52

బాలునిచేఁ గల్పింపఁబడిన పిశాచమువలె, కేవలమా బ్రహ్మదేవుని చిత్తముచేఁ గల్పింపఁబడినవై, వాస్తవముగ లేనివే యైనట్టి తేజఃకణములీసూర్యచంద్ర నక్షత్రాదిరూపత్వమును బొందినవి.

ప్రాణాపానపరావర్తదోలా తదుదరోదితా
వాతస్కన్ధాభిధాం ధత్తే జగత్తద్ధృదయం మహత్. 53

ప్రాణాపానముల పరివర్తనయొక్క యూయలగు ఆతని యుదరము వాతస్కంధమను నామమును ధరించుచున్నది. దానినే మహత్తరమైన జగత్తుయొక్క హృదయమనియు నందురు.

ప్రతిచ్ఛన్దశరీరాణాం ప్రథమం బీజమేష సః
జగద్గతానాం సర్వేషామాకల్ప వ్యవహారిణామ్. 54

ఈ జగత్తునందు కల్పమువఱకు వ్యవహరించునట్టి సమస్తజీవులయొక్క వాసనలచేఁ గల్పితములగు వ్యష్టి శరీరములయొక్క ప్రథమబీజము ఈ బ్రహ్మదేవుఁడేయై యున్నాఁడు.

ప్రతిచ్ఛన్దాద్యదేతస్మాదుత్థితా జగదాత్మనా
దేహాస్తథా యథా బాహ్యమన్తరేషాం తథా స్థితమ్. 55

ఈతనిచే సృజింపఁబడు ఆ యా జీవులయొక్క వాసనలచే జగద్రూపముగఁ బ్రకటితములగు, అనేక దేహములయొక్క బాహ్యాభ్యంతరములందును నతడేకరూపముతోటి స్థితిగల్గియుండును.

చితిస్తస్యాద్యబీజస్య పూర్వమేవ యథోదితా
తథైవాద్యాపి జీవేన్తస్తథోదేతి తదీహితా. 56

చిద్రూపుఁడును, ఆది బీజమునగు ఆ హిరణ్యగర్భుని యిచ్ఛచేఁ బూర్వమేవిధముగ నాయా జీవులందు తత్తద్వాసనలచే జగత్పరంపర యుదయించెనో, అట్లే యిపుడును నుదయించుచున్నది.

శ్లేష్మపిత్తానిలాస్తస్య చన్ద్రార్కపవనాస్త్రయః
గ్రహా ఋక్షగణాస్తస్య ప్రాణాష్ఠీవనసీకరాః. 57

ఆ బ్రహ్మదేవుని శ్లేష్మ, పిత్త, వాయువులే చంద్ర, సూర్య, వాయువులై యొప్పుచున్నవి. మఱియు నాతని శ్లేష్మ బిందువులే తదితర గ్రహ, నక్షత్రాదులై చెన్నొందుచున్నవి.

తస్యాస్థీన్యద్రిజాలాని మేదసో జాతికా ఘనాః
శిరః పాదా త్వచం దేహాన్నశ్యామస్తస్య నో వయమ్. 58

పర్వతసమూహము లాతని అస్థులు; మేఘములు మేదస్సునుండి యుద్భవించిన పదార్థములు; ఆతని శిరస్సు, పాదములు (ఊర్ధ్వాధోలోకములు) చర్మము (బ్రహ్మాండావరణము) అన్యవ్యష్టి దేహములు దూరముననుండుటచే మనము గాంచఁజాలము.

వపుర్విరాజో జగదఙ్గ విద్ధిసంకల్పరూపస్య హి కల్పనాత్మ
ఆకాశశైలావనిసాగరాది సర్వం చిదాకాశమతః ప్రశాన్తమ్. 59

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే విరాడాత్మవర్ణనం
నామ త్రిసప్తతితమః సర్గః ॥ 73 ॥

ప్రియుఁడవగు రామచంద్రా! ఈ జగత్తును సంకల్పరూపుఁడగు విరాట్ - పురుషుని కల్పనామయమగు శరీరమనియే యెఱుఁగుము. మనస్సుచేఁ గల్పితమగు పదార్థము సత్యమెన్నటికిని గానేరదు. కావున, యాకాశ, పర్వత, పృథివీ, సముద్రాది సమస్త జగత్తున్ను (అధిష్ఠానరూపముచే) ప్రశాంతమగు చిదాకాశమేయై యున్నది.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణ ప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున విరాడాత్మవర్ణనమను డెబ్బదిమూఁడవ సర్గము ॥ 73 ॥

చతుఃసప్తతితమః సర్గః

[యాన్యఙ్గాన్యస్య యే లోకా చాస్యావయవాః పృథక్
యథా చాన్తఃస్థితోఽన్యైష తత్సర్వమిహ వర్ణ్యతే.

ఏ లోకములీ బ్రహ్మదేవుని ఏయే వేర్వేఱు అవయవములో, ఏ ప్రకారముగ నవియన్నియు నాతని యాభ్యంతరమున స్థితిగల్గియున్నవో, ఆ విషయములన్నియు నిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీవసిష్ఠ ఉవాచః—

తస్మిన్కల్పే తు సంకల్పే తస్య యద్వపురాస్థితమ్
శృణు తత్ర వ్యవస్థేయం విచిత్రాచారహారిణీ. 1

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఆశిలయందుఁ గాంచఁబడిన బ్రహ్మకల్పమందా విరాట్ - పురుషునియొక్క సంకల్పమయమగు బ్రహ్మాండ శరీరమేదిగలదో, అద్దానియందలి విచిత్రాచారములచే చిత్తమును హరించునట్టి - వ్యవస్థను గూర్చి వినుము.

పరమం యచ్చిదాకాశం తద్విరాడాత్మనో వపుః
ఆద్యన్తమధ్యరహితం లఘుత్వస్యవపుర్జగత్. 2

అది మధ్యాంతరహితమైనట్టి పరమ చిదాకాశమే యీ విరాట్పురుషుని ప్రథమ కల్పనా రహితమగు శరీరమైయున్నది. అతని కల్పితమగు ఈ జగత్ - శరీరమైతే అత్యంతలఘువైనది.

సంకల్పరహితో బ్రహ్మ స్వాణ్డం సంకల్పనాత్మకమ్
వపుషః పరితో భాస్వత్పశ్యత్యాకాశమేవ తత్. 3

ఆ బ్రహ్మదేవుఁడు స్వ సంకల్పశరీరమగు బ్రహ్మాండమునకు వెలుపల నిస్సంకల్పసాక్షి చిదాకాశమాత్రుఁడై సంకల్పాత్మకమగు తన బ్రహ్మాండమును గాంచుచున్నాఁడు. ఆ బ్రహ్మాండమున్ను పరమార్థ దృష్టియందు చిదాకాశమేయైయున్నది.

బ్రహ్మ త్వైత్రష స్వసంకల్పం స్వమణ్డమకరోద్ద్విధా
తైజసం తైజసాకారః పుష్టః పుష్టం విహంగవత్. 4

బలిసిన పక్షి పుష్టమగు తన యండము (గ్రుడ్డు) ను రెండుగా విభజించునట్లు, లింగ సష్ట్యభిమానియు, చిదాకాశరూపుఁడునగు బ్రహ్మదేవుఁడు నిజకల్పిత సువర్ణరూప బ్రహ్మాండమును రెండుగా విభజించెను.

అణ్డస్యైకం నభోదూరః గతం సంబుద్ధవానసౌ
భువోధఃసంస్థితం భాగం వ్యతిరిక్తం చ నాత్మనా. 5

అందూర్ధ్వభాగమును ఆకాశముగను, అధోభాగమును పృథ్వ్యాదిలోకములుగను నాతఁడు కల్పించెను. కాని యవియన్నియు ఆత్మకంటె భిన్నములుకావు.

బ్రహ్మాణ్డభాగ ఊర్ధ్వస్థో విరాజః శిర ఉచ్యతే
అధోభాగోఽన్య పాదాఖ్యో నితమ్బో మధ్యమాత్రఖమ్. 6

బ్రహ్మాండముయొక్క సర్వోపరిభాగము విరాట్ - పురుషునియొక్క శిరస్సు; అధోభాగము పాదములు, మధ్యనున్న యాకాశము నితంబము (పిఱుఁదులు.)

దూరం విముక్తయోః సంధిః ఖణ్డయోరితి విస్తృతా
అనన్తా వ్యోమలేఖా సా శ్యామా శూన్యేతి దృశ్యతే. 7

అతిదూరముగ విభక్తమైనట్టి బ్రహ్మాండముయొక్క రెండు కపాలములయొక్క మహా విశాలమైనట్టి మధ్యభాగము ఏదిగలదో, అది యనంతమై, నీలవర్ణయుతమై, శూన్యమైనట్టి యాకాశమువలె జనులకు దృగ్గోచరమగుచున్నది.

ద్యౌస్తాలు విపులం తస్య తారారుధిరబిన్దవః
సంవిద్వాతలవా దేహే సురాసురనరాదయః. 8

దేహాన్తః కృమయస్తస్య భూతప్రేతపిశాచకాః
లోకాన్తరాణి రన్ధ్రాణి సుషిరాణ్యస్య దేహకే. 9

బ్రహ్మాణ్డఖణ్డమస్యాధో విస్తృతం పాదయోస్తలమ్
జానుమణ్డలరన్ధ్రాణి పాతాలకుహరాణ్యధః. 10

జలైశ్చచలాయన్తీ సుషిరానేకరన్ధ్రగా
భూరన్త్రర్మణ్డలీలోలా సముద్రద్వీపవేష్టనా. 11

జలైర్గుడగుడాయన్త్యో నద్యో నాడ్యః సరిద్రసః
జమ్బూద్వీపం హృదమ్భోజమస్య హేమాద్రికర్ణికమ్. 12

కుక్షయః కుకుభః శూన్యా యకృత్ప్లీహాదయోఽచలాః
మృద్వ్యః స్నిగ్ధాః పటాకారా మేదసో జాలికా ఘనాః. 13

చన్ద్రార్కౌ లోచనే తస్య బ్రహ్మలోకో ముఖం స్మృతమ్
తేజః సోమోఽస్య కథితః శ్లేష్మా ప్రాలేయపర్వతః. 14

అగ్నిలోకస్తథౌర్వాగ్నిః పిత్తమస్యాతిదుస్సహమ్
వాతస్కన్ధమహావాతాః ప్రాణాపానా హృదిస్థితాః. 15

కల్పద్రుమవనాన్యస్య సర్వవృన్దాని చ క్వచిత్
లోమజాలాన్యనన్తాని వనాన్యుపవనాని చ. 16

ఊర్ధ్వం బ్రహ్మాణ్డఖణ్డం తు సమస్తమరుమస్తకమ్
బ్రహ్మాణ్డప్రాన్తరన్ధ్రార్చిరస్య దీప్తా శిఖోత్థితా. 17

స్వర్గలోక మాతని విశాలమైన దవుడ; నక్షత్రములు రక్తబిందువులు; సురాసుర మనుష్యాదులు బుద్ధి, ప్రాణముల వృత్తిభేదములు భూతప్రేత పిశాచాదులు దేహమందలి కృములు; లోక, లోకాంతరములు దేహమందున్న చక్షురాది రంధ్రములు; ఈ భూమండలమున కధోభాగము ననున్న విశాల బ్రహ్మాండఖండము పాదతలము; పాతాళకుహరాదులు మోకాటిరంధ్రములు; జలములచే చంచలములై పెక్కు రంధ్రములుఁగలవై, వ్యాకులములైనట్టి సముద్ర, ద్వీపాదులచేఁ జుట్టఁబడిన పృథివి దేహముయొక్క మధ్యప్రదేశము, జలములచే గుడ గుడ మని శబ్దమొనర్చు నదులు నాడులు, తన్నదీజల మా నాడులందలి రసము; మేరుపర్వతమను కర్ణిక (దుద్దు) తోఁగూడిన జంబూద్వీపము హృదయకమలము; శూన్యదిశలు కుక్షిభాగములు, పర్వతములు ప్లీహాది మాంస విశేషములు; మేఘములు; మృదువుగను, వస్త్రాకారముగను నున్నట్టి మేదస్సు (కొవ్వు); చంద్ర సూర్యులు నేత్రములు; బ్రహ్మలోకము ముఖము; సోమము వీర్యము; శ్లేష్మము హిమవత్పర్వతము; అగ్నిలోకమున్ను పృథివియందలి యగ్నియు, దుస్సహమైనట్టి పిత్తము; మహావాయువులు హృదయమందలి ప్రాణాపానాది వాయువులు; కల్పవృక్షవనములు, పాతాళాదులందు బ్రసిద్ధములైన సర్పసమూహములు, అనంతములైన వన, ఉపవనములు రోమజాలము; ఊర్ధ్వభాగమున నున్న బ్రహ్మాండఖండమంతయు విశాలమైన మస్తకము, బ్రహ్మాండము యొక్క యూర్ధ్వప్రాంతమునందలి రంధ్రమందు ప్రసిద్ధమైనట్టి దీప్తి ప్రకాశమానమగు అతనిశిఖ.

స్వయమేష మనస్తేన మనో నాస్యోపయుజ్యతే
ఆత్మైవ భోక్తృతామేతి కిల కస్య కథం కుతః. 18

ఈ బ్రహ్మదేవుఁడు సమష్టి మనస్స్వరూపుఁడగుటచే స్వయముగనే మనస్సై యున్నాఁడు. కావున నీతనికి సమస్త కల్పనలయందును మఱియొక మనస్సుయొక్క యుపయోగమేమియు లేదు. ఆత్మయే స్వభోగార్థము భోగసమూహమును గల్పించుచున్నదనిన, అట్లు కాదు. అయ్యది కూటస్థ, అద్వయ స్వరూపమగుటచే నట్టికల్పన యెట్లెచట నెవనికి అత్మచే సంభవించును?

స్వయమేవేన్ద్రియాణ్యేష తేనాన్యత్రాస్తితా కృతా
యతస్తత్కల్పనామాత్రమేవేన్ద్రియగణః కిల. 19

మఱియు, ఈ బ్రహ్మదేవుఁడు స్వయముగనే సమస్తేంద్రియ రూపుఁడైయున్నాఁడు. అతని చేతనే అస్మదాదులందు యింద్రియముల అస్తిత్వము కల్పింపఁబడియున్నది. కావున అతని యింద్రియ సమూహమున్ను కల్పనామాత్రమే యైయున్నది.

అవయవావయవినోరివేహేన్ద్రియచిత్తయోః
న మనాగపి భేదోఽస్తి త్వైక్యమేకశరీరయోః. 20

అవయవి; అవయవములవలె ఏకశరీరముగలిగియున్న చిత్త, ఇంద్రియములందొకింతేని భేదము లేదు, ఐక్యమేగలదు.

తస్య తాన్యేవ కార్యాణి జగతాం యాని కాని చిత్
సంకల్పా ఏవ పుంవృత్త్యా చలన్త్యారుపితద్వితాః. 21

జగత్తునందలి సమస్తక్రియ లాతనిక్రియలేయగును. ఏలయనగా? అతని సంకల్పములే సర్వజీవులయొక్క యారోపితమగు ద్వైతవ్యవహార రూపముచే నడుచుచున్నవి.

జాగతే తస్య విజ్ఞేయే నాన్యేఽన్య మృతిజన్మనీ
స ఏవేదం జగత్యస్మత్సంకల్పాత్మాస్య నేతరత్. 22

సమస్తజగత్తుయొక్క యుత్పత్తి, నాశములే యా బ్రహ్మదేవుని జనన, మరణములని యెఱుఁగవలయును. గాని ప్రత్యేక వ్యక్తియొక్కవి కావు. ఈ ప్రపంచముయొక్క సమష్టిరూపమున్ను అస్మదాది సర్వులయొక్క సంకల్పరూపమున్ను అతఁడేగాని మఱియెవరును గాదు.

తత్సత్తయా జగత్సత్తా తన్మృత్యైవ జగన్మృతమ్
యాదృశీ స్పన్దమరుతోః సత్తైకా తాదృశీ తయోః. 23

అతని సత్తచే జగత్తుయొక్క సత్తయు, అతని మరణముచే జగత్తుయొక్క మరణమున్ను సంభవించుచున్నది. వాయువు అద్దాని చలనముల కొకేసత్తగల్గి యుండునట్లు బ్రహ్మదేవునకును అతనిచేఁ గల్పితమగు జగత్తునకును నొకేసత్త గల్గియున్నది.

జగద్విరాజోః సత్తైకా పవనస్పన్దయోరివ
జగద్యత్స విరాడేవ యో విరాట్ తజ్జగత్స్మృతమ్. 24

వాయు, స్పందములకువలె విరాట్, జగత్తుల కొకేసత్తగలదు. ఏది జగత్తో, అదియే విరాట్టు, అతఁడే జగత్తు.

జగద్బ్రహ్మ విరాట్ చేతి శబ్దాః పర్యాయవాచకాః
సంకల్పమాత్రమేవైతే శుద్ధచిద్వ్యోమరూపిణః. 25

జగత్తు, విరాట్టు, బ్రహ్మము — ఈమూఁడు పదములును నొకే యర్థమును బోధించునవై యున్నవి. ఈ విరాట్, జగత్తులు శుద్ధచిదాకాశరూపుఁడగు పరమాత్మయొక్క సంకల్పమాత్రములేయై వాస్తవముగ (అధిష్ఠానరూపముచే) బ్రహ్మరూపములై యొప్పుచున్నవి.

శ్రీరామ ఉవాచః—

సంకల్పాత్స విరాడేవ ఖమేవాకృతిమాగతమ్
అస్తు నామ స్వదేహాన్తః కథం బ్రహ్మైవ తిష్ఠతి. 26

శ్రీరాముడు:— ఓ మునీంద్రా! సంకల్పముచే పరమాత్మ విరాడ్రూపమునుబొంది సాకారత్వము నొందెనను విషయము నంగీకరించితినిగాని, ఆ బ్రహ్మదేవుఁడు తన శరీరములోపల నెట్లువసించుచున్నాడో వచింపవేడెద.

శ్రీవసిష్ఠ ఉవాచః—

యథా ధ్యానేన దేహాన్తస్తిష్ఠసి త్వం యథా స్థితమ్
తథాస్తే నిజదేహేఽన్తః సంకల్పాత్మా పితామహః. 27

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! మానసపూజయందు హృదయమునఁ గల్పింపఁబడిన రత్నమండపమందు దేవుని గూర్చుండఁబెట్టి ఛత్రచామరాదులచే నీవాతనిని బూజించు నట్లనుభవమునందు విధమున సంకల్పరూపుఁడగు బ్రహ్మదేవుఁడున్ను దన శరీరములోపల వసింపఁగలఁడు.

నృణాం తథా చ ముఖ్యానాం జీవో బ్రహ్మపురోదరే
ఉత్పత్తిపుత్రికా దేహాః ప్రతిబిమ్బోపమోఽస్తి సః. 28

మఱియు, స్థూలదేహమందలి హృదయకమలమున సూక్ష్మదేహాత్మకమగు తమయొక్క జీవరూప స్థితి వివేకులందరికిని ననుభవ సిద్ధమేయైయున్నది. సర్వజీవులయొక్క దేహములున్ను నిర్మింపఁబడిన ప్రతిమాకారములవంటివి. అద్దమునందు ప్రతి బింబమువలె బ్రహ్మదేవుఁడుండును.

యత్ర త్వమపి దేహాన్తః కర్తుం శక్తోఽస్యలం స్థితమ్
సంకల్పాత్మా విభుస్తత్ర బ్రహ్మ కిం న కరిష్యతి. 29

నీవే నీస్థూలదేహమందు బాగుగ వసింపఁగల్గునపుడు, ఇఁక సంకల్పరూపుఁడును, సర్వ వ్యాపియునగు బ్రహ్మదేవుఁడేల వసింపలేఁడు?

బీజాన్తః స్థావరం హ్యాస్తే పదార్థే యత్ర జంగమః
కిం నాస్తే తత్ర దేహేఽన్తర్నిజచిత్కల్పనాత్మికా. 30

వృక్షాది స్థావరములున్ను దమ బీజమందు నెలకొనియుండగల్లు నపుడిఁక సర్వశక్తి యావిర్భవించినట్టి చైతన్య-కల్పనాత్మకుండగు బ్రహ్మదేవుఁడేల నిజదేహమున వసింపలేడు.

సాకారో గగనాత్మాస్తు నిరాకారం ఖమస్తు వా
ఆస్తే బహిరథాన్తశ్చ భిన్నే బాహ్యాన్తరే బహిః. 31

చిదాకాశరూపుఁడగు బ్రహ్మదేవుఁడు బ్రహ్మాండరూపముచే సాకారముగ నున్నను లేక, సమష్టి మనోరూపముచే నిరాకారమగు ఆకాశముగనున్నను, ఉభయస్థితులందును సమస్త పదార్థముల యొక్క బాహ్యాభ్యంతరములందు. వెలయుచుండును కాని వాస్తవముగ బాహ్యాభ్యంతర కల్పన పరమాత్మయందు లేదు.

ఆత్మారామః కాష్ఠమౌనీ న జడోఽపి దృషజ్జడః
అహంత్వమిత్యాదిమయో విరాడాత్మని తిష్ఠతి. 32

ఆ బ్రహ్మదేవుఁడు బాహ్యమున బ్రహ్మాండరూపుఁడుగను, అభ్యంతరమున 'అహం త్వా'దిమయుఁడును, ఆత్మయందాత్మారాముఁడుగను, కాష్ఠమువలె మౌనముగను నున్నవాడై, జడ. స్వరూపుఁడు గాకున్నను శిలవలె జడముగ నున్నవాఁడై స్వాత్మయందు విరాజిల్లుచున్నాడు.

ఆవేష్టితోజ్ఝితలతాతృణదారువృంవ
దుచ్ఛృఙ్ఖమమ్బురయవచ్చ విరోపితాఙ్గః
నానావిధేఽపి విహరన్నపి కార్యజాలే
తజ్జ్ఞః శిలాజఠరశాన్తమనస్క ఏవ. 33

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే విరాడాత్మవర్ణనం
నామ చతుఃసప్తతితమః సర్గః ॥ 74 ॥

ఓ రామచంద్రా! కేవలము విరాట్-పురుషుఁడేకాదు. తత్త్వజ్ఞానులందఱును లతా. తృణ, కాష్ఠ, మనుజ విగ్రహాదులవలె, రజ్జ్వాదులచే మొదట బంధింపఁబడినను, పిదప విడువఁబడినను క్రోధరహితులై మౌనముగ నుందురు. మఱియు జలప్రవాహమువలె నిరోధింపఁబడినను, అవయవములు ఛిన్నభిన్నములైనను తమ శాంత స్థితి నెన్నటికిని వీడరు. వివిధకార్యజాలములందు విహరించుచున్నను వారు శిలామధ్యభాగమువలె నిశ్చలురై, క్రోధాదివర్జితులై, శాంతచిత్తులైయే యుందురు.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున
నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున విరాడాత్మవర్ణన
మను డెబ్బదినాల్గవ సర్గము ॥ 74 ॥

పఞ్చసప్తతితమః సర్గః

[విధాతరి ధ్యానపరే ద్వాదశాదిత్యసంభవః
దహన్నత్ర జగత్సర్వం వర్ణ్యతే ప్రలయానలః.

బ్రహ్మదేవుఁడు ధ్యానపరుఁడు కాఁగా ద్వాదశాదిత్యులుద్భవించి జగత్తునంతయు దహించి వైచుట, ప్రళయాగ్నియొక్క స్వరూపము. ఇచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీవసిష్ఠ ఉవాచః—

అథాగ్రస్థ బ్రహ్మలోకే బ్రహ్మణి ధ్యానశాలిని
నిక్షిప్తాక్షః శనైర్దిక్షు దృష్టవానహమగ్రతః. 1
ద్వితీయమర్కం మధ్యాహ్నే పశ్చాదభ్యుదితం స్ఫుటమ్
దిగ్దాహమివ దిక్చక్రే వనదాహమివాచలే. 2

శ్రీ వసిష్ఠుఁడు:– ఓ రామచంద్రా ! బ్రహ్మదేవుఁడు ధ్యానతత్పరుఁడు కాఁగా, నేనింద్రాదుల నగరములయొక్క పతనమును జూచిన పిదప మెల్లగ దిక్కులవైపునకుఁ దృష్టిని బ్రసరింపనట సమ్ముఖమున దహనరూపమైనదియు, పర్వతముపైని అరణ్యదాహమునుఁ బోలినదియు, మధ్యాహ్నసూర్యుఁడుగాక వేఱైనదియు నగు రెండవసూర్యుఁడు పశ్చిమదిశయందు స్పష్టముగ నుదయించుటను గాంచితిని.

వహ్నిలోకమివ వ్యోమ్ని వడవాగ్నిమివార్ణవే
తతోఽపశ్యమహం దీప్తం సూర్యం నైఋతదిఙ్ముఖే. 3
సూర్యం యామ్యే కకుబ్భాగే సూర్యమగ్నికకుబ్ముఖే
సూర్యమైన్ద్రకకుబ్భాగే సూర్యమీశానదిఙ్ముఖే. 4
కుబేరకకుభి సూర్యం సూర్యం వాయవ్యదిక్తటే
సూర్యం వరుణదిగ్భాగే తేన విస్మయవానహమ్. 5
యావద్విచారయామ్యాశు విధివైధుర్యమాకులమ్
ఉదభూద్భూతలాత్తావదర్కః ఔర్వ ఇవార్ణవాత్. 6

ఆ పిదప ఆకాశమందు అగ్నిగోళమువంటిదియు, సముద్రమందలి బడబాగ్నిఁ బోలినదియు నగు ప్రదీప్తమైన మఱియొక సూర్యుని నైఋతిదిక్కునందు జూచితిని. తదుపరి అగ్నివలె, బ్రజ్వలితమగు మఱియొక సూర్యుని దక్షిణదిశయందు గాంచితిని. అట్లే పూర్వ, ఈశాన్యదిక్కులందును వేఱ్వేఱు సూర్యుల నవలోకించితిని. పిమ్మట ఉత్తర, వాయవ్యదిశలందును భిన్న భిన్న సూర్యులుదయించుటను గాంచి విస్మితుఁడనైతి. అపుడు నేను దైవముయొక్క ప్రతికూలత్వమును గూర్చి విచారించుచుండగనే యింతలో సముద్రమునుండి బడబాగ్నివలె, పృథివీతలమునుండి శీఘ్రముగ వేఱొక సూర్యుఁడు ప్రకటమయ్యెను.

ఏకాదశేఽఖిలార్కాణాం ప్రతిబిమ్బమివోత్థితమ్
ఉదభూత్త్రయమర్కాణామన్తరే దిగ్గణామ్బరే. 7
తద్ధి రౌద్రం వపుస్తత్ర తన్మధ్యే లోచనత్రయమ్
తద్ద్వాదశపరిమాణం దీప్తం వృన్దం వివస్వతామ్. 8
సర్వదిక్కం దదాహోచ్చైః శుష్కం వనమివానలః

మఱల దిక్సమూహముయొక్క మధ్య నున్న యాకాశమునఁ బదునొకండవ సూర్యుఁడున్ను, ఆ పిదప మఱియొక సూర్యుఁడున్ను నిట్లు పన్నిద్దఱు సూర్యులుదయించిరి. ఆ పదునొకండవ సూర్యునియందు సమస్తసూర్యుల ప్రతిబింబమువలె మఱి ముప్వురు సూర్యులుదయించిరి. ఆ సూర్యత్రయము రుద్రుని శరీరమైయున్నది. ఆ రుద్ర శరీరమందు మూఁడు నేత్రములు గలవు. ఆ రుద్ర శరీరమే ద్వాదశాదిత్య సమూహరూపమై, దిక్కులన్నింటిని, శుష్కమగు అరణ్యమును నగ్నివలె భస్మీభూతమొనర్చివైచెను.

అథోదభూజ్జగత్ఖణ్డశోషణగ్రీష్మవాసరః. 9
అనగ్నిరగ్నిదాహో ద్రాగదృశ్యోల్ముకగుల్మకః
అనగ్నినాగ్నిదాహేన తేన తామరసేక్షణ. 10
అఙ్గాని దావదగ్ధాని భిన్నానీవ మమాభవన్
ప్రదేశం తమథ త్యక్త్వా దూరమారూఢవానహమ్. 11

అటుపిమ్మట జగత్తును శోషింపఁజేయునట్టి ప్రచండ గ్రీష్మర్తువుయొక్క దివస ముద్భవించెను. కమలనేత్రుఁడవగు రామచంద్రా ! పిదప అదృశ్యములైన కొఱవులచే, ప్రసిద్ధాగ్ని రహితమగు సౌరాగ్ని (సూర్యాగ్ని) దాహము శీఘ్రముగ నుత్పన్నమయ్యెను. ఆ యగ్ని వేడిమిచే నా అవయవములు దగ్ధమై నవివలె భిన్నములాయెను. కావున నేనా స్థలమును వీడి యూర్ధ్వభాగమున దూరమగు యాకాశప్రదేశమును జేరితిని.

దృఢహస్తతలాఘాతహతకన్దుకవన్నభః
అపశ్యం గగనస్థోఽహముదితం చణ్డతేజసమ్. 12
తపన్తం ద్వాదశాదిత్యం గణం దిక్షు దిశస్వపి
బృహత్తత్ర నతారావజ్వాలేవ భగణం చలమ్. 18

బలవంతమైన చేతితోఁ గొట్టఁబడిన బంతివలె నెగిరి దూరమగు ఆకాశమున స్థితిగలవాఁడనై, ప్రచండతేజోయుక్తమై యుదయించునట్టి ప్రదీప్తమగు ద్వాదశాదిత్య సమూహమును నేనటనుండి వీక్షించితిని. ఆ యాదిత్యసమూహము దశదిక్కులను దపింపఁజేయుచుండెను. అత్తఱి యా దిశలందాకాశమును వ్యాప్తమొనర్చునదియు, జ్వాలవలె చంచల వర్తులాకారముగ నున్నదియు నగు నక్షత్ర చక్రమును నేను గాంచితిని.

మహాకుహాకుహాశబ్దం క్వథత్పాతాలడమ్బరమ్
నజ్వాలోల్ముకనీరన్ధ్రలోకాన్తరపురాన్తరమ్. 14
జ్వాలాఘనపటాటోపసిన్దూరీకృతపర్వతమ్
దీప్యమానమహాగారస్థిరవిద్యుత్కకుత్పటమ్. 15
స్ఫురత్కటకటాటోపచటత్పత్తనమణ్డలమ్
విదధద్భూతలోద్భూతధూమదణ్డైః శిలాఘనైః. 16
కాచస్తమ్భసహస్రాఢ్యం భువనస్థానమణ్డపమ్
క్వథద్భూతమహాభూతతాడితార్ణవనిర్ఘరమ్. 17
భూతలోకపురాపాతస్ఫుటచ్చటచటోద్భటమ్
తారావికరణోద్ఘాతఘృష్టరత్నధరాతలమ్. 18
సర్వస్థలాలయచలద్దహ్యమానజనవ్రజమ్

క్షీణాక్రన్దక్వథద్భూతగణదుర్వాసదిక్తటమ్. 19
ఉత్తప్తామ్బూదరాభిన్నజలేచరమహార్ణవమ్
సర్వదిక్కానలప్లోషక్షీణాక్రన్దపురాన్తరమ్. 20
విదలద్దగ్ధదిగ్దన్తిదత్తోత్తమ్భితభూధరమ్
ధరాధరదరీరన్ధ్ర ధూమమణ్డలకుణ్డలమ్. 21
పతత్పర్వతనిష్పిష్టప్లుష్టపత్తనమణ్డలమ్
పచత్పచత్పచాశబ్దశబ్దితాద్రీన్ద్రకుఞ్జరమ్. 22
తాపతప్తోన్నమద్భూతజ్వరితార్ణవపర్వతమ్
హృదయస్ఫోటనిస్సారపతద్విద్యాధరాఙ్గనమ్. 23

ఆ ద్వాదశ సూర్యసమూహము గొప్ప 'కుహ కుహ' శబ్దముతోఁ గూడినదియు, సప్త సముద్రములను గాచునదియు, జ్వాలాయుక్తములగు కొలువులచే లోకలోకాంతరములను, నగరములను వ్యాప్తమొనర్చునదియు, జ్వాలారూపములగు మేఘములను రక్తవస్త్రములచేఁ బర్వతములను సిందూరవర్ణయుతములుగాఁ జేయునదియు, దేదీప్యమానములగు లోకపాలుర స్థానములందు దిఙ్మండలమును స్థిరవిద్యుద్రూపముగ నొనర్చునదియు, నగరసమూహమును వ్యక్తమైన 'కట కటా, చట చటా' శబ్దయుక్తముగఁ గావించునదియు, శిలవలె ఘనీభూతమై, దండాకారముగ నున్నట్టి ధూమములచేఁ బదునాల్గు లోకములను మండపమును వేలకొలఁది కాచ (గాజు) స్తంభములతో గూడినదానినిగఁ జేయునదియు, దహించి పోవుచున్న ప్రాణులయొక్కయు, పృథ్వ్యాది భూతములయొక్కయు రోదనములచే ఘర్ఘరశబ్దముతో గూడినదియు, నలువైపుల ప్రాణులయొక్కయు, లోకములయొక్కయు, అందలి నగరములయొక్కయు పతనముచే 'చట చటా' శబ్దములచేఁ బూర్ణమైనదియు, నక్షత్రముల పతనముయొక్క ప్రహారములచేఁ బృథ్వీతలమందలి రత్నములను ఘర్షితమొనర్చునదియు, సమస్తస్థలములందును, గృహములందును బరుగిడుచున్నట్టి దహింపఁబడుచున్న జనసమూహము గలదియు, మరణించినవియు, రోదన పూర్వకముగ దహింపబడుచున్నవియు నగు ప్రాణులచే దిక్కులన్నింటిని దుర్గంధయుతముగ గావించునదియు, బాగుగ కాగిన సముద్రజలముచే జలచరజీవులను వ్యాకులమొనర్చునదియు, సర్వదిశలందును వ్యాపించిన అగ్ని దాహముచే బ్రాణులు మరణింప, అనేకనగరములను శమించిన రోదనము గలవిగ గావించునవియు దలితములై, విదగ్ధములైనట్టి దిగ్గజముల దంతములను స్తంభములచే పృథివిని అధోభాగమున ధరింపజేయునదియు, పర్వతగుహలను ధూమమండలముచేఁ బూర్ణమొనర్చునదియు, పడుచున్న పర్వతములచే కాలిన నగర సమూహమును చూర్ణము చేయునదియు, మహాపర్వతములను అందలి యేనుఁగలను 'పచ పచా' శబ్దములచే దహింపఁజేయునదియు, గొప్ప వేడిమిచే సంతప్తములై గంతులిడుచున్న సముద్ర, పర్వతములను జ్వరయుక్తములుగఁ గావించునదియు, హృదయవిదారణముచే సారరహితులగు విద్యాధరస్త్రీలను బడఁద్రోయునదియునై యొప్పుచుండెను.

ఆక్రన్దరోదనక్రాన్తమూర్ధనిః సరణామరమ్
నాగలోకజ్వలజ్జ్వాలాపాతలోత్తప్తభూతలమ్. 24
శుష్కార్ణవసద్దావక్వవివర్తోగ్రజలేచరమ్

ఔర్వేణాబిన్ధనాభావాత్రోడ్డీయేవ సహస్రధా. 25
గతేన నృత్యతోత్థాయ గృహీతగగనాఙ్గనమ్

అత్తఱి కొందఱు అఱపులచేతను, ఏడ్పులచేతను శ్రమనొందియుండిరి. కొందఱు యోగబలముచే బ్రహ్మరంధ్రమును భేదించుకొని వెడలి అమరులైరి. నాగలోకమును జ్వలింపజేయు అగ్నిజ్వాలలచే పాతాళమువఱకు భూతలము సంతప్తమాయెను. చిరకాలము తపింపబడినట్టి భయంకర జలచరజీవులు శుష్కసముద్రములం దిటునటు దిరుగుచుండెను. జలమను ఇంధనములు లేనికారణమున బడబాగ్ని అనేకవిధముల భిన్న భిన్నమగుచుండెను. నృత్యమొనర్చుచున్న అప్సరసలు ద్వాదశాదిత్యులచే గ్రహింపబడి సంతప్తలగుచుండిరి.

అథోదభూజ్జ్వలజ్జ్వాలాకింశుకాంశుకశోభితః. 26
తాణ్డవాయేవ కల్పాగ్నిస్తరలోల్ముకమాల్యవాన్
తారం పటపటాటోపీ రటద్ఫట ఇవోద్భటః. 27
జ్వాలోద్భుజో ధూమకచో జగజ్జీర్ణకుటీనటః

అటుపిమ్మట జ్వలించు జ్వాలయను రక్తవస్త్రముచే శోభితమైనదియు, చంచలములగు కొఱవులను మాలలుధరించినదియు, గొప్ప 'పటపటా' శబ్దములతోఁగూడి పగులు వెదుళ్లు మున్నగువానిచే అనేకవాద్యసహితమై యొప్పువీరునివలెఁ జెన్నొందునదియు, మహాప్రజ్వలిత జ్వాలారూపమగు భుజములు గలదియు, ధూమమను కేశములచే భూషితమైనదియునగు ప్రళయాగ్నియను నటుఁడు జగత్తను శిథిలకుటీరమున నృత్యమొనర్పసాగెను.

జజ్వలుర్వనజాలాని పురాణి నగరాణి చ. 28
మణ్డలద్వీపదుర్గాణి జఙ్గలాని స్థలాని చ
సర్వఖాని మహాకాశమాశా దశ దివః శిరః. 29
శ్వభ్రరూపారఘట్టాట్టపట్టనోదారదిక్తటః
శృఙ్గాణి సిద్ధవృన్దాని గిరయః సాగరార్ణవాః. 30
సరః సరస్యః సరితో దేవాసురనలోరగాః
ఆశాః శనశనాశబ్దైః పురుషైశ్చ శివార్చిషామ్. 31

ఆసన్నీడాకురాక్షస్యో జ్వాలాజాలోజ్జ్వలోర్ధ్వజాః
భ్రమద్భ్రమితి భాంకారైర్భీషణైర్భూరిభస్మభిః. 32

ఆ ప్రళయాగ్నిచే అరణ్యసమూహములు, గ్రామములు, నగరములు అన్నియు దగ్ధములు కాఁజొచ్చెను. మండల, ద్వీప, దుర్గ, అరణ్యస్థలములును పాతాళాది భూఛిద్రములును, మహాకాశమున్ను, స్వర్గలోకముయొక్కయు పరిభాగమున్ను జ్వలింపఁబడసాగెను! ఒకచోట నుత్తమగర్తముల చేతను, ఇంకొకచోట జలయంత్రములచేతను, వేఱొకచోట, నెత్తైనమేడలను దమనీయమైనట్టి దిక్తటమున్ను, పర్వత శిఖరములున్ను అట వసించు సిద్ధాదుల సమూహములున్ను,

పర్వత, సాగర, మహాసాగరములున్ను దహింపబడజొచ్చెను. సరస్సులు, జలాశయములు, నదులు, దేవతలు, అసురులు, మనుజులు సర్పములతోసహా దిశలన్నియు ఆ రుద్రునిచే నేత్రజ్వాలలచే దగ్ధములు కానారంభించెను. మఱియు, జ్వాలాసమూహమను కేశముల ధరించినదియు, భయంకరములైన భాంకారశబ్దములచేఁ బరస్పర మధికభస్మమును విసరుకొనునవియు, ఒకరిదానిపై మఱియొకటి ధూళి జలాదులను జల్లుకొనునవియునగు దిక్కులు దుష్టరాక్షసులవలె క్రీడాతత్పరములాయెను.

జ్వాలాః శ్వభ్రాద్రిభూమీనాం గుహాభ్యః పరినిర్యయుః
జ్వాలోదరస్థాఅరుణాః సమస్తా భూతజాతయః. 33
స్థలపద్మోదరాలీనామాజహ్రుః శ్రియమ్ శ్రియః
సద్యో నిఃసృతరక్తాభైః సిన్దూరామోదసున్దరైః. 34
ధగద్ధగితి గాయద్భిర్జ్వాలాజాలైర్జగద్గతైః
ఆసీద్రక్తాంశుకైః కీర్ణం సంధ్యాభ్రైరివ వానభః. 35
ఉత్ఫుల్లకింశుకవనై రుడ్డీనైరివ వావృతామ్
ఔర్వేణ చావృతా ఆసన్ఫుల్లాశోకవనా ఇవ. 36
ఇవ స్థలాబ్జవలితా రావిరా ఇవ చార్ణవాః

గోతులతోఁగూడిన పర్వతభూములయొక్క గుహలనుండి అగ్నిజ్వాలలు బయల్వెడలెను. ఆ జ్వాలామధ్యముననున్న ప్రాణి సమూహములన్నియు రక్తవర్ణయుతములాయెను. దిక్కులు సంపత్తిరహితములై, అప్పుడపుడు బయలుదేరిన రక్తవర్ణపు జ్వాలలచే స్థలపద్మములయొక్క మధ్యభాగమువంటి శోభనుధరించెను. 'ధగత్, ధగత్' శబ్దములచేఁ బాడుచున్నట్టి జగత్తునందలి జ్వాలాసమూహములచేఁ నాకసము సంధ్యాకాల మేఘములవలె రక్తవస్త్రములచేఁ గప్పఁబడినట్లుండెను మఱియు, వికసించిన కింశుక (మోదుగ) వనములచేవలె ఆకాశము రక్తవర్ణజ్వాలలచే వ్యాప్తమై యొప్పుచుండెను. సముద్రములున్ను వికసించిన అశోకవనమువలె రక్తవర్ణయుతములై బడబాగ్నిచే, గప్పఁబడెను. మఱియు నయ్యవి స్థలకమలములచే నావృతమైనట్లును, ప్రాతఃకాల సూర్యసమూహములచే వ్యాప్తమైనట్లును భాసించుచుండెను.

నానావర్ణజ్వలజ్జ్వాలాధూమవిన్యాసబన్ధవాన్. 37
రూఢం వహ్నిమివాధాతుం చిత్రసౌధలతాశ్రయమ్
అనన్త ఇవ విన్యాసవనయౌవనపావకః. 38
ఉదయాస్తమయాదిభ్యో విన్ధ్యో విదురతామగాత్
అఙ్గారకల్పవిటపైర్జ్వాలావనవిపల్లవైః. 39
శనైరీషదివ ప్లుష్టైః సహ్యోఽసహ్యత్వమాయయౌ
మధ్యమధ్యకచత్కార్ష్ణ్యభ్రమద్ధూమాలిమాలికమ్. 40
వలజ్జ్వాలాబ్జమలినం దృష్టం సర ఇవామ్బరమ్

వనములందు యౌవనమును బొందునదైన దావాగ్ని సౌధతలము నాశ్రయించు చిత్రలిఖితమగు మిథ్యాగ్నిని సత్యాగ్నిగ నొనర్పుటకా యనునట్లు వివిధవర్ణములచేఁ బ్రజ్వలితమగు జ్వాలలతో గూడి ధూమసమూహయుతమై యనేక శిరస్సులతోఁగూడిన సర్పరాజు (శేషుఁడు)వలె విస్తరించెను. పెక్కు సూర్యుల యుదయాస్తమయములచే వింధ్యపర్వతమున్ను క్షీణత్వమొందెను. గంతులిడుచున్న యగ్నిజ్వాలలతోఁగూడిన వృక్షములు గలదై, సంక్షోభముఁజెందినట్టి వనములచే దక్షిణదేశమందలి సహ్యపర్వతము అసహ్యత్వమును బొందెను. మధ్య మధ్య ప్రకాశమానమగు కృష్ణవర్ణముతోఁగూడిన ధూమమను భ్రమరములచే నావృతమై, ధూమయుక్తములగు యగ్నిజ్వాలలను కమలములచే వేష్టితమై యాకాశము సరోవరము భంగి గన్పట్టెను.

ఖేఽద్రీణాం శిఖరే వ్యోమ్ని శిఖాశిఖరశేఖరాః. 41
ననృతుర్నీరసా నాశనరక్త్యః కేతుకున్తలాః
తలాహితానిలాజ్వాలా బ్రహ్మాణ్డోర్ధ్వకపాటభూః. 42
తర్జనప్రోత్పతద్భూతధానౌఘా భ్రాష్ట్రవ్యభూమికా
క్వణచ్ఛ్రేణీ మృజ్జలాగ్నిర్నానావర్ణాననారుణా. 43
హృత్త్రపకోష్ఠేజగల్లక్ష్మ్యాః సౌవర్ణీవాభవత్తదా

జ్వాలాగ్రములచే మనోహరులై, ధూమకేతువను కేశపాశములతోఁగూడినట్టి ఆశరూపిణులగు నర్తకులు పర్వత గుహలందును, శిఖరములందును, శూన్యాకాశమందును గూడ కరుణారసశూన్యలై నృత్యమొనర్పసాగిరి. అత్తఱి బ్రహ్మాండముయొక్క యూర్ధ్వబాగమను మూఁత గలదై, అధోభాగమున అగ్నిజ్వాలలచే వ్యాప్తమై, బాధచే నెగిరెగిరి పడుచున్న ప్రాణికోట్లను ధ్యానముతోఁ గూడినదై పృథివి భ్రాష్ట్రము (వేపుఁడు చట్టి) వలె నొప్పుచుండెను. అనేక దీపములందలి మృత్తికల చేతను, సమస్త సముద్రముల జలములచేతను, అట వ్యాపించిన అగ్నులచేతను, వివిధవర్ణయుక్తమైనట్టి పృథివి, ఆ ప్రళయకాలమున వక్షస్థలమును బాదుకొని యేడ్చుచున్న జగల్లక్ష్మియొక్క హృదయమున స్థాపింపఁబడిన హస్తమందలి సువర్ణరచిత కంకణ సమూహమువలె శోభించెను.

శైలాశ్చటచటాస్ఫోటైర్వృక్షాః కటాకటారవైః. 44
దేశాహలహలోల్లాసైరలం విదలనం యయుః
అబ్ధయః క్వథితాకారాః ఫేనిలోల్లాసమాంసలాః. 45
వీచీకరతలాఘాతాంశ్చక్రురర్కముఖే ముఖే
అన్యోన్యవేల్లితోల్లోల భూతలాకార పర్వతమ్. 46
జహ్రుర్వీచీకరైర్దేహ జడాః ప్రకుపితా ఇవ
ఆశాకాశాశినామేషాం గుహాగుహగుహారవాన్. 47
పపాత, శబ్ద ఆగ్నేయో జ్వాలాతటతటోద్భవః

మఱియు, ఆసమయమునఁ బర్వతములన్నియు 'చట చటా' శబ్దములతోడను, వృక్షములన్నియు 'కటకటా' రవములతోడను బగులఁజొచ్చెను. దేశములన్నియు 'హలహలా' శబ్దములచేఁ జూర్ణముగ వినాశమొందెను. కాగిన జలముతోఁ గూడినవై, సురుగులచే మనోహరములైనట్టి

సముద్రములు తమయందుఁ బ్రతిబింబించిన సూర్యుఁడను దిలకము గలవై, తరంగములను హస్తములచేఁ దమముఖముపై బాదుకొని యేడ్వఁదొడఁగెను. మహాకోపముఁజెందిన మూర్ఖులు మృత్తికాశిలాదులను దినునట్లు, ఆ సముద్రములు తరంగములయొక్క పరస్పర అఘాతములచే మృత్తికాశిలాదుల నేకమొనర్చుటద్వారా పర్వతములను భూతలాకారముగ జేసివైచి తరంగములను హస్తములచే వానిని భుజించుచున్నట్లుండెను. మఱియు, అ సముద్రములు తమయందలి పర్వతగుహల నుండి వినిర్గతములైనవియు, దిక్కులను బూర్ణమొనర్చునవియునగు జ్వాలలచే 'గుహగుహ' మను శబ్దమును గావించుచుండెను. వేఱొకచోట, పర్వతతటముల సంఘట్టనముచే నుత్పన్నమైన అగ్ని శబ్దమును ఆ జ్వాలలు పఠించుచుండెను.

లోకపాలపరాపాతతప్తాగ్గారాద్రి భిత్తయః. 48
దిశో దశాపి వైవశ్యం యయురున్మత్తవృత్తయః
కాఞ్చనద్రవసాద్రీన్ద్ర ద్రుమాగార గుహాగృహః. 49
శనైశ్చార్వాకృతిర్మేరురాసీద్ధిమ ఇవాతపే

అపుడు, లోకపాలుర నగరములు పడుటచేతను, పర్వతములను గోడలన్నియు అగ్నిమయములగుటచేతను, దశదిక్కులున్ను ఉన్మత్తుని చేష్టలతోఁగూడినవై వ్యాకులత్వమొందెను. సువర్ణద్రవభూతములైన సమీపపర్వతములతోడను, ఇంద్ర, కల్పవృక్ష, గుహాగృహములతోడను గూడిన 'మేరుపర్వతమపుడు' ఆ తపముచే హిమమువలె కరఁగిపోయెను.

క్షణే నైవానలాత్తస్మాద్ధిమవాఞ్జతువద్రుతః. 50
సర్వాన్తః శీతలం శుద్ధో దుర్జనాదివ సజ్జనం

సర్వథా అంతఃకరణమున శీతలుఁడై శుద్ధుఁడైనట్టి సజ్జనుఁడు దుర్జనునివలన కరఁగిపోవునట్లు, అత్తఱి ప్రళయాగ్నిచే హిమాలయము లక్కవలె క్షణములోఁ కరఁగిపోయెను.

తస్యామపి దశాయాం తు మలయోఽమలసౌరభః. 51
అసీత్త్యజత్యుదారాత్మా న నాశేఽప్యుత్తమం గుణమ్
నశ్యన్నపి మహాన్హ్లాదం న ఖేదం సంప్రయచ్ఛతి. 52

అట్టి నాశదశయందును మలయపర్వతము నిర్మల సుగంధయుక్తముగనే యుండెను. ఏలయనిన, ఉదారచిత్తుఁడు నాశసమయమునను తన యుత్తమ గుణములనుద్యజింపనేరఁడు, మఱియు ఉత్తముఁడగు మహాత్ముఁడు నశించుచున్నప్పటికిని బ్రసన్నుఁడుగనే యుండునుగాని దుఃఖమొందడు.

చన్దనం దగ్ధమప్యాసీదానన్దాయైవ జీవతామ్
న కదాచన సంయాతి వస్తూత్తమమవస్తుతామ్. 53

చందనము దగ్ధమగుచున్నను జీవుల కానందమునే గొల్పును. ఉత్తమవస్తువెన్నఁటికిని నికృష్టత్వము నొందనేరదుగదా !

ప్రలయానలనిర్దగ్ధమపి హేమ న నష్టవత్
ద్వే హేమనభసీ తస్మిన్న నష్టే ప్రలయానలే. 54

ప్రళయాగ్నిచే దహింపఁబడినను సువర్ణము నశింపకనే యుండెను. ఈ రీతిగ అప్రళయాగ్నియందు సువర్ణము, ఆకాశమను రెండువస్తువులు మాత్రము నశింపనివై యుండెను.

తయోరేవ వపు శ్లాఘ్యం సర్వనాశేఽప్యనాశయోః
నభో విభుతయాఽనాశి హేమాకృష్టతయాక్షయమ్. 55

సమస్తము నశించినను నశింపకయున్నట్టి యారెంటియొక్క శరీరమున్ను శ్లాఘనీయమైనదే యగును. ఆకాశము వ్యాపకమగుటచేతను, సువర్ణము దోషరహితమగుటచేతను నాశము లేనివైయున్నవి.

సత్వమేకం సుఖం మన్యే న రజో న చ వా తమః

ఇక్కారణమున, ఓ రామచంద్రా ! రజస్తమోగుణములు లేనట్టి బ్రహ్మానందదాయకమగు శుద్ధసత్వగుణమునే సుఖసారమని నేనెంచెద.

చలదుచ్ఛవనానీవ వికీర్ణాఙ్గారవర్షణః. 56
దగ్ధాబ్ధాద్రిర్మహాధూమ జ్వాలోఽభూద్వహ్నివారిదః
రసవిస్మరణార్తానాం శూన్యానాం స్ఫారదేహినామ్. 57
శుష్కాణాం వ్యోమవిటపిపత్రాణాం పాత్రరూపిణామ్
వారిదానాం సవారీణాం దగ్ధానాం ప్రలయార్చిషా. 58
జ్ఞ న్యేవాజ్ఞనదోషాణాం దృష్టం భస్మాపి న క్వచిత్

ఆసమయమున మేఘములను పర్వతములను దహింపఁజేయునదియు ధూమముతోఁ గూడిన జ్వాలాసహితమైనదియునగు ప్రళయాగ్నియను మేఘము, చలించు గొప్ప యున్నతవనములవలె నాకాశమున స్ఫురించుచు, నిప్పుల వర్షమును వెదజల్లెను. మఱియు, జలములన్నియు, బూర్ణముగ శోషింపఁబడుటచే జలాభావమున నతిదుఃఖులైమరణించి, శూన్యమువలె విశాలదేహమును ధరించినట్టి అండజాది చతుర్విధప్రాణులయొక్కయు, ప్రళయాగ్నిచే దగ్ధమైనట్టి జలముగలవై, సర్వదాశుష్కించి పోవుటచే సాకాశ వృక్షపత్రములవలె శూన్యరూపముఁజెందిన మేఘములయొక్కయు భస్మమైనను నొక్కకచోట - జ్ఞానియొక్క జ్ఞానాగ్ని దగ్ధములగు దోషములవలె - కానుపింపకనేయున్నది,

న లఙ్ఘయతి కైలాసం యావదుల్లసితోఽనలః. 59
తావత్తం కల్పకుపితో రుద్రో నేత్రాగ్నినాదహత్
దాహస్ఫుటద్ద్రుమస్థూల శిలాచటాచటారవాః. 60
లకుటోపలలోష్టాఘైరయుధ్యన్తేవ భూభృతః
జ్వాలాఘనఘటాటోప సావతంసచలాన్తిమాః 61
బభూవుర్వ్యోమ వికసత్స్థూలపద్మవనా ఇవ
సర్గః కదాచిదేవాసీదిత్యగాత్స్మరరణీయతామ్. 62

ఉల్లాససహితమగు ఆ ప్రళయాగ్ని అంతవఱకును గైలాసపర్వతమును దహింపకయుండ నింతలో కల్పాంతకమునకై కుపితుఁడగు రుద్రుఁడద్దానిని దన నేత్రాగ్నిచే భస్మీభూతమొనర్చెను. వేడిమిచే బ్రద్దలగుచున్న వృక్షములయొక్కయు, గొప్ప శిలలయొక్కయు చటచటా

శబ్దములతోఁ గూడినవై పర్వతములన్నియుఁ గుబ్బములతోటిని రాళ్లతోటిని బరస్పరము యుద్ధమొన ర్చుకొను చున్నట్లు తోచుచుండెను. అగ్నిజ్వాలా విలాసములచే, జంచలములైన శిఖరములతోఁగూడి నవైయా పర్వతములన్నియు వికసించిన మహాపద్మవనమువలె నాకసమునఁనొప్పుచుండెను. వెయ్యేల! సమస్తము ఎపుడో సృష్టియుండి -యుండెను. అనిపించునట్టి స్మరణీయదశను పొందినదాయెను.

కల్పాన్తః స్మారయన్మూర్ఖానగాదస్మరణీయతామ్
తాపోపతాపపరమాః పరమారణతత్పరాః
వహ్నయోఽవహ్నవం చక్రుర్జగతామసతామివ 63

మూర్ఖులకు సంసారముయొక్క అసారత్వమును స్మరింపఁజేయుచు నపుడు కల్పాంతము ప్రత్యక్షమయ్యెను. తాప, ఉపతాపములందుఁ బ్రవీణములైనవియు, పదవినాశమునందు తత్పర ములు నగు ప్రళయాగ్నులు శశశృంగాదుల చందమున జగత్తులయొక్క అత్యంతాభావమును గావించెను.

పవురశనినిపాతపీడితాఙ్గాః
కచదనలోల్ముకగుల్మమణ్డలాఢ్యాః
ప్రలయసమయవాయవోఽనలాన్తా
ద్దలదమరావలయో లయేలిహన్తః. 64

విద్యుత్పాతములచే ప్రాణుల అవయవములను బీడించునవియు, ప్రకాశమానములఁగు అగ్ని జ్వాలలతోఁగూడి యుండుటచే వృక్షసంతతిఁ బోలునవియు, దేవతల విమానాదులను శిథిల మొనర్చునవియు నగు ప్రళయ వాయువులపుడా యగ్నిమధ్యమునుండి బయల్వెడలి దిక్కులను నాకుచు వీవ దొడఁగెను

వ్యాలోలస్ఫుటదానలద్రుమవలప్రోద్భూతభస్మోష్మణా
దత్తాభ్రాభ్రమదుల్ముకాహతివహత్స్ఫాఙ్గారగౌరార్చిషః
భ్రశ్యత్పావకశృఙ్గమధ్యవిలసజ్జ్వాలావలీశ్యామలా
నిఃశేషాగ్నినికాశసుస్తవజవా వేగేన వాతా వవుః. 65

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే మహాకల్పాన్తాగ్నివర్ణనం నామ పఞ్చసప్తతితమః సర్గః ॥75॥

ఆ సమయమున, చంచల జ్వాలలచే వికసించు నట్టి అగ్నిచేఁ బరిబూర్ణములైన వృక్షము లతోఁగూడిన వనములం దుత్పన్నమైన భస్మసహితమగు యుష్ణత్వముచే నాకాశమును మేఘ యుక్తముగ గావించునదియు, పరిభ్రమించు ఉల్ముకముల (కొఱవుల) ఆఘాతములచే బయలు దేఱిన నిప్పులతో గూడినట్టి పీతవర్ణజ్వాలలను ధరించినవియు, అగ్నియను బర్వతముయొక్క శిఖామధ్యమున విలాసపూర్వకముగ నుండునట్టి కజ్జలము (కాటుక)తోఁ గూడినవియునగు జ్వాలా సమూహములచే శ్యామవర్ణ సహితములైనవియు, సమస్త జగత్తునందలి అగ్నులను బ్రకాశింపఁ జేయుటచే ప్రశంసనీయమైనట్టి వేగము కలవియునగు వాయువులు ప్రచండముగ వీవసాగెను.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున మహాకల్పాన్తాగ్ని వర్ణనమను డెబ్బదియైదవ సర్గము ॥75॥

షట్సప్తతితమః సర్గః

[ఊర్ధ్వ వారుణదిగ్భాగే పుష్కరావర్తకోదయః
వర్ణ్యతేఽత్రోప సంహారోఽప్యగ్నేరాగ్నేయదిఙ్ముఖే,

పశ్చిమదిక్కుయొక్క యూర్ధ్వభాగమందు 'పుష్కరావర్త'ములను ప్రళయమేఘము లుదయించుట, దక్షిణదిక్కునందగ్ని శమించుట యను విషయము లిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీవసిష్ఠ ఉవాచ:—

అథ కల్పాన్తమరుతి వహత్యవధుతాచలే.
బలేనామ్భోధికల్లోలైర్నభస్యావర్తకారిణి. 1

సముద్రేషు విముద్రేషు మర్యాదోల్లఙ్ఘనే ఘనే
అధనేషు ధనిష్వమ్బుదారిద్ర్యోపద్రవద్రుతే. 2

భూతలే భూతలేశాంశవర్జితే వహ్నిభర్జితే
పాతాలమపి నాతాలే గతే కిమపి కాలతః. 3

దివి వా విద్యమానాయాం విశీర్ణే సర్గవర్గకే
లోకే వ్యోమగతాలోకే శోకాకసి కకుబ్గణే. 4

కుతోఽప్యాకాశకుహరాద్ద్రుప్తదైత్యగణా ఇవ
పుష్కరావర్తకా మేఘాశ్చక్రుర్గులుగులారవమ్. 5

శ్రీ వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! అటుపిదప, పర్వతములఁగూడఁ గంపింపఁజేయు నవియు, తమ బలముచే సముద్రతరంగములద్వారా యాకాశమందును ఆవర్తములను లేవగొట్టు నవియు నగు ప్రచండ వాయువులు వీవ, ధనికులు నిర్ధనులగునట్లు, హద్దును మీఱునట్టి సముద్ర ములు జలాదారిద్ర్య దుఃఖముచే నశించుచుండ, అగ్నిచే దగ్ధమై భూతములమున్ను భూతిలాంశ రహితమై యొప్ప, పాతాళమున్ను కాలక్రమమున నశింప, సృష్టి ఛిన్నభిన్నమై వినాశమొంద, స్వర్గలోకమున్ను నాకాశమందలి సూర్యప్రకాశమున మిళితము కాఁగా, దిక్కులన్నియు శోక నిమగ్నములు కాఁగా, అపుడొకానొక యాకాశమను గర్తమునుండి వెలువడినవై, దైత్య సమూహము వలె పుష్కరావర్తములను మేఘములు 'గులుగులు'మను శబ్దమొనర్పసాగెను.

బ్రహ్మవిస్ఫోటితస్వాణ్డకుడ్యవిస్ఫోటనోద్భటమ్
అన్యోన్యాస్ఫాలనోత్ఫాలమత్తార్ణవరవావిలమ్. 6
లోకార్ణవపురాద్గీర్ణఘనకోలాహలోల్బణమ్

ఏతత్కులాచలస్కన్ధబద్ధోగ్రరవఘర్ఘరమ్.
7
బ్రహ్మణ్డశకలజఠరపూరణావర్తమన్థరమ్
స్వర్లోకరోదఃపాతాలతలతోఽతిసగుల్మకమ్.
8
సమస్తదూరదిగ్భిత్తిహేలాహేలసఘర్ఘులమ్
మహాప్రలయసంపన్నాపానకాపానతర్షులమ్.
9
ప్రసృతప్రలయాభ్యన్ధ్రమత్తైరావతబృంహితమ్
ఆకల్పక్షుబ్ధమేఘాబ్ధినిర్హ్రాదమివ సంభృతమ్.
10
మహాప్రలయసంక్షుబ్ధక్షీరోదమథనారవమ్
బ్రహ్మణ్డోగ్రారఘట్టేఽస్మిన్వార్యన్త్రమివ సారవమ్.
11

ఆ మేఘముల శబ్దము, బ్రహ్మదేవునిచేఁ బగులగొట్టబడిన బ్రహ్మాండమను గోడయొక్క ధ్వనివలె నున్నతమైనదియు, పరస్పర మొకదానిపై నొకటి గంతులు వేయుచున్న మదించిన సముద్రములయొక్క శబ్దమువలెఁ గలుషితమైనదియు, లోక, సముద్రనగరములందుఁ బ్రతి ధ్వని రూపముచే వ్యాపించిన కోలాహలములచే నతి దుస్సహమైనదియు, పైన వచించిన కులపర్వతములయొక్క గొప్ప దహనశబ్దములతోటి కలియుటచే ఘర్ఘరశబ్దయుక్తమైనదియు, బ్రహ్మాండమను శంఖమును బూరించుటచే గలిగిన ధ్వనివలె గంభీరమైనదియు, స్వర్గలోక, పృథివీ, పాతాళములవఱకనేక శాఖలచే వ్యాప్తమైనదియు, అతిదూరస్థములై, అపారములైనట్టి దిక్కులను గోడలను లీలాపూర్వకముగ నొరయునట్టి స్వభావము గలదియు, మహాప్రళయకాలమున సప్తసముద్రములు కలిపి కాఁగుటచే సంభవించిన పానకమును ద్రావుటయం దిచ్ఛగలదియు, విజయార్థము బయల్వెడలిన ప్రళయమను ఇంద్రుని మదించిన ఐరావతముయొక్క గర్జనవలె వృద్ధిబొందినదియు, ప్రళయమువఱకు, చిరకాలము నిరోధింపఁబడుటచే సంక్షుబ్ధములైన, మేఘములను సముద్రములయొక్క చిరసంచితమై, ఏకకాలమున వినిర్గతమైనట్టి శబ్దమును బోలినదియు, మహానదియు,మహాప్రళయముచే సంక్షోభమొందిన క్షీరసాగరముయొక్క మంథనశబ్దమువలె నున్నదియు, బ్రహ్మాండమను గొప్ప ఘటీయంత్రమందలి జలధార యంత్రముయొక్క శబ్దమువంటిదియునై యుండెను.

అథాస్మిన్నతి కల్పాగ్నౌ స్థితిమేతి కథం ఘనః
ఇతి విస్మితవానస్మి దృశం దిగ్నవకేఽత్యజమ్.
12
యావన్న క్వచిదేవాత్ర పశ్యామ్యాశాసు కేవలమ్
తరన్తితరలాస్ఫాలముల్బకాశనివృష్టయః
13
తేన జ్వలనతాపేన బహుయోజనకోటిషు
పదార్థా భస్మతాం యాన్తి దూరేదిక్షు దశస్వపి.
14
అనన్తరం క్షణాన్వ్యోమ్ని దూరేఽహమనుభూతవాన్
ఊర్ధ్వతః శీతలంవాతమదస్తాదనలోపమమ్.
15
ఏతావతి నభోమార్గే దూరే కల్పామ్బుదాః స్థితాః
యస్తేషామగ్నితాపానాం విషయో నచ సద్దృశామ్.
16

తదుపరి 'ఈ ప్రళయాగ్నియందు మేఘములెట్లు స్థితిఁబొందఁగల్గినవి' అని తలంచి విస్మితుఁడనై యా మేఘాన్వేషణకొఱకై యధోదిశయందు దప్ప తక్కిన తొమ్మిది దిక్కులందును దృష్టిని బ్రసరింప ఏ దిక్కునందును మేఘములను గాంచలేదు, విశాలమైనట్టి కొఱవులయొక్కయుఁ బిడుగుల యొక్కయు వృష్టిమాత్రము గోచరించినది. ఆ యగ్నియొక్క తీవ్రతాపముచే కోట్లకొలఁది యోజనములవఱకును దశదిక్కులందు సమస్త పదార్థములు భస్మీభూతములయ్యెను. పిమ్మట క్షణకాలములలో నాకాశమున నతిదూరమున నూర్ధ్వభాగమున శీతలవాయువున్ను, అధోభాగమున అగ్నితుల్యమగు ఉష్ణవాయువున్ను నున్నట్లు త్వగింద్రియముచే ననుభవించితిని. ఇట్లు అధోభాగమున వ్యాపించిన అగ్నితాపములకుగాని, అట జీవించు ప్రాణుల దృష్టికిగాని విషయముగానంతటి దూరమార్గమందాకాశమున ఆ కల్పాంతమేఘములు స్థితినొందియుండెను.

అథ వారుణదిగ్భాగాదాయయౌ కల్పమారుతః
యస్మింస్తృణవదుహ్యన్తే విన్ధ్యమేరుహిమాలయాః.
17
తేన జ్వాలాచలాః ప్రోన్తోడ్డీనాఙ్గారవిహంగమాః
లోలోల్ముకవనాక్రాన్తా జగ్మురగ్నిదిశం ద్రుతమ్.
18
సంధ్యాభ్రసదృశా కారాస్తేరురఙ్గారవారిదాః
భ్రేముర్భస్మభరాభ్రాణి పూతాఙ్గారరజాంసి ఖే
19
స జ్వాలవిలసద్వాతో దృష్టోఽనలదృశం వ్రజన్
హేమాద్రీణాం సపక్షాణామనీకం ద్రవతామివ
20

పిదప పశ్చిమదిశనుండి కల్పాంతవాయువు వీవదొడఁగ వింధ్య, మేరు, హిమాలయాది మహా పర్వతములున్ను తృణమువలె నద్దానియందెగిరిపోఁజొచ్చెను. సమీపమున ఎగురుచున్న నిప్పులను బక్షులతోఁగూడినవియు, చంచలములైన కొఱవులను వనములచే గప్పఁబడినవియునగు అగ్నిజ్వాలలను బర్వతము లాప్రచండవాయువుచే శీఘ్రముగ నాగ్నేయదిక్కునకుఁ గొట్టుకొని పోయెను. అత్తఱి సంధ్యాకాలమేఘములవలె నొప్పుచున్నవై భస్మమను జలమును ధరించియున్నవై ప్రదీప్తములైన అగ్నిరూపమేఘము లాకాశమున సంచరించుచుండెను. అగ్నిజ్వాలలతో విలాస మొనర్చుచు ఆ దుష్టవాయువు ఱెక్కలతోఁగూడిన మేరుపర్వతసమూహమువలె నాగ్నేయదిశకుఁ జనుచుండెను.

ధరాద్రిమణ్డలాభోగేసామ్యాఙ్గారభరాత్మని
జ్వాలావలిగణే జాతే భాతే తేజసి భాస్వతామ్.
21
అర్ణవేష్వనలార్ణస్సు క్వథనోత్ఫాలవారిషు
వనేష్వస్మృతపర్ణేషు దీప్తాగ్నితరుధారిషు.
22
బ్రహ్మలోకస్థనాథేషు బ్రహ్మలోకపురేషు చ
సాఙ్గనాబాలవృద్ధేషు దగ్ధేషు నిపతత్సుఖమ్
23
కల్పాన్తానలపద్మిన్యా బ్రహ్మాగ్రావసరోవరే
జ్వాలాపల్లవశాలిన్యాః సబీజాయాఃసటోల్ముకైః.
24

అనిలాత్మసు భూతేషు నాగేషు చ నగేషు చ
ఆపాతాలం నిమగ్నేషు మహత్యఙ్గార కర్దమే. 25
ఉష్ట్రసైన్యమివాలక్ష్య గతిమన్నికటం నభః
ఆయయావఞ్జనశ్యామః కల్పామ్బుదగణః క్వణన్. 26

పృథివియు, పర్వతములున్ను సంతట జ్వాలారహితములగు నిప్పులచేఁ బరిపూర్ణమై యుండ ద్వాదశసూర్యులతేజము ధూళిరహితమై స్ఫుటముగఁ బ్రకాశించుచుండ సముద్రములన్నియు కాగినవై అగ్నిమయములై, గంతులిడుచున్నట్టి జలములతోఁగూడియుండ వనములన్నియుఁ బ రహితములై, ప్రదీప్తమగు అగ్నిరూపమును ధరించినవై వృక్షములతో గూడియున్నవిగాకాఁ బ్రహ్మలోకమందలి స్త్రీ, బాల, వృద్ధులున్ను, ప్రభువులున్ను, పురములున్ను, సర్వము భస్మీభూతమై యాకసమునఁబడుచుండ కేసరములవంటి స్ఫులింగములతోగూడిన కొఱవులచే బీజసహితమై జ్వాలలను పల్లవములచే శోభితమైనట్టి శిలారహితమగు బ్రహ్మమను సరోవరమున దృఢత్వముఁ జెందినదై, కల్పాంతాగ్నులను పద్మసమూహము విషయమైనవాయువుచేఁ బూర్ణములగు నాగలోకమందలి సర్పములు, పర్వతములను నట్టి మూలముగలదై పాతాళమువఱకు గొప్పనిప్పులను బురదయందు నిమగ్నమైయుండ అపుడు (తమ దేహమందలి తోలుతిత్తులందు జలమును నింపుకొనియుండు) ఒంటెల సైన్యమును బోలినదియు ఆకాశమున శీఘ్రముగఁ జనునదియు కాటుకవలె నల్లనైనదియునగు కల్పాంతమేఘ సమూహము శబ్దమొనర్చుచు సమీపమున కేతెంచెను.

స్థిరకల్పానల జ్వాలాతుల్య విద్యున్మయాచలః
ఏకకోణకవిశ్రాన్తసప్తార్ణవపయోభరః. 27
భిత్తిభాసురనీహారభారనిర్వారరిక్తటః
బ్రహ్మణ్డకుద్య నిబిడమణ్డలా స్ఫోటపణ్డితః. 28
కల్పాన్తక్షుభితామ్భోధిర్వర్తులావర్తవృత్తిమాన్
తడిజ్జలచరః సారనిర్హ్రాదః ఖమివాగతః. 29
మృతో దగ్ధో నిశానాథస్తతో ద్విగుణశీతలః
అన్యమాకారమాశ్రిత్య పరం లోకమివాగతః. 30
హేమసంభారరూపేణ హిమాలయమివాఖిలమ్
జాడ్యస్తమ్భితనిశ్శేషజలకాష్ఠాచలం దధత్. 31

అ మేఘసమూహము స్థిరకల్పాంతాగ్నిజ్వాలవంటి విద్యున్మయమగు పర్వతమును బోలినదియు, ఒక కోణమున సప్తసముద్రముల జలమును ధరించునదియు, భిత్తివంటి హిమసమూహములచే దిక్కులను బూర్ణమొనర్చునదియు, బ్రహ్మాండముయొక్క తుదివఱకు భూతలమును విదీర్ణముగావించుటయందు నేర్పరియు, గోళాకారులగు ద్వాదశసూర్యులను పరిధిచేఁ జుట్టబడినదియు, మెఱపులను, జలచరజీవులు గలదియు, గంభీరశబ్దయుక్తములై కల్పాంతముచే క్షుబ్ధములైనట్టి సప్తసముద్రములే మేఘమండలరూపముగ నాకసమున వెలయుచున్నదా యనుపించునదియు, కల్పాంతమున మరణించి దగ్ధమైనట్టి చంద్రుఁడు మరల పూర్వముకంటె ద్విగుణమగు

శీతలత్వముగల్గి మేఘమండలమను అన్యాకారమును గ్రహించి యాకాశమను పరలోకమున భాసిల్లుచున్నదా యని తోపింపఁజేయునదియు, సువర్ణసమూహమువంటి విద్యున్మండలమును శీతలత్వముచే సమస్తజలములను గాష్ఠమువలె నిశ్చలముగ స్తంభింపఁజేయునట్టి హిమాలయమును ధరించియున్నట్లున్నదియునై వెలయుచుండెను.

అథ బ్రహ్మణ్డవిస్ఫోటకఠినం ఘటితామ్బరమ్
ప్రాగ్దృతోద్భటతాషారకాష్ఠా వృష్టిః పపాత హ. 32
అగ్నిదాహవనాకాశవిద్యుదున్మేషభీషణా
చటద్గడగడాస్ఫోటస్ఫుటద్బ్రహ్మణ్డమణ్డలా. 33
ప్రథితోత్థిత సీత్కారశతక్ష్వేడాక్షయారవా
శీతసీకరనీహారభిత్తి బంధమయామ్బరా. 34
రోదోమణ్డప వైధూర్యస్తంభసంభారభాసురైః
ధారాసారైర్ధరాధుర్యశైలశాంతకశాలినీ. 35
దరాచటచటాస్ఫోటస్ఫురదఙ్గారపత్తనా
గర్జితోర్జిత సంపాతపతల్లోకాన్తరాకులా. 36

పిదప అకాశమును, బ్రహ్మాండముయొక్క స్ఫోటనము (పగులుట) ను బోలిన కఠినవజ్రపాత్రముతోఁ గూడినదిగఁ గావించునదియు, దిక్కులను మొమ్మొదటనే జలబిందుమయముగ నొనర్చునదియు, అరణ్యాకాశములందు అగ్నిదాహమువంటి విద్యుత్ప్రకాశముచే నతిభయంకరమైయొప్పునదియు, 'చట చటాఁ గడగడా' శబ్దములచే బ్రహ్మాండసమూహమును బగులగొట్టుచున్నట్లున్నదియు ఆవిర్భూతములైన యనేక గొప్పసత్కార శబ్దములచే మహాధ్వనియుతమైయున్నదియు, శీతల జలకణములచేతను, హిమసమూహముచేతను. నాకాశమును భిత్తిమయముగ గావించునదియు, భూమ్యాకాశముల మధ్యభాగమను మండపముయొక్క స్తంభములవలెనున్న యతిస్థూలమైన జలధారలయొక్క పతనముచే టంకప్రహారములవలె, బర్వతములను ఛేదించునదియు, 'చట చటా' శబ్దములచేఁ బృథివియందలి అంగార (నిప్పు) సమూహములను భేదించునదియు, గర్జనతోఁ గూడిన ప్రబలజలపాతములచే లోక, లోకాంతరములను బడఁగొట్టుటయందు దత్పరమగు నదియు నగు కుంభవృష్టి కురిసెను.

సా బభూవాథ సాఙ్గారజగద్గేహవిలాసినీ
కృతప్రత్యుద్గమా బాష్పశ్రియా జ్వలనయా భువః 37

అపుడు, అగ్నిమయమైయున్న జగద్గృహమున విలాసమొనర్చుచు ఆ వృష్టి పృథివిపైఁగల యగ్నితోటి బాష్పశోభతోఁగూడి సఖివలెఁ గలిసెను.

జ్వాలాలవోల్లలన డమ్బరమమ్బరం త
ద్వ్యాణన్థలాబ్జదల జాలమివాలమాసీత్
జ్వాలాభ్రమద్భ్రమరపఙ్క్తి నిభాస్తదాసం
స్తత్ర స్ఫురచ్ఛిశిరసీకరపక్షపుఞ్జాః. 38

మఱియు నపుడు జ్వాలలయొక్క లేశములతోఁగూడినదై యాకాశము బాగుగ రూఢములైన స్థలకమలములయొక్క దళములచే వ్యాప్తమైయున్నట్లు భాసించుచుండెను. అతి శీతలములగు జలబిందుసమూహములున్ను నయ్యాకాశమున నపుడు జ్వాలలందు పరిభ్రమించుచున్న తుమ్మెదలవలె నొప్పుచుండెను.

ఉద్యద్బృహచ్చటచటా రవపూరితాశో
భీమోఽభవత్సలిలదానలసన్నిపాతః
దుర్వారవైరివిషమో మహతాం బలానాం
సంగ్రామ ఉగ్ర ఇవ హేతిహతోగ్రహేతిః 39

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే పుష్కరావర్త
డమ్బర వర్ణనం నామ షట్సప్తతితమః సర్గః ॥ 76 ॥

ఓ రామచంద్రా! ఆ సమయమున మేఘములయొక్కయు, అగ్నులయొక్కయు, సమావేశము గొప్ప 'చట చటా' శబ్దములచే దిక్కులను బూరించునదై నివారింపశక్యముగాని వైరుల విషమత్వముతో గూడినదియు, గొప్పసేనలయొక్క మహాయుధములచే వినాశమొనర్పఁబడిన మహాయుధములు గలదియు నగు సంగ్రామమువలె భయంకరమై వెలసెను.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
పాషాణోపాఖ్యానమున పుష్కరావర్త డంబర వర్ణనమను
డెబ్బదియాఱవ సర్గము ॥ 76 ॥

సప్తసప్తతితమః సర్గః

[పుష్కరావర్తకోత్సృష్ట వృష్టిద్వారా విసంష్ఠులమ్
సప్తాబ్ధిక్షోభనిర్ధూతం జగద్భూయోఽత్ర వర్ణ్యతే.

పుష్కరావర్త మేఘములచే కురియఁబడిన వర్షధారలచే శిథిలీభూతమై, సప్తసముద్రముల క్షోభచే వినాశ మొనర్చఁబడిన జగత్తుయొక్క వర్ణన మిచటఁ గావింపఁబడుచున్నది.]

శ్రీవసిష్ఠ ఉవాచ:—

అథావనిపయస్తేజఃపవనానాం యుగక్షయే
జాతే పరమసంక్షోభే బభూవాస్మిఞ్జగత్త్రయమ్. 1

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఆ ప్రళయకాలమున, పృథివి, జలము, అగ్ని, వాయువులను ఈ నాల్గు భూతములున్ను మహాసంక్షోభముఁ జెందఁగా ముల్లోకములయొక్క స్థితి యెట్లుండెనో వచించుచున్నాను, వినుము.

తాపిచ్ఛవిపినోడ్డీతినిభభస్మాభ్రభాసురమ్
మహార్ణవమహావర్తవృత్తి ధూమవివర్తనమ్. 2

నీలజ్వాలాలవోల్లాసం హేలాటిమిటిమారటి
కృతభస్మాభ్రసంభారపూర్ణలోకాన్తరాన్తరమ్. 3

ఉచ్ఛలద్ఘర్ఘరుత్కారైశ్ఛమచ్ఛమమయాత్మకైః
తూర్యమున్నమదాసారవిసారిజయఘోషణమ్. 4

భ్రమద్భస్మాభ్రధూమ్రమాభ్రం బృహత్కల్పాభ్రసంభ్రమమ్
బాష్పాభ్రవిభ్రమోద్భ్రాన్త సీకరోగ్రాభ్రవృన్దవత్. 5

బ్రహ్మాణ్డభిత్తిభాంకారభీషణైర్మాతరిశ్వనః
ప్రసరైరమ్బరోడ్డీన దగ్ధేన్ద్రాదిపురోత్కరమ్. 6

జలానలానిలోల్లాసస్ఫుటతోత్కటిగతాశ్మనామ్
ప్రవిఘట్టనటంకారైర్జడీభూతాక్షకశ్రుతి. 7

నభఃస్తమ్భనిభాబన్ధధారానీరన్ధ్రవర్షణైః
కర్షణైః కల్పవహ్నీనాం ఛమచ్ఛమ ఘనధ్వని. 8

అపుడు త్రైలోక్యము తమాలవనమువలె భాసించు యెగురుచున్న భస్మముచేతను, మేఘములచేతను ప్రకాశమానమైనదియు, మహాసముద్రముయొక్క గొప్ప యావర్తమునుబోలిన ధూమముల పరిభ్రమణముతో గూడినదియు, తడచిన వస్తువులు దహింపఁబడునపుడు జనించిన నీల జ్వాలయొక్క విలాసపూర్వకమగు క్రీడచే 'టిమటిమ' మను ధ్వనియుక్తమైనదియు భస్మ, మేఘ సమూహములఁచే బూర్ణములైనట్టి లోక, లోకాంతరములు గలదియు, తడుచుచున్న కట్టెలయొక్క 'ఛమ ఛమ' శబ్దముతోఁగూడిన యుచ్చధ్వనిచే జలధారలయొక్క జయఘోషను నలుగడల వ్యాపింపఁజేయునదియు, పరిభ్రమించు భస్మ, మేఘ, ధూమ, వాయువులచే మహాకల్పాంత సంభ్రమయుక్తమైనదియు, బాష్ప, మేఘముల పరస్పర విభ్రమముచే భ్రమణశీలములైన జలకణములతోఁగూడి మేఘ సమూహమువలెఁ దోచునదియు బ్రహ్మాండముయొక్క హద్దువఱకుఁ బ్రసరించుచు, భాంకార శబ్దములచే భయంకరమైనట్టి వాయువుచే నాకాశమందెగురుచున్నట్టి భస్మీభూతములైన యింద్రాదుల నగరములుగలదియు, జలాగ్నివాయువుల పరస్పర అఘాతములచే నెగురుచున్న పర్వతములయొక్క సంఘట్టనచేతను, టంకార శబ్దములచేతను నశించిన శ్రోత్రేంద్రియములతోఁ గూడినదియు, అకాశ స్తంభములఁ బోలియున్న గొప్ప జలధారలయొక్క ఘనీభూతములైన వర్షములచేతను, కల్పాంతాగ్నులయొక్క పరస్పర సంఘర్షములచేతను, 'ఛమ ఛమ' ధ్వని సహితమైనదియు నాయెను.

గఙ్గాతరఙ్గికా యేషాం తాదృశైః సరితాం గణైః
అభ్రైరివ నభోభీమైః పూర్యమాణాఖిలార్ణవమ్. 9

తాపిచ్ఛపత్ర వృన్దస్థపుష్పగుచ్ఛసమోపమైః
తపద్భిరర్కైరాలీఢపీఠకల్పాభ్రమణ్డలమ్. 10

వహద్గిరిసరిద్వ్యూహశిఖరిద్వీపపత్తనమ్
కల్పానిలఘనక్షోభకృతపర్వతకుట్టనమ్. 11

గ్రహతారాగణైరుగ్రైర్వ్యగ్రైర్విగ్రహమర్గహైః
పతద్భిర్ద్విగుణాలాతలతామావర్తపాతిభిః. 12

అవహోత్థజలాద్రీన్ద్ర సంఘట్టాస్ఫోటఘట్టితమ్
మహాప్రలయపర్యస్త పర్వతప్రాన్త కుట్టిమమ్. 13

ఘనసీకృతబాష్పాన్తైః కల్పాభ్రైరపి మేదురైః
అన్ధీకృతార్కజాలాంశుతమోనిబిడమన్థరమ్. 14

విశీర్ణవసుధాపీఠఖణ్డఖణ్డైర్గలత్తటైః
ఊహ్యమానైర్గలచ్ఛైలపతనైః సంకటార్ణవమ్. 15

ఊర్మ్యద్వ్యదుపలచ్ఛిన్నఘనైర్ఘస్మరమారుతైః
సముద్రఘోషైర్నిర్ఘాతగమ్భీరైర్భగ్నదిక్తటమ్. 16

మఱియు, ఆ ముల్లోకములపుడు భయంకరములైన మేఘములచే అకాశము పూర్ణమై యుండునట్లు, గంగానదియొక్క తరంగములతో సమానములగు అనేక మహానదులచేఁ బరిపూర్ణములైనట్టి సర్వ సముద్రములతోఁ గూడియున్నవియు, తమాలపత్ర సమూహముండున్న పుష్పగుచ్ఛములఁబోలిన సంతప్త సూర్య మండలములచే నాస్వాదింపఁబడిన కల్పాంత మేఘ మండలములు గలవియు, పర్వతములనుండి ప్రవహించు నదీ సమూహములచేఁ గొట్టుకొని పోవుచున్న పర్వత, ద్వీప, నగరములు గల్గియున్నవియు, కల్పాంత వాయువుయొక్క ప్రజల క్షోభచే చూర్ణభూతములైన పర్వతములతో గూడియున్నవియు, పరస్పర ప్రహారముచే నిరోధింప శక్యము కానివై, గుండ్రముగా తిరుగుచుఁ బడుచున్నవై, భూమిపైకంటె నాకాశమున రెండురెట్లు పెద్దదగు అలాత (కొఱవి) చక్రమును రచించునవైనట్టి భయంకరములైన గ్రహ, నక్షత్రసమూహములు గలవియు, నలువైపులవీచుచున్న ప్రచండవాయువులచే నుత్పన్నములైన పర్వతాకారములైన జలతరంగములయొక్క సంఘట్టనములతోఁ బోరాడుచున్నట్టి పర్వతములు గలవియు, మహాప్రళయ వాయువుచే విచ్ఛిన్నమొనర్పబడిన పర్వతప్రాంతప్రదేశములు గల్గియున్నవియు, ఘనీభూతములగు జలకణ, బాష్పరహితములై, శ్యామవర్ణయుతములైనట్టి ప్రళయమేఘములచే సూర్యకిరణములున్ను గప్పఁబడుటచే నంధకారమయములై యున్నవియు, ఛిన్నభిన్నములగు భూఖండములచే, నశించిన తటములుగల్గి యిటునటు, గొట్టుకొనిపోవుచు, దొరలుచు, పడుచున్నట్టి పర్వతములచే బాధితమగు సముద్రము గలవియు, మహాతరంగములనుండి జనించిన అన్యతరంగములచే విసరివేయఁబడు శిలలచే మేఘములను ఛిన్నమొనర్చునవైయు, సముద్రమువంటి గంభీరనాదము గల్గియున్నవైనట్టి ప్రచండవాయువులచే భగ్నములైన దిక్తటములు గలవియునై యొప్పుచుండెను.

బ్రహ్మణ్డకుడ్యక్రోడాగ్ర కట్టకైః కటుటాంకృతైః
కల్పా[illegible]తై కార్ణవారటి. 17

స్వర్గపాతాలభూర్లోకఖణ్డఖణ్డైర్విమిశ్రితైః
యథాస్వభావం తిష్ఠద్భిర్మరుబుధ్నైర్వృతామ్బరమ్. 18

మృతార్ధమృతదగ్ధార్ధదగ్ధాఙ్గైర్దేవదానవైః
అన్యోన్యదర్శనాద్వాతవేల్లితైర్భ్రామితాయుధమ్. 19

కల్పాన్తపవనోద్భ్రాన్తైర్లోకాన్తరజరత్తృణైః
అ[illegible]నవాతాఖ్యాస్తన్భుముద్భూతభస్మభిః. 20

ఉహ్యమానశిలాజాలప్రహారవిలుఠత్తటైః
పతల్లోకాన్తరైః స్ఫారదుష్కాలకటుటాంకృతమ్. 21

వాతోద్వ్యూహగిరివ్రాతగుహాభాంకారభాసురమ్
పతద్భిర్విహితావర్తలోకపాలపురీపురైః. 22

కృతకర్కశనిర్హ్రాదైరసురైరివ మారుతైః
ఊహ్యమానవనవ్యూహప్రోతవాతాయనైర్వృతమ్. 23

పురమణ్డలదైత్యాగ్నిసురనాగవివస్వతామ్
నికురమ్బం దధద్వ్యోమ్ని మశకానామివోచ్చయమ్. 24

ఇంకను, ఆ త్రైలోక్యము, బ్రహ్మాండముయొక్క వక్షస్థలమునఁ బ్రహారమొనర్చునవై, ఘోరమైన టంకారశబ్దముతోఁ గూడినవైనట్టి ప్రళయకాల మేఘములను బాహువులయొక్క యాఘాతములచేఁ గంపితమగు సముద్రముగలదై యేడ్చుచున్నట్లున్నదియు, అధోభాగమున జలాభావముచే మరుస్థలమువలె నున్నవై, యథారీతి వర్తించుచు నెరుగుచున్నట్టి స్వర్గ, పాతాళ, భూలోకములయొక్క మిళిత ఖండములచే నాకాశమును గప్పునదియు, అర్ధమృతులై, అర్ధదగ్ధశరీరులైనట్టి దేవ, దానవులు పరస్పరము శత్రుదృష్టిచేఁ జూచుకొనుటచేఁ వధించుకొను నిమిత్తము చలింపఁజేయఁబడిన ఆయుధములు గలదియు, కల్పాంతవాయువుచే నెగురఁగొట్టఁబడిన, లోకలోకాంతరముల యొక్క శిథిల తృణములు నిజోత్పన్నమగు భస్మముచే వాయువును శ్వేతవర్ణయుతముగా జేయుటచే 'అర్జునవాత'మను రోగముతోఁ గూడియున్నదిగ, దోచునదియు, ఎగురుచున్న శిలాసమూహములయొక్క ప్రహారముంచే శిథిలములైన తటములు గలవై, పడుచున్నవైనట్టి లోకాంతరములచే మహాదుష్కాల జనితమగు కఠోర టంకారశబ్దముతోఁ గూడియున్నదియు, వాయుసంఘట్టనములచేఁ బర్వతగుహలందు జనించిన భాంకారశబ్దము గల్గియున్నదియు, భ్రమణపూర్వకముగ, బడుచున్నట్టి లోకపాలురపురములున్ను, తదితర పురములున్ను గలదియు, అసురులవలెఁ కర్కశనాదమొనర్చు ప్రచండవాయువుల ద్వారా కొట్టుకొనిపోవు వనసమూహములచే, చంచలములైన అశ్వములచేఁ బూర్ణమైనట్లు కానుపించునదియు, పుర, మండల, దైత్య, అగ్ని, దేవతా, నాగ, సూర్యాదుల సమూహమును మశకసమూహమువలె నాకసమున ధరించియున్నదియునై వెలయుచుండెను.

నశ్యన్నగవరాభోగైర్గాఢైర్భగ్నసురాలయైః
ఆవర్తఘర్ఘరారావైర్జలమూర్ధ్వమధోనలమ్. 25

కుర్వజ్జలాద్రినిష్పేషైర్దిక్పాలపురకుట్టనమ్
నిపతద్దేవదైత్యేన్ద్రసిద్ధగన్ధర్వపత్తనమ్. 26
కుట్టనం పర్వతాదీనాం ప్రశాన్తాఙ్గారరూపిణామ్
వాతైః కుర్వత్పదార్థానామసారం రజసామివ. 27
పురాణ్యమరదైత్యానాం భ్రమద్భిత్తీ నిశాతయత్
రత్నైః ఖణఖణాయన్తి పయాంసీవ పయస్వతామ్. 28
పూర్ణామ్బరం పతల్లోకలోకసప్తకమన్దిరైః
చక్రావృత్త్యా భ్రమద్రూపైరమరైః సాగరైరివ. 29
డీనోడ్డీనైః పరివృతం విచలద్వాతవేల్లితైః
దగ్ధాదగ్ధైః పదార్థైః ఖే శీర్ణపర్ణగణైరివ. 30
హేమస్ఫటికవైడూర్యసుసారమణిమన్దిరైః
దివః పతద్భిరాకీర్ణముద్యజ్ఝణఝణస్వనైః, 31

మఱియు ఆ త్రైలోక్యమపుడు పగులుటవలన గల్గు ఘర్ఘరశబ్దముతోఁగూడి నశించుచున్నట్టి యనేకపర్వతప్రదేశములతోను, భగ్నమగు దేవాలయములతోను గూడియున్నదై యూర్ధ్వభాగమున జలమును, అధోభాగమున అగ్నిని ధరించియున్నదియు, పర్వతములను దిక్పాలకుల నగరములను బిండి చేయుచున్న మహావృష్టి జలము గల్గియున్నదియు, దేవ. దైత్య, ఇంద్ర, సిద్ధాదులయొక్క పడుచున్న నగరములచేఁ బూర్ణమైనదియు, శమించిన యగ్నిరూపములగు పర్వతాది పదార్థములను ధూళినివలె నిర్దయత్వపూర్వకముగ ఛేదించునట్టి వాయువులు గలదియు, మేఘ జలములవంటి రత్నములయొక్క 'ఖణ ఖణ' శబ్దముతోటి భేదింపబడుచున్న దేవదైత్యుల పురములతోను, పరిభ్రమించు భిత్తిసముదాయముతోను గూడియున్నదియు, సముద్రమువలె చక్రాకారముగఁ దిరుగుచున్నట్టి దేవతలతోడను పడుచున్నట్టి ప్రాణులతోడను గూడియున్న సప్తలోకముల మందిరములచేఁ బూర్ణమైన యాకాశము గలదియు, చంచలవాయువుచే బరివేష్టితములును, ఎగురుచు పడుచు నున్నవియు నగు అర్ధ దగ్ధ పదార్థములచే శిథిలపత్రములచేవలె వ్యాపింపఁబడినట్టి యాకాశప్రదేశము గల్గియున్నదియు, మహాఝణఝణధ్వని సహితమై యాకాశమునుండి పడుచున్న యుత్తమ సువర్ణ, స్ఫటిక, వైడూర్యమణులచే నిర్మితములగు మందిరములచే వ్యాప్తమైనదియునై యొప్పుచుండెను.

ఉత్పేతుర్ధూమభస్మాబ్దాః పేతుర్వారా పురోత్కరాః
ఉన్మమజ్జుస్తరఙ్గాఘా మమజ్జుర్భూతలాద్రయః. 32
ఆవర్తఘర్ఘరారావా మిథో విదలనోద్యతాః
జుఘూర్ణురర్ణవాకీర్ణపర్ణవత్ప్రౌఢపర్వతాః. 33

ఆ సమయమున వృష్టిజలముచే ధూమ, భస్మ, మేఘ తరంగముల సమూహములు పైకి లేచిపోఁగెను. నగరములు క్రిందబడఁజొచ్చెను. భూతల పర్వత సమూహములు మునుఁగసాగెను. ఆవర్తయుక్తములై, ఘర్ఘరశబ్దసహితములై, పరస్పరము ఛేదించుకొనుటయందుద్యుక్తములై మహాపర్వతములు శిథిలపత్రము... ...గాఁ జొచ్చెను.

క్రన్దద్భిష్టామరగణం చలత్సజ్జీవభూతకమ్
భ్రమత్కేతుశతోత్పాతఁ దుష్ప్రేక్ష్యమభవజ్జగత్. 34
మృతార్ధమృతయా భూతసంతత్యానిలలోలయా
అభూన్నిరన్ధ్రమాకాశం జీర్ణపర్ణసవర్ణయా. 35
జగదాసీత్పతచ్ఛృఙ్గస్థూలధారౌఘనిర్భరమ్
వహద్వహద్గిరిపురవాతపూర్ణసరిచ్ఛతమ్. 36
శామ్యచ్ఛమశమాశబ్దశతశాఖహుతాశనమ్
చలాబ్ధివలనాన్దోలలోలశైలలసత్తటమ్. 37
తృణరాశిసరిన్న్యాయమిశ్రద్వీపార్ణవోత్కటమ్
అత్యన్తమారచిద్వ్యోమక్షణజ్వాలాసహావనమ్. 38

ఆ త్రిజగత్తు ఏడ్చుచున్న శిష్టులగు దేవతలతోడను, కొంచెముప్రాణము గల్గియున్న జీవులతోడను గూడియున్నదియు పరిభ్రమించు అనేక ధూమకేతువులను, ఉత్పాతములచేతను బరిపూర్ణమై భయంకరముగఁ గన్పట్టునదియు, వాయువుచేఁజలించు శిథిలపత్రములవలె అర్ధమృతులును, సర్వథామృతులునగు ప్రాణులచే వ్యాప్తమైనట్టి యాకాశముగలదియు, పడుచున్న పర్వత శిఖరములను బోలినట్టి స్థూలజలధారలతో గూడియున్నదియు, పర్వత నగరాదులనుగూడ గొట్టుకొనిపోవునట్టి యనేకనదులచే, బూర్ణమైనదియు, శమించుచు 'శమశమా' శబ్దయుతమై అనేక శాఖలుగ విభక్తమైనట్టి అగ్నిగలదియు, చంచలములగు సముద్రములయొక్క అందోళనముచేఁ గదల్పఁబడు పర్వతములయొక్క శోభాయుక్తములగు తటములచే వ్యాప్తమైనదియు, నదులందు తృణరాసులవలె మిశ్రభూతములైనట్టి యనేక ద్వీపసముద్రములుగలదియు, అత్యంతదూరముగనున్న (దుర్లభమగు) చిదాకాశమందు క్షణకాలపుజ్వాలలనైన సహింపజాలనిదియునైయుండెను.

వర్షశామ్యద్ధుతాశోత్థభస్మామోదపతత్పురమ్
భూతపూర్వజగద్భ్రాన్తం పరివిస్మృతసర్గకమ్. 39
నిరర్గలోల్లసన్నాదం సర్గలోపశమక్రమమ్
సర్గలోపోల్లసచ్ఛేషం సర్గలోప వివర్జితమ్. 40
అనారతవిపర్యాసకారిమారుతనిర్వృతమ్
బీజరాశిరివాజస్రం పూర్యమాణం పునః పునః. 41
ఉల్ముకాన్యోన్యనిష్పేష వహ్నిచూర్ణసువర్ణజైః
రజోభిర్వివృతైర్హేమకుట్టిమాకాశకోటరమ్. 42
భూమణ్డలబృహత్ఖణ్డైర్భ్రష్టైః సద్వీపసాగరైః
పూర్ణసప్తమపాతాలం లుఠత్పాతాలమణ్డలైః. 43

ఆసప్తమసుతాలాన్త మామహీతలపర్వతమ్
ఆవ్యోమ్నైకార్ణవీభూతం పూర్ణం ప్రలయవాయుభిః. 44

మఱియు, జగత్తపుడు, వర్షము శమించుటచే అగ్నిచే నుత్పన్నమగు ధూమమువలన పడుచున్నట్టి దేవతలు గలదియు, పూర్వకాలమున చరాచర సంయుక్తమైయున్నను వర్తమానమున సర్వనాశముచే సృష్టియొక్క విస్మృతితోఁ గూడియున్నదియు, నిరంతరము శోభాయమానమైనట్టి నాదముతోఁగూడిన సృష్టియంతయు లోపించిపోవుటచే శాంతియుక్తమైనదియు, అట్లు సృష్టి లోపించినను. వాస్తవముగ నుత్పత్తి నాశరహితుఁడగు పరమాత్మ శేషించియుండుటచే నాతనిచే శోభితమైనదియు, నిరంతరము ప్రత్యాసమును గల్గజేయునట్టి వాయువు శమించియున్నదియు, బీజ రాశివలె సదా మరల మరల పూరింపఁబడినదియు ఉల్మకముల (కొఱవుల) పరస్పర సంఘర్షణ ముచే అగ్ని, సువర్ణములనుండి యుత్పన్నమైన స్వచ్ఛధూళి సమూహములచే బంగారపు కప్పువలెఁ గన్పట్టు యాకాశ భాగముగలదియు, పొర్లాడుచున్న అన్యపాతాళ మండలములతోఁగూడి అనేక ద్వీప, సముద్రయుక్తమై పడుచున్నట్టి భూమండలముయొక్క మహాఖండములచే సప్తమ పాతాళమువఱకుఁ బూర్ణమైనదియు, అధోభాగమున సప్తమ పాతాళమువఱకును, మధ్యభాగమున భూతల పర్వతములవఱకును, ఊర్ధ్వభాగమున ఆకాశమువఱకును ప్రచండప్రళయ వాయువులచే నేకమగు మహా సముద్రమువలెఁ బూర్ణమైయున్నదియునాయెను.

ఏకార్ణవోఽథ వవృధే శనైః శీఘ్రం సరిచ్ఛతైః
భువనే జలకల్లోలైః కోపో మూర్ఖాశయే యథా. 45

పిమ్మట, మూర్ఖుని హృదయమునఁ గోపమువలె, శీఘ్రగాములగు అనేకనదులయొక్క జలతరంగములచేఁ బ్రపంచమున ఏకమగు మహాసముద్రము మెల్లగ వృద్ధినొందెను.

ముసలోపమయా పూర్వం తతః స్తమ్భనిభాజ్గయా
తతస్తాలద్రుమాకారధారయాసారసారయా. 46

తతో నదీ ప్రవాహోగ్రజలవాతైకపాతయా
సప్తద్వీపమహీపీఠ సమమేఘరమేధయా. 47

మొమ్మొదట ముసలము (రోఁకలి) వంటివియు, ఆ పిదప స్తంభాకారమువంటివియు, పిమ్మట తాళ వృక్షాకృతివంటివియునగు స్థూలజలధారలచేఁ గ్రమముగ వృష్టికురిసెను. తదుపరి సప్తద్వీపయుక్తమగు సమగ్రభూతలమువలె మహాస్థూలమైనదియు, మహానదియొక్క తీవ్రప్రవాహ మును బోలినదియు నగు జలపాతముతోఁగూడిన కుంభవర్షము కురియ నారంభించెను.

వహ్నిర్విదాహకృద్వృష్ట్యా శమమభ్యాయయౌ తథా
శాస్త్రసజ్జనసంగత్యా గాఢమాపత్పదం యథా. 48

శాస్త్ర, సజ్జనుల సాంగత్యముచే మహావిపత్తి శమించునట్లు. ఆ మహావృష్టిచే అతిదాహ కరమగు అగ్ని శమించినదాయెను.

ఊర్ధ్వాధరస్థపరివృత్తపదార్థజాత
మన్తఃకణైః ఖణఖణాయుతశైలమజ్జమ్
బ్రహ్మాణ్డకోటరమభూద్విధురం కుబాల
లీలావిలోలమివ బిల్వఫలం విశుద్ధమ్. 49

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే పుష్కరావర్తవృష్టివిసంష్ఠుల జగద్వర్ణనం నామ సప్తసప్తతితమః సర్గః ॥ 77 ॥

ఓ రామచంద్రా! క్రిందనుఁ పైనను తిరుగాడుచున్నట్టి పదార్థసమూహములతోఁ గూడినదియు, లోన జలకణములతోఁ గూడి యొప్పుచున్నదియు, ఖణ ఖణ శబ్దముతోటి మునుఁగుచున్న పర్వతములు గలదియు నగు బ్రహ్మాండకోటరమపుడు, బాలుర దుష్టక్రీడలచేఁ జంచలమగు శుద్ధ బిల్వఫలమువలె వినాశమొందెను.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున పుష్కరావర్తవృష్టి విసంష్ఠుల జగద్వర్ణనమను డెబ్బదియేడవ సర్గము ॥ 77 ॥

అష్టసప్తతితమః సర్గః

[నదీప్రమాణైరాసారైరభితః పూరయన్నభః
ఏకార్ణవప్రవృద్ధోఽత్ర విస్తరేణోప వర్ణ్యతే.

నదీప్రమాణములగు స్థూల జల ధారలచే నాకాశమంతయు వ్యాపింపఁబడుట, ఏకమగు మహాసముద్రము వృద్ధినొందుట విస్తారముగ నిట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీవసిష్ఠ ఉవాచః—

వాతవర్షహిమోత్పాతపాతభగ్నేధరాతలే
జడవేగోఽగమద్వృద్ధిం కలావివ మహీపతిః. 1

శ్రీవసిష్ఠుఁడు:– ఓ రామచంద్రా! వాయువు, వర్షము, హిమము, ఉత్పాతములు మున్నగువానిచే భూతలము నశింప, కలియుగమున దుష్టరాజులవలె నపుడు జలవేగము వృద్ధి నొందెను.

గఙ్గాప్రవాహపతితధారాపాతవివర్ధితః
సరిత్సహస్రైః సహసా మేరుమన్దరభాసురైః. 2

ఆదిత్యపథసంప్రాప్తకన్దరో జడమన్థరః
ఏకార్ణవః సముచ్ఛూన ఆసీన్మూర్ఖ ఇవేశ్వరః. 3

గంగా సమానములగు మేఘధారలయొక్క సంపాతములచేతను, అనేకనదులచేతను వృద్ధిఁ బొందినదై, అకస్మాత్తుగ మేరు, మందర పర్వతములవలె భాసించు స్థూలతరంగములచేఁ బర్వతగుహలను గొట్టుకొనిపోయి సూర్యమార్గమును బొందింపఁ జేయునదియు, జలముచే నతి గంభీరమైనదియు నగు ఏకమహాసముద్రము, మూర్ఖుఁడగు రాజువలెఁ బెరిఁగినదై యుండెను.

విపులావర్తవృత్తాత్త విపృత్తాద్రిజరత్తృణః
స్ఫురత్తుఙ్గతరఙ్గాగ్రనిగీర్ణాదిత్యమణ్డలః. 4
మేరుమన్దరకైలాసవిన్ధ్యసహ్యజలేచరః
గలితావనిపఙ్కాన్తర్లీనవ్యాలమృణాలకః. 5
అర్ధదగ్ధద్రుమవనవ్యూహశైవలసంకటః
త్రైలోక్యభస్మసంస్పృష్ట ఆసీత్కర్దమకుత్సితః. 6
నభఃస్తమ్భబృహద్ధానోత్తాలభాస్కరపుష్కరః
ధారాజాలమహామ్భోదవిలీన నలినీదలః. 7
డిణ్డీరపర్వతప్రాప్తనదదున్మత్తవారిదః
భ్రమదిన్ద్రానిలార్కేన్దుపురపత్తనపూరణైః. 8
కాష్ఠవత్ప్రోహ్యమానోగ్రసురాసురజనోత్కరః
శనైః క్రమోచ్ఛూనతయా లిహన్నాదిత్యమణ్డలమ్. 9
తరత్తారతరారావధారాధరసముద్భవైః
బుద్బుదైః పరిసందిగ్ధప్రోహ్యమాణమహాచలః. 10

మఱియు, ఆ ప్రళయకాలిక మహాసముద్రమపుడు గొప్ప ఆవర్తములందు శిథిల తృణమువలెఁ దిరుగుచున్నట్టి యనేకపర్వతములను ధరించియున్నదియు, చంచలములును, ఉన్నతములు నగు తరంగముల యగ్రభాగముచే సూర్యమండలమునున్ను గ్రసించునదియు, మేరు, మందర, కైలాస, వింధ్య, సహ్యాది పర్వతములను జలజీవులచేఁ బూర్ణమైనదియు, నశించిన పృథివి యొక్క పంకము లోపల లీనమైనట్టి శేషాది సర్పములను కమలనాళములు గలదియు, సగము కాలినట్టి వృక్షములతోఁ గూడిన వనసమూహములను నాచుగల్గియున్నదియు, త్రిలోకముల భస్మము కలియుటచే బురదతోఁగూడి నిందితమైనదియు, ఆకాశరూప నాళను బొడుఁ బ్రచండ ద్వాదశాదిత్యులే పద్మములుగా గల్గియున్నదియు, ధారా సమూహరూపములగు గొప్ప మేఘములు జలముపై సంలగ్నములై యుండుటచే విలీనప్రాయములైన కమలదళములతో గూడియున్నట్లు భాసించునదియు, ఫేన (నురుఁగు) పర్వతముల సమీపమున శబ్దమొనర్చుచున్న యున్మత్తమేఘముతోఁ గూడియున్నదియు. పరిభ్రమించుచున్న యింద్ర, వాయు, సూర్య, చంద్రులచేతను, అనేక గ్రామ నగరాదుల సమూహములచేతను వ్యాప్తమైనదియు, కొయ్యలవలెఁ గొట్టుకొనిపోవుచున్న భయంకర సురాసురాది ప్రాణి సమూహము గలదియు, క్రమముగ వృద్ధినొందుచు సూర్యమండల మునుగూడ గ్రసించుచున్నదియు, గొప్ప నాద మొనర్చు చంచలమేఘములచే నుత్పన్నములగు బుద్బుదములవలెఁ గొట్టుకొనిపోవుచున్న యనేకమహాపర్వతములు గలదియునై వృద్ధికెక్కెను.

భ్రమద్బుద్బుదవిశ్రాన్తభ్రాన్తకల్పాన్తవారిదః
ఉత్తాలైస్తైరనాధారైః పశ్యన్నపరవారిదమ్. 11
మహాప్రవాహవార్యోఘఘోషఘుంఘుమితామ్బరః
ఏకప్రవాహమహితసవ్యోమకులపర్వతః. 12
చణ్డవాతకృతాపూర్వజలౌఘకులపర్వతైః
మహాఘురఘురారావఘర్ఘరోగ్రమహారయః. 13
బ్రహ్మాణ్డఖణ్డసంఘట్టపరావృత్తిభిరుద్ధతః
కుర్వన్యోజనలక్షాణి వితతాన్యున్నతాని చ. 14
తృణైరివ తరఙ్గేషు దోలాన్దోలనమద్రిభిః
కుర్వద్భిరుపలాఘాతభగ్నభాస్కరమండలః. 15
శూన్యబ్రహ్మాణ్డవిపులజలఘాతకులాయకే
నీలానచల కాకోలాన్గ్రహన్సలిలజాలకైః. 16
మృతామృత మహద్భూతమజ్జనోన్మజ్జనాకులాన్
తరంగ మకరావర్తప్రతిబిమ్బాన్వితానివ. 17

ఇంకను, ఆ సముద్రము, పరిభ్రమించు బుద్బుదములపై విశ్రమించునట్టి కల్పాంత మేఘములు గల్గియున్నదియు, కనుగ్రుడ్లు పైకెత్తి స్వాధారములకు ముఖము మాత్రము లేనట్టి బుద్బుదరూపనేత్రములచే సమీపముననున్న యితరమేఘములను గాంచుచున్నట్టి (పైవచించిన) బుద్బుదసహితమేఘములు గలదియు; మహాజలప్రవాహముయొక్క ప్రచండనాదముచే ఆకాశమును బూర్ణమొనర్చునదియు, ఒకే ప్రవాహమున ఆకాశసహితముగ కులపర్వతములను నిమగ్నములుగ జేయునదియు, ప్రచండవాయువుచే నుత్పన్నములగు అపూర్వములైన తరంగములను కులపర్వతములచే జనించిన గొప్ప ఘురఘురా' శబ్దముచే ఘర్ఘరధ్వనియుక్తమైనదియు, ఆ జలసమూహముల ఈ మహావేగముచే భయంకరమైయు నొప్పునదియు, బ్రహ్మాండఖండములయొక్క పరస్పర సంఘట్టనములచే గర్వీభూతమైనదియు, లక్షల కొలఁది యోజనములవఱకు గల అనేకయున్నత విశాల స్థలములను దనయందిముడ్చుకొనుచున్నదియు, తరంగములందు తృణమువలె నూయల యూగుచున్న పర్వతములయొక్క యాఘాతములచే సూర్యమండలమును భగ్నమొనర్చుచున్నదియు జలసమూహరూపమగు శూన్యబ్రహ్మాండమను గొప్పగూటియందున్నవై, మృతులున్ను; జీవితులు నగు అనేక ప్రాణుల మజ్జన, ఉన్మజ్జనములచే వ్యాకులములై, తరంగములందును, మకరాకృతి గలయావర్తములందును బ్రతిబింబించినవానివలె నున్నవైనట్టి నీలవర్ణముగల పర్వతములను పెద్ద కాకులను జలరూపములగు వలలచేఁ బట్టుచున్నట్లున్నదియునై వృద్ధినొందసాగెను.

మృతశిష్టాన్పరభ్రష్టాన్పోన్నాదితటి కోటిషు
దఘజ్జలబ్రశాస్త్రాం స్త్రిదశాన్మశకానివ. 18
విపులాద్యతనాకాశ విపులానమ్బు బుద్బుదాన్
సహస్రసంఖ్యాన్కలయంల్లోచనానీవ వాసవః. 19

శరద్వ్యోమసమాభోగైర్వలద్భిర్బుద్బుదేక్షణైః
పశ్యన్నివ నదీధారాస్మేఘానాత్మామ పూరకాన్. 20
పుష్కరావర్తకాద్యానాం బహుభిర్వీచిమణ్డలైః
కుర్వన్నాలిఙ్గనానీవ సపక్షాద్రివదుత్థితైః. 21
త్రిజగద్గ్రాససంతృప్తః ప్రగాయన్నివ ఘర్ఘరైః
స్వైర్నృత్యన్నివ చోగ్రాద్రికటకైర్వీచిదోర్ద్రుమైః. 22
నదీధారాధరైరూర్ధ్వే మధ్యే దగ్ధైర్ధరాధరైః
అధో ధరాధరైర్నాగైరధరఃపఙ్కగైర్వృతః. 23
ధారాత్రిపథగాపూరైర్నిపతద్భిర్నిరన్తరమ్
మగ్నోన్మగ్నోహ్యమానాద్రిశృఙ్గ డిణ్డీరబుద్బుదః. 24
ఉహ్యమానదలత్స్వర్గ ఖణ్డాక్రన్దన్నభశ్చరః
వహద్విద్యాధరీ వృన్దపద్మినీసున్దరాన్తరః. 25

మఱియు ఆ మహాసముద్రమపుడు మృతినొందగా మిగిలినవారును స్వపురములనుండి జాఱినవారును, జలబలముచే శ్రమనొందియున్నవారును నగు దేవతలను సురగులను బర్వతశిఖరములపై దోమలవలె వహించియున్నదియు. ఈ యాకాశమువలె విశాలములైనట్టి గొప్ప బుద్బుదములను వేయినేత్రములను ఇంద్రునివలె ధరించియున్నదియు, శరత్కాలపు ఆకాశమువలె విశాలములైన బుద్బుదములను నేత్రములచే నదీతుల్యములగు స్థూలధారలతోఁగూడిన మేఘములను గాంచుచున్నట్లున్నదియు, ఱెక్కలుగల పర్వతములవలె నావిర్భూతములైన యనేక తరంగసమూహములచే 'పుష్కరావర్తాది మేఘము'లను కౌఁగిలించుకొనుచున్నట్లు తోచునదియు, ముల్లోకములను కబళముచే దృప్తిఁజెంది ఘర్ఘరశబ్దములచే గానమొనర్చుచు పర్వతములను గడియములచే నలంకరింపఁబడినదై తరంగములను భుజములచే నాట్యమాడుచున్నట్లున్నదియు, ఊర్ధ్వభాగమున నదీతుల్యములగు స్థూలజలధారలతోఁగూడిన మేఘములచేతను, మధ్యభాగమున దగ్ధపర్వతములచేతను, అధోభాగమున పంకమందుండు సర్పములచేతను వ్యాప్తమైయున్నదియు, గంగాప్రవాహమువలె నిరంతరము జలధారలచేఁబూర్ణమైయున్నదియు మునుఁగుచు, తేలుచు, కొట్టుకొనిపోవుచున్న పర్వతశిఖరములవంటి ఫేన బుద్బుదములు గలదియు, కొట్టుకొనిపోవుచున్న ఛిన్నభిన్నములైన స్వర్గఖండములందేడ్చుచున్నట్టి ఆకాశచారులగు దేవతలు గల్గియున్నదియు, ప్రవాహపతితమగు విద్యాధరీసమూహమును కమలవృందముచే లోన మహాహారముగా నున్నదియునై యొప్పుచుండెను.

ఏకార్ణవపయః పూరైర్ఘర్ఘరారావరంహసి
త్రైలోక్యఖణ్డసంహారే ప్రోహ్యమాణే మహామ్భసి. 26
నాసీత్కశ్చిత్పరిత్రాతా హన్తా జీవితచోఽపి చ
శక్నోతి కః పరిత్రాతుం కాలేన కవలీకృతమ్. 27

ఆ యేకమైనట్టి మహాప్రళయసముద్రముయొక్క గొప్పప్రవాహములచే ఘర్ఘరశబ్దసహితమై అతివేగయుక్తమైనట్టి మహాజలమున ముల్లోకములును గొట్టుకొనిపోవుచుండునపుడు రక్షకుండెవ్వఁడును లేకయుండెను. మఱియు అపుడా సముద్రతరంగములచే గ్రసింపఁబడని యే ప్రాణియున్ను, పదార్థమున్ను గూడ లేకయుండె, కాలముచేఁ గబళింపఁబడిన జగత్తును రక్షింప నెవరికిఁదరము!

నాకాశమాసీన్న దిగన్త ఆసీదధోఽపి నాసీన్న తదూర్ధ్వమాసీత్
భూతం న ఆసీన్న చ సర్గ ఆసీదాసీత్పరం కేవలమేవ వారి. 28

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే ఏకార్ణవవర్ణనం
నామ అష్టసప్తతితమః సర్గః ॥ 78 ॥

ఓ రామచంద్రా! ఆ సమయమున, ఆకాశముగాని, దిక్కులుగాని, ఊర్ధ్వాధోభేదములుగాని; భూతకాలముగాని సృష్టిగాని లేకయుండెను. కేవలము జలముమాత్రమే యుండియుండెను.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణ ప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున ఏకార్ణవవర్ణనమను డెబ్బదియెనిమిదవ సర్గము ॥ 78 ॥

ఏకోనాశీతితమః సర్గః

[సర్షిదేవగణస్యాత్రధాతుర్నిర్వాణమీర్యతే
స్వప్నస్యేవ ప్రబోధేన బాధస్తచ్చ సమర్థ్యతే.

జాగ్రత్తుచే స్వప్నము బాధితమగునట్లు, జగత్తు బాధితముకాఁగా ఋషిదేవగణసహితముగ బ్రహ్మదేవుఁడు నిర్వాణము నొందుట యిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీవసిష్ఠ ఉవాచ:—
ఏతస్మిన్నన్తరే చక్షుర్వ్యోమస్థోఽహమథాత్యజమ్
బ్రహ్మలోకే మహాలోకే ప్రభాతేఽర్కప్రభామివ. 1

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! తపోలోకమువఱకు జగత్తు ప్రళయసముద్రమునందు మునుఁగ, అపుడు సత్యలోక సమీపస్థమగు ఆకాశమందున్న నేను, ప్రాతఃకాలమున సూర్యుఁడు తన ప్రకాశమును బ్రసరించునట్లు, మహాప్రకాశయుక్తమగు బ్రహ్మలోకమున నా దృష్టిని బ్రసరించితిని.

యావద్ద్రష్టో మయా తత్ర శైలాదివ వినిర్మితః
పరమేష్ఠీ సమాధిస్థః ప్రధానపరివారవాన్. 2
సమూహశ్చైవ దేవానాం మునీనాం భావితాత్మనామ్
శుక్రో బృహస్పతిశ్చైవ శక్రోవైశ్రవణో యమః. 3

సోమోఽథ వరుణోఽగ్నిశ్చ తథాన్యేఽపి సురర్షయః
దేవగన్ధర్వసిద్ధానాం సాధ్యానాం చ వినాయకాః. 4

ఇంతలో నచట, సాలోక్యముక్తిని బొందినవారును, బ్రహ్మదేవునితోఁగూడ కైవల్యపదమును బొందువారుననగు పరివారజనముతోసహా శిలానిర్మిత విగ్రహమువలె నిశ్చలముగ సమాధియందుఁ గూర్చొనియున్నట్టి బ్రహ్మదేవుని గాంచితిని. మఱియు నచ్చోట అధికారులగు దేవతలను నిర్మలహృదయులగు మునులను శుక్రాచార్యుని, బృహస్పతిని, ఇంద్రుని, కుబేరుని, యముని, చంద్రుని, వరుణుని, అగ్నిని, తక్కినదేవతలను, ఋషులను, దేవ, గంధర్వ, సిద్ధ, సాధ్యులనాయకులనుగూడ నే నవలోకించితిని.

లిపికర్మార్పితాకారాః సర్వే ధ్యానపరాయణాః
బద్ధపద్మాసనాస్తత్ర నిర్జీవా ఇవ సంస్థితాః. 5

వారందఱును చిత్రమందు లిఖింపఁబడినవారి చందమున నున్నవారును, పద్మాసనము వైచికొని కూర్చున్నవారును, నిర్జీవులవలెఁ గాన్పించుచున్నవారును, ధ్యానపరాయణులునై యుండిరి.

అథ తే ద్వాదశాదిత్యాస్తమేవోద్దేశమాగతాః
బద్ధపద్మాసనాస్తస్థుస్తథైవాశు తథైవ తే. 6

తదుపరి, పూర్వము తెల్పఁబడిన ద్వాదశాదిత్యులున్ను ఆ స్థానములకు విచ్చేసిన యా దేవమునులవలె శీఘ్రముగ నటఁ బద్మాసనము బంధించి గూరుచుండిరి.

తతో ముహూర్తమాత్రేణ దృష్టవానహమబ్జజమ్
పురోవినిద్రతాం యాతః స్వప్నదృష్టమివాగ్రగమ్. 7

పిమ్మట ముహూర్తమాత్ర కాలములో స్వప్నమునుండి మేల్కొనిన మనుజుఁడు స్వప్నపదార్థములను దనయెదుట గావించువిధమున బ్రహ్మదేవుని ఆత్మ మాత్రపరిశేషునిగ నెదుట నేను గాంచితిని.

బ్రహ్మలోకజనం సర్వం మహతామివ వాసనామ్
నాపశ్యం స్వప్ననగరం బుధ్యమాన ఇవాగ్రగమ్. 8

మఱియు, తత్త్వజ్ఞుల వాసనవలె నంతర్ధాన మొందినట్టి తక్కిన బ్రహ్మలోకస్థజనసమూహమంతటినిగూడ నపుడు మేల్కొనిన మనుజుఁడు తన యెదుట స్వప్ననగరమును గాంచనట్లు నేను గాంచకుంటిని.

అరణ్యశూన్యమేవాసీత్తద్బ్రహ్మమననం తదా
కఠినాకాణ్డవిధ్వస్తం పృథివ్యామివ పత్తనమ్.

అట్లు బ్రహ్మదేవుని అంతిమ ఆత్మసాక్షాత్కారసమయమున నాతనిగూడ, నచటసర్వులు విదేహముక్తినొందుటచే, కఠినమగు ఆకస్మికనాశముచేఁ బృథివియందలి నగరమువలె, బ్రహ్మలోకమపుడు జనశూన్యమగు అరణ్యమువలె గోచరించెను.

సర్వ ఏవ న చ క్వాపి తే తథా తాదృశాస్తదా
ఋషయో మునయో దేవా సిద్ధా విద్యాధరాదయః. 10

ఆ సమస్త ఋషి, ముని, దేవ, విద్యాధరాదులున్ను నపుడా బ్రహ్మదేవునివలె (దృశ్య) శూన్యరూపులైరి. ఏలయనిన, వారచ్చోటినుండి యెచటకును బోకయే ఆత్మస్వరూపమున విలీనులైరి.

జ్ఞాతం తతోఽవధానేన మయా నభసి తిష్ఠతా
యావన్నిర్వాణమాపన్నా బ్రహ్మవత్సర్వ ఏవ తే. 11

పిమ్మట నే నాకాశమందుండి ధ్యానముచే బ్రహ్మదేవునివలెనే వారందఱున్ను నామరూపములను త్యజించి నిర్వాణమును బొందిరని యెఱిఁగితిని.

వాసనాయాం విలీనాయామదర్శనముపాగతాః
స్వప్నలోకాః ప్రబుద్ధానామివ స్వం రూపమాగతాః. 12

నిద్రనుండి మేల్కొనినవారు స్వస్వరూపమును బొందునట్లు, వాసనలు నశించుటచే వారందఱున్ను అదృశ్యులై తమ శుద్ధ బ్రహ్మరూపమును బ్రాప్తినొందిరి.

ఆకాశాత్మైవ దేహోఽయం భాతి వాసనయా స్ఫుటః
తదభావాత్తు నో భాతి స్వప్నో బోధవతో యథా. 13

ఆకాశరూపమగు ఈ దేహము వాసనచేఁ బ్రత్యక్షముగ భాసించుచున్నది. వాసనయొక్క అభావముచే, జాగ్రతునకు స్వప్నమువలె, భాసింపకయేయుండును.

అన్తరిక్షగతో దేహో యథా స్వప్నే విలోక్యతే
బోధే తద్వాసనాశాన్తౌ న కించిదపి లక్ష్యతే. 14

స్వప్నమందు ఆకాశగమన మొనర్చుదేహము మేల్కొనినపిదప కానుపించునట్లు, వాసనలు శమింప, ఈ శరీరాదు లెవ్వియును గానుపింపనేరవు.

జాగ్రత్యపి తథైవాయం వాసనాయాః పరిక్షయే
నైవాతివాహికో నైవ లక్ష్యతేఽత్రాధిభౌతికః. 15

జాగ్రత్తునందే వాసనలు క్షయించుటచే స్థూల, సూక్ష్మశరీరములు రెండును భాసింపకుండును.

స్వప్నానుభవ ఏషోఽత్ర దృష్టాన్తత్వేన లక్ష్యతే
ఆబాలమేతత్సంసిద్ధమనుభూతం శ్రుతం స్మృతమ్. 16

బాలకుని పర్యంత మనుభూతమై, శ్రుతి, పురాణాదులవలన నెఱుఁగఁబడినదై, ప్రసిద్ధమైనట్టి స్వప్నానుభవమే యివ్విషయమున దృష్టాంతమైయున్నది.

అపహ్నుతే చ వా యోఽపి స్వమేవానుభవం శఠః
సత్యాజ్యః కో హ్యలీకేన సుప్తముద్బోధయేత్కిలః. 17

ఏ శఠుఁడు నిజానుభవసిద్ధమును అన్యులయనుభవసిద్ధములునగు స్వప్న నాశమును విశ్వసింపఁడో అట్టివాఁడు త్యాజ్యుఁడేయగును. మఱియు నట్టి మిథ్యారూపుఁడగు స్వప్నశీలు డెవనిచేతను, మేలుకొలుపఁబడఁదగిన వాఁడుకాఁడు.

దేహకారణకః స్వప్నే దేహాభావాన్న దృశ్యతే
इति చేత్తదదేహానాం పరలోకోఽపి నాస్తి చ. 18

ఈ జాగ్రచ్ఛరీరమునకు కారణము పిత్రాదుల దేహములనియు, స్వప్నశరీర కారణ మట్లు పిత్రాదిదేహములు కావనియు, కనుకనే స్వప్నమందు వాస్తవముగ దేహములేదనియుఁ గాన, పై దృష్టాంతము సరికాదనియు వచించుచో, యజ్ఞాదికారణములచే నుత్పన్నములగు పరలోక-శరీరములున్ను నపుడు మిథ్యయగుటఁబట్టి నీవు నాస్తికుఁడవే యైతివి.

ఇత్యేతదభవిష్యచ్చేత్తచ్ఛరీరకసంక్షయే
నాభవిష్యదయం సర్గః స చాస్త్యేవ చ సర్వదా. 19

దేహముచే, వప్పు తదితరకారణములచే నుత్పన్నమగు దేహము సర్వథా అసత్తని తలంచుచో, నపుడు దేహముచే నుత్పన్నముకాని బ్రహ్మదేవుని శరీరమున్ను, సర్వథా అసత్తగుట చేతను, పూర్వ కల్పాంతమున సర్వశరీరములు సంపూర్ణముగ క్షయమైయుండుటచేతను, దేహమే లేకపోవుటచే మరల యే శరీరమున్ను, ఏ సృష్టియు నిపుడుండకయే యుండవలసివచ్చును. కాని, అట్లుగాక, సృష్టియు, శరీరాదులున్ను నిపుడు సదా సర్వుల యనుభవమందును నుండియేయున్నవి.

అవయవవిభాగాత్మన్యవశ్యం భావిని క్షయే
న కదాచిదనిత్థం తజ్జగదిత్యప్యసంస్థితమ్. 20

'దేహములనుండియే దేహము లుత్పన్నములగుచు అర్థక్రియా సమర్థములగుచున్నవి. ఇట్లు, సర్వదా ప్రవాహరూపమై యీ జగత్తు, అనాదియై నిత్యసిద్ధమైయున్నది. దీనికి ప్రళయ మెన్నఁడును సంభవింపదు' - అను ఈ జైమినీయమతమున్ను సరికాదు. ఏలయనిన, పంచభూతముల సంయోగరూపములేయగు ఈ జగత్తునందలి పదార్థములయొక్క విభాగము సంభవించు నపుడు జగత్తుయొక్క నాశము అనివార్యమేయగును.

న కదాచిజ్జగన్నాశో దేహోద్భూతగుణాదికమ్
మదశక్తిరివజ్ఞప్తిరుదేతీతి చ వక్షి చేత్. 21
తత్పురాణేతిహాసానాం సర్వసంక్షయవాదినామ్
స్మృత్యాదీనాం సవేదానాం వైయర్థ్యముపజాయతే. 22

' ఈ జగత్తుయొక్క కారణమగు పృథ్వ్యాది భూతచతుష్టయ మెన్నటికిని నశింపదు. కావున, జగత్తు నశింపనిదేయగును; మద్యహేతువులగు క్షారాది పదార్థముల సంయోగముచే మదశక్తి యావిర్భవించునట్లు, ఆ పంచభూతములే దేహాకారముగఁ బరిణమించునపుడు. అందు జ్ఞానగుణ ముదయించుచున్నది'ని (ఛార్వాకుఁడు) అనినచో, అపుడు వస్తువినాశము, చతుర్విధ ప్రళయము, అష్టాదశ పురాణములు, భారతాది ఇతిహాసములు, ఐహిక, పారలౌకిక హితాహిత ధర్మాధర్మములఁ బ్రతిపాదించు శ్రుతి, స్మృతులు, సదాచారములు మున్నగు నవియన్నియు వ్యర్థములును, అప్రమాణములు నగును.

అప్రమాణతయైతస్మిన్నర్థే తేషాం మహామతే
అన్యథాఽపి ప్రమాణత్వం వన్ధ్యాదావపి కిం భవేత్. 23

'దేహాత్మవాదులమగు మాచార్వాకులమతమున వానివ్యర్థత్వము, అప్రమాణత్వము సమ్మతమే' అనిన, ఓ విశాలబుద్ధీ! ఈ యనేక శిష్టుల యభిప్రాయములన్నియు అప్రమాణములగుచో 'వంధ్య అనేకసుతలఁగనెను' అనునీ మున్నగు వాక్యములవంటి నీ వాక్యమున్ను నపుడు ప్రమాణమెట్లగును?

న చైతదిష్యతే లోకే జగదుచ్ఛేదకారణాత్
అన్యచ్చాస్త్రామేవదజ్ఞ మమేదమతరం శృణు. 24

ఓ ప్రియుఁడవగు చార్వాకా! జగత్తునశించునదియగుటవలన నీమత మంగీకారము కానేరదు. ఇంకను నీమతమందలి దూషణములఁ గూర్చివినుము.

మదశక్త్యాత్మని జ్ఞానే దృష్టాదేశాన్తరేషు యా
ప్రమృతానాం పిశాచాది దేహతా సా న సిధ్యతి. 25

మదశక్తివలె జ్ఞానగుణము దేహముచే నుత్పన్నమగుచున్నదనిన, మఱియొకచోట మరణించినవాని శరీరమచటనే నశించిపోవుటచే అతడు పిశాచాది అన్యదేహముచే స్వదేశమునకేతెంచి, పరశరీరప్రవేశముద్వారా స్వజనాదులతోటి సంభాషించుట మున్నగు క్రియలపుడు సంభవింపకయే యుండవలసివచ్చును.

అథ సాపి ముధా భ్రాన్తిర్యావద్దేహం ప్రదృశ్యతే
ఇతి చేత్తన్మృధా నామ సత్యమిత్యేవ వో భవేత్. 26

పిశాచాదులు అప్రత్యక్షములగుటచే నట్టి పిశాచాది కల్పనయు వ్యర్థభ్రాంతియే యనిన, నీవాక్యమున్ను అప్రత్యక్షమగుటచే నదియు అప్రమాణమేల కాగూడదు?

ఏవం చేత్తత్పరో లోకః సత్స్వర్గనరకాదికమ్
ఇత్యేషాపి న సంవిత్కిం సత్యతాముపగచ్ఛతి. 27

శబ్దాదుల ప్రమాణము సమ్మతమనినచో, అపుడు నిర్దోషశబ్దరూపములగు శ్రుతుల యొక్క ప్రామాణ్యమున్ను సమ్మతమగుటఁబట్టి, తచ్ఛ్రుతి ప్రతిపాదకములగు పరలోక, స్వర్గ, నరకాదులున్ను నిత్యములగుటచే వాని జ్ఞానమున్ను ప్రామాణ్యమేల పొందరాదు?

న పిశాచప్రమా సత్యా మదశక్తిమతోఽపి హి
ప్రతిభాన న సత్యా స్యాత్పరలోకాత్మికా కథమ్. 28

మఱియొక దేహము నాశ్రయించునట్టి అనుభవసిద్ధమగు పిశాచమునుగూర్చిన బుద్ధియే సత్యముకానిచో, నిఁక, మదిరాది పదార్థములయొక్క మదశక్తి ప్రతిభయు సత్యము కాకయే యుండును. ఇట్లు. నీ 'మదశక్తి' దృష్టాంతము సరికానందున. జ్ఞానమునకు భూతగుణముసిద్ధింపమి జీవునియొక్క పరలోకాత్మికమగు స్వర్గ నరకాది స్థితిని నిరసించుటకు నీవెట్లు శక్తుఁడవగుదువు?

పిశాచోఽస్తీతి చేత్సంవిత్సత్యార్థా తేన సంవిదః
మృతస్యాస్తి పరో లోక ఇత్యస్యాం కిం న సత్యతా. 29

సర్వజన ప్రసిద్ధమగు అనుభవముయొక్క ప్రమాణముచే 'పిశాచము గలదను' బుద్ధిని సత్యమని నమ్మినచో, మృతునకుఁ బరలోకముగలద'ను శ్రుతిప్రతిపాదకజ్ఞానమందును సత్యత్వమేల యుండరాదు?

కాకతాలీయవద్దేహాత్ప్రైశాచీ జ్ఞప్తిరస్తి చేత్
పరలోకార్థసంవిత్తిః కథం నాస్తి సకారణా. 30

కాకతాలీయమువలె నాకస్మికమై, శ్రుతివంటి దృఢతర ప్రమాణజన్యముకానిదైనను పిశాచ, జ్ఞానము స్వానుభవ విరుద్ధముకానందున 'కలద'ని వచించునపుడు. ఇఁక, దృఢతర శ్రుత్యాది కారణసహితమైనట్టి పరలోకజ్ఞానము సత్యముకాదని యెట్లు చెప్పగలవు?

యా స్తర్వేత్తి యథా సంవిత్సా తథానుభవత్యలమ్
అస్తు సత్యమసత్యం వాసిద్ధమిత్యనుభూతితః. 31

సత్యమైనను. అసత్యమైనను ఏ సంవిత్తు (జ్ఞానము) ఏ వస్తువుయొక్క సత్తనే ప్రకారముగ దనయందెఱుఁగునో, అద్దాని నా ప్రకారముగనే యనుభవించునను విషయ మనుభవసిద్ధమేయై యున్నది,

మృతస్యాస్తి పరో లోకో విదిత్యేవం మయా భవేత్
సతి వాసతి దేహేఽస్మిస్తేన కిం సదసచ్చ కిమ్. 32

జీవితదశయందు శ్రుత్యాది ప్రమాణములచేగాని మరణదశయందు, స్వప్నమువంటి ప్రతిభామాత్రఁ బలముచేగాని 'పరలోకము గలడ'ను నీప్రకారమగు అనుభవ రూపమైన జ్ఞానము గలుగుచో నిఁక, జీవితుని, యనుభవసిద్ధమే సత్యమనియు, మృతుని యనుభవసిద్ధము అసత్యమనియు, లేక తద్విపరీతమనియు, వచించుట సరికాదు. కావున, ఉభయానుభవములను దొలగించుటకు శక్యముకాదు.

తస్మాత్స్వభావః ప్రథమం ప్రస్ఫురన్వేత్తి సంవిదమ్
వాసనాకారణం పశ్చాద్బుద్ధ్వా సంపశ్యతి భ్రమమ్. 33

కాఁబట్టి వేదాది ప్రమాణములచే బ్రతిపాదితమైన స్వయంసిద్ధమగు జ్ఞానస్వరూపమైన ఆత్మ స్వప్రకాశమగుటచే సర్వవ్యవహారములకుఁ బూర్వము నిత్యసిద్ధమగు నిజస్వరూప జ్ఞానమును మొమ్మొదట నెఱుఁగుచున్నది. పిమ్మట వాసనలకు కారణమగు సూక్ష్మ శరీరము నెఱుఁగుచున్నది ఆ పిదప స్థూలదేహాది సంసారభ్రమను గాంచుచున్నది.

తత్తయాచ్ఛమమాయాతి ద్రష్టృదృశ్యదృగామయః
తత్సత్తాయాముదేతీయం సంసృత్యాఖ్యా పిశాచికా. 34

వాసనలు నశించుటచే ద్రష్టృదర్శన దృశ్యరూపమగు రోగము శమించుచున్నది. వాసన యుండుటచే సంసారమను పిశాచ ముదయించుచున్నది.

ఉపలమ్భ ఉదేత్యాదౌ బ్రహ్మణో వాసనా తతః
తచ్ఛాన్తిం విద్ధి నిర్వాణం తత్సత్తాం సంసృతిభ్రమమ్. 35

ఓ రామచంద్రా! సృష్ట్యాదియందు బ్రహ్మదేవునకు జగన్నిర్మాణమును గూర్చిన యిచ్ఛ జనించుచున్నది. తదుపరి జగద్రూపముచేఁ బూర్వకాలిక వాసనయొక్క యుత్పత్తిసంభవించుచున్నది, కావున వాసనయొక్క శమనమే నిర్వాణమనియు, దాని అస్తిత్వమే సంసారభ్రమయనియు నెఱుఁగుము.

ఉత్పన్నైవ చ సానాదౌ పరబ్రహ్మణ్యసంభవాత్
ఉత్పన్నా సమయాద్యాసౌ బ్రహ్మైవ పరమేవ సత్. 36

కాని, ఆ వాసన వాస్తవముగ పరబ్రహ్మమునుండి జనింపలేదు. (బ్రహ్మము కూటస్థ, అద్వైత స్వభావయుతమగుటచే) అద్వితీయ బ్రహ్మమునుగూర్చి బోధించుటకొఱకు శాస్త్రముచేఁ గల్పితమైనట్టి సిద్ధాంతముచే. జ్ఞానోదయ పర్యంతమద్దానిని (వాసనను) ఏదో యొక కారణముచే జనించినదని యంగీకరింపవలెను. జ్ఞానముత్పన్నమైన పిదపయో, సమస్తజగత్తున్ను, ఆ వాసనయు పరబ్రహ్మరూపమే యగును.

ఏతావద్యత్పరిజ్ఞానం తన్నిర్వాణం విదుర్బుధాః
యదత్రైవాపరిజ్ఞానం తం బన్ధం విద్ధి రాఘవ. 37

ఓ రామచంద్రా! అట్టి బ్రహ్మజ్ఞానమునే తత్త్వజ్ఞులు నిర్వాణమందురు. అట్టి బ్రహ్మమును గూర్చిన జ్ఞానము లేకుండుటయే బంధమని యెఱుఁగుము.

విజ్ఞానఘనఏవాయం కచనాకచనాత్మకః
స్వయమేవ కచత్యన్తర్న కచత్యేవ వా స్వయం. 38

విజ్ఞానఘనమగు ఈ యాత్మ బ్రకాశరూపమైనదియు, అప్రకాశరూపమైనదిగూడ నగును. ఎఱుఁగఁబడినచో నది స్వయముగనే ప్రకాశరూపముచే నంతఃకరణమున స్ఫురించును. ఎఱుఁగఁబడనిచో స్వయముగనే స్ఫురింపకయు నుండును.

సంవిదంశపరావృత్తిమాత్రే పేలవరూపిణి
బన్ధదృఙ్మోక్షదృక్ చేతి క్లేశస్తత్సాధనం కియత్. 39

'నేను బద్ధుఁడను' అను ఈ భావనచే బంధమున్ను, 'నేను ముక్తుఁడను' అను ఈ భావనచే ముక్తియున్ను ఆత్మకు, గలుగుచుండ, ఇట్లు భావనయొక్క పరివర్తన మాత్రముచే బంధమోక్షములు సిద్ధించుచుండ నిఁక మోక్షసాధనమున నే క్లేశము గలదు?

సంవిదుద్బోధనే బన్ధస్తదనుద్బోధనే శివమ్
అసత్సద్వజ్జగద్భాతి సంవిదుద్బోధనోదరమ్. 40

చిత్తవృత్తిని బహిర్ముఖ మొనర్చుటచే బంధమున్ను, అద్దానిని సమాధి ద్వారా ఆత్మయందు లీనమొనర్చుటచే మోక్షమున్ను గలుగుచున్నది. చిత్తవృత్తిని బహిర్ముఖము గావించుటచే అసత్తగు జగత్తు సత్తువలె భాసించుచున్నది.

అజడం వేదనం సుప్తం మోక్ష ఇత్యభిధీయతే
ప్రబుద్ధం బన్ధ ఇత్యాహుర్యదిచ్ఛసి తదాహర. 41

ఓ రామచంద్రా! దృశ్యప్రపంచరహితమై, శాంతమైనట్టి చైతన్యస్వరూపముతోటి స్థితియే మోక్షమనియు, దృశ్యప్రపంచసహితమైనట్టి స్థితి బంధమనియు జెప్పఁబడును. ఈ రెంటియందును నీవు దేని నిచ్ఛగించెదవో, దాని నభ్యసించుము.

నిర్వాణవాసనమనన్తమనాద్యమచ్ఛ
బోధైకతానమపయన్త్రణమస్తశఙ్కమ్
అద్వైతమైక్యరహితం చ నిరస్తశూన్య
మాకాశకోశవిశదాశయ శాన్తమాస్స్వ. 42

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు, నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే వాసనాభావ ప్రతిపాదనం నామైకోనాశీతితమః సర్గః ॥ 79 ॥

ఓ రామచంద్రా! నీవు విక్షేపరహితమగు సుఖముకొఱకై, వాసనారహితమై, అనాదియై అనంతమై, నిర్మలబోధరూపమై, ద్వైత, ఏకత్వవర్జితమై, శూన్యత్వరహితమై, ఆకాశమువలె నిర్మలమైనట్టి బ్రహ్మస్వరూపముతోటియే స్థితి గల్గి బంధరహితుఁడవు కమ్ము.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున వాసనాభావ ప్రతిపాదమను డెబ్బదితొమ్మిదవ సర్గము ॥ 79 ॥

అశీతితమః సర్గః

[వైజ్ఞానికస్తత్త్వదృశావర్ణితః ప్రళయక్రమః
ప్రాకృతో యోగిగమ్యోఽన్యో వర్ణ్యతే ప్రళయక్రమః.

ఇదివఱలో వైజ్ఞానికతత్త్వదృష్టిచే ప్రళయక్రమము వర్ణింపఁబడియుండెను. ఇపుడు సామాన్యయోగి గమ్యమగు అన్యప్రళయక్రమము వర్ణింపఁబడుచున్నది.]

శ్రీవసిష్ఠ ఉవాచః—

ఇతి తే సర్వ ఆయాతా బ్రహ్మలోకనివాసినః
అదృశ్యతామేవ గతా దీపాః క్షీణదశా ఇవ. 1

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఈ ప్రకారముగ నచటికేతెంచిన యా బ్రహ్మలోకనివాసులందఱును, తైలము, వత్తిలేని దీపమువలె అదృశ్యత్వమొందిరి.

అథ తే ద్వాదశాదిత్యా బ్రహ్మణి బ్రహ్మణాం గతే
జగద్వద్బ్రహ్మలోకం తమదహన్నాస్వరార్చిషః. 2

తదుపరి యా ద్వాదశాదిత్యులున్ను, బ్రహ్మమందు బ్రహ్మరూపత్వము నొంద, ఆ పిమ్మట భూలోకాదులనువలె బ్రహ్మలోకమునున్ను, ప్రకాశవంతములగు అగ్నిజ్వాలలు భస్మీభూతమొనర్చివైచెను.

అట్లు బ్రహ్మదేవుని నగరమును దహించివైచి, ఆ బ్రహ్మదేవునివలెనే ధ్యానమొనర్చి ఆ యగ్న్యాది దేవతలున్ను పిమ్మట తైలము, వత్తిలేని దీపమువలె శాంతినొందిరి.

వైరిఞ్చనగరం దగ్ధ్వా ధ్యానం కృత్వా విరిఞ్చివత్
తేఽపి నిర్వాణమాజగ్ముర్నిః స్నేహదశదీపవత్. 3

తత ఏకార్ణవాపూరో విరిఞ్చనగరాన్తరమ్
రాత్రౌ భువమివ ధ్వాన్తం పూరయామాస నూర్మిమాన్. 4

ఆబ్రహ్మలోకమభవజ్జగదాపూర్ణమర్ణసా
తుల్యం రసైకపూర్ణేన పక్వద్రాక్షాఫలేన తత్. 5

తత్తదూర్మి గిరివ్రాతభగ్నైరావలితాః ఖిలాః
విచ్ఛిన్నాః కల్పజలదా జల ఏవ నిలిల్యిరే. 6

పిదప, రాత్రియందు అంధకారము భూమండలమును బూర్ణమొనర్చునట్లు విశాలతరంగయుక్తమగు మహాసముద్ర మా బ్రహ్మదేవుని నగరమును బూర్ణమొనర్చివైచెను. అత్తఱి, రసముచేఁ బూర్ణమగు పరిపక్వద్రాక్షఫలమువలె బ్రహ్మలోకమువఱకు బ్రహ్మాండమంతయు జలముచేఁ బూరితమాయెను. ఆయా యనేకప్రకారములగు తరంగములచేతను, తేలియాడు బర్వతసమూహములచేతను, పక్షులయొక్కయు, దేవతలయొక్కయు శరీరములచేతను ఛిన్నభిన్నములై పుష్కరావర్తాది కల్పాంతమేఘములా జలమందే లీనములై పోయెను.

ఏతస్మిన్నన్తరే తత్ర దృష్టవానహమమ్బరాత్
యావదభ్యుదితం భీమం భీతః కించిన్నభోన్తరాత్. 7

కల్పాన్తజగదాకారం కృష్ణమాపూరితామ్బరమ్
అకల్పం సంభృతం నైశం దేహేనేవోత్థితం తమః. 8

తరుణాదిత్యలక్షాణాం తేజ ఆభాస్వరం దధత్
ఆదిత్యత్రయసంకాశైః స్థిరవిద్యుచ్ఛయోల్బణైః. 9

నేత్రైస్త్రిభిర్భాస్వరముఖం జ్వాలాపుఞ్జసముద్గిరమ్
పఞ్చాననం దశభుజం త్రినేత్రం శూలపాణికమ్. 10

ఆయాన్తమన్తముక్తేఽపి వ్యోమ్నీవ వితతాకృతిమ్
ఖమివాసి ఘనశ్యామం దేహమాసాద్య సంస్థితమ్. 11

స్థితమేకార్ణవాపూర్ణాద్బ్రహ్మణ్డాద్బహిరమ్బరే
వ్యోమేవహస్తపాదాదిసంనివేశేన లక్షితమ్. 12

ఘోణానిలపరావృత్తివిధూతైకమహార్ణవమ్
గోవిన్దమివ దోర్దణ్డక్షోభితక్షీరసాగరమ్. 13

కల్పార్ణవజలాపూరం పుంస్త్వేనేవ సముత్థితమ్
మూర్తియుక్తమహంకారమస్తకారణమాగతమ్. 14

కులాచలబృహద్వృన్దమివోడ్డయనడమ్బరైః
పక్షైర్మైరుత్థితం వ్యోమ సమస్తమఖిపూరయత్. 15

పిమ్మట నేనా యాకాశస్థానమునుండి లేచి వెడలనుండఁగా నింతలో నట నొకానొక భయంకరరూపమును గాంచి భీతిల్లితిని. కల్పాంతజగదాకారమువంటిదియు, కృష్ణవర్ణము గలదియునై యాకాశమును బూర్ణమొనర్చుచు నయ్యాకారము, కల్పమువఱకు సంచిత మొనర్పఁబడిన యంధకారము మూర్తీభవించియున్నదా యనునట్లు ప్రకటమయ్యెను. మఱియు, ఆ రూపము లక్షలకొలఁది నూతన సూర్యులయొక్క ప్రకాశమయమగు తేజమును ధరించియున్నదియు సూర్యత్రయమును బోలినదియు, స్థిరవిద్యుత్సమూహమువలె దేదీప్యమానమైనదియు, నేత్రకాంతిచే బ్రకాశమానమైన ముఖముగలదియు, జ్వాలాసమూహమును వెలిగ్రక్కుచున్నదియు, మూఁడునేత్రములు, ఐదు ముఖములు, పది భుజములు, గలదియు, హస్తమందుఁ ద్రిశూలమును ధరించియున్నదియు, అనంతాకాశమువలె విశాలమైన యాకృతిగలదియు, మేఘమువలెను, ఖడ్గమువలెను శ్యామవర్ణముగలదై మూర్తివంతమైన యాకాశమువలె నొప్పుచున్నదియు, మహాసముద్రముచేఁ బూర్ణమగు బ్రహ్మాండముయొక్క బాహ్యమున ఆకాశమున స్థితి గల్గియున్నదియు, ఆకాశమేయవ్విధమున హస్తపాదాద్యవయవములతోఁ గూడినట్లుగన్పట్టునదియు, శ్వాసవాయువుయొక్క గమనాగమనములచే మహాసముద్రమునుగూడఁ గంపింపజేయునదియు, విష్ణుభగవానునివలె భుజదండములచే క్షీరసాగరమును క్షోభితమొనర్చునదియు, పురుషాకారమును ధరించిన కల్పాంత సముద్రమువలె నుదయించినదియు, అహంకారమంతటియొక్క సమష్టిరూపము మూర్తిని దాల్చియేతెంచినట్లున్నదియు, కులపర్వతముల మహాసమూహమువలెఁ బ్రకటమైనదియు, ఎగురుటయందుఁ దత్పరములగు ఱెక్కలచే నాకాశమండలమంతయుఁ బూర్ణమొనర్చు నదియునై విరాజిల్లుచుండెను.

తతస్త్రిశూలనయనై ర్మయారుద్రోఽయమిత్యసౌ
దూరాదేవ పరిజ్ఞాయ పరమేశో నమస్కృతః. 16

పిదప, త్రిశూలమునుబట్టియు, త్రినేత్రములనుబట్టియు 'ఈతఁడు రుద్రుఁడు' అని యెఱిఁగి దూరమునుండియే యా పరమేశ్వరునకు నమస్కరించితిని.

శ్రీరామ ఉవాచః—

కిం స తాదృగ్విధో రుద్రః కిం కృష్ణః కిం మహాకృతిః
కిం పఞ్చవదనః కస్మాద్దశబాహుః స తిష్ఠతి. 17

కిం త్రినేత్రః కిముగ్రాత్మా కిమేకః కిం ప్రయోజనః
కేనేరితః కిమకరోచ్ఛాయాసీద్వద కా మునే. 18

శ్రీరాముఁడు:— మహాత్మా! పరమేశ్వరుఁడగు రుద్రుఁడవ్విధమున కృష్ణవర్ణమును, మహాకారమును, పంచముఖములను, త్రినేత్రములను, దశభుజములను, ఉగ్రరూపమును, ఏకస్వరూపమును ఏల గలిగియున్నాడు? ఏకారణముచే నట్టి భయంకరరూపమును దాల్చినాఁడు? మఱియు నాతఁడు స్వతంత్రుఁడా, పరతంత్రుడా? స్వతంత్రుఁడైనచో పూర్ణకాముఁడగు నాతనికి సంహారమునఁ బ్రవృత్తియేల? పరతంత్రుఁడైనచో నెవనిప్రేరణచే నాకార్యము నాచరించుచున్నాఁడు? అతనిఛాయా రూపమగు మాయయు నేదైయున్నది? దయచేసి వచింపుడు.

శ్రీవసిష్ఠ ఉవాచః—

కాకుత్స్థ రుద్రనామాసావహంకారతయోత్థితః
విషమైకాభిమానాత్మా మూర్తిరస్యామలం నభః. 19

శ్రీ వసిష్ఠుఁడు:— కకుత్స్థవంశమున జనించిన ఓ రామచంద్రా! ఈ పరమేశ్వరుఁడు సృష్టిస్థితి సంహారాదులఁగూర్చిన సంకల్పాదులకు కారణభూతమగు అహంకారత్వముచే రుద్రనామముతో ఆవిర్భవించెను. (సర్వప్రాణులను రోదనమొనర్ప జేయువాఁడగుటచేతను, శరణాగతుల సమస్త రోగములను బారద్రోలువాఁడగుటచేతను నాతనికి రుద్రుఁడని పేరువచ్చినది.) అతఁడు దుష్టజనులను రోదనమొనర్పఁ జేయుటయందు 'విషమాభిమానరూపము'ను, శరణాగతుల రోగములఁ బారద్రోలుటయందు 'ఏకాభిమానరూపము'ను ధరించుచున్నాఁడు. అతనిస్వరూపము కేవలము చిదాకాశమాత్రమేయైయున్నది.

వ్యోమాకృతిః స భగవాన్వ్యోమవర్ణో మహాద్యుతిః
చిద్వ్యోమమాత్రసారత్వాదాకాశాత్మా స ఉచ్యతే. 20

వాస్తవముగ సర్వసారమగు చిదాకాశమాత్రమే స్వరూపముగఁ గల్గియుండుటఁబట్టి యా భగవంతుఁ డాకాశమువంటి యాకారము, వర్ణము గలవాఁడై మహాప్రకాశమయుఁడై చెన్నొందుచు ఆకాశరూపుఁడని వచింపఁబడుచున్నాఁడు.

సర్వభూతాత్మభూతత్వాత్సర్వగత్వాన్మహాకృతిః
యాని తస్యానుషక్తాని పఞ్చ ఖానీన్ద్రియాణ్యలమ్. 21

తాని తస్య ముఖాన్యాహుస్తప్రదూపాణి సర్వతః
కర్మేన్ద్రియాణి విషయాస్తే హి తస్య భుజా దశ. 22

సర్వప్రాణులయొక్క స్వరూపుఁడును, సర్వవ్యాపియునగుటచే నాతఁడు మహాకారమును ధరించియున్నాఁడు. సమస్తజీవులయొక్క పంచజ్ఞానేంద్రియములే, యాతని పంచముఖములని వచింపఁబడినవి. కావుననే జ్ఞానేంద్రియములంతటను బ్రకాశస్వభావము గలవైయున్నవి. వాగాది కర్మేంద్రియములైదున్ను, వాని విషయములగు వచన, అదాన, భ్రమణాదులైదున్ను నాతని పది భుజములై యొప్పుచున్నవి.

సర్వభూతనరైః సార్ధం బ్రహ్మణా పరమేయుషా
యదాసౌ సంపరిత్యక్తస్తదా స్వాం మూర్తిమాగతః. 23

ప్రళయకాలమున సర్వజీవులతో సహా ప్రజాపతియగు బ్రహ్మదేవుఁడు పరమకారణమగు బ్రహ్మరూపత్వమొంది యీతనిని త్యజింప నపుడీతఁడు (రుద్రుఁడు) పైనఁదెల్పిన తన యాకాశమాత్ర పరిశేషమగు కారణరూపమును బొందెను.

స చైకాంశైకరూపాత్మా నాస్తి తస్య హి సాకృతిః
కథం దృశ్యత ఏవాసౌ భ్రాన్తిమాత్రేణ మూర్తిమాన్. 24

సమస్తకార్యములు ప్రళయమున లయింప, కారణాంశ మాత్రముచే శేషించియున్న యా రుద్రభగవానునకు వాస్తవముగ నే యాకారమున్ను లేదు. కేవలము తన యుపాసకులయొక్క వాసనలచే వారివారికి భ్రాంతి ద్వారా యాతఁడట్లు మూర్తివంతుఁడై భాసించును.

చిదాకాశగతే స్ఫారే భూతాకాశే స తిష్ఠతి
దేహే చ సర్వభూతానాం నిత్యం వాయురివేశ్వరః. 25

వ్యాపకమగు చిదాకాశరూపత్వము నెపుడాతఁడు పొందునో, అపుడాయీశ్వరుఁడు భూతాకాశమందును, సర్వజీవుల దేహములందును, వాయువువలె (అంతర్యామి రూపముచే) స్థితి నొందియుండును.

సర్వభూతపరిత్యక్తస్తస్మిన్కాలే ఖమూర్తిమాన్
క్షోభయన్ప్రక్షణం క్షీణః పరమాం శాన్తిమేష్యతి. 26

ప్రళయమున క్షణకాలము సమస్తమును క్షోభితమొనర్చి పిదప సర్వభూతరహితుఁడై, చిదాకాశమాత్ర దేహధారియై యాతఁడు పరమశాంతి నొందును.

యే గుణాకృతయః కాలాశ్చిత్తాహంకారబుద్ధయః
ప్రణవస్య చ యే వర్ణా యే చ వేదాస్తథా త్రయః. 27
రుద్రస్య తస్య తే నేత్రసంనివేశేన సంస్థితాః

సత్త్వరజస్తమోగుణముల యాకృతులు, భూతభవిష్యద్వర్తమానములను మూఁడు కాలములు, చిత్తాహంకారబుద్ధులు, అ. ఉ. మ్ — అను ప్రణవముయొక్క మూఁడు వర్ణములు, మూఁడు వేదములు, ఆ రుద్రునియొక్క మూఁడు నేత్రములై వెలయుచున్నవి.

త్రిశూలం తేన త్రైలోక్యం గృహీతం కరకోటరే. 28
యస్మాత్తద్వ్యతిరేకేణ సర్వభూతగణేష్వపి
అన్యన్న విద్యతే కించిద్దేహాత్మైవ తతః స్థితః. 29

తన పిడికిటియం దాతడు ముల్లోకములను త్రిశూలమును ధరించియున్నాఁడు. సర్వభూతసమూహములందును నాతనికంటె వేఱైనదియు నొకింతైనను లేదు. జగచ్ఛరీరముచే నాతఁడే వ్యాపించియున్నాఁడు.

సర్వసత్త్వఫలమ్భాత్మా స్వభావోఽన్య ప్రయోజనమ్
ఈరితః శివరూపేణ చిన్మాత్రాకాశరూపిణా. 30
తేనైవ చ నిగీర్ణః సన్పరమాం శాన్తిమేత్యసౌ

సర్వజీవులకును వారి వారి కర్మానుసారము విషయఫలమును, అధికారికి జ్ఞానఫలమును నొసంగునట్టి స్వభావమే సృష్టియొక్క ప్రయోజనమైయున్నది. శివమై, చిదాకాశమాత్రమైనట్టి తన స్వరూపముచేఁ బ్రేరితుఁడై యాతఁడక్కార్యమునఁ బ్రవృత్తుఁడగుచున్నాడు. మఱియు, ఆతని చిత్స్వరూపముచేతనే ప్రళయార్థమున్ను బ్రేరితుఁడై యాతఁడు సమస్తజగత్తును సంహారమొనర్చి మరల శాంతి నొందుచున్నాఁడు.

నిర్మలాకాశరూపాత్మా కృష్ణ ఇత్యేష ఈశ్వరః. 31
కృత్వా కల్పం జగత్సర్వం తత్పీత్వైకార్ణవం తదా
స ప్రయాతి పరాం శాన్తిమభూయ సంనివృత్తయే. 32

నిర్మల చిదాకాశరూపుఁడగు ఈ పరమేశ్వరుఁడే మహాకాల రుద్రరూపమును ధరించి యా ప్రళయ మహాసముద్రమును పాన మొనర్చి మఱల తిరిగి యే రూపమును ధరింపక పరమ శాంతిని బొందుచున్నాఁడు.

అనన్తరం మయా దృష్టస్త్రాసౌ యావదుద్యమాత్
ప్రవృత్తః ప్రాణవేగేన తమాక్రష్టుం మహార్ణవమ్. 33

ఓ రామచంద్రా! అవ్విధమున యా మహాకాల రుద్రరూపమును దర్శించినపిదప, ప్రయత్నశీలుఁడై శ్వాసయొక్క వేగముచే ఆ మహాసముద్రమునంతయుఁ బానమొనర్పుటకై ప్రవృత్తుఁడగుటను గాంచితిని.

అథ తస్య ముఖం స్ఫారం జ్వాలామాలాకులాన్తరమ్
ప్రాణాకృష్టో మహామ్భోధిర్వాడవాగ్నిమివావిశత్. 34

తదుపరి, ప్రాణవాయువుచే నాకర్షింపబడినదై యా మహాసముద్రము జ్వాలాసమూహములచే వ్యాప్తమగు విశాలమైన యా పరమేశ్వరుని ముఖమున, బడబాగ్నియందువలెఁ బ్రవేశించెను.

స ఏవ వాడవో భూత్వా వహ్నిరాకల్పమర్ణవే
అహంకారః పిబత్యమ్బు రుద్రః సర్వం తు తత్తదా. 35

అహంకార రూపుఁడగు ఆ రుద్రుఁడాసమయమున బడబాగ్నియై యా కల్పాంత సముద్ర జలము నంతయుఁ ద్రాగివైచెను.

పాతాలమివ పానీయం సర్పోబిలమివ క్షణాత్
పఞ్చవాయురివాకాశమవిశత్తన్ముఖం జవాత్. 36

జలము పాతాళమందును, సర్పము తన బిలమందును, పంచవాయువు లాకాశమందును బ్రవేశించునట్లు, అత్తఱి శీఘ్రముగ ఆ మహాసముద్రము రుద్రుని ముఖమునఁ బ్రవేశించెను

సముపేత్యాపిబద్రుద్రః స ముహూర్తేన తత్పయః
కృష్ణాఙ్గోఽర్క ఇవ ధ్వాన్తం తత్సంపర్క ఇవాగుణమ్. 37

సూర్యుఁడంధకారమును, సత్సాంగత్యము దోషసమూహమును ద్రాగివేయునట్లు, కాల రూపుఁడగు రుద్రభగవానుఁడపుడా సముద్రజలమునంతయు ముహూర్తమాత్రకాలములోఁ ద్రాగివైచెను.

ఆబ్రహ్మలోకపాతాలం శాన్తంశూన్యమథాభవత్
రజోధూమానిలామ్భోధిభూతముక్తం సమం నభః. 38

పిమ్మట ధూమ, ధూళి జల, వాయురహితమగు నిర్మలాకాశమువలె బ్రహ్మలోకము నుండి పాతాళమువఱకు బ్రశాంతముగను, శూన్యముగను నాయెను.

కేవలం తత్ర దృశ్యన్తే చత్వారో వ్యోమనిర్మలాః
ఇమే పదార్థా నిస్పన్దాః శృణు తాన్రఘునన్దన. 39

ఓ రఘునందనా! అపుడచట కేవల మాకాశమువలె నిర్మలములై, నిశ్చలములైనట్టి యీ నాల్గుపదార్థములుమాత్రము గన్పించుచుండెను. వానిఁగూర్చి నీవువినుము.

ఏకస్తావదసౌ మధ్యే రుద్రః కృష్ణామ్బరాకృతిః
నిరాధారః స్థితో వ్యోమ్ని నిస్పన్దామోదబిమ్బవత్. 40
ద్వితీయోఽవస్థితో దూరే పృథ్వ్యాకాశతలోపమః
భాగో బ్రహ్మాణ్డసదనస్యాధః పాతాలసప్తకాత్. 41
పాతాలభూతలదివాం సశైలేన్ద్రదివౌకసామ్
వ్యాప్తః పార్థివభాగేన పఙ్కమాత్రాత్మనాత్మభాక్. 42
తృతీయోఽత్ర పదార్థోఽభూదూర్ధ్వం బ్రహ్మాణ్డభాగభూః
దృష్టిక్షయాత్సుదూరత్వాద్దుర్లక్ష్యగగనాసితః 43
దూరవిశ్లిష్టయోర్మధ్యం యత్తద్బ్రహ్మాణ్డఖణ్డయోః
తదాకాశమనాద్యన్తం బ్రహ్మ నిర్మలమాతతమ్. 44
చతుర్థోఽసౌ పదార్థస్తు తదా సంలక్షితో మయా
చతుష్టయాదత్ర నాన్యదేతస్మాదేవ కించన. 45

ఒకటి, ఆకాశమువలె విశాలరూపుఁడై, కృష్ణవర్ణయుతుఁడై, ఆధార రహితుఁడై, నిశ్చల సుగంధస్వరూపమువలె మధ్యాకాశమున నున్నట్టి పైనఁదెల్పిన రుద్రుఁడు. రెండవది సప్తపాతాళములకంటె నతిదూరమై, పృథివీ, ఆకాశముల క్రిందిప్రదేశమును బోలినదై యున్నట్టి బ్రహ్మాండమను గృహముయొక్క యధోభాగము పర్వత, దేవతాది సహితముగఁ బాతాళ, భూలోక, స్వర్గములు భస్మీభూతములగుటచేతను, మరల రుద్రముఖముచే జలమంతయుఁ ద్రాగఁబడుటచేతను, పంకమయమై శేషించిన పృథివీభాగముచే ఆ బ్రహ్మాండముయొక్క యధోభాగము వ్యాప్తమై యుండెను. ఇఁక మూఁడవది. అతిదూరమున నుండుటచే నేత్రజ్యోతి కందనిదై, దుర్లక్ష్యమై శ్యామవర్ణ యుక్తమగు యాకాశమువలె నున్నట్టి బ్రహ్మాండఖండముయొక్క యూర్ధ్వభాగము అతి దూరముగ విభక్తమైన యీ బ్రహ్మాండఖండములయొక్క మధ్యమందున్నట్టి, అనాదియై అనంతమై, సర్వత్ర వ్యాప్తమైనట్టి బ్రహ్మాకాశము నాల్గవది. ఇట్టి నాల్గుపదార్థములను నేనచట నపుడుగాంచితిని. ఇవి తప్ప మఱి యేవస్తువున్ను నచట గోచరింపలేదు.

శ్రీరామ ఉవాచ:—

బహిః కిం విద్యతే బ్రహ్మన్బ్రహ్మసద్మకటాహతః
కాస్తత్రావరణా బ్రూహి కియత్యః సంస్థితాః కథమ్. 46

శ్రీరాముఁడు:— మహాత్మా! ఈ బ్రహ్మాండ కటాహమునకు బాహ్యమున నేమేమి పదార్థములు గలవు? మఱియు నేయే యావరణములు గలవు? నిరాధారములగు యవి యచట నెట్లు స్థితిగల్గియున్నవి?

శ్రీవసిష్ఠ ఉవాచ:—

బ్రహ్మాణ్డఖణ్డయోః పారే తతో దశగుణం జలమ్
సంధ్యాకాశమనన్తం తద్వర్జయిత్వా తతః స్థితమ్. 47
తతస్తథైవ జ్వాలాత్మ తేజో దశగుణం స్థితమ్
తతస్తథైవ పవనః పవనో నిర్మలః స్థితః. 48
తతస్తథైవ విమలం నభో దశగుణం స్మృతమ్
తతం పరమమత్యచ్ఛం బ్రహ్మాకాశమనన్తకమ్. 49
అన్యత్రాన్యత్ర తస్యాథ దృష్టయోఽన్యాస్తథైవ ఖే
కచన్త్యనన్తా దూరస్థామిథో దృష్టాత్మసృష్టయః. 50

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఈ బ్రహ్మాండ ఖండముల కావల యీ బ్రహ్మాండమునకంటెఁ బదిరెట్లు విశాలమైనట్టి జలముగలదు. బ్రహ్మాండ ఖండములయొక్క సంధియందు గల యాకాశమనంతమై యుండుటఁబట్టి, అయ్యది యాఖండములకు లోననేగాక బయటనుగూడ వ్యాపించి యున్నది. పిదప, ఆ జలముకంటెఁ బదిరెట్లు అధికముగ విశాలమైనట్టి జ్వాలామయమగు అగ్ని గలదు, ఆ తరువాత ఆ యగ్నికంటెఁ బదిరెట్లధికమగు నిర్మలవాయువుగలదు. దాని కావల, ఆ వాయువుకంటెఁ బదిరెట్లు విశాలమైనట్టి శుద్ధమగు ఆకాశముగలదు. అటుపిమ్మట పరమ పవిత్రమై, అతి నిర్మలమైనట్టి యనంతమగు బ్రహ్మాకాశముగలదు. మహేశ్వర, కపిలాది వేత్తలు యోగులయొక్క మతము ననుసరించి మాయాశబలిత బ్రహ్మాకాశమున, అహంకారము, మహత్తు, ప్రకృతి మున్నగునవియును నొకదానికంటె నొకటి పదిరెట్లధికముగనున్నవై వర్తించుచున్నట్లు గలదు. ఇవ్విధముగ ఆనంతములైన కల్పనాదృష్టులుగలవు. కాని యవియన్నియుఁ బరస్పరము వివాదగ్రస్తములై యున్నందున నిట నుపేక్షింపఁబడినది.

శ్రీరామ ఉవాచ:—

ఊర్ధ్వే బ్రహ్మాణ్డఖణ్డస్య తథాధస్తాన్మునీశ్వర
తజ్జలాది మహాకారం క్వ కథం కేన ధార్యతే. 51

శ్రీరాముఁడు:— ఓ మునీశ్వరా! బ్రహ్మాండఖండముయొక్క యూర్ధ్వాధోభాగములందు విశాలాకారము గల్గియున్నట్టి యా జలాదు లెట్లు దేనిచే ధరింపఁబడుచున్నవి?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

స పార్థివపదార్థానాం స్థితః పుష్కరపత్రవత్
భాగస్తమేవాధావన్తి తే సుతా మాతరం యథా. 52

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! శిశువులు తల్లినిగూర్చి పరువిడునట్లు, కమలదళమువలె నున్నట్టి పార్థివ పదార్థ భాగమగు బ్రహ్మాండకపాలముయొక్క యాకర్షణచే ఆ జలాదులన్నియు నద్దాని ననుసరించి పరువిడుచున్నవి. (ఆధారరూపముచే నాశ్రయించుచున్నవి.)

అతో యదేవ నేదీయో బ్రహ్మాణ్డాఖ్యం మహావపుః
తత్పదార్థాః ప్రధావన్తి తృషితాః సలిలం యథా. 53

దప్పికఁ గొనినవాఁడు నీటివైపునకుఁ బరుగిడునట్లు సమీపమున నున్నట్టి మహాశరీరము గల బ్రహ్మాండఖండమువైపునకవి యన్నియుఁ బరుగిడుచున్నవి.

అవలమ్బ్య తదేవాన్తః సంస్థితాస్తైజసాదయః
న స్థితిం ప్రవిముఞ్చన్తి స్వాం యథావయవా ఇవ. 54

లోన నా యాకర్షణ శక్తినే యవలంబించి యా తేజసాది పదార్థములు స్థితి గల్గియున్నవి. మఱియు శరీరసంయుక్తములగు హస్తపాదాద్యవయవములవలె నవి తమ స్థితిని త్యజించుటలేదు.

శ్రీరామ ఉవాచ:—

బ్రహ్మన్బ్రహ్మాణ్డఖణ్డే తే తిష్ఠతః కథముచ్యతామ్
కిమాకృతీ ధృతే కేన కథం వా పరినశ్యతః. 55

శ్రీరాముఁడు:— మహాత్మా! అట్లా యితరములగు జలాద్యావరణముల కాధారమైనట్టి యా బ్రహ్మాండఖండము లెట్లు స్థితి గల్గియున్నవి? వాని యాకారము లేమి? ఏది యెట్లు వానిని ధరించుచున్నది? మఱియు నయ్యవి యెట్లు నశించుచున్నవి?

శ్రీవసిష్ఠ ఉవాచ:—

అధృతం ధృతమేవోచ్చైరపతచ్చైవ వా పతత్
అనాకృత్యేవ సాకారం జగత్స్వప్నపురం యథా. 56

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! స్వప్నపురమువలె ఈ జగత్తు వాస్తవముగ ధరింపఁబడకున్నను బాగుగ ధరింపఁబడుచునే యున్నది. పడకున్నను బడుచునేయున్నది. మఱియు నిరాకారమైనను, సాకారముగనే యున్నది.

కిమస్య నామ పతతి కిం వా కేనాస్య ధార్యతే
యథా సంవిత్తి కచనం తథైతదవతిష్ఠతే. 57

ఈ మాయామయ ప్రపంచమునందుఁ బడునదేమి? ఎవరెట్లు దీనిని ధరించుదురు? చైతన్యశక్తియొక్క స్ఫురణము ననుసరించియే యియ్యది ప్రకాశించుచున్నది.

యథా కేశోణ్డ్రకం వ్యోమ్ని యథా చ వ్యోమ్ని శూన్యతా
యథా వా పవనే స్పన్దో జగచ్చిద్గగనే తథా. 58

ఆకాశమందు కేశములున్ను, శూన్యత్వమున్ను నెట్లు గలవో, వాయువందుఁ జలనమెట్లు గలదో, అట్లే చిదాకాశమం దీజగత్తున్ను గలదు.

చితౌ సంకల్పనగరం బ్రహ్మాణ్డాఖ్యం జగద్గృహమ్
ఖే ఖమేవాప్యనాకారం ప్రత్యాకారమివ స్థితమ్. 59

సంకల్పనగరమువలె ఈ బ్రహ్మాండమను గృహము చైతన్యమున వెలయుచున్నది. నిరాకారమగు చిదాకాశమే చిదాకాశమున నిట్లు నియతమగు యాకారమును ధరించిన దానివలె వర్తించుచున్నది.

పాతసంవిత్సముద్భూతం పతదాస్తే దివానిశమ్
గచ్ఛన్త్యా సంవిదోద్భూతం గచ్ఛదాస్తే దివానిశమ్. 60
స్థితసంవిత్సముద్భూతం తిష్ఠదాస్తే దివానిశమ్
ఉత్పతన్త్యా చితోద్భూత ముత్పతచ్చైవ తిష్ఠతి. 61
ఏతి నాశవిదా నాశం మహాకల్పాదివేదనైః
జాయతే జన్మసంవిత్త్యా వ్యోమ్ని సర్వాదివేదనైః 62

పతనమును గూర్చిన అధ్యాసముచేఁ బూర్ణమగు సంవిత్తు (చైతన్యముతోఁ గూడినదై యీ జగత్తు రాత్రిందినములు పడుటయందుఁ దత్పరమగుచున్నది. అట్లే గమనమునుగూర్చిన అధ్యాసముచేఁబూర్ణమగు సంవిత్తుచే నిరంతరము గమనశీలమై వర్తించుచున్నది. ధారణామయమగు సంవిత్తుతో గూడినదై సదా స్థితిగల్గియున్నది. ఊర్ధ్వగమనమయమగు చైతన్యముతోఁగూడి సదా యూర్ధ్వమునకు, జనుచున్నది. నాశసంవిత్తుతోఁ గూడినదై కల్పాంతమున నశించుచున్నది. చిన్మయమగు సంవిత్తుఁతోగూడి సృష్ట్యాదియందు చిదాకాశమున జనించుచున్నది.

అభాతి మౌక్తికగణః శరదమ్బరాన్త
ర్దృష్టావసత్య ఉదితోఽప్యతిసత్యరూపః
భ్రాన్త్యా యథా నభసి చ స్ఫురతాం తథైషాం
సంఖ్యాం విధాతుమిహ కో జగతాం సమర్థః. 63

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే భ్రాన్తిమాత్రత్వప్రతిపాదనం నామాశీతితమః సర్గః ॥ 80 ॥

ఓ రామచంద్రా! శరత్కాలాకాశమువైపు వీక్షించు మనుజుని దృష్టికి అసంఖ్యాతములగు ముత్యముల సమూహము గోచరించునట్లును, అవి అసత్యములైనను సత్యములుగఁదోచునట్లును, భ్రాంతిచే చిదాకాశమున స్ఫురించునట్టి యీ జగత్తులయొక్క ఆధారాదులఁగూర్చిన గణన మొనర్ప నెవరికిఁదరము?

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున
నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున భ్రాంతిమాత్రత్వ ప్రతిపాదనమను
నెనుబదవ సర్గము ॥ 80 ॥

ఏకాశీతితమః సర్గః

[రుద్రః స నృత్యన్ప్రళయే భైరవోఽత్రోపవర్ణ్యతే
తచ్ఛాయాకాలరాత్రిశ్చ నృత్యన్తీ జగదఙ్గికా.

ప్రళయమున నృత్యమొనర్చుచున్న భైరవరుద్రునిగూర్చియు, అతనిఛాయయు జగద్రూపిణియు నృత్యమొనర్చు చున్నదియునగు కాలరాత్రినిగూర్చియు నిట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీవసిష్ఠ ఉవాచ :—

అథ రాఘవ రుద్రం తం తదా తస్మిన్మహామ్బరే
ప్రవృత్తం నర్తితుం మత్తమపశ్యం వితతాకృతిమ్. 1

శ్రీ వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! తదుపరి యామహాకాశమున మదించినవాఁడును, విశాలరూపధారియునగు రుద్రభగవానుఁడు నృత్యమొనర్చుటకై ప్రవృత్తుఁడగుటను నేను గాంచితిని.

వ్యోమేవాకృతిమాపన్నమజహద్వ్యాపితాం నిజామ్
మహాకారం ఘనశ్యామం దశాశాపరిపూరకమ్. 2

అర్కేన్దువహ్నినయనం చలద్దశదిగమ్బరమ్
ఘనదీర్ఘప్రభాజాలమాలానం శ్యామలార్చిషామ్. 3

వడవాగ్నిదృశం లోలభుజోర్మిభరభాసురమ్
ఏకార్ణవార్ణో ద్రాగ్దేహబన్ధేనేవ సముత్థితమ్. 4

అత్తఁడి యావఁడాకాశమే యాకృతిని ధరించి వచ్చినట్లున్నవాఁడును తన వ్యాపకత్వమును త్యజింపనివాఁడును, ఘన శ్యామవర్ణముగలవాఁడును, మహాకారముగల్గి దశదిక్కులను బూరించువాఁడును, సూర్య చంద్రాగ్నులను మూఁడునేత్రములు గలవాఁడును, చలించు దిశదిక్కులను వస్త్రమును ధరించినవాఁడును, ఘనమై, దీర్ఘమైనట్టి ప్రభాసమూహముతోఁ గూడియున్నవాఁడును, నీలవర్ణపు ప్రభాజ్వాలలకు కట్టుకంబమువలె నున్నవాఁడును, బడబాగ్నివంటి నేత్రములుగలవాఁడును, చంచలభుజములను దరంగ సమూహముచే బ్రకాశమానమగు శరీరమును ధరించువాఁడును, ఏకమగు మహాసముద్రము యొక్క జలమే శరీరమునుగ్రహించి శీఘ్రముగ నుద్భూతమైనట్లు చూపట్టువాఁడునై యొప్పుచుండెను.

పశ్యామ్యనన్తరమహం యావత్తస్య శరీరతః
ఛాయేవ పరినిర్యాతి నర్తనానువిధాయినీ. 5

సూర్యేష్వవిద్యమానేషు మహాతమసి చామ్బరే
స్థితా కథమియం ఛాయా భవేదితి మతిర్మమ. 6

యావద్విచారయామ్యాశు తావత్తస్య తదా పురః
సా స్థితా పరినృత్యన్తీ విస్తీర్ణా త్రిలోచనా. 7

ఆ పిదప, ఆ రుద్రుని నృత్యము ననుకరించుచు ఛాయయాతని శరీరమునుండి బయల్వెడలుటను నేనుగాంచితిని. సూర్యుఁడు లేకయుండ, గొప్ప యంధకారమయమగు ఆకాశమున ఆ ఛాయయెటు స్థితినొందియున్నను శంక నా బుద్ధియందుఁ బొడమెను. ఇట్లు దానినిగూర్చి విచారించుచుండ నింతలో శీఘ్రముగ, విశాలరూపమును ధరించినదియు, శోభాయమానములగు మూఁడు నేత్రములు గల్గియున్నదియునై యాఛాయ నృత్యమొనర్చుచు రుద్రభగవానుని సమ్ముఖమున నిలఁబడెను.

కృష్ణా కృశా శిరాలాఙ్గీ జర్జరా వితతాకృతిః
జ్వాలాకులానలాలోలవనసంభార శేఖరా. 8

భిన్నాఞ్జనతమఃశ్యామా యామినీవాకృతిం గతా
తమఃశ్రీర్దేహయుక్తేవ సాకారేవామ్బరద్యుతిః. 9

అతిదీర్ఘా కరాలాస్యా నభో మాతుమివోద్యతా
దీర్ఘజానుభుజభ్రాన్త్యా మాతుకామేవ దిఙ్ముఖమ్ 10

కృశా బహూపవాసేవ పరినిమ్నమహాతనుః
కజ్జలశ్యామలా మేఘమాలేవ పవనాకులా. 11

కృశాశక్తా యదా స్థాతుం సుదీర్ఘా విధినా తదా
గ్రథితేవ శిరారూపైర్దామభిర్దైర్ఘ్యశాలిభిః. 13

ఆ ఛాయారూపిణి కృష్ణవర్ణముగలదియు, కృశించినదియు, నాడీరూపములగు అవయవముల ధరించినదియు, శిథిలాంగయుక్తయు, విశాలాకారముగలదియు, అగ్నిజ్వాలలచే వ్యాపింపబడియున్నదియు, చంచలవనముయొక్క పుష్పఫలవాదులతోఁగూడిన శిరోభూషణము గలదియు ఘనీభూతమగు కజ్జలము (కాటుక) వలె శ్యామవర్ణముగలదియు, ఆకారమును ధరించి వచ్చిన కృష్ణపక్ష రాత్రివలెనున్నదియు, అంధకారమే దేహమును గైకొని యేంతెంచునట్లు చూపట్టునదియు, ఆకాశకాంతి యాకృతిని ధరించి వచ్చినట్లు తోఁచునదియు, అతిదీర్ఘమైభయంకరమైనట్టి ముఖముగలదియు, తన దీర్ఘరూపముచే నాకసమును కొలుచుటకు యత్నించుచున్నట్లున్నదియు, విశాలములగు తన జానువులచేతను, భుజములచేతను దిఙ్ముఖమును గొలువ నెంచుచున్నట్లున్నదియు, అధికోపవాసముచేవలె, గ్రశించినదియు, అంతటఁ గర్తములతోఁగూడిన మహాశరీరముగలదియు, వాయువుచే వ్యాకులమగు మేఘసమూహమునుబోలినదియు, అతి దీర్ఘరూపిణియై, కృశించినదై యుండుటచే నిలుచుటకుఁగూడ శక్తిలేకయున్నందున బ్రహ్మదేవుఁడామెయొక్క స్థిరత్వముకొఱకై దీర్ఘములైన నాడులను త్రాళ్ళచే బంధించినట్లు తోపింపఁజేయునదియునై వెలయుచుండెను.

తథా నామ సుదీర్ఘా సా యథా తస్యాః శిరఃఖురమ్
మయా దృష్టం ప్రయత్నేన చిరోర్ధ్వాధోగమాగమైః. 13

ఓ రామచంద్రా! ఆమె అతిదీర్ఘరూపిణియై యుండుటచే నామెయొక్క శిరస్సునున్ను, పాదనఖములను గాంచుటకుఁ బ్రయత్నముచేఁ జిరకాలము నేనూర్ధ్వాధో గమనాగమనములన్ను సల్పవలసివచ్చినది.

అన్త్రాన్త్రతన్త్రీగ్రథితశిరః కరఖురోత్కరా
ఆమూలాత్సూత్రవలితా కణ్టకానామివ స్థలీ. 14

విశ్వరూపమయార్కాదిశిరః కమలజాలకైః
కృతమాలామలాలోకవాతవహ్నిమయాఞ్చలా. 15

ప్రలమ్బకర్ణా లులితనాగా నృశవకుణ్డలా
శుష్కతుమ్బిలతాష్ఠీలా దీర్ఘా లోలాసితస్తనీ. 16

కుమారబర్హిపిచ్ఛైర్బ్రాహ్మమూర్ధజమణ్డలైః
లాఞ్ఛితోచ్చసురాధీశశిరఃఖట్వాఙ్గమణ్డలా. 17

దన్తేన్దుమాలావిమలా విమలోద్యోతపాతతః
తమోర్ణవోర్ధ్వలేఖేవ న్వృత్తావర్తవివర్తినీ. 18

శుష్కతుమ్బిలతేవోచ్చైరాకాశతరుసంస్థితా
విలోలావయవాష్ఠిలా వాతైః పటపటారవా. 19

బృహత్తరఙ్గోర్ధ్వభుజా శ్యామలోల్లాసశాలినీ
ఏకార్ణవోర్మిమాలేవ నృత్తావృత్తివివర్తినీ. 20

క్షణమేకభుజాకారా క్షణం బహుభుజాకులా
అనన్తోగ్రభుజాక్షిప్తజగన్నర్తనమణ్డపా 21

క్షిప్రమేకముఖాకారా క్షిప్రం బహుముఖాకృతిః
అనన్తోగ్రముఖీ క్షిప్రం నిర్ముఖీ చాపి చ క్షణమ్. 22

ఏకపాదాన్వితా క్షిప్రం క్షిప్రం పాదశతాన్వితా
క్షణం చానన్తపాదాఢ్యా నిష్పాదాకారిణీ క్షణమ్. 23

అమూలాగ్రము లతలచేఁ జుట్టఁబడిన కంటకవృక్షప్రదేశమువలె, శిరస్సుమొదలుకొని పాదములవఱకు నాయొక్క అవయవములన్నియు నాడీసమూహములచేతను ప్రేగులు మున్నగు వానిచేతను గూర్పఁబడియుండెను. మఱియు, ఆ ఛాయారూపిణియగు భగవతి, వివిధవర్ణములతోఁ గూడిన సూర్యాది దేవ, దానవుల శిరంబులను కమలముల మాలను, వాయువుచేఁ బ్రదీప్తమగు అగ్నిచేఁ బూర్ణమైనట్టి చంచలవస్త్రమును ధరించియున్నదియు, దీర్ఘములగు చెవులయందు, జంచలములగు సర్పములచే శోభించుచున్నదియు, మృత మనుజులనుకుండలముల ధరించునదియు, జానువులవఱకు వ్రేలాడుచున్న శుష్కించిన (ఫలయుక్తమగు) సొరతీగెవలె దీర్ఘములై, చంచలములై, కృష్ణవర్ణయుతములైనట్టి స్తనములుగలదియు. చిన్న నెమళ్ల పింఛములతోఁడను, బ్రహ్మదేవుని కేశసమూహములతోడను చిహ్నితమైనదియు, ఇంద్రాది దేవతల శిరంబులుగలిగిన ఖట్వాంగమండలముచే నొప్పునదియు, దంతరూపమగు చంద్రమాలచే నిర్మలమైనదియు, స్వచ్ఛమైన యా దంతముల కిరణపాతముచే వృద్ధిఁబొందినదియు, అంధకారమను సముద్రముయొక్క అవర్తములచేఁ జంచలమగు ఉపరిభాగమువలె నున్నదియు, చంచలములైన అవయవగ్రంథులు గలదియు, వాయువుచే గావింపఁబడుచున్న 'పటాపట' శబ్దముచే శోభిల్లుచున్నదియు, ఆకాశమను గొప్ప వృక్షమునుండిజనించిన శుష్కించిన సొరతీగెవలె భాసించుచున్నదియు, మహాతరంగముల వంటి యూర్ధ్వభుజములయొక్క శ్యామవర్ణత్వముచే శోభించుచున్నదియు, నృత్యమొనర్చు ఆ వర్తములతోఁగూడిన ప్రళయకాలపు మహాసముద్రముయొక్క తరంగసమూహమువలెఁ జెన్నొందుచున్నదియు, ఒకపుడొకేభుజమును ధరించియుండునదియు, మరల క్షణకాలములో ననేక

భుజములచే నొప్పునదియు, వేఱొకపుడు భయంకరములైన యనంతభుజములచే జగత్తను నృత్యమండపమును వ్యాకుల మొనర్చు నదియు, ఒకపు డొకేముఖమును ధరించియుండునదియు, వెంటనే యనేక ముఖములను ధరించునదియు, మరల శీఘ్రముగ అనంతములైన భయంకర ముఖముల గల్గియుండునదియు, యింకొక క్షణములో సర్వథా ముఖరహితయై వెలయునదియు, అట్లే యొకక్షణమం దేకపాదమును ధరించునదియు, మఱుక్షణమే యనేకపాదములచే నొప్పునదియు, మరల వెంటనే అనంతపాదములు కల్గియుండునదియు పిమ్మట క్షణములో సర్వథా పాదరహి[illegible] వర్తించునదియునై భాసిల్లుచుండెను.

కాలరాత్రిరియం సేతి మయానుమితదేహికా
కాలీ భగవతీ సేయమితి నిర్ణీతసజ్జనా. 24

ఆమెయొక్క దేహమును బట్టి నే నామెను 'కాలరాత్రి' యని యూహించితిని. ఇతర సజ్జనులున్ను నామెను 'కాళీభగవతియని' నిశ్చయించిరి.

జ్వాలాపూర్ణారఘట్టోగ్రఖాతాభనయనత్రయా
జ్వలద్ధరేన్ద్రనీలాద్రి నానూపమలలాటభూః. 25

లోకాలోకేన్ద్రనీలోగ్రశ్వభ్రభీమహనుద్వయా
వాతస్కన్ధగణప్రోతతారాముక్తాకలాపినీ. 26

ఇన్ద్రనీలాద్రితుల్యోచ్చతోరణోచ్చైః ప్రభామ్బరే
విశ్రాన్తకాచశైలాభభగ భీషణవాయసీ. 27

నృత్యద్భుజలతాపుష్పైర్నఖశుభ్రాభ్రమణ్డలైః
పూర్ణచన్ద్రశతానీవ భ్రామయన్తీ నభస్తలే. 28

భ్రమద్భిర్వ్యాప్తదిక్చక్రా భుజైః కల్పామ్బుదైరివ
వర్షద్భిః ప్రాణిజప్రాన్తతారాతేభాబృహత్ప్రభాః. 29

నఖపుష్పాఙ్గులీవల్లీజాలైర్భ్రాన్తభుజద్రుమైః
కృష్ణైః కాననితాశేష గగనాగ్రోగ్రమూర్తిభిః. 30

తమాలతాలతః స్థూలాం భువం దగ్ధమహావనైః
విడమ్బయన్తీ వలితాం జఙ్ఘాసఙ్ఘేన లోలతా. 31

అప్యనన్తే మహావ్యోమ్ని పారం ప్రాప్తైః శిరోరుహైః
కుర్వాణేవాతతం వాసం చరత్తిమిరదన్తినః. 32

ఉహ్యన్తే మేరవో యేన తేన నిశ్వాసవాయునా
ఘనఘుంఘుమదిక్చక్రగగనగ్రామఘోషిణా. 33

ఘనామారుతఫూత్కారక్ష్వేడగేయం ప్రగాయతా
నియతానునయేనేవ చలితా సానువృత్తినా. 34

ఆ కాళిభగవతి, జ్వాలాపూర్ణమగు అరఘట్టము (జలయంత్రము) యొక్క కాష మందలి గర్తములఁబోలిన త్రినేత్రములు గలదియు, జాజ్వల్యమానమగు భూప్రదేశముగల యింద్రనీలపర్వత శిఖరమువంటి లలాటముచే నొప్పునదియు, లోకాలోక పర్వతముయొక్క ప్రసిద్ధమైన యింద్రనీల గర్తమువలె భయంకరములైనట్టి చెక్కిళ్ళ మీఁదిభాగములు గలదియు, వాయుసమూహమున, గూర్పఁబడిన నక్షత్రములను ముత్యాలహారముచే శోభించునదియు, ఇంద్రనీలపర్వతమును బోలిన యెత్తైన నగర బహిర్ద్వారమున పద్మరాగాదులకాంతిచే రంజితమైనట్టి యాకాశమున తద్ద్వారాంతమునగల ఛిద్రమందు ప్రతిష్ఠింపబడు అధోముఖముగల్గిన కృత్రిమకాచ (గాజు) పర్వతమునుబోలినట్టి భగమను భయంకరమైన కాకి గలదియు, నృత్యమందుఁ జలించునట్టి భుజలతలను బుష్పములచేతను, నఖముల నిర్మల ప్రకాశమను మేఘమండలములచేతను ఆకాశమున అనేకపూర్ణచంద్రులఁగూర్చిన భ్రమను గలుగఁజేయునదియు, కల్పాంత మేఘముల వలెను, గజముత్యములవలెను, నక్షత్రసమూహమువలెను నఖముల మహాకాంతిని వర్షించుచుపరిభ్రమించునట్టి భుజములచే దిఙ్మండలమును వ్యాప్తమొనర్చునదియు, గోళ్ళను బుష్పముల తోడను, వ్రేళ్ళను లతలతోడను, కృష్ణవర్ణముగలవై, భయంకరాకారయుతములై, భ్రమణశీలములైనట్టి భుజములను వృక్షములతోడను గూడినదై యాకాశమునంతటిని అరణ్యమువలెఁ దోపింపఁజేయునదియు, అంతట జలించునట్టి జంఘు (పిక్క)లచే, దగ్ధములైమిగిలినట్టి తమాల, తాలాదివృక్షయుక్తములగు మహావనములచే నున్నతమైనట్టి భూమి ననుకరించుచున్నదియు, అనంతమైన మహాకాశముయొక్కయు తీరమును బొందినట్టి విశాలములైన కేశములచే, సంచరించు అంధకారమను గజముయొక్క నివాసమును ఆకసమున సిద్ధింపఁజేయునదియు, ప్రబలవాయువుయొక్క ఫూత్కారశబ్దమును గానమొనర్చునట్టి ప్రతిధ్వనులచే ఘనీభూతమగు ఘుంఘుమ శబ్దపూర్ణమైనట్టి దిఙ్మండలముగల యాకాశమను గ్రామమందు ఘోషణ సల్పుచున్నట్లున్నదై, మేర్వాది పర్వతములనుగూడ నెగురఁగొట్టునదైనట్టి తన నిశ్వాసముతోగూడి, నియమపూర్వకమగు అనునయముచే ననుగమించు నటునితోగూడ బోవుచున్నట్లున్నదియునై వెలయుచుండెను.

తతో నృత్తవశావేశాద్వర్ధమానశరీరిణీ
మయా దృష్టావధానేన గగనాభోగభూరిణా. 35

పిమ్మట నృత్యవశమున వృద్ధినొందినట్టి శరీరముగల యా భగవతిని ఆకాశమందున్న నేను సావధానముగ వీక్షించితిని.

యావత్తయావృతా దేహే హేలావలనసారయా
మాలా మలయకైలాససహ్యమన్దరమేరుభిః. 36
ఆసీత్తస్యా యుగాన్తాభ్రమాలికాపట్టపట్టికా
ఆదర్శమణ్డలాన్యఙ్గే త్రీణి లోకాన్తరాణి చ. 37
కర్ణయోర్హిమవన్మేరూ రూప్యకాఞ్చనముద్రికే
బ్రహ్మాణ్డఘుంఘుమైర్మాలా మహతీ కటిమేఖలా. 38
స్రజః కులాచలాః శృఙ్గవనపత్తనగుచ్ఛకాః
జరత్పురవనద్వీపగ్రామపేలవపల్లవాః. 39

విలాసముగా నృత్యమొనర్చుటయే ప్రయోజనముగాఁగలదైన యాదేవియపుడు మేరు మందర, కైలాస, సహ్య, మలయాది పర్వతముల మాలను ధరించియుండెను. ప్రళయకాలపు పుష్కరావర్తాది మేఘముల మాల యామెయొక్క వక్షస్థలపట్టికయై విరాజిల్లుచుండెను. ముల్లోకములున్ను జంఘ, ఉదర, కంఠములందలి మణిమయములగు యాభరణములై విలసిల్లుచుండెను. హిమాలయ, సుమేరుపర్వతములు చెవులయొక్క వెండిబంగారుకమ్మలై యొప్పుచుండెను. ఘుంఘుమశబ్ద పూర్ణములగు బ్రహ్మాండముల పంక్తి యామెయొక్క మొలనూలై చెన్నొందుచుండె. శిఖర, వన, నగ... లను బూగుత్తులతోను, శిథిలగ్రామ, వన, ద్వీప, నగరాదులను అల్పపల్లవములతోను గూడిన ... పర్వతములామెయొక్క కంఠమాలలయి యుండెను.

తస్యా అఙ్గేషు దృష్టాని పురాణి నగరాణి చ
ఋతవశ్చ త్రయో లోకా మాసాహోరాత్రమాలికాః. 40
ముక్తాలతాదికం నద్యః కాలిన్దీత్రిపథాదికాః
ధర్మాధర్మావుభౌ కర్ణభూషణే చాన్యకర్ణయోః. 41
స్తనాస్తస్యాస్తు చత్వారః స్రవద్ధర్మపయోలవాః
వేదాః సకలశాస్త్రార్థచతుః సంస్థానచూచుకాః. 42
త్రిశూలైః పట్టిశైః ప్రాసైః శరశక్త్యృష్టిముద్గరైః
నిర్యదాయుధజాలాని స్రగ్దామాని బిభర్తిసా. 43
చతుర్దశవిధా భూతజాతయో యాః సురాదికాః
తస్యాః శరీరశాలిన్యాస్తా లోమావలయః స్థితాః. 44

ఓ రామచంద్రా! ఆ భగవతియొక్క యంగములందు నేను నగర, గ్రామ, ఋతు, మాస, దిన, రాత్రుల సమూహములను, ముల్లోకములనుగూడ గాంచితిని. కాళిందీ, గంగాదినదులాపె కంఠమందలి ముత్యాలహారములైయుండెను, ధర్మాధర్మము లామెయొక్క యితరకర్ణములందలి భూషణములై, యొప్పుచుండెను. సకల శాస్త్రార్థమను క్షీరముచేఁ బరిపూర్ణములగు నాల్గు వేదములున్ను ఆమెయొక్క నాల్గు స్తనములై వెలయుచుండెను. మఱియు నామె త్రిశూల, పట్టిశ, కుంత, బాణ, శక్తి, ఖడ్గ, ముద్గరాదులతోఁగూడిన తీక్ష్ణములైన యాయుధములను బుష్పమాలలను ధరించియుండెను. పదునాల్గు విధములగు దేవతాది ప్రాణిజాతులు, శరీరముతోటి శోభించు అ భగవతియొక్క రోమసమూహమై యుండెను.

తస్యాశ్చ నగరగ్రామగిరయో దేహశాయినః
నృత్యన్త్యా సహ నృత్యన్తి పునర్జన్మ॒ముదేవ తే. 45
జంగమాత్మైకమేవైతజ్జగదస్థావరం తదా
నృత్యతీతి మయా జ్ఞాతం పరలోకే సుఖం స్థితమ్. 46
నిగీర్ణం జగదజస్రం కృత్వా తృప్తిముపాగతా
పరినృత్యతి సా మత్తా జగజ్జీర్ణా హి చాతకీ. 47

ఆదర్శప్రతిబిమ్బస్థమివాభాత్యఖిలం జగత్
తస్యా వపుషి విస్తీర్ణే స్వరూపిణి స్వరూపదృక్. 48

ఆమెయొక్క దేహమందున్న నగర, గ్రామ పర్వతాదులు పునర్జన్మనుగూర్చిన యానందముచేవలె నామెతోసహ నృత్యమొనర్చుచుండెను. నశించిన స్థావరజంగమాత్మకమగు జగత్తంతయు నామెయొక్క దేహమను బరలోకమున నృత్యమొనర్చుచు సుఖముగ నున్నట్లు నేను గాంచితిని. నిజావయవమందున్న జగత్తను శుష్కసర్పమును మ్రింగి తృప్తిఁ బొందినదై యా భగవతి మదించిన యాఁడునెమలివలె నృత్యము సల్పుచుండెను. అద్దమందు ప్రతిబింబమువలె నామెయొక్క విశాల దేహమున జగత్తంతయు పూర్వసదృశముగ భాసించుచుండెను.

సా న నృత్యతి తత్పూర్వం సశైలవనకాననమ్
జగన్నృత్యతి నానాత్మా మృత్వా పునరుపాగతమ్. 49
తజ్జగన్నర్తనం చారు తద్దేహాదర్శసంస్థితమ్
చిరం మయా తదా దృష్టమవినష్టం పునః స్థితమ్ 50

ఒకపుడాదేవి నృత్యము సల్పకయున్నను, ఆమెయందు, వివిధ వన, పర్వతాది సహితమగు జగత్తు, నశించినదైనను మరల పునర్జన్మను బొంది నృత్యము సల్పుచునే యున్నట్లున్ను గాంచితిని, నశించినదైనప్పటికి మరల యీమె శరీరమను అద్దమున స్థితిబొందినదై యట్లు నృత్యమొనర్చుచున్నట్టి జగత్తును నేను చిరకాలము వీక్షించితిని.

విచలత్తారకాజాలం భ్రమత్పర్వతమణ్డలమ్
మశకవ్యూహవద్వాతవ్యా భూతామరదానవమ్. 51
సంగ్రామోన్ముక్తచక్రాభద్వీపార్ణవవృతామ్బరమ్
హేలావివలనావర్త ప్రోఢశైల ధరాతృణమ్. 52
నీలమేఘాంశుకావృత్తి వాతఘుంఘుమితామ్బరమ్
కాష్ఠా స్థ్యాదిస్ఫుటాస్ఫోటపతత్పటపటారవమ్. 53
జగత్పదార్థైర్వ్యామిశ్రైరమిశ్రైర్ముకురైర్యథా
వ్యాప్తమాభోగి భాంకారైరజైరగ్రభయస్తథా. 54

ఆ జగన్నృత్యము చంచలనక్షత్రసమూహయుక్తమైనదియు, పరిభ్రమించు పర్వతమండలముతోఁగూడినదియు. మశకసమూహమువలె వాయువుచే నెగురగొట్టఁబడిన దేవ, దానవులు గలదియు, యుద్ధమున విసరివేయఁబడిన చక్రములవలె ద్వీప, సముద్రములచే నాకాశమును గప్పునదియు, విలాసపూర్వకముగ సుడివాయువుచే వహింపఁబడిన పృథివీ, పర్వతరూప తృణములు గలదియు, నీలమేఘములను వస్త్రములయొక్క పరివర్తనములందు వాయువులచే ఘుంఘుమ శబ్దయుతముగ గావింపబడిన యాకాశము గల్గియున్నదియు, అధోభాగమున కాష్ఠ శిలాదుల సంఘట్టనములచే విస్పష్టమైన పటపటాశబ్దయుక్తమై యొప్పుచున్నదియు, పరస్పర సంఘటన, విభాగములచే ప్రతిక్షణము మిళితములై మెలగుచున్నట్టి జగత్పదార్థములతోఁగూడిన

అంగములచేతను, వాని భ్రమణములచేతను మూర్తివంతములగు భయములచే వ్యాప్తమైయున్నదియునై భాసించుచుండెను.

మేరుర్నృత్యతి లోలోచ్చకులాచల బృహద్భుజః
భ్రమదభ్రపటో పేతనమత్తను తనూరుహః. 55
అత్యజన్తః సముద్రాశ్చ మర్యాదాముద్రణం ద్రుమాః
భూమేర్నభస్తలం యాన్తి నభసో యాన్తి భూతలమ్. 56
పురాణి ఘర్ఘరారావైర్దృశ్యన్తే లుఠితాన్యధః
సగృహాట్టాలవాస్తవ్యం నచ కించిల్లుఠత్యధః. 57
తస్యాం భ్రమన్త్యాం చతురం చన్ద్రార్కదినరాత్రయః
నఖాగ్రలేఖా లోకాన్తర్భాన్తి కాఞ్చనసూత్రవత్. 58
విభాన్తి సృష్టయస్తస్యా ఘర్మాణి జలజాలికాః
ఇవ నీహారహారిణ్యా నీలవారిద వాససః. 59

అత్తఱి చంచలములైనట్టి గొప్ప కులపర్వతములను భుజములచే శోభించుచు పరిభ్రమించు మేఘములను వస్త్రములచేఁ గప్పబడినదై, కల్పవృక్షములను సూక్ష్మరోమ పంక్తిగలదై మేరుపర్వతము నృత్యము సల్పుచుండెను. సముద్రములు తమతీరపు హద్దును వీడకయే నాట్యమొనర్చుచుండెను. వృక్షములు భూతలమునుండి యాకాశమును, ఆకాశమునుండి భూతలమును బొందుచుండెను. గృహములతోడను, మిద్దెలతోడను అందలి సమస్త పదార్థములతోడను, నగరములు ఘర్ఘర శబ్దయుక్తములై క్రింద పొరలుచున్నట్లును, ఒకపుడు పొరలకయే యున్నట్లును గన్పట్టుచుండెను. ఆ దేవియగు కాలరాత్రి చాతుర్యపూర్వకముగ పరిభ్రమించుచుండ చంద్ర, సూర్య దినరాత్రులామెయొక్క నఖాగ్రముల ప్రకాశములందు సువర్ణసూత్రమువలె భాసిల్లుచుండెను. నీహారము (మంచు) అను హారముగల్గి, నీలమేఘములను వస్త్రములను ధరించియున్న యా భగవతియొక్క అవయవములందు, మేఘములచే విసర్జింపఁబడిన జలకణములు స్వేదబిందులవలె గానుపించుచుండెను.

ఖమేవ తస్యాః సంపన్నం కబరీమణ్డలం బృహత్
పాతాలం చరణౌ భూమిరుదరం బాహవో దిశః. 60
ద్వీపాబ్ధయోఽన్త్రవలయః పార్శ్వకాః సర్వపర్వతాః
ప్రాణాపానా వలీదోలాః పవనస్కన్ధశాలికాః. 61

ఆకాశమె ఆ కాళీ భగవతియొక్క గొప్ప కేశసమూహము; పాతాళమే చరణములు, భూమి, యుదరము, దశదిక్కులు భుజములు; ద్వీప సముద్రములు ప్రేగులయొక్క వలయము; పర్వతములన్నియు పార్శ్వభాగములు; వాయువుయొక్క యిటునటు వీచుట ప్రాణాపానములయొక్క యూయలవంటి చలనము.

తదానుభూతం నృత్యన్త్యాస్తస్యా వపుషి విస్తృతే
హిమవన్మేరు సహ్యాద్య్రైర్దోలనభ్రమమద్రిభిః. 62

తరదద్రిగులుచ్ఛాస్తా వలయన్త్యాతయా స్రజః
పునః కల్పాన్త ఆరబ్ధ ఇవ తాణ్డవహేలయా. 63

సురాసురోరగానీకరోమశాల్గి శరీరకః
నిస్పన్దం స్థాతుమశకన్నసా భ్రమతి చక్రవత్. 64

నానావిభవవిజ్ఞానయజ్ఞ యజ్ఞోపవీతినీ
సా సరస్త్రీ నభస్యాసీద్వ్రహ్మఘూత్కారఘోషిణీ. 65

నృత్యమొనర్చుచున్న యా భగవతియొక్క విశాల శరీరమున హిమాలయ మేరు, సహ్య మందరాది పర్వతములు ఊయెలయొక్క సుఖము ననుభవించెను, ఎగురుచున్న పర్వతములను మొగ్గలతోగూడిన బ్రహ్మాండమాల నిటునటు త్రిప్పుచు ఆ భగవతి తాండవలీలచే మరల ప్రళయము నారంభము చేసెనాయనునట్లుండెను. సురా, సుర, ఉరగాదుల సమూహమును రోమములతోఁగూడిన యామె శరీరము నిశ్చలముగ నుండజాలకుండెను. కావున నది చక్రమువలెఁ దిరుగసాగెను. వివిధ కర్మఫల రూపములగు విభవములు, వాని యనుష్ఠానమునకుఁ గారణములైన విజ్ఞానములు. ఆ విజ్ఞానముల అనుష్ఠానరూపములగు యజ్ఞములు, అను నీ మూఁడు సూత్రములతోగూడిన యజ్ఞోపవీతమును ధరించి యాకాశమున నృత్యమొనర్చుచున్నదై యా భగవతి వేదఘోషచేయు బ్రహ్మచారిణివలె భాసించుచుండెను.

తత్ర భూతలమాకాశమాకాశమపి భూతలమ్
ప్రతికృతి భవత్యన్తర్న చ కించిద్వివర్తతే. 66

బృహన్నాసాగుహాగేహనిర్గతా ఘనఘుంఘుమాః
తత్రోగ్రా వాతవో వాన్తి ఘోరఘూత్కారకారిణః. 67

నభఃకరశతైస్తస్యాశ్చతురావృత్తివర్తిభిః
భాతి చణ్డానిలోద్ధూతైరాకీర్ణమివ పల్లవైః. 68

ఆ నృత్యమున ఆకాశము భూతలముగను, భూతల మాకాశముగను పరివర్తితమగుచుండెను. కాని వాస్తవముగ నేమియు పరివర్తనము నొందుటలేదు. ఏలయనిన ఆరెండును వాని వాని యందలి పదార్థములతోసహా క్రిందకు, పైకి తిరుగుచుండుటచే భ్రాంతిచే నట్లు గానుపించుచుండెను. ఆ భగవతి యొక్క నాసికాగుహలను గృహమునుండి వెలువడినవై ఘనీభూతమగు ఘుంఘుమశబ్దమును, భయంకరమగు ఘూత్కారధ్వనిని గావించుచు, ప్రచండవాయువులు వీచుచుండెను. చాతుర్యముతోటి పరిభ్రమించుచున్న ఆమెయొక్క యసంఖ్యాతములైన హస్తములచే నాకాశము ప్రచండవాయువుచేఁ గంపితములగు పల్లవములచే వ్యాప్తమైనట్లుండెను.

తదఙ్గజజగద్వస్తుజాత భ్రమణసంభవాత్
దృష్టిర్ధీరాపి మే మోహే సన్నా సన్నేవ సంగరే. 69

ప్రోహ్యాన్తే యన్త్రవచ్ఛైలా నిపతన్తి నభశ్చరాః
లుఠన్త్యమరగేహాని వలితే దేహదర్పణే. 70

మేరవః పర్ణవద్వ్యాఢా మలయాః పల్లవా ఇవ
హిమాద్రయో హిమకణా ఇవౌర్వ్యోఽబ్జలతా ఇవ. 71

సహ్యా మహ్యామివ ఖగా విన్ధ్యా విద్యాధరా ఇవ
వృక్షావర్తే భ్రమన్త్యోన్తా రాజహంసా ఇవామ్బరే. 72

ఆమెయొక్క అంగములందు జనించిన జగద్వస్తువులయొక్క భ్రమణముచే, నాదృష్టి వాస్తవముగ ధైర్యస్థైర్యములు గలదైనను మహాయుద్ధమున సైన్యమువలె కుంఠితమాయెను. ఆ పె దేహమను అద్దము పరివర్తితముకాఁగా, యంత్రమువలెఁ బర్వతములు చలింపసాగెను. ఆకాశచారులు పడఁదొడఁగిరి. దేవతల గృహము లిటునటుఁ బొరలఁజొచ్చెను, మేరుపర్వతములను పత్రములతోగూడినదై, మలయాచలములను పల్లవములుగలదై హిమాలయములను హిమకణములతోఁగూడి యామెయొక్క దేహము పృథివినుండి జనించిన కమల - లతవలెఁ శోభించుచుండెను. మఱియు నామెయొక్క దేహమందు, సహ్యపర్వతములు పృథివిపైన పక్షులవలెను, వింధ్యాచలములు ఆకాశమందు విద్యాధరులవలెను, వృక్షములు ఆకసమున రాజహంసలవలెను సంచరించుచుండెను.

ద్వీపాస్యపి తృణానీవ సముద్రా వలయా ఇవ
సురలోకాలయః పద్మా ఆసంస్తద్దేహవారిణి. 73

విశదాకాశసంకాశే స్వప్నాజ్ఞానపురోపమే
అఙ్గే తస్య బృహజ్జఙ్ఘే పిణ్డాదిత్యసమత్విషి. 74

ఆమెయొక్క దేహమను సరోవరమున సమస్తద్వీపములు తృణములవలెను, సముద్రములు వలయములవలెను. దేవలోకములు కమలములవలెను భాసించుచుండెను. ఆకాశమువలె విశాలమై, స్వప్నమందుదయించిన చీఁకటి నగరమును బోలినదై, గొప్ప జంఘ (పిక్క) గలదై, ముద్దగాఁ జేయఁబడిన యనేక సూర్యులవలెఁ బ్రకాశమానమైనట్టి యామెయొక్క శరీరమున వింధ్యాది స్థావరపదార్థములున్ను జంగత్వమొందెను (చలించుచుండెను).

విన్ధ్యో నృత్యతి కాఞ్చనాచలవనే సహ్యశ్చసహ్యో గిరిః
కైలాసో మలయో మహేన్ద్రశిఖరీ క్రౌఞ్చాలయో మన్దరః
గోకర్ణో గగనాఙ్గణే వసుమతీ విద్యాధరాణాం పురం
సర్వేజంగమతాం గతా వనభువస్తస్యాః శరీరే సదా. 75

మేరుపర్వతవనమందు వింధ్యాచలము తన చిరకాలపు పగను దీర్చుకొనుచున్న దానివలె నృత్యము చేయుచుండెను. అది సహింపక కైలాస, మలయ, మహేంద్ర, క్రౌంచ, మందర, గోకర్ణాది పర్వతములన్నియు నాకాశమను ముంగటియందుఁ గ్రోధముచేవలె నాట్యముచేయసాగెను. ఆ పక్షపాతముచే బృథివియు, విద్యాధరుల నగరములున్ను నృత్యముచేయదొడఁగెను. ఇవ్విధమున ఆ దేవియొక్క శరీరమున స్థావరములన్నియు జంగమరూపములాయెను.

ఆద్రిర్న్యృత్యతి పర్వతే గిరిరపి ప్రోచ్చైర్నభః కోటరే
వ్యోమాపీన్దుదివాకరైః క్వ చలితం భూమేరధస్తాద్గతమ్

సద్వీపాచలపత్తనో వనగణః ప్రోత్కీర్ణ పుష్పో దివి
వ్యాలోలం జగదమ్బుధావివ తృణం దిక్చక్రకే భ్రామ్యతి. 76

ఇంకను నామెయొక్క దేహమున ఆశ్చర్యమేమనగా - సముద్రములు పర్వతములపై నాట్యమాడుచుండెను, పర్వతములు మహాకాశమను గర్తమున నృత్యము సేయుచుండెను; సూర్య చంద్రులతో సహ యాకాశము పృథివిక్రింద నెచటికోపోయెను, వికసిత పుష్పములచేఁ బూర్ణము లగు ద్వీప, పర్వతాదులతోఁగూడిన వనసమూహము సూర్యాదుల స్థానమున నాట్యము సల్పుచుండెను. ఇట్లు, సముద్రమందుఁ దృణమువలె, చంచలమగు జగత్తు దిఙ్మండలమున పరిభ్రమించుచుండెను.

వ్యోమ్ని భ్రమన్తి గిరయోఽమ్బుధయో దిగన్తే
లోకాన్తరాణి పురపత్తనమణ్డలాని
నద్యః సరాంసి ముకురాన్తరివ ప్రవృద్ధ
వాతావకీర్ణతృణవిభ్రమణ క్రమేణ. 77

మత్స్యాశ్చరన్తి చ మరౌ వరవారిణీవ
వ్యోమ్ని స్థిరాణి నగరాణి భువీవ భాన్తి
ఖే భూధరా గగనసంక్షయవారివాహ
ముత్పాతవాత పరివృత్తగిరిస్థితం తత్. 78

ఋక్షోత్కరో భ్రమతి దీపసహస్రయన్త్ర
చక్రక్రమేణ మణివర్షణవేగచారుః
అన్తర్బహిశ్చ పరితః ప్రణయేన ముక్తం
విద్యాధరామరగణైరివ పుష్పవర్షమ్. 79

అట నాకాశమునఁ బర్వతములు, దిగంతములందు సముద్రములు తిరుగుచుండెను. గ్రామ, నగర, రాజ్య, నదీ, తటాకాదులు దర్పణము నందువలె అన్యలోక, లోకాంతరములందుఁ బ్రవేశించి, ప్రచండవాయువుచేఁ గొట్టుకొని పోఁబడు తృణసమూహమువలె పరిభ్రమించుచుండెను. ఉత్తమ జలసహితమగు సముద్రమునందువలె మరుభూమియందు మత్స్యములు సంచరించుచుండెను. పృథివిపైవలె ఆకాశమందు పుర, పర్వతములు స్థిరముగ శోభించుచుండెను. ఉత్పాత వాయువుచే భ్రమణశీలములైన పర్వతములపై నాకాశము, ప్రళయమేఘములు భాసించుచుండెను. మణులయొక్క వృష్టివేగమువలె మనోహరమై, వేలకొలఁది దీపయంత్రముల భ్రమణమును బోలినదై, ఈ మీసభయందుఁ బ్రీతిచే విద్యాధర, దేవతాదులచేఁ గురిపింపఁబడిన పుష్పవర్షమువలె, నక్షత్ర సమూహము పృథివియొక్క బాహ్యాభ్యంతరములందంతటను దిరుగుచుండెను.

సంహారసర్గనిచయా దినరాత్రిభాగే
బిన్దూపమా రజతయోర్దివ[వర్లో]ర్కరాశ్చ
కృష్ణాః సితాశ్చ పరితోఽమల శుక్లకృష్ణ
స్వాదర్శ మణ్డలవదా కులముల్లసన్తి. 80

రత్నాని భాస్కర నిశాకరమణ్డలాని
తారోత్కరాన్తరలమణ్డలకాన్తిహారాః
స్వచ్ఛామ్బరాణి వలితాని మహామ్బరాణి
కుర్వన్త్యనారత మనల్పమలాతలేఖాః. 81

మఱియు, ఆ భగవతియొక్క దేహమందు సృష్టి ప్రళయ సమూహములు దినరాత్రులవలె అల్పములుగ భాసించుచుండెను. అట్లే దినరాత్రులున్ను శుద్ధ, మలిన రజత (వెండి) బిందువులవలె నత్యల్పములుగఁ దోచుచుండెను. శుక్ల కృష్ణపక్షములు శ్వేత, నీలమణుల ఆదర్శ (దర్పణ) మండలములవలెఁ జెన్నొందుచుండెను. సూర్య చంద్రులు రత్నములవలెను, నక్షత్ర సమూహములు చంచల మనోహర హారములవలెను. నిర్మలాకాశము పరివేష్టితములగు మహావస్త్రములవలెను జూపట్టుచుండెను. మఱియు నయ్యాకాశమున పరిభ్రమించు, అగ్ని, విద్యుదాదులు 'అలాత' (కొఱవి) చక్రములవలె మహాప్రకాశము గావించుచుండెను.

కల్పాన్తకాల విలుఠత్త్రిజగన్మణీని
వ్యావర్తనైర్ఝగితి జాతఝణఝణాని
తేజాంసి ఝుంకృతతయోర్ధ్వమధశ్చ యాన్తి
నానావిధాని గుణవన్తి విభూషణాని. 82

ఆ దేవియొక్క శరీరమున, ప్రళయకాలమున నిటునటు పొర్లాడుచున్న ముల్లోకములున్ను శీఘ్రముగ 'ఝణఝణ' శబ్దమొనర్చు మణుల చందముననాయెను. ఝుంకార శబ్దము గావించుచు క్రిందకుఁ బైకినిఁ బోవుచున్న సూర్యాది తైజసపదార్థము లనేక గుణములతోఁ గూడిన నూపురాద్యాభరణములై యొప్పుచుండెను.

సంగ్రామమత్తభటఖడ్గమరీచివీచి
శ్యామాయమాన సకలాతప వాసరాణామ్
వ్యావృత్తిభిర్విలుఠతామపి సుస్థిరాణా
మాకర్ణ్యతే కలకలో జనమణ్డలానామ్. 83

మఱియు, ఆ భగవతియొక్క నృత్యమున, యుద్ధమందుఁ డమ ఖడ్గాదుల కాంతులచే గ్రీష్మర్తు దివసములనుగూడ శ్యామవర్ణయుతములుగ, గావించువారును, నిత్యభ్రమణములచేఁ బొరలుచున్నప్పటికిని, అధిష్ఠాన బ్రహ్మముయొక్క స్థిరత్వముచే అతిస్థిరులునగు మదించిన వీరులయొక్క గొప్ప కోలాహలము వినిపించుచుండెను.

బ్రహ్మేన్ద్రవిష్ణుహర వహ్నిరవీన్దుపూర్వా
దేవాసురాః పరివివృత్తిభిరాతపన్తః
అన్యేఽన్య ఏవ వివిధా ఉపయాన్తి యాన్తి
వాతావధూతమశకాశని విభ్రమేణ. 84

భూత, భవిష్యత్కాలములందలి అనంతకోటి సృష్టి, ప్రళయములతోఁ గూడియున్న శరీరమును ధరించియున్నట్టి యా దేవియొక్క నృత్యమున బ్రహ్మ, విష్ణు ఇంద్రాది దేవతలున్ను, అసురులున్ను, వారివారి అధికారములయొక్క ప్రవృత్తులచే వేర్వేఱు రూపముల ధరించి అస్థిరత్వముతో, గూడియున్నవారై వాయువుచేఁ గంపితములగు మశకము (దోమ)ల వలెను. విద్యుత్ యొక్క విలాసములవలెను వచ్చుచు పోవుచునుండిరి

సంహారసరసుఖదుఃఖ భవాభవేహా
నీహానిషేధ విధిజన్మ మృతిభ్రమాద్యాః
సారం పృథక్ప విలసన్తి సదైవ సర్గే
వ్యామిశ్రతాముపగతా అపి తత్ర భావాః. 85

భోవోద్భవస్థితి విపత్కరణభ్రమాణాం
సంహారసర్గభువనావని విభ్రమాణామ్
మిథ్యైవ ఖే ప్రకచతాం ఖశరీరకాణాం
సంలక్ష్యతేఽత్ర మనాగపి నామసంఖ్యా. 86

ఉత్పాతశాన్తిమరణోత్సవయుద్ధసామ్య
విద్వేషరాగభయవిశ్వసనాది తత్ర
ఏకత్ర కోచ ఇవ రత్నచయో విభాతి
నానారసాప్రతిఘసర్గ పరంపరం తత్ 87

ఆ భగవతియొక్క శరీరమున భాసించు, సృష్టియందు సృష్టి, ప్రళయములు, సుఖ దుఃఖములు, భవాభవములు, చేష్టాచేష్టలు, విధినిషేధములు, జననమరణములు మున్నగునవి పరస్పర విరుద్ధములైనను, సదా కూడియు వేత్వేఱుగను భాసించుచుండెను. మఱియు నామె శరీరమందు చిదాకాశరూపమున మిథ్యగనే యుత్పన్నమైనవియు, కనుకనే వాస్తవముగ శూన్య రూపములును, నగు సృష్టి ప్రళయ, భువన, పృథివ్యాది విభ్రమములయొక్కయు, అధిష్ఠానము నుండి మిథ్యగా నుత్పన్నములైన స్థితులయొక్కయు, విపత్తులయొక్కయు [illegible] భ్రమల యొక్కయు గణన యొకింతైనను గావింపబడజాలదు. ఇంకను నట పరస్ప[illegible] విరుద్ధములైనను, ఉత్పాతశాంతులు, జననమరణములు, యుద్ధ, తదభావములు, రాగద్వేషములు, భయాభయములు మున్నగునవి యన్నియు నొకేచోట కోశమందు రత్నసమూహమువలె శోభించుచుండెను. ఏలయనిన, నానారసభరితమైనను అమెయొక్క శరీరము పరస్పర మొకదానినొకటి విరోధింపని సృష్టిపరంపరతోఁ గూడియుండెను.

తస్యాశ్చిదమ్బరమయే వపుషి స్వభావ
భూతా స్ఫుటానుభవభావజగద్వ్యవస్థాః
సర్వ్యక్షయా మలిన దృక్కలితామ్బరస్థ
కేశోణ్డ్రకస్ఫురణవిత్ఫరితః స్ఫురన్తి. 88

తిమిరరోగముచే మలినమైనట్టి దృష్టిగలవానికి నాకసమున కేశాదులు కన్పించునట్లు, వాస్తవముగ చిదాకాశరూపమే యైనట్టి యా భగవతియొక్క శరీరమున మాయరూపమగు అవరణచే, ప్రత్యక్షానుభూతమగు జగద్వ్యవస్థయంతయును, ప్రళయాదులున్ను భాసించుచున్నది.

జగత్సంక్షుబ్ధ మక్షుబ్ధం దృశ్యతే స్థితి సంస్థితి
సంచాల్యమానముకురప్రతిబిమ్బ ఇవాస్థితమ్. 89

నిశ్చలమైన పర్వతము చలించు అద్దమున చంచలముగఁదోచునట్లు, అచలమైనయధిష్ఠానమునయే సంక్షోభము లేకయున్న యీ జగత్తు మాయా క్షోభదృష్టిచే సంక్షుభితముగ భాసించుచున్నది.

నృత్యస్ఫురత్ప్రతాపాన్తర్జగదర్థాః ప్రతిక్షణమ్
స్థితిం త్యజన్తి గృహ్ణన్తి బాలసంకల్పసర్గవత్. 90

క్రియాశక్తిః శరీరేఽన్తః పూర్యమాణా అనారతమ్
రాశీభూయ విశీర్యన్తే జగన్ముద్గకణోత్కరాః. 91

క్షణమాలక్ష్యతే కించిన్న కించిదపి సా క్షణమ్
క్షణమఙ్గుష్ఠమాత్రైవ క్షణమాకాశపూరిణీ. 92

నృత్యముచే స్ఫురించునట్టి ప్రతాపముగలిగిన యా మహామాయయొక్క శరీరమునఁ బ్రవేశించిన సమస్త జగత్తుయొక్క పదార్థములున్ను బాలుని సంకల్పసృష్టివలెఁ బ్రతిక్షణము పరిణామముచేఁ దమపూర్వపు స్థితిని ద్యజించి యన్యస్థితిని, గ్రహించుచుండెను. ఆ భగవతియొక్క శరీరమున నిరంతరము క్రియాశక్తి పరిపూర్ణమై యుండుటచే నట ముద్గ (పెసల) రాశివలె జగత్తొకచోట నేకీభూతమై మరల కాలక్రమమున సర్వత్ర విస్తృతమగుచున్నది, పరిణామ స్వభావము గల జగత్తుతోటి పరిపూర్ణమైయుండుటచే నామె క్షణక్షణము వేఱువేఱు రూపముల ధరించుచుండెను. క్షణకాలములోనే అంగుష్ఠమాత్ర రూపమును ధరించుచు మరల క్షణకాలములోనే యాకాశ రూప మగుచుండెను.

యస్మాత్సా సకలా దేవీ సంవిచ్ఛక్తిర్జగన్మయీ
అనన్తా పరమాకాశకోశశుద్ధశరీరిణీ. 93

ఆ దేవి చైతన్యముయొక్క స్ఫురణమాత్రమగు శక్తిస్వరూపిణి యగుటచే సర్వజగన్మయియై యొప్పుచున్నది. కాని, వాస్తవముగ అనంత, శుద్ధ, చిదాకాశమాత్ర శరీరధారిణియే యైయున్నది.

కాలత్రయస్థితజగత్త్రితయాన్తరీ హి
చిత్సా తథా కచతి తేన యథాస్థితేన
రూపేణ చిత్రకృదుదారమనఃస్థ చిత్ర
సంసారజాల సదృశేన కచజ్జవేన. 94

ఆ భగవతి త్రికాలములందున్నట్టి పరిణామశీలమగు జగత్త్రయముయొక్క యాభ్యంతరమందున్న చిత్స్వరూపమైయున్నది. ఇక్కారణమున, చిత్రకారుని విశాల చిత్తముననున్న చిత్రమయమగు ప్రపంచజాలమువలె ఆయా కర్మ, వాసనల పరిపక్వతనుబట్టి విచిత్ర జగద్రూపముగ పరిణమించి శోభించుచున్నది.

సర్వాత్మకైకవపురేక చిదాత్మకత్వా
త్స్పంశాన్తఖైకవపురేక చిదాత్మతత్త్వాత్
ఏవం నిమేషణ సమున్మిషితైకరూపం
సా బిభ్రతీ వపురనన్తమనాది భాతి. 95

ఆ దేవి అవిద్యావృతమగు చిత్స్వరూపమగుటచే సర్వసంసారమయియై చూపట్టు చున్నది. మఱియు విద్యచే అవిద్యబాధితముకాఁగా శుద్ధ చిదాకాశ రూపముగనే వెలుగుచున్నది. ఈ ప్రకారముగ బద్ధునియొక్కయు, ముక్తునియొక్కయు దృష్టులచేతను. నిమేష, ఉన్మేషముల చేతను, అవిద్యా, విద్యలచేతను క్రమముగ సంసారమయమైనట్టియు శుద్ధ, చిన్మయ, అనాద్యనంత మైనట్టియు శరీరమును ధరించుచు నామె ప్రకాశించుచున్నది.

తస్యాం విభాతి తదనన్తశిలాత్మకోశే
లేఖాబ్జ చక్రరచనాదివదేవ దృశ్యమ్
వ్యోమాత్మకం గగనమాత్ర శరీరవత్యాం
చిత్త్వాద్ధ్రవజ్జలధికోశ ఇవోర్మిలేఖా. 96

స్ఫటిక శిలయందు కమల చక్రాదుల రచనవలెను, సముద్రమందు తరంగ సమూహము వలెను చిదాకాశశరీరధారిణియగు ఆ దేవియొక్క శరీరమున ఈ దృశ్యము అభిన్నరూపమున భాసించుచున్నది.

మహతీ భైరవీ దేవీ నృత్యన్త్యాపూరితామ్బరా
తస్య కల్పాన్తరుద్రస్య సా పురో భైరవాకృతేః. 97
శిరోమన్దా త్రితోగ్రాగ్ని దగ్ధస్థాణువనావనిః
కల్పాన్తవాతవ్యాధూతా వనమాలేవ నృత్యతి. 98
కుద్దాలోలూఖలబృసీ ఫలకుమ్భకరణ్డకైః
ముసలోదఞ్చనస్థాలీస్తమ్భైః స్రగ్దామధారిణీ. 99
ఏవం విధానాం స్రగ్దామజాలానాం కుసుమోత్కరమ్
కిరన్తీ సంసృజన్తీవ నృత్తక్షుబ్ధం క్షయంక్షతమ్. 100

మహాభయంకరరూపిణియగు ఆ దేవి తన దేహముచే ఆకాశమున బూర్ణ మొనర్చి భైరవ రూపధారియగు కల్పాంతరుద్రుని సమ్ముఖమున నృత్యము చేయదొడఁగెను. మఱియు, ఆ రుద్రుని లలాటస్థానముననున్న ప్రబలమైన తృతీయ నేత్రాగ్నిచే దగ్ధములై, స్థాణుశేషములైనట్టి వనములుగల భూమి గల్గియున్నదై, కల్పాంతవాయువుచే కంపితమగు వనసమూహమువలె నామె నృత్యమునల్పుచుండెను. కుద్దాలము (త్రవ్వెడు సాధనము) ఉలూఖలము (ఱోలు) బృసి (దర్భాసనము,) ఫలము, కుంభము, కరండకము, (చిన్న పెట్టె) ముసలము (రోకలి) ఉదంచనము (మూకుడు,) స్థాలి (వంటకుండ,) స్థంభము మున్నగువాని మాలలనుధరించి, నృత్యమందు కంపితలై క్షయమొందిన యట్టి మాలలయొక్క పుష్పములను వెదజల్లుచు మరల నూతన పుష్పములను సృజించుచు ఆ భగవతి నృత్యము చేయుచుండెను.

వన్ద్యమానస్తయా సోఽపి తథైవాకాశభైరవః
తథైవ వితతాకారస్తదోచ్చైః పరినృత్యతి. 101

ఇట్టి యా భగవతిచే వంద్యమానుఁడును, ఆకాశమువలె విశాలరూపమును ధరించిన వాఁడునగు భైరవభగవానుఁడున్ను నపుడు మహానృత్యము సల్పుచుండెను.

డింబండింబం సుడింబం పచపచ సహసా ఝుమ్యఝుమ్యం ప్రఝుమ్యమ్
నృత్యన్తీ శబ్దవాద్యైః స్రజమురసిశిరఃశేఖరం తార్క్ష్యపక్షైః
పూర్ణం రక్తావసానాం యమమహిషమహాశృఙ్గమాదాయ పాణౌ
పాయాద్వో వన్ద్యమానః ప్రలయముదితయా భైరవః కాలరాత్ర్యా. 102

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే కాలరాత్రి వర్ణనం నామైకాశీతితమః సర్గః ॥ 81 ॥

ఓ రామచంద్రా! రక్తమద్యముచే బూర్ణమగు యమ - మహిషముయొక్క గొప్ప శృంగ మును హస్తమందు గ్రహించి 'డింబం, డింబం ఝుమ ఝుమ' మను తాళశబ్దములచే నృత్య మొనర్చునదియు, వక్షఃస్థలమున శిరస్సుల మాలను ధరించునదియు, గరుత్మంతుని ఱెక్కలచే భూషితమైనట్టి మస్తకము గలదియు, ప్రళయమున జగత్తును భక్షించి సంతోషముగ వెలయునదియు నగు కాలరాత్రిచే స్తుతింపబడునట్టి భైరవ భగవంతుఁడు మిమ్ములను (జ్ఞాన ప్రతిబంధకదోష, నివారణముద్వారా) రక్షించుగాత!

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున కాలరాత్రి వర్ణనమను నెనుబదియొకటవ సర్గము ॥ 81 ॥

ద్వ్యశీతితమః సర్గః

[చిద్రూపస్య శివస్యాత్ర తత్త్వం నిష్కృష్య వర్ణ్యతే
సకలం యావదజ్ఞాతం పరిజ్ఞాతం తు నిష్కలమ్.

అజ్ఞానముచే కళాసహితమై, జ్ఞానముచే కళారహితమైనట్టి చిద్రూపమగు పరమాత్మ యొక్క తత్త్వమిట శోధింపఁబడి వర్ణింపఁబడుచున్నది.

శ్రీరామ ఉవాచః—

కిమేతద్భగవన్సర్వనాశే నృత్యతి కేన సా
కిం శూర్పఫలకుమ్భాద్యైస్తస్యాః స్రగ్దామధారణమ్. 1
కిం నష్టం త్రిజగద్భూయః కిం కాల్యా దేహసంస్థితమ్
పరినృత్యతి నిర్వాణం కథం పునరుపాగతమ్. 2

శ్రీరాముఁడు :— మహాత్మా! ప్రళయమున నంతయు నశించిపోఁగా నిఁక నేయంగము చే ఆ కాళీభగవతి నృత్యము సల్పుచుండెను? శూర్ప, ఫలకుంభాది వినష్టపదార్థములయొక్క మాల నామె యెట్లు ధరించియుండెను? ఈ ముల్లోకములందును నశించినదేది? ఆ కాళీదేవి యొక్క శరీరరూపముచే స్థితినొందియున్నదేది? నశించిన జగత్తు మరల యేతెంచి యెట్లు నృత్యము సల్పుచున్నది?

శ్రీవసిష్ఠ ఉవాచః—

నాసౌ పుమాన్న చాసౌ స్త్రీ న తన్నృత్యం న తావుభౌ
తథాభూతే తథాచారే ఆకృతీ న చ తే తయోః. 3

అనాదిచిన్మాత్రనభో యత్తత్కారణకారణమ్
అనన్తం శాన్తమాభాసమాత్రమవ్యయమాతతమ్. 4

శ్రీ వసిష్ఠుఁడు :— ఓ రామచంద్రా! ఆ భైరవుఁడు పురుషుఁడు కాదు, స్త్రీ కాదు; ఆ నృత్యమున్ను వాస్తవముకాదు, ఆ కాళీ. భైరవుల యాకృతులును, వాస్తవముగ లేనివేయైయున్నవి. అనాదియై, చిన్మాత్రమై, చిదాకాశరూపమై, సర్వకారణములకును కారణమై, అనంతమై, శాంతమై, ప్రకాశమాత్రమై, అవ్యయమై, సర్వవ్యాపకమైనట్టి పరబ్రహ్మమే వారిరువురునునై యున్నారు.

శివం తత్ప్రచ్ఛివం సాక్షాల్లక్ష్యతే భైరవాకృతి
తథా స్థితో జగచ్ఛాన్తౌ పరమాకాశ ఏవ సః. 5

నిరతిశయానందరూపమగు సద్రూపమైన సాక్షాత్ పరబ్రహ్మమే నీలకంఠ, త్రినేత్రత్వాది శివరూపమును ధరించుచున్నది. మఱియు; ఉపాసకుల వాసనానుసార మయ్యది భైరవాకారముగను స్థితినొందియున్నది. జగత్తు శమింప యాభైరవాదులు చిదాకాశమే యైయుందురు.

చేతనత్వాత్తథాభూతస్వభావవిభవాదృతే
స్థాతుం న యుజ్యతే తస్య యథా హేమ్నో నిరాకృతి. 6

ఆకారమును ధరింపక సువర్ణముండజాలనట్లు, చేతనరూపమగుటచే అజ్ఞాతమగు చైతన్యము సృష్టిస్థితి సంహారములను తన స్వభావమును విడిచి యుండజాలదు.

కథమాస్తాం వద ప్రాజ్ఞ చిన్మాత్రం చేతనం వినా
కథమాస్తాం వద ప్రాజ్ఞ మరిచం తిక్తతాం వినా. 7

మిరియము కారపుదనము లేకయుండజాలనట్లు, (అజ్ఞాతమగు) చిన్మాత్రము చేత్యమగు విషయాకారమును ధరింపక నుండఁజాలదు.

కటకాది వినా హేమ కథమాస్తాం విలోచ్యతామ్
కథం స్వభావేన వినా పదార్థస్య భవేత్స్థితిః. 8

ఓ రామచంద్రా! కటకాద్యాభరణముల యాకారమును ధరింపక సువర్ణ మెట్లుండ గలదో విచారింపుము? ఏ పదార్థమైనను తన స్వభావమును విడిచి యెట్లుండగలదు?

వినా తిష్ఠతి మాధుర్యం కథయేక్షురసః కథమ్
నిర్మాధుర్యశ్చ యస్త్విక్షురసో నహి స తద్రసః. 9

చెఱకురసము మాధుర్యములేక యెట్లుండగలదో వచింపుము? మాధుర్యము లేక యుండునది చెఱకురసమే కానేరదు.

అచేతనం యచ్చిన్మాత్రం న తచ్చిన్మాత్రముచ్యతే
న చ చిన్మాత్రనభసో నష్టం క్వచన యుజ్యతే. 10

దేనిని ప్రకాశింపఁజేయనిచో చిన్మాత్రము చిన్మాత్రమనియే వచింపఁబడదు. మఱియు చిదాకాశమున కెచటను నాశమున్ను యుక్తము కానేరదు.

స్వసత్తామాత్రకాదన్యత్కించిత్తస్య న యుజ్యతే
అన్యత్వమురరీకర్తుం వ్యోమానన్యమసౌ కిల. 11

బ్రహ్మముయొక్క స్వసత్తామాత్రమున కన్యముగ మఱేద్దియునులేదు. ఆ బ్రహ్మమే అనేకత్వమును గూర్చిన యిచ్ఛచే తనకంటె అభిన్నమైన రూపముగల జగత్తను అన్యత్వము నంగీకరించెను.

తస్మాత్తస్య యదక్షుబ్ధం సత్తామాత్రం స్వభాసనమ్
అనాదిమధ్యపర్యన్తం సర్వశక్తిమయాత్మకమ్. 12

తదేతత్త్రిజగత్సర్గకల్పాన్తౌ వ్యోమ భూర్దిశః
నాశ ఉత్పాదనం నామ వినాభాసనం నభః. 13

కావున ఆదిమధ్యాంతరహితమై, క్షోభవర్జితమై, సర్వశక్తిమయమైనట్టి బ్రహ్మముయొక్క నిజసత్తామాత్ర ప్రకాశమే యీ ముల్లోకములయొక్క సృష్టియు కల్పాంతమున్ను నగును. మఱియు నదియే యాకాశమున్ను, పృథివియు, దిక్కులున్నుగూడ నగును. ఆకాశముయొక్క నీలత్వమువలె, అవిద్యాదృష్టిచేతనే యుత్పత్తినాశములు భాసించుచున్నవి.

జననం మరణం మాయా మోహమాన్ద్యమవస్తుతా
వస్తుతా చ వివేకశ్చ బన్ధో మోక్షః శుభాశుభే. 14

విద్యావిద్యా విదేహత్వం సదేహత్వం క్షణశ్చిరమ్
చఞ్చలత్వం స్థిరత్వం వా త్వం చాహం చేతరశ్చ తత్. 15

సదసద్భావ సదసన్మౌర్ఖ్యం పాణ్డిత్యమేవ చ
దేశకాలక్రియాద్రవ్యకలనాకేలికల్పనమ్. 16

రూపాలోకమనస్కారకర్మబుద్ధీన్ద్రియాత్మకమ్
తేజోవార్యనిలాకాశపృథ్వ్యాదికమిదం తతమ్. 17

ఏతత్సర్వమసౌ శుద్ధచిదాకాశో నిరామయః
అజహద్వ్యోమతామేవ సర్వాత్మైవమాస్థితః. 18

ఓ రామచంద్రా! జననము, మరణము, మాయ, మోహము, మందత్వము, అవస్తుత్వము, వస్తుత్వము, వివేకము, బంధము, మోక్షము శుభము, అశుభము, విద్య, అవిద్య, నిరాకారత్వము, సాకారత్వము, క్షణము, చిరకాలము, చంచలత్వము, స్థిరత్వము, త్వత్త ('నీ'వను

భావము,) అహంత్వము, అన్యత్వము, సత్తు, అసత్తు, మూర్ఖత్వము, పాండిత్యము, దేశ కాలము, క్రియ, ద్రవ్యము, కళ, క్రీడ, కల్పన, నామరూపములు, బాహ్యంతరవిషయము కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు ఈ వ్యాప్తములైయున్నట్టి పృథివీ జలాగ్ని వాయురాకాశ పదార్థములు అన్నియు నిరామయమైన శుద్ధ చిదాకాశమే యైయున్నవి. ఆ చైతన్యము తన చిదాకాశ రూపత్వమునుద్యజింపకయే సర్వరూపమైయున్నది

ఏతత్సర్వం చ విమలం ఖమేవాత్ర న సంశయః
అస్మాదనన్యత్స్వప్నాదిర్దృష్టాన్తోఽత్రావిఖణ్డితః. 19

ఈ సమస్త జగత్తు చిదాకాశమేయై యున్నది. ఇట సందేహమేమియునులేదు. ఆ చైతన్యముకంటె వేఱుగ నేదియునులేదు. స్వప్నాదులందలి పదార్థములే యిందులకు అఖండితమైన దృష్టాంతమైయున్నవి.

చిన్మయః పరమాకాశో య ఏవ కథితో మయా
ఏషోఽసౌ శివ ఇత్యుక్తో భవత్యేష సనాతనః. 20

ఓ రామచంద్రా! ఏచిన్మయమగు పరమాకాశమునుగూర్చి నీకు వచించితినో అదియే సనాతనుఁడగు శివుఁడని పేర్కొనబడినది.

స ఏష హరిరిత్యాస్తే భవత్యేష పితామహః
చన్ద్రోఽర్క ఇన్ద్రో వరుణో యమో వైశ్రవణోఽనలః. 21

అనిలో జలదోఽమ్భోధిర్వ్యో యిదస్త్యస్తి నాస్తి చ
ఇత్యేతే చిన్మయాకాశకోశలేశాః స్ఫురన్త్యలమ్. 22

ఈ శివరూపుఁడగు పరమాత్మయే బ్రహ్మ, విష్ణు, చంద్ర, సూర్య, ఇంద్ర, వరుణ యమ, కుబేర, అగ్న్యాదిరూపములను ధరించుచున్నాడు. అట్లే వాయు, మేఘ, సముద్రాదులున్ను, భూత, భవిష్యత్పదార్థములున్ను, 'కలవని, లేవని' వికల్పింపఁబడు వస్తువులున్ను అన్నియుపరమాత్మయే యైయున్నవి. ఈ ప్రకారముగ ఈ బ్రహ్మాది సమస్తపదార్థములున్ను (ఉపాధిద్వారా) చిన్మయమగు బ్రహ్మకాశకోశముయొక్క అంశరూపములేయై లెస్సగ స్ఫురించుచున్నవి.

ఏవంవిధాభిః సంజ్ఞాభిర్మృధా భావనయేదృశాః
స్వభావమాత్రబోధేన భవన్త్యేతే తు తాదృశాః. 23

అన్యథా గ్రహణము కావించునట్టి 'అవిద్యచే' బరమాత్మయే యిట్లు బ్రహ్మాది నామములతోటి చూపట్టును. పరమార్థ స్వభావమాత్ర బోధచే ఈ బ్రహ్మాది సమస్త పదార్థములున్ను చిన్మాత్రముగనే శేషించును,

అబోధో బోధ ఇత్యేవం చిద్వ్యోమైవాత్మని స్థితమ్
తస్మాద్భేదో ద్వైతమైక్యం నాస్తేవేతి ప్రశామ్యతామ్. 24

ఓ రామచంద్రా! చిదాకాశమగు బ్రహ్మమే అజ్ఞానదృష్టిచే అబోధరూపమగుచు జీవజగద్రూపములతోటి తనయందు స్థితినొందియున్నది. తత్త్వదృష్టిచే నదియే బో[illegible]పమగుచు

చిదాకాశముగనే తనయందు వెలయుచున్నది. ఇక్కారణమున భేదము, ద్వైతము, ఐక్యము మున్నగునవి యెవ్వియు వాస్తవముగ లేవనియే యెంచి శాంతుఁడవగుము!

తావత్తరఙ్గత్వమయం కరోతి జీవః స్వసంసారమహాసముద్రే
యావన్న జానాతి పరం స్వభావం నిరామయం తన్మయతాముపేతః. 25

జీవుఁడెంతవఱకు తన స్వరూపము నెఱుఁగకుండునో, అంతవఱకు నాతఁడీ సంసారమను మహాసముద్రమున జనన, మరణ, భ్రమణాది వివిధతరంగములయొక్క కల్పన గావించుచునేయుండును. ఎపుడు తన పరబ్రహ్మస్వభావము నెఱుఁగునో అపుడద్దానియందు తన్మయుఁడై నిరామయమగు బ్రహ్మరూపమే యగును.

జ్ఞానే తు శాన్తిం స తథోపయాతి యథా న సోఽబ్ధిర్న తరఙ్గకోఽసౌ
యథాస్థితం సర్వమిదం చ శాన్తం భవత్యనన్తం పరమేవ తస్య. 26

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే శివస్వరూపవర్ణనం
నామ ద్వ్యశీతితమః సర్గః ॥ 82 ॥

ఓ రామచంద్రా! జ్ఞానముకలుగఁగా ఈ జీవుఁడు తరంగరహితమగు సముద్రమువలె శాంతినొందును. అపుడీ యథాస్థితమగు సమస్తజగత్తున్ను నాతనికి పరమశాంతమగు బ్రహ్మరూపమే యగును.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
పాషాణోపాఖ్యానమున శివస్వరూపవర్ణనమను
నెనుబది రెండవ సర్గము ॥ 82 ॥

త్ర్యశీతితమః సర్గః

[చిన్మాత్రమేవ స శివో న కాలీ భైరవాకృతిః
బోధాయ కల్పనా దృష్ట్యా తథా భాతీతి వర్ణ్యతే.

ఆ భైరవాకారుఁడగు శివుఁడున్ను, కాళీభగవతియు చిన్మాత్ర స్వరూపులేయనియు, వారి యా యా కృతులు వాస్తవముగ సత్యములు కావనియు, బోధకొఱకై కల్పనాదృష్టిచే వారట్లు భాసించుచున్నారనియు నిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

చిన్మాత్ర పరమాకాశ ఏష యః కథితో మయా
ఏషోఽసౌ శివ ఇత్యుక్తస్తదా రుద్రః ప్రనృత్యతి. 1

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఈ నాచేవర్ణింపఁబడినటువంటి చిన్మాత్రమగు బ్రహ్మకాశ మెయ్యదిగలదో, అదియే శివుఁడని చెప్పఁబడినది; మఱియు నదియే రుద్రరూపమును ధరించి ప్రళయకాలమున నృత్యము చేయుచున్నది.

యాసౌ తస్యాకృతిర్నాసావాకృతిః కృతినాం వర
తచ్చిన్మాత్రఘనం వ్యోమ తథా కచతి తాదృశమ్. 2

పుణ్యవంతులలో శ్రేష్ఠుఁడవగు రామచంద్రా! ఈ రుద్రుని భయంకరమైన యాకృతి యేది గలదో, అది వాస్తవముగ నాతని యాకృతి కాదు. చిద్ఘనమగు చిదాకాశమే యట్టి రూపముచే స్ఫురించుచున్నది.

మయా దృష్టా తదాకాశమేవ శాన్తం తదాకృతిః
మయేవ తత్పరిజ్ఞాతం నాన్యః పశ్యతి తత్తథా. 3

తత్త్వదృష్టిచే నేనాయాకారమును శాంతమగు చిదాకాశమాత్రముగనే వీక్షించితిని. నేనే యద్దానిని యథార్థరూపముచే నెఱిఁగితిని. వివేకదృష్టి రహితుఁడగు జీవుఁడెవ్వఁడును దాని నట్లు గాంచఁజాలఁడు.

యథా నామ స కల్పాన్తః స రుద్రః సా చ భైరవీ
మాయామాత్రం తథా సర్వం పరిజ్ఞాతమలం మయా. 4

ఏ ప్రకారము ఆ కల్పాంతము, ఆ రుద్రుఁడు, ఆ భైరవి మాయామాత్రులై యుండిరో అది యంతయును తత్త్వదృష్టిచే నేను బాగుగ గ్రహించితిని.

చిద్వ్యోమైవ పరం శూన్యం సంనివేశేన తేన తత్
తథా సంలక్ష్యతే నామ భైరవాకారతాం గతమ్. 5

ఆ సమస్తమును పరమ (దృశ్య) శూన్యమైనట్టి చిదాకాశ మాత్రమే యైయున్నది. ఆ యాకారముగాని, ఆ నృత్యముగాని వాస్తవముగ లేనివేయగును. ఉపాసకుల వాసనచే ఆ భగవంతుఁడట్లు భైరవాకారమున గానుపించును.

వాచ్యవాచకసంబన్ధం వినా బోధో న జాయతే
యస్మాత్తస్మాత్త్వయి మయా దృష్టమేవ ప్రవర్ణితమ్. 6

ఓ రామచంద్రా! వాచ్యవాచక సంబంధమునుగూర్చిన కల్పన లేకున్నచో బోధ జనింపదు, కావున తత్కల్పనచే ఆ నాచేగాంచఁబడిన ప్రళయ, నృత్యాదులను నేను నీకు వర్ణించిచెప్పితిని.

యదేవ వాచ్యపారూఢమేతద్రామ సదైవ తే
రూఢాధిభౌతికదృశః క్షణాన్మాయాత్మతాం గతమ్. 7

ఓ రామచంద్రా! చిరకాలాభ్యాసముచే జగత్తునందు ఆధిభౌతికదృష్టి ప్రౌఢమైయున్నట్టి నీయొక్క వాక్కునం దెయ్యది దృఢపడియున్నదో, అదియంతయు మాయా మాత్రమే యగుచు క్షణకాలములో భ్రమచే సత్యత్వమును బొందినదగుచున్నది.

న భైరవీ సా నైవాసౌ భైరవో నైవ సంక్షయః
సమస్తమేవ తద్భ్రాన్తిమాత్రం చిద్వ్యోమ భాసతే. 8

వాస్తవముగ, ఆ భైరవిగాని, భైరవుఁడుగాని, ప్రళయముగాని లేవు. అదియంతయు భ్రాంతిమాత్రమేయైయున్నది. పరమార్థమున చిదాకాశమే యట్లు భాసించుచున్నదగును.

స్వప్ననిర్మాణపురవత్సంకల్పరణవేగవత్
కథార్థసార్థరసవన్మనోరాజ్య విలాసవత్. 9

స్వప్నపుర నిర్మాణమువలెను, సంకల్ప యుద్ధవేగమువలెను, కథార్థమువలెను, మనోరాజ్య విలాసమువలెను, చిదాకాశమే యీ సమస్త రూపముచే భాసించుచున్నది.

యథా స్వప్నపురం స్వచ్ఛే వ్యోమ్ని మౌక్తికధీర్యథా
యథా కేశోణ్డ్రకం వ్యోమ్ని తథాఽచిద్భాతి చిద్ఘనే. 10

నిర్మలమగు ఆకాశమున స్వప్ననగరము, ముత్యములు, కేశాదులు భాసించువిధమున, భ్రాంతిచే చిద్ఘనమందును 'అచిత్తు' భాసించుచున్నది.

చిన్మాత్రాకాశమేవాచ్ఛం కచతి స్వాత్మనాత్మని
తథా నామ యదాభాతి తదాత్మైవ జగత్త్రయా. 11

జ్ఞానమెపుడుకలుగునో, అపుడు నిర్మలమగు చిదాకాశమే స్వయముగ తనయందు జగద్రూపముచే భాసించుచున్నదగును.

యథా చిద్వ్యోమ్ని కచతి స్వ ఏవాత్మా తథా పటే
తథా కచతి తత్రత్ర కల్పాన్తానలనర్తనే. 12

ఆత్మ చిదాకాశమందెట్లు ప్రకాశించునో అట్లే పట (వస్త్ర)మందును, కల్పాంతాగ్నియందును, నృత్యాదులందునుగూడఁ బ్రకాశించుచున్నది.

శివయోరేవమాకారో నిరాకారోఽఙ్గ వర్ణితః
అధునా శృణు తే వక్ష్యే నృత్యస్యానృతతాస్థితమ్. 13

ప్రియుఁడవగు రామచంద్రా! ఈ ప్రకారముగ భైరవీ, శివుల నిరాకారమగు ఆకారమునే నేను నీకు వర్ణించి చెప్పితిని. ఇపుడిఁక వారి నృత్యముయొక్క మిథ్యాత్వమునుగూర్చి చెప్పుచున్నాను, వినుము.

చేతనం చేతనాధాతోః కించిత్సంస్పన్దనం వినా
క్వచిత్స్థాతుం న శక్నోతి వస్త్వవస్తుతయా యథా. 14

భ్రాంతిచేఁ గాంచఁబడిన శుక్త్యాది వస్తువులు, అవస్తువులగు రజతాదుల రూపమున భాసింపక నుండజాలనట్లు (అజ్ఞాతమైన) చిన్మాత్రమగు పరమాత్మయొక్క చేతనత్వమును కించిత్ స్పందనములేక యుండఁజాలదు,

స్వభావాచ్చేతనం తస్మాద్రుద్రత్వేన తథా స్థితమ్
హేమేవ రూపకత్వేన సంనివేశవిలాసినా. 15

సువర్ణము కటకాదుల రూపమున పరివర్తితమగునట్లు, (అజ్ఞాతమగు) చైతన్యమును స్వభావముచే రుద్రరూపమున స్థితినొందియున్నది.

యన్నామ చేతనం యత్రతదవశ్యం స్వభావతః
స్పన్దధర్మి భవత్యేవ వస్తుతా హి స్వభావజా. 16

(అజ్ఞాతమగు) చైతన్యమెచటనుండునో. అచట స్వభావముగనే అయ్యది స్పంద (చలన) ధర్మము అవశ్యము కలిగియుండును. ఏలయనగా నది యద్దాని స్వభావమేయైయున్నది.

యః స్పన్దశ్చిద్ఘనస్యాస్య శివస్యాస్య స ఏవ నః
స్వవాసనావేశవశాత్ప్వయమేవ విరాజతే. 17

చిద్ఘనమై శివరూపమైనట్టి పరమాత్మయొక్క స్పందమెయ్యది గలదో, అదియే మనకు స్వవాసనావశముచే, నృత్యమొనర్చుచున్న భైరవాద్యాకారముల విలసిల్లుచున్నది.

అతః స కల్పాన్త శివో రుద్రో రౌద్రాకృతిర్ద్రుతమ్
యన్నృత్యతి హి తద్విద్ధి చిద్ఘనస్పన్దనం నిజమ్. 18

కావున ఓ రామచంద్రా! భయంకరాకృతిఁ దాల్చి శీఘ్రముగ నృత్యము సల్పుచున్నట్టి శివరూపుఁడగు రుద్రుఁడు చిద్ఘనముయొక్క నిజ స్పందమనియే యెఱుఁగుము.

శ్రీరామ ఉవాచ:—

ప్రామాణికదృశా దృశ్యమిదం నాస్త్యేవ వస్తుతః
యదేవాస్తీవతత్సర్వం కల్పాన్తే ప్రవినశ్యతి. 19
తత్కల్పాన్తమహాశూన్యే ఏతస్మిన్పరమామ్బరే
కథంచిన్నామ వా చేత్యం చేత్రా చేతతి చిద్ఘనః. 20

శ్రీరాముడు:—మహాత్మా! ప్రామాణికదృష్టిచే ఈ దృశ్యము లేనేలేదు. ఇఁక, అప్రామాణిక దృష్టియందు, దృశ్యమెయ్యది గలదో, అదియంతయు, కల్పాంతమందు నశించుచున్నది, అట్టిచో, కల్పాంతమందు మహాశూన్యమగు ఈ చిదాకాశమున చేత్య (విషయ) రహితముగ చైతన్య మెట్లుండును? ఆశ్రయాభావముచే అది చేతయిత (విషయమును ప్రకాశింపఁజేయునది) యెట్లగును? మఱియు, తనకంటె భిన్నముగనే క్రియము లేనందుచే ఆచిద్ఘనము ప్రకాశింపజేయుట యెట్లు?

శ్రీవసిష్ఠ ఉవాచ:—

ఏతదేవ తదాప్యజ్ఞద్వైతైక్యామ్భోధిశాన్తయే
యది చిన్మాత్రనభసశ్చేత్యమస్తి న కించన. 21

శ్రీవసిష్ఠుడు:— ప్రియుఁడవగు రామచంద్రా! చిన్మాత్రమగు ఆకాశమునకు ప్రళయమందు చేత్యము (విషయము) ఎద్దియు లేదని శంకించినచో నపుడున్న ద్వైత ఏకత్వముల గూర్చిన సందేహమను సముద్రముయొక్క శాంతికొఱకై యిదే ప్రత్యుత్తరమును నీవు వినుము.

న కించిచ్చేతతి తతః కించిత్కించిత్కదాచన
సర్వం శాన్తం దృషన్మౌనం విజ్ఞానఘనమమ్బరమ్. 22

యథార్థముగ నెచటను నెపుడును చేత్యముగాని చేత యితగాని లేవు. సమస్తము శాంతమై, కేవలమై ఘనీభూతమై, విజ్ఞానఘనమైనట్టి చిదాకాశమే యైయున్నది.

యచ్చేదం చేత్యతే నామ తత్స్వభావోఽస్య వల్గతి
చిత్స్వభావస్య శాన్తస్య స్వసత్తాయామవస్థితేః. 23

ఈ చేతితము కాబఁడునది (ప్రకాశింపఁబడునది) యంతయు, నిజసత్తయందున్నదగు చిత్స్వభావమే అజ్ఞాతమగుటచే జీవ జగద్రూపమున స్ఫురించుచున్నదగును.

యథా స్వప్నే చిదేవాన్తః పురపత్తనవద్భవేత్
పురాది నతు యత్కించిద్విజ్ఞానాకాశమేవ తత్. 24

ఎట్లనగా స్వప్నమందు చిత్స్వరూపమే నగరాదుల రూపమును ధరించుచున్నది. అటాదులు వాస్తవముగ లేవు. అవియన్నియు చిదాకాశమేయైయున్నవి.

ఆత్మనాత్మని చిచ్ఛూన్యం జ్ఞాత్వా చ జ్ఞేయమప్యలమ్
తథా చ సర్గాదారభ్య వేత్తి స్వం కచనం చ తత్. 25

చైతన్యము జ్ఞేయము (దృశ్యము) నంతయు బాగుగ నెఱింగియున్నను తనయందు జ్ఞేయరహితముగనే వెలయుచున్నది. మఱియు నయ్యది సృష్టినుండి మొదలుకొని ప్రళయము వఱకుగల తన స్ఫురణము నంతయును నెఱుఁగుచున్నది.

స్వయమన్తః కచన్తీ చిత్స్వభావాకాశకోటరే
క్షణకల్పజగద్భ్రాన్తిం ధత్తే కల్పనయా స్వయా. 26

ఈ చైతన్యము తనయొక్క చిత్స్వభావాకాశమను కోటరమున స్వయముగ ప్రకాశించి, తనయొక్క కల్పనచేతనే క్షణ, కల్ప, జగత్తులఁగూర్చిన భ్రాంతిని ధరించుచున్నది.

స్వయమన్తః కచత్కాన్తిశ్చిదాకాశః స్వభావఖే
అయం సోఽహమయం చ త్వం కరోతీత్యాదికల్పనమ్. 27

మఱియు, యీ తేజోమయమగు చైతన్యము తనయొక్క చిత్స్వభావాకాశమున స్వయప్రకాశించుచు 'వీఁడు, వాఁడు, నేను, నీవు' మున్నగు కల్పనలను గావించుచున్నది.

తస్మాన్న ద్వైతమస్తీహ న చైక్యం న చ శూన్యతా
న చేతనాచేతనం వై మౌనమేవ న తచ్చ వా. 28

కావున వాస్తవముగ నిట ద్వైతముగాని, ఏకత్వముగాని, శూన్యత్వముగాని, చేత్యము చేతయితగాని, మౌనముగాని, అమౌనముగాని లేవు. కేవలము చిన్మాత్రమేగలదు.

న చేతతి క్వచిత్కించిత్కశ్చిచ్చేత్యాత్మభావతః
తేన చేత్రాపి నాస్తీవ మౌనమేవావశిష్యతే. 29

చేత్యము (అధిష్ఠానదృష్టిచే) చిద్రూపముకంటె వేఱుకానందున, వాస్తవముగ చైతన్యముడును నెచటను నెద్దానిని చేతిత (ప్రకాశిత) మొనర్చుటలేదు. ఇక్కారణమున చేతయితకూడ లేనిదియగును. (చేత, చేతయితలు రెండును యథార్థముగ మిథ్యయని భావము). కావున మౌనమగు చైతన్యమే శేషించుచున్నది.

నిర్వికల్పసమాధిర్హి సిద్ధాన్తః సర్వవాఙ్మయే
తచ్చ జీవదృషన్మౌనం తూష్ణీమేవాత ఆస్యతామ్. 80

ఓ రామచంద్రా! సమస్త వాఙ్మయ ప్రపంచమందును నిర్వికల్పసమాధియే సిద్ధాంతమై యున్నది. అట్టి సమాధిజీవునియొక్క - శిలవలె నిశ్చలమై, శాంతమైనట్టి మౌనావస్థయేయై యున్నది. కాఁబట్టి నీవాత్మయందు మౌనముగ నెలకొనియుండుము.

కుర్వన్నిజం ప్రకృతమేవ యథా ప్రవాహ
మాచారజాలమచలః పరమార్థమౌనాత్
నిర్మానమోహమదభేదమనఙ్గజీవ
మాకాశకోశవిశదాశయశాన్తమాస్వ. 81

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే విశ్వరూపదర్శనం
నామ త్ర్యశీతితమః సర్గః ॥ 83 ॥

ఓ రామచంద్రా! నీవు లోకదృష్టిచే ప్రస్తుత రాజ్యపరిపాలనాది ఆచారములను పితృపితామహాదులనుండి ప్రాప్తించిన క్రమములనుబట్టి చేయుచు స్వదృష్టిచే పరమార్థ మౌనముతోఁ గూడినవాడవై అభిమాన మోహాదులఁ ద్యజించి, ఆకాశమువలె నిర్మలుఁడవై, ఏ విక్షేపమున్ను లేక నిశ్చలముగ ఆత్మయందు స్థితిగల్గియుండుము.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున
నుత్తరార్థమున పాషాణోపాఖ్యానమున విశ్వరూపదర్శన
మను నెనుబది మూడవ సర్గము ॥ 83 ॥

చతురశీతితమః సర్గః

[శివశక్త్యోర్నిజం రూపం వివిచ్యాత్రోపవర్ణ్యతే
శూర్పాదిమాలారూపం చ సత్యాసత్యావిమర్శతః,

వివేచించి శివ. శక్తుల నిజరూపము తెలుపఁబడుటయు. సత్యాసత్యముల విమర్శచే శూర్పాదులతోఁగూడిన మాలయొక్క వాస్తవరూపము వచింపఁబడుటయు నిట గాననగును.]

శ్రీరామ ఉవాచ :—

అనన్తరం మునే బ్రూహి కాలీ కిమివ నృత్యతి
కిం శూర్పఫలకుద్దాలముసలాదిస్రజాఽఽవృతా. 1

శ్రీరాముఁడు:—ఓ మునీంద్రా! ఇంక ఆకాళి, శూర్ప (చాట) ఫలాదులతోఁగూడిన మాల నెందులకు ధరించుచున్నదియు, ఏ కారణముచే నృత్యమొనర్చుచున్నదియు వచింపఁగోరెద.

శ్రీవసిష్ఠ ఉవాచ :—

స భైరవశ్చిదాకాశః శివ ఇత్యభిధీయతే
అనన్యాం తస్య తాం విద్ధి స్పన్దశక్తిం మనోమయీమ్. 2

శ్రీ వసిష్ఠుఁడుః— ఓ రామచంద్రా! ఆ భైరవుఁడు చిదాకాశమగు శివరూపుఁడని చెప్పఁబడుచున్నాడు. ఆ కాళీదేవిని అతనికంటె వేఱుకానిదిగను ఆతని స్పందశక్తిగను, మనోమయ రూపిణిగను నెఱుఁగుము.

యథైకం పవనస్పన్దమేకమౌష్ణ్యానలౌ యథా
చిన్మాత్రం స్పన్దశక్తిశ్చ తథైవైకాత్మ సర్వదా. 3

వాయువు అద్దాని స్పందమున్ను, అగ్ని అద్దాని యుష్ణత్వమున్ను నొకేపదార్థములగునట్లు చిన్మాత్రములు, అద్దాని స్పందశక్తియు సదా యేకరూపమేయగును,

స్పన్దేన లక్ష్యతే వాయుర్వహ్నిరౌష్ణ్యేన లక్ష్యతే
చిన్మాత్రమమలం శాన్తం శివ ఇత్యభిధీయతే. 4

తత్స్పన్దమాయాశక్త్యైవలక్ష్యతే నాన్యథా కిల
శివం బ్రహ్మవిదుః శాన్తమవాచ్యం వాగ్విదామపి. 5

స్పందముచే వాయువున్ను, ఉష్ణత్వముచే నగ్నియు నెఱుఁగఁబడునట్లు చిన్మాత్రరూపుఁడై శాంతుఁడైనట్టి శివుఁడున్ను, స్పందరూపమగు మాయాశక్తిచేతనే యెఱుఁగఁబడునుగాని అన్యథా కాదు. ఆ శివుఁడు బ్రహ్మముకంటె వేఱుకాఁడు. ఏలయనిన, శ్రుతులన్నియును బ్రహ్మవిదులందఱున్ను శివునే బ్రహ్మముగ వచించుచున్నారు,

స్పన్దశక్తిస్తదిచ్ఛేదం దృశ్యాభాసం తనోతి సా
సాకారస్య నరస్యేచ్ఛా యథా వై కల్పనాపురమ్. 6

సాకారమైన మనుజుని యిచ్ఛ నిరాకారమై, కల్పనామయమైనట్టి నగరమును నిర్మించునట్లు, శివుని స్పందశక్తియైన ఇచ్ఛారూపిణియగు ఆ కాళి యీ దృశ్యమును విస్తరింపఁజేయుచున్నది,

కరోత్యేవ శివస్యేచ్ఛా కరోతీదమనాకృతేః
సైషా చితిరితి ప్రోక్తా జీవనాజ్జీవితైషిణామ్. 7

ప్రకృతిత్వేన సర్గస్య స్వయం ప్రకృతితాం గతా
దృశ్యాభాసానుభూతానాం కరణాత్సోచ్యతే క్రియా. 8

వడవాగ్నిశిఖాకారాచ్ఛోషాచ్ఛుష్కేతి కథ్యతే
చణ్డిత్వాచ్చణ్డికా ప్రోక్తా సోత్పలోత్పలవర్ణతః 9

జయా జయైకనిష్ఠత్వాత్సిద్ధా సిద్ధిసమాశ్రయాత్
జయన్తీ చ జయా ప్రోక్తా విజయా విజయాశ్రయాత్. 10

ప్రోక్తా పరాజితా వీర్యాద్దుర్గా దుర్గ్రహరూపతః

ఓంకారసారశక్తిత్వాదుమేతి పరికీర్తితా. 11

గాయత్రీ గాయనాత్మత్వాత్సావిత్రీ ప్రసవస్థితేః
సరణాత్సర్వదృష్టీనాం కథితైషా సరస్వతీ. 12

గౌరీ గౌరాఙ్గదేహత్వాద్భవదేహానుషఙ్గిణీ
సుప్తానామథ బుద్ధానామాత్రోచ్చారణాద్ధృది. 13

నిత్యం త్రైలోక్యభూతానాముమేతీన్దుకలోచ్యతే

నిరాకారమైనట్టి శివుని యిచ్ఛయే యీ జగత్తును నిర్మించుచున్నది మఱియు సర్వజీవులయొక్క జీవనహేతువగుటచే ఆ యిచ్ఛారూపిణి జీవచైతన్యమనియు వచింపఁబడినది. స్వయముగ జగద్రూపమున పరిణామమొందుటచే నామె ప్రకృతిరూపత్వమును బొందుచున్నది. దృశ్యాభాసములందనుభూతములగు ఉత్పత్త్యాది వికారములఁ గావించుటఁబట్టి యా భగవతి క్రియయనియుఁ జెప్పఁబడుచున్నది. అట్లే బడబాగ్నియొక్క శిఖను బోలిన శుష్కమాంసమును ధరించుటచే నామె (పురాణాదులందు) శుష్కయనియు, దుష్టులపైఁ గోపగించుటచే చండికయనియు, నీలకమలవర్ణము గలిగియుండుటచే సోత్పలయనియు, జయతత్పర యగుటచే జయయనియు, సిద్ధుల ఆశ్రయమగుటచే సిద్ధయనియు, విజయమున కాశ్రయమగుటచే జయయనియు, జయంతి యనియు, విజయ యనియు, మహా పరాక్రమశీల యగుటచే 'అపరాజిత' యనియు, గ్రహించుటకు కష్టసాధ్యమగుటచే దుర్గయనియు, ఓంకారముయొక్క సారమైనట్టి శక్తియగుటచే 'ఉమ' యనియు, జపించువారికి పరమపురుషార్థ మొసంగుటచే గాయత్రియనియు, సంతతియొక్క స్థితికి కారణమగుటచే సావిత్రి యనియు, కర్మోపాసనాజ్ఞానాది దృష్టులను ప్రసరింపఁజేయుటచే సరస్వతియనియు, గౌరవర్ణపు దేహముతోఁ గూడియున్నందున గౌరియనియు, జగదుత్పత్తికి కారణభూతుఁడగు భవుని (మహేశ్వరుని దేహసంగిని యగుటచే భవానియనియు, నిద్రించునట్టియు, మేల్కొనినట్టియు త్రైలోక్యమందలి ప్రాణులయొక్క హృదయమందు, అకార, ఉకార, మకారముల కతీతమైనట్టి, ప్రణవనాద భాగమగు శబ్దబ్రహ్మమును, సర్వదా యుచ్చరించుటచే ఇందుకళారూపిణియగు ఉమయనియు వచింపఁబడుచున్నది.

శివయోర్వ్యోమరూపత్వాదసితం లక్ష్యతే వపుః. 14

నభో హి మాంసమేతాభ్యాం దృష్టికృష్టం విలోక్యతే
అస్తి నభో నభస్యేవ తా నభోనభసి స్థితా. 15

శివుఁడున్ను, కాళియు ఆకాశరూపులగుటచే వారిరువురి శరీరమున్ను శ్యామవర్ణయుతమై యొప్పుచున్నది. వాస్తవముగ చిదాకాశరూపులేయైయున్నను, సృష్టి సంకల్పదృష్టిచే వారి శరీరము మాంసమయమగు శరీరమువలె శ్యామవర్ణయుక్తముగను, ఆకాశమువలెను గాంచఁబడుచున్నది. ఆకాశము ఆకాశమందే వెలయుచున్నది. కావున, ఆకాశరూపులగు వీరిరువురును ఆకాశమందే స్థితిగల్గియున్నారు.

నభోనిభావభూతాఙ్గావచ్ఛౌ వ్యోమ్న ఇవాగ్రజౌ
హస్తపాదాస్యమూర్ధౌఘైర్యద్బహుత్వాల్పత్వభేదతః. 16

ఆదిస్వరూపులగు వీరిరువురున్ను అతిస్వచ్ఛములైన యంగములు గల్గియుండుటచేతను వారిని ఆకాశరూపులుగ నెఱుఁగనగును. హస్త, పాద, ముఖ, శిరసాదులయొక్క బహుత్వ, అల్పత్వ భేదములతోగూడిన నానాత్వము గల్గియున్నను వాస్తవముగ వారు ఏకరూపులే యగుదురు.

నానాత్వం హలశూర్పాదిస్రగ్ధరత్వం చ తచ్ఛృణు
సా హి క్రియా భగవతీ పరిస్పన్దైకరూపిణీ. 17

దద్యాత్స్నాయాచ్చ జుహుయాదిత్యాద్యగ్రశరీరిణీ
చితిశక్తిరనాద్యన్తా తథా భాతాత్మనాత్మని. 18

సాకాశరూపిణీ కాన్తా దృశ్యశ్రీః స్పన్దధర్మిణీ
దేవ్యాస్తస్యా హి యాః కాల్యా నానాభినయనర్తనాః. 19

తా ఇమా బ్రహ్మణః సర్గజరామరణరీతయః
క్రియాసా గ్రామనగరద్వీపమణ్డలమాలికాః. 20

స్పన్దాన్కరోతి ధత్తేఽన్తః కల్పితావయవాత్మికా

ఓ రామచంద్రా ! అ దేవి శూర్పాదులతోఁగూడిన మాల నెందులకు ధరించుచున్నదో కారణమును వినుము. ఆ భగవతి అనాదియు, అనంతమునైనట్టి చిత్ - శక్తిరూపిణియైయున్నను, స్వేచ్ఛచే స్వయముగ సర్వవైదిక క్రియారూపిణియై, వేదరహితములైన దానస్నానయాగాది రూపమైన శ్రేష్ఠశరీరముగలదియాయెను. కావున, ఆ దేవియొక్క నానాప్రకారములైన అభినయములతోఁగూడిన నర్తనములెవ్విగలవో, అవియే బ్రహ్మదేవుని సృష్టియొక్క కర్మఫలరూపములైన జరామరణాదిరీతులగును. మఱియు రూపరహితకు క్రియ అప్రసిద్ధమగుటచే నామె కల్పితహస్తపాదాద్యవయవ సహితయై, గ్రామనగర, ద్వీప, మండల సమూహములను శరీరమందు ధరించి వానిచేఁడన క్రియారూపత్వమును బ్రకటిత మొనర్చుచున్నది.

కాలీ కమలినీ కాలీ క్రియా బ్రహ్మాణ్డకాలికా. 21

ధత్తే స్వావయవీభూతాం దృశ్యలక్ష్మిమిమాం హృది
న కదాచన చిద్దేవీ నిర్దేశ్యావయవా క్వచిత్. 22

ధారణాది సర్వక్రియా వాచియగు 'కల' ధాతువునుండి 'కాలీ' శబ్దముత్పన్నమైనగుటచేతను ఆకాళిభగవతి బ్రహ్మాండ రూపములగు బీజకోశములను తనయందు ధరించి వానియుత్పత్తి, పాలనాది క్రియలనుసల్పుచు; స్వయముగ తత్క్రియా రూపిణియై, కమలపు లతవలె శ్యామలాంగియై యొప్పుచు, తనయొక్క పుష్పాద్యవయవరూపమగు పృథివ్యాది దృశ్యశోభను తన హృదయమున ధరించుచున్నది. ఇట్లు జగత్తు తన అవయవముగా గల్గియున్నను పరమార్థమున చిద్రూపిణియగు ఆ దేవి యెచటను నెపుడును అవయవసహితయై యుండలేదు.

శివత్వా వ్యతిరేకేణ శివత్వైవం విదృశ్యతామ్
యథాఙ్గ శూన్యతా వ్యోమ్నః స్పన్దనం మాతరిశ్వనః. 23

జ్యోత్స్నాయాశ్చైత్యమేవం హి దృశ్యమఙ్గం చితేః క్రియా
శివం శాన్తమనాయాసమవ్యయం విద్ధి నిర్మలమ్. 24

ఓ రామచంద్రా! శివునికంటె వేఱుగ లేనందుచే నీమెను శివరూపిణిగనే యెఱుగుము. మఱియు, ఆకాశమునకు శూన్యత్వమున్ను, వాయువునకు స్పందమున్ను, చంద్రికకు ప్రకాశమున్ను అంగమైనట్లు, ఈ క్రియారూపమగు దృశ్యమున్ను నామె కంగమై యొప్పుచున్నది. కాని, వాస్తవముగ, శివమై, శాంతమై, స్వభావసిద్ధమై, అవ్యయమై, నిర్మలమైనట్టి చైతన్యమే యామెయొక్క స్వరూపమని యెఱుఁగుము.

న మనాగపి తత్రాస్తి స్తైమిత్యం స్పన్దధర్మతా
సా క్రియైవ తథారూపా సతీ బోధవశాద్యదా. 25
వ్యావృత్త్యైవ తథైవాస్తే శివ ఇత్యుచ్యతే తదా

ఆ చైతన్యమున నొకింతైనను స్పంద ధర్మముగాని, అస్పంద (నిశ్చల) ధర్మముగాని లేదు. అజ్ఞానవశముచే ఆ చైతన్యమే క్రియారూపముగ భాసించును. జ్ఞానవశముచే నెపుడయ్యది తనక్రియా స్వభావమునుండి తొలఁగి వాస్తవ స్వభావముతోటి వర్తిల్లునో అపుడదియే శివరూపమని వచింపఁబడును.

చితిశక్తేః క్రియాదేవ్యాః ప్రతిష్ఠానం యదాత్మని. 26
యథా భూతస్థితేరేవ తదేవ శివ ఉచ్యతే

కూటస్థ చైతన్య శక్తిరూపిణియైన దేవియొక్క తనయందు స్పంద. జడభావములతోటి యుండుట యేదిగలదో, అదియే క్రియ యనఁబడును. తన స్వాభావిక చిన్మాత్ర స్వభావముతోటి యుండుట యేదిగలదో, అదియే శివరూపమనఁబడును.

దేవ్యాః క్రియాయాశ్చిచ్ఛక్తేః స్వరూపిణ్యా మహాకృతేః. 27
కల్పితాకారధారిణ్యా అనన్యావయవా ఇమే
సర్గాఃసజ్జనతావర్గా లోకా ఆలోకభాస్వరాః. 28

క్రియారూపిణియు, చిత్ - శక్తియు, మహాకారవతియు, కల్పితాకార ధారిణియునగు ఆ దేవికి జనసమూహయుక్తములై ప్రకాశయుతములైనట్టి యీ సృష్టులున్ను, లోకములున్ను, అభిన్నములైన అవయవములైయున్నవి.

సద్వీపసాగరాః పృథ్వ్యాః సవనావనయోఽద్రయః
సాఙ్గోపాఙ్గాస్త్రయో వేదాః సవిద్యాస్థానగీతయః. 29
సవిధిప్రతిషేధార్థాః సశుభాశుభకల్పనాః
సదక్షిణాగ్నయో యజ్ఞాః పురోడాశాద్యశంసినః. 30
భూపాలోలూఖలబృసీశూర్పయూపాదిసంయుతాః
సంగ్రామాః సాయుధగ్రామాః సశూలశరశక్తయః. 31

స భుశుణ్డి గదాప్రాసహయేభభటభాసురాః
జ్ఞాతయో భూతసంఘానాం చతుర్దశ సురాదికాః
చతుర్దశాబ్ధిద్వీపోర్వ్యాస్తథా లోకాశ్చతుర్దశ. 32

ద్వీప, సముద్రసహితమగు పృథివి, వనభూములు, పర్వతములు, సాంగోపాంగములైన మూఁడు వేదములు, విద్యాస్థానయుక్తములగు సర్వగీతములు, విధినిషేధములతోఁగూడిన శుభాశుభకల్పనలు, దక్షిణాగ్ని సహితములగు సర్వ యజ్ఞములు, భక్ష్యరూపమగు పురోడాశము, రాజసమూహము ముసల, ఉలూఖల, శూర్ప, యూపాదిసహితమగు సర్వయజ్ఞపాత్రలు, శూల, శక్తి, బాణాద్యాయుధ సహితములగు సమస్తసంగ్రామములు, గద ప్రాస (ఈటె), అశ్వ గజ, యోధసమూహము. ప్రాణికోట్లయొక్క దేవతాది (పదునాల్గు) జాతులు, సప్తసముద్రములు, సప్తద్వీపములు, పదునాల్గులోకములు—ఇవియన్నియు ఆ కల్పితాకార ధారిణియగు దేవియొక్క అభిన్నములైన అవయవములైయున్నది.

శ్రీరామ ఉవాచః —

చితేః కల్పాః శరీరిణ్యాః సర్గా యేఽగ్జే స్థితాస్తథా
తే కిమాత్మని తిష్ఠన్తి ఉతాసత్యా వదేతి భోః. 33

శ్రీరాముడు :—ప్రభూ! రుద్ర, కాళీరూపధారిణియగు చైతన్యముయొక్క శరీరముఁ ప్రళయ సమయమందుగల ఏ యనేక భూత భవిష్యత్కాల సృష్టిప్రళయములఁ గూర్చి తామ వర్ణించియుంటిరో, అవి వాస్తవముగ ఆత్మయందున్నవా, లేక అసత్యములా, వచింప ప్రార్థన,

శ్రీ వసిష్ఠ ఉవాచః—

రామాసౌ కిల చిచ్ఛక్తిస్తయా యచ్చోదితం తథా
తత్ప్రచేతితమేవాతః సత్యం చేదమివాఖిలమ్. 34

శ్రీ వసిష్ఠుఁడు.— ఓ రామచంద్రా! సత్యసంకల్పరూపిణియగు ఈచిత్ శక్తి జీవుల కర్మవాసనానుసార మెపుడెట్లు దేనిఁగూర్చి ప్రేరణచేయునో, అపుడవ్విధముగనే యాజీవులద్దానిని సత్యముగగాని అసత్యముగ గాని యనుభవింతురు.

తత్ప్రతిబిమ్బితం బాహ్యన్ముకురప్రతిబిమ్బవత్
సత్యం తదన్తరేవాస్తి చితేర్నాసత్యమర్థతః. 35

అద్దమునందలి ప్రతిబింబమువలె బాహ్యపదార్థములు పూర్వవాసనాది కారణములచే చైతన్యమున సత్యరూపములుగనే ప్రతిబింబితములై యందున్నవిగాని అసత్యరూపములుగగాదు.

చిద్రూపస్య తథాప్యన్తః సత్సంకల్పపురం భవేత్
దృఢధ్యానాద్విశుద్ధాయాశ్చితేర్భవతు సా కథమ్. 36

అట్లు వాసనాయుతులగు జీవుల యనుభవబలముచే నవి సత్యములైయున్నప్పటికిని యథార్థముగ చిద్రూపమందు అచిద్రూపము ప్రవేశించుట అసంభవముగాన, ఆయాదృశ్యపదార్థము

లన్నియు సంకల్పనగరమువలె మిథ్యయే యగును. కాఁబట్టి దృఢధ్యానముచే వాసనలు క్షయించినట్టి విశుద్ధచిత్తునకిఁక దృశ్యప్రసక్తియే యెట్లుండఁగలదు?

ఆదర్శేష్వథవా స్వప్నే సర్గః సంకల్పనేఽస్తు వా
న ఆత్మనర్థ్యకారిత్వాత్సత్య ఇత్యేవ మే మతిః. 37

ప్రతీతిమాత్రముచే అద్దమునందలి ప్రతిబింబము, స్వప్న సంకల్ప సృష్టులు, అజ్ఞాన దృష్టిచే నాసమయమున సత్యములుగనే తోచునట్లు, ఈ సృష్టియున్ను దానిని గాంచు కాలమున ఆత్మయందు అర్థక్రియాసమర్థమగుటఁబట్టి యట్టిస్థితియందు సత్యమనియే నాయభిప్రాయము.

మమ నార్థాయ స ఇతి వక్షి చేత్తత్కథం భవేత్
దేశాన్తరగతాః సర్వే భవన్త్యర్థాయ సంప్రతి. 38

'స్వప్న, ప్రతిబింబాదులందలి పదార్థములు నాయొక్క బాహ్యములగు అర్థక్రియ లొనర్చుట యందెట్లు సమర్థమగున'ని, యందువేని, దేశాంతరమందున్న ఘటాది పదార్థములు నీయొక్క గృహమందలి జలానయనాది కార్యములొనర్చుటయందు సమర్థములై యున్నవా వచింపుము?

యథా దేశాన్తరగ్రామ స్తద్గతస్యార్థకృద్భవేత్
సర్వే తథైవ తద్భావం గతస్యార్థవినిశ్చయాత్. 39

దేశాంతరమందున్న గ్రామ మాదేశమును బొందిన మనుజునియొక్క ప్రయోజనమునే సిద్ధింపజేయునట్లును. స్వప్నపదార్థములు స్వప్నదశను బొందినవానికే అర్థక్రియా సమర్థములగు నట్లును, ఆయాభావమును బొందినవానికే ఆయాపదార్థములన్నియు సత్యములుగను, అర్థక్రియా సమర్థములుగను నగుననుట నిశ్చయము.

యద్యథాభూతసర్వార్థక్రియాకారి ప్రదృశ్యతే
తత్సత్యమాత్మనోఽన్యస్య నైవా తత్తాముపేయుషః. 40

ఏ పదార్థ మేద్రష్టను అర్థక్రియా సమర్థమగుచున్నదో, అయ్యది యాతని దృష్టియందే సత్యమగునుగాని, అట్టి ద్రష్టృస్థితిని బొందని యన్యునిదృష్టియందుఁగాదు.

తస్మాచ్చిచ్ఛక్తికోశస్థాః సర్వాః సర్గపరమ్పరాః
సత్య ఆత్మేతి తద్భావం గతస్యాన్యస్య నాఖిలాః. 41

కాబట్టి చిత్-శక్తియొక్క కోశమందున్న దృష్టిపరంపరలన్నియునాయాభావమును బొందిన ఆత్మ (ద్రష్టి) యొక్క సృష్టియందే సత్యములై యుండునుగాని అన్యమగు ఆత్మకుఁగాదు.

భూతభవ్యభవిష్యస్థాః సంకల్పస్వప్నపూర్గణాః
సర్వే సత్యా పరం తత్త్వం సర్వాత్మా కథమన్యథా. 42

భూత భవిష్యద్వర్తమానములందలి పదార్థసమూహమున్ను, స్వప్న, సంకల్ప నగరాదులున్ను సమస్తము, ఆయాదశలందు సత్యమేయగును. అట్లుకానిచో, ఆత్మతత్త్వము సర్వ రూపు మెట్లగును?

ప్రాప్యన్తే యోగసిద్ధేన తద్భావం తు గతేన తే
అన్యేన పర్వతా గ్రామా గత్వా దేశాన్తరే యథా. 43

కావుననే యోగులు ఇతరుల స్వప్నములందుఁ బ్రవేశించియు, పరకాయప్రవేశాదుల ద్వారా ఆ యామనుజుల మనోభావమును బొందియు ఆయాపదార్థములను దేశాంతరమందలి పర్వత గ్రామాదుల నట కేతెంచుటచే ననుభవించువిధమున అనుభవించుచున్నారు.

చాలితస్య యథా గాఢనిద్రస్య స్వప్నపత్తనమ్
న లుఠత్యేవ లుఠితమిత్యప్యనుమతం స్ఫుటమ్. 44

తథా చలన్త్యా లుఠితం తస్యా దేహగతం జగత్
న లుఠత్యేవ ముకురప్రతిబిమ్బమివ స్థితమ్. 45

గాఢనిద్రను బొందియున్న మనుజుని శయ్యను మెల్లగ మఱియొకచోటికిఁ గొనిపోయినను అతని స్వప్నమందలి నగరాదులు చలింపకయేయుండుట ప్రసిద్ధమైయున్నట్లు, నృత్యమందు కాళీభగవతియొక్క దేహము చలించినను, అద్దమందలి ప్రతిబింబమువలె ఆమెయొక్క శరీర మందున్న జగత్తు చలింపకయే యున్నది.

స త్రైలోక్యమహారమ్భః సత్యోఽపి భ్రాన్తిమాత్రకమ్
భ్రాన్తిమాత్రస్య కే నామ లుఠనాలుఠనే వద. 46

ఓ రామచంద్రా! ఈ త్రైలోక్యమను మహారంభము, అట్టిదశయందున్న మనుజులకు సత్యముగాఁదోచినను వాస్తవముగభ్రాంతిమాత్రమే యైయున్నది. భ్రాంతిమాత్రమైన దానియొక్కయిఁక చలనమేమి? అచలనమేమి? వచింపుము!

కదా స్వప్నపురం సత్యం కదా స్వప్నపురం ముధా
కదా స్వప్నపురం భగ్నం కదా స్వప్నపురం స్థితమ్. 47

స్వప్నపురము సత్యముగానున్న దెపుడు, మిథ్యగా నున్న దెపుడు? నశించిన దెపుడు, స్థితినొందయున్న దెపుడు? చెప్పుము?

భ్రాన్తిత్వం కేవలం సైవ దృశ్యశ్రీర్యావదగ్రగా
త్వం విద్ధీమామపి భ్రాన్తిం జగల్లక్ష్మీమవాసవీమ్. 48

ఓ రామచంద్రా! ఈయెదుటనున్నట్టి దృశ్యశోభయంతయు కేవలము భ్రాంతిమాత్రమే యైయున్నది. కావున ఈజగత్-శోభనంతయు నీవు భ్రాంతి మాత్రముగను, అవాస్తవముగను నెఱుఁగుము.

సంకల్పనే మనోరాజ్యే స్వప్నే సంకథనే భ్రమే
యథా పురానుభవనం త్రైలోక్యానుభవం తథా. 49

ఓ రామచంద్రా! సంకల్పమందును, మనోరాజ్యమందును, స్వప్నమందును, కథాదులందును, భ్రమయందును గలుగునగరాదుల యనుభవమువంటిదే, యీత్రైలోక్యానుభవము గూడనని తెలిసికొనుము,

అహమితి జగదితి నాన్తర్భ్రాన్తిరియం ప్రకచతీవ చితః
పరమాకాశకృశాఖ్యా శామ్యతి నిపుణం పరిజ్ఞాతా. 50

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే శివశక్తివర్ణనం
నామ చతురశీతితమః సర్గః ॥ 84 ॥

ఓ రాఘవా! వాస్తవముగ చైతన్యమందు 'నేను జగత్తు' ఇత్యాదివ్యవస్థ లేనేలేదు. ఆకాశమందలి కృశత్వమువలె, చిదాకాశమం దియ్యది భ్రాంతిమాత్రమైయున్నది, కావున చిత్స్వరూపమును బాగుగ నెఱుగుటచే ఈ భ్రాంతి శమించిపోవుచున్నది.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
పాషాణోపాఖ్యానమున శివశక్తివర్ణనమను
నెనుబది నాల్గవ సర్గము ॥ 84 ॥

పఞ్చాశీతితమః సర్గః

[దేవ్యాస్తథా ప్రనృత్యన్త్యా దృష్ట్వా స్పృష్ట్వా చ తం శివమ్
ప్రేమ్ణా తదఙ్గే విలయాదేకీభావోఽత్ర వర్ణ్యతే.

అట్లు నృత్యము చేయుచున్న దేవి శివునిగాంచి యాతనిని స్పృశించి ప్రేమచే నాతని శరీరమునలయించి యేకీభావము నొందుట యిచట వర్ణింపబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఇతి నృత్యతి సా దేవీ దీర్ఘదోర్దణ్డమణ్డలైః
పరిస్పన్దాత్మకైర్వ్యోమ కుర్వాణా ఘనకాననమ్. 1

శ్రీవసిష్ఠుఁడు :— ఓ రామచంద్రా! ఈప్రకారముగ చలించు దీర్ఘభుజమండలముచే నాకసమును భీకరారణ్యముగ గావించుచు ఆదేవి నృత్యము సల్పుచుండెను.

క్రియాసా నృత్యతి తథా చితిశక్తిరనామయా
అస్యా విభూషణం శూర్పకుద్దాలపటలాదికమ్. 2

శరశక్తిగదాప్రాసముసలాది శిలాది చ
భావాభావపదార్థౌఘ కలాకాలక్రమాది చ. 3

అజ్ఞాతనిర్వికార చైతన్యశక్తియైన క్రియారూపిణియగు ఆదేవియట్లు స్వభావముగనే నృత్యము చేయుచుండెను. శూర్ప, కుఠారాదులున్ను, శర, శక్తి, గదా, కుంత, ముసల, శిలాదులున్ను, భావాభావరూప పదార్థసమూహమున్ను, కళా, క్షణ, ఘటిక, మాసాది కాలక్రమమున్ను నామెయొక్క యా భూషణములై యొప్పుచుండెను.

చిత్స్పన్దోఽన్తర్జగద్ధత్తే కల్పనేవ పురం హృది
సైవ వా జగదిత్యేవ కల్పనైవ యథా పురమ్. 4

స్వప్న, మనోరాజ్యాదులందు కల్పనయే హృదయమున నగరాద్యాకారముల ధరించునట్లు చైతన్యస్పందరూపిణియగు ఆ భగవతి తనయందు జగత్తును ధరించుచున్నది. లేక, కల్పనయే జగద్రూపమగునట్లు, ఆ దేవియే జగద్రూపమైయునున్నది.

పవనస్య యథా స్పన్దస్తథైవేచ్ఛా శివస్య సా
యథా స్పన్దోఽనిలస్యాన్తః ప్రశాన్తేచ్ఛస్తథా శివః. 5

వాయువునందు స్పందమువలె, శివునియందు ఇచ్ఛారూపిణియగు ఆ భైరవీదేవి కలదు. స్పందము వాయువుకంటె వేఱుకానట్లు, ఆ శివేచ్ఛయు శివునికంటె వేఱుకానందున శివునివలెనే నిర్మలమై, ప్రశాంతమై వర్తించుచున్నది.

అమూర్తో మూర్తమాకాశే శబ్దాడమ్బరమానిలః
యథా స్పన్దస్తనోత్యేవం శివేచ్ఛా కురుతే జగత్. 6

నిరాకారమైనను వాయువు ఆకాశమందు శబ్ద, సంచలనాది ఆడంబరమును గావించునట్లు, నిరాకారమైనను శివేచ్ఛ జగత్తును విస్తరింపఁజేయుచున్నది.

నృత్యన్త్యాథ యదా తత్ర తథా తస్మిన్పరామ్బరే
కాకతాలీయయోగేన సంరమ్భవశతః స్వయమ్. 7

నికటస్థః శివః స్పృష్టః స మనాగ్రభమన్తికమ్
వాడవోఽగ్నిః స్వనాశాయావహన్త్యేవామ్బులేఖయా. 8

అట్లు చిదాకాశమున నృత్యమొనర్చుచు ఆదేవి కాకతాళీయ యోగముచే ప్రేమవశమున సమీపముననున్నట్టి శివుని స్పృశింప, తత్స్పర్శమాత్రముచే ఆవరణశక్తిని దూరీకరించినదై, స్వవినాశము కొఱకై బడబాగ్నిని స్పృశించు సముద్ర ప్రవాహజలమువలెఁ గ్రమముగ తన రూపమును గోల్పోవుచు శివునియందైక్యము గాఁజొచ్చెను.

స్పృష్టమాత్రే శివే తస్మింస్తతః పరమకారణే
ప్రవృత్తా ప్రకృతిం గన్తుం సా శనైస్తనుతాం తథా. 9

అనన్తాకారతాం త్యక్త్వా సంపన్నా గిరిమాత్రికా
తతో నగరమాత్రాసా తతశ్చ ద్రుమసున్దరీ. 10

తతో వ్యోమసమాకారా శివస్యైవాకృతిం తతః
సా ప్రవిష్టా సరిచ్ఛాన్తసంరమ్భేవ మహార్ణవమ్. 11

అట్లా పరమకారణమగు శివుని స్పర్శించి నంతమాత్రముచే నాపె మెల్లగ సూక్ష్మమగుచు తన వాస్తవ స్వభావమును బొందఁదొడఁగెను. మొదట తన యనంతాకారమును వీడి యాదేవి పర్వతాకార మాత్రముగను, ఆ పిదప నగరాకారమాత్రముగను నాయెను. అటుపిమ్మట, వృక్షమువలె సౌందర్యవతియగు ఆమె వృక్షాకారమాత్రముగనయి, తదుపరి అవ్యాకృతాకాశరూపమును ధరించి, అనంతరము వేగమును త్యజించి నది మహాసముద్రమునఁ బ్రవేశించునట్లు, శివుని యాకారమందుఁ బ్రవేశించెను,

ఏక ఏవాభవదథో శివయా పరివర్జితః
శివ ఏవ శివః శాన్త ఆకాశే శమనోఽఖితః. 12

అత్తఱి భవానీరహితుఁడై, సర్వసంహారకర్తయు, శాంతుఁడును, భక్తులందఱికిని మంగళ ప్రదుఁడును, సర్వోపద్రవ వినాశకుఁడును, అద్వైతరూపుఁడునగు శివుఁడొకఁడు మాత్రమే యాకాశమందంతట నొప్పుచుండెను.

శ్రీరామ ఉవాచః—

భగవఞ్ఛ్వసంస్పృష్టా సా శివా పరమేశ్వరీ
కిమర్థమాగతా శాన్తిమితి మే బ్రూహి తత్త్వతః. 13

శ్రీరాముఁడు :— మహాత్మా ! శివుని స్పృశించినంతమాత్రముచే అపరమేశ్వరి యేల శమించెనో యథార్థముగఁ దెలియఁజేయ వేడెద.

శ్రీవసిష్ఠ ఉవాచః—

సా రామ ప్రకృతిః ప్రోక్తా శివేచ్ఛా పారమేశ్వరీ
జగన్మాయేతి విఖ్యాతా స్పన్దశక్తిరకృత్రిమా. 14

శ్రీవసిష్ఠుఁడు :— ఓ రామచంద్రా ! శివుని స్వాభావిక స్పందశక్తియగు ఆదేవి ప్రకృతి యనియు, శివేచ్ఛయనియు, పరమేశ్వరియనియు, ఆదిజగన్మాయయనియు వచింపఁబడుచు, ఇట్లు వివిధ నామములచేఁ ప్రసిద్ధికెక్కియున్నది.

స పరః ప్రకృతేః ప్రోక్తః పురుషః పవనాకృతిః
శివరూపధరః శాన్తః శరదాకాశశాన్తిమాన్. 15

సర్వవ్యాపియు; వాయురూపుఁడును, శాంతుఁడును, శరత్కాలాకాశమువలెఁ బ్రశాంత శీలుఁడును,పరమపురుషుఁడును, శివరూపధారియునగు పరమేశ్వరుడు ఆప్రకృతికంటెపరమైనవాడు.

భ్రమతి ప్రకృతిస్తావత్సంసారే భ్రమరూపిణీ
స్పన్దమాత్రాత్మికా సేచ్ఛా చిచ్ఛక్తిః పారమేశ్వరీ. 16
యావన్న పశ్యతి శివం నిత్యతృప్తమనామయమ్
అజరం పరమాద్యన్తవర్జితం వర్జితద్వయమ్. 17

నిత్యతృప్తుఁడును, నిర్వికారుఁడును, అజరుఁడును అద్యంతరహితుఁడును, ద్వైతవర్జితుఁ డునునగు పరమశివుని గాంచనంతవఱకును, భ్రమరూపిణియు, స్పందమాత్రస్వరూపిణియు, చిత్-శక్తియు, పరమేశ్వరేచ్ఛయునగు ప్రకృతి సంసారమున పరిభ్రమించుచునే యుండును.

సంవిన్మాత్రైకధర్మిత్వాత్కాకతాలీయయోగతః
సంవిద్దేవీ శివం స్పృష్ట్వా తన్మయీవ భవత్యలమ్. 18

కేవలము సంవిన్మాత్ర (జ్ఞానమాత్ర) స్వరూపిణియగుటచే, ఆ సంవిత్తగు దేవి కాక తాళీయ యోగముచే శివుని స్పృశించి ఆతనియందు పూర్ణముగ తన్మయమగుచున్నది

ప్రకృతిః పురుషం స్పృష్ట్వా ప్రకృతిత్వం సముజ్ఝతి
తదన్తరేకతాం గత్వా నదీరూపమివార్ణవే. 19

ఈ ప్రకృతి పురుషుని స్పృశించి తన ప్రకృతిరూపమును ద్యజించినదై, నది సముద్ర ముందు లీనమగునట్లు, అతనితో ఏకరూపత్వ మొందుచున్నది.

ఆపగా హి పయోమాత్రం సజ్గే అర్ణవ ఏవ సా
యదాతదా తమేవాశు ప్రాప్య తత్రైవ లీయతే. 20

జలమాత్రమగు నది సముద్రముతో గలియునపుడు శీఘ్రముగ నద్దానియందు లీనమై సముద్ర రూపమగుచున్నదిగదా !

చితిః శివేచ్ఛా సా దేవం తమేవాసాద్య శామ్యతి
జన్మస్థానశిలాం ప్రాప్య తీక్ష్ణధారా యథాయసీ. 21

లోహమయమగు కత్తియొక్క పదునైన యంచు తన జన్మస్థానమగు శిలను (మట్టిని) బొంది తన యాకృతిని గోల్పోయి తద్రూపమేయగునట్లు, శివేచ్ఛారూపిణియగు చైతన్యమున్ను శివరూపుఁడగు దేవుని బొంది శమించుచున్నది.

పుంసశ్ఛాయాం నిజచ్ఛాయాప్రవిష్టస్య శరీరకమ్
యథాశు ప్రవిశత్యేవ ప్రకృతిః పురుషం తథా. 22

అరణ్యాదులందుఁ బ్రవేశించిన మనుజునియొక్క ఛాయ యాతని శరీరమున శీఘ్రముగఁ బ్రవేశించునట్లు, ప్రకృతియు పురుషునియందుఁ బ్రవేశించుచున్నది.

చేతిత్వా చిన్నిజం భావం పురుషాఖ్యం సనాతనమ్
భూయో భ్రమతి సంసారే నేహ తత్తాం ప్రయాతి హి. 23

వాస్తవముగ చిద్రూపమగుటచే చిత్ = శక్తియగు ప్రకృతి తన నిజరూపమగు సనాతన పురుషుని బొంది, అజ్ఞానము నశించుటవలన మరల యీ సంసారమునఁ దిరుగాడక యా పురుషుని యందే లీనమగును.

సాధుర్వసతి చోరౌఘే తావద్యావదసౌ నతమ్
పరిజానాతి విజ్ఞాయ న తత్ర రమతే పునః. 24

చోరుల సంఘమందు సాధువు 'వీరు చోరులు' అని యెఱుఁగ నంతవఱకు వసించును. ఎఱిఁగినపిదప మరల నద్దానియందుఁ బ్రీతియే గొనకయుండుగదా !

ద్వైతే తావదసద్రూపే రమతే భ్రమతే చితి
పరం పశ్యతి నో యావత్తం దృష్ట్వా తన్మయీ భవేత్. 25

అట్లే, పరమపురుషుని గాంచనంతవఱకు ఈ ప్రకృతి అసద్రూపమగు ద్వైతమున రమించుచు పరిభ్రమించుచునుండును, గాంచినచో నాతనియందు తన్మయమగును.

చిదినిర్వాణరూపం యత్ప్రకృతిః పరమం పదమ్
ప్రాప్య తత్తామవాప్నోతి సరిదబ్ధావివాబ్ధితామ్. 26

ఈ ప్రకృతి వాస్తవముగ చైతన్య స్వరూపమై, పరమపదమై, నిర్వాణ రూపమైయే యున్నది. కాఁబట్టి, సముద్రమును బొందినది తత్సముద్రరూపమే యగునట్లు, ఆ పరమపురుషుని బొంది, అయ్యది తచ్ఛివరూపమే యగుచున్నది.

తావద్వి మోహవశతశ్చితిరాకులేషు
సర్గేషు సంసరతి జన్మదశాసు తాసు
యావన్న పశ్యతి పరం తమథాశు దృష్ట్వా
తత్రైవ మజ్జతి ఘనం మధునీవ భృఙ్గీ. 27

వ్యాకులములైయున్న ఈ యనేక సృష్టులందును, ఆయా దుఃఖమయములైన జన్మదశలందును ఈ (అజ్ఞాత) చైతన్యము పరమపురుషుని గాంచనంతవఱకు, మోహవశముచే పరిభ్రమించుచున్నది. అతనిని గాంచగనే, ఘనీభూతమగు మధువు (తేనె)నందు తుమ్మెదవలె నాతనియందు నిమగ్నమగుచున్నది.

సంప్రాప్య కస్త్యజతి నామ తదాత్మతత్త్వం
ప్రాప్యానుభూయ చ జహాతి రసాయనం కః
శామ్యన్తి యేన సకలాని నిరన్తరాణి
దుఃఖాని జన్మమృతిమోహమయాని రామ. 28

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే ప్రకృతిపురుషక్రమవర్ణనం
నామ పఞ్చాశీతితమః సర్గః ॥ 85 ॥

ఓ రామచంద్రా! అట్టి ఆత్మతత్త్వమును బొంది మరల యెవఁడద్దానిని త్యజించివేయును? దేనిచే జననమరణమోహమయములగు సమస్తదుఃఖములున్ను శాశ్వతముగ శమించిపోవునో, అట్టి ఆత్మామృతము ననుభవించి యెవఁడు మరల యద్దానిని వదలివేయనెంచును?

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
పాషాణోపాఖ్యానమున ప్రకృతిపురుషక్రమవర్ణనమను
నెనుబదియైదవ సర్గము ॥ 85 ॥

షడశీతితమః సర్గః

[బ్రహ్మాణ్డఖర్పరగ్రాసిరుద్రదేహస్య సౌక్ష్మ్యతః
చిదాకాశే తిరోభావః శిలాయామత్ర వర్ణ్యతే.
తత్ప్రదేశాన్తరేష్వన్యశిలావృక్షతృణాదిషు
సర్వత్ర సర్గవైచిత్ర్యదర్శనం బ్రహ్మణీర్యతే.

చిదాకాశాంతర్గతమగు శిలయందు బ్రహ్మాండకపాలములను మ్రింగివేయునట్టి రుద్రుని దే[illegible] అదృశ్యమగుటయు, అచట అన్యప్రదేశములందును శిలావృక్ష తృణాదులంద[illegible] సృష్టివైచిత్ర్యము గానుపించుటయు నిచట వర్ణింపబడుచున్నది.]

శ్రీవసిష్ఠ ఉవాచ:—

శృణు రామ కథం తత్ర మహాకాశే తథా స్థితః
దేహే భ్రాన్తిం తు తాం త్యక్త్వా స రుద్రోఽప్యుపశామ్యతి. 1

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! అచట ఆ మహాకాశమందున్న రుద్రభగవానుఁడు తన దేహమందలి భ్రాంతిని వీడి యెట్లు శమించెనో యా కథాక్రమమును వినుము.

స రుద్రస్తౌ జగత్ఖణ్డౌ తదా చిత్ర ఇవార్పితాః
నిస్పన్దా ఇవ తత్రాసన్ప్రేక్షమాణే స్థితే మయి. 2

నేను వీక్షించుచున్న సమయమున నచట రుద్రభగవానుఁడున్ను, ఊర్ధ్వాధో బ్రహ్మాండకపాలములున్ను మూఁడును చిత్రమందు లిఖింపఁబడినవానివలె నయ్యాకాశమున నిశ్చలముగ నుండెను.

తతో ముహూర్తమాత్రేణ స రుద్రస్తౌ నభోన్తరే
ఖణ్డౌ విలోకయామాస దృశార్కేణేవ రోదసీ. 3

తదుప[illegible]దభగవానుఁడు తన సూర్యరూప నేత్రముచే ఆకాశ, భూతలముల గాంచునట్లు [illegible] ముహూర్తమాత్ర కాలములో నాయాకాశమున బ్రహ్మాండఖండముల రెంటిని నవలోకించెను.

తతో నిమేషమాత్రేణ ఘోణాశ్వాసేన ఖణ్డకౌ
తౌ సమానీయ చిక్షేప పాతాలాన్తరివాననే. 4

పిమ్మట నిమిషమాత్రములో శ్వాసవాయువుచే నాతఁడా బ్రహ్మాండఖండముల రెంటిని నాకర్షించి, పాతాలమునందువలె తన ముఖమందు వైచుకొనెను.

అతిష్ఠదేక ఏవాసావేకం ఖే ఖమివాఖిలే
భుక్తబ్రహ్మాణ్డఖణ్డోగ్రమణ్డమణ్డకమణ్డలః. 5

అట్లా బ్రహ్మాండఖండములను గొప్ప క్షీరమండకము (పక్వాన్నవిశేషము)లను భుజించి యా రుద్రభగవానుఁడు, అఖిలాకాశ మందాకాశమువలె స్థితినొందియుండెను

తతో ముహూర్తమాత్రేణ లఘుః సోఽభ్రమివాభవత్
తతో భవద్యష్టిసమస్తతః ప్రాదేశమాత్రకః. 6

తతః కాచకణాకారో మయాదృష్టః స తాదృశః
తతః సోఽణుాభవన్దృష్టో మయా ఖాద్దివ్యదృష్టినా. 7

పరమాణురథో భూత్వా తతస్త్వన్తర్ధిమాయయౌ

అనంతరము ముహూర్తమాత్రకాలములో నాతఁడు మేఘమువలె లఘురూపముఁ బొందెను. ఆ పిమ్మట, చేతి కఱ్ఱంత పరిమాణముగను తదుపరి అంగుష్ఠమాత్రముగను సూక్ష్మాకృతిఁదాల్చెను. పిదప అతఁడు సూక్ష్మకాచ (గాజు) ఖండమువలెను అనంతరము పరమాణువుగను నగుటను నేను దివ్యదృష్టిచే వీక్షించితిని. అట్టు పరమాణురూపమును బొంది యా రుద్రుఁడంతర్ధాన మయ్యెను.

ఇత్యసౌ శమమాయాతః శరదమ్బుదఖణ్డవత్. 8
తాదృశోఽపి మహారమ్భః పురః పశ్యత ఏవ మే
ఇతి సావరణే తేన తే బ్రహ్మాణ్డకవాటకే. 9
వినిగీర్ణే క్షుధార్తేన హరిణేనేవ పర్ణకే

ఈ ప్రకారముగ, ఆ జగదాది రుద్రాకారపర్యంతముగల మహారంభమంతయు నేను జూచుచుండగనే శమించినదాయెను. మఱియు, ఆకలిగొనిన జింక చిన్నయాకులను మ్రింగునట్లు ఆ రుద్రభగవానుఁడున్ను, ఆవరణసహితములగు బ్రహ్మాండకవాటముల రెంటిని మ్రింగివైచెను.

అథాభూన్నిర్మలం వ్యోమ శాన్తం బ్రహ్మైవ కేవలమ్. 10
అనాదిమధ్యపర్యన్తం సంవిదాకాశమాత్రకమ్
ఇత్యహం దృష్టవాంస్తత్ర కల్పాన్తమురువిభ్రమమ్. 11
దర్పణప్రతిబిమ్బాభం శిలాశకలకోటరే

తదనంతర మచట ఆకాశమంతయున్ను కేవలము నిర్మల బ్రహ్మరూపముగనే యుండెను. ఓ రామచంద్రా! ఈ ప్రకారముగ అనేక భ్రమయుక్తమైనదియు, అద్దమందలి ప్రతిబింబమును బోలినదియు నగు ఆ శిలాఖండమందలి మహాప్రళయమును నేను ఆద్యంత మధ్యరహితమగు చిదాకాశమాత్రముగనే వీక్షించితిని.

అథ తామఙ్గనాం స్మృత్వా తాం శిలాం తచ్చ విభ్రమమ్. 12
రాజద్వారగతో గ్రామ్య ఇవాహం విస్మయం గతః

అటుపిదప ఆ విద్యాధరిని. ఆ శిలను, ఆ విభ్రమమునంతయు స్మరించి రాజద్వారమును బొందిన గ్రామీణునివలె నేను మహదాశ్చర్యము నొందితిని.

తామాలోకితవాన్భూయః కలధౌతశిలామహమ్. 13
యావత్సర్వత్ర సన్త్యత్ర సర్గాః కాల్యా ఇవాఙ్గకే
బుద్ధినే[illegible] వా న శే యథా. 14

పిమ్మట మఱియొక ప్రదేశమునుండి నే నా సువర్ణమయమగు శిల నవలోకింప, కాళీ శరీరము నందువలె, ఆ శిలయందంతటను దివ్యదృష్టిచే అనేకసృష్టులు గానుపింపఁదొడగెను.

సర్వత్ర సర్వదా సర్వం యదస్త్యేవ తదా తథా
దూరవత్ప్రేక్ష్యతే మాంసదృశా యద్యేవ సా శిలా. 15
దృశ్యతే తచ్ఛిలైవైకా న తు సర్గాది కించన
సావస్థితా శిలైవైకరూపా నిబిడమణ్డలా: 16

[illegible]చే సర్వత్ర స్థితిగల్గి యున్నదంతయు సదా లెస్సగ గానుపించును. ఆ శిల మాంస[illegible] దూరముందున్న పదార్థమువలెఁ గాంచఁబడినచో తత్ప్రదేశమందు ఘనీభూతమై యున్నట్టి[illegible] రూపమైన శిలగనే గన్పట్టునుగాని. అందలి సృష్ట్యాదులెవ్వియు నవుడు కానుపింపవు.

కలధౌతమయీ స్ఫారా సన్ధ్యాజలదసున్దరీ
తతోఽహం విస్మయావిష్టః ప్రవిచారితవాన్పునః. 17
శిలాయామపరం భాగం తథైవ పరయా దృశా
యావత్తమపి పశ్యామి జగదారమ్భమన్తరం. 18
తథైవ సుషిరాకార ఇవ నానార్థసున్దరమ్
పునరన్యం తథైవాహం ప్రదేశం పరిదృష్టవాన్. 19
సర్గసంరమ్భవలితం యావత్తమపి తాదృశమ్
యంయం ప్రదేశం పశ్యామి శిలాయాస్తత్రతత్ర వై. 20
జగత్పశ్యామి విమలమాదర్శ ఇవ బిమ్బితమ్

సువర్ణమయమై, విశాలమై, సంధ్యాకాల మేఘమువలె సుందరమైనట్టి యా శిలను జూచి యాశ్చర్యయుతుఁడనై మరల విచారించి యద్దాని మఱియొక భాగమున దివ్యదృష్టిని బ్రసరింప వెంటనే యచ్చోటున్ను అనేక జగదారంభములచే వ్యాప్తమై యున్నట్లు గాంచితిని. అట్లే బిలము వంటి యాకారమందనేకపదార్థములచే సుందరములై వెలయుచున్నట్టి యా శిలయొక్క యన్య ప్రదేశముల నవలోకింపనవియు బూర్వదృష్టప్రదేశమువలె అనేక సృష్ట్యారంభములచే వేష్టితమై యొప్పుచుండెను. ఇట్లా శిలయొక్క యే యే భాగమును వీక్షించినను, అచటచట అద్దమందుఁ బ్రతిబింబించిన దానివలె నిర్మలమగు జగత్తు కానుపించెను,

మయాతికౌతుకేనాథ సర్వాస్తస్య గిరేః శిలాః. 21
అన్విష్టా భూమిభాగాశ్చ తృణగుల్మాదయస్తథా
యావత్సర్వత్ర తత్రాదృగ్జగదస్తి యథాస్థితమ్. 22

పిమ్మట, కౌతుకముతో నేనా పర్వతము యొక్క తక్కిన శిలలన్నింటిని భూభాగ, తృణలతాదులనుగూడ బరికింప సర్వత్రయదేవిధముగ అనేకజగత్తులు యథాస్థితముగ వర్తించుటఁ గాంచితిని.

బుద్ధ్యైవ దృశ్యతే నాజ్ఞా పరయా వివిధాకృతి

ఆ యనేక విధములగు జగత్తులన్నియును అధిభౌతిక దేహభావ భ్రాంతిరహితమగు సర్వసాక్షిభూతమైన బుద్ధిచేతనే గానుపించునుగాని భౌతిక నేత్రముచేఁగాదు.

క్వచిత్ప్రథమసర్గాత్మ జాయమానప్రజాపతి. 23

కల్ప్యమానర్క్ష చన్ద్రార్కదినరాత్ర్యృతువత్సరమ్
క్వచిత్క్వచిన్మహీపీఠసంపన్న జనమణ్డలమ్. 24

క్వచిత్కించిదఖాతోగ్రచతుః సాగరఖాతకమ్
క్వచిత్కించిదసంజాతసురసంజాతదానవమ్. 25

క్వచిత్కించిత్కృతయుగాచారసజ్జనభూతకమ్
క్వచిత్కించిత్కలియుగాచారదుర్జనభూతకమ్. 26

క్వచిత్కించిత్పురవ్యూహదైత్యసంగరదుస్తరమ్. 27

క్వచిత్కించిన్మహాశైలజాలనిర్వివరావని
క్వచిత్కించిరసంపన్నసర్గమేకామ్బుజోద్భవమ్. 28

క్వచిత్కించిజ్జరామృత్యూన్ముక్తభూతలమానవమ్
క్వచిత్కించిదసంజాతచన్ద్రశూన్యశిరఃశివమ్. 29

అనిర్మథితదుగ్ధాబ్ధిమృత్యుమత్సురపూరితమ్
అసంజాతామృతాశ్వేభవైద్యగోకమలావిషమ్. 30

శుక్రామరమహావిద్యానాశనోత్కసురవ్రజమ్
క్వచిత్కించిచ్చగర్భాఘ్నికర్తనోత్కసురేశ్వరమ్. 31

అపరిమ్లానధర్మత్వాత్స్వప్రకాశాఖిలవ్రజమ్
క్వచిత్కించిచ్చ పూర్వాన్యసంనివేశక్రమస్థితి. 32

అపూర్వవేదశాస్త్రార్థసమాచారవిచారణమ్
క్వచిత్కించిన్న కల్పాన్తసంక్షోభమివ సంస్థితమ్. 33

క్వచిత్కించిచ్చ దైత్యౌఘవిలుణ్ఠితసురాలయమ్
క్వచిత్కించిత్పురోద్యానగాయద్గన్ధర్వకిన్నరమ్. 34

క్వచిత్కించిత్ప్రమారబ్ధగీర్వాణాసురసౌహృదమ్

ఆ యనేక జగత్తులం దొకచోట ప్రథమసృష్టికై ప్రజాపతి జనించుచుండెను. ఒకచోట బ్రహ్మదేవుఁడు సూర్య, చంద్ర, నక్షత్రమండల, దిన, రాత్రి, ఋతు, సంవత్సరాదులయొక్క కల్పన గావించుచుండెను. ఒకచోట భూతలము జనసమూహముతోఁ గూడియుండెను; ఒక జగత్తునందు సగరపుత్రులింకను నాల్గు మహాసముద్రములను త్రవ్వకనేయుండిరి. వేఱొక జగత్తునందు దేవతులు జనించిరిగాని, రాక్షసులింకను జనింపకయేయుండిరి; ఒక్కొకచోట సజ్జనులందు కృతయుగాచారములు వర్తిల్లుచుండెను; ఇంకొకచోట దుర్జనులందు, కలియుగాచారములు ప్రవృత్తములై యుండెను; ఒకచోట, [illegible] యుద్ధములచేతను ప్రదేశము అతిదుస్తరమై

యుండెను; వేఱొకచోట భూతలము పర్వత సమూహములచేఁ బూర్ణమైయుండెను. ఒకచోట బ్రహ్మదేవుఁడు తప్ప సృష్టియెద్దియు నింకను జనింపకుండెను; ఒకచోట జరామృత్యువులచే భూతలము మనుష్యరహితమై యొప్పుచుండెను; ఇంకొకచోటఁ జంద్రుఁడుత్పన్నము కానందుచే శివుఁడు చంద్రరూప శిరోభూషణ రహితుఁడైయుండెను; ఒకచోట క్షీరసాగర మథనమింకను గానందుచే జగత్తు మృత్యుగ్రస్తులగు దేవతలచేఁ బూర్ణమైయుండెను, కావుననే యచటనింకను అమృతము ఉచ్చైశ్శ్రవమను నశ్వము, ధన్వంతరి, కామధేనువు, లక్ష్మి, విషము జనింపకనేయుండెను; ఒకచోటు శుక్రాచార్యుని మృతసంజీవనీ విద్యాప్రదమగు తపస్సునందు విఘ్నముగలుగజేయుచున్న యుత్కంఠితులగు దేవతలతోఁ గూడియుండెను; వేఱొకచోట దితియొక్క గర్భమును ఖండించుటయందు ఇంద్రుఁడుత్కంఠితుఁడగుచుండెను; ఒకచోట ధర్మము నశింపనందున ప్రజలందఱును స్వప్రకాశరూపమగు బ్రహ్మజ్ఞానయుక్తులైయుండిరి; ఒకచోటఁ పదార్థముల రచన పూర్వక్రమముకంటె విలక్షణముగనుండెను; ఒకచోట అపూర్వమైన వేదశాస్త్రార్థ విచారమున జనులు నిమగ్నులైయుండిరి; వేఱొకచోటు కల్పాంత సంక్షోభ మెద్దియు లేనిదానివలెనుండెను, ఒకచోట దైత్య సమూహము దేవతల స్థానములఁ గొన్ని కొన్నింటిని నాశమొనర్చియుండెను; ఒకచోట నందనవనమందు గంధర్వులు, కిన్నరులు గానము చేయుచుండిరి; ఒకచోట క్షీరసాగరమథనమునకై దేవాసురులందు మైత్రి ప్రారంభించియుండెను.

భూతభవ్యభవిష్యత్స్థగదాడమ్బరం మయా. 35
తదానుభూతం వపుషి మహావిశ్వగణాత్మని

ఈ ప్రకారముగ భూతభవిష్యద్వర్తమానములందలి జగదాడంబరమును నేనపుడు మహావిశ్వరూపుఁడగు పరమాత్మయొక్క స్వరూపమున గాంచితిని.

ఏకత్ర కల్పవిక్షుబ్ధపుష్కరావర్తమన్థరమ్. 36

ఏకత్ర సౌమ్యసకలభూతసంతతిసంస్థితమ్
ఏకత్ర సమనుత్క్షుబ్ధసురాసురనరేశ్వరమ్. 37

ఏకత్రాసంభవద్భానునిత్యాభిన్నతమోఘనమ్
ఏకత్రాసంభవద్ధ్వాన్తం కాన్తం జ్వాలోదరోపమమ్. 38

ఏకత్ర నలినీనాలనిలీనమధుకైటభమ్
ఏకత్ర పద్మమఞ్జూషా సుప్తబాలనవాబ్జజమ్. 39

ఏకత్రైకార్ణవోదగ్రవృక్షవిశ్రాన్తమాదవమ్
ఏకత్ర కల్పరజనీ నిఃశూన్యతిమిరాకులమ్. 40

శిలాజఠరనిస్పన్దం వ్యోమైవ వితతాకృతి
సుషుప్తజఠరాకారమప్రజ్ఞాతమలక్షణమ్. 41

అప్రతర్క్యమవిజ్ఞేయం సుషుప్తమివసర్వతః
ఏకత్ర పక్షవిక్షుబ్ధశైలకాకాకులామ్బరమ్. 42

ఏకత్ర వజ్రనిష్పేషద్రవదమ్భోధరభాసురమ్

ఏకత్రోద్వృత్తమత్తాబ్ధిహ్రియమాణధరాచలమ్. 43
ఏకత్ర వురవృత్రాన్ధబలిసంగరసంకులమ్
ఏకత్ర మత్తపాతాల గజకమ్పివసున్దరమ్. 44
ఏకత్ర శేషశిరసః కల్పాన్తలులితావని
క్వచిదల్పేన రామేణ హతరావణరాక్షసమ్. 45
రక్షసా రావణేనైవ క్వచిద్విహతరాఘనమ్
భూస్థపాదేన దేవాద్రిశిరస్థశిరసా పరమ్. 46
పశ్యామ్యమ్బరమాక్రాన్తం క్వచిద్వై కాలనేమినా
క్వచిద్భాపసురైర్నిత్యం దానవైరేవ పాలితమ్. 47
క్వచిచ్చ భ్రష్టదనుజైరమరైరేవ పాలితమ్
జిష్ణుయుక్తేన గుప్తేన విష్ణుపాణ్డవకౌరవైః. 48
క్వచిద్భారతయుద్ధేన నిహతాక్షౌహిణీగణమ్

మఱియు, అయనేక జగత్తులం దొకచోట కల్పాంతమునకై పుష్కరావర్తమేఘములు ప్రకృత్తములగుచుండెను. ఇంకొకచోట భూతకోట్లన్నియు శాంతముగనుండెను; వేఱొకచోట ప్రళయముచే దేవ, దైత్య, భూపతులు, సంక్షోభమొందుచుండిరి; ఒకచోట సూర్యుఁడు లేనందున సదా యంధకారమయమై యొప్పుచుండెను; ఒకచోట సూర్యుఁడు నిత్యము వెలుఁగుటచే నంధకార రహితముగను, సుందరముగను, జ్వాలాసదృశముగ దేదీప్యమానముగను నుండెను; ఒకచోట భగవంతుని నాభికమలమున మధుకైటభులను దైత్యులు విలీనులైయుండిరి; ఒకచోట భగవంతుని నాభికమలమున నూతన బాలకుఁడగు బ్రహ్మదేవుఁడు నిద్రించుచుండెను; ఒకచోటు కల్పాంత రాత్రియందు శూన్యమగు అంధకారముచే వ్యాప్తమైయుండెను; ఒకచోట ప్రళయ మహాసముద్రమున నెత్తైయున అక్షయ వటవృక్షముపై మాధవ భగవానుఁడు నిద్రించుచుండెను. ఇంకొకచోట పృథివ్యాదు లుత్పన్నములు గానందుచే నా ప్రదేశము విశేష చిహ్నరహితమై, సుషుప్తివంటి యాకృతిగలదై, శిలామధ్యభాగమువలె నిశ్చలమైనట్టి విశాలమగు ఆకాశమాత్రముతోఁగూడియుండెను; ఒకచోట జగత్తు అప్రతర్క్యమై, అవిజ్ఞేయమై, సుషుప్తి చందముననుండెను; ఒకచోట [illegible]తోఁగూడిన పర్వతములను కాకులచే నాకాశము వ్యాప్తమైయుండెను. ఒకచోట జగత్తు వజ్రాయుధములచే చూర్ణములై, ద్రవీభూతములైనట్టి పర్వతములచే భయంకరమై యొప్పుచుండెను. ఒకచోట త్రిపురాసుర, వృత్రాసుర, అంధకాసుర, బలిమున్నగు అసురుల యుద్ధములచే జగత్తువ్యాప్తమై యుండెను. ఒకచోట పాతాళమందలి మత్తగజేంద్రములచేఁ బృథివి కంపితమగుచుండెను. ఇంకొకచోట కల్పాంతమున శేషభగవానుని శిరముపై భూమి దొర్లుచుండెను. వేఱొకచోట సీత నపహరించుటచే బాలుఁడగు రామునిచే రాక్షసుఁడగు రావణుఁడు హతుఁడాయెను. ఒకచోట సీత నపహరించుట ద్వారా రాక్షసుఁడైన రావణుఁడు రాముని వంచించియుండెను. మఱియొకచోట భూమిపై పాదములున్ను, సుమేరుపర్వతముపై శిరస్సున్ను నిడి కాలనేమి యాకాశమును నాక్రమించియుండెను. ఒకచోట దేవతలను దఱిమివైచి సదా యసురులే జగంబును బాలించుచుండిరి. మఱియొకచోట

అసురులను దొలగించి దేవతలే ప్రపంచము నేలుచుండిరి. ఒకచోట కృష్ణునిచే రక్షితుఁడగు అర్జునునితోఁగూడిన పాండవులకును, కౌరవులకును జరిగిన భారతయుద్ధమందు 'అక్షౌహిణీ' సమూహము నశించియుండెను.

శ్రీరామ ఉవాచ:—

కిమహం భగవన్పూర్వమభవం కథయేతి మే. 49
అభవం చేదనేనైవ సంనివేశేన తత్కథమ్

శ్రీరాముఁడు:— మహాత్మా! పూర్వకల్పమున నే నెట్లుంటిని? ఇట్టి యాకారముతోటియా లేక మఱియొక యాకారముతోటియా? వచింపగోరెద.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

సర్వ ఏవ వివర్తన్తే రామ భావాః పునఃపునః. 50
పూర్యమాణా యథా మాషాః క్రమేణాన్యేన తేన వా
సర్వక్రమసమాః కేచిత్తయైవాన్యేన వా మిథః. 51

శ్రీవసిష్ఠుడు:— ఓ రామచంద్రా! సమస్త పదార్థములున్ను మరల మరల పరివర్తనము చెందుచునేయుండును. పూరింపబడు గరిసె మున్నగువానియందలి మాషాదిధాన్యములవలెఁ పదార్థములన్నియు కొన్ని అదేయాకారముగల్గియు, కొన్ని మఱియొక యాకారముగల్గియు మార్పు చెందుచుండును.

స్ఫురన్త్యర్థసమా భావాః కేచిదబ్ధితరఙ్గవత్
పునస్త్వం పునరేవాహం పునః పునరిమే జనాః. 52

ఓ రామచంద్రా! కొన్నిపదార్థములు సముద్ర తరంగములవలె నొకపుడు సమానరూపములుగనే స్ఫురించును. నీవు, నేను ఈ సమస్త ప్రజలు మరల మరల యుత్పన్నులగుచునే యున్నారు.

న కదాచన నైవాన్యే సంభవన్త్యఖిలం పరే
త ఏవాన్యేఽభవామ్భోధౌ తరఙ్గా ఇవ నిర్ణయః. 53
యద్వన్న జాయతే తద్వద్భూతానాం భ్రమతాం భవేత్
ఆయాన్తి యాన్త్యనన్తాని భూతానీహ భవభ్రమైః. 54

పరమార్థ దృష్టిచే చిదాకాశమున నవియేగాని, లేక అన్యములుగాని యగు పదార్థము లెపుడును సంభవింపనేరవు. మాయాదృష్టిచే, సముద్రతరంగములవలె అదేరూపముచేగాని లేక అన్యరూపముచేగాని పదార్థములు స్ఫురించుచుండును. ఏలయనినఁ సంసారభ్రమచే అనంతకోటి జీవులు మరల మరల వచ్చుచుఁ బోవుచునున్నారు.

తాన్యేవాన్యాని చాన్యాని సమాని విషమాణి చ
ఆవృత్తిమన్తి తాన్యేవ తథైవాన్యాని చాభితః. 55

ఒకపుడు అదేరూపముచేగాని, ఒకపుడు అన్యరూపముచేగాని, ఒకపుడు సమానముగగాని, ఒకపుడు విషమముగగాని యీ పదార్థముల చక్రమంతటను దిరుగుచున్నది,

విద్ధి సీకరజాలాని భూతాని జగదమ్బుధేః
విత్తబన్ధు వయఃకర్మవిద్యా విజ్ఞానచేష్టితైః. 56
తైరేవ కేచిజ్జాయన్తే భూయోభూయః శరీరిణః
ఆర్ధైస్తైః సదృశాః కేచిత్కేచిత్పాదేన తైః సమాః. 57

ఓ రామచంద్రా! జీవులందఱిని జగత్తను సముద్రముయొక్క బిందుకణములుగ నెఱుగుము. ఆ జీవులలోఁ గొందఱు మరల మరల యవియే ధన, బంధు వయః, కర్మ, విద్యా, విజ్ఞాన చేష్టాదులు గల్గియు, కొందఱు వానిలో సగముభాగము గల్గియు మఱికొందఱు నాల్గవ భాగము గల్గియునుండుచుందురు.

తజ్జీవాస్తైర్విసదృశా భవన్త్య న్యశరీరిణః
సర్వైరేభిః సమాః కేచిత్కాలేనైవ విలక్షణాః
కాలేన సదృశాః కేచిదనేన చ విలక్షణాః. 58

కొందఱు జీవులవియే శరీరములుగల్గియు, కొందఱు భిన్నశరీరములుగల్గియు నుందురు, మఱికొందఱు, అన్ని విషయములందును బూర్వమువలెనేయుందురు. గాని కాలమందుమాత్రము విలక్షణముగ నుందురు. ఇంకకొందఱు కాలమందు సమముగ నుందురుగాని తక్కిన విషయములందు విలక్షణముగ నుందురు.

కాలేనాకులకేష్టయాన్య ఇవ తే గచ్ఛన్త్యధోర్ధ్వం పున
ర్దేహాలేఖనఖేదితాన్యగణితాన్యన్యాని ధాన్యాన్యలమ్
భూతామ్బూని వహన్తి సంసృతిమయే తాన్యమ్బుధౌ చఞ్చలే
చక్రావృత్తిమయాని సంకలయితుం శక్నోతి కస్తాన్యలమ్. 59

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే జగదన్యాన్యత్వవర్ణనం నామ షడశీతితమః సర్గః ॥ 86 ॥

ఓ రామచంద్రా! రాగద్వేషాదులచే వ్యాప్తములైన విచిత్ర ధ... ...లఁగూర్చిన చేష్టలతోఁగూడి యా జీవులు కాలక్రమమున ననంతములైన వివిధ దేహము... ధరించుచు స్వర్గ నరకాదులను ఊర్ధ్వాధోలోకములకు మరల మరల జనుచున్నారు. ఇక్కారణమున, ఈ చంచల సంసారసముద్రమున చక్రావర్తములఁబోలి ప్రవహించుచున్నట్టి భూతకోట్లను జలములు సదృశములో, లేక, భిన్నములో, తద్రూపములో, లేక అన్యరూపములో బాగుగ నిర్ధారణచేయుట కెవఁడు సమర్థుఁడు.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున జగదన్యాన్యత్వ వర్ణనమను నెనుబదియాఱవ సర్గము ॥ 86 ॥

సప్తాశీతితమః సర్గః

[వసిష్ఠేన స్వదేహోఽత్ర వర్ణ్యతే విశ్వకల్పనమ్
స్వస్యైవ హి స్వయంభూత్వం తన్వక్షాద్యుద్భవక్రమాత్.

సూక్ష్మములగు ఇంద్రియాదుల యుత్పత్తిక్రమముచే వసిష్ఠుఁడు తనయందే హిరణ్యగర్భరూపత్వమును బొందుట, తన శరీరమందే జగత్తునుగూర్చిన కల్పన గావించుట యిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీవసిష్ఠ ఉవాచః—

తతశ్చిదాకాశవపుర్వ్యాప్యనన్తో నిరామయః
దత్తావధానో వపుషి తదా పశ్యామ్యహం క్వచిత్. 1

యావదన్తర్గతః సర్గః సంస్థితోఽఙ్కురితోపమః
కుసూలస్యేవ బీజస్య సిక్తస్యేవాఙ్కురో హృది. 2

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! పిమ్మట అనంతమై, నిరామయమైనట్టి చిదాకాశమయమగు శరీరము గల్గియున్న నేను, ఏకాగ్రచిత్తుఁడనై నా దేహమునఁ బరికింప, ధాన్యపు గరిసెయందు వర్షముచే దడుపఁబడిన బీజమందంకురమువలె నందొకచోట సృష్టిని గాంచితిని.

ఊర్ధ్వముచ్ఛూన ఏవాన్తః సేకాద్బీజే యథాఙ్కురః
ఆకారవత్యనాకారే చిత్త్వాచిత్త్వే తథా జగత్. 3

తడపఁబడిన బీజమందంకురము పైకి లేచి వృద్ధిఁబొందునట్లు, ఆకారయుక్తములును, అనాకారయుక్తములును, చేతనాచేతనములును నగు సమస్తవస్తువులందును జగత్తు గలదు.

యథోన్మిషతి దృశ్యశ్రీః సుషుప్తామ్బోధమేయుషః
జాగ్రద్వా విగతే స్వప్నే చిన్మాత్రస్య స్వచేతనాత్. 4

తథైవాత్మని సర్గాదావనుభూతస్వరూపిణి
హృది సర్గోదయో నాన్యరూప ఆకాశరూపతః. 5

సుషుప్తినుండి స్వప్నదశకుగాని లేక స్వప్నమునుండి జాగ్రద్దశకుగాని యేతెంచిన చిన్మాత్రుఁడగు మనుజునకుఁ గ్రమముగ స్వప్న, జాగ్రత్ప్రపంచముల శోభ జనించునట్లు, ఆత్మస్వరూపమును అనుభూతమొనర్చుకొనియున్న నా యొక్క హృదయమున సృష్ట్యాదియందు సృష్టి యుదయించినది. అయ్యది చిదాకాశముకంటె భిన్నము కానిదే యగును.

శ్రీరామ ఉవాచః—

ఆకాశరూప ఆకాశే పరమాకాశ కథ్యతామ్
భూయో నిపుణబోధాయ కథం సర్గః ప్రవర్తతే. 6

శ్రీరాముఁడు:— హృదయాకాశరూపుఁడవగు మహాత్మా! చిదాకాశరూపులగు తమయందు సృష్టి యెట్లుత్పన్నమాయెనో, బాగుగఁ దెలియుటకొఱకు మరల వచింప ప్రార్థన.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

శృణు రామ యథా పూర్వం స్వయం భూత్వం మయా తదా
అనుభూతమసత్సద్వదిదం స్వప్నపురోపమమ్. 7

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! స్వప్నపురమువలె అసత్తైనను, సత్తువలెఁ దోచునట్టి (సర్వజగత్కల్పనచే) బ్రహ్మదేవుని పదమును నేను నాయందెట్లనుభవించితినో యథారీతి వినుము.

తమాలోక్య మహాకల్పసంభ్రమం వ్యోమరూపిణా
భాగేఽన్యత్ర శరీగస్య సంవిదున్మేషితా మయా. 8

చిదాకాశరూపుఁడనగు నేను పైవచించిన శిలయందలి యనేకసృష్టులఁ గాంచి శరీరమున నొకానొక అన్యభాగమున నున్న సంవిత్తు (జ్ఞానము)ను సృష్టి దర్శనమునుగూర్చిన సంకల్పముతోఁటి మేలుకొలిపితిని.

యదైవ సామలా సంవిత్కించిదున్మేషితా స్థితా
తదైవాహం క్వచిత్తత్ర పశ్యామ్యాకాశతామివ. 9

ఎపుడానిర్మలమగు సంవిత్తు ఒకింత స్ఫురించినదాయెనో, అపుడే నేను నాయందొకానొకచోట ఆకాశరూపత్వమును గాంచితిని.

గతం స్వభావం చిద్వ్యోమ యథా త్వం రామ నిద్రయా
జాగ్రద్వా స్వప్నలోకం వా విశన్వేత్సి సమం ఘనమ్. 10

ఓ రామచంద్రా! ఎట్లు నీవు చిదాకాశమును గాఢనిద్రానంతరము స్వప్న, జాగ్రద్దశల నొందుచు ఘనీభూతమగు స్వభావమును బొందుచున్నట్లెఱుఁగుదువో, అట్లే నేనపుడా యాకాశరూపమును నాయందనుభవించితిని.

దిఙ్మాత్రాకాశమేవాదౌ తతోఽస్మీత్యేవ వేదనమ్
తద్ఘనం కథ్యతే బుద్ధిః సా ఘనా మన ఉచ్యతే. 11

పిమ్మట ఆ యాకాశరూపముననే దిక్కులఁగూర్చిన బోధ కలిగెను. ఆ యాకాశ దిఙ్మాత్రములగూర్చి పర్యాలోచించుటచే మొమ్మొదట చిత్తమేర్పడెను. 'ఆ యాకాశాదులే నేను' అను జ్ఞానమహంకారమనఁబడును. ఘనీభూతమగు అట్టి జ్ఞానము బుద్ధి యనఁబడుచున్నది. మరల యదియే సంకల్పవికల్పములచే ఘనరూపమగుటచే మనస్సని చెప్పఁబడుచున్నది. ఈ ప్రకారముగ నవి యన్నియు నాయందేర్పడెను.

తద్వేత్తి శబ్దతన్మాత్రం తన్మాత్రాణీతరాణ్యథ
పశ్చేన్ద్రియాణి తత్త్వాల్యాదితీన్ద్రియగణోదయః. 12

తదుపరి యా మనస్సు శబ్దాది తన్మాత్రల నెఱుఁగుటచే నవియుఁ గల్పింపఁబడెను. పిమ్మట క్రమముగ సూక్ష్మ, స్థూల పంచేంద్రియ సమూహముదయించెను.

సుషుప్తాద్విశతః స్వప్నం జగద్దృశ్యఘనోదయమ్
యథా తథైవ సర్గాదౌ దుఃఖం భాతి నిమేషతః. 13

సుషుప్తిదశనుండి స్వప్నమందుఁ బ్రవేశించుటచే జగత్తను ఘనీభూతమగు దృశ్యముదయించునట్లు, సృష్టికిఁ బూర్వము దుఃఖరహితమై యుండు శుద్ధాత్మ సృష్ట్యాదియందెపుడు సృష్టివైపున కభిముఖమగుచున్నదో, అపుడొక్క నిమిషములోనే దుఃఖముదయించుచున్నది.

తుల్యకాలమనన్తేఽస్మిన్దృశ్య జాలావభాసనే
కథయన్తి క్రమం కేచిత్కేచిన్న కథయన్తి చ. 14

ఈ యనంతమగు పరమాత్మయందొకే కాలమున ఈ దృశ్యసమూహమంతయు నెపుడు భాసింపఁదొడఁగునో, అపుడు కొందఱద్దానియందు క్రమమ్మును వచింతురు. మఱికొందఱు వచింపకయు నుందురు.

పరమాణుకణే కాన్తే సంపన్నమనుభూతవాన్
అహం చేతనమాత్మానం వస్తుతోఽమలమేవ ఖమ్. 15

క్షణమందును కల్పమువలెను, పరమాణువందును దీర్ఘప్రదేశమువలెను కల్పనచే నేనచట బ్రహ్మాండరూపమగు చైతన్యాత్మను ననుభవించితిని. కాని యథార్థముగ ఆ నిర్మలాత్మ చిదాకాశరూపమేయైయున్నది.

యథా స్వభావతో వ్యోమ్ని చలత్యేవానిశం మరుత్
తథా స్వభావాత్సర్వత్ర పశ్యత్యేవ వపుస్త్వితి. 16

స్వభావముగనే వాయువు ఆకాశమున నిరంతరము చలించునట్లు, మనస్సు స్వభావముగనే సర్వత్ర శరీరాదుల కల్పనఁ గాంచుచున్నది.

యాదృశం చేతితం రూపం శక్త్యా పరమయా తయా
తచ్ఛక్నోత్యన్యథా కర్తుం నైషా యత్నేన భూయసా. 17

ప్రథమమున మనస్సుయొక్క పరమశక్తి జగత్తుయొక్క రూపాదుల కల్పన నెటుల గావించెనో, అద్దాని నది స్వయముగ గొప్ప ప్రయత్నముచేనైనను మఱియొక విధముగ జేయఁజాలదు.

తతః పశ్యామ్యహం యావత్సంపన్నోఽప్యణురూపకః
చిత్త్వాచ్చేతస్తదేవాశు తథా భూతోస్మి సంస్థితః. 18

పిదప నేను అపరిచ్ఛిన్నుఁడనైనప్పటికిని కల్పనచే నన్ను బరిచ్ఛిన్నరూపముగనే యనుభవించితిని. మొదట చిద్రూపమునుండి శీఘ్రముగ చిత్తరూపమున స్థితి నొందితిని.

తతోఽహం బుద్ధవాన్రూపం తను తేజఃకణాకృతి
తదేవ భావయన్పశ్చాద్గతోఽహం స్థూలతామివ. 19

అటు తరువాత చిత్ప్రతిబింబవ్యాప్తిచే తేజఃకణమువలె వెలయునట్టి లింగశరీరము ననుభవించితిని. ఆ పిదప భావనచే స్థూలశరీరత్వ మొందితిని.

ప్రేక్షే తావదహం కించిదితి బోధాల్లఘో స్తతః
ఘనాగాలోకనాయైవ సంప్రవృత్తోఽనుభూతవాన్. 20

తదుపరి 'నేను జూచుదును' అను నొకింత బోధచే అలోకనమందుఁ బ్రవృత్తుఁడను కాఁగా నేత్రాది ద్వారములతోటి కూడినవాఁడనైతిని.

యన్నామ తత్ర తత్కించిత్తస్యేహాద్య రఘూద్వహ
శృణు నామాని ముఖ్యాని కల్పితాని భవాదృశైః. 21

రఘుకుల తిలకుఁడవగు రామచంద్రా! అట నేయే పేర్లు నీవంటివారలచేఁ గల్పింపఁబడెనో, అందు ముఖ్యమైనవాని నిపుడు పేర్కొనుచున్నాను వినుము.

ద్రష్టుం ప్రవృత్తో రన్ధ్రేణ యేన తచ్చక్షురుచ్యతే
యచ్చ పశ్యామి తద్దృశ్యం దర్శనం తు ఫలం తతః. 22

యదా పశ్యామి కాలోఽసౌ యథా పశ్యామి స క్రమః
ప్రౌఢా నియతిరిత్యస్య యత్ర పశ్యామి తన్నభః. 23

ఏ రంధ్రముచేఁ జూచుటకుఁ బ్రవృత్తుఁడనైతినో దానిని నేత్రమందురు. దేనిని జూచితినో అది దృశ్యము. దర్శనమద్దాని ఫలము. ఎపుడు చూచితినో అది కాలము; ఎట్లు చూచితినో అది క్రమము, ఎచట చూచితినో అది యాకాశము; ఇట్లు దృఢమగు నియతి ఆత్మకుఁ బ్రవృత్తమాయెను.

స్థితోఽస్మి యత్ర దేశోఽసావిత్యద్యైషా ప్రకల్పనా
తదా త్వహం చిదున్మేషమాత్రాత్తన్మాత్రకారణమ్. 24

మఱియు ఎచట నుంటినో అది దేశము -- ఇత్యాదికల్పన ఆత్మకు సిద్ధించెను. అపుడాసమస్తము చైతన్యముయొక్క స్ఫురణ మాత్రమే యనియు అద్దాని కారణము నేనే యనియు ననుభవము నొందితిని.

పశ్యామీతి తతస్తత్ర మనాగ్బోధా మమోదభూత్
తతో రన్ధ్రద్వయేనాహ మపశ్యం యత్తదవ్యఖమ్. 25

నేత్రములను రెండు ద్వారములగుండా నేనెపుడు చూడ మొదలిడితినో అపుడు 'ఈ చూచునది యంతయు చిదాకాశమాత్రమే' అను నొకింత బోధ నాకుఁ గలిగెను.

యాభ్యామపశ్యం రన్ధ్రాభ్యాం త ఇమే లోచనే స్థితే
తతః కించిచ్ఛృణోమీతి సంవిదిత్యుదితా మమ. 26

తతః కించిన్మనాఙ్మాత్రం ఝంకారం శ్రుతవానహమ్
ప్రధ్మాతస్యేవ శఙ్ఖస్య శబ్దం వ్యోమ్నః స్వభావజమ్. 27

యాభ్యామహమథాశ్రౌషం త ఇమే శ్రవణశ్రవణే
ప్రదేశాభ్యాం విచరతా మరుతా వితతస్వనమ్. 28

ఏ రంధ్రములగుండా చూచితినో, అవి నేత్రములై వర్తించెను. పిదప ఒకింత విందునను చిత్తవృత్తి నాకుదయించెను. అపుడు శంఖనాదమును బోలినదియు, ఆకాశమునకు స్వాభావికమైనదియు నగు ఝంకారశబ్దమును గొంచెము వింటిని. అట్లు చలనశీలమగు వాయువుతోగూడిన యే ఛిద్రములగుండా వ్యాప్తమగు ధ్వనిని నేను వింటినో, ఆ రెండును కర్ణరంధ్రములనబడును.

స్పర్శసంవేదనం కించిదహమత్రానుభూతవాన్
యేన నామ ప్రదేశేన తేన సా త్వక్చ కథ్యతే. 29

యేనస్పృష్టమివాఙ్గం తత్తదాహమనుభూతవాన్
సత్సంవేదనమాత్రాత్మా సోఽయం వాయురితి స్మృతః. 30

పిమ్మట ఏ ప్రదేశమునుండి నేను స్పర్శజ్ఞానము ననుభవించితినో యద్దానిని 'త్వక్కు' అందురు. దేనిచే స్పృశింపఁబడిన యంగముల నపుడనుభవించితినో అది సత్ - సంవేదనమాత్ర రూపమగు (స్పర్శేంద్రియ విషయమైన) వాయువనఁబడును.

స్పర్శనేన్ద్రియతన్మాత్రమితి వేదిని సంస్థితమ్
ఆస్వాదసంవిద్యాభూన్మే తదాస్వాద్య రసేన్ద్రియమ్. 31

ప్రాణాన్మే ఘ్రాణతన్మాత్రముదితం వ్యోమరూపిణః
ఇత్థం న కించిత్సం పన్నం సర్వం సంపన్నమత్ర మే. 32

ఇవ్విధమున స్పర్శేంద్రియముయొక్క యనుభవకర్త నెపుడైతినో, అపుడు రసాస్వాదమొనర్ప నిచ్ఛ జనించెను. తోడనే రస సహితమగు రసనేంద్రియమేర్పడెను. అట్లే ఘ్రాణించుటను గూర్చిన సంకల్పముచే ఘ్రాణేంద్రియము సంభవించెను. ఈ ప్రకారముగ ఆకాశరూపుఁడ నగు నాకట సమస్తదేహేంద్రియ విషయసంపత్తి చేకూరెను. కాని వాస్తవముగ నేమియుఁ జేకూరనిదియే యగును.

ఏవమిన్ద్రియతన్మాత్రజాలం చేత్తత్ర సంస్థితః
యావత్తావద్విదః పఞ్చ బలాదేవ మమోదితాః. 33

శబ్ద రూప రస స్పర్శ గన్ధమాత్రశరీరికాః
అనాకారాస్తథా భాతస్వరూపిణ్యో భ్రమాత్మికాః. 34

ఓ రామచంద్రా! ఇట్లు ఇంద్రియ తన్మాత్ర సమూహమంతయు నాయందచట స్థితిగలదాయెను. అత్తఱి వాస్తవముగ మిథ్యారూపములును, భ్రమాత్మికములును నగు శబ్ద స్పర్శ రూప రస గంధములయొక్క భోగజ్ఞానము నాకు బలాత్కారముగ నుదయించెను,

ఏవం రూపమహం జాలం భావయన్యత్తదాస్థితః
తదహంకార ఇత్యద్య కథ్యతే త్వాదృశైర్జనైః. 35

ఏష ఏవ ఘనీభూతో బుద్ధిరిత్యభిధీయతే
సాథ బుద్ధిర్ఘనీభూతా మన ఇత్యభిధీయతే. 36

ఈ ప్రకారముగ దేహేంద్రియ విషయముల నభిమానించుచు నేనుంటిని. అట్టి యభిమానమే నీవంటివారిచే 'అహంకార'మని చెప్పఁబడినది. ఆ బుద్ధియే సంకల్పవికల్పములచే ఘనీభూతమైన మనస్సనఁబడుచున్నది. అదియే విషయములను మరల మరల స్మరించుటవలన చిత్తమని యెంచఁబడుచున్నది.

అన్తఃకరణరూపత్వమేవమత్రాహమాస్థితః
ఆతివాహిక దేహాత్మా చిన్మయవ్యోమరూపవాన్. 37

పవనాద్యప్యహం శూన్యః కేవలాకాశమాత్రకః
సర్వేషామేవ భావానాం శూన్యాకృతిరరోధకః. 38

ఇవ్విధమున వాస్తవముగ చిదాకాశరూపుఁడనగు నేను సూక్ష్మశరీరధారినై, అంతఃకరణ రూపుఁడనై యట నుంటిని. మఱియుఁ వాయువుకంటె సూక్ష్మమైన యాకృతి గల్గి కేవలము ఆకాశ మాత్రుఁడనై, నిరాకారుఁడ నగుటచే నేపదార్థమును నిరోధించనివాఁడనై యుంటిని.

అథైవం భావనాద్బ్రహం యదా తత్ర చిరం స్థితః
తదాహం దేహవాన్స్రష్ట ఇతి మే ప్రత్యయోఽభవత్. 39

తేనాహం ప్రత్యయేనాథ శబ్దం కర్తుం ప్రవృత్తవాన్
శూన్య ఏవ యథా సుప్తః స్వప్నోడ్డీననరో రవమ్. 40

ఇట్లా పూర్వకల్పితమగు బ్రహ్మదేవుని శరీరమున భావన చేయుచు చిరకాలమెపుడు నే నుంటినో, అపుడు 'నేను చతుర్ముఖ దేహధారినై యున్నాను' అను వృత్తి నాకుఁ గలిగెను. అట్టి వృత్తితోఁగూడి యపుడు స్వప్నస్థమనుజునివలె శూన్యాకాశమున నెగురుచు నేను శబ్దమొనర్పఁ దొడఁగితిని.

అథ పూర్వం కుతః శబ్దో బాలేనేవ తదోమితి
తతః స ఏష ఓంకార ఇతి నీతః పునః ప్రథామ్. 41

అట్లు పూర్వము బాలరూపుఁడనగు నేను ప్రథమమున నేశబ్దముచ్చరించితినో, అయ్యది మరల ప్రపంచమున 'ఓంకార'రూపముచేఁ ప్రసిద్ధికెక్కెను.

తతః స్వప్ననరేణేవ యత్కించిద్గదితం మయా
తదేతద్విద్ధి వాచం త్వం పశ్చాన్నీతాం ప్రథామిహ. 42

ఓ రామచంద్రా! తదుపరి స్వప్నమందలి మనుజుని శబ్దమువలె పూర్వాభ్యస్తములగు గాయత్రీ, వేదాదులవేని నేను బలికితినో అవి ప్రపంచమున వాణీరూపముచేఁ ప్రసిద్ధికెక్కెనని యెఱుఁగుము.

బ్రహ్మైవ సోఽస్మి సంపన్నః సృష్టేః కర్తా జగద్గురుః
తతో మనోమయేనైవ కల్పితాః సృష్టయో మయా. 43

ఈ ప్రకారముగ నేను సృష్టికర్తయు, జగద్గురువునకు బ్రహ్మదేవుఁడనేనైతిని. పిమ్మట అట్టి మనోమయుఁడనగు నాచే ననేకసృష్టులు కల్పింపబడెను.

ఏవమస్మి సముత్పన్నో న తు జాతోస్మి కించన
దృష్టవానస్మి బ్రహ్మాణ్డం బ్రహ్మాణ్డాన్తం న కించన. 44

అట్లు బ్రహ్మరూపుఁడనై నేను నిజస్థూలశరీరమును అవరణసహిత బ్రహ్మాండమును, తద్బ్రహ్మాండముయొక్క బాహ్యరూపమును గాంచితిని. కాని వాస్తవముగ న దృశ్యమెద్దియు లేసిదేయైయున్నది.

ఏవం జగతి సంపన్నే మమైతస్మిన్మనోమయే
న కించిత్తత్ర సంపన్నం తచ్ఛూన్యం వ్యోమ కేవలమ్. 45

ఇవ్విధమున మనోమయుఁడనగు నేను జగద్రూపుఁడనైతిని. కాని యథార్థముగ నట్లేమియు గాకయే యున్నాను. ఏలయనిన ఆ సమస్తము (దృశ్య) శూన్యమైనట్టి కేవల చిదాకాశమే యైయున్నది.

ఇత్థం సంశూన్యమేవేదం సర్వం వేదనమాత్రకమ్
మనాగపి న సన్త్యేతే భావాః పృథ్వ్యాదయః కిల. 46

ఓ రామచంద్రా! ఇట్లు నా సృష్టివలెనే తక్కిన సమస్తసృష్టులున్ను (దృశ్య) శూన్యములై, చిదాకాశమాత్రములే యైయున్నవి. కావున వాస్తవముగ ఈ పృథివ్యాది పదార్థము లెవ్వియును నొకింతైనను లేకయే యైయున్నవి

జగన్మృగతృష్ణామ్బూని భాన్తి సంవిది సంవిదః
న బాహ్యమస్తి నో బాహ్యే ఖే తద్వ్యోమ తథా స్థితమ్. 47

జ్ఞానస్వరూపుఁడగు పరమాత్మయందు జ్ఞానరూపములే యగు అనేకజగత్తులు మృగతృష్ణాజలములవలె భాసించుచున్నవి. వాస్తవముగ బాహ్యమనునదియే లేదు; బాహ్యమందలి జగత్తున్ను లేదు. ఇది యంతయు చిదాకాశమే యవ్విధమున నున్నదగును

మరౌ నాస్త్యేవ సలిలం సంవిత్పశ్యతి తత్తథా
నిర్మూలమన్తః సంతప్తా స్వసంభ్రమవతీ భ్రమమ్. 48

నాస్త్యేవ బ్రహ్మణి జగత్సంవిత్పశ్యతి తత్తథా
నిర్మూలమేవ సంవిత్త్వాదేవం భ్రాన్తేశ్చ సంభ్రమమ్. 49

మరుస్థలమున నిజముగ జలము లేదు. కాని కారణములేకయే యంతఃకరణమున సంతప్తమై బుద్ధియే యట్లు జలభ్రాంతిని వీక్షించుచున్నది. అట్లే బ్రహ్మమందును వాస్తవముగ జగత్తులేదు. నిష్కారణముగనే అజ్ఞానావృతమగు సంవిత్స్వభావముచే ఆత్మ జగద్భ్రాంతిని గాంచుచున్నది.

అసదేవేదమాభాతి హృద్యేవ జగదాతతమ్
సంకల్పనమనోరాజ్యం యథా స్వప్నపురాదివత్. 50

సంకల్పనగరమువలెను, మనోరాజ్యమువలెను, స్వప్నపురాదులవలెను ఈ జగత్తు అసత్తే యగుచు హృదయమున వ్యాపించియున్నది.

పార్శ్వసుప్త జనస్వప్నస్తచ్చిత్తావేశనం వినా
యథా న కించిత్తచ్చిత్తావేశనాదనుభూయతే. 51

తథా జగత్తద్దృషదం సంప్రవిశ్యానుభూయతే
ఆదర్శబిమ్బితాకారం దృష్టమప్యన్యథాప్యసత్. 52

ప్రక్కన నిదురించుచున్న మనుజుని స్వప్నమును నాతని చిత్తమందుఁ బ్రవేశింపకుండ నెవ్వఁడును నొకింతైనను ననుభవింపఁజాలనట్లు ఆ జగత్కల్పన కధిష్ఠానభూతమగు చిత్ - శిలయందుఁ బ్రవేశింపనిచో, అద్దమందుఁ బ్రతిబింబించినదానివంటిదియు, వాస్తవముగ అసత్తున్నగు ఆ జగత్తు నెవ్వఁడును గాంచఁజాలఁడు.

ఆధిభౌతికభావేన నేత్రేణ యది లక్ష్యతే
తత్తన్న దృశ్యతే కించిద్గిరిరేవ ప్రదృశ్యతే. 53

అధిభౌతిక (స్థూల)రూపమగు నేత్రముచే గాంచఁబడినచో, ఆ శిలయందలి బ్రహ్మాండములెవ్వియు గానుపింపవు. లోకాలోకపర్వతమే కానుపించును.

ఆతివాహికదేహేన పరం బోధదృశా యది
ప్రేక్ష్యతే దృశ్యతే సర్గః పరమాత్మైవ చామలః. 54

ఆతివాహిక (సూక్ష్మ)దేహముతో పరమబోధదృష్టిచే జూడఁబడినచో, ఆ శిలయందలి సృష్టి కానుపించును. అట్టి యోగుల దృష్టియందయ్యది నిర్మల పరమాత్మరూపమే యగును.

సర్వత్ర సర్గనిర్వాణం ప్రజ్ఞాలోకేన లక్ష్యతే
బ్రహ్మైవాన్యథా చేత్తన్న కించిదఖిలక్ష్యతే. 55

జ్ఞానదృష్టిచే ఈ సృష్టి సర్వత్ర నిర్వాణరూపమగు బ్రహ్మముగనే గన్పట్టును. అట్టి దృష్టి లేనిచో నట్లేమియు గానుపింపకుండును.

యత్పశ్యత్యవదాతా ధీః సోపపత్తివిచారణా
న తన్నేత్రైస్త్రిభిః శర్వో నేన్ద్రో నేత్రశతైరపి. 56

ఉపపత్తి విచారణా సహితమగు శుద్ధబుద్ధి దేనిని గాంచునో, అద్దానిని త్రినేత్రములచే శివుఁడుగాని, నేత్రశతముచే నింద్రుఁడుగాని గాంచఁజాలఁడు.

యథా ఖమావృతం సర్గైస్తథా భూరితి బుద్ధవాన్
తథాహమభవం ధ్యాతా ధరాధారణయాన్వితః. 57

ఆకాశమువలెఁ బృథివియు సృష్టులచేఁ బూర్ణమై యున్నదని యోగదృష్టిచే నేనెపుడెఱిగితినో, అపుడు పృథివియొక్క ధారణతోగూడినట్టి ధ్యాతనైయుంటిని.

తయా ధరా ధారణయా ధరారూపధరోఽభవమ్
అత్యజన్నేవ చిద్వ్యోమవపుః సమ్రాడివాచిరాత్. 58

అత్తఱి చక్రవర్తి తన దేహమందలి అహంభావమును త్యజింపకయే సమస్తభూమండలమందును మమత్వము నెట్లు ధరించునో, అట్లే నేను నా చిత్స్వరూపమును పృథివి యందలి అహంభావముచేఁ బృథివీరూపధారినై యొప్పితిని.

ధరాధారణయా చైవ ధరాధాతూదరం గతః
ద్వీపాద్రితృణవృక్షాది దేహోఽహమనుభూతవాన్. 59

అట్లు పృథివియొక్క ధారణచే నేను పృథివ్యభిమానియగు జీవునియొక్క బుద్ధితోటి తాదాత్మ్యమును బొందినవాఁడనై ద్వీప, పర్వత, తృణ, వృక్షాదులను నా శరీరమువలెనే యనుభవించితిని.

సంపన్నోఽస్మ్యథ భూపీఠం నానావనతనూరుహమ్
నానారత్నావలీ వ్యాప్తం నానానగరభూషణమ్. 60

గ్రామగహ్వరపర్వాఢ్యం పాతాలసుషిరోదరమ్
కులాచలభుజాశ్లిష్టద్వీపాబ్ధివలయాన్వితమ్. 61

తృణౌఘతనురోమాఢ్యం గిరిఖణ్డకగుల్మకమ్
దిగ్వారణకటవ్యూహధృతం శేషశిరః శతైః. 62

హ్రియమాణం మహీపాలైః శోభమానేభతస్తుభిః
ప్రాణిభిర్భుజ్యమానాఙ్గం వర్ధమానం వ్యవస్థయా. 63

హిమవద్విన్ధ్యసుస్కన్ధం సుమేరూదారకన్ధరమ్
గఙ్గాదిసరిదాపూరముక్తాహారరణత్తనుమ్. 64

గుహాగహనకచ్ఛాదిసాగరాదర్శమణ్డలమ్
మరూషరస్థలశ్వేతసువరామ్బరసున్దరమ్. 65

భూతపూర్వైః పరాపూర్ణం పరిపూతం మహార్ణవైః
అలంకృతం పుష్పవనైః సమారబ్ధం రజోఘనైః. 66

నిత్యం కృషీవలైః కృష్టం వీజితం శిశిరానిలైః
తాపితం తపనైస్తప్తైరుక్షితం ప్రావృడమ్బుభిః. 67

విపులాగ్రస్థలోరస్కం పద్మాకరకృతేక్షణమ్
సితాసితఘనోష్ణీషం దశాశోదరమన్దిరమ్. 68

లోకాలోకమహాఖాతవలయోగ్రాస్యభీషణమ్
అనన్తభూతసంఘాతపరిస్పన్దైకచేతనమ్. 69

వ్యాప్తమన్తర్బహిశ్చైవ నానాభూతగణైః పృథక్
దేవదానవగన్ధర్వైర్బహిరన్తస్తు కీటకైః. 70

పాతాలేన్ద్రియరన్ధ్రేషు నాగాసురకృమివ్రజైః
సప్తస్వర్ణవకోశేషు నానాజాతిజలేచరైః. 71

ఆ సమయమున నేను వివిధవనవృక్షములచే వ్యాప్తమైనదియు, పలువిధరత్నములచే శోభిల్లునదియు, వివిధ నగరములచే భూషితమైనదియునగు పృథివీరూపమును బొందితిని. మఱియు ననేక గ్రామ, అరణ్యములను పర్వము (గనుపు) లు గలదియు, పాతాళబిలమును ఉదరముతోఁ గూడినదియు, సప్తకులపర్వతములను భుజములచే నొప్పునదియు, ద్వీప, సముద్రములను [illegible]

ములు గల్గియున్నదియు తృణసమూహమను రోమములచేఁ బూర్ణమైనదియు, పర్వతఖండములను గుల్మరోగగ్రంథులు గలదియు దిగ్గజముల మస్తకములచేతను, శేషుని వేయిశిరములచేతను ధరింపఁబడినదియు, శోభాయమానములగు గజములతోఁగూడిన సేనాసమూహమను తంతువులుగల రాజులయొక్క పరస్పర యుద్ధములచే నీడ్వఁబడునదియు. ప్రాణులచే ననుభవింపఁబడు శరీర, నగర, గ్రామాదుల వ్యవస్థచే వృద్ధిఁబొందినదియు, హిమాలయ వింధ్యపర్వతములను నుత్తమ స్కంధము (మూఁపు) లు గలదియు, సుమేరు పర్వతమను గొప్పకంఠము గల్గియున్నదియు, గంగా యమునాది నదులయొక్క ప్రవాహములను ముత్యాలహారములచే శబ్ధితమగుచున్న శరీరముతోఁ గూడినదియు, గుహలచే దట్టములైనట్టి పర్వతములతోఁగూడిన తీరముగల్గియున్న సముద్రములను నద్దములచే శోభించునదియు, మరుప్రదేశ, ఊషరస్థలములను శ్వేతవస్త్రములచే సుందరమైనదియు, పూర్వపు ప్రళయకాల మహాసముద్రములందు స్నానముచేసి బయల్వెడలుటచేఁ నంతట, బవిత్రమైనదియు, పుష్పవనములచే నలంకృతమైనదియు, చందనధూళులచే లిప్తమైనదియు, కృషీవలులచే నెల్లపుడు దున్నఁబడునదియు, శీతలవాయువులచే వీవఁబడునదియు, సూర్యకిరణములచేఁ దపింపఁబడునదియు, వర్షాజలముచేఁ దడుపఁబడునదియు, విశాల సమప్రదేశమను వక్షఃస్థలముతోఁ గూడియున్నదియు, కమల సరోవరములను నేత్రములు గలదియు, సూర్య చంద్రులను దలపాగచే శోభించునదియు, దశదిక్కులను నుత్తమమందిరములచే నొప్పునదియు, లోకాలోక పర్వత సమీపమునగల గొప్ప కందకమను భీషణముఖముచే భయంకరమైనదియు, అనంతకోటి జీవుల చలనమే చలనముగను; వారి చైతన్యమే చైతన్యముగను గల్గియున్నదియు, బాహ్యాభ్యంతరములందును అనేక భిన్న భిన్న ప్రాణికోట్లచే వ్యాప్తమైయున్నదియు, బాహ్యమున దేవ, దానవ, గంధర్వాదులతోను, అభ్యంతరమున కృమికీటాదులతోను గూడియున్నదియు, పాతాళమను నింద్రియఛిద్రములందు నాగ, అసురులను కృమిసమూహములచేతను. సప్తసముద్రములందు జలచరములచేతను వ్యాప్తమైయున్నదియు నగు పృథివీరూపమును బొందితిని.

వ్యాప్తం నదీవనసముద్రదిగన్తశైల
ద్వీపాఖ్యజన్తువిషయస్థలజఙ్గలౌఘైః
నానావలీవలితమణ్డలకోశఖణ్డం
వల్లీసరః సరిదరాతిగణాబ్జఖణ్డైః. 72

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే పార్థివధాత్వన్తర్గత జగదానన్త్య ప్రతిపాదనం నామ సప్తాశీతితమః సర్గః ॥ 87 ॥

మఱియు ఓ రామచంద్రా! అపుడు నేను నదీ, వన, సముద్ర, దిగంత, పర్వత, ద్వీపాదులతోఁగూడినదియు, ప్రాణుల భోగ్యపదార్థములచే యుక్తమైనదియు స్థల, అరణ్యాదుల సమూహములచేతను, వివిధపర్వతనద్యాదులచే వేష్టితములగు మండల ప్రదేశములచేతను, లతా, తటాక, కమలాదులచేతను వ్యాప్తమైనట్టి భూతలరూపమును బడసితిని.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున పార్థివధాత్వన్తర్గత జగదానన్త్య ప్రతిపాదనమను నెనుబది యేడవ సర్గము ॥ 87 ॥

అష్టాశీతితమః సర్గః

[స్వదేహభూతే భూపీఠే తత్ర తత్ర వ్యవస్థితాః
విశేషా ఇహ వర్ణ్యన్తే కౌతుకాత్స్వేన వీక్షితాః.

నిజదేహరూపమగు భూతలమున నచటచట వర్తించునవియు, కౌతుకముతో తన చేతనే వీక్షింపఁబడినవియునగు విశేషములను వసిష్ఠుఁడిచట వర్ణించుట కాననగును.]

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

భూపీఠేన సతా తత్ర మయా తదను మానవ
అనుభూతం నదనదీస్వసంవేదనసంస్థితేః. 1

శ్రీ వసిష్ఠుఁడు:— మనువంశోద్భవుఁడవగు రామచంద్రా! అట్లు భూతలరూపమును బొందిన నేనపుడు తదంతర్గతములగు నదనదీసముద్రాది విశేషాకారములయొక్క స్థితిచే నేమేమి యనుభవించితినో వినుము.

క్వచిన్మరణసాక్రన్దనారీకరుణవేదనమ్
క్వచిదుత్తాణ్డవస్త్రైణమహోత్సవ మహాసుఖమ్. 2

క్వచిద్దుర్వారదుర్భిక్షదురాక్రన్దం దురీహితమ్
క్వచిత్సకలసస్యౌఘసంపన్నఘనసౌహృదమ్. 3

క్వచిదగ్నిమహాదాహదగ్ధదేహోగ్రవేదనమ్
క్వచిజ్జలప్లవాలూనపురపత్తనఖణ్డకమ్. 4

క్వచిచ్చపలసామన్తకృతలుణ్ఠనమణ్డలమ్
క్వచిదుద్దామదౌరాత్మ్య రక్షః పైశాచమణ్డలమ్. 5

క్వచిజ్జలాశయోల్లాసవేల్లనోత్పులకాగ్రకమ్
కన్దరోదరనిష్క్రాన్తవాతవేల్లితవారిదమ్. 6

సంవిదోఘోన్నమత్ప్రాజ్ఞకేశోత్థాఙ్కురలోమకమ్
వారివాహనవిక్షోభనతోన్నతలసత్తలమ్. 7

సశృఙ్గఖైరవశ్వభ్రపురాద్రివనపత్తనమ్
సంవిన్మణ్డలసంచాలలేఖాఙ్కమృదుకల్పనమ్. 8

ఆ భూతల మొకచోట, పతిపుత్రాదుల మరణమువలనఁ గరుణచే నేడ్చుచున్న స్త్రీల రోదనముచే వ్యాప్తమైనదియు, ఒకచోట స్త్రీల నృత్యగానాద్యుత్సవములచే మహాసుఖసహితమై యున్నదియు, ఒకచోట గొప్పక్షామమువలన నేడ్చుచున్న జనులతోఁగూడి దుష్ట చేష్టాయుతమై యున్నదియు, ఒకచోట సమస్త ధాన్యసమూహములతోఁ దులతూగుచు నుత్తమస్నేహయుక్తమై యొప్పుచున్నదియు, ఒకచోట అగ్నియొక్క మహాదాహముచే దేహములు దగ్ధములుకాఁగా భయంకర పీడతోఁగూడియున్నదియు, ఒకచోట జలప్రవాహముచే గ్రామనగరాదులు మునుంగుటచే భయోత్పాదకమై యున్నదియు, ఒకచోట దేశములను గొల్లగొట్టు చపలసామంతులతోఁగూడినదియు,

ఒకచోట ప్రచండ రాక్షస, పిశాచాదుల దుష్టచేష్టలతోఁ గూడియున్నదియు, ఒకచోట జలసమృద్ధితోఁ గూడినవై ధాన్యాదుల యంకురములచే రమణీయములైనట్టి క్షేత్రములచే నొప్పునదియు, ఒకచోట గుహాంతర్భాగములనుండి బయల్వెడలిన వాయువుచే నొకింత చలింపఁజేయబడిన మేఘములచే శోభించునదియు, హర్షముచేఁ బులకితములైన నిజకేశములవలె వెలయుచున్న యుత్థితములైన అంకురములను రోమములు గలదియు, ఒకచోట జల ప్రవాహముయొక్క విక్షోభమువలన ఉన్నత, అవనత స్థలములతోఁగూడి శోభించునదియు, తమయందలి పెద్దపెద్ద శిలలవలన శృంగసహితములుగ భాసించు భయంకర గర్తములతోఁగూడిన నగరగ్రామ, వనాదులు గల్గియున్నదియు, ఒకచోట నగరవాసులను బడఁగొట్టుటఁగూర్చిన శంకనుగల్గించునట్టి మృదు సంచలనముతో కూడియున్నదియునై వెలయుచుండెను.

క్వచిత్త్రామ స్తసంక్షుబ్ధ సైన్యసంహరణం రణే
క్వచిత్సౌమ్యసుఖాసీనసర్వసామ న్తమణ్డలమ్. 9
అరణ్యం క్వచిదాశూన్యముల్లసద్వాతఝుంకృతి
జంగలం క్వచిదాలూనవ్యుప్తసంపన్నసస్యకమ్. 10
హంసకారణ్డవాకీర్ణసరఃఫుల్లామ్బుజం క్వచిత్
క్వచిన్మరుస్థల స్థూల స్తమ్భనార్జునమారుతమ్. 11
క్వచిన్నదనదీవాహహేలానికషఘర్ఘరమ్
క్వచిదఙ్కురకార్యాఙ్గసిక్తబీజస్య జృమ్భణమ్. 12
క్వచిదన్తస్థ కీటాస్యమృదుస్పన్దనవేదనమ్
మాం త్వమేవాశు బుద్ధ్వేహ త్రాయస్వేతీవ బోధనమ్. 13
శాఖాపరికరాభోగం మృద్భాగాఙ్గనిపీడనైః
మూలజాలమవష్టభ్య క్వచిద్విటపధారిణమ్. 14
అన్యోన్యమలమాక్రమ్య దిక్తటాఙ్గనిపీడనైః
క్వచిదద్రిస్థనిబిడై రర్ణవోల్లాసవేల్లితమ్. 15
శుష్కపల్లవసంకోచనిబిడాఙ్గనిపీడనమ్
అమర్షణైః కరైరార్కైః స్వరసాకర్షణం క్వచిత్. 16

మఱియు, ఆ భూతల మొకచోట యుద్ధమందు సామంతరాజుల సంక్షుబ్ధసైన్యముయొక్క సంహారములచే భయంకరమైనదియు, ఒకచోట సుఖముగను, శాంతముగనున్న సమస్త సామంతగణముతోఁ గూడియున్నదియు, ఒకచోట వాయువుయొక్క ఝుంకార శబ్దముగల్గియున్నదియు, వేఱొకచోట నంతటను నరణ్యాయుతమైనదియు, ఒకచోట మొదటఁ గోయబడినవియు, మరల నాటఁబడినవియునగు యనేక ధాన్యాదులచే శోభించునదియు, ఒకచోట హంస, కారండవాది పక్షులచే వ్యాప్తములైయున్న సరోవరములందు వికసించిన కమలములతోఁగూడి యున్నదియు, ఒకచోట మరుభూమియందు సుడిగాల్పులచే లేవఁగొట్టబడిన ధూళిచే స్థూలములగు స్థంభాకారములను గాన్పించునట్టి [illegible] ...ంకరమైనది [illegible], ఒకచోట నదీనదముల

ప్రవాహములయొక్క పరస్పర సంఘర్షణముచే ఘర్ఘరశబ్దయుక్తమైనదియు, ఒకచోట కాలువలచేతను, ఘటీయంత్రాదులచేతను దడుపఁబడిన క్షేత్రములందలి బీజాదులయొక్క వృద్ధితోఁగూడియున్నదియు, ఒకచోట శిలాదులందు సంకటముల ననుభవించుచు నన్నెఱిఁగి 'ఓ వసిష్ఠమునీంద్రా! నన్ను రక్షింపుము' అను కీటముయొక్క ప్రార్థనగల్గియున్నదియు, ఒకచోట వటాదివృక్షములయొక్క శాఖలు భూమికిఁ దగులుటచే అచటి మృద్భాగమును బీడించునట్టి శాఖాపరికరములతోఁ గూడినదియు, ఒకచోట మూలసమూహము నవలంబించి వృక్షములను ధారణయొనర్చునదియు, ఒకచోట పరస్పర సంఘర్షణముచే దిక్తటములఁ బీడించునవై శిలవలె దట్టములైనట్టి వృక్షములచే సముద్రక్షోభచేవలె వేష్టితమైయున్నదియు, ఒకచోట ఘనీభూతములగు వృక్షములవలన భూమిపైకి తమ ప్రసారము నిరోధింపఁబడుటచేఁ క్రుద్ధములైనట్టి సూర్యకిరణములద్వారా తమయొక్క రసమాకర్షింపఁబడుటచే శుష్కించి, ముడుచుకొనిన పల్లవములతోను అవయవములయొక్క విశేష బాధతోను గూడియున్న వృక్షములుగలదియునై యొప్పుచుండెను.

శృఙ్గమన్దిరమాతఙ్గప్రహారాశనిభూరుహామ్
నిబిడాఙ్గోత్కటస్థైర్యపరుషాపతనం క్వచిత్. 17
నిమీలితేక్షణానన్దతనూనామసమాక్రమమ్
క్వచిత్సూక్ష్మతరోల్లేఖమఙ్కురోల్లాసనం నవమ్. 18
మక్షికాయూకమశకనివాససదృశం క్వచిత్
కుడ్యలేశకుభృఙ్గారిహలహేలానికర్షణమ్. 19
శీతం శీతవిశీర్ణాఙ్గజర్జరత్వగ్వికీర్ణవత్
పాషాణీభూతసలిలం క్వచిత్పరుషమారుతమ్. 20
ఉద్దాలీభూతమృద్వ్యఙ్గమజ్జదన్తఃకృమివ్రజమ్
క్వచిదుద్భవదఙ్గాదిమూలం జలనిమజ్జనమ్. 21
శనైరన్తర్నిలీనామ్బుకృతాహ్లాదం బహిశ్చరమ్
సోన్నామాఙ్కురరోమౌఘం క్వచిద్వర్షవిజృమ్భితమ్. 22

ఇంకను, ఆ భూతలమొకచోట పర్వతశిఖరములను మందిరములందలి గజములయొక్క దంతప్రహారములను వజ్రపాతములచే స్థైర్యమును గోల్పోయిన వృక్షములయొక్క దృఢావయవములుగలదియు ఒకచోట నేత్రములు మూసికొని, సూక్ష్మమగు ఆత్మతత్త్వమనుభవించుచు, ఆనంద పరవశముతోఁగూడిన దేహములుగల సమాధినిష్ఠుల అపూర్వమైన రోమాంకురోల్లాసనముతోఁ గూడినదియు, ఒకచోట మక్షిక (ఈఁగ)లయొక్కయు, యూకము (పేను)లయొక్కయు, మశకము (దోమ)లయొక్కయు నివాసమును బోలినదియు. ఒకచోట కమలకోశములందు నిదురించు దుష్ట భ్రమరములయొక్క శత్రురూపులగు యేనుఁగులయొక్క దంతములచే నాఁగళ్ళచేవలె లీలాపూర్వకముగఁ బెల్లగింపబడునదియు, ఒకచోట (హిమాలయాది ప్రదేశములందు) శీతలత్వముచే విదీర్ణములైన అవయవములు గల ప్రాణులయొక్క శిథిలీభూతమైన చర్మముతోఁగూడినదై, జలమును [illegible] గాన్పించునదియు, ఒకచోట కఠినమగు వాయువుచే వ్యాప్తమైయున్నదియు, ఒకచోట

ఖండింపఁబడిన కోమలాంగములందు బ్రవేశించిన కృమికీటాదులుగలదియు, ఒకచోట ఉత్పన్నము లగుచున్న అంగ, మూలాదులతోఁ గూడియున్నదియు, ఒకచోట జలమందు నిమగ్నమైయున్నదియు. ఒకచోట వర్షాభివృద్ధిచే లోనబీజములందు మెల్లమెల్లగ వర్షజలము ప్రవేశించుటవలన నానంద యుక్తమై బాహ్యప్రదేశమున సంకురరూపమగు రోమాంచముతోఁ కూడియున్నదియునై వెలయు చుండెను. – ఓ రామచంద్రా! ఇవ్విధముననే నా భూతలరూపమగు శరీరమును ననుభవించితిని,

తనుతరపవనవికమ్పిత కోమలనలినీదలాస్తరణై:
విహరణమివ మే విహితం సరోఖిరగ్గేషు నిర్వాణమ్. 23

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే భూమణ్డలగతవిశేషవర్ణనం నామాష్టాశీతితమః సర్గః ॥ 88 ॥

ఓ రామచంద్రా ! ఆ నాభూతల రూపములగు అవయవములందొకచోట సూక్ష్మ వాయువుచేఁ జలింపఁజేయఁబడు కోమలమునైన కమలదళములయొక్క విస్తారముచే మహదానంద రూపమగు క్రీడవలె వర్తించుచుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున భూమండలగత విశేషవర్ణనమను నెనుబది యెనిమిదవ సర్గము ॥ 88 ॥

ఏకోననవతితమః సర్గః

[అత్ర తద్ధారణాదృష్టం భూమణ్డలమిదం తథా
జగత్సర్వం చ చిద్వ్యోమ్ని మనోమాత్రమితీర్యతే.

అట్టి ధారణముచే, గాంచఁబడిన యీ భూమండలమున్ను, సమస్తజగత్తు[illegible] చిదాకాశ మున మనోమాత్రమే యని యిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీరామ ఉవాచః—

పార్థివీం ధారణాం బద్ధ్వా జగన్తి సమవేక్షితుమ్
సంపన్నస్త్వమసా భూమిలోకః కిముత మానసః. 1

శ్రీరాముఁడు:— గురువర్యా! జగంబులను గాంచుటకై పృథివియొక్క ధారణయొనర్చి తామీ కాన్పించు భూలోకమువంటి స్వరూపముఁ జెందితిరా లేక మానసిక రూపముఁ జెందితిరా?

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఇదం చ మానసం చాహం సంపన్నః పృథుభూతలమ్
నేదం న మానసం నైవ సంపన్నో వస్తుతస్త్వహమ్. 2

శ్రీవసిష్ఠుఁడు ఓరామచంద్రా! కల్పనాదృష్టిచే, జూచినచో నేను బొందిన యీ మృత్తికా పాషాణమయమగు ప్రసిద్ధమైన విశాలభూతలరూపము మనోమాత్రవికారమే యగుటచే మానసిక మేయైయున్నది. కాని వాస్తవముగ (తత్త్వదృష్టిచే) నేను భూతలరూపమును గాని, మానసికరూప మునుగాని, బొందకయే యుంటిని.

అమానసం మహీపీఠం న సంభవతి కించన
యదసద్వేత్సి యత్సద్వా మనోమాత్రకమేవ తత్. 3

మనస్సునకు భిన్నముగ భూతల మెద్దియు సంభవింపనేరదు. సత్తుగాని, అసత్తుగాని యగు ఏరూపమును నీవెఱుఁగుచున్నావో. అది యంతయును మనోమాత్రమే యైయున్నది.

చిదాకాశమహం శుద్ధం తస్య మే తత్పదాత్మనః
యచ్చిన్మాత్రాత్మకచనం తత్సంకల్పాభిధం స్మృతమ్. 4

వాస్తవముగ నేను శుద్ధ చిదాకాశరూపుఁడను. అట్టి శుద్ధ చిద్రూపుఁడనగు నా యొక్క స్ఫురణ మెయ్యది గలదో, అదియే సంకల్పమనఁబడును.

తన్మనస్తన్మహీపృష్ఠం తజ్జగత్స పితామహః
సంకల్పపురమద్వ్యోమ్ని కచత్యేతన్మనోనభః 5

అట్టి చిదాత్మయొక్క స్ఫురణమే మనస్సు! అదియే భూతలము; అదియే జగత్తు; అదియే బ్రహ్మదేవుఁడు: ఈ మానసిక ఆకాశము చిదాకాశమున సంకల్పనగరమువలె స్ఫురించు చున్నది.

ఏవం సంకల్పమాత్రం మే మనోమాత్రం తదాతతమ్
ధారణాభ్యాససంపుష్టం భూమణ్డలమితి స్థితమ్. 6

ఈ ప్రకారముగ, ఈ భూమండలము నా యొక్క సంకల్పమాత్రమై, మనోమయమై, ధారణాభ్యాసముచే పరిపుష్టమైయున్నది.

నేదం భూమణ్డలం తద్వై తదన్యద్ధి మనోమయమ్
ఆకాశమాత్ర కచనమచేత్యం కచనం చితేః. 7

ఓరామచంద్రా! ఈ భూమండలము నీవెట్లు గాంచుచున్నావో, అట్లులేదు, మనోమాత్ర మైయున్నది. ఈజగత్తంతయు నిర్విషయమైనట్టి చిదాకాశముయొక్క స్ఫురణమాత్రమే యగును.

తదేవాకాశమాత్రాత్మ తథా భూతం చిరం స్థితమ్
ఇదం ప్రత్యయలబ్ధత్వాన్మానసత్వం సముజ్ఝతి. 8

వాస్తవముగ చిదాకాశమాత్రమై యున్నప్పటికిని ఈజగత్తు తన యీ స్థూలరూపముచేఁ జిరకాలముండియున్నది. మఱియు స్వప్నాదులందుఁ గాంచఁబడు పృథ్వ్యాదులవలె ఇదం (దృశ్య) ప్రతీతికి విషయమైనను, అది తన మానసరూపత్వమును త్యజింపనేరదు.

ఇదం స్థిరం సుకఠినం వితతం భూమిమణ్డలమ్
అస్తీతి జాయతే బుద్ధిర్వ్యోమ్నీవ చిరవేదనాత్. 9

ఆకాశమందలి నీలత్వమువలె, చిరకాలాభ్యాసముచే ఈజగత్తుస్థిరముగను, మహాకఠినముగను, విశాలముగను నున్నది.

న్యాయేనేదమివానేన న స్థితం వసుధాతలమ్
ఇదం చైవైకమేవాద్య సర్గస్యాద్యముపాగతమ్. 10

'వాచారమ్భణం వికారో నామధేయమ్ ....' అనఁగా, ఈ ప్రపంచమంతయు వాక్కునకు మాత్రము విషయమైయున్నదిగాని వాస్తవముగ లేనిదేయగునని యివ్విధమున ప్రతిపాదించు శ్రుత్యుక్తన్యాయము ననుసరించి, అజ్ఞానులకుఁ బ్రసిద్ధముగఁ గన్పట్టు ఈ భూతలము యథార్థముగ లేకయేయున్నది. మనోమయమగు ఆదిసృష్టియొక్క ఆద్యమై, మనోమయమై, ఏకమైనట్టి సూక్ష్మరూప మెయ్యది గలదో, అదియే యిట్లు స్థూలత్వమును బొందియున్నది.

యథా స్వప్నే పురత్వేన చిదేవ వ్యోమ్ని భాసతే
తథా చిదేవ సర్గాదావిదం జగదితి స్థితమ్. 11

స్వప్నమందు చైతన్యమే నగరాదులరూపమున భాసించునట్లు, సృష్ట్యాదియందు చైతన్యమే జగద్రూపముగ స్థితినొందియున్నది.

విద్ధి చిద్రూపబాలస్య మనోరాజ్యం జగత్త్రయమ్
మహీతలాదికం దృశ్యమిదం సర్వం చ సర్వదా. 12

ఓ రామచంద్రా! భూలోకాది ముల్లోకములున్ను, ఈ సమస్తదృశ్యమున్ను సదా చిద్రూపమను బాలకునియొక్క మనోరాజ్యమనియే యెఱుఁగుము.

చిద్రూపస్యాత్మనో నాన్యః సంకల్పస్తన్మయం జగత్
వస్తుతస్తు న సత్యాత్మ న పిణ్డాత్మ న భాసురమ్. 13

చిద్రూపమగు ఆత్మయొక్క సంకల్పము ఆ చైతన్యముకంటె భిన్నముకాదు. అట్టి సంకల్పమయమై యీ జగత్తు వెలయుచున్నది. వాస్తవముగ నిది సత్యముకాదు, ఆకారయుతము కాదు, ప్రకాశమానమున్ను గాదు.

దృశ్యమస్త్యపరిజ్ఞాతం పరిజ్ఞాతం న విద్యతే
పరిజ్ఞాతం తదేవాస్య శృణోషి యదిదం చిరమ్. 14

ఓ రామచంద్రా! చిన్మాత్రమునుగూర్చిన అజ్ఞానముచేతనే యీ జగత్తు కలదు. జ్ఞానముచే లేదు. జ్ఞానముచే నెయ్యది నావలన నీవు బహుకాలము వినుచున్నట్టి యీచిద్రూపమేయగును.

సర్వం చిన్మాత్రమాకాశాన్తం ప్రకచత్యాత్మనాత్మని
భూమణ్డలాత్మ దృశ్యాత్మ ద్వైతైక్యాభ్యాం వివర్జితమ్. 15

ఈ భూమండలాది దృశ్యమంతయు ద్వైత, ఏకత్వరహితమైన శాంతమగు చిన్మాత్రమే తనయందుఁ దానవ్విధమున స్ఫురించుచున్నదగును.

మణిర్యథా స్వభావేన శుక్లపీతాదికాస్త్విషః
అకుర్వన్నేవ కురుతే చిదాకాశస్తథా జగత్. 16

మణి యే వ్యాపారమున్ను గావింపకయే శుక్లపీతాది కాంతులనెట్లు స్వభావముగనే రచించుచున్నదో, అట్లే చిదాకాశమున్ను ఏ వ్యాపారమున్ను గావింపకయే స్వభావముగనే జగత్తును రచించుచున్నది.

యతో న కించిత్కురుతే న చ రూపం సముజ్ఝతి
తస్మాన్న మానసం నేదం కించిదస్తి మహీతలమ్. 17

వాస్తవముగ, పరమాత్మ యేమియును జేయుటలేదు. తన (చిన్మాత్ర) స్వరూపమును ద్యజించుటయులేదు. కావున మానసికరూపముగాని, స్థూలమగు ఈ భూతలరూపముగాని యథార్థముగ లేకయేయున్నది.

మహీతలమివాభాతి చిద్వ్యోమైవ నిరన్తరమ్
ఆత్మన్యేవాతలం వ్యోమ యథామలతలం స్థితమ్. 18

ఆకాశము రూపరహితమైనను, నిర్మల రూపయుక్తముగఁ గానుపించునట్లు, చిదాకాశమే భూతలరూపముగ నిరంతరము కానుపించుచున్నది.

స్వభావమాత్రకచనం తత్తదేవ యథాస్థితమ్
భూమణ్డలమివాత్యచ్ఛం ఖమేవ విశతాన్తరమ్. 19

చిత్-స్వభావమాత్రముయొక్క స్ఫురణమెయ్యది గలదో, అదియే యీ అతినిర్మలమగు భూమండలముగఁ గానుపించుచున్నది. కావున యథార్థముగ చిదాకాశమే (అజ్ఞానముచే) యిట్లు భేదరూపమున గానుపించుచున్నదగును

ఇదం భూమణ్డలం తచ్చ ద్వయమేతన్మహాచితేః
స్వరూపమేవ కచతి తవ స్వప్నపురం యథా. 20

ఓ రామచంద్రా! ఈ భూమండలమున్ను, ఆ నా ధారణాసిద్ధమగు భూమండలమున్ను, రెండును నీయొక్క స్వప్నపురమువలె, మహాచైతన్యముయొక్క స్ఫురణ (వివర్త) మాత్రములే యైయున్నవి,

ఇదమాకాశమాత్రాత్మ తదప్యాకాశమాత్రకమ్
అజ్ఞానాత్మపరిజ్ఞానజ్ఞానాన్నేదం న తత్క్వచిత్. 21

ఇదియున్ను చిదాకాశమాత్రమే, అదియున్ను చిదాకాశమాత్రమే. అజ్ఞానముచేతనే ఇయ్యవి భాసించుచున్నవి; జ్ఞానముచే నిదిగాని, అదిగాని యెచటను లేకయున్నవి.

త్రైలోక్యభూతజాలానాం కాలత్రితయభావినామ్
సంభ్రమః స్వప్నసంకల్పో మనోరాజ్యదశాస్థితా. 22

త్రికాలములందు వర్తించు ముల్లోకములందలి ప్రాణికోట్లయొక్క స్థితి స్వప్నసంకల్పమువలె భ్రాంతిమాత్రమైయున్నది. మఱియు నది మనోరాజ్య దశవంటిదియే యగును.

భూతాన్యథ భవిష్యన్తి వర్తమానాని యాని చ
భూమణ్డలాని తాన్యఙ్గ సత్తాసామాన్యతాం గతా. 23
అహమేవ సమగ్రాణి తేషామన్తగతాన్యపి
తేన తాన్యనుభూతాని తథా దృష్టాని చాఖిలమ్. 24

ప్రియుడవగు రామచంద్రా! భూతభవిష్యద్వర్తమానములందలి యనేక భూమండలములన్నియు అధిష్ఠాన సత్తాసామాన్య (ఆత్మసత్తా) రూపములేయై యున్నవి. కావున 'అవియు' వానియందలి సమస్తపదార్థములున్ను నేనే, యను ధారణచే వానినన్నిటిని నా స్వరూపములుగనే నేనుగాంచితిని. అనుభవించితిని.

చిన్మాత్రమేతదజరం పరమాత్మతత్త్వం
శుద్ధాత్మతామజహదఙ్గగతం బిభర్తి
సర్వం యథాస్థితమిదం జగదాత్తభేదం
బుద్ధం సదజ్ఞన బిభర్తి తు కించవాపి. 25

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే దృశ్యమనోమాత్రత్వ
ప్రతిపాదనం నామైకోననవతితమః సర్గః ॥ 89 ॥

ఓ రామచంద్రా! జననమరణరహితమై, చిన్మాత్రమైనట్టి పరమాత్మ తత్త్వమే అజ్ఞాన దశయందు, తన శుద్ధాత్మరూపమును త్యజింపకయే ఈ యనేక భేదసహితమైన యథాస్థితమగు చరాచర ప్రపంచమును సద్రూపమువలెగావించి భరించుచున్నది. కాని, జ్ఞానదశయందట్లేమియు భరింపకయే యున్నది.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
పాషాణోపాఖ్యానమున దృశ్యమనోమాత్రత్వ ప్రతిపాదనమను
నెనుబదితొమ్మిదవ సర్గము ॥ 89 ॥

నవతితమః సర్గః

[పృథివీ హృదయేఽనన్తజగద్దృష్టిరిహోచ్యతే
జలధారణయా సర్వజలలీలా చ పూర్వవత్.

పృథివియం దనేకజగత్తులఁ గాంచుట, జలధారణచే సంపూర్ణజలముయొక్క లీల దర్శింపఁబడుట యిట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీరామ ఉవాచ:—

అనన్తరం వద బ్రహ్మఞ్జగన్తి భవతా తదా
భూమణ్డలానాం హృదయే క్వచిద్దృష్టాని నైవ వా. 1

శ్రీరాముఁడు:- మహాత్మా! పూర్వము స్వర్ణమయ శిలాదిప్రదేశములం దనేక బ్రహ్మాండములను తాము వీక్షించినట్లు, ధారణాదృష్టియందీ భూమండలములందును ప్రతివస్తువునందట్లు బ్రహ్మాండములఁ గాంచితిరా లేదా?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

పరాత్మజాగ్రత్స్వప్నోర్వీమణ్డలాభూత్మనా మయా
తతోఽనుభూతం హృదయే దృష్టం చ పరయా దృశా. 2

శ్రీవసిష్ఠుఁడు:— ఓరామచంద్రా! పృథివీధారణచే, పరమాత్మయొక్క విభూతియైన జాగ్రదవస్థయందలి భూమండలరూపముచేతను, స్వప్నావస్థయందలి భూమండలరూపముచేతను, ఆయా భూప్రదేశ భేదరూపమగు వాని హృదయమందు, ఈశ్వరసాక్షిదృష్టిచే, దేనిని ప్రత్యక్షముగఁ గాంచితినో, అనుభవించితినో వచించెద వినుము.

యావత్తథైవ సర్వత్ర జగజ్జాలమివ స్థితమ్
సర్వం దృశ్యమయం శాన్తమపి ద్వైతమయాత్మకమ్. 3

ఆ పర్వతశిలయందెట్లనేక బ్రహ్మాండముల నవలోకించితినో, అట్లే యీపృథివ్యాదులందును సర్వత్ర యనేక జగత్సమూహము లుండియుండుటఁ గాంచితిని. ఈ సమస్తదృశ్యమున్ను ద్వైతమయమైయున్నను వాస్తవముగ అద్వైతమగు ప్రశాంతపరమాత్మ స్వరూపమే యైయున్నది.

జగన్తి సన్తి సర్వత్ర సర్వత్ర బ్రహ్మ సంస్థితమ్
సర్వం శూన్యం పరం శాన్తం సర్వమారమ్భమన్థరమ్. 4

ఏలయనఁగా నిట సర్వత్ర జగత్తులున్నుగలవు. సర్వత్ర బ్రహ్మమున్నుగలదు. అట్లే సర్వము (దృశ్య) శూన్యమై, శాంతమైయున్నది. సర్వము అనేక కార్యారంభములచే వ్యగ్రమైయున్నది.

సర్వత్రైవాస్తి పృథ్వ్యాది స్థూలం తచ్చ న కించన
చిద్వ్యోమైవ యథా స్వప్నపురం పరమజాతవత్. 5

స్థూలములైన పృథివ్యాదులు సర్వత్రయుండియున్నవి. కాని వాస్తవముగనవి లేనివేయగును. యథార్థముగ నుత్పన్నముకాకయేయున్న స్వప్ననగరమువలె నంతయు చిదాకాశమే యైయున్నది.

నేహ నానాస్తి నో నానా న నాస్తిత్వం న చాస్తితా
అహమిత్యేవ నైవాస్తి యత్ర తత్ర కుతోఽస్తి కిమ్. 6

ఇట, ఏకముగాని, అనేకముగాని, అస్తిత్వముగాని, నాస్తిత్వముగాని, లేవు. ఎచట, ఏక అనేకాదుల అభిమానియగు 'నేను' యనునదియే లేకయున్నదో, అచట నిఁక నేమి యుండఁగలదు.

అనుభూతమపీదం సదహమిత్యాదిరూపకమ్
నాస్త్యేవ యది వాప్యస్తి తద్బ్రహ్మాజమనామయమ్. 7

అనుభూతములైనను 'నేను' మున్నగురూపములు వాస్తవముగ లేకయేయున్నవి. ఒకవేళ యున్నచో నవి నిరామయమై, అజమైనట్టి బ్రహ్మరూపములేయగును.

యత్స్వప్నపురమేవేదం సర్గాదావేవ చిన్నభః
అస్తితా నాస్తితే తత్ర కీదృశే క్వ కుతః స్థితే. 8

సృష్టికిఁ బూర్వ మీ అహంకారాది జగత్తు చిదాకాశమేయైయున్నందున సృష్ట్యానంతరము చిదాకాశమునఁ గానుపించినను నయ్యది స్వప్నపురము వంటిదేయగును. కావున, ఇఁక నద్దాని యందు అస్తిత్వ, నాస్తిత్వము లెట్లెచట నేరీతి యుండగలవు ?

యథాహం దృష్టవాంస్తాని జగన్త్యవనిరూపధృక్
తథా మయా జలీభూయ దృష్టం తాదృశమేవ తత్. 9

పృథివీరూపమునుధరించి యెట్లనేకజగత్తులను నేను వీక్షించితినో, అట్లే జలరూపమును ధరించియు నవ్విధముననే యనేకజగంబులఁ గాంచితిని.

వారిధారణయా వారి భూత్వా జడమివాజడమ్
సముద్రమన్దిరేష్వన్తశ్చిరం గులగులాయితమ్. 10

చిద్రూపుఁడనైయున్నను జలధారణచే జడమగు జలరూపముఁబొంది సముద్రములను మందిరములందు చిరకాలము 'గుల గుల' శబ్దముగావించితిని.

తృణవృక్షలతాగుల్మవల్లీనాం స్తమ్భనాడిషు
మృద్వలక్షితమారూఢం తవాఙ్గేష్వివ యూకయా. 11
సర్వోత్థానోపమాస్తమ్భే తచ్ఛేదే వలయోపమా
మృద్వా కర్ణాహిగత్యేవ రచనా ప్రకృతోదరే. 12

నీ యంగములందు యూకము (పేను) వసించునట్లు, తృణ, వృక్ష, లతా, గుల్మాదులందు అదృశ్యరూపముచే నేను వసించితిని. మఱియు, ఆ తృణాదులందు మందగతితోఁ గూడిన వాఁడనై, వాని యూర్ధ్వస్థితిఁ బోలియు, వాని ఛేదన భేదనాదులందు వలయాకారముగను నే నుంటిని.

వల్లీతమాలతాలాదిపల్లవేషు ఫలేషు చ
విశ్రమ్య పుష్టయా కృత్యా రేఖావిరచనం కృతమ్. 13
ముఖేనావిశ్య హృదయమృతువైధుర్యధారిణా
హృతా విధురితా భుక్తా లూనా దేహేషు ధాతవః. 14
సుప్తం పల్లవతల్పేషు ప్రాలేయకణరూపిణా
తుల్యకాలమశేషేషు దిక్షు సర్వాస్వఖేదినా. 15
నానాహ్రదనదీగేహగ్రాహిణా విరతాధ్వనా
విశ్రాన్తం సేతుసుహృదః ప్రసాదేన క్వచిత్క్వచిత్. 16

లతలయొక్కయు, తమాల, తాళాది వృక్షముల యొక్కయు, పల్లవ, ఫలాదులందు రసరూపముతోటి విశ్రమించి, కాలక్రమమునఁ బరిపుష్టములగు పత్రాదుల యాకారముచే లోన నాడీసమూహమును రచించితిని. మఱియు, జలాదులఁ బానముచేయు సమయమున ముఖము

గుండా ప్రాణుల హృదయమందుఁ బ్రవేశించి, ఋతువులయొక్క విషమత్వమును ధరించిన నేను వాత, పిత్తాది ధాతువుల నొకచోట ధరించితిని, ఒకచోట వికలత్వ మొందించితిని. ఒకచోట పక్వ మొనర్చితిని. ఒకచోట ఖండించితిని. దుఃఖరహితుఁడనై సర్వదిశలయందును నేకకాలముననే నేను హిమకణ రూపములగు శయ్యలపై శయనించితిని. వివిధ నదీ, జలాశయములయొక్క పథికుల నివాసములను గ్రహించునట్టి నిరంతర ప్రవాహరూపమగు మార్గముచే నలసి సేతువు (ఆనకట్ట) యనుమిత్రుని యనుగ్రహముచే నొక్కొకచోట విశ్రమించితిని.

విదా విదనుసంధానాజ్జడేన తదనాశ్రయాత్
జడాశయేషూల్లసితం జలేనావర్తవర్తినా. 17
మయా దుష్కృతినేవోర్ధ్వశిలాస్వస్థేన భూభృతామ్
స్వావర్తవర్తినా శ్వభ్రపాతేషు శతధా గతమ్. 18
ధూమరూపేణ నిర్గత్య దారుభ్యో గగనార్ణవే
కణరత్నేన నీలర్క్షమణ్యన్తర్వర్తినా స్థితమ్. 19
విశ్రాన్తమభ్రపీఠేషు విద్యుద్వనితయా సహ
భిన్నేన్ద్రనీలనీలేన శేషాఙ్గేష్వివ శౌరిణా. 20

చైతన్యముకాని దానియొక్క అనుసంధానముచేతను, చిత్స్వభావము నాశ్రయింపక పోవుటచేతను, జడాశయము (లేక, జలాశయము) లందు జలముచే ఆవర్తరూపములగు అనేక భ్రమలందు విలాసమొనర్చితిని. ప్రాయశ్చిత్తార్థము కొండచఱియనుండి పడుటకుఁ బ్రవృత్తుఁడగు పాపివలె నేను పర్వతశిలలపైనుండి అస్వస్థతచే బయల్వెడలి సెలయేళ్ళద్వారా గోతులందు బడుటచే నూఱు వ్రక్కలుగ శిథిలమైపోతిని. కాష్ఠములనుండి ధూమరూపముచే బయలుదేఱి యాకాశమను సముద్రమున నీలవర్ణపు నక్షత్రములను రత్నములందు రత్నకణరూపముగ నుంటిని. భిన్నమగు ఇంద్రనీలమణివలె నీలవర్ణయుతుఁడగు విష్ణుభగవానుఁడు లక్ష్మితోఁగూడ శేషుని యంగములపై విశ్రమించునట్లు, మేఘపీఠములందు విద్యుత్తను వనితతోఁగూడ (జలరూపముచే) నేను విశ్రమించితిని.

పరమాణుమయే సర్గే పిణ్డరూపేష్వలక్షితమ్
స్థితమన్తః పదార్థేషు బ్రహ్మణేవాఖిలాత్మనా. 21

పిపీలికాది అతిసూక్ష్మశరీరములందు వాని నాడ్యాది పదార్థములలో పరమసూక్ష్మమైన జలరూపముతోటి, సర్వరూపుఁడగు బ్రహ్మదేవునివలె నుంటిని.

ప్రాప్య జిహ్వాణుభిః సఙ్గమనుభూతిః కృతోత్తమా
యామాత్మనో న దేహస్య మన్యే జ్ఞానస్య కేవలమ్. 22

మధురరసాది రూపముల ధరించి నేను జిహ్వయొక్క పరమాణువుతోటి కలిసి ఆయా రసముల యుత్తమానుభవమును సాక్షాత్కరించుకొంటిని. అట్టి యనుభవమును కేవలము జ్ఞానరూపము అగు ఆత్మయొక్క (విషయానందాకారముగ నావిర్భూతమగు) స్వరూపముగనే నమ్ముచున్నాను గాని దేహముయొక్క స్వరూపముగఁగాదు.

న మయా న చ దేహేన నాన్యే నాస్వాదితాత్మ యత్
తద న్తర్వివృతం చేత్యమజ్ఞానాయ తదప్యసత్. 23

విషయము (దర్శ్యము) అనందరూపముకాదు, కావున, అట్టి విషయము నాచే (అధిష్ఠాన చైతన్యముచే) గాని, దేహముచేగాని, జీవునిచేగాని అస్వాదింపఁబడు ఆత్మసుఖముయొక్క లేశమైనను గల్గియుండమిచే, ఆస్వాదింప యోగ్యముకానేరదు. కావున, చైతన్య మెద్దానిని విషయరూపముగఁ బ్రకాశింపఁజేయుచున్నదో, అది అసత్తున్ను, జీవులను వ్యామోహపఱచునదియునైయున్నది.

సర్వర్తురసరూపేణ నానామోదాని దిక్ష్వలమ్
భుక్తాని పుష్పజాలాని ప్రోచ్ఛిష్టం దదతాలయే. 24
చతుర్దశప్రకారాణాం భూతానామఙ్గసన్ధిషు
ఉషితం చేతనేనేవ జడేనాప్యజడాత్మనా. 25
సీకరోత్కరరూపేణ రథమారుహ్య మారుతమ్
ఆమోదేనేవ విహితం విమలవ్యోమవీధిషు. 26

ఉచ్ఛిష్టమును తుమ్మెదల కొసంగుచు సర్వఋతువులయొక్క రసరూపముచే దిక్కులందు వివిధసుగంధములను, పుష్పసమూహములను నే నాస్వాదించితిని. కల్పనచేఁ జడ (జల) రూపుఁడనైనను వాస్తవముగ చైతన్యరూపుఁడనగు నే నవుడు పదునాల్గు విధములగుజీవుల అవయవ సంధులందు వసించితిని. మఱియు జలకణరూపధారినై, వాయువను రథమెక్కి, నిర్మలాకాశ మార్గములందు జనులను సుగంధముచే నాహ్లాద పఱచుచు విహరించితిని.

రామ తస్యామవస్థాయాం పరమాణుకణం ప్రతి
అనుభూతమశేషేణ యథాస్థితమిదం జగత్. 27

ఓ రామచంద్రా! అట్టి దశయందు పరమాణువునందును (పూర్వము వచించిన పర్వతశిలయందువలె) సంపూర్ణముగ స్థితినొందియున్నట్టి యీ జగత్తును నే ననుభవించితిని.

అజడేన జడేనైవ సమయా జాలయా తయా
అన్తఃసర్వపదార్థానాం జ్ఞాతాజ్ఞాతేన సంస్థితమ్. 28

సమస్తపదార్థముల యాభ్యంతరముల నెఱుఁగునట్టి జ్ఞాతయు, చిద్రూపుఁడను నైయున్నప్పటికి, ఆ జలధారణచే నపుడు అజ్ఞాతవలెను, జడ (జల) రూపమువలెను సర్వత్ర స్థితినొంది యుంటిని.

జగతాం తత్ర లక్షాణి నాశోత్పాతశతాని చ
మయా దృష్టాని రూఢాని కదలీదలపీఠవత్. 29

అరఁటిపట్టలవలె నొకదానిలో నొకటి ప్రరూఢములై వర్తించుచున్న లక్షలకొలఁది బ్రహ్మాండములను, వాని యనేక నాశోత్పాతములను నేనచటఁ గాంచితిని.

ఏవం జగచ్చాజగద్వా సాకారం వా నిరాకృతి
చిన్మాత్రగగనం సర్వమాకాశాధికనిర్మలమ్. 30

ఈ ప్రకారమగు అనేక జగత్తులుగాని, వాని అభావముగాని, సాకారముగాని, నిరాకారముగాని, సమస్తము ఆకాశముకంటె అతినిర్మలమగు చిదాకాశమాత్రమేయై యున్నది.

న కించ న త్వం చ న కించ నేదం శుద్ధః పరో బోధ ఇదం విభాతి
స చాపి నో కించన నాపి శూన్యమాకాశమేవాసి వికాసమాస్స్వ. 31

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే జలజగద్వర్ణనం
నామ నవతితమః సర్గః ॥ 90 ॥

ఓ రామచంద్రా! అవస్థాత్రయ సహితమగు దేహేంద్రియాదులుగాని, ఆకాశాది సమస్త బాహ్య ప్రపంచముగాని వాస్తవముగ నొకింతైనను లేకయేయున్నవి. శోధిత 'తత్త్వం' పదార్థరూపమగు బోధ దృశ్యస్వభావముగాని, అదృశ్యస్వభావముగాని, అదృశ్యశూన్యస్వభావముగాని కానిదై యున్నది. అయ్యది అఖండాకాశరూపమేయగును. అదియే నీవు. కావున, అఖండవాక్యార్థబోధచే సమస్తద్వైతమును విధ్వస్తమొనర్చి శుద్ధచిదాకాశరూపుఁడవై యుండుము.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున
నుత్తరార్ధమున పాషాణోపాఖ్యానమున జలజగ
ద్వర్ణనమను తొంబదవ సర్గము ॥ 90 ॥

ఏకనవతితమః సర్గః

[తేజోధారణయా తేజో భావమాసాద్య వీక్షితాః
సూర్యచంద్రాగ్నిరత్నాది చమత్కారా ఇహోదితాః.

తేజముయొక్క ధారణచే సూర్యచంద్రాగ్నిరత్నాదులను వసిష్ఠుఁడు గాంచెనను విషయ మిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచః—

తతోఽహమభవం తేజస్తేజోధారణయోద్ధయా
చన్ద్రార్కతారకాగ్న్యాదివిచిత్రావయవాన్వితమ్. 1

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! అటుపిమ్మట ప్రదీప్తమగు తేజముయొక్క గొప్ప ధారణచే నేను సూర్యచంద్రాగ్ని నక్షత్రాద్యవయవయుక్తమగు తేజమైతిని.

నిత్యం సత్త్వప్రధానత్వాత్ప్రకాశాకృతిరాజగత్
సర్వం దృశ్యమృతే సర్వచారధ్వాన్తప్రతాపయుక్. 2
దీపాదిభిః శనైః స్నిగ్ధైర్దశాశతవిహారిభిః
ప్రత్యక్షీకృతసర్వార్థం ప్రతిగేహం సురాజవత్. 3

లోకాలోకే చ హృషితైశ్చన్ద్రార్కాద్యంశురోమభిః
పరప్రకాశైకరతైర్ధూరోత్క్షిప్తామ్బరామ్బరమ్. 4

అపుడు, నిత్యము సత్త్వప్రధానుఁడనగుటచే సమస్తజగత్తునందును ప్రకాశాకృతి గలవాఁడనై చోరులను అంధకారమున ప్రతాపశాలినగు తేజోరూపుఁడనైతిని. మఱియు, ఉత్తమరాజువలె అనేక దశల (వత్తుల)తో విహరించు దీపాదులద్వారా ప్రతిగృహమందును సమస్తపదార్థములను ప్రత్యక్ష మొనర్పఁజొచ్చితిని. పరప్రకాశైక తత్పరులును, కనుకనే సర్వజీవులను, సమస్తలోకములను ప్రకాశింపఁజేయుటయందు మిగుల ప్రసన్నులును, పులకితశరీరులునగు సూర్యచంద్రాదుల యొక్క కిరణములను రోమములచే నాకాశముయొక్క యంధకారమను వస్త్రమును దూరముగ విసరివేయసాగితిని.

అన్ధకారస్య దైన్యస్య సమస్తగుణనాశినః
దృశ్యం సద్దృశ్యమనిశం సర్గస్య గుణశాలినః. 5

సమస్త పదార్థములను మఱుఁగుపఱచునదియు, రూపాదిగుణములను నశింపఁజేయునదియు నగు అంధకారమును దీనత్వమును సదా నివర్తించుచు, ఉత్తమదృశ్యమును ప్రత్యక్ష మొనర్చునట్టి తేజోరూపమును నేను ధరించితిని.

తమస్తమాలవరశుః పరిశుద్ధికరం పదమ్
సువర్ణమణిమాణిక్యముక్తాదిజనజీవితమ్. 6
శుక్లకృష్ణారుణాదీనాం నిత్యం జ్యోత్స్నాఙ్కశాయినామ్
పుత్రాణామివ వర్ణానాం సర్వేషాం దేహదః పితా. 7
ఘనస్నేహరసం పృథ్వ్యా రక్షితానల వేదనమ్
గృహం ప్రతి ఘనానన్దైర్వృతదీపకపుత్రకమ్. 8

మఱియు ఆ తేజము అంధకారమను తమాలవృక్షమునకు గండ్రగొడ్డలి వంటిదియు, పరమశుద్ధికి స్థానమున్ను, సువర్ణమణి, మాణిక్యముక్తాదుల రూపమున జీవనహేతువైనదియు, ప్రకాశమను అంగముపై సదా శయనించునదియు, పుత్రులకుఁదండ్రివలె శుక్ల, కృష్ణ, అరుణాది సర్వవర్ణములకును జన్మదాతయు, పృథివియెడల ఘనీభూతమగు స్నేహముగలదియు, కనుకనే పార్థివభాగమును రక్షించి తక్కినదానిని భస్మీభూతమొనర్చునదియు. పృథివియుఁ దిరిగి ప్రీతిగల్గి యుండుటఁబట్టి ప్రతి గృహమందును భిత్త్యాదులచే వాయ్వాదుల యాఘాతములనుండి రక్షింపఁబడు దీపమను బుత్రుఁడు గలదియునైయుండెను.

దృష్టం పాతాలకేష్విష త్తమోరూపేషు పావకమ్
అర్ధదృష్టం రజోరూపే భూతలే భూతమాలితే. 9
సత్త్వాత్మసు మహానత్వం సత్యత్వం దేవసద్మసు
జగజ్జీర్ణకుటీద్వీపః కూపోమ్భస్తమసోర్మహాన్. 10
దిగ్వధూవిమలాదర్శో నిశానీహారమారుతః
సత్త్వం చన్ద్రార్కవహ్నీనాం కుఙ్కమాఽలేపనం దివః. 11

కేదారం దినసస్యానాం తమోచ్ఛ్వానామనుగ్రహః
నభః కాచబృహత్పాత్రక్షాలనామ్బు సముల్లసత్. 12

ఇంకను, ఆ తేజము తమోరూపములగు పాతాళాదిలోకములం దొకింత ప్రకాశించునదియు ప్రాణులచేఁ బరివేష్టితమైనట్టి రజోరూపమగు భూలోకమున సగము ప్రకాశించునదియు సత్త్వగుణ మయములగు దేవలోకములందు మహాప్రకాశయుక్తమైనదియు, జగత్తను శిథిలకుటీరమందు దీపమువంటిదియు, అంధకారమను జలమునకు అగాధకూపమువంటిది (గ్రసించునది)యు, [illegible] యొక్క నిర్మలమైన యద్దమున్ను (ప్రకాశింపఁజేయునదియు,) రాత్రియను మంచునకు [illegible]వంటిదియు, సూర్యచంద్రాగ్నుల జీవితసర్వస్వమున్ను, స్వర్గమను వధువు యొక్క [illegible] కుంకుమలేపనమున్ను దివసములను సస్యములకు క్షేత్రమున్ను, అంధకారగ్రస్తములగు రూపాదుల[illegible]ల ననుగ్రహించునదియు, ఆకాశమును గొప్పగాజుగిన్నెయొక్క ప్రక్షాలనమున నుత్తమజలమువంటిదియునైయుండెను.

సత్తాప్రదతయార్థానాం ప్రకాశీకతయాపి చ
చిన్మాత్రపరమార్థస్య సహోదర ఇవాంశుజః. 13
క్రియాకమలినీ భానుర్భూతలోదరజీవితమ్
రూపాలోకమనస్కారచమత్కారశ్చ తేజసా. 14
నభస్తలగతాసంఖ్యనక్షత్ర మణిమాలితః
దినర్తువత్సరాబ్ధ్యంభస్యా వాడవాగ్న్యబ్ధి ఫేనిలః. 15
చన్ద్రార్కాదితరఙ్గాన్తరజడం పఙ్కిలో మహాన్
బ్రహ్మాద్బ్రహ్మాణ్డ ఖాతస్థో నిత్యమేకార్ణవోఽక్షయః. 16

మఱియు, ఆ తేజము సమస్తపదార్థములకును సత్తనొసంగునదియు, ప్రకాశింపఁజేయునదియు నగుటచే చిన్మాత్రమైన పరమార్థముయొక్క తమ్మునివలె నొప్పునదియు, క్రియయను కమలసరోవరమునకు సూర్యునివంటిదియు, భూలోకముయొక్క జీవనహేతువున్ను, రూపాది విషయముల నావరించు తమస్సును వృత్తియందారూఢమగు చైతన్యమువలె నివారింపఁజేయుటచే తన్నివారణరూపమగు చమత్కారముగలదియు, ఆకాశమందున్న అసంఖ్యాతములగు నక్షత్రములను మణులచే వేష్టితమై, దిన, ఋతు, వత్సరాది కాలభేదరూపములగు గొప్ప బడబాగ్నులు మున్నగువానియొక్క క్షోభచేనురుఁగు తోఁగూడియున్నదై, సూర్య, చంద్రాదులను తరంగములచే లోన విస్తరింపఁజేయఁబడిన ధూళులచే జలములేకయే యొకపుడు మహాపంకిలమైయున్నదై, గొప్ప బ్రహ్మాండమను కందకమున వెలయుచున్నదై నిత్యమక్షయమైనట్టి యేకమగు మహాసముద్రముఁ బోలియున్నదియునై యొప్పుచుండెను.

హేమాదిషు సువర్ణత్వం నరాదిషు పరాక్రమః
కాచకచ్యం చ రత్నాదౌ వర్షాదిష్వవభాసనమ్. 17
జ్యోత్స్నాముఖేష్వభిమ్బేషు పక్ష్మలేక్షణలక్ష్మసు
ప్రవతత్స్నేహామృతాపూరో హాససౌహార్ద భాసనమ్. 18

కపోలబాహునేత్రాక్షి భ్రూకరాలకలాసకః
నిర్జోఽజేయతయా జాతో విలాసః కామినీజనే. 19

తృణీకృత త్రిభువనచపేటాస్ఫోటితద్విషామ్
శిరఃసు వజ్రీకరణం వీర్యం సింహాదిచేతసి. 20

అట్టి తేజముయొక్క ధారణచే నేను ధాతువులందు సువర్ణత్వమున్ను, మనుజాదులందు పరాక్రమమున్ను, రత్నాదులందుఁ గాంతియు. వర్షాదులందు విద్యుత్ప్రకాశమున్ను నైతిని. మఱియు, ముఖమును బోలిన చంద్రబింబములందుఁ జంద్రికారూపమున్ను, ఱెప్పలతోఁగూడిన నేత్రములుగల ముఖమువంటి యా చంద్రబింబములందుఁ జంద్రికాసదృశమగు ద్రవీభూతమైన స్నేహామృతముచేఁ బూర్ణమై, హాస్యసౌహార్దయుక్తమైనట్టి ప్రకాశమున్ను, స్త్రీలయందు కపోల, బాహు, నేత్ర, హస్తకేశాదుల సౌందర్యమును ప్రకాశింపఁజేయునట్టి అజేయమగు కామవిలాసమున్ను, ముల్లోకములను దృణమువలె నెంచువారును, తమ చేతిదెబ్బలచే శత్రువులను గంపింపఁజేయువారునునగు పరాక్రమ శీలురైన వృత్రాసురాదులయొక్కయు శిరస్సుపై వజ్రప్రహారమున్ను, సింహాదుల చిత్తమందలి పరాక్రమ రూపమున్ను నైతిని.

కటకఙ్కట కుట్టాకఖడ్గ సంఘట్ట టాంకృతైః
పటుస్ఫుటాటో పరటిభటేష్వటసముద్భటమ్. 21

దేవేషు దానవారిత్వం సురారిత్వం సురాదిషు
సర్వభూతేషు సోఽజస్త్వమున్నామః స్థావరాదిషు. 22

మఱియు నట్టి తేజముయొక్క ధారణచే నేను యోధులందు, కఠోర లోహమయ కవచములను ఛేదించునట్టి ఖడ్గముల పరస్పర సంఘర్షణముచే జనించు టంకారశబ్దములచే మహాశబ్దముగావించు పరాక్రమరూపమైతిని. అట్లే, దేవతలందు దానవశత్రుత్వమున్ను, అసురులందు దేవతాశత్రుత్వమున్ను సర్వ జీవులయందు బలమున్ను, స్థావరములందు ఉన్నతరూపత్వమున్ను నైతిని.

అథ తే మరువద్భాస్వాం స్త్రత్రాహమనుభూతవాన్
జగదాకాశకోశేషు తేషు తామరసేక్షణ. 23

కమలనేత్రుఁడవగు రామచంద్రా! నీయొక్క ప్రసిద్ధమగు మరుభూమి తనయందు నద్యాదుల కల్పన ననుభవించునట్లు, అటుపిమ్మట నిజధారణాకల్పితములగు జగదాకాశకోశములందు సూర్యుడనై నేను నాయందీవచింపఁబోవు సమస్తమున్ను ననుభవించితిని.

దిగన్తదశనిస్తీర్ణైః కరజాలైర్జగత్థగమ్
గృహ్ణాదద్రృఙ్గమర్కత్వం గ్రామవద్దృష్టభూతలమ్. 24

కామోత్పలే కోశచక్రం వాడవం తిమిరార్ణవే
బ్రహ్మాణ్డసదనే దీపం వృక్షం దినఫలావలేః. 25

దశదిక్కులందును వ్యాపించిన కిరణములద్వారాపర్వతాద్యవయవ సహితమగు జగత్తును పక్షిగిబట్టుకొను ... ... ప్రత్యక్షముగ భూతలమును గాంచు

దదియు, చంద్రుని జూడనెంచు కలువయొక్క కోశబంధనమునకు హేతుభూతమగు చక్రమున్ను, అంధకారమను సముద్రమందు బడబాగ్నియు, బ్రహ్మాండమగు గృహమున దీపమున్ను, దివసములను ఫలసమూహములకు వృక్షమున్ను నగు సూర్యునియొక్క స్వరూపమనుభవించితిని.

రసాయనహ్రదాకారమిన్దుత్వం వదనం దివః
నిశానిశాచరీహాసం వికాసం రజనీవిశామ్. 26

జగల్లావణ్యలక్ష్మీనాం సర్వాసాముపమాస్పదమ్
రజనీరోహిణీనారీకైరవానాం పరం ప్రియమ్. 27

నేత్రవృద్ధస్య వక్త్రస్య ద్యులతాపుష్పజాలకమ్
స్వర్గౌఘమశకవ్యూహం తారకాపటలం మృదు. 28

మఱియు, అమృతముయొక్క హ్రదము (మడుగు)వంటి యాకృతిగలదియు, ఆకాశముయొక్క ముఖమువంటియు, రాత్రియను అభిసారికయొక్క హాస్యమువలెఁ జూపట్టునదియు, రాత్రియందుఁ బ్రవేశాది వ్యవహారములఁ గావించువారికిఁ బ్రకాశకమైనదియు, జగత్తునందలి సమస్త సౌందర్య సంపదలతోటి పోల్పఁదగినదియు, రాత్రి, రోహిణి (చంద్రునిభార్య) స్త్రీ, కలువలకును సర్వజీవులయొక్క నేత్రసమూహమునకును, ముఖమునకును ఆహ్లాద, వికాసజనకమగుటచే బరమ ప్రియమైనదియు నగు చంద్రునిరూపమున్ను ననుభవించితిని. అట్లే ఆకాశమను లతయొక్క పుష్పసమూహమువంటిదియు స్వర్గసుఖమను మధుప్రవాహమున నాసక్తములైన మశకముల బోలినదియునగు కోమల నక్షత్రగణరూపమునుగూడ ననుభవించితిని.

వణిజ్మాత్రే వణిగ్ఘస్తతులాతోలనదోలితమ్
రత్నత్వం జలకల్లోలహస్తాన్దోలనమబ్ధిభిః. 29

అబ్ధాబ్ధౌ శఫరావర్తమబ్ధా గోమఙ్జరీగణః
అబ్ధాదౌ దావదహనం వైద్యుతం ద్యోతనం తనౌ. 30

దారుదారణదుర్వారదీప్తం జ్వలనమాతతమ్
యజ్ఞాగ్నిదాహకల్యాణం విస్ఫోటకఠినారవమ్. 31

కచత్కాఞ్చనమాణిక్యముక్తామణిమయం మహః
తపస్తాం నీతమాక్షిప్య పాణ్డిత్యమివ పామరైః. 32

విశ్రాన్తం స్తనశృఙ్గేషు ముక్తాహారతయా తయా
అసురోరగగన్ధర్వనరనాయకయోషితామ్. 33

ఇంకను, వర్తకుల హస్తములచే త్రాసులందుఁ దూయఁబడుటద్వారా యిటునటు దల్పఁబడునవియు, సముద్రతరంగములను హస్తములచే నాందోళితము లొనర్పఁబడునవియునగు; రత్నముల స్వరూపమునున్ను ననుభవించితిని. సముద్రమందు బడబాగ్నియై భీతిల్లిన క్షుద్రమత్స్యములను పరిభ్రమింపఁ జేయునట్టి కౌతుకము ననుభవించితిని. సూర్యకిరణసమూహమై స్వశరీరమ్మున బ్రకాశమనుభవించితిని, మఱియు, మేఘపర్వతాదులందుఁ బ్రవేశించి అటనట దావానల,

విద్యుదాదుల రూపమునున్ను, ననుభవించితిని. అట్లే, అగ్ని రూపమును బొంది, కాష్ఠములను భస్మీభూత మొనర్చునదియు అంతట వ్యాపించునదియు, దుర్నివారమైనదియు, కఠినమగు చటచటా శబ్దయుక్తమైనదియునగు జ్వలనమునున్ను ననుభవించితిని. యజ్ఞాగ్నియై వివిధ హవిస్సులను దహింపఁజేయుటయను కళ్యాణమునుగూడ ననుభవించితిని. మఱియు అగ్నిరూపముబొంది దేదీప్యమానములగు సువర్ణ; మాణిక్య మణి. ముక్తాదులతోఁగూడిన కోశాగారమును భస్మీభూతము గావించి మూర్ఖుఁడు పండితుని దుఃఖపెట్టునట్లు అద్దాని యజమానుని దుఃఖపెట్టితిని. సుర, అసుర, నాగ, గంధర్వ, రాజాదుల స్త్రీలయొక్క స్తనములను శిఖరములపైని ముత్యాలహార రూపత్వమునుగూడ ననుభవించితిని.

పాదాహతిం గతం మార్గే తిలకత్వం వధూముఖే
ఖద్యోతేన మయా లబ్ధం పశ్యావస్థాసు చాపలమ్. 34

ఖద్యోత (మిణుఁగుఱు పురుగు) రూపమును ధరించి మార్గమున పాదప్రహారమును, స్త్రీల ముఖముపైని తిలకత్వమును ననుభవించితిని. స్థానభేదముతోఁగూడిన యున్నత, అవనత స్థితులందలి అనియతిని వీక్షించుము!

క్వచిద్విద్యుత్తయా తేషు శఫర్యా చార్ణవేష్వివ
ఖస్థేషు విక్రృతం చారు వార్యావర్తవిరావిషు. 35
క్వచిద్దీపతయానీయ కలికా కోమలాఙ్గయా
అన్తఃపురేషు కాన్తానాం సురతాలోకనం కృతమ్. 36
క్వచిత్కజ్జలజాలస్య జ్వాలాకనకదాకృతే
ఛేదినా ఘనకూర్మాభం సఙ్గస్తైవ స్వకోటరే. 37
కల్పాన్తేషు క్వచిత్సర్వజగద్భ్రమఘనభ్రమాత్
ఖే కజ్జలాసితే లీనం రుద్రదేహ ఇవ విద్యుతా. 38
క్వచిదాకల్పమాపీయ వాడవాగ్నితయా జలమ్
జగత్సు గగనేష్వన్తే నన్నతే జలరాశిషు. 39
క్వచిదుల్ముకదన్తేన మయా జ్వాలాభుజాత్మనా
విలోలధూమావర్తోగ్రకున్తలేనాకులౌజసా. 40
పురపల్లవదాహేషు కవలీకృతజన్తునా
కృతాః కృతాష్ట కాష్ఠాది పదార్థాః ఖాదనోచితాః. 41

మఱియు నొకచోట, జలముయొక్క ఆవర్తములచే శబ్దించునట్టి మేఘములందు విద్యుద్రూపమును ధరించి, సముద్రమందు శఫరియను మత్స్యమువలె మనోహరముగ చేష్టలుసల్పితిని వేఱొకచోట పూమొగ్గవలె కోమలాంగయుక్తమగు దీపరూపముతోటి యంతఃపురములందు స్థాపింపఁబడి స్త్రీల సురతము నవలోకించితిని. ఒకచోట జ్వాలారూపమగు సువర్ణమును ఖండించునటువంటి యాకారముగల నిజకోటరమగు వత్తియొక్క చివర ప్రరూఢమైన కజ్జల (కాటుక) సమూహముయొక్క సంగముచే మందగ్రస్తగ... [illegible] ...సువముల [illegible]కోచమువలన కూర్మమువంటి

యాకారమును ధరించితిని. ఒకచోట కల్పాంతాగ్నిరూపమును ధరించి ప్రళయమున ననేక జగత్తులందు భ్రమణపూర్వకముగ దహింపఁజేయుటయొక్క మహాశ్రమచే ధూమాదులచే నల్లనైనట్టి యాకసమునరుద్రుని వాహనమగు మేఘమందు మెఱుపువలె విలీనుఁడనైయుంటిని ఒకచోట బడబాగ్నిరూపముచేఁ గల్పాంతమువఱకు జలమునుద్రావి తుదకు శూన్యత్వమును బొందిన జలరాసులందు నృత్యమొనర్చితిని. మఱియొకచోట, ఉల్ముకము (కొఱవి)లను దంతములతోఁగూడి, జ్వాలలను భుజములచే భూషితమై, చంచల ధూమావర్తములయొక్క యగ్రభాగములను కేశములచే శోభితమైనట్టి యగ్నియొక్క రూపమును ధరించి నగరములను పల్లవములను దగ్ధమొనర్చుచు జంతువులను నశింపఁజేయుచు, కాష్ఠాది పదార్థములను భక్షింపసాగితిని.

హతేన శస్త్రపాషాణైరయః పిణ్డాదివాసినా
హన్త్రదాహార్థముద్గీర్ణాః కణకోపలతాః క్వచిత్. 42
క్వచిన్మహాశిలాకోశే పాషాణమణినా మయా
సమస్తభూతాదృశేన స్థితం యుగశతాన్యపి. 43

ఒకచోట, కమ్మరివారి శాలాదులందు లోహపిండాదులరూపమున వసించుచు సమ్మెటలచేతను, శిలలచేతను గొట్టఁబడి యాకొట్టువారి దహనార్థము స్ఫులింగములను, శిలాఖండములను వెలిగ్రక్కితిని; వేఱొకచోట గొప్పశిలాకోశమందు వజ్ర, వైడూర్యాది మణులరూపమును ధరించి యే ప్రాణికిని గన్పింపక వందలకొలఁది యుగములవఱకు వసించితిని.

శ్రీరామ ఉవాచః—

మునే తస్యామవస్థాయామనుభూతం త్వయా సుఖమ్
ఉత దుఃఖమితి బ్రూహి బోధాయ మమ మానద. 44

శ్రీరాముఁడు:— మానప్రదుఁడనగు నో మునీంద్రా! అట్టి శిలావస్థయందుఁ దాము సుఖమనుభవించితిరా, లేక దుఃఖమనుభవించితిరా యను విషయమును బోధకొఱకై నాకు వచింపవేఁడెద.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

యథా యాతి నరః సుప్తో జడతాం చేతనోఽపి సన్
చిద్వ్యోమ గచ్ఛేద్దృశ్యత్వం తథా జాడ్యం ప్రచేతతి. 45

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! చేతనరూపుఁడైనను నిద్రించునపుడు మనుజుఁడెట్లు జడత్వమును బొందుచున్నాఁడో; అట్లే చిదాకాశమున్ను దృశ్యరూపమై జడత్వము ననుభవించుచున్నది.

ఆత్మానం చేతతి బ్రహ్మ పృథ్వ్యాదీవ యదా తదా
సుప్తం జడమివాస్తేఽన్తః స్యాదస్య న తదన్యథా. 46

బ్రహ్మమెపుడు తన్ను పృథ్వ్యాదుల రూపమున ననుభవించునో, అపుడు సుషుప్తునివలెను, జడునివలెను; దనయందుండును. అంతేగాని మఱియొకరూపమేమియుఁ బొందదు. అట్టిచో [illegible]నికి దుఃఖప్రసంగ మెచట?

వస్తుతస్తస్య ఖోర్వ్యాది నాసద్రూపం న సన్మయమ్
ద్రష్టృదృశ్యమివాభాతి బ్రహ్మ చైతత్సమం స్థితమ్. 47

వాస్తవముగ నాకాశ పృథివ్యాదు లద్దానియొక్క సద్రూపములుగాని, అసద్రూపములు గాని కావు. సదా ఆవికారముగ నున్నదే యగుచు నయ్యది ద్రష్టృదృశ్యములవలెఁ బ్రకాశించుచున్నది.

ఏతత్సత్యపరిజ్ఞానం యస్యోత్పన్నమఖణ్డితమ్
న తస్య పఞ్చభూతాని న దృశ్యద్రష్టృ విభ్రమః. 48

ఇట్టి సత్యమగు అఖండజ్ఞాన మెవనికి నుత్పన్నమగునో, వానికిఁక పంచభూతములుగాని. ద్రష్టృ దృశ్యములఁగూర్చిన భ్రమగాని యుండనేరదు.

తదా మయైవం శుద్ధేన తత్కృతం బ్రహ్మరూపిణా
బ్రహ్మరూపాదృతే కించిదేతత్కర్తుర్న యుజ్యతే. 49

ఆ సమయమున శుద్ధమగు బ్రహ్మరూపముచేతనే యదియంతయు నేననుభవించితిని. బ్రహ్మరూపము లేక అది యొకింతైనను ననుభవింపఁబడఁజాలదు.

యదా సర్వమిదం దృశ్యం జాతం బ్రహ్మ నిరామయమ్
తదా బ్రహ్మపదస్థేన మయాత్మైవ సమీక్షితః. 50

ఎపుడే దృశ్యమంతయు నాకు నిరామయమగు బ్రహ్మరూపమే ఆయెనో, అపుడు బ్రహ్మపరస్థుఁడనగు నేను నన్నవ్విధముగఁ గాంచితిని.

యదా పునరహం పఞ్చభూతానీత్యేవ భాసయన్
భవామి జడ ఏవాహం తదా చేతామి కిం కిల. 51

అట్లుగాక, నన్ను నేను పంచభూతములుగనే (శిలామణ్యాది రూపముగనే) యెఱుఁగుచో నపుడు సర్వథా జడుఁడనే యగుదునుగాన నపుడిఁక దేని ననుభవింపగలను? స్మరింపఁగలను?

సుప్తోఽస్మీతి దృఢం భావం బుద్ధవాంశ్చేతనోఽపి సన్
నైద్రమేవైత్యలం జాడ్యం లసచ్చేతతి కించన. 52

'నేను నిద్రితుఁడనైయున్నాన'ను దృఢభావమును చైతన్యమైయు నేనెఱిఁగితిని. ఏలయనఁగా నిద్రాసమయమందును నప్పటియజ్ఞానమును స్వప్రకాశమగు ఆత్మ యెఱుఁగుచునేయున్నది.

యస్తు జ్ఞానప్రబుద్ధాత్మా దేహస్తస్యాధిభౌతికః
శామ్యత్యుదేతి విమలో బోధాత్మైవాతివాహికః. 53

జ్ఞానముచే నెవఁడు ప్రబుద్ధుఁడగునో, అతనికి అధిభౌతిక (స్థూల) దేహము శమించి నిర్మలబోధరూపమగు సూక్ష్మశరీర ముదయించుచున్నది!

ఆతివాహికదేహేన తేన బోధాత్మనాఽమునా
బృహతా వా యథాకామం నిర్వాణాత్మావతిష్ఠతే. 54

అట్టి జ్ఞానమయమగు సూక్ష్మమైన అనురూప శరీరముచేతను, లేక మహచ్ఛరీరముచేతను తన యిచ్ఛానుసారము జీవన్ముక్తుఁడు మెలఁగుచుండును.

బోధదేహేన హృదయం శిలానామప్యభేదినామ్
ప్రవిశ్యాశు వినిర్యాతి యాతి పాతాలమమ్బరమ్. 55

బోధరూపమగు దేహముచే జీవుఁడు అభేద్యములగు శిలాదులలోపలగూడఁ బ్రవేశించి శీఘ్రముగ బయటకు రాఁగల్గును. మఱియు, పాతాళమందలి యాకాశమునుగూడఁ బొందఁగల్గును.

తస్మాన్మయా పురా రామ బోధదేహేన తత్తదా
తథా కృతమనన్తేన చిన్మయవ్యోమరూపిణా. 56

ఓ రామచంద్రా! ఇక్కారణమున నేను పూర్వమపుడు, అనంతమై, చిదాకాశమయమైనట్టి బోధరూపముచేతనే యాపృథివ్యాది రూపముల నన్నింటిని ధరించితిని, అనుభవించితిని.

వజ్రపాషాణ పాతాలనభోమ్బరగమాగమాన్
కుర్వతస్తాదృశస్యాశు న విఘ్న ఉపజాయతే. 57

చిత్స్వరూపమగు ఆత్మకు వజ్ర, శిలా, పాతాళ, ఆకాశ, స్వర్గాదులందు శీఘ్రముగ గమనాగమనము లొనర్చుటయందు విఘ్నమెద్దియుఁ గలుగఁజాలదు.

బోధమాత్రశరీరేణ యావదాస్తే జడేష్వసౌ
పదార్థేషు తథాభూతస్తావత్తత్రావతిష్ఠతే. 58

స్వేచ్ఛయైవ చలిత్వాథ తతోఽన్యత్ర ప్రయాతి చేత్
తత్తత్రైవ స్థితిం యాతి తత్రైవాగతిర్యథా. 59

బోధమాత్రశరీరముచే ఈ యాత్మ జడపదార్థములం దెంతవఱకుండునో, నంతవఱకట్టి రూపముతోటియే స్థితిగల్గియుండును. ఎపుడు తనయిచ్ఛచే మఱియొకచోటి కేగదలంచునో, అపుడు చలనాదిరూప దుఃఖములేకయే యచట స్థితిఁబొందును. ఏలయనిన, అద్దానికి గమనాగమనములున్ను, స్థితియు సమానమేయగును.

బోధమాత్రం విదుర్దేహమాతివాహికమవ్యయమ్
ఇదానీం త్వం తమేవేహ బుధోఽనుభవసి స్వయమ్. 60

ఓ రామచంద్రా! బోధమాత్రమునే అవ్యయమగు 'అతివాహిక' (సూక్ష్మ) శరీరమందురు. తలంచినచో నిపుడు నీవున్ను నిచట నట్టి అతివాహిక దేహమును..., ధారణచే జగద్రూపమున్ను స్వయముగ ననుభవింపఁగలవు.

చిన్మాత్రవ్యోమరూపోఽస్మీత్యర్కాదావితి బోధతః
ఆత్మైవాస్తముపానీతః సన్నేవాసన్నివాత్మనా. 61

'సూర్యాదులందును నేను కేవలము చిన్మాత్రాకాశ రూపుఁడనైయున్నానను' బోధచే ...లు తనుయిచ్ఛచే సూర్యాది సమస్తజగత్తును అస్తమింపఁజేసి యద్దానిని ఆత్మ మాత్రత్వము

తోటి స్థాపింపఁజేయు శక్తులైయుందురు. అత్తఱి జగత్తు ఆత్మరూపముచే విద్యమానమైయున్నను దృశ్యరూపబాధవలన లేనిదాని చందముననగును.

స్థితం స్వప్నాది జగతి తమ సేవానతేవ చ
అవృతేనేవ వాన్యాసామలభ్యేన స తాదృశమ్. 62

జాగ్రత్పురుషుని దృష్టియందు నిద్రించు మనుజుని స్వప్నాది జగత్తు, అజ్ఞానావృతమగుటచే అసత్తై, శూన్యమై, లేక అన్యసుప్తమనుజునకు అలభ్యమైయున్నదగునో, అట్లే జ్ఞాని యొక్క దృష్టియందీ జాగ్రజ్జగత్తున్ను అసత్తేయగును.

తరఙ్గలేఖయాఙ్గార సరితః స్వాఙ్గలగ్నయా
మనోరాజ్యశ్రియేవాశుక్ ప్రోత్పన్న స్తద్వదేహయా. 63

తన మనోరాజ్యముచేఁ గల్పితమగు అగ్నిచేఁ బరిపూర్ణమగు నదియొక్క తరంగ సమూహము తన యంగములకుఁ దగుల్కొనినప్పటికిని మనుజుఁడెట్లు శోకరహితుఁడై యుండునో, అట్లే యొకింత యిచ్చచే శిలా, మణ్యాదిరూపముచేఁ గల్పించుకొనినప్పటికిని నా కడుపు దుఃఖమేమియు లేకుండెను.

కజ్జలాలికయా వహ్ని విపినం పుష్పశోభయా
పుల్లస్థలామ్బుజాకారం కిం శుకాశోక రూపయా. 64

వితతారమ్భయాప్యుచ్చైర్జ్వాలాజ్వలతయేద్ధయా
ఉపోత్థాయాఙ్గగలితం ఖలలక్ష్మ్యేవ లోలయా. 65

ఓ రామచంద్రా! అగ్నిదశను బొందిననేను, అరణ్యమును ధూమాదులను భ్రమరములచేఁ బూర్ణముగను, కింశుక, అశోకాది పుష్పముల రూపమునుబోలిన జ్వాలలచేఁ బ్రదీప్తమగు అగ్నిచే వ్యాప్తముగను గావించి, ఇట్లద్దానిని వికసించిన స్థలకమలమువంటి యాకారముగ నొనర్చితిని. మఱియు ప్రవర్ధమానమైన దీప్తిచే దుష్టుని ఐశ్వర్యమువలె చంచలములైనట్టి జ్వాలలతోఁగూడి శీఘ్రముగ వృద్ధినొంది మరల వెంటనే శమించితిని.

తేజ స్తయాపి పరమాణుకణోదరేఽపి దృష్టేత్థమేవమిహ రామ మయా [illegible]గద్భిః
అన్యాచసానచ చిదమ్బరతః పరస్మాత్స్వప్నే పురాచలగణోఽత్ర [illegible]ంవః. 66

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే తైజసజగద్వర్ణనం నామైక నవతితమః సర్గః ॥ 91 ॥

ఓ రామచంద్రా! ఈ ప్రకారముగ, తేజోరూపమును ధరించిన నేను పరమాణువు యొక్క దేశమందును అనేక జగత్తులఁ గాంచితిని. అవియు ఈ నీ జగత్తున్ను చిదాకాశముకంటె భిన్నములుకావు. ఇవ్విషయమున స్వప్నమందలి నగర, పర్వతసమూహములే దృష్టాంతము.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణ తైజసజగద్వర్ణనమను తొంబది యొకటవ సర్గము ॥ 91 ॥

ద్వినవతితమః సర్గః

[వాయుధారణయా వాయుభావే తత్కర్మవిస్తరః
తతః సాకాశసార్వాత్మ్య స్థితిశ్చాత్రోపవర్ణ్యతే.

వాయు-ధారణచే వాయురూపమొంద, అద్దాని కర్మయొక్క విస్తారము, పిదప ఆకాశ-ధారణచే ఆకాశరూపముకాఁగా స్వరూపముతోటి స్థితి యిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీ వసిష్ఠ ఉవాచః—

అథ వాతమయీం కృత్వా జగత్ప్రేక్షణకౌతుకాత్
ధారణాం ధీరయా వృత్త్యా వితతామహమాగతః. 1

సంపన్నోఽస్మ్యనిలో వల్లీలలనాలోలలాసకః
కమలోత్పలకున్దాదిజాలకామోద పాలకః. 2

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! పిమ్మట జగంబులఁ గాంచునట్టి యిచ్ఛచే ధీరవృత్తితోగూడి వాయు-ధారణ యొనర్చి వాయువు వ్యాపించియున్నంతదనుక విస్తరించినవాఁడనై లతలను స్త్రీ జనముయొక్క విలాసహేతువున్ను, కమల, ఉత్పల, కుందాది పుష్పసమూహము యొక్క సుగంధములను బాలించువాఁడనునైతిని.

సీకరోత్కర నీహార హేలాహరణతత్పరః
సురతశ్రాన్తసర్వాఙ్గసమాహ్లాదనతర్షులః. 3

తృణగుల్మలతావల్లీదలతాణ్డవపణ్డితః
లతౌషధిఫలోల్లాసకుసుమామోద మణ్డితః. 4

మఱియు జలకణ, హిమాదులను లీలాపూర్వకముగ హరించుటయందుఁ దత్పరమైనదియు, సురతముచే శ్రమనొందినవారియొక్క సర్వాంగముల నాహ్లాదపఱచుటయందు లోభియు, తృణ, గుల్మ, లతాదులను నాట్యమాడించుటయందు నేర్పరియు, ఓషధి, లతా, ఫలాదుల యుల్లాసముచేతను, పుష్ప సుగంధములచేతను భూషితమైనదియు నగు వాయువుయొక్క రూపమును బొందితిని.

మృదుర్మఙ్గలకాలేషు లలనాలోకలాలకః
భీమ ఉత్పాతకాలేషు పర్ణవత్ప్రోథపర్వతః. 5

నన్దనే కున్దమన్దార మకరన్దరజోరుణః
నరకేఽఙ్గార సంభార భూరినీహార భాసురః. 6

సాగరే సరలావర్తలేఖానుమితసర్పణః
దివి వారిద సంచారమృష్టామృష్టేన్దుదర్పణః. 7

నక్షత్ర క్షత్రసైన్యస్య రథో రంహోవిజృంహితః
త్రైలోక్యసిద్ధసంచార విమానధరణే హితః. 8

మంగళసమయములందు శీతల, మంద, సుగంధములచే స్త్రీలకుఁ బ్రీతిజనకమైనదియు, నాశసమయములందు భయంకరరూపమును ధరించి దృఢపర్వతములనుగూడ పత్రములవలె నెగురఁగొట్టునదియు, స్వర్గమందున్న నందనవనమందలి కుందమందారాది పుష్పముల ధూళులచే నెఱ్ఱనైనదియు, నరకమందలి అగ్నిసమూహములచే మహానీహారము (మంచు)వలె భాసించునదియు, సముద్రములందలి సరళములైన ఆవర్తసమూహముచే నూహింపఁబడు గమనముగలదియు) మేఘములను దొలగించుటద్వారా స్వచ్ఛముగను, కప్పుటద్వారా మలినముగను జంద్రుఁడను నద్దమును గావించునదియు, నక్షత్రములను క్షత్రియసైన్యముయొక్క రథమును వేగముగ ముందునకు సాగించునదియు, ముల్లోకములందును సంచరించునట్టి సిద్ధులయొక్క విమానములను ధరించుటయందనుకూలమైనదియునగు వాయువుయొక్క రూపముఁ బొందితిని.

సహోదర ఇవ క్షిప్రగామిత్వాదస్య చేతస
అనఙ్గోఽపి సమస్తాఙ్గః స్పన్దానన్దనచన్దనః. 9
తుషారసీకరాసారజరారోమవిజర్జరః
ఆమోదయౌవనోన్మాదో మౌనమార్దవశైశవః. 10
నన్దనామోదమధురా మధురోదారసంస్మృతిః
చారుచైత్రరథోన్ముక్తో హృతకాన్తారతశ్రమః. 11
చిరం గఙ్గాతరఙ్గాఙ్గదోలాన్దోలనసశ్రమః
శ్రమస్వరూపాజ్ఞతయా నివారిత తతశ్రమః. 12
పుష్పభారానతాః స్పర్శైర్వ్యస్తవనితాలతాః
చిరం చపలయన్ ల్లోలదలహస్తా విలోచనాః. 13
చిరం భుక్త్వేన్దుబిమ్బాగ్రం సుప్తా పూర్ణాభ్రతల్పకే
విధూయ కమలానీకమపనీతరతశ్రమః. 14
సమస్తరజసామేకో వ్యోమగామీ తురంగమః
ఆమోదమదమాతఙ్గ సముల్లాసమహాసుహృత్. 15
ధీరేణాపృతడిచ్ఛృఙ్గం పయోదపశుపాలకః
తన్తుః సీకరముక్తానామరిధర్మా రజోరుజామ్. 16

మఱియు, శీఘ్రగామి యగుటచే చిత్తముయొక్క సోదరునివంటిదియు, అవయవరహితమైనను సర్వావయవయుక్తమైనదియు, సంచలనముచే చందనవనమునకు ఆనందము గొల్పునదియు, హిమకణములను దెల్లని రోమములచే వృద్ధునిపగిదితోఁచునదియు, పుష్పాదుల సుగంధములచే యౌవనోన్మత్తునివలెఁ గన్పట్టునదియు, మౌన, మృదుత్వములందు బాలునివంటిదియు, నందనవనమున సుగంధయుక్తమై, గంభీర, మధుర సంచారసహితమై యొప్పునదియు, ఉత్తమమైన కుబేరోద్యాన వనమునుండి బయలుదేఱి వనితల సురతశ్రమను బాపునదియు, చిరకాలము గంగానదియొక్క తరంగములను నూయెలలయొక్క యాందోళనముచే శ్రమయుక్తమైనదియు, నిజశ్రమను మఱచి యితరుల మహాశ్రమను నివారించునదియు, చంచలదళములను హస్తములతోను, భ్రమ

ములను నేత్రములతోడను శోభితములై పుష్పభారముచే వంగినట్టి లతలను వసంతవనితలను తన కోమల స్పర్శములచే చిరకాలము చపలలుగఁ జేయునదియు, చిరకాలము చంద్రమండలముయొక్క శ్రేష్ఠమగు అమృతమును బానముచేయునదియు కమలవనములను గంపితమొనర్చునదియు, మేఘములను శయ్యలపైఁ బరుండునదియు, రతిశ్రమను బోఁగొట్టునదియు, సమస్తధూళులకును ఏకమైనట్టి ఆకాశగామియగు అశ్వమున్ను, సౌగంధ్యమదముచే గజముల నుల్లాసపఱచు మహామిత్రుఁడున్ను, మెఱపుయను శృంగము (గొల్లవారి వాద్యవిశేషము)ను బొంది యద్దాని గంభీరనాదముచే మేఘములను బశువులయొక్క పాలకుఁడై యొప్పునదియు, జలకణములను ముత్యములను ధరించుటయందు దారమువంటిదియు, ధూళిని నశింపఁజేయునదగు జలమును నెండింపఁజేయునదగుటచే నద్దానికి (జలమునకు) శత్రువు వంటిదియునగు వాయువుయొక్క రూపమును ధరించితిని.

ఆకాశకుసుమామోదః సర్వశబ్దసహోదరః
నాడీ ప్రణాలీసలిలం భూతాఙ్గో పాఙ్గవర్తకః. 17
మర్మకర్మకరైకాత్మా హృద్గుహాగేహ కేసరీ
నిత్యమేకాన్తపథికః సారవిజ్ఞాతవేదనః. 18
ఆమోదరత్నలుణ్టాకో విమాన నగరావనిః
దాహాన్ధకారశీతాంశుః శైత్యేన్దుక్షీరసాగరః. 19
ప్రాణాపానకలారజ్జ్వా ప్రాణినాం యన్త్రవాహకః
అరిర్మిత్రం చ ద్వీపానాం ద్వీపసంచారణే రతః. 20
పురోగతోఽప్యదృశ్యాత్మా మనోరాజ్యపురోపమః
తాలవృన్తతిలేతైలమాలానం స్పన్దదన్తినః. 21
ఏకక్షణలవేనైవ చాలితాఖిలభూధరః
వర్ణావలితరఙ్గాణాం గఙ్గావాహ ఇవైకకృత్. 22
ధూమామ్బువాహరజసాం మహావర్తకృదమ్బసామ్
ద్యునదీవాహవార్యోఘనభోనీలోత్పలాలికః. 23
శరీరావేష్టితోన్ముక్తపురాణతృణచోపనః
స్పన్దపద్మవనాదిత్యః శబ్దవర్షైకవారిదః. 24

మఱియును, ఆకాశమను బుష్పముయొక్క గంధమున్ను, కావుననే యద్దాని గుణములగు సమస్తశబ్దములకును సోదరునివంటిదియు, ప్రాణులయొక్క అంగ, ఉపాంగములందు వర్తించునదై, వాని నాడీరూప నాళములందు జలముపగిది యొప్పునదియు, ఇట్లు సమస్తభూతములయొక్క ప్రాణరూపమగుటచే హృదయాది మర్మస్థానముయొక్క కర్మలఁ జేయించువాని యన్నింటిలోఁ బ్రధానమైనదియు, హృదయమను గుహయొక్క సింహమున్ను, నిత్య మేకాంతముగ సంచరించునదియు, అగ్నియొక్క బలము నెఱిఁగినదియు, సుగంధములను రత్నములను దొంగిలించునదియు, విమానములను నగరములకు భూమియు, సంతాపమను అంధకారమునకుఁ జంద్రుఁడున్ను, శీతలత్వమను జంద్రునకు క్షీరసాగరము (జన్మస్థానము)న్ను, ప్రాణాపానములను

కళలను త్రాళ్లచే ప్రాణుల దేహరూప యంత్రమును వహించునదియు, తరంగములచే ఖండించుటఁబట్టి ద్వీపములయొక్క శత్రువున్ను, ధూళులచే వృద్ధినొందించుటఁబట్టి యా ద్వీపములయొక్క మిత్రుఁడున్ను, ద్వీపములందు సంచరించుటయందుఁ దత్పరమైనదియు, మనోరాజ్యమువలె నెదుట నున్నను అదృశ్యమై యుండునదియు, తాళవృంతము (విసనకఱ్ఱ) అను తిలమున తైలమువంటిదియు, చలనమను ఏనుఁగునకు కట్టుకంబమున్ను, ప్రళయకాలమున నొక్కక్షణముననే సమస్తపర్వతములను బెల్లగించునదియు, వివిధవర్ణములతోఁగూడిన ధూళులను తరంగములను గంగాప్రవాహమువలెఁ గలిపి యైక్యమొనర్చునదియు, ధూమ, మేఘ, ధూళి, జలములను ఆవర్తయుక్తములుగఁ గావించునదియు, ఆకాశగంగయే పుష్పరసప్రవాహముగాఁ గల్గిన యాకాశమను నీలకమలముయొక్క భ్రమరమున్ను, శరీరముయొక్క వేష్టనము తొలఁగినట్టి శిథిలతృణములయొక్క మందగతికి హేతువున్ను క్రియాసామాన్యమను పద్మవనమును వికసింపఁజేయుటయందు సూర్యుడును, శబ్దమను వర్షమునకుఁ బ్రధానమైనమేఘమున్ను నగు వాయువుయొక్క స్వరూపమును నేనపుడు బొందితిని.

వ్యోమకాననమాతఙ్గః శరీరగృహగర్గటః
ధూలీకదమ్బవిపినమాలాలిఙ్గననాయకః. 25
స్త్యానీకరణసంశోషధృతిస్పన్దనసారథైః
నశైత్యైః కర్మభిః షడ్భిరలబ్ధక్షణ అక్షయమ్. 26
రసాకర్షణసవ్యగ్రో నిత్యం భ్రాతేవ తేజసః
హరణాదానకర్త్రాణామఙ్గానాం వినియోగకృత్. 27
శరీరనగరే నాడీ మార్గైర్గతినిరర్గలః
రసభాణ్డే పరావర్తాదాయుర్మణిమహావణిక్. 28
శరీరనగరీనాశనిర్మాణైకపరాయణః
రసకిట్టకలాధాతుపృథక్కరణకోవిదః. 29

ఇంకను, ఆకాశమను అరణ్యమున గజమువంటిదియు, శరీరమను గృహమున నీరుతోడు యంత్రమువలె శబ్దమొనర్చునదియు, ధూళి, అరణ్యసమూహములను నాయికలయొక్క ఆలింగనమందు నాయకుఁడును ఘృతాదుల పిండీకరణము (గడ్డకట్టించుట) జలాదుల శోషణము, మేఘాదుల ధారణము, తృణాదుల కంపనము, గంధధారణము, తాపహరణమను నీయాఱు కర్మలఁచే బ్రళయమువఱకు విశ్రాంతిని బొందనిదియు, తేజముయొక్క సోదరునివలె రసాకర్షణమందు నిత్యము వేగిరపడునదియు, హరణగ్రహణాది కర్మలఁజేయు హస్తాద్యవయవములను జలింపఁజేయునదియు, శరీరమను నగరమున నాడులను మార్గములద్వారా నిరాటంకముగఁ జనునదియు, అన్నరసమయమగు దేహమను బాత్రయందుఁ బ్రాణాపానాదిరూపములచేఁ దిరుగుటద్వారా ఆయువను మణియొక్క రక్షణ, వ్యయమందు గొప్పవర్తకునివంటిదియు, శరీరమను నగరముయొక్క నాశ, నిర్మాణములందుఁ దత్పరమైనదియు, అన్నరసములయొక్కయు మలముయొక్కయు, సూక్ష్మతరములైన సారభావములయొక్కయు, రక్తమాంసాది, లేక వాతపిత్తాది ధాతువులయొక్కయు వేఱుపఱచుటయందు మహాప్రవీణమైనదియు నగు వాయురూపము నపుడు ధరించితిని.

ప్రతిసూక్ష్మాణుకం దేహే తతో దృష్టం మయా జగత్
తత్రేత్థం రూపవానస్మి స్ఫుటమాభోగి సుస్థిరమ్. 30

ఓ రామచంద్రా! ఆ వాయువురూపమందును ప్రతిసూక్ష్మాణువునందు ననేక జగత్తులను నేను వీక్షించితిని. ఆ జగత్తులందును నిదేప్రకారము పృథ్వ్యాదిజగద్రూపధారినై నేనే వెలయుచుంటిని.

పరమాణుప్రతి త్వత్ర ప్రోహ్యన్త ఇవ సర్గకాః
న చ కించిత్క్వలోహ్యన్తే భాకృతే కిమివోహ్యతే. 31

అట ప్రతిపరమాణువునందును సృష్టి సమూహములు చలించుచుండెను. కాని పరమార్థ దృష్టియందవి యేమియు చలింపకనే యున్నవి ఏలయనఁగా (దృశ్య) శూన్యాకారమగు పరబ్రహ్మమున నెద్దాని గమనాగమనము లుండగలవు ?

సచన్ద్రార్కానిలాగ్నీన్ద్ర పద్మవైశ్రవణేశ్వరాః
సబ్రహ్మహరిగన్ధర్వా విద్యాధరమహోరగాః. 32
ససాగరగిరిద్వీప దిగన్తరమహార్ణవాః
సలోకాన్తరలోకేశ క్రియాకాలకలాక్రమాః. 33
సస్వర్గభూమి పాతాలతతలోకాన్తరాన్తరాః
సభావాభావవైధుర్య జరామరణసంభ్రమాః. 34

చంద్ర, సూర్య, వాయు, అగ్ని, ఇంద్ర, వరుణ కుబేరాది దేవతలతోడను, బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, గంధర్వ, విద్యాధర, మహోరగములతోడను, సముద్ర, పృథివీ, పర్వత, ద్వీప, దిగంత, మహాసముద్ర, లోకాంతర, లోకేశాదులతోడను, క్రియా, కాల, కళాదుల క్రమములతోడను, స్వర్గ, భూమి, పాతాళ, తదితర లోకాంతరములతోడను, భావ, అభావ, క్షయ, జరా,మరణ విభ్రమములతోడను గూడిన యనేకజగంబులచట ప్రతి పరమాణువునందును పరిభ్రమించుచుండెను.

ఏవం నామ తదా రామ భూతపఞ్చకరూపిణా
మయా ప్రవిహృతం తత్ర త్రైలోక్య నలినోదరే. 35

ఓ రామచంద్రా ! ఇవ్విధముగ నపుడు ఆకాశాది పంచభూత స్వరూపధారినగు నేనచట త్రైలోక్యమను కమలమున విహరించితిని.

రసః పీతోఽను భూతశ్చ క్ష్మాజలానిలతేజసామ్
మూలజాలేన వృక్షాణాం ప్రాణినాం వసతాం మయా. 36
రసాయనఘనాఙ్గేషు చన్దనద్రవశోభిషు
లుఠితం చన్ద్రబిమ్బేషు తుషారశయనేష్వివ. 37
సర్వర్తువనజాలేషు నానామోదాని దిక్ష్వలమ్
భుక్తాని పుష్పజాలాని ప్రోచ్ఛిష్టం దదతాలయే. 38
తతోఽన్నతాసు మృద్వీషు స్వాస్తీర్ణాస్వమ్బరాజిరే

సుప్తం శుభ్రాభ్రమాలాసు నవనీతస్థలీష్వివ. 39
సుమనః పత్రమృదుషు నీలలక్ష్మీవిలాసిషు
సురసిద్ధాఙ్గనాఙ్గేషు దూరాన్తస్మరవాసనమ్. 40
కుతః కుముదకహ్లారకమలే నలినీవనే
కోమలః కలహంసీభిర్లీలాకలకలారవః. 41

పృథివీ, జలాగ్ని, వాయువులయొక్క సమూహ రూపములగు వృక్షములందు వసించుచు మూలములద్వారా భూమియందలి రసమును నేను పానమొనర్చితిని. అమృతముచేఁ బరిపూర్ణమైనవియు చందనద్రవమువలె శైత్యాదిగుణములచే శోభితములునునగు చంద్రబింబములందు హిమశయ్యలందువలెఁ బొరలాడితిని. సర్వఋతువులయొక్క వనసమూహములందు వివిధ దిశలందును నా యుచ్ఛిష్టమును దుమ్మెదకొసంగుచు పలువిధ సుగంధములతోఁగూడిన పుష్పములను బాగుగ ననుభవించితిని. విశాలమై ఉన్నతమై కోమలమైనట్టి యాకాశమను ముంగిటియందుఁ జక్కఁగఁ బఱుపఁబడిన శ్వేతమేఘ సమూహములను శయ్యలపై, నవనీత (వెన్న) స్థలములపైవలెఁ బరుండితిని. శిరీషాది (దిరిసెనమున్నగు) పుష్పములయొక్క పత్రములవలెఁ గోమలములైన అవయవములు గలవారును, నీలకమలమందలి లక్ష్మివలె విలాసవతులునగు సురసిద్ధాంగనల యంగములపై కామవాసనారహితుఁడనై శయనించితిని. కుముద, కల్హార, కమల, కమలవనములందు మధుర భాషిణులగు ఆఁడుహంసలతోటి లీలాపూర్వకముగఁ గోమల, మధుర శబ్దమొనర్చితిని.

సరత్సరిచ్ఛిరాసారా మూలభూమణ్డలాన్వితాః
అఙ్గైరూఢాః స్ఫురద్భూతా లోమాలయ ఇవాద్రయః. 42
ఖాద్రయః ప్రథితా దీర్ఘసరిత్సూత్రైః సముద్రకైః
ఆదర్శైరివ విశ్రాన్తమఙ్గేషు ప్రతిబిమ్బిభిః. 43

మఱియు, అత్తఱి బ్రహ్మాండ రూపుఁడనగు నేను ప్రవహించు నదులను ఉత్తమ నాడులయొక్క మూలభూతమగు భూమండలముతోఁ గూడినట్టి ప్రకాశమానములగు పర్వతములను రోమసమూహమువలె నా యంగములచే వహించితిని. జగత్తునందుఁ బ్రసిద్ధములగు పర్వత, ఆకాశములు నదులను సూత్రములతోడను, సముద్రములతోడను, ప్రతిబింబముతోఁగూడిన యద్దములవలె నా అవయవములపై విశ్రమించెను.

భూతసర్గేణ విశ్రాన్తం సిద్ధవిద్యాధరాదినా
మద్దేహే చేతితేనేవ మక్షికాయూకరూపిణా. 44
మత్ప్రసాదేన ముదితైర్లబ్ధమర్కాదిభిర్వపుః
కృష్ణరక్తసితాపీతహరితైర్హరితైరివ. 45

సిద్ధ, విద్యాధరాది ప్రాణి సమూహము నా దేహమందుఁ బరిజ్ఞాన సహితములగు మక్షికా, యూకాదులవలె విశ్రమించెను. నా యనుగ్రహముచే లభించిన శరీరముగలవారును, సంతోషాన్వితులును, కృష్ణ, రక్త, శ్వేత, అతిపీత, హరితవర్ణములతోఁగూడిన వారునగు సూర్యాదులు, జలసమృద్ధిగల ప్రదేశమందు వృక్షములవలె, నా శరీరమున ఆనందముగ వసించియుండిరి.

సముద్రముద్రయా సప్తద్వీపసప్తాత్మరూపయా
సంస్థయా స్థాపితా భూమిః ప్రకోష్ఠే వలయోపమా. 46
విద్యాధరపురస్త్రీణాం పరామృష్టాఙ్గయష్టినా
అదృష్టేనైవ విహితః పులకోల్లాస ఆత్మనా. 47

సప్తసముద్రములును, సప్తద్వీపములును గల్గి సప్తరూపములతోటి వెలయు పృథివిని నేను నాముంజేతియందుఁ గంకణముగ స్థాపితము చేసితిని. విద్యాధర స్త్రీలచే స్పృశింపఁబడిన శరీరముగల నేను వారిచేఁ జూడఁబడకయే యానందముచే వారలఁ బులకితల గావించితిని

సరిచ్ఛిరామలస్ఫారరసాని సుషిరాణి చ
జగన్త్యేవాస్థిజాలాని మమాసన్సంస్థితాని చ. 48
అసంఖ్యైర్వ్యోమమాతఙ్గైశ్చన్ద్రార్కచలచామరైః
ఉదుమ్బరాన్తర్మశకైరివ మద్ధృదయే స్థితమ్. 49

నదులను నాడులతోఁగూడి నిర్మల రసపూర్ణమైనవియు, ఛిద్రయుక్తములైనవియు నగు పర్వతాదులచే వ్యాప్తములైన జగంబులు నా శరీరమున అస్థిమాంసములవలె స్థితినొందియుండెను. అసంఖ్యాతములగు ఐరావతాది గజములును, సూర్యచంద్రాదులను జంచలములైన వింజామరములును, ఉదుంబర (మేడి) ఫలమున మశకములవలె నా హృదయమున వెలయుచుండెను.

సర్వపాతాలపాదేన భూతలోదరధారిణా
ఖమూర్ధ్నాపి తదా రామ న త్యక్తాథ పరాణుతా. 50

ఓ రామచంద్రా! ఈ ప్రకారముగ నపుడు సమస్తపాతాళమును బాదములుగను, భూతలమును నుదరముగను, ఆకాశమును శిరముగను ధరించియున్నను నేను నా పరమ సూక్ష్మ చిన్మాత్ర స్వభావమును త్యజింపకనే యుంటిని.

దిక్షు సర్వాసు సర్వత్ర సర్వదా సర్వకారిణా
సర్వాత్మనాప్యసర్వేణ శూన్యరూపేణ సంస్థితమ్. 51

సమస్త దిశలందును, సర్వత్ర, సదా, సర్వరూపమై, సర్వకార్యకారియై యున్నపుటికిని నేను అసర్వమై (జగద్రహితమై) సర్వద్వైతశూన్యమైనట్టి చిన్మాత్రముగనే యుంటిని.

కించిత్త్వం సదకించిత్త్వం సాకృతిత్త్వం నిరాకృతి
అనుభూతం సజాడ్యం చ చేతనత్వమలం మయా. 52

పరిచిన్నత్వము, అపరిచ్ఛిన్నత్వము, సాకారము, నిరాకారము, జడత్వము, చేతనత్వము, ఈ మున్నగు విరుద్ధధర్మములయొక్క సముచ్చయము నపుడు నేను నా స్వరూపమునందు బాగుగ ననుభవించితిని.

మైనాకముగ్ధపీనస్య సాగరస్యావనిం ప్రతి
సన్తి సర్గసహస్రాణి స్థాణుభూతాన్యథో మయా. 53

మైనాకమువలె అంతర్లీనములైయున్న పర్వతాదులచే ముగ్ధమై, అతివిశాలమైనట్టి సముద్రముయొక్క భూభాగమందలి ప్రతిష్ఠానమందునుగూడ స్థాణురూపములైయున్న యనేక సృష్టులను గాంచితిని, అనుభవించితిని.

జగన్త్యఙ్గే మయోఢాని గూఢాని ప్రకటాన్యపి
ప్రతిబిమ్బపురాణీవ ముకురేణాజడాత్మనా. 54

జడమగు అద్దము తనయందు ప్రతిబింబిత నగరములను ధరించునట్లు, చిద్రూపుఁడగు నేను ప్రకటములును, గుప్తములునగు అనేక బ్రహ్మాండములను నా శరీరమున ధరించితిని.

ఏవం జలానిలాగ్నిత్వం భూమిత్వం ఖాత్మనా మయా
కృతం చితేవ స్వప్నేషు బత మాయావిజృమ్భితమ్. 55

ఓ రామచంద్రా! ఈ ప్రకారముగ పృథివీ జలాగ్ని వాయురాకాశములను, స్వప్నమందలి చైతన్యమువలె నేను ధరించితిని. ఆహా! మాయయొక్క ప్రతాపమును జూడుము!

అపి తస్యామవస్థాయాం జగన్త్యాకాశకోశకే
మయా దృష్టాన్యసంఖ్యాని పరమాణుకణం ప్రతి. 56

అట్టి స్థితియందును నేను ఆకాశకోశమున ప్రతి పరమాణువందును అసంఖ్యాతములగు జగంబుల వీక్షించితిని.

పరమాణుప్రతివ్యోమ పరమాణు ప్రతిష్ఠితమ్
సర్గవృన్దం యథా స్వప్నే స్వప్నాన్తరయుతం పురమ్. 57

ప్రతి పరమాణువందును నిట్లే వ్యాప్తమగు ఆకాశము గలదు. అట్టి యాకాశముయొక్క ప్రతిపరమాణువందును మరల, స్వప్నమందు స్వప్నాంతరముయొక్క నగరాదులవలె అనేకసృష్టులు గలవు.

స్వమేవాహమభూత్వం భూమణ్డలం ద్వీపకుణ్డలమ్
సర్వాత్మనాపి న వ్యాప్తం కించనాపి మయా క్వచిత్. 58

స్వకీయ అధ్యాసమాత్రముచేతనే నేనీ ద్వీపసహిత భూమండలాది రూపములను ధరించితిని. కావున సర్వజగద్రూపుఁడనై యున్నను వాస్తవముగ నెచటను నొకింతైనను వ్యాపించియుండలేదు.

సముత్పాదయతాశేషం లతాతరుతృణాఙ్కురమ్
భూతలేన రసాః కృష్టా మయార్థేనైవ పుంభృతామ్. 59

మనుజాది దేహధారుల నిమిత్తము సమస్త లతా, వృక్షతృణాంకురముల నుత్పన్నమొనర్చుచు నేను భూమిద్వారా వర్షాదుల జలముల నాకర్షించితిని.

అవదాతతమే యుద్ధబోధకాలముపేషి
జగల్లక్షాణి తిష్ఠన్తి న తిష్ఠన్తి చ కానిచిత్. 60

యుద్ధమువలె సర్వద్వైత సంహారకమగు శుద్ధ బోధరూపకాలము సంప్రాప్తింప నాయందు లక్షలకొలఁది బ్రహ్మాండములు వర్తించుచున్నవి, వర్తింపకనున్నవి.

చితి యాస్తు చమత్కారం చమత్కుర్వన్తి యత్స్వతః
స్వచమత్కృతయోఽన్తస్థాస్తదేతాః సృష్టిదృష్టయః. 61

చైతన్యమందున్న స్వకీయచమత్కృతులు నిజసత్తాస్ఫూర్తి రూపముచే స్వయముగ ఏ చమత్కారము గావించుచున్నవో (జగత్తు నారోపించి ప్రకటమొనర్చుచున్నవో) తద్రూపముతోటియే యీ సృష్టులు వెలయుచున్నవి.

అనుభూతం కృతం కష్టం యావత్క్వచన కించన
పరమార్థచమత్కారాదృతే నేహోపలభ్యతే. 62

అనుభవము, రచన, కష్టము మున్నగునవి యెచట నేవిగలవో, అవి యన్నియు పరమార్థ చైతన్యముయొక్క చమత్కారము తప్ప అన్యమేమియుఁ గానేరవు.

ప్రత్యేకం విశ్వరూపాత్మా సర్వకర్తా నిరామయః
ప్రబుద్ధః శుద్ధబోధాత్మా సర్వం బ్రహ్మాత్మకం యతః. 63

కావున, అధ్యారోపదృష్టిచే ప్రతివస్తువునకును స్వసత్త నర్పించుటఁబట్టి నేను సర్వరూపుఁడనగు, కర్తనైయున్నాను. అపవాదదృష్టిచే సమస్తము బ్రహ్మరూపమగుటచే ప్రబుద్ధుఁడును, నిరామయుఁడను, కేవలము శుద్ధబోధస్వరూపుఁడను, బ్రహ్మరూపుఁడను నైయున్నాను.

సర్వః సర్వత్ర సర్వాత్మా సర్వగః సర్వసంశ్రయః
ఏతత్ప్రబుద్ధవిషయమప్రబుద్ధం న వేద్మ్యహమ్. 64

కాఁబట్టి, ప్రతివస్తువు నందున్నట్టి బ్రహ్మమందు సర్వజగత్తు యొక్క అధ్యాసమగుటచే, ప్రబుద్ధుని దృష్టియందు వాస్తవముగ ఈ జగత్తంతయు సర్వత్ర సర్వాత్మకమై, సర్వవ్యాపకమై, సర్వాశ్రయమైనట్టి బ్రహ్మమేయైయున్నది. ఇఁక, అప్రబుద్ధుని దృష్టియందలి జగద్రూపమో, నేనెఱుఁగను.

ఆకాశకోశ విశదాత్మని చిత్స్వరూపే యేయం సదా కచతి సర్గపరమ్పరేతి
సాన్తస్తదేవ కిల తాప ఇవాన్తరూష్మాభేదోపలమ్భ ఇతి నాస్తి సదస్త్యనన్తమ్. 65

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే పరమార్థ సర్గయోరైక్య
ప్రతిపాదనం నామ ద్వినవతితమః సర్గః ॥ 92 ॥

ఓ రామచంద్రా! ఆకాశకోశమువలె నిర్మలమైనట్టి చిత్స్వరూపమగు ఆత్మయందీసృష్టి పరంపర సదా భాసించుచున్నది. అయ్యది అంతమున ఆ చిద్రూపబ్రహ్మమే యగుచున్నది. 'తాపమందు ఉష్ణత్వము గలదను' వాక్యమున ఆ తాపాది పదములురెండును సమానార్థసూచకములేయైనట్లు బ్రహ్మము జగత్తను రెండు పదములందును వాస్తవముగ భేదమేమియును లేదు. మఱియు యథార్థముగ నామరూపాత్మకమను దృశ్యములేనిదియు, అనంతమైన సద్రూపమగు బ్రహ్మమే గలదియునగును.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషా॥ పరమార్థసర్గయోరైక్య ప్రతిపాదనమను దొంబదిరెండవ సర్గము ॥92॥

త్రినవతితమః సర్గః

[వాసిష్ఠకుట్యాం ధ్యానస్థ సిద్ధస్యేహ నిరీక్షణమ్
పాతః కుట్యుపసంహారాత్పూర్వదన్తోక్తిశ్చ వర్ణ్యతే.

వసిష్ఠమునీంద్రుని కుటీరమున ధ్యానస్థుఁడగు సిద్ధుని దర్శనము, ఆ కుటీరము యొక్క పతనము, సిద్ధుఁడు తన వృత్తాంతమును వర్ణించుట యిటఁ గాననగును.]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

అథైవం రూపసంవిత్తేః పరావృత్త్య ప్రయత్నతః
తమమ్బరకుటీకోశ దేశమాగతవానహమ్. 1

శ్రీ వసిష్ఠుఁడు - ఓ రామచంద్రా! ఇట్లు కౌతుకముచే ఆ జగంబుల దర్శించినపిదప యట్టి క్రియనుండి ప్రయత్నపూర్వకముగఁ దొలఁగి, ఆ నాపూర్వపు అకాశమందున్నట్టి సమాధి కుటీరమువద్ద కేగితిని.

యావత్తత్ర న పశ్యామి స్వదేహం క్వచన స్థితమ్
పశ్యామి కేవలం సిద్ధం కమప్యన్యం పురః స్థితమ్. 2

కాని యచటికేగి చూడ, ఆ నాశరీర మెచటను గానుపింపకుండె. సమాధియందున్నట్టి కేవల మొక అన్యుఁడగు సిద్ధుఁడు మాత్రమచట నుండియుండుటను గాంచితిని.

ఉపవిష్టం సమాధాననిష్ఠమిష్టం పదం గతమ్
సౌమ్యోదయమివాదిత్యం దగ్ధేన్ధనమివానలమ్. 3
బద్ధపద్మాసనం శాన్తం సమాధాననిరఞ్జనమ్
గుల్ఫద్వితయమధ్యస్థవృషణం విషయాతిగమ్. 4
మృష్టసౌమ్యసమాభోగస్కన్ధబన్ధురకన్ధరమ్
సుస్థిరోదారవిశ్రాన్తస్ఫారకస్థితి సున్దరమ్. 5
నాభీనికటగోత్తానపాణిద్వితయదీప్తిభిః
హృదయామ్భోజతేజోభిర్బహిష్ఠైరివ భాసితమ్. 6
శ్లిష్టపక్ష్మేక్షణం క్షీణసర్వేక్షం స్వచ్ఛతాం గతమ్
సరో నిమీలితామ్భోజమివ సుప్తం దినాత్యయే. 7
అవిక్షుభితమాశాన్తమన్తఃకరణకోటరమ్
దధానం ధీరయా వృత్త్యా శాన్తోత్పాతమివామ్బరమ్. 8

ఆతఁడు సమాధియందు నిమగ్నుఁడైయున్నవాఁడును, బ్రహ్మపదమును బొందినవాఁడును, సౌమ్యమైన యుదయముగల ఆదిత్యునివలెను, దగ్ధమైన ఇంధనముయొక్క అగ్నివలెను ప్రకాశరూపమైనవాఁడును, పద్మాసనము వైచికొని కూరుచున్నవాఁడును, శాంతుఁడును ఇష్ట విషయమున చిత్తము స్థిరమగుటచే నిశ్చలుండును, గుల్ఫము (చీలమండ)ల రెంటి — మధ్యమునను అండకోశము గల్గియున్నవాఁడును, విషయములకు బరమగు పరబ్రహ్మమందు నిష్ఠగలవాఁడును, భస్మత్రిపుండ్రరేఖలతోఁ గూడిఁ సౌమ్యములై, గంభీరములై, సమములైనట్టి భుజస్కంధములచే శోభితమగు కంఠముగల్గియున్నవాఁడును సుస్థిరమై, ఉదారవస్తువగు ఆత్మ యందు విశ్రాంతినొందిన మనస్సుచేఁ బ్రసన్నమైనట్టి సుఖముగలదైన శిరస్సుయొక్క స్థితిచే సుందరుఁడును, నాభిసమీపమున తెఱచియుంచినట్టి హస్తద్వయముయొక్క ప్రకాశములచే బాహ్యమున కేతెంచిన హృదయకమల తేజములచేవలె భాసిల్లుచున్నవాఁడును, కనురెప్పల రెంటిని మూసుకొన్నవాఁడును, క్షీణించిన సమస్తబాహ్యేంద్రియ వ్యాపారములుగలవాఁడును, దినాంతమున ముకుళితమైన కమల సరోవరమువలె నిర్మలత్వమును బొందియున్నవాఁడును, ఉత్పాతము శమించిన యాకాశమువలె క్షోభరహితమై, సర్వథా శాంతమైనట్టి అంతఃకరణమును ధీరవృత్తిచే ధరించియున్నవాఁడునునై యొప్పుచుండెను.

అపశ్యతా నిజం దేహం తం మునిం పశ్యతా పురః
ఇదం మయా తదా తత్ర చిన్తితం చారుచేతసా. 9

అట్లచట ఎదుట నాదేహమునుగాంచక యమ్ముని వర్యుని దేహమును వీక్షించి యంతట శుద్ధ చిత్తముతో నేనిట్లు చింతించితిని

అయం కశ్చిన్మహాసిద్ధః సంప్రాప్తోఽస్మిన్దిగన్తరే
విచార్యాహమివైకాన్తం విశ్రామార్థీ మహామ్బరమ్. 10
సమాధియోగ్యమేకాన్తం లభేయేతీహ చిన్తయా
కుటీ దృష్టేయమేతేన సత్యసంకల్పశాలినా. 11
మదాగమనమేతేన తతోఽచిన్తయతా చిరమ్
తం స్వదేహం శవీభూతమపాస్యేహ కృతా స్థితిః. 12

'ఈతఁడెవఁడో యేకాంతమున నావలెనే విశ్రాంతి నభిలషించినట్టి మహాసిద్ధుడగు మహాత్ముఁడై యున్నవాఁడై దిగంతమందున్న యీ మహాకాశమున కేతెంచియున్నాఁడు. మఱియు, సత్యసంకల్పయుతుఁడగు ఈ మహనీయుఁడు 'సమాధియోగ్యమగు ఏకాంతస్థానమును బొందుదును' అను చింతచే యీ కుటీరమును గాంచెను. చిరకాలము నేనుపేక్షించుటచే నా శరీరమును మరణించినదిగ నెఱిఁగి, నా యాగమనమునుగూర్చి విచారింపక, ఆ నాశరీరమును మఱియొక చోటవైచి యీతఁడిచట స్థితిఁబొందెను.

తదిహాస్తమహం యామి స్వం లోకమితి నిశ్చయమ్
యావద్గన్తుం ప్రవృత్తోఽస్మి తావత్సంకల్పసంక్షయాత్. 13
సా నివృత్తా కుటీ తత్ర సంపన్నం వ్యోమ కేవలమ్
స సిద్ధోఽపి నిరాధారః పతితోఽధః సమాధిమాన్. 14

ఆ నాస్థూలశరీర మిటనశించినది. కావున, ఇపుడు నా సూక్ష్మశరీరముతోనే నేను నిజ సప్తర్షిలోకమునకుఁ బోయెదనని నిశ్చయించి యట్లు చనుటకుఁ బ్రవృత్తుఁడను కాఁగా వెంటనే సంకల్ప క్షయముచే ఆ కుటీరము నశించిపోయి కేవల మాకాశమాత్రమై యొప్పెను. ఆ సమాధిస్థుఁడగు సిద్ధుఁడును నపుడు నిరాధారుఁడై క్రిందఁ బడెను,

స్వప్నసంకల్పసంశాన్తౌ స్వప్నసంకల్పపత్తనమ్
యదా సా సుకుటీ నష్టా మత్సంకల్పోపశాన్తితః. 15
స పపాత తతో ధ్యానీ జలోత్పీడ ఇవామ్బుదాత్
ఖాదివానిలనున్నోఽబ్ద ఇన్దుబిమ్బమివ క్షయే. 16

స్వప్న, సంకల్పములు శమింప ఆ స్వప్నసంకల్పములందలి నగరమున్ను శమించునట్లు, నా సంకల్పముపశమింప ఎపుడా కుటీరమున్ను నశించిపోయెనో, అపుడు మేఘమునుండి జలధారవలెను, ఆకాశమునుండి వాయుప్రేరితమగు మేఘమువలెను, ప్రళయకాలమునఁ జంద్ర బింబమువలెను. ఆ ధ్యాని క్రిందఁ బడెను.

వైమానిక ఇవాపుణ్యశ్ఛిన్నమూల ఇవ ద్రుమః
ఖాత్త్యక్త ఇవ పాషాణః స పపాత తతోఽవనౌ. 17
అహం యావదియం తావత్కుటికాస్త్వితి కల్పనే
క్షీణే కుటీక్షయే జాతే స సిద్ధః పతితః క్షణాత్. 18

మఱియు, పుణ్యము క్షయించిన వైమానిక దేవతవలెను, మూలము ఛిన్నమొనర్పఁబడిన వృక్షమువలెను, ఆకాశమునుండి విడువఁబడిన శిలవలెను, ఆ సిద్ధుఁడు భూమిపైఁ బడెను. 'ఎంతవఱకు నేనుందునో, అంతదనుక ఈ కుటీరముండుగాక' అను ఈ సంకల్పము నాయొక్క గమనమునుగూర్చిన సంకల్పముచే క్షయమొంద, వెంటనే యాకుటీరమునశింప, ఆ సిద్ధుడున్ను క్షణకాలములోఁ గ్రిందబడెను.

పతతా తేన సిద్ధేన తతః సౌజన్యకౌతుకః
మనసైవాహమగమం నభసో వసుధాతలమ్. 19

సుజనత్వమునుగూర్చిన కౌతుకముతోఁగూడిన నేనపుడు మనస్సు (సూక్ష్మశరీరము) తోనే యా సిద్ధునితోఁగూడఁ బృథ్వీతలముపైకి నేతెంచితిని.

సోఽపతత్పవనస్కన్దవలనావర్తవృత్తిభిః
సప్తద్వీపసముద్రాన్తే గీర్వాణరమణావనౌ. 20

వాయుమండలముయొక్క పరివర్తనములచేఁ బ్రేరితములగు ఆవర్తములచే ఆ సిద్ధుడు సప్తద్వీప, సప్తసముద్రములయొక్క యంతమందున్న దేవతలక్రీడాస్థలమగు సువర్ణభూమిపైబడెను.

ప్రాణాపానోర్ధ్వగామిత్వాత్థాద్యథాస్థితమేవ సః
స్పృష్టాపూర్వోర్ధ్వమూర్ధోర్వ్యాం బద్ధపద్మాసనోఽపతత్. 21

ప్రథమమున భూమిని స్పృశించిన పాదభాగములు గలవాఁడును; శిరస్సు ఊర్ధ్వముగ స్థాపించుకొనియున్నవాఁడునై యాతఁడు ప్రాణాపానముల యూర్ధ్వగమనమువలన ఆకాశమందలి కుటీరమందున్నట్లుగనే పద్మాసనస్థుఁడై భూమిపైఁ బడెను.

న ప్రబుద్ధో బభూవాసౌ విచరం తమచేతనః
పాషాణదేహ ఇవ వా తూలాత్మేవైవ వా లఘుః. 22

యోగబలముచే వజ్ర, శిలాదులవలె దృఢమైనట్టియు, దూదివలె లఘువైనట్టియు దేహము గల్గియుండుటచే నాతఁడు దూరమునుండి పడినప్పటికిని భగ్నశరీరుఁడు కాకుండెను. మఱియు చిత్తము అన్యత్ర సంలగ్నమై యుండుటఁబట్టి యాతఁడు అచేతనునివలె నొప్పుచు సమాధినుండి మేల్కొనక యుండెను.

మయా తదవబోధార్థమథ యత్నవతా తదా
కృత్వా జలదతాం వ్యోమ్ని వృష్టం గర్జితమూర్జితమ్. 23

అపుడాతనిని సమాధినుండి మేలుకొలుపుటకై ప్రయత్నవంతుఁడనై నేనాకాశమున సంకల్పముచే మేఘము నుత్పన్నమొనర్చి వర్షముకురుపించితిని. మఱియు బిగ్గరగా గర్జనయుఁ గావింపించితిని.

కరకాశనిపాతేన తేన తస్మిన్దిగన్తరే
మయూరం ప్రావృషేవాముః బుద్ధ్వా బోధితవానసౌ. 24

ఇంకను, ఆతఁడున్నదిశయందు వడగండ్లవాన కురిపించి, వర్షర్తువు మయూరమును మేలుకొలుపునట్లు, నేను స్వబుద్ధిచే నమ్మహాత్ముని బోధితునిగఁ జేసితిని.

బభూవాభాసితాఙ్గశ్రీర్వికాసితవిలోచనః
ధారానికరఫుల్లాత్మా ప్రావృషీవామ్బుజాకరః. 25

అపుడాతఁడు వర్షాకాలమున జలధారలచే వికసితమగు కమలవనమువలె ప్రకాశమానములగు అంగములతోఁ గూడినవాఁడై, వికసిత నేత్రుఁడై శోభించెను.

ప్రబుద్ధం సంప్రశాన్తాయాం దృష్ట్వా తమహమగ్రతః
అపృచ్ఛం స్వేచ్ఛయా వృత్త్యా నివృత్తం పరమార్థతః. 26

అట్లు సమాధినుండి నివృత్తిని బొందినట్టి ప్రబుద్ధుఁడును, ప్రశాంతుఁడునగు ఆ సిద్ధుని యెదుట నిర్మలవృత్తితోటి నేనాతని నిట్లు ప్రశ్నించితిని.

క్వస్థితోఽసి కరోషీదం కిం చ భో మునినాయక
కస్త్వం కస్మాదలం దూరాన్న భ్రంశమపి చేతసి. 27

ఓ మునివర్యా ! మీ రెవరు ? ఎచటనున్నారు? ఏమి చేయుచున్నారు? దూరమునుండి పడినప్పటికిని చిత్తమున దానినేల యెఱుఁగకున్నారు ?

ఇత్యుక్తో మామసౌ ప్రేక్ష్య సంస్మృత్య ప్రాక్తనీం గతిమ్
ఉవాచ వచనం చారు చాతకో జలదం యథా. 28

నే నిట్లడుగనంత యాతఁడు నన్ను జూచి తన పూర్వకాలస్థితిని స్మరించి, చాతకము మేఘమునుగూర్చి పలుకునట్లు, నన్నుగూర్చి కోమలవచనముల నిట్లు పలికెను.

సిద్ధ ఉవాచ :—

ప్రతిపాలయ మే యావత్స్వవృత్తాన్తం స్మరామ్యహమ్
కథయిష్యామి తే పశ్చాత్పాశ్చాత్యం వృత్తమాత్మనః. 29

సిద్ధుఁడు:— మహాత్మా! నేను నా వృత్తాంతమును స్మరించుకొనునంతవఱ కొకింత వేచియుండుడు. ఆ పిమ్మట నా పూర్వవృత్తాంతమంతటిని తమకుఁ దెలిపెదను.

ఇత్యుక్త్వా చిన్తయిత్వాశు స యథా వృత్తమక్షతమ్
స్మృతవాన్ప్రాయమహ్నీవ సమాచరితమాత్మనః. 30

ఓ రామచంద్రా! ఇట్లు చెప్పి యాతఁడు, దినమందలి సమాచార మంతటిని జనులు సాయంకాలమున స్మరించువిధమున, తన పూర్వవృత్తాంతమంతటిని శీఘ్రముగ చింతించి స్మరించెను.

మామథోవాచ వచనం చారుచన్ద్రాంశుశీతలమ్
ఆహ్లాదనమనిన్ద్యం చ నిరవద్యం సుఖోదయమ్. 31

ఆ పిదప, చంద్రకిరణములవలె శీతలములును, ఆనందదాయకములును, అనింద్యములును, ఆక్షేపణలేనివియు, సుఖోదయము గలవియునగు మనోహరములైన వాక్యముల నిట్లాతఁడు నాతోఁ బలికెను.

సిద్ధ ఉవాచ:—

అధునా త్వం మయా బ్రహ్మన్పరిజ్ఞాతోఽభివాదయే
అతిక్రమోఽయం క్షన్తవ్యః స్వభావో హి సతాః క్షమా. 32

సిద్ధుఁడు:— మహాత్మా! ఇపుడు నేను తమ్ముల నెఱిఁగితిని. తమకు నమస్కారము. ప్రథమ దర్శనమునఁ దమకు నమస్కరింపని యపరాధమును క్షమింపుఁడు. క్షమయే సత్పురుషుల స్వభావముగదా!

మునే చిరమహం భ్రాన్తో దేవోపవనభూమిషు
భోగామోదవిమోహేషు షట్పదః పద్మినీష్వివ. 33

ఓ మునీంద్రా! ప్రథమమున, భోగమను సుగంధముచే మోహదాయకములగు దేవతల యుపవనభూములందు,కమలసరోవరములందు భ్రమరములవలె, చిరకాలము నేను పరిభ్రమించితిని.

దృశ్యనద్యామథో చిత్తజలకల్లోలహేలయా
చక్రావర్తోహ్యమానేన మయోద్విగ్నేన చిన్తితమ్. 34

చిత్తమను తరంగ - లీలచే ఈ దృశ్యప్రపంచమను నదియందు చక్రమువంటి ఆవర్తములందుఁ దిరుగుచు వ్యాకులుఁడనైన నేనిట్లు చింతించితిని.

సంసారసాగరే దృశ్యకల్లోలైరరహమాకులః
కాలేనోద్వేగమాయాతశ్చాతకోఽవగ్రహే యథా. 35

ఈ సంసారసాగరమున దృశ్య - తరంగములచే వ్యాకులుఁడనై, వర్షము లేమి చాతకపక్షి దుఃఖించునట్లు, నేను కాలక్రమమున దుఃఖము నొందితిని.

సంవిన్మాత్రైకసారేషు రమ్యం భోగేషు నామ కిమ్
అవశిష్టే గతోద్వేగసంవిద్వ్యోమ్న్యేవ కేవలమ్. 36

జ్ఞానముమాత్రమే సారముగాఁగల్గిన యీ ప్రపంచమందలి భోగములందు ఆ జ్ఞానము తప్ప అన్యమగు రమ్యమైన వస్తువెద్ది గలదు? కావున నేను సర్వదుఃఖమును ద్యజించి జ్ఞానస్వరూపమగు ఆకాశమందే స్థితిగల్గియుండెదను.

శబ్దరూపరసస్పర్శగన్ధమాత్రాదృతే పరమ్
నేహ కించన నామాస్తి కిమేతావత్యహం రమే. 37

శబ్దస్పర్శరూప రసగంధమాత్రములు తప్ప అన్యమైన వస్తువెద్దియును ఈ ప్రపంచమున లేదు. అట్టిచో, పరిచ్ఛిన్నములై, దుఃఖరూపములైనట్టి వానియందు నేనేల రమింపవలెను?

చిన్మాత్రాకాశమేవైతత్సర్వం చిన్మాత్రమేవ వా
తత్కిమత్రా సదాకారే రమే నష్టమతిర్యథా. 38

ఈ శబ్దాది విషయములన్నియు చిదాకాశము యొక్క సత్తచేతనే సత్తగలిగియున్నవై తద్వ్యతిరేకముగ శూన్యరూపములేయై యొప్పుచున్నవి. లేక సమస్తముచిన్మాత్రమే యైయున్నది గాన మఱియొకవస్తువు లేనేలేదు. కావున, అసత్తగు ఆకారము గల్గియున్న యీ శబ్దాదులందు నష్టబుద్ధివలె ఏల రమింపవలెను?

విషయా విషవైషమ్యా వామాః కామవిమోహదాః
రసాః సరసవైరస్యా లుఠన్నేషు న కో హతః. 39

శబ్దాది విషయములు విషమువలె మరణ, ఉన్మాదాది వైషమ్యమును గలుగఁజేయునవై యున్నవి. స్త్రీలో కామవిమోహదాయకలై యున్నారు. రాగములో సరసుఁడగు మనుజునకును విరసత్వమును గలుగఁజేయునవియగును. కాఁబట్టి యిట్టివానియందు రమించుచు నెవఁడు హతుఁడు గాకయున్నాఁడు?

జీర్ణా జీవితజమ్బాలజరచ్ఛఫరి కామతిః
కాయం ద్రుతగతా దాతుం జరేచ్ఛతి బృహద్బకీ. 40

శిథిలమైనట్టి జీవితమను శైవాలము (నాచు) నందు గొప్పశఫరి (మత్స్యవిశేషము) లభించినదను బుద్ధితోఁగూడినదై వార్ధక్యమను మహాబకము (పెద్దకొంగ) శీఘ్రముగ నేతెంచి శరీరమును గ్రహింపనెంచుచున్నది,

కాయోఽయమచిరాపాయో బుద్బుదోఽమ్బునిధావివ
స్ఫురన్నేన పురోన్తర్ధిం యాతి దీపశిఖా యథా. 41

సముద్రమందలి బుద్బుదమువలె శీఘ్రముగ నశించునట్టి యీ శరీరము ఎదుట స్ఫురించుచు స్ఫురించుచునే దీపశిఖవలె నంతర్ధానమగుచున్నది.

వివిధాకులకల్లోలా చక్రావర్తవిధాయినీ
మృతిజన్మబృహత్కూలా సుఖదుఃఖతరఙ్గిణీ. 42
యౌవనోల్లాసకలిలా జరాధవలఫేనిలా
కాకతాలీయయోగేన సంపన్న సుఖబుద్బుదా. 43

వ్యవహారమహావాహరేఖాజడరవాకులా
రాగద్వేషఘనోల్లాసా భూతలాలోల దేహికా. 44
లోభమోహమహావర్తా పాతోత్పాతవివర్తనీ
హా తప్తా జీవితాఖ్యేయం నదీ నదనశీతలా. 45

ఈ జీవితమనునది, అనేకములైన విక్షేపములను కల్లోలములతోఁ గూడినదియు, చక్రమువంటి ఆవర్తములుగల్గి ప్రవహించునదియు, జనన మరణములను రెండు గొప్ప తీరములు గలదియు, సుఖదుఃఖములను తరంగములు గల్గియున్నదియు, యౌవనోల్లాసమను పంకముచేఁ గలుషిత మైనదియు, వార్ధక్యమను తెల్లని నురుఁగుగలదియు, కాకతాళీయయోగముచే సంప్రాప్తమైన సుఖమను బుద్బుదములతోఁ గూడినదియు, వ్యవహారమను మహాప్రవాహసమూహముచేతను, మూర్ఖప్రలాపములను జలశబ్దములచేతను వ్యాప్తమైనదియు. రాగద్వేషములను మేఘములచే వృద్ధి నొందునదియు, భూతలముపైఁ జంచలమైన దేహముగలదియు, లోభమోహములను గొప్ప ఆవర్త సహితమైయున్నదియు, పతన ఉత్పతనములతోటి తిరుగాడునదియు, నామమాత్రముచే శీతలమైనదియు, కాని వాస్తవముగ తాపత్రయములచే సంతప్తమై ప్రవహించునదియునై యొప్పుచు దుఃఖమునే కలిగించుచున్నది,

అపూర్వాణ్యుపగచ్ఛన్తి తథా పూర్వాణి యాన్త్యలమ్
సంసారసరిదమ్భూని సంగతాని ధనాని చ. 46

నదీజలములవలె ఈ సంసారమందలి పుత్రమిత్ర ధనాది పదార్థములు వెనుకటివి పూర్తిగఁబోవుచు, మరల క్రొత్తవియేతెంచుచున్నవి.

ప్రవృత్తా యే నివర్తన్తే తైరలం హతభావకైః
అపూర్వా యే ప్రవర్తన్తే తేష్వథాస్థేహ కీదృశీ. 47

మొదట సంప్రాప్తించినవి నివర్తించుచున్నవి, క్రొత్తవి యేతెంచుచున్నవి. కావున నట్టి నశించు పదార్థములచే మనకేమి ప్రయోజనము? మఱియు నట్టి పదార్థములందు విశ్వాసమేల?

సర్వస్యాః సరితో వారి ప్రయాత్యాయాతి చాకరాత్
దేహనద్యాః పయస్త్వాయుర్యాత్యేవాయాతి నో పునః. 48

నదులన్నింటియొక్క జలము ప్రవాహరూపముచేఁ బోవుచున్నది. మరల పర్వత మేఘాదుల నుండి యేతెంచుచున్నది. కాని ఈ దేహమను నదియొక్క ఆయువను జలము పోవుచున్నది. గాని మరల పచ్చుటలేదు.

శతశః పరివర్తన్తే ప్రతిపిణ్డం క్షణం ప్రతి
కులాలచక్రకాభావా ఇవ భావా భవామ్బుధౌ. 49

కుమ్మరివాని చక్రముపై ఆరూఢములగు ఘటాది పాత్రలవలె, ఈ సంసారమను సముద్రమున ప్రతిదేహమందును, ప్రతిక్షణమందును భోగ్యపదార్థము లనేకవిధములుగ పరివర్తనము చెందుచున్నవి.

చరన్తి చతురాశ్చోరా విషమా విషయారయః
హరన్తి భావసర్వస్వం జాగర్మి స్వపిమీహ కిమ్. 50

భయంకరములైన విషయములను శత్రురూపులగు చతురచోరులు నలువైపుల సంచరించుచున్నారు. నేను మేల్కొనియున్నను, నిదురించుచున్నను వారు నా వివేకమను సర్వస్వమును హరించి వైచుచున్నారు.

ఆయుషః ఖణ్డఖణ్డాశ్చ నిపతన్తః పునః పునః
న కశ్చిద్వేత్తి కాలేన క్షతాని దివసాన్యహో. 51

ప్రతిక్షణము ఆయువుయొక్క ఖండ, ఖండములు రాలిపోవుచున్నవి. అయ్యో, ఆయువు యొక్క దివసములను కాలము క్షయమొనర్చి వైచుచుండుటను ఎవఁడును నెఱుఁగుటలేదే!

ఇదమద్య తథేదం చ తథేదమిదమస్య మే
ఏవం కలనయా లోకో గతం ప్రాప్తం న వేత్త్యహో. 52

అహా! ఇది నేఁడు లభించినది, ఇది రేపు లభించును, 'ఇది వీనిది, ఇది నాది' ఈ మున్నగు కల్పనలచేఁ బ్రపంచమందలి జనులు తమ గడచిన ఆయువునుగాని, ప్రాప్తించిన మృత్యువునుగాని యెఱుఁగక యున్నారే!

భుక్తం పీతమనన్తాసు భ్రాన్తం చ వనభూమిషు
దృష్టాని సుఖదుఃఖాని కిమన్యదిహ సాధ్యతే. 53

అనేక పదార్థములను భుజించితిని, త్రాగితిని; పెక్కువనభూములందు సంచరించితిని అనేక సుఖదుఃఖములనుగూడ గాంచితిని. ఇఁక నిటసాధింపఁదగిన అన్యపదార్థమేమి గలదు?

సుఖదుఃఖానుభవనాద్భూయోభూయో వివర్తనాత్
అనిత్యత్వాచ్చ భావానాం స్థితా నిష్కౌతుకా వయమ్. 54

సుఖదుఃఖానుభవముచేతను, మరల మరల ఆ పదార్థములనే యనుభవించుటచేతను, పదార్థములు అనిత్యములగుటచేతను భోగములందు మేము ఉత్కంఠ లేనివారమై యుంటిమి.

భుక్తాని భోగవృన్దాని దృష్టా చానిత్యతా భృశమ్
నోపలభ్యత ఏవాతి విశ్రాన్తిరిహ కుత్రచిత్. 55

అనేక భోగముల ననుభవించితిని; వాని అనిత్యత్వమునున్ను మరల మరల గాంచితిని; కాని పూర్ణవిశ్రాంతి నొసంగు ప్రదేశ మిట నెచటను బొందకుంటిని.

భ్రాన్తముత్తుఙ్గశృఙ్గాసు మేరూపవనభూమిషు
లోకపాలపురీషూచ్చైః సంప్రాప్తం కిమకృత్రిమమ్. 56

ఎత్తైన పర్వతశిఖరములందును, మేరుపర్వతముయొక్క యుపవనభూములందును, లోకపాలుర మహానగరములందును గూడ సంచరించితిని. కాని శాశ్వతమైనదియు సహజమైనదియు నగు పదార్థమెద్దియును నేను బొందకుంటిని.

సర్వత్ర దారుభిర్వృక్షా మాంసైర్భూతాని భూర్భృదా
దుఃఖాన్యనిత్యతా చేతి కథమాశ్వాస్యతే వద. 57

ఓ మునీంద్రా! ఎల్లెడల వృక్షములు దారువు (కొయ్య)లచేతను, ప్రాణులు మాంసముల చేతను, భూమి మృత్తికచేతను, ప్రపంచమంతయు దుఃఖ, అనిత్యత్వములచేతను వ్యాప్తమై యున్నది. అసారములగు ఇట్టి వీనిచే ధైర్య మెట్లు గలుగునో వచింపుఁడు?

న ధనాని న మిత్రాణి న సుఖాని న బాన్ధవాః
శక్నువన్తి పరిత్రాతుం కాలేనాకలితం జనమ్. 58

కాలముచే గ్రసింపఁబడిన జనులను ధనములుగాని, మిత్రులుగాని, సుఖములుగాని బంధువులుగాని, రక్షింపఁజాలవు.

జనో జీమూతజఠరజలవద్గిరికుక్షిషు
యాత్యన్తః శూన్య ఏవాస్తం పాంసూపచయపేలవః. 59

ధూళిసమూహమువలె అస్థిరుఁడగు మనుజుఁడు పర్వతములపైఁ బడియుండు మేఘములందలి జలమువలె, విషయములందు లీనుఁడై, క్షణక్షణము క్షీణదశనొందుచు, అభ్యంతరమున పురుషార్థరహితుఁడై, మరణమును బొందుచున్నాఁడు.

న మే మనోరమాః కామా న చ రమ్యా విభూతయః
ఇదం మత్తాఙ్గనాపాఙ్గభఙ్గలోలం చ జీవితమ్. 60

సుందరస్త్రీలుగాని, కామములుగాని, ఐశ్వర్యములుగాని నాకిపుడు రమణీయములుగఁ దోచుటలేదు. ఏలయనిన ఈ జీవితము మదించిన స్త్రీయొక్క కడకంటివలెఁ జంచలమైయున్నది.

క్వేవ కస్య కథం నామ కుత ఆశ్వాసనా మునే
అద్య శ్వో వాఽఽపదం పాపో మృత్యుర్మూర్ధ్ని నియచ్ఛతి. 61

ఓ మునీంద్రా! ఎచట నెట్లవనికి ఆశ్వాసన (ధైర్య) ముండఁగలదో చెప్పుడు? నేఁడో, రేపో, క్రూరమగు మృత్యువు శిరస్సుపై అపదను దెచ్చి పెట్టనున్నదిగదా!

శరీరం పర్ణవద్భ్రంశి జీవితం జీర్ణసంస్థితి
ధీరధీరతయా గ్రస్తా రసా నీరసతాం గతాః. 62

ఈ శరీరము ఎండుటాకువలెఁ బతనశీలమైయున్నది. జీవితము శిథిలమైన స్థితిగల్గియున్నది. బుద్ధి అధీరత్వముచే గ్రస్తమైయున్నది. రసములన్నియు నీరసములై యొప్పుచున్నవి.

నీతం మనోరథైరేవ నీరసైర్వాఽఽయురాతతమ్
న మమ స్వం చమత్కారకారి కించిదపీహితమ్. 63

నీరసములైన భోగములచేతను, వానిఁగూర్చిన కోర్కెలచేతను మాత్రమే నా ఆయువంతయును గడపఁబడినది. ఆత్మ-చమత్కారజనకమగు ఏ యుత్తమ పురుషార్థమును నేను సంపాదించి యుండలేదు.

మోహోఽద్య మాన్ద్యమాయాతో దేహో నేహోపయుజ్యతే
అనాస్థైవోత్తమావస్థా స్థానాస్థైవాధమా స్థితిః. 64

ఇపుడు మోహము మందగించినది. ఈ దేహమువలన నిట నేప్రయోజనమున్నులేదు. విషయములందాసక్తిలేకుండుటయే యుత్తమస్థితియు, అసక్తిగల్గియుండుటయే అధమస్థితియునగును.

ఆపదాపతితైవేయమహో మోహవిధాయినీ
నిత్యమిత్యేవ మన్తవ్యం సక్తవ్యం నేహ సంసృతౌ. 65

వివేకియగువాఁడు సంపదప్రాప్తించినపుడు 'అహా! మోహకారకమగు అపద వచ్చి పడినది' అని తలంచి సంసారమున ఆసక్తుఁడుకాక యుండవలెను.

విధిభిః ప్రతిషేధైశ్చ శాశ్వతైరప్యశాశ్వతైః
యథేష్టం నీయతే లోకే జలం నిమ్నోన్నతైరివ. 66

నిమ్నోన్నత ప్రదేశములచే జలము గొనిపోఁబడునట్లు, విధినిషేధములచేతను, శాశ్వత అశాశ్వతములచేతను జనులు యథేష్టముగఁ గొనిపోఁబడుచున్నారు.

వివేకామోదసర్వస్వం చేతఃకుసుమకోశతః
హృత్వామూర్చాం ప్రయచ్ఛన్తి విషయా విషవాయవః. 67

విషయములను విషవాయువులు చిత్తమను పుష్పకోశమునుండి వివేకమను సుగంధమంతటిని హరించి మూర్ఛను గలుగజేఁయుచున్నవి.

అసదేవ తథా నామ దృష్టం సత్తాముపాగతమ్
యథా సదేవ సద్రూపం సంపన్నమసదేవ సత్. 68

సద్రూపమగు పరబ్రహ్మము మాయయొక్క ఆవరణశక్తిచే అసత్తగు జగత్తువలె నెట్లు భాసించుచున్నదో, అట్లే విక్షేపశక్తిచే అసత్తగు జగత్తున్ను సద్రూపమువలె భాసించుచున్నది. ఇదియే మాయయొక్క అఘటిత ఘటనాపటుత్వము.

దోలాయన్త్యోఽవనౌ దేహం సాగరాన్ప్రరగాఙ్గనాః
యథా ధావన్తి ధావన్తి జనతా విషయాంస్తథా. 69

తీరముల రెంటినిగూర్చి తనప్రవాహమను దేహము నూగించుచు నదులు సముద్రము వైపునకుఁ బరుగిడునట్లు, జనులున్ను విషయములవైపునకుఁ బరుగిడుచున్నారు.

ధావన్తి విషయాన్ లక్ష్యమున్ముక్తాశ్చిత్తసాయకాః
స్పృశన్తి న గుణాన్భూయః కృతఘ్నాః సౌహృదం యథా. 70

విడువఁబడిన చిత్తమను బాణములు విషయములవైపునకే పరుగిడుచు, కృతఘ్నులు మైత్రిని స్పృశింపనట్లు మరల వివేక, వైరాగ్యాది గుణము (అల్లెత్రాడు)ను స్పృశింపకయున్నవి.

ఉత్పాతవాయురేవాయుర్మిత్రాణ్యేవాతి శత్రవః
బన్ధవో బన్ధనాన్యేవ ధనాన్యేవాతి నైధనమ్. 71

సుఖాన్యేవాతిదుఃఖాని సంపదః పరమాపదః
భోగా భవమహారోగా రతిరేవ పరారతిః 72

ఆయువే ఉత్పాతవాయువు; మిత్రులే ప్రబలశత్రువులు; బంధువులే బంధనములు; ధనమే మరణసాధనము; సుఖములే మహాదుఃఖములు; సంపదలే గొప్పయాపదలు; భోగములే సంసార మహారోగములు; ఆసక్తియే పరమదుఃఖము.

ఆపదః సంపదః సర్వాః సుఖం దుఃఖాయ కేవలమ్
జీవితం మరణాయైవ బత మాయావిజృమ్భితమ్. 73

సంపదలన్నియు ఆపదలే; సుఖము కేవలము దుఃఖముకొఱకేయైయున్నది. జీవితమున్ను మరణముకొఱకేయగును. అహా మాయయొక్క ప్రభావ మెట్టిది!

బహూన్కాలపరావర్తానిష్టానిష్టాన్సుఖం మనాక్
పశ్యన్ప్రియవియోగాంశ్చ యాతి జర్జరతాం జనః. 74

అనేకములగు కాలపరివర్తనములను' ఇష్టానిష్టములను అల్పసుఖమును, ప్రియవస్తువులయొక్క వియోగములను గాంచి యీ మనస్సు శిథిలమగుచున్నది.

భోగా విషయసంభోగా భోగా ఏవ ఫణావతామ్
దశన్త్యేవ మనాక్స్పృష్టా దృష్టా నష్టాః ప్రతిక్షణమ్. 75

విషయభోగములు పాముపడగలవంటివే యగును. కొంచమైనను స్పృశించినచో వెంటనే కఱచును. కాని విచారించినచో నయ్యవి యాక్షణమందే నశించిపోవును.

ఆయుర్యాతి నిరాయాసపదప్రాప్తి వివర్జితైః
ఉదర్కభఙ్గురాకారైః కరాలైః కష్టచేష్టితైః. 76

ఆయాసరహితమగు ఆత్మపదముయొక్క ప్రాప్తిలేనివియు, పరిణామమున, కుటిలమైన యాకారముగలవియు, భయంకరములైన, కష్టముల నొసంగునవియునగు చేష్టలచే ఆయువు వ్యర్థముగ గడచిపోవుచున్నది.

భోగాశాబద్ధతృష్ణానామవమానః పదేపదే
ఆలానమవలీనానాం వన్యానామివ దన్తినామ్. 77

కట్టుకంబమునకుఁ గట్టఁబడి యుపవాసులచే కృశించినట్టి వనగజములకువలె భోగాశయందు బంధింపఁబడిన తృష్ణాసహితులగు మనుజులకు అడుగడుగునకు అవమానము తటస్థించుచున్నది.

సంపదః ప్రమదాశ్చైవ తరఙ్గోత్సఙ్గభఙ్గురాః
కస్తాస్వహిఫణాచ్ఛత్రచ్ఛాయాసు రమతే బుధః. 78

సంపదలు, స్త్రీలు, తరంగములవలె క్షణభంగురములైనవి, సర్పముయొక్క పడగయను గొడుగుక్రిందటి నీడయందు ఏబుద్ధిమంతుఁడు క్రీడింప నెంచును?

సత్యం మనోరమాః కామాః సత్యం రమ్యా విభూతయః
కింతు మత్తాఙ్గనాపాఙ్గభఙ్గలోలం హి జీవితమ్. 79

ఒకవేళ సంపదలు స్త్రీలు మనోహరములేయని నమ్మినను, మదించిన స్త్రీయొక్క కడకంటివలె జీవితము చంచలమైనదిగదా!

ఆపాతరమణీయేషు రమన్తే విషయేషు యే
అత్యన్తవిరసాన్తేషు పతన్తి నిరయేషు తే. 80

విచారింపనికారణముచే రమణీయములును, పరిణామమున అత్యంతనీరసములు నగు విషయములందెవరు రమింతురో, వారు నరకమందుఁ దప్పక పడుదురు.

ద్వన్ద్వదోషోపరుద్ధాని దుఃసాధ్యాన్యస్థిరాణి చ
ధనాన్యభవ్యసేవ్యాని మమ జాతు న తుష్టయే. 81

ఆర్జించు సమయమున శీతోష్ణ. క్షుత్పిపాసాది ద్వంద్వములచే నిరోధింపఁబడునదియు, కష్టసాధ్యమున్ను, అస్థిరమైనదియు, ఉత్తములు కానివారిచే సేవింపఁబడునదియునగు ధనము నాకెపుడును సంతుష్టిని గలుగఁజేయఁజాలదు.

ఆపాతమాత్రమధురా దుఃఖపర్యవసాయినీ
మోహనాయైవ లోకస్య లక్ష్మీః క్షణవిలాసినీ. 82

విచారింపని కారణముచేఁ బ్రియమైనదియు, తుదకు దుఃఖమునే గలుగఁజేయునదియు; క్షణకాలముమాత్రము విలాసముగ నుండునదియునగు ధనము మనుజులను మోహపఱచునదై యున్నది.

అపాతరమణీయాని విమర్దవిసరాణ్యపి
దుఃఖాన్యాపత్ప్రదాతౄణి సంగతాని ఖలైరివ. 83

విచారింపమి మనోహరమును, శీఘ్రముగ నశించునదియు, దుఃఖమును, ఆపదలను గలుగఁజేయునదియునగు ధనాదుల సంబంధము దుష్టులతోటి మిత్రత్వమువంటిది.

శరదమ్బుధరచ్ఛాయాగత్వర్యో యౌవనశ్రియః
ఆపాతరమ్యా విషయాః పర్యన్తపరితాపినః. 84

యౌవనముయొక్క శోభ శరత్కాలమేఘముయొక్క ఛాయవలె నశ్వరమైనది. విజయములో, ఆరంభమున రమణీయములను, అంతమున సంతాపకరములు నైయున్నవి.

అన్తకః పర్యవస్థాతా జీవితే మహతామపి
చలన్త్యాయూంషి శాఖాగ్రలమ్బామ్బూనీవ దేహినామ్. 85

మహాత్ముల జీవితమునున్ను మృత్యువు తప్పక హరించి వేయుచున్నది. ప్రాణులయొక్క అయువులు శాఖాగ్రభాగమున వ్రేలాడుచున్న జలబిందువులవలె జారిపోవుచున్నవి.

జీరన్తే జీర్యతః కేశా దన్తా జీర్యన్తి జీర్యతః
క్షీయతే జీర్యతే సర్వం తృష్ణైవైకా న జీర్యతే. 86

వార్ధక్యమును బొందిన జీవునియొక్క కేశములున్ను దంతములున్ను శిథిలమగుచున్నవి. అ ట్లే యాతని సమస్తమున్ను శిథిలమై క్షయించుచున్నది. కాని తృష్ణయొకటిమాత్రము క్షయింపక యే వర్తించుచున్నది.

భోగాభోగాతిగహనే సర్వస్మిన్కాయకాననే
పరముల్లాసమాయాతి తృష్ణైకా విషమఞ్జరీ. 87

సమస్తభావికాల శరీరపరంపరయను మహాగాఢారణ్యమున భోగముల నిమిత్తమై తృష్ణయను విష-లత పరమోల్లాసమును బొందుచున్నది.

బాల్యం యౌవనవద్యాతి యౌవనం యాతి బాల్యవత్
ఉపమానోపమేయత్వం భఙ్గురత్వం మిథోఽనయోః. 88

బాల్యము యౌవనమువలెను, యౌవనము బాల్యమువలెను గడచిపోవుచున్నవి. ఈ రెంటికిని సాదృశ్యము. క్షణభంగురత్వము పరస్పరము సమానములేయై యున్నవి.

జీవితం గలతి క్షిప్రం జలమఞ్జలినా యథా
ప్రవాహ ఇవ వాహిన్యా గతం న వినివర్తతే. 89

దోసిలియందలి జలమువలె జీవితము శీఘ్రముగ నశించిపోవుచున్నది. మఱియు నదీ ప్రవాహమువలె, గడచిన జీవితము మరల యెన్నటికిని రానేరాదు.

ఝటిత్యేవాగతో దేహః కుతోఽప్యర్జునవాతవత్
యాతి పశ్యత ఏవాస్తం తరఙ్గామ్బుదదీపవత్. 90

'అర్జున' రోగవాయువువలె - ఏ యే దేహము జీవునకుఁ బ్రాప్తించుచున్నదో, అయ్యది తరంగ మేఘ, దీపములవలె నేకారణముననో చూచుచుండగనే శీఘ్రముగ నశించుచున్నది.

రమ్యేష్వరమ్యతా దృష్టా స్థిరేష్వస్థిరతాపి చ
సత్యేష్వసత్యతార్థేషు తేనేహ విరసా వయమ్. 91

రమ్యములుగను, స్థిరములుగను, సత్యములుగను భాసించు జగత్పదార్థములందు అరమ్యత్వమున్ను, అస్థిరత్వమున్ను అసత్యత్వమున్ను గాంచఁబడినందున మాకువానియెడల వైరాగ్యము జనించినది,

సుఖం యదాత్మవిశ్రాన్తౌ గతే మనసి సత్త్వతామ్
పాతాలే భూతలే స్వర్గే తన్న భోగేషు కేషుచిత్. 92

వాసనారహితులగు మనుజులకు ఆత్మవిశ్రాంతి లభించుటచే నే సుఖము చిత్తమున సంప్రాప్తించుచున్నదో, అయ్యది పాతాళమునగాని, స్వర్గమునగాని, భూలోకమునగాని, మఱి యేవిధములైన భోగములందుగాని ప్రాప్తింపనేరదు.

అపి సంపూర్ణహృద్యార్థాః పఞ్చాపీన్ద్రియవృత్తయః
తావజ్జయన్తిమామేతా భృఙ్గం చిత్రలతా ఇవ. 93

చిత్రమందలి లత తుమ్మెదను జయింపఁజాలనట్లు, ఇపుడు వైరాగ్యయుతుఁడనగు నన్ను సమస్త మనోహర పదార్థములున్ను, సర్వేంద్రియ వృత్తులున్నుగూడ జయింపఁ జాలవు

అద్య దీర్ఘేణ కాలేన నిరహంకృతినా మయా
స్వర్గాపవర్గవైతృష్ణ్య మిదమాసాదితం ధియా. 94

మఱియు, అహంకార రహితుఁడనగు నే నిపుడు దీర్ఘ కాలమునుండి స్వర్గ, మోక్షముల యెడలఁగూడ బుద్ధిచే విరక్తిఁ బొందియుంటిని.

చిరమేకాన్తవిశ్రాన్త్యై తేనై తన్నభసః పదమ్
త్వమివాగతవానత్ర దృష్టవానస్మి తాం కుటీమ్. 95

కావుననే, తమవలె నేకాంతమునఁజిరకాల మాత్మయందు విశ్రాంతినొందఁదలంచి, ఆ యాకాశస్థానమున కేతెంచి యచటి యాతమకుటీరమును గాంచితిని.

అద్యైతత్త్వంపరిజ్ఞాతం యదేషా భవతః కుటీ
ఆగన్తా త్వం పునశ్చేతి మయా తన్న విచారితమ్. 96

ఆ కుటీరము తమదని యిపుడేనాకుఁ దెలిసినది. మరియు తాము మరల యద్దానికడ కేతెంచెదరని నేను దలంచియుండలేదు.

తదా త్వత్ర మయా జ్ఞాతం కశ్చిత్సిద్ధోఽయమాత్మనా
దేహం త్యక్త్వేహ నిర్వాణం దత ఇత్యనుమానతః. 97

ఆ కుటీరమున నెవఁడో సిద్ధుఁడుండియుండెననియు, అతఁడు దేహమునువీడి కైవల్య పదమునొందెననియు నే నపుడు అనుమానముచే నెఱిఁగితిని.

ఏతన్మే భగవన్వృత్తమేషోఽస్మీతి యథా స్థితమ్
మయా తే కథితం సర్వం యథా జానాసి తత్కురు. 98

మహాత్మా ! ఇట్లు నా వృత్తాంతమంతయు నున్నదియున్నట్లుగఁ దమకు నివేదించితిని. నిఁక నా యీ యపరాధమునకై దండనముగాని, అనుగ్రహముగాని యేది తాము ఉచితమని తలంతురో దానిఁ జేయుఁడు.

సిద్ధైర్న యావదవధానపరైర్విచార్య
నిర్ణీతముత్తమధియాన్తర శేషవస్తు
తావత్త్రికాలకలనం న విదన్తి కించి
దిత్యఙ్గజాదిమనసోఽపి మునే స్వభావః. 99

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే ఆకాశమణ్డపసిద్ధసమాగమగాథా వర్ణనం నామ త్రినవతితమః సర్గః ॥ 93 ॥

ఓ మునీంద్రా! సిద్ధులున్ను ఎంతపఱకు ఏకాగ్రచిత్తులై అంతఃకరణమున సమస్త పదార్థములను ఉత్తమబుద్ధి (సమాధిదృష్టి)తోటి విచారించి నిర్ణయింపరో, అంతవఱకు వారికిని త్రికాలములందలి వృత్తాంతములయొక్క సమ్యక్-జ్ఞాన మొకింతైనను గలుగనేరదు. బ్రహ్మాదుల మనస్సుయొక్కయు నిదియే స్వభావమైయున్నది. అట్టిచో నిఁక మావంటివారివిషయమై వేఱు చెప్పవలెనా, కాఁబట్టి తమవృత్తాంతము నెఱుఁగని యపరాధమును క్షమింపుఁడ'ని భావము).

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషా॥ ఆకాశమండపసిద్ధసమాగమ గాథావర్ణనమను దొంబది మూఁడవ సర్గము ॥ 93 ॥

~~~~~~

చతుర్నవతితమః సర్గః

[సిద్ధలోకం ద్వయోర్యానం పిశాచానాం చ సంస్థితిః
వర్ణ్యతే దేవతానాం చ మనోమాత్రానుసారిణీ.

వసిష్ఠుఁడున్ను, ఆ సిద్ధుఁడును సిద్ధలోకమున కేగుట, పిశాచములయొక్కయు, దేవతలయొక్కయు, మనోమాత్రము ననుసరించిన స్థితి మున్నగు విషయము లిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

అథ హేమమయాకాశవిస్తీర్ణాయాం మహాభువి
సౌహార్దాదేవ సిద్ధస్య తస్యేదమహముక్తవాన్. 1

శ్రీవసిష్ఠుఁడు:- ఓ రామచంద్రా! అటుపిమ్మట, ఆకాశమువలె విశాలమైనట్టి యా సువర్ణమయమగు మహాభూతలముపై మిత్రత్వపూర్వకముగ నేనా సిద్ధునితో నిట్లంటిని.

త్వయా న కేవలం తావన్మయాపి న విచారితమ్
అవ్యాప్తిరహితా నామ న సంభవతి దేహినామ్. 2

కేవలము మీరేకాదు. నేనుగూడ ఏకాగ్రబుద్ధితో విచారింపలేదు. దేహధారులగు యోగులకున్ను చిత్తైకాగ్రతారూపమగు ధారణలేనిచో త్రికాలజ్ఞానము కలుగనేరదని మీరు వచించిన మాట సత్యమేయగును.

కస్మాన్మయాతవోదన్తం విచార్యాసా స్థిరీకృతా
న కుటీ వ్యోమ్ని తేన త్వమభవిష్యః స్థిరస్థితిః. 3

నేను మీవృత్తాంతమును విచారించి మీకచట స్థిరస్థితి గలుగులాగున, ఆ యాకాశమందలి కుటీరమును ఏల స్థిరముగనుంచలేదు? ...వున, ఆ నాయపరాధమును మీరున్ను క్షమింపుఁడు.)

ఉత్తిష్ఠ సిద్ధలోకేషు నివసావో యథాస్థితమ్
స్వాస్పదస్థితయః సౌమ్యాః స్వాత్మసిద్ధ్యానుసాధనమ్. 4

కాఁబట్టి లెండు, పోవుదము; మీరు మీ సిద్ధలోకములకును, నేను నా సప్తర్షిలోకమునకును జని యట వసింతుము. ఏలయనిన, విక్షేపరహితమగు తమ తమ స్థితికొఱకై స్వస్థానమందలి సౌమ్యమగు నివాసమే యుత్తమ సాధనమగును.

ఇతి నిర్ణీయ తావుచ్చైరుత్ప్లుతౌ తారకోపమౌ
సమమేకపురోడ్డీనౌ వ్యోమయన్త్రోపలావివ. 5

ఓ రామచంద్రా! ఇట్లు నిర్ణయించి నక్షత్రములనుబోలి మే మిరువురమున్ను యంత్రాలయమునుండి యెగురగొట్టఁబడిన శిలాద్వయమువలె నపుడు విశాలమైన యాకాశమున సమముగ నెగిరితిమి.

ప్రణామపూర్వమన్యోన్యమథ కృత్వా విసర్జనమ్
గతః సోఽభిమతం దేశమహం చాభిమతం గతః. 6

పిమ్మట, పరస్పర ప్రణామపూర్వకముగ నొకరినుండి యొకరు సెలవుగైకొని వీడినవారమై మామా యభిమత ప్రదేశములకుఁ జనితిమి.

ఇతి వృత్తాన్తమఖిలముక్తవానస్మి రాఘవ
తవాశ్చర్యమయీం పశ్య సంసృతీనాం విచిత్రతామ్. 7

ఓ రామచంద్రా! ఈ ప్రకారముగ నిజానుభూతమగు పాషాణోపాఖ్యానమునంతయు, మఱియు ఆ సిద్ధునిగూర్చిన వృత్తాంతమును నీకుఁ దెలియఁజేసితిని. సంసారములయొక్క ఆశ్చర్యమయమైన వైచిత్ర్యమును గాంచుము,

శ్రీరామ ఉవాచః—

భగవంస్తవ దేహోఽసౌ పృథివ్యామణుతాం గతః
భ్రాన్తః కేన శరీరేణ సిద్ధలోకాంస్తతో భవాన్.

శ్రీరాముఁడు:— మహాత్మా! ఆ కుటీరమందున్న తమ దేహము పృథివిం ధూళిమయమై పోయినదిగదా; అపు డేదేహముతోటి తాము సిద్ధలోకమునకేగి యచట సంభాషవ్యవహారముల గాంచితిరి.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

అస్మృతం శృణు వృత్తాన్తం తతో మమ జగద్గృహే
భ్రమతః సిద్ధసేనాసు లోకపాలపురీషు చ. 9
అహమిన్ద్రపురం ప్రాప్తో న కశ్చిత్తత్ర దృష్టవాన్
మామిమం దేహరహితమాతివాహికదేహినమ్. 10

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఆ వృత్తాంతమును వినుము, నాకు స్మరణకు వచ్చినది. సువర్ణమయ భూమినుండి వెడలి అపుడు జగత్తను గృహమున సంచరించుచు సిద్ధుల సేనలందును, లోకపాలుర నగరములందును దిరిగి తుదకింద్రుని పట్టణమునుజేరితిని. అట స్థూలదేహరహితుఁడను, మనోమాత్ర శరీరుఁడనునగు నన్నెవరును గాంచలేదు.
~~~~~~

అహం కిల తదా రామ సంపన్నో గగనాకృతిః
న చాధారో న చాధేయశ్చిదాకాశమయాత్మకః. 11
న గ్రహీతా న చ గ్రాహ్యస్త్వాదృశార్థావబోధినామ్
న చైవ దేశకాలానాం క్వచిదావృత్తికారకః. 12

ఓ రామచంద్రా! అత్తఱి చిదాకాశమయ స్వరూపుఁడనగు నేనాకాశమువలె సూక్ష్మాకృతి గలవాఁడనైతిని. నాకపుడాధారముగాని, ఆధేయముగాని యెద్దియులేకుండెను మఱియు నపుడు నేను స్థూలపదార్థముల నెఱుఁగు నీవంటివారిలో గ్రహీతగాని, గ్రాహ్యముగాని గాక యుంటిని. ఇంకను దేశకాలాదుల పరివర్తనకారకుఁడనుగూడ గాకయుంటిని.

మనోమననమాత్రాత్మా పృథ్వ్యాదిపరివర్జితః
సంకల్పపురుషాకారః పదార్థానామరోధకః. 13

మఱియు, మననశీలమగు మనోమాత్రుఁడను, పృథ్వ్యాదివర్జితుఁడను సంకల్పపురుషుని యాకారము గలవాఁడును ఘటాది స్థూలపదార్థములను నిరోధింపని వాఁడనునైయుంటిని.

అరుద్ధశ్చ పదార్థౌఘైః స్వయం స్వానుభవోన్ముఖః
వ్యవహర్తా తథా భూతైరేవం పుంభిర్మనోమయైః. 14

స్థూలపదార్థసమూహములచే నిరోధింపఁ బడనివాఁడను స్వయముగ స్వానుభవము యెడల ఉన్ముఖుఁడను మనోమయులగు ప్రాణులతోటి వ్యవహరించువాఁడునునైయుంటిని.

స్వాప్నానుభూతయో రామ దృష్టాన్తోఽత్ర విఖణ్డితః
అనుభూత్యపలాపం తు యః కుర్యాత్తేన తేఽస్త్వలమ్. 15

ఓ రామచంద్రా! ఇట స్వప్నానుభవమే అఖండమైన దృష్టాంతమైయున్నది. ఎవరుఁ ఁభవమును ప్రమాణముగనమ్మరో, అట్టి నైయాయికులతోటి సంభాషణాదులచే నీకేప్రయోజన న్నులేదు.

యథా స్వప్నచరో గేహే వ్యవహర్తా న దృశ్యతే
తథా తదానదృష్టోఽస్మి పురస్థోఽపి నభోగతైః. 16

స్వప్నమందు వ్యవహరించు మనుజుఁడు ఆతని గృహమందలి యితరులచేఁ జూడఁబడ నట్లు, అపుడు ఎదుటనున్నప్పటికిని నేను ఆకాశచారులగు దేవతలచే జూడఁబడకుంటిని.

అహమన్యాన్ప్రపశ్యామి పార్థివాకారభాసురాన్
మామాతివాహికాత్మానం న కశ్చిదపి పశ్యతి. 17

పృథివీసంబంధమైన యాకారముగల్గి భాసించు తక్కినప్రాణులను నేనపుడు జూచుచునే యుంటినిగాని, సూక్ష్మశరీరధారినగు నన్ను మాత్రమెవఁడును గాంచకయుండెను.

శ్రీరామ ఉవాచః—

న దృశ్యతే విదేహత్వాద్భవాన్వ్యోమవపుర్యది
తత్కథం తేన సిద్ధేన దృష్టోఽసి కనకావనౌ 18

శ్రీరాముఁడు:— మహాత్మా! దేహరహితులును, ఆకాశశరీరధారులు నగుటచే తామితరులకుఁ గానుపింపకయుండినచో, ఆ సిద్ధుఁడు సువర్ణభూమిపై తమ్ముల నెట్లు దర్శించెను?

శ్రీ వసిష్ఠ ఉవాచః—

అస్మదాదిర్జనో నామ యథా సంకల్పకల్పితాన్
నాసంకల్పితమాప్నోతి సత్యకామవపుర్యతః. 19

వసిష్ఠుఁడు:— శ్రీరామచంద్రా! మావంటి (జ్ఞానయోగసిద్ధులగు) జనులు నిజ (సత్య) సంకల్పముచే కల్పితములైనట్టి పదార్థములనే గాంతురు. కావున సత్యసంకల్పముగలవాఁడైనను సంకల్పింపని వస్తువును బొందఁజాలఁడు.

వ్యవహారేషు మగ్నేన లౌకికేష్వమలాత్మనా
క్షణాద్విస్మర్యతే పుంసా ఆతివాహికమాత్మనః. 20

లౌకికవ్యవహారములందు నిమగ్నుఁడగు సూక్ష్మశరీరధారియైన నిర్మలాత్ముఁడగు మనుజుఁడున్ను క్షణకాలములో తనసూక్ష్మరూపమును మఱచును.

మయా పశ్యతు మామేష ఇతి సంకల్పితం తదా
తేన మాం దృష్టవానేష స్వ సంకల్పార్థభాజనమ్. 21

'ఈ సిద్ధుఁడు నన్ను గాంచుగాక' అని నేనపుడు సంకల్పించితిని. కావుననే యీతఁడు స్వసంకల్పముచే నన్ను గాంచగల్గెను.

జనో జరఠభేదత్వాన్న సంకల్పార్థ భాజనమ్
స ఏష జీర్ణభేదత్వాత్సత్యకామత్వ భాజనమ్. 22

ఎవనికి చిరకాల వాసనలచే బ్రహ్మాత్మలయొక్క భేదము దృఢపడియుండునో, అట్టి వాఁడు సంకల్పిత పదార్థములను గాంచలేడు అట్టిభేదము నశించినందుననే, ఆ సిద్ధుఁడు సత్య సంకల్పమునకు యోగ్యుఁడయ్యెను.

ద్వయోస్తు సిద్ధయోః సిద్ధవిరుద్ధేప్సితయోర్మిథః
అధికైకావదాతాత్మా జయీ పురుషయత్నవాన్. 23

ఎపుడిరువురు సిద్ధులందు పరస్పరవిరుద్ధములైన యభీష్టము లుండునో, అనఁగా నొకఁడు 'ఈతనినినేను గాంచుదును, అనియు' మఱియొకడు 'ఈతఁడునన్ను గాంచకుండుగాక' అనియు దలంచునో, అపుడు, అందెవని ఆత్మజ్ఞానము ప్రబలమై, అధికనిర్మలమైయుండునో, ఆతఁడు జయించును

భ్రమతః సిద్ధసేనాసు లోకపాలపురీషు మే
విస్మృతా వ్యవహారౌఘైః సాతివాహికతాత్మనః. 24

సిద్ధుల సేనలందును, లోకపాలుర పురములందును దిరుగుచున్న నేనపుడు వ్యవహారాధిక్యతవలన నా యొక్క సూక్ష్మరూపత్వమును మఱచితిని.

యదా తదాహమపరై ర్వ్యవహర్తుం మహామ్బరే
ప్రవృత్తో న చ మాం కశ్చిత్తత్ర పశ్యతి చఞ్చలమ్. 25

అపుడు నేనితరులతోఁగూడ మహాకాశమున వ్యవహరించుటకుఁ బ్రవృత్తుఁడనైతిని. కాని యట్టి చంచలరూపుఁడనగు నన్నచట నెవ్వఁడును గాంచకుండెను.

అత్యన్తమప్యారటతః శబ్దో న శ్రూయతే మమ
కేనచిత్సురలోకేషు స్వప్నపుంస ఇవానఘ. 26

పాపరహితుఁడవగు రామచంద్రా! దేవలోకములందు నేను బిగ్గరగా నరచినప్పటికిని, స్వప్నమనుజుని శబ్దమును విననట్లు, అద్దాని నెవఁడును వినఁజాలకుండెను.

అవష్టబ్ధుం ప్రవృత్తస్య నాన్యావష్టబ్ధయే మమ
సంపద్యతే కించిదపి మనోమననదేహినః. 27

మనన శీలమగు మనోరూపదేహమును ధరించిన నేనపుడితరులను గ్రహించుట, వారి కవలంబన మొసంగుట మున్నగువ్యాపారములందు ప్రవృత్తుఁడ నైతినిగాని, మద్గ్రహణాదులం దితరుఁడెవ్వఁడును సమర్థుఁడు గాకుండెను.

ఏవం వ్యోమపిశాచోఽహం సంపన్నో రఘునన్దన
మయానుభూతా కాప్యేషా దేవాగారపిశాచతా. 28

ఓ రాఘవా! ఈప్రకారముగ నేనాకాశమందలి పిశాచమైతిని. ఇట్లు, దేవతల స్థానములందు నేను అనిర్వచనీయమైన పిశాచత్వ మనుభవించితిని.

శ్రీరామ ఉవాచః—

పిశాచాః సన్తిలోకేఽస్మిన్కిమాకారాః కిమాస్పదాః
కింజాతీయాః కిమాచారాః కీదృశాః కీదృశాశయాః. 29

శ్రీరాముఁడు:— మహాత్మా! ఈ ప్రపంచమున పిశాచము లేయాకారము గల్గియుందురు? ఎచట వసింతురు? ఏజాతికిఁ జెందియుందురు? ఎట్టి యాచరణ గలిగియుందురు? ఎట్లుందురు? ఎట్టి యభిప్రాయముతోఁగూడి వర్తింతురు?

శ్రీ వసిష్ఠ ఉవాచః—

పిశాచాః సన్తి లోకేఽస్మిన్యాదృశాస్తాదృశాన్శృణు
న సభ్యోఽసౌ న యో వక్తి ప్రసఙ్గాపతితం వచః. 30

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఈ ప్రపంచమున పిశాచము లెట్టివారై యుందురో, వారినిఁగూర్చి వినుము. సభ్యత్వము (మంచి నడవడి) లేనివాఁడును, ప్రసంగానుసారము వచనములఁబల్కనివాఁడును పిశాచమేయగును.

పిశాచాః కేచిదాకాశసదృశాః సూక్ష్మదేహకాః
హస్తపాదాదిసంయుక్తాః పశ్యన్తి త్వమివాకృతిమ్. 31

కొందఱు పిశాచములు ఆకాశమువలె సూక్ష్మ (మనోమయ) దేహధారులై, స్వప్నమువలె మనఃకల్పితములగు హస్తపాదాదులు గల్గియుందురు. వారు నీవలెనే తక్కిన యాకారములను గాంచుచుందురు.

ఛాయయా భయదాయిన్యా త్వన్యత్ర భ్రమరూపయా
తే చిత్తాక్రమణం కృత్వా బోధయన్తి నరాశయమ్. 32

ఆ పిశాచము లితరుల చిత్తమందుఁ బ్రవేశించి, భ్రమరూపమును, భయదాయకము నగు తమ ఛాయచే వారల నాక్రమించి వివిధదుఃఖాదుల నొసంగు చేష్టలచే వారి ఆశయమును ఉద్బోధన మొనర్తురు.

ఘ్నన్త్యదన్తి పిబన్త్యాశు లఘుసత్త్వబలం జనమ్
బలం సత్త్వమథో జీవాన్హింసన్త్యాక్రమ్య చిత్తకమ్. 33

మఱియు వారు కొందఱి జీవులందుఁబ్రవేశించి, శీఘ్రముగ వారిని జంపుదురు; ఋణానుబంధనము ననుసరించి వారిదేహధాతువులనున్ను భుజింతురు; రక్తాదులను బానము చేయుదురు; వారల చిత్తము నాక్రమించి బలమును, తేజమును నశింపఁజేయుదురు.

ఆకాశసదృశాః కేచిత్కేచిన్నీహారసంనిభాః
కేచిత్స్వప్ననరాకారాః సాకారా అపి స్వాత్మకాః. 34
కేచిదభ్రదలప్రఖ్యాః కేచిత్పవనదేహకాః
కేచిద్దృమాత్మకా ఏవ సర్వే బుద్ధిమనోమయాః. 35

పిశాచములలోఁ, గొందఱు ఆకాశమువలె అతిసూక్ష్మరూపులైయు, కొందఱు హిమమువంటి ఆకృతిగల్గియు, కొందఱు స్వప్నమనుజుల ఆకారమును ధరించియు మఱికొందఱు సాకారరూపమును గ్రహించియు మరల ఆకాశమువలె నిరాకారులగుచు (అంతర్ధానముఁజెందుచు)ను, కొందఱు మేఘమువంటియు, మఱికొందఱు వాయువువంటియు రూపముగల్గియు, కొందఱు, ఆయా భూతగ్రస్తులగు జీవుల భ్రమానుసారము దేహము ధరించియు వర్తించుచుందురు. కాని పిశాచములన్నియు బుద్ధిమయ, మనోమయ శరీరధారులైయె యుందురు.

గ్రహీతుం నైవ యుజ్యన్తే గ్రహీతుం శక్నువన్తి నో
ఆకాశశూన్యవపుషః పశ్యన్త్యాకృతిమాత్మనః. 36

పిశాచములు గ్రహించుటకు యోగ్యులుగాని, సమర్థులుగాని కారు. వారు ఆకాశమువలె శూన్యశరీరధారులై తమయాకృతిని తామే యనుభవింతురు; మఱియు, పరస్పరమున్ను గాంచుకొందురు.

శీతాతపాదివిహితం సుఖం దుఃఖం విదన్తి చ
పాతుమత్తుమవష్టబ్ధుమీహితుం శక్నువన్తి నో. 37

శీతోష్ణాది జనితములగు సుఖదుఃఖములను వారనుభవించుదురు. కాని బాహ్య జలాదులను ద్రావుటకుగాని, భుజించుటకుగాని, ఏ పదార్థమునైన ఆధారముగఁ గైకొనుటకుగాని, ఇచ్ఛవచ్చినట్లు దానగ్రహణాదులచే వ్యవహరించుటకుగాని శక్యులుకారు.

ఇచ్ఛాద్వేషభయక్రోధలోభమోహసమన్వితాః
మన్త్రౌషధతపోదాన ధైర్యధర్మవశీకృతాః. 38

మఱియు వారు, ఇచ్ఛా, ద్వేష, భయ, క్రోధ, లోభ, మోహయుతులై యుందురు. మంత్ర, ఔషధ, తపో, దాన, ధైర్య ధర్మములచే వారు వశీకృతులును నగుదురు.

సత్త్వావష్టమ్భయన్త్రేణ మన్త్రేణారాధితేన వా
దృశ్యన్తేఽపి చ గృహ్యన్తే కదాచిత్కేనచిత్క్వచిత్. 39

ఒకానొకచోట వారు 'సత్త్వావష్టంభము' అను యోగధారణచేతను, బీజాక్షరాది యుక్తమగు యంత్రముచేతను, ఆరాధింపఁబడిన మంత్రముచేతను, భూతవిద్యనెఱింగిన మనుజునకు వశీభూతులై యాతనికి గానుపింతురు. మఱియు సేవాదులం దాతనిచే నియోగింపఁబడుదురు.

దేవయోనిర్ద్విధా సా తేన కేచిద్దేవోపమాదయః
కేచిన్నరసమశ్రీకాః కేచిన్నాగసమన్వయాః. 40
శ్వశృగాలోపమాః కేచిద్గ్రామజఙ్గలవాసినః
కుల్యావకరరథ్యాసు వసన్తి నిరయేషు చ. 41

పిశాచములు దేవయోనులకుఁజెందిన వారే గనుక వారిలోఁ గొందఱు దేవతలవలె అణిమాద్యైశ్వర్యయుక్తులైయుందురు. అట్లే కొందఱు మనుజులవలె శ్రీమంతులును, కొందఱు నాగ (సర్ప) సదృశులునునై యుందురు. కొందఱు శునక, శృగాలము (నక్క)లఁ బోలియున్నవారై గ్రామ, అరణ్యములందు వసింతురు. మఱికొందఱు ఎముకలు పెంటప్రోగు మున్నగువానితోఁ గూడిన కల్మషమైన మార్గప్రదేశములందును, నరక సమానములగు అపవిత్రస్థానములందును నివసించుదురు.

ఏతదాస్పదమేతేషామిత్యాకారాః ప్రకీర్తితాః
పిశాచా ఏవమాచారా జన్మైషాం శ్రూయతామిదమ్. 42

ఓ రామచంద్రా! ఈప్రకారముగ పిశాచములయొక్క స్థాన ఆకార, ఆచారములఁ గూర్చి నీకుఁ దెలిపితిని. ఇఁక వారి జన్మనుగూర్చి వినుము.

అచేత్యచిన్మయం బ్రహ్మ సర్వశక్తిస్వభావతః
యచ్చిత్తం బుద్ధమేవాన్తశ్చేత్యం సంకల్పయన్నివ. 43
తం జీవం విద్ధి స ప్రౌఢస్త్వహంకార ఇతి స్మృతః
సోఽహంకారః స్మృతః పుష్టో మన ఇత్యుదితాత్మభిః. 44
స ఏవ కథ్యతే బ్రహ్మ సంకల్పాకాశరూపవాన్

చేత్య (విషయ) రహితమై, చిన్మయమై, స్వభావముగ సర్వశక్తియుతమైనట్టి మాయాశబలితబ్రహ్మము చేత్య (విషయ)మును సంకల్పించుచు తన్ను మనస్సుగను పురుషునిగను నెఱిఁగి తద్రూపముగ నున్నపుడదియే జీవుఁడనియు లేక ప్రథమాంకురమనియు నెఱుఁగుము. ఆ జీవరూపమే ప్రౌఢమై, అభిమానయుక్తమగునపుడు అహంకారమని చెప్పఁబడుచున్నది. అహంకారమే

పరిపుష్టమగునపుడు మనస్సని ఆత్మజ్ఞులచేఁ బేర్కొనఁబడినది. ఆ మనస్సే సమష్టిరూపముచే సంకల్పాకాశరూపధారియగు బ్రహ్మదేవుఁడని చెప్పఁబడుచున్నది.

అసదేవాసతో బీజం జగతో విగతాకృతిః. 45
ఏవం మనః స్థితో బ్రహ్మ సదేహోఽప్యమలం నభః
తత్స్వప్నపురుషాకారః సన్నేవాసద్వపుః సదా. 46

అసత్తగు ఈ జగత్తునకు అసత్తై, ఆకారరహితమైనట్టి మనస్సే బీజమైయున్నది. ఈ ప్రకారముగ మనస్సే బ్రహ్మదేవుఁడై యొప్పుచున్నది. కావున దేహవంతుఁడై యున్నప్పటికిని బ్రహ్మదేవుఁడు నిర్మలాకాశరూపుఁడే యైయున్నాఁడు. మఱియు విద్యమానుడైయున్నను నాతఁడు స్వప్నపురుషుని ఆకారమువలె సదా అవిద్యమానుఁడే యగును.

పృథ్వ్యాదిమూర్తిరహితస్త్వాతివాహికదేహవాన్
పృథ్వ్యాదయః కిల కుతః సంకల్పపురుషస్య ఖే. 47

బ్రహ్మదేవుఁడు పృథ్వ్యాదుల యాకారములేనివాఁడై సూక్ష్మశరీరధారియై యున్నాఁడు. ఏలయనిన, ఆకాశమున, సంకల్పపురుషునకు పృథ్వ్యాదుల యాకృతి యెచట.

భవన్మనో యథాకాశపురం పశ్యతి కల్పితమ్
తథా మనోవిరఞ్చిత్వం పశ్యత్యాత్మని కల్పితమ్. 48

ఓ రామచంద్రా! నీ మనస్సు ఆకాశమున నెట్లు కల్పితనగరమును వీక్షించునో, అట్లే మనస్సు తనయందు కల్పితమగు బ్రహ్మదేవత్వమునున్ను గాంచుచున్నది.

యద్వేత్తి కల్పితం తత్సత్పశ్యత్యనుభవత్యపి
యో యావన్మాత్రకస్తత్స కస్మాత్కిల న పశ్యతి. 49

కావున, బ్రహ్మదేవుఁడు ఏయే స్వసంకల్పితమైన దాని నెఱుఁగుచున్నాఁడో, దాని నాయా పదార్థాకారముగ సత్యముగ గాంచుచు ననుభవించుచు నున్నాఁడు. అట్లే, ఏయే జీవులు గలరో, వారందఱున్ను ఆ చిద్రూపమగు సద్వస్తువే గావున జ్ఞానశక్తియుతులై యుండుటచే ఏల యా బ్రహ్మదేవునివలె నిజకల్పితమును గాంచలేరు ?

స యత్పశ్యతి తత్త్వాదృక్ శూన్యాత్మా శూన్యమమ్బరే
బ్రహ్మ బ్రహ్మణి వా బ్రహ్మ తదిదం జగదుచ్యతే. 50

నిరాకారమైన మనోరూపుఁడగు ఆ బ్రహ్మదేవుఁడు చిదాకాశమున, వాస్తవముగ శూన్యమైనట్టి యే బ్రహ్మండకారము నవలోకించుచున్నాఁడో, అదియే యీ జగత్తని చెప్పఁబడుచున్నది.

తథా సంప్రతి భాసోఽస్య చిరకాలైకభావనాత్
ఘనీభూతః స్థితః పుష్టః సుదీర్ఘస్వప్నసున్దరః. 51

ఆ బ్రహ్మదేవుని ప్రతిభాసమగు ఈ జగత్తను అతి దీర్ఘమైన సుందరస్వప్నము చిరకాల తదేకభావనచే ఘనీభూతమై, పరిపుష్టమై వెలయుచున్నది.

అతివాహికదేహస్య తస్య తచ్చిరభావనాత్
సర్గానుభవనం భూరి బ్రహ్మణో బ్రహ్మరూప్యపి. 52
గతం ప్రకటతోత్కర్షాదాధిభౌతికదేహతామ్
తేనైవ సర్గ ఇత్యుక్తో భేదసంతతిభాసురః. 53

కావుననే, మనోమాత్రదేహధారియు, వాస్తవముగ బ్రహ్మరూపుఁడునైయున్నను, చిరకాల భావనచే ఆ బ్రహ్మదేవునకు సృష్ట్యనుభవము అధిభౌతిక (స్థూల) రూపముతో లెస్సగ ప్రకటమయ్యెను. మఱియు, అందువలననే యది భేదసమూహరూపముతో భాసించు 'సృష్టి' అని చెప్పఁబడినది.

స బ్రహ్మ బ్రహ్మమాత్రాత్మా బ్రహ్మమాత్రాత్మనో స్తయోః
అజాతయోరేవ సదా తదాత్మజగతోర్ద్వయోః. 54
అభిన్నయోరేవ భృశం శూన్యత్వామ్బరయోరివ
ఏకాత్మ్యేనైవ వసతోః పవనస్పన్దయోరివ. 55

ఆ బ్రహ్మదేవుఁడున్ను, ఆతని సంకల్పముచే నుత్పన్నమైన యీ జగత్తున్ను రెండును పరమార్థమున బ్రహ్మరూపములే యగును. సదా యుత్పత్తి, భేదరహితములైన యీ రెండును, ఆకాశశూన్యత్వములవలెను, వాయు, స్పందములవలెను వాస్తవముగ ఏకరూపములే యై యున్నవి.

వేత్తి భూతమయత్వం తన్మిథ్యైవ న తు వాస్తవమ్
తథా యథా త్వం సంకల్పపురుషస్య సతోఽసతః. 56

ఓ రామచంద్రా! ఎట్లు నీవు నీ సంకల్పపురుషుని సద్రూపములైన నగరాదులయొక్క పంచభూతమయత్వమును అసత్తుగ నెఱుఁగుదువో, అట్లే బ్రహ్మదేవుఁడున్ను జగత్తుయొక్క భూతమయత్వమును మిథ్యగనే యెఱుఁగునుగాని వాస్తవముగఁ గాదు.

తతః శరీరధాతూనాం తేన పృథ్వ్యాదికాః కృతాః
అభిధాః పఞ్చ చిత్స్పష్టా జగదిత్యేవ తాః స్థితాః. 57

ఆ బ్రహ్మదేవుఁడు చిత్సత్తచేఁ బరిపుష్టములైనట్టి, బ్రహ్మాండరూపమగు స్వశరీరముయొక్క కఠిన, ద్రవాది ధాతువులకు, పృథివ్యాది పంచసంజ్ఞలొసంగెను. అవియన్నియుఁ గలిసి జగద్రూపముగ స్థితినొందియున్నవి.

యథా త్వసత్య ఏవాయం సంకల్పః సత్య ఏవ తే
తథాసావాత్మసంకల్పం సత్యమేవానుభూతవాన్. 58

ఓ రామచంద్రా! ఎట్లు నీ స్వప్న, మనోరాజ్యాదులు అసత్యములైనను, ఆ యా స్థితులందు వానిని నీవు సత్యరూపములుగనే యనుభవించుచున్నావో, అట్లే బ్రహ్మదేవుఁడున్ను స్వసంకల్ప జనితమగు జగత్తును సత్యరూపముగనే యనుభవించుచున్నాఁడు.

స స్వయం చిన్మయాకాశః ససంకల్పశ్చిదమ్బరమ్
అతః స్వప్నో జగత్సర్వం కృతౌ నాశోద్భవౌ స్థితౌ. 59

ఆ బ్రహ్మదేవుఁడు స్వయముగ చిదాకాశస్వరూపుఁడైయున్నాఁడు. అట్లే యాతని సంకల్పమున్ను పరమార్థమున చిదాకాశస్వరూపమేయై యున్నది. నామరూపాత్మకమగు ఈ జగత్తయు స్వప్నతుల్యమై, ఆ బ్రహ్మదేవునియొక్క సంకల్పమేయై యొప్పుచున్నది. మఱియు, అద్దాని నాశోత్పత్తులు ఆ సంకల్పముచేతనే గావింపబడినవై స్థితినొందియున్నవి.

యథైవైతన్మనః సత్యం తదంశాః సత్యమేవ తే
తథైవ తత్కృతాశ్చన్ద్రరుద్రార్కేన్దుమరీచయః. 60

ఓరామచంద్రా! ఈ మనోరూపుఁడగు బ్రహ్మదేవుఁ డెట్లు సత్యమో, అట్లే యాతని వృత్తిరూపములగు చంద్ర, రుద్ర, సూర్యాదులున్ను నీకు సత్యములేయగుచు, అర్థక్రియా సమర్థములగుచున్నవి.

ఏవం స్థితే జగజ్జాలం తన్మనోరాజ్యముచ్యతే
తచ్చ శూన్యం నిరాలమ్బమాకాశకచనం చితి. 61

కాఁబట్టి యీసమస్త జగత్సమూహమున్ను మనోరాజ్యమనియే చెప్పఁబడుచున్నది. మఱియు నయ్యది చైతన్యమున, వాస్తవముగ దృశ్యశూన్యమై, నిరాలంబమైనట్టి చిదాకాశరూపమే యైయున్నది.

యథా స్వప్నపురం వ్యోమ సంకల్పాద్రిర్యథా నభః
తథా బ్రహ్మజగచ్చైవ ఖమేవాచ్ఛమనాకృతి. 62

స్వప్నమందలి పర్వతనగరాదులు చిదాకాశరూపములే యైనట్లు, బ్రహ్మదేవుఁడున్ను, జగత్తున్ను నిరాకారమై, నిర్మలమైనట్టి చిదాకాశస్వరూపములేయై వెలయుచున్నవి.

ఏవమాభాసమాత్రస్య కచతోఽనిశమవ్యయమ్
సర్గాదిమధ్యాన్తదృశో మిథ్యైవాత్రోదితాః స్థితాః. 63

ఇవ్విధమున, ఆభాసమాత్రముచే సదా స్ఫురించునట్టి యీ జగత్తుయొక్క యుత్పత్తి స్థితి, ప్రళయములు మిథ్యగనే యుదయించినవై యున్నవి. కాని యథార్థముగ అసమస్తమున్ను అవ్యయమైన బ్రహ్మమేయగును.

కించిదాకాశకోశస్య తవ వా మమ వానఘ
జగతో వాపి జాయేత కిం వా నశ్యతి మే వద. 64

ఓ రాఘవా! చిదాకాశరూపులమైన నీయొక్కగాని, నాయొక్కగాని ఈజగత్తుయొక్క గాని యేమి యుత్పన్నమగుచున్నది. ఏమి నశించుచున్నది, వచింపుము!

తత్కిమర్థమనర్థాయ నిరర్థకమపార్థకాః
కస్మాదభ్యుదితా బ్రూహి రాగద్వేషభయాదయః. 65

కావున కేవలము ప్రయోజనశూన్యములై, అపార్థకములై, అనర్థకరములైనట్టి రాగద్వేషభయాదు లేల యుదయించినవో చెప్పుము?

వస్తుతోఽస్తి న సర్గాదిర్న సర్గో నాప్యసర్గతా
విద్యతే సకృతాభాతమిదమిత్థం సదైవ తత్.

ప్రియుఁడవగు రామచంద్రా! వాస్తవముగ (పరమార్థదృష్టియందు) సృష్టియొక్క కారణముగాని, సృష్టిగాని, అసృష్టిగాని లేవు. ఒకపర్యాయము ప్రకాశించుటచే మరల యెన్నఁడును ఆవరణములేకుండునట్లు స్థితిఁ బొందియుండు ఈప్రత్యగ్రూపము (జగజ్జీవాదులు) పరమార్థమున సదా యా బ్రహ్మమే యైయున్నది.

అశూన్యే విపులాభోగే స్వచ్ఛచిజ్జలపూరితే
కలనాపఙ్కకలిలే భవిష్యతి చిదమ్బరే. 67
అన్తరిక్షాక్షయక్షేత్రే స్వాత్మనో గగనాత్మికా
తస్మాద్బీజాదియం జాతా భూరిభూతశిలావలిః. 68

మిగుల శూన్యమై, విశాలమై, నిర్మలమైనట్టి చైతన్యమను జలముచేఁ బూర్ణమై, కల్పనయను బురదచే కళంకితమైనట్టి చిదాకాశమను అక్షయమైన క్షేత్రమున, చిదాకాశమందు చిదాకాశమను బీజమునుండి చిదాకాశరూపములేయగు అనేక భూతకోట్లను శిలాసమూహ ముత్పన్నమయ్యెను, ముందును ఉత్పన్నముకాఁగలదు.

నాస్తి కించిదిహ క్షేత్రం వ్యుప్తం నామ న కించన
న బీజమస్తి నో జాతం కించిత్సర్వం చ సంస్థితమ్. 69

కాని యథార్థముగ ఈచిదాకాశమందు క్షేత్రముగాని, బీజముగాని యెవ్వియునులేవు; మఱియు నేదియు నాటఁబడలేదు. ఉత్పన్నమున్నుగాలేదు. మాయచేతనే అంతయు నిట్లు స్థితి నొందియున్నది.

యాః శిలావలయస్తత్ర పుష్టాస్తా విబుధాదయః
యాస్తు వర్ణోజ్జ్వలా ఏతాః స్వాస్థితా బుద్ధబుద్ధయః. 70
యాస్త్వర్ధపక్వాస్తా ఏతా నరనాగాదిజాతయః
యాస్త్వావశ్యానా రజోనష్టాస్తాః కృమిస్థావరాదయః. 71
యాస్తు గుర్వ్యః ఫలైర్హీనాః శూన్యాకారాః క్షయక్షతాః
అశరీరా శరీరిణ్యస్తాః పిశాచాదికాః స్మృతాః. 72

ఆ కల్పనా పంకకలుషితమగు చైతన్య క్షేత్రమున బాగుగ రూఢినొందిన శిలలే దేవతాది జాతులు; ప్రకాశాతిశయముచే నుజ్జ్వలములైన రత్నాదులే దేవర్షులు మున్నగువారు; అర్ధప్రకాశయుక్తములగు శిలలే మనుష్య, నాగాదిజాతులు; ధూళిచే వినష్టములై శిథిలములైనట్టి శిలలు కృమిస్థావరాదులు; మహాభారభూతములును. ప్రకాశాదిఫలరహితములును, శూన్యాకారములును. నాశయుక్తములును దేహరహితములైనను దేహాకారముగలవియునగు శిలలే పిశాచాదులు.

నహి సంకల్పితుః స్వేచ్ఛా క్వచిత్పర్యనుయుజ్యతే
తాస్తథేచ్ఛా విరిఞ్చస్య తథా నామ తథోదితాః. 73

బ్రహ్మదేవుఁడు తనయిచ్ఛచే దేవర్షులు మున్నగువారినే యుత్పన్నముగావింపక పిశాచాది దుష్టజీవుల నేల సృజించెనను ఆక్షేపమాతని యిచ్ఛపై జేయఁదగదు. ఏలయనిన, ఆతని యిఁ
[illegible] ప్రాణుల కర్మవాసనాదుల ననుసరించియే ప్రవర్తించునదగును.

సర్వా ఏవ చిదాకాశరూపిణ్యో భూతజాతయః
అతివాహికదేహిన్యః పృథ్వ్యాదిరహితాత్మికాః. 74

వాస్తవముగ సమస్తప్రాణిజాతులున్ను మనోమాత్రశరీరధారులున్ను, పృథ్వ్యాది రహితములున్ను, చిదాకాశరూపములు నైయున్నవి.

తాశ్చిరాభ్యాసవశతస్త్వాధిభౌతికసంవిదమ్
ప్రాప్తా దీర్ఘానుభవనాత్స్వప్నజాగ్రద్దశామివ. 75

దీర్ఘకాల మనుభవించుటవలన స్వప్నము జాగ్రద్దశ నొందునట్లు, చిరకాలాభ్యాసముచే ఆ ప్రాణి జాతులన్నియు ఆధిభౌతికరూపత్వము నొందినవి

పిశాచాద్యాస్తథా ఏతే తథా భూతాధిభౌతికాః
తిష్ఠన్తి తుష్టమనసః స్వసంసారవిహారిణః. 76

ఈ పిశాచాదులున్ను, నట్లు చిరకాలాభ్యాసముచే అధిభౌతికరూపత్వము నొందినవారై నిక సంసారమున విహరించుచు స్వజాతి యోగ్యములగు భోగములచే సంతుష్టమానసులై యున్నారు.

పశ్యన్తి కాశ్చిదన్యోన్యం గ్రామ్యా గ్రామ్యేయకానివ
స్వప్నైకలోకవాస్తవ్యా ఇవైతా భూతజాతయః. 77

గ్రామస్థులు గ్రామస్థులను జూచునట్లును, స్వప్నలోకనివాసులు పరస్పరము గాంచుకొనునట్లును, కొన్ని పిశాచజాతులు దర్శనాదులచే పరస్పరము వ్యవహరించుకొనుచుండును.

కాశ్చిద్బహునరప్రాప్తస్వప్ననిర్మాణలోకవత్
నాన్యోన్యమపి పశ్యన్తి నానాసంస్థానసంస్థితాః. 78

వివిధస్థానము లందుండునట్టి మఱికొన్ని పిశాచజాతులు చాలవరకు అట్లు మనుజుని యొక్క స్వప్నజీవులవలె పరస్పరమున్ను గాంచకనుండును.

స్థితా యథైతా జగతి పిశాచాద్యాః కుజాతయః
ప్రాయస్తథైతాః కుష్మాణ్డయక్షప్రేతాదయః స్థితాః. 79

ఓ రామచంద్రా! ఈ ప్రపంచమున పిశాచాది దుష్టజాతులేరీతిగలవో, ప్రాయః ఆ రీతిగనే కుంభాండ యక్ష ప్రేతాది జాతులున్ను గలవు.

యథా తత్రేహ వై నిమ్నే జలం తత్రావతిష్ఠతే
తథా యత్ర పిశాచాద్యాస్తమస్తత్రావతిష్ఠతే. ౮౦

నిమ్నస్థాన మెచట నుండునో, అచట జలము స్థితిగల్గియుండునటు పిశాచాదు లెచట నుందురో, అచట వారిపాపముయొక్క తారతమ్యమును బట్టి న్యూనాధిక తమోగుణమున్ను స్థితిగల్గియుండును,

మధ్యాహ్నేపి పిశాచశ్చేదజిరే తిష్ఠతి స్వయమ్
తత్తత్స్యాన్థం తమస్తత్ర సంనిధానం కరోత్యలమ్. 81

మధ్యాహ్నసమయమందును పిశాచము స్వయముగ ముంగిటియందు నిలఁబడుచో నచటను నాతనియెదుట అంధకారమే వర్తిల్లును.

న నిహన్తి చ తద్భానుర్న చాన్యస్తత్ప్రపశ్యతి
స ఏవ చానుభవతి పశ్య మాయా విజృమ్భితమ్. 82

ఓ రామచంద్రా! ఆ యంధకారమును సూర్యుఁడు నశింపఁజేయఁడు. మఱియు నద్దానిని మఱియెవఁడును గాంచకుండును. ఆ పిశాచమే స్వయముగ దాని ననుభవించును. మాయయొక్క ప్రతాప మెట్టిదో చూడుము!

అగ్నేరాదిత్య చన్ద్రాదేస్తైజసం మణ్డలం యథా
పిశాచాదేరజన్యాత్మ తామసం మణ్డలం తథా. 83

మన వ్యవహారము కొఱకై సూర్య చంద్రాగ్నుల తేజోమండల మున్నట్లే పిశాచాదుల వ్యవహారమునకై అంధకారమండలమున్ను గలదు.

యాతి తేజస్యనోజస్త్వం తమస్యోజః ప్రధానతామ్
ఉలూకవత్పిశాచాద్యా ఆశ్చర్యం తత్స్వభావతః. 84

ఉలూకము (గుడ్లగూబ) వలె పిశాచాదులు స్వభావముగనే ప్రకాశమున నిర్బలులైయు అంధకారమున ప్రబలులైయు నుందురు. అహా! ఎట్టి యాశ్చర్యము!

ఏషా పిశాచా జనితస్య జాతిః ప్రోక్తా మయా తే సమయానపేతా
పిశాచతుల్యః సురలోకపాల లోకేషు జాతోఽహమితి ప్రసఙ్గాత్. 85

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే పిశాచవర్ణనప్రసఙ్గేన జగద్బ్రహ్మణోరైక్యప్రతిపాదనం నామ చతుర్నవతితమః సర్గః ॥ 94 ॥

ఓ రామచంద్రా! దేవతలయొక్కయు లోకపాలురయొక్కయు నగరములందు నేను పిశాచమువలె నైతినని నేను వచించినపుడు ఆ ప్రసంగమున నీవడిగిన ప్రశ్ననుసరించి అడిగిన దానిని తప్పక వచింపవలెనను సంప్రదాయమును పాలించుచు పిశాచజాతిని గూర్చి నేనివ్విధమున నీకు వర్ణించి చెప్పితిని.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషాణ పిశాచవర్ణనప్రసంగేన జగద్బ్రహ్మణో రైక్యప్రతిపాదనమను తొంబది నాల్గవ సర్గము ॥ 94 ॥

షణ్ణవతితమః సర్గః

[సత్యసంకల్పస్మృత్యా వ్యవహారః పునర్గృహైః
స్వస్యాకాశవసిష్ఠాదినామాప్తిశ్చేహ వర్ణ్యతే.

సత్యసంకల్పముయొక్క స్మృతిచే మరల జనులతోటి తనవ్యవహారము, తనయొక్క ఆకాశ వసిష్ఠాది నామముల సంప్రాప్తి వసిష్ఠునిచే నిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీ వసిష్ఠ ఉవాచః—

తతశ్చిదాకాశవపుర్భూతపఞ్చకవర్జితః
విహరన్నహమాకాశే పిశాచ ఇవ సంస్థితః. 1

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! అపుడు పంచ భూతవర్జితమగు కేవలచిదాకాశ మాత్ర దేహధారినై పిశాచమువలె నాకసమున సంచరించుచు నుంటిని.

న మాం పశ్యన్తి చన్ద్రార్కశక్రా హరిహరాదయః
న దేవసిద్ధగన్ధర్వకింనరా నాప్సరోగణాః. 2

ఆ సమయమున నన్ను చంద్ర, సూర్య, ఇంద్ర, హరి, హరాదులుగాని, దేవ, సిద్ధ, గంధర్వ, కిన్నర, అప్సరగణములు గాని చూడజాలకయుండిరి.

నాక్రామన్తి మయాక్రాన్తా న చ శృణ్వన్తి మద్వచః
ఇత్యహం మోహమాపన్నో విక్రీత ఇవ సజ్జనః. 3

నేను వారి నాక్రమించినను వారు తిరిగి నన్నాక్రమింపఁజాలకుండిరి. నావాక్యము ఉన్ను వినజాలకుండిరి. ఈ ప్రకారముగ విక్రీతుఁడగు సజ్జనునివలె నేను కర్తవ్యాకర్తవ్య విచార శూన్యుఁడనై మోహమును బొందితిని.

అథ చిన్తితవానస్మి సత్యకామా ఇమే వయమ్
పశ్యన్తు మాం సురగణాస్త్వేవ తస్మిన్పురాలయే. 4

ద్రష్టుం ప్రవృత్తా మామగ్రే వాస్తవ్యాః సర్వ ఏవ తే
ఝటిత్యేవ పురం ప్రాప్తమిన్ద్రజాలద్రుమం యథా. 5

పిమ్మట 'మనము సత్యకాములముగదా' అను విషయమును స్మరించి యపుడు 'ఈ దేవతలందఱున్ను నన్ను జూచుగాక' అని సంకల్పించితిని. వెంటనే యాదేవలోకమందు నా ఁటుదుటనున్న దేవలోకనివాసులందఱున్ను, ఎదుట తటస్థించిన యింద్రజాల వృక్షమునువలెనన్ను గాంచఁదొడఁగిరి.

అథ గీర్వాణగేహేషు సంపన్నో వ్యవహార్యహమ్
యథాస్థితసమాచారః స్థితో నిఃశఙ్కచేష్టితః. 6

అటు పిదప యథాస్థితమగు ఆచారముగల్గి, శంకారహితముగఁ బ్రవర్తించుచునే నా వతల గృహములందు సంభాషణాది వ్యవహారమును గావింపఁ దొడఁగితిని.

యైరవిజ్ఞాతవృత్తాన్తైర్దృష్టోఽహమవనేరుత్థితః
వసిష్ఠః పార్థివ ఇతి లోకేషు ప్రథితోఽస్మి తైః. 7

వ్యోమన్యాదిత్యరశ్మిభ్యో దృష్టోఽహం యైర్నభో గతైః
వసిష్ఠస్తైజస ఇతి లోకేషు ప్రథితోఽస్మి తైః. 8

వాతాత్సముదితో దృష్టో యైరహం గగనాస్పదైః
సిద్ధైర్వాతవసిష్ఠాఖ్యస్తైరహం సముదాహృతః. 9

యైరహం సలిలాద్దృష్టః ప్రోత్థితస్తైర్మునీశ్వరైః
ఉక్తో వారివసిష్ఠోఽహమితి మే జన్మసంతతిః. 10

తతః ప్రభృతి లోకేఽహం పార్థివః ప్రథితః క్వచిత్
అమ్మయః క్వచిదన్యేషాం తైజసో మారుతః క్వచిత్. 11

అపుడు నా వృత్తాంతము తెలియనివారు, ముంగిటియందలి పృథివినుండి ప్రథమముననే నావిర్భవించుటను జూచి 'పార్థివ వసిష్ఠుఁడ'ని లోకమున నన్నుబేర్కొనిరి. అట్లే యాకాశమున సూర్యకిరణములనుండి నేను వెలువడుటను గాంచినట్టి యాకాశచారులవలన నేను 'తైజస వసిష్ఠు'ఁడని లోకమునఁ బ్రసిద్ధికెక్కితిని, ఆ ప్రకారముగనే వాయుమండలమునుండి నేనుదయించుటను వీక్షించినట్టి యాకాశవాసులగు దేవ, సిద్ధులచే 'వాతవసిష్ఠుండని'యు జలమునుండి వెలువడుటను జూచినట్టి మునీశ్వరులచే 'వారివసిష్ఠుఁడ'నియు, ఆకాశమునుండి వినిర్గతుఁడగుటను గాంచినట్టివారిచే 'ఆకాశవసిష్ఠుఁడ'నియు నేను బిలువఁబడితిని, ఇవ్విధమున వివిధకల్పనలచే నా నామమున్ను, జన్మయు, గల్పింపఁబడెను. అప్పటినుండియు లోకములందునే నొకచోట పార్థివుఁడనియు, ఒకచోట అమ్మయుఁ (జలమయు)డనియు, మఱియొకచోట తైజసుఁడనియు, ఇంకొకచోట మారుతుఁడనియు, వేఱొకచోట ఆకాశమయుఁడనియుఁ బ్రసిద్ధికెక్కితిని.

అథ కాలేన మే తత్ర తస్మిన్నేవాతివాహికే
అధిభౌతికతా దేహే రూఢారూఢా స్తరేరితా. 12

తదుపరి కాలక్రమమున, చిరకాలాభ్యాసముచే పరిణతిఁ జెందిన మనస్సుచేఁ బొందింపఁబడినదై, ఆనా అతివాహిక (సూక్ష్మ)శరీరమున అధిభౌతిక (స్థూల)త్వము ప్రకటమయ్యెను.

యదేతదాతివాహిత్వమాధిభౌతికతా చ ఖమ్
ద్వయమప్యేక దేహాత్మ తతః కచతి మే చితిః. 13

నాదృష్టియందు అతివాహిక (సూక్ష్మ) అధిభౌతిక (స్థూల) దేహములు రెండును చిదాకాశరూపములే యైయున్నవి. కావున నా చైతన్యము ఆత్మభావము తోటియే స్ఫురించుచున్నది. గాని దేహాత్మభావము తోటికాదు.

ఏవమాత్మ క్వచిద్వ్యోమ కచనాత్మాప్యహం నభః
పరమేవ నిరాకారం యుష్మాస్వాకారవానపి. 14

ఓ రామచంద్రా! ఈప్రకారముగ ఒకచోట నేనాకాశాది పంచభూతరూపముల తోటి స్ఫురించునప్పటికిని నిరాకారమైన పరబ్రహ్మస్వరూపమే యైయున్నాను. మీయొక్క యుపదేశాదుల కొఱకే నేను సాకారరూపమును ధరించియున్నాను.

జీవన్ముక్తో వ్యవహరంస్తథాస్తే బ్రహ్మఖాత్మకః
తథైవాదేహముక్తోఽపి తిష్ఠతి బ్రహ్మమాత్రకః. 15

విదేహముక్తుఁడు చిదాకాశ (బ్రహ్మ) మాత్రుఁడై స్థితిగల్గియుండునట్లు జీవన్ముక్తుడున్ను వ్యవహారమాచరించునప్పటికిని చిదాకాశరూపుఁడేయై వెలయుచుండును,

మమ న బ్రహ్మతాపేతా తాదృగ్వ్యవహృతేరపి
అసంభవాదన్యదృశో యుష్మదాదిష్వహం త్వహమ్. 16

ఓ రామచంద్రా! బ్రహ్మముకంటె అన్యమగు దృష్టినాకు సంభవింపమి వ్యవహరించినప్పటికి నాబ్రహ్మరూపత్వము పోకయుండెను. మఱియు మీయొక్క యుపదేశాదులకొఱకే నేను వసిష్ఠరూపము తోటి స్థితినొందియున్నాను.

యథాఽజ్ఞస్య స్వప్ననరే నిర్జన్మని నిరాకృతౌ
అధిభౌతికతాబుద్ధిస్తథా మే జగతోపి చ. 17

జన్మరహితుఁడును ఆకారవర్జితుఁడునగు స్వప్నమనుజునియందు అజ్ఞానికెట్లు అధిభౌతిక దృష్టి యుండునో అట్లే నాయొక్కయు తదితరజనులయొక్కయు ప్రపంచముయొక్కయు విషయమందును జీవులకట్టి భౌతికదృష్టిగలదు.

ఏవమేవావభాసన్తే సర్వ ఏవ స్వయం భువః
సర్గాశ్చ నతు జాయన్తే ప్రయాతా ఇవ బోధితాః. 18

ఇవ్విధమున బ్రహ్మదేవుని మొదలుకొని సమస్తశరీరములున్ను, ఆ బ్రహ్మదేవునిచే రచితములగు సృష్టులన్నియున్ను నితరుల (అజ్ఞానుల దృష్టియందే అధిభౌతికములుగను ఉత్పన్నములుగను భాసించుచున్నవి. కాని యథార్థముగ నవియుత్పన్నములే గాకయున్నవి.

ఏష సోహమిహాకాశవసిష్ఠః పుష్టతామివ
గతోద్య స్వాత్మనాభ్యాసాద్భవతాం వా భవత్స్థితిః. 19

ఈ ఆకాశవసిష్ఠుఁడగు నేను నిజమనంబుయొక్క యభ్యాసముచేతగాని లేకనీయొక్క బుద్ధిననుసరించిగాని యిట్లు అధిభౌతికదేహముతో స్థితిగల్గియుంటిని.

ఆకాశాత్మన ఏవైతే సర్వ ఏవ స్వయంభువః
యథాత్వేతన్మనోమాత్రమిమే సర్గాస్తథైవ హి. 20

నాకువలనే తత్త్వజ్ఞులందఱికిని బ్రహ్మదేవునకును గూడ స్వదృష్టియందీజగత్తంతయు చిదాకాశమాత్రమే యైయున్నది. పరీక్షకునిదృష్టియం దీసమస్తము మనోమాత్రమై యొప్పుచున్నది.

అహమాదిరయం సర్గ స్త్వపరిజ్ఞానదోషతః
వేతాల ఇవ బాలానాం గతో వో వ్రజసారతామ్. 21

బాలురదృష్టియందు బేతాళమువలె అజ్ఞానదోషముచే నా మొదలుకొని యీ సమస్త సృష్టియు మీ దృష్టియందు వజ్రమువలె దృఢరూపమును బొందియున్నది.

పరిజ్ఞాతస్తు కాలేన స్వల్పేనైవోపశామ్యతి
వాసనాశానవాత్స్నేహో బన్ధౌ దూరగతే యథా. 22

వాసన సన్నగిలుటచే కాలక్రమమున దూరదేశమందున్న బంధువునందు స్నేహముపశమించునట్లు ఎఱుఁగఁబడుటచే అల్పకాలముననే యీ సృష్టియొక్క ఆధిభౌతికత్వము శమించుచున్నది.

ఘనత్వమహమాసాద్య తథా సర్వస్య శామ్యతి
పరిజ్ఞాతా యథా స్వప్ననిధేరాదేయభావనా. 23

ఎఱుకఁబడిన పిమ్మట స్వప్నమందలి ధనమందు గ్రహణబుద్ధి తొలగునట్లు ఎఱుఁగఁబడిన పిదప అహంకారరూపమగు సృష్టియొక్క స్థూలత్వమున్ను శమించుచున్నది.

శామ్యన్తి సంపరిజ్ఞాతాః సకలా దృశ్యదృష్టయః
యథా మరునదీవేగవారిగ్రహణబుద్ధయః. 24

ఎఱుఁగఁబడిన పిదప మరుభూమియందలి నదీవేగమందు జలగ్రహణబుద్ధి తొలఁగునట్లు జ్ఞానము గలిగిన పిమ్మట దృశ్యదృష్టులన్నియు నుపశమించుచున్నవి.

మహారామాయణప్రాయశాస్త్రప్రేక్షణమాత్రతః
పీతదాసాద్యతే నిత్యం కిమేతావతి దుష్కరమ్. 25

(వాసిష్ఠ) మహారామాయణమువంటి శాస్త్రముయొక్క దర్శనమాత్రము చేతనే యిట్టి జీవన్ముక్తత్వము నిరంతరము సంప్రాప్తించుచున్నది. కావున నింతమాత్రపు కార్యమాచరించుటయందేమి కష్టము గలదు ?

సంసారవాసనాభావరూపే సక్తా ను యస్య ధీః
మన్దో మోక్షే నిరాకాఙ్క్షీ స శ్వా కీటోఽథవా జనః. 26

ఎవని బుద్ధి సంసారవాసనావశముచే అభావరూపములగు దేహేంద్రియాది పదార్థములందాసక్తమైయుండునో మఱియు మోక్షవిషయమున గోర్కెలేకయుండునో అట్టి మందుండు (అశుచి పదార్థములందలి యాసక్తిచే) శునకము లేక కీటమోయగు గాని మనుజుఁడు కానేరడు.

భోగాభోగః కిలాయం యః స జీవన్ముక్తబుద్ధినా
కీదృశో భుజ్యమానః స్యాత్కీదృక్స్యాన్మౌర్ఖ్యసేవినా. 27

ఓ రామచంద్రా! జీవన్ముక్తబుద్ధితోటి యనుభవింపఁబడు శబ్దాది భోగకలాపమెట్లుండునో మూర్ఖ (అజ్ఞాన) బుద్ధితోటి సేవింపఁబడు శబ్దాదిభోగము లెట్లుండునో యోచించుము ? (మొదటిది చిద్రూపముచే నానందప్రదముగను, రెండవది జడదృశ్యరూపముచే దుఃఖప్రదముగను నుండునని భావము.)

మహారామాయణప్రాయశాస్త్రప్రేక్షణమాత్రతః
అన్తఃశీతలతోదేతి పరార్థేషు హిమోపమా. 28

(వాసిష్ఠ) మహారామాయణమువంటి శాస్త్రముయొక్క దర్శనమాత్రముచేతనే మనుజులకు హిమము (మంచు)వలె సమస్తపదార్థములందును మహత్తరమైన అంతఃకరణశీతలత్వ ముదయించుచున్నది.

మోక్షః శీతలచిత్తత్వం బన్ధః సంతప్తచిత్తతా
ఏతస్మిన్నపి నార్థిత్వమహో లోకస్య మూఢతా. 29

చిత్తముయొక్క శీతలత్వమే మోక్షము; చిత్తముయొక్క సంతాపమే బంధము. అట్టి చిత్తముయొక్క శీతలత్వమందును జనులకుఁ గోర్కెలేకున్నదే! ఆహా! లోకముయొక్క మూఢత్వమెట్టిది!

అయం ప్రకృత్యా విషయైర్వశీకృతః పరస్పరం స్త్రీధనలోలుపో జన
యథార్థసందర్శనతః సుఖీ భవేన్ముముక్షుశాస్త్రార్థవిచారణాదితః. 30

మనుజులు స్వభావముగనే విషయములచే వశీకృతులగుచున్నారు. కావుననే పరస్పర యుద్ధచౌర్యాదులచేఁగూడ స్త్రీధనాదులను సంపాదించుటయందు లోలుపులై వర్తించుచున్నారు. ఇట్లు భ్రాంతి, సంతాపములతోఁగూడి పరితపించుచున్న యట్టివారెపుడు విరక్తులై, ముముక్షుశాస్త్రము (వేదాంతము)యొక్క అర్థవిచారణా, నిదిధ్యాసనాద్యుపాయములచే, తత్త్వజ్ఞానమును సముపార్జించి యథార్థవస్తువు (ఆత్మ) నవలోకించుదురో, అపుడు సుఖవంతులగుదురు.

శ్రీ వాల్మీకిరువాచ :—

ఇత్యుక్తవత్యథ మునౌ దివసో జగామ సాయంతనాయ విధయేఽస్తమినో జగామ స్నాతుం సభాకృతనమస్కరణా జగామ శ్యామాక్షయే రవికరైశ్చ సహాజగామ.

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పాషాణోపాఖ్యానే వసిష్ఠశరీరవర్ణనం నామ పఞ్చనవతితమః సర్గః ॥ 95 ॥

దివసః ॥ 17 ॥ పాషాణోపాఖ్యానం సమాప్తమ్.

శ్రీవాల్మీకిః—— ఓ భరద్వాజా! వసిష్ఠమునీంద్రుఁ డిట్లు పల్క, అపుడు దివసము ...గా, సాయంకాలవిధుల నెరవేర్చుటకై సూర్యుఁ డస్తాద్రిఁ గ్రుంకెను. స్నాన సంధ్యాది గావించుటకుగాను సభ్యులందఱునులేచి పరస్పరము వందనపూర్వకముగ సెలవుగైకొని . ఆ రాత్రి గడచినపిమ్మట సూర్యోదయముకాగానే మరల యథాప్రకారము వారందఱును ...స్థలమునకు విచ్చేసిరి.

శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున పాషా॥ వసిష్ఠశరీరవర్ణనమను దొంబదియైదవ సర్గము ॥ 95 ॥

పదునేడవరోజు ॥ 17 ॥ పాషాణోపాఖ్యానము సమాప్తము.

షణ్ణవతితమః సర్గః

[పాషాణాఖ్యానతాత్పర్యం చిద్వివర్తో జగద్భ్రమః
వర్ణ్యతేఽత్ర చిదేవాత్మా బ్రహ్మానన్దోఽజరామరః.

పాషాణోపాఖ్యానముయొక్క తాత్పర్యము 'చిద్వివర్తమాత్రమే జగత్తుయొక్క భ్రమ' అని తెల్పుట, బ్రహ్మానందమయమై, అజరమై, అమరమైనట్టి చిద్రూపమగు ఆత్మయొక్క వర్ణనము మున్నగు విషయము లిచటఁ గాననగును.]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

పాషాణాఖ్యానమేతత్తే కథితం కార్యకోవిద
అనయేమాః స్ఫురద్దృష్ట్యా సృష్టయో నభసి స్థితాః. 1

శ్రీవసిష్ఠుఁడు:— కార్యకుశలుఁడవగు రామచంద్రా! ఇవ్విధమున పాషాణోపాఖ్యానమును నేను నీకు వర్ణించి చెప్పితిని. ఈ యాఖ్యానముద్వారా, చిన్మాత్రపూర్ణదృష్టిచే, సమస్త సృష్టులు చిదాకాశమున నెలకొనియున్నవని నిశ్చయింపుము.

న చ స్థితం కించనాపి క్వచనాపి కదాచన
స్థితం బ్రహ్మఘనే బ్రహ్మ యథాస్థితమఖణ్డితమ్. 2

ఈ జగత్తేదియు నెచటను నెపుడును నుండియుండలేదు. ఏకరసమై, చిద్ఘనమైనట్టి బ్రహ్మమే బ్రహ్మమందు అఖండరూపమున యథారీతి స్థితిగల్గియున్నది.

బ్రహ్మ చిన్మాత్రకం విద్ధి తద్యథా స్వప్నదృష్టిషు
పురం భవన్నిజాద్రూపాన్న కదాచన భిద్యతే. 3

ఓ రామచంద్రా! స్వప్నమందలి నగరాదులు నిజచిద్రూపముకంటె నెపుడును భిన్నములు కానట్లును, చిద్రూపములే యగునట్లును, ఈ జగత్తున్ను బ్రహ్మచిన్మాత్రమనియే యెఱుఁగుము.

స్వయం భూత్వసమాపత్తౌ తథా దృశ్యవ్యవస్థితౌ
స్వరూపమజహత్త్వేవ చిదాకాశమజం స్థితమ్. 4

బ్రహ్మదేవుని (సమష్టిజీవుని) రూపముతోటి స్థూలసూక్ష్మ జగద్రూపమను దృశ్యముయొక్క వ్యవస్థితి యేర్పడినప్పటికిని, జన్మరహితమగు చిదాకాశము తన చిత్స్వరూపమును త్యజింపకయే స్థితి నొందియున్నది.

న స్వయంభూర్న చ జగన్న స్వప్నపురమప్యలమ్
స్థితం సంవిన్మహాదృష్ట్యా బ్రహ్మ చిన్మాత్రమేతయా.

పరమార్థమున బ్రహ్మదేవుఁడుగాని, జగత్తుగాని, స్వప్ననగరాదులుగాని యెవ్వియు లేవు. అట్టి చైతన్యమహాదృష్టిచే చిన్మాత్ర మొకటియే గలదు.

యథా పురం భవత్స్వప్నే చిద్రూపం స్వాత్మని స్థితమ్
అఖణ్డమేవమాసృష్టేః రామ ప్రలయాస్థితే.

స్వప్నమందు స్ఫురించు నగరము చిద్రూపమేయగుచు స్వాత్మయందే నెలకొనియుండునట్లు, సృష్ట్యాది ప్రళయ పర్యంతముగల సమస్త జగత్తున్ను అఖండమగు బ్రహ్మరూపమే యైయున్నది.

హేమహేమాశ్మనోః స్వప్నపురచేతనయోర్యథా
భేదో న సంభవత్యేవ న భేదశ్చితిసర్గయోః. 7

సువర్ణమునకును సువర్ణశిలకును, చైతన్యమునకును స్వప్నపురమునకును భేదము సంభవింపనట్లు, చైతన్యమునకును సృష్టికినిగూడ నొకింతైనను భేదము సంభవింపనేరదు.

శిలారేకాస్తి నో సర్గో హేమాస్తి న తదూర్మికా
స్వప్నాచలే చిదేవాస్తి న తు కాచన శైలతా. 8

సువర్ణశిలయందు సువర్ణమే గలదుగాని శిలాత్వములేనట్లును, స్వప్నపర్వతమున చైతన్యమే గలదుగాని పర్వతత్వము లేనట్లును, ఇట కేవలమొక చైతన్యమే గలదుగాని సృష్టియనునది లేనేలేదు.

చిదేవ శైలవద్భాతి యథా స్వప్నే నిరామయా
తథా బ్రహ్మ నిరాకారం సర్గవద్భాతి నేతరత్. 9

స్వప్నమున నిర్వికారమగు చైతన్యమే పర్వతమువలె భాసించునట్లు, నిరాకారమగు బ్రహ్మమే యిట సృష్టిచందమున భాసించుచున్నదిగాని అన్యమెద్దియునుగాదు.

చిన్మాత్రమిదమాకాశమనన్తమజమవ్యయమ్
మహాకల్పసహస్రేషు నోదేతి న చ శామ్యతి. 10

ఈ సృష్టియంతయు నిర్మలమై, సర్వవ్యాపకమై, నిర్లేపకమై, అజమై, అవ్యయమై, అనంతమైనట్టి చిన్మాత్రమే యైయున్నది. అయ్యది వేలకొలఁది మహాకల్పములందును నుదయింపదు. అస్తమింపదు; కేవలము ఏకరసమైయే యుండును.

చిదాకాశో హి పురుషశ్చిదాకాశో భవానయమ్
చిదాకాశోఽహమజరశ్చిదాకాశో జగత్త్రయమ్. 11

ఓ రామచంద్రా! జీవుఁడు చిదాకాశమే; నీవున్ను చిదాకాశమే; ఈ నేనున్ను అజరమై, అమరమైనట్టి చిదాకాశమే; ముల్లోకములున్ను చిదాకాశమే.

చిదాకాశం వర్జయిత్వా శవమేవ శరీరకమ్
అచ్ఛేద్యోఽసావదాహ్యోఽసౌ చిదాకాశో న శామ్యతి. 12

చిదాకాశము లేనిచో శరీరమునిర్జీవమేయగును. మఱియు, ఈ చిదాకాశము దేనిచేతను ఛేదింపఁబడనిదియు, దహింపఁబడనిదియు, ఎన్నఁడును శమింపనిదియునై వర్తిల్లుచున్నది.

అతో న కించిన్మ్రియతే న చ కించన జాయతే
చిత్త్వాత్తతశ్చిత్కచనం జగదిత్యనుభూయతే. 13

కావున, సర్వము చిన్మాత్రమగుటచే వాస్తవముగ నేదియు మరణించుటలేదు, జన్మించుటలేదు. చైతన్యముయొక్క స్ఫురణమే జగద్రూపముగ ననుభూతమగుచున్నది.

చిన్మాత్రపురుషో జన్తుర్మ్రియతే యది నామ వా
తతో మరిష్యత్తత్పుత్రో నిఃసన్దేహం పితుర్మృతౌ. 14

చిన్మాత్రపురుషుఁడగు జీవుఁడు మరణించుచో, ('ఆత్మావై పుత్రనామాసి' ఈ మున్నగు శ్రుతివాక్యములఁబట్టి పితాపుత్రుల అభేదము సిద్ధించుటవలనను, ఆత్మయొక్క భేదమందుఁ బ్రమాణము లేనందువలనను) తండ్రియొక్క మరణముచేఁ బుత్రుఁడున్ను మరణింపవలసి యుండును.

ఏకస్మిన్మృతే జన్తావమరిష్యంస్తు సర్వదా
సర్వ ఏవ జనాః శూన్యమభవిష్యన్మహీతలమ్. 15

మఱియు చిన్మాత్రమగు ఆత్మమరణించునదగుచో, ('ఏక ఏవ హి భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః'-అనఁగా, ఒకే ఆత్మ సర్వజీవులందును గలదు. ఇత్యాది శ్రుతులఁబట్టి) ఒకఁడు మరణించుటచే నందఱున్ను మరణింపవలసియుందురు. అపుడీ జగత్తు సర్వదా ప్రాణిశూన్యమై పోవును.

న చాద్యాపి మృతం రామ చిన్మాత్రం కస్యచిత్క్వచిత్
న చ శూన్యా స్థితా భూమి స్తస్మాచ్చిత్పురుషోఽక్షయః. 16

కాని, ఓరామచంద్రా! నేఁటివఱ కెవనికిని నెచటను చిన్మాత్రము మరణించియుండలేదు; ఈ జగత్తున్ను ప్రాణిశూన్యమై యుండలేదు. కావున చిన్మాత్రుఁడగు జీవుఁడు సదా నాశరహితుఁడే యగును.

ఏకం చిన్మాత్రమేవాహం సశరీరాదయో మమ
ఇతి సత్యానుసంధానే క్వ జన్మమరణాదయః. 17

'అద్వితీయమగు చిన్మాత్రమే నేను. నాకు శరీరాదులు లేవు, అని యిట్లు విచారించుటచే నిఁక జననమరణాదు లెచట?

అహం చిన్మాత్రమమలమిత్యాత్మానుభవం స్వయమ్
అపహన్త్యాత్మహన్తారో నిమజ్జన్త్యాపదర్ణవే. 18

నిర్మలమై, ఏకమైనట్టి చిన్మాత్రమే నేను, అనునట్టి యాత్మానుభవము నెవరు స్వయముగ కుతర్కములచే ఖండింతురో, వారు ఆత్మహంతకులే యగుచు, ఆపదలను సముద్రమున మునుఁగుదురు.

చిదహం గగనాదచ్ఛా నిత్యానన్తా నిరామయా
కిం జీవితం మే కింవాపి మరణం వా సుఖాసుఖే. 19

వ్యోమాత్మచేతనమహం, క్వశరీరాదయో మమ
ఇత్యాత్మహాపహ్నుతేఽన్తర్యోఽనుభూతం ధిగస్తు తమ్. 20

'ఆకాశముకంటెను స్వచ్ఛమై, నిత్యమై, అనంతమై, నిర్వికారమైనట్టి చైతన్యమే నేను, నాకిఁక జీవితమేమి? మరణమేమి? సుఖమేమి? దుఃఖమేమి? చిదాకాశరూపమగు చైతన్యమే నేనైయుండ యిఁక నాకు శరీరాదులేమి?'-అని యిట్లు తత్త్వజ్ఞులచే తమయందను భూతమగు ఆత్మను [illegible] హంతకునికి ధిక్కారముగుఁగాత!

చిదాకాశమహం స్వచ్ఛమనుభూతిరితి స్ఫుటా
యస్యాస్తమాగతా మూఢం తం జీవన్తం శవం విదుః. 21

'నేను నిర్మలమగు చిదాకాశమును' అను నిట్టి ప్రత్యక్షానుభవ మెవనికి నశించునో, అట్టి మూఢుని తత్త్వజ్ఞులు జీవించుచున్నప్పటికిని మృతుఁడనియే వచింతురు.

అహం వేదనమాత్రాత్మా కాని దేహేన్ద్రియాణి మే
లబ్ధాత్మానమితి స్వచ్ఛం ప్రవిలుమ్పన్తి నాపదః. 22

'నేను చిన్మాత్రస్వరూపుఁడను, నాకిఁక దేహేంద్రియాదులేమి?' అను బోధచే ఆత్మస్వరూపమును బొందినట్టియు, అవిద్యాది మాలిన్యము నశించుటచే నిర్మలుఁడైనట్టియు మనుజుని జననమరణాది ఆపదలు ఛేదింపనేరవు.

చిన్మాత్రం శుద్ధమాత్మానం యోఽవలమ్బ్య స్థిరః స్థితః
నాధయస్తం విలుమ్పన్తి మహోపలమివేషవః. 23

గొప్పశిలను బాణములు ఛేదింపఁజాలనట్లు, చిన్మాత్రమై, శుద్ధమైనట్టి ఆత్మ నవలంబించి స్థిరముగ నుండువానిని మానసిక వ్యథలెవ్వియు ఛేదింపఁజాలవు.

చిత్తం స్వభావం విస్మృత్య బద్ధాస్థా యే శరీరకే
తైః సువర్ణం పరిత్యజ్య గృహీతం భస్మ వస్తుతః. 24

తనయొక్క చిత్స్వభావమును మఱచి యెవఁడు శరీరాదులం దాసక్తిగల్గియుండునో, అట్టివాఁడు వాస్తవముగ సువర్ణమును త్యజించి భస్మమును గ్రహించువాఁడే యగును.

బలం బుద్ధిశ్చ తేజశ్చ దేహోఽహమితి భావనాత్
నశ్యత్యుదేత్యేతదేవ చిదేవాహమితి స్థితేః. 25

'నేను దేహమును' అను భావననే బలము, బుద్ధి, తేజము నశించును. 'నేను చైతన్యము'నే, అను భావనచే బలము, బుద్ధి, తేజములు వర్ధిల్లును.

చిదాకాశమహం శుద్ధం క్వ మే మరణజన్మనీ
ఏవం స్థితేస్యుః కింనిష్ఠా లోభమోహమదాదయః. 26

'నేను శుద్ధచిదాకాశమగు ఆత్మను, నాకిఁక జననమరణములేమి?' అని యిట్లు తలంచి స్థితినొంద, లోభ, మోహ, మదాదులిఁక దేనినాశ్రయించి యుండఁగలవు?

చిదాకాశాదృతే దేహోఽన్యత్వాపరమవాప్నుయాత్
తస్మై తద్యుద్యతే వక్తుం సన్తి లోభాదయస్త్వితి. 27

చిదాకాశమును వదలి స్థూలసూక్ష్మ కారణ శరీరములనే ఆత్మ బుద్ధిచే నెవఁడుగాంచునో అట్టి మూఢునికొఱకు మాత్రము లోభమోహాదులు గలవని వచింపఁదగును.

న చ్ఛిద్యే న చ దహ్యేఽహం చిన్మాత్రం వజ్రవచ్ఛితి
న దేహీ నిశ్చయో యస్య తం ప్రత్యస్తకరస్పృశమ్. 28

'నేను దేనిచేతను ఛేదింపఁబడు వాఁడనుగాను. దహింపఁబడు వాఁడనుగాను; వజ్రము వలె దృఢమైనట్టి చైతన్యము నే నేను, దేహవంతుఁడ నెన్నఁటికినిగాను' అనునిట్టి నిశ్చయమెవనికిఁ గల్గియుండునో, వానికి మృత్యువు తృణమువంటిదేయగును.

అహో ను ముగ్ధతా జ్ఞానదృష్టీనాం యద్విద స్త్వలమ్
శరీర శకలాభావే నశ్యామ ఇతి మోహితాః 29

అహా! పండితులందును నెట్టి వ్యామోహము గన్పించుచున్నది; జడమైనట్టి శరీరమను శకలము (తునుక) నశింప 'మేము నశించుచున్నామని' తలంచి భీతిల్లుచున్నారే!

అహం చిన్నభ ఏవేతి సత్యే భావే స్థిరే సతి
వజ్రపాత యుగాన్తాగ్ని దాహాః పుష్పోత్కరోపమాః. 30

'నేను చిదాకాశమునే, అను ఈ సత్యభావన బాగుగ స్థిరపడినచో నిఁక వజ్రపాతము గాని ప్రళయాగ్నిదాహములుగాని పుష్పవృష్టి చందముననే యుండును.

చిన్మాత్రమమరం నాహం యన్నశ్యామీతి రోదితి
అనష్ట ఏవ తద్దేహో జాతపూర్వా ఖరోలికా. 31

'జనన మరణరహితమైనట్టి చిన్మాత్రమును నేను గాను, కావుననే నశించుచున్నాను, అని యిట్లుతలంచి, ఆత్మనశింపకున్నను నెవఁడేడ్చుచున్నాఁడో, అట్టివాఁడు వివేకుల దృష్టియందు అపూర్వమైన పరిహాసక్రీడయేయగును.

ఇదం చేతనమేవాహం నాహం దేహాదిదృష్టయః
ఇతి నిశ్చయవానో్ఽన్తర్న స ముహ్యతి కర్హిచిత్. 32

'నిత్యమై, అపరోక్షమైనట్టి చిన్మాత్రమునే నేను, దేహాదులనుగాను, అని యిట్లెవఁడు అంతఃకరణమున నిశ్చయించునో, ఆతఁడెన్నఁటికిని మోహమును బొందనేరఁడు.

అహం చేతనమాకాశో నాశో మే నోపపద్యతే
చేతనేన జగత్పూర్ణం కేవ సందేహితా్రత వః. 33

'నేను చిదాకాశమాత్రుఁడను, నా కెన్నఁడును నాశము కలుగఁజాలదు, ఈ జగత్తు చైతన్యముచేఁ బూర్ణమైయున్నది' అను నివ్విషయమున మీకు సందియమేల ?

చేతనం వర్జయిత్వాన్యత్కించిద్భూయం జనా యది
యదుచ్యతాం మహామూఢాః స్వాత్మా కిమపలప్యతే. 34

'మేము చైతన్యముకంటె వేఱైనవారము' అని మీరు వచించుచో, ఓ మహామూఢులారా! అట్టి యనుభవమునకు హేతువగు మీ ఆత్మనే మీరేల లేదనుచున్నారు ?

తచ్చేతనం చేన్మ్రియతే తజ్జనాః ప్రత్యహం మృతాః
బ్రూత కిం న మృతా యూయం తన్మృతం కిల చేతనమ్. 35

చైతన్యముమరణించుచో, జనులందఱును ప్రతిదినమున్ను మరణింపవలసియుందురు. మఱియు అందఱియొక్క, చైతన్యమొకటేయగుటచే నది మరణింప మీరేలమరణింపక యున్నారో వచింపుఁడు ?

తస్మాన్న మ్రియతే కించిన్న చ జీవతి కించన
జీవామీతి మృతో్ఽస్మీతి చిచ్చేతతి న నశ్యతి. 36

కాఁబట్టి యేదియు మరణించుటలేదు, ఏదియు జీవించుటలేదు; 'జీవించుచున్నాను, మరణించుచున్నాను' అనుభ్రాంతిని చైతన్యమనుభవించుచున్నది. అంతేగాని స్వయముగ నెన్నఁడును నశింపకయేయున్నది.

చిచ్చేతతి యథా వా యత్తత్తథా సాఽశు పశ్యతి
ఆబాలమేషో్ఽనుభవో న క్వచిత్సా చ నశ్యతి. 37

ఆచైతన్యము దేని నేరీతి యెఱుఁగుచున్నదో, ఆరీతిగనే దానిని శీఘ్రముగఁ గాంచుచున్న దను విషయము ఆ బాలవృద్ధపర్యంత మందఱియందును ననుభవసిద్ధమైయున్నది. కావున నయ్యది యెచటను నెన్నఁడును నశింపకయేయున్నదగును.

పరిపశ్యతి సంసారం పరిపశ్యతి ముక్తతామ్
సుఖదుఃఖాని జానాతి స్వరూపాత్తన్న భిద్యతే. 38

మఱియు ఆ చైతన్యము సంసారమును, ముక్తిగూడ గాంచుచున్నది; యట్లే సుఖదుఃఖ ములనున్ను నెఱుఁగుచున్నది. కాని, ఆయా భిన్నదశలయందును నయ్యది తన చిత్స్వరూపము కంటె వేఱుగాకయే యున్నది.

అపరిజ్ఞాతదేహాత్తు ధత్తే మోహాభిధాం స్వయమ్
పరిజ్ఞాతస్వరూపాత్తు ధత్తే మోక్షాభిధాం స్వయమ్. 39

నిజస్వరూపము నెఱుఁగకపోవుటచే బంధమను సంజ్ఞను, ఎఱుఁగుటచే మోక్షమను సంజ్ఞను ఆ చైతన్యము స్వయముగనే ధరించుచున్నది.

నాస్తమేతి న చోదేతి న కదాచన కించన
సర్వమేవ చ చిన్మాత్రమాకాశవిశదం యతః. 40

సమస్తము నిర్మలమైన చిదాకాశమే యైయున్నది. గావున నెచటను నేదియు నుత్పన్న మగుటలేదుఁ, నశించుటలేదు.

న తదస్తి న యత్సత్యం న తదస్తి న యన్మృషా
యద్యథా యేన నిర్ణీతం తత్తథా తం ప్రతి స్థితమ్. 41

ఈ ప్రపంచమందలి పదార్థములందు సత్యముకానిదిగాని, మిథ్యకానిదిగాని యేదియు లేదు; దేని నెవఁడెట్లు నిర్ణయించునో, అది వాని కట్లే (సత్యముగగాని, (మిథ్యగగాని) స్థితినొంది యుండును.

యద్యద్యథా జగతి చేతతి చేతనాత్మా
తత్తత్తథానుభవతీత్యనుభూతిసిద్ధమ్
దృష్టం విషామృతదృశేవ పదార్థజాతం
నాతో్ఽస్తి సంవిదవిధేయమితి ప్రసిద్ధమ్. 42

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అమరత్వప్రతిపాదనం నామ షణ్ణవతితమః సర్గః ॥ 96 ॥

ఓ రామచంద్రా! ఈ చైతన్యాత్మ ప్రపంచమున నేయేపదార్థము నేయేరీతి యెఱుఁగునో, ఆయారీతిగనే దాని ననుభవించునను విషయము అనుభవసిద్ధమైయున్నది. ఏలయనిన, ఒకే పదార్థము దేశకాల భేదమునుబట్టి యొకని కొకచోట విషముగను, మఱియొకని కొకచోట అమృతముగను నగుచున్నది. కావున, సమస్త పదార్థములున్ను చైతన్యముయొక్క అనుభవానుసారమే స్థితిగల్గియున్నవనుట ప్రసిద్ధమైయున్నది.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అమరత్వ ప్రతిపాదనమను దొంబదియాఱవ సర్గము ॥ 96 ॥

సప్తనవతితమః సర్గః

[వర్ణ్యతే సర్వశక్తిత్వాత్సర్వవాద్యుక్తి సత్యతా
భోగాసక్తిశ్చ సర్వేషాం తత్త్వజ్ఞ విరలస్థితిః.

పరమాత్మయొక్క సర్వశక్తిత్వమువలన వాదులందఱి వచనములయొక్కయు సత్యత్వము, భోగములందు సర్వజీవులయొక్క ఆసక్తి తత్త్వజ్ఞులయొక్క దుర్లభత్వము మున్నగు విషయము లిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీవసిష్ఠ ఉవాచ :—

సంవిన్మయత్వాజ్జగతః స్వప్నస్య పరమాత్మనః
బ్రహ్మాకాశతయా సర్వం బ్రహ్మైవేత్యనుభూయతే. 1

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఈ జగత్తు పరమాత్మయొక్క స్వప్నతుల్యమగుటచేతను, సమస్తము బ్రహ్మాకాశరూపమగుటవలనను, ఈ జగత్తంతయు బ్రహ్మరూపముగ ననుభూతమగుచుండుట సత్యమేయగును.

భ్రమస్య చాతిదృశ్యత్వాదదృశ్యత్వాన్మహాచితేః
మదశక్తివదాత్మేతి సత్యతాస్యాపి యుజ్యతే. 2

జగద్రూపమగు భ్రమ కానుపించుటచేతను అధిష్ఠానమగు మహాచైతన్యము కానుపింపక పోవుటచేతను, చిదాత్మ మదశక్తివలె స్వయముగ అదృశ్యమై దృశ్యభ్రమహేతువగు కార్యరూపముచేతనే స్వసత్తను బ్రకటించుచున్నది యగునుగనుక ఈ జగద్రూపముయొక్క సత్యత్వమును తగియే యున్నది.

అసత్త్వాద్దృశ్యవిభ్రాన్తేరలభ్యత్వాన్మహాచితేః
ఉపలబ్ధురభావాచ్చ శూన్యనామ్నిపి సత్యపి. 3

బంధకాలమున సర్వదృశ్యోపరామరూపమగు మోక్షముయొక్క అసత్త్వవలనను అది లేనిచో మహాచైతన్యమున్ను అలభ్యమగుటచేతను, ముక్తికాలమందును ప్రమాత (అంతఃకరణోపహితుఁడగు జీవుఁడు) యొక్క అభావమువలనను, మిగుల అప్రసిద్ధప్రాయత్వముచే పరమార్థ వస్తువునందును శూన్యత్వమునంటి సంజ్ఞ సత్యమేయగుచున్నది

చిన్మాత్రం పురుషోఽకర్తా సమేత్యావ్యక్తతో జగత్
ఏవం దృష్టేః సత్యమేతదేషామర్థానుభూతితః. 4

'చిన్మాత్రుఁడగు పురుషుఁడే కర్త; అతని సత్తవలన త్రిగుణముల సామ్యావస్థా రూపమగు అవ్యక్తము (ప్రకృతి) నుండి జగత్తుత్పన్నమగుచున్నది' అనునిట్టి దృష్టిసాంఖ్యులకు వారి యనుభవమును బట్టి అది యావిధముగనే సత్యమైయున్నది.

వివర్తో బ్రహ్మణో దృశ్యమిత్యేషం వాదినోఽపి సత్
మతమేవం స్వరూపాణా మర్థానామనుభూతితః. 5

విచారణయందు సమస్తపదార్థములయొక్క స్వరూపమును బ్రహ్మవివర్తముగనే అనుభవించుటవలన యాదృశ్యజగత్తు బ్రహ్మముయొక్క వివర్తమే యని వచించు వేదాంతవాదుల మతమున్ను సత్యమేయైయున్నది.

పరమాణుసమూహాత్మ జగదిత్యపిసత్యతః
సంవేద్యతే యథా యద్యత్తత్తథైవానుభూతితః. 6

అట్లే కణాద, గౌతమ, సౌత్రాంతిక, వైభాషిక, అర్హతుల మతము ననుసరించి యీ జగత్తు పరమాణువుల సమూహరూపమేయను కల్పనయు వారి యనుభవమునుబట్టి సత్యమేయైయున్నది. ఏలయనిన, ఏది యేవిధమున నెఱుఁగఁబడుచున్నదో, అది యావిధముగనే యనుభవింపఁబడుచున్నది.

యథా దృష్టం తథైవేదమిహ లోకే పరత్ర చ
నాసన్న సదితి ప్రౌఢా సత్యమాధ్యాత్మికీ గతిః. 7

'ఇహలోకమందును, పరలోకమందును నేది యేవిధమున జూడఁబడుచున్నదో, అది యావిధముగనే యుండియున్నది, అది సత్యముకాదు, అసత్యముకాదు, అనిర్వచనీయమేయగును.' ఇట్లే జగత్తు మనస్సుయొక్క కల్పనామాత్రరూపమే గలదైయున్నది. అనునిట్టిదృష్టి సృష్టివాదుల మతమున్ను వారి యనుభవమును బట్టి సత్యమే యగును.

బాహ్యమేవాస్తి నాస్త్యన్యదిత్యన్యే సత్యవాదినః
స్వాత్మన్యక్షగణాతీతం ప్రాప్నువన్తి న తే యతః. 8

'బాహ్యమందగు పృథివ్యాది భూత చతుష్టయము మాత్రమేగలదు; దానికతీతమైనట్టి అభ్యంతరమందలి యనునది ఆత్మలేదు.' అను చార్వాకుల మతమున్ను వారిదృష్టినిబట్టి సత్యమే యైయున్నది. ఏలయనిన, ఇంద్రియాదులకు పరమైనట్టి ఆత్మను వారుతమయందుఁ బొందఁజాలక యున్నారు.

అనారతవిపర్యాసదర్శనాత్క్షణభఙ్గధీః
యుక్తైవ తద్విదామాద్యం సర్వశక్తి హి తత్పదమ్. 9

అట్లే, ప్రతిక్షణము సమస్తపదార్థములయొక్క పరివర్తనమును గాంచుటవలన నంతయు పరివర్తనశీలమైనదనియు, క్షణభంగురమైనదనియు వచించు క్షణికవాదుల మతమున్ను వారి యనుభవమును బట్టి సత్యమేయైయున్నది. ఏలయనిన, ఆద్యమగు బ్రహ్మపదము సర్వశక్తియుతమై వెలయుచున్నదిగదా !

కలవిఙ్కఘటన్యాయో ధర్మ ఇత్యపి తద్విదామ్
తథాత్మ సిద్ధేర్మ్లేచ్ఛానాం తద్దేశేషు న దుష్యతి. 10

కలవింకఘటన్యాయమువలె [అనఁగా ఘటమందు బంధింపఁబడిన కలవింకపక్షి (ఊరఁబిచ్చుక) ఆ ఘటముయొక్క ముఖము తెఱువఁబడగనే యెగిరిపోవునట్లు,] పరిచ్ఛిన్న పరిమాణము గల జీవుఁడున్ను కర్మక్షయముకాగానే పరలోకమున కెగిరిపోవును. అను ఈ 'అర్హతుల' కల్పన యున్ను సత్యమైనదే. ఆ విధముగనే ఈశ్వరునిచే నుత్పన్నముకాఁబడిన దేహాకారుఁడగు జీవుఁడు మరణానంతరము ఆ దేహము పాఁతిపెట్టఁబడిన స్థలమునందే యుండుననియు, పిమ్మట, కాలాంతరమున ఈశ్వరునిచే విచారింపఁబడి యాతనియిచ్ఛచే శాశ్వతముగ స్వర్గమందుగాని, నరకమందుగాని, యుంచఁబడుననియు, వచించుయవనాది మ్లేచ్ఛులమతమున్ను వారియనుభవము ననుసరించి దూషితముకాకయే యున్నది.

సమాః సన్తశ్చ విప్రాగ్నివిషామృతమృతిష్వపి
శాన్త్యేవం తద్విదాం సర్వమిదం సర్వాత్మకం యతః. 11

అంతటను సమబుద్ధిగలవారును, సన్మాత్రవస్తువునందు తత్పరమైనట్టి దృష్టిగలవారునగు జ్ఞానులు, అమృత, విషములందును జనన మరణాదులందును ఐకరస స్వభావులై సమముగ వెలయుచుందురు. ఏలయనిన, వారిదృష్టియందీజగత్తంతయు బ్రహ్మమయమేయగును సర్వత్ర సర్వాత్మకమై యొప్పుచున్నదగును. (కావున నిట దుర్లభమైన దేదియును లేదు అందుచేతనే వాదులందఱియొక్క యభిలషితములును నిట సిద్ధించినవని భావము.)

స్వభావసిద్ధమేవేదం యుక్తమిత్యేవ తద్విదామ్
అన్విష్టా యాతి నో ప్రాప్తిం బుద్ధిమత్పర్వకర్తృతా. 12

'ఈ జగత్తంతయు స్వయముగ స్వభావముగనే నుత్పన్నమగుచున్నది, స్వభావముగనే నశించుచున్నది. దీనికి కర్తయెవఁడునులేఁడ'ని వచించు స్వభావవాదులయొక్క మతమున్ను వారి దృష్టికోణమును బట్టి సత్యమేయైయున్నది. ఏలయనిన, అన్వేషించినప్పటికిని వృష్టి, వాయు, నక్షత్ర, సూర్యాదుల విషయమున కర్త లభించుటలేదుగదా !

ఏకః సర్వత్ర కర్తేతి సత్యం తన్మయచేతసామ్
సోఽయం నిశ్చయవాన్సోఽత్ర తదాప్నోతీత్య బాధితమ్. 13

'సర్వత్రకర్త యొక ఈశ్వరుఁడేయై యున్నాఁడని' నిశ్చయించు ఈశ్వరార్పిత చిత్తులగు ఉపాసకుల మతమున్ను సత్యమేయై యొప్పుచున్నది. వారు తమయందు తమయుపాస్యమగు ఈశ్వరుని పొందుచునేయున్నారు. గావున పైవాదివలె సర్వకర్తయగు ఈశ్వరుని బాధితునిగా నెఱుఁగరు.

అయం లోకః పరశ్చాస్తి స్నానాగ్న్యాది చ నేతరత్
ఏతదేతాదృశం సత్యం విద్ధి భావితభావనమ్. 14

ఓ రామచంద్రా ! 'ఇహలోకమువలె పరలోకమున్ను సత్యమైనదే. కావున తీర్థ, స్నాన, అగ్నిహోత్రాదులు నిష్ఫలములుకావు' అనునిట్టి ఆస్తికులయొక్క యుత్తమ భావనయు సత్యమనియే యెఱుఁగుము.

అశేషం శూన్యమేవేతి బౌద్ధానామేతదేవ సత్
లభ్యతే తద్విచారేణ యత్ర కించన నైవ హి. 15

ఈ జగత్తంతయు శూన్యమేయను బౌద్ధులయొక్క భావమున్ను వారి యనుభవమునుబట్టి సత్యమేయైయున్నది. ఏలయనిన. వారివిచారణచే శూన్యముతప్ప మఱియేదియు లభించుటలేదు.

చితిశ్చిన్తామణిరివ కల్పద్రుమ ఇవేప్సితమ్
ఆశు సంపాదయత్యన్తరాత్మనాత్మని భాత్మికా. 16

ఈ ప్రకారముగ చిదాకాశరూపమగు చైతన్యము చింతామణివలెను, కల్పవృక్షమువలెను జీవులకు వారి వారి అభిలషితములను శీఘ్రముగ వారియందు సిద్ధింపఁజేయుచున్నది.

నేదం శూన్యం న చాశూన్యమిత్యపస్తు న తద్విదామ్
సర్వశక్తిర్హి సా శక్తిర్న తద్విద్యత ఏవ తత్. 17

అట్లే 'ఈ జగత్తు శూన్యముకాదు, అశూన్యముకాదు, అనిర్వచనీయమైనదని' వచించు వారియొక్క భావమున్ను సత్యమైనదే. ఏలయనిన, సర్వశక్తివంతమగు బ్రహ్మముయొక్క మాయాశక్తి శూన్యముకాదు, బ్రహ్మముకాదు, రెంటికిని విలక్షణమై, అనిర్వచనీయమై యొప్పుచున్నది.

తస్మాత్స్వనిశ్చయే యస్మిన్యః స్థితః స తథా తతః
అవశ్యం ఫలమాప్నోతి న చేద్బాల్యాన్నివర్తతే. 18

కాఁబట్టి, ఎవఁడే నిశ్చయమందుండునో, అతడద్దానియొక్క ఫలమును మూర్ఖత్వముచే దానినుండి తొలఁగని పక్షమున - తప్పక బడయగలడు. (ఆత్మజ్ఞానమును బొందనంతవఱకే ఆ యా సిద్ధాంతములన్నియు సత్యములగును. పొందినపిదప ఆత్మయే సత్యముగాని మఱియొకటి కాదని భావము.)

విచార్య పణ్డితైః సార్ధం శ్రేష్ఠవస్తుని ధీమతా
స రూఢో నిశ్చయో గ్రాహ్యో నేతరత్ర యథా తథా. 19

అనేకమతములయొక్క కారణమును పండితులతోసహా బాగుగ విచారించి బుద్ధిమంతుఁడగువాఁడు శ్రేష్ఠమగు ఆత్మవస్తువునందే దృఢమగు నిశ్చయము గల్గియుండవలెను గాని మఱియొక దానియందుఁగాదు,

సంభవత్యుత్తమప్రజ్ఞః శాస్త్రతో వ్యవహారతః
యో యత్ర నామ తత్రాసౌ పణ్డితస్తం సమాశ్రయేత్. 20

శాస్త్రాధ్యయనమందును, ఉత్తమాచరణయందును మహాకుశలుఁడగు పండితుఁడెచటనుండునో వెతకి యాతనినే తెన్నుగ నాశ్రయింపవలెను.

సతాం వివదమానానాం సచ్ఛాస్త్రవ్యవహారిణామ్
యః సమాహ్లాదకో నిన్ద్యః స శ్రేష్ఠస్తం సమాశ్రయేత్ 21

సచ్ఛాస్త్రము ననుసరించి వ్యవహరించువారును, పరస్పరము విచారణసల్పుకొను వారునగు సజ్జనుల కాహ్లాదము గొల్పువాఁడును, నిషిద్ధాచరణ లేనివాఁడునగు మహాత్మునే యాశ్రయింపవలయును.

సర్వ ఏవానిశం శ్రేయో ధావన్తి ప్రాణినో బలాత్
పరినిమ్నం పయాంసీవ తద్విచార్య సమాశ్రయేత్. 22

జలము నిమ్నస్థలమునుగూర్చి పరువిడునట్లు సర్వజీవులును తమ తమ యభిలషితమును గూర్చి బలపూర్వకముగఁ బరువిడుచున్నారు. వానియందు పరమపురుషార్థసాధన మేదియై యుండునని విచారించి సచ్ఛాస్త్ర, సద్గురువులనే యాశ్రయింపవలయును.

కల్లోలైరుహ్యమానానాం నృణాం సంసారసాగరే
అజ్ఞాతా దివసా యాన్తి తృణానామివ బిన్దవః 23

తృణములయొక్క యగ్రభాగములందు సంలగ్నములైయుండు జలబిందువులవలె, ఈ సంసారసాగరమున మనోరథములను తరంగములచేఁ గొట్టుకొనిపోఁబడు జనులయొక్క అజ్ఞాత దివసములు సత్వరముగఁ జనుచున్నవి. (ఆయువు గడచిపోవుచున్నదిగావున శీఘ్రముగనే సద్గురువు నాశ్రమింపవలెననుట).

శ్రీరామ ఉవాచః—

జగత్పూర్వం లతేవాపి విశ్రాన్తా వితతే పదే
పూర్వాపరవిచారేణ కే పరాభావదర్శినః. 24

శ్రీరాముఁడు:– మహాత్మా! చిదాకాశమున జగద్రూపములగు అనేకశాఖలయొక్క ప్రసరణపూర్వకముగ అతివిస్తారముగ ప్రాణులయొక్క భోగతృష్ణ విశ్రమించియున్నదిగదా! అట్టిచో నీక జగత్స్వరూపానర్థముయొక్క పూర్వాపర విచారణచేతను, సారాసారముల వివేకముచేతను పరమార్థమును దర్శించినట్టి శ్రేష్ఠులగు మహాత్ములెచట నుందురు? (అతిదుర్లభులని భావము.)

శ్రీ వసిష్ఠ ఉవాచః—

జాతా జాతా కతిపయే వ్యపదేశ్యా భవన్తి తే
యేషాం యాన్తి ప్రకాశేన దివసా భాస్వతామివ. 25

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! దుర్లభులనుట సత్యమేగాని, ప్రయత్నరూపకముగ వెతకినచో నట్టి మహాత్ములు మనుష్యదేవతాది జాతులందచటచట జూపట్టుచునే యుందురు. అట్టి వారికి సూర్యునకువలె దినములు ప్రకాశమందే గడచిపోవును.

అధశ్చోర్ధ్వం చ ధావన్తశ్చక్రావర్తవివర్తనైః
సర్వే తృణవదుహ్యన్తే మూఢా మోహభవామ్బుధౌ. 26

మూఢులగు తక్కినవారందఱును మోహరూపమగు సంసారసాగరమున భోగరూపములగు చక్రావర్తములయొక్క పరివర్తనములచేతను, తృష్ణారూపములగు తరంగములచేతను క్రిందకును, పైకిని గొట్టుకొనిపోవుచున్నారు.

నష్టాత్మస్థితయో భోగవహ్నిషు ప్రజ్వలన్త్యలమ్
దేవా దివి దవేనాద్రౌ దహ్యమానా ద్రుమా ఇవ. 27

నశించిన ఆత్మస్థితి గలవారై దేవతలు పర్వతముపై దావాగ్నిచే వృక్షమువలె స్వర్గమున భోగాగ్నియందు లెస్సగ దహింపఁబడుచున్నారు.

పాతితా మదసంపన్నా దానవా దానవారిభిః
గజా ఇవ నిరాలానా ఘోరే నారాయణావటే. 28

కట్టుకంబమునకుఁ గట్టఁబడని మదపుటేనుఁగులు లోతైన గోతులందుఁ బడఁద్రోయఁబడునట్లు, మదోన్మత్తులగు రాక్షసులు తమశత్రువులగు దేవతలచే నారాయణుఁడను మహాగర్తమునఁ బడఁద్రోయఁ బడుచున్నారు.

న గన్ధమపి గన్ధర్వా దర్శయన్తి వివేకజమ్
గీతపీతపరామర్శాః సరన్తి హరిణా ఇవ. 29

ఇఁక గంధర్వులో, వివేకజనితమగు ఆత్మజ్ఞానముయొక్క లేశమైనను నెఱుఁగనివారై, గీతమను మద్యమును ద్రావి, తద్వశముచే హరిణములవలె, మృత్యువను వ్యాధుని చెంతకుఁ బరువిడుచున్నారు.

విద్యాధరాశ్చ విద్యానామధారత్వేన మోహితాః
స్ఫురితానాముదారాణామపి కుర్వన్తి నాదరమ్. 30

విద్యాధరులు భోగవిద్యలయొక్క యాధారత్వముచే మోహితులై, బ్రహ్మవిద్యాబలముచేఁ బ్రకాశించు ఉదారశీలురగు వివేకుల నాదరింపకున్నారు.

యక్షా విక్షోభితభువో దక్షతామక్షతా ఇవ
దర్శయన్త్యసహాయేషు బాలవృద్ధాతురేషు చ. 31

ఇఁక యక్షులో, భయ, జ్వర, ఉన్మాదాది దోషములను జనింపఁజేయుటద్వారా జనుల నివాసములను క్షోభపెట్టువారును, తమదేహములు స్థిరములని నమ్మువారును, అసహాయులై, మణిమంత్రాదిబల శూన్యులైనట్టి బాలురందును, వృద్ధులందును, అశక్తులందును తమ దక్షత్వమును జూపువారునై యున్నారు.

దన్తినామివ మత్తానాం రంహసా హరిణారిణా
కృతః కరిష్యసి త్వం చ రాక్షసానాం పరిక్షయమ్. 32

సింహము మదపుటేనుఁగుల వధించునట్లు, రాక్షసులకు శత్రుభూతుఁడైన విష్ణువు, ఉన్మత్తులగు ఆ రక్కసులను పూర్వమనేకపర్యాయములు సంహరించెను. ఇఁక ముందునునీవు సంహరింపగలవు.

భృశం పిశాచాః పశ్యన్తి భూతభోజనచిన్తయా
ధూమాన్ధకారానిలయా జ్వాలయాహుతయో యథా. 33

ధూమముయొక్క అంధకారముచేఁ బూర్ణములగు అగ్ని జ్వాలలందలి యాహుతులవలె పిశాచములు సదా ప్రాణులను భుజించుటఁ గూర్చిన చింతచే తమ్ము దహింపఁబడుచున్న వారినిగ వీక్షించుచున్నారు.

నాగజాలమృణాలాని మగ్నాని ధరణీతలే
నాగానామివ మూలాని జడానీవ స్థితాన్యలమ్. 34

ఇఁక నాగజాతియను మృణాలసమూహము (తామరతూళ్ళు)న్ను వృక్షమూలములవలె జడస్వరూపమై పాతాళమున వివేకశూన్యమై వసించుచున్నది.

వివరం శరణం యేషాం కీటానామివ భూతలే
తేషా మసురజాలానాం వివేకేషు కథైవ కా. 35

భూతలమున కీటములవలె శూన్యస్థానముల నాశ్రయించియుండు అసురులను బాలకులందిఁక వివేకముయొక్క ప్రసంగమే యెచట?

అల్పమాత్రకణార్థేన సంచరన్తి దివానిశమ్
పిపీలికాసధర్మాణః ప్రాయేణ పురుషా అపి. 36

చీమలవలె మనుజులున్ను అల్పమాత్రములైన విషయకణముల గూర్చిన లోభముచే ప్రాయః రాత్రిందినములు సంచరించుచున్నారు.

సర్వాసాం భూతజాతీనాం వ్యగ్రాణాం వ్యర్థదీర్ఘయా
క్షీబాణామివ గచ్ఛన్తి దివసాని దురీహయా. 37

వ్యర్థములైన మహాదుష్టచేష్టలచే వ్యాకులురగు సమస్తభూతజాతులయొక్క దివములు మద్యపుల దివసములవలె నిరర్థకముగ గడచిపోవుచున్నవి.

న కించిత్స్పంస్పృశత్యన్తర్వివేకో విమలో జనమ్.
జలేఽగాధే నిపతితం నిమజ్జన్తం రజో యథా. 38

అగాధజలమునఁబడి మునుఁగుచున్నవానిని ధూళి స్పృశించనట్లు నిర్మలమగు వివేకమొకింతైనను మనుజుని హృదయమును స్పృశించుట లేదు.

నీయన్తే నియమాధూతా మానవా మానవాయుభిః
కామ్పిక్తైః స్ఫుటతాపూతాః కిరాడు నికరా ఇవ. 39

చేటలచే ధాన్యమును తూర్పాఱఁబట్టునపుడు పొల్లంతయుగాలిచేఁ గొట్టుకొనిపోఁబడునట్లు దేహాదులందలి అభిమానమను వాయువులచేతను, నియమములచేతను జలింపఁబడినవారై జనులు కొట్టుకొనిపోఁబడుచున్నారు.

పానభోజనజమ్బాలే గహనే యోగినీగణాః
దుర్గన్ధపల్వలోద్గారే పతితాః పామరా ఇవ, 40

సురా. రక్తపాన, మాంసాది భోజనరూపమగు పంకముతో గూడినదై, తామసఫలభోగాసక్తిరూపమగు: దుర్గంధయుతమైనట్టి పల్వలము (మడుగు)న యోగినీగణములు (ఒకానొక స్త్రీదేవతా సమూహము) నికృష్టములగు కీటములవలెఁ బడియున్నవి.

కేవలం యమచన్ద్రేన్ద్రరుద్రార్కవరుణానిలాః
జీవన్ముక్తా హరిబ్రహ్మగురుశుక్రానలాదయః. 41

ప్రజాపతీనాం సప్తర్షిదక్షాద్యాః కశ్యపాదయః
నారదాద్యాః కుమారాద్యాః సనకాద్యాః సురాత్మజాః. 42

దానవానాం హిరణ్యాక్షబలిప్రహ్లాదశమ్బరాః
మయవృత్రాన్ధనముచి కేశిపుత్రమురాదయః. 43

విభీషణాద్యా రక్షస్సు ప్రహస్తేన్ద్రజిదాదయః
శేషతక్షకకర్కోటమహాపద్మాదయోఽహిషు. 44

దేవతలందు కేవలము యమ, చంద్ర, ఇంద్ర, రుద్ర, సూర్య, వరుణ, వాయు, బ్రహ్మ, విష్ణు, బృహస్పతి, శుక్రాచార్య, అగ్న్యాదులున్ను, ప్రజాపతులందు దక్ష, కశ్యపాదులున్ను, దేవర్షులందు నారదాదులున్ను, దేవపుత్రులందు కుమార, సనకాదులున్ను, దానవులందు హిరణ్యాక్ష, బలి, ప్రహ్లాద, శంబర, మయ, వృత్ర, అంధక, నముచి, కేశిపుత్ర, మురాదులున్ను, రాక్షసులందు విభీషణ; ప్రహస్త, ఇంద్రజిదాదులున్ను, నాగులందుశేష, తక్షక, కర్కోటక, మహాపద్మాదులున్ను మాత్రము జీవన్ముక్తులగు వివేకులైయున్నారు.

బ్రహ్మవిష్ణ్విన్ద్రలోకేషు వాస్తవ్యా ముక్తదేహినః
ముక్తస్వభావాస్తుషితాః సిద్ధాః సాధ్యాశ్చ కేచన. 45

బ్రహ్మ, విష్ణు, ఇంద్రలోకములందు వసించువారిలో, గొందఱు తుషితులు (దేవతావిశేషము) సిద్ధులు, సాధ్యులుగూడ జీవన్ముక్తులై, ముక్తస్వభావులై యున్నారు.

మానుషేషు చ రాజానో మునయో బ్రాహ్మణోత్తమాః
జీవన్ముక్తాః సంభవన్తి విరలాస్తు రఘూద్వహ. 46

రఘుకులతిలకుఁడవగు రామచంద్రా! అట్లే మనుష్యులందును రాజులు, మునులు, బ్రాహ్మణోత్తములు మున్నగువారు కొలఁదిమందిమాత్రము జీవన్ముక్తులై యొప్పుచున్నారు.

భూతాని సన్తి సకలాని బహూని దిక్షు
భోధాన్వితాని విరలాని భవన్తి కింతు
వృక్షా భవన్తి ఫలపల్లవజాలయుక్తాః
కల్పద్రుమాస్తు విరలాః ఖలు సంభవన్తి. 47

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే వివేకివిరలత్వవర్ణనం
నామసప్తనవతితమః సర్గః ॥ 97 ॥

ఓ రామచంద్రా! ఫలపల్లవాదులతోఁగూడిన వృక్షము లెల్లెడల గలవుగాని కల్పవృక్షములు మాత్రము బహుకొలఁదిగా నున్నవిధమున, దశదిశలందును ప్రాణికోట్లనేకులు గలరుకాని, అందు జీవన్ముక్తులైనవారు చాల యరుదుగానున్నారు.

ఇది శ్రీ వాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున వివేకవిరలత్వవర్ణనమను తొంబదియేడవ సర్గము ॥ 97 ॥

అష్టనవతితమః సర్గః

[లక్షణాన్యుపవర్ణ్యన్తే సతాం తత్త్వవిదామిహ
పరీక్ష్యోపేక్ష్య తద్దోషాన్కర్తవ్యశ్చ తదాశ్రయః.

సజ్జనులగు తత్త్వజ్ఞుల లక్షణములున్ను, పరీక్షించి, దోషయుక్తులనుపేక్షించి సత్పురుషుల నాశ్రయింపవలెనను విషయమున్ను నిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

వివేకినో విరక్తా యే విశ్రాన్తా యే పరే పదే
తేషాం తనుత్వమాయాన్తి లోభమోహాదయోఽరయః. 1

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! వివేకులును, విరక్తులును, పరమాత్మపదమున విశ్రమించువారునగు మహనీయులకు లోభమోహాది శత్రువులు తగ్గిపోవుదురు.

న హృష్యన్తి న కుప్యన్తి నావిశన్త్యాహరన్తి చ
ఉద్విజన్తేఽపి నో లోకాల్లోకాన్నోద్వేజయన్తి చ. 2

వివేకులగువారెపుడును అధికముగ; ప్రసన్నులుకారు; కోపగింపరు; దేనియందును ఆసక్తిగల్గియుండరు; భోగ్యపదార్థములను సంగ్రహింపరు; జనులవలన నుద్వేగము నొందరు, జనులనుద్వేగుల గావింపరు.

న నాస్తిక్యాన్న చాస్తిక్యాత్కష్టానుష్ఠానవైదికాః
మనోజ్ఞమధురాచారాః ప్రియపేశలవాదినః. 3

నాస్తికత్వముతోఁగూడి దురాచారముల నొనర్పరు; ఆస్తికత్వముతోగూడి అతిక్లేశకరములగు వైదిక కర్మానుష్ఠానమునఁ దత్పరులున్నుగారు; మనోహరమై, మధురమైనట్టి యాచరణ గలవారై ప్రియముగను, కోమలముగను వచించువారై చెన్నొందుదురు

సఙ్గాదాహ్లాదయన్త్యన్తః శశాఙ్కకిరణా ఇవ
వివేచితారః కార్యాణాం నిర్ణేతారః క్షణాదపి. 4

వివేకులు చంద్రకిరణములవలె తమ సాంగత్యముచే జనులకు నాహ్లాదము గొల్పుదురు. మఱియు లౌకిక, వైదిక కర్మలందు బరస్పర విరోధము తటస్థించినపుడు, నివారించి అనుష్ఠానసంకటము సంప్రాప్తింప, అపుడు జనుల సందేహమును. క్షణకాలములో నివారించి కర్తవ్య ... నిర్ణయించి చెప్పెదరు.

అనుద్వేగకరాచారా బాన్ధవా నాగరా ఇవ
బహిః సర్వసమాచారా అన్తః సర్వార్థశీతలాః. 5

మఱియు, ఉత్తమ బంధువులవలె ఉద్వేగరహితులును, ఆచారశీలురును, బాహ్యమున నందఱితోటి సమముగ సామాన్యాచరణ గలవారును, కాని అంతరంగమున సమస్తకార్యములందును ప్రశాంతముగ నుండు వారునై వెలయుదురు.

శాస్త్రార్థరసికాస్తజ్జ్ఞా జ్ఞాతలోకపరావరాః
హేయోపాదేయవేత్తారో యథా ప్రాప్తాభిపాతినః. 6

ఇంకను, వివేకులగువారు శాస్త్రార్థరసికులును, ఆత్మజ్ఞులును, జగత్తుయొక్క పూర్వాపరతత్వము తెలిసినవారును, గ్రాహ్యత్యాజ్యముల జ్ఞానము గలవారును, యథాప్రాప్తములగు కార్యముల నాచరించువారునై యుందురు.

విరుద్ధకార్యవిరతా రసికాః సజ్జనస్థితౌ
అనావరణసౌగన్ధ్యైః పరాస్పదసుఖాశనైః. 7

పూజయన్త్యాగతం ఫుల్లా భృఙ్గం పద్మా ఇవార్థినమ్
ఆవర్జయన్తి జనతాం జనతాపాపహారిణః. 8

శాస్త్రవిరుద్ధములగు కార్యములయెడల విరక్తిగలవారును సదాచారముయెడల ప్రీతిగల్గియుండు వారును, వికసించిన కమలము తుమ్మెదల సత్కరించునట్లు, ఉపదేశముచే హృదయకోశమును దెఱచుటద్వారా జ్ఞానోదయమను సుగంధములచేతను, ఉత్తమమగు ఆశ్రయ దానముచేతను, సుఖదాయకములగు భోజనములచేతను, స్వగృహమున కేతెంచిన అర్థిజనులను సత్కరించువారునై యొప్పుదురు, యొక్క పాపమును హరించునట్టి యా జ్ఞానులు తమయుత్తమగుణములచే సత్పురుషులను వశమొనర్చుకొందురు.

శీతలాస్పదవత్స్నిగ్ధాః ప్రావృషీవ పయోధరాః
భూభృద్భఙ్గకరం ధీరా దేశభఙ్గదమాకులమ్. 9

రోధయన్త్యాగతం క్షోభం భూకమ్పమివ పర్వతాః
ఉత్సాహయన్తి విపది సుఖయన్తి చ సంపది. 10

వర్షాకాలమందలి మేఘమువలెను, ఉద్యానాదులవలెను శీతల స్వభావయుతులును, భూకంపమును బర్వతములు నిరోధించునట్లు, రాజులయొక్క దేశములను భంగమొనర్చునట్టి మహామారీ, దుర్భిక్షాది ప్రయుక్తమగు జనక్షోభమును దమతపఃప్రభావముచేతను, సత్కర్మల ననుష్ఠింపఁజేయుటద్వారాను నివారించువారును, ఆపదలందుత్సాహము గొల్పువారును, సంపదలందు సుఖపెట్టువారునై జ్ఞానులు వర్తించుచుందురు.

చన్ద్రబిమ్బోపమాకారా దారా ఇవ గుణాకరాః
యశఃపుష్పామలదిశో ఖావిసత్ఫలహేతవః. 11

మఱియు వివేకులగు ఆత్మజ్ఞులు చంద్రబింబమువలె శీతలహృదయులును పతివ్రతా స్త్రీలవలె మాధుర్య, ప్రేమాదిగుణములకు నిలయులును, యశస్సను పుష్పములచే దిక్కులను ప్రకాశింపఁజేయువారును, భావికాల సత్ఫలములకు హేతుభూతులునై భాసిల్లుదురు.

పుంస్కోకిలసమాలాపా మాధవా ఇవ సాధవః

ఇంకను, అట్టి జ్ఞానులగు సాధువులు పురుష కోకిలవలె మధుర భాషులై వసంతర్తువు వలెఁ జెన్నొందుదురు.

కల్లోలబహులావర్తం వ్యామోహమకరాలయమ్. 12
లుఠన్తమివ హేమన్తం లోడయన్తం జనాస్పదమ్
వీచివిక్షోభచపలం పరచిత్తమహార్ణవమ్. 13
తచ్చ రోధయితుం శక్తాస్తటస్థాః సాధుపర్వతాః

అనేక మనోరథములను తరంగములచేతను, ఆవర్తములచేతను బూర్ణమైనదియు, వ్యామోహ మను మొసలికి స్థానభూతమైనదియు, కమలవనమును మధించు హేమంతమువలె జనుల నివాసస్థానమును మథించునదియు శోకమోహాదులను షడూర్ములవిక్షోభముచేఁ జంచలమైనది యునగు రాజాదులచిత్తమను మహాసముద్రమునున్ను సాధుపుంగవులు వివేకోపదేశాద్యుపాయ ములచే, తీరస్థపర్వతమువలె నిరోధింప శక్యులగుదురు.

ఆపత్సు బుద్ధినాశేషు కల్లోలేష్వాకులేషు చ. 14
సంకటేషు దురన్తేషు సన్త ఏవ గతిః సతామ్

కావున, ఆపదలందును, బుద్ధినశించునపుడును, జరామృత్యు శోకమోహాది షడూర్ముల యందును, వ్యాకులస్థితులందును, తదితర సంకటములందును దురంతములందును తత్త్వజ్ఞుఁడగు జ్ఞానియే జనులకు శరణ్యుఁడగును,

ఏభిశ్చిహ్నైరథాన్యైశ్చ జ్ఞాత్వా తానుచితాశయాన్. 15
ఆశ్రయేత్తైకవిశ్రాన్త్యై శ్రాన్తః సంసారవర్త్మనా
యస్మాదత్యన్తవిషమః సంసారోరగసాగరః. 16

ఇట్టివియు, తదితరములునునగు చిహ్నములచే విశాలహృదయులగు మహాత్ముల నెఱిఁగి సంసారమార్గముచే శ్రమగొనియున్నవాఁడు అద్వయమగు బ్రహ్మమందలి విశ్రాంతికొఱకై యట్టివారి నాశ్రయింపవలయును. ఏలయనిన, సంసారసాగరము సర్పమువలె నతిభయంకర మైనదిగదా!

వినా సత్సఙ్గమన్యేన పోతకేన న తీర్యతే

అట్టి సంసారసాగరము సత్సంగమనునోడచేఁ దప్ప మఱిదేనిచేతను దాటఁబడదు.

ఆస్తాం కిం మే విచారేణ యద్భవేదస్తు తన్మమ. 17
ఇత్యన్తః కల్కమాసాద్య న స్థేయం గర్తకీటవత్

'విచారణచే నేమి ప్రయోజనము? ఏదిమనదైయున్నదో, అది మనకగును' అనునిట్టి యలసత నంతఃకరణమున [illegible] కవలె నుండరాదు.

ఏకోఽపి విద్యతే యస్య గుణస్తం సర్వముత్సృజన్. 18
అనాదృత్యాన్యతద్దోషం తావన్మాత్రం సమాశ్రయేత్

పైనఁదెల్పిన యుత్తమగుణములం దొకటేని యెవని యందుండునో ఆయొక్కదాని కొఱకైనను ఇతరకార్యములన్నిఁటిని బరిత్యజించి, అతని అన్యదోషములను అనాదరించి (లక్ష్య పెట్టక) ఆతని నాశ్రయించియే తీరవలెను.

గుణాన్దోషాంశ్చ విజ్ఞాతుమాబాల్యాత్స్వప్రయత్నతః. 19
తథా సంభవసత్సఙ్గశాస్త్రైః ప్రాగ్ధియమేధయేత్
దోషలేశమనాదృత్య నిత్యం సేవేత సజ్జనమ్. 20

బాల్యకాలమునుండియు స్వప్రయత్నముచే గుణదోషముల నెఱుఁగుటకొఱకై యథా సంభవము సత్సంగ, శాస్త్రాభ్యాసములచే ప్రథమమున బుద్ధిని వృద్ధిపఱచవలెను. మఱియు దోష లేశముల ననాదరించి నిత్యము సజ్జనులను సేవింపవలయును.

స్థూలదోషం త్వనిర్వాణం శనైః పరిహరేత్క్రమాత్
యాతి రమ్యమరమ్యత్వం స్థిరమస్థిరతామపి. 21

పిమ్మట స్థూలదోషములుగల పరిజనులను క్రమముగ మెల్లగఁ బరిత్యజించవలెను. ఏల యనిన దుస్సాంగత్యముచే, శుద్ధచిత్తమున్ను మలినమగుచున్నది. మఱియు, స్థిరమగు విశ్రాంతి సుఖమున్ను చంచలమగుచున్నది.

యథా దృష్టం తథా మన్యే యాతి సాధురసాధుతామ్
ఏష సోఽత్యన్త ఉత్పాతో యః సాధుర్యాతి దుష్టతామ్. 22

దుస్సాంగత్యములే సాధువున్ను అసాధుత్వమును బొందునని నేనుదలంచెదను. ఏల యనిన, లోకమందట్లే గాంచఁబడుచున్నది. మఱియు, సాధువు దుష్టత్వము నొందుట జగత్తు యొక్క గొప్ప అని అనిష్టసూచకమైయున్నది.

దేశకాలవశాత్పాపైర్మహోత్పాతోఽపి దృశ్యతే
సర్వకర్మాణి సంత్యజ్య కుర్యాత్సజ్జనసంగమమ్
ఏతత్కర్మ నిరాబాధం లోకద్వితయసాధనమ్. 23

దేశకాలవశమున పాపములచే గొప్ప అరిష్టములు లోకమున సంభవించుట గాంచఁ బడుచున్నది. కావున సర్వకర్మలను త్యజించి సజ్జనసాంగత్యమునే యాచరింపవలయును. అట్టి కర్మయే బాధారహితమై, ఇహ, పరలోకములకును సాధనమై యొప్పుచున్నది.

న సజ్జనాద్దూరతరః క్వచిద్భవే
ద్భజేత సాధూన్వినయక్రియాన్వితః
స్పృశన్త్యయత్నేన హి తత్సమీపగం
విసారిణస్తద్గతపుష్పరేణవః. 24

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే సజ్జనసమాగమప్రశంసానామ అష్టనవతితమః సర్గ ॥ 98 ॥

ఓ రామచంద్రా! సజ్జనులనుండి యెన్నఁడును మనుజుఁడు దూరుఁడు కారాదు. నమ్రతాది గుణములతోఁ గూడినవాఁడై సాధువులను సేవింపవలయును. సాధుపురుషుల సమీపమున నున్నవారిని అప్రయత్నముగనే నలువైపులఁ బ్రసరించు యాతనియొక్క సద్గుణములను బుష్పముల యొక్క రేణువులు స్పృశించును.

ఇది శ్రీ వాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున సజ్జనసమాగమప్రశంసయను తొంబదియెనిమిదవ సర్గము ॥ 98 ॥

నవనవతితమః సర్గః

[కృమికీటపతఙ్గానాం తిర్యక్స్థావరజన్మనామ్
సంసారే యాదృశో భోగస్తత్సర్వమిహ వర్ణ్యతే.

కృమి, కీట, పతంగ, తిర్యక్, స్థావరజన్మలందుఁ బ్రపంచమున నెట్టి యనుభవముండునో యను విషయమిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీరామ ఉవాచ :—

సన్తి దుఃఖక్షయేఽస్మాకం శాస్త్రసత్సఙ్గయుక్తయః
మన్త్రౌషధితపోదానతీర్థపుణ్యాశ్రమాశ్రయాః. 1

కృమికీటపతఙ్గాద్యాస్తిర్యక్స్థావరజాతయః
కథం స్థితా కిమారమ్భాస్తేషాం దుఃఖక్షయం కథమ్. 2

శ్రీరాముడు;— మహాత్మా! మనుజులకైతే దుఃఖనివారణమునకై శాస్త్రాభ్యాస, సత్సంగ మంత్ర, ఔషధ; తప, దాన, తీర్థ, పుణ్యాశ్రమ సేవనాద్యుపాయములు గలవు. కాని, కృమి, కీట, పతంగ, తిర్యక్, స్థావరాది జాతులట్టియుపాయముల వేనినిగూడ నెఱుఁగక యున్నవిగదా! అట్టిచో నవి యెట్లు, జీవింపఁగల్గుచున్నవి? ఏ కార్యము లొనర్చుచున్నవి? వాటికి దుఃఖక్షయ మెట్లు కలుగును?

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

సర్వాణ్యేవేహ భూతాని స్థావరాణి చరాణి చ
ఆత్మోచితాయాం సత్తాయాం విశ్రాన్తాని స్థితాన్యలమ్. 3

శ్రీ వసిష్ఠుఁడు;—ఓ రామచంద్రా! సమస్త స్థావర, జంగమప్రాణులున్ను వానివానికి యోగ్యములైనట్టి భోగములయొక్క సుఖసత్తయందు స్థితిగల్గియున్నవి, మఱియు, యేదేది యేజన్మ పొందున్నదో, ఆ జన్మకుఁదగినట్టి విషయముయొక్క ప్రాప్తినే మహాపురుషార్థమని యెంచుచున్నది.

భూతానామణుమాత్రాణామప్యస్మాకమివైషణాః
కింత్వ[illegible]స్తేహం త్వచలసంనిభాః. 4

అట్టి యల్పప్రాణులకున్ను, మనకున్నుగూడ స్వస్వజన్మోచిత సుఖభోగేచ్ఛకలదుగాని, మనకట్టి భోగములందు అల్పవిశ్వాసమున్ను, కొలఁది విఘ్నములు మాత్రమే గలవు. వానికో కామ క్రోధాదులప్రాబల్యము చేతను, వివేకము లేనందువలనను అధికవిశ్వాసమున్ను, పర్వతమువలె గొప్పవియై, అనేకములైనట్టి విఘ్నములున్ను గలవు.

యథా విరాట్ ప్రయతతే వాలఖిల్యాస్తథైవ ఖే
బాలముష్ట్యల్పకాయేఽపి పశ్యాహంకృతి జృమ్భితమ్. 5

ఓ రామచంద్రా! బ్రహ్మాండశరీరుఁడగు విరాట్టు స్వభోగముకొఱకై యెట్లు ప్రయత్నించుచున్నాఁడో, అట్లే కేశాగ్రభాగమువలె సూక్ష్మములైనట్టి కృమికీటాది జీవులున్ను, బాలుని పిడికిటి యొక్క ఛిద్రముకంటెను నల్పమైనట్టి తమ గృహాకాశమునఁ బ్రయత్నించుచున్నవి. అహా! అహంకారముయొక్క ప్రతాపమును జూడుము!

జాయన్తే చ మ్రియన్తే చ నిరాధారేఽమ్బరే ఖగాః
శూన్యైకవిషయాస్తేషాం స్వాస్థ్యం న భవతి క్షణమ్. 6

కేవలము శూన్యములైనట్టి విషయములం దభిలాషగలవై, పక్షులు నిరాధారమగు ఆకాశమున జన్మించుచు మరణించుచునున్నవి. వానికి క్షణకాలమైనను శాంతి లభించుటలేదు.

పిపీలికాయాశ్చేష్టా భిర్గ్రాసావాసాత్మబన్ధుభిః
అస్మద్దివసకల్పోఽపి న పర్యాప్తః క్షణో యథా. 7

ధాన్యాది పదార్థకణ సంపాదనమందును, కుటుంబముయొక్క పాలన, పోషణాది క్రియలందును చీమలకు మన దివసమువంటి దీర్ఘకాలమున్ను క్షణమువలెఁ జాలకయేయున్నది.

త్రసరేణుప్రమాణాత్మా కృమ్యణుస్తిమినామకః
గమనే వ్యగ్రతా తస్య గరుడస్యేవ లక్ష్యతే. 8

త్రసరేణువువంటి యాకృతిగల అతిసూక్ష్మమైనట్టి తిమియను కృమియొక్క గమనమందును గరుత్మంతునియొక్క గమనమందువలె వ్యగ్రత్వము కానుపించుచున్నది.

అయం సోఽహమిదం తన్మ ఇత్యాకల్పితకల్పనమ్
జగద్యథా నృణాం స్ఫారం తథైవోచ్చైర్గుణైః కృమేః. 9

'వీఁడు వాఁడు, నేను, ఇది, నా గృహము, నాధనము, ఇత్యాది కల్పనారూపమగు జగత్తు గుణాతిశయములచే మనుజుల కెట్లు వర్ధినొందియున్నదో, అట్లే కృమికీటాదులకును వర్ధి నొందియున్నది.

దేశకాలక్రియాద్రవ్యవ్యగ్రయా జర్జరీకృతమ్
క్షీయతే వ్రణకీటానామస్మాకమివ జీవితమ్. 10

దేశకాలక్రియాద్రవ్యాది విషయములఁగూర్చిన చింతచే మనజీవితమెట్లు క్షీణించుచున్నదో, అట్లే వ్రణమందలి కీటములయొక్కయు జీవితముక్షీణించు చున్నది.

పాదపాః కించిదున్నిద్రా ఘననిద్రాః ఖరూపలాః
కృమికీటాదయః కార్యే నరవత్స్వప్న బోధినః. 11

వృక్షము లొకింత జాగరూకములై యున్నవి; శిలలు ఘోరనిద్రయందున్నవి; కృమికీటాదులు తమతమ కార్యములందు మనుజునివలె నొకింత జాగరూకములుగను, ఒకింత నిద్రాశీలములు గనునున్నవి.

శరీరనాశ వీవ్యైషాం సుఖం సంప్రతి దుఃఖకృత్
అస్మాకమివ తేషాం తజ్జీవితం తు సుఖాయతే. 12

మనకువలెనే యా కృమికీటాదులకును జీవితము సుఖముగను-మరణము దుఃఖముగనునున్నది.

జనో ద్వీపాన్తరం యాదృగ్విక్రీతః పరిపశ్యతి
పదార్థజాలం పశ్యన్తి తాదృక్పశుమృగాదయః. 13

ద్వీపాంతరమును బొందిన విక్రీతుఁడగు మనుజునివలె, పశుమృగాదులన్నియును పదార్థసమూహమును ఉదాసీనత్వముతోను ముగ్ధదృష్టితోను గాంచును.

అస్మాకమివ సంసార స్తిరశ్చాం సుఖదుఃఖదః
పదార్థప్రవిభాగేన కేవలం తే వివర్జితాః. 14

మనకువలెనే తిర్యగ్జీవులకును ఈప్రపంచము సుఖదుఃఖప్రదమైయున్నది. కాని పదార్థముల గుణక్రియోపయోగాది విభాగమునవి చేయఁజాలని వైయున్నవి. కేవల మింతే భేదము.

హృదయాత్సుఖదుఃఖాభ్యాం నాసాతో రశనాగుణైః
పశవః పరికృష్యన్తే విక్రీతాః పామరా అపి. 15

విక్రీతులగు పామరజనులవలె, పశువులును ముక్కుత్రాటిద్వారా (బంధింపఁబడిన త్రాడు ద్వారా) అంతఃకరణమున సుఖదుఃఖములచే నీడ్వఁబడుచున్నవి.

సుప్తానాం యాదృగస్మాకం వేదనం స్పృష్టసుత్వచామ్
వృక్షగుల్మాఙ్కురాదీనాం తాదృగుద్ధామవేదనమ్. 16

సుకుమారమగు చర్మముగలిగియున్నట్టి మనకు సుఖనిద్రయందు శీతోష్ణమశకాదులవలన నెట్టి మహాదుఃఖవేదనము కలుగునో, అట్లే వృక్ష, గుల్మ, అంకురాదులకును కృమికీటాదులచేఁ గావింపఁబడు దంశనము(కాటు)లందు అధికదుఃఖవేదనము గలుగును,

యాదృగస్మాకమిత్యర్థ క్రమసంసారపాతినామ్
పదార్థవేదనం తాదృక్తిరశ్చాం భ్రాన్తమభ్రమమ్. 17

దేశక్షోభాదులవలనఁ బరుగిడుటమున్నగు క్రియలాచరించునపుడు కుశకంటకాది బాధామయమగు సంసారమునఁబడిన మనకు సర్వత్రభయపూర్వకమగు పదార్థవేదన మెట్లు కలుగునో, అట్లే పక్షి, సర్పాది తిర్యగ్జీవులకును గలుగును.

అహ్లాదమాత్ర సామ్యత్వం సుఖతశ్చేన్ద్రకీటయోః
సమం వికల్పవిన్ముక్తం వికల్పస్త్వనతిక్రమః. 18

విక్షేపానుభవములను వదలినచో, సామాన్యమగు ఆనందమందును, ఆహారనిద్రాది సుఖములందును ఇంద్రునకును, కీటమునకును మనఃప్రసన్నత సమానమేయగును. విక్షేపమైతే యిరువురికిని నతిక్రమింప కష్టసాధ్యమేయైయున్నది.

రాగద్వేష భయాహార మైథునోత్థం సుఖాసుఖమ్
తిరశ్చాం జన్మమృత్యాదిభేదః కశ్చిన్న విద్యతే. 19

రాగ, ద్వేష, భయ, ఆహార, మైథున జనితములగు సుఖదుఃఖములందును. జననమరణాది భేదమందును ఇంద్రునకును, కీటమునకును ఏ భేదమున్నులేదు.

ఋతే పదార్థభూతార్థభవిష్యద్వస్తు బోధతః
శేషం బభ్రువ్యహిగోమాయుగజాదీనాం నృభిః సమమ్. 20

శాస్త్రగమ్యములగు పుణ్య, పాప, బ్రహ్మతత్త్వాదుల జ్ఞానమును, భూతభవిష్యత్పదార్థ జ్ఞానమున్నుదప్ప నకుల (ముంగిస), సర్ప, శృగాల (నక్క), గజాదిపశువులన్నిటికిని తక్కిన జ్ఞానము మనుజునితోటి సమానముగనే యున్నది.

నిద్రామయానాం వృక్షాణాం స్వసత్తామచలాదయః
స్థితా అనుభవన్త్యోఽన్యే చిదాకాశమఖణ్డితమ్. 21

నిద్రాగ్రస్తములగు వృక్షములయొక్క గాఢమైన అజ్ఞానముతోఁగూడిన స్వసత్తను పర్వతాదు లనుభవించుచున్నవి. హిమాలయ మేర్వాది తత్త్వజ్ఞ పర్వతములైతే అఖండచిదాకాశము ననుభవించుచున్నది.

అపీననిద్రా వృక్షాద్యాః స్వసత్తాస్థాస్తథాద్రయః
జఙ్గమాని చిదాకాశం నామ కించిత్క్వదాచన. 22

వృక్షాదులు గాఢనిద్రయందున్నవి; పర్వతాదులు అజ్ఞానయుక్తమగు స్వసత్తయందున్నవి; జంగమజాతులందు తత్త్వజ్ఞులు చిదాకాశమాత్ర స్వరూపులైయున్నారు. కావున, ఈ జగత్కల్పన వీరందఱిదృష్టిచేఁ గావింపఁబడినదికాదు. ఇఁక జంగమజాతులందుఁ దక్కినవారగు కొందఱికి మాత్రము స్వప్నమందు అర్ధవికాసముతోను, జాగ్రత్తునందుఁ బూర్ణవికాసముతోను బొసించు ఒకింత జగత్తైనను పెక్కురి దృష్టిననుసరించి చిదాకాశమనుటయే యుక్తమగును.

అఖణ్డచిత్తా శైలాదిసత్తా నిద్రా చ భూరుహామ్
ద్వైతోపలమ్భముక్తత్వాత్థమేవైకమతో జగత్. 23

పర్వతాదుల అఖండసత్తయు, వృక్షాదుల నిద్రాసత్తయు ద్వైతానుభవ రహితమగుటచే వానిదృష్టిచే జగత్తంతయు, ఏకమైనట్టి అజ్ఞానోపహిత చిదాకాశమాత్రమే యైయున్నది.

పరిజ్ఞాతం జగద్యావదపరిజ్ఞాన సంయుతమ్
న త్వం నాహం న చైవాస్తి నాస్తి న చ భవిష్యతి. 24

ఓ రామచంద్రా ! ఆత్మతత్త్వజ్ఞాన మెంతవఱకు కలుగకుండునో, అంతవఱకీజగత్తుండును. కలిగినపిమ్మట, ఈ జగత్తుగాని, నీవుగాని, మఱియెవరుగాని, నేనుగాని, భూతభవిష్యద్వర్తమానములం దెపుడునులేకయే యుందుము.

యథా స్థితం సద్వైవేదం మౌనమేవ శిలాఘనమ్
అనాద్యన్తమవిచ్ఛిద్రమనిద్రం చ సనిద్రకమ్. 25

వాస్తవముగ ఈ జగత్తు అనాదియై, అనంతమై, అపరిచ్ఛిన్నమై, అజ్ఞాన నిద్రారహితమై, మౌనసదృశమై, శిలవలె చిద్ఘనమై, యథాస్థితముగ వెలయుచున్నట్టి చిదాకాశమేయైయున్నది. అజ్ఞాని యొక్క దృష్టిచే స్వప్నమువలె నిజస్వరూపముననే యీ జగద్వైచిత్ర్యము కల్పింపఁబడినదగును.

పూర్వం సర్గాద్యథైవాసీత్తథైవైకం సమస్థితమ్
భవిష్యత్యధునానన్తం కాలమేవం తథైవ చ. 26

పరమార్థమున ఈ సృష్టి పూర్వమెట్లుండెనో, ఇపుడును నట్లే సమముగను, ఏకరూపముగను నున్నది; ఇఁక ముందును అనంతకాలమువఱ కట్లే యుండఁబోవును.

నైవాత్మతా న పరతా న జగత్తా న శూన్యతా
న మౌనతా న మౌనిత్వం కించిన్నేహోపపద్యతే. 27

అట్టి శుద్ధచిన్మాత్రమున నిజత్వముగాని, పరత్వముగాని, ప్రపంచత్వముగాని, శూన్యత్వముగాని, మౌనత్వముగాని, మౌనిత్వముగాని యేదియు తగదు.

త్వం యథాస్థితమేవాస్స్వ యథాస్థితమహం స్థితః
సుఖాసుఖే పరాకాశే శాన్తే నేహాస్తి కించన. 28

ఓ రామచంద్రా ! నీవు, నేను, ఈ సమస్తమున్ను యథాస్థితమగు బ్రహ్మము మాత్రమేయై యున్నాము. ఈ శాంతమగు చిదాకాశమున సుఖదుఃఖము లెవ్వియును లేనివైయున్నవి.

పరమాకాశతాం ముక్త్వా కిం స్వప్ననగరే వద
విద్యతే కిల తచ్ఛాన్తం చిద్వ్యోమాచ్ఛమనామయమ్ 29

ఓ రాఘవా ! స్వప్ననగరమున పరమాకాశముతప్ప అన్యమేదిగలదో చెప్పుము; కావున, ఏది కలదో యది శాంతమై, నిర్మలమై, నిర్వికారమైనట్టి చిదాకాశమే యైయున్నది.

అపరిజ్ఞప్తిరేవైకా తత్ర సంభ్రమకారిణీ
పరిజ్ఞాతమిదం యావద్విద్యతే సాపి న క్వచిత్. 30

అట స్వప్నమున అజ్ఞాన మొకటియే భ్రమను గలిగించుచున్నది. జ్ఞానము కలిగిన పిమ్మట అదియు నెచటను లభించుటలేదు.

పరిజ్ఞాతే జగత్స్వప్నే యావత్సత్యం న కించన
గ్రహస్తదేనం ప్రతి కిం స్నేహో వన్ధ్యాసుతే తు కః 31

అట్లె జగత్తను స్వప్నమున్ను నెఱుఁగఁబడిన పిదప అందు సత్యత్వ మెద్దియు గానఁబడుటలేదు. అట్టిచో నిఁక సద్దానియం దాసక్తియేల? వంధ్యాపుత్రునియెడల స్నేహమేమి?

స్వప్నకాలే పరిజ్ఞాతే జగత్స్వప్నమణావణౌ
కిముపాదేయతా కాస్థా ప్రబోధేఽసౌ న కించన. 32

జగత్తను స్వప్న మెఱుఁగఁబడ, ప్రతి పరమాణువందును సంభావ్యమగు అజగత్తను స్వప్న రూపమగు మణియందిఁక గ్రాహ్యబుద్ధియేమి? ఆసక్తియేమి? ఏలయనిన, ఆత్మజ్ఞానస్థితి యను జాగ్రత్తు నందిది యెద్దియును లేకయుండును.

యన్న కించిత్ప్రబోధోఽస్తి నాప్రబోధోఽస్తి తత్క్వచిత్
యస్తూపలమ్భస్తత్కాలే పూర్వావస్థైవ సా తథా. 33

ఏది (జగత్తు) ప్రబోధకాలమున లేనిదైయున్నదో, అది అప్రబోధకాలమందును వాస్తవముగ నెచటను లేనిదేయగును. అజ్ఞానమే యట్లు జగదనుభవరూపముగ భాసించుచున్నదగును.

విద్యతే వర్తమానత్వం భవిష్యద్భూతతా తథా
బోధాబోధశ్చ నో సత్యం వస్తు శాన్తం కిలాఖిలమ్. 34

భూతభవిష్యద్వర్తమానములున్ను, జ్ఞానాజ్ఞానములున్నుగూడ యథార్థముగ లేనివైయున్నవి. అంతయు శాంతమగు పరమాత్మవస్తువేయై యున్నది.

యథోర్మిణోర్మ్యా నిహతే న కాచిత్పయసాం క్షతిః
తథా దేహేన నిహతే దేహే నాస్తి చితేః క్షతిః. 35

తరంగముచే తరంగము నశింపఁబడినను జలమునకు హానిలేనట్లు, దేహముచే దేహము నశింపఁబడినను, అధిష్ఠానమగు ఆత్మ కేహానియున్ను లేదు.

చితావకాశ ఏవాహం దేహ ఇత్యుపజాయతే
సంవిదేవ తతో దేహే నష్టే కిం నామ నశ్యతి. 36

ఆకాశరూపమగు చైతన్యమందే 'నేనుదేహమును' అను భ్రాంతిజ్ఞాన ముత్పన్నమగుచున్నది. కావున నట్టి భ్రాంతిజ్ఞానరూపమగు దేహము నశింప, అచైతన్యమున కేమి నశించుచున్నది?

ప్రబుద్ధస్యైవ చిద్వ్యోమ్నః స్వప్నో జగదితి స్థితమ్
పృథ్వ్యాదిరహితం యస్మాత్తస్మాత్స్వప్నాత్మకం జగత్. 37

ప్రబుద్ధమగు చిదాకాశముయొక్క స్వప్నమే జగద్రూపమున స్థితినొందియున్నది. కాఁబట్టి జగత్తు పృథ్వ్యాదిరహితమై స్వప్నరూపమై వెలయుచున్నది.

సర్గాదౌ పూర్వచిత్స్వప్నాజ్జాతా పృథ్వ్యాదివస్తుధీః
స్వప్నార్థే సత్యతాభ్రాన్తిః కల్పనామాత్రరూపిణీ. 38

సృష్ట్యాదియందు, పూర్వపూర్వచిత్ - స్వప్న సంస్కారముచే పృథివ్యాదులందు వస్తుబుద్ధి యేర్పడినది. మఱియు, స్వప్నపదార్థములందలి సత్యత్వమును గూర్చిన భ్రాంతికల్పనామాత్రమే యగును,

పూర్వాత్పూర్వతరస్యాస్య స్వప్నస్యావయవస్థితా
సత్యేవాసత్యరూపాయాం పృథ్వ్యాదికలనా కృతా. 39

ఈప్రకారముగ, అనాది ప్రవాహరూపమగు స్వప్నముయొక్క అవయవరూపమై, అసత్య మైనట్టి యీ జగత్స్థితియందు సత్యమైనదానివలె పృథ్వ్యాదుల కల్పనను మూఢులు గావించిరి.

సా చ భ్రాన్తిస్తథా రూఢా యథాఽసత్యైవ సత్యతామ్
పరమామాగతా తత్తు సత్యమత్యన్త నిర్మలమ్. 40

అసత్యము సత్యరూపముగ దృఢపడునట్లు. ఆ భ్రాంతియు నవ్విధమున బాగుగ దృఢపడిన దాయెను. మఱియు దేనియందిదియంతయు, గల్పింపఁబడినదో, అట్టి పరమార్థసత్యమగు బ్రహ్మతత్త్వమైతే అత్యంతనిర్మలమైయే వెలయుచున్నది.

వస్తుతస్తు యథాభూతం చిద్బ్రహ్మైవాతతం స్థితమ్
న చ తత్సంస్థితం కించిత్స్మర్తాస్మర్తా కిమాత్మకః. 41

వాస్తవముగ ఈ పృథ్వ్యాదులెవ్వియు పూర్వమున్న స్థితినొందియుండి యుండలేదు, యథా రీతి చిద్రూపమగు బ్రహ్మమేయంతటను వ్యాపించియున్నది. అట్టిచో ఆ పృథ్వ్యాదుల యను భవమును స్మరించువాఁడుగాని; విస్మరించువాఁడుగాని యెట్లుండఁగలఁడు?

ఏవం మాత్రాపరిజ్ఞానమేవాత్ర ప్రతిబోధకమ్
అత్రైవ తు పరిజ్ఞానం కవాటప్రవిఘాటనమ్. 42

చిన్మాత్రమునుగూర్చిన అజ్ఞానమే జగత్తుయొక్క సత్యత్వమను భ్రాంతినిగలుగఁ జేయునదైయున్నది. అద్దాని పరిజ్ఞానమే తద్భ్రాంతిరూపమగు కవాటమును దెఱచునదగుచున్నది.

పారిశేష్యాన్న పృథ్వ్యాది కించిత్సంభవతి క్వచిత్
యో ద్రష్టా యచ్చ వా దృశ్యం విమలం శివమేవ తత్ 43

కార్యసహితముగ అజ్ఞానము బాధింపఁబడుటబట్టి చిన్మాత్రమే పరిశేషించుటచే, పృథ్వ్యాదు లెవ్వియు నెచటను సంభవింపనేరవు. కావున, ఎదిద్రష్టయో, ఏదిదృశ్యమో యారెండును పరమార్థమున నిర్మల శివరూపమేయైయున్నవి

ముకురేఽన్తర్యథా బిమ్బాద్బిమ్బం భాతి జగత్తథా
చిద్వ్యోమని స్వతో భాతమబిమ్బాదేవ బిమ్బితమ్. 44

అద్ద మందు బాహ్యబింబమువలన ప్రతిబింబము భాసించునట్లు, చిదాకాశమందు బాహ్య బింబములేకయే జగత్తుస్వయముగ ప్రతిబింబించినదై భాసించుచున్నది.

ముకురేఽన్తర్యథా బిమ్బం న దృష్టమపి కించన
తథా చిద్వ్యోమగం విశ్వం న దృష్టమపి కించన. 45

అద్దమందు బింబమెద్దియుఁ గాంచఁబడనట్లు, చిదాకాశమునను జగత్తేదియు నెపుడును గాంచఁబడలేదు.

లభ్యతే యద్విచారేణ యత్ప్రకారణకం స్థితమ్
తత్ప్రచ్ఛేషం తు భామాత్రమభూతం సత్కథం భవేత్. 46

ఏ పదార్థము ప్రమాణసహితమైయున్నదో, ఆదియే విచారణచే లభించును. మఱియు నదియే పరమార్థసత్యమగును. ప్రమాణరహితమైనది కేవలము ప్రతిభాసమాత్రమై, త్రికాలము లందును లేనిదగును. అట్టిది పరమార్థ సత్యమెట్లగును.

భవేద్భ్రమాత్మకమపి కించిదర్థక్రియాకరమ్
స్వప్నాఙ్గనాపి కురుతే సత్యామర్థక్రియాం నృణామ్. 47

అసత్యరూపిణియగు స్వప్నస్త్రీయు జనులకు వీర్యపాతమను సత్యక్రియ నొనర్చునట్లు, భ్రమమయమగు పదార్థమున్ను అర్థక్రియాసమర్థమగుచున్నది.

యత్తద్భానం తు సా చిద్భా పరమం తచ్చిదమ్బరమ్
ఇతి క్వాహం క్వ విశ్వశ్రీః క్వ త్వం దృశ్యదృశశ్చ కాః. 48

ఈ జగత్తుయొక్క భానము (ప్రకాశము, సత్త) యేదిగలదో, అదియంతయు చిదాకాశము యొక్కయే ప్రకాశమైయున్నది. కాఁబట్టి నేనెచట? నీవెచట? జగత్తెచట? దృశ్యదృష్టి యెచట?

మృత్వా పునర్భవనమస్తి కిమఙ్గ నష్టం
మృత్వా న చేద్భవనమస్తి తథాపి శాన్తిః
విజ్ఞానదృష్టివశతోఽస్త్యథ చేద్విమోక్ష
స్తన్నేహ కించిదపి దుఃఖముదారబుద్ధేః. 49

ప్రియుఁడవగు రామచంద్రా! విజ్ఞానదృష్టి ననుసరించి ఆత్మయుత్పత్తి నాశరహితమని యుదారబుద్ధివగు నీకిపుడు వచింపబడియున్నందున, మరణానంతరము మరల దేహముత్పన్న మగునని యొకవేళ యెంచినను ఆత్మకేమి హానిగలదు? మఱియు నొకవేళ, మరణానంతరము పునర్జన్మలేదు, మోక్షమేగలదని తలంచినను నపుడును సర్వప్రపంచ శాంతియే సిద్ధించును. గాన ఏ విధముగఁ జూచినను నిట నొకింతైనను దుఃఖము లేకయేయున్నది.

మూర్ఖస్య యాదృశమిదం తు తదజ్ఞ ఏవ
జానాత్యసౌ నహి వయం కిల తత్ర తజ్జ్ఞాః
మత్స్యో హి యో మృగనదీసలిలే స ఏవ
జానాతి తచ్చపలవీచి వివర్తనాని. 50

మూర్ఖున కేజననమరణముల యనుభవ మగుచున్నదో 'దాని నాతఁడే యెఱుఁగునుగాని. మనకు దానిఁగూర్చి యేమియును దెలియదు. ఏలయనిన, ఎవఁడు మృగతృష్ణానదీజలమున 'నేను మత్స్యమును' అని యిట్లు మత్స్యభావన ననుభవించునో, అతఁడే తన్నదీతరంగములయొక్క పరివర్తనము నెఱుఁగునుగాని తన్మృగతృష్ణా నదీభ్రాంతిరహితుఁడగు అన్యుఁడుకాదు,

అన్తర్బహిస్తమహమిత్యపి చైవమాది
సర్వాత్మకం తపతి చిన్నభ ఏకమేవ
శాఖాశిఖా విటపపత్రఫలైక దేహః
సంకల్పవృక్ష ఇవ బోధఖ మాత్రసారః. 51

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పరమార్థ నిరూపణం
నామ నవనవతితమః సర్గః ॥ 99 ॥

ఓ రామచంద్రా ! మనోరాజ్యమున, చిదాకాశమాత్ర సారమగు ఆత్మయే శాఖాపత్రపుష్ప ఫలాదిరూపమైన ఏకదేహమగు సంకల్పవృక్షమై యెట్లు స్ఫురించుచున్నదో, అట్లే తత్త్వజ్ఞాని యొక్క దృష్టిచే బాహ్యాభ్యంతరములందును చిదాకాశమొకటియే 'నీవు, నేను' ఇత్యాది సర్వజగద్రూపమై, స్ఫురించుచున్నది.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
పరమార్థనిర్వాణమను దొంబదితొమ్మిదవ సర్గము ॥ 99 ॥

శతతమః సర్గః

[దేహాత్మవాద్యాదిమతే నివిష్టానాం మతేరపి
యథాతత్త్వేఽవతారః స్యాత్తథా యుక్తిరిహోచ్యతే.

దేహాత్మవాదులు మున్నగువారి మతమునఁ బ్రవేశించిన బుద్ధియొక్కయు బ్రహ్మతత్త్వమున నెట్లు ప్రవేశము సంభవించునో, ఆ యుక్తి యిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీరామ ఉవాచః—

యుక్తిః స్యాత్కీదృశీ బ్రహ్మన్సంసారే దుఃఖశాన్తయే
తేషాం యేషామయం పక్షం శ్రూయతాముచ్యతాం తతః. 1

శ్రీరాముఁడు:— మహాత్మా ! నేనిపుడు వచింపఁబోవుచున్న దానిని విని, అట్టి మతము గల వారికిప్రపంచమున దుఃఖశాంతికై యేమి యుక్తిగలదో యాపిమ్మట వచింపప్రార్థన.

యావజ్జీవం సుఖం జీవేన్నాస్తి మృత్యురగోచరః
భస్మీభూతస్య శాన్తస్య పునరాగమనం కుతః. 2

'ఎంతవఱకు జీవితముండునో, అంతవఱకు సుఖముగా జీవింపవలయును. మృత్యువు ప్రత్యక్షమైయున్నది. భస్మీభూతమై శమించునట్టి దేహమునకు మరల రాక యెచట?" – ఇట్టి మతముగలవారి దుఃఖమెట్లు శమించును?

శ్రీ వసిష్ఠ ఉవాచః—

యం యం నిశ్చయమాదత్తే సంవిదన్తరఖణ్డితమ్
తత్తథైవానుభవతి ప్రత్యక్షమితి సర్వగమ్. 3

శ్రీవసిష్ఠుఁడు.- ఓ రామచంద్రా! ఏయే నిశ్చయమును సంవిత్తు తనయందు బూర్ణముగ ధరించునో, ఆయానిశ్చయమునట్లే యది యనుభవించుచుండుట సర్వులకును స్వానుభవసిద్ధమై యున్నది.

యథా ఖం సర్వగం శాన్తం తథా చిద్వ్యోమ సర్వగమ్
తదేవైక్యమథ ద్వైతమన్యార్థస్యాత్యసంభవాత్. 4

ఆకాశమువలె చిదాకాశము సర్వవ్యాపకమై, శాంతమైయున్నది. పామరులగు చార్వాకాదులచేఁ గల్పితమగు దేహాదద్వైతమున్ను, జ్ఞానులయొక్క అనుభవసిద్ధమగు అద్వైతమున్ను నంతయు ఆ చిదాకాశమేయైయున్నది. ఏలయనిన, అద్దానికంటె భిన్నమగునది యెద్దియు సంభవింపనేరదు.

సర్గాదౌ తదృతేఽన్యోఽర్థో మహాప్రలయరూపిణి
అకారణత్వాన్నాస్త్యేవ బ్రహ్మైవేదమతస్తతమ్. 5

సృష్టికిఁ బూర్వము అద్వితీయ బ్రహ్మరూపమగు మహాప్రళయమున బ్రహ్మముకంటె [illegible] వేవస్తువున్ను లేదు. ఆ బ్రహ్మమునకు వేఱొక కారణమున్ను లేదు. కావున సర్వత్ర బ్రహ్మమే [illegible]ించి యున్నదగను

సమస్తవేదశాస్త్రార్థం యే మహాప్రలయాది చ
నేచ్ఛన్తి తే మహామూఢా నిఃశస్త్రా నో మృతా ఇవ. 6

సమస్త వేదశాస్త్రములయొక్క తాత్పర్యభూతమగు బ్రహ్మమును, మహాప్రళయాదులను. తద్బ్రహ్మప్రాప్తిరూపమగు మోక్షమును, తత్సాధనములను నెవరిచ్ఛగింపరో, అట్టి శాస్త్రశూన్యులగు మహామూఢులు మాదృష్టియందు మృతప్రాయులే యగుదురు. అట్టివారు తత్త్వోపదేశమున కర్హులుకారు.

సర్వశాస్త్రావిరుద్ధేన సర్వం బ్రహ్మేదమిత్యలమ్
స్థితం సానుభవం యోక్త్ర్యేషాం తైర్న కథాక్రమః. 7

ఇఁక, సమస్తదేహేంద్రి యాదులయొక్క ప్రవర్తకమగు ప్రత్యగాత్మ చైతన్యముగాని, మనస్సుగాని, సర్వశాస్త్రానుసారము కేవలమొక బ్రహ్మమేయను నిట్టియనుభవముచే నెవరు పూర్ణకాములై కృతకృత్యులైయుందురో, అట్టివారి కొఱకును గాదు ఉపదేశ క్రమము; కేవలము జిజ్ఞాసువుల కొఱకు మాత్రమేయగును.

నిత్యా నిరన్తరోదేతి యాదృశీ సంవిదాశయే
భూయతే తన్మయేనైవ పుంసా దేహోఽస్తు మాథవా. 8

నిత్యమై, అపరోక్షమైనట్టి సంవిత్తు, అంతఃకరణమున నెవ్విధముగనుదయించునో అవ్విధముగనే జీవుఁడనుభవించును. దేహమున్ననుసరి లేకున్ననుసరి.

బోధాచ్చేత్సంవిదో జాతః స దుఃఖి పురుషో భవేత్
విరుద్ధం వేదనం యావత్తావజ్జీవోఽగ్ని తన్మయః. 9

కావుననే, ఓ రామచంద్రా! ఆనందస్వరూపమగు ఆత్మకు విరుద్ధముగ నెవఁడు అంతఃకరణ వృత్తిచే 'నేనుదుఃఖి' అని దృఢముగ నిశ్చయించుచున్నాఁడో అతఁడట్టి భావముతోటి తన్మయుడై అవశ్యము దుఃఖమునే యనుభవించుచున్నాఁడు.

జగచ్చిద్వ్యోమకచనమాత్రమేవేతి భావితే
తత్కథం వేదనం వ్యోమ్నా బోధః కస్య కుతో భవేత్. 10

'జగత్తు చిదాకాశము యొక్క స్ఫురణమాత్రమైయున్నది.' అని యిట్లు దృఢముగ నిశ్చయించినచో కూటస్థమై, అద్వయమైనట్టి యాచిదాకాశమువలననిఁక దుఃఖానుభవమెవనికి నెట్లు కలుగును?

న కానిచిత్ప్రధావన్తి ఏకనిశ్చయసంవిదామ్
పుంసాం సుఖాని దుఃఖాని రజాంసి నభసామివ. 11

ఆకాశమును ధూళి అంటనట్లు, ఏకమైనట్టి సంవిత్తు (చైతన్యము, లేక, జ్ఞానము) మాత్రము గలదను నిశ్చయముగలవారిని సుఖదుఃఖములెవ్వియు నంటనేరవు.

సంవిత్సత్యాస్త్వసత్యా వా నిశ్చయస్తావదీదృశః
ఆబాలమేతత్సంసిద్ధం కేనాపహ్నూయతే కథమ్. 12

సంవిత్తు సత్యమైనను అసత్యమైనను, నగుగాక! కాని, సత్పదార్థములయొక్కయు అసత్పదార్థముల యొక్కయు ననుభవమెయ్యది ఆబాల గోపాలము ప్రసిద్ధమై యున్నదో, దాని నెవఁడెట్లు కాదనఁగలడు?

న దేహః పురుషో వాపి జీవోఽన్య ఉపలభ్యతే
సంవిత్సర్వమిదం సాతు యథా వేత్తి తథా జగత్. 13

దేహాత్మవాదుల దేహమున్ను, సాంఖ్యుల పురుషుఁడున్ను, మీమాంసకుల జీవుఁడున్ను అట్టివేయగు తదితరములున్ను సంవిత్తుకంటె వేఱుగనొకింతైనను లభించుటలేదు. కావున సర్వవాదుల యొక్క యభీష్టము సంవిత్తేయగుచున్నది. ఆ సంవిత్తు ఎట్లెఱుఁగుచున్నదో, అట్లే యీ జగత్తుయొక్క యనుభవము జీవునకుఁ గలుగుచున్నది.

సా సత్యాప్యథవాసత్యా తయా దేహోఽను భూయతే
స్వాతన్త్ర్యేణ యథా స్వప్నే పాతాలే ఖే జలే దివి. 14

ఆ సంవిత్తు సత్యమైనను, అసత్యమైనను నగుగాక! కాని స్వకల్పనా మాత్రముచే నయ్యది స్వప్నమందువలె పాతాళ, ఆకాశ, జల, స్వర్గాదులందును దేహాదుల ననుభవించుచు నేయున్నది.

సంవిత్సత్యాస్త్వసత్యా వా తావన్మాత్రః స్మృతః పుమాన్
స యథా నిశ్చయో నూనం తత్సత్యమితి నిశ్చయః 15

సంవిత్తు (ఆ యావాదుల దృష్టిననుసరించి) సత్యమైనను అసత్యమైనను నగుగాక! కాని, ఆత్మయైతే సంవిన్మాత్రమనియే చెప్పఁబడినది. ఆయాత్మ దేనినెట్లు నిశ్చయించునో, అదినిక్కముగ నట్లే సత్యమై యొప్పును.

ప్రామాణ్యం సర్వశాస్త్రాణామేతేనైవ ప్రసిద్ధ్యతి
సర్వసిద్ధాన్త సిద్ధాన్త ఏష ఏవేతి మే మతిః. 16

ఇట్లు, సంవిత్తువలననే సర్వశాస్త్రములయొక్క ప్రామాణ్యము ప్రతిష్ఠితమగుటఁబట్టియు సంవిత్తే సర్వవాదుల సిద్ధాంతముల నుపజీవింపఁ జేయుటవలనను, మఱియు నదియే సర్వులకుఁ బురుషార్థ హేతువగుటవలనను, అట్టి సంచిత్ - అద్వైతవాద సిద్ధాంతమే సర్వసిద్ధాంత శిరోమణి యని నా యభిప్రాయము.

తస్మాదబోధతాయాస్తే యథా సంవిత్తథైవ సా
భవత్యకలుషాకారా తథైవ ఫలభాగినీ. 17

అవిద్యయే సర్వవాదులసంవిత్తున కనుకూలముగఁ బరిణామ మొందినదై, వారి వారి. నిశ్చయానుసారము అర్థక్రియయందుఁ బ్రవృత్తమగుచున్నది. అదియే బోధితమగునపుడు నిష్కలంకమైన చిదాకారముగలదై మోక్షఫలభాగిని యగుచున్నది.

దేశకాల క్రియాద్రవ్యవేదశాస్త్రైషణాభ్రమైః
అబోధతా తు యా సంవిత్కదాచిత్సా న నశ్యతి. 18

పవిత్ర దేశకాలాదులందలి స్నానదానాది క్రియలచేతను, రసాయన మంత్రౌషధాది ద్రవ్యములచేతను, కర్మశాస్త్రములచేతను, స్వర్గపశు పుత్రాదులఁగూర్చిన యిచ్ఛారూప భ్రమల చేతను. ఆ అవిద్యయు తత్ప్రయుక్తమగు విక్షేపసంవిత్తున్ను నెన్నఁడును నశింపనేరవు. (ఆత్మ జ్ఞానము చేతనే నశించుననుట.)

ఆవిర్భవతి సా భూయః క్షీణాశఙ్కా క్షణేన చేత్
తత్కేన సంవిదో దుఃఖం కదా నామోపశామ్యతి. 19

ఆత్మజ్ఞానముచే ఆ అవిద్య సంపూర్ణముగ నశించినదై మరల యెన్నఁడును నుదయింప కుండును. ఒకవేళ క్షణకాలము మరల ఆవిర్భవించుచో, అపుడా జీవుని దుఃఖమిఁక నెపుడు దేనిచే నశించును ? (ఆత్మజ్ఞానముచే నశించిన అవిద్య మరల యెన్నఁటికిని నుదయింపనే యుదయింపదని భావము.)

సంవిదేవ నృణాం జీవః స యథా దృఢభావనః
తథా సుఖీ వా దుఃఖీ వా భవేదిత్యేష నిశ్చయః. 20

సంవిత్తే మనుష్యాదులయొక్క జీవుఁడు ఆ జీవుఁడేప్రకారము దృఢముగ భావించునో, ఆ ప్రకారమే సుఖవంతుఁడుగగాని, దుఃఖవంతుఁడుగగాని యగుననుట నిశ్చయము.

సంవిచ్ఛేదస్తి తజ్జ్ఞానాం శరణం భవభేదనే
నాస్తి చేత్తచ్ఛిలామూకమాన్ధ్యమేవావశిష్యతే. 21

ప్రత్యగాత్మరూపమగు సంవిత్తే యథార్థముగ నెఱుఁగఁ బడినచో సంసార బంధనమును ఛేదించివేయుసు. కావున నయ్యది ముముక్షువు లెల్లరకును శరణ్యమైయున్నది, అదిలేనిచో జగత్తు నందు శిలవంటి మూకత్వమున్ను, అంధకారము (జడత్వము)న్ను మాత్రమే శేషించును,

యత్త్రయైవ సంవిత్త్యా వేదనేనైవ లభ్యతే
అత్యం స్వభావజ్ఞప్త్యాస్తర్ణాఢ్యం పుంసేవ నిద్రయా. 22

ఏలయనిన, మనుజుఁడు నిద్రవలన జడత్వమును బొందునట్లు స్వభావసిద్ధమై, స్వప్రకాశమైనట్టి జ్ఞప్తిరూపమగు ప్రత్యగాత్మసంవిత్తు, అజ్ఞానమువలన ఈ ప్రపంచమును బొందుచున్నది. కావున, అసంవిత్తుయొక్క అభావముచే సాక్షిశూన్యమగు అంధత్వ (జడత్వ)మే జగంబునశేషించును.

శ్రీరామ ఉవాచ:—

దిక్ష్వథస్తాచ్చ నాన్తోఽస్యా భావి నాపి జగత్క్షయః
అస్తీతి భావితం యేన సంత్యక్తాభావబుద్ధినా. 23

విజ్ఞానఘనమేవేదమితి నూనమపశ్యతా
పశ్యతా చ యథా దృష్టం సర్వక్షయమపశ్యతా. 24

తస్య స్యాత్కిదృశీ బ్రహ్మన్ముక్తిరాదివినాశనే
ఇతి మే సంశయం ఛిన్ధి భూయో బోధాభివృద్ధయే. 25

శ్రీరాముఁడు;— మహాత్మా! దశదిశలందును ఈ ప్రపంచమునకు అంతములేదు. కావున ఈ జగత్తు నాశరహితమైనదని తలంచువాఁడును, ప్రాగభావ, ప్రధ్వంసాభావ, అత్యంతాభావములను విశ్వసించనివాఁడును ఈ సమస్తము విజ్ఞానఘనమే యనునట్టి పరమార్థతత్త్వమును గాంచనివాఁడును, ఈ కానుపించు జగత్తే సత్యమని నమ్ము వాఁడునగు మనుజునియొక్క సంసార రోగము శమించుటకై యేమి యుక్తిగలదు? మహాశయా! జ్ఞానాభివృద్ధికొఱకై యీ నా సంశయమును మరల ఛేదింపవేడెద.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అత్రైకం తావదుచితం పూర్వమేవ తథోత్తరమ్
ద్వితీయముత్తరం న్యాయ్యం వక్ష్యమాణమిదం శృణు. 26

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! దీనికి ఉచితమైన ప్రత్యుత్తర మొకటి (వేదాంత శాస్త్రమును విశ్వసింపనివారు మృతప్రాయులు. అట్టివారు ఉపదేశ పాత్రులుకారు. ఈ మొదలగు వాక్యములు) యిదివరకే చెప్పఁబడియుండెను. ఇపుడు మఱియొక యోగ్యమైన యుత్తరము చెప్పబోవుచున్నాను వినుము.

ఈదృగ్భావస్త్వయా ప్రోక్తో యః పుమాన్పురుషోత్తమ
స తావచ్చేతనామాత్రం భవతీత్యనుభూయతే. 27

స చాకారవినాశేన యుజ్యతే నాత్ర సంశయః

పురుషోత్తముఁడవగు రామచంద్రా! నీవు తెల్పిన భావములు గల మనుజుఁడు దేహాతిరిక్త చేతనాత్మవాదియా, లేక, నిత్యసూక్ష్మదేహాత్మవాదియా, లేక, స్థూలదేహాత్మవాదియా, లేక, శుద్ధసంవిదాత్మవాదియా, లేక అజ్ఞానావృత సంవిదాత్మవాదియా, లేక సంవిదపలాపియా (సంవిత్తులేదనువాఁడా) అందు మొదటివాఁడగు చేతనాత్మవాదియైనచోఁ గ్రమముగ విచారణాదులచే నాతఁడాత్మతత్త్వము ననుభూతమొనర్చుకొనఁగలడు. ఏలయనఁగా దేహాద్యాకారరూపమగు ఉపాధియొక్క సంపూర్ణవినాశముచే నాతఁడు పరమాత్మతోటి తప్పక ఏకీభావమును బొందును. ఇట సంశయమేదియును లేదు.

అథావినాశో దేహశ్చేత్తద్దుఃఖస్యాత్ర కః క్రమః. 28

ఇఁక నిత్యసూక్ష్మదేహాత్మవాదియైనచో - (నాశవంతమగు అన్నమయదేహమందాత్మబుద్ధి గల్గియున్నచో మనుజునకు నెల్లెడల వినాశభయముచే దుఃఖముండును. కాని) నాశరహితమైనదాని యందలి ఆత్మత్వబుద్ధిచే నిఁక దుఃఖక్రమమెచట? (కావున క్రమముగ నాఁతడును బ్రబోధితుఁడై వాస్తవతత్త్వమును బొందఁగలడని భావము.)

భవేద్భాగవిభాగాత్మ వినాశస్త్వవిచారతః
అవశ్యం తస్య భవతి కిలేతి నను నిశ్చయః. 29

[illegible]దేహాత్మవాది 'అవయవసహితమగు పదార్థము నశించునను' న్యాయమును విచా[illegible] కాలక్రమమున, అట్టి నాశమునుగూర్చిన విచారణగావింప నాతనికిన్ని దేహము కంటె [illegible]మగు చైతన్యమందు ఆత్మబుద్ధి గలుగుననుట నిక్కము

మృతః న సంవిదాత్మత్వాద్భూయో నో వేత్తి సంసృతిమ్
జ్ఞానధౌతా న యా సంవిన్న సా తిష్ఠత్యసంసృతిః. 30

శుద్ధసంవిదాత్మవాదియగు జీవన్ముక్తుఁడు సదా సర్వత్రలీలగా జగత్తును గాంచుచుండి నప్పటికి మరణానంతరము (విదేహముక్తుడైన పిదప) మరల జగత్తు నెన్నఁడును గాంచకయే యుండును. అజ్ఞానావృత సంవిదాత్మవాదియొక్క సంవిత్తు తత్త్వజ్ఞానముచే శుద్ధము చేయబడ సందుచే కలుషితమై యుండుటవలన నాతఁడవశ్యము సంసారసహితుఁడేయైయుండును. (అయినను, ఒకానొక జన్మయందు జ్ఞానోదయముచే నాతఁడున్ను నుద్ధరింపఁబడునని భావము.)

అథవా నాస్తి సంవిత్తిరితి నిశ్చయవాన్యది
తతస్తాదృగ్వేదనతో భవత్యేవ దృషజ్జడః. 31

యథావేదనమరేష చిత్త్వే దేహక్షయాత్తతే
మృతిరేవ పరం శ్రేయో దృష్టం నానుభవాదితి. 32

ఇఁక సంవిత్తు లేదను నిశ్చయముగలవాఁడు అట్టిబోధచే శిలవలె చిరకాలము విశేషజ్ఞాన రహితుఁడై జడప్రాయుడై యుండును. మఱియు అట్లు మరణపర్యంతము దృఢపడినట్టి జడాత్మక జ్ఞానముచే విశేషజ్ఞానము నశించుటఁబట్టి దేహపాతానంతరము గాఢసుషుప్తిసదృశమగు యా మృత్యువునే మోక్షముగను పరమశ్రేయముగను గాంచును, (నైయ్యాయికుల ముక్తివంటి స్థితిని అనుభవించును.) అంతేగాని నిరతిశయానందానుభవరూపమగు శ్రేయము నాఁతడు గాంచకుండును.

అసంభవచ్ఛుద్ధవిదో నిఃశరీరా భవన్తి యే
జడభావా జడీభూయ దుర్భేదాన్ధ్యా భవన్తి తే. 33

శుద్ధసంవిద్రూపమగు ఆత్మ అసంభవమని తలంచునట్టి శూన్యవాదులు మరణించిన పిదప అతి జడస్వరూపులై మహాతమస్సుచే నావరింపఁబడిన దుర్భేద్యములైనట్టి అంధకారమయ ప్రదేశములను బొందుదురు.

యే చాపి స్వప్నపురవత్సర్వం పశ్యన్తి చిన్మయాః
మేషామిదమిశాశేషం జగజ్జాలం ప్రవర్తతే. 34

జగత్తును క్షణికవిజ్ఞానమయముగను, స్వప్నపురమువలెను గాంచునట్టి విజ్ఞానవాదుల యొక్కయు సమస్తవ్యవహారములు సుఖదుఃఖమయములుగనే ప్రవర్తించుచుండును.

స్థైర్యాస్థైర్యేణ భూతానాం కిమపూర్వమతో భవేత్
భూతస్థైర్యే తథాస్థైర్యే సుఖం చైవాసుఖం సమమ్. 35

జగత్తు స్థిరమని వచించు స్థైర్యవాదులకును, క్షణికమని వచించు క్షణికత్వవాదులకును ఉభయులకును సుఖదుఃఖములు సమానముగనే యుండును. ఏలయనిన, పదార్థముల స్థిరత్వ, క్షణికత్వములచే జగద్వ్యవహార వైచిత్ర్యబుద్ధియందేమి భేదముండఁగలదు?

స్థిరమస్త్వస్థిరం వాపి మహ్యాది మహతామపి
చిద్భామాత్రమిదం భాతి యావదజ్ఞానమాతతమ్. 36

పృథ్వ్యాది స్థూల, లేక, సూక్ష్మపంచ మహాభూతములు స్థిరములైనను, క్షణికములైనను, ఆ విషయమున జ్ఞానులకు విశేషమైన పట్టుదల యేమియునులేదు. ఏలయనిన, అజ్ఞానమెంతవఱకుండునో, అంతవఱకును ఈ యధ్యస్తమయిన జగత్తు శుక్తియందలి రజతమువలె భాసించుచునే యుండును అట్టి రజతముయొక్క మూల్యవిచారణవలె ఆ యజ్ఞాత జగత్తుయొక్క విచారణయు నపుడు వ్యర్థమేయగును. వాస్తవముగ ఈ సమస్తమున్ను అధిష్ఠానమగు చైతన్యము యొక్క ప్రకాశమేయైయున్నది.

సంవిదా సంవిదోఽసత్తామిహావ్యాప్య వినష్టయా
నిర్ణీయాఙ్గీకృతంయైర్వా జాడ్యం తద్బాలకైరలమ్. 37

సంవిత్తు (ఆత్మ) ఎపుడును క్షణికము కాఁజాలదు. ఏలయనిన, అది తన అసత్తారూపమగు నాశమును, జడత్వమును, రెంటిని వ్యాపించి యుండఁజాలదు. కావున, సంవిత్తుచేతనే సంవిత్తుయొక్క కాలరూప అసత్తయగు క్షణికత్వమును, దేశరూప అసత్తయగు జడత్వమును ఏ మూఢులు నిర్ణయించి యంగీకరించిరో, వారితోటి సంభాషించుటచే నే ప్రయోజనమున్ను లేదు.

యేషాం విద్భ్యః శరీరాణి తే వన్ద్యాః పురుషోత్తమాః
శరీరేభ్యోవిదో యేషాం తైరలం పురుషాధమైః. 38

శరీరాది జడప్రపంచము చైతన్యముయొక్క వివర్తరూపమని యెంచు పురుషోత్తములు వందనీయులు. కాని శరీరాదులనుండి తద్వికారముచే చైతన్యమేర్పడినదని తలంచు చార్వాకాది అధమ మనుజులతోటి మనకే ప్రయోజనమున్ను లేదు.

చిద్రూపో జీవబీజౌఘ ఆకాశకృమిజాలవత్
ఊర్ధ్వం తిర్యగధో యాతి పూర్యమాణ ఇవ స్వయమ్. 39

చిద్రూపుఁడును, సర్వజీవులయొక్క బీజ భూతుఁడుననగు హిరణ్యగర్భుఁడు మశక సమూహమునవలె నొప్పునట్టి యనేక జీవరూపులను స్వయము[illegible]చి, పూరింపఁబడుచున్న పాత్రయందలి జలమువలె [illegible], [illegible]ందకును, ప్రక్కలకును పరిభ్రమించుచున్నాఁడు.

చేత్యతే యేన కర్తాన్యో బీజౌఘేన స తత్పరః
తథైవానుభవత్యన్తః స్వయమేవ వివల్గతి. 40

ఆ వివిధజీవుల సమష్టిరూప కర్తృత్వము హిరణ్యగర్భ చిదాభాసుఁడను (జీజ) బీజ సమూహముచే దనయందెఱుఁగఁ బడుచున్నది. అపుడయ్యది యద్దానియందాసక్తమై వివిధకర్తృరూపమును దనయందు స్వయముగనే అనుభవించుచు, ఆ విధముగనే సంసారమునఁ దిరుగాడుచున్నది.

యద్యథా చేత్యతే యేన తజ్జీవేనాశు తేన తత్
చిద్రూపేణాప్యతే సిద్ధమేతదాబాలమక్షతమ్. 41

చిద్రూపుఁడగు ఏజీవునిచే నేది యెవ్విధముగ నెఱుఁగఁబడుచున్నదో, అది యవ్విధముగనే శీఘ్ర[illegible]గ నాతనిఁచే బొందఁబడుట ఆబాలగోపాలమందును ప్రసిద్ధమైయున్నది.

యథా ధూమస్య నభసి యథామ్బోధౌ మహామ్భసః
ఆవర్తవృత్తయశ్చిత్రాస్తథా చిద్వ్యోమ్ని సంసృతేః. 42

ఆకాశమందు ధూమముయొక్కయు, మహాసముద్రమున జలముయొక్కయు అనేక విచిత్రములైన అవర్తవృత్తులు సంభవించునట్లు, చిదాకాశమందును సంసారముయొక్క వివిధ వైచిత్ర్యము సంభవించుచున్నది.

పురీ భవతి చిద్వ్యోమ యథా స్వప్నే నరం ప్రతి
తథాదిసర్గాత్ప్రభృతి తదేవేదం జగత్స్థితమ్. 43

స్వప్నమున చిదాకాశమే మనుజునకెట్లు మహాపురమగుచున్నదో, అట్లే సృష్ట్యాదినుండి నేటివఱకును ఆ చిదాకాశమే జగద్రూపముగ స్థితి నొందియున్నది.

సహకారినిమిత్తాని యథా స్వప్నే న సన్తివై
పృథివ్యాదీని భూతాని తథైవాదౌ జగత్స్థితేః. 44

మఱియు, స్వప్నమున సహకారికారణములు లేకయే సమస్తము సంభవించునట్లు, సృష్ట్యాదియందలి జగత్స్థితియందును, పృథివ్యాది పంచభూతములున్ను అట్లు సహకారి కారణములు లేకయే సంభవమగుచున్నవి.

అజ్ఞానాం స్వప్ననగరే వసుధా వివిధాః కృతాః
యాస్తా ఏవ జగత్స్వప్ననగరే పుష్టతాం గతాః. 45

స్వప్ననగరమున గృహాద్యనేక కోమలములైన వివిధ ఖేదములెవ్వి గావింపఁబడెనో, అవియే యీ జగత్తను స్వప్ననగరమున పుష్టత్వమును బొందినవై యొప్పుచున్నవి.

చిన్మాత్రాకాశమేవేమాః ప్రజాద్వైతైక్యవర్జితాః
కే వాత్ర రఞ్జనాన్యా ఖే యద్భాభాతి ఖమేవ తత్. 46

వాస్తవముగ. ఈ ప్రజలందఱును ద్వైతైక్యవివర్జితులై, చిన్మాత్రాకాశ రూపులేయై యున్నారు. ఇట చిదాకాశమున మఱియొక రంజన మేమిగలదు? ఏది భాసించుచున్నదో, అది చిదాకాశమేయై యున్నది

చిచ్చన్ద్రికా చతుర్దిక్కం శీతలాహ్లాదకారిణీ
తనోతి చేతనా లోకం తస్యేదం కచనం జగత్. 47

త్రివిధతాపముల హరించునదగుటచే శీతలమైనదియు, ఆహ్లాదమును గలుగఁజేయునదియు నగు చైతన్యమను చంద్రిక తన చేతన ప్రకాశమును నలువైపుల విస్తరింపఁజేయుచున్నది. అట్టి ప్రకాశముయొక్క, పదార్థరూపముతోనైన, స్ఫురణమే యీ జగత్తైయున్నది.

ఆద్యావాద్యన్తయోర్వ్యోమ్ని చిన్మయే సర్గదర్శనమ్
చిదున్మేషనిమేషాభ్యాం భాత్యోదేత్యస్తమేతి చ. 48

సృష్టికిఁ బూర్వమున్ను, ప్రళయముననను సృష్టిరహితమైయున్నట్టి చిన్మయాకాశమున నిపుడే సృష్టి గోచరించుచున్నదో, అది చిదాకాశమగు యా బ్రహ్మమేయైయున్నది. ఆ బ్రహ్మమే యట్లు నిజచైతన్యముయొక్క, పరిచ్ఛిన్న, అపరిచ్ఛిన్నరూపములచే, వికాస, సంకోచములద్వారా స్వయముగ స్వప్నమువలె నుదయించుచు, అస్తమించుచున్నది.

యద్యథా వేత్తి యత్తత్స్తత్తథైవానుభవత్యలమ్
యస్మాత్సమస్తం చిన్మాత్రం కిమివాత్ర న విద్యతే. 49

శ్రుతిప్రసిద్ధమగు ఆ చిద్రూపమైన సద్వస్తువు సృష్ట్యాదియందేవస్తువు నేరీతి యెఱుఁగుచున్నదో నేఁటికిని దాని నారీతిగనే లెస్సగ ననుభవించుచున్నది. (చైతన్యము స్వసత్తాబలముచే జగంబును సత్తుగనొనర్చి గాంచుచున్నది.) కావున, సమస్తము చిన్మాత్రమైయేయున్నది. అట్టిచో నిఁక సత్తుకాని పదార్థమెయ్యది గలదు?

శరదాకాశవిశదం సంవిదః సౌమ్య మానసాః
అసన్త ఏవ తిష్ఠన్తి సన్తోఽధిగతతత్పదాః. 50

బ్రహ్మపదమును బొందిన సౌమ్యమనస్కులగు మహాత్ములు శరత్కాలాకాశమువలె నిర్మలమైనట్టి చైతన్యరూపముతో వర్తించుచు, తద్భిన్నమగు దృశ్యరూపముతో వర్తింపకయుందురు.

నిర్మానమోహా జితసఙ్గదోషాః ప్రవాహసంప్రాప్తనిజార్థభాజః
తిష్ఠన్తి కార్యవ్యవహారదృష్టా నిరామయా యన్త్రమయా ఇవైతే. 51

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే నాస్తిక్యనిరాకరణం నామ
శతతమః సర్గః ॥ 100 ॥

ఓ రామచంద్రా! అభిమాన, మోహాదులు లేనివారును, సంగదోషములను, జయించిన వారును ప్రవాహపతిత కార్యముల నాచరించువారునగు జీవన్ముక్తులైన మహనీయులు, ఇతరుల కార్యవ్యవహార దృష్టియందు పురుషప్రతిమలవలె వికారరహితులై వెలయుచుందురు.

ఇది శ్రీ వాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
నాస్తిక్యనిరాకరణమను నూఱవ సర్గము ॥ 100 ॥

ఏకాధికశతతమః సర్గః

[సంవిదై కాత్మ్యమమలం సదా సర్వత్ర ప్రశ్యతః
అప్రాప్తేర్భయహేతూనాం అభయస్థితిరీర్యతే.

అంతటను నిర్మలమగు సంవిత్తుతోటి యేకత్వమును వీక్షించువారియొక్క భయహేతు వర్జితమగు అభయ పదమందలి స్థితి యిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

చిన్మాత్ర మేవ పురుషస్త దేవేత్థమవస్థితమ్
చిన్మాత్రవ్యతిరేకేణ కిమన్యదుపపద్యతే. 1

శ్రీవసిష్ఠుఁడు:- ఓ రామచంద్రా! పురుషుఁడు చిన్మాత్రమే యైయున్నాఁడు. ఆ చిన్మాత్రమే నానావాదికల్పితములగు, స్థాయి, క్షణికాది రూపములుగను, జననమరణ, భయశోకాదిరూపములుగను స్థితినొందియున్నది. ఏలయనిన, ఆ చిన్మాత్రము తప్పదానికన్యముగ మఱేద్దియు నుండఁ జాలదు.

తచ్చావదాతమాకాశం తన్మయే ద్రష్టృ దృశ్యతే
తావన్మాత్రం జగదతో హేయోపాదేయధీః కుతః. 2

మఱియు, ఆ చైతన్యము ఆకాశమువలె నిర్మలమైనది. ద్రష్టృదృశ్యము లద్దాని వివర్తరూపములే యగును. ఈ జగత్తంతయు ఆ చిన్మాత్రమే యైయున్నది. అట్టిచో నిఁక గ్రహణ, త్యాగ బుద్ధి యెచట?

న విద్యతే పరో లోకో బార్హస్పత్యస్య యస్య తు
విదోఽన్యత్తస్య కిం సారం రాగద్వేషావతః కుతః. 3

బృహస్పతిరచితమగు బుద్ధశాస్త్రము ననుసరించునట్టి క్షణికవిజ్ఞాన వాదుల మతమందు ఈ జగత్తు క్షణికవిజ్ఞానముకంటె అన్యముగ నేమియును గాదు. కావున వారిమతమందును జగత్తు యొక్క నిర్విషయత్వమువలన రాగద్వేషములకుఁ దావులేదు. అయినప్పటికి దేనిచే వారు సంవిత్తు (చైతన్యము) యొక్క నిత్యత్వమును అభిలషింపక యున్నారో, అట్టి సారమగు వస్తువు వారికి సంవిత్తున కన్యమైన దేదిగలదు? ఏదియులేదని భావము. కావున క్షణికాంశమున వారి మతము అసంగతమేయగునని తాత్పర్యము.

ఇష్టానిష్టదృశో రాగద్వేషదోషాః కిమాత్మకాః
సంవిద్వ్యోమమయే స్వప్నే జగదాఖ్యేఽఙ్గ కథ్యతామ్. 4

ప్రియుఁడవగు రామచంద్రా! చిదాకాశముయొక్క వివర్తరూపమగు స్వప్నమే జగత్తను మనసిద్ధాంతమును బట్టి యిఁక నట్టి జగత్తునందు రాగద్వేష, ఇష్టానిష్టాదు లేమియో వచింపుము?

ఇదం హేయముపాదేయం వేతి సంవిత్త్వమాత్మని
నిర్మలే నిర్మలం భాతి కేవాత్ర తదతద్దృశౌ. 5

'ఇదిత్యజింపఁదగినది. ఇది గ్రహింపఁదగినది' అను నిట్టి వికల్పాధ్యాసమునున్ను చిదాకాశరూపమగు సంవిత్తు తన చిదాకాశ స్వరూపముననే గాంచుచున్నది, అపుడున్ను నిర్మలమగు చిదాకాశమందు నిర్మలమగు చిదాకాశరూపముగనే జగత్తుభాసించుచున్నది. కావున నిఁక ఇచట ఇష్టానిష్టముల దృష్టి యెచట?

సంవిన్నరోఽమరో నాగః సంవిత్స్థావరజంగమమ్
భావాభావాదయోఽస్యాబ్ధేస్తరఙ్గావర్తవృత్తయః. 6

మనుష్యులు, దేవతలు, నాగులు, స్థావరజంగమములు అన్నియు సంవిద్రూపములే యైయున్నవి, ఇట్టి సంవిద్రూపమగు సముద్రముయొక్క తరంగముల ఆవర్తవృత్తులే జనన మరణాదులు.

సంవిదాకాశమేవాహం భవానపి జనా అపి
మ్రియామహే నో కదాచిత్సంవిత్కిల కదా మృతా. 7

ఓ రామచంద్రా! నేను, నీవు, సమస్తజీవులున్ను సంవిదాకాశమే యైయున్నాము. కావున మనమెపుడును మఱణింపనివారమే యగుదుము. సంవిత్తు(చిదాత్మ)ఎపుడు మరణించినదోచెప్పుము?

సంవిదో నాస్తి సంవేద్యం స్వయం సంవేద్యతామితా
చిత్త్వాదతో విశాలాక్ష ద్విత్వైకత్వే క్వ వా స్థితే. 8

కమలనేత్రుఁడవగు రామచంద్రా! సర్వము సంవిన్మయమగుటచే సంవిత్తు దేనియొక్కయు సంవేద్యము (జ్ఞేయము) కానేరదు. స్వయముగనే సంవేద్యత్వమును బొందినదనినచో, చిద్రూపమగుటఁ బట్టి యిఁక నద్దానియందు ద్విత్వ, ఏకత్వము లెటుల నుండగలవు? (కావున సంవేద్యత్వమును బొంద లేదనియే భావము.)

సంవిన్మాత్రాదృతే తస్మాద్భూతం కిమివ కథ్యతామ్
కథ్యతాం మ్రియతే తచ్చేత్తదద్యేమే కుతో వయమ్. 9

ఓ రామచంద్రా! సంవిత్తు (చిదాత్మ) తప్ప మఱియొక సద్వస్తువేది కలదో చెప్పుము? మఱియు, సంవిత్తుమరణించునదగుచో నిపుడు వీరు, మనము, ఎట్లు జీవింపగల్గు చున్నామో చెప్పుము?

వాదినః సౌగతాద్యా యే యే లోకాయతికాదయః
సంవిదాకాశముత్సృజ్య యన్మయాస్తే తదుచ్యతామ్. 10

సౌగత, లోకాయతాది సర్వవాదులున్ను సంవిదాకాశము (చిదాకాశము)నువదలి మఱి దేనినినమ్ముచున్నారో చెప్పుము? (చిదాకాశమే, ఆ యా వాదులకు వారివారి అభిమత పదార్థాకారముగ వ్యక్తమగుచున్నదని భావము.)

సంవిదాకాశమేవై తత్కేన చిద్బ్రహ్మ కథ్యతే
కేనచిత్ప్రోచ్యతే జ్ఞానం కేనచిచ్ఛూన్య ముచ్యతే. 11
కేనచిన్మదశక్త్యాఖ్యం కేనచిత్పురుషాభిధమ్
కేనచిచ్చ చిదాకాశం శివ ఆత్మా చ కేనచిత్, 12

ఈ సంవిద్రూపమగు ఆకాశమునే కొందఱు బ్రహ్మమనియు; కొందఱు విజ్ఞానమనియు, మఱికొందఱు శూన్యమనియు, ఇంకకొందఱు సుద్యముయొక్క శక్తివలె, చేతనసహితముగ దేహాకారమున పరిణతములైన పృథ్వ్యాదిభూతములయొక్క ధర్మముగలదనియు, కొందఱు పురుషుఁడనియు, కొందఱు చిదాకాశమనియు, మఱికొందఱు శివుఁడనియు, ఇంకకొందఱు 'ఆత్మ' యనియు వచించుచున్నారు.

చిన్మాత్రమేవమవ్యక్తం యాతి న క్వచిదన్యతామ్
యస్మాత్స్వయం తదేవైవమాత్మానం వేత్తి నేతరత్. 13

ఇట్లు వాదులచే ననేకప్రకారములగు వికల్పములచేఁ జెప్పఁబడినను, ఈ చిన్మాత్రము మఱియొక రూపమును బొందకనే యున్నది. అట్టి వికల్పములచే దాని కేహానియున్ను లేదు. ఏలయనిన, ఆ సర్వ వికల్పములకును, అట్టి తనవికల్పిత స్వరూపమునకును తాను సాక్షియై స్వయముగ తానే వాటినన్నిఁటి నెఱుఁగుచున్నదిగాని మఱియొకటికాదు, కావున నది నిర్వికల్పమే యైయున్నది.

చూర్ణతాం యాన్తు మేఽఙ్గాని సన్తు మేరూపమాని చ
కా క్షతిః కా చ వా వృద్ధిశ్చిద్రూపవపుషో మమ. 14

నా అవయవములు చూర్ణములై పోవుగాక ! లేక, మేరుపర్వతమువలె విశాలములగు గాక ! అయినను, చిన్మాత్రశరీరుఁడనగు నాకు దానిచే హానిగాని, వృద్ధిగాని యేమిగలదు?

మృతాః పితామహాద్యాశ్చిన్న మృతా సా మ్రియేత చేత్
తజ్జన్మనైవ నామ స్యాదస్మాకం మృతసంవిదామ్. 15

మన పితామహాదులందఱును మరణించిరి కాని వారి ఆత్మరూపమగు చైతన్యము మాత్రము మరణింపలేదు. అదియు మరణించినదనినచో, మృతచైతన్య సహితులగు వారికి మరల జన్మయే లేకయుండవలసివచ్చును, మనవిషయమైయున్నట్లే యెఱుఁగవలయును.

న జాయతే న మ్రియతే సంవిదాకాశమక్షయమ్
భవేత్కథం కథయ కిం కిలాకాశస్య సంక్షయః. 16

ఓ రామచంద్రా! నాశరహితమగు ఈ చిదాకాశ మెన్నఁడును జన్మించుటలేదు, మరణించుటలేదు; ఆకాశముయొక్క క్షయమేది యెట్లు సంభవించునో వచింపుము?

జగద్రూపైకకచనమవినాశి చిదమ్బరమ్
ఉదయాస్తమయోన్ముక్తం స్థితమాత్మని కేవలమ్. 17

ఇట్లు చైతన్యమునకు నాశము అసంభవమగుటచే, జగద్రూపముయొక్క స్ఫురణము కేవలము చిదాకాశమే ఉదయాస్తమయరహితమై, నాశవర్జితమై తనయందుఁ దానవ్విధమున స్థితి గల్గియున్నదగును.

జగద్భానం దధద్భాహం చిన్మణిః స్ఫటికాచలః
అనాదిమధ్యపర్యన్తః స్వచ్ఛ ఆత్మని తిష్ఠతి. 18

ఆదిమధ్యాంతరహితమైన చిదాకాశమును స్ఫటికపర్వతముతనయందు స్వయముగనే జగత్తును ధరించుచు, నిజతత్త్వ సాక్షాత్కారమను అగ్నిచే దానిని దగ్ధమొనర్చి, నిర్మలమగు తన ఆత్మ యందు తాను వెలయుచున్నది.

యథాయథాన్ధకారేణ ప్రేక్ష్యమాణం ప్రణశ్యతి
కిమప్యభ్రచక్రాభం తథేదం విశ్వమాత్మని. 19

ప్రియుఁడవగు రామచంద్రా! రాత్రియందలి యంధకారముచే సంపాదింపఁబడిన యొకానొక మేఘచక్రమువంటి జగదావరణము ప్రాతఃకాలమున సూర్యప్రకాశమునే యేరీతి క్రమముగ నశించునో ఆయారీతి అజ్ఞానాంధకారకృతమగు ఈ జగత్తున్ను జ్ఞానప్రకాశముచేఁ గ్రమముగ వినాశమొందును.

యథామ్బుధిః స్వయం యాతి తోయాద్యావర్తకాదికమ్
స్థితోఽదధత్తథైవేదం చిదాకాశోఽఙ్గమాత్మని. 20

సముద్రము స్వయముగ తనయందు ప్రవాహ, తరంగ, ఫేన, బుద్బుద, ఆవర్తాది రూపముల ధరించి యుండునట్లు చిదాకాశమున్ను తనయందు జగత్తను అవయవమును ధరించియున్నది.

చిన్మాత్రమేవ పురుషః ఖవత్స చ న నశ్యతి
కదాచనాపి తద్వ్యర్థం యన్నశ్యామీతి శోకితా. 21

పురుషుఁడు చిన్మాత్రమే అయియున్నాఁడు. కావున ఆకాశమువలె నాతఁడెన్నఁటికిని నశింపకయేయుండును. ఇక్కారణమున, 'నేను నశించుచున్నానని' దుఃఖించుట వ్యర్థమేయగును.

దేహాద్దేహాన్తరప్రాప్తౌ నవ ఏవ మహోత్సవః
మరణాత్మని కిం మూఢా హర్షస్థానే విషీదథ. 22

'శిథిలమైన దేహమును వీడి నూతనమైన శరీరమును గ్రహించుటకు నిమిత్తభూతమగుటచే మరణము నూతనమహోత్సవమేయై యున్నది. కాఁబట్టి ఓ మూఢులారా! హర్షింపఁదగినచోట మీరేల దుఃఖించుచున్నారు.

మృతశ్చేన్న భవేద్భూయః సోఽత్రాప్యుపచయో మహాన్
భావాభావగ్రహోత్సర్గజ్వరః ప్రశమమాగతః. 23

ఒకవేళ, మరణించినపిదప మరల జన్మలేదని తలంచినచోనపుడున్ను మహత్తరమైన పురుషార్థము చేకూరినట్లే యగును. ఏలయనిన, ఉత్పత్తినాశ, గ్రహణత్యాగాది రూపమగు సంసారజ్వరమపుడు శమించినదే యగును.

మరణం జీవితం తస్మాన్న దుఃఖం న సుఖం యతః
నాస్త్యేవైతచ్చిదాకాశః కిలేత్థమభిజృమ్భతే. 24

ఇట్లు, జనన మరణములు సత్యములని తలంచినపుడే దుఃఖములేకయుండ నీఁకనవి అసత్యములైనపుడు దుఃఖప్రసక్తియే యెచట? పరమార్థమున జీవిత మరణ, సుఖదుఃఖాదు లెవ్వియును లేకయే యున్నవి. చిదాకాశమే అయన్నిఁటిరూపమున విజృంభించుచున్నదగును.

మృతస్య దేహలాభశ్చేన్నవ ఏవ తదుత్సవః
మృతిర్నాశో హి దేహస్య సామ్ప్రతిః పరమం సుఖమ్. 25

మరణించిన పిమ్మట మరల దేహము లభించునో, అది నూతనోత్సవమే యగును. ఏలయనఁగా శిథిలమైన దేహముయొక్క నాశమేమరణముగాన, అది పరమసుఖమే యగుచున్నది.

మృతిరత్యన్తనాశశ్చేత్తద్భవామయసంక్షయః
భూయః శరీరలాభశ్చేన్నవ ఏవ తదుత్సవః. 26

ఒకవేళ, అత్యంతనాశమే మరణమనినచో, అపుడు పరిశ్రమలేకయే సంసారరోగముపశమించినదగుచున్నది. అట్లుగాక, మరల శరీరము లభించుననినచో అది నూతనోత్సవమే యగును.

కుకర్మభ్యోఽథ భీతిశ్చేత్తాని సమేహ పరత్ర చ
తాని మాకర్ష భోస్తస్మాల్లోకద్వితయసిద్ధయే. 27

దుష్కర్మలచే, మరణానంతరము నరకాదిప్రాప్తి రూపమగు భయముగలదనినచో, ఆ భయ మిచటను రాజదండనాదులచే నట్టి దుష్కర్మల కుండియేయున్నది. కావున ఇహ పరలోకములందలి శ్రేయస్సిద్ధికొఱకై యట్టి దుష్కర్మల నాచరింపకుఁడు.

మరిష్యామి మరిష్యామి మరిష్యామీతి భాషసే
భవిష్యామి భవిష్యామి భవిష్యామీతి నేక్షసే. 28

'నేను చచ్చెదను, చచ్చెదను, చచ్చెద'నని యేల బల్కెదవు? 'చిద్రూపుఁడ నగుటచే నేను మరణానంతరమున్ను ఉందును, ఉందును, ఉందునని' యేల తలంపకయున్నావు?

క్వ నామ జన్మమరణే క్వ భవాభవ భూమయః
సంవిదాత్మకమేవేదం వ్యోమ వ్యోమ్ని వివర్తతే. 29

పరమార్థమున జనన మరణ, ఉత్పత్తినాశములఁ గూర్చిన స్థితులెచట? ఇదియంతయు చిదాకాశమేయైయున్నది. ఆ చిదాకాశము తనయందుఁ దానేజగద్రూపమున నిట్లు వివర్తభావము నొందుచున్నది.

సంవిదాకాశమాత్రాత్మా పిబ భుంక్ష్వాస్వ నిర్మమః
ఆకాశకోశకాన్తస్య కుత ఇచ్ఛోదయస్తవ. 30

ఓ రామచంద్రా! నీవు చిదాకాశ మాత్రుఁడవు. కావున అవ్విధమున ఆత్మజ్ఞానము కలిగిన పిమ్మట మమత్వరహితుఁడవై త్రావుము, భుజింపుము, ప్రపంచమున వ్యవహారమున్ను ఆచరింపుము. ఏలయనిన, ఆకాశకోశమువలె నిర్మలమైనట్టి చిదాత్మయొక్క స్వరూపముగల నీయందపుడిఁక ఇచ్ఛాదుల యుదయ మెచట?

స్వప్రవాహబలోద్యుక్తదేశకాలవశాదితాన్
భవాన్భుఙ్క్ష్వోఽభయో భవ్యః పావనాన్పావనాదపి. 31

నిజప్రవాహబలముచే ప్రసక్తమైనట్టి ప్రయత్నముచేతను, దేశకాలవశముచేతను ప్రాప్తించినవియు, అతి పవిత్రములైనవియునగు శబ్దాదివిషయములను మాత్రమే భవ్యుఁడును, నిర్భయుఁడు నగు ఆత్మజ్ఞుఁ డనుభవించును.

మధ్యమధ్య గతాన్దోషాన్దేశకాలవశోదితాన్
అనాదృత్యాన్తరేవాస్తే సుప్తధీరవహేలయన్. 32

మధ్య మధ్య దేశకాలవశముచే సంప్రాప్తించు దేశక్షోభ, దుర్భిక్షాది దోషములను అనాదరించి, నిర్వికల్పసమాధియందు నిమగ్నమైనట్టి బుద్ధిగలవారై యక్కాలమును దిరస్కరించివైచును.

న దుఃఖమేతి మరణాత్సుఖమేతి న జీవితాత్
నాభివాఞ్ఛతి న ద్వేష్టి స తదాస్తే వివాసనః. 33

అట్టి తత్త్వజ్ఞుఁడు మరణముచే దుఃఖమునుగాని, జీవితముచే సుఖమునుగాని పొందడు. మఱియు, దేనిని వాంఛింపడు! దేనిని, ద్వేషింపడు: ఏలయనిన, అతఁడు సదా వాసనారహితుఁడైయేయుండును.

మరణజీవిత జన్మజరత్తృణా
న్యవిమృశన్విగతేచ్ఛమవాసనః
విదితవేద్య ఇహాజ్ఞ ఇవోదితో
వసతి వీతభయస్త్వచలో యథా. 34

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే పరమోపదేశో నామైకాధికశతతమః సర్గః ॥101॥

ఓ రామచంద్రా! జీవన్ముక్తుఁడు, ఇచ్ఛారహితుఁడై, వాసనావర్జితుఁడై, జననమరణాది దుఃఖములను శిథిలతృణములవలె భావించుచు, విదితవేద్యు (ఆత్మజ్ఞు)డై, భయరహితుడై పర్వతము భంగి ప్రపంచమున నిశ్చలముగ వసించుచుండును.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున
నుత్తరార్ధమున పరమోపదేశమను నూటొకటవ సర్గము ॥ 101 ॥

ద్వ్యధికశతతమః సర్గః

[భూయోఽపి బుద్ధతత్త్వస్య వర్ణ్యతే లక్షణావలిః
తదభ్యాసదృఢత్వేన బోధదార్ఢ్యం భవేదితి

అభ్యాసదార్ఢ్యముచే బోధయొక్క దృఢత్వమును గల్గించుటకొఱకై మరల ఆత్మజ్ఞాని యొక్క లక్షణము లిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీరామ ఉవాచః—

పరిజ్ఞాతే పరే వస్తున్యనాదినిధనాత్మని 1
సంపద్యతే వద బ్రహ్మన్కీదృశః పురుషోత్తమః.

శ్రీరాముఁడు:– మహాత్మా! ఆద్యంతరహితమై, పరమతత్త్వమైనట్టి బ్రహ్మవస్తు వెఱుఁగఁబడినమీదట ఉత్తముఁడగు మనుజుఁ డేయేలక్షణములతోఁ గూడియుండునో వచింపవేడా?

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

శృణు సంపద్యతే కీదృగ్జ్ఞాతజ్ఞేయో నరోత్తమః
యావజ్జీవం కథం చైష కిమాచారోఽవతిష్ఠతే. 2

శ్రీవసిష్ఠుఁడు:— జ్ఞేయమగు ఆత్మనెఱిఁగినవాఁడైన మనుజశ్రేష్ఠుఁడగు జీవన్ముక్తుఁ డెట్లుండునో, ఎట్టి స్వభావ, ఆచరణములతోఁగూడి యావజ్జీవము వర్తించునో వచించెద వినుము.

ఉపలా అపి మిత్రాణి బన్ధవో వనపాదపాః
వనమధ్యే స్థితస్యాపి స్వజనా మృగపోతకాః. 3

జీవన్ముక్తునకు శిలలున్ను మిత్రులే; వన వృక్షములున్ను బంధువులే; వనమధ్యమున నున్న యాతనికి మృగశిశువులున్ను స్వజనులే. (స్థావర, జంగమాది సర్వజీవులందును సమదృష్టి గల్గియుండునని భావము.)

ఆకీర్ణం శూన్యమేవాస్య విపదశ్చాతిసంపదః
స్థితస్యాపి మహారాజ్యే వ్యసనాన్యేవ సూత్సవాః. 4

ఆత్మజ్ఞుఁడగు ఆతనికి జనసంకీర్ణమగు స్థానమున్ను శూన్యప్రదేశమేయగును; మఱియు, ఆపదలున్ను మహాసంపదలుగనే వర్తించును; మహారాజ్యమున నున్నను దుఃఖములనే యాతఁడు మహోత్సవములుగ నమ్మును.

అసమాధిః సమాధానం దుఃఖమేవ మహత్సుఖమ్
వ్యవహారోఽపి సన్మౌనం కర్మాణ్యేవాత్యకర్మతా. 5

అట్టి జీవన్ముక్తుఁడు, అసమాధినిన్ని సమాధిగను, దుఃఖమునున్ను మహాసుఖముగను, వచన వ్యవహారమునున్ను మౌనముగను, కర్మలనున్ను గొప్ప అకర్మత్వముగను దలంచును.

జాగ్రదేవ సుషుప్తస్థో జీవన్నేవ మృతోపమః
కరోతి సర్వమాచారం న కరోతి చ కించన. 6

మఱియు నాతఁడు జాగ్రత్తునందున్నను సుషుప్తునివలెఁ దోచువాడును (సుషుప్త సదృశమగు నిర్వికల్పాత్మయందుండువాఁడును), జీవించియున్నను (శరీరరహితమగు ఆత్మయందలి స్థితిచే) మృతునివలెఁ జూపట్టువాఁడును, సర్వాచారములను గావించుచున్నను (అకర్తయగు ఆత్మయందుఁ బ్రతిష్ఠితుఁడై యుండుటచే) ఏమియుఁ గావింపనివాఁడునై వెలయుచుండును.

రసికోఽత్యన్తవిరసో నిర్ఘృణో బన్ధువత్సలః
నిర్దయోఽత్యన్తకరుణో వితృష్ణస్తృష్ణయాన్వితః. 7

విషయసుఖములందును ఆత్మసుఖ మాత్రత్వదృష్టిచే అతిరసికుఁడును, కాని విషయ దృష్టిచే అత్యంతవిరసుఁడును, బంధువులందు ఆత్మబుద్ధిచే వాత్సల్యయుతుఁడును, పరబుద్ధిచే స్నేహవర్జితుడును, దయావిషయమగు రెండవ వస్తువునే గాంచనందుచే నిర్దయుఁడును, తన శరీరమునందువలె నితర శరీరమునందును సుఖదుఃఖములను వీక్షించుటచే అత్యంత కరుణాసహి

తుఁడును, పరిపూర్ణుడైయుండుటచే తృష్ణారహితుఁడును, అజ్ఞజనోద్ధారమును గావింప తలంపుచే నట్టివారి హితమును గూర్చిన తృష్ణతోఁ గూడియుండువాఁడునై జీవన్ముక్తుఁ డొప్పుచుండును.

సర్వాభినన్దితాచారః సర్వాచారబహిష్కృతః
వీతశోకభయాయాసః సశోక ఇవ లక్ష్యతే. 8

మఱియు, సర్వులచేఁ బ్రశంసింపఁబడు ఆచరణగలవాఁడైయు, సర్వాచారములకంటెను వేఱుగనున్నవాడును, శోక, భయ, ఆయాసరహితుఁడైయు, అజ్ఞానుల దుఃఖములను గాంచుటచే శోకయుక్తునివలె నుండువాఁడునై భాసిల్లుచుండును.

తస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే తు సః
పరముద్వేగమాపన్నః సంసృతౌ రసికోఽపి సన్. 9

ఆతనివలన లోకము భీతిఁజెందదు! లోకమువలన నాతఁడు భీతిల్లడు; ఇతరుల దృష్టియందు సంసారమున రసికుఁడైయున్నట్లు చూపట్టినను, అతఁడు పరమవైరాగ్యమును బొందియున్నవాడే యగును.

నాభినన్దతి సంప్రాప్తం నాప్రాప్తమభివాఞ్ఛతి
ఆస్తేఽనుభూయమానేఽర్థే నచ హర్షవిషాదయోః. 10

ప్రాప్తించిన దానినిగూర్చి సంతోషింపడు, ప్రాప్తింపనిదానిని వాంఛింపడు; హర్షవిషాదములకు హేతుభూతములగు పదార్థముల ననుభవించినను నాతఁడు హర్షవిషాదముల బొందకయే యుండును.

దుఃఖితే దుఃఖితకథః సుఖితే సుఖసంకథః
ఆస్తే సర్వాస్వవస్థాసు హృదయేనాపరాజితః. 11

దుఃఖులందు దుఃఖప్రసంగమును, సుఖులందు సుఖప్రసంగమును గావించుచునాతఁడు హృదయమున సర్వావస్థలందును సమముగనేయుండును. సుఖదుఃఖముల వేనిచేతను జయింపఁబడక వెలయుచుండును.

కర్మణః సుకృతాదన్యదస్మై కించిన్న రోచతే
స్వభావ ఏవ మహతాం నను యన్న విచేష్టితమ్. 12

ఓ రామచంద్రా! అట్టి జీవన్ముక్తునకు పుణ్యకర్మతప్ప మఱియేదియు రుచింపదు. శాస్త్ర నిషిద్ధమగు కర్మ నాచరింపకుండుట మహాత్ముల స్వభావమేయైయున్నది గదా!

నాలమ్బతే రసికతాం నచ నీరసతాం క్వచిత్
నార్థేషు విచరత్యర్థీ వీతరాగః సరాగవత్. 13

మఱియు, జ్ఞాని దేనియందును ఆసక్తి గల్గియుండడు ప్రేమవర్జితుఁడైయు నుండడు; ధనముల కొఱకై యాచకుఁడై సంచరింపడు. ఆతఁడు రాగరహితుఁడైనను రాగయుక్తునివలె గోచరించును.

యథా శాస్త్రవ్యవహృతేః సుఖదుఃఖైః క్రమాగతైః
అనాగతేఽపి చాయాతి న హర్షం న విషాదితామ్. 14

శాస్త్రానుకూలములగు వ్యవహారములందు క్రమప్రాప్తములగు సుఖదుఃఖములచే వాస్తవముగ స్పృశింపఁబడకయున్నను నాతఁడు స్పృశింపఁబడినవానివలెఁ దోచును. కానిహర్ష విషాదముల నెన్నఁటికిని బొందనేరడు.

సంప్రహృష్టాశ్చ లక్ష్యన్తే లక్ష్యన్తే దుఃఖితాస్తథా
న స్వభావం త్యజన్త్యన్తః సంసారారభటీనటాః. 15

అట్టి జ్ఞానులు సుఖకారణములచేఁ బ్రసన్నులుగను, దుఃఖ కారణములచే దుఃఖితులుగను నున్నట్లు పైకిఁ దోచినను, లోన తమనిరతిశయానందజనితమగు ధీరస్వభావమును ద్యజింపకయే యుందురు. కావున, హర్షవిషాదాది చిహ్నవిడంబనముతోడ వారు సంసారమను నాట్యరచనయందలి నటులవలెనే యొప్పుదురు.

ఆత్మీయేష్వర్థజాతేషు మిథ్యాత్మసు సుతాదిషు
బుద్బుదేష్వివ తోయానాం న స్నేహస్తత్త్వదర్శినామ్. 16

తత్త్వజ్ఞులు తమయొక్క ధనాదులందును, మిథ్యారూపులగు పుత్రాదులందును క్షణికములగు జలబుద్బుదములందువలె స్నేహము (అసక్తి) లేకయుందురు.

అస్నేహ ఏవ సుఘన స్నేహార్ద్రహృదయో యథా
వత్సలాం దర్శయన్వృత్తిం జ్ఞస్తిష్ఠతి యథాక్రమమ్. 17

అట్లు స్నేహరహితుఁడై యున్నను జ్ఞాని ఘనీభూతమగు స్నేహముచే ఆర్ద్రమైన హృదయముగలవానివలె వాత్సల్యత్వమును, ప్రేమపూర్ణమగు వృత్తినిదర్శింపఁజేయుచు యథాక్రమముగ స్థితినొంది యుండును.

వాయూనివ ప్రవాహస్థాః స్పృశన్తి విషయాన్మృధా
దేహసత్తావిషాన్మూఢా నీయన్తే విషయోదరే. 18

మూఢులు దేహమునే ఆత్మయనితలంచి యట్టి దేహాత్మబుద్ధి రూపమగు విషముచే సంతాప మూర్ఛితులవలె, కామాదిసంతాపముయొక్క శమనముకొఱకై అత్యాసక్తితోటి విషయములందు విలీనులగుచున్నారు, అట్లు విలీనులైనను, తపించిన వైతరణీనదీ ప్రవాహమందలి నారకిపురుషుఁడు పైభాగమందలి వాయువును స్పృశించినట్లు, ఆ విషయములను వ్యర్థముగ నొకింత స్పృశించు చున్నారేగాని అనాసక్తితోటి పూర్ణముగ ననుభవించి విశ్రాంతినొందఁ జాలకున్నారు.

బహిః సర్వసమాచారమన్తః సర్వార్థశీతలమ్
నిత్యమన్తరనావిష్ట ఆవిష్ట ఇవ తిష్ఠతి. 19

ఇఁక తత్త్వజ్ఞుఁడైతే బాహ్యమున సర్వశిష్టాచారములఁ గావించుచు, అభ్యంతరమున సర్వపదార్థములందును శీతలుఁడైవర్తించును. మఱియు, నిత్యము అంతరంగమున దేనియందును బ్రవేశింపక యున్నవాఁడై వెలసినను, బాహ్యమునఁ బ్రవేశించినవానివలెనే తోచుచుండును.

శ్రీరామ ఉవాచ :—

స్వరూపమీదృశం తస్య కో వేత్తి మునినాయక
వదసత్యమసత్యం వా భవత్యజ్ఞో హ్యపీదృశః. 20

శ్రీ రాముఁడు:— ఓ మునీంద్రా! ఇట్టి యా జ్ఞానియొక్క స్వరూపము సత్యమైనదో, అసత్యమైనదో యెవఁడెఱుఁగఁ గలఁడు? ఏలయనిన, అజ్ఞానియు దంభముచే నిట్టి చిహ్నములతోటి చూపట్టునుగదా.

అశ్వవద్బ్రహ్మచర్యేణ చరన్తోఽదారుచేతసః
మిథ్యా తపస్విదార్ఢ్యాయ భవన్త్యేవంవిధా మునే. 21

ఓ మునీశ్వరా! అశ్వమువలె బ్రహ్మచర్యము నాచరించుచు, కపటహృదయులై జ్ఞానులవలె నటించునట్టి కలుషచిత్తులగు దాంభికులైన అజ్ఞానులున్ను మిథ్యాకల్పితమగు స్వతపః ప్రఖ్యాతి యొక్క దార్ఢ్యముకొఱకై యిట్టి లక్షణములతోనే గూడియుందురుగదా!

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

అసత్యం వాస్తు సత్యం వా స్వరూపం వరమీదృశమ్
విద్ధి వేదవిదాం త్వేష స్వభావానుభవస్థితః. 22

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! సత్యమైనను, అసత్యమైనను సరియే, పైఁజెప్పిన లక్షణములతోఁగూడిన స్వరూపము శ్రేష్ఠమైయున్నది. కావున దానిను పేక్షింపఁదగదు. వేదవేత్తలగు తత్త్వజ్ఞులకట్టి స్వరూపము అనుభవబలముచే స్వభావముగనే ప్రతిష్ఠితమైయుండునుగాని దంభ,హఠములచే సంపాదింపఁబడునదికాదు.

అనావిష్టా విచేష్టన్తే వీతరాగాః సరాగవత్
గతహాసా హసన్త్యజ్ఞాన్సహసా కరుణాకులాః. 23

జ్ఞానులగువారు రాగవర్జితులును, క్రియాఫలములం దాసక్తిలేని వారునైయున్నను రాగయుక్తునివలె చేష్టల సల్పుచుందురు. హాస్యరహితులైయున్నను వెంటనే కరుణాపూర్ణులై అజ్ఞానుల గూర్చి నవ్వుచుందురు.

చిత్తాదర్శగతం దృశ్యం సర్వం కపటకుట్టిమమ్
పశ్యన్త్యసత్పరిజ్ఞాతం స్వప్నే హేమేవ హస్తగమ్. 24

ఆత్మజ్ఞానులీదృశ్యము నంతయును, చిత్తమను అద్దమును బొందిన కపటభూమి వలెను, ఎఱుఁగఁబడిన స్వప్నమందలి హస్తమందున్న సువర్ణమువలెను అసత్తుగ వీక్షింతురు.

అన్తః శీతలతామేషాం తాం న జానన్తి కేచన
దూరాచ్చన్దనదారూణామామోదమివ జన్తవః. 25

దూరమునుండి చందనవృక్షములయొక్క సుగంధమును జంతువు లెఱుఁగఁజాలనట్లు, ఇట్టి జ్ఞానుల యంతఃకరణమునందలి శీతలత్వమును అజ్ఞాను లెవరును నెఱుఁగఁజాలరు.

యే తు విజ్ఞాతవిజ్ఞేయాస్తాదృశాః పావనాశయాః
జానన్తి తాం తథైవాన్తరహేః పాదానివాహయః. 26

సర్పములయడుగులను సర్పములే యెఱుఁగఁగల్గునట్లు జ్ఞేయము నెఱిఁగిన వారును, పవిత్రహృదయులునగు జ్ఞానులే జ్ఞానుల అంతఃశీతలత్వము నెఱుఁగఁగలరు.

భావం నిగూహయన్త్యేతే తముత్తమమనుత్తమాః
గ్రామ్యైర్ధనైః కిలానర్ఘ్యః కశ్చిన్తామణిరాపణే. 27

సర్వోత్తమములగు జ్ఞానులు తమయుత్తమభావముల (స్వగుణాదివిషయముల) నెప్పుడును దాచిపెట్టుదురు. గ్రామనగరాలందలి ధనములచేఁ గొన నశక్యమైనట్టి చింతామణిని బజారునందెవఁడు వెల్లడి చేయును?

తస్మిన్నిగూహనే భావో యతస్తేషాం న దర్శనే
నిర్వాసనా గతద్వైతా గతమానాః కిలాఙ్గ తే. 28

ప్రియుఁడవగు రామచంద్రా! తత్త్వజ్ఞానుల తాత్పర్యము తమ స్వగుణాది అభ్యంతర విషయములను దాటుటయందే గలదుగాని అజ్ఞానులవలె వెల్లడి చేయుటయందు గాదు. ఏలయనిన వారుఖ్యాతిమానాదులందు రాగములేనివారును, వాసనావర్జితులును ద్వైతశూన్యులునై యున్నారు.

ఏకాన్తామానదౌర్గత్యజనావజ్ఞాస్త్వయస్తు తాన్
సుఖయన్తి యథా రామ నతథైవ మహర్ధయః. 29

ఓ రామచంద్రా! జ్ఞానులగు మహాత్ములను, ఏకాంతము, ప్రతిష్ఠాపూజాదుల అభావము దారిద్ర్యము జనులవలనగల్గు అవమానము మున్నగునవి యెట్లు సుఖపెట్టునో, అట్లు మహాబుద్ధి సిద్ధులున్నుగూడ సుఖపెట్టజాలవు (ఏలయనిన ప్రతిష్ఠాపూజాదులందుఁ బెక్కువిక్షేపములచే వారి ఆత్మసుఖానుభవమునకు విచ్ఛేదము గల్గును.)

స్వసంవేదనసంవేద్యసారా విదితవేద్యతా
నైషా దర్శయితుం శక్యా దృశ్యతే న చ తద్విదా. 30

స్వానుభవముచేతనే యెఱుఁగఁబడునట్టి నిరతిశయానందము గల్గియున్న ఆత్మజ్ఞత యేది గలదో, అదియితరులకు జూపుటకు శక్యముకాదు. ఏలయనఁగా అది ఆత్మజ్ఞానికిగూడ దృష్టిగోచరము కానేరదు. స్వప్రకాశమగు స్వాత్మరూపముచేతనే స్వయముగ అనుభూతమగును.

గుణం మమేమం జానాతు జనః పూజాం కరోతు మే
ఇత్యహంకారిణామీహా న తు తన్ముక్తచేతసామ్. 31

నా యీ గుణమును ప్రపంచ మెఱుఁగుగాక! జనులు నన్నుబూజించుగాక! అను నిట్టి భావము అహంకారులకే గల్గియుండునుగాని ముక్తచిత్తులకు (జ్ఞానులకు) కాదు.

క్రియాఫలాని దివ్యోమ గమనాదీని రాఘవ
అజ్ఞానామపి సిద్ధ్యన్తి మన్త్రౌషధివశాదిహ. 32

ఓ రాఘవా! ఈ ప్రపంచమున మంత్రౌషధాదుల బలముచే ఆకాశగమనాది సిద్ధులున్ను, క్రియాఫలాదులున్ను అజ్ఞానులకుఁగూడ సిద్ధించును.

యో యాదృక్ క్లేశమాధాతుం సమర్థస్తాదృగేవ సః
అవశ్యం ఫలమాప్నోతి ప్రబుద్ధోఽప్యజ్ఞ ఏవ వా. 33

ఎవఁడెట్టి (ఆకాశగమనాదిసిద్ధి ప్రయత్నరూపమగు శారీరక మానసిక) క్లేశమును ధరింప సమర్థుఁడగునో, అతఁడట్టి ఫలమును అవశ్యము పొందును. జ్ఞానియైనను అజ్ఞానియైనను సరియే.

ఆమోదశ్చన్దనస్యేవ స్పన్దనస్య ఫలం హృది
సర్వస్యైవాస్తి తన్నూనం తద్వశా సమవాప్యతే. 34

చందనముయొక్క సుగంధము చందనమందున్నట్లు, విహితనిషిద్ధకర్మలయొక్క ఫలము సర్వుల హృదయమందును గలదు. అయ్యది కాలక్రమమున అవిర్భూతమై యద్దానికర్తచే నిక్కముగఁ బొందఁబడుచున్నది.

అహన్తావాసనాద్వైతం వస్తుతా దృశ్యవస్తుషు
యస్యాస్త్యసౌ సాధయతి ఖగమాదిక్రియాఫలమ్. 35

సిద్ధిరూపములగు దృశ్యవస్తువులందెవనికి 'నేను భోక్తనగుదును' అహంకారవాసనా రూపమగు పరిచ్ఛిన్నమైన ఆత్మకల్పన గలదో, అతఁడే ఆకాశగమన సిద్ధ్యాది క్రియాఫలమును సాధించును.

ఇదం న కించిద్యాత్ర నిర్వాణం చేతి జ్ఞస్తు వేత్తి యః
సోఽవాసనః కర్మవాత్యాః కథం సాధయతి క్రియాః. 36

'ఈ యాకాశగమనాది సిద్ధిసమూహమంతయు తుచ్ఛమై, మనోభ్రమమాత్రమైయున్నది. అని నిశ్చయించి కేవల మధిష్ఠానమగు చిదాకాశమాత్రమునే యెవఁడెఱుఁగునో, అట్టి వాసనారహితుఁడగు తత్త్వజ్ఞుఁడు కర్మయను సుడిగాలియొక్క పరిభ్రమణములవంటి ఆకాశగమనాది క్రియాఫలముల నేల సాధించును?

నైవ తస్య కృతేనార్థో నాఽకృతేనేహ కశ్చన
న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః. 37

అట్టి ఆత్మజ్ఞున కీప్రపంచమున నేదేని కర్మచేయుటచేగాని, చేయకుండుటచేగాని యే ప్రయోజనమున్ను లేదు. మఱియు నాతనికి సర్వభూతములందును ప్రయోజనము నిమిత్తమాశ్రయింపవలసిన వస్తువేదియును లేదు.

నాఽదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా క్వచిత్
ఉదారమనోవృత్తేర్లోభాయ విదితాత్మనః. 38

ఉదారచిత్తుఁడగు ఆత్మజ్ఞుని ప్రలోభమొనర్చునట్టి వస్తువేదియు భూలోకమునగాని [illegible] [illegible] లేదు.

జగదేవ తృణం యస్య న కించిద్రజ ఏవ వా
కిం నామ తస్య భవతు అన్యదాదేయతాం గతమ్. 39

ఎవనికి జగతంతయు తృణప్రాయమైయున్నదో, ఎవనికి రజోగుణములేదో, అట్టి ధీరుఁడగు జ్ఞానికి ఆత్మకన్యముగ నెద్ది గ్రహింపనగును?

నిర్వాహితజగద్యాత్రః పరిపూర్ణమనా మునిః
యథాస్థితమసావాస్తే సంప్రయాతి యథాగతమ్. 40

లోకసంగ్రహార్థము జగద్వ్యవహారములను నిర్వహించువాఁడును, పరిపూర్ణచిత్తుఁడును, ఆత్మస్వరూపమున యథారీతి స్థితిగల్గియుండువాఁడునగు ముని యథాప్రాప్తములగు శిష్టాచారముల ననుసరించును.

నిత్యాన్తఃశీతలో మౌనీ సత్త్వీభూతమనోవనిః
పరిపూర్ణార్ణవాకారో గమ్భీరప్రకటాశయః. 41

మఱియు, జ్ఞాని నిత్యము అంతఃకరణమున శీతలుఁడై, మౌనియై, సత్త్వయుక్తమగు మనస్సు తోటి సర్వులను రక్షించువాఁడై పూర్ణసముద్రమువలె నొప్పువాఁడై, గంభీర ప్రకటాశయ యుక్తుఁడై వెలయుచుండును.

రసాయనపరాపూర్ణాహ్రదవత్ హ్లాదమాత్మని
ధత్తే కరోతి వాన్యస్య సకలేన్దురివామలః. 42

అమృతముచేఁ బరిపూర్ణమగు సరస్సువలె జ్ఞాని తనయందానందమును ధరించును. మఱియు నిర్మల, పూర్ణచంద్రునివలె నితరులకును నానందమును గొలుపును.

మన్దారమఞ్జరీకుఞ్జపిఞ్జరా దేవభూమయః
న తథా హ్లాదయన్త్యేతా యథా పణితబుద్ధయః. 43

బోధనములద్వారా జ్ఞానుల బుద్ధి మనుజుని నెట్లానందపఱచునో, అట్లు మందారలతా కుంజములచేఁ బూర్ణములైన దేవతల నందనవనభూములున్ను ఆనందపఱుపఁజాలవు.

చన్ద్రబిమ్బైర్వసన్తైశ్చ మహతామహతాశయైః
సారం సౌభాగ్యసౌగన్ధ్య సారభాలోకభోగిషు. 44

వివేకియగువాఁడు గ్రీష్మర్తుసంబంధములగు ప్రకాశయుతములైన చంద్రబింబములనుండియు, సుగంధయుక్తములగు వసంతకాలమునుండియు, సౌభాగ్యయుతులగు తత్త్వవేత్తల రాగాది రహితములగు ఆశయములనుండియు సారమును గ్రహించును.

భ్రాన్తిమాత్రమిదం విశ్వమిన్ద్రజాలమసన్మయమ్
త్యజతీతి వినిశ్చిత్య దినానుదినమేషణాః. 45

అట్టి సారగ్రహణముచే వివేకి యీప్రపంచము భ్రాంతిమాత్రమనియు, ఇంద్రజాలమువలె అసన్మయమనియు బాగుగ నిశ్చయించి కోర్కెలను ప్రతిదినము త్యజించివైచుచుండును.

శీతాతపాదిదుఃఖాని నిజదేహగతాన్యపి
అన్యదేహగతానీవ జ్ఞః పశ్యత్యవహేలయా. 46

మఱియు జ్ఞాని, తనదేహమును బొందినవైనను శీత, ఆతపాది దుఃఖములను అన్యుని దేహమును బొందినవానివలె అనాదరముతోటి గాంచును.

కరుణోదారయా వృత్త్యా వృత్త్యా వ్రతతిధీరయా
నీరసో నీరసారాం తు సారతాం సరతి స్థితిమ్. 47

ఇతరులకొఱకై ఫలపుష్పాదులను ధరించు లతవలె కరుణతోడను, ఉదారవృత్తితోడను జ్ఞాని యితరులఁ బాలించుచుండును. మఱియు స్వయముగ విరక్తుఁడై (లతవలె) యథాప్రాప్తమగు జల మాత్రముచేనైనను సంతుష్టినొందును.

వ్యవహారం యథాప్రాప్తం లోకసామాన్యమాచరన్
చరాచరాణాం భూతానాముపర్యేవావతిష్ఠతే. 48

యథాప్రాప్తమైనట్టి లోకసామాన్యమగు వ్యవహారమాచరించుచుఁ దత్త్వజ్ఞుఁడు చరాచర భూతములకు పైగనే విలసిల్లును.

ప్రజ్ఞాప్రాసాదమారూఢ స్త్వశోచ్యః శోచతే జనాన్
భూయిష్ఠానివ శైలస్థః సర్వాన్ప్రాజ్ఞోఽనుపశ్యతి. 49

ప్రజ్ఞయను మేడపైనెక్కి జ్ఞాని, స్వయముగ దుఃఖరహితుఁడైయున్నను, అజ్ఞానుల కొఱకై దుఃఖించును. మఱియు పర్వతముపై నున్నవాఁడు భూమిపైనున్నవారిని వీక్షించునట్లు, అట్టిప్రాజ్ఞుడు సర్వజనులను వీక్షించుచుండును.

చిరం కల్లోలవలితః సుమనా జలధౌ భ్రమే
పరం పారముపాగత్యపరాం విశ్రాన్తిమేతి సః. 50

భ్రమయను సముద్రమున కామక్రోధాదులను తరంగములచే చిరకాలమావరింపఁబడినవాఁడై తుదకు జ్ఞానమను నావచే తీరమునుబొంది సుమనస్కుఁడగు జ్ఞాని పరమవిశ్రాంతిని బొందుచున్నాడు.

హసన్త శాన్తయా వృత్త్యా ప్రాక్తనీర్జాగతీర్గతీః
స్మయమాన ఇవాస్తేఽన్తర్జనతాశ్చ ఘనభ్రమాః. 51

మఱియు, తత్త్వజ్ఞుఁడు తన పూర్వకాలిక సంసారస్థితులనుగూర్చి శాంతముగనవ్వుకొనుచు ఘనమగు అజ్ఞానభ్రమతోఁగూడియున్న జనులఁగూర్చి లోన చిరునగవు నవ్వుచుండును.

ఏతాః కాన్తారనిర్మగ్నమితాః సంసారదృష్టయః
అసత్యో హృతవత్యో మామిత్యన్తర్యాతి విస్మయమ్. 52

'అరణ్యమున మార్గముతప్పిన అంధునితో పోల్పఁదగిన యీ సంసారము యొక్క అసత్య దృష్టులు నన్ను విమోహితుని జేయఁజూచుచున్నవని' తలంచి యాతఁడు లోన విస్మయమొందును.

దృష్ట్వాష్టగుణమైశ్వర్యమనిష్టం మే తృణాయతే
ఇత్యుపైత్యుపశాన్తత్వాత్స్మయమానోఽపి న స్మయమ్. 53

'సౌభాగ్యవశమున అష్టనిధైశ్వర్యములు నాకు అరిష్టములై, తృణమువలె భాసించుచున్నది' అని యిట్లు తలంచి జ్ఞాని యొకింత నవ్వుచుండును. కాని గర్వమును మాత్రము బొందకుండును.

కశ్చిద్గిరిగుహాగేహః కశ్చిత్పుణ్యాశ్రమాశ్రయః
కశ్చిద్గృహస్థాశ్రమవాన్కశ్చిద్బహుం రటస్స్థితః. 54

కశ్చిద్భిక్షాచరాచారః కశ్చిదేకాన్తతాపసః
కశ్చిన్మౌనవ్రతధరః కశ్చిద్ధ్యానపరాయణః. 55

కశ్చిద్విపశ్చిద్విఖ్యాతః కశ్చిచ్ఛ్రోతా శ్రుతేః స్మృతేః
కశ్చిద్రాజా ద్విజః కశ్చిత్కశ్చిదజ్ఞ ఇవ స్థితః. 56

గుటికాఞ్జనఖడ్గాదిసిద్ధః కశ్చిన్నభోగతః
కశ్చిచ్ఛిల్పకలాజీవీ కశ్చిత్పామరరూపభృత్. 57

కశ్చిత్త్యక్తసమాచారః కశ్చిచ్ఛ్రోత్రియనాయకః
కశ్చిదున్మత్తచరితః ప్రవ్రజ్యాం కశ్చిదాశ్రితః. 58

జ్ఞానులలో నొకఁడు పర్వత గుహలందు వసించుచుండును. మఱియొకఁడు పుణ్యాశ్రమములందు నివసించుచుండును వేఱొకఁడు గృహస్థాశ్రమమందుండును; ఇంకొకఁడెక్కువ సంచారము సల్పుచుండును; ఒకఁడు భిక్షాటనమాచరించుచుండును; ఒకఁడేకాంతమునఁ దాపసియై వర్తిల్లును; ఒకఁడు మౌనవ్రతమును ధరించియుండును; మఱియొకఁడు ధ్యానపరాయణుఁడై యుండును; ఒకఁడు విఖ్యాతుఁడగు పండితుఁడై యొప్పుచుండును; ఇంకొకఁడు శ్రుతిస్మృతులను శ్రవణము చేయుచుండును, ఒకఁడు రాజైయుండును; ఒకఁడు బ్రాహ్మణుడై విలసిల్లును; ఒకఁడు అజ్ఞానివలె నొప్పుచుండును; మఱియొకడు గుటిక, అంజన, ఖడ్గాదులచే ఆకాశగమనాది సిద్ధులఁ బొందును; ఒకఁడు శిల్పకళచే జీవిక నిర్వహించుకొనుచుండును; ఒకఁడు పామరునివలె రూపము ధరించియుండును; ఒకఁడు అచారము లన్నింటిని విడిచివైచును; ఇంకొకఁడు వేద వేత్తలలో నగ్రగణ్యుఁడై వెలయుచుండును; వేఱొకఁడు పిచ్చివానివలె వ్యవహరించుచుండును; మఱియొకఁడు సన్న్యాసమును గ్రహించియుండును.

పురుషో న శరీరాది న చ చిత్తాది కించన
పురుషశ్చేతనం నామ న స నశ్యతి కర్హిచిత్. 59

పురుషుఁడు (ఆత్మ) శరీరాదులు కాడు. చిత్తాదులున్ను కాడు; చేతనమాత్రుడేఁయై యున్నాడు; అతడెపుడును నశింపడు.

అచ్ఛేద్యోఽసావదాహ్యోఽసావక్లేద్యోఽశోష్య ఏవ చ
నిత్యః సర్వగతః స్థాణురచలోఽసౌ సనాతనః. 60

అట్టి చైతన్యరూపుఁడగు పురుషుఁడు దేనిచేతను ఛేదింపఁబడడు; దహింపఁబడడు; తడుపఁబడడు; ఎండింపఁబడడు; అతఁడు నిత్యుఁడు, సర్వవ్యాపి; స్థాణువువలె నిశ్చలుఁడు; సనాతనుఁడు,

ఇతి సమ్యక్ప్రబుద్ధో యః స యథా యత్ర తిష్ఠతి
తథా తిష్ఠతు తత్రాత్ర స్థానాస్థానియమేన కిమ్. 61

ఇట్టి చిత్ పురుషుని బాగుగ నెఱిఁగినట్టి పురుషోత్తముఁడగు జ్ఞాని యిఁక నెచట నెట్లుండునో, అచట నట్లే యుండుగాక! వర్ణాశ్రమాది స్థానములచేగాని, నియమములచేగాని యాతని కేమి ప్రయోజనము?

పాతాలమావిశతు యాతు నభో విలఙ్ఘ్య
దిఙ్మణ్డలం భ్రమతు పేషణమేవ యేన
చిన్మాత్రమేతదజరం నతు యాతు నాశ
మాకాశకోశ ఇవ శాన్తమజం శివం తత్. 62

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే మరణాద్యభావోపదేశో నామ
ద్వ్యుత్తరశతతమః సర్గః ॥ 102 ॥

ఓ రామచంద్రా! తత్త్వజ్ఞాని పాతాళమందు ప్రవేశించుగాక! ఆకాశము నుల్లంఘించి పైకి జనుగాక! దిశలందు పరిభ్రమించుగాక! అట్టి భ్రమణమందు మానసోత్తర లోకాలోకాది పర్వతములచే చూర్ణమైపోవుగాక! కాని చిన్మాత్రుఁడగు అతని స్వరూప మెప్పుడును నశింపకయే యుండును. ఏలయనిన, అది ఆకాశకోశమువలె ప్రశాంతియై, నిరుపద్రవమై, నిత్యమై, అసంగమై, అద్వయమై, అజమై నిరతిశయానందమయమైనట్టి శివపదమై వెలయుచున్నది

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
మరణాద్యభావోపదేశమను నూటరెండవ సర్గము ॥ 102 ॥

త్ర్యధికశతతమః సర్గః

[చితో నిత్యత్వమేకత్వం స్వాతంత్ర్యమపి సాధ్యతే
సచ్ఛాస్త్రస్యాస్య మాహాత్మ్యం హితం చాత్రోపదిశ్యతే

చైతన్యముయొక్క నిత్యత్వ ఏకత్వ స్వాతంత్ర్యములు సాధింపఁబడుట సచ్ఛాస్త్రము యొక్క మాహాత్మ్య హితము లుపదేశింపఁబడుట యిచట వర్ణింపఁబడుచున్నవి,]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

భామాత్రం భానమాత్రం వా శాన్తం భాసత ఏవ చ
చిన్మాత్రం యదనాద్యన్తం తస్య నాశః కథం కదా. 1

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! జాగ్రత్స్వప్న సుషుప్తులను త్రివిధావస్థలందును సాక్షియై ప్రకాశమాత్రమై విషయములను ప్రకాశింపఁజేయునదై అనాదియై అనంతమై శాంతరూపముగ భాసించునదైనట్టి యే చి... శము గలదో, అద్దాని నాశ మెచట నెట్లు సంభవించును?

తావన్మాత్రం చ పురుషః కదాచిత్స న నశ్యతి
యది నశ్యతి చిన్మాత్రం భూయో జాయేత కిం కథమ్. 2

అట్టి చిన్మాత్రుఁడే పురుషుఁడు. అతఁడెన్నఁడును నశింపఁడు. చిన్మాత్రము నశించుచో మఱల యేది యెట్లుత్పన్నము కాఁగలదు? (సాక్షిలేనిచో సృష్టియే అసంభవముగాన.)

న చాన్యదన్యచ్చిన్మాత్రం క్వచిత్కించన కస్యచిత్
సర్వానుభవసాదృశ్యే కీదృశీ నామ సాన్యతా. 3

చైతన్యముకంటె వేఱైనట్టి మఱియొక చైతన్య మెప్పుడును నెవరికిని సంభవింపఁజాలదు. ఏలయనిన, చైతన్యము అనుభవమాత్రమైయున్నదిగాన, పూర్వ ఉత్తరకాలములందు అనుభవమాత్రమున సర్వాంశములందును సమానత్వమే వర్తించుచున్నందున చైతన్యమునకు భిన్నత్వ మెప్పుడును గలుగనేరదు.

సర్వస్యైవ హిమం శీతముష్ణోఽగ్నిర్మధురం పయః
చిన్మాత్రస్యావదాతస్య కీదృగన్యత్వమత్ర తు. 4

అట్లే పురుషభేదముచేగూడ చైతన్యమునకు భేదము గలుగఁజాలదు. ఏలయనఁగా చిన్మాత్రమున కెల్లెడలను హిమము శీతలముగను అగ్ని యుష్ణముగను క్షీరము మధురముగనే యనుభూతమగుచున్నది. అట్టిచో ఈ శుద్ధ చిన్మాత్రమునకిఁక భేదమెట్లుండును?

శరీరనాశే నాశశ్చేచ్చిన్మాత్రస్య తదుచ్యతామ్
హర్షస్థానే విషాదః కిం మరణే సంసృతిక్షయే. 5

ఒకవేళ, చార్వాకాదుల మతము ననుసరించి శరీర నాశముచే చిన్మాత్రమున్ను నశించునని యనినచో, అపుడు మరణముచే సంసారక్షయ మగుటఁబట్టి అట్టి మరణమును హర్షింపఁదగిన స్థానమున నిఁక విషాదమేల?

న చ నామ శరీరస్య నాశే నశ్యతి చిన్నభః
దేహే నష్టేఽపి బన్ధూనాం మ్లేచ్ఛైర్దృష్టా పిశాచతా. 6

కాని, శరీరనాశముచే చిదాకాశ మెప్పుడును నశింపదు. ఏలయనగా, బంధువుల శరీరము నశించినను మ్లేచ్ఛులు వారి పిశాచత్వమును గాంచుచునేయున్నారు.

యావచ్ఛరీరసత్తా చేచ్చేతనస్య తదుచ్యతామ్
శవః కస్మాన్న చలతి సత్యఖణ్డే శరీరకే. 7

శరీరమెంతవఱకుండునో, అంతవఱకు చైతన్యసత్త యుండుననుటయు యుక్తముకాదు. ఏలయనిన, మరణానంతరము శవము ఖండింపఁబడక యున్నను నయ్యది యేల చలించుటలేదో (చైతన్యయుక్తమైయుండుటలేదో) వచింపుము?

పిశాచానుభవో జీవధర్మశ్చేత్తత్స సర్వదా
కిం న పశ్యతి కిం బన్ధౌ మృతే పశ్యతి తత్తథా. 8

మరణించిన బంధువుయొక్క పిశాచమును గాంచుట మ్లేచ్ఛుని స్వభావమై యున్నదనినచో, అట్టి పిశాచమును జీవించియుండు బంధువందేల గాంచుటలేదు? మరణించిన పిదపయే యేల గాంచుచున్నాఁడు?

జీవధర్మో విశిష్టశ్చేత్తాదృశత్వం నరః కథమ్
మిథ్యా దేశాన్తరమృతే పిశాచత్వం న పశ్యతి. 9

బంధువుయొక్క మరణమునుగూర్చిన జ్ఞానముతోఁ గూడుకొని యున్నపు డాతని పిశాచమును గాంచుట జీవుని ధర్మమై యున్నదనినచో, దేశాంతరమునఁ గల్పితమగు బంధువుయొక్క మిథ్యా మరణమునుగూర్చి వినునపుడును అతని పిశాచము నేల గాంచుటలేదు?

తస్మాత్సర్వాత్మకం త్వేతత్చిన్మాత్రం న నియన్త్రితమ్
యద్యద్యత్ర యథా వేత్తి తత్తత్తత్రావగచ్ఛతి. 10

ఈ ప్రకారముగ చైతన్యముయొక్క భేదమున్ను, వినాశమున్ను అసంభవమగుటచే నయ్యది సర్వాత్మకమై, నిత్యమై, వస్తుకృత పరిచ్ఛేదముచేతను నియమింపఁబడనిదైయున్నది. మఱియు, నది యే యే దేశ కాలములందుఁ దన్నెవ్విధమున నెఱుఁగుచున్నదో, అచట నట్లాయా వస్తు రూపముగ దన్ననుభవించుచున్నది.

అబాధితైవైకఘనా సంవిద్భవతి యాదృశీ
తాదృశ్యైవానుభూతిర్హి తత్స్వభావోఽత్ర కారణమ్. 11

చిద్ఘనమగు సంవిత్తు సత్యసంకల్ప యుక్తమగుటచే అబాధిత మగుటవలన సృష్ట్యాదియందు స్వసంకల్పముచే నేయేరీతి యగుచున్నదో అయా రీతిగనే నేఁటికిని సర్వులకు ననుభూతమగుచున్నది. ఇట నద్దాని స్వభావమే కారణమైయున్నది.

అన్యన్న సంభవత్యత్ర సర్గాదావేవ కారణమ్
యన్నామ తదిదానీం స్యాత్కథ్యతాం కిదృశం కథమ్. 12

సృష్ట్యాదియందు సత్యసంకల్పయుక్తమగు బ్రహ్మ సంవిత్తుకంటె అన్యముగ మఱి యే కారణమున్ను సంభవింపఁజాలదు. సంభవించినచో నది యెట్టిదియో ఏ రీతి సంభవించునో యిపుడు తెలుపుదు?

సర్గాదావేవ నోత్పన్నానచైవాద్యావభాసతే
వికల్పశ్రీర్జగద్భాసా కేవలం భాతి చిన్నభః. 13

ప్రధాన, పరమాణ్వాది వికల్పసమూహ మెద్దియు సృష్ట్యాది యందుత్పన్నముకాలేదు. ఇపుడును భాసించుటలేదు; ఈ జగత్ప్రకాశ రూపముతోటి కేవలము చిదాకాశమే భాసించుచున్నది.

అభాసమాత్రమేవేదం దృశ్యమిత్యవబుధ్యతే
దృశ్యమిత్యవబోధేన తదృతే స్యాత్క్వ దృశ్యతా. 14

దృశ్యమని యెఱుఁగఁబడుచున్న యిది యంతయు చైతన్యముయొక్క వివర్త మాత్రమే యైయున్నది. ఉదాహరణ మృగతృష్ణానదీ జలములందువలె ఈ జగత్తునందు అధిష్ఠాన చిదాకాశము తప్ప వేఱు సత్యత్వ మెచట?

నచమత్కార చాతుర్యం చారుచిన్నభసారసాత్
బోధేన బుధ్యతే దృశ్యమిత్యబోధాన్న బుధ్యతే. 15

కేవలము ఉత్తమమగు చిదాకాశముయొక్క చమత్కార రూపమైన చాతుర్యమే యీ దృశ్యమైయున్నది. ఇయ్యది జాగ్రత్స్వప్నముల బోధచే నెఱుఁగఁబడుచున్నది. సుషుప్తియందు బోధ లేనందుచే నెఱుఁగఁబడుటలేదు.

బోధోఽబోధశ్చ తద్రూపమేవమేవ నిరామయమ్
భేదోఽత్ర వాచి నత్వర్థే తస్మాన్నాస్త్యేవ దృశ్యతా. 16

బోధయు, అబోధయు రెండును నిరామయమగు చైతన్యముయొక్క రూపములేయైయున్నవి. ఇందుభేదము 'రాహువుయొక్క శిరస్సు' అను వాక్యమందువలె కేవలము వచనమాత్రమందేగాని అర్థమందుఁగాదు. కావున వాస్తవముగ దృశ్యమెద్దియు లేకయేయున్నది.

యా చాసీద్దృశ్యతైషాం తాం విద్ధి త్వమవిచారణామ్
సా చేదానీం విచారేణ వినష్టాతః క్వ దృశ్యతే. 17

ఓ రామచంద్రా! లేక, పదార్థముల దృశ్యత్వమేది గలదో, అది చిత్ - తత్త్వమును గూర్చిన అవిచారణ యనియే యెఱుఁగుము. విచారణచే నిపుడా యవిచారణ నశింపఁజేయఁబడినచో నిఁక దృశ్యత్వ మెచటనుండును?

అస్మిన్నేవ ధియో యత్న ఆత్మజ్ఞానవిచారణే
యత్నేన పరమోఽభ్యాసః స లోకద్వయ సిద్ధిదః. 18

కాఁబట్టి, ఇట్టి ఆత్మజ్ఞాన విచారణయందే బుద్ధియొక్క తీవ్రప్రయత్నము సలుపవలయును. యత్నముచేఁ గావింపఁబడు విచారణయొక్క గొప్ప అభ్యాసము ఇహపరలోకములందును సిద్ధిదాయకమైయున్నది.

అవిద్యోపశమస్త్వేష జాతోఽపి భవతామిహ
అభ్యాసేన వినా సాధో న సిద్ధిముపగచ్ఛతి. 19

సాధువగు రామచంద్రా! నీకిచట ఉపదేశవాక్యములచే అవిద్య యుపశమించినప్పటికిని, జీవన్ముక్తి - ప్రతిష్ఠయొక్క సిద్ధియైతే అభ్యాసము లేక సంభవింపనేరదు.

నోద్వేగం సంపరిత్యజ్య గృహీత్వానుదినం క్షణమ్
లోకద్వయహితం పథ్యమిదం శాస్త్రం విచార్యతామ్. 20

శమాది సాధనసంపన్నుఁడగు మనుజుఁడు భయమును, సోమరితనమును, చింతను వీడి. ఉభయలోకములందును హితమును గలుగఁజేయునదియు, మిగుల యోగ్యమైనదియునగు యీ మహారామాయణమను శాస్త్రమును ప్రతిదినము కొంతసేపు విచారింపవలయును.

విజ్ఞాతమప్యవిజ్ఞాతమాత్మజ్ఞానమిదం భవేత్
భవతాం భూరిభాగానాం సంభూయాభ్యసనం వినా. 21

మీకు ఆత్మజ్ఞానము తెలిసియున్నప్పటికిని. అసంభావనాది అనేకదోషములతోఁగూడి యుండుటవలన, పరస్పర కథన, బోధన, చింతనాద్యభ్యాసము లేకుండినచో మఱపువలన, తెలియని దాని చందముననే యుండును.

యోయమర్థం ప్రార్థయతే తదర్థం యతతే తథా
సోఽవశ్యం తమవాప్నోతి న చేచ్ఛ్రాన్తో నివర్తతే. 22

ఎవఁడేవస్తువునుగూర్చి ప్రార్థించునో, అతఁడు దానికొఱకై ప్రయత్నమున్ను జేయును. మఱియు శ్రమచే నద్దానినుండి నివర్తింపనిచో తప్పక దానిఁ బొందఁగలఁడు

తస్మాదస్మాన్నివర్తధ్వమసచ్ఛాస్త్ర విచారణాత్
శాన్తిం ప్రాప్స్యథ సచ్ఛాస్త్రాజ్జయలక్ష్మీం యథా రణాత్. 23

కావున అనాత్మశాస్త్రవిచారణనుండి మరలి మీరు సచ్ఛాస్త్రములనే విచారింపుఁడు. అట్టిచో యద్ధముచే జయలక్ష్మిని బొందునట్లు మీరు శాంతిని దప్పక బొందఁగలరు.

వివేకే చావివేకే చ వహత్యేషా మనోనదీ
యత్రైవ వాహ్యతే యత్నాత్తత్రైవ స్థితిమృచ్ఛతి. 24

ఈ మనస్సను నది వివేక, అవివేకములను రెండువైపులగూడ, ప్రవహించుచున్నది. అందొకవైపు ప్రవాహము నరికట్టి ప్రయత్నముచే దానిని మఱియొకవైపునకుఁ ద్రిప్పినచో, అది యచటనే స్థితి బొందియుండును.

అస్మాచ్ఛాస్త్రాదృతే శ్రేయో న భూతం న భవిష్యతి
తతః పరమబోధార్థమిదమేవ విచార్యతామ్. 25

(మహారామాయణమను) ఈ అధ్యాత్మశాస్త్రముకంటె వేఱైనట్టి యుత్తమ వివేక సాధన మింతవఱకెపుడును నుండియుండలేదు; ఇఁకముందును నుండఁబోదు. కావున, పరమబోధకొఱకై దీనినే విచారింపుఁడు.

స్వయమేవ విచార్యేదం పరో బోధోఽనుభూయతే
సంసారాధ్వశ్రమహరో న త్వేతద్వరశాపవత్. 26

సంసారమార్గముయొక్క శ్రమను హరించునట్టి యీ శాస్త్రమునే విచారించినచో వెంటనే స్వయముగ ఆత్మతత్త్వబోధము అనుభూతమగును. అంతేగాని ఇయ్యది వరశాపాదులవలె కాలాంతరమున ఫలము కలుగఁజేయునదికాదు.

యన్న పిత్రా న వా మాత్రా న చాపి సుకృతైః కృతమ్
శ్రేయస్తద్వః పరిజ్ఞాతమిదమాశు కరిష్యతి. 27

ఏశ్రేయమును మీకు తల్లిగాని, తండ్రిగాని, ఇతరములగు సుకృతములుగాని, కలుఁగ చేయలేవో, దానిని విచారణచే నెఱుఁగఁబడిన యీ శాస్త్రము మీకుఁగలుగఁ జేయఁగలదు.

భవబన్ధమయీ సాధో విషమేయం విషూచికా
ఆత్మజ్ఞానాదృతే దీర్ఘా న కదాచన శామ్యతి. 28

సాధువగు రామచంద్రా! సంసారబంధమయమై, అతిభయంకరమై, దీర్ఘమైనట్టి యీ (అజ్ఞానమను) మహామారి ఆత్మజ్ఞానములేకున్న యెన్నఁడును నశింపదు.

మహామోహమయీ మాయా మిథ్యైవాహమితి స్థితా
శాస్త్రార్థభావనేనాశు ముచ్యతాం పరశోచ్యతా. 29

ఓ జనులారా! అహంకారరూపమున మిథ్యగనే స్థితినొందియున్నట్టి మహామోహమయ మగు ఈ మాయనున్ను దానిచేగల్గు మహద్దుఃఖమునున్ను ఉత్తమశాస్త్రార్థ భావనచే శీఘ్రముఁగ ద్యజించి వేయుఁడు.

యాత మాఽఽపాతమధురం వ్యోమ వ్యోమైకరూపిణీమ్
శూన్యం వాయుం పిబన్తోఽస్తగ్లేలిహానా ఇవాహయః. 30

ఆకలి గొనిన సర్పములు రసహీనమగు వాయువును నాకు చుండునట్లు విచారింపని కారణముచే మధురముగఁ దోచునట్టి శూన్యమైన విషయసమూహము నాస్వాదించుచు అనంతమైన యీ సంసారమున మీరు తగుల్కొనకుఁడు.

యాన్తి వో దివసాః కష్టమవిజ్ఞాతగమాగమాః
వ్యవహారేహితై రేవ ప్రతిపాలయతాం మృతిమ్. 31

ఆహా! ఎట్టి ఖేదకరమైన విషయము వ్యవహార చేష్టలచే మీయొక్క దివసములు గమనా గమనము లెఱుఁగఁబడినవై వ్యర్థముగ గడచిపోవుచున్నవి; కావున మృత్యువు కాచుకొనియే యున్నదని యెఱిఁగి అయ్యది తటస్థింపకమునుపే సచ్ఛాస్త్రవిచారణాదులచే ఆత్మతత్త్వము శీఘ్రముగఁబడయుఁడు.

తావదాశ్వాసనైషాస్తి భవతాం భవభాగినామ్
దినాని కతిచిద్యావన్నాయాతి మరణావధిః. 32

భయయుక్తులగు మీకెంతవఱకు గొన్నిదినములలో మరణమను అయువుయొక్క అవధి రాక యుండునో, అంతవఱకు మాత్రమే సచ్ఛాస్త్రాశ్రలంబనముచే ధైర్యముంద వీలగును.

అగచ్ఛన్త్యాం మృతౌ కష్టం పరితాపముపాప్స్యథ
తం యత్రాగ్న్యగ్నివిచ్ఛేదః శీతచన్దనలేపనమ్. 33

ఇఁక మృత్యువు తటస్థింపు ఎచట అగ్నులయొక్క విచ్ఛేదమున్ను శీతలమగు చందన లేపమువలె ననుభవింపవలసి యుండునో, అట్టి కష్టదాయకమగు పరితాపమును బొంద గలరు.

క్రీణన్తి ప్రాణపణ్యేన భవం భూతాం మనస్త్రభమాః
యథాశాస్త్రైః కథం బుద్ధ్యా న క్రీణన్త్యజరం పదమ్. 34

ఆహా! ఘనీభూతమైన భ్రమతోఁగూడు కొనినట్టి మూఢులగు జనులు యుద్ధాదులందుఁ దమప్రాణమను మూల్యమొసంగియైనను ధన జయాభిమానములఁ గొనుచున్నారేగాని శాస్త్రోక్తము లగు వివేకవైరాగ్య శ్రవణాద్యుపాయములచేఁ బ్రాప్తింపు తత్త్వబుద్ధిచే అజరమగు మోక్షపదము నేల కొనుటలేరు? ఆశ్చర్యము!

పదం పరమయత్నేన క్రియతే యైశ్చిదమ్బరే
కథం తైః సహ్యతేఽజ్ఞానశత్రుపాదః స్వమూర్ధని. 35

ఏ వివేకులు స్వతత్త్వజ్ఞానమాత్రముచే చిదాకాశమున స్థితిఁ బొందుచున్నారో, అజ్ఞాన శత్రువధాసమర్థులగు అట్టి సర్వోత్కృష్టులు సచ్ఛాస్త్రాదుల యుపేక్షద్వారా తమశిరముపై అజ్ఞానమను శత్రువుయొక్క పాదము నెట్లు సహింతురు ?

నిర్మాన మోహమాపన్నా గతిం గచ్ఛత మాధమామ్
క్రియతే స్వాత్మ బోధేన మూలకాషో మహాపదామ్. 36

ఓ సభ్యులారా! మీరు అభిమాన మోహముల నడఁచునట్టి దృఢవివేకమును బొందినవారై తత్త్వము నెఱిఁగి మోక్షగతిని బడయుఁడేగాని అధమమగు సంసారగతిని బడయకుఁడు. ఆత్మజ్ఞానముచే గొప్ప యాపదలున్ను సమూలముగ నశింపఁజేయఁబడు చున్నవి.

ప్రలపన్తమహోరాత్రం యుష్మదర్థేన మామిమమ్
యం ప్రపశ్యేదమాకర్ణ్య స్వాత్మనైవాత్మ తార్ప్యతామ్. 37

కంఠశోషాది శ్రమలకోర్చి రాత్రిందినములు మీకొఱకై యఱచుచు పాటుపడుచున్న యీ నన్నవలోకించి దయచేసి యీ నావచనములను ఆదరముతోఁ వినిస్వయముగ దేహాదులం దాత్మబుద్ధిని వీడి, అపరిచ్ఛిన్నమగు బ్రహ్మాత్మ భావమును బొందుఁడు.

అద్యైవ న చికిత్సాం యః కరోతి మరణాపదః
సంప్రాప్తాయాం మృతౌ మూఢః కరిష్యతి కిమాతురః. 38

ఎవఁడు మరణమను ఆపదకిపుడే చికిత్సయొనర్పఁడో, అట్టి మూఢుఁడు మరణము తటస్థించినపుడు, బాధితుఁడై యేమిచేయఁగలడు ?

అస్మాద్గ్రన్థాదృతే గ్రన్థో నాన్యః స్వాత్మావబోధనే
నూనమర్థకరో గ్రాహ్యస్తిలస్తైలార్థినామివ. 39

ఆత్మావబోధనమందు ఈ (వాసిష్ఠ మహారామాయణ) గ్రంథముతప్ప మఱియొక యుత్తమమైన గ్రంథములేదు కావున, తైలమును గోరువారు తిలలను గ్రహించునట్లు, మోక్షసాధకు లిద్దానిని నిక్కముగ గ్రహింపవలయును.

ఆత్మజ్ఞానమిదం శాస్త్రం ప్రకాశయతి దీపవత్
పితేవ బోధయత్యాశు కాన్తేవ రమయత్యలమ్. 40

మఱియు, ఈ గ్రంథము దీపమువలె ఆత్మజ్ఞానమును బ్రకాశింపఁజేయును. తండ్రివలె శీఘ్రముగ బోధనయొనర్చును. స్త్రీ వలె బాగుగ నానందింపఁజేయును.

విద్యమానమపి జ్ఞానం జ్ఞాతం శాస్త్రగణాన్న యత్
దుర్బోధం మధురం తత్తు జ్ఞాస్యస్మీతో న సంశయః. 41

నిత్యప్రాప్తమైనను ఏ ఆత్మరూపమగు జ్ఞానము అతి దుర్బోధమగుటచే శాస్త్రాంతరముల చేతను దెలియఁబడక యున్నదో, అద్దాని నీ గ్రంథముచే జనులు సులభముగ నెఱుఁగఁ దెలిసికొనగలరు. ఇట సంశయమేమియును లేదు.

ఇదముత్తమమాఖ్యానం ముఖ్యానాం శాస్త్రదృష్టిషు
సుఖేన బోధదం హృద్యమపూర్వం నతు కించన. 42

శాస్త్రదృష్టులందలి ముఖ్యములైన ఆఖ్యానముల మధ్య ఈ యాఖ్యాన ముత్తమమైనది. మఱియు నియ్యది సులభముగ బోధించునదియు, మనోహరమైనదియునై యొప్పుచున్నది, ఇందు అనాదికాలమునుండి వచ్చుచున్న తత్త్వవేత్తల సంప్రదాయమునకు విరుద్ధమైనట్టి స్వకపోల కల్పితమైనది యొకింతైనను లేదు.

నానాఖ్యానకథాచిత్రే వినోదేన విచారయేత్
ఇదం శాస్త్రం పరం యాతి పుమాన్నాస్త్యత్ర సంశయః. 43

వివిధములగు ఆఖ్యానములతోఁడను, కథలతోఁడనుగూడి విచిత్రమైయున్నట్టి యీ (వాసిష్ఠ మహారామాయణ) శాస్త్రమును మనోరంజనము కొఱకైనను మనుజుఁడు విచారించుచో నిక్కముగ పరమాత్మ బోధను బొందఁగలడు. ఇందు సంశయమేమియును లేదు.

యో హ్యద్యాపి న సంప్రాప్తః పణ్డితైరవిఖణ్డితైః
స ఇతః ప్రాప్యతే బోధః సువర్ణమివ సైకతాత్. 44

ఏ జ్ఞానమును పూర్ణశాస్త్రజ్ఞులగు పండితులున్ను నేఁటివఱకుఁ బొందలేదో, అట్టి జ్ఞానమీ శాస్త్రమునుండి బంగారుగనియందు ఇసుకనుండి బంగారు పొందఁబడునట్లు-పొందఁబడుచున్నది.

శాస్త్రకర్తరి మజ్జ్కవ్యం న కదాచన కుత్రచిత్
శాస్త్రార్థ ఏవ తన్నిత్యం యుక్తియుక్తానుభూతిదే. 45

బోధనుగూర్చిన సంశయముచే నెపుడును నెచటను శాస్త్రముయొక్క కర్తయందు మగ్నుఁడు కాఁగూడదు. యుక్తి యుక్తమై, అనుభవదాయకమైనట్టి యాతని శాస్త్రార్థమందే సదా మగ్నుడైఁ యుండవలెను.

అజ్ఞానాన్మత్సరాన్మోహాదవిచారిభిరేకతా
అవహేలితశాస్త్రార్థైః కర్తవ్యా నాత్మహన్తృభిః. 46

అజ్ఞానముచేతను, మాత్సర్యముచేతను, మోహముచేతను ఈ శాస్త్రార్థములను దిరస్కరించునట్టి విచారహీనులగు ఆత్మహంతకులతో నెన్నఁడును మైత్రి సలుపఁగూడదు.

జానామ్యేవ యథైవేమా యదహంత్వం యథా ధియః
తథా బోధితకారుణ్యాత్స్వభావో హి మమేదృశః. 47

ఓ రామచంద్రా! శ్రోతలగు వీరున్ను, నీవున్ను ఎట్టి అధికారి విశేషణములతో గూడియున్నారో, మీ బుద్ధులెట్లు శ్రవణ, ధారణాభ్యాస సమర్థములైయున్నవో, నేనెట్లు మీ యుపదేశ

ముకొఱకై మీ తండ్రిగారి యానతిని బొందియుంటినో, అదియంతయు నేను బాగుగ నెఱింగియే యున్నాను. కావున నట్టి మీ భాగ్యోదయముచే నుద్భూతమగు కారుణ్యమువలన నేను మీ యుపదేశమునకై, ప్రవృత్తుఁడనై మీతోటి మైత్రి సలుపుచున్నాను. ఇట్లు దీనులయెడ సదా కరుణ గల్గి దయాళుత్వము వహించుట నా స్వభావమే యైయున్నది.

యుష్మత్పుణ్యవిల్లవః శుద్ధ ఏవం వక్తుమిహ స్థితః
అహం నరో న గన్ధర్వో నామరో న చ రాక్షసః. 48

లేక, మీయొక్క శుద్ధమై, సూక్ష్మమైనట్టి ఆత్మయే మీయొక్క పుణ్యవశముచే ఈ ప్రకారముగ వసిష్ఠరూపముచే మీ కుపదేశించుటకై మీతోడ మిత్రత్వము గావించి యిట నున్నది. అంతేగాని, నిజముగ నేను మనుష్యుఁడనుగాను, గంధర్వుఁడనుగాను, దేవతనుగాను రాక్షసుఁడనుగాను.

సంవిన్మాత్రా భవన్తో హి తద్భావోఽస్త్యతినిర్మలః
స్థితోఽస్మీతి భవత్పుణ్యైర్నను నాస్మి న చాపరః. 49

మీరందరున్ను ఆత్మమాత్రస్వరూపులే. అట్టి అతి నిర్మలమైన మీయొక్క ఆత్మయే రూపముగాగల నేను మీ పుణ్యములచే నిట మీ కుపదేశించుటకై స్థితినొందియున్నాను. ఓ సఖ్యులారా! మీ యాత్మకంటె నేనొకింతైనను వేఱుకాను.

శ్యామాయమానా నాయాన్తి యావన్మరణవాసరాః
సారః సంగ్రహియతాం తావద్వైరస్యం వస్తుదృష్టిషు. 50

కావున అంధకారమయములగు మరణదినములు రాకపూర్వమే నన్ను అప్తునిగ నెఱిఁగి నా యుపదేశముయొక్క ప్రథమసారమగు సర్వపదార్థముల యెడల వైరాగ్యముఁ అను దాన్నిని సంపాదింపుఁడు,

ఇహైవ నరకవ్యాధేశ్చికిత్సాం న కరోతి యః
గత్వా నిరౌషధం స్థానం స రుజః కిం కరిష్యతి. 51

ఎవఁడిలోకమునందే నరకమను వ్యాధికి చికిత్స గావింపక యుండునో, అట్టివాఁడు ఔషధములులేని స్థానమునకేగి, నరకరోగముచే బాధితుడై యేమి చేయఁగలఁడు?

సర్వభావేషు వైరస్యం న యావత్సముపాగతమ్
భావానాం భావనా తావత్తానవం నోపగచ్ఛతి. 52

సర్వ పదార్థములందును వైరాగ్యమెంతవఱకుఁ బొందఁబడకయుండునో, అంతవఱకును ఆ పదార్థములయొక్క వాసన సన్నగిలనేరదు.

ఆత్మానమలముద్ధర్తుం వాసనాతానవాదృతే
నాస్త్యుపాయో మహాబుద్ధే కశ్చనాపి కదాచన. 53

మహాబుద్ధివగు రామచంద్రా! ఆత్మను బూర్ణముగ నుద్ధరించుటకొఱకై వాసనలను సన్నగిలఁజేయుట తప్ప మఱియొక యుపాయమెద్దియు నెచటను నెపుడును లేదు,

భావాస్తు యది విద్యన్తే తద్ధి తేవస్తుభావనా
కిం త్వేతే నైవ సన్తీహ శశశృఙ్గాదయో యథా. 54

పదార్థములు సత్యములగుచో, వానిఁగూర్చిన వాసన యుక్తమగును. కానియవి శశశృంగాదులవలె లేకయేయున్నవిగదా! (ఇఁకనట్టి వానియందాసక్తియేల?)

సర్వ ఏవ జగద్భావా అవిచారితచారవః
అవిద్యమానసద్భావా విచారాద్విశరారవః. 55

ప్రపంచమందలి సమస్తపదార్థములున్ను సత్యత్వములేనివై, విచారింపని కారణముచేతనే రమణీయములుగ భాసించుచున్నవి. విచారించినచో నయ్యవి అసద్రూపములుగనే తోచును,

ప్రామాణిక విచారేషు న విద్యన్తే కృతేషు యే
కథం సన్తి జగద్భావాస్తే కేసన్తి సదైవ వా. 56

ప్రామాణిక (వేదాంతానుసార) విచారములు గావింపఁబడ ఏపదార్థములు లేకయుండునో అవి యెట్టి స్వరూపముగలవి? ఏకవస్తుస్వరూపములా! లేక, సర్వవస్తుస్వరూపములా? ఎల్లపుడున్నవా లేక ఒకానొకపుడు మాత్రమేయున్నవా? (అనఁగా చైతన్యముకంటె వేఱుగ ఆ పదార్థములు మిథ్యయని భావము.)

సర్వ ఏవ జగద్భావాః కారణాభావతో భృశమ్
సర్గాదావేవ నోత్పన్నా యచ్చేదం భాతి తత్పరమ్. 57

కారణముయొక్క అభావముచే జగత్తునందలి పదార్థములన్నియు సృష్ట్యాదియం దొకింతైనను నుత్పన్నములు గాకయేయున్నవి కావున, ఈ జగత్తెయ్యది భాసించుచున్నదో, అది బ్రహ్మమే యగును.

పదే సర్వేన్ద్రియాతీతే మనఃషష్ఠేన్ద్రియాత్మనామ్
భావానాం కారణం నాస్తి మనఃషష్ఠేన్ద్రియాత్మకమ్. 58

సర్వేంద్రియముల కతీతమగు బ్రహ్మపదమున మనస్సహితములైన సర్వేంద్రియముల యొక్క వేద్యములగు విషయములయొక్క కారణము మనస్సహిత షష్ఠేంద్రియము లెన్నఁటికిని గాఁజాలవు. ఇంద్రియముల కతీతమగు కేవలము చిన్మాత్రమైనట్టి బ్రహ్మమున నింద్రియములు గాని, ఇంద్రియవేద్యములగు విషయములుగాని సంభవింపనేరవుగదా!

భావానాం వివిధాఖ్యానామనాఖ్యం కారణం కుతః
కుతో వస్తున్యవస్తుత్వం వ్యోమన్యవ్యోమతా కుతః. 59

అనేకవిధములైన నామరూపములతోఁగూడిన పదార్థములయొక్క కారణము నామరూప రహితమగు బ్రహ్మము కాఁజాలదు. ఏలయనిన వస్తువునందు అవస్తుత్వము, శూన్యమున శూన్యత్వము ఎటుల సంభవించును?

సాకారస్య హి సాకారం వటధానాదివద్భవేత్
బీజం తద్యస్తు సాకారం జాయతేఽన్యత్కుతోఽన్యథా. 60

సాకారములగు వటవృక్షాదుల కారణము సాకారములగు వటబీజాదులగును. ఇట్లు సాకారమునుండియే సాకారము జనించునుగాని నిరాకారమునుండి కాదు. కావున నిరాకారమగు బ్రహ్మము సాకారమగు జగత్తునకు కారణము కాఁజాలదు.

న కించిదపి యత్రాస్తి బీజమాకృతిమన్మనాక్
తత ఆకృతి మద్విశ్వం భవతీతి విడమ్బనమ్. 61

దేనియందు సాకారమగు బీజమొకింతైనను లేకయున్నదో, అద్దానినుండి సాకారమగు ఈ జగత్తు కలుగుచున్నదనుట అర్థశూన్యమగు వాక్యమే యగును.

కార్యకారణభావాది తస్మిన్నహి పరే పదే
వాచాలత్వేన యన్నామ కల్ప్యతే మౌర్ఖ్యమేవ తత్. 62

ఆ సర్వోత్కృష్టపదమగు బ్రహ్మమున కార్యకారణభావాదు లెవ్వియునులేవు. ఉన్నట్లు వాచాలత్వముచే నొకవేళ కల్పింపఁబడినచో నది కేవలము మూర్ఖత్వమే యగును.

సహకారి నిమిత్తానామభావే హి న కారణాత్
కార్యం భవేదన్యదేతి బాలైరప్యనుభూయతే. 63

సహకారికారణములు లేనపుడు కారణమునుండి కార్యమెన్నఁడును గలుగఁజాలదను విషయము బాలురచేతనుగూడ ననుభవింపఁబడుచున్నది.

తన్మాత్రవేదనం భూయః పృథ్వ్యాదీనాం చ కారణమ్
కిమస్తి కథ్యతాం ఛాయా కథమాస్తే వదాతపే. 64

జగదాకార జ్ఞానమువలనను పృథ్వ్యాది జడపదార్థములయొక్క కారణము చైతన్య మెన్నటికిని గాఁజాలదు. సూర్యరశ్మియందు ఛాయ యెట్లుండగలదో వచింపుము?

పరమాణుసమూహో యే జగదిత్యవ్యవాస్తవమ్
శశశృఙ్గం ధనుః ప్రఖ్యమజ్ఞానాదభిధీయతే. 65

పరమాణు సమూహములున్ను జగత్తుయొక్క కారణము కానేరవు. ఏలయనిన, 'కుందేటికొమ్ము ధనుస్సువలె నున్నదను' వాక్యము అజ్ఞానముచేతనే వచింపఁబడుచున్నది.

పరమాణు సమూహశ్చేత్సంభూయ కురుతే జగత్
యదృచ్ఛయైవ తమసి శీర్యతే చ యదృచ్ఛయా. 66

పరమాణు సమూహములుకలిసి తమయిష్టము చొప్పున జగత్తును నిర్మించుచున్నచో తమయిష్టముచొప్పుననే యవి యాకాశమున శిథిలములైయు పోవుచున్నవి.

తదఙ్గమిఙ్గతే నిత్యం దేశే దేశే గృహే గృహే
అపూర్వాత్మరజః శృఙ్గం ఖ్యాతం వా స్యాద్దినేదినే. 67

అపుడు, జగత్తుయొక్క అవయవములగు పరమాణువులు నిత్యము పడుచు, లేచుచు అపూర్వముగ సంచరించుచుండుటచే నవికలిసి ప్రతిదినము గృహ గృహమునకును, దేశ దేశమును పర్వతశిఖరములుగగాని, కూపములుగగాని యేల యగుటలేదు?

న చ తద్దృశ్యతే కించిత్కస్య తత్కర్మ తాదృశమ్
భవేద్వ్యర్థమభవ్యస్య జడాస్తు పరమాణవః. 68

మఱియు పరమాణు రూపమగు నిరవయవద్రవ్య మెపుడును నెవనికిని గానుపించుట లేదు. కిటికీలగుండా ప్రసరించు సూర్యకిరణములందైతే త్రసరేణువులే కన్పించుచున్నవి. త్రసరేణువుల అవయవపరంపరయొక్క అవధినిరవయవమగు పరమాణువనియు ననుమానింపఁబడదు. ఏలయనిన, నిరవయవమగుదానియందు సంయోగముయొక్క అయోగ్యత్వముచే ద్రవ్యత్వములేదు. ఆకాశపుష్పమువలె అతీంద్రియములగు పరమాణువుల యొక్క సంయోగముచే జగద్రచన గావించుట యెవరికర్మ? సంసారిదా? అసంసారిదా? పరమాణువుల సంయోగముచే జగన్నిర్మాణము గావించుటయందు సంసారికి సామర్థ్యములేదనుట స్పష్టమేయైయున్నది. అపుడు అసంసారిదే యగును. అసంసారియైతే యొకపరమేశ్వరుడున్ను, జడపదార్థమున్ను మాత్రమేయగును. ఈ యిరువురిలో పరమేశ్వరుఁడు నిత్యముక్తుఁడగుటచే నాతనికి జగన్నిర్మాణము నిష్ప్రయోజనమగును. ఇఁక జడములగు పరమాణువులో స్వతః జగన్నిర్మాణము గావింపఁజాలవు.

నాబుద్ధిపూర్వం తత్కర్మ సంభవత్యఙ్గ కస్యచిత్
బుద్ధిపూర్వం తు యద్వ్యర్థం కుర్యాదున్మత్తకో హి కః. 69

ప్రియుఁడవగు రామచంద్రా! మనస్సుచేతను అచింత్యమైనట్టి యద్భుతరచనలతోఁ గూడిన యీ జగత్తు అబుద్ధిపూర్వకముగ నెవనిచేతను రచింపఁబడఁజాలదు. ఇఁక బుద్ధిపూర్వకముగనో, వ్యర్థమగు కార్యమునే యున్మత్తుఁడొనర్చును?

జడస్య బుద్ధిపూర్వేహా మరుతో నాస్తి తాం వినా
న సంభవత్యణుచయో నాన్యత్కర్త్రోపపద్యతే. 70

జడమగు వాయువునకు బుద్ధిపూర్వకమగు చేష్టసంభవింపదు. అట్టి చేష్టలేనిచోఁ పరమాణువుల సంగ్రహము కావింపఁబడదు. కావున పరమాణువులు జగత్కారణము కానేరవు. ఇవ్విధమున, జడములగు పరమాణువులుగాని, సర్వజ్ఞుఁడగు పరమేశ్వరుఁడుగాని జగత్కారణము కానందుచేతను, అన్యమగు జీవసమూహమంతయును ప్రళయమున దేహరహితముగుటవలనను, సృష్ట్యాదియందు జగత్తునకు కర్త యెవరును తగుటలేదని సిద్ధించుచున్నది.

వయమాత్మాన ఏవేమే భాత్మానః భాత్మకా జనాః
తథా స్థితా యథా స్వప్నే భవతాం స్వప్నమానవాః. 71

'కర్తలేనిచో, జగత్తు ఉత్పన్నమే కానిదగుటవలన మనమందఱ మెవరము? ఎట్లీజగత్తునందున్నాము'? అనినచో, మేము మీరు యీసమస్తజనులున్ను చిదాకాశరూపులమే యైయున్నాము. మఱియు నీయొక్క స్వప్నమందు స్వప్నమానవులెట్లు స్థితిగల్గియుందురో, అట్లే మనమందఱ మిచట స్థితిగల్గియున్నాము.

తస్మాన్న జాయతే కించిద్విశ్వం నాపి చ విద్యతే
ఇత్థం చిన్నభ ఏవాచ్ఛం ప్రకచత్యాత్మనాత్మని. 72

కాఁబట్టి యీ ప్రపంచమేదియు నుత్పన్నమగుటలేదు. విద్యమానమై యుండుటలేదు. ఈ సమస్తరూపముచే నిర్మలమగు చిదాకాశమే తనయందుఁదాను స్ఫురించుచున్నది.

విశ్వాకాశం చిదాకాశే విష్వగ్విశ్రాన్తిమాగతమ్
స్పన్దో ద్రవత్వం శూన్యత్వమనిలేఽమ్భసి ఖే యథా. 73

ఇక్కారణమున వాయువందు స్పందము (చలనము) వలెను, జలమందు ద్రవత్వము వలెను, ఆకాశమందు శూన్యత్వమువలెను, ఈ జగదాకాశము చిదాకాశమున అభిన్నరూపముతోటి మహా విశ్రాంతినొందియున్నది.

దేశాద్దేశాన్తరప్రాప్తౌ నిమేషేణాతిదూరతః
సంవిదో యద్వపుర్మధ్యే చిద్వ్యోమ్నో విద్ధి తద్వపుః 74

ఓ రామచంద్రా! ఒకప్రదేశమునుండి అదూరముననున్న మఱియొక ప్రదేశమునకు క్షణకాలములో దృష్టి చనునపుడు ఆ రెండు ప్రదేశముల మధ్యనున్నట్టి నిర్విషయమగు సంవిత్తు (జ్ఞానము) యొక్క స్వరూపమేదిగలదో, అదియే చిదాకాశముయొక్క స్వరూపమని యెఱుఁగుము.

స స్వభావో హి సర్వేషామర్థానాం తే చ తన్మయాః
తాదృశాస్తన్నభోరూపాస్తేన విశ్వమతో నభః. 75

ఆ చిదాకాశమే సమస్తపదార్థముయొక్క పరమార్థస్వరూపమైయున్నది. పదార్థములన్నియు వాస్తవముగ చిదాకాశమయములేయై వెలయుచున్నవి. కాఁబట్టి జగత్తు చిదాకాశరూపమే గాని శూన్యాకాశరూపముగాదు.

స్వభావస్య పరావృత్తిర్న నాగేవాశు తస్య సా
స్వభావాదవిభిన్నైవ సేదం జగదితి స్థితా. 76

ఆ చిదాకాశముయొక్క తన స్వరూపముకంటె అభిన్నముగాని రీతియొకింత వివర్తభావముతో శీఘ్రముగ నొందిన పరివర్తన మేదిగలదో, అదియే జగద్రూపముగ స్థితినొందియున్నది. (వివర్తభావము = రజ్జుసర్పమువంటి భావము.)

జగచ్చిన్నభసోస్తస్మాన్న కదాచన భిన్నతా
ఏకమేవ ద్వయో రూపం పవనస్పన్దయోరివ. 77

కావున జగత్తు చిదాకాశముల కెపుడును భేదములేదు. వాయు స్పందములవలె ఆ రెండును నొకేరూపము గల్గియున్నవి.

దేశాద్దేశాన్తరప్రాప్తౌ విదో మధ్యే హి యద్వపుః
శాన్తాశేషవిశేషాత్మ తన్ముఖ్యం నేతరద్విదుః. 78

నిమిషమాత్ర కాలములో నొకప్రదేశమునుండి దూరముననున్న మఱియొక ప్రదేశమునకు దృష్టి చనునపుడు ఆ రెండు ప్రదేశముల మధ్యనుండు సర్వ విశేషరహితమగు సంవిత్తు (జ్ఞానము) యొక్క స్వరూపమేదిగలదో. అదియే చిదాకాశముయొక్క స్వరూపము. కావున నదియే ముఖ్యమైన అనుభవముయొక్క స్వరూపముగాని మఱియొకటి కాదని చెప్పుదురు.

స స్వభావోఽఙ్గ భూతానాం తత్ర తిష్ఠన్తి పణ్డితాః
తస్మాన్న విచలన్త్యేతే నిత్యధ్యానాద్ధరాదయః. 79

ప్రియుడఁనగు రామచంద్రా! నిర్విషయమగు ఆ చిత్సరూపమే సర్వభూతములయొక్కయు స్వభావమైయున్నది దానియందే జ్ఞానులెపుడును స్థితిగల్గియుందురు. అట్టి నిత్యధ్యానరూపమునుండి హరిహరాదులున్ను నెపుడును చలింపకయుందురు.

ఆభాసాకాశమేవేదం భామాత్రమవభాసనమ్
విశ్వమాకారరహితం స్వభావం విదురవ్యయమ్. 80

ఈ ప్రపంచమంతయు చైతన్యముయొక్క అభాసమాత్రమగు అకాశమేయైయున్నది. దీని ప్రప ముున్ను చిత్ప్రభామాత్రమే యగును. కాఁబట్టి యీ జగత్తు వాస్తవముగ అకారరహితమై అవ్యయమైనట్టి చిత్స్వభావమే గలిగియున్నదని చెప్పఁబడుచున్నది.

న జాయతే న మ్రియతే న భూత్వా భావి కుత్రచిత్
అనన్యదేవ చిద్వ్యోమ్నః శూన్యత్వమివ ఖాజ్జగత్. 81

పరమార్థముగ ఈ జగత్తెపుడును నుద్భవించుటలేదు, నశించుటలేదు. ఎచటను నుండియుండలేదు,ఉండబోదు; అకాశముకంటె శూన్యత్వము వేఱుకానట్లు ఈ జగత్తు చిదాకాశముకంటె వేఱుకానిదైయున్నది.

న విశ్వమస్తి నైవాసీన్న చ నామ భవిష్యతి
ఇదమాభాసతే శాన్తం చిద్వ్యోమ పరమాత్మని. 82

ఈ ప్రపంచ మెపుడును నుండియుండలేదు, ఉండుటలేదు, ఉండఁబోదు; శాంతమైనట్టి చిదాకాశమే నిజ పరమాత్మయందిట్లు జగద్రూపముగ భాసించుచున్నది.

చిన్మాత్రమేవ కచతి స్వప్నే పురతయా యథా
తథైవ జాగ్రదాఖ్యేఽస్మిన్స్వప్నే కచతి స్వయమ్. 83

స్వప్నమందు ఆ చిన్మాత్రమే నగరాదిరూపములుగ స్ఫురించునట్లు, ఈ జాగ్రత్తను స్వప్నమందును చిన్మాత్రమే స్వయముగ జగద్రూపముగ స్ఫురించుచున్నది.

సర్గాదావేవ భావానామసత్త్వేత్యస్తి దేహకః
కుతస్తస్మాచ్ఛరీరత్వం స్వప్నే ఏవ నభశ్చితేః. 84

సృష్ట్యాదియందే సమస్తపదార్థములయొక్క అభావము సంభవింప నిక నిపుడీ దేహమెచటనున్నది? కావున ఈ శరీరాది రూపములతోటి భాసించునది చిదాకాశము యొక్క స్వప్నమే యైయున్నది.

స్వయం భావ్యాఖ్యం శరీరం స్వం పూర్వః స్వప్నో మహాచితేః
ఇద ఉత్థానాన్తదను స్వప్నాత్స్వప్నాన్తరం వయమ్. 85

మహాచైతన్యముయొక్క ప్రథమ స్వప్నము బ్రహ్మదేవుని శరీరమైయున్నది. ఆ బ్రహ్మదేవుని శరీరమునుండి యావిర్భవించిన మనము ఆ స్వప్నముయొక్క స్వప్నాంతర రూపులవలె నున్నాము.

గణ్డస్యోపరి జాతానాం స్ఫోటానామత ఏవ నః
పరమేణ ప్రయత్నేన న మనో నామ యాస్యతి. 86

కంఠముయొక్క వాపుపై లేచిన కురుపునకు ఆ కంఠముతో సాక్షాత్ సంబంధము లేనట్లు, బ్రహ్మముయొక్క స్వప్నాంతరరూపుల మగుటచే ఆ బ్రహ్మముతో దూరసంబంధము గల్గియుండుటవలన భ్రాంతిదార్ఢ్యముచే, మన చిత్తము మహాప్రయత్నముతోఁ గూడినదైనను బ్రహ్మమందు శీఘ్రముగఁ జనుటలేదు,

బ్రహ్మైవాసత్యపురుషః సత్యవచ్చానుభూయతే
స్థితం తతః ప్రభృత్యేవ సత్యలీకమిదం తతమ్. 87

కంఠమే వాపుగను, ఆ వాపుపైని కురుపుగను నున్నదై వాస్తవముగ వానికంటె వేఱు గాకయున్నను వేఱుగ నున్నట్లు తోచు విధమునను, ఆ వేఱురూపములు అసత్యములైనను సత్యములుగ గన్పట్టునట్లును, బ్రహ్మమున్ను హిరణ్యగర్భ, వ్యష్టిజీవరూపమగు అసత్యపురుషుఁడై తద్రూపముతో సత్యముగ ననుభూతమగుచున్నది. మఱియు, ఎప్పటినుండి బ్రహ్మము జీవరూపమైయున్నదో, అప్పటినుండియు మిథ్యారూపమగు ఈ జగత్తు వ్యాపించియున్నది.

ఆబ్రహ్మస్తమ్బపర్యన్తమలీకం జాయతే జగత్
యథా స్వప్నే తథాలీకమేవమాశు వినశ్యతి. 88

బ్రహ్మదేవుని మొదలుకొని తృణముపఱకుగల యీ జగత్తంతయు స్వప్నమందువలె మిథ్యగనే యుత్పన్నమగుచున్నది. మరల స్వప్నమువలెనే శీఘ్రముగ నశించుచున్నది. అనశించుటగూడ మిథ్యయేయైయున్నది.

చిద్వ్యోమైవైత్య విశ్వత్వం యథా స్వప్నే వినశ్యతి
అనుదిత్యైవ విశ్వత్వం జాగ్రదాఖ్యే తథైవ చ. 89

స్వప్నమందు చిదాకాశమే జగద్రూపము నెట్లు ధరించుచున్నదో, మరల యెట్లా జగద్రూపము నశించుచున్నదో, అట్లే యీ జాగ్రత్తను స్వప్నమందును చిదాకాశము వాస్తవముగ జన్మనుబొందకయే జగద్రూపమగుచున్నది. (జ్ఞానప్రాప్తిచే) మరల యాజగద్రూపము నశించుచున్నద,

అనుభూతమలీకం వాప్యలీకం సత్యవత్స్థితమ్
సంవిదేవ యథా స్వప్నే నగరాదితయోదితా. 90

సాకారేవ నిరాకారా స్థితా తద్వజ్జగత్తయా
సంవిదాకాశమాకాశాదణు మేరోరణుర్యథా. 91

ఈ జగత్తు అనుభూతమైనను, సత్యముగ భాసించినను, మిథ్యయేయైయున్నది. చైతన్యము నిరాకారమైనను స్వప్న[illegible] నుదయించునట్లు, సాకారమగు ఈజగద్రూపముగ స్థితినొందియున్నది. మఱియు, మేరు పర్వతము కంటె అణువు అతిసూక్ష్మమైనట్లు, ఆకాశము కంటె చిదాకాశ మతిసూక్ష్మమైయున్నది.

కిల యత్తస్య నామ స్యాదాకాశాదణుతా కుతః
కారణాభావతోఽన్యస్య నాకార ఉపపద్యతే. 92

కాని 'ఆకాశముకంటె సూక్ష్మత్వము' చిదాకాశముయొక్క ధర్మముకాదు. ఎచట 'ఆకాశముకం[illegible]ది సూక్ష్మమైనదని' వచింపఁబడునో, అచట 'కారణాభావముచే జగత్తుయొక్క స్థూలా[illegible]గగద'ను అభిప్రాయమే యగును.

సర్గాదావేవ యో జాతో జాతోఽయం జగతః కుతః
యదేవ వేదనాకాశే పురం స్వప్నే తదేవ నః. 93

ఏ నగరాదులు సృష్ట్యాది యందే యుత్పన్నములు గాకయున్నవో, అవి యిపుడు జగత్తునుండి యెట్లుత్పన్నములగును? స్వప్నమందు. ఇటిక మున్నగునవి లేకయే నగరాదులెట్లు కానుపించుచున్నవో అట్లే యీ జాగ్రదాకాశమందును గానుపించుచున్నవి. మాకు (వేదాంత సిద్ధాంతమున) జాగ్రదాకాశమందలి పురమెట్టిదో, స్వప్నాకాశమందలి పురమున్ను నట్టిదే.

భేదః స్వప్నాద్రిచిద్వ్యోమ్నోర్న శూన్యామ్బరయోరివ
యదేవ చిన్నభో నామ తదేవ స్వప్నపత్తనమ్. 94

ఆకాశ, శూన్యత్వములందువలె, చిదాకాశ, స్వప్నపర్వతములందు భేదములేదు. ఏది చిదాకాశమో, అదియేస్వప్ననగరము. అట్లే జాగ్రత్పదార్థములకును, చిదాకాశమునకును భేదమేమియును లేదు.

యదేవ స్పన్దనం నామ స ఏవ పవనో యథా
స్పన్దాస్పన్దైకరూపాత్మా వాయుర్వ్యోమోపమస్తథా. 95

ఏదిస్పందమో, ఆదియే వాయువైనట్లును, స్పంద, అస్పందములందు ఏకరూపమైనట్టి వాయువేదిగలదో, అది యాకాశముకంటె భిన్నము కానట్లును జగచ్చిదాకాశములందును భేదము లేదు.

తస్మాచ్చిన్నభ ఏవేదం జగదాకృతి లక్ష్యతే
సర్వం శూన్యం నిరాలమ్బం భాసనం చిద్వివస్వతః. 96

కాఁబట్టి చిదాకాశమే యిట్లు జగదాకారముగఁ గానుపించు చున్నది. ఈ సమస్తమున్ను శూన్యమై, నిరాలంబమైనట్టి చిన్మాత్రమను సూర్యునియొక్క ప్రకాశమేయైయున్నది.

శాన్తమేవేదమఖిలం నిరస్తాస్తమయోదయమ్
సకృద్విభాతమమలం దృషన్మౌనమనామయమ్. 97

ఈ ప్రపంచమంతయు ఉదయాస్తమయ రహితమై, అఖండప్రకాశ రూపమై, నిర్మలమై, శిలవలె మౌనరూపమై, నిర్వికారమైనట్టి శాంతమగు బ్రహ్మమేయైయున్నది.

తస్మాద్వద కథం భావాః కుతో భావాః క్వ భావధీః
క్వ ద్వైతం క్వైకతా క్వాహం క్వభావాః క్వ చ భావనాః. 98

కావున, ఓ రామచంద్రా! ఈ పదార్థములెచట? భావాభావములఁ గూర్చిన బుద్ధులెచట? ద్వైతమెచట? ఏకత్వ మెచట? మనమెచట పదార్థములఁగూర్చిన భావన లెచట?

నిత్యోదితో వ్యవహరన్నపి నిర్వికారో
ద్వైతైక్యముక్తమతిరుత్తమశీతలోఽన్తః
నిర్వాణ ఆస్స్వ విగతామయశుద్ధబోధ
బోధైకతాముపగతోఽగ్ర న సన్తి భావాః. 99

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే సకలభావాభావోపదేశేన పరమార్థైకతా
ప్రతిపాదనం నామ త్ర్యధికశతతమః సర్గః ॥ 103 ॥

ప్రియుఁడవగు రామచంద్రా! నీవు నిర్వికార శుద్ధబోధరూపమగు ఆత్మయొక్క జ్ఞానముచే నట్టి యేకత్వమునుబొంది, నిత్యోదిత రూపుడవై, వ్యవహరించు చున్నప్పటికి, అందు అభినివేశముతేనందుచే నిర్వికారుఁడవై, ద్వైత, ఏకత్వవర్జితమగు బుద్ధిగల్గి, అంతఃకరణమున శీతలుడవై, నిర్వాణ రూపుడవై, నిరతిశయానంద స్వరూపముతో వెలయుము. ఏలయనిన, నీకు విక్షేపహేతువులగు ఈ పదార్థములు వాస్తవముగ లేకయేయున్నవి.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
సకలభావాభావోపదేశేన పరమార్థైకతా ప్రతిపాదనమను
నూట మూఁడవ సర్గము ॥ 103 ॥

చతురధికశతతమః సర్గః

[ఆకాశాదేర్హి వాయ్వాదిభావోఽనుభవతో యథా
చిత ఏవ జగద్భావోఽనుభవాదేవ సాధ్యతే.

వాయ్వాది పదార్థములు ఆకాశమునుండియే అనుభవముద్వారా జనించుచున్నవి. కావున జగత్పదార్థములన్నియు చిదాకాశమునుండియే కలుగుచున్నవని యా అనుభవము చేతనే యిచట సాధింపబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఆకాశః శబ్దతన్మాత్రం స్పర్శతన్మాత్రకోఽనిలః
తత్సఙ్ఘోత్కర్షజం తేజస్తచ్ఛాన్తిశ్చేత్యపాం స్థితిః. 1

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఆకాశము శబ్దతన్మాత్రమున్ను, వాయువు స్పర్శతన్మాత్రమున్నునైయున్నవి. ఆ యాకాశ వాయువుల సంఘర్షణముచే రూపతన్మాత్రమగు తేజము జనించెను. ఆ తేజముయొక్క యుష్ణత్వశాంతిచే రసతన్మాత్రమగు జలముయొక్క స్థితియేర్పడెను

భూరేషాం సఙ్ఘః స్వప్నాభే జగద్భానే క్రమస్త్వితి
కథం [illegible] వ్యోమ్నో మూర్తిః ప్రవర్తతే. 2

వీనియన్నింటి యొక్క సమూహరూపము గంధతన్మాత్రమగు పృథివియై యున్నది. ఈ ప్రకారముగ నిదియంతయు స్వప్నతుల్యమగు ఈ జగత్తుయొక్క భాన (ప్రకాశ) మందుఁ క్రమమై యొప్పుచున్నది. అయితే, నిరాకారమగు ఆకాశమునుండి సాకారములగు తక్కిన యీ భూతములెట్లు జనించుచున్నవను ప్రశ్న యిట నుదయించుచున్నది.

గత్వాసుదూరమప్యేతద్జ్ఞప్తేశ్చేత్పరికల్ప్యతే
తదాదావేవ సత్యర్థే దోషోఽస్మిన్క ఇవామలే. 3

'నిష్క్రియమగు ఆకాశమునుండి చలనరూపమగు వాయువు, రూపరహితమగు వాయువునుండి రూపయుక్తమగు తేజము, రసవర్జితమగు తేజమునుండి రససహితమగు జలము, గంధశూన్యమగు జలమునుండి గంధయుక్తమగు పృథివి జనించినవని అనుభవ రూపమగు జ్ఞప్తియొక్క బలము చేతనే కల్పించుచున్నాము' అనినచో, చాలదూరమేగి తుదకుజ్ఞప్తియే శరణు బొందవలసి వచ్చినచో 'ఆదియందే యాజ్ఞప్తియే స్వప్నాదులందువలె సర్వజగద్రూపమును వివర్త భావముచే ధరించుననియు ఇట్లు బ్రహ్మమే సర్వపదార్థ స్వరూపమైయున్నద'ను ఈ సర్వదోష రహితమగు సిద్ధాంతమును విశ్వసించుటయందేమి దోషము గలదు?

జ్ఞప్తిరేవాతివిమలా స్వరూపాత్మని భాతి యత్
తదేవ జగదిత్యుక్తం సత్యమిత్యేవ సత్యతః. 4

తన స్వరూపమునఁ బ్రకాశించుచున్నట్టి యీ అతినిర్మలమగు జ్ఞప్తి (చైతన్యము) యేది గలదో, అదియే యథార్థముగ ఈ జగత్తని శ్రుత్యాదులబలముచేఁ జెప్పఁబడినది. ఇది పరమసత్యము.

న క్వచిత్సన్తి భూతాని పఞ్చ కుట్యాదయో న వా
అసన్త్యప్యనుభూతాని నను స్వప్నదశాస్వివ. 5

ఈ పంచభూతము లెచటనులేవు. అసత్యములైనను నివి స్వప్నదశలందువలె సత్యములుగనను భూతములగుచున్నవి.

స్వభావ ఏవ విమలో యథా స్వప్నే పురాదివత్
కచత్యేవం జాగ్రతీదం జగద్వద్వస్తు తత్సుఖమ్. 6

నిర్మలమై, సుఖరూపమైనట్టి చిత్స్వభావము స్వప్నమందు నగరాదులవలె స్ఫురించునట్లు, జాగ్రత్తునందును ఈ జగత్తువలె స్ఫురించుచున్నది.

చేతనాకాశ ఏవాహం తదేవేదం జగత్స్థితమ్
ఇత్యహం జగదిత్యేకం ఖమేవైకం శిలాఘనమ్. 7

నేను చిదాకాశమునే; ఆ చిదాకాశమే యీ జగద్రూపముగ స్థితినొందియున్నది. కాఁబట్టి నేనున్ను, ఈ జగత్తున్ను నొకటియే. ఇరువురమును ఏకమై, శిలవలె (విజ్ఞాన) ఘనమైనట్టి చిదాకాశమేయైయున్నాము.

యదాదిసర్గజననం యత్కల్పాన్తవివర్తనమ్
యుద్వా భువనసంస్థానం తద్ధి వ్యోమ నిరాకృతి. 8

అది సృష్టియొక్క యుత్పత్తి, ప్రళయమను వివర్తనము, లోక, లోకాంతరముల యొక్క స్థితి, అన్నియు నిరాకారమగు చిదాకాశమేయైయున్నవి.

సతి వాఽసతి వా దేహే నిర్దుఃఖసుఖత్వమక్షయం మోక్షః
బుద్ధేఽమలే స్వభావే నిర్భరవిశ్రాన్తిరస్తు సర్వేహ. 9

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే జగదసత్తా ప్రతిపాదనం నామ
చతురధికశతతమః సర్గః ॥ 104 ॥

ఓ రామచంద్రా! నిర్మలమగు ఆత్మస్వభావ మెఱుఁగఁబడ, ఏ దుఃఖరహితమగు అక్షయ మైనట్టి భూమానందస్వరూపస్థితి సంభవించునో, అదియే మోక్షము. అది దేహమున్నపుడు ప్రాప్తించినను, లేనపుడు ప్రాప్తించినను నొకటియే. అట్టి నిర్మలమోక్షపదమున నీకుఁ బూర్ణ విశ్రాంతి కలుగు గాక!

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
జగదసత్తాప్రతిపాదనమను నూట నాలుగవ సర్గము ॥ 104 ॥

పఞ్చాధికశతతమః సర్గః

[చిదేవాభాతి జాగ్రద్వచ్చిదేవ స్వప్నవత్తథా
న జాగ్రత్స్వప్నయోర్భేదః స్వభావేనేతి వర్ణ్యతే.

జాగ్రత్స్వప్నరూపములతోటి చైతన్యమే ప్రకాశించుచున్నదనియు, చిత్స్వభావముచే జాగ్రత్స్వప్నములందు భేదమేమియు లేదనియు నిచటవర్ణింపఁబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

స్వభావం జగదాకారం చిద్భావోఽనుభవన్స్థితః
స్వతః స్వప్నమివానన్యమాత్మనః కల్పనాభిధమ్. 1

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! చిత్స్వభావమగు ఆత్మ, తనకంటె వేఱుకానట్టి కల్పనారూపమగు స్వప్నమును స్వయముగ ననుభవించునట్లు, తన స్వభావమునే (జాగ్రత్) జగదాకారముగను ననుభవించుచున్నది.

జాగ్రత్సుషుప్తమేవేదం శిలాజఠరమేవ వా
ఆకాశమేవ వా శూన్యం జగత్స్వేన చ నోజ్ఝితమ్. 2

ప్రపంచత్వముచేఁ ద్యజింపఁబడనిదై యీ జాగ్రత్తు మూలముచే సుషుప్తియందలి అజ్ఞానమున్ను అధిష్ఠానరూపముచే శిలవలె (విజ్ఞాన) ఘనమైనట్టి చిదాకాశమున్ను, నిజ(దృశ్య)రూపముచే ఆకాశమువలె శూన్యమున్ను నగుచు, స్వప్నమేయై యొప్పుచున్నది.

స్వప్న ఏవాత్ర దృష్టాన్తః పురమణ్డలమణ్డితః
స్వప్నే జగన్న కించిత్సదిత్థమాభాతి భాసురమ్. 3

పురమండలాదులచే శోభించు స్వప్నమే యిట దృష్టాంతమైయున్నది. స్వప్నమందు వాస్తవముగ జగత్తేమియునులేదు. సచ్చిద్రూపమగు ఆత్మయే యట్లు ప్రకాశమయస్వరూపముచే భాసించుచున్నది.

త్రైలోక్యమసదేవేదం యథా స్వప్నేఽవభాసతే
జాగ్రత్యస్మింస్తథైవేదం మనగాప్యత్ర నాన్యథా. 4

ఈ ముల్లోకములున్ను మిథ్యారూపములై స్వప్నమందెట్లు భాసించుచున్నవో, అట్లే జాగ్రత్తునందును భాసించుచున్నవి. రెంటియందును కొంచెమైనను భేదములేదు.

న జాగ్రతి నచ స్వప్నే జగచ్ఛబ్దార్థసంభవః
స్వం వస్తుతస్తు చిద్వ్యోమ్నో భానం బుద్ధం జగత్త్రయా. 5

చిద్వ్యోమ్నః స్వచమత్కారో వ్యోమస్యద్ర్యాదిరూపభృత్
జగదిత్యేవ బుద్ధోఽన్తర్జాగ్రత్స్వప్నే స్వయంభువా. 6

వాస్తవముగ జగత్తుయొక్క శబ్దార్థముల సంభవము జాగ్రత్తునందుగాని, స్వప్నమందు గానిలేదు. బ్రహ్మదేవుఁడు, అజ్ఞానావృతాత్మరూపమగు ఆకాశమున చిదాకాశప్రకాశముచే పర్వతాది రూపముల ధరించిన స్వచమత్కారమగు అజ్ఞానమే జాగ్రత్స్వప్నములందలి జగత్తని నెఱిఁగెను.

జగన్న కించిదేవేదం చిద్రూపం చ న కించన
ఏతే కించిదివాభాతో నభశ్చిజ్జగతీ ముధా. 7

ఈ జగత్తుగాని, దాని నెఱుఁగునట్టి చిత్తముగాని యొకింతైనను లేవు. అత్యంతశూన్య రూపములగు ఈ జగచ్చిత్తములు రెండును గ్రాహ్యగ్రాహకరూపములతో బ్రహ్మమందు మిథ్యగనే భాసించుచున్నవి.

అభాతమేవ త్రైలోక్యం యథా స్వప్నే న కించన
శూన్యమేవ భవేదేవమేవం జాగ్రతి నిర్వపుః. 8

స్వప్నపదార్థమువలె అసత్తైనను ఈ త్రైలోక్యము భాసించుచున్నది. కావున, స్వప్నమందు జగత్తు శూన్యరూపమైనట్లు, జాగ్రత్తునందును శూన్యమేయైయున్నది.

స్వప్నే కిల మహాబుద్ధే నానానిర్మాణశాలిని
అరమ్యా ఏవ నారమ్యా అసత్సదివ చాతతమ్. 9

మహాబుద్ధివగు రామచంద్రా! వివిధరచనలతోఁగూడి శోభించునట్టి స్వప్నమందు, అక్రియలే క్రియలుగను, అసత్తే సత్తుగను వ్యాప్తములై భాసించుచున్నవి.

అవ్యోమైవాతివితతం వ్యోమాన్తపరివర్జితమ్
వ్యోమైవాచలసంఘాతో నానాపురగణోత్కరః. 10

అట్టి దశయందు, ఆకాశవర్జితమగు బ్రహ్మమే అతివిశాలమై, అతిశూన్యమైనట్టి యాకాశ మగుచున్నది. ఆ యాకాశమే మరల వివిధ పర్వత, నగరసమూహముగా నగుచున్నది.

అవ్యబ్ధాబ్ధ్యద్రినిర్ఘోషో మౌనమేవ యథా తథా
న శృణోత్యేవ పార్శ్వస్థః సంప్రబుధ్యాపి కించన. 11

ఒకనికి స్వప్నమునఁ బ్రసిద్ధమగు మేఘ, సముద్ర, పర్వతాదుల శబ్దముప్రక్కన నిదురించుచున్నట్టిగాని లేక మేల్కొనినట్టిగాని మఱియొకనికి నిశ్శబ్దమే యెట్లగునో, అట్టి స్థితియే జాగ్రత్తును గూర్చియునగును.

ప్రజాయతే వా జాతోఽపి వన్ధ్యాయా స్తనయో యథా
జాతోఽప్యజాత ఏవాస్తే యథాత్మమృతివిస్మృతౌ. 12

మఱియు, ఎట్లు స్వప్నమందు వాస్తవముగ జనింపనప్పటికి వంధ్యాపుత్రుఁడు జనించి నట్లు తోచుచున్నాఁడో, మరణించి మరల జన్మగైకొనినప్పటికిని మనుజుఁడు తన మరణముయొక్క విస్మృతిచే మరల తాను జనింపకయేయున్నాఁడని యెట్లు తలఁచుచున్నాఁడో జాగ్రత్తు యొక్క స్థితియు నట్టిదే యగును.

సదసద్భవతి క్షిప్రం భవోఽననుభవో యథా
విపర్యస్యతి సర్వం చ రాత్రిరేవ యథా దినమ్. 13

అసద్యత్సంభవత్యాశు దినమేవ యథా నిశా
అసంభవః సంభవతి యథా స్వమృతిదర్శనమ్. 14

అసంభవః సంభవతి జగద్వ్యానమివామ్బరే
తమఏవ మహాలోకో యః సనిద్రః సవాసరః. 15

ఆలోక ఏవైతి తమో యన్నిద్రాస్వప్నవాసరాః
వసుధైవ భవేద్వ్యోమ శ్వభ్రాదిపతనే యథా. 16

స్వప్నమందు శీఘ్రముగ సత్తు, అసత్తగుచున్నది. ఎట్లనిన, తానుశయనించు భూమి యొక్కయు అభావమట సంభవించుచున్నది. మఱియు రాత్రియే పగలగుచు[illegible]. ఇవ్విధమున సర్వముయొక్కయు నచటవిపర్యయము (విరుద్ధత్వము) తటస్థించుచున్నది. మఱియు నట, అసత్తున్ను శీఘ్రముగ సత్తగుచున్నది. పగలే రాత్రిగ గన్పించుచున్నది. తనయొక్క మరణమున్ను గానుపించుచున్నది. ఆకాశమందును జగత్తు భాసించుచున్నది. చీఁకటియే మహాప్రకాశమగు చున్నది. పగటియొక్క ప్రకాశమున్ను చీకటియగుచున్నది. గోతులందు బడునపుడు శయనభూమియే యాకాశమగుచున్నది. ఇవ్విధమున, అసంభవమైనదియు నట సంభవించుచున్నది.

అసత్యరూపమేవేతి భాతి స్వప్నే జగద్యథా
తథైవ జాగ్రదాభాతి మనాగప్యత్ర నాన్యథా. 17

అసత్యరూపమైనను జగత్తు స్వప్నమున నెట్లు భాసించుచున్నదో, అట్లే జాగ్రత్తునందును భాసించుచున్నది. ఇందు కొంచెమైనను భేదములేదు.

యథా ద్వౌ సదృశౌ సూర్యౌ యథా ద్వౌ సదృశౌ నరౌ
జాగ్రత్స్వప్నౌ తథైవైతౌ మనాగప్యత్ర నాన్యథా. 18

గతదినమునఁ గాంచినట్టియు; నేఁడు గాంచినట్టియు సూర్యులిరువురును నొకేసూర్యుఁ డగునట్లును, గతదినమునఁ గాంచినట్టియు; నేఁడు గాంచినట్టియు మనుజు లిరువురును నొకే మనుజుఁడగు నట్లును, జాగ్రత్స్వప్నములు రెండును నొకటియే యైయున్నవి. అ రెంటి యందును నొకింతైనను భేదములేదు.

శ్రీరామ ఉవాచ :—

నైతదేవమపి క్షిప్రాత్ప్రత్యయో యత్ర బాధకః
స్వప్నే తద్దర్శనేనాన్తః కథం జాగ్రత్సమం భవేత్. 19

శ్రీరాముఁడు: — మహాత్మా ! జాగ్రత్స్వప్నములు సమములని తాముపచించినది యుక్త ముగాఁ దోఁచుటలేదు. ఏలయనిన, ఏ స్వప్నమున జాగ్రత్తు శీఘ్రముగ బాధకమగుచున్నదో, అట్టి జాగ్రత్తుయొక్క దర్శనముచే స్వప్నము స్వయముగనే నిజ అంతఃకరణమున అసత్తుగ భాసించు చున్నదిగదా !

శ్రీవసిష్ఠ ఉవాచ :—

నిహృత్య స్వప్నజగతి స్వప్న బన్ధుజనైః సమమ్
మృతిమాప్నోతి తత్రాసౌ ద్రష్టా స్వప్నస్య లాఘవ. 20

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా ! స్వప్నప్రపంచమున స్వప్నముయొక్క ద్రష్ట తన స్వప్నబంధువులతోటి విహరించి యటఁదన స్వప్నదేహనాశ రూపమగు మృత్యువును బొందు చున్నాడు.

మృతఃసన్స్వప్నజగతి స్వప్నజన్తు వియోగవాన్
ఇహ ప్రబుధ్యతే జన్తుర్నిద్రాముక్తశ్చ కథ్యతే. 21

అట్లు స్వప్నప్రపంచమున మరణించి యాతఁడు స్వప్నజీవులనుండి వియోగమొంది ఇట జాగ్రజ్జగత్తునందెపుఁడు మేల్కొనుచున్నాఁడో, అపుడు నిద్రనుండి విముక్తుఁడాయెనని పచింపఁబడుచున్నాఁడు. (దేశాంతర, దేహాంతరములందుఁ గాంచఁబడిన పదార్థములయొక్క అదర్శనమాత్రముచే వానియొక్క బాధ కానేరదు. పూర్వజన్మయందలి బంధ్వాదు లీజన్మయందు గాంచఁబడనంత మాత్రముచే బాధితులగుటలేదుగదా ! కావున జాగ్రత్తునందు జీవుఁడు అన్యదేహ మును మాత్రమేగైకొనుటచే ఆ పూర్వపు స్వప్నపదార్థములు దానిచే బాధింపబడనివేయగును.

సుఖదుఃఖదశామోహాన్దినరాత్రి విపర్యయాన్
అనుభూయ బహూన్ద్రష్టా మ్రియతే స్వప్నసంసృతౌ. 22

స్వప్నప్రపంచమున ద్రష్ట అనేక సుఖదుఃఖదశలను. పెక్కుమోహములను, దినరాత్రుల యొక్క విపర్యయములను ననుభవించి మరణించుచున్నాఁడు. (స్వప్నదేహమును త్యజించు చున్నాడు)

గతనిద్రతయా పశ్చాన్నిద్రాన్త ఇహ జాయతే
న సత్యమేతదిత్యేవం తతః ప్రత్యయవాన్భవేత్. 23

పిమ్మట నిద్రయొక్క అభావముచే జాగ్రత్ప్రపంచమున నిద్రయొక్క అంతముకాఁగా నచట జనించుచున్నాఁడు. (శయనప్రదేశముననున్న దేహముతో నాతనికి సంబంధము కలుగుచున్నది.) అత్తఱి యాతఁడు 'స్వప్నానుభూతములగు పదార్థములు సత్యములు కావను' బుద్ధి గలవాఁడగు చున్నాఁడు. (అట్టి బుద్ధి దేహాంతరమందలి స్వప్నపదార్థములను బాధింపసమర్థమైనది కానేరదు.)

స్వప్నద్రష్టా యథా స్వప్నసంసారే మృతిమాప్తవాన్
అన్యం జాగ్రన్మయం స్వప్నం ద్రష్టుం భూయః ప్రజాయతే. 24
జాగ్రద్ద్రష్టా తథా జాగ్రత్సంసారే మృతిమాప్తవాన్
అన్యం జాగ్రన్మయం స్వప్నం ద్రష్టుంభూయఃస జాయతే. 25

స్వప్నద్రష్ట స్వప్నప్రపంచమున మృతినొంది, జాగ్రన్మయమగు అన్యస్వప్నమును గాంచుటకై మరల యెట్లు జనించుచున్నాఁడో, అట్లే జాగ్రత్తుయొక్క ద్రష్టయు జాగ్రత్ప్రపంచమున మరణించి జాగ్రన్మయమగు అన్యస్వప్నము నవలోకించుటకై మరల జనించుచున్నాఁడు.

న స్వప్నమసదిత్యేవం పూర్వస్మిఞ్జాగ్రదాత్మని
పునఃప్రత్యయమాదత్తే స్వప్నాత్స్వప్నాన్తరం గతః. 26
న జాగ్రత్ప్రత్యయం తత్ర పునర్గృహ్ణాతి ముగ్ధధీః
స్వప్నసందర్శనం త్వన్యత్తత్రాప్యనుభవత్యథ. 27

జీవుఁడు జాగ్రత్ప్రపంచమున మరణించి మఱియొక జాగ్రత్ప్రపంచమున జన్మించు నపుడు పూర్వజాగ్రత్ప్రపంచరూప స్వప్నమున అసత్యత్వబుద్ధిని యెట్లుగ్రహింపఁడో (జాగ్రద్బుద్ధినే గ్రహించునో) అట్లే యొక స్వప్నప్రపంచమునుండి స్వప్నాంతర ప్రపంచమును బొందినపుడున్ను, ఉత్తర స్వప్నమున అసత్యత్వబుద్ధిని గ్రహింపక జాగ్రద్బుద్ధినే గ్రహించుచున్నాఁడు. అట నుత్తర స్వప్నమున జాగ్రద్బుద్ధి మూర్ఖత్వ మెట్లగునో, అట్లే పూర్వజాగ్రత్తునందును (వాస్తవముగ నది స్వప్నమేయైనను) స్వప్నత్వ, అసత్యత్వములను గ్రహింపకుండుటయు (జాగ్రద్బుద్ధిని గ్రహించుటయు) మూర్ఖత్వమేయగును.

స్వప్నం జాగ్రత్తయా జాగ్రత్స్వప్నత్వం చేతి నామని
న జాయతే న మ్రియతే జాయతే మ్రియతేఽపి చ. 28

ఇట్లు జీవుఁడు జాగ్రత్స్వప్నములను రెండవస్థలందును వాస్తవముగ జన్మించుటలేదు, మరణించుటలేదు. అయినను, ఆయాదేహములందలి యభిమానముచే జన్మించుచున్నాఁడు. మరణించుచునున్నాఁడు.

స్వప్నద్రష్టా స్వప్నమృతః ప్రబుద్ధ ఇహ కథ్యతే
ఇహ జాగ్రన్మృతో జన్తుః ప్రబుద్ధోఽన్యత్ర కథ్యతే 29

స్వప్నద్రష్ట స్వప్నమున మరణించి యీ జాగ్రత్ప్రపంచమున మేల్కొనెనని చెప్పఁబడుచున్నాఁడు. అట్లే యీ జాగ్రత్తునందు మరణించి స్వప్నమున మేల్కొనెనని చెప్పఁబడుచున్నాఁడు. ఇట్లు రెంటికిని సమానత్వమే గలదు.

స్వప్నాత్స్వప్నస్థితౌ జాగ్రజ్జాగ్రత్స్వప్న ప్రదర్శనమ్
మృత్వాన్యత్ర ప్రబుద్ధస్య జాగ్రత్స్వప్నో భవత్యలమ్. 30

ఒకస్వప్నమునుండి మఱియొకస్వప్నమున స్థితిఁబొందునపుడు, ఆ రెండవస్వప్నము మొదటిస్వప్నముకంటె విశేషముగ గానఁబడుటచే జాగ్రత్తగుచున్నది. అట్లే జాగ్రత్తునందు మరణించి స్వప్నమునగాని. మఱియొక జాగ్రత్తునందుగాని మేల్కొను మనుజునకు పూర్వ జాగ్రత్తు తప్పక స్వప్నమగుచున్నది.

ఇతిహాసమయావేవ జాగ్రత్స్వప్నావుభావపి
పరస్పరం గతావేతావుపమానోపమేయతామ్. 31

కావున జాగ్రత్స్వప్నములురెండును పూర్వవృత్తాంతకథార్థమువలె యథార్థములు కానివగుటచేఁ బరస్పరము ఉపమాన, ఉపమేయత్వము (సాదృశ్యమును)ను బొందినవైయున్నవి.

స్వప్నో జాగ్రదివాభాతి జాగ్రత్స్వప్నమివోదితమ్
వస్తుతస్తు ద్వయమసచ్చిత్త్వం కచతి కేవలమ్. 32

మఱియు, వర్తమానదశయందు స్వప్నమున్ను జాగ్రత్తువలెఁ బ్రత్యక్షముగ భాసించుచున్నది. భూతకాలిక జాగ్రత్తున్ను ప్రసిద్ధమగు స్వప్నమువలె నుదయించిన దగుచున్నది కానిఁ వాస్తవముగ ఆరెండును అసత్యములైయున్నవి. కేవలము చిదాకాశమే యట్లు స్ఫురించుచున్నది.

స్థావరం జంగమం చైవ భూతజాతమశేషతః
చిన్మాత్రవ్యతిరేకేణ కిమన్యదుపపద్యతే. 33

స్థావరజంగమములగు సమస్తప్రాణికోట్లున్ను చిన్మాత్రముతప్ప మఱియేమి కాఁదగును?

మృన్మయం తు యథా భాణ్డం మృచ్ఛూన్యం నోపలభ్యతే
చిచ్చమత్కార మాత్రాత్మ తథా కాష్ఠోపలాద్యపి. 34

మృణ్మయమగు పాత్ర మృత్తికతప్ప మఱియేమియుఁ గానట్లు, కాష్ఠ, శిలాదులున్ను చైతన్యముయొక్క చమత్కార మాత్రరూపముతప్ప అన్యమేమియుఁ గానేరవు.

వస్తుజాతమిదం స్వప్నే జాగ్రత్యపి తథైవ నః
దృష్టో య ఉపలః స్వప్నే చిచ్చమత్కరణాదృతే. 35
కిమన్యత్సంవిదః ప్రాజ్ఞ కిలావశ్యం చిదేవ సా
నను యాదృగ్వపుఃస్వప్నే జాగ్రత్తాదృగఖణ్డితమ్. 36

స్వప్నమందుగాని, జాగ్రత్తునందుగాని మనకు ఏవస్తు సమూహము గానుపించుచున్నదో, లేక అనుభూతమగుచున్నదో, అదియంతయు చిన్మాత్రమేయైయున్నది. స్వప్నమందు మనముగాంచిన శిల చిచ్చమత్కారము తప్ప మఱియేమి కాఁగలదు ? ప్రాజ్ఞుఁడవగు రామచంద్రా! ఇవ్విషయమున నీవు విద్వాంసులతోటి సంవాదమొనర్చి విచారణగావింపుము. మఱియు, తద్విచారోత్పన్నమగు తత్త్వజ్ఞానముచే నట్టి స్వప్నశిల చిద్రూపమేయని నిశ్చయింపుము. ఈ ప్రకారముగ, స్వప్నమందెట్లు చిద్రూపమే స్థితినొందియున్నదో, జాగ్రత్తునందును నట్లు పూర్ణమగు చిద్రూపమే వెలయుచున్నది.

జగజ్జాతమతః సర్వం చిన్మాత్రం బ్రహ్మఖణ్డితమ్
జగజ్జాతమతః సర్వం చిన్మాత్రం బ్రహ్మకుట్టిమమ్. 37

అధ్యారోపదృష్టిచే చిన్మాత్రమగు బ్రహ్మమే జగదాకారముగ విభక్తమైయున్నది. అపవాద దృష్టిచే జగత్తంతయు బ్రహ్మమేయై విలసిల్లుచున్నది.

మృన్మయం తు యథా భాణ్డం మృచ్ఛూన్యం నోపలభ్యతే
చిన్మయం తు తథా చేత్యం చిచ్ఛూన్యం నోపలభ్యతే. 38

శైలాత్మకం యథా భాణ్డం శైలశూన్యం న లభ్యతే
చిన్మయం తు తథా చేత్యం చిచ్ఛూన్యం నోపలభ్యతే. 39

ద్రవరూపం యథా వారి ద్రవరిక్తం న లభ్యతే
చిన్మయం తు తథా చేత్యం చిచ్ఛూన్యం నోపలభ్యతే. 40

ఊష్మరూపో యథా వహ్నిర్నిరూష్మా నోపలభ్యతే
చిన్మయం తు తథా చేత్యం చిచ్ఛూన్యం నోపలభ్యతే. 41

యథా స్పన్దమయో వాయురస్పన్దో నోపలభ్యతే
చిన్మయం తు తథా చేత్యం చిచ్ఛూన్యం నోపలభ్యతే. 42

మృణ్మయపాత్ర మృత్తికారహితముగ లభింపఁజాలనట్లును, శిలామయమగు పాత్ర శిలాశూన్యముగ లభింపఁజాలనట్లును, ద్రవరూపమగు జలము ద్రవరహితముగ లభింపఁజాలనట్లును, ఉష్ణరూపమగు అగ్ని ఉష్ణత్వశూన్యముగ లభింపఁజాలనట్లును, స్పంద (చలన) మయమగు వాయువు స్పంద రహితముగ లభింపఁజాలనట్లు, చిన్మయమగు పదార్థము (జగత్తు)న్ను చైతన్యరహితముగ లభింపఁజాలదు.

యద్యన్మయం తద్వినా తు తత్కథం కిల లభ్యతే
క్వాశూన్యం లభ్యతే వ్యోమ క్వాఘనా లభ్యతే మహీ. 43

ఏది దేని మయమైయున్నదో, అది యదిలేక యెట్లు లభింపఁగలదు? ఆకాశము శూన్యత్వములేకయు, పృథివి మూర్తత్వము (ఆకృతి) లేకయు నెచట లభింపఁగలదు?

చిద్వ్యోమమయమేవేదం యథా ఘటపటాదికమ్
స్వప్నే తథేదం శైలాది చిద్వ్యోమాభాసమాత్రకమ్. 44

స్వప్నమందలి ఘటపటాది పదార్థములన్నియు చిదాకాశమయములై యున్నట్లు, ఈ జాగ్రత్తునందలి పర్వతాది పదార్థములన్నియునుగూడ చిదాకాశముయొక్క ఆభాసమాత్ర రూపములైయున్నవి.

స్వప్నే యథా గగనమేవ పురాచలాది
సంవిన్మయం సుభగ జాగ్రతి తద్వదేవ
స్వప్నోఽథ జాగ్రదితి శాన్తమనన్తమేకం
చిన్మాత్రమత్ర నను నామ వినాస్తు వాదః 45

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే జాగ్రత్స్వప్నైక్యప్రతిపాదనం నామ పఞ్చోత్తరశతతమః సర్గః ॥ 105 ॥

ఉత్తముఁడవగు రామచంద్రా! స్వప్నమున నగర, పర్వతాదులు చిన్మయమగు ఆకాశమే యైయున్నట్లు, జాగ్రత్తునందును నవి చిన్మయాకాశమే యైయున్నవి. కాఁబట్టి స్వప్న, జాగ్రత్తులను వికల్పనములేనట్టి యేకమగు చిన్మాత్రమే శేషించుచున్నది. ఇవ్విషయమున వాదుల యొక్క వివాదము వ్యర్థమేయగును.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున జాగ్రత్స్వప్నైక్యప్రతిపాదన మను నూటయైదవ సర్గము ॥ 105 ॥

షడధిక శతతమః సర్గః

[లక్షణౌఘైశ్చిదాకాశమివ భూయః ప్రదర్శ్యతే
తదేవ జగదిత్యేతదపి భూయః ప్రపఞ్చ్యతే,

లక్షణ సమూహములచే మరల చిదాకాశము ప్రదర్శింపఁబడుచు, ఆ చిదాకాశమే జగత్తని మరల యిచట వర్ణింపఁబడుచున్నది]

శ్రీరామ ఉవాచ :—

కీదృశం స్యాచ్చిదాకాశం తద్బ్రహ్మన్బ్రహ్మ యత్పరమ్
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్ 1

శ్రీరాముఁడు:— మహాత్మా! ఆ పరబ్రహ్మమగు చిదాకాశ మెట్టిదో మరల తెలుప ప్రార్థన. ఏలయనిన, తమ వచనామృతమును వినుటయందు నాకుఁ దృప్తి కలుగకున్నది.

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

సమయోర్యమయోర్భ్రాత్రోర్వ్యవహారాయ నామనీ
యద్వత్క్రియతే ద్వే తద్వజ్జాగ్రత్స్వప్నశిలామయే. 2

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఏకకాలమునఁగూడి జనించు సమానులగు సోదరులకు వ్యవహారమునకై వేఱువేఱు పేర్లు పెట్టఁబడునట్లు, జాగ్రత్స్వప్నరూపమగు అఖండ చైతన్యస్ఫటిక శిలామయములై, తత్ప్రతిబింబ ప్రాయములై సమానములైనట్టి రెండుప్రపంచములకు జాగ్రత్స్వప్నములని వేఱ్వేఱు పేర్లు పెట్టఁబడినవి.

వస్తుతస్త్వనయోర్భేదో న ద్వయోః పయసోరివ
ద్వయమప్యేకమేవైతచ్చిన్మాత్రం వ్యోమ నిర్మలమ్. 3

జలద్వయమందువలెను, లేక, క్షీరద్వయమందువలెను వాస్తవముగ ఈ జాగ్రత్స్వప్నముల రెంటియందును భేదమేమియునులేదు. రెండును నొకటియే. నిర్మలమగు చిన్మాత్రాకాశమే యవి రెండునునైయున్నవి.

దేశాద్దేశాన్తరం దూరం ప్రాప్తాయాః సంవిదో వపుః
నిమిషేణైవ తన్మధ్యే చిదాకాశం తదుచ్యతే. 4

నిమిషమాత్రకాలములో నొకప్రదేశమునుండి అతిదూరముననున్న మఱియొక ప్రదేశమునకు దృష్టి చనునపుడు, ఆ రెండు ప్రదేశముల మధ్యనుండు నిర్విషయమగు సంవిత్తు (జ్ఞానము) యొక్క స్వరూపమేదిగలదో, అదియే చిదాకాశమని చెప్పఁబడుచున్నది.

యాదృశస్తిష్ఠతః స్వచ్ఛం రసమాకర్షతస్తరోః
భవేద్భావో నభస్స్వచ్ఛస్తాదృశం చిన్నభః స్మృతమ్. 5

మూలప్రదేశముద్వారా భూమియొక్క రసము నాకర్షించుచు నుండునట్టి వృక్షమునకు వృద్ధిక్షయవర్జితమైనట్టి యే ఆహ్లాదభావము వర్తించుచుండునో, అట్టిదే నిర్మలమగు చిదాకాశముయొక్క స్వరూపమని వచింపఁబడినది.

వినివృత్తాఖిలేచ్ఛస్య పుంసః సంశాన్తచేతసః
యాదృశః స్యాత్సమో భావస్తాదృశం చిన్నభః స్మృతమ్ 6

కోర్కెలన్నియు శమించినట్టి శాంతచిత్తుఁడగు మనుజునకు సర్వవైషమ్యరహితమైనట్టి యే స్వాభావిక సుఖస్వరూపముయొక్క యనుభవమగునో అట్టిదే చిదాకాశముయొక్క రూపమని పేర్కొనఁబడినది.

అనాగతాయాం నిద్రాయాం మనోవిషయసంక్షయే
పుంసః స్వస్థస్య యోభావః స చిదాకాశ ఉచ్యతే. 7

నిద్రారంభమున మనస్సుయొక్క సమస్తవిషయములును నశించుటచే స్వస్థచిత్తుఁడగు మనుజునకే యానందానుభవమగుచున్నదో, అదియే చిదాకాశమని చెప్పఁబడినది;

తృణగుల్మలతాదీనాం వృద్ధిమాగచ్ఛతామృతౌ
యః స్యాదున్మమతో భావః స చిదాకాశ ఉచ్యతే. 8

వర్షర్తువునందుగాని, లేక శరదృతువునందుగాని వృద్ధి బొందియుండునట్టి తృణగుల్మలతాదులయొక్కయే మమత్వరహితమగు యానందభావము గలదో, అదియే చిదాకాశమని వచింపఁబడినది.

రూపాలోకమనస్కారవిముక్తస్యామృతస్య యః
భావః పుంసః శరద్వ్యోమ విశదస్తచ్చిదమ్బరమ్. 9

రూప, సంకల్పాది సమస్త బాహ్యాభ్యంతర విషయముక్తుఁడగు జీవితపురుషునియొక్క శరత్కాలాకాశమువలె నిర్మలమైనట్టి ఆనందభావమెయ్యది గలదో, అదియే చిదాకాశము.

యదేతదాసనం సృష్టం కాష్ఠపాషాణభూభృతామ్
చేతానానాం చ సత్తాత్మ చిదాకాశం స ఉచ్యతే. 10

బ్రహ్మదేవుఁడు కాష్ఠశిలాపర్వతాదులకే చేష్టారహితమగు స్థితిని నిర్మించెనో, అదియే చేతనులగు జీవులకు మనోనాశముచే సత్తాత్మస్థితి యగుచో నపుడది చిదాకాశమనఁబడును,

ద్రష్టృదర్శనదృశ్యానాం త్రయాణాముదయో యతః
యత్ర వాస్తమయశ్చిత్తం తద్విద్ధి విగతామయమ్. 11

ఓ రామచంద్రా! అవస్థాత్రయమునకు సాక్షియైన యెద్దానినుండి జాగ్రత్స్వప్నములయొక్క ద్రష్టృ, దర్శన, దృశ్యములను త్రిపుటి యుదయించుచున్నదో, మరల యెద్దానియందా త్రిపుటిలయించుచున్నదో, దానినే నీవు నిర్వికారమగు చిదాకాశముగ నెఱుఁగుము.

యత ఉద్యన్తి యస్మింశ్చ చిత్రాః పరిణమన్త్యలమ్
పదార్థానుభవాః సర్వే చిదాకాశః స ఉచ్యతే. 12

ఏ సాక్షిస్వరూపమునుండి విచిత్రములైన పదార్థానుభవములన్నియు నుదయించుచున్నవో. ఎద్దానియందయ్యవి సంకల్ప, వికల్ప విచార, నిశ్చయ, త్యాగ, గ్రహణాదిరూపములచే నుత్తరోత్తర పరిణామమొందుచున్నవో, అదియే చిదాకాశమనఁబడు చున్నది.

యస్మిన్సర్వం యతః సర్వం యః సర్వం సర్వతశ్చ యః
యశ్చ సర్వమయో నిత్యం స చిదాకాశ ఉచ్యతే. 13

దేనియందు సమస్తమున్నుగలదో, దేనినుండి సమస్తముద్భవించుచున్నదో, సమస్తమేదియైయున్నదో, ఏది యంతట వ్యాపించియున్నదో, ఏది సర్వమయమై వెలుఁగుచున్నదో, అదియే నిత్యమైనట్టి చిదాకాశమని పేర్కొనఁబడుచున్నది.

దివి భూమౌ బహిశ్చాన్తస్తథాన్యస్య సమాభిధః
యో విభాత్యవభాసాత్మా చిదాకాశః స ఉచ్యతే. 14

స్వర్గమందును, భూమియందును, బాహ్యాభ్యంతరములందును, ఇతర నామరూపములందును ప్రకాశరూపమైన యెద్ది భాసించుచున్నదో, అదియే చిదాకాశమని చెప్పఁబడుచున్నది.

యస్మిన్నిత్యే తతే తన్తౌ దృఢే స్రగివ తిష్ఠతి
సదసదుత్థితం విశ్వం విశ్వాఙ్గే తచ్చిదంబరమ్. 15

జగత్తే అవయవముగాఁగల్గిన దేనియందావిర్భూతమై సాకారనిరాకారరూపమగు ఈ ప్రపంచము దృఢమగు సూత్రమున మాలవలె స్థితినొందియున్నదో, అదియే చిదాకాశము.

యస్మాత్సర్వాః ప్రసూయన్తే సర్గప్రలయవిక్రియాః
యస్మింశ్చైవ ప్రలీయన్తే యన్మయాస్తచ్చిదమ్బరమ్. 16

దేనినుండి సృష్టి, ప్రళయాది వికారములన్నియు నుద్భవించుచున్నవో, మరల దేనియందవియన్నియు లయించుచున్నవో, దేనిచేఁబూర్ణములై యవియెప్పుచున్నవో, అదియే చిదాకాశము.

నిద్రాయాం వినివృత్తాయాం యతో విశ్వం ప్రవర్తతే
నివర్తతే చ యచ్ఛాన్తౌ తచ్చిదమ్బరముచ్యతే. 17

సుషుప్తి, ప్రళయరూపమగు నిద్ర తొలఁగఁగా ఏసాక్షిరూపమునుండి విక్షేపశక్తిద్వారా జాగ్రత్స్వప్నరూపమగు ప్రపంచ ముత్పన్నమగుచున్నదో, మరల విక్షేపశక్తి శమించుటచే దేనియందది నివృత్తమగుచున్నదో, అదియే చిదాకాశమనఁబడును.

యస్యోన్మేష నిమేషాభ్యాం జగత్ప్రళయోదయౌ
స్వానుభూత్యాత్మకం స్వాన్తః స్థితం తద్విద్ధి చిన్నభః 18

ఓ రామచంద్రా! దేనియొక్క ఉన్మేష (చరమసాక్షాత్కార వృత్త్యావిర్భావము), నిమేష (స్వరూపావరణ)ములచే జగత్సత్తయొక్క ప్రళయ, ఉత్పత్తులు సంభవించుచున్నవో; స్వానుభవ రూపముచే నెయ్యది తనయందు స్థితిగల్గియున్నదో, అదియే చిదాకాశమని నీ వెఱుఁగుము.

నేదం నేదం తదిత్యేవం సర్వం నిర్ణీయ సర్వథా
యన్న కించిత్సదా సర్వం తచ్చిద్వ్యోమేతి కథ్యతే. 19

'నేతి, నేతి' (ఇది కాదు, ఇదికాదు) అను నీప్రకారముగ సమస్తమును బూర్ణముగ నిషేధించుచురాఁగా తుదకెయ్యది శేషించుచున్నదో, ఏది సదా సర్వమునై యున్నప్పటికి వాస్తవముగ నేదియుఁగాకయేయున్నదో, అదియే చిదాకాశమని వచింపఁబడుచున్నది.

దేశాద్దేశాన్తరప్రాప్తౌ యన్మధ్యే సంవిదో వపుః
దూరతోఽర్ధనిమేషేణ తచ్చిన్మాత్రవపుః స్మృతమ్. 20

అర్ధనిమిషమాత్రములో నొకప్రదేశమునుండి దూరముననున్న మఱియొక ప్రదేశమునకు దృష్టి చనునపుడు, ఆరెండు ప్రదేశముల మధ్యనుండి నిర్విషయమగు సంవిత్తుయొక్క స్వరూపమేది గలదో, అదియే చిన్మాత్రరూపమని పేర్కొనఁబడినది.

విశ్వం తన్మయమేవేదం యథా భూతం యథాస్థితమ్
రూపాలోకమనస్కారైరుక్తమప్యేవమీదృశమ్. 21

రూపసంకల్పాది బాహ్యాభ్యంతర విషయములతోఁగూడి యథారీతి స్థితిగల్గియున్న యీ ప్రపంచమంతయు తచ్చిదాకాశమయమే యైయున్నది.

ఈషదున్మేషణాదేతదన్యతామివ గచ్ఛతి
అనన్యరూపమపి సచ్చిద్వ్యోమ విమలాకృతి. 22

ఇట్లీప్రపంచము నిర్మలమగు సచ్చిదాకాశమునం దద్దానికంటె వేఱుగాక యున్నప్పటికి, ఒకింత ఉన్మేష నిమేషములచే ప్రలయ; సృష్టిరూపమగు అన్యత్వమును బొందినదానివలె నగుచున్నది.

పశ్యన్నేవైన్ద్రియైరర్థాన్మూనం నిర్వాసనాశయః
ప్రబుద్ధ ఏవైకఘనః సుషుప్తావస్థితో భవ. 23

ఓ రామచంద్రా! ఇంద్రియములచేఁ బదార్థముల ననుభవించు చున్నప్పటికి, నీవు వాసనా రహితుఁడవై, నిరతిశయానంద ఘనైక రూపమగు ఆత్మయొక్క జ్ఞానముతోఁ గూడినవాఁడవై సుషుప్తియందున్నవానివలె నిశ్చలముగ స్వాత్మయందు నెలకొనియుండుము.

నిర్వాసనః శాన్తమనా వద వ్రజ పిబాహర
పాషాణ ఇవ సంజీవో నిత్యం సుఘనమౌనవాన్. 24

ఓ రామచంద్రా! నీవు వాసనారహితుఁడవై శాంతచిత్తుఁడవై, జీవించుచున్నను శిలవలె నిత్యము మహామౌనమును ధరించి, ఆత్మానందమున నిమగ్నుఁడవై, సంభాషింపుము, సంచరింపుము, భుజింపుము, త్రాగుము, తదిరవ్యవహారముల నాచరింపుము.

ఇదం న సంభవత్యేవ దృశ్యం పశ్యసి యత్పురః
మృగతృష్ణాజలమివ ద్వైతమిన్దావివోదితమ్. 25

ఓ రాఘవా! ఏ దృశ్యమును నీవు నీయెదుటఁ గాంచుచున్నావో, అది వాస్తవముగ సంభ[illegible]ను. మృగతృష్ణాజలమువలెను, చంద్రద్వయమువలెను నది యివ్విధమున చిదాకా[illegible]ంటె భిన్నముగ మిథ్యగానుదయించినదై యున్నది.

ఇదమాదావనుత్పన్నం కారణాభావతః కిల
కారణేన వినా కార్యం న హి నామోపపద్యతే. 26

ఏలయనిన, ఈ దృశ్యజగత్తు సృష్ట్యాదియందు కారణాభావముచే నుత్పన్నమే కాకయున్నది. కారణములేక యే కార్యమున్ను నెచటను నుండఁజాలదుగదా!

యద్వోపపద్యతే కించిత్తదకారణకోద్భవమ్
యథాస్థితం పరం రూపముద్భూతమివ లక్ష్యతే. 27

బీజమునుండి అంకురాదులెవ్వి యుత్పన్నము లగుచున్నవో, అవి కారణరహితమగు అద్వయ బ్రహ్మమునుండియే కలిగినవగును. కాని ఆ పరబ్రహ్మము తన స్వరూపమున నెప్పటియట్లే స్థితినొందియున్నది. అందయ్యవి యుత్పన్నములైనట్లు గోచరించుచున్నవి.

తద్యథాస్థితమేవాగ్ర్య పూర్వరూపమవస్థితమ్
భవత్యద్వయమేవాచ్ఛం ద్వయేనాప్యుపలక్షితమ్. 28

ప్రియుఁడగు రామచంద్రా! చంద్రుఁడొకఁడేయైనను, భ్రాంతిచే రెండుగా గన్పించునట్లు, ఆ బ్రహ్మము తన పూర్వపునిర్మల అద్వయరూపముతోనే యథారీతి స్థితిగల్గియున్నను భ్రమచే ద్వైతరూపముగ గాంచఁబడుచున్నది.

తత్రేదంప్రత్యయః ప్రౌఢో భవత్యనుభవో హి యః
సమాయాతమిదం భ్రాన్తం తత్స్వప్నస్త్రీసమం విదుః. 29

ఆ యద్వైత బ్రహ్మమున నేజగత్తుయొక్క దృఢానుభవము గలుగుచున్నదో, అది అనాదికాలమునుండి వచ్చుచున్న భ్రాంతిరూపమగు అజ్ఞానమువలననే యేర్పడినదగును. కావున, అయ్యది స్వప్నస్త్రీతుల్యముగఁ జెప్పఁబడినది,

తస్మాద్దృశ్యం న చోత్పన్నం నైవాస్తి న భవిష్యతి
న చ నశ్యతి యన్నాస్తి తస్య కిం నామ నశ్యతి. 30

ఇక్కారణమున ఈ దృశ్య మెపుడును నుత్పన్నము కాలేదు, ఇపుడును లేదు, ముందును నుండఁబోదు. మఱియు నది యెపుడును నశించుటయులేదు. ఏది లేకయేయున్నదో, దానికిఁక నాశమేమి?

తత్తదేవ పరం శాన్తం చిద్వ్యోమైవ తథా స్థితమ్
స్వరూపాదచ్యుతం స్వస్థం సౌమ్యం జగదివోదితం. 31

కావున పరమశాంతమగు చిదాకాశమే తనస్వరూపమునుండి చ్యుతినొందక, స్వస్థము ను సౌమ్యముగను నెప్పటియట్లున్నదై యా విధముగ జగద్రూపముతోటి యావిర్భవించినదగును.

నహీదమగ్రే యద్దృష్టం దృశ్యం తత్క దాచన
న చాపి ద్రష్టాదృష్టార్థాభావే క్వ ద్రష్టృతా కిల. 32

ఏది ప్రథమమున (సృష్టికిఁ బూర్వము) గాంచబడక యున్నదో, అట్టి దృశ్యమెటుల సత్య మగును? మఱియు దృశ్యముయొక్క అభావమువలన ద్రష్టయు లేనివాఁడేయగును. ఏలయనిన, దృశ్యమే లేనపుడిఁక ద్రష్టృత్వ మెచట?

శ్రీరామ ఉవాచ :—

ఏవం చేత్తద్వద బ్రహ్మన్ద్రష్టృదృశ్యావభాసనమ్
కిమిదం కథమాభాతి భూయోఽపి వదతాం వర. 33

శ్రీరాముఁడు:— వక్తలలో శ్రేష్ఠుడవగు నో మహాత్మా! అట్లైనచో, ఈ ద్రష్టృదృశ్యముల యొక్క భాసించుట యేమి? మఱియు నవి యెట్లు భాసించుచున్నవి? అను విషయమును మరల తెలుపప్రార్థన.

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

అసద్రూపస్య దృశ్యస్య కారణాభావతః సదా
దృశ్యతాస్యేత్యపి ప్రౌఢనిర్దేశస్యాత్యసంభవాత్. 34

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! కారణముయొక్క అభావముచే అసద్రూపమగు దృశ్యముయొక్క భానము (భాసించుట) యెపుడును సంభవింపనేరదు. మఱియు, 'కారణాభావ ముచే అసద్రూపముయొక్క యుత్పత్తియే అసంభవమగుటచే నపుడద్దాని దృశ్యత్వము అసంభవ మని వేఱు చెప్పవలెనా? అను ప్రౌఢివాదమును బట్టియు ఈ జగత్తుయొక్క దృశ్యత్వము లేనిదే యగుచున్నది. కావున, సద్రూపమగు పరబ్రహ్మమే మాయచే నవ్విధమున భాసించుచున్నదగును.

యదిదం భాసతే కించిద్ద్రష్టృదృశ్యభ్రమాత్మకమ్
జగదాది పరం రూపం తద్విద్ధి పరమాత్మనః 35

ఓ రామచంద్రా! భ్రమాత్మకములై, ద్రష్టృదృశ్యాదిరూపములతోటి భాసించు యీ జగ దాది పదార్థములెవ్వి గలవో, వానిని పరమాత్మయొక్క రూపములుగనే నీ వెఱుఁగుము.

స్వప్నే చిన్మాత్ర ఏవాస్తే యథా గగనకాననమ్
తథా జగత్తయా భాతి స్వయం చిన్మాత్రమాత్మని. 36

స్వప్నమున ఆకాశ, వనాది పదార్థములన్నియు చిన్మాత్రములే యైనట్లు, జాగ్రత్తు నందును చిన్మాత్రమగు ఆత్మయే స్వయముగ తనయందుఁదాను జగద్రూపముగ భాసించుచున్నది.

ఇహాదిసర్గాత్ప్రభృతి నాస్త్యుపాదానకారణమ్
కించనాపి క్వచిదపి భాతీత్థం బ్రహ్మ కేవలమ్. 37

ఇట, ఆదిసృష్టినుండి మొదలుకొని దేనికిని నెచటను ఉపాదానకారణమేమియును లేదు. కావున నెయ్యది భాసించుచున్నదో, అది కేవలము బ్రహ్మమే యగును.

యచ్చిదాకాశకచనం స్వయమాత్మని జృమ్భతే
తదిదం భాతి తస్యైవ జగదిత్యుదితం వపుః. 38

...కాశముయొక్క స్ఫురణము స్వయముగఁ తనయందు (చిదాకాశమందు) వి...చు చున్నదో, అదియే యీ జగదాకారముగ నుదయించినదై భాసించుచున్నది.

యథా భావస్య భావత్వం యథా శూన్యస్య శూన్యతా
ఆకారిణో యథాకారస్తథా చిన్నభసో జగత్. 39

భావమునకు భావత్వమున్ను, శూన్యమునకు శూన్యత్వమున్ను, ఆకారపదార్థము నకు ఆకారమున్ను నెట్లో, అట్లే చిదాకాశమున కిజగత్తున్నునై యున్నది.

ఇదం విద్ధి చిదాభాసం పరమార్థఘనం ఘనమ్
ఇత్థం స్థితం స్వయం భాతం ద్రష్టృదృశ్యదృగాత్మకమ్. 40

ఓ రామచంద్రా! ఈ జగత్తును సైంధవ (లవణ) ఘనమువలె ఏకరసమగు పరమార్థఘన మైన చిద్రూపముగనే యెఱుఁగుము. చైతన్యమే మాయయందు ప్రతిభాసించినదై యిట్లు ద్రష్టృ దృశ్యదర్శనమను త్రిపుటీరూపముచే స్వయముగ భాసించుచున్నది.

వస్తుతస్తు ద్వయాభావాన్నాభాసి నచ భాసనమ్
కిమపీదమనిర్దేశ్యం సద్వాఽసద్వేతి వేత్తి కః. 41

మాయయొక్క త్యాగమందు ద్వైతముయొక్క అభావమువలన నిఁక భాస్య, భాసకము లెవ్వియు నుండవు. గావున నపుడీ జగత్తు సత్తో, అసత్తో యెవడెఱుఁగును? కావున నిది, అనిర్వ చనీయమే యగును.

శ్రీరామ ఉవాచ :—

ఏవం చేత్తద్వద బ్రహ్మన్కార్యకారణతాదికః
కథం భేదః కిమాయాతః కథం సత్యత్వమాగతః. 42

శ్రీరాముఁడు:— మహాత్మా! ఈజగత్తు ద్రష్టృదృశ్య శూన్యమగుచో నపుడు కార్యకారణ త్వాది భేద మెయ్యది యెట్లేతెంచినదో, ఎట్లది సత్యముగ భాసించుచున్నదో వచింపఁగోరెద.

శ్రీవసిష్ఠ ఉవాచ :—

చిత్ప్రకాశో యథా భానం యదా భావయతి స్వయమ్
స్వాత్మా తథా తదేవాశు పశ్యసీత్యసి దృష్టవాన్. 43

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! స్వాత్మయగు చిత్ప్రకాశము (తద్రూపుఁడగు ఈశ్వరుఁడు) స్వయముగ నెపుడెట్లు భాసించునో, మఱియు ప్రాణికోట్లయొక్క కామ, కర్మ, వాసనానుసారము సత్యసంకల్పముచే నెట్లు భావించునో, అపుడారీతిగనే నీవు శీఘ్రముగఁ గాంతువు. కావున ఈ ప్రకారముగనే నీవాద్రష్టృదృశ్యభావముల ననుభవించినవాఁడవైతివి.

చిద్వ్యోమైవాయమాకారః స్వేవ్యోమ్న్యేవ న ముహ్యతి
స్వయమేవ యథా స్వప్నే కోఽస్య పర్యనుయోగకృత్. 44

ఈ కార్యకారణ భావములనున్ను చిదాకాశమే (తద్రూపుఁడగు ఈశ్వరుఁడే) ధరించుచున్నది. స్వప్నమెఱుఁగఁ బడునటుల ఎపుడా సమస్తమున్ను తన చిదాకాశమందే స్వయముగ సంభవించుచున్నదని యెపుడది యెఱుఁగునో, అపుడు మోహమును బొందకుండును. అట్లెఱుఁగనిచో మోహమును బొందును. అయితే, 'స్వాత్మబోధ సమర్థుఁడగు యీశ్వరుఁడు స్వయముగ జీవుఁడై యేల మోహమొందవలెనని' యడిగినచో, అట్లాక్షేపించునట్టి శక్తి యెవనికిఁగలదు? (ఎవనికిని లేదని భావము. ఈ ప్రపంచ మీశ్వరునియొక్క లీలయైయున్నది.)

భావాద్భావాన్తరప్రాప్తౌ మధ్యే యత్సంవిదో వపుః
తచ్చిద్వ్యోమ తదేవేదం సర్వం చ స్థితినేతరత్. 45

క్షీరము దధి (పెరుగు) భావమును బొందునపుడును, మృత్పిండము ఘటభావమును బొందునపుడును పూర్వభావ నివృత్తియొక్కయు, ఉత్తరభావోత్పత్తియొక్కయు మధ్య క్షణకాలములో ఏ సన్మాత్రరూపము ప్రసిద్ధమైయున్నదో, అదియే పరమార్థసత్యమగు చిదాకాశముయొక్క స్వరూపమైయున్నది. మఱియు నదియే యీ సమస్తమున్ను, సర్వవస్తువులయొక్క స్థితియునై యున్నదిగాని మఱియొకటికాదు.

కార్యకారణ భావాదిదృశో విద్యావిజృమ్భికాః
జగద్వత్కల్పయత్యేష కోఽస్య పర్యనుయోగకృత్. 46

కార్యకారణభావాది దృష్టులన్నియు 'అవిద్యా' (మాయా) కల్పితములే యగును. మఱియు. ఈశ్వరునియొక్క జీవభావకల్పనయందువలె, జీవునియొక్క తన యవిద్యచే గల్పితమగు కార్యకారణరూపమైన అవస్థాత్రయకల్పనయందును ఆక్షేపము యుక్తముకాదు. తనయొక్క కల్పననుగూర్చి తానే యెవఁడాక్షేపించు కొనఁగలడు?

ద్రష్టా భోక్తాథ కర్తా వా కశ్చిత్స్యాదితరో యది
తత్కథం కిమిదం దృశ్యమితి యుజ్యేత నాన్యథా. 47

ద్రష్టగాని, భోక్తగాని, కర్తగాని, కల్పించువాఁడుగాని తనకంటె వేఱైయుండుచో 'ఈ ద్రష్టృదృశ్యాది కల్పనయేమి? ఎటు?' అను ఆక్షేపముతగును.

యత్ర స్వప్నే నిరాభాసం చిద్వ్యోమైవ విరాజతే
శుద్ధమేకమనేకాత్మ తత్ర కిం కస్య వికల్ప్యతే. 48

ఎచట స్వప్నమున నితరమగు యే ప్రకాశమున్ను లేక శుద్ధమై, ఏకమైనట్టి చిదాకాశమే అనేక పదార్థరూపములుగ విరాజిల్లుచున్నదో, అటనిఁక దేనినిగూర్చి యేమి యాక్షేపింపఁబడగలదు? (అట్లే సర్వపదార్థ రూపమున చిదాకాశమే వెలుఁగుచున్నట్టి యీ జాగ్రత్ప్రపంచమందును దేనిఁగూర్చియు ఆక్షేపము తగదని భావము.)

అస్వయంభువ ఏవేయం చిన్మాత్రే భాతి సర్గభాః
పరిజ్ఞాతా సతీ సా తు బ్రహ్మైవ భవతి క్షణాత్. 49

బ్రహ్మమునుండి మొదలుకొని సమస్తజీవులకును ఈ దృష్టి భ్రాంతి భాసించుచునేయున్నది. కాని యెపుడయ్యది అసత్తని యెఱుఁగఁ బడుచున్నదో, అపుడది తత్క్షణము బ్రహ్మమే యగుచున్నది

ఏషైవ త్వపరిజ్ఞాతా భ్రాన్తిర్మాయేతి కథ్యతే
జగదిత్యుచ్యతే విద్యా దృశ్యమిత్యుపవర్ణ్యతే. 50

ఈ సృష్టిభ్రాంతియే వాస్తవముగ నెఱుఁగఁబడక యున్నపుడు శాస్త్రములందు మాయయనియు, లోకమున జగత్తనియు, అజ్ఞానులచే 'అవిద్య' యనియు, వివేకులచే దృశ్యమనియుఁ జెప్పఁ బడుచున్నది.

చిదాకాశప్రకాశేన చిత్తా దృశ్యపిశాచకః
వేతాలో బాలకేనేవ బుద్ధోఽసన్నేవ సన్నివ. 51

చిదాకాశముయొక్క జ్ఞానముచే ఈ సమస్తభ్రాంతియుఁ దొలఁగుచున్నది. మఱియు వాస్తవముగ నిజచిత్స్వభావముకంటె వేఱుఁగ లేనప్పటికిని, ఈదృశ్యపిశాచము బాలునిచే బేతాళమెఱుఁగఁబడునట్లు వేఱుగనే యెఱుఁగబడుచున్నది.

జగత్తాత్మన్యసత్యాపి చిద్వ్యోమ్నైవానుభూయతే
సత్యేవ సాఙ్గలేఖేవ స్వప్నేఽద్రిపురతా యథా. 52

నిరాకారమగు ఆత్మయం దీజగద్రూపత్వము అసత్యమేయైనను; స్వప్నమందుఁ బర్వతనగరాదు లనుభవింపఁబడునట్లు చిదాకాశముచే నయ్యది సత్యముగను అవయవసహితముగను ననుభవింపఁబడుచున్నది.

అహమద్రిమహం రుద్రః సముద్రోఽహమహం విరాట్
చేత్యతే ఖే చితై వేతి స్వప్నేద్రిపురతా యథా. 53

స్వప్నమునఁ బర్వత నగరాదు లనుభవింపఁబడునట్లు నేను మేర్వాది పర్వతములను నేను రుద్రుఁడను నేను సముద్రమును నేను విరాట్పురుషుఁడను అను నివ్విధమున చైతన్యముచేతనే చిదాకాశమున ననుభవింపఁబడుచున్నది.

ఆకారి కారణాభావాజ్జాతం కార్యం న కించన
మహాప్రలయచిద్వ్యోమ్ని చిత్థిప్రతేత్థమిదన్తయా. 54

మహాప్రళయరూపమగు చిదాకాశమున సాకారమగు కారణముయొక్క అభావముచే ఈ జగదాది రూపమగు కార్యమెద్దియు నుత్పన్నముగాకయేయున్నది. చిదాకాశమే యిట్లు జగద్రూపముగ స్థితినొందియున్నది.

అకారణకమేవేదం వ్యోమ వ్యోమ్నానుభూయతే
జగదిత్యేవ శూన్యాఙ్గం చిన్మాత్రాత్మ చిదాత్మని. 55

కారణరహితమై అవయవశూన్యమైనట్టి చిదాకాశరూపమగు జగత్తును చిదాకాశరూపమై చిన్మాత్రమగు ఆత్మ స్వయముగ తన స్వరూపమును ననుభవించుచున్నది.

సర్వ ఏవ జడా జీర్ణా దర్పణా ఇవ జన్తవః
సమీపగత ఏవాన్తః కుర్వతస్తు విచారణమ్. 56

సర్వజీవులును అద్దములవలె తమయందు పరికల్పింపఁబడిన జగద్భేదముల నెఱుఁగఁజాలక పోవుటచేతను విచారాభావముచే తమవాస్తవస్వరూపముగ గాంచనసమర్థులగుటవలనను జడులై వ్యర్థముగ శిథిలత నొందుచున్నారు. తత్త్వవిచారమును గావించు ధీరునకైతే పరమపురుషార్థము (నిజప్రత్యగాత్మరూపమున) సమీపమునకే యేతెంచినదగును.

తత్తత్స్వరూపముత్సృజ్య బుద్ధ్వా చిన్మాత్రఖం జగత్
అశ్మనా చేతనేనైవ స్థేయం నాస్థేతరోత్తమా. 57

విచారణచే జగత్తునందలి సమస్త పదార్థములయొక్క నామరూపములను త్యజించి శేషించునట్టి చిన్మాత్రాకాశమే జగత్తుయొక్క వాస్తవస్వరూపముగ నెఱిఁగి చైతన్యఘనముతోడ శిలవలె నిశ్చలముగ నుండవలయును. అట్టి చైతన్యముకంటె భిన్నములైన మాయికములగు దేహాదులందలి ఆసక్తి యుత్తమముకాదు.

యథాస్తే చలయద్దేహం వార్యావర్త జగద్ద్రవః
చేతతీతి తథా చిత్త్వం స్థితా చిత్తజ్జగద్దృశా. 58

ద్రవరూపమగు జలమెట్లు తనదేహమును జలింపఁజేయుచు ఆవర్తతరంగాది రూపములచే స్థితినొందియున్నదో, అట్లే చైతన్యమున్ను తనయందు వ్యాపారరూపమును గల్పించి జగద్రూపముగ స్థితినొందియున్నది.

యథా కల్పద్రుమోఽభీష్టం కుర్యాచ్చిన్తామణిర్యథా
తథా యద్భావితం స్వాన్తస్తత్పూరయతి చిత్క్షణాత్. 59

కల్పవృక్షమున్ను చింతామణియు చింతించినంతమాత్రమున నే అభీష్టపదార్థము నొసంగునట్లు చైతన్యమున్ను జీవుడు తనయందు దేనిని భావించునో దానిని తత్క్షణమే పరిపూర్ణమొనర్చుచున్నది.

చితిశ్చిన్తామణిరివ కల్పద్రుమ ఇవేప్సితమ్
ఆశు సంపాదయత్యన్తరాత్మనాత్మని భాస్వరా. 60

చింతామణివలెను, కల్పవృక్షమువలెను, చిదాకాశరూపమగు చైతన్యము జీవుని యభిలషితమును వానియందు శీఘ్రముగ బ్రాప్తింపఁజేయుచున్నది.

దేశాద్దేశాన్తరప్రాప్తౌ మధ్యదేశే చితేర్వపుః
యత్తన్మయమిదం దృశ్యం కుతో ద్వైతైక్యవిభ్రమః. 61

నిమిషమాత్రకాలములో నొకప్రదేశమునుండి దూరముననున్న మఱియొక ప్రదేశమునకు దృష్టి జనునపుడు ఆరెండు ప్రదేశముల మధ్యనుండు నిర్విషయమగు చైతన్యముయొక్క స్వరూపమేదిగలదో, అద్దానిచే బరిపూర్ణమై యీ జగత్తు వెలయుచున్నది. కావున నిట ద్వైత ఏకత్వముల గూర్చిన భ్రమయెచట?

చిచ్ఛాయైవం కచత్యచ్ఛమనన్తా భాస్వరోదరా
అఙ్గరిక్తాపి దృశ్యాన్తఃశూన్యతా నీలతేవ ఖే. 62

ఆకాశము శూన్యత్వ, నీలత్వరూపములచే స్ఫురించునట్లు అవయవవర్జితమై, దృశ్యరహితమై అనంతమై, ప్రకాశపరిపూర్ణమైనట్టి చైతన్యముయొక్క నిర్మలకాంతియే జగద్రూపముచే స్ఫురించుచున్నది.

విసదృశకార్యానుభవో న భవతి సహకారికారణాభావాత్
సర్గాదావత ఆద్యా చిదేవ దృశ్యం యథా స్వప్నే. 63

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే కార్యకారణనిరాసోనామ షడధికశతతమః సర్గః ॥ 106 ॥

ఓ రామచంద్రా! సృష్ట్యాదియందు, చైతన్యముకంటె సర్వథా భిన్నమైనట్టి జడజగద్రూపమగు కార్యముయొక్క యుత్పత్తి సహకారికారణముయొక్క అభావముచే సంభవింపకయే యున్నది. కాఁబట్టి స్వప్నమందువలె ఈ జాగ్రత్తునందలి దృశ్యమున్ను, ఆద్యస్వరూపమగు చైతన్యమే యైయున్నదిగాని తద్భిన్నముగ అణుమాత్రమైననుగాదు.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున కార్యకారణనిరాసమను నూటాఱవ సర్గము ॥ 106 ॥

సప్తాధికశతతమః సర్గః

[ఇహోపపాద్యతే చేత్యపృథ్వ్యాదీనామవస్తుతా
చిన్మణేరేవ కచనం స్వప్నవజ్జగదిత్యపి.

పృథ్వ్యాదుల అవస్తుత్వము, స్వప్నమందువలె చైతన్యమను మణియొక్క స్ఫురణమే యీ జగత్తు — అను విషయము లిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీవసిష్ఠ ఉవాచ :—

అచేత్యచిన్మయం విశ్వం విష్వగాభాతి చిన్నభః
అత్ర చిచ్చేతనం చేదం చేత్యమప్యేవమాత్మకమ్. 1

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! విషయవర్జితమై, చిన్మయమైనట్టి చిదాకాశమే నలువైపుల ప్రపంచరూపముగ భాసించుచున్నది. కావున నిట చిత్తు (ప్రకాశకము) చేతనము (ప్రకాశనము), చేత్యము (ప్రకాశ్యమగు విషయము) అను ఈ త్రిపుటియు శుద్ధచిదాత్మరూపమే యైయున్నది.

అతో జీవన్నపి మృత ఇవ సర్వోఽవతిష్ఠతే
అసావహం చ త్వం చేతి జీవన్తోఽపి మృతా ఇవ. 2

ఓ రామచంద్రా! ఇక్కారణమున (సమస్తము కూటస్థమై, అచలమైనట్టి చిదాకాశమే యగుట(బట్టి) జీవించియున్నప్పటికిని సర్వము మరణించినవానివలె నిశ్చలముగ స్థితినొందియున్న దగును. మఱియు నీవు, నేను, ఈ సభ్యులందఱును జీవించియున్నప్పటికిని మరణించినవారి వలెనే యున్నవారమగుదుము. అనఁగా స్థితిగల్గియున్నప్పటికిని ఈ జగత్తుయొక్క జగద్భావ నివృత్తియు, జీవించియున్నప్పటికి మనయందఱియొక్క జీవభావనివృత్తి (ఆత్మభావప్రాప్తి)యు సంభవించినదగుచున్నది.

కాష్ఠమౌనమృతా ఏవ వ్యవహారగతా అపి
ఖగమా ఏవ వా సర్వే భావా స్థావరజంగమాః. 3

మఱియు (సర్వము చిదాకాశమయమగుటచే) స్థావరజంగమ రూపములగు సమస్త పదార్థములున్ను వ్యవహారయుక్తములై యున్నప్పటికిని మృతునివలెను, కాష్ఠమువలె నిశ్చలముగను, మౌనముగను నున్నవై, లేక, ఆకాశమువలె అత్యంత నిరాకారభావమును ప్రాప్తినొందినవై వెలయుచున్నవగుచు.

ఆకాశ కాచకచ్యాత్మ యదిదం కించిదాతతమ్
న కించి దేవ తద్విద్ధి కించిద్వ్యోమ్ని కుతో భవేత్. 4

ఓ రామచంద్రా! ఈ వ్యాప్తమైయున్న జగజ్జీవాది సమస్తమున్ను ఆకాశముయొక్క నీలత్వమువంటిదే యైయున్నది. కావున దీనినంతయు నీవు మిథ్యగనే యెఱుఁగుము. ఏలయనిన, ఆకాశమున నీలత్వాదు లెట్లుండఁగలవు?

కేశోణ్డ్రకనదీవాహధూమాలీమౌక్తికాదివత్
యత్థం కచతి తత్రాస్తి నానుభూతేఽపి వస్తుతా. 5

ఆకాశమందు కేశములు, నదీప్రవాహము, ధూమసమూహము, ముత్యములు మున్నగునవి అనుభూతములైనను లేనివేయగునట్లు, ఈ దృశ్యజగత్తు స్ఫురించు చున్నప్పటికిని ఇందు వస్తుత్వము (సత్యత్వము) లేనిదైయున్నది.

తథైవాస్మిఞ్జగన్నామ్ని చిద్వ్యోమ్ని కచనే చితే
అనుభూతేఽపి నిఃశూన్యే కాస్థాస్థాభావకశ్చ కః. 6

ఆకాశమున ముత్యములు మున్నగువానివలె, చిదాకాశము యొక్క స్ఫురణరూపమగు ఈ జగజ్జగత్తు అనుభూతమైనప్పటికిని సర్వథా శూన్యమైనట్టి యద్దానియందిఁక భోగాసక్తియేమి? అట్టి భోగాసక్తి జనకమగు పదార్థమేమి?

చిజ్జ్వాలకల్పనాజాలే శూన్యాత్మని నిరర్థకే
అవస్తుభూతే పృథ్వ్యాదౌ భ్రాన్తిమాత్రాత్మరోదయే. 7
కిమాస్థా బాలకా భ్రూత మమేదమహమిత్యలమ్
అ జ్ఞాతం రమతే బాల సంకల్పే బాల ఏవ చ. 8

చిద్రూపమను బాలునియొక్క కల్పనాజాలమై, శూన్యరూపములై, నిరర్థకములై, మిథ్యాభూతములై, భ్రాంతిమాత్రములైనట్టి యీ పృథ్వ్యాది పదార్థములందు ఓ అజ్ఞులారా! 'నేను నాది, యిదినేను, ఇత్యాదిరూపమగు మహా ఆసక్తియేలకోవచింపుఁడు! ఆహా! తెలిసినది! అజ్ఞాన సంకల్పమున అజ్ఞానియే ప్రీతిఁగొనును! (అజ్ఞానమే అట్టి యాసక్తికి హేతువని భావము.)

పృథ్వ్యాద్యసద్విచారైర్వా వ్యర్థం యాస్యతి జీవితమ్
కించిచ్చ న జ్ఞాస్యతి ఖోరాకాశక్షాలనోద్యతః. 9

సువర్ణ, రత్నాదుల, గోరువాఁడు అవియున్నట్టి స్థానమును ప్రక్షాళనమొనర్చుటను వదలి, ఆకాశమును ప్రక్షాళనమొనర్చుటకుఁ బ్రవృత్తుఁడైనచో, గొప్ప ప్రయత్నముచేఁగూడ నొకింత ఫలమునైనను బొందనట్లు, పరమార్థమును జేకూర్చునట్టి వైరాగ్యాది సాధనములను వదలి పృథ్వ్యాది అసత్పదార్థముల లాభమునుగూర్చిన విచారములచే మనుజుఁడెట్టి ఫలమునున్ను బొందనేరఁడు. పైగా జీవితము వ్యర్థముగ గడచిపోవును.

సహకార్యాదిపూర్వాణాం కారణానామభావతః
యదాదావేవ నోత్పన్నం తన్నామాద్య భవేత్కుతః. 10

సహకారికారణముల అభావముచేనేది (జగత్తు) ఆదియందే యుత్పన్నము గాక యున్నదో, అది యిపుడెట్లుండును?

అజాతేనాసతార్థేన ఖేన వ్యవహరన్తి యే
మూఢా మృతమజాతం వా తనయం పాలయన్తి తే. 11

ఉత్పన్నములే కానివియు, అసద్రూపములును, శూన్యములునగు పదార్థములతోటి వ్యవహరించునట్టి మూఢులు, ఇంకను జనింపనివాఁడును, లేక మరణించిన వాఁడునగు పుత్రుని పాలించు వారేయగుదురు.

కుతః పృథ్వ్యాదయః కేన కే నామ కథముత్థితాః
చిద్వ్యోమేత్థమిదం శాన్తం ప్రకచత్యాత్మనాత్మని. 12

పృథ్వ్యాది పదార్థములెవ్వి? యెటనుండి దేనిచేనెట్లు ఉత్పన్నములైనవి? శాంతమగు చిదాకాశమే యివ్విధమున ఆ పృథ్వ్యాదిరూపములతోటి తనయందుఁ దాను స్ఫురించుచున్నది.

కార్యకారణకాలాది కల్పనాకులచేతసామ్
ఏవం పృథ్వ్యాదయః సన్తి తైర్బాలైరలమస్తు నః. 13

కార్య కారణ, కాలాది కల్పనలచే వ్యాకులములైనట్టి చిత్తములు గలవారి దృష్టియందే పృథ్వాదులిట్లు సత్యములై వర్తించుచున్నవి. అట్టి బాలుర (అజ్ఞానుల) తోటి మాకేప్రయోజనమున్ను లేదు.

అపృథ్వ్యాది జగన్నామ సపృథ్వ్యాది చ ఖాత్మకమ్
కచతీత్థం నభోరూపం స్వప్నాదిష్వివ చిన్మణిః. 14

స్వప్నమందలి పృథ్వ్యాది రహితమగు జగత్తున్ను, జాగ్రత్ప్రసిద్ధమైన పృథ్వ్యాది సహితమగు జగత్తున్ను రెండును చిదాకాశ రూపములేయైయున్నవి. స్వప్నాదులందువలె చిదాకాశ రూపమగు చిన్మణియే యివ్విధమున జగద్రూపముచేఁ బ్రకాశించుచున్నది.

అఙ్గం యదేతస్య చిదమ్బరస్య నిరాకృతి స్వానుభవానుమానమ్
తదేతదాభాతి మహీతలాది రూపేణ వేద్యేతి కృతాభిధానమ్. 15

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యాభావప్రతిపాదనం నామ
సప్తాధిక శతతమః సర్గః ॥ 107 ॥

ఓ రామచంద్రా! స్వానుభవ రూపమైన యీ చిదాకాశముయొక్క నిరాకారమగు స్వరూపమేది గలదో, అదియేదృశ్యమను కల్పితనామముతోఁగూడి యిట్లు పృథ్వ్యాదుల రూపముతోఁటి భాసించుచున్నది.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
అవిద్యాభావప్రతిపాదనమను నూటేడవ సర్గము ॥ 107 ॥

అష్టాధిక శతతమః సర్గః

[అనష్టాయామవిద్యాయాం జగదన్తో న కర్హిచిత్
అత్రార్థే విస్తరాచ్చిత్రమవిద్యాఖ్యాన మీర్యతే.
తస్మిన్విపశ్చిచ్చరితే చతుర్దిక్షువిపశ్చితః
ఇహ ద్విషత్సముత్థానోదన్తశ్చత్యస్తముచ్యతే.

అవిద్య నశించనిచో, జగత్తునకు అంతములేదను విషయమునుగూర్చి విచిత్రమగు 'అవిద్యోపాఖ్యాన' మిచట విస్తారముగ వచింపఁబడుచున్నది. మఱియు నట విపశ్చిత్తుయొక్క చరిత్రమున నలువైపులనుండి శత్రువులు లేచుటయు నిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీరామ ఉవాచ :—

అవిద్యా దృశ్యరూపేయం కచన్తీ యస్య విద్యతే
చిన్నభఃస్వప్ననగరీ దృశ్యమానాపి శూన్యకమ్. 1
తస్యాఙ్ఞస్య కియత్కాలం కింరూపా స్యాత్కిమాత్మికా
కియతీ సా చ వేత్యేయం మునే మే కథ్యతాం పునః. 2

శ్రీరాముఁడు:— మహాత్మా! వాస్తవముగ చిదాకాశస్వరూపమై స్వప్ననగరమును బోలియున్నదై విద్యమానమైయున్నను శూన్యభూతమైనట్టి యీ దృశ్యరూపమగు అవిద్య యెవనికి నశింపకయుండునో, అట్టి అజ్ఞానికయ్యది యెంతకాలమువఱకుండును? ఏరూపముతోఁటి వర్తించును? దేశతః యెంత పరిమితి గలిగియుండును? అను నివ్విషయమును దయచేసి మరల తెలుపప్రార్థన.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

అవిద్యా విద్యతే యేషామజ్ఞానాం భూతలాదికా
తేషామస్యాం బ్రహ్మణీవ నాస్త్యన్తోఽత్ర కథాం శృణు. 3

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! పృథ్వ్యాదిదృశ్య రూపమగు అవిద్యయెవరికి ఉండునో అట్టి అజ్ఞానులకు దానియందు బ్రహ్మమందువలె దేశతః కాలతః అంతమే యుండదు. ఇవ్విషయమున ఈ చెప్పబోవు కథనుగూర్చి వినుము.

సదృశం జగతోఽస్యాస్తి క్వచిదమ్బరకోణకే
కస్మింశ్చిత్త్రిజగత్కించిదనయైవ వ్యవస్థయా. 4

చిదాకాశముయొక్క యొకానొకకోణమందు (పూర్వము వచించిన లోకాలోకపర్వత శిలవంటి) ఒకానొకవస్తువునందొక ప్రదేశమున ఈ త్రైలోక్యము వలెనే భువనద్వీపదేశకాలాది వ్యవస్థతోఁగూడిన యొకానొక త్రైలోక్యము గలదు.

అస్తి కశ్చిద్భువో భాగో భూషణం తత్ర భూస్థితేః
పురీ తతమితిర్నామ్నా సువ్యక్తకలనాఽవనౌ. 5

అట జంబూద్వీపమను భూప్రదేశమునకు భూషణమై యొప్పునట్టి యొకానొక భూభాగము గలదు. అందుమనుజ గజాశ్వాదులకు సంచారయోగ్యమై ఉత్తమమైనట్టి యొకానొక సమప్రదేశమున 'తతమితి' అనుబేరుగల ప్రసిద్ధమైన నగరమొండు గలదు.

తత్రాసీత్పార్థివః కశ్చిద్విపశ్చిదితి విశ్రుతః
యః సభాయాం సుసభ్యాయాం విపశ్చిత్త్వాద్విరాజతే. 6

ఆ నగరమున 'విపశ్చిత్తు' అనుబేరుచే విఖ్యాతి నొందిన భూపాలుఁడొకఁడు గలఁడు. అతఁడు సర్వశాస్త్రములందును ప్రావీణ్యము గలవాఁడగుటచే నుత్తమసభ్యులు గల సభయందు శోభిల్లుచు నుండెను.

రాజహంస ఇవాబ్జిన్యామృక్షచక్ర ఇవోడురాట్
సుమేరురివ శైలౌఘే యః సభాయామరాజత. 7

కమలసరోవరమున రాజహంసవలెను, నక్షత్రసమూహమున చంద్రునివలెను, పర్వత గణమధ్యమున సుమేరువువలెను, నాతఁడు సభయందు విరాజిల్లుచుండెను.

నివర్తతే యతోఽశక్త్యా వచనం గుణవర్ణనాత్
కవీనామచలాకారా భవేద్భా భూధరో యథా. 8

ఆ రాజుయొక్క అనంతగుణముల వర్ణించుటయందు కవులవాణి అశక్తత్వముచే నివర్తించుచుండెను. అయినను కవులాతని యుత్తమకీర్తిని వర్ణించుచునే యుండిరి, ఏలయనిన. అతనివలన వారికి స్థిరమగు సంపత్తిగుణోత్కర్షాదులతోఁగూడిన శోభకలుగుచుండెను. మఱియు సుమేరుపర్వతములవలె నారాజు తన్నాశ్రయించినవారిని స్వర్ణమయులుఁగ జేయుచుండెను.

ప్రాతః ప్రాతర్వికసితాత్సర్వా శాఖాసనోద్యతాత్
యతః ప్రతాపజనిత శ్రీరుదేత్యమ్బుజాదివ. 9

సర్వదిశలను బ్రకాశింపఁజేయుటకుఁ బ్రవృత్తమగు సూర్యరశ్మిచేఁ ప్రాతఃకాలమున వికసిత కమలమునుండి శోభయుదయించునట్లు ఆ రాజుయొక్క ప్రతాపముచేఁ బ్రతిదినము సంపత్తి యుదయించు చుండెను.

స బ్రహ్మణ్యమతిర్మానీ వహ్నిమేవాధిదైవతమ్
అపూజయత్సమం భక్త్యా పేవం వేత్తిస్మ నేతరమ్. 10

బ్రాహ్మణ భక్తుఁడును, మానయుతుఁడునగు ఆరాజు దేవతలందు బ్రాహ్మణ రూపుఁడగు అగ్నినే యెక్కువభక్తితోఁ బూజించుచుండెను. ఆ యగ్ని తప్ప మఱియొక దేవత నాతఁ డెఱుఁగఁడు.

సమత్స్య మకరావ్యూహా గజవాజిగణాన్వితాః
అవర్తచక్రవ్యూహాఢ్యాః కల్లోలబలమాలితాః. 11
మర్యాదాపాలనే యుక్తా అకమ్పనబలాధికాః
మన్త్రిష్వవ్యన్య చత్వారో దిక్షు సత్సాగరా ఇవ. 12

మత్స్య, మకరాది వ్యూహరచనాయుక్తులును, అశ్వగజాది సమూహసంపన్నులును, ఆవర్త, చక్రాది వ్యూహములచేఁ బరిపూర్ణులును, తరంగములవలె సేనలచేఁ బరివేష్టితులును, మర్యాదా పాలనతత్పరులును, మహాబలయుతులును, నాలుగుదిక్కులను బాలించువారునగు నలుగురు మంత్రులాతనికి నాల్గుసముద్రములవలె నలుదిక్కుల వెలయుచుండిరి.

త్రైరశేషకకుప్చక్రనాభిరాభాసతావనిః
ఆసీత్సుదర్శనో జేతా న సుదర్శనచక్రవత్. 13

ఆ మంత్రులచే నా రాజు దిక్చక్రమంతటికిని నాభివలె ఆధారభూతుఁడై, భూతలమును బ్రకాశింపఁజేయుచు శత్రువులచే జయింపఁబడనివాఁడై, ఎల్లెడల తానేజయించుచు సుదర్శనచక్రమువలె భాసిల్లుచుండెను.

తమేకదా యయౌ పూర్వదిఙ్ముఖాచ్చతురశ్చరః
స ఉవాచ రహో రంహోగతిఘోరాక్షరం వచః 14

ఒకపుడారాజువద్దకుఁ దూర్పుదిక్కునుండి యొక చతురుఁడైనదూత యేతెంచికాలుని శబ్దములవలె దుర్నివారములైనట్టి కఠోరవాక్యముల నిట్లు పలికెను.

దేవదోర్ద్రుమవిశ్రాన్త ధరాగోబన్ధనాచ్యుత
శ్రూయతాం మన్ముఖాత్సర్వద్యథా ప్రాప్తం విధీయతామ్. 15
పూర్వదిఙ్ముఖసామన్తో జ్వరేణాస్తముపాగతః
మన్యే జేతుం యమం యాతస్త్వయారబ్ధోజితారిణా. 16

తస్మిన్సమస్తతో జేతుం దక్షిణాపథనాయకః
పూర్వాపరాభ్యామాక్రమ్య బలాభ్యామరిణా హతః. 17
తస్మిన్మృతే సమాగమ్య యావద్వారుణదిక్పతిః
బలేనా యాతి కకుభో తే సమాదాతుమాదృతః. 18
పూర్వదేశనృపైః సార్ధం దక్షిణాపథపార్థివైః
తావ దేవారిభిరసావర్ధమార్గే రణే హతః. 19

తమభుజములను వృక్షములందు సదా విశ్రమించుచున్నట్టి భూమండలమను గోబంధనముతోఁ గూడియున్న యో దేవా! నేను జెప్పఁబోవు వాక్యములవిని యాపిదప యెట్లుచితమో యట్లాచరింపుఁడు. మహారాజా! తూర్పుదిక్కునన్న సామంతుఁడు (మంత్రి) జ్వరముచేఁ బీడితుఁడై మరణించెను. శత్రువులను జయించునట్టి తమచే నాతఁడు యమరాజును నిర్జించుటకై పంపఁబడెనని నేను దలంచుచున్నాను. ఆతఁడు మరణించినపిదప దక్షిణదిక్కునందలి సామంతుఁడు పూర్వ, దక్షిణదిశలను బూర్ణముగ జయింప నుద్యుక్తుఁడుకాఁగా ఆయాదిశలందలి శత్రుసేనలచే నాక్రమింపఁ బడినవాఁడై యాతఁడున్ను హతుఁడాయెను. అట్లాతఁడున్ను మృతినొంద పశ్చిమదిశ యందలి నాయకుఁడు సేనాసమేతుఁడై పూర్వ, దక్షిణదిక్కులను జయించుటకై యాదరముతోటి ప్రవృత్తుఁడుకాఁగా నింతలో బూర్వదిశయందలి శత్రురాజులతోఁగూడిన దక్షిణదిక్కునందలి శత్రురాజులచే నాతఁడు మార్గమధ్యముననే చంపఁబడెను.

శ్రీవసిష్ఠ ఉవాచ :—

అథాస్మిన్కథయత్యేవం త్వరార్తమపరశ్చరః
ఉపప్లవో జడోత్పీడ ఇవ హర్మ్యం వివేశ హ. 20

శ్రీవసిష్ఠుఁడు;— ఓ రామచంద్రా! ఆదూత యిట్లు చెప్పుచుండగనే మఱియొక దూత త్వరితత్వముచేఁ బీడితుఁడై ప్రళయకాల జలప్రవాహమువలె ఆరాజ భవనమును ప్రవేశించెను.

చర ఉవాచ :—

ఉత్తరాశాబలాధ్యక్షో దేవారిభిరుపద్రుతః
ఇత ఆయాతి సబలో భగ్నసేత్వమ్బుపూరవత్. 21

దూత;— దేవా! ఉత్తరదిక్కునందలి సేనానాయకుఁడు శత్రువులచే బాధితుఁడై సేతువు (ఆనకట్ట) తెగిపోవ జలమేతెంచునట్లు సేనాసమేతుఁడై యిచటి కేతెంచుచున్నాఁడు.

శ్రీవసిష్ఠ ఉవాచ :—

ఇతి శ్రుత్వా మహీపాలః కాలక్షేపమవాస్తవమ్
మన్యమాన ఉవాచేదం నిర్గచ్ఛన్వరమన్దిరాత్. 22

శ్రీవసిష్ఠుఁడు;— ఓ రామచంద్రా! అది విని యారాజు ఇఁక కాలక్షేపముచేయుట ధన ధాన్యాదులన్నిఁటికి హానికరమని యెంచి వెంటనే శ్రేష్ఠమగు యామందిరమునుండి బయల్వెడలుచు సమీపముననున్న మనుజులతోటి యిట్లు వచించెను.

రాజ్ఞః సన్నహ్య సామన్తానానీయన్తాం చ మన్త్రిణః
ఉద్ఘాట్యన్తాం హేతిశాలా దీయన్తాం ఘోరహేతయః. 23
శ్లేష్యన్తాం కంకటా దేహేష్వాగచ్ఛన్తు పదాతయః
గణ్యన్తామాశు సైన్యాని క్రియన్తాం వరకల్పనాః. 24
కల్ప్యన్తాం చ బలాధ్యక్షాః ప్రేష్యన్తామభితశ్చరాః

రాజులను సామంతులను మంత్రులను సందఱిని యుద్ధమునకై సన్నద్ధులుగఁజేసి యిటకుఁ గొనిరండు! ఆయుధశాలలను దెఱచుఁడు! సైనికులకు భయంకరములైన యాయుధముల నొసంగుఁడు! యోధులందఱును దమతమ దేహములపైఁ గవచములను ధరింపుఁడు! పదాతి (కాలిబంటు) సైనికులందఱును రండు! సేనలను శీఘ్రముగ లెక్కింపుఁడు! శ్రేష్ఠులగు వీరులను వేఱు చేయుఁడు! సేనానాయకులను నియమించుఁడు! నలువైపుల దూతలను బంపుఁడు!

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

వదత్యేవం త్వరాయుక్తం సంరమ్భవతి రాజని. 25
ప్రతిహార ఉవాచేదం ప్రవిశ్యాకులమానతః

ప్రతీహార ఉవాచ :—

ఉత్తరాశాబలాధ్యక్షో దేవ ద్వార్యవతిష్ఠతి
కాఙ్క్షత్యబ్జమివార్కస్య దేవదేవస్య దర్శనం. 26

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! త్వరితత్వముతోను, వేగిరపాటుతోను గూడియున్న రాజిట్లు వచించుచుండగనే యింతలో నొక వ్యాకులచిత్తుఁడగు ద్వారపాలకుఁడు వినమ్రుఁడై యిట్లు పలికెను. దేవా! ఉత్తరదిక్కునందలి సేనానాయకుఁడు ద్వారముకడ వేచియున్నాఁడు. మఱియు, కమలము సూర్యుని జూడఁగోరునట్లు, రాజాధిరాజగు తమ దర్శనము నపేక్షించుచున్నాఁడు.

రాజోవాచ :—

గచ్ఛావిలమ్బితం తావదేనమేవ ప్రవేశయ
జానీమః కిం దిగన్తేషు వృత్తం వృత్తాన్తసంశ్రవాత్. 27

రాజు:— శీఘ్రముగఁబోయి యా సేనాపతి నిటకుఁ గొనిరమ్ము. అతనివలన వృత్తాంతమును వినుటచే దిగంతములందలి సమాచారములను దెలిసికొనఁగలను.

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

ఇత్యుక్త ఉత్తరాశేశం ప్రతిహారప్రవేశితమ్
ప్రణామపరమగ్రేఽసౌ రాజాఽపశ్యద్బలాధిపమ్. 28
క్షతవిక్షతసర్వాఙ్గ మఙ్గమఙ్గేషు సంతతమ్
శ్వాసాకులం వమద్రక్తం ధైర్యేణా బలనిర్జితమ్. 29
స ప్రణమ్య త్వరాయుక్తమువాచేదముపక్రమమ్
సంస్తభ్యాఙ్గవ్యథామాశు సంతతో చ్ఛ్వాసముచ్ఛ్వసన్. 30

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! రాజిట్లు చెప్పనంత ఆ ద్వారపాలకునిచేఁ బ్రవేశింపఁ జేయఁబడినట్టియు, ప్రణమిల్లుచు నున్నట్టియు నుత్తరదేశసేనాపతిని రాజు తనయెదుటఁ గాంచెను. అతఁడు ఛిన్నభిన్నములైన అవయవములు గలవాఁడును, ప్రతి అంగమందును బాణములచే వ్యాప్తమైయున్నవాఁడును, శ్వాసచే వ్యాకులయుక్తుఁడై యొప్పుచున్నవాఁడును రక్తమును వెలిగ్రక్కుచున్నవాఁడును, బలరహితుఁడగుటచే నిర్జితుఁడైనవాఁడును, నైయుండెను. ధైర్యముచే నాతఁడపుడు తన అవయవముల బాధను సహించుకొని త్వరితముగ శ్వాసగైకొనుచు రాజునకుఁ బ్రణమిల్లి యిట్లు పలికెను.

బలాధ్యక్ష ఉవాచ :—

దేవ త్రయోఽపి దిక్పాలా బలేన బహునా సహ
త్వదాజ్ఞయేవ నిర్జేతుం యమం యమపురం గతాః. 31
తద్దేశపాలనాద్యర్థమశక్తం మామిమం తతః
అనుద్రవన్తో బహవో భూపాః ప్రాప్తా బలాదిహ. 32
మహత్పరబలం ప్రాప్తమిదం దేవస్య మణ్డలమ్
విధీయతాం తథా ప్రాప్తం న దేవస్యాస్తి దుర్జయమ్. 33

సేనాపతి:— దేవా! తమయాజ్ఞచే యమరాజును జయించుటకే కాబోలు పూర్వ, దక్షిణ, పశ్చిమ దిశలందలి సేనాపతులు ముువ్వురును తమ గొప్పసైన్యముతో సహా యమపురమునకుఁ జనిరి. అపుడాదేశములను బాలించుటయందువన్ను అసమర్థునిగ నెఱిఁగి పెక్కురు శత్రురాజులు నన్ను వెన్నంటుచు నిటకేతెంచిరి. కావున, దేవా! తమరాజ్యమున నిపుడు గొప్పశత్రుసైన్యమేతెంచియున్నది ఇఁక నెట్లుచితమో యట్లు చేయుఁడు! తమకు దుర్జయమైన దేదియు లేదుగదా!

శ్రీ వసిష్ఠ ఉవాచః—

అథ తస్మిన్వదత్యేవమార్తిమత్యాతివిక్షతే
సహసైవాభ్యువాచేదం ప్రవిశ్య పురుషోఽవరః. 34

శ్రీ వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! ఛిన్నాంగుఁడును, బాధాగ్రస్తుఁడునగు ఆ సేనాపతి యిట్లు చెప్పుచుండగనే యింతలో మఱియొక పురుషుఁడటకు శీఘ్రముగ నేతెంచి రాజుతోనిట్లనెను.

పురుషా మణ్డలస్యాస్య విపులా దలలీలయా
స్థితాన్యరిబలాన్యుచ్చైశ్చతుర్దిక్కం నరేశ్వర. 35
కచచ్చక్రగదాప్రాసకున్తకాననకాన్తిభిః
వలితా నోఽరిభిర్యామిర్లోకాలోకతటైరివ. 36
పతాకాయుధయోధధ్వజాశ్చలత్పరికరాకులాః
విసరన్తి రథాస్తత్ర ప్రోడ్డీనత్రిపురౌఘవత్. 37
కరాను న్నామయన్తః ఖే మాంసవృక్షవనోపమాః
బృంహన్తి వారణవ్యూహా వర్షావారిదవృన్దవత్. 38

నతోన్నతాని కుర్వన్తః స్పన్దేనోర్వీనతోన్నతైః
హేషన్తే హయసంఘాతా వాతస్పన్దమహాబ్ధివత్. 39

రసన్తి తురగాపూరాః ఫేనిలావర్తపాతినః
సర్వతో వలయాకారా లవణార్ణవవారివత్. 40

ఆకాశకాన్తి సన్నాహైర్దిశం ప్రతి బలం బలమ్
ఉదేత్య లఘుకల్లోలైః ప్రలయార్ణవపూరవత్. 41

శరాస్త్రశస్త్రసన్నాహముకుటాభరణత్విషః
కచన్తి త్వత్ప్రతాపాగ్నేర్జ్వాలా ఇవ తదఙ్గగాః. 42

సమత్స్యమకరవ్యూహాః సచక్రావర్తవృత్తయః
ఉద్యన్తి సైన్యసంఘట్టైః కల్లోలా జలధేరివ. 43

పరస్పరపరామర్శాత్కున్తాద్యాయుధపఙ్క్తయః
కోపాదివోగ్రహుంకారైర్జ్వలన్తి విరటన్తి చ. 44

ఓ రాజా! అశ్వత్థాది వృక్షములయొక్క పత్రములవలెఁ జనించుచున్నట్టి యనేక మనుజులిపుడు తమరాజ్యమున కేతెంచియున్నారు. నలువైపుల గొప్పసైన్యము వ్యాపించియున్నది. మెఱయుచున్న చక్ర, గదా, ప్రాస (ఈఁటె), కుంతాద్యాయుధరూపమగు అరణ్యముయొక్క కాంతులతోఁ గూడిన శత్రువులచే మనభూప్రదేశము, లోకాలోకపర్వత తటములచేవలె నావరింపఁ బడియున్నది. పతాకములు, ఆయుధములు, యోధులను అవయవములతోఁ గూడినవై, చలించు పరికరములచేఁ బూర్ణములైయొప్పు రథములు, ఎగురుచున్న త్రిపురాసురుని నగరమువలె నలువైపుల సంచరించుచున్నవి. తొండముల నాకసమునఁ ద్రిప్పుచు మాంసమయ వృక్షములతోఁ గూడిన వనములవలెఁ దోచుచున్నట్టి గజసమూహములు, వర్షాకాలమందలి మేఘములవలె ఘీంకారము సల్పుచున్నవి. భూమియొక్క మిట్టపల్లములనుబోలి పైకిని, క్రిందికిని నెగురుచు గుఱ్ఱపు సమూహములు, వాయుతాడిత మహాసముద్రమువలె, గర్జనయొనర్చుచున్నవి. మఱియు, ఆ యశ్వ సమూహములు ఫేన (నురుఁగు) యుక్తములగు ఆవర్తములవలె పరిభ్రమించుచు, అంతటను వలయాకారముగ నావరించియున్నవై లవణసముద్రజలమువలె శబ్దించుచున్నవి. ఆకాశమువలె నిర్మలమైనట్టి కాంతులతోఁగూడిన కవచశస్త్రాస్త్రాదులతోటి సన్నద్ధమైయున్న సైన్యముః మహాతరంగ యుక్తమగు ప్రళయకాల సముద్రప్రవాహమువలె ప్రతిదిక్కునందును నుదయించుచున్నది, బాణ, శస్త్రాస్త్ర, కవచ, ఆభరణాదుల దీప్తిచేఁ బూర్ణములగు ఆ సైనికుల యంగములందలి ప్రకాశము తమ ప్రతాపాగ్ని జ్వాలలవలె వెలుఁగుచున్నది. మత్స్యమకరాద్యాకార యుక్తములగు వ్యూహములతోఁగూడినవియు, చక్రరూపములగు ఆవర్తములయొక్క భ్రమణములు గలవియు, పరస్పర సంఘట్టన సహితములునగు, సైన్యసమూహములు సముద్రమునుండి మహాతరంగములవలె నుదయించుచున్నవి. మఱియు, పరస్పర సంఘర్షణములచే కుంతాద్యాయుధములు ప్రజ్వలితములై 'ఝున ఝున' శబ్దములతోఁగూడి, కోపమునుచే భయంకర హుంకారశబ్దములు గావించుచున్నవాయను నట్లు ధ్వనిసల్పుచున్నవి.

ఇతి కర్తుమహం దేవ విజ్ఞప్తిం స్వామినేరితః
తస్మాన్మణ్డలసీమాన్తగుల్మాద్యుద్ధాయ గచ్ఛతా. 45

తమహం దేవ గచ్ఛామి శక్త్యృష్టిశరసంగతః
మయేహావేదితం సర్వం దేవో జానాత్యతః పరమ్. 46

దేవా! మనరాజ్యమునఁ బ్రవేశించిన యీ సైన్యములతోటి యుద్ధమొనర్చుటకై పోవుచున్న తమ సామంతుఁడు, తమతో నివ్విధముగ విజ్ఞప్తిగావించు నిమిత్తము నన్నిటకుఁబంపెను. నేనిపుడు శర, శక్తి, ఖడ్గాద్యాయుధములతోఁగూడి యా సామంతునికడకేగుచున్నాను. ఇట్లు, అతఁడు చెప్పినదానినంతయుఁ దమకు నివేదించితిని. ఇఁకమీద చేయఁదగినదేమున్నదో దానిని తామే యెఱుఁగుదురు.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఇత్యుక్త్వాథ ప్రణామం చ స కృత్వా త్వరయా యయౌ
కృత్వా గులుగులారావం శాన్తో వీచిరివామ్బుధేః. 47

శ్రీవసిష్ఠుఁడు:—ఓ రామచంద్రా! ఇట్లు వచించినపిదప యాతఁడారాజునకుఁ బ్రణమిల్లి, సముద్రముయొక్క శాంతతరంగమువలె 'గులుగులు' శబ్దముమ గావించి శీఘ్రముగ వెడలెను.

సంభ్రాన్తమన్త్రినృపయోధనియోగినాగ
నారీరథాశ్వపరిచారకనాగరౌఘమ్
రాజ్ఞో గృహం స్వభయతోలితహేతిసార్థం
చణ్డానిలాకులమహావనతుల్యమాసీత్. 48

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే అవిద్యాక్షేపణే పార్థివ సంరమ్భవర్ణనం నామాష్టోత్తర శతతమః సర్గః ॥ 108 ॥

ఓ రామచంద్రా! అపుడు, వేగిరపాటుతో గూడిన మంత్రులు, రాజులు, సైనికులు, రాజసేవకులు, ఏనుఁగులు, గుఱ్ఱములు, రథములు, స్త్రీలు, పురుషులు, దాసజనులు, నగరనివాసులు మున్నగువారియొక్క సమూహములతోడను, తమతమ భయముచే నాయుధములను వహించియున్న జంతుసముదాయములతోడను, ఆ రాజగృహము, ప్రచండవాయువుచే వ్యాప్తమగు మహారణ్యమువలె భయంకరముగ నొప్పుచుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అవిద్యోపాఖ్యానాంతర్గత విపశ్చిదుపాఖ్యానే అవిద్యాక్షేపణే పార్థివ సంరంభ వర్ణనమను నూట యెనిమిదవ సర్గము ॥ 108 ॥

నవాధికశతతమః సర్గః

[ఇహ మన్త్రివచః శ్రుత్వా హుతదేహస్య పావకాత్
రాజ్ఞశ్చతుర్భిర్దేహైర్ద్రాక్సముత్థానముదీర్యతే.

మంత్రుల వచనములనువినినపిదప రాజు తనదేహమును అగ్నియందు హోమముచేయ, తిరిగి నాల్గుదేహములతో నందుండి యాతఁడు వెంటనేబయల్వెడలుట యిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

ఏతస్మిన్నన్తరే సర్వే మన్త్రిణో నృపమాయయుః
మునయో వాసవమివ దైత్యాక్రాన్తనభోభువమ్. 1

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఇంతలో ఆ రాజు చెంతకు మంత్రులందఱును, దైత్యులచే నాక్రమింపఁబడిన స్వర్గమందు ఇంద్రుని సమీపమునకు మునులేతెంచునట్లు, ఏతెంచిరి.

మన్త్రిణ ఊచుః:—

దేవ నిర్ణీతమస్మాభిర్యావన్న విషయోఽరయః
త్రయాణామప్యుపాయానాం దణ్డస్తేషు విధీయతామ్. 2
ప్రణయోఽనుప్రవేశో వా న కదాచన యః కృతః
అధునా తేషు తం దేవ కుర్యాత్తేషు కథైవ కా. 3
పాపామ్లేచ్ఛా ధనాఢ్యాశ్చ నానాదేశ్యాః సుసంహతాః
బహవో లబ్ధరన్ధ్రాశ్చ సామాదేర్నాస్పదం ద్విషః. 4

మంత్రులు :— దేవా! శత్రువులు సామదానభేదములను మూఁడుపాయములకును బాత్రులు కారనియు వారికి దండనమే విధింపవలయుననియు మేమందఱమును బాగుగ నిశ్చయించితిమి. ఏమనము దానమానాదులచే శత్రువులతోటి స్నేహముగాని ఎవనినైన శరణుబొందుట యను మిషచే నాతని వధించుటకై వారిపక్షమందుఁ బ్రవేశించుటగాని యెన్నఁడును గావింపక యున్నామో, అట్టి మన మిపుడేల వానిఁజేయవలెను ? కావున నిపుడాశత్రువులయెడల నట్టి యశో వినాశకరములగు యుపాయముల ప్రసంగమే మన కెద్ది? మనలోపముల నెఱిఁగినవారును, పాపులును, ధనాఢ్యులునైన మ్లేచ్ఛులగు శత్రువులనేకులు కలిసి యిట కేతెంచియున్నారు. అట్టి వారు సామదానాద్యుపాయములకుఁ దగరు.

తత్సాహసమేవేదం వర్జయిత్వా ప్రతిక్రియా
నాన్యాస్తి శీఘ్రమేవాతో రణోద్యోగో విధీయతామ్. 5
వీరాణాం దీయతామాజ్ఞా పూజ్యన్తామిష్టదేవతాః
ఆహూయన్తాం చ సామన్తా హన్యతాం రణదున్దుభిః. 6
సన్నహ్యన్తామశేషేణ నిర్గచ్ఛన్తు రణే భటాః
క్రియన్తాం కాలకమ్రాభ్రమేదురాశాజితా దిశః. 7
ఆస్ఫాల్యన్తాం ధనూంష్యుచ్చైః క్వణన్తు గుణపఙ్క్తయః
భవన్తు జలదశ్యామాః కకుభః ఖణ్డమణ్డలైః. 8

స్ఫురజ్జ్యావిద్యుతః శూరవారిదా ఘనగర్జితాః
నారాచధారా ముఞ్చన్తు కచత్కోదణ్డకుణ్డలాః. 9

కాఁబట్టి యుత్తమసాహసముతప్ప మఱియొక ప్రతిక్రియ యేదియునులేదు. అందుచే శీఘ్రముగ యుద్ధమునకై సన్నాహముచేయఁబడుగాక! వీరులకాజ్ఞ యివ్వఁబడుగాక! ఇష్టదేవతలు బూజింపఁబడుదురుగాక! సామంతులు బిలువఁబడుగాక! రణదుందుభులు మ్రోగింపఁబడుగాక! పూర్ణసన్నాహములతోఁగూడి వీరులందఱును యుద్ధమునకుఁ జనుగాక! ప్రళయకాల మేఘముల చేవలె దిక్కులన్నియు నేనుఁగులచేఁ గప్పివేయఁబడుగాక! గొప్పగొప్ప ధనుస్సులు గైకొనఁబడుగాక! వానియల్లె త్రాళ్లు తమ శబ్దములచే దిక్కులను బూర్ణమొనర్చుగాక! అర్ధమండలాకారములగు ధనుస్సులుమేఘములవలె దిక్కులను శ్యామవర్ణయుతములుగఁ జేయుగాక! ప్రకాశించు అల్లె త్రాళ్ళను మెఱపులతోఁగూడినవారును, సింహనాదమును గర్జించువారును, దేదీప్యమానములగుభుజకుండలములచే భూషితులునగు శూరులను మేఘములు బాణములను జలధారలను వర్షించుగాక!

రాజోవాచ:—

గమ్యతాం సఙ్గరాయాసు సంవిధానం విధీయతామ్
స్నాత్వాహం పూజయిత్వాగ్నిం నిర్గచ్ఛామి రణాజిరమ్. 10

రాజు :— మీరు వెళ్ళి శీఘ్రముగ యుద్ధముయొక్క విధానమును గావించుఁడు. స్నానముచేసి, అగ్నిదేవుని బూజించి నేనును రణరంగమున కేతెంచెదను.

ఇత్యుక్త్వా నృపతిః స్నాతో మహారమ్భోఽపి సత్క్షణాత్
ప్రావృషీవ నవోద్యానం గఙ్గాజలధరైర్ఘటైః. 11
అథ ప్రవిష్టోఽగ్నిగృహం పూజయిత్వా హుతాశనమ్
ఆదరేణ యథా శాస్త్రం చిన్తయామాస భూమిపః. 12

ఇట్లు వచించి యా రాజనేకములైన ముఖ్యకార్యములనుగూడఁ ద్యజించి, వర్షాకాలమున నూతనోద్యానమువలె, గంగాజలపరిపూర్ణములగు ఘటములచే శీఘ్రముగ స్నానమాచరించెను. పిమ్మట నాతఁడగ్నిగృహమునఁ బ్రవేశించి శాస్త్రోక్తవిధిప్రకార మాదరముతోడ నయ్యగ్నిదేవుని బూజించి యివ్విధముగ చింతనచేసెను.

భీతమాయు రనాయాస విలాసవిభవశ్రియా
ప్రజాభ్యో దత్తమభయమాసముద్రసముద్రితమ్. 13
ఆక్రాన్తవసుధా పీఠాః పాదపీఠే కృతా ద్విషః
లతాః ఫలభరేణేవ నమితాః కకుభో దశ. 14
ప్రజాచిత్తేన్దుబిమ్బేషు లిఖితం ధవలం యశః
భూమావారోపితా కీర్తిలతా త్రిపథగామినీ. 15
కోశవద్భరితా రత్నైః సుహృన్మిత్రార్యబన్ధవః
నిపీతోఽర్ణవతీరేషు నాపు కేళరసాసవః. 16

దేవా! ఇంతవఱకును అనేక విలాస వైభవములతోటి అనాయాసముగ నేను నా ఆయువును గడపివైచితిని. సముద్రపర్యంతముగల భూప్రదేశమున శాసన ముద్రాసహితముగ ప్రజల కభయమొసంగితిని. భూమండలమును జయించితిని. శత్రువులను పాదములక్రిందుగఁ జేసితిని. ఫలభారముచే లతలవలె దశదిక్కులను సత్ఫలముల భారముచే వినమ్రములుగ గావించితిని. ప్రజల చిత్తములను చంద్రబింబములందు నిర్మలకీర్తి నంకితమొనర్చితిని. భూమండలమున కీర్తిలతయను గంగానదిని స్థాపితముచేసితిని. సుహృదులను, మిత్రులును, పూజ్యులగు బ్రాహ్మణులను, బంధువులను ధనాగారమునువలె రత్నములచే నింపితిని. దిగ్విజయ యాత్రయందు సముద్రతీరములకడ నారికేళ మధ్యమును బానమొనర్చితిని.

ద్విషామాక మ్పితా భేకగలాఙ్గిత్వగివానవః
మద్భానవాఙ్కితా జాతా ద్వీపాన్తరకులాచలాః. 17
విహృతం సిద్ధసేనాసు దిగన్త నవభూమిషు
భూమ్యన్తభూభృతాం మూర్ధ్ని విశ్రాన్తం మేఘలీలయా. 18
ధియేవోచ్చైః పదే జ్ఞానపూర్ణయైకాన్తశీలయా
విలబ్ధాన్యవినష్టాని రాష్ట్రానిష్టార్థకారిణా. 19
రక్షాంస్యప్యవినీతాని బద్ధాని నిగడైర్ఘనైః
ధర్మార్థకామైరన్యోన్యం చయాపచయవర్జితైః. 20
అఖణ్డితైర్మయానీతం పీతాతియశసా వయః
ఇదానీం శష్పవిశ్రాన్తప్రాలేయభరభాసురమ్. 21
ఆగతం వార్ధకం సర్వభోగసంరమ్భయార్జనమ్

మాట్లాడునపుడు శత్రువుల ప్రాణములను కప్పమెడయొక్క చర్మమువలె, గంపించునట్లు చేసితిని. ద్వీపాంతములందలి కులపర్వతములనున్ను నాయొక్క శాసనముచే చిహ్నితములుగఁ గావించితిని. దిగంతములందుఁ బ్రసిద్ధములగు సువర్ణభూములందు సిద్ధసేనలందు విహరించితిని జ్ఞానపూర్ణమగుబుద్ధిచే సమాధిద్వారాయోగి బ్రహ్మపదమున విశ్రమించునట్లు, భూమియొక్క అంతమునగల లోకాలోకాది పర్వతముల శిఖరములపై మేఘములవలె విశ్రమించితిని ప్రజాహితకరుఁడనగు నేననేక సుసంపన్నములై వృద్ధియుక్తములైనట్టి రాష్ట్రములను బడసితిని. అవినయముతోఁగూడిన రాక్షసులనున్ను దృఢబంధనములచే బంధించితిని. ధర్మార్థకామములను పరస్పర బాధారహితముగను సమముగను సంపాదించుచు నా ఆయువును గడపితిని. ఇక నిపుఁడు, అధిక యశస్సుచే పీతవర్ణ సదృశముగ నున్నదియు, తృణాగ్రభాగములందు విశ్రమించు హిమబిందువులవలె, దెల్లనైనదియు, భోగములయొక్క సంభవములేనిదియు నగు వార్ధక్యమేతెంచినది.

రక్షోఽప్యర్యరయో రౌద్రా బలవన్తో రణైషిణః. 22
సంభూయ సర్వతః ప్రాప్తాః నందిగ్ధో వర్తతే జయః
తదిహైవానలాయాస్మై దేవాయ జయదాయినే. 23

పైగా నిట్టి వృద్ధ్యాప్యమందు, యుద్ధాభిలాషులును, బలవంతులును, భయంకరులునగు శత్రువులందఱును గలసివచ్చి యిట నలువైపుల వ్యాపించియున్నారు. అందుచేవిజయము నాకిపుడు

సందిగ్ధమైయున్నది. కావున, ఈ స్థానముననే విజయదాతయగు అగ్నిదేవున కీనాశిరంబు నాదరము తోటి ఆహుతి యొనర్తును!

మస్తకాహుతిమేవేమాం సముద్యమ్య దదామి వై

రాజోవాచ:—

కృశానో దేవ మూర్ధాయం తుభ్య మాహుతితాం గతః. 24
మయా పూర్వం పురోడాశ ఇవ దేవేశ దీయతే
యదితుష్టోఽసి భగవం స్తదనేన కృతేన మే. 25
చత్వారో భవతః కుణ్డాత్స్వదేహాః ప్రోద్భవన్తు మే
బలపన్తః శ్రియా దీప్తా నారాయణభుజా ఇవ. 26
త్వైచ్చతుర్దిక్కమేవారీన్వధ్యామహమవిఘ్నతః
త్వయా చ దర్శనం దేయం మహ్యం మతిమతే విభో. 27

రాజు:— ఓ యగ్నిదేవా! ఈ శిరస్సిపుడు నీకాహుతిగ నైనది. దేవేశా! పూర్వము యజ్ఞములందు పురోడాశము సర్పించినట్లు, ఇపుడీమస్తకమును నీకర్పించుచున్నాను. మహాత్మా! సంతుష్టుఁడవైనచో, ఈనాకర్మచే ఈ(అగ్ని)కుండమునుండి అతిబలవంతములును, శోభచేఁ బ్రదీప్తములును, నారాయణుని భుజములవంటివియునగు నాల్గుశరీరములు నాకుత్పన్నములగుఁగాక! అ నాల్గింటిచే నేను నలుదిక్కులందలి శత్రువులందఱిని నిర్విఘ్నముగ వధించివైతును. మఱియు, ప్రభూ! నిన్ను దర్శించి, గోర్కెచే సదా నిన్ను స్మరించుచునున్నట్టి యీనాకుఁ నీదర్శనమునుగూడ నిప్పింపఁగోరెదను.

శ్రీవసిష్ఠ ఉవాచ:—

ఇత్యుక్త్వా స మహీపాలః ఖడ్గమాదాయ చిచ్ఛిదే
శిరః కమలమాలోలం లీలయేవాశు బాలకః. 28

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఇట్లు పలికి యారాజంత తనఖడ్గమును గైకొని, చంచలకమలమును బాలుఁడు త్రుంచివేయునట్లు, తన శిరస్సును శీఘ్రముగ భేదించివైచెను.

ఛిన్నమేష శిరో యావజ్జుహోత్యసితవర్త్మనే
తావచ్ఛరీరేణ సహ పపాతాగ్నౌ స పార్థివః. 29

అట్లు భేదింపఁబడిన శిరస్సును అగ్నియందాతఁడు హోమము చేయునంతలో, ఆశిరస్సుతోఁగూడ నాతఁడున్ను నయ్యగ్నియందుఁబడెను.

భుక్త్వాథ వహ్నిస్తం దేహం దదావస్మై చతుర్గుణమ్
మహతాముపయుక్తం హి సద్య విపాభివర్ధతే. 30

అపుడగ్నిదేవుఁ డాశరీరమును హవిస్సువలె భుజించి తిరిగి నాలుగంతలుగ దానినాతని కొసంగెను. మహాత్ములచే స్వీకరింపఁబడినది వెంటనే వృద్ధినొందునుగదా!

చతుర్మూర్తిరథోత్తస్థౌ పావకాద్వసుధాధిపః
ప్రజ్వలంస్తేజసాం పుంజై ర్నారాయణ ఇవార్ణవాత్. 31

అత్తఱి తేజఃపుంజములచేఁ బ్రజ్వరిలుచు ఆరాజు, సముద్రమునుండి నారాయణుని వలె ఆ యగ్నికుండమునుండి నాల్గుశరీరములతోటి బయల్వెడలెను.

తే దేహా స్తస్య చత్వారో విరేజుర్భాస్వరత్విషః
సహజాతోత్తమోత్తం సభూషణాయుధవాససః. 32

సకంకటశిరస్త్రాణాః సమౌలికటకాఙ్గదాః
సహారకుణ్డలాభోగాః సర్వాః సర్వే మహాశయాః. 33

సర్వ ఏవ సమాకారాః సదృశావయవాన్వితాః
చఞ్చలోచ్చైఃశ్రవః ప్రఖ్యం హయరత్న మవస్థితాః. 34

ససువర్ణశరాపూర్ణతూణీరాః సుమహాశయాః
సమానగుణకోదణ్డాః సమానవపుషః శుభాః. 35

తోడనే యుత్పన్నములైన యుత్తమ కిరీటాద్యాభరణములతోను, ఆయుధ వస్త్రాదులతోను, గూడినదై, అతిప్రదీప్తమగు కాంతిగలవై, యా రాజుయొక్క నాల్గు దేహములును విరాజిల్లుచుండెను, మఱియు, ఆ దేహములు కవచ, శిరస్త్రాణయుక్తములును, ముకుట, కటక అంగదాద్యాభరణములచే శోభితములును, హార, కుండలాద్యనేక ఆభూషణములచే నలంకృతములును, ఆశ్రితులందఱిని రక్షించునవియు, గొప్ప యాశయములతోఁ గూడినవియు, సమానాకారము గలవియు, సమములైన అవయవములతోటి యొప్పునవియు, ఉచ్చైఃశ్రవస్సు (ఇంద్రుని గుఱ్ఱము, వలె చంచలములై, అత్యుత్తమములైనట్టి అశ్వములపై నారూఢములైయున్నవియు, సువర్ణమయములగు బాణములచేఁ బూర్ణములైన అమ్ములపొదులు గల్గియున్నవియు, మహాబుద్ధియుక్తములును, సమాన గుణసహితములును, ధనుస్సులను ధరించియున్నవియు, మహా శోభాసంపన్నములై వెలయుచుండెను.

సమారోహన్తి తే యస్మిన్స్వంసి నాగే రథే హయే
సర్వేషామరిదోషాణాం నైవగమ్యో భవత్యసౌ. 36

మఱియు, ఆ రాజుయొక్క దేహములు ఏ మనుజ, గజ, అశ్వ, రథాది వాహనములపై నారోహించునో, ఆ వాహనములు శత్రువుల మంత్ర, యంత్ర, శస్త్రాస్త్రాదులకు వశములు కానేరవు.

పీత్వా ధృత్వా చిరం కాలం గర్భే పురుషతాపితాః
వేద్యామివ హితాస్తత్ర సాగరా బడవార్చిషా. 37

ఇంకను ఆ దేహములు:— బడబాగ్ని నాల్గుసముద్రములను మొమ్మొదటఁద్రావి, చిరకాలము వానిని దన గర్భమందు ధరించి, పిమ్మట పురుషాకారమును వానికిఁ బొందింపఁ జేసి, ఆ పిదప ఆ యగ్నికుండ వేదికయందు వానినిఁ బ్రసవించెనా యనునట్లు భాసించుచుండెను.

రత్నాశ్వదేహకుసుమోత్కర పూర్ణదేహా
శ్చత్వార ఇన్దుహసితై రవ భాసయన్తః
సమ్మూర్తయో హరయ ఏవ యథాబ్ధయో వా
వేదా ఇహాహుతిహుతాదనలాత్ప్రసస్రుః. 38

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గతవిపశ్చిదుపాఖ్యానే అగ్నిప్రవేశాద్దేహలాభోనామ నవాధికశతతమః సర్గః ॥ 109 ॥

ఓ రామచంద్రా! మఱియు, ఆ దేహములు రత్నములచే భూషితములై, రత్నపూర్ణములగు అశ్వములపై నారోహించియున్నవై, పుష్పసమూహములచేఁ బరిపూర్ణములై, చంద్రబింబమువంటి హాస్యముచే దిక్కులను ప్రకాశితమొనర్చుచు, విపశ్చిద్రాజుయొక్క యాహుతులచే హోమము గావింపఁబడిన యా యగ్నినుండి, నలుగురు విష్ణువులవలెను లేక ఆకృతి ధరించిన చతుస్సముద్రములవలెను, లేక నాల్గు వేదములవలెను బయల్వెడలెను.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అవి ॥వి॥ 'అగ్నిప్రవేశాద్దేహలాభ'మను నూట తొమ్మిదవ సర్గము ॥ 109 ॥

~~~~~~~~~

దశాధికశతతమః సర్గః

[పురోపకణ్ఠం సంప్రాప్తైశ్చతుర్దిక్షు సహారిభిః
బ్రహ్మవృత్తం దారుణం యుద్ధం విస్తరేణాత్ర వర్ణ్యతే.

నలువైపులనుండి నగరసమీపమున కేతెంచిన శత్రువులతోటి ఘోర యుద్ధ మారంభమాయెనను విషయ మిచట విస్తారముగ వర్ణింపఁబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచః—

పురోపకణ్ఠసంప్రాప్తైశ్చతుర్దిక్కం సహారిభిః
వీతస్మిన్నన్తరే తత్ర ప్రవృత్తం దారుణం రణమ్. 1

శ్రీ వసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఇంతలో నలువైపులనుండి శత్రువులు నగరసమీపమునకు విచ్చేసిరి. అపుడు వారితోటి భయంకరమైన యుద్ధ మారంభమయ్యెను.

లుణ్ఠితగ్రామనగరం ప్రజాకుల మహాకులమ్
అగ్నిదాహజ్వలద్దేహం ధూమాభ్రపటలావృతమ్. 2

శరజాలమహాదూమచ్ఛన్నార్కవిలసత్తమః
క్షిప్రదృష్టరవిక్షిప్రమదృష్టరవిమణ్డలమ్. 3

అగ్నిదాహ మహాతాపప్రతపత్పర్ణకాననమ్
లోలాలాతలతాశూలముసలోపలపూర్ణఖమ్. 4

అనలప్రతిబిమ్బౌఘైర్ద్విగుణజ్వలనాయుధమ్
రణభగ్నమహాశూర ప్రాప్తేన్ద్రవనితాసుధమ్. 5

ఉద్దామవారణారావై రణలమ్పటహర్షదమ్
~~~~~~~~~

భుశుణ్డీమణ్డలప్రాసశూలతోమరవర్షదమ్. 6
భటకోలాహలోల్లాసహృద్భఙ్గమృతపామరమ్
రజఃపటలశుభ్రాభ్రకృతద్యుపథవారణమ్. 7
మరణవ్యగ్రసామన్తముక్తనాదప్రవజ్రద్వజమ్
ఇతశ్చేతశ్చ నిపతద్వైద్యుతోపహతప్రజమ్. 8

ఆ యుద్ధము కొల్లగొట్టఁబడిన గ్రామ, నగరములు గలదియు, ప్రజా సమూహమునకు గొప్ప వ్యాకులత్వమును గలుగఁజేయునదియు, అగ్నిజ్వాలలచే దహింపఁబడుచున్న దేహములు గలదియు, ధూమమను మేఘసమూహముచేఁ గప్పఁబడినదియు, బాణములచేతను, పొగచేతను సూర్యుఁడు కప్పఁబడుటచే గాఢాంధకారమయమై వర్తించుచున్నదియు, సూర్యుని క్షణకాలము కనుపించువానినిగను, క్షణకాలము కనుపించనివానినిగను జేయునదియు, అగ్ని దాహజనితమగు మహోత్పాతముచే పత్ర వనాదులను దగ్ధమొనర్చునదియు, చంచలములైన కొఱవులను బతలచేతను హల, ముసల (ఆయుధ విశేషము) శిలాదులచేతను, ఆకసమును చూర్ణము గావించునదియు, అగ్నియొక్క ప్రతిబింబ సమూహములచే రెండింతలుగా ప్రజ్వలితములైన యాయుధములు గలదియు, సంగ్రామమున హతులైన మహాశూరులకు అప్సరసలను, అమృతమును బొందింపఁజేయునదియు, నిరంకుశములైన యేనుఁగులయొక్క శబ్దములచే రణోత్సాహులకు హర్ష మొసఁగునదియు, భుశుండి, ప్రాసము (ఈటె) శూలము, తోమరము మున్నగు ఆయుధములను వర్షించుచున్న వీరుల కోలాహల, అట్టహాసములను వినినంతమాత్రముచే గుండె పగిలి చచ్చుచున్నట్టి పిరికివారు గలదియు, ధూళిసమూహమను తెల్లని మేఘములచే నాకాశమార్గమును నిరోధించునదియు, మరణమున వ్యగ్రులగు సామంతులచేఁ గావింపఁబడిన నాదముచే నేతెంచిన ఘనస్తోమము గలదియు, ఇటునటుఁ బడుచున్నట్టి మెఱపువంటి యగ్నిచే హతులైన ప్రజలు గలిగి యున్నదియునై యొప్పుచుండెను.

అగ్నిదిగ్ధపతద్గేహప్రోజ్ఝితాగ్నిమయామ్బుదమ్
మరణాహ్లాదనాసంఖ్యశరధారామయామ్బుదమ్. 9
జితాసాగరకల్లోలం తురఙ్గమతరఙ్గకైః
దన్తిదన్తవినిష్పేషతారక్రేంకారకర్కశమ్. 10
కోటకోటికుటీకుడ్యకణ్టకోద్భటసద్భటమ్
చటత్కృత్యోత్కటకోటాట్టకూటాటనపటచ్ఛటమ్. 11
లుఠత్పటనకుట్టాకసాటోపస్ఫుటపట్టిశమ్
ఖే వటత్కేతుపట్టాట్టపటత్పటపటారవమ్. 12
దన్తిదన్తగుణోద్గీర్ణైర్హేతిపాషాణఘర్షణైః
తారక్రేంకారహుంకారైరాహూతసురవారణమ్. 13
వహచ్ఛరనదీనీపూరపూర్ణామ్బరమహార్ణవమ్
విచలచ్చక్రకున్తాసిధారామకరకర్కశమ్. 14

ఉన్మాదయోధసంఘట్టకంకటోత్కటటాంకృతైః
లసఙ్ఝణఝణారావైర్ఘటితద్వీపమణ్డలమ్. 15
పాదపాతపరాపిష్టశరసంజాతకర్దమమ్
వహద్రక్తనదీరంహఃప్రోహ్యమాణరథద్విపమ్. 16

మఱియు, ఆ యుద్ధము, అగ్నిచే దహింపఁబడిన గృహములనుండి బయల్వెడలిన అగ్నిచేఁ బరిపూర్ణములగు ధూమములను మేఘములు గలదియు, మరణముచే ఆనందము గొల్పునట్టి అసంఖ్యాతములగు బాణముల వర్షించునట్టి మేఘములు గల్గియున్నదియు, అశ్వముల గతిరూపములగు తరంగములచే సముద్రతరంగములను జయించునదియు, ఏనుఁగుల దంతములయొక్క సంఘర్షణముచే జనించిన గొప్పనాదముచే కర్కశమైనదియు, కోటలయొక్క పైభాగమందలి కుటీరములయొక్క గోడలందు కంటకములవలె బాణముల వెదచల్లుటయందు సమర్థులైన యుత్తమవీరులు గలదియు, చటచటాశబ్దముతోఁ గూడిన అగ్నిచేఁ బరివేష్టితములైన కోటలయందలి మేడలపై నాట్యమాడుచున్న అగ్నికాంతి గలిగియున్నదియు, గమనమును నిరోధించుచున్నట్టి ప్రకాశవంతములైన పొరలుచున్న ఖడ్గాద్యాయుధములచే భయంకరమైనదియు, ఆకాశమునఁ బరివేష్టించుచున్నట్టి పతాకవస్త్రములు గల మేడలపై పటపటాశబ్దములతోఁ గూడియున్నదియు, ఏనుఁగుల దంతములయొక్క తెలుపుదనము మున్నగు గుణములను వెళ్ళగ్రక్కుచున్నట్టి ఆయుధములయొక్క శిలలపైని సంఘర్షణములచే జనించిన క్రేంకారహుంకారశబ్దములచే దిగ్గజముల నాహ్వానించుచున్నట్లున్నదియు, ప్రవహించు బాణ నదీప్రవాహములచేఁ బూర్ణమైనట్టి యాకాశమను సముద్రముగలదియు, అందు చలించుచున్న చక్ర, కుంత, ఖడ్గములయొక్క అంచులను మొసళ్ళచే భయంకరమైనదియు, మహానాదమొనర్చుచున్న యోధుల సంఘర్షణములచే జనించిన కవచములయొక్క గొప్పటంకారశబ్దములచే శోభించు ఝణఝణారావములచే వ్యాపింపఁబడిన ద్వీప, మండలములు గలదియు, పాదముల మర్దనములచే చూర్ణములైనట్టి బాణములయొక్క పంకము (బురద)తోఁగూడియున్నదియు, ప్రవహించుచున్న రక్తనదీప్రవాహమునఁ గొట్టుకొని పోఁబడుచున్నట్టి రథ, గజాదులు గలదియునై వర్తించుచుండెను.

సుపర్ణహేలానిపతత్రోత్పతత్పట్టపట్టిశమ్
శరవారితరఙ్గార్తభగ్నాయుధజలేచరమ్. 17
హేతిసంఘట్టనిష్క్రాన్తజ్వాలాప్రజ్వలితామ్బరమ్
వలీపలితనిర్ముక్తశూరాక్రాన్తత్రివిష్టపమ్. 18
పాణ్డుపాంసుపయోవాహకచచ్చక్రాచిరద్యుతి
హేతినిర్వ్యపరాకాశాయుధానాధారభూతలమ్. 19
కటదస్ఫుటభటాటోపరటత్త్రుటితభటోత్కటమ్
చటచ్ఛకట సంఘట్టపిష్టకాష్ఠలుఠద్రథమ్. 20
కబన్ధభటవేతాలమిశ్రకణ్టకసంకటమ్
వేతాలభుజ్యమానాగ్ర్యశవమాంసహృదమ్బుజమ్. 21

శూరశాతితశీరార్ధశిరఃకరఖురోరుకమ్
కబన్ధదోర్ద్రుమస్పన్దవనీకృతనభస్తలమ్. 22
తరల్లోలాస్యవేతాలహాసఘట్టితపేటకమ్
కంకటోత్కటసాటోపభటభ్రుకుటిభీషణమ్. 23
ఏకాన్తమారణైకాన్తమరణైకాన్తభూషణమ్
ప్రహారదానగ్రహణకార్పణ్యాపారదూషణమ్. 24

ఇంకను ఆయుద్ధము, గరుత్మంతునివలె బాణములు పైనఁబడుటచే నెగురగొట్టఁబడిన వీరుల యాయుధములు గలదియు, బాణములను జలముయొక్క తరంగములచేఁ బీడితులగు యోధులయొక్క భగ్నములైన యాయుధములను జలచరములు గల్గియున్నదియు, శస్త్రముల పరస్పర సంఘట్టనములచే వెలువడిన యగ్నిజ్వాలచే నాకాశమును బ్రదీప్తమొనర్చునదియు, దేవభావమును బొందుటచే వార్ధక్య చిహ్నములు లేనట్టి శూరులచే స్వర్గమునున్ను నాక్రమించుచున్నదియు, పాండురవర్ణముగల ధూళియను మేఘములందు చక్రాయుధరూపమగు మెఱపుయొక్క క్షణిక ప్రకాశముతోఁగూడినదియు, శస్త్రాస్త్రములచే అవకాశరహితమై యుండుటచే యోధుల ప్రహారముల కాధారముగాక యున్నట్టి భూతలము గలదియు, బాణములను వర్షించుచున్న మహాయోధులయొక్క ఆటోపములచే నఱచుచున్నట్టి ప్రతిపక్షసైనికులచే భయంకరమైనదియు, భూమిని గప్పుచున్నట్టి శకటములయొక్క సంఘట్టనములచే చూర్ణములైన తదితరశకటములయొక్క కాష్ఠములపై దొరలుచున్న రథములు గల్గియున్నదియు, వీరుల మొండెములతోను, బేతాళములతోను గలిసినట్టి శత్రువులచే అతిదుర్గమమైనదియు, శవముల హృదయకమలములందలి మాంసమును భుజించుచున్న భేతాళములచే అతిభయంకరమైనదియు, భుజములతోఁగూడిన మొండెములను వృక్షములయొక్క చలనముచే నాకాశమును వనముపగిది గావించుచున్నదియు ఎగురుచున్నట్టి చంచలముఖములు గలవారును, ప్రసన్నులునగు బేతాళములయొక్క పాత్రలను శవములచేఁ బూరించునదియు, కవచములుగలవారై విజృంభించునట్టి ప్రచండసైనికుల క్రోధదృష్టులచే భీకరమైనదియు, సర్వథా వధించుటఁమరణించుటయను నీరెండే మహా భూషణములుగాఁగలదియు, ప్రహారముల యొక్క దాన, గ్రహణములందలి అసామర్థ్యమే మహా దూషణముగాఁగలదియు, నైయుండెను.

శూరవారణసామన్తమదవారివిశోషణమ్
మారణైకాన్తరసికకృతాన్తానన్దపోషణమ్. 25
అవికత్థనగుప్తానాం శూరాణాం జయఘోషణమ్
అశూరాణాం చ గుప్తానాం ప్రఖావుద్ఘోషణం పరమ్. 26
శౌర్యాదీనాం ప్రసుప్తానాం స్వగుణానాం ప్రబోధనమ్
ధనమాధారభూతానాం రాష్ట్రేషు భుజశాలినామ్. 27
దన్త్యారూఢరథాస్ఫోటప్రభగ్నకటవారణమ్
సమస్తమత్తగన్ధేభదానవారినివారణమ్. 28
సారసారవసామన్తముక్తమత్తమతఙ్గజమ్
జరజ్జితకరానీకకల్పితాసికవేదనమ్. 29

దినం దినకరస్యేవ నృపస్య శరణం గతమ్
అనాగతభటవ్రాతపిష్టార్ధమృతమానవమ్. 30

మఱియు, సామంతులయొక్క మదమను జలమును బోషించునదియు, వధించుట యందు మహాప్రీతి గలదగుటచే యముని ఆనందమును బోషించునదియు, తమ శౌర్యమును గూర్చి ప్రశంసించుకొననట్టి గుప్తులగు శూరులయొక్క యుద్ధక్రియను ప్రత్యక్షముగఁ జూచు జనులచేఁ గావింపఁబడు జయఘోషణ గలదియు, శౌర్యరహితులగూర్చిన నిందాఘోషణయు గల్గియున్నదియు, బాహుబలముచే శోభితులును, కావుననే రాజ్యములందు దుర్బలుర కాధారభూతులుననగు వీరులయొక్క శౌర్యాది గుణముల కీర్తనము ధనమువలెఁ బ్రియముగాఁగలదియు, గజములయొక్కయు, రథారూఢులయొక్కయు పరస్పర సంఘర్షణముచే ఛిన్నలైన చెక్కిళ్లు గలిగిన యేనుఁగులతో గూడియున్నదియు, సుగంధమదజలయుక్తములగు మదపుటేనుఁగు లన్నింటియొక్క మదజలమును శోషింపఁజేయునదియు, సరస్సునందు మదపుటేనుఁగులు ప్రవేశింప అఱచునట్టి సారసపక్షులవలె నఱచుచున్న సామంతులచేఁ ద్యజింపఁబడిన మదగజములు గలదియు, ఖడ్గవిద్య యందు అర్ధశిక్షితులగు సైనికులయొక్క ఖడ్గప్రహారములచేఁ బ్రకటితమైనట్టి వారి విద్యాకౌశలము కలిగియున్నదియు, వీరులు రాకయున్నను వచ్చిరను భ్రాంతిచేఁ బరుగిడుచుఁ బరస్పరము పాదతలములచేఁ ద్రొక్కఁబడి అర్ధమృతులైనట్టి జనులు గలదియు, కావుననే పగలు సూర్యుని శరణుబొందినట్లు రాజును శరణుబొందినయట్టి మనుజులతోఁ గూడియున్నదియునై యొప్పుచుండెను.

మానవాయుబలోన్మత్తనతప్రారబ్ధకుట్టనమ్
ధనానాం ప్రాణపణ్యానాం నవమాపటపత్తనమ్. 31
పటనద్ధపతాకౌఘజాతసంచారిదోర్ద్రుమమ్
రక్తోజ్జ్వలత్వాత్త్రైలోక్యలక్ష్మ్యా భూషణవిద్రుమమ్. 32
మన్దరాహననోద్భూతక్షీరోదజలసున్దరైః
ఛత్త్రైశ్ఛాదితహేత్యోఘపుష్పాఢ్యగగనాఙ్గనమ్. 33
గణగీర్వాణగన్ధర్వగీతశూరాశయం కృతమ్
తద్ధ్వాతరలతాలాగ్రహేతిహాలాహలాయుధమ్. 34

ఇంకను ఆ యుద్ధము, అభిమానమను (ఉన్మాద) వాయుబలముచే ఉన్మత్తులైనట్టి వీరులచేఁ గావింపఁబడిన నమ్రజనులయొక్కయు మర్దనము గలదియు, ప్రాణము లను ధనములచేఁ గొనఁదగిన పదార్థములయొక్క కొత్త బాజారువలెఁ దోచుచున్నదియు, వస్త్రములచే బంధింపఁబడిన పతాక సమూహములచే జనించిన సంచరించు భుజరూప వృక్షములు గల్గియున్నదియు, రక్త శ్వేతవర్ణములు గల్గియుండుటచే త్రైలోక్యమను లక్ష్మియొక్క భూషణ భూతమగు పగడమువలె నొప్పుచున్నదియు, మందర పర్వతముయొక్క అఘాతముచే నుద్భవించిన క్షీర సముద్ర జలమువలె సుందరములైనట్టి తెల్లని గొడుగులచే గప్పఁబడిన ఆయుధసమూహమను బుష్పములచే నాకాశమను ముంగిటిభాగమును వ్యాప్తమొనర్చునదియు, ప్రమథ, గంధర్వాదులయొక్క కాంతులతోఁగూడిన చంచల ధ్వజాగ్రములచేతను, ఆయుధములచేతను అనేక బలరాములవలెఁ దోచుచున్న వీరులు గల్గియున్నదియునై వెలయుచుండెను.

సంఘప్రహరణాసంఖ్యయాతుధానారుణక్షణమ్
భుక్త్వా చాద్రిగుహా గేహపూరితాపూర్వదుర్ద్రుమమ్. 35

కచత్కున్తవనవ్యస్తశిరఃకరవృతామ్బరమ్
క్షేపణోన్ముక్తపాషాణపూరప్లుతకకుబ్లతమ్. 36

మహాచటచటాశబ్దస్ఫుటద్రవబృహద్ద్రుమమ్
నారీహలహలారావరణన్నగరమన్దిరమ్. 37

మన్దరాదానలాకారనభోభాతాయుధవ్రజమ్
పరిత్యజ్య ధనం గేహం దురోర్వీవిద్రుతవ్రజమ్. 38

సర్వతోహేతివహనాత్సమక్షప్రేక్షకోజ్ఝితమ్
వర్జితం భీరుభిః పక్షిరాజవృన్దమివాహిభిః. 39

దన్తిదన్తవినిష్పిష్టశిష్టసద్భటసంకటమ్
కటే మృత్యోరివ నరద్రాక్షాపీడనయన్త్రకే. 40

యన్త్రపాషాణసంఘట్టపిష్టామ్బరగతాయుధమ్
యోధనాదనదద్దన్తివృన్దబన్ధురకన్దరమ్ 41

ధరాధరదరీరన్ధ్రప్రతిశ్రుత్ప్రోతగర్జితమ్

మఱియు ఆ యుద్ధమున కలిసి వినోదముగ ప్రహారమొనర్చునట్టి యనేక రాక్షసులు నిశ్శబ్దముగ నేతెంచి శవముల భుజించి, పర్వతగుహలను నిజ గృహములను వానిచే బూరించి, విషవృక్ష సదృశులగు ఇతర రాక్షసులచేఁగూడ భుజింపించిరి. ప్రకాశించు కుంతము (ఈఁటె)లతోఁ గూడినదై, కుంతనమువలెఁ దోచునట్టి సైన్యసమూహము ఛేదించిన శిరస్సులచేతను, హస్తముల చేతను నాకసమును బూర్ణమొనర్చెను. విసరఁబడిన శిలలయొక్క ప్రవాహములచే దిక్కులను లత బాగుగఁ దడిసినదాయెను. యోధులయొక్క భుజముల ఆస్ఫోటనములచే జనించిన గొప్ప చటచటా శబ్దములచే మహావృక్షములు విరుగుచున్నవా యనునట్లు ధ్వనియుక్తములైయుండెను. స్త్రీల కోలాహలముచే నగర, మందిరములు శబ్దించుచున్నవివలె నుండెను. మందరపర్వతముపైని దావాగ్నివలె ఆకాశమున ఆయుధసమూహము దీపిల్లుచుండెను. ప్రజలు తమ గృహ, ధనాదులఁ ద్యజించి దూరదేశములకుఁ బారిపోవుచుండిరి. అంతటను గావింపఁబడుచున్న శస్త్రాస్త్రముల యొక్క ప్రహారములచే ప్రేక్షకులు దూరముననుండియే వెడలిపోవుచుండిరి. గరుడ సమూహమును సర్పము వీడునట్లు; భీరువు లాప్రదేశమును త్యజించి పోవుచుండిరి. మనుజులను ద్రాక్షఫలములను పిండునట్టి మృత్యువను యంత్రమును బోలియున్న యేనుఁగులయొక్క గండస్థలమందలి దంతములచే బీడింపఁబడుచు శేషించిన ఉత్తమవీరులు సంకటయుక్తులై యుండిరి. మఱియు, యంత్ర శిలాదుల సంఘట్టనముచే నాయుధములు చూర్ణములై యాకాశమును బొందింపఁబడుచుండెను. యోధుల నాదముచేతను, ఏనుఁగుల ఘీంకార శబ్దములచేతను, బర్వత గుహలు పూర్ణములైయుండెను. అట్టి గర్జనలచే ఆ గుహలు బాగుగఁ బ్రతిధ్వనించుచుండెను.

అర్జితం ప్రాణసర్వస్వమర్జయద్భిరుపార్జితమ్. 42

భర్జితం హేతిగహనైరగ్నిదాహైశ్చ సంతతైః
తైరేవాన్యైరథాన్యైశ్చ ద్వన్ద్వయుద్ధైరనిష్ఠితమ్. 43

వేష్టితం మృతశిష్టైశ్చ సారైః సుభటపేటకైః
కైలాసైరివ సంశుద్ధైరీశ్వరాధారతాం గతైః. 44

గొప్పప్రయత్నముచే జన్మమొదలుకొని ఆర్జింపఁబడిన బలసర్వస్వమును ప్రకటించునట్టి శూరులచే ఆ యుద్ధము సముపార్జింపఁబడినదిగ నుండెను. మఱియు, ఆ యుద్ధము నిరంతర మగ్నిదాహములచేతను, ఆయుధముల దహనములచేతను దగ్ధమై యెప్పుచు, పైనఁ దెల్పినవారును, అన్యులునగు వీరుల యొక్క ద్వంద్వయుద్ధములతోఁగూడి సమాప్తినొందకయేయుండెను. సంశుద్ధులగు ఈశ్వరారాధకులచే కైలాసము పరివేష్టింపఁబడియుండునట్లు, చావగా మిగిలినవారును, స్వామిభక్తులునునగు ఉత్తమ వీరులచే ఆయుద్ధము పరివేష్టింపఁబడియుండెను.

తైరుదారైః సమాక్రాన్తం యే మృత్యోరపి మృత్యవః
మరణం జీవితం యేషాం జీవితం మరణం రణే. 45

మఱియు నచట నెవరికి యుద్ధమున మరణించుట జీవితమువలెఁ బ్రియమైనదో, యుద్ధమునుండి పారిపోయి జీవించుట మరణమువలె అప్రియమైనదో, ఎవరు మృత్యువునకును మృత్యువులో, అట్టి పునరాగమనరహితులైన పరమపదమును బొందిన యుదారచరితులగు శూరులచే త్రైలోక్యమును జయింపఁబడినదాయెను.

రణే నభసి నిర్లూనవరవారణవారిజే
సారసాః సరసీవాత్ర రేజురత్యుద్భటా భటాః. 46

ఆ యుద్ధమను నాకాశమున శ్రేష్ఠములగు యేనుఁగులు (లేక, కవచములు) ఛిన్నభిన్నములు కాఁగా, ప్రచండవీరులట సరస్సునందు సారసపక్షులవలె శోభించుచుండిరి.

యన్త్రాశ్మక్షేపణానాం ప్రసరణసరితా ఘూత్కృతైః పూత్కృతైర్ద్రాక్
కాన్తానాం వ్యోమ్ని మూర్ధ్నాం శరసలిలముచాం సైనికానాం చ నాదైః
టాంకారైరాయుధానాం నభసి విసరతామశ్వచక్రైభశబ్దై
రాసీన్నిః సంధిబన్ధోపల జఠరజడం జీర్ణకర్ణం గతం తత్. 47

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే సంగ్రామవర్ణనం నామ దశాధికశతతమః సర్గః ॥ 110 ॥

ఓ రామచంద్రా! యంత్రములనుండి విసరివేయఁబడిన శిలలయొక్క ప్రవాహ రూపములగు నదులయొక్క శబ్దములచేతను, అప్పుడే ఛిన్నములై యాకాశమున నెగురుచున్నట్టి మస్తకములయొక్క పూత్కారశబ్దములచేతను. బాణములను జలమును వర్షించునట్టి యోధుల నాదముల

చేతను, ఆకాశమునఁ బ్రసరింపఁబడిన ఆయుధములయొక్క టాంకారశబ్దములచేతను, అశ్వ, గజ, చక్రములయొక్క మహాశబ్దములచేతను వ్యాపింపఁబడినదై ఆయుద్ధము కర్ణములను బధిరములుగా నొనర్చుచు సంధిరహితమగు శిలామధ్యభాగమువలె వానిని జడములుగాఁ జేసివైచెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అవి ॥విప॥ సంగ్రామవర్ణనమను నూటపదియవ సర్గము ॥ 110 ॥

~~~~~~~~~~~~~

ఏకాదశాధికశతతమః సర్గః

[స్వసైన్యే హీయమానేఽత్ర నిర్గతేన మహీభృతా
వాయవ్యాస్త్రైశ్చతుర్దిక్షు వర్ణ్యతే ద్విషతాం క్షయః.

తన సైన్యము క్షీణింప రాజుబయలుదేఱి వాయవ్యాస్త్రములచే నలువైపుల శత్రువులను క్షయింపఁజేయుట యిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఇతి కల్పాన్తసదృశే యత్తే సమరసంభ్రమే
పతన్తీషూత్పతన్తీషు సేనాసు సమరేఽజిరే. 1
తూర్యభేరీమహాశఙ్ఖఖడ్గేషు ఖే నదత్సు చ
ధనుర్ధ్వనిషు వీరాణాం తారక్రేంకారకారిషు. 2
అన్యోన్యకఠినాస్ఫోటవికటే భటపేటకే
కవత్కటకటాటోపే కటుకుట్టితకఙ్కటే. 3
కించిత్ప్రభజ్యమానాసు విశత్కశ్మాసు సంగరే
విపశ్చిత్పక్షసేనాసు లూయమానలతాస్వివ. 4
ఉదభూత్పూరయన్నాశా నృపనిర్యాణదున్దుభిః
చతుర్ధాశనిసంపూర్ణకల్పాభ్రరవమాంసలః. 5

శ్రీవసిష్ఠుఁడు :— ఓ రామచంద్రా! ఇవ్విధమునఁ బ్రళయమువంటి మహాయుద్ధసంభ్రమము ప్రవృత్తముకాఁగా, ఆయుద్ధమను ముంగిటియందుఁ గొన్ని సేనలోఁడుచు, కొన్ని జయించుచునుండ, తూర్య, భేరీ, మహాశంఖముల ప్రతిధ్వనులతోఁగూడ నాకసమున ఖడ్గములు శబ్దమొనర్చుచుండ, వీరుల హుంకారశబ్దముతోఁబాటు ధనుస్సుల టంకారనాదము వెలువడుచుండ, పరస్పర కఠోర సంఘట్టనములచే భయంకర వీరసమూహముయొక్క కవచముల కటకటాశబ్దములతోటి విఱుగుచుండ, విపశ్చిన్మహారాజుయొక్క సైన్యమొకింత మర్దితమై, ప్రవేశించుచున్న మూర్ఛగలదై, ఛేదింపఁబడిన లతవలె క్షీణించుచుండ నత్తఱి దిక్కులన్నింటిని తన శబ్దముచే బూరించుచు, వజ్ర(పిడుగు) శబ్దమునకు నాల్దింతలధికముగ ధ్వనించుచు, పూర్ణకల్పాంత మేఘనాదమువలె గంభీరమైనట్టి ధ్వనిగలదై, రాజుయొక్క రాకనుగూర్చిన దుందుభులు మ్రోగెను.

స్ఫుటతాం కులశైలానాం తుల్యకాలమివోత్కటః
స్ఫుటచ్చటచటాస్ఫోటైర్జడతాఖిలదిక్తటః. 6

ఆ దుందుభినాదము ఏకకాలమునఁ బగిలిన సప్తకుల పర్వతములయొక్క శబ్దమువలె నతి గంభీరమై, విస్పష్టములగు చటపటాశబ్దములచే దిక్కులన్నింటిని జడములుగాఁ జేసివైచెను.

లోకపాలైరివాకారైర్నారాయణభుజైరివ
స చతుర్భిశ్చతుర్దిక్కం నిర్జగామ మహీపతిః. 7

అపుడింద్రాదిలోకపాలురవలెను, ఆకారమును ధరించిన నారాయణుని చతుర్భుజములవలెను నున్నట్టి తన నాల్గు దేహములతో ఆ రాజు నాల్గు దిక్కులకుఁ జనెను.

చతురఙ్గేణ మహతా సైన్యేన పరివారితః
అట్టాలవలయాత్కృత్వా నిర్గత్య నగరాద్బహిః. 8
దదర్శాత్మబలం రిక్తం బలవద్రిపుమణ్డలమ్

గొప్ప చతురంగ సేనతోఁ గూడినవాఁడై యా రాజు ఎత్తైన మేడలయొక్క వరుసలు గలదియు, యుద్ధముచే సంకటయుక్తమైయున్నదియు నగు తన నగరముయొక్క వెలుపలి భాగమునకేతెంచి చూడ నట తన సైన్యము దుర్బలముగను, శత్రుసైన్యము బలయుక్తముగను నుండి యుండుట గాంచెను.

గర్జన్తం చ లయోత్కృత్యా భీమం యుద్ధోద్ధతార్ణవమ్. 9
శరసీకరనీరన్ధ్రం మకరవ్యూహసంకులమ్
వారణవ్యూహవలితం తరఙ్గవ్యూహవిస్తృతమ్. 10
చక్రావర్తవహద్వ్యూహకల్లోలకలితాన్తరమ్
చలద్రథశతావర్తం పతాకాలహరీగణమ్. 11
ప్రస్ఫురచ్ఛత్రఫేనాఢ్యం హయహేషితఫీత్కృతమ్
సముల్లసద్ధేతిజలం కచద్ధారాకరం పరమ్. 12
తరత్తరలమాతఙ్గతురఙ్గౌఘతరఙ్గకమ్
హేత్యమ్భసి కచత్పాపముద్యద్గులుగులోదరమ్. 13
దరీదలనసంక్షుబ్ధమరుజ్జనితఘుంఘుమమ్
నతోన్నతకృతాద్రీన్ద్రమహాస్పన్దశరీరకమ్. 14
మజ్జన్మాతఙ్గతురగహేలాహత మహీధరమ్
అపారవిచరత్పూరకల్లోలాలమహాజలమ్. 15
అకాలకల్పాన్తదశాసముత్థానఘనాకృతిమ్
ఆక్రాన్తరోదసీరన్ధ్రరుధిరైకమహార్ణవమ్. 16
కచదాయుధఖణ్డౌఘడీనరత్నావృతోదరమ్
చలద్వ్యూహ చలచ్చద్వ్యస్తయన్త్రాశ్మక్షేపణాశ్మకమ్. 17
~~~~~~~~~~~~~

రత్నసీకరనీహారసంధ్యాభ్రపటలానతమ్
క్వచిత్పాంసుపయోవాహపీతహేతిపయోధరమ్. 18

అత్తఱి ప్రపంచమును లయమొనర్చుటకుగాను లేచి గర్జించుచు భయంకరమై యొప్పుచున్నదియు, బాణములను జలకణములచేఁ బూర్ణమైనదియు, పెక్కు మకరవ్యూహములును, గజవ్యూహములును, తరంగవ్యూహములును గల్గియున్నదియు, విశాలమైనదియు, చక్ర ఆవర్త ములవలెఁ చలించు సేనా సమూహములు గలదియు, వీరులను తరంగముచే నొప్పునదియు, చలించు అసంఖ్యాతములగు రథములను ఆవర్తములతోఁ గూడియున్నదియు, పతాకములను తరంగసమూహము గలదియు, ప్రకాశించుచున్న గొడుగులను నురుఁగుచే వ్యాపింపఁబడినదియు, గుఱ్ఱముల హినహినారవమును జలచర జంతువుల ఫీత్కారశబ్దముచే భయంకరమైనదియు, శోభాయమానములగు యాయుధములను జలముచేఁ బూర్ణమైయున్నదియు, మెఱయుచున్న యాయుధధారల కుత్తమ నిలయమై చెన్నొందునదియు, చంచలములైన గజ, అశ్వసమూహములను తరంగములతోఁగూడినదియు, ఆయుధములను జలమందుఁ బ్రకాశమానులగు మ్లేచ్ఛులను కాల సర్పములచేఁ బూర్ణమైనదియు, వీరులయొక్క వార్తలచే 'గులుగులు' శబ్దయుక్తమై యున్నదియు, గుహలయొక్క ఖండనముచే విక్షోభమొందినట్టి వాయువుచే నుత్పన్నమైన ఘుంఘుమ శబ్దముతోఁ గూడినవియు, చిన్నవియు, పెద్దవియునగు యేనుఁగులను మహాపర్వతములయొక్క పడుట, లేచుటయను గొప్ప చలనము గలిగియున్న విశాల శరీరముతో నలరుచున్నదియు, పడుచున్న గజాశ్వములచే లీలాపూర్వకముగఁ హతములగుచున్న పర్వతములు గలదియు, చలించు అపార సేనాప్రవాహమను తరంగములచే భూషితమగు మహాబలము గల్గియున్నదియు, అకాలమునఁ జల్పాంతస్థితియొక్క యావిర్భావమువలె గొప్ప యాకారమును ధరించినదియు, భూమ్యాకాశముల నాక్రమించిన గొప్ప రక్తసముద్రమువలె నొప్పునదియు, ప్రదీప్తములైన యాయుధములను రత్నములతోఁ గూడియున్నదియు, చలించు సేనావ్యూహములున్ను, శిలాయంత్రములనుండి యిటు నటు విసరివేయఁబడు శిలాసమూహమున్ను గల్గియున్నదియు, రత్నఖండములచే హిమసంయుత సంధ్యాకాలమేఘముచేవలె నావరింపబడియున్నదియు, ఒకచోట ధూళియను మేఘములచేఁ ద్రావఁబడిన యాయుధములను మేఘములు గలదియునగు శత్రుసమూహమను మహాసముద్రమును ఆ రాజు అచట వీక్షించెను.

తమాలోక్య రణామ్భోధిమగస్త్యోఽస్య భవామ్యహమ్
ఇతి సంచిన్త్య మనసా స పాతుం తం రణార్ణవమ్. 19
అస్త్రం సస్మార వాయవ్యం చతుర్దిక్కం చ సందధే
ధనుషి శిఖరాధారే త్రిపురాన్త ఇవోద్యతః. 20

యుద్ధమునకుఁ గారణమైనయట్టి శత్రుమండలమను సముద్రమునుగాంచి యా నృపాలుడంత 'సైన్యమునకు నేను అగస్త్య ఋషినయ్యెద'నని తలంచి యా రణసముద్రమును బానము చేయుటకుగాను వాయవ్యాస్త్రమును స్మరించి పర్వతముల కాధారభూతమగు మేరువను ధనస్సునందు త్రిపురము నంతమొనరించుటకై శివుఁడస్త్రమును సంధించినట్లు ధనుస్సునందు బాణమును నలువైపుల సంధించెను.

ఆత్మీయదేశసైన్యానాం శ్రేయోర్థం శాన్తయేఽనలమ్
నమస్కృత్యాథ జప్త్వాశు స తత్తత్యాజ దారుణమ్. 21
యథాతథైవ తత్యాజ తస్య సాహాయకాయ సః
పర్జన్యాస్త్రం మహాస్త్రౌఘం ద్విషదాతపశాన్తయే. 22

తన సైన్యముయొక్క హితముకొఱకును, శత్రుసైన్యముయొక్క దమనముకొఱకును నాతఁడగ్నిదేవునకుఁ బ్రణమిల్లి, మంత్రమును జపించి శీఘ్రముగ ఆ దారుణమైన యస్త్రమును బ్రయోగించెను. దానినెట్లు త్యజించెనో, అట్లే యద్దానిసహాయము కొఱకును, శత్రుజనిత తాపశాంతి కొఱకును, అస్త్రములన్నింటికిని ప్రభువగు పర్జన్యాస్త్రమునుగూడ నాతఁడు ప్రయోగించెను.

తస్మాదస్త్రజుషో ఘోరాద్ధనుషః పరినిర్గతాః
అష్టమూర్తేశ్చతుర్దిక్కమాశాకుహరపూరకాః. 23
నిర్యయుర్బాణసరితస్త్రిశూలసరితస్తథా
శక్తీనాముగ్రసరితో భుశుణ్డీసరితస్తథా. 24
ముద్గరాణాం చ సరితః ప్రాసానాం సరితో రయాత్
చక్రాణాం చైవ సరితః పరశ్వధనదీరయాః. 25
తోమరాణాం చ సరితో భిన్దిపాలమహాపగాః
పాషాణానాం చ సరితో వాతాః కల్పాన్తశంసినః. 26
అశనీనాం చ సరితో విద్యుతాం సరితస్తథా
జలధారా సరిత్పూరాః ఖడ్గవర్షసమన్వితాః. 27
సనారాచా మహావర్షహర్షలోత్పాతపీవరాః
నాగాశ్చ యుగపర్యన్తస్ఫుటితాద్రీన్ద్రజా ఇవ. 28

అపుడా భయంకరములైన యస్త్రముల రెంటితోఁగూడిన యెనిమిదివిధములగు ఆకృతులుగల యా ధనుస్సునుండి నలువైపుల బయలుదేఱి, దిక్కులన్నింటిని బూర్ణ మొనర్చుచు బాణ, త్రిశూల, శక్తి, భుశుండ్యాద్యాయుధములయొక్క భయంకరములైన నదులు ప్రవహింపఁ జొచ్చెను; ఇంతేఁగాక, ముద్గర (ఇనుపగుదియ) ప్రాస (ఈఁటె) చక్ర, పరశు (గండగొడ్డలి) తోమర (చిల్లకోల), భిందిపాలాద్యాయుధములయొక్కయు. శిలలయొక్కయు, పిడుగులయొక్కయు, మెఱపులయొక్కయు భయంకరములైన నదులు అతివేగముగ నలుదెసలఁ బ్రవహింపసాగెను. మఱియు నపుడు కల్పాంతసూచకమగు మహావాయువులువీవదొడఁగెను; ఖడ్గవర్షముతోఁగూడిన జలధారలుగల నదులు ప్రవహింపఁజొచ్చెను; బాణములయొక్క మహావృష్టితోఁగూడినవై, మహావాయువులచే వృద్ధిఁబొందిన ఉత్పాతాగ్నులవలెఁ బరిపుష్టములైన శరీరములుగల సర్పములు, ప్రళయ కాలమున విచ్ఛిన్నములగు మహాపర్వతములనుండి జనించు ధూళిసమూహములవలె బయలుదేఱెను.

తేనాస్త్రవర్షవేగేన ధుతః సోఽరిబలార్ణవః
ఝటిత్యేవ న కాలేన పాంసురాశిరివాఖిలః. 29

సలిలాశనిశస్త్రౌఘామాసారైశ్చణ్డమారుతైః
సరాంసీవ విసేతూని సైన్యాని పరిదుద్రువుః. 30

చతురఙ్గశ్చతుర్దిక్కం బలౌఘః స పరాఙ్ముఖః
యయౌ ప్రావృడ్గిరినదీమహావాహ ఇవ ద్రుతః. 31

వహత్స్విన్న బృహచ్ఛిన్నపతాకాకేతుపాదపః
మరీచిపుష్పశబలవిలోలాసిలతావనః. 32

ఆయస్త్రవర్షముయొక్క వేగముచే అశత్రుసైన్యమను సముద్రమెల్లెడల ధూళిరాశివలె శీఘ్రముగ నెగురఁగొట్టఁబడెను మఱియు, జల, వజ్ర శస్త్రములయొక్క మహావర్షములచేతను, ప్రచండవాయువులచేతను ఆరిపుసైన్యములు కట్టతెగిన సరోవరజలమువలె నలువైపుల వెడలిపోఁ జొచ్చెను. అపుడా శత్రువుల చతురంగసేనా సమూహము వెనుకకు మరలి, వర్షాకాలమందలి పర్వతనదియొక్క మహాప్రవాహమువలె వేగముగ బరువెత్తుచు నలుదెసలఁ జనెను. వాయు ప్రవాహమువలనఁ బ్రవహించుచు, చెమటచేఁ దడిసినవై, ఛిన్నభిన్నములైనట్టి పతాకములను వృక్షములు గలదియు, మరీచి పుష్పములవలె చిత్రవర్ణములుగలవై, చంచలములైనట్టి ఖడ్గసమూహములను లతావనములతోఁగూడినదియునగు అశత్రుసైన్యమను పర్వతనది యపుడు పరుగిడసాగెను.

విలుఠత్పృష్టపాషాణపృషగ్రక్తద్రవావచః
ఘోరైర్ఘురఘురారావైరలం హృదయభఙ్గదః. 33

ఉహ్యమానబృహద్దన్తిదన్తద్రుమవిఘట్టనైః
స్ఫూర్జచ్ఛటచటారావతర్జితోద్గర్జితామ్బుదః. 34

హేతివృత్తోగ్రసంఘట్టపుష్పజాతఝుణఝ్ఝణః
తరత్తరలసారావతురఙ్గమతరఙ్గకః. 35

రథాదిఖటచక్రౌఘశిలాక్రేంకారపీవరః
పదాతిరథహస్త్యశ్వశిలాసంఘట్టసంకటః. 36

కటుచంకార చీత్కారక్రేంకార పరిపీవరః
మృతా మృతా వయమితి ఘనకోలాహలాకులః. 37

సేనావారిమహావర్తచలద్గులుగులారవః
రక్తసీకరనీహారసంధ్యామ్బుదవితానకః. 38

హేతివీచివటాచ్ఛిన్నవారివామనవారిదః
వర్షపఙ్కిలభూపీఠతటఖణ్డనమణ్డితః. 39

కున్తశూలగదాప్రాసవహత్తలతలాద్భుతః
సాక్రన్దభీరుజనతాప్రతపన్మృగపోతః. 40

మృతహస్త్యశ్వయోధౌఘజీర్ణపర్ణనిరన్తరః
పిష్టదేహవసామాంసపఙ్కసంజాతకర్దమః. 41

చూర్ణీకృతఖురాపిష్టమహాస్థిఘనసైకతః
ఉహ్యమానశిలాపూరకాష్ఠకోటికటఙ్కటః. 42

పరుగిడుటయందు అసమర్థులును, శిలవలె స్థూలములైనట్టి శరీరములు గలవారునగు వీరుల శరీరములనుండి బయలుదేఱుచున్న రక్తధారలతోఁగూడి అనిర్వచనీయమై యొప్పునదియు, అందు మూర్ఛిల్లిన శత్రువుల ఘోర ఘురఘురా శబ్దములచే హృదయమును భేదించునదియు (భయంకరమైనదియు), కొట్టుకొనిపోవుచున్న పెద్ద యేనుఁగుల దంతములను వృక్షములయొక్క సంఘట్టనములచే పిడుగులవంటి చటచటా శబ్దములచే మేఘ గర్జనలఁగూడఁ దిరస్కరించునదియు, ఆయుధములయొక్క శిలలతోటి సంఘట్టనమను నదీతీరమందలి వృక్షములయొక్క పుష్పములం దుత్పన్నమైన తుమ్మెదల 'ఝుణఝుణారావము గలదియు, రథాదులయొక్కయు, వీరులయొక్కయు, చక్రసమూహములయొక్కయు శిలలతో సంఘట్టనమను మండూక, పక్ష్యాదుల శబ్దములచే పుష్టమైనదియు, కాలిబంటు సైన్యముయొక్కయు, రథ, గజ అశ్వములయొక్కయు శిలలతోటి సంఘట్టనముచే మహా సంకటయుక్తమైనదియు, కర్ణకటువులైన చీత్కార క్రేంకార శబ్దములచేఁ బరిపుష్టమైనదియు 'మేము చచ్చితిమి మేము చచ్చితి'మను గొప్ప కోలాహలముచే వ్యాప్తమైనదియు సేనయను జలముయొక్క గొప్ప యావర్తముయొక్క చలనముచలన గులుగులు శబ్దముతోఁ గూడియున్నదియు, రక్తధారలను మంచుచే సంధ్యాకాల మేఘమండలమను వితానము (మేలుకట్టు)వలె నొప్పునదియు, ఆయుధములను తరంగములచే వటవృక్షములవలె ఛిన్నభిన్నమొనర్పఁబడిన వినమ్రములైన మేఘములు గలదియు, వర్షముచే పంకిలమైయున్నట్టి భూతలముయొక్క (మార్గసిద్ధికొఱకు గావింపఁబడిన) తీరముల ఖండనముచే శోభించుచున్నదియు, కుంత శూల, గదాప్రాసాద్యాయుధముల ధరించి పరుగిడుచున్న వీరులనునట్టి కొట్టుకొనిపోఁబడుచున్న తాళవృక్షవనముచే నద్భుతమైనదియు, ఏడ్చుచున్న భీరుజనులనునట్టి తపించు బాలహరిణములచే వ్యాప్తమైనదియు, మరణించిన సైనిక గజాశ్వసమూహమను శిథిల పత్రములతో, నిరంతరము కూడియున్నదియు, చూర్ణీభూతములైన దేహములయొక్క క్రొవ్వు, మాంసములను బురదగలదియు, ఏనుఁగులు మున్నగువాని పాదములచేఁ ద్రొక్కఁబడి పిండిచేయఁబడిన యెముకలను పెద్ద యిసుకతోఁ గూడినదియు, కొట్టుకొని పోఁబడుచున్న కాష్ఠ శిలాదుల సంఘట్టనములచే 'కటకటా' శబ్దయుక్తమైయున్నదియునగు అశత్రుసమూహమను పర్వతనది యపుడు పరుగిడఁజొచ్చెను.

ఉద్గర్జత్ప్రలయామ్భోదైర్వహత్ప్రలయవాయుభిః
ప్రపతత్ప్రలయాసారైః ప్రలయాశనిసంకటైః. 43

పఙ్కిలాఖిలభూపీఠైః సలిలోపప్లుతస్థలైః
సితశైత్యవశాశ్యానధారాకృతఖపఞ్జరైః 44

సమగ్రనగరగ్రామగృహజ్వలితవహ్నిభిః
ప్రజాశ్వేభపదాతీనామాక్రన్దేనాపి ఘర్ఘరైః 45

రథామ్భోధరనిర్హ్రాదైర్దివిభూమౌ ఘనారవైః
చతుర్దిక్కం ఘనం తారక్రేంకారస్య చతుష్టయైః. 46

విద్యుద్వలయవిస్తారకారిసంఘట్టఘర్షణైః.
శరశక్తిగదాప్రాసభిన్దిపాలాదివర్షణైః. 47
సర్వదిక్కమసంఖ్యాని బలాని బలశాలినామ్
భూభృతాం విద్రవన్త్యాశు వినేశుర్మశకౌఘవత్. 48

మహాగర్జనలసల్లు ప్రళయ మేఘములవలనను, ప్రచండముగ వీచు ప్రళయ వాయువులవలనను, లెస్సగ కురియు ప్రళయ జలధారలవలనను, ప్రళయ వజ్రపాతములయొక్క సంకటములవలనను, పంకయుక్తములగు సమస్త భూతలములవలనను, జలముచేఁ బరిపూర్ణములగు స్థలములవలనను, ప్రబల శైత్యమువలన శోషింపకయున్నట్టి జలధారాజనితములగు ఆకాశమందలి పంజరములవలనను, సమస్తగ్రామ నగరములందలి గృహములందుఁ బ్రజ్వలింపఁబడిన యగ్నులవలనను, కాలిబంటు సైన్యముయొక్కయు, అశ్వములయొక్కయు, గజములయొక్కయు రోదనమువలన గల్గిన మహా ఘర్ఘర శబ్దములవలనను, భూమిపైని రథాదులయొక్కయు ఆకాశమందలి మేఘములయొక్కయు గంభీర నాదములవలనను, నలుదెసల వ్యాపించిన విపశ్చిత్తుయొక్క, ధనుస్సుయొక్క మహా క్రేంకార శబ్ద చతుష్టయములవలనను, మెఱపులను వలయము (కడియము)లను విస్తరింపజేయునట్టి మేఘములయొక్క సంఘర్షణములవలనను, బాణ, శక్తి, గదా, ప్రాస, భిందిపాలాద్యాయుధములయొక్క వర్షములవలనను, మహా బలవంతులగు శత్రురాజుల యసంఖ్యాతములైన సైన్యము లన్నిదిక్కులఁ బరువిడుచు మశకసమూహము (దోమల)వలె శీఘ్రముగ వినష్టములైపోయెను.

ఉద్దామపావకవనోపమహేతిసార్థ మేఘానలాకుల జనాశనివర్షపాతైః
అనల్పలాని చపలాబ్ధిజలాబలాని పర్యాకులాని వడవాగ్నిమివావిశన్తి. 49

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే
చతుర్దిగ్గత బలద్రవణం నామైకాదశాధికశతతమః సర్గః

ఓ రామచంద్రా! ప్రచండ దావాగ్నివంటి యాయుధములవలనను, ప్రాణులను వ్యాకులపఱచునట్టి మేఘ, అగ్ని, వజ్రము (పిడుగు)ల వర్షములవలనను, చంచల సముద్రమున బడబాగ్నియందుఁ బ్రవేశించు బలహీనములైన జలచర జీవులవలె, ఆ శత్రుసైన్యమపుడు వ్యాకులమయ్యెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
అవిద్యోపాఖ్యానాంతర్గత విపశ్చిదుపాఖ్యానే చతుర్దిగ్గతబలద్రవణమను
నూట పదునొకండవ సర్గము ॥ 111 ॥

ద్వా ద శా ధి క శ త త మః స ర్గః

[యత్ర యత్ర యథా నష్టా యద్యద్దేశ్యాః పలాయితాః
వర్ణ్యన్తేఽత్ర తథా సర్వే చతుర్దిక్షు ద్విషద్భటాః.

ఏ యే దేశీయులగు శత్రుసైనికు లెచటెచట నెట్లెట్లు నశించిరో, పలుదిక్కులఁ బరువిడి పోయిరో యా విషయములన్నియు నిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

లోకహారామ్బరవ్యాలం చేదిచన్దనకాననమ్
ఛిన్నం పరశుధారాభిః పతితం దక్షిణార్ణవే. 1
పర్ణవత్రోహ్యాపూరేణ పారసీకాః పరస్పరమ్
ప్రహరన్తో విమోహేన వినష్టా వఞ్జులావనే. 2
దర్దురాద్రౌ దురన్తేషు దరదీర్ణహృదన్తరాః
దరీరన్ధ్రేషు సంలీనా దరదా దానవా ఇవ. 3

శ్రీవసిష్ఠుఁడు :— ఓ రామచంద్రా! మనోహరములైనహార, వస్త్రములనునట్టి సర్పములను ధరించిన చేదిదేశపు వీరులను చందనవనము కుఠారి (గండగొడ్డళ్ళ) ధారలచే ఛిన్నమొనర్పఁబడినదై దక్షిణసముద్రమునఁ బోయిపడెను. అస్త్రప్రవాహముచేఁ బత్రములవలె నెగురుచు, పారసీకదేశపు యోధులు అజ్ఞానముచేఁ దమ్ములతామే వధించుకొనుచు వంజులదేశమున నశించిపోయిరి. దరదదేశపువీరులు విదీర్ణములైన హృదయములు గలవారై దర్దురపర్వతముయొక్క భయంకరగుహలందలి రంధ్రములందు రాక్షసులవలె విలీనులైపోయిరి.

చతురాయుధధారాగ్రచూర్ణనీహారధారిణః
విద్యుద్వలయినో వాతా వేల్లితాయుధవారిదాః. 4
దన్తినోఽన్యోన్యమాభగ్నదన్తదేహాసృక్పీడితాః
మృత్యూదరోమ్భుకగ్రాసపిణ్డపిణ్డా ఇవాభవన్. 5

అయ్యవసరమున బాణ, ప్రాస, ఖడ్గ, కుఠారములను నాల్గువిధములైన యాయుధములయొక్క ధారాగ్రములచే గావింపఁబడిన శిలాకవచాదులు చూర్ణమను మంచును ధరించినవియు, మెఱపులచేఁ జుట్టఁబడినవియునగు వారుణాస్త్రప్రయుక్తములగు మేఘములును, ప్రచండవాయువులును సంచరింపఁదొడఁగెను. అపుడు పరస్పరప్రహారములచే భగ్నములైన దంతములుగలవియు, రక్తసమూహముచే దేహమునఁ బీడితములైనవియునగు ఏనుఁగులు మృత్యువుయొక్క యుదరమును బూర్ణమొనర్చునట్టి కబళమువలె ఖండఖండములాయెను.

తఙ్గా రైవతికా రాత్రౌ రౌద్రతోమరతాడితాః
రూపికాభిః పిశాచీభిర్భుక్తా భాగీకృతాఙ్గకాః. 6
తాలీతమాలగహనే దశార్ణాః శీర్ణజఙ్గలే
గలే పాదం నిధాయాన్తః కృత్తాః సింహైర్గతాసవః. 7
పశ్చిమార్ణవతీరస్థా నాలికేరధరావనౌ
యవనా విగతప్రాణా నిగీర్ణా మకరోత్కరైః. 8
నారాచనికరం నీలం నిమేషం నాసహఞ్ఛకాః
రమఠా నలినీషణ్డా ఇవ తాణ్డవితాసవః. 9
శ్రవణాభోగశృఙ్గాగ్రో మహేన్ద్రోఽద్రిర్దివి ప్రవైః

విద్రుతై ర్వలితో నీలై ర్జాలై ర్జలముచామివ 10
చామీకర వరాకారా భగ్నా తజ్జణవాహినీ
మృతా హృతామ్బరా చోరై ర్భుక్తైకా న్తే నిశాచరైః. 11
ద్యౌరివర్షభరై రాసీ త్తదాసారం భువ స్తలమ్
వివ ర్తమానై రభితః కచద్భిర్జ్వలనాయుధైః. 12

దరదదేశీయులేయగు మణికొందఱు సైనికులు రాత్రియందు భయంకరములైన తోమరము (చిల్లకోల)లచేఁ గొట్టఁబడి తమరూపముచేఁ బురుషులను వంచించునట్టి స్త్రీపిశాచములచే భుజింపఁబడినవారై, ఛిన్నదేహులై రైవతపర్వతమున విలీనులైరి. తాళ, తమాలాది వృక్షములతోఁగూడి దట్టమైనట్టి శిథిలారణ్యమున దశార్ణదేశీయులగు భటుల కంఠములపై సింహములు తమ పాదములనుంచి ప్రాణరహితులుగఁజేసెను. నారికేళవృక్షసహితమగు పశ్చిమ సముద్రతీరమున యవనులు మొసళ్ళచే మ్రింగఁబడి ప్రాణములఁ గోల్పోయిరి. శకదేశపుయోధులు నల్లని యినుప బాణములను క్షణకాలమైనను సహింపఁజాలక పరువెత్తిపోయిరి. రమఠదేశీయులగు వీరులు వాయువుచేఁ గొట్టఁబడిన కమలదండములవలె విచ్ఛిన్నులైపోయిరి. శ్రవణనక్షత్రముయొక్క రచనను బోలినట్టి మూఁడు శిఖరములతోఁగూడిన మహేంద్రపర్వతము, పరుగెత్తిపోయిన నీల వర్ణపు డివిదేశీయ సైనికులచే మేఘసమూహముచేవలె నావరింపఁబడినదాయెను. సువర్ణము వంటి యాకృతిగల తంగణదేశసైన్యము మొమ్మొదట చోరులచే నపహరింపఁబడిన వస్త్రములుగలదై, పిమ్మట నేకాంతమున నిశాచరులచే భక్షింపఁబడెను. అట్లు భక్షింపఁబడు సమయమున నచటి భూతలము, ప్రజ్వలించు భ్రమణశీలములైన కొఱవుల ధరించిన నిశాచరులచే, నక్షత్రసమూహముచే నాకసమువలె, శోభాయమానమై యొప్పెను.

ధారాధరధరారన్ధ్రప్రతిశ్రుద్ఘనఘుంఘుమా
జగద్గేహగుహాసీద్ద్వార్ఘనం గాతుమివోద్యతా. 13
ద్వీపాన్తరజనాశ్చక్రైర్జర్జరా జీవితం జహుః
మీనజగ్గలజమ్బాలే జీర్ణమత్స్యా ఇవాజలే. 14
యావద్ద్వీపా జితాః కుక్షౌ సహ్యాద్రౌ సమమూర్తయః
ఆశ్వస్య దివసాన్సప్త యయురాయాసమన్థరమ్. 15
గన్ధమాదనపున్నాగవనగుఞ్జేషు పుఞ్జితాః
విద్యాధరకుమారీభిర్గాన్ధారాః పరిరక్షితాః 16
హూణచీనకిరాతానాం ముక్తైస్తైశ్చక్రవర్షణైః
కమలానీవ లూనాని శిరాంస్యభిముఖానిలైః. 17
నిలీనా నలినీనాలే కణ్టకా ఇవ నిశ్చలాః
ద్రుమే ద్రుమే ద్రుమమయా భయాత్త్వస్యావసంశ్చిరమ్. 18
చారుసారఙ్గరఙ్గాసు శైలకానన భూమిషు
చతుర్దిక్కం తదాపాతైః సంపన్నం క్షోభణం ఘనమ్. 19

కణ్టకస్థలనామానః కణ్టకస్థలకర్కశాః
కణ్టకస్థలగా ఆసన్కణ్టకస్థలమణ్డలే. 20

ఆ విపశ్చిద్రాజుయొక్క విజయ సమయమున జగద్గృహమను గుహను ధరించిన యాకాశము పర్వత గుహలందలి గర్జన ప్రతిధ్వనులచే, గొప్ప మృదంగధ్వనితోటి యాతని యశోగానమునఁ బ్రవృత్తమైనదా యన్నట్లుండెను, చక్రాయుధములచే శైథిల్యమునొందినవారై ద్వీపాంతరములందలి జనులు, జలరహితమగు శైవాలము (నాచు) నందలి శిథిల మత్స్యములవలెఁ బ్రాణములఁ గోల్పోయిరి. సమస్త ద్వీపములందలి పరాజితులైన భటులు సహ్యపర్వతముపై దాగుకొని తమ గాయములు మున్నగువానికిఁ జికిత్స గావించుకొని యథారీతి శరీరము గోల్కొనిన వారై బహు పరిశ్రమచే తమతమ నెలవులకు మెల్లగఁ జనిరి. గంధమాదన పర్వతముపైని పున్నాగవన కుంజములందు సమకూడిన గాంధారదేశపు భటులను విద్యాధర కుమారీగణము పరిరక్షించెను. హూణ, చీన కిరాతసైనికుల శిరంబులు విపశ్చిద్రాజుచే విడువఁబడిన చక్రాయుధ వర్షముచే అభిముఖముగా, వీచు వాయువులచే కమలమువలె, విచ్ఛిన్నములైపోయెను. నిలీపదేశ వీరులు కమలనాళమున కంటకములవలె నిశ్చలులై, జడప్రాయులై యావిపశ్చిద్రాజుయొక్క భయముతోఁగూడి వృక్షములందే చాలకాలము వసించిరి. లేళ్ళయొక్కయు, పక్షులయొక్కయు విహారస్థానములగు పర్వతారణ్య భూములందును ఆ విపశ్చిత్తుయొక్క దాడులచే నలువైపుల మహాక్షోభము జనించెను. కంటకస్థలమను పేరుగలవారును, కంటకవనమువలె కఠినులునగు యోధులు చోరుల నివాసమగు ప్రదేశమున కంటక వనమందు భయముచే దాగుకొనిరి.

పారసీకాః పరం పూరైః పారం ప్రాప్య పయోనిధేః
నిపేతుః పవనైః పూతాః ప్రలయే తారకా ఇవ. 21
వపురమ్భోధికుట్టాకా దృషదాం కటకాఙ్కితాః
సర్వదిగ్వనలుణ్టాకా వాతాః ప్రలయశఙ్కితాః. 22
ఆసారసారాః పఙ్కమ్ప్లుతాః సఘనఘుంఘుమాః
ఆసన్దశదిశోఽదృశ్యా బహుక్షుబ్ధాయుధానిలైః. 23
నిర్హ్రాదకారిభిర్వాతైర్వ్యహచ్ఛపభపారవమ్
ప్రసస్రుసుర్భువి నీహారా మహార్ణవరయా ఇవ. 24
విదూరస్థా రథేభ్యశ్చ వీచిచీత్కారకారిణః
సరోమ్భస్యనిలైః పేతుః పద్మేభ్య ఇవ షట్పదాః. 25
ఆయుధౌఘేఽపి చక్రౌఘాత్పాదాతం బలమావిలమ్
రజోరాశిరివాసాలేన సమర్థం పలాయనే. 26
హూణా ఆమస్తకం మగ్నా ఉత్తరార్ణవ సైకతే
క్లిన్నాస్తత్రైవ పఙ్కాన్తః పూరణావిలశూలవత్. 27
తీరైలావనలేఖాసు శకాః పూర్వపయోనిధేః
నీతా బద్ధ్వా దినం ముక్తా న గతా యమసాదనమ్. 28

మన్దం మన్దాః మహేన్ద్రాద్రౌ క్రన్దన్తః పతితా దివ
ఆశ్వాసితా మునివరై ర్భిన్నా శ్రమమృగా ఇవ. 29

పారశీకదేశపు వీరులు విపశ్చిత్తుని అస్త్రప్రవాహములచే గొట్టుకొనిపోయి సముద్రతీరమును బొంది ప్రళయవాయువులచేఁ బ్రేరితములగు నక్షత్రములవలె, ఆ సముద్రమునఁ బడిపోయిరి. సముద్రమును క్షోభపెట్టుననియు, శిలాప్రహారములచేఁ బర్వతములపైఁగూడ చిహ్నములఁ గలుగజేయుననియు, సర్వదిశలందును వనములఁ బెల్లగించుననియు, ప్రళయమునుగూర్చిన శంకను జనింపఁజేయుననియునగు ప్రచండవాయువు లపుడు వీవదొడఁగెను. మహా సంక్షుబ్ధములైన యాయుధములచేతను వాయువులచేతను దశదిక్కులు ఘనమగు ఘుంఘుమ నాదముచేఁ బూర్ణములై వర్షధారాయుక్తములై బురదచేతను, నీటిచేతను దడిసి అదృశ్యములాయెను. గొప్ప ధ్వనిగావించు వాయువులచే భూమిపై మంచు మహాసముద్ర ప్రవాహములవలె 'ఛపఛపా' శబ్దములతోటి ప్రవహించుచుండెను. దూరదేశములందున్న రథికులున్ను వాయువుయొక్క యాఘాతములచే తరంగములవలె 'చీత్కార' శబ్దము గావించుచు, వాయువుచేఁ గొట్టబడిన తుమ్మెదలు పద్మమునుండి క్రిందఁ బడునట్లు తమ రథములపైనుండి సరోవరజలమునఁ బడిపోయిరి. కాలిబంటు సైనికులు ఆయుధములు గలిగియున్నప్పటికిని విపశ్చిత్తుని చక్రసమూహముచే బాధితులై, అశ్రుపూరితలోచనులై, జలధారలు కురియుటచే ధూళిరాశివలెఁ బరుగిడుటయందు అసమర్థులైరి. హూణులు ఉత్తర సముద్రతీరమందలి యిసుకయందుఁ గంఠమువఱకు నిమగ్నులై, మృత్తికయందుంచఁబడిన శూలమువలె, అచటి బురదయందు శిథిలురైపోయిరి. శకదేశపు యోధులు పూర్వ సముద్రతీరమునగల యేలక వనమునకుఁ గొనిరాఁబడి యట రోజంతయు బంధింపఁబడి యున్నవారై మరల విపశ్చిత్తుచే విడుదల చేయఁబడినందున యమపురికి జనక యుండిరి. మద్రదేశపు సైనికులు మెల్లమెల్లగ మహేంద్రపర్వతముపైఁ జేరిరి. కాని ఆ యెత్తైన ప్రదేశమునుండి వారేడ్చుచుఁ గ్రిందఁ బడిరి. అపుడు ఉత్తములగు మునులు వారిని తమ యాశ్రమమృగములనువలె నోదార్చిరి.

ప్రవిష్టా యాచనం సహ్యే లబ్ధాః సురబిలాద్ద్వయమ్
అనర్థేనార్థ ఆయాతి కాకతాలీయతః క్వచిత్. 30

సహ్యపర్వతమును బ్రవేశించిన వీరులు కుటజాద్యమను బేరుగల యద్దాని శిఖరముపైఁ గల సురబిలమందలి మూకాంబికయను దేవియొక్క సన్నిధిని జేరుటచే నట నద్దేవిని బ్రార్థించుటవలన ఐహిక, పారలౌకిక మనోరథములు రెండును వారికి సిద్ధించెను. భాగ్యోదయకాలమున కాకతాలీయ యోగముచే నొకానొకచోట అనర్థముచేతను అర్థసిద్ధియగుచున్నది!

పతితా దర్దురారణ్యే దాశార్ణా జీర్ణపర్ణవత్
భుక్త్వా విషఫలాన్యజ్ఞా మృతాస్తత్రైవ తే స్వయమ్. 31

విశల్యకరణీం భుక్త్వా కాకతాలీయయోగతః
హిమాద్రౌ హైహయా యాతా గృహం విద్యాధరా ఇవ. 32

పృష్ఠస్రమ్లానకుసుమా ధనుర్భిర్గృహమాగతాః
వఙ్గా నాద్యాపి దృశ్యన్తే పిశాచత్వమివాగతాః. 33

అఙ్గా వనఫలైర్భుక్తైర్విద్యాధరపదప్రదైః
విద్యాధరీభిః క్రీడన్తి దివి విద్యాధరాః స్థితాః. 34

తాలీతమాలఖణ్డేషు పతితాః పాటితాఙ్గకాః
పారసీకా గతా మోహం భ్రమాద్వైమానికా ఇవ. 35

తరలాసారమాతఙ్గం పతితం తఙ్గణాఙ్గణే
అఙ్గైరఙ్గకలిఙ్గానాం చతురఙ్గం బలం హతమ్. 36

క్రమత్యరిబలే సాల్వాః శరశైలోదకోదరే
పతితాః ప్రభుణా సార్ధమద్యాప్యేవోపలాః స్థితాః. 37

అసంఖ్యాః ప్రపలాయన్తః కకుభం కకుభం ప్రతి
నరాః సరత్తరఙ్గేషు సాగరేషు లయం గతాః. 38

దశార్ణదేశీయులగు యోధులు దర్దురపర్వతారణ్యమున శుష్కపత్రములవలెఁ బడినవారై యట అజ్ఞానముచే విషఫలముల భుజించి స్వయముగ మరణించిరి. హైహయదేశపు భటులు హిమాలయపర్వతమును జేరి యచట కాకతాలీయ యోగముచే విశల్యకరణి (పీడలన్నింటిని దొలగించునది, ఆకాశగమనసిద్ధి నొసంగునది) అను ఓషధిని భుజించి విద్యాధరులవలె ఆకాశచారులై తమగృహములకుఁ జనిరి. వంగదేశపుసైనికులు మలినములైన పుష్పమాలలుగలవారై బాణములన్నియు వ్యయములగుటచే కేవలము ధనుస్సులుమాత్రము గైకొని తమతమ గృహములకుఁ బోయి, భయముచే నేఁటికిని బయటకురాక పిశాచత్వమును బొందినవారివలె అదృశ్యులై యున్నారు. అంగదేశీయులగు భటులు విద్యాధరపదము నొసంగునట్టి వనఫలములను భుజించి విద్యాధరులై స్వర్గమున విద్యాధరస్త్రీలతో క్రీడించుచుండిరి. పారసీకదేశపు యోధులు తాళ, తమాల వనములందుఁబడి, శత్రువులచే మర్దింపఁబడిన దేహములు గలవారై మూర్ఛిల్లి భ్రమచే వైమానికులవలెనయిరి. ప్రియుఁడవగు రామచంద్రా! మదించిన చంచలములైన గజములతోఁ గూడిన చతురంగసేనాసమేతులగు కళింగ దేశపు వీరులు, అంగదేశపు సైనికులచేఁ గొట్టఁబడి తంగణదేశమునఁ బోయిపడిరి. సాల్వదేశీయులైన భటులు బాణ, శిలా, జలములతోఁగూడిన శత్రుసైన్యముచే నాక్రమింపఁబడి తమ ప్రభువుతోసహా మఱియొకదేశమునఁ బోయిపడిరి. అచటవారు నేఁటికిని యా దేశపు గ్రామదేవతా రూపములైన ప్రతిమలైయున్నారు. అసంఖ్యులగు మనుజులు ప్రతిదిక్కునందును బరువిడుచు, చంచలతరంగములతోఁగూడిన సముద్రములందుఁబడి లయమొందిరి.

క్షేత్రాటవీపురజలస్థలశైలకూల
కుల్యాగహారసరిదబ్ధిభ్రుగుద్రుమేషు
గ్రామారపట్టిగిరికూపగుహాగృహేషు
భ్రష్టాని కః కలయితుం కుబలాని శక్తః 39

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే బలపరిభ్రంశో నామ ద్వాదశాధికశతతమః సర్గః ॥ 112 ॥

ఓ రామచంద్రా! సముద్రములందే కాదు. క్షేత్ర, నగర, జల, స్థల, పర్వత, తీర, కుల్యకాలువలు, అగ్రహార, నదీ, సముద్ర, గర్త, వృక్ష, గ్రామ, శుల్కస్థాన, కూప, గుహా, గృహాదులందు నశించినట్టి యాదుష్టశత్రుసైన్యములను లెక్కింప నెవరికిఁ దరము?

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అవి ॥విప॥ బలపరిభ్రంశ మను నూటపండ్రెండవ సర్గము ॥ 112 ॥

త్రయోదశాధిక శతతమః సర్గః

[అస్త్రాణామరిసంశాన్త్యా సాధనానాం చ సంక్షయః
అర్ణవానాం చ విభవో వర్ణ్యతే విస్తరాదిహ.

శత్రువులు శమించుటచే అస్త్రములయొక్కయు, సాధనములయొక్కయు క్షయమగుట, సముద్రముల వైభవము అను విషయము లిచట విస్తారముగ వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

బలాన్యనుతరన్తోఽథ తదిత్థం ద్రవతాం ద్విషామ్
దూరాద్దూరతరం ప్రాప్తాశ్చత్వారస్తే విపశ్చితః. 1

శ్రీవసిష్ఠుఁడు :— ఓ రామచంద్రా! ఇట్లు పరుగిడుచున్న శత్రుసైన్యమును వెన్నంటుచు ఆ నలుగురు విపశ్చిద్రాజులున్ను చాలదూరమేగిరి.

సర్వశక్తిమయైకేన చేతనేనేశ్వరేణ తే
ప్రహితా దిగ్జయం చక్రుః సర్వ ఏవ సమాశయాః. 2

సర్వశక్తియుతుఁడును, సర్వదేహములందేక రూపుఁడునగు చైతన్యస్వరూపుఁడైన యీశ్వరునిచే ప్రేరితులై, సమానమైన యభిప్రాయము గల్గిన యా విపశ్చిత్తులు నలుగురున్ను అపుడు దిగ్విజయము గావించిరి.

దూరాత్తావదవిచ్ఛిన్నమనుస్రసుర్బలాని తే
యావత్తీరం సముద్రాణాం ప్రవాహాః సరితామివ. 3

నదీ ప్రవాహములవలె వారాశత్రుసైన్యములను సముద్రపర్యంత మెడతెగక వెన్నంటుచుఁ బోయిరి.

దూరావిశ్రాన్తయానేన తేషాం తత్సర్వసాధనమ్
ఆత్మీయం పరకీయం చ క్షీణం కుసరిదమ్బువత్. 4

అట్లు చాలదూరము విశ్రాంతిలేక నిరంతరమేగుటవలన, ఆ విపశ్చిత్సైన్యముల యొక్కయు, శత్రుసైన్యములయొక్కయు, జీవన, యుద్ధాదులసాధనములగు ధన, శాస్త్రాదు లన్నియు ప్రతిదినము వ్యయమగుటచే కాలువల నీటివలె క్షయించిపోయెను.

ఆత్మీయాన్యన్యదీయాని తేషాం వీక్ష్య బలాన్యలమ్
క్షీణానీవ ముముక్షూణాం పుణ్యపాపాని ధావతామ్. 5

స్వయమస్త్రాణి శాన్తాని కృతకృత్యాన్యథామ్బరే
జ్వాలాజాలాని వహ్నీనాం, దాహ్యాస్యాసంభవాదివ. 6

ముముక్షువుల పుణ్యపాపములవలె, తమయొక్కయు, పరుగిడుచున్న శత్రువుల యొక్కయు సైన్యము పూర్ణముగ క్షయమొందుటఁ గాంచి, విదూరథుల అస్త్రశస్త్రములపుడు తమ్ము కృతకృత్యములుగ నమ్మి, దహింపఁదగిన వస్తువుయొక్క అభావముచే అగ్నియొక్క జ్వాల సమూహము శమించునట్లు. శమించినవాయెను.

ఆలయేషు రథాశ్వేభవృక్షౌషూదిషు హేతయః
ఆసన్నిద్రాలవో లీనా దినాన్తే విహగా ఇవ. 7

అత్తఱి ఆయుధములన్నియుఁ దమతమ నెలవులందును, రథ, అశ్వ, గజ, వృక్షసమూహాదులందును, లీనములై, దినాంతమున నిద్రాగ్రస్తములగు పక్షులవలె చేష్టా రహితములయ్యెను.

తరఙ్గా ఇవ తోయేఽన్తర్నీహారా ఇవ వారిదే
మేఘా వాయావివామోదా వ్యోమనీవ నిలిల్యిరే. 8

తరంగములు జలమందును, మంచు మేఘమందును, మేఘములు వాయువందును, సుగంధము ఆకాశమందును లయించునట్లు, ఆ శస్త్రాస్త్రములన్నియు నపుడు తమతమ స్థానము లందు విలీనములాయెను.

ధారాపఙ్కతలాలీనశాన్తహేతిజలేచరః
నారాచసీకరాసారనీహారపరివర్జితః. 9

చక్రావర్తశతోన్ముక్తో యుక్తః సౌమ్యతయాచ్ఛయా
ప్రశాన్తమేఘసంరమ్భతరఙ్గోత్తుఙ్గవర్షణః. 10

అన్తర్లీనర్క్షరత్నౌఘకోణసంస్థార్కవాడవః
శూన్యతావారిరమలో వ్యోమైకాబ్ధిర భూత్పృథుః. 11

అపుడాయాకాశమను నిర్మలమై, విశాలమైనట్టి యేక సముద్రము వర్షధారాజనితమగు పంకమున లీనములును, కావుననే శమించినవియునగు యాయుధములను జలచరములు గలదియు, ఇనుపబాణములను హిమ, జలధారలు లేనిదియు, అనేక చక్రాయుధములను ఆవర్తములు లేనిదియు, నిర్మలముగను, శాంతముగను, నున్నదియు, మేఘముల క్షోభచే నుత్పన్నములగు తరంగములకంటెను నుత్పన్నతములైనట్టి వర్షములు ప్రశాంతించినదియు, లోన లయించినట్టి నక్షత్రములను రత్నసమూహము గలదియు, ఒకమూల సూర్యుఁడను బడబాగ్ని గలిగి యున్నదియు, శూన్యత్వమను జలముచే శోభించుచున్నదియునై యొప్పుచుండెను.

లమ్బప్రకాశగమ్భీరం ప్రసన్నం కాన్తిమత్తతమ్
రజో విరహితం రేజే ఖం మనో మహతామివ. 12

మఱియు నయ్యాకాశమపుడు విశాలమగు ఆత్మయొక్క ప్రకాశముచేతను, సూర్య ప్రకాశముచేతను గంభీరముగ నున్నదై, నిర్మలముగను కాంతివంతముగను, వ్యాపకముగను ధూళి రహితముగను, రజోగుణవర్జితముగను నున్నదై మహాత్ముల మనస్సువలె విరాజిల్లుచుండెను.

అథార్ణవాంస్తే దదృశురాకాశస్యానుజానివ
విస్తీర్ణాన్విమలాకారాన్పూరితాఖిలదిక్తటాన్. 13

పిమ్మట, ఆ విపశ్చిత్తులు నలుగురున్ను, వారి సామంతాదులున్ను, ఆకాశముయొక్క తమ్ములవలె నున్నవియు, విశాలములును, నిర్మలాకారయుక్తములును, దిక్కులన్నింటిని బూరించు నవియునగు సముద్రములను వీక్షించిరి.

తరఙ్గగణకల్లోలమహాగులుగులాకులన్
భూరిసీకరనీహార హారిహారిశరీరిణః. 14

స్థితానాత్మానమాస్తీర్య భూమౌ వ్యాధ్యాతురానివ
శ్వసనార్తాంశ్చలద్దేహాన్వివర్తోర్మిమహాభుజాన్. 15

జడానపి స్పన్దమయాన్కల్లోలాకోటకోటరాన్
సంసారానివ విస్తీర్ణాంశ్చక్రావర్తదశాకులాన్. 16

రత్నరాశి తటోద్యోతపీవరీకృతభాస్కరాన్
శఙ్ఖరాశివిశద్వాతశబ్దితార్జిత ఘుంఘుమాన్. 17

మాంసలోర్మిఘటాఘోషఘర్ఘరామ్బరడమ్బరాన్
వర్తులావర్తవిస్తారప్రభ్రమద్విద్రుమద్రుమాన్. 18

మకరవ్యూహనిర్హ్రాదఘర్ఘరోదరఘుంఘుమాన్
మత్స్యపుచ్ఛచ్ఛటాచ్ఛిన్న మజ్జత్పోతకృతారవాన్. 19

ఉద్గ్రీవకూర్మ మకరనిగీర్ణార్ణనరోత్కరాన్
ఊర్మిబిమ్బితసప్తాశ్వ సహస్రార్కనభోనిభాన్. 20

ఆ సముద్రములు' తరంగములందలి జలకణములయొక్క కల్లోలములచే మహా 'గులుగులు' శబ్దముచేఁ బూర్ణములైయున్నవియు, అధిక హిమ, జలధారసహితములగు మేఘములచే మనోహరములైన శరీరములుగలవియు, కొలచుటకై తమ శరీరములను భూమిపైఁ బఱచినట్లున్నవియు, తరంగములచే బీడితములైన చంచలదేహములుగలవియు, గంతులిడుచున్న తరంగములను గొప్పభుజములతోఁగూడినవియు, జడములైనను చేష్టాయుక్తములైనవియు, తరంగముల వలన కుటిలములైనట్టి జలాశయములుగలవియు చక్రమువంటి ఆవర్తములయొక్క దశలచేఁ బూర్ణములైనట్టి సంసారములవలె విశాలములైనవియు, రత్నరాశులుగల తీరముల ప్రకాశముచే నుదయకాలమున సూర్యుని స్థూలముగ నొనర్చునవియు, శంఖరాశులందుఁ బ్రవేశించు వాయువుయొక్క శబ్దముచే మహాఘుమఘుమ ధ్వనితోఁగూడినవియు, పరిపుష్టములగు తరంగ సమూహములచే నాకాశమున ఘర్ఘరశబ్దముయొక్క యాడంబరమును గలుగఁజేయునవియు, గుండ్రములై,

విశాలములైనట్టి పర్భ్రమించు పగడపు వృక్షములుగలవియు, మొసళ్ళ శబ్దములచే ధ్వనియుక్తములైన యుదరములవలన ఘుంఘుమనాదసహితములై యున్నవియు, పెద్దచేపలయొక్క తోఁకల చివరిభాగములచే చిన్నభిన్నములై మునుఁగుచున్నట్టి నౌకలచేఁ గావింపఁబడిన శబ్దముతోఁగూడినవియు, ఎత్తైన కంఠములుగల తాఁబేళ్ళచేతను, మొసళ్ళచేతను మ్రింగఁబడిన నూలువస్త్రముల ధరించిన మనుష్యసమూహములు గలవియు, తరంగములందు ప్రతిబింబించిన సూర్యునిచే వేలకొలది సూర్యులతోగూడిన యాకాశమువలె నొప్పుచున్నవియునై వెలయుచుండెను.

ఘాంకారకారిపవనపతద్భూత్యతతోద్ఘటాన్
ఊర్మ్యుదస్తమణివ్రాతబలాజ్ఝణఝణధ్వనీన్. 21

నానాజాలైర్వలభుజైర్హేలాస్పృష్టార్కమణ్డలాన్
నమదున్నమదుద్రశ్మిరత్నమాణిక్యమణ్డలాన్. 22

ఉత్ఫాలఫేనిలావర్తవివర్తమకరోత్కరాన్
క్వచిత్కరికరోన్నామైః క్షణం వంశవనీకృతాన్. 23

లహరీవల్లరీవాలాన్పృష్ఠతాలిషు మాధవాన్
క్వచిదన్తరవిశ్రాన్తనపరిచ్ఛదమాధవాన్. 24

ఏకదేశస్థితాసంఖ్య నానాసురసురాలయాన్
తారానవతరఙ్గౌఘపరిదన్తురితామ్బరాన్. 25

గుహామశకవద్గర్తభీత శాఖాయితాచలాన్
నయతోమ్బుతరఙ్గౌఘైర్వేలాద్రీనతిఖర్వతామ్. 26

ఖక్షేత్రారోపితానల్పరత్నరశ్మిపథాఙ్కురాన్
శుద్ధశుక్తిముఖోన్ముక్తముక్తాన్తరితసైకతాన్. 27

నానారత్నాంశుకౌశేయసూత్రచిత్రాంన్తరఙ్గితాః
విశన్నదీస్థశాదిగ్భ్యః సమాకీర్ణాన్పటానివ. 28

మఱియు, అ సముద్రములు ఘాంకారశబ్దముగావించు వాయువులయొక్క వేగముచే బోవు పలువిధ ధనాదులతోఁగూడిన గొప్ప నౌకలుగలవియు, తరంగములచే విసరబడు మణి సమూహములయొక్క పతనమువలన గలిగిన ఝణఝణధ్వనులతోఁ గూడినవియు, ప్రదీప్తములగు వివిధమణులయొక్క ప్రభాజాలమను భుజములచే లీలాపూర్వకముగ సూర్యమండలమును స్పృశించునవియు, క్రిందను, బైనను వ్యాపించుచున్న ప్రకాశముతోఁగూడిన మాణిక్యాద్యనేక రత్నములతోఁ గూడియున్నవియు, పైకెగురుచున్న నురుఁగుతోఁగూడిన సుడులందుఁ దిరుగుచున్న మొసళ్లుగలవియు, ఒక్కచోట నీటిని కలఁబెట్టు ఏనుఁగలయొక్క పైకెత్తఁబడిన తొండములచే క్షణకాలము వెదుళ్ళ వనమువలెఁ గావింపఁబడునవియు, తరంగములందేనుఁగుల పుచ్ఛము (తోఁక)లను లతలచే శోభించునవియు, ఏనుఁగుల పృష్ఠభాగములను తుమ్మెదలపై ఫేనసమూహము (నురుఁగు) అను బుష్పములతోఁగూడి వసంతఋతు సహితములైయున్నట్లు తోఁచునవియు,

ఒకచోట (శ్వేత ద్వీపాదులందు) అభ్యంతర ప్రదేశమున విశ్రమించు పరివారసమేతుఁడగు మాధవ భగవానునిచే శోభించునవియు, ఒకభాగమున సంఖ్యాతములగు వివిధ సురాసురుల స్థానములు గలవియు, ప్రతిబింబించిన నక్షత్రములతోఁగూడిన నూతనతరంగసమూహముచే నాకాశమును బరిహసించుచున్నట్లున్నవియు, గుహయందలి దోమలవలె, బాతాళమను గర్తమున బ్రవేశించి బయటికేతెంచుటకు భీతిల్లి యచటనే విస్తరించినట్టి పర్వతములు గల్గియున్నవియు, అత్యున్నతములగు తరంగసమూహములచే, తీరమందలి పర్వతములను చాల పొట్టివిగ జూపట్టునట్లు చేయునవియు, నిజక్షేత్రమున నాటఁబడిన మహారత్నములయొక్క కిరణ ప్రసారములను అంకురములచే భూషితములైనవియు, నిర్మలములగు ముత్తెపుచిప్పల ముఖమునుండి వినిర్గతములైన ముత్యములతోఁ గూడిన యిసుక గలవియు, వివిధరత్నములయొక్క కిరణములను పట్టుదారములచేఁ జిత్రింపఁబడిన తరంగములతోఁ గూడియున్నవియు, ప్రవేశించుచున్న నదులే కండెయందు బ్రవేశించు దారములుగాఁ గలవై దశదిక్కులఁ బరిపూర్ణముగ విస్తరించినట్టి నేఁయబడుచున్న మహావస్త్రములవలె నున్నవియునై చెన్నొందుచుండెను.

ఇన్ద్రనీలతటైర్వ్యాప్తముక్తాశుక్తిశతాఙ్కితైః
క్వచిద్దర్శయతః కాన్తశతేన్దుకనఖశ్రియమ్. 29
రత్నాంశుజాలసందిగ్ధాన్తరఙ్గాదేశబిమ్బితాః
పరివర్తయతః ఫుల్లాస్తీరతాలీవనావలీః. 30
ఏలాలవఙ్గకఙ్కోలఫలమాలాం బిభృక్షుభిః
వేలావనలతాభ్రష్టామాత్తావృత్తిర్జలేచరైః. 31
చూతనీపకదమ్బాగ్రవిహగాన్ప్రతిబిమ్బితాన్
భుఙ్క్తానైర్వ్యలమ్బేన కృతాచ్ఛోటాఙ్జలేచరైః. 32
ఖేచరప్రతిబిమ్బేన విద్రవద్భిరితస్తతః
భగ్నబన్ధబృహత్సేతూన్క్షణం ప్రతి జలేచరైః. 33
అమూర్తాన్ప్రతిబిమ్బేన హృదయస్థజగత్త్రయాన్
చతురో వ్యోమవిపులాన్దిక్షు నారాయణానివ. 34
అతిగామ్భీర్యనైర్మల్యవిస్తారవిభవైర్నభః
నిగీర్య సందర్శయతో హృదయాదివ బిమ్బితమ్. 35
జలచారివిహఙ్గానాం సాకాశం ప్రతిబిమ్బితమ్
ఆశయైర్దధతః సారైః పద్మాన్భృఙ్గమివాత్మగమ్. 36
తరఙ్గతరలాస్ఫాలమారుతైరాహతామ్బరాన్
కన్దరోద్గారగమ్భీరైః కల్పాన్తజలదాలయాన్. 37

ఇంకను, ఆ సముద్రములు వెదచల్లఁబడిన ముక్తాపూర్ణములగు ముత్తెపుచిప్పలచే చిహ్నితములగు ఇంద్రనీలమణులతోఁగూడిన తీరములచే ననేక చంద్రులయొక్క కాంతివంటి నఖశోభను దర్శింపఁ జేయుచున్నవియు, రత్నముల కిరణసమూహములచేఁ గప్పఁబడినవై, తరంగములందుఁ బ్రతిబింబితములై, వికసితములైనట్టి తీరస్థతాళవనములను వృద్ధిపరచునవియు, తీరములందున్న వనములందలి లతలనుండి క్రిందఁబడిన ఏల (ఏలక), లవంగ, కంకోలాది ఫలములను భుజింపఁ గోరి తీరములందు సంచరించునట్టి జలచరములు గలవియు, తీరములందలి ఆమ్రకదంబాది వృక్షములయొక్క శాఖాగ్రభాగములందున్నవై జలమునందుఁ బ్రతిబింబించినవైన పక్షులను భక్ష్య పదార్థమును జూపుట మున్నగు కపటోపాయములచే తరంగముల సన్నిధికి నాకర్షించి వానిని భుజించు వ్రేళ్లయొక్క ధ్వనులఁ గావించు జలచరములు గల్గియున్నవియు, ఆకాశచారుల ప్రతిబింబములచే భయపడి యిటునటు పరుగిడు జలచరములవలన క్షణకాలము తెగినట్టి గొప్ప సేతు బంధములు గలవియు, నాల్గుదిక్కులందును, ఆకార రహితులును, ప్రతిబింబ రూపముతో హృదయమందలి త్రైలోక్యముతోఁగూడియున్నవారును, ఆకాశమువలె నిర్మలమైన స్వరూపము గలవారునగు నలుగురు నారాయణులవలె నున్నవియు, మహాగాంభీర్య, నైర్మల్య, విస్తారాది విభవములతోఁ గూడియుండుటచే, ప్రతిబింబించిన యాకాశమును మ్రింగి మరల దానిని హృదయమునుండి బయటకుఁ దీసి చూపుచున్నట్లున్నవియు, సమీపములందలి జలచరులగు పక్షులను ప్రతిబింబములద్వారా సారభూతములగు తమ హృదయములందు ధరించి, నిజకోశగర్భమందున్న తుమ్మెదను కమలముధరించి వెలయునట్లు వెలయుచున్నవియు, చంచలములగు తరంగములయొక్క సంచాలనమునఁ బ్రవృత్తములగు వాయువులచే నాకాశమును గొట్టునవియు, తమయందలి పర్వతములయొక్క గుహలందుఁ జనువాయువుయొక్క గమనాగమనములచే ననుమానింపఁబడు తద్గుహాగాంభీర్యములచే, కల్పాంత మేఘములకు స్థానభూతములై యున్నవియునై యలరారుచుండెను.

గుహాగులుగులావర్తనిర్ఘోషాశనిభీషణాన్
భృశం భావయతో గ్రస్తానగస్త్యౌర్వానలానివ. 38
భూరిసీకరపుష్పాణి తరఙ్గౌఘతరూణి చ
ప్రాప్తాన్యమ్బువనానీవ లహరీమఞ్జరీణి ఖమ్. 39
సరత్తరఙ్గజాలాని ప్రోడ్డీనప్రాణిమన్త్యధః
ఆకాశఖణ్డఖణ్డత్వాత్పతితానీవ విభ్రమాత్. 40

మఱియు, గుహలందలి 'గులుగులు' శబ్దములచేతను, అచటి ఆవర్తములయొక్క ధ్వనులచేతను, పిడుగువలె భయంకరములైనవియు, తమ్ములఁ గబళించునటువంటి అగస్త్య, బడబాగ్నులను తమ గుహలందు బాగుగ కబళింపఁబడినట్లు భావించుచున్నవివలె వర్తించునవియు, ఆకాశమును బొందిన అనేకజలకణములను బుష్పములతోడను, తరంగసమూహమను వృక్షముల తోడను, ప్రవాహములను లతలతోడను గూడిన జలమయములైన వనములవలె నొప్పుచున్నవియు, పైకెగయుచున్నట్టి మత్స్యాది ప్రాణులతోఁగూడి చలించుచున్నవియు, శస్త్రములచే నాకాశము ఖండింపఁబడ, క్రిందఁబడిన యాకాశఖండములవలె భ్రమచేఁ జూపట్టునవియునగు విశాల తరంగ సమూహములు గల్గియున్నవియు నగు ఆ నాల్గుసముద్రములను విపశ్చిద్రాజులున్ను, వారి సహచరులున్ను వీక్షించిరి.

ఏలాలవఙ్గబకులామలకీతమాల హింతాలతాలదలతాణ్డవఖణ్డితాగ్రే
ప్రాప్తే పతల్లవణవారిధిదీర్ఘతీరం రేఖా బభావలినిభామ్బరశైలమూర్ధ్ని. 41

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే సముద్రవర్ణనం నామ త్రయోదశాధికశతతమః సర్గః ॥ 113 ॥

ఓ రామచంద్రా! ఈ ప్రకారముగ గంతులిడుచున్న తరంగములతోఁగూడియున్న లవణసముద్రములయొక్క దీర్ఘతటమును విపశ్చిత్సైన్య మెపుడు పొందెనో, అపుడాతీరమున కెదుట నున్నట్టి యాకాశమునంటుచున్న యెత్తైన పర్వతములయొక్క శిఖరములపై, ఏల (ఏలక), లవంగ, బకుల, ఆమలకీ (ఉసిరిక), తమాల, హింతాల; తాలాది వృక్షములయొక్క పత్రముల చలనములచే విభక్తమైనట్టి భ్రమరసదృశమైన అంధకారరేఖ శోభించెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అవి ॥విప॥ సముద్రవర్ణనమను నూట పదమూఁడవ సర్గము ॥ 113 ॥

~~~~~~~~~

చతుర్దశాధిక శతతమః సర్గః

[ఇత ఆరభ్య వర్ణ్యన్తే విపశ్చిద్భ్యః ప్రదర్శితాః
పార్శ్వగైర్వనవృక్షాబ్ధిశైలమేఘ వనేచరాః.

ఇటనుండి మొదలుకొని సహచరులగు మంత్ర్యాదులు విపశ్చిత్తులకు జూపిన వనవృక్షః సముద్ర, పర్వత, మేఘ, వనచరాదులు వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అథ తేషాం తదా తత్ర తతస్తాంస్తానదర్శయన్
పార్శ్వగా వనవృక్షాబ్ధి శైలమేఘవనేచరాన్. 1

శ్రీవసిష్ఠుఁడు:—ఓ రామచంద్రా! అట్టు సముద్రతీరమును బొందినపిదప ప్రక్కనున్నట్టి మంత్ర్యాదులుఁ ఆవిపశ్చిద్రాజులకచట వన, వృక్ష, సముద్ర, పర్వత, మేఘ, వనచరాదులఁ జూపిరి.

దేవపశ్యాస్యశైలస్య యోయమభ్రంకషాగ్రభూః
సమరున్మధ్యదేశాదేరశ్మదేశముపేయుషః. 2

ఇమా బకుల పున్నాగనాలికేరకులాకులాః
విపినావలయో వాన్తవివిధామోదమారుతాః. 3

లునాత్యుపత్యకాం వార్ధిః శైలశాలిశిలావలీః
వనాలీర్లహరీదాత్రై రాపాదఫలపల్లవాః. 4

అధిత్యకాసు మేఘాలీర్నృత్యతాం స్వామ్బుభూభృతామ్
ధునోతి జలధిర్బాలో గృహధూమావలీమివ. 5

రాకాబ్ధిపూరసంప్రోతశఙ్ఖశాఖాస్తటద్రుమాః
చన్ద్రబిమ్బఫలాః కల్పవృక్షా ఇవ విభాన్త్యమీ. 6

రత్నపుష్పభరాపూర్ణరక్తపల్లవపాణయః
భవన్తం పూజయన్తీవ లతాదారాన్వితా ద్రుమాః 7

ప్రోతోర్మిమకరగ్రాసైర్దృషద్దన్తైర్గుహాముఖైః
ఋక్షవానృక్షవద్భూభృద్ధత్తే ఘురఘురారవమ్. 8

సహచరులలో నొకడు:— దేవా! మధ్యదేశాదులందలి పర్వతోపరి భూములకంటెను అధిక శిలాచయమగు ప్రదేశమును బొందిన యీ పర్వతముయొక్క యత్యున్నతమైనదియు, అధిక ...యుక్తమైనదియు, దేవ గంధర్వాదులకు విహారభూతమైనదియునగు శిఖరభాగమును వీక్షింపుఁడు! పున్నాగ, బకుల, నారికేళాది వృక్షములచేఁ బూర్ణములై వెలిగ్రక్కుచున్న యనేక సుగంధవాయువులతోఁ గూడిన యీ వనసమూహముల గాంచుడు! ఈ పర్వతభూమినిన్ని, పర్వతములపై శోభించు శిలాసమూహములను, క్రిందనుండి పైవఱకు ఫల, పుష్ప, పల్లవాదులచేఁ బూర్ణములైనట్టి వన పంక్తులను, సముద్ర తరంగములను కొడవళ్లెట్లు ఛేదించుచున్నవో చూడుడు! వాయువుచేఁ గంపితములగు వృక్ష లతాదులను భుజములచే భావమును దెల్పుచు నృత్యము సల్పుచున్నవియు, స్వేదబిందువులవంటి జలకణములతోఁ గూడియున్నవియునగు పర్వతములపై విశ్రమించు మేఘసమూహమును, విసనకఱ్ఱచే బాలుఁడు గృహమందలి ధూమపంక్తి నెగురగొట్టునట్లు, సముద్ర మెట్లెగురఁగొట్టుచున్నదో గాంచుఁడు! పూర్ణిమనాటి చంద్రోదయసమయమున ప్రవర్ధమానమగు సముద్రముయొక్క ప్రవాహములచే గ్రుచ్చఁబడిన శంఖములుగల శాఖలతోఁగూడినవియు, చంద్రబింబములవలె అమృత రసపూర్ణములును నిర్మలములునగు ఫలములు గలవియునగు ఈ తీరమందలి వృక్షములు కల్పతరువులవలె శోభించుచున్నవి చూడుఁడు! లతలను స్త్రీలతోఁగూడి, రత్నములవంటి పుష్పములచేఁ బూర్ణములై రక్త పల్లవములను హస్తములు గల్గిన యీ వృక్షములు తమగృహమున కేతెంచిన అతిథులగు తమ్ములఁ బూజించుచున్నట్లున్నవి. తరంగములచే వ్యాప్తములైన మొసళ్లను భక్షించునట్టి తెల్లని శిలలను దంతములతోను (గుహలను) ముఖములతోను గూడినవై యీ ఋక్షవంతమను పర్వతము భల్లూకమువలె ఘురఘురశబ్దము గావించుచున్నది. వీక్షింపుఁడు!

మహేన్ద్రో మన్ద్రగర్జాభిరభిక్షిపతి గర్జతః
పర్జన్యానూర్జితో జన్యః ప్రతిజన్యాన్యథా జడైః. 9

చన్దనారూషితః శ్రీమాఞ్జేతుం జలధివేల్లనాః
సముద్యత ఇవోచ్చైఽసౌ మల్లో మలయపర్వతః. 10

సర్వతః కచితోఽజస్రం రత్నవీచిభిరమ్బుధిః
భూరత్నవలయభ్రాన్త్యా ప్రేక్ష్యతే సూర్యమార్గగైః. 11

సరన్తి రత్నమూర్ధానశ్చలకానిలపాయినః
వానపూరాః పర్వతకాః సర్పా ఇవ నతోన్నతైః. 12

భ్రమన్తో వీచిశృఙ్గేషు మకరేభాః కరోత్కటైః
హరన్తి సీకరామ్భోదా మేఘానుద్రావితా ఇవ. 13
~~~~~~~~~

ఆవర్తవలితాకారః సీకరోత్కరకీర్ణదిక్
పూర్ణత్వాత్తు శిరోశక్తో (మియతేఒత్యుత్కరః కరీ. 14
వివిధప్రాణిసంపూర్ణాః సజలాద్రినతోన్నతాః
యథైవామ్భోధయః సర్వాస్తథైవ ద్వీపభూమయః. 15

ఓ రాజా! యుద్ధకుశలుడగు వీరుఁడు కటువాక్యములచేఁ దన శత్రువుల నదలించి పడఁగొట్టునట్లు, ఈ మహేంద్రమను పర్వతముపైన గర్జించుచున్న మేఘములను గంభీర గర్జనల తోటి క్రిందకుఁ బడద్రోయుచున్నది. చూడుఁడు! చందనవృక్షములచేఁ బరివేష్టితమై, అతి శోభాయుక్తమై మిగుల యున్నతమైనట్టి యీ మలయపర్వతమను శూరుఁడు ప్రతిపక్షియగు సముద్రముయొక్క ప్రవాహములను భుజములయొక్క వేష్టనములను జయింప యత్నించుచున్నట్లున్నది. యవలోకింపుఁడు! అంతటను రత్నమయములగు తరంగములచే శోభించు ఈ సముద్రము సూర్యమార్గముననున్న ఆకాశచారులచే పృథివియొక్క రత్నజటితమగు కడియమునుగూర్చిన భ్రమతోటి నిరంతరము చూడఁబడుచున్నది. రత్నములవంటి పుష్పములను శిరస్సుపై ధరించినవియు, వనసమూహములచేఁ బూర్ణములైనవియు నగు చిన్నచిన్న పర్వతములు, వాయువుచే నందలి వనములు చలింప, సర్పములవలె నిటునటుఁ జలించుచున్నట్లు తోఁచుచున్నవి. తరంగములను శిఖరములందు సంచరించు సముద్రమందలి మొసళ్ళును అరణ్యమందలి యేనుఁగులును, ఆ తరంగములయొక్క ప్రవేశ నిర్గమనములందుఁ దమ ప్రచండ హస్తములచేతను, తెఱచిన ముఖములచేతను బరస్పరము గ్రహింప నెంచుచున్నట్లున్నవి. సంచరించు మేఘములచేఁ ద్రోయఁబడినట్టి వర్షించు మేఘములవలె దర్శకుల చిత్తమును హరించుచున్నవి. చూడుఁడు! అందొక యేనుగ అగాధజలమందలి యావర్తమునఁబడి తిరుగుచు నన్నివైపుల జలముచే జుట్టఁబడినదై శిరస్సు పైకెత్తఁజాలక తొండమునెత్తి మరణించుచున్నది. గాంచుడు! అనేకవిధములగు ప్రాణులచేఁ బరిపూర్ణములై, జలయుక్తములై, పర్వతములచే నిమ్నోన్నతములుగ నున్నవై యీ సముద్రములు ద్వీపభూము లన్నింటివలెనే వర్తించుచున్నవి. అవలోకింపుఁడు!

ఆవర్తానాత్మనోఒనన్యానన్యానివ భాస్వరాన్
గృహ్యమాణానసద్రూపాన్దృశ్యపానానపి స్ఫుటాన్. 16
తరఙ్గతరలానన్తర్జడానప్యమ్బుధిశ్చలాన్
ధత్తే బ్రహ్మజగన్తీవ సాన్తానప్యనన్తవర్జితాన్. 17
యానన్తరిన్ద్రవద్భానుమణీన్తత్తేఒమ్బుధిర్వహాన్
మన్థాపహృతసర్వస్వో దేవేభ్యః పరిరక్షితాన్. 18
దృశ్యమానాన్మహాతేజస్తథా పాతాలతోఒప్యలమ్
ప్రతిబిమ్బవిభఙ్గ్యాన్తరసత్యానివ గోపితాన్. 19
తేషాం మధ్యాదేకమేకం ప్రత్యహం పశ్చిమార్ణవే
నిక్షేపాయ క్షిపతి యంతేన మన్యే దినం భవేత్. 20
నానాదిగ్దేశపయసామబ్ధౌ సాధుసమాగమః
యా[illegible] కలకలాన్వితః. 21

జలేచరావరా నూనం సాగరార్ణవసఙ్గమే
అన్యోన్యవేల్లనాద్యుద్ధం న కదాచన శామ్యతి. 22
శామ్యత్తిమితరఙ్గాగ్రగనర్తనావర్తవిభ్రమమ్
వలయన్వాయురాయాతి వాన్తసీకరమౌక్తికైః. 23
సరిన్ముక్తాలతామధ్యమధ్యస్థాబ్దమణీశ్వరాః
దీర్ఘాః ఖణఖణాయన్తే చఞ్చలాః సర్వతోఒమ్బుధేః. 24
మహేన్ద్రాద్రేర్గుహాగేహపరావృత్తార్ణవాధ్వనామ్
ఖాంకారిణ్యో భువః సిద్ధసాధ్యానాం సుసుఖావహాః. 25

తనకంటె వేఱుగాలేకున్నను వేఱుగానున్నవివలె, నొప్పునవియు అసద్రూపములైనను గ్రహింపఁబడుచు, ప్రత్యక్షముగఁ గానుపించునవియు, జడములైనను తరంగములవలెఁ జంచలములున్ను అంతముగలవైనను అనంతములుగఁ జూపట్టునవియునగు ఆవర్తములను, బ్రహ్మము అనేక జగంబులను ధరించునట్లు, ఈ సముద్రము ధరించుచున్నది చూడుడు! దేవతలు, అసురులు తన్ను మధించు సమయమున సర్వస్వ మపహరింపఁబడినదైనను, ఈ సముద్రము దేవతలచే దాచిపెట్టఁబడిన యనేక సూర్యకాంతాది మణులను, ఇంద్రుఁడసురులకుఁ దెలియక తనయందనేక మణులను ధరించుచున్నట్లు ధరించుచున్నది గాంచుడు! మహాతేజోవంతములును కనుకనే అగాధజలము క్రిందనుండియుఁ బాగుగఁ గానుపించుచున్నవియు నగు మణులను ఈ సముద్రము ప్రతిబింబముయొక్క విభంగముచే లేనివిగఁ దోపింపఁజేసి తనయందు ధరించుచున్నది. ఆ మణుల మధ్యనుండి ప్రతిదినమయ్యది ఏయొకమణిని పశ్చిమసముద్రమందుఁ బడఁద్రోయుటకై యాకసమున విసరివేయుచున్నదో, దానిచేతనే దివసమేర్పడుచున్నదని తలంచెదను. యాత్రయందనేక జనులు పరస్పరము కూడునట్లు వివిధదేశములందలి జలము లీసముద్రమునందుఁ గలకల శబ్దముతోటి లెస్సగఁ గలియుచున్నవి. యుద్ధోత్సాహులలో జలచరులే నిక్కముగ నందఱికంటెను శ్రేష్ఠములై యున్నవి. ఏలయనఁగా, పూర్వపశ్చిమ సముద్రములయొక్క సమాగమమున వాని పరస్పర మల్లయుద్ధమెన్నటికిని శమింపకయేయున్నది. అలసినట్టి తిమియను పేరుగల మత్స్యములకు తరంగాగ్రములందలి నృత్యమున నే యావర్తములఁగూర్చిన భ్రమ గల్గియున్నదో, అద్దానిని వెలిగ్రక్కిన జలబిందువులను ముత్యాల పారితోషికముచేఁ బరివేష్టించుచుఁ బ్రభువువలె వాయువెల్లితెంచుచున్నదో చూడుడు! మఱియు ఓ దేవా! నదులను ముత్యముల తీగెలందు మధ్యమధ్య నున్నట్టి మేఘములను శ్రేష్ఠమణు లెవ్విగలవో, అయ్యవి సముద్రముయొక్క కంఠమున నంతటను దీర్ఘముగ వ్రేలాడుచు, పరస్పర అభిఘాతములచే ఖణఖణమను శబ్దమును గావించుచున్నవి. వీక్షింపుఁడు! ఓ రాజా! మహేంద్రపర్వతముయొక్క ఖాంకారశబ్దముచేఁ బూర్ణమగు భూమిని బొంది, అరుచిచే నటనుండి మరలి తత్పర్వతగుహలను గృహములందు రతికొఱకై చనునట్టి సముద్రమార్గాపలంబులగు సిద్ధులకును సాధ్యులకును రతిశ్రమను బోగొట్టునదగుటచే, ఈ వాయువు సుఖావహమై చెన్నొందుచున్నది.

మన్దరః కన్దరోద్గీర్ణైః ప్రసరైర్మాతరిశ్వనః
కమ్పాకులవనాభోగః పుష్పమేఘాంస్తతోతి ఖే. 26
చూతనీప కదమ్బాఢ్య గన్ధమాదనకన్దరాన్

విశన్తి మేఘహరిణాస్తడిత్తరలలోచనాః. 27
హిమవత్కన్దరోద్గీర్ణా వల్లీవలయతాణ్డవమ్.
తన్వానా వాయవో యాన్తి విభిన్నాబ్ధాబ్ధివీచయః. 28
తాత చూతకదమ్బాగ్రపరామర్శసుగన్ధయః
వలయన్త్యబ్ధికల్లోలాన్గన్ధమాదనవాయవః. 29
జలదాన్వలయన్వాయురలకాలకతాం గతాన్
ఇత ఆయాతి పుష్పాభం రచయన్వనవీథిషు. 30
కున్దమన్దారసందోహమధురామోదమన్థరాన్
తుషారసీకరోన్మిశ్రానివ్యాత కలయానిలాన్. 31
నాలికేరలతాలాస్య లబ్ధతిక్త సుగన్ధయః
పతన్తి పవనాః పశ్య పారశీకపురీః పురా. 32

సహచరులలో మఱియొకడు;– దేవా! వాయువుచేఁ గంపితములగు వనములచే వ్యాప్తమైనట్టి యీ మందరపర్వతము తన గుహలనుండి వెలువడిన వాయువుయొక్క ప్రవాహములచే నాకసమున మేఘములను బుష్పయుక్తములుగా నొనర్చుచున్నది గాంచుఁడు? ఆమ్ర, నీప (కడిమి) కదంబాది వృక్షములచే, బూర్ణమైనట్టి గంధమాదన పర్వతముయొక్క గుహలందు మెఱపులను జంచల నేత్రముల ధరించిన మేఘములను లేళ్లు ప్రవేశించుచున్నవి చూడుఁడు! హిమవత్పర్వత గుహలనుండి వెలువడినవియు, మేఘములను సముద్రతరంగములను విభిన్నమొనర్చునవియునగు వాయువులు వలయాకారముగనున్న లతలయొక్క నృత్యమును విస్తరింపఁజేయుచు వీచుచున్నవి యవలోకింపుఁడు! దేవా; ఆమ్ర, కదంబాది వృక్షములయొక్క పుష్పముల సుగంధములచేఁ బూర్ణములగు ఈ గంధమాదన పర్వత వాయువులు సముద్రతరంగములను బరివేష్టించుచున్నవి! కుబేరుని పట్టణమగు అలకాపురియొక్క కేశములవలెఁ జెన్నొందుచున్న మేఘములను జుట్టుచు వనమార్గములందు మేఘములను బుష్పయుక్తములుగా నొనర్చుచు ఈ వాయువు ఈ వైపునకే యేతెంచుచున్నది చూడుఁడు! కుంద (మొల్ల) మందార పుష్ప సమూహముయొక్క మధుర సుగంధముచే) బరిపూర్ణములైనవియు, మందగతిగలవియు, హిమకణ సంయుక్తములునగు ఈ వాయువుల నీ గంధమాదన పర్వతముపైఁ దామనుభవింపుఁడు! నారికేళ వృక్షములయొక్కయు, మల్లికాది లతలయొక్కయు నృత్యముచేఁ గ్రమముగ లభించినవాని మద్య గంధ, సుగంధములతోఁగూడినవై యీ వాయువులు పారసీకపురము వైపునకు జనుచున్నవి, యెదుటఁ గాంచుఁడు!

ధున్వానాః పుష్పితేశానవనకర్పూరవారిదాన్
చాలయన్తోఽనిలా వాన్తి కైలాసకమలాకరాన్. 33
కరీన్ద్ర కుమ్భనిశ్చ్యాన్తమదమన్థరమూర్తయః
ఇమే శుకశుకాయన్తే విన్ధ్యకన్దరవాయవః. 34
శబరీణాం శరీరేషు శీర్ణపర్ణోత్కరే గిరౌ
నాగాశ్చైః [illegible]సీన గరాయతే. 35

అబ్ధ్యద్రిసరిదమ్భోదవనలేఖాఙ్గికా దిశః
త్వత్ప్రతాపబలైరేతా హసన్తీవార్కరశ్మిభిః. 36

ఓ రాజా! ఈశ్వరునియొక్క ప్రమదవనమునందలి కదళీ, కర్పూరాదులచే సుగంధితములైనట్టి మేఘములను, కైలాసపర్వతముపైఁగల కమలసమూహములను, గంపింపఁజేయునట్టి వాయువులు వీచుచున్నవి చూడుఁడు! గజేంద్రముల కుంభస్థలములనుండి వెలువడిన మదజలముచేఁ బూర్ణములైన యాకృతులు గలవై యీ వింధ్యపర్వతగుహలందలి వాయువులు చిలుకలవలె అవ్యక్త ధ్వని గావించుచు వీచుచున్నవి. శబరస్త్రీల (బోయతల) దేహములందలి వస్త్రములకొఱకై పడిన శిథిలపత్రసమూహముతోగూడిన యీ మలయపర్వతముపైఁగల వనపంక్తి పత్రముల ధరించిన శబరులతోడను, వారి యినుపబాణములతోడను, పశుపక్ష్యాదులతోడను గూడినదై నగరమువలె భాసించుచున్నది. సముద్ర, పర్వత, నదీ, మేఘ, వనాదులను అవయవముల ధరించిన యీ దిశలన్నియు తమప్రతాప, బలములను సూర్యకిరణములతోటి నవ్వుచున్నట్లున్నవి.

అత్రోపశైలవనవీథిషు పుష్పశయ్యా
విద్యాధరీవిరచితాః పరివర్ణయన్తి
పార్శ్వద్వయస్థపరివృత్తపదాత్పముద్రా
ద్వ్యావృత్తముగ్ధవనితాపురుషాయితాని. 37

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే దిగ్దర్శనం నామ చతుర్దశాధికశతతమః సర్గః ॥ 114 ॥

దేవా! ఈ ప్రదేశమున పర్వత, వన మార్గములందు రతికొఱకై విద్యాధరులచే రచింపఁబడిన పుష్పశయ్యలు - సముద్రతీరమునుండి లాక్షారంజితములైన పాదములయొక్క చిహ్నములచే, పురుషుఁడు రతియందు శ్రమనొంద ముగ్ధవనిత అధోదేశమునుండి యూర్ధ్వదేశమున కేతెంచి పురుషాయిత క్రీడ గావించెనని సూచించుచున్నవి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అవి ॥ విప ॥ దిగ్దర్శనమను నూట పదునాల్గవ సర్గము ॥ 114 ॥

పఞ్చదశాధిక శతతమః సర్గః

[వర్ణ్యన్తేఽత్ర చతుర్దిక్షు వనాని గిరయో నగాః
నద్యః సముద్రాః పవన పక్షిగ్రామఘనాదయః.

నలుదిక్కులందలి వన, పర్వత, వృక్ష, నదీ, సముద్ర, వాయు, పక్షి, గ్రామ, మేఘాదు[illegible] వర్ణింపఁబడుచున్నవి.]

పార్శ్వగా ఊచుః—

అత్రోత్తమాశయలతావలయాలయేషు
లీలావిలోలలలనాః కలయన్తి గీతమ్
ఉద్దామభావరస విస్మృతవాసరేహా
విశ్రమ్య కిన్నరగణాః కలకాకలీకమ్. 1

ఏతే హిమాద్రి మలయాచల విన్ధ్యసహ్య
క్రౌఞ్చమహేన్ద్రమధుమన్దరదర్దురాద్యాః
దూరస్థితా దృశి సితాభ్రపటా వహన్తి
సంశుష్కపర్ణలవలాఞ్ఛితలోష్ఠలీలామ్. 2

అమీ దూరాలోకవ్యవహితమహావర్త్మనిచయాః
పురః ప్రాకారాణాం కులశిఖరిణో బిభ్రతి వపుః
విశన్తీరమ్భోధిం కలయ లులితా భాన్తి సరితః
పటస్యాన్తః సక్తాః ప్రతనుసితసూత్రా ఇవ దశాః. 3

ప్రక్కనున్నవారు:— మహాశయా! ఈ పర్వతముయొక్క లతాకుంజములందు లీలలందాసక్తలగు వనితలతోఁగూడిన కిన్నరులు సంచారి భావములచేతను, శృంగారాది రసములచేతను దిన క్రియలను మఱచి విశ్రమించినవారై మధురగీతములను బాడుచున్నారు. ఈ హిమాలయ, మలయ, వింధ్య, సహ్య, క్రౌంచ, మహేంద్ర, మధు, మందర, దర్దురాది పర్వతములు దూరమున నుండుటచేతను, తెల్లని మేఘములను వస్త్రములను ధరించియుండుటచేతను జూచువానికి శుష్క పత్రములచేఁ గప్పఁబడిన చిన్నశిలలవలెఁ గానుపించుచున్నవి చూడుఁడు! ఈ కుల పర్వతములతిదూరమున నున్నవై, వేలుగనున్న గొప్ప అంతరాళప్రదేశమార్గ సమూహముగలవై, పరస్పరము సంలగ్నములైయుండుటఁబట్టి నగరప్రాకారములవలెఁ గన్పట్టుచున్నవి. సముద్రమును బ్రవేశించుచు శీఘ్రత్వముచే నిటునటుఁ జలించునట్టి యీనదులు వస్త్రమందలి సన్నని దారములవలె నొప్పుచున్నవి.

దశాశాః శైలానాముపరి పరితః ప్రావృతఘనా
ఘనశ్యామాకారాః ఖగకలకలాలాపలపితాః
లతాముక్తైః పుష్పైర్గలిత వనలేఖాభుజలతా
హసన్త్యస్తే రాజన్నృవనవనితా భాన్తి పురతః. 4

తాలీతమాలబకులాకులతుఙ్గశృఙ్గ
మేకీకృతాకృతి వనం తరలం విభాతి
అబ్ధ్యాహతం జలనిధేస్తరలైస్తరఙ్గై
స్తీరాన్తలగ్నఘనశైవలజాలకల్పమ్. 5

ఇతః స్వపితి కేశవః కులమితస్తదీయద్విషా
మితోఽపి శరణార్థినః శిఖరి పక్షిణః శేరతే
ఇతోఽపి వడవానలః సహ సమస్తసంవర్తకై
రహోవితతమూర్జితం భరసహం చ సిన్ధోర్వపుః. 6

ఓ రాజా! పర్వతములపై నంతట నావరించియున్నట్టి మేఘములవలె ఘనశ్యామవర్ణయుక్తములై, పక్షుల మధురధ్వనులచే శబ్దసహితములై, లతలచే విడువబడిన పుష్పములతోఁ గూడినవై, శోభాయమానములగు వనసమూహములను భుజలతలు గలవైనట్టి యీ దశదిక్కులున్ను తమ యంతఃపురరాణులనుగూర్చి నవ్వుచున్నట్లున్నవి. తాళ, తమాల, బకులాది వృక్షములచే వ్యాప్తములైనట్టి యెత్తైన పర్వతశిఖరములు గలదియు, దూరమునుండి శిఖరములవలె భాసించు పర్వతములతోటి యేకాకారము నొందియున్నదియు, వాయువుచేఁ జంచలమైనదియునగు ఈ వనము, సముద్రముయొక్క చంచలతరంగములచేఁ గొట్టఁబడు తీరమందలి దట్టమైననాచువలెఁ గన్పట్టుచున్నది చూడుఁడు! ఆహా! ఈ సముద్రమున కెంత విశాలమై, బలవత్తరమై, భారసహిష్ణువైనట్టి శరీరముగలదో వీక్షింపుఁడు! ఒకవైపు విష్ణుభగవానుఁడు శయనించుచున్నాడు; మఱియొకవైపు విష్ణుద్వేషులగు అసురుల సమూహము వర్తించుచున్నది; వేఱొకవైపు శరణార్థులగు పర్వతములను పక్షులు శయనించుచున్నవి! ఇంకొకవైపు ప్రళయకాల పుష్కరావర్తక మేఘములతోఁబాటు బడబాగ్ని విరాజమానమైయున్నది!

ఏతేజమ్బునదీతటా రవికరై రాభాన్తిహేమాఖిల
గ్రామారణ్య పురస్థలీగిరితరుస్థాణ్వగ్రహారోచ్చయాః
జ్వాలాలీవలితామ్బరాన్తరవిహోముఞ్చన్తి భాసోఖిత
స్వర్వాభూమివ భూరిహైవమమరాసేవ్యాస్తి నో మానుషైః. 7

ఏతే కదమ్బవనకమ్బలమమ్బుదాభ
మాభాన్తి భాస్కర పథానుగతా వహన్తః
అస్యాచలస్య వసుధేవ తటం తవాస్తు
మా సూర్య రోధకనభస్థఘనౌఘశఙ్కా. 8

(ఉత్తరదిక్కునుబొందిన విపశ్చిద్రాజుతోటి యొకఁడిట్లనుచున్నాఁడు.) ఓ రాజా! సువర్ణమయములైనట్టి సమస్త గ్రామాదులతోఁగూడిన యీ (మేరుపర్వత తలముననున్న) జంబునది యొక్క తీరములు సూర్యకిరణములచే వ్యాప్తములైయంతటను భాసిల్లుచున్నవి. మఱియు సువర్ణ జ్వాలా సమూహములచే వేష్టితమైన యాకాశమును ముద్దిడుచు నలువైపుల ప్రకాశమును వెదచల్లుచున్నవి. అట్టి శోభతోఁగూడిన యీ ప్రదేశమంతయు దేవతలకే యుపభోగింప యోగ్యమైనది గాని మనుష్యులకుఁ గాదు. మేఘములను బోలినట్టి కదంబవనమను కంబళిని ధరించుచు సూర్యమార్గగామియగు ఈ (మేరు)పర్వతోపరిభాగ మెట్లు భాసిల్లుచున్నదో చూడుఁడు. కావున, తమపృథివియే యీ తటమను బుద్ధి కలుగుగాక, మఱియు యీ ప్రదేశములు సూర్యునిగతిని నిరోధించు ఆకాశమందలి మేఘసమూహమను బుద్ధి లేకుండుగాక.

ఏషోఽసౌ మలయో లయాగ్రలవలీవల్లీలసచ్చన్దన
స్ఫీతామోదమదార్ద్రసేవ తరవో వక్త్రే క్రియన్తే త్రిభిః
సజ్వాలోద్వహనాక్షసంస్థితకపోలోష్మోదయోత్తార్ణవే
అఙ్గుష్ఠాఙ్గులిభిర్యథోష్ణకకణాస్తప్తా యథా యోషితామ్. 9

ఏషోబ్ధిధౌతకలధౌతతటాధిరూఢ
భోగీన్ద్రభోగపరివేష్టితచన్దనోఽగః
విద్యాధరీవదనపఙ్కజదీప్తిపుఞ్జ
హేమీకృతాఖిలశిలో మలయాభిధానః. 10

(దక్షిణదిక్కును బొందిన విపశ్చిత్తుతోటి యొకఁడిట్లు వచించుచున్నాఁడు.) ఓ రాజా! ఈ మలయపర్వత మెంతప్రభావశాలియనఁగా ఇద్దానిపైగల శ్రేష్ఠలతలచే శోభితములగు చందన వృక్షములయొక్క శుద్ధసుగంధరసముచే చందనభూతములైన యితర వృక్షములున్ను దేవ, మనుష్య, అసురుల ముఫ్వురియొక్కయు ముఖకమలములపై తుమ్మెదలవలె తిలకముగఁ గావింపఁబడు చున్నవి. మఱియు జ్వాలాసహితమగు అగ్నిని మూఁడవనేత్రమున ధరించి చెక్కిళ్ళపై ఉష్ణత్వము యొక్క యుదయముతోఁగూడిన, అంగుళీగ్రహణ పూర్వకమగు యుత్కృష్టమైన నృత్యము సల్పునపుడు జనించు ఉష్ణస్వేదబిందువుల నియ్యది తనసుగంధయుక్తములగు శీతలవాయువులచే, స్త్రీల రతిశ్రమజనితములగు స్వేదబిందువులనువలె, శీతలములుగ నొనర్చివైచుచున్నది. సముద్ర తరంగములచే ప్రక్షాళితములగు సువర్ణమయతటములపై నావిర్భూతములగు సర్పములచేఁ బరివేష్టితములైన చందన వృక్షములుగలదియు, విద్యాధర స్త్రీల ముఖకమలముల ప్రకాశములచే నితర శిలలన్నింటినిగూడ సువర్ణమయములుగ గావించునదియునగు ఈ యెదుటనున్న మలయమను బేరుగల పర్వతము లక్ష్మికి నివాసస్థానమై యొప్పుచున్నది.

కూజత్కఙ్కకఠోరగహ్వరనదీక్వత్కారవత్కీచక
స్తమ్భాడమ్బరమూకమౌకులికులః క్రౌఞ్చాచలోఽయంగిరిః
ఏతస్మిన్ప్రబలాకినాం ప్రచలతాముద్వేజితాః కూజితై
రుద్వేల్లన్తి పురాణరోహణతరుస్తమ్భేషు కుమ్భీనసాః. 11

కోమలకనకలతాలయ విలసితలలనావిలోలవలయకృతమ్
శ్రవణరసాయనపానం వితతమిహాకర్ణయాస్య ట టే. 12

కరికరటగలితమదజల వలితశ్చలవీచిచఞ్చరీకచయైః
చర్వితఏష కదర్థిత ఇవ కణనికరో విరౌతి వారినిధౌ. 13

పశ్యామవేన్దురామృత నవనీతశరీరసున్దరీవలితః
పితురుత్సఙ్గే కురితే జలలీలాం క్షీరవారి.ధౌ. 14

నృత్యన్తి మత్తకలకోకిలకాకలీకాః
పశ్యామలే మలయసానునిబాలవల్ల్యః
లోలాలిజాలనయనారుణపత్రపాణి
పుష్పామధూత్సవవిలాసవిశేషవత్యః. 15

ఓ రాజా! ఇయ్యది, ధ్వనియుక్తములైన పొదలయొక్కయు, శిలాప్రదేశాదులుగల యరణ్యములయొక్కయు, నదులయొక్కయు శబ్దమువంటి శబ్దముతోఁగూడిన వేణు (వెదురు) స్తంభములయొక్క గీతమును విననాసక్తిచే నిశ్శబ్దముగనున్న తుమ్మెదల సమూహము గల్గియున్న క్రౌంచమను బేరుగల పర్వతము. ఇట, ఎగురుచుండు కొంగలతోఁ గూడిన నీలమేఘములు ప్రియములైయున్న నెమళ్ళయొక్క యఱపులచే భీతిల్లినసర్పములు శిథిలవృక్షములయొక్క తొఱ్ఱలందుఁ ప్రవేశించిదాగుకొనుచున్నవి. ఓ రాజా! ఇచట ఈ క్రౌంచ పర్వతమున కోమలములగు సువర్ణ లతలచే రచింపఁబడిన కుంజములందుఁ దమ తమ ప్రియుల తోటి విలాస మొనర్చు స్త్రీల యొక్క రతిచే చంచలములైనట్టి కడియముల యొక్క, రాగి జనుల చెవుల కమృత పానమువలెఁ బ్రియమైనట్టి శబ్దమును వినుఁడు! ఏనుఁగుల గండస్థలములనుండి జాఱిన మదజలముచే మిశ్రితమైన కారణమువలన, చంచలతరంగములందు, భ్రమరములచే చర్వితములైన వానివలెను, తిరస్కరింపఁబడిన వాని చందమునను, ఈ జలకణసమూహము సముద్రమున నేడ్చుచున్నది చూడుఁడు! ఈ నిర్మల చంద్రుఁడు అమృతమథనముచే జనించిన నవనీతము (వెన్న) వంటి శరీరము గలవాడై, అట్టి శరీరమేగల్గియున్న నక్షత్రములను సుందర స్త్రీలతోఁగూడి క్షీరసముద్రమునఁ ప్రతిబింబించి తన తండ్రి (క్షీరసముద్రము)యొక్క యొడియందు జలక్రీడ గావించుచుండు ఈ కౌతుకమును వీక్షింపుఁడు? మధురభాషులగు కోకిలలయొక్క మధురగీతములతోఁ గూడినవై, చంచల భ్రమరణములను నేత్రముల ధరించి ఎఱ్ఱని యాకులను హస్తములందుఁ బుష్పముల నిడుకొని వసంతకాలోత్సవ విలాసములతోటి విశేషసౌందర్యమును వహించిన యీ బాలలతలను సుందరులు ఈ నిర్మలమలయ పర్వతశిఖరముపై నృత్యమొనర్చుచున్నారు గాంచుఁడు!

వంశానాం హృది పర్వతేషు జలధౌ తోయార్థినీనాం తు యే
శుక్తీనాం హృదయే విశన్తి సమయే వర్షాంభసాం బిన్దవః
తే ముక్తాఫలతాం వ్రజన్తి కరిణాం కుమ్భేషు వాన్యద్భవేత్
శుద్ధా మౌక్తికవత్స్వరుత్తమగుణా ఏతాస్త్రిధా జాతయః. 16

ఓ రాజా! ఒకజాతిముత్యములు పర్వతములపై వెదుళ్లరంధ్రములందుండును. మఱియొకజాతివి, సముద్రమున జలార్థులగు ముత్తెపుచిప్పలందు వర్షబిందువులు ప్రవేశించుటచే నుద్భవమగును. ఇంకొక జాతివి గంధగజములయొక్క గండస్థలమున నుండును. ఈ మూడు విధములగు ముత్తెముల జాతులున్ను ఉత్తమములైనవి. అందాయాస్థానములయొక్క శుద్ధత్వ, శ్రేష్ఠత్వములచే నయ్యవి యుత్తమగుణయుక్తములై చెన్నొందును.

శైలేఽబ్ధౌ పురుషేఽవనౌ జలధరే భేకే శిలాయాం గజే
నానాకారధరా భవన్తి మణయః కర్మాణి తేషాం విభో
హ్లాదోచ్చాటనమారణజ్వరభయభ్రాన్తిప్రకాశాన్ధతా
ఖేదోత్తాపనభూనభోగతిదృశో నాశో విధానం తథా. 17

ఆ విధముగనే ప్రభూ! పర్వత, సముద్ర, మనుష్య, వన, మేఘ, మండూక, శిలా, గజేంద్రములందును ననేకప్రకారములగు మణులుండును. వాని క్రియలెవ్వియనఁగా తాపశాంతి, శత్రువుల యుచ్చాటనము. (పారద్రోలుట) మారణము, జ్వరము, భయము, భ్రాంతి, అంధత్వము,

ఖేదము, ఉత్తాపనము, (మణిగలవానికి గలుగఁజేయు) మఱుఁగుననున్న పదార్థములయొక్క జ్ఞానము, భూమిపై శీఘ్రగమనము, ఆకాశగమనము, భూతభవిష్యద్దర్శనము, వ్యాధిదుర్భిక్షాదుల నాశము, ఇతరులచే బ్రయోగింపఁబడిన మంత్ర, యంత్ర, కృత్యాదులయొక్క ప్రతివిధానము.

వాతాయనోదరగవాక్షకవాటకక్ష-
ద్వారాననైరిహపురాణ్యుదితే పతన్తి
శ్వభ్రాభ్రకన్దరదరీవనవేణురన్ధ్రై
ర్వర్గేణ మన్దర ఇవాఽమృతసిన్ధుమిన్దుమ్. 18

పీతచ్ఛృఙ్గం హరతి పవనః కింస్విదిత్యున్ముఖీభి
ర్దృష్టోత్సాహశ్చకితచకితం ముగ్ధసిద్ధాఙ్గనాభిః
ప్రాలేయాద్రేః ప్రతితటవనం ప్రోత్పతత్యభ్రమూర్ధ్వం
వజ్రస్తమ్భోగగనసుతలోత్తోలనాయైవ భూమేః. 19

గఙ్గాతరఙ్గహిమసీకరశీతలాని
విద్యాధరాధ్యుషితచారుశిలాతలాని
పుష్పాభ్రసంవలితపుష్పితకాననాని
రాజన్విలోకయ మహేన్ద్రగిరేస్తటాని. 20

ఓ రాజా! ఈ ప్రదేశమునఁ జంద్రుఁడుదయింప నగరముయొక్క వాతాయన (కిటికీలు) గృహద్వారాది ముఖములచే మందరపర్వతము గర్త, మేఘ, గుహా, వనవేణువులయొక్క రంధ్ర సమూహముచేవలె అమృతసముద్రరూపమగు యా చంద్రుని స్తుతించుచున్నది ఈ 'పర్వత'శిఖరమును వాయువెగురఁగొట్టుచున్నదా యేమి అను సంశయముచే నాశ్చర్యముతోఁగూడిన ముగ్ధలగు సిద్ధాంగనలచేఁ గాంచఁబడిన, హిమవత్పర్వతతటముల నుండి పైకెగసిన యీ మేఘము, ఆకాశ, పాతాళముల పరస్పర యాధిక్యత నెఱుఁగుటకై (తూచుటకై) భూమినుండి లేచిన (తోలన) వజ్రస్తంభమువలె నలరారుచున్నది చూడుడు! ఓ రాజా! గంగాతరంగములవలెను, హిమకణములవలెను శీతలములైనవియు; విద్యాధరులచే సేవింప బడునట్టి సుందర శిలాతలములుగలవియు, పుష్పమయములగు మేఘములచేఁ జుట్టఁబడిన పుష్పితవనములు గల్గియున్నవియునగు ఈ మహేంద్రపర్వతముయొక్క తటముల నవలోకింపుడు!

దేశాన్తరేషు వితతాని వనాన్తరాణి
పుష్పస్థలాన్యుపవనాన్యథపత్తనాని
తీర్థేషు పూతభువనాని జలాని దృష్ట్వా
దౌర్భాగ్యభీతిరపయాతి జవానువిద్ధా. 21

ఓ రాజా! దేశాంతరములందు విశాలవనములను పుష్పములచేఁ బరిపూర్ణమగు స్థానములను, ఉపవనములను, నగరములను, తీర్థములను పవిత్రస్థలములను, జలయుక్తములగు స్థానములను జూచుటచే దౌర్భాగ్యమునుగూర్చిన భీతి వేగముగ బరువిడుచున్నది. (శీఘ్రముగఁ దొలగుచున్నదని భావము)

శృఙ్గాణి పూరితదిగన్తరమణ్డలాని
శ్వభ్రాభ్రకన్దరనికుఞ్జకులాకులాని
వ్యోమోపమాన్యపి చ వారిధికుణ్డలాని
దృష్ట్వా గలన్తి కుకృతాని బృహన్తరాణి. 22

శ్రీశైలాది శిఖరములను, సాధుజనులచేఁ బరిపూర్ణమునగు దిఙ్మండలములను, పవిత్ర కూపాదులను, హిమాలయాది పర్వతములయొక్క మేఘయుక్తములగు గుహలను, పొదరిళ్లచేఁ బరిపూర్ణములగు చంపకారణ్యాదులను, ఆకాశమువలె నిర్మలములగు సముద్రములను, సేతుబంధము (రామేశ్వరము) మున్నగు తీర్థములను దర్శించుటవలన మనుజులయొక్క బ్రహ్మహత్యాది మహాపాతకములున్ను నశించుచున్నవి.

రమ్యాశ్చన్దనవీథయో హి మలయే విన్ధ్యే మదాన్ధాగజాః
కైలాసే నృప పాదజాతి కనకం చన్ద్రం మహేన్ద్రాచలే
దివ్యాశ్చౌషదయస్తుషారశిఖరే సర్వత్ర రత్నాని వై
సన్త్యన్ధాఖువదేష జీర్ణసదనే వ్యర్థం జనో జీర్యతే. 23

ఓ రాజా! మలయపర్వతములపై రమణీయములైన చందనవృక్ష నికుంజములతోఁ గూడిన మార్గములున్ను, వింధ్యపర్వతముపై మదాంధములగు గజములున్ను, కైలాసపర్వతముపై నుత్తమసువర్ణమున్ను, మహేంద్రపర్వతముపై 'చంద్ర'మను ధాతువున్ను, హిమాలయపర్వతముపై, దివ్యగుణయుక్తములగు ఓషధులున్ను, తదితర పర్వతములపై రత్నాదులున్ను గలవు. అయినను భాగ్యహీనుఁడగు మనుజుఁడు వానిని జూడగ అంధమూషికమువలె జీర్ణగృహమున వ్యర్థముగ శిథిలీభూతుఁడగుచున్నాఁడు.

సోన్నతం జగదివోరుతటాకం వారిణా వివలితం తిమిరేణ
ప్రస్ఫురన్తి చ యుగాన్త ఇవైతా విద్యుతః శఫరికా ఇవ లోలా. 24

సావశ్యాయాశ్యాననీహారధారా ధారోద్గారాన్వారిదాన్మాదయన్తః
శీతానీతోద్ధామరోమాఞ్చచర్చాః ప్రోద్యచ్ఛృఙ్గం వాన్త్యహో వర్షవాతాః. 25

హా వాతి నీలజలదప్రసరానుసారీ వాతః కిరన్విటపిపల్లవ పుష్పగుచ్ఛాన్
ధీరోత్కరద్రుమవనాన్తరచారచారురాసారసీకరకదమ్బకసారసారః. 26

మారుతాః సురతక్లాన్తకాన్తానిఃశ్వసితైరిమే
వహన్తి వృద్ధిం గన్ధం చ లవం సర్గాదివ చ్యుతాః. 27

కువలయకువలయ వికచన కుసుమలతావి దలనోద్యతా మృదవః
ఘనపట పాటనపటవో విధుతోపవనా వహన్త్యమీ పవనాః. 28

సంధ్యాభ్రలేశానుపయన్తి వాతా నభస్తలే కోమలకమ్పనేన
నృపాఙ్గణే పుష్పవిచిత్రలేఖా సువాసితే భృత్యవరా ఇవైతే. 29

క్వచిత్కుసుమగన్ధయః కమలవర్గగన్ధాః క్వచి
త్క్వచిత్కుసుమవర్షిణో లలితకేసరాసారిణః
క్వచిచ్చ హిమపాణ్డవో హరితపీతలశ్యామలా
వహన్తి శిఖరానిలాః సురతమన్దఘర్మచ్ఛిదః. 30

ఈ దిక్కులు మేఘమను అంధకారముచేఁ గప్పబడినవై యుగాంతమున స్వర్గలోకము వఱకు జలముచేఁ బరిపూర్ణమైయుండు జగత్తను మహాతటాకమువలెఁ జెన్నొందుచున్నవి. అట్టి యీ తటాకము (సరస్సు)నఁ జంచలములగు మెఱుపులు అల్పమత్స్యములవలె గోచరించుచున్నవి చూడుడు? ఆహా! హిమసహితములును, భూమ్యాదులందు సూక్ష్మములుగ నొనర్పఁబడు నీహార (మంచు)ధారలుగలవియు, జలధారలను వెలిగ్రక్కునవియునగు మేఘములను మదించినవిగఁ గావించుచు, శీతలస్పర్శచే జనులకు గొప్పరోమాంచమును గల్గజేయునట్టి వర్షవాయువులు మహాశబ్ద మొనరించుచు వీచుచున్నవి! అహా! నీలమేఘముయొక్క సంచారము ననుసరించునదియుఁ అంకుర వృక్షవనాదులందు చరించుటచే సౌగంధ్యాదిగుణయుక్తమైనదియు, జలకణములయొక్క సమూహ ములచే మహాసారవంతమైనదియు, ధీరత్వముతోఁగూడినదియునగు ఈ శీతలవాయువు వృక్షశాఖ లందలి పల్లవ పుష్పగుచ్ఛంబులను జెదరఁగొట్టుచు వీచుచున్నది! ఈ వాయువులు రతిచే శ్రమనొందిన దేవతాస్త్రీలయొక్క నిశ్శ్వాసములచే వృద్ధిఁబొందినవై, పూర్వపుణ్యవాసనాలవముచేవలె సుగంధముతోఁగూడి, స్వర్గమునుండి చ్యుతి నొందినవానిచందమున నొప్పుచు వీచుచున్నవి. మఱియు నియ్యవి భూమండలమందలి కమలములన్నిఁటిని వికసింపఁజేయునవియు, పుష్పలతాదు లను మర్దించునవియు (కావుననే సుగంధయుక్తములును), మందగమనయుక్తములును మేఘములను వస్త్రములను చించివైచుటయందు సమర్థములును, ఉపవనములను గంపింపఁజేయునవియునై వీచుచున్నవి. పుష్పములయొక్క విచిత్రములైన వరుసలచే సుగంధితమైన రాజగృహముయొక్క ముంగిటియందుఁ బుష్పములను గదిలించుచు భృత్యులు చనునట్లు, ఆకాశమున సంధ్యాకాల మేఘఖండములను మెల్లమెల్లగఁ జలింపఁజేయుచు ఈ వాయువులు చనుచున్నవి. ఓ రాజా! ఈ పర్వతశిఖరమందలి వాయువు లొకచోట నుత్తమములగు అనేక పుష్పములయొక్క సుగంధముచేఁ బూర్ణములైయు, ఒకచోట కమలసమూహములయొక్క సుగంధముతోఁగూడియు, ఒకచోట కోమలములైన కేసరములుగల పుష్పములను వర్షింపఁజేయుచును, ఒకచోట మంచుతోఁగూడి పాండురవర్ణముగల్గియు, ఒకచోట పర్వతధాతువులతోఁగూడి హరిత(ఆకుపచ్చ), పీత, శ్యామ వర్ణములచే నొప్పుచును, ఒకచోట రతిచే శ్రమనొందిన స్త్రీలయొక్క స్వేదబిందువులను దొలగించు చును వీచుచున్నవి.

క్వచిద్ఘుంకారకాంకారై రఙ్గారనికరాన్కరైః
కింకరైర్వికిరత్యర్కో మూర్ఖసంసర్గవానివ. 31

నరరసాయనతృప్తివిముక్తయా ప్రమదయా మదయాపితలజ్జయా
ఉపగతే వపుషా న విషహ్యతే విషవిమూర్చ్ఛనయేవ సమాయతా. 32

వలితతామరసా మృదుశీకరాః శశికరోత్కరవీచివిభేదినః
సదహనా ఇవ తాపమయాః పురో విరహిణీషు వనావనివాయవః. 33

ఇహ హి పూర్వపయోధితటావటే ఖికటవస్త్రతపటాః కటకితటాః

నవమదాసవయౌవనసంశ్రయాః కలయ యాన్తి కథం శబరస్త్రియః. 34

నవరసాసవసారనిశాగమ క్షయభయాతురచిత్తతయాఙ్గనా
త్యజతికాన్తమియం న మనాగపిద్రుతమితోవలితేవ పురోఽహిభిః. 35

ప్రభాతతూర్యముఖరైర్దివసైరివ తర్జితా
హృద్యేవ స్ఫుటితా నారీ నిలీనా దయితోరసి. 36

ఓ రాజా! ఒకచోట సూర్యభగవానుఁడు, కింకరులవలెఁ దనయాజ్ఞను బాలించు సూర్య కాంతమణులచే గుహాదులందు దహింపఁబడుచుండు ప్రాణుల హుంకారములచేతను, రోదనశబ్ద ములచేతను సూచితములగు అగ్నిసమూహములను, దుష్టసాంగత్యముచే దూషితుఁడైనవానినివలె, తనకిరణములచేఁ ద్రోయుచున్నాఁడు చూడుఁడు? పురుషుఁడను అమృతముచేఁ దృప్తినొందక, మదముచేలజ్జారహితయై యీ వనిత మరల పురుషుని యాలింగన మొనర్చుకొనినది. ఇపుడామె రతినివృత్తికొఱకైన వక్రోక్తిని విషమూర్ఛా ప్రయుక్తమగు స్వమరణమునువలె సహింపఁ జాల కున్నది. ఓ రాజా! కమలములయొక్క కోమలములైన జలకణములతోఁ గూడుకొనినవియు చంద్రకిరణసమూహమును, తరంగములను భేదించునవియునై యున్నప్పటికి, ఈ యెదుటనున్న మంద, శీతల వనవాయువులు విరహిణులకుఁ దాపమయములగు అగ్నులవలెనే కన్పట్టుచున్నవి. దేవా! ఈ పూర్వసముద్రతీరమను నిమ్నదేశమున విశాలపత్రములే వస్త్రములుగాఁగల్గి, గాజుకడియ ములచే నలంకరించుకొని, నూతనమదయుక్తమగు యౌవనము నాశ్రయించినట్టి యీ శబరస్త్రీలెట్లు విలాసపూర్వకముగఁ జనుచున్నారో చూడుఁడు! నూతనరత్యనురాగ మొసంగు మదసహిత సంభోగమున రాత్రియొక్క క్షయమునుగూర్చిన భయముచే నాతురచిత్తముతోటి యీ యంగన శీఘ్రముగ రాగయుక్తుఁడైన తనప్రియునియొకింతైనను ద్యజింపక ఇట నెదుట సర్పములచేఁ జుట్టఁ బడిన చందనలతవలెఁ గానుపించుచున్నది. ప్రాతఃకాల శంఖాదిరావములచే శబ్దసంయుక్తమగు దివసముచే నదలింపఁబడినదానివలె నిజహృదయముననే విదీర్ణయైన యీ వనిత తనప్రియుని వక్షస్థలముపై విలీనయైయున్నది. చూడుఁడు!

ప్రోత్ఫుల్లకింశుకైరేషా దక్షిణజలధేస్తటేఽత్ర వనరాజీ
జ్వలితేవ జలతరఙ్గైః పానః పునర్యేన సిచ్యతేఽమ్బుధినా. 37

అస్యా నిర్యాన్త్యనిలైర్ధూమా ఇవ కృష్ణకేసరామ్బుధరాః
అఙ్గారా ఇవ కుసుమా న్యపశాన్తాఙ్గారవచ్చ ఖగభృఙ్గాః. 38

ఉదృశ్యేవ విలోకయ వనరాజీ సత్యవహ్నినా జ్వలితా
గిరిశిరసి తూత్తరస్యాం దిశి దూరే ధూయతే చ ఖే పవనైః. 39

క్రౌఞ్చాచలస్య భువిమన్థరమేఘచక్ర
గమ్భీరతారరవనర్తితబర్హిణీయమ్
పశ్యోత్థితం తుములమాకులవర్ష వాత
వ్యాధూతపుష్పఫలపల్లవకాననీయమ్. 40

అస్తాచలే వికటకాఞ్చనకూటకోటి
సంఘట్టనస్ఫుటితజర్జరచారుసంధిః
ఖర్వం రథః పతతి స స్మరవేః సచక్ర
చీత్కారతారతరకూబరరాస ఏషః. 41

ఓ రాజా ! ఈ దక్షిణసముద్రతీరమున వికసించిన కింశుక (మోదుగు) పుష్పములచేఁ బ్రజ్వలింపఁబడినట్లున్న యీ వనసమూహమును జలతరంగములచే సముద్రము మరల మరల తడుపుచున్నది గాంచుఁడు ! ఈ వికసించిన కింశుకవనసమూహమునుండి నల్లని కేసరములను శిరస్సుపై ధరించునట్టి మేఘములు పొగవలెను, కింశుకపుష్పములు నిప్పులవలెను, పక్షులు, తుమ్మెదలు చల్లారిననిప్పు (బొగ్గు)ల వలెను బయల్వెడలుచున్నవి చూడుఁడు ! ఉత్తరదిక్కునందలి పర్వతశిఖరముపై నిటువంటి వనసమూహమే సత్యమగు అగ్నిచేఁ బ్రజ్వలింపఁబడుట నవలోకింపుఁడు ! అద్దాని నాకసమున వాయువులున్ను గంపింపఁజేయుచున్నవి. క్రౌంచపర్వతభూమిపై, మెల్లగఁ జను మేఘమండలముయొక్క గంభీరనాదములచే నృత్యమొనర్చునట్టి నెమళ్ళతోఁ గూడినవియు, శబ్దసహితమై, వ్యాకులమైనట్టి వర్షవాయువుచే కంపితములగు పుష్పఫలపల్లవములచేఁ బూర్ణములైనవియునగు ఈ యున్నతవన సమూహమును వీక్షింపుఁడు ! అస్తాచలముయొక్క భయంకరమైనఁ సువర్ణమయ శిఖరముయొక్క యంచునకుఁ దగుల్కొనుటచే శిథిలములైనట్టి సుందరసంధులతోఁ గూడినదియు, చక్రముల చీత్కారశబ్దసహితమైన బండినొగయొక్క ధ్వనిగలదియునై ఈ సూర్యునిరథము అతినిమ్న ప్రదేశమునుగూర్చి దిగుచున్నది చూడుఁడు !

భువనభవనప్రాకారేద్రౌ నిశాకరభేరుకం
పరివికసితం భీతం భాసామలాలిరుపాశ్రితః
తదిహ జగతాం వస్తు శ్రేష్ఠం న కించన విద్యతే
విధిరుపహతః కుర్యాన్నో యత్క్షణేన కలఙ్కితమ్. 42

బ్రహ్మాండమను గృహముయొక్క ప్రాకారరూపమగు ఈ యుదయాచలముపై నలువైపులఁ బ్రకాశముచేఁ బూర్ణమైనదియు, మాలిన్యముచే భీతినొందునదియు, మాంగలిక పుష్పమువలె అతిమంగళకరమైనదియునగు చంద్రుఁడను బుష్పముదయించినది. కాని, అచటను బ్రహ్మదేవునిచేఁ బ్రేరితమైన కళంకమను తుమ్మెదవచ్చి చేరియేయున్నది. దీనిచే, ఈబ్రహ్మాండమధ్యమున దుష్టుఁడగు బ్రహ్మదేవుఁడు క్షణకాలము కళంకితముగా నొనర్పని శ్రేష్ఠమగు వస్తువెద్దియు లేదని నిశ్చితమగుచున్నది.

త్రిభువనహరాట్టహాసో భువన మహాభవన ఏష మఙ్గలః
క్షీరసలిలావపూరో గగనాబ్ధేశ్చన్ద్ర ఆలోకః. 43

స్పృష్టప్రదోషమయమన్దరమథ్యమాన
చన్ద్రార్ణవోల్లసితదుగ్ధతరఙ్గభఙ్గైః
పశ్య ప్రభాపటలకైః పరిపూరితాఙ్గీః
పూరైరివోగ్రసరితః ప్రసరద్భిరాశాః. 44

ఏతే పతన్త్యతులతాలకరాలలోల
వేతాలబాలవలితా నిశి గుహ్యకౌఘాః
హూణేశ్వరస్య నగరాణి నిరస్తశాన్తి
స్వస్తిశ్రవాదివికలాని బలేన భోక్తుమ్. 45

తావద్విభాతి గగనే పరిపూర్ణచన్ద్రో
యావద్వధూవదనమేతి న సద్మబాహ్యమ్
అభ్యుద్గతేఽఙ్గణ నభస్యబలాననేన్దౌ
ఇన్దోః సితాభ్రశకలస్య చ కో విశేషః. 46

ఓ రాజా ! ఈయాకాశమను సముద్రముయొక్క చంద్రప్రకాశము త్రైలోక్యముయొక్క ప్రభువగు ఈశ్వరునియొక్క యట్టహాసమో, లేక జగత్తను మహాగృహముయొక్క సున్నపులేపనమో, లేక, క్షీరసముద్రజలముయొక్క శుద్ధప్రవాహమో, అయియున్నది. సంధ్యాకాల ధాతువర్ణములచే స్పృశింపఁబడిన మందరపర్వతముచే మథింపఁబడిన చంద్రుఁడను క్షీరసాగరముయొక్క క్షీరమయ తరంగములవంటి ప్రసరణశీలములైన తేజఃపుంజములచే, శివునిచే విడువఁబడిన గంగానదియొక్క సంచరణశీలములైన ప్రవాహములచేవలె, పూర్ణమైనట్టి శరీరముగల యీ దిశలను వీక్షింపుఁడు ! నిరుపమానగుణశాలివగు నోరాజా ! తాళవృక్షములవలె భయంకరులై యొప్పు బేతాళబాలురతోఁ గూడిన యీ గుహ్యులయొక్క సమూహములు రాత్రియందు, శాంతికర్మ, స్వస్తివాచన, మంగళాచరణములు లేనివారును, కావుననే యనేకపీడలచే వ్యాకులురునగు హూణేశ్వరనగరమందలి జనులను బలాత్కారముగ భుజించుటకుఁ బోవుచున్నారు. ఓ రాజా ! గృహమునకు వెలుపల స్త్రీయొక్క ముఖము రానంతవఱకే యీ పూర్ణచంద్రుఁడాకసమున శోభించును. గృహాంగణమను ఆకాశమున స్త్రీముఖమను జంద్రుఁడుదయించినపిమ్మట నద్దాని సౌందర్యముచేఁ నాతఁడు పరాజితుఁడగును కావున నపుడట్టి తేజోహీనుఁడగు చంద్రునియందును, తెల్లని మేఘఖండమందును నేమి విశేషముగలదు ?

వృద్ధానిచంద్రాంశునవామ్బరాణి గఙ్గౌఘనిర్ధూతశిలాన్యమూని
హిమాతతాన్యగ్రలతాజటాని తుషారశైలేశ్వరమస్తకాని. 47

స ఏష మన్దారవనావతంసో దోలాప్సరోగేయవిసారివాతః
క్వచిన్మణిద్యోతవిచిత్రచిత్రః సందృశ్యతే వ్యోమని మన్దరాద్రిః. 48

ప్రోన్నిద్రనీరన్ధ్రశిలీన్ధ్రసాన్ద్ర పుష్పార్ఘ్య పాత్రద్రుమహామహీధ్రాః
సాన్ద్రాభ్రనిర్హ్రాదగభీరకుక్షా సర్వాన్తరిక్షశ్రియముద్వహన్తి. 49

ఇతః స కైలాసగిరిర్గరీయసా ప్రభా ప్రవాహేణ మితేన యస్య ఖమ్
శంభోరివాభాతి సుతస్యకుట్టిమంచన్ద్రోఽపి చ క్షీరసముద్రగో యథా. 50

స్థాణూనాం ఛిన్నశాఖానాం మృన్మయానాం చ వాసవః
సంధత్తే పశ్య దూరాణాం వాతైర్ముక్తశిఖా ఇవ. 51

ఓ రాజా ! అతివిశాలములును, చంద్రకిరణములను నూతనవస్త్రములను ధరించినవియు, గంగాప్రవాహముచే కడుగఁబడిన శిలలచేఁ బూర్ణములును, మంచుచేఁ గప్పఁబడినవియు, గొప్ప లతలను జడలను ధరించినవియునగు ఈహిమవత్పర్వత శిఖరము లెట్లు శోభించుచున్నవో చూడుఁడు! మందారవనములను శిరోభూషణములుగల్గి, ఊయెలలందూగు అప్సరసల గీతములను విస్తరింపఁజేయునట్టి వాయువుచేఁ బరిపూర్ణమై, అచటచట మణులయొక్క ప్రకాశముచే విచిత్ర చిత్రములతోఁగూడినదై యీ మందరపర్వతము అత్యున్నతముగ నాకసమునఁగానఁబడుచున్నది. అవలోకింపుఁడు ! వికసితపుష్పములచే దట్టముగ వ్యాపింపఁబడినట్టి ఘనీభూతములైన కదళీ (అరఁటి)పుష్పములను అర్ఘ్యపాత్రలను ధరించియున్న యీ గొప్పపర్వతములు, గంభీర మేఘ నాదములచేఁ బూర్ణమగు అగాధద్రోణీప్రదేశమున నక్షత్రసహితముగ విద్యమానమైయున్న అంత రిక్షముయొక్క శోభను ధరించుచున్నవి. ఓ రాజా ! ఇటనుండి యుత్తరదిక్కుననున్న యీ కైలాస పర్వతమును జూడుఁడు ! అద్దానిచే వ్యాప్తమైన శ్రేష్ఠమగు దీప్తిప్రవాహముచే నాకాశ మధోభాగ మున కుమారస్వామియొక్క ముక్తాచూర్ణనిర్మితమగు క్రీడాగృహమువలెను, ఊర్ధ్వభాగమున క్షీరసాగరమునందువలెఁ చంద్రుడు విలీనమైయున్నట్లును భాసించుచున్నది. ఓ రాజా గొడ్డళ్లచే నఱుకబడిన శాఖలను స్థాణువులు, అగ్నిచే దగ్ధమొనర్పఁబడిన గృహకుడ్యాదులు పరస్పరము దూరముగనున్నప్పటికి, వర్షముచే, తడుపుటద్వారా రెంటియందును అంకురము నుత్పన్నముచేసి, మూలసహితములుగ గావించి, కౌతుకియగు యింద్రుఁడు, వాయువులచే గంధప్రసారముద్వారా వానిని పరస్పరము కూర్చుచుధరించుచున్నాఁడు ! గాంచుఁడు !

ఏతే కదమ్బకులకున్దసుగన్ధివాతా
లిమ్పన్తి మాంసలతయా మకరన్దవృష్టేః
ఘ్రాణం ఘనైః పరిమలైరవిజాలనీలా
వ్యాలోడ్య మేఘపటలైః ఖమివాభ్రకాయాః. 52

ఉన్నిద్ర కుడ్మలదలాసు వనస్థలీషు
సచ్ఛాయశాద్వలఘనేషు చ జఙ్గలేషు
గ్రామేషు సంతతఫలద్రుమసంకులేషు
లక్ష్మీః స్వయం నివసతీవ నివాసహేతోః. 53

వాతాయనా గతలతావృతసౌధకోశ
కోశాతకీకుసుమకేసరమాహరద్భిః
ఆగుల్ఫకీర్ణముకుళాజిర వీష వాతై
ర్గ్రామో విభాతి నగరం వనదేవతానామ్. 54

ఉన్నిద్రామల చమ్పకద్రుమలతా దోలావిలోలాఙ్గనా
కూజన్నిర్ఝరవారయః పరిసరప్రోన్నిద్రతాలద్రుమాః
ఉత్ఫుల్లోజ్జ్వల మఞ్జరీసితలతాగేహోల్లసద్బర్హిణః
పర్యన్తోన్నతసాలలమ్బజలదా రమ్యా గిరిగ్రామకాః. 55

ఓ రాజా ! కదంబ, కుంద, బకులాది వృక్షములయొక్క పుష్పములచే సుగంధితము లును. పుష్పరసములను ద్రావుటచేఁ బరిపుష్టములును, కావుననే తుమ్మెదలసమూహమువలె నీల వర్ణయుతులును మేఘములవలె విశాలదేహులునగు ఈ వాయువులు సుగంధపదార్థము లన్నిఁటిని మథించి ఘనీభూతమగు సుగంధముతోఁగూడినవై, మేఘసమూహ మాకాశమునఁ బ్రవేశించునట్లు ప్రాణికోట్ల నాసికారంధ్రములను బ్రవేశించుచున్నవి చూడుఁడు ! వర్షాకాలమున, వికసితములగు అనేక పుష్పములతోఁ గూడిన వనస్థలములందును, ఛాయాసహితములును, దట్టమైన తృణాదు [illegible]నినవియునగు అరణ్యములందును, నిరంతరము ఫలపుష్పములచేఁ బూర్ణములగు వృక్ష[illegible]చే వ్యాప్తములైన గ్రామములందును, స్వనివాస హేతువగు శోభాతిశయము యొక్క దర్శన[illegible]కై లక్ష్మీదేవి వసించుచున్నది. ఓ రాజా ! ఈ యెదుటనున్న గ్రామము కిటికీలగుండా ప్రవే[illegible]న యనేకలతలచేఁ గప్పఁబడిన మేడలపై కోశాతకీ (ఉత్తరేను) పుష్పములను వానిపరాగ ములను గొనివచ్చు వాయువులవలన చీలమండలమువఱకు నెత్తుగఁబడియున్న పుష్పములచే వ్యాప్తములైన ముంగిళ్లుగలదై వనదేవతల నగరమువలె బాసిల్లుచున్నది. వికసిత, నిర్మల పుష్ప ములచేఁ బూర్ణములగు చంపక వృక్షములయొక్క లతలను నూయెలలపై గ్రీడించు చంచలస్త్రీలతోఁ గూడినవై, కల్లోలమొనర్చు సెలయేళ్ళ నీటిచేఁ బూర్ణములై, పరిసరమునఁ బుష్పించిన తాళవృక్ష ములచే శోభించుచు, ప్రకాశమానములగు లతలచే నలంకరింపఁబడిన లతాగృహములందు నృత్య మొనర్చు నెమళ్ళుగలవై, ఉన్నతప్రాకారములపైనను, వృక్షములపైనను వ్రేలాడు మేఘములచే భూషితములై యీ పర్వత గ్రామము లెట్లు వెలయుచున్నవో వీక్షింపుఁడు !

వాతాలోలవిచిత్ర పత్రలతికా సంపూర్ణనీలస్థలాః
కూజల్లావక కోక కుక్కుట ఘటాగాయత్పులిన్దాఙ్గనాః
బాలావ్యాకులతర్ణకా దధిమధుక్షీరాజ్య పానోజ్జ్వలాః
కస్యేవామృతమణ్డపా విరచితా రమ్యా గిరిగ్రామకాః 56

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే విపశ్చిదనుచరకృతపదార్థవర్ణనం నామ పఞ్చదశాధిక శతతమః సర్గః ॥ 115 ॥

మఱియు, ఓ రాజా ! వాయువులచేఁ జంచలములైనట్టి విచిత్రఫల పుష్పములతోఁ గూడిన లతలచేఁ బూర్ణములైన నీలస్థలములచే నొప్పుచు. కూయుచున్న మధుర భాషలగు 'కోక కుక్కుటాది' పక్షులచే వ్యాప్తములై, పాడుచున్న మ్లేచ్ఛజాతిస్త్రీలతోఁ గూడినవై బాలురచే పాలింపఁ బడుటచే వ్యాకులరహితములైయున్న దూడలుగలవై, పాలు, పెరుఁగు, నేయి, తేనె మున్నగునవి త్రాగుటచే పుష్టిగల్గియున్న బాలురచేఁ బూర్ణములై యీ మనోహరములగు పర్వత గ్రామములు బ్రహ్మదేవుని విశ్రాంతికొఱకై నిర్మింపఁబడిన అమృతపూర్ణములగు మండపమువలె విరాజిల్లుచున్నవి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
అవి॥ విప॥ విపశ్చిదనుచరకృతపదార్థవర్ణనమను
నూట పదునైదవ సర్గము ॥ 115 ॥

షోడశాధికశతతమః సర్గః

[సంగ్రామవ్యోమ విరహి శిఖరిగ్రామడమ్బరాః
గిరిగహ్వరమేఘాశ్చ మూర్ఖకాకాశ్చ వర్ణితాః

యుద్ధము. ఆకాశము, విరహులు, గ్రామములు, అరణ్యములు, మేఘములు, మూర్ఖకాకులు, ఇచట వర్ణింపఁబడుచున్నవి.]

అనుచరా ఊచుః—

దేవ పశ్యాత్ర సంగ్రామలగ్నసీమాన్త భూభృతామ్
కచన్తి హేతిసంఘాతా విసరన్తి బలాని చ. 1

హతాన్వ్యోమానభిముఖాన్వీరాన్వీరైః సహస్రశః
ఆరోప్యారోప్య ఖం యాన్తి పశ్య పశ్యాఙ్గనారథైః. 2

అనుచరులు:— దేవా! యుద్ధమునందు తత్పరులగు సరిహద్దుదేశపు రాజులయొక్క ఆయుధసమూహములు మెఱయుచుండుటయు వారినలువిధములగు సేనలువిస్తరించుచుండుటయు నిటుఁ గాంచుఁడు! యుద్ధమున వీరులచే సమ్ముఖమున హతులైనట్టి వేలకొలఁది వీరులను విమానములపై గూర్చుండఁబెట్టి అప్సరసలు వారినాకాశమున గొనిపోవుచున్నారు. జూడుఁడు!

విజిగీషోః పునః ప్రాప్తే సంకటే ప్రకటే రణే
ధర్మ్యం విరాజతే యుద్ధం యౌవనే సురతం యథా. 3

శత్రువులకు యుద్ధమున ప్రకటమైనట్టి సంకటము ప్రాప్తింప అధర్మములేక వారిని జంపుట విజయమునుగోరు బలవంతునకు శోభింపదు. ధర్మయుక్తమగు యుద్ధమే యౌవనమున రతివలె శోభించును.

లోకైరనిన్దితా లక్ష్మీరారోగ్యం శ్రీసమన్వితమ్
ధర్మ్యం యుద్ధం పరార్థేన జీవితస్యోత్తమం ఫలమ్. 4

లోకులచే నిందింపఁబడని సంపద ధనసంయుతమగు ఆరోగ్యము ప్రజలకొఱకగు ధర్మపూర్వకమైన యుద్ధము ఇయ్యవి జీవితముయొక్క యుత్తమఫలములై యున్నవి.

అవిరోధేన ధర్మస్య యుద్ధే సంముఖమాగతమ్
యోధానురూపం యో హన్తి శూరః స్వర్గ్యః స నేతరః. 5

ధర్మవిరుద్ధముగాని యుద్ధమున సమ్ముఖమున కేతెంచినవాఁడును అనురూపుఁడునునగు యోధుని (అనఁగా నొకఁడైనచో నొకనిని రథారూఢుఁడైనచో రథారూఢుని శస్త్రధారియగుచో శస్త్రధారిని నిరాయుధుఁడగుచో నిరాయుధుని) వధించునో అట్టి శూరుఁడే స్వర్గమున కర్హుడుగాని మఱియొకఁడు కాదు.

హస్తస్థితాసివరనీలసరోజదామ
శ్యామో హయోత్థఘనరేణునిశాగమోఽత్ర
ఆలోకయ క్రమణమేష కథం కరోతి
[illegible] 6

ఏతే కచన్తి శరశక్తిగదాభుశుణ్డీ
శూలాసికున్తపటుతోమరచక్రపూర్ణాః
తాపాః సతాణ్డవకచప్రచలే చలేఽబ్ధౌ
దేహేన వల్గతి భువీవ ఫణీన్ద్రసంఘాః. 7

ఓ రాజా! ప్రయోగింపఁబడుచున్న యాయుధములే భూషణములుగాగల యీ వీరపురుష[illegible] చెంతకు లక్ష్మియొక్క హస్తమందున్న యుత్తమఖడ్గమను నీలకమలముయొక్క [illegible] శ్యామవర్ణయుతములై గుఱ్ఱములచే లేవగొట్టబడినవై ఘనీభూతములైనట్టి ధూళికణముల[illegible]త్పన్నమైన యంధకారమను రాత్రియొక్క యాగమనము ఈయుద్ధభూమియందెట్లు ప్రవ[illegible]చున్నదో చూడుఁడు! (లక్ష్మి యీరాత్రి యందీవీరుని స్వయంవరమున వరించునో లేదో యను కౌతుకమును వీక్షింపుఁడని భావము) బాణశక్తి, గద, భుశుండి, శూల, ఖడ్గ, కుంత, తోమర చక్రాద్యాయుధములచేఁ బూర్ణులగు ఈ యోధులు, నృత్యమున జంచలములైనట్టి తృణకాష్ఠాదులతోఁగూడిన పర్వతముపైని దావాగ్నివలె బాసిల్లుచున్నారు. మఱియు వారియందు ఆ బాణశక్త్యాద్యాయుధములు సముద్రము నిజదేహముతోడ విజృంభింప భూమిపైకి నేతెంచిన యందలి మహాసర్పములవలె ప్రకాశించుచున్నవి.

పశ్యామ్బరం బలవదమ్బుధరాబ్ధిపూర్ణం
పశ్యామ్బరం తరలతారకతారహారమ్
పశ్యామ్బరం సుఘనసక్తమసైకసారం
పశ్యామ్బరం విశదచన్ద్రకరావసిక్తమ్. 8

ఓ రాజా! ఈ యాకాశ మొకవైపు మేఘ, సముద్రములచేఁ బూర్ణముగను, ఒకవైపు చంచల తరంగములను హారములచే భూషితముగను, వేఱొకవైపు ఘనీభూతమగు అంధకారముచే నీలవర్ణయుక్తముగను. మఱియొకవైపు చంద్రకిరణములచేఁ దడిసినదిగను నుండియుండుటను గాంచుఁడు!

యత్రానేకసురాసురాస్పదఘటా తారాపదేశం గతా
ఋక్షాణాం చ యదాస్పదం విసరతాం సర్వోన్నతానాం చ యత్
తస్మిఞ్శూన్యమితి ప్రతీతిరధునాప్యస్తం గతా నామ్బరే
కోఽన్యో మార్జయితుం జనోఽజ్ఞరచితం లోకాపవాదం క్షమః. 9

ఎద్దానియందనేకములైన సురాసురస్థానములగు విమానాదులయొక్క సమూహము 'తార' అనువ్యాజమును బొందినదో, ఎయ్యది అశ్విన్యాది నక్షత్రములకును, సర్వోపరి విరాజమానములగు సూర్యచంద్రాదులకును నెలవైయొప్పుచున్నదో, అట్టి యీ యాకాశము సర్వత్ర పరిపూర్ణమైయున్నను దానియందలి శూన్యత్వ ప్రతీతి నేఁటికిని దొలఁగకున్నది. మహాసమర్థమగు ఆకాశమున్ను, అజ్ఞానులచేఁ గావింపఁబడిన (శూన్యత్వ రూపమగు) తననిందను దొలగించుకొనఁ జాలనిచో, ఇఁక నన్యుఁడెవఁడు తొలగించుకొన సమర్థుఁడగును?

మేఘాటోపైః ప్రలయదహనైరద్రిపక్షాభిఘాతైః
స్తారాపూరైరమరదితిజక్షుబ్ధసంగ్రామసంఘైః

వ్యోమాద్యాపి ప్రకృతి వికృతిం నామ నాయాత్యసంఖ్యై
రన్తః సారాశయగుణవతాం లక్ష్యతే నో మహిమ్నః. 10

మేఘసమూహముల చేతను, ప్రళయాగ్నులచేతను, పర్వతముల తెక్కలయొక్క దెబ్బల చేతను, నక్షత్రగణములచేతను, సుధాసురుల అసంఖ్యాతములైన సంక్షుబ్ధములగు యుద్ధముల చేతనుగూడ ఆకాశము నేఁటివఱకును తన స్వరూపమునందేవికారమునున్ను బొందకయేయున్నది. ఉత్తమగుణశీలురగు మహాత్ముల మహిమకు అంతమేకానుపించదు.

ఆన్దోలయస్యవిరతం గగనార్కమఙ్కే
నారాయణం చ శశినం చ తథేతరాణి
తేజాంసి భాసురతడిత్ప్రభృతీని సాధో
చిత్రం తథాపి న జహాసి యదాస్యమన్తః. 11

సాధువగు నో యాకాశమా! నీ వెల్లప్పుడు సూర్యనారాయణుని, ఆతని పరిజనులగు సమస్త దేవతలను, చంద్రుని, తదితర గ్రహ, నక్షత్ర, విద్యుదాది తేజోవంతములగు పదార్థములను నీ యొడియందు ధరించి వానిని చలింపఁజేయుచున్నావు. అయినను నీ యాభ్యంతరమునందలి అంధకార రూపమగు నీలత్వమును నీవు త్యజింపకయేయున్నావు. ఆశ్చర్యము!

ఆకాశ కాశసి తు యత్రశశాఙ్కబిమ్బం
త్వత్కీర్ణకజ్జలతమోమలినోఽసి తత్త్వమ్
సజ్జాన్న యన్నయసి తత్ఖలు చిత్రముచ్చైః
కోనామ వాన్తరమలం మలినీకరోతి. 12

ఓ యాకాశమా! నీవు మలినమైనదానవు ఏలయనిన, నీనుండి బయల్వెడలిన చంద్ర బింబమున్ను కాటుకవంటి చిహ్నముతో గూడినదాయెను. దానియందు నీవు కళంకమను మిషచే ప్రత్యక్షముగ మలినముగ గానుపించుచున్నావుగదా! అయినను, నీవు నీయొక్క సాంగత్యముచే చంద్రబింబము నంతయు మలినముగ, జేయఁజాలకుండుట మహాచిత్రముగానున్నది. లోన మాలిన్యముగలదే మలినమైన దాని సాంగత్యముచే బాహ్యమునను మాలిన్యమును బొందును. లోన నిర్మలమైన దానినిఁక నేది మలిన యుక్తముగఁ గావింపఁగలదు?

పూర్ణస్యాపి జగద్దోషైః సర్వదైవావికారిణః
ఖస్య మన్యే బుధస్యేవ సుఖం సర్వార్థశూన్యతా. 13

మాలిన్యాది ప్రపంచదోషములఁచేఁ బూర్ణమైయున్నను, సదానిర్వికారమై యుండుటఁబట్టి ఆకాశమునకు, జ్ఞానికివలె సర్వానర్థశూన్యమగు నిర్మలసుఖము గలదనియే నేను నమ్ముచున్నాను.

కల్పాన్తశక్రదుమవీరుదున్నతిదృశాం కర్తాసిధర్తాసి చ
ఆకాశేన్దుఘనార్క కిన్నరమరుత్సన్దామరాణామపి
సర్వం రమ్యం మసంకులాశయసమస్వచ్ఛస్వభావస్య తే
[illegible] ముఞ్చాయ ఖేదాయ నః. 14

ఉదారబుద్ధివగు ప్రియమైన యాకాశమా! నీవు ప్రళయకాల మేఘములకును, ఉన్నతములగు వృక్షాదులకును అవకాశ మొసంగుటవలన వానికర్తవై యున్నావు. మఱియు, చంద్ర, సూర్య, మేఘ, వాయుసమూహ, కిన్నరులకును, తదితరదేవతలకును నీవు ఆధారభూతుఁడవై యొప్పుచున్నావు. ఇట్లు, సమమై, నిర్మలస్వభావ యుక్తమైనట్టి నియొక్క సమస్త కార్యములున్ను మనోహరములేయై చెన్నొందుచున్నవి. కాని, సూర్యునియొక్క ప్రజ్వలనమున కవకాశమొసంగి సంతాపకత్వమును కర్మ ఎయ్యది నీవు కావించుచున్నావో అది మాకు దుఃఖముకొఱకే యగుచున్నది.

ఆకాశ కాశమసి నిర్మలమచ్ఛముచ్చై
రాధార ఉన్నతయోత్తమముత్తమానామ్
త్వామేత్య కింతు విరలం కరకా ఘనోఽయం
లోకం విమర్దయతి తేన పరోసి నీచైః. 15

ఓ యాకాశమా! నీవు నిర్మలమై, ప్రకాశమానమై, ఉన్నతత్వముచే నుత్తములగు దేవతాదులకును ఆధారభూతమైయున్నావు. కాని, అవకాశసహితమైయున్న నిన్నాశ్రయించి యీ వడగళ్ళను గురియు మేఘము జనులను మర్దించుచు బాధను గలుగఁజేయుచున్నది. ఇట్టి దోషముచే నీవు అతినీచమై యున్నావు.

ఆకాశ కర్షకష ఏవ నికర్షణం తే
మన్యే చిరం సముచితం నతు కించిదన్యత్
శూన్యోసి యజ్జలధరర్క్ష విమానచన్ద్ర
సూర్యనిలాన్వహసి భాసి న చార్థశూన్యః. 16

ఓ యాకాశమా! ఒరపిడిరాయిపై, బంగారువలె నీయొక్క పరీక్ష చిరకాలము చేయవలసియున్నది. ఏలయనఁగా నీవు శూన్యమైనను మేఘ, నక్షత్రమండల, చంద్ర, సూర్య, వాయ్వాదులను ధరించుచున్నావు; ప్రకాశమానమై విరాజిల్లుచున్నావు; నిష్ప్రయోజనమున్ను గాకయున్నావు. ('ఇట్లు బంగారు, యొక్క గుణములన్నియుఁ గలిగియున్నావు గాన నద్దాని పరీక్షాస్థానమున్ను నీకుఁ దగియే యున్నదని వచించుటయగును.

అహ్న ప్రకాశమసి రక్తవపుర్దినాన్తే
యామాసు కృష్ణమథ చాఖిలవస్తురిక్తమ్
నిత్యం న కించిదపి సద్వహసీతి మాయాం
న వ్యోమ వేత్తి విదుషోఽపి విచేష్టితం తే. 17

ఆకాశమా! నీవు పగటియందు ప్రకాశమానమగు వర్ణముగలిగియుందువు. సాయంకాలమున సంధ్యారాగములచే రక్తవర్ణమైనట్టి శరీరము ధరించియుందువు. రాత్రియంతయు కృష్ణవర్ణముతో గూడియుందువు. మఱియు నిత్యము సద్వస్తువెద్దియు ధరింపకయేయున్నావు గావున సర్వపదార్థరహితమైయున్నావు. కావున నీయొక్క మాయనున్ను, తత్త్వజ్ఞానియొక్క చేష్టనున్ను ఎవఁ [illegible]ఱుంగఁజాలకయే యున్నాఁడు.

అకించనోఽపి కార్యాణి సాధయత్యాతతాశయః
అన్తః శూన్యమపి వ్యోమ సర్వస్యోన్నతికారణమ్. 18

లోన శూన్యమైయున్నప్పటికిని ఆకాశము సర్వపదార్థములయొక్క యున్నతికి హేతువైనట్లు అతివిశాలబుద్ధియగు తత్త్వజ్ఞాని ధనశూన్యుఁడై యున్నప్పటికిని అనేక కార్యములను సాధించుచున్నాఁడు.

న తృణసలిలం నైవ గ్రామో న నామ చ పత్తనం
న చ దలభరస్నిగ్ధచ్ఛాయస్తరుర్న చ సత్ప్రపా
తదపి గగనాధ్వానం సూర్యః ప్రయాతి దినేదినే
విషమమపి యత్ప్రారబ్ధం తత్త్యజన్తి న సాత్త్వికాః. 19

ఆకాశమార్గమున విశ్రాంతికొఱకై తృణముగాని, జలముగాని, గ్రామముగాని, నగరముగాని, పత్రపరిపూర్ణమగు ఉత్తమచ్ఛాయ నొసంగు వృక్షముగాని, రమ్యమగు పానీయశాల (చలిపందిరి) గాని యెవ్వియును లేవు. అయినను సూర్యుఁడామార్గమునఁ బ్రతిదిన మేగుచునే యున్నాఁడు. ఏలయనిన, సత్త్వశీలురగు మహనీయులు ఇతరుల కసాధ్యమైనట్టి కార్యమైనను బ్రారంభించినదాని నెన్నటికిని త్యజింపకయే యుందురు.

యామా ధ్వాన్తపటేన శీతలరుచిః కర్పూరపూరైః కరై
రర్కాలోకనవాంశుకేన దివసస్తారౌఘపుష్పోత్కరైః
ద్యౌరమ్భోదతుషారవారి కుసుమైః సర్వర్తవో భూషయ
న్త్యేతే కాలకలాత్మనో స్త్రిభువనే వ్యోమాఙ్గణం నాథయోః. 20

సూర్యప్రకాశమను నూతనవస్త్రముచే దివసము తన్నలంకరించుకొనుచున్నది. శీతలమగు రాత్రి అంధకారమను వస్త్రముచేతను, కర్పూరపరాగమువంటి నక్షత్రసమూహమను పుష్పములచేతను దన్ను భూషితమొనర్చుకొనుచున్నది. వసంతాది ఋతువులన్నియు నాకాశమున మేఘ, హిమరూపములగు జలపుష్పములచేఁ దమ్ముల నలంకరించుకొనుచున్నవి. ఇవియన్నియుఁ గలసి కాలకళారూపులును త్రైలోక్యనాథులునగు చంద్రసూర్యులయొక్క క్రీడాస్థానమగు ఆకాశమను ముంగిటి నలంకరించుచున్నవి.

ధూమాభ్రరేణుతిమిరార్కనిశేశసంధ్యా
తారావిమానగరుడాదిసురాసురాణామ్
క్షోభైరపి ప్రకృతిముజ్ఝతి నాన్తరిక్షం
చిత్రోత్థితా స్థితిరహో ను మహాశయస్య. 21

మహాశయుని స్థితి యాశ్చర్యరూపముగను, ఉన్నతముగను గానుపించుచున్నది. ఏలయనిన ధూమ, మేఘ, ధూళి, అంధకార, సూర్య, చంద్ర, సంధ్యా, నక్షత్రగణ, విమాన, గరుడ, సురాసురాదుల సంక్షోభముతోటి గూడియున్నను, ఆకాశము తన స్వాభావికమగు నిర్మలస్థితిని త్యజించుటలేదు.

దిగ్భిత్తిబద్ధమిదమూర్ధ్వతలాన్తరిక్ష
ముర్వీతలం ఘనపురాచలకోటిఖాణ్డమ్

విద్యాధరామరమహోరగజాలకారం
లోకౌఘసంసరణసంఘపిపీలికాఢ్యమ్. 22

ఓ రాజా ! దిక్కులను గోడలచే సంబంధమైన అంతరిక్షమను నూర్ధ్వసౌధభాగముగలదై, పృథివియను నధోభాగముచే నొప్పుచు, మేఘ, నగర, పర్వతములను ననేకప్రాకారాదులచేఁ బూర్ణమై విద్యాధర, దేవతా, మహాసర్పాదులను సాలీళ్ళచే వ్యాప్తమై, అండజాది చతుర్విధభూత సముదాయమను జీవులచేఁ బరిపూర్ణమై యీ త్రైలోక్య మొక శిథిలగృహమువలె వెలయుచున్నది.

కాలః క్రియా చ భువనం భవనం చిరాయ
నామాధితిష్ఠత ఇవోపవనం వికాసి
ఆశఙ్క్యతే ప్రతిదినం నను నష్టమేవ
నాద్యాపి నశ్యతి చ కేయమహో ను మాయా (యుగలకమ్.) 23

వికసించిన వనమును తోటమాలి, ఆతని భార్యయను నిరువురు పాలించునట్లు, ఇట్టి త్రైలోక్యమను గృహమును కాల, క్రియలను స్త్రీపురుషులిరువురు పాలించుచున్నారు. ప్రతిదినమియ్యది నశించుచున్నట్లు తోచినను, ప్రవాహరూపముచే నేఁటికిని నశింపకనేయున్నది. అహా ! పరమాత్మయొక్క యీ మాయ యెట్టి యాశ్చర్యరూపమైయున్నది.

ఖం మన్యే పాదపాదీనాం రోధయత్యధికోన్నతిమ్
అకర్తురేవ మహతో మహిమ్నోదేతి కర్తృతా. 24

ఓ రాజా ! వృద్ధియుక్తములగు వృక్షాది సమస్తపదార్థములయొక్క అధికోన్నతిని ఆకసమే నిరోధించుచున్నదని తలంచెద. ఏలయనిన, వ్యాపారరహితమగు పర్వతమునకు మార్గమును నిరోధించుట యను వ్యాపారమెట్లు సంభవించుచున్నదో, అట్లే నిరోధవ్యాపారశూన్యమగు ఆకాశమునకు నిరోధమున అకర్తృత్వమే యున్నను, మహాపురుషుని మహిమచేతనే కర్తృత్వముదయించుచున్నది.

జగతాం యత్ర లక్షాణి న భవన్త్యుద్భవన్తి చ
తచ్ఛూన్యముచ్యతే వ్యోమ ధిక్పాణ్డిత్యమఖణ్డితమ్. 25

యద్దానియందు లక్షలకొలఁది బ్రహ్మాండము లుత్పన్నములై, నశించుచున్నవో, అట్టి యాకాశమును శూన్యమని యెవరు చెప్పుదురో, వారి అఖండపాండిత్యమునకు ధిక్కారమగుగాక !

వ్యోమన్యేవ ప్రలీయన్తే వ్యోమతః ప్రోద్భవన్తి చ
గచ్ఛతోన్మత్తతామేతామీశ్వరాన్యభిదా కృతా. 26

ఓ రాజా ! ఆకాశముననే సర్వజగంబు లుద్భవించుచున్నవి. ఆకాశముననే యవి స్థితిగల్గియున్నవి; మరల ఆకాశముననే యవి లయించుచున్నవి. ఈ ప్రకారముగ ఈశ్వరుని లక్షణమాకాశమందుఁ గన్పించుచున్నది గావున ఆకాశమే యీశ్వరుఁడైయున్నది, ఇక్కారణమున, ఆకాశమీశ్వరునికంటె అన్యమైయున్నదను భేదము ఉన్మత్తుఁడగు వానిచేతనే గావింపఁబడినదగును.

ఆయాన్తి యాన్తి నిపతన్తి తథోత్పతన్తి
సర్గాశ్రియః కనఘటా ఇవ పాదకోష్ఠాః

యత్రామలం తదహమేకమనాదిమధ్యం
మన్యే ఖమేవ నతు కారణమీశ్వరాఖ్యమ్. 27

కావున, అగ్నినుండి మిణుగురులవలె ఏ యాద్యంతమధ్యరహితమగు నిర్మలపదమునుండి యనేకసృష్టులు వచ్చుచుఁ బోవుచున్నవో. దేనియం దయ్యవి యుద్భవించుచు నశించుచున్నవో, అట్టి చిదాకాశరూపుఁడనగు నేనే ఆమాయాకాశమగుదునుగాని జడముకాదు మఱియు, 'మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్, మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాఽద్వయ మస్మ్యహమ్' అనఁగా 'నాయందే సమస్తము జనించుచు, స్థితినొందుచు, లయించుచున్నది. అట్టి అద్వయరూపమగు బ్రహ్మమే నేను' – అను నీ మున్నగు శ్రుతులఁబట్టి నేనే యా జగత్కారణంబగు ఈశ్వరుఁడనగుదునుగాని, నైయాయికాదుల కభిమతమగు తటస్థరూపుఁడగు ఈశ్వరుఁడు జగత్కారణము కానేరఁడు.

ఆధారమాయతతరం త్రిజగన్మణీనా
మగ్జే విభర్త్యమితమన్తర శేషవస్తు
వ్యోమైవ చిద్వపురహం పరమేవ మన్యే
యత్రోదయాస్తమయమేతి జగద్భ్రమోఽయమ్. 28

ఓ రాజా ! ఏది అనంతరరూపమైయున్నదో, ఏది సమస్తపదార్థములను దనయంగమున ధరించుచున్నదో, ఏది త్రైలోక్యరూపములగు మణుల కాధారమై యొప్పుచున్నదో, ఎద్దానియందీజగద్రూపమగు భ్రమ యుదయాస్తమయముల నొందుచున్నదో, అట్టి చిదాకాశమగు పరబ్రహ్మమే నేనని తలంచుచున్నాను.

వనావనౌ వనచరచారు కామినా
మనోహరద్రుమగగనేషు గీయతే
ఇతో గిరేః శిరసి విలోక్యతేఽమునా
వియోగినా పథి వహతా రసాకులమ్. 29

గీతం శ్రుఙ్గతరూచ్చపల్లవపుటే నిఃశ్వస్య పోత్కణ్ఠయా
కణ్ఠాశ్లిష్టగిరా వియోగహతయా విద్యాధరాణాం స్త్రి[illegible]
యన్నామాత్ర తదేష నాథ పథికః పోచ్ఛ్వాసకః కర్ణయన్
దోలాన్దోలనయేవ చఞ్చలధియా నోయాతి నోనూచ్యతే. 30

గాయత్యద్రి శిరస్తరౌ దలపుటే నిఃశ్వస్య విద్యాధరీ
కాకల్యా తిలకం వియోగవిధురా బాష్పాకులైః సా పురః
నాథోత్సఙ్గగృహే గృహీత చిబుకం స్మేర భవచ్చుమ్బనం
స్మృత్వాస్వాద్య రసాయనం హతసమా నీతా మయైతా ఇతి. 31

[illegible] ప్రాగ్భవసత్పతిః స మునినా శాపేన వృక్షీకృతో
వర్షద్వాదశకం తదేవ గణయన్త్యేషైవ సాత్ర స్థితా

గాయత్యుత్కలితా తదేవ దయితం తం పాదపంసంశ్రితా
మార్గే మార్గవిహారిణాం వదనతో రాజన్మమైతచ్ఛ్రుతమ్. 32

పశ్యైష సోఽస్మదవలోకనశాన్తశాపో
విద్యాధరో విటపితామవముచ్య బాలామ్
కణ్ఠే కరోతివిటపాకృతివిప్రపలమ్బై
స్తైరేవ బాహుభిరలం స్ఫుటపుష్పహాసః. 33

ఓ రాజా ! ఈ పర్వతముయొక్క యూర్ధ్వభాగమున గల మనోహరవృక్షపరిపూర్ణమగు వనభూమియందొకానొక కాముకుఁడగు సుందరవనచరునిచే గీతము పాడఁబడుచుండ, అధోభాగమునఁ జనుచున్న యీ వియోగియగు పురుషుఁడా గీతమును విని రాగముచే వ్యాకులుఁడై యా పాడుచున్న వానిఁగూర్చి పైకిఁ జూచుచున్నాఁడు. వీక్షింపుడు ! ప్రభూ ! ఈ పర్వతశిఖరమున గల వనమందలి యెత్తైన వృక్షముయొక్క పల్లవసమూహరూపమగు కుంజమున వియోగముచే దుఃఖము నొందినదియు, ఉత్కంఠతోఁగూడినదియునగు విద్యాధరస్త్రీచే గద్గదస్వరముచేఁ బ్రేమపూర్ణమగు గీతమెయ్యది పాడఁబడుచున్నదో, దానిని ఈక్రింద నేగుచున్న బాటసారి యుచ్ఛ్వాసముతోఁగూడి వినుచు, ఊయెలయందూగుచున్న దానివలెనున్న చంచలబుద్ధిచే నచటనే నిలఁబడి ముందుకుఁ జనకయున్నాఁడు. ఆతని సహచరులును ముందుకేగుటకై యాతనితోటి వచింపకయున్నారు, ఆశ్చర్యము ! ఎదుటనున్నట్టి యా విద్యాధరి కన్నీటిని గార్చుచు, చెదిరిన తిలకముగలదై, వియోగముచే నతిదుఃఖితయై, నిశ్శ్వాసము గావించి, మంద మధురస్వరముతో నిట్లు పాడుచున్నది. నాథా ! నీ యొడియను గృహమందు నీయొక్క కపోలగ్రహణపూర్వకమగు యొకింత హాస్యముతోఁగూడిన చుంబనము (ముద్దు) అను అమృతమును స్మరించి, మరలమరల యాస్వాదించి యిచట నేను దుఃఖపూరితములైన వత్సరముల కాలమును గడపితిని. ఓ రాజా ! ఆ వృక్షము పూర్వకాలము ఆ విద్యాధరియొక్క పతియైయుండెను. ఏదోయొక యపరాధముచే నాతఁడొక మునీశ్వరునిచే శపింపఁబడి పంద్రెండు వత్సరములు వృక్షముగాఁ జేయఁబడెను. ఆ కాలమును లెక్కించుకొనుచు ఆ విద్యాధరి యచటనే యుత్కంఠతోఁ గూడుకొని యున్నదై తన పతిరూపమగు ఆ వృక్షమునే యాశ్రయించియున్నదని యీ మార్గమునబోవువారి ముఖమునుండి నేను వింటిని. ఓ రాజా ! ఆ శాపము మన మావృక్షమును జూచువఱకేగలదు. కావున నిపుడా వృక్షరూపుఁడగు విద్యాధరుఁడు శమించిన శాపముగలవాఁడై వృక్షత్వమును ద్యజించి, వికసించినపుష్పములవంటి హాస్యముతోఁగూడి శాఖాసదృశములగు భుజములచే ఆవిద్యాధరిని కౌఁగిలించుకొనుచున్నాఁడు చూడుఁడు !

శిఖరిణాం కరిణాం కుసుమోత్కరో విటపిషు స్ఫుటరోమసు రాజతే
గగనవిచ్యుత తారకలీలయా శిఖరమేష తుషారసమానయా. 34

మీనావలీసరభసప్లుతిఘట్టితామ్బు
వీచీవిలోలవిరువత్కురరీకరాలా
కావేర్యహో కుసుమశుక్లపటాఽవభాతి
నిఃశబ్దకరబుక్కకులసంకులకూలకచ్ఛా. 35

భాత్యత్ర పశ్యరవిణా కటకే సువేల
శైలస్య కాఞ్చనశిలా సకలామలశ్రీః
వేలావలోల వరుణాలయవీచిభఙ్గ
పర్యన్తవాడవకృశానుకణోపమానమ్. 36

ఆసన్నపీనజలదావలితాలయానాం
గేహోపశల్య పరిపుల్లవన ద్రుమాణాం
లక్ష్మీః పలాశపటలావలి[illegible]మ్బరాణాం
ఘోషాకసాం సమవలోకయ పర్వతేషు. 37

ఉన్నిద్రపుష్పపటుపాణ్డుర పుష్పఖణ్డా
మన్దారభాణ్డవిశిఖణ్డికరణ్డకచ్ఛాః
గ్రామాః ప్రపాతజలజాల విలాసవాద్యా
వల్గద్గుహాగహనగీతజనా జయన్తి. 38

ఉన్నిద్రకన్దల దలాన్తర లీయమాన
కూజన్మదాన్ధమధుపోన్నదపామరాణామ్
మన్యే న సా భవతి తుష్టిరిహామరాణామ్
యా గోకులేషు గిరిగహ్వరిణాం నరాణామ్. 39

ఓ రాజా! పర్వతములను ఏనుఁగులయొక్క వృక్షములను స్పష్టరోమ సమూహముపైఁ బుష్పరాశి, వసంతహిమ కణములఁబోలినట్టి ఆకాశమునుండి జారిపడిన నక్షత్రములయొక్క లీల వలె విరాజిల్లుచున్నది. యవలోకింపుఁడు! అహా! మత్స్యసమూహములయొక్క సంభ్రమయుక్త ములగు శీఘ్రగమనములచే భేదింపఁబడిన జలతరంగములందు గ్రీడించుచున్న చంచల కుక్కుటి (లకుముకి) పక్షులచే భయంకరములై యొప్పుపుష్పరూప శ్వేతవస్త్రములను ధరించినదై, నిర్భయ ములగు రంకములను మృగసమూహములచే వ్యాప్తములైన తటములుగల జలప్రాయ ప్రదేశము లతోఁ గూడినదై యీ కావేరీనది శోభించుచున్నది. ఓ రాజా! ఈ సువేలపర్వతముపై సూర్యకిరణ ములచేఁ బ్రదీప్తమగు ఈ నిర్మలమైన సువర్ణశిలయంతయు తీరప్రదేశములందుఁ జంచలసముద్ర తరంగములచే వ్యాప్తమగు బడబాగ్ని కణమువలె భాసించుచున్నది చూడుఁడు! దేవా! ఈ పర్వత ములపై సమీపముననున్న ఘనమేఘములచే నావరింపఁబడినవియు సరిహద్దులందు వికసిత పుష్పసంయుక్తములగు వృక్షములచే వ్యాప్తములైనవియు, పలాశ (మోదుగు) వృక్షసమూహ ములచేఁ బరివేష్టితములైన యాకాశ ప్రదేశములచే రమణీయములై యొప్పునవియునగు ఈ గొల్లల యిండ్లయొక్క శోభను వీక్షింపుఁడు! వికసించిన పుష్పములచే అతి శుభ్రములైనట్టి పుష్పవాటి కలతోఁ గూడినవియు, మందారవృక్షములను ననేకపుష్పపాత్రలచేఁ బరిపూర్ణములును, నలువిధ ములగు నెమళ్ళకు నృత్యస్థానమగుటచే పేటికలవంటి జలప్రాయములగు చల్లని ప్రదేశములు గలవియు, గోతులందుఁ బైనుండిపడుచున్న జలసమూహముయొక్క విలాసముచేమయూరముల నృత్యమందు వాద్యరూపములగు ధ్వనులతోఁగూడినవియు, గుహలను గృహములు గల్గియున్నవియు నగు ఈ పర్వతగ్రామములు స్వర్గమునుగూడ జయించుచున్నవి. ఓ రాజా! ఈ పర్వతగ్రామము లందలి గోవులస్థానములందు వికసించిన పుష్పములయొక్క దళములందు లీనములై ధ్వనిచేయు నట్టి మదాంధములగు తుమ్మెదలఁగాంచుటచే నుద్దీపితమైన కామముగల పర్వతారణ్యవాసులగు పామరులైన గొల్లదంపతులకు ఏ సంతుష్టిగలుగుచున్నదో, అయ్యది నందనవనమునఁ గ్రీడించుచున్న దేవతలకుఁగూడఁ గలుగుట లేదని నేను దలంచుచున్నాను.

భృఙ్గావదోలితలతాకులకాననాన్త
ర్గాయత్పులిన్దదయితాననదత్తనేత్రమ్
లీలాకులా గతఘృణం గిరిగహ్వరేషు
కిం ఘ్నన్తి శత్రుమివ ముగ్ధమృగం కిరాతాః 40

నానావికాసికుసుమోత్కరసారలబ్ధ
వల్లీదలావలనశీతలితాధ్వగాఙ్గాః
సామ్భఃపథప్రసరణేన తరత్తరఙ్గా
గ్రామా గిరీన్ద్రగహనేషు జయన్తిచన్ద్రమ్. 41

కూజన్నిర్ఝరవారయః పరిసరత్ప్రోన్నిద్రతాలద్రుమా
హేలోల్లాసితపుష్పపల్లవవలద్వల్లీవితానామ్బరాః
పర్యన్తోన్నతసాలలమ్బిజలదా రమ్యా గిరిగ్రామకా
శ్చన్ద్రాశ్వేత్థమితా వనిం శశిపురోద్యానస్య భాగా ఇవ. 42

ఆసన్నపీతఘనఘర్ఘరమేఘనాద
నృత్యచ్ఛిఖణ్డినవతాణ్డవవిప్రకీర్ణైః
గ్రామాః కలాపికులకోమలబర్హఖణ్డైః
ప్రోడ్డీనచన్ద్రకమణిప్రకరా జయన్తి. 43

పార్శ్వస్థచారుశశిమణ్డలమణ్డనేషు
విశ్రాన్తవారిగురువారిదవారణేషు
గ్రామేషు యా గిరితటేషు విలాసలక్ష్మీ
ర్రాజ్యేషు సా విభవవత్సు కుతో విరిఞ్చే. 44

ఓ రాజా! తుమ్మెదలచేఁ జలింపఁజేయఁబడిన లతలచే వ్యాప్తములగు పర్వతారణ్యము లందు బాడుచున్నట్టి పులిందస్త్రీలయొక్క ముఖములను తదేకదృష్టితో వీక్షించు ముగ్ధహరిణమును, శృంగారచేష్టలచేఁ బరిపూర్ణులగు కిరాతులు నిర్దయులైశత్రువునువలె నేల వధించుచున్నారు? ఓరాజా! పలువిధ వికసిత పుష్పములవలన లబ్ధములైన శైత్య, సుగంధాదులతోఁ గూడిన వాయువుయొక్క లతాసంచాలనములచే పథికుల అవయవములను శీతలపఱచునవియు, జలము యొక్క శైత్యగుణమును గ్రహించినట్టి వాయువులచలనముచేఁ జంచలములైన తరంగములతోఁ గూడిన జలాశయములచేఁ బూర్ణములునగు ఈ పర్వతగ్రామములు శైత్యాదిగుణముల యాధిక్యతచేఁ

ఇంద్రునిగూడ జయించుచున్నవి. మఱియు, ధ్వనిసల్పు సెలయేళ్ళయొక్క జలముతోఁగూడినవియు వాయువుచేఁ జలింపఁబడు వికసిత తాళవృక్షములు గలవియు, శోభాయమానములగు పుష్పపల్లవములచేఁ బూర్ణములైన చంచలలతలచే లీలాపూర్వకముగ నాకసమును గప్పునవియు, సమీపప్రదేశమున నున్నతతాళవృక్షములపై ప్రేలాడు మేఘములచే శోభించునవియు, స్వర్గమందలి చంద్రనగరముయొక్క భాగములవలె నున్నవియునగు ఈ పర్వతగ్రామములు చంద్రసంబంధమగు అమృతమును స్రవింపఁజేయునట్టి అశ్వత్థ వృక్షముతోఁగూడిన బ్రహ్మలోక భూమినిగూడ జయించుచున్నవి. సమీపముననున్నవియు, మెఱపులను ద్రావించువియునగు దట్టములైన మేఘములయొక్క నాదములచే నృత్యముచేయుచున్న నెమళ్ళయొక్క నూతననాట్యములందు వెదచల్లబడిన కోమల పక్షఖండములచే నెగురఁగొట్టఁబడిన చంద్రకమణి సమూహములు గల్గియున్న యీ పర్వత గ్రామములు సర్వోత్తమములై వెలయుచున్నవి. మఱియు, ఒకవైపు మనోహరమైన చంద్రమండలమను ఆభరణముచే భూషితములై, మఱియొకవైపు గొప్పమేఘమండలమను నేనుఁగలచే శోభితములై యున్నట్టి యీ పర్వతతటముల పైనున్న గ్రామములందు ఏ విలాస సంపదగలదో, అయ్యది వైభవయుక్తములగు బ్రహ్మదేవుని రాజ్యములందును నెచటగలదు?

స్వామోదనన్దనవనాన్తరసున్దరేషు
సంతానకస్తబకహాసినికుఞ్జకేషు
ఉన్నిద్రమన్ద్రమధుపాకులపారిభద్ర
సాన్ద్రద్రుమేష్వభిరమే గిరిగహ్వరేషు. 45

హరిణీరావరమ్యేషు హారిహారితహారిషు
గిరిగ్రామేషు పుష్పేషు పురేష్వివ రతిర్నృణామ్. 46

స్ఫాటికస్తమ్భసంభారరమ్యనిర్ఝరవారిణి
నృత్యన్త్యేతాః శిఖణ్డిన్యః పశ్యాస్మిన్గ్రామగహ్వరే. 47

శిఖణ్డిన్యో విలాసిన్యః పుష్పభారనతా లతాః
అత్ర నృత్యన్తి కుఞ్జేషు రణనిర్ఝరపుష్కరే. 48

హారీతహారిహరితోపవనద్రుమాసు
వాపీప్రపమాణరణితామలకాకలీషు
గ్రామస్థలీషు గిరిగహ్వరగోపితాసు
మన్యే ముదైష రమతే స్వరసేనకామః. 49

ఓ రాజా! సుగంధయుక్తమగు నందనవనములవలె సుందరములను, కల్పవృక్షముయొక్క పుష్పగుచ్ఛములను పరిహసించునట్టి కుంజములచే శోభితములును, పుష్పములచేతను, మధురభాషులగు తుమ్మెదలచేతను బూర్ణములైనవియు, దట్టములైననింబ (వేఁప) వృక్షములచే వ్యాప్తములునగు ఈపర్వతవనములందు నేను విహరించుచున్నాను. లేళ్లయొక్క శబ్దములచే రమణీయములును, మనోహరములగు చిలుకలచే హృదయరంజకములునగు ఈ పర్వతగ్రామములందుఁ మన్మథుని పురములందువలె, జనులకుఁ బ్రీతి గలుగుచున్నది. ఓ రాజా! స్ఫటికస్తంభసమూహమును బోలినట్టి సెలయేళ్ళజలముచే రమ్యమైన యీ పర్వతగ్రామారణ్యమున, ఆఁడు

నెమళ్లెట్లు నాట్యమాడుచున్నవో చూడుఁడు! శబ్దమొనర్చుచున్న సెలయేళ్లజలములచే భూషితమైనట్టి యీ పర్వతగ్రామారణ్య కుంజములందు విలాసముతోఁగూడిన యాఁడు నెమళ్లున్ను, పుష్పభారముచే వంగిన లతలున్ను నెట్లు నృత్యముసల్పుచున్నవో, గాంచుఁడు! హారీతములను పక్షులచే మనోహరములును, హరిత (ఆకుపచ్చ) వర్ణముగలవియునగు వనవృక్షములచే శోభితములును, కోనేళ్లయందు సంచరించు హంస, సారసాదిపక్షుల మధురధ్వనులచేఁ బూర్ణములును, పర్వతారణ్యములచే గోపితములునగు యీ గ్రామస్థలములందు మన్మథుఁడు తన యిచ్ఛానుసారము క్రీడించుచున్నాఁడని తలంచెద.

శ్రీమద్వృత్తమహాశయాతపహర ప్రోచ్చైర్గభీరాకృతే
భూభృన్మూర్ధసు భూషణం భవసి భో భూమే రసైకాస్పదమ్
పీతత్తు క్షపయేన్మనాంసి యదిదం మేఘ త్వయా వర్షతా
హర్షాదూషరపల్వలస్థలతరుష్వమోఘవిభాగక్రమః 50

నిత్యం స్నాసి సుతీర్థవారివిసరైరుచ్చైఃపదస్థోమ్బుద
శుద్ధః సన్విపినావనౌ నివససి ప్రారబ్ధ మౌనవ్రతః
రిక్తస్యాప్యతికాన్తిరేవ భవతః కాయాశ్రయా లక్ష్యతే
ప్రోత్థాయాశనిమాతనోషి కిమిదం తుచ్ఛం తవా చేష్టితమ్. 51

ఉదారచరితుఁడవును, మహాశయుఁడవును, ఆతపమును హరించువాఁడవును, ఉన్నత, గంభీరాకారుఁడవునగు నో మేఘమా! నీవు పర్వతముల శిరస్సులపై భూషణమై యలరారుచున్నావు. మఱియు, భూమియొక్క క్షేత్ర, వాటికాదుల సంపత్తికి హేతువగు జలమునకు నీవే స్థానభూతుఁడవై యొప్పుచున్నావు. ఇట్లనేక సద్గుణములతోఁ గూడియున్నప్పటికిని, సంతోషముతో వర్షించునపుడు, అపాత్రభూతములగు ఊషరక్షేత్రములందును, కంటకాది వృక్షములందును సుక్షేత్రములందువలె జలప్రదానము గావించుటవలన నీకుగల సదసత్పాత్రవిభాగమును గూర్చిన అపరిజ్ఞానము సత్పురుషుల చిత్తమును బీడించుచున్నది. ఓ మేఘుడా! నీవు గంగా సముద్రాది యుత్తమ తీర్థములందు జలత్యాగాదులద్వారా నిత్యము స్నానమాచరించుచున్నావు; మఱియు, ఉన్నతపదముపై స్థితినొంది సమస్తప్రాణులకును జలమొసంగుచునున్నావు; శుద్ధుఁడవై అరణ్యభూమియందు మౌనముగ వసించుచున్నావు; శరత్కాలమున జలరహితుఁడవైనను ఉత్తమ ధవళకాంతియే నీ శరీరము నాశ్రయించియుండుట కానఁబడుచున్నది. ఇట్లున్నప్పటికిని నీవు జలదానముకొఱకై లేచి విద్యుద్రూపమగు అగ్నితోఁగూడి కఠోరధ్వని గావించుట యొద్దికలదో, ఆ నీకార్యము సదా అనుచితమై, తుచ్ఛమైయున్నది.

వస్త్వస్థానగతం సర్వం శుభమప్యశుభం భవేత్
దుర్మేఘం స్థానమాసాద్య వారిత్వసితతాం గతమ్. 52

అయోగ్యస్థానమును బొందినచో సమస్త శుభవస్తువులున్ను అశుభములగుచున్నవి. దుష్ట మేఘమను స్థానమునుబొంది స్వచ్ఛమగు జలమున్ను శ్యామ (నల్లని) వర్ణమును బొందుచున్నదిగదా!

అహో ను మేఘేన జలం విముక్త
మహోను తోయేన విపూరితా భూః

అహో ను భూమౌ పరిపోషితశ్చ
జలై రనాఢ్యైః ప్రణయీవ దీనః. 53

అహా ! ఈ మేఘము జలమును త్యజించి భూమిని జలముచేఁ బూరించుచున్నది. మఱియు ధనికులు దీనులగు జనులను మిత్రులనువలె ధనముచేఁ బోషించు నట్లు, ఇయ్యది శుష్కధాన్యాదులను జలముచేఁ బరిపోషించుచున్నది.

నైర్ఘృణ్యమస్థైర్యమథాశుచిత్వమ్
రథ్యాచరత్వం పరికుత్సితత్వమ్
శ్వభ్యో గృహీతంకిము నామ మూర్ఖై
ర్మూర్ఖేభ్య ఏవాథ శునా న జానే. 54

ఓ రాజా ! నిర్దయత్వము, చంచలత్వము, అపవిత్రత, మార్గములందుఁదిరుగాడుట, మహానీచత్వము అను, ఈ నికృష్టగుణములను కుక్కలనుండి మూర్ఖులు నేర్చుకొనిరో, లేక మూర్ఖులనుండి కుక్కలు నేర్చుకొనినవో నేనెఱుఁగను.

గుణైః కతిపయైరేవ బహుదోషోఽపి కస్య చిత్
ఉపాదేయో భవత్యేవ శౌర్యసంతోషభక్తిభిః 55

కుక్కలవలె, శౌర్య, (అల్ప) సంతోష, భక్త్యాది కొన్నిగుణములవలన మనుజుఁడు, అనేక దోషయుక్తుఁడై యున్నప్పటికిని, ఒకానొకనికిఁ బ్రియుఁడగుచున్నాఁడు.

ఉన్మత్తమత్తపతనోన్ముఖధావమాన
మానాధికాన్విషయవీథిషు ముక్తమూర్తిః
యన్మన్యతే తృణలవాగ్ర విలోకయేచ్చా
సత్వం జడత్వముత వాస్య విచార్యతాం తత్. 56

ఓ అల్పతృణాగ్రభాగమా ! భోగపరంపరలం దాసక్తుఁడైన, విషయలంపటుఁడగు మూర్ఖుఁడు, ఉన్మత్తులైనవారిని, మదిరాదులచే మత్తతనొందినవారిని, ప్రమాదక్రోధాదుల యావేశముచే కూపాదులందుఁ బడఁబోవువారిని, పిశాచాదుల యావేశముచేఁ బరుగిడువారిని తత్త్వజ్ఞానాధిక్యతచే దేహాది పరిచ్ఛేదములను మఱచి 'నేను బ్రహ్మమును' అను సర్వోత్కృష్ట ప్రమాణమందుఁ బ్రతిష్ఠితులును, షష్ఠాది భూమికారూఢులునగు మహనీయులను తృణసమానముగ నెంచుట యేదిగలదో, దానిని నీవేగాంచుము? ఆ విషయలంపటుని యిచ్ఛ సత్వమా, లేక జడమా? యను రహస్యమును నీవే విచారింపుము. సత్వమైనచో నపుడా మూర్ఖుఁడు శునక సమానుఁడే యగును. జడమైనచో అల్పతృణాగ్రభాగముకంటెను (విషయలాంపట్యాదిదోషాధిక్యతవలన) తుచ్ఛుఁడగును. ఇట్లు తృణసామ్యత్వమున్ను నాతనికి దుర్లభమైయుండ నిఁక అయున్మత్తాదులకంటె నీచత్వమాతనికి వేఱుగఁ జెప్పవలెనా?

కోలాహలః సమానేఽపి తిర్యక్త్వే క్షుబ్ధమానసైః
అన్యథా సహ్యతే సింహైర్మీలితై రన్యథా శ్వభిః. 57

ఓ రాజా ! సింహము, శునకము (కుక్క), ఈరెండును నొకే తిర్యగ్జాతికిఁ జెందియుండుటచే సమానములైనను, సింహము మేఘాదుల గర్జనమను కోలాహలముచే మనంబున నేక్షోభయు నొందక నేత్రములను మూసికొని సహించుకొనుచున్నది. శునకమో, క్షోభనొందిన మనసుతోఁ గూడి భయముచే నేత్రములను మూసికొని సహించుకొనుచున్నది.

నిత్యాశుచే ప్రియజనే భషణైకనిష్ఠ
రథ్యాన్తరభ్రమణనీతసమస్తకాల
కౌలేయకాశయసమానతయైవ మన్యే
మూర్ఖేణ కేనచిదహో బత శిక్షితోసి 58

నిత్యము అపవిత్రమైనట్టియు, ప్రియజనులపై సదా మొఱుఁగునట్టియు, సందులుగొందులందు (కుమార్గములందు) తిరుగాడుచు, కాలమంతయు, గడుపునట్టియు ఓ శునకమా ! నీయొక్క, మూర్ఖునియొక్కయు చిత్తవృత్తి సమానమగుటఁబట్టి నీవు ఏమూర్ఖునివద్దనుండియో శిక్షను బడసితివని నేను దలంచుచున్నాను.

నిత్యం సర్వం జగదసదృశం కుర్వతోచ్చైర్విధాత్రా
దాహిత్రేఽస్మిఞ్ఛుని సమదృశే నిర్మితం సర్వమేవ
వాసోఽమేధ్యావకరకుహరే భోజనం గూథపూయం
సర్వాలోకే కురతి కురతిః సర్వనిన్ద్యం శరీరమ్. 59

అపవిత్రమై, మలయుక్తమైనట్టి గోతియందు వసించుట, మలమును, చీమును భుజించుట, అందఱు చూచుచుండ మార్గమధ్యమున నిందితమగు మైథునము సల్పుట, అట్టిక్రియయందు దుష్టమగు కోర్కె గల్గియుండుట, మహానింద్యమగు శరీరమును బొందియుండుట అను ఈ యనురూపములగు సమస్తధర్మములను - కర్మవైషమ్యమువలన విషమజగత్తును సృజించు బ్రహ్మదేవుఁడు సరమయను దేవస్త్రీ శునకముయొక్క సంతతిరూపమగు ఈ శునకమందు సమముగనే రచించెను.

త్వత్తః కోఽధమ ఇత్యుదీరితవతే శ్వోవాచ హాసాన్వితం
మత్తో మౌర్ఖ్యమమేధ్యమాన్ద్యమశుభం యః సేవతే సోఽధికః
శౌర్యం భక్తిరకృత్రిమా ధృతిరితి శ్రీమాన్గుణో యోఽస్తి మే
మూర్ఖాదేష గుణః ప్రయత్ననిచయైరన్విష్య నోలభ్యతే. 60

'నీకంటె అధముఁడెవఁడ'ని యడిగిన మనుజునిగూర్చి శునకము నవ్వుచు నిట్లు పలికెను— 'అజ్ఞానము, అపవిత్రత, దేహాభిమానము, విచారనేత్రరాహిత్యము, అశుభము-వీనిని సేవించు మూర్ఖుఁడు నాకంటె అధముఁడైయున్నాఁడు. మఱియు, శౌర్యము, సహజమగు స్వామిభక్తి, అల్పసంతోషము అను నేయుత్తమ గుణములు నాయందు గలవో, అవి యనేక ప్రయత్నములచే వెతకినప్పటికిని మూర్ఖునియందుఁ గానరావు.

భక్తేఽమేధ్య మమేధ్య ఏవ రమతే నిత్యం మహావస్కరే
శ్వాస్థిమత్తి సచేతనం కృతరతిర్నిశ్చేతనం కృన్తతి

సర్వైరేత్య రతే శునీవివలితే లోష్టైర్హనైస్తాడ్యతే
ధాత్రా ఖేలసమన్వితస్థితిరలం లోకే కృతో నేశ్వరః 61

శునకము మలాద్యపవిత్ర వస్తువులనే భుజించును. అతినీచమగు పురీషమునఁ గ్రీడించును. సజీవములైనను, నిరపరాధములగు మూషకాదులను బొందినదై మెదలకుండ తినును. దుర్బలములగు మేషాదులను అపరాధము లేకున్నను కఱచును; స్త్రీ శునకముతో మైథున మొనర్చునపుడు జనులందఱిచే రాళ్ళచేఁ గొట్టఁబడును. ఇట్టి మిక్కిలి అసమర్థమగు శునకమును బ్రహ్మదేవుఁడు, జగత్తునందు సంపూర్ణాయుపర్యంతము మహా దుర్విలాసయుక్తమగు స్థితిగలదానినిగ రచించెను.

లిఙ్గస్యోఽర్ధ్వం రటత్కాక ఆత్మానం దర్శయత్యయమ్
సర్వాధఃపాతకోత్తుఙ్గగతం పశ్యత మామితి. 62

ఓ రాజా ! శివలింగముపై, అక్షతాది శివనిర్మాల్యమును భక్షింపనెంచి యఱచుచున్న కాకి తన్నుగూర్చిన యీ నిదర్శనమును సర్వులకును జూపుచున్నది. — 'అధోగతికి హేతువులైన సమస్తపాపములలో మహాపాపమగు శివనిర్మాల్యభక్షణనందుఁ బ్రవృత్తమైన నన్ను ప్రత్యక్షముగ కాకజన్మనుబొంది యుండుటఁ జూడుఁడు !'

కాకక కటుకల్కారవ కవలితగుణకర్దమే భ్రమన్సరసి
అన్తరయసి మధుపరవం యదతో మే శిరసి ఫలభూతః. 63

కటు! దంభభాషణముచే హంస సారసాది పక్షుల గుణములను కబళించు ఓ దుష్ట కాకమా ! నీవు సరోవరమున పంకమందుఁ దిరుగాడుచు నీకటుశబ్దములచే భ్రమరాదుల మధుర ధ్వనుల నంతర్ధాన మొనర్చుచున్నావు, ఇక్కారణమున నా శిరస్సునందు (బాధను గలుగఁజేయుట వలన) నీవు కంటకరూపమై వర్తించుచున్నావు.

కవలయతి నరకనికరం పరిహరతి మృణాలికాం ధ్వాఙ్క్షః
యదతోస్తు మా స్మయస్తే స్వభ్యస్తం సర్వదా స్వదతే. 64

మిత్రమా ! కాకి పలువిధములగు అపవిత్రపదార్థములను భుజించుచున్నది; మఱియు, లభించినప్పటికిని తామరతూళ్ళను వదలివేయుచున్నది. దీనిచే తమకాశ్చర్యము లేకుండుగాక ! ఏలయనిన, సర్వులును వారివారికి అభ్యస్తమైనదానినే సదా భుజించుచుందురు.

వివిధవనకుసుమ కేసర ధవలవపుర్హంస ఇవదృష్టః
కాకః కృమికులకవలం క్లిన్నమథోకవలయన్జ్ఞాతః. 65

మొమ్మొదట, వివిధవనపుష్పముల కేసరములచేతను, అందలిపరాగములచేతను తెల్లనైనట్టి శరీరముగల కాకి భ్రాంతిచే హంసగాఁ గానిపించెను. పిమ్మటతడిసిన క్రిమిసమూహమును భక్షించుచుండ కాకియని తెలియఁబడెను.

తుల్యవర్ణచ్ఛదైః కృష్ణః సంగతైఃకిల కోకిలైః
కేన విజ్ఞాయతే కాకః స్వయం యది న భాషతే. 66

సమానమైన వర్ణముగల ఱెక్కలతోఁగూడిన కోకిలలతోఁగలిసియుండు నల్లనివర్ణముగల కాకి స్వయముగ మాట్లాడనిచో నిఁక దేనిచే నెఱుఁగఁబడును ?

అరణ్యాన్యా మృదఃస్థాణౌ స్థితః కాకో నిరీక్షతే
చైత్యాద్దశదిశశ్చోరో నిశి సుప్తేజనే యథా 67

రాత్రియందు జనులునిదురింప, చోరుఁడు, దేవాలయ వృక్షమునెక్కి దశదిక్కులు వీక్షించునట్లు, మహారణ్యమందలి మృణ్మయమైన శిథిలస్తంభము పైనుండి కాకి దిక్కులనన్నింటిని జూచుచున్నది.

పరభససారసవిదలత్పుష్కరమకరన్దసున్దరే సరసి
కథమిహ విహరతి కాకఃస్ఫురదవకర నికరధూసరస్కన్ధః. 68

హా కష్టమిష్టవపుషిస్ఫుటపుణ్డరీక
కోశే కషాహననయోగ్యముఖః పిశాచః
పశ్యైష కాక ఉపవిశ్య కువల్వలేఽస్మిన్
లీలాః కరోతి వివిధాః సహ రాజహంసైః. 69

ఓ రాజా ! వేగముతోఁగూడిన సారస, హంసాది పక్షులచేఁ ద్రొక్కఁబడిన కమలముల యొక్క మకరందములచే మనోహరమైనట్టి యీ సరోవరమున, చలించువాయువుచే నెగురగొట్టబడిన ధూళిచే ధూసరమైన శరీరముగల యీ కాకి యెట్లు విహరించుచున్నది ? (అట్లు విహరించుట అనుచితమని భావము.) ఓ రాజా ! తమకభిమతమైనట్టి స్వరూపమగు సరస్సునందు వికసితకమల కోశములందు వెలయుచున్న రాజహంసలతోటి, శిలలచేఁ గొట్టఁదగిన ముఖముగల ఈ కాకియను పిశాచము ఈ దుష్టజలాశయమునఁ బ్రవేశించి రాజహంసవలె నటించుచు వివిధలీలలఁ గావించుచున్నది ! అహా ! ఎట్టి ఖేదకరమైన విషయమో చూడుఁడు !

హే కాక కర్కశరవ క్రకచైకచిహ్న
తాదృక్త్వశఙ్కనమపి క్వను తేఽద్య యాతమ్
కస్మాదనర్థకమిదం పికపాకమేక
పుత్రాశయా తదపి తే హ్యుపహాససిద్ధ్యై. 70

వినువారి కర్ణములను ఛేదించుటకొఱకగు కర్కశధ్వనియను అంపమే యేకైక చిహ్నముగా గల్గిన యో కాకమా ! కాకులయొక్క భాగమును కాకులకంటె వేఱైనదెద్దియు ననుభవింపకుండుగాక యనువిచారముచే సద్యాక్షాకులనే యాహ్వానించుచు నీవఱచుచుందువు. ఆ నీ విచారము నేఁడెచటికిఁ బోయినది ? 'నీవొక్క పుత్రుఁడవు నాకు జీవింపుము' అను ఈ యాశయముతోటి కోకిలయొక్క పిల్ల నేలవ్యర్థముగఁ బోషించుచున్నావు? ఏలయనిన, నీవు సదాకటుభాషివై యున్నావు. కావున మధురభాషియగు నద్దానిని బోషించుట నీ యొక్క మనోరథసిద్ధి (మధురస్వర ప్రాప్తి) కొఱకుఁ గానేరదు, ఉపహాససిద్ధి కొఱకే యగును.

ఆలోక్య పఙ్కజవనే సవిలాసవన్తం
కాకం కలఙ్కసదృశం భృశమారటన్తమ్

హా కష్టశబ్దశతనష్ట విచేష్టితో యో
నో రోదితి క్రకచకేన విదార్యతాం నః 71

కమలవనమున విలాసయుక్తముగ నున్నదియు, కళంకము వంటిదియు మరల మరల అఱచుచున్నదియునగు కాకిని జూచియొకఁ డిట్లనెను – ఓ కాకమా! ఎవఁడు నీయొక్కగాని, దుష్టులయొక్కగాని యనేకక్రూరశబ్దములనువిని ఖేదముచే నష్టచిత్తుఁడైయేడ్వడో, అతనినే నీవు నీకటుశబ్దములను అంపముచేఛేదించివైచుము. కానినేను మాత్రమట్లుకాను. కావున, ఏలవ్యర్థముగ నఱచుచున్నావు.

విశరారుశరారుమయే బకమద్గుఘనే చ పల్వలే చపలాః
స్యుర్యది కౌశికకాకా స్తత్ప్వోద్దేషా సమన్వితా గోష్ఠీ. 72

(దుష్టులసభయందు దుష్టులే యోగ్యులుగాని సాధువొకడైనను గాదను విషయము అన్యాపదేశముచేనిట వచింపఁబడుచున్నది.) సంచరించునవియు, హింసించునవియునగు కొంగలు, నీటికాకులను పక్షులచేఁ బరిపూర్ణమైనట్టి యీ యల్పజలాశయమున చపలములైన గ్రుడ్లగూబలున్ను, కాకులున్నుగూడ వచ్చిచేరినచోనిఁక ఈ యల్పజలాశయరూపమగు సభ తద్యోగ్యులగు సభ్యులతోఁ గూడినదగును.

కోకిలః కాకసంఘాతైః సమసంవరణాకృతిః
గదితైర్వ్యక్తతామేతి సభాయామివ పణ్డితః 73

కాకుల సమూహమందు కోకిల సమానవర్ణము, ఆకారము కలిగియున్నదైె, వానియందుఁగలిసి వేఱుగఁ గనుపింపక యున్నప్పటికిని, సభయందుఁ బండితునివలె, వాక్కులతో నది వ్యక్తమగుచున్నది.

మృదుకుసుమాఙ్కురదలనంసోఢుమలం కోకిలస్య కుసుమలతా
నతు కఙ్కగృధ్రమద్గుక బకకుక్కుటవాయసాదీనామ్. 74

పుష్పలత, కోకిలయొక్క కోమలపుష్పాంకుర ఖండనమను అపరాధమును సహింపఁ గలదుగాని, రాపులుఁగు, గ్రద్ద, నీటికాకి, కొంగ, కోడి, కాకి మున్నగు పక్షులయొక్క స్పర్శనైనను సహింపఁజాలదు. (అట్లే సాధువుల యపరాధములున్ను సహింపఁబడగలవుగాని, దుర్జనుల సంబంధమే దుస్సహమైయుండునని భావము)

శ్రోత్రోత్సవం తవ కలం కలకణ్ఠకోఽత్ర
నాదంశృణోతి రతివిగ్రహసంధిదూతమ్
కాకైరులూకకలహైరిహ గుల్మకేషు
క్రేంకారఘర్ఘరరవైః శ్రుతిరాగశాన్తమ్. 75

(దుష్టుల సభయందు సద్విద్యావర్ణనము గావింపనెంచు మనుజునిగూర్చి యొకఁడు అన్యాపదేశముచే నిట్లు వచించుచున్నాఁడు – ఇంపైన కంఠముగలయో కోకిలా! దంపతుల రతికలహమున సంధియొనర్చు దూతవంటి వాఁడవును, కర్ణములకు ఉత్సవరూపుఁడవునగు నీ యొక్క నాదము నిచట నెవరు విందురు? ఏలయనగా, ఇచట కంటకలతలందు గ్రుడ్లగూబలతోటి సదా కలహముజేయునట్టి కాకులు ఘర్ఘర శబ్దములచే నందఱి చెవులున్ను బగిలిపోవుచున్నవి.

వాచాకోమలయాసుకోకిలశిశుః కల్యాణకల్పాం కథాం
సర్వావర్జనమార్జవేన కురుతే యావత్పురో రాగిణామ్
తావన్మత్తనయోఽయమిత్యవిరతం క్రాంకారభీమారవై
ర్ధార్ష్ట్యేనోపవనే నిపత్య నభసః సర్వే కృతా నీరసాః. 76

ఉపవనమున మధురశబ్దానురాగులగు మనుజుల యెదుట కోమలమగు వాక్కుతోటి మహోత్సవరూపమైన కర్ణసుఖదాయకమగు కథనుజెప్పి కోకిలబాలకుఁడు శ్రోతల మనంబుల రంజింపఁజేయుచుండ నింతలో నాకసమునుండి కాకి యేతెంచి 'ఈ కోకిలశిశువు నా కుమారుఁడు, ఈతనిని నేను బోషించి యుజ్జీవింపఁజేసితిని' అను ఈ మున్నగు భయంకర కఠోరశబ్దములచే ఆశ్రోతలందఱిని నిరుత్సాహులుగఁ జేసివైచెను.

కిం కిం కోకిలకూజసిద్రుతతరవం హర్షాత్సముల్లాసితం
గ్రీవాకోటరతః ప్రవేశయ పునర్మాఖాచ్చిరం తే భ్రమః
ఉద్దామైఃకుసుమైర్నిరన్తరతరం నేదం మధోర్జృమ్భితం
హేమన్తేన కృతాస్తుషారనికరైః శుష్కా అమీ పాదపాః 77

ఓ కోకిలా! నీవు శ్రోతల యోగ్యత్వాదులను విచారింపకనే స్వగుణ ప్రకటనమును గూర్చిన హర్షముచే శీఘ్రముగ నేమిమి కూయుచున్నావు? కంఠమను బిలమునుండి బయల్వెడలిన యుల్లాసయుక్తమగు భాషణమును తిరిగి యాకంఠమందుఁ బ్రవేశింపఁజేయుము. 'ఇది నాగుణములను ప్రకటమొనర్చుటకు తగిన సమయము' ఈ శ్రోతలు యోగ్యులు - అను ఈభ్రమ చిరకాలమువఱకు నీకుండకుండుగాక! ఏలయనిన, ఇయ్యది యుత్తమ వికసితపుష్పములచే నిరంతరము పూర్ణమైయుండు వసంతముయొక్క విజృంభణముకాదు; హేమంత హిమసమూహములచే నిప్పుడీవృక్షములన్నియు శుష్కములుగ గావింపఁబడియున్నవి, కావున వీనియందు నీ వాక్కులకు సాఫల్యములేదు.

కూజితోఽకిలకోమలం కలరవైర్నిత్యం ప్రశస్తాకృతే
కేనేదం బత శిక్షితోఽసి వచనం దుఃఖప్రదందుర్భగమ్
చైత్రే చిత్రనవాఙ్కురే విరహిణీ వక్తి త్వయా యాత్మనః
కస్యాయం మధురిత్యతస్తవతవేత్యుక్తం త్వరోచ్చైస్తరోః 78

చిత్రవిచిత్రములగు నూతనాంకురములతోఁగూడిన చైత్రమాసమున విరహిణి యిట్లు చెప్పుచున్నది - మధురశబ్దముతోటి నిత్యము కూయుచుండునట్టి మనోహరమైన యాకృతిగల యో కోకిలా! ఈ చైత్రమాస మెవనిది అని నిన్ను బ్రశ్నించినపుడు నీవు నీవసంతకాలపు యున్నత వృక్షముపై నుండి శీఘ్రముగ 'తవ, తవ' (నీది, నీది) అని పలుకుచున్నావు, ఈ మిథ్యాభాషణమును, నీకెవరు నేర్పిరి? ఏలయనిన ప్రియురాలితోఁగూడి యానందముగ గానమొనర్చుచున్న నీదే యీ మధు (చైత్ర) మాసమగును గాని విరహిణియగు నాదికాదు. కావున నీ యీ మిథ్యా వచనము నాకుదుఃఖమునే కలిగించు చున్నది.

మానస్పన్దవిహారవర్ణవపుషాం సామ్యేఽపి కాకవ్రజే
కాకః కోకిల ఏష కాన్తిరుచిరో దూరాత్పరిజ్ఞాయతే

మధ్యే మూర్ఖజనస్య పణ్డిత ఇవ స్వాకారభవ్యక్రియః
సర్వో హి ప్రథిమా నమేతి సదృశస్వాన్తశ్చమత్కారతః. 79

ఓ రాజా ! కాకుల సమూహమందు కోకిలకు ఱెక్కలు మున్నగువాని చలనమందును విహారమందును, వర్ణమందును, శరీరమందును సామ్యమున్నప్పటికిని, మనోహరమైన కాంతిగల యీకోకిల, మూర్ఖజనుల మధ్య బండితునివలె దూరమునుండియే (కాకిగాదని) తెలియఁబడుచున్నది. ఏలయనిన, సర్వజనులును నిగూఢులుగ వర్తించినప్పటికిని తమయనురూపమగు అభ్యంతర చమత్కారముచేఁ బ్రసిద్ధత్వమును బొందుచున్నారు.

భ్రాతః కోకిల కూజితై రలమలం నాయాత్యనర్ఘో గుణ
స్తూష్ణీమాస్స్వ విశీర్ణ పర్ణపటల చ్ఛన్నే క్వచిత్కోటరే
ఉద్దామద్రుమకన్దరే కటురటత్కాకావలీసంకులః
కాలోఽయం శిశిరస్య సంప్రతి సఖే నాయం వసన్తోత్సవః. 80

సోదరుఁడవగు నోకోకిలా ! ఇయ్యది కటుభాషణము సల్పు కాకసమూహముచే వ్యాప్తమైనట్టి శిశిరఋతువుగాని వసంతోత్సవముకాదు. ఇపుడు నీమధురకూజనములచే అమూల్య గుణమేద్దియు సిద్ధింపదు. కావున నీకలభాషణమును కట్టిపెట్టి యెచటనైన నేదైన యొక గొప్ప వృక్షముయొక్క తొఱ్ఱయందు ఆకులచే గప్పుకొని మౌనముగ నుండుము.

చిత్రం మాతరమేష కోకిలశిశుః సంత్యజ్య కాకీం గతః
సైషైనం తుదతీతి యావదహమప్యాచిన్తయామి క్షణమ్
తావత్సోఽపి తథాశు మాతృసదృశం శ్లిష్టో రసాద్వర్ధితుం
యామాయాతి దిశం స్వభావసుభగః సైవాస్య మాహాత్మ్యదా. 81

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే శ్వకాక కోకిలాన్యోక్తి వర్ణనంనామ షోడశాధికశతతమః సర్గః ॥ 116 ॥

ఆహా ! ఈకోకిలశిశువు తన తల్లియగు కాకిని విడిచి యెచటికో పోవుట యొక యాశ్చర్యము ! తదుపరి యాతల్లియగు కాకి యీ కోకిలశిశువును ముక్కుతోఁబొడిచి పీడించుట మఱియొక యాశ్చర్యము ! ఇట్టివిషయమును గూర్చి క్షణకాలము విచారించుచుండ నింతలో ఈ కోకిల శిశువున్ను నుత్సాహముతోటి తల్లివలెనే వృద్ధినొందఁజొచ్చెను. ఏలయనిన, భాగ్యవంతుఁడే దిక్కునకుఁ జనునోయాదిక్కే యాతనికి మాహాత్మ్యమును గలుగఁజేయునదగును.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
అవి॥ విప॥ శ్వకాక కోకిలాన్యోక్తి వర్ణనమను
నూట పదునారవ సర్గము ॥ 116 ॥

సప్తదశాధిక శతతమః సర్గః

[వర్ణ్యతేఽత్ర సరఃపద్మ కుముదోత్పలమండితం
పద్మభ్రమరహంసాద్యాస్తత్ప్రసజ్గేన వర్ణితాః.

కమల, కుముదాది పుష్పములచే భూషితమగు సరస్సుయొక్కయు, తత్ప్రసంగమున కమల, భ్రమర. హంసాదులయొక్కయు వర్ణన మిచటఁ గావింపఁబడుచున్నది.]

సహచరా ఊచుః :—

పశ్యాద్రిసానావివ బిమ్బితం ఖం పురఃసరో మారపురఃసరో యః
కహ్లారపద్మోత్పల జాలనాల లలద్విచిత్రారవపక్షివీతమ్ 1
వికాసితోద్దణ్డసహస్రపత్ర కోశస్థలస్థోద్ధుర రాజహంసమ్
పీతద్విరేఫద్విజలోకజుష్టం భువీవ గేహం కమలాసనస్య. 2

ఆకీర్ణసీకరకరాలదిగన్తరాలే
పుల్లోత్పలాబ్జపటలోదర రేణుగౌరమ్
ఆమోదమత్తమదుపద్విజగీతి గీతం
యాతం వితానకమివామ్బరగం వహన్తమ్. 3

క్వచిత్తరత్తారతరఙ్గభఙ్గం క్వచిద్విషద్భూరివిరావిభృఙ్గమ్
క్వచిద్గభీరామలవారిసుప్తం క్వచిత్సరోజోజ్జ్వలపుష్పగుప్తమ్. 4

సహచరులు:— ఓ రాజా ! ఇటనెదుట పర్వతశిఖరముపై నీల, రక్త, శ్వేత కమలములయొక్క నాళములందలి మృణాలముల (తూఁడ్లు) కొఱకై క్రీడించుచు, విచిత్రశబ్దముల గావించునట్టి పక్షులచే వ్యాప్తమై, కావుననే నక్షత్ర, పక్షిగణసహితమై ప్రతిబింబించిన యాకాశమువలె నొప్పుచున్నదైన యీ సరోవరమును గాంచుఁడు ! ఈ పర్వతశిఖర మీ సరోవరముయొక్క శోభాతిశయముచే కామోద్దీపకమగుటఁబట్టి మన్మథుని సేవకునివలె భాసించుచున్నది. ఓ రాజా ! వికసించిన యుత్తమసహస్రదళ కమలములయొక్క కోశములందు శోభాధురంధురములగు రాజహంసలచే సేవింపఁబడుచున్నదై. ఇంద్రనీల మణులఁ బోలినట్టి తుమ్మెదలతోడను, సారసాది పక్షుల తోడను గూడియున్నదై, ఈ సరోవరము భూలోకమున - బ్రాహ్మణాదులచేతను, తదితర జనుల చేతను సేవింపఁబడు బ్రహ్మదేవుని గృహమువలె విరాజిల్లుచున్నది చూడుఁడు ! ఈ సరస్సు, వ్యాప్తములగు జలకణములచే హిమయుక్తములుగ గావించునదియు, వికసించిన కమలాదులందలి రేణువులచే గౌరవర్ణయుతమైనదియు, సుగంధరసముచే మదించినట్టి తుమ్మెదల యొక్కయు, పక్షులయొక్కయు గీతములచేఁ బరిపూర్ణమైనదియు, ఊర్ధ్వదేశమునగల వితానము (మేలుకట్టు) వంటి యాకాశమును బొందిన మేఘ, హిమాదులను ప్రతిబింబముయొక్క మిషచే ధరించియున్నదియు, ఒకచోట చంచల ఉన్నతతరంగములచే వ్యాప్తమైయున్నదియు, మఱియొకచోట మనోన్మత్తతచేఁ బరస్పరము ద్వేషించుకొనుచు మహాశబ్దమొనర్చుచున్న తుమ్మెదలుగలదియు, ఒకచోట గంభీర. నిర్మల. నిశ్చల జలముతో గూడి నిదురించుచున్న దానివలెనున్నదియు. ఒకచోట కమలముల చేతను, కుముదము (ఎఱ్ఱదామర) ల చేతను గప్పఁబడినదియునై విలసిల్లుచున్నది యవలోకింపుఁడు.

కణాణుముక్తాజలతాపటాలం తీరేషు సింహే సులతాసుటాలమ్
తరఙ్గనిర్ధూతశిలోగ్రకచ్ఛం మహీతలాకాశమనన్తకచ్ఛమ్. 5

తడిత్ప్రకాశోదరమస్య మేఘ సున్నాబ్జజాతోత్థరజఃప్రభాభిః
పృషద్భిరధ్వాన్తమయైకదేశం సంధ్యామ్బరాభోగమివాప్రకాశం.
వాతావకీర్ణశరదమ్బుదఖణ్డఖణ్డం వ్యోమేవ కేవలసమీరణమావృతాఙ్గమ్
హంసైర్విలసద్బిసలతాకవలాలసాంసైః కాలేన సంచయకృతైరివ చన్ద్రబిమ్బైః
ఆమోదమన్దమకరన్దకరాలవాత వ్యాధూతపఙ్కపుటపాటనపాటవేన
ఉద్యన్మహాపటపటా వచమీవలేఖా క్షుభ్యత్ఖగాశ్రితలతోజ్ఝితపుష్పవర్షమ్. 8

ఓ రాజా! ఈ సరస్సు ముత్తెములవంటి జలకణములచే తాపమును హరించునదియు, తీరమందలి సింహమును ప్రతిబింబించిన మఱియొక సింహముగ నెఱిఁగి దీర్ఘలతలచే సద్దానిని దొలగించునదియు తరంగములచే నెగురగొట్టఁబడిన శిలలు, పంకముగల తీరములు గల్గియున్నదియు, అనంతములగు మేఘముల, అనంతములైన తీరములుగల యాకాశము భూమిపైకిఁ దిగివచ్చినట్లున్నదియు, మేఘములను దొలగించునట్టి వాయువుచే కంపితమైనట్టి కమలసమూహము నుండిలేచిన పరాగముల దీప్తిచే మెఱపువంటి కాంతితోఁగూడిన యుదరముగలదియు, ఒకచోట జలబిందుమయమై, మఱియొకచోట అంధకారమయమైనట్టి సంధ్యాకాలాకాశమువలె నొకింతప్రకాశముతోఁ గూడియున్నదియు, కాలముచేఁగూడ బెట్టఁబడిన చంద్రబింబములవంటివియు, తామర తూళ్ళను కబళములను శిశువులకొఱకై గూటికిఁ దీసికొనిపోవుచు, తద్భారముచే మందత్వముతోఁ గూడినవియునగు హంసలచే నావృతమైనట్టి శరీరముగలదై, వాయువుచే ఛిన్నభిన్నములైన శరత్కాల మేఘఖండములచే వ్యాప్తమైనట్టి కేవల వాయుయుక్తమగు ఆకాశమువలె నొప్పుచున్నదియు సుగంధ భారముచేవలె మందగమనముగలదై మకరంద సంపర్కముచేఁ దడిసినదైనట్టి వాయువుచేఁ గంపితమగు జలమిశ్రిత పంకమునందలి పంకభాగమును గ్రిందికిఁ బంపుటయందలి త్వరచే 'పటా పటా' శబ్దమును గలుగఁజేయు తరంగసమూహముచే క్షుభితములైనట్టి పక్షులచే నాశ్రయింపఁబడిన తీరస్థలతలచే, తన పుష్పరూపవస్త్రమును వృద్ధిపఱచు చున్నదా యనునట్లు పుష్పవర్షము గావించుచున్నదియునై యలరారుచున్నది చూడుఁడు.

వేల్లన్మహా కమలపల్లవతాలవృన్త సంవీజితం వలితచామరచారుఫేనమ్
రాజాయమానమలికోకిలగీతగీతం సద్వృత్తపఙ్కజలతాలలితాఙ్గనౌఘమ్. 9

భృఙ్గాగ్రభాజనమనోహరహారిగీతం రాజీవరేణురణకీర్ణపిశఙ్గతోయమ్
డిణ్డీరపిణ్డపరిపాణ్డురపుణ్డరీక ఖణ్డోపమణ్డిత తటోపవనావతంసమ్. 10

మఱియు, ఓ రాజా! చంచల మహాకమలదళములను విసనకఱ్ఱలచే వీవఁబడుచు, ఉత్తమఫేనము (నురుఁగు) అను వింజామరములచే వేష్టితమై, భ్రమర, కోకిలాదుల గీతములచేఁ బ్రశంసింపఁబడుచు శ్రేష్ఠకమలలతలను వనితాసమూహముచేఁ జుట్టఁబడినదై యీ సరోవరము రాజువలె శోభించుచున్నది వీక్షింపుఁడు! ఇంకను, తుమ్మెదలను శ్రేష్ఠ, మనోహర గాయకులయొక్క శ్రేష్ఠమైన గానముతోఁగూడినదియు, కమల పరాగములచే వ్యాప్తమగుటచే పీతవర్ణమగు జలము

గల్గియున్నదియు, నురుఁగుముద్దలవలె దెల్లని వర్ణముగల కమల ఖండములచే సమీపమున నలంకరింపఁబడియున్నదియు, తీరమందలి యుపవనమునకు శిరోభూషణమై యొప్పుచున్నట్టి పుష్పసమూహముచే భూషితమైయున్నదియునై వెలయుచున్నది గాంచుఁడు!

వివిక్తహృదయామ్భోజం హృదయాహ్లాదనం పరమ్
రసవత్స్వాదు భాతీదం సరఃసత్సంగమోపమమ్. 11

ఓ రాజా! పవిత్ర (హృదయ) కమలములను ధరించియున్నదైయు, మనంబునకుఁ బరమానందమును గొల్పుచు, అమృతమువలె సాదిష్టమగు రసముతోఁగూడియున్నదై యీ సరస్సు సత్పురుషుల సాంగత్యమువలె శోభించుచున్నది!

బిమ్బితేన మరువ్యోమ్నా భాతీదం సౌమ్యనిర్మలమ్
శాస్త్రార్థపరిణామేన మహతామివ మానసమ్. 12

సౌమ్యుఁడవగు నోరాజా! మరుప్రదేశమువలె జలరహితమైనట్టి శరత్కాలాకాశము యొక్క ప్రతిబింబముచే ఈ సరోవరము బ్రహ్మసాక్షాత్కారముతోఁగూడిన మహాత్ముల మనస్సువలె నిర్మలముగ శోభించుచున్నది.

కించిల్లక్ష్యమపశ్యామం పృషత్పరుషమారుతమ్
హిమాభ్రమివ భాతీదం సరః సరససారసమ్. 13

హేమంతఋతువునందీ సరస్సు మంచుచే, గప్పఁబడుటచే నొకింత మాత్రము కానుపించును. మఱియు, నపుడిది హిమయుక్తమై యుండుటవలన నలుపుదనములేనిదై, మనోహరములగు సారసపక్షులతోఁగూడి హిమసహితమగు మేఘమువలె భాసించును.

యథేదం బ్రహ్మణోదృశ్యమవికారాది నేతరత్
యథామ్భసి తరఙ్గాది రాజన్పృథగివ స్థితమ్. 14

ఓ రాజా! వాస్తవముగ యీ దృశ్యజగత్తు వికారాదిరహితమై బ్రహ్మమాత్రమైయున్నను, అజ్ఞానముచే తద్భిన్నముగఁ జూపట్టునట్లు, ఈతరంగాదులున్ను జలముకంటె వేఱుగాకున్నను వేఱుగానున్నవివలె వర్తించుచున్నవి.

ఆత్మనైవోహ్యమానానాం చక్రావర్తవిధాయినామ్
జడాశయానాం విషమా హా కల్లోలపరమ్పరా. 15

అహా! తమయొక్క జలము (జడత్వము) చేతనే కొట్టుకొనిపోఁబడునవియు, చక్రములవంటి అవర్తము (భ్రమ) లతోఁగూడినవియు నగు జలాశయముల (జడాశయుల) యొక్క తరంగ (దుఃఖ) పరంపర భయంకరమైయున్నది.

కూపవాపీసరోబ్ధీనాం దృశ్యతే యాదృగన్తరమ్
నారీపురుష శ్రేయానాం విజ్ఞేయం తాదృగన్తరమ్ 16

కూప, వాపి(కోనేరు), సరోవర, సముద్రాద్యుపాధి భేదములచే జలమందు తారతమ్యము కల్పింపఁబడినట్లును, వాస్తవముగ జలమంతటను నొకటేయైనట్లును, స్త్రీ, పురుషాది శరీరభేదములచే ఆత్మయందును భేదము కల్పింపఁబడినదేగాని వాస్తవముగ ఆత్మయందే భేదమున్ను లేదు.

జన్తోరివాస్య మనసో జలజాతిబన్ధ జీర్ణస్య జర్జరదశా లహరీభ్రమేణ
ఆవర్తవృత్తివలితాన్యతిసంతతాని కో నామ సంకలయితుం కమలాని శక్తః.

వివిధ జన్మలయొక్క సంబంధముచే శిథిలమైనట్టి జీవుని మనస్సుయొక్క శిథిలదశాంతములతోఁగూడిన భోగోత్సాహములయొక్క అతిశయముచే నిరంతరము ఆవర్తతుల్యములగు - ఇచ్ఛాద్వేషాది వృత్తులయొక్క పరివర్తనములనువలె ఈ సరస్సునందలి జలమునుండి యుత్పన్నములై, నిరంతరము తరంగములచేతను, ఆవర్తములచేతను బరివేష్టితములైనట్టి యనేకవిధములగు ఈ కమలముల నెవరు లెక్కింపగలరు?

చిత్రం విజృమ్భితమహో జడసంగమస్య
పద్మోపి యన్నిజగుణానగుణానివైషః
అన్తః ప్రగోపయతి కణ్ఠతలే నివేశ్య
సర్వాశ్య దర్శయతి దుర్భగకణ్టకౌఘమ్. 18

జలసంబంధము (మూర్ఖుని సాంగత్యము) యొక్క విలాసము ఆశ్చర్యపూర్ణమైనది. ఏలయనిన సద్గుణసంపన్నమగు కమలమున్ను తన సుగంధ సౌందర్య మకరందాది గుణములను కంఠమందుఁ దాచి దోషములనువలెఁ గప్పిపెట్టుచు. దుష్టకంటకాదులను బాహ్యమున సర్వజనులకును జూపుచున్నది.

సచ్ఛిద్రైరదృఢైః సూక్ష్మైర్గోపితైర్జాడ్య సంయుతైః
అనల్పైరపి నిఃసారైః పద్మస్యేవ గుణైరలమ్. 19

ఛిద్రసహితములును, అస్థిరములును, సూక్ష్మములును, గోపితములును జడత్వయుక్తములును నిస్సారములునగు కమల సూత్రములఁబోలిన దోషయుతములైన గుణములెన్నిగలవో, అవిత్యాజ్యములే యగును.

మహతాం కులపద్మానాం గుణసౌన్దర్య శాలినామ్
ప్రభావం నాస్తి సంఖ్యాతుం వాసుకేరపి శక్తతా. 20

యశస్సను సుగంధముచే తమకులమును విఖ్యాత మొనర్చునవియు, గుణసౌందర్యాదులచే శోభించునవియునగు ఉత్తమకమలముల (మహాత్ముల) యొక్క ప్రభావమును లెక్కించుటయందు శేషభగవానుఁడున్ను అసమర్థుఁడగును.

హరివక్షోగతా లక్ష్మీరపి శోభార్థమేవ యత్
బిభర్తి కమలం హస్తే కాన్యాశం సాధికా భవేత్. 21

ఏ కమలమును విష్ణుభగవానుని వక్షస్థలమును బొందిన సర్వసౌందర్యాధి దేవతయగు లక్ష్మియున్ను శోభార్థము తనహస్తమందు ధరించుచున్నదో, అద్దానియొక్క నిఁక నధికమగు ప్రశంసమేమి యుండఁగలదు?

సితాసితాభ్యాం రూపాభ్యాం కమలోత్పలఖణ్డయోః
వైసాదృశ్యం భవేత్కింతు సమా జడజడైతయోః. 22

శ్వేత, నీల కమలములందు - జడత్వముచే జడీభూతమైనదియు, చంద్ర సూర్య ద్వేషమను మూర్ఖత్వముయొక్క రూపమైనదియునగు వృత్తిసమానమేగాని, శ్వేత, నీలరూపములచే మాత్రము భేదముగలదు.

సామ్యం న పుల్లవిపినేన సరఃసు యాతి
వ్యోమ్నా న తారకయుతేన న చేన్దువృన్దైః
నృత్యద్వధూవిహసితాననశోభయైతి
పుల్లస్య పఙ్కజవనస్య నవోదితా శ్రీః. 23

సరోవరములందు వికసించిన కమలవనముయొక్క నూతనముగ నుత్పన్నమైనశోభ, వికసిత కల్పవృక్షవనముతోటిగాని, నక్షత్రసమూహముచే శోభించు నాకాశముతోటిగాని, ఒకచోటఁ జేర్చఁబడిన యనేక చంద్రబింబముల తోటిగాని సామ్యమును బొందనేరదు. నృత్యము చేయుచుండు స్త్రీలయొక్క హాస్యయుక్తమగు ముఖశోభతోటి మాత్రమే సామ్యమును బొందును.

యేషాం పుష్పలతాస్వాదైరనన్యమనసాం గతమ్
భృఙ్గాణామాయురాయామి త ఏవ సుభగోత్తమాః. 24

ఓ రాజా ! వేనియొక్క దీర్ఘమగు ఆయువంతయు పుష్పలతాస్వాదనములందే గడుపఁబడినదో, అట్టి అనన్యచిత్తముగల తుమ్మెదలే సౌభాగ్యయుక్తములును, ఉత్తములునైయున్నవి.

చూతచారుచమత్కారం చఞ్చరీకాశ్చరన్తి యే
త ఏవ సచమత్కారా ఇతరే జాతిపూరణమ్. 25

ఆమ్ర (మామిడి) వృక్షముయొక్క సుందరచమత్కార జనకమగు మకరందరసమును, నూతనాంకురరసమును పానమొనర్చునట్టి తుమ్మెదలు, కోకిలలు మాత్రమే ధన్యములు. తక్కినవి తమ జాతిని పూరించునవి మాత్రమేయగును.

మత్తా మధుమదామోదైః పుష్కరేషు రణన్తి యే
తుష్టానామితరస్వాదైర్భ్రమరాణామ్ హసన్తితే. 26

సుగంధయుక్తమగు మధువునుద్రావి మదోన్మత్తములై కమలములపై ధ్వనిసల్పు తుమ్మెదలు ఇతరపదార్థముల యాస్వాదనములచే సంతుష్టములైనట్టి తుమ్మెదలనుగూర్చి నవ్వుచున్నవి.

యేనోషితంవిరుతముల్లసితం ప్రసుప్తం పద్మోదరేషు శశికోటగకోమలేషు
భృఙ్గః స ఏషశశిరే విరసేషు భావం కష్టం కరిష్యతి కథం తరుపుష్పకేషు. 27

ఏ భ్రమరము చంద్రునివలె కోమలములైనట్టి కమలకోశములందుఁ బ్రవేశించెనో, విహరించెనో ధ్వనిసల్పెనో, విలాసమొనర్చెనో, బాగుగ నిదురించెనో, అయ్యది యిఁక శిశిర ఋతువునందలి శుష్కవృక్షములం దేల ప్రీతిఁగొనును ?

అపుల్లమల్లికోద్దామముకులోపరి షట్పదః
దృశ్యతే కాలరుద్రేణ శూలే ప్రోత ఇవాన్ధకః 28

ముకుళించియున్న మల్లికాపుష్పపు మొగ్గపై తుమ్మెద, కాలరుద్రునిచే శూలమందుఁ గ్రుచ్చబడిన అంధకుఁడను దైత్యునివలెఁ గానుపించుచున్నది.

ఆస్వాదయన్వివిధపుష్పమధూని భృఙ్గం
నిత్యం భ్రమన్సకలశైలలతాగృహేషు
నాద్యాపి తుష్యసి కిమఙ్గ దురాశయోఽసి
మన్యే న సారముపగచ్ఛసి వా వనేభ్యః. 29

ఓ ప్రియమైన తుమ్మెదా! నీవు వివిధపుష్పములందలి మధువునుగ్రోలుచు సమస్త పర్వతలతాగృహములందును నిరంతరము సంచరించుచున్నప్పటికిని నేఁటికిని ఏల సంతుష్టిని బడయకున్నావు? మధులంపటత్వముచే నీవు దురాశయుఁడవయితివని నేను తలంచుచున్నాను. కాకున్న, వనములనుండి యింకను సారపదార్థమును ఏల పొందకుంటివి? (పొందినచో సంతుష్టుఁడవేయై యుందువని భావము).

కమలకులకవలకోవిద గచ్ఛ సరో మధుప మారూఢమ్
బదరదరీషు విదీర్ణం దేహం కురు కణ్టకక్రకచైః. 30

కమలవనమున పుష్పరసాస్వాదనమున నిపుణుఁడవగు నో భ్రమరమా! నీవు కమల సరోవరమునకేగుము. మఱియు, పుష్పరసముచేఁ బరిపుష్టమగు నీ దేహమును బదరీ (రేఁగు) వృక్షకంటకములను అంపములచేఁ గోయకుము.

అతసీకుసుమే కువలయ దలవలయే వికసితే చ తాపిచ్ఛే
వరభాగ మేహి మధునా తాసు విసదృశీవ పణ్డితః పురుషః. 31

ఓ తుమ్మెదా! పండితుఁడగు మనుజుఁడు తనకు అనురూపుఁడగు ప్రభువుగాని, సమాజముగాని లభింపనపుడు అనురూపుఁడుకాని ప్రభువు వద్దగాని, సమాజమువద్దగాని విద్వాంసుని ప్రాప్తికొఱకై వసించునేగాని కిరాతాదిదుష్టుల కులమందు వసింపనివిధమున ఏ హేమంత శిశిరాది కాలములందు నీవుకమలములను బొందకుందువో, అపుడు నీకనురూపములగు అతసీ (అగిసె) పుష్పములందును కలువపూదలములందును, వికసితతమాల పుష్పములందును ప్రాప్తించిన మధువును గ్రోలుచు ఆయువును గడుపుము.

పశ్యైషా నాభినలినీ కేసరైః పాలితా శ్రియా
హంసమాలామలావల్లీ సామగాయనకూజితా. 32

ఓ రాజా! ఈ సరోవరముయొక్క నాభికమలముల కేసరములచే, బాలింపఁబడినదై, కావుననే వానియొక్క వర్ణరూపాదిశోభతోఁ, గూడుకొనినదై సామగానమువలె గంభీరముగఁ గూయు చున్నట్టి యీ హంస సమూహమును వీక్షింపుఁడు!

దోలాకమలనీలస్థాం దృష్ట్వా ఖే ప్రతిబిమ్బితామ్
హంసో హంసీమనుసరన్మణ్డలే నేహ చేతతి. 33

ఓ రాజా! ఇట ఊయలవలె నూఁగుచున్న కమలమను గూఁటియందున్నదియు, ఈ సరోవరమండలముయొక్క యాకాశమునఁ బ్రతిబింబించినదియునగు హంసి (ఆడు హంస) ననుస రించిపోవుచు హంస, తత్పతనభయముచే మూర్ఛిల్లుటఁ గాంచుఁడు!

మా భూత్కస్యచిదేవైషా రాజన్వ్యసనితా భృశమ్
పశ్యైతాం బిమ్బితాం హంసో హంసీమనుసరన్మృతః. 34

ఓ రాజా! ఇట్టి మహాస్త్రీవ్యసన మెవనికిని లేకుండుగాక! చూడుఁడు! ఈ ప్రతిబింబిత హంసి ననుసరించిపోవుచు ఈ హంసయెట్లు మరణించినదో!

హేలయా రాజహంసేన యత్కృతం కలకూజితమ్
న తద్వర్షశతేనాపి జానాత్యాశిక్షితుం బకః. 35

లీలా పూర్వకముగ రాజహంస యేమధుర కూజనమును సల్పునో యద్దానిని కొంగ నూరువత్సరములకైనను నేర్చుకొనఁజాలదు.

సమానేష్వాకరాకారజాతిచేష్టాశనాదిషు
హంసస్య రాజహంసస్య దూరమత్యన్తమన్తరమ్. 36

జన్మ, ఆకార, జాతి, చేష్టా, భోజనాదులందు సామాన్య హంస, రాజహంస సమాన ములేయైనప్పటికిని, ఆ రెంటియందును చాల భేదముగలదు.

శుక్లపక్షస్థితో వ్యోమ్ని కుముదాకరభాసకః
అహ్లాదయతి చేతాంసి హంసశ్చన్ద్ర ఇవోత్థితః. 37

శుక్ల (తెల్లని) పక్షము (ఱెక్క) లచే నాకసమున నుండునదియు, కలువలను బ్రకాశింపఁ జేయునదియునగు హంస, ఉదయించిన చంద్రునివలె చిత్తముల నానందపఱచుచున్నది.

ఉన్నాలనలినీనాలకదలీస్తమ్భసంకులే
వనే విహరతాం లక్ష్మీం హంసానామేతి కః ఖగః. 38

అరఁటి స్తంభములవంటి యూర్ధ్వనాళములతోఁగూడిన కమలములయొక్క వనమందు విహరించు హంసల (యోగుల) యొక్క శోభను ఏయితర పక్షియున్ను (ఆకాశ చారులగు దేవతలున్ను) పొందఁజాలరు.

తరఙ్గవలయాలోలసీకరోత్కరహారిణీ
కుముదోత్పల కహ్లాదపుష్పసంభారసున్దరీ. 39
భృఙ్గలోలాలకలతా రణత్సారసనూపురా
వర్తులావర్తనాభికా చలద్వీచివిలోచనా. 40
ప్రతీక్షమాణా దయితం రసపూరకరంధరమ్
నారీవ సరసీ చారు హంసకాఖ్యాం విరాజతే. 41

ఓ రాజా! తరంగములను కడియములను ధరించినదియు, చంచలజలకణములను హారములచే శోభించునదియు, రక్త, నీలాది వర్ణములుగల కమలములను పుష్పసమూహములచే మనోహరముగ నున్నదియు, తుమ్మెదలను చంచలకేశములు గలదియు, శబ్దించు సారసపక్షులను నూపురము (అందె)లతోఁ గూడినదియు, చక్రాకారములగు ఆవర్తములను నాభిచే శోభించునదియు, చలించు తరంగములను నేత్రములు గలదియు, లతలతోడను, ఇరువురు హంసబాలకుల తోడను గూడినదియునగు ఈ సరోవరమను స్త్రీ. మనోరథమను జలమును పూరించునటువంటి పర్వతమును తన పతిని నెదుటఁగాంచుచు విరాజిల్లుచున్నది.

హే హంసమద్గుబకకాకశరారుసారే మా త్వం సరస్యవిరతం కురు వాసమేకః
ఆపద్యపీహసమశీలవయోవచోభిః శ్రేయఃఫలాభవతి సంగతిరాత్మవర్గైః. 42

ఓ హంసా! నీవు కొంగలు, కాకులు, నీటికాకులు మున్నగు హింసక పక్షులచే సేవితమగు సరస్సునందొంటరిగ వసింపకుము. ఏలయనిన. తనతోటి సమానములగు శీల, వయో, వచనాదులతో గూడిన స్వవర్గీయులందు వసించుట విపత్తునందును శ్రేయోదాయకమేయగును.

పాదాక్రాన్తమహేభమస్తకతటః పద్మాకరై కాలయః
కహ్లారోత్పలకున్ద చమ్పకలతాసంభోగసౌభాగ్యవాన్
భృఙ్గోఽప్యేష విధేర్వశేన శిశిరే లోష్టం తృణం స్వాదయన్
శీతే శుష్కబకత్యహో ను విపదా దైన్యే మనోదీయతే. 43

తమపాదములచే గజేంద్రముల మస్తక తటములగూడ ద్రొక్కునదియు, కమలవనమే నివాసస్థలముగ, గలదియు, రక్త, నీల, శ్వేతకమలములయొక్కయు, కుంద (మొల్ల) చంపక లతలయొక్కయు సంభోగముచే సౌభాగ్యవంతమైనదియునగు - (ఇట్టి ప్రభావముగల) - తుమ్మెదయు విధివశమున శిశిరఋతువునందు లోష్ట (మట్టిగడ్డ), తృణాదుల నాస్వాదించుచు శుష్కబకము (కొంగ) వలె నాచరించుచున్నది! అహా! విపత్తునందు బెద్దలమనస్సున్ను దీనత్వమును గ్రహించుచున్నది!

పుత్రస్యేహ దలోదరే ద్యుతితరత్తారం చిరం సంస్మృతం
హంసస్యాంసవినున్ననాలగహనే సంచారిణా భో మయా
శుక్లాసారమిహాబ్జినీ వికిరతి స్వం వారిబిన్దూత్కరం
మధ్యాహ్నే శిశిరం వికాసి సహసా మూర్ధ్నిస్ఫుటం దృశ్యతాం. 44

ఓ రాజా! హంసయొక్క ఱెక్కలచేఁ గొట్టఁబడిన నాళములుగల కమలవనమును ప్రవేశించిన నేనొకపుడు ప్రకాశమానమగు కమలమందు స్థితినొందియున్న హంసబాలకుడు స్వముఖము నుండి వినిర్గతమగుచున్న యున్నతస్వరముతోటి యీ వాక్యములను దనతండ్రితో బల్కుచుండ వింటిని. వానిని చిరకాలమున కిపుడు స్మరించుచున్నాను — ఓ తండ్రీ! కమల సరస్సితే ముత్తెములఁబోలిన జలబిందుసమూహమును వెదచల్లుచున్నది. పైననో మధ్యాహ్న సమయమందును అకస్మాత్తుగ విస్తరించిన యీ మంచును ప్రత్యక్షముగఁ జూడుము!

వ్యోమ్నిన్దోరివ సౌమ్యవారిణి చిరం నిఃశబ్దకం సర్పతో
హంసస్యాంసహతాబ్జనాలవలనానిష్కమ్పటబ్కక్షత్రైః

గఙ్గావారివదత్ర పుష్కరపుటాద్బ్రాహ్మాదివాసోపరి
భ్రష్టా యే జలబిన్దవో జలచరా హృష్టాః పిబన్త్యాశు తామ్. 45

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే పద్మభ్రమరహంస వర్ణనంనామ సప్తదశాధికశతతమః సర్గః ॥ 117 ॥

ఓ రాజా! ఈ సరస్సునందు, ఆకాశమందలి చంద్రునివలె నిర్మలమైనట్టి జలమందు నిశ్శబ్దముగ సంచరించుచున్న హంసయొక్క ఱెక్కల ఆఘాతములచేఁ జలింపఁజేయబడిన - బ్రహ్మదేవుని ఆసనమువంటి - కమలపుటమునుండి యే జలబిందువులు ఈ సరోవరము పైబడుచున్నవో, వానిని మత్స్యాదిజలచరజీవులు ప్రసన్నులై గంగాజలమునువలె శీఘ్రముగఁ బానమొనర్చుచున్నవి చూడుడు!

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అవి॥ విప॥ పద్మభ్రమరహంసవర్ణనమను నూటపదునేడవ సర్గము ॥ 117 ॥

అష్టాదశాధిక శతతమః సర్గః

[బకమద్గుమయూరాణాం పాన్థానాం చ వియోగినామ్
మత్స్యానాం చాతకానాం చ చరిత్రమిహ వర్ణ్యతే.

బక, జలకాక, మయూర, వియోగిపథిక, మత్స్య చాతకముల చరిత్ర యిచట వర్ణింపబడుచున్నది.]

సహచరసహచర్యః క్రమేణోచుః:—

నిర్గుణస్య బకస్యాస్య గుణ ఏకోఽస్తి దృశ్యతామ్
యత్ప్రావృషం స్మారయతి ప్రావృట్ప్రావృడితి బ్రువన్. 1

సహచర సహచరీగణము క్రమముగ నిట్లు పలికెను - ఈ గుణరహితమగు కొంగయందొక గుణము కలదు చూడుఁడు - ఇది 'ప్రావృట్ ప్రావృట్' అని పలుకుచు వర్షర్తువును స్మరింపఁజేయుచున్నది.

బక హంస ఇవాభాసి సరఃస్థో మద్గుసౌహృదమ్
నృశంసత్వం చ వాణీం చ త్యక్త్వా హంసో భవ స్ఫుటమ్. 2

ఓ బకమా! నీవు సరస్సునందున్నదానవై వర్ణముచే హంసవలె భాసించుచున్నావు. అట్టి నీవు జలకాకులతోటి మిత్రత్వము, జీవహింసయను క్రూరత్వము, కఠోరవాణియను నీ మూడు దోషములను ద్యజించి స్పష్టముగ హంసవుకమ్ము.

గమ్భీరం వారిగర్భం ప్రసృతజలచరం యే ప్రవిశ్య ప్రవిశ్య
ప్రాజ్ఞత్వాన్నో గృహీతచఞ్చ్వచఞ్చ్వతురతర పరం జగ్ధవన్తో విదగ్ధాః
తే కేనాప్యద్య దిష్ట్యా మృతతిమిగమితాః కాలయుక్తే మహిమ్నా
నాక్రామన్తి క్రమస్తాః సుహరమపి పురః పఙ్గవో మద్గవోఽమీ. 3

మహాచతురుఁడవగునో రాజా! మత్స్యములఁ జంపుటయందు నిపుణములును. అనేక జలజీవులచేఁ బూర్ణమైనట్టి జలగర్భమును మరల మరల ప్రవేశించి ముక్కులతోటి చేపలను బట్టుకొని భక్షించునవియునగు యీ జలకాకులు దైవవశముచే దేనియొక్క మహిమచేతనో మృతినొందిన తిమియను మత్స్యములను భుజించుటచే కంఠరోగముతోఁ గూడినవియు, కుంటివియు కాఁగా మిగుల యాకలిబాధతోఁ గూడియున్నను ఎదుట సమీపముననేయున్నవియు, తేలికగఁ బట్టుకొనఁబడునవియునగు మత్స్యములపైఁగూడ ఆక్రమణము సలుపజాలకున్నవి! ఆశ్చర్యము.

ఏవం విహన్యతే లోకః స్వార్థేనేతి ప్రదర్శయన్
మద్గుర్మద్గురుతాం యాత ఇత్యేవం స్తౌతి దుర్జనః. 4

'ఈ ప్రకారముగ జలకాకివలెనే స్వార్థముచే ప్రపంచమున జనులు యితరులను వధించుటకు జూచుచున్నారు'. అను అర్థమును ప్రదర్శించుచు, ఇవ్విషయమున జలకాకి నా గురువు అని యిట్లు దుర్జనుఁడు జలకాకిని ప్రశంసించుచున్నాఁడు.

ఉత్కన్ధరో వితతనిర్మల చారుపక్షో
హంసోఽయమత్ర నళసీతి జనైః ప్రతీతః
గృహ్ణాతి పల్వలజలాచ్ఛఫరీం యదాసౌ
జ్ఞాతస్తదా ఖలు బకోఽయమితీహ లోకైః 5

ఇట ఆకాశమువైపునకుఁ గంఠమెత్తుకొనియున్నదియు, నిర్మలములును, మనోహరములును విశాలములునగు ఱెక్కలు గలిగియున్నదియునగు ఈ యెదుటనున్నది హంసయనిజనులు మొదట నిశ్చయించిరి. కాని యెపుడు అల్పజలాశయమునుండి మత్స్యమును బట్టుకొనఁదొడఁగెనో అపుడిది కొంగయని వారెఱిఁగిరి.

అతిబహు కాలవిలోలా నవలోక్య బకాంస్తపోదమ్భాన్
అత్రైవా తిమిరస్థాం స్తటవనితా విస్మితా ధూర్తాన్. 6

అల్పజలాశయాదులందు మత్స్యములకొఱకు బహుకాలము చంచలములైయున్నవియు, ఈ సరస్సునందే తపోదంభము గలిగియున్నవియునగు బకము (కొంగ) లను వీక్షించి, ధూర్తుల చరిత్రము లెఱిఁగిన తీరమందలి యొకానొకవనిత, ఆరీతిగనే యితరచోట్ల చాలకాలము విషయలాంపట్యముచే చంచలురును, ఈ సరోవరతీరమున సాయంకాలమువఱకు కపటముచే తపము సల్పువారునగు ధూర్తులనుజూచి విస్మయమొందెను.

అత్ర జలే హిమహేలాః పశ్యైతా అపహరన్తి సితపద్మాన్
ఇచ్ఛసి తా అనుగన్తుం నాహం తే వల్లభా వ్రజామీతి. 7
కుపితాం తామనునేతుం యత్నపరః పాన్థ ఏష పథి కాన్తామ్
అవలోకయ నరనాయక కుసుమలతాకుహర కేలితీరవనే. 8
ఇతి హావభావవిలసిత వివలనకోపార్ధదృష్టిహసితాని
కుర్వాణా వరవనితా కథయతి తే దృశ్యతాం రాజన్. 9

(పథికుని భార్య పథికునితో నిట్లనియె -) 'నాథా! ఈ సరోవరజలమందు శీతత్వమును లెక్కఁజేయక తెల్లనికమలములను గొనిపోవుచున్న స్త్రీలను జూచుచున్నావు. వారిననుసరించి నీవు పోఁదలంచు చున్నందున నేను నీ ప్రియురాలును గాను, అందుచే నాదారి నేనేగుచున్నాను.' ఇట్లు వచించుచు కుపితయైన యా తనపత్నిని శాంతపఱచుటయందు యత్నపరుఁడై యా పథికుఁడు పుష్పలతాకుంజములచే శోభితమగు నదీతీరవనమందామెను బ్రార్థించుచున్నాఁడు, ఓ నరాధిపా? చూడుఁడు! మఱియు, ఆ పథికుల దాంపత్యచరిత్రమును హావభావ విలాసములతోడను, కోపయుక్తమగు అర్ధదృష్టితోడను హాస్యాది చేష్టలతోడను వచించుచున్న యీ తమ యుత్తమవనితనవలోకింపుఁడు!

బక మద్గుశరారూణాం నిత్యమేకౌకసామపి
సంకరోఽస్తి మిథో బుద్ధేర్న మూర్ఖవిదుషామివ. 10

నిరంతర మొకేస్థలమున నున్నప్పటికిని మూర్ఖ, పండితులందువలె, కొంగలందును, జలకాకులందును, నీచజాతికిఁజెందిన హింసకమానవులందును బుద్ధిపరస్పరము కలియకనుండును.

చఞ్చ్వగ్రే ఖఞ్జరీటస్య కీటః కిటికిటాయతే
దౌర్భాగ్యస్య పురాణస్య పతాకేవోచ్ఛ్రితోన్నతే. 11

ఓ రాజా! ఊర్ధ్వభాగమున, దౌర్భాగ్యుని పూర్వసంచిత పాపరూపమగు పొడవైన పతాకమువలె, ఈ కాటుకపిట్టయొక్క ముక్కుకొనయందు కీటమెట్లు 'కిటకిట' మనుచున్నదో గాంచుఁడు!

తారం తీరతరౌ స రౌతి తరలో యావద్బకః ప్రోల్లసం
స్తావత్పల్వలగోష్పదేఽమ్బుకలిలే యావద్బలాద్దేహకమ్
మజ్జన్త్యా ప్రియవక్షసీవ నిపుణాం త్రాతం శఫర్యా భయా
ద్ధృద్భఙ్గేన మహాపదీహ హి మృతేర్నాన్యద్భవేత్సౌఖ్యదమ్. 12

ఓ రాజా! ఈ యల్పజలాశయముయొక్క తీరమందలి వృక్షముపై కొంగ యుల్లాసముగఁ గూయుచుండ నింతలో నద్దానినోటియందున్న మత్స్యము తన సంపూర్ణ బలముతోటి యా జలమందు దుమికి, తనప్రియుని వక్షస్థలమును జేరుటకాయసునట్లు మునిఁగి భయముచే మరణించినను, తన శరీరమును బాగుగ రక్షించుకొనినదేయాయెను. ఏలయనిన, ఈ ప్రపంచమున మహావిపత్తుసంభవింప హృదయభంగముచే మరణించుటకంటె నధికసౌఖ్యప్రదమగు శరణమెద్దియునులేదు.

బకాజగరమద్గూనాం హృది యా ప్రాణినాం ధృతిః
అచర్విత నిగీర్ణానాం మన్యే నిద్రోపమైవ సా. 13

బక, జలకాక అజగరాది ప్రాణుల యుదరమందుఁ బ్రవేశించినవియు, నమలక మ్రింగఁబడినట్టివియునగు మత్స్యాది ప్రాణుల యొక్క స్థితి సుషుప్తి సదృశమగు మూర్ఛయే యని నేను దలంచుచున్నాను.

ఆసన్నమద్గు బకగృధ్రబిడాలసర్ప
దృష్ట్యా భయం భవతి యత్సలిలాశయానామ్

తస్యాగ్రత స్తృణమివాశనిపాతభగ్నో
జాతిస్మరేణ విదుషో క్తమదః పురా మే. 14

సమీపముననున్న జలకాకి, కొంగ, గద్ద. పిల్లి, పాము మున్నగు హింసక జీవులను జూచినపుడు మత్స్యాది ప్రాణుల కేభయము గలుగుచున్నదో, అద్దానిముందు, పిడుగుపడుటవలన గలుగు భయమున్ను తృణమువలె అల్పమేయైయున్నదను రహస్యమును పూర్వము, మత్స్యాది ప్రాణుల దుఃఖములను స్మరించుచున్న యొకానొక విద్వాంసుఁడు నాకుఁ జెప్పెను.

ఇహ సరోవరతీరతరో స్తలే కుసుమశాలిని ముగ్ధమృగాన్పురః
సమవలోకయ లోకమలా బలాత్సమవకీర్ణనవోత్పలకేతకాన్. 15

ఓ రాజా! ఇట నెదుట ఈ సరోవరతీరమునగల పుష్పపరిపూర్ణమైనట్టి వృక్షతలమున తుమ్మెదలు నేత్రములకు, చెవులకు అనందమొనగూర్చుచుండ, నూతన కమలములను, కేతకి (మొగిలి) పుష్పములను జెదరఁగొట్టుచున్నట్టి యీ ముగ్ధహరిణములను తమ ప్రియురాండ్రకుఁ జూపుఁడు!

బర్హీ ప్రోన్నతచి త్తత్వాత్తోయమిన్ద్రం ప్రయాచతే
స పూరయతి తేనాస్య మహాత్మా నిఖిలాం మహీమ్. 16

నెమలి గొప్పబుద్ధిగల దగుటచే ఇంద్రునిగూర్చియే జలమునకై యాచించుచున్నది. ఉదారచిత్తుఁడైన మహాత్ముఁడగు ఆ యింద్రుఁడున్ను నద్దాని గొప్పబుద్ధికిమెచ్చి దానిప్రీతికొఱకై భూమినంతటిని జలముచే నింపుచున్నాఁడు. (మహాత్ములు అత్యుదారులని భావము.)

మేఘాననుసర న్త్యేతే మయూరా స్తనపా ఇవ
మలినో మలినస్యైవ పుత్ర ఇత్యనుమీయతే. 17

దూడలు తల్లులననుసరించునట్లు, ఈ నెమళ్ళు మేఘముల ననుసరించుచున్నవి. దీనిచే, నలుపువర్ణముగల నెమలి నలుపువర్ణముగల మేఘముయొక్క యే పుత్రుఁడని యూహింపఁబడుచున్నది.

మృగానాలోక్య పథికశ్చి న్తయన్దయి తేక్షణే
పురః స్థేష పదార్థేష యన్త్ర పుత్రికతాం గతః. 18

బాటసారి లేళ్ళనుజూచి, తనప్రియురాలి నేత్రములనుగూర్చి చింతించుచు, యంత్ర నిర్మిత విగ్రహమువలె నెదుటనున్నట్టి పదార్థములఁగూడఁ గాంచకయున్నాఁడు చూడుఁడు! (నిశ్చేష్టుఁడై యుండెననుట.)

శిఖీ వార్యపి నాద త్తే భూమేర్భు క్తే బలాదహిమ్
దౌరాత్మ్యం తన్న జానే కిం సర్పస్య శిఖినోఽథవా. 19

నెమలి భూమిపైనుండి జలమునైనను గ్రహింపదుగాని సర్పమును మాత్రము బలాత్కారముగ గ్రహించి తినును. ఇపుడీవిషయమున సర్పముయొక్క దుష్టత్వమో, లేక, నెమలి యొక్క దుష్టత్వమోనేనెఱుఁగను.

సజ్జనాశయనీకాశం త్యక్త్వా బర్హీ మహత్సరః
పిబత్యమ్బ్వభ్రనిష్ఠ్యూతం మన్యే తన్నశిఖీశితః. 20

సజ్జనుల యంతఃకరణమును బోలినట్టి మహాసరోవర జలమును వదలి మయూరము మేఘముఖమునుండి జారిననీటిని ద్రాగుటకు కారణము, సరోవరమునకు శిరస్సు వంచవలసి వచ్చుటఁ గూర్చిన భయమని తలంచెద.

లసత్కలాపజలదాః పశ్య నృత్యన్తి బర్హిణః
ధున్వానాః పిచ్ఛకాన్తీన్ద్రం ప్రావృషః పోతకా ఇవ. 21

ఓ రాజా! ప్రకాశించు పింఛములను మేఘములతోఁ గూడినవై, పింఛములయొక్క ... ద్రుని గంపింపఁజేయుచు వర్షాకాలముయొక్క బాలకులవలె నొప్పుచు నృత్యము ... నెమళ్ళను జూడుఁడు!

వరవనే వనవాతవిసారిణాం చపలచన్ద్రక చారుతరఙ్గిణామ్
ఇహ పయోనిధిరేవ కపాలినాం విసృతము క్తతయేవ విలాసనః 22

ఈ శ్రేష్ఠవనమున వనవాయువుచే చంచలములును, చపల చంద్రచిహ్నములతోగూడిన తరంగములను సుందరపక్షములు అెక్కలుగలవియునగు నదీరూపములునగు మయూరములను తనయందు విస్తరింపఁజేయబడిన ముత్యములనువలె నాట్యమాడింపఁజేయునది సముద్రమేగాని మేఘముకాదు.

చరతృణాని పిబామ్బు వనావనౌ కలయ విశ్రమణం కదలీవనే
చకితచాతక పావకదూషితా నహి సుఖాయ భవత్యతిమానితా. 23

ఓ భీతిల్లిన చాతకమా! నీవు కదళీవనసమీపమునగల శీతల హరిత (పచ్చని) తృణములను భక్షింపుము; కాలువలు మున్నగువానియందలి నీటిని ద్రావుము. కదళీవనమున విశ్రమింపుము, ఏలయనిన ఈ వనభూమియందు గ్రీష్మర్తువందు అగ్నియొక్క సంభావనతోగూడినట్టి శుష్కవృక్షపు తొఱ్ఱయందలి నివాసమునుగూర్చిన గర్వము నీకు సుఖముకొఱకు గానేరదు.

నాయం మయూర మకరాలయవారిపూర
పూర్ణోదరో జలధరోఽమ్బరమారురుక్షుః
దావాగ్నిదగ్ధ వనపాదపకోటరాగ్ర
ధూమావలీవలయ ఉత్థిత ఏష శైలాత్. 24

ఓ మయూరమా! ఈ యెదుట గానిపించుచున్నట్టి యాకాశమున కెగయుచున్న పదార్థము సముద్రజలముచేఁ బూర్ణమైన యుదరముగల మేఘముకాదు ఇది దావాగ్నిచే దగ్ధమైన వనవృక్షములయొక్క తొఱ్ఱలనుండి బయల్వెడలిన చక్రరూపమగు ధూమసమూహము, పర్వతమునుండి లేచినదేయగును.

యేనాబ్దేన శరద్విధావపి శిఖీ సంతర్పితో వారిభి
ర్నో వర్షాస్వపి పూరయేద్యది సరస్తద్బాలలోకోచితమ్
ఆరబ్ధం సమవేక్ష్య సజ్జనజనో హాసేన దుఃస్థో భవే
ద్బర్హీ త్యాత్మతృషైవ నేతుమఖిలం కాలం సమభ్యుద్యతః. 25

'ఏ మేఘము శరత్కాలమందు మయూరమును ఉదకములచేఁ తృప్తిగావింపలేదో, అయ్యది వర్షర్తువందును సరస్సును పూరింపకుండనిచో' అను వాక్యము అల్పులకే తగునుగాని విజ్ఞులకుఁగాదు. 'ఔదార్యయోగ్యమగు సమయమందును, ఆరంభింపఁబడిన యీ అనౌదార్యమును జూచి, పామరులచే గావింపబడిన యాహాస్యమువలన సజ్జనులు దుఃఖితులగుదురు.' అని యిట్లు చింతించి, మయూరము దప్పికతోనే తన కాలమంతయుఁ గడుపుటకు ఉద్యుక్తమయ్యెను.

స్ఫటికవిమలం పీత్వా తోయం ఘనోదరనిర్గతం
పిబతి స పునర్మార్గే క్షుభ్యం స్తృషాపి శిఖి జలమ్
స్ఫురతి చ ఘనం స్మృత్వా స్మృత్వా న చాపి విపద్యతే
గుణవతి జనే బద్ధాశానాం శ్రమోఽపి సుఖావహః. 26

మయూరము (నెమలి) మొదట స్ఫటికపలె నిర్మలమైనదియు, మేఘమునుండి వినిర్గతమైనదియునగు జలమును్రదాగి మరల దప్పిక గొనినను మార్గమందలి బురదతోగూడిన నీటి నెన్నఁటికిని త్రాగకయేయుండును. అది మేఘమును స్మరించి యుల్లాసముజెందునేగాని మరణింపదు. వీలయనగా ఆశావంతులైన గుణశీలురకు శ్రమము సుఖదాయకమేయగును.

ఇహాతివాహయన్త్యేతే మార్గదౌస్థ్యం ఘనాగమే
కథాభిః ప్రథికాః ప్రాయో విమూఢా జీవితం యథా. 27

ఓ రాజా! ఆత్మజ్ఞానరహితులగు మూఢులు తమ జీవితమును కష్టముతో గడుపునట్లు ఇచట స్త్రీ వియోగులగు ఈ బాటసారులు వర్షర్తువునందు దమ సమయమును కథావార్తాదులతోటి కష్టముగ గడుపుచుండుటఁ జూడుఁడు!

పశ్యాత్ర నాథ సరసః కమలోత్పలకుముద బిసమృణాలానామ్
కహ్లారపత్రపయసాం భారానాదాయ బాలికాశ్చలితాః. 28
కిమిదం న యథేతి తతః పృష్టాభిస్తాభిరుక్తమేతస్య
వ్యసనజ్వరతప్తాయాః పథిక వయం బాలఖ్య ఇతి. 29
అథ రాగరక్తహృదయాః స్తనభరవితతా విలాసలలితాఙ్గ్యః
పథికానాం స్మరణపథం భూయోఽవ్యనయన్ప్రియాః స్వగేహస్థాః.
సా నూనం మమ కాన్తా దృష్ట్వా సుస్నిగ్ధఘనతమః శ్యామమ్
గగనం చ శూన్యగహనం ప్రలపతి భువి పతతి విస్థలతి. 31

ఓ రాజా! ఈ సరోవరమునుండి, రక్త, శ్వేతకమల పత్రములయొక్కయు కమలదండములయొక్కయు, రక్తకమలములపై సంబద్ధమైన జలముయొక్కయు భారమును వహించి యీ యువతులు జనుచున్నారు, గాంచుఁడు! 'ఈ కమలముల భారమును ఏలవహించుచున్నారని' నేను వారిని బ్రశ్నింపనంత వారు ఓ పథికుఁడా! మేమందఱము పతివియోగముచే సంతప్తయైన నాయికయొక్క బాలసఖులము. కావున నామెయొక్క యుపచారార్థము వీనిని గొనిపోవుచున్నారము' అని వచించిరి. అటుపిమ్మట, తమతమ ప్రియులం దనురాగవతులును, గొప్ప స్తనభారముతోఁ గూడుకొనియున్నవారును. కోమలాంగములచే విలాసవతులై యొప్పుచున్న వారునగు యాసఖులు తమ యాకృతులచే పథికులకు. దమ తమ గృహములందలి ప్రియురాండ్రను జ్ఞప్తికిఁ దెచ్చిరి. అట నొకపథికుఁడు తనప్రియురాలిని గూర్చి స్మరించుచు నిట్లు పలికెను. — మిగుల దట్టములైనట్టి యీ మేఘములను అంధకారముచే శ్యామవర్ణయుక్తములైన యీ యాకాశమును, వనమునుజూచి నా ప్రియురాలిపుడు వియోగముచే నేడ్చుచు, భూమిపైఁబడుచు, తొట్రుపాటు నొందుచుండును, నిక్కము!

...దలీకువలయావలితాబ్జపాత్ర సంప్రేర్యమాణనలినీమధుపానమత్తః
...తీరతరుపల్లవలాస్యలబ్ధసమ్ముగ్ధశబ్దగణగీతగుణో నభస్వాన్. 32

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే హరిణ మయూరకముగ్ధాదివర్ణనం నామాష్టదశాధికశతతమః సర్గః ॥ 118 ॥

తుమ్మెదల సమూహముచేతను, కలువలచేతను జుట్టఁబడిన కమలమను పాత్రచే నొసంగఁబడిన మధువుయొక్క పానముచే మదించినదియు, తీరమందలి వృక్ష, లతలయొక్క పల్లవముల నృత్యముచే లబ్ధమైన కోమల, గంభీరశబ్దసమూహముచేఁ బ్రసిద్ధమొనర్పఁబడినట్టి శైత్య, మాంద్య, సౌగంధ్యాది గుణములతోఁ గూడినదియునగు వాయువు వీచుచున్నది.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
అవి॥ విప॥ హరిణమయూరక ముగ్ధాదివర్ణనమను
నూట పదునెనిమిదవ సర్గము ॥ 118 ॥

ఏకోనవింశాధిక శతతమః సర్గః

[పథికః స్వాం ప్రియాం ప్రాప్య తదగ్రే తద్వియోగజామ్
ప్రాక్తనీం స్వాం దశామత్ర శ్మశానాన్తామవర్ణయత్.

వియోగియను యొక పథికుఁడు తన ప్రియురాలిని బొంది, ఆమెముందు, (పూర్వము) వియోగముచేఁ గలిగినట్టి శ్మశానపర్యంతమగు తన దుఃఖమయస్థితిని వర్ణించుట యిచటఁ గాననగును.]

సహచరా ఊచుః :—

కథయత్యేష పథికః పశ్య మన్దరగుల్మకే
ప్రియాయాశ్చిరలబ్ధాయా వృత్తాం విరహసంకథామ్. 1

సహచరులు:— ఓ రాజా! ఈ పథికుఁడు (బాటసారి) మందరపర్వతముయొక్క పొదరింటియందు, చిరకాలమునకు లభించిన తన ప్రియురాలియెదుట తన పూర్వపు విరహకథను జెప్పుచున్నాఁడు చూడుఁడు!

విశ్రత శృణు కింవృత్తమాశ్చర్యమిదముత్తమమ్
దాతుం త్వన్నికటే దూతమహం చిన్తాన్వితోఽవదమ్. 2

అస్మిన్మహాప్రలయకాలనమే వియోగే
యో మాం తయేహ మమ యాతిగృహం స కః స్యాత్

పథికు(డు:— ప్రియా! నీ వియోగదశయందొక దినమున సంభవించినట్టి యీ యాశ్చర్యకరమై, ఉత్తమమైనట్టి వృత్తాంతమును వినుము — నీ చెంతకు నాయొక్క వృత్తాంతమును బంపుటకై దూతకొఱకు విచారించుచు చింతాన్వితు(డనై నేనిట్లను కొంటిని — మహా ప్రళయ కాలము వంటి యీ వియోగరూపమగు గొప్ప విపత్తునందు ఈ నావృత్తాంతమును నా గృహము నకు(గొంపోయి నా ప్రియురాలి కెఱి(గింప(జేయు దూతయెవ(డు కలడు ?

నైవాస్త్యసౌ జగతి యః పరదుఃఖశాన్త్యై
ప్రీత్యా నిరన్తరతరం సరలం యతేత. 3

ఈ ప్రపంచమున(నితరుల దుఃఖమును శమింప(జేయుటకై ప్రీతితో సరలభావముతోటి నిరంతరము యత్నించు మనుజు(డెవడు(నులేడు.

అ ఏష శిఖరే మేఘః స్మరాశ్వ ఇవ సంయుతః
విద్యుల్లతావిలాసిన్యా వలితో రసికః స్థితః. 4

ఇంతలో నాకీ విషయము స్మరణకు వచ్చినది — ఈ యెదుటనున్న పర్వతశిఖరముపై ఈ కానుపించుచున్న మేఘము ప్రీతిచే నిరంతరము పరదుఃఖోపశమనము గావించుట మున్నగు గుణములతో(గూడినదై, మన్మథుని గుఱ్ఱమువలె శీఘ్రముగ నా గృహమునకేగ సమర్థమైనదై, పరోపకార రసికస్వరూపమై, మెఱపుతీగెయను తన ప్రియురాలితో(గూడి యిటనున్నది. (కావున, నేను దీనినే ప్రార్థించెదనని తలంచి యద్దానితో నిట్లంటిని.)

ఖ్యాతర్మేషు మహేన్ద్ర చాపముచితం వ్యాలమ్బ్య కణ్ఠే గుణం
నీచైర్గర్జ ముహూర్తకం కురు దయాం సా బాష్పపూర్ణేక్షణా
బాలా బాలమృణాలకోమలతనుస్తన్వీ న సోఢుం క్షమా
తాం గత్వాసుగతే గలజ్జలలవై రాశ్వాసయాత్మానిలైః 5

చిత్తతూలికయా వ్యోమ్ని లిఖిత్వాలిఙ్గితా సతీ
న జానే క్వాధునై వేతః పయోద దయితా గతా. 6

'శోభావంతమగు గమనము గలిగినట్టి సోదరు(డవగు నో మేఘమా! ఉత్తమగుణము లతో నలరారు నీకుచితమైనట్టి గొప్ప యింద్రధనుస్సును గ్రహించి నా ప్రియురాలివద్దకేగి జల కణయుక్తములగు నిజవాయువులచే నామెను మొమ్మొదట నూరడింపుము. పిమ్మట దయయుంచి నా సందేశమును దెలుపుటకై కొంచెముసేపు మెల్లమెల్లగ గర్జింపుము. ఏలయనిన, నాయొక్క వియోగమునుగూర్చిన దుఃఖముచే అశ్రుపూరితలోచనయు, లేక కమలనాళమువలె(గోమలమైనట్టి శరీరముగలదియు, బాలయు నగు నా ప్రియురాలు నీ కఠోరగర్జనమును సహింప(జాలకయుండును.

ఓ మేఘమా! నే నామెను నా హృదయాకాశమున చిత్తమను కలముతోటి చిత్రించి కౌగలించు కొనుచుండ నింతలోనే యామె యిపుడిచటనుండి యెచటికేగినదో తెలియకున్నది.

ఇత్థం చిన్తాపరవశమతే స్తన్వి సార్ధం త్వయాఽసా
వన్తర్లీనప్రసరమనసః క్వాపి యాతా స్మృతిర్మే
సంపన్నోఽహం పరవశవపుః కాష్ఠకుడ్యోపమాఙ్గో
భగ్నం సోఢుం క ఇవ విరహక్లేశజం నామ శక్తః. 7

పశ్చాజ్జాతః కలకలరవః సంతతే పాన్థసార్థే
దీనాలాపైర్వ్యసనవిధురై రాలపన్తే చ మేఘమ్
కష్టం పాన్థో మృత ఇతి మహారమ్భసంపన్న హాహా
శబ్దః ప్రోద్యత్పథికవనితావిస్మృతోరఃప్రహారః. 8

లోకేనాసుం మృతి ఇతి తతో బాష్పసంపూరితాక్షం
శాఖిం పూజాం విరచితవతా సంచయీకృత్య దారు
దగ్ధుం నీతోఽస్మృతి భయమహం ప్రజ్వలచ్చిత్యనన్త
ప్రోద్యత్స్ఫోటస్ఫుట పటపటారావరౌద్రం శ్మశానమ్. 9

తత్రాహం తైః కమలవదనే బాష్పపూర్ణాక్షివక్త్రై
ర్న్యస్తః కైశ్చిచ్చితిశయనకే బద్ధలోకాలిలేఖే
ధూమోద్గారావిరలజటిలే మస్తకే మత్తమృత్యో
శ్చూడారత్నోత్తమ ఇవ కలామాత్రదృశ్యేఽగ్ని హేమ్ని. 10

అస్మిన్కాలే కువలయలతాకోమలా ధూమలేఖా
నాసారన్ధ్రం మృదుగలబిలం మే ప్రవృత్తా నియాతుమ్
ఉష్ణా కృష్ణా నకులకలితా సత్వరం బాలసర్పీ
భూమే రన్ధ్రం తనుమివ దరాద్దైర్ఘ్యసంకోచకుబ్జా. 11

ఓ సూక్ష్మాంగీ! ఇట్లు మేఘమునుగూర్చి చెప్పి చింతా పరవశు(డనైయుండ, మనస్సు లోననే లీనముకా(గా, పూర్వాపరవిచారసమర్థమగు నా బుద్ధి నీతో(గూడ నెచటికో పోయినది. అట్లు బుద్ధి లోపించుటచే నేనపుడు పరవశమైనట్టి శరీరముగల్గి కాష్ఠ, శిలాదులవలె నిశ్చేష్టములైన యంగముల గలవా(డనైతిని. విరహజనితమగు తాపమును సహింప నెవ(డు సమర్థు(డగును! ప్రియా! అటుపిమ్మట, నన్నట్లు, చేష్టారహితునిగ(గాంచి పథికసమూహమంతయు, గలిసి అయ్యో, అయ్యో, ఈ పథికు(డు మరణించెను! అని యిట్లు గొప్పవేగిరపాటుతోటి 'హాహా' శబ్దములు గావింప(దొడ(గెను. తదుపరి వక్షఃస్థలమును బాదుకొనుచు 'అయ్యో పాంథు(డు మరణించెను' అని విలపించుచు నేతెంచినట్టి పథికస్త్రీలయొక్క మహాకోలాహలము సంభవించెను. అప్పుడచట కొందఱు దుఃఖముచే గద్గదస్వరము గలవారై దీనాలాపములతోటి మేఘమునుగూడ

నిందింపసాగిరి. తదనంతర మా పథిక జనులందఱును నన్ను మృతునిగ నిశ్చయించి అశ్రుపూరితలోచనులై శవమునకుఁ దగిన పూజనుగావించి, కాష్ఠములను బ్రోగుచేసి మహాభయంకరమైనదియు, ప్రజ్వలించు చితులచే నుత్పన్నములగు అనంతములైన స్పష్ట 'పటపటా' శబ్దములచేభీతిని గొల్పునదియునగు శ్మశానమునకు నన్ను గొనిపోయిరి. ఓ కమలముఖీ! అచట అశ్రుపూరిత నేత్రులగు కొందఱు పథికులచే నేను చితియను శయ్యపై నుంచఁబడితిని. అటు పిమ్మట, నలువైపుల జనులను బంధించునట్లొప్పునదియు, దట్టమైన ధూమసమూహమును వెలిగ్రక్కుచు భయంకరమై యున్నదియునగు మదించిన మృత్యువుయొక్క శిరస్సుపై నుత్తమ చూడామణివలె స్ఫురించునట్టి అగ్నియను సువర్ణము కళామాత్రము (ఒకింత) కానుపింప, అపుడు కలువతీఁగవలె కోమలమై, ఉష్ణమై, నల్లనై, దీర్ఘత్వసంకోచముచేఁ బొట్టిదైనట్టి ధూమపంక్తి నా యొక్క మృదువైన నాసికాబిలమునముంగిసచే భయపెట్టఁబడిన బాలసర్పము సూక్ష్మమైన భూరంధ్రమునందుఁ బ్రవేశించునట్లు, ప్రవేశింపఁదొడఁగెను.

త్వత్సంకల్పామృతకవచితో నాపవిద్ధస్తయాహం
కున్తఃశ్రేణ్యా దృఢపతనయా వజ్రకాయో యథాజః
త్వామాసన్నాం మదనసరితం హృద్గృహే గాహమానో
మర్మచ్ఛేదేష్వపి విలసితా నావిదం వేదనాస్తాః. 12

ఏతావన్తం సమయముచితం తన్వి సార్ధం త్వయాన్త
ర్లీలాలోలం హృది చిరతరం తన్మయాత్రానుభూతమ్
యస్మిద్దృష్టేఽమృతహ్రద ఇవోన్మజ్జనో మైర్యథాసా
రాజ్యాభోగో విశసనమివాల్పాల్పమేవేతి బుద్ధిః. 13

సా లీలా తే విలాసా వచనమపి చ తత్సస్మితం తే కటాక్షాః
సానన్దానన్తరస్య ప్రసరసముచితా దూరమణ్యేకభూషా
తానీహారావసారావహసన చలనావేగవిక్షోభితాని
కింవా తత్తన్న యత్సంస్మృతమమృతరసాహ్లాదస[illegible]కరోతి. 14

త్వత్సంగమే సురతసౌఖ్యరసాయనేన
బాలే తతోఽహమతితృప్తతయా శ్రమార్తః
తత్రస్థితో మృదుని తల్పతలే శశాఙ్క
బిమ్బే శరచ్ఛిశిరనిర్మలశోచిషీవ 15

అత్రాన్తరే ఝటితి చన్దనపఙ్కశీతా
దీర్ఘాదివేన్దుశకలాదశనిః సశబ్దః
దృష్టో మయా చితితలజ్వలితో హుతాశః
క్షీరాబ్ధివాడవనిభోఽఙ్గగతః సతల్పాత్. 16

కాని, ఓ ప్రియా! నేను నీయాకారమను అమృతముచే కవచముచేవలె ఆవృతుఁడనై వజ్రశరీరుఁడగు బ్రహ్మదేవుఁడు మృత్యువు యొక్క, దృఢపతనముతోఁగూడిన కుంతాయుధ (ఈఁటె) సమూహముచే బీడింపఁబడనట్లు, ఏమియు పీడితుఁడును గాకయుంటిని. మఱియు, నా హృదయమను గృహముయొక్క సామీప్యమును బొందిన మన్మథ - నదీతుల్యవగు నీ యొక్క స్వరూపమున స్నాన మాడుచుండుటచే, ముఖ్యావయవములు ఛేదింపఁబడు చున్నప్పటికిని ఆయగ్నిదాహ జనితమగు బాధను నేననుభవింపకయేయుంటిని. ఓ సూక్ష్మాంగి! ఆ మూర్ఛదశయందు హృదయముననున్న నీతో లీలాపూర్వకముగ చిరసౌఖ్యమనుభవించితిని. అపుడాసుఖమందు అమృతకుండయందలి స్నానముచేగలుగు సౌఖ్యము కానుపింప త్రైలోక్య రాజ్యాధిపత్య సుఖముకూడ తుచ్ఛమేయను బుద్ధి నాకుఁ గలిగెను. ప్రియా! మహదానందదాయకమగు ఆ నీ లీల, ఆ విలాసము, వచనము, చిరునగవు, కటాక్షదృష్టులు, శ్రేష్ఠమగు మణిమయహారము తీసివేయఁబడునట్టి ఆనందప్రదమగు రతిసమయమందలి యాలింగనక్రియ, అప్పటి చేష్టలు భూషణముల శబ్దములు హాస్యము, అవయవముల చలనము, చిత్తవిక్షోభము ఈ మున్నగు వానియందు అమృతసమానమగు సుఖమును గలిగింపని దెద్దికలదు? బాలా! అటుపిమ్మట నీ యొక్క సంగమున రతిసౌఖ్యమను అమృతముచే మిగుల తృప్తుఁడనై, శ్రమచేనలసి యచట కోమలశయ్యపై, శరత్కాలమున శీతలకిరణయుక్తమగు చంద్రబింబమునందువలె స్థితినొందియుంటిని. అయ్యవసరమున, చందనపంకమువలె శీతలమైనదియు, దీర్ఘమైనదియునగు చంద్రమండలమునుండి మిగుల అసంభవమగు పిడుగువలె, ఆ నాశయ్యనుండి బయల్వెడలినదియు శబ్దసహితమైనదియు అవయవములఁ దాకుచున్నదియు, చితిపై జ్వలించుచున్నదియునగు అగ్నిని, క్షీరసముద్రపు బడబాగ్నివలెఁ గాంచితిని.

సహచరా ఊచుః:—

ఇత్యుక్తవతి కాన్తేఽస్మిన్ హా హతాస్మీతి వాదినీ
ముగ్ధా మౌగ్ధ్యాద్వరావర్తశఙ్కయా మూర్ఛితా స్థితా. 17
తామేనామేష నలినీదలవీజేన వారిభిః
ఆశ్వాసయంస్తథావస్థాం కణ్ఠేకృత్వాత్ర సంస్థితః. 18
పునః పృష్టోఽనయా వక్తి వశ్య తామేవ సంకథామ్
ఏష పార్శ్వగతామేనాం గృహీత్వా చిబుకే ప్రియామ్. 19

హా హా హుతాశ ఇతి కించిదివోపజాత
ఖేదో వదామి ఖలుయావదహం త్వరావాన్
తావచ్చితిర్ఝటితి తైరవలుణ్ఠితా సా
పాన్థైః క్షణాత్థరఖరాకులితాలసద్భిః. 20

పాన్థాస్తతస్తరలతాలవిలాసవాద్య
మాలిఙ్గ్య మామతనుశేఖరపూరితాఙ్గమ్
ఉత్థాపితస్థితిమలం పరివార్య సర్వే
నేదుర్ఘగుర్ఘహసురానన్నృతుర్వ్యవల్గుః. 21

సహచరులు :— ఓ రాజా! పతి యిట్లు చెప్పుచుండ ముగ్ధయగు ఆ స్త్రీ తన ముగ్ధత్వము వలన మహాప్రళయము (పతిమరణము)ను గూర్చిన శంకచె 'అయ్యో చచ్చితిని' అని పలుకుచు మూర్ఛిల్లెను. అట్లు మూర్ఛిల్లిన యా కాంతను పతి కమలదళములను వీచుటచేతను, శీతల జలమును జల్లుటచేతను శాంతపఱచి, మూర్ఛనుండి లేపి. కంఠమందుఁ జేర్చుకొని యిచట (మందరపర్వతకుంజమున) నున్నాఁడు. ఓ రాజా! అట్లు మేలుకొనినపిదప తన యాప్రియురాలి చిబుకము (గడ్డము)ను బట్టుకొని పతిశేషించిన కథ నిట్లామెకుఁ జెప్పుచున్నాఁడు జూడుఁడు (పతి) ప్రియా! అపుడు నే నొకింత ఖేదము జనించినవాఁడనై 'అయ్యో! ఇది అగ్ని' అని చెప్పుచుండగనే యింతలో శీఘ్రముగ అప్రసన్నయుతులగు పాంథులు 'ఖరఖర'శబ్దముచేఁ బూర్ణమగు ఆచితి నంతయు లాగివైచిరి. మృతుఁడాయెనని తలంపఁబడినవాఁడు మరల బ్రతుకుటచే ఆ పథికు లందఱును తాళవిలాసవాదనపూర్వకముగ చితిపైనుండి నన్నెత్తి, అనేక మంగళపదార్థముల చేతను, ఉత్తమ పుష్పసమూహములచేతను పూరితమైనట్టి శరీరముగల నన్ను కౌఁగిలించుకొని, నలువైపుల నన్ను జుట్టి ప్రసన్నత్వముచేఁ బాడఁదొడఁగిరి. గంతులువేయఁ దొడఁగిరి. నవ్వ దొడఁగిరి. వాద్యములు వాయింపఁ దొడఁగిరి, నృత్యము చేయసాగిరి.

విషమవినాయకసుఖదం వలితం భస్మాహిశవశిరఃప్రకరైః
శశిధవలాస్థికపాలం వపురివ రౌద్రం శ్మశానమథ దృష్టమ్. 22

పార్శ్వచ్ఛాయాం హరన్తో విచలితవిదలక్లిన్నకఙ్కాలగన్ధా
స్తన్వన్తో భూరిభస్మ ప్రవితతమిహికామాధునానాః శవానామ్
కేశానాకాశకోశే శశిగలితశరాకారిణః శాంకరాణా
మస్తీనాం టాంకృతేనారచితఖరగిరస్తత్ర వాతా వహన్తి. 23

జ్వలదనల చితిప్రవాహనిర్యత్పవనహతోష్మవిశుష్కపర్ణవృక్షా
జ్వరనపవనభాస్కరాత్మజానాం రమణగృహానుకృతిం బిభర్తి సా భూః. 24

దృష్టం శ్మశానం తదనస్తభీమ కరఙ్క కంకాల ఘనామగన్ధి
మాద్యచ్ఛివావాయసకఙ్కగృధ్ర పిశాచవేతాలవిరావరౌద్రమ్. 25

ఆనీతనానాశవబన్ధుసార్థ సంరోదనాప్రహాదిదిగన్తకుఞ్జమ్
ఖగావకృష్టార్ధశిరాన్త్రతన్త్రీ నిబద్ధదగ్ధద్రుమఖణ్డజాలమ్. 26

క్వచిచ్చితిక్షోభకృతప్రకాశం క్వచిన్మహాకేశకృతాబ్దవృన్దమ్
క్వచిచ్ఛరక్తాత్తధరావితానం నక్తం స్తనత్యభ్రమివాస్తశైలమ్. 27

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే
పథికవిరహవృత్త వర్ణనంనామ ఏకోనవింశాధికశతతమః సర్గః ॥ 119 ॥

అటుపిమ్మట, భస్మముయొక్కయు, సర్పములయొక్కయు, శవముల శిరస్సుల యొక్కయు సమూహములచేఁ బూర్ణమై, భయంకరులగు వినాయక, యోగిన్యాదులకు సుఖ దాయకమై, చంద్రునివలెఁ దెల్లనైనట్టి యస్థులచేతను, కపాలములచేతను వ్యాప్తమై, రుద్రసంబధమగు

శరీరమువలె నొప్పుచున్నట్టి యాశ్మశానభూమిని నేను గాంచితిని. అచ్చోట, ప్రక్కనున్న వనము యొక్క పచ్చనినీడను - ధూళిని విసరుటద్వారా - హరించునవియు తడిసిన శవములయొక్క దుర్గంధమును వ్యాపింపఁజేయునవియు, పెక్కు ధూళులచే హిమసమూహమును విస్తరింపఁజేయు నవియు, శవముల కేశములను గదల్చునవియు, అకాశమను అమ్ములపొదియందలి - చంద్రుని సమీపమునుండి జారిన — బాణములవలె నొప్పుచున్నవియు, శివునకు భూషణయోగ్యములైనట్టి అస్థుల యాఘాతములచేఁ గఠోరశబ్దములఁ గావించునవియునగు వాయువులు వీచుచుండెను. ప్రియా! ప్రజ్వలించు అగ్నులుగల చితులనుండి ప్రవాహరూపముగా బయల్వెడలిన ధూమసహిత ములగు అగ్నిస్ఫులింగములతోఁగూడిన వాయువుచేఁ గొట్టఁబడినవియుఁ కావుననే వేడిమిచే మిగుల శుష్కించినట్టి యాకులుగలవియునగు వృక్షములు గల్గియున్న యాశ్మశానభూమి, అగ్నియొక్క, శనియొక్క క్రీడాయోగ్యమగు గృహమువలెఁ జెన్నొందుచున్నది. మఱియు, ఆశ్మశానము భయంక రములైనవియు, సగము కాలినవియు. దుర్గంధపూర్ణములునగు శరీరములచే వ్యాప్తమై, మదోన్మత్తము లగు సృగాల (నక్క), కాక, గృధ్ర, పిశాచ, బేతాళాదుల శబ్దములచే నతిభీకరమైయుండియుండు టను నేనుగాంచితిని. ఇంకను నయ్యది ఏవిధశవములఁ గొనివచ్చు బంధ్వాదుల రోదనములచే నంత టను శబ్దయుక్తములైనట్టి దిగంతములు, కుంజములున్ను గలదియు, పక్షులచే లాఁగుకొనిపోఁబడిన నరములచేతను, ప్రేగులచేతను గప్పఁబడిన దగ్ధప్రాయములైనట్టి వృక్షఖండములు లతాసమూహ ములు గల్గియున్నదియునై యొప్పుచుండెను. ప్రియా! ఆశ్మశానమొకచోట చితియొక్క సంచలన ముచే నగ్నిజ్వాల ప్రదీప్తమగుటచేఁ బ్రకాశయుక్తమైనదియు, మఱియొకచోట శవముల గొప్ప కేశములచే మేఘసమూహములవలె గన్పట్టునదియు, ఒకచోట రక్తమయమైన పృథివియను వితా నముతోఁగూడినదియు, ఒకచోట శైలరహితమగు ఉఱుముచున్న మేఘమువలె రాత్రి చూపట్టునది యునైయుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
అవి॥ విప॥ పథికవిరహవృత్తవర్ణనమను నూటపందొమ్మిదవ సర్గము ॥119॥

వింశాధికశతతమః సర్గః

[వర్ణ్యన్తే వాయవో వృక్షా భ్రమరా వనపఙ్క్తయః
దేవస్త్రియోఽబ్ధివీచ్యశ్చ హేమచూడఖగాదయః

వాయు, వృక్ష, భ్రమర, వనసమూహ, దేవస్త్రీ, సముద్రతరంగ, హేమచూడ పక్ష్యాదు లిచట వర్ణింపఁబడుచున్నవి.]

సహచరా ఊచుః—

ఏవం ప్రాయాః కథాః కుర్వత్స్వైన్మిథునం మహత్
పానం ప్రవృత్తవత్సారం పాతుం పద్మనిభేక్షణ.

సహచరులుః— కమలనేత్రుఁడవగు నో రాజా! ఈ మున్నగు కథల, జెప్పుకొనుచు ఆదంపతు లిరువురును నిపుడుత్తమమగు మద్యమును ద్రావుటయందుఁ బ్రవృత్తులైరి చూడుఁడు!

కదలీకన్దలీస్వచ్ఛగుచ్ఛోచ్ఛ్రాటనపణ్డితాః
వివిధా వాయవో వాన్తి పుష్పకేసరమణ్డితాః. 2

వాన్తి వాతా వనోద్యాన్తవివిధామోదమాంసలాః
పీతఘర్మకణాః కాన్తలలనాలకలాలకాః. 3

కులాచలగుహాగేహవలనోద్యన్మృగాధిపాః
సరన్త్యసురసంరమ్భైర్లవణార్ణవమారుతాః. 4

తమాల తాలతరల లీలాన్దోలనలాలితాః
అనిలాజలకల్లోలోత్క్రాన్తకోమలపల్లవాః. 5

లలన్నవలతావాన్తపుష్పధూళివిధూసరాః
సరన్తి మరుతో మన్దముద్యానేషు నృపా ఇవ. 6

ఓ రాజా ! కదలీ, కందళ్యాద్యనేక నిర్మల పుష్పగుచ్ఛములను వికసింపఁజేయుటయందు నిపుణములును, పుష్పకేసరములచే నలంకృతములును, వనములనుండి బయల్వెడలిన వివిధసుగంధ ములచేఁ బూర్ణములును, స్వేదబిందువులను ద్రాగినవియు, సుందరస్త్రీలయొక్క చెదరిన కేశముల తోటి విలాసమొనర్చునవియునగు అనేక ప్రకారములైన వాయువులిచట వీచుచున్నవి గాంచుము ! మఱియు; ఈ లవణసముద్ర వాయువులు కులపర్వతములయొక్క గుహలను గృహములందుఁ బ్రవేశించి, అటుఁదిరుగఁ బ్రారంభించు సింహములవలె నొప్పుచున్నవియు, అసురులవలె సంరంభ యుక్తముగ మేరుపర్వతశిఖరము నాక్రమింపఁ బ్రయత్నించుచున్నట్లున్నవియునై వీచుచున్నవి. ఇంకను, తాళ, తమాలవృక్షములను నూయెలయందు చంచలబాలకునివలె లీలాపూర్వకముగ నూఁగునవియు, జలకల్లోలములనుండి యెగిరివచ్చి వృక్షాగ్రములందలి కోమలపల్లవములను గ్రహించునవియు, విలాసమొనర్చునూతన లతలనుండి వెలువడిన పుష్పపరాగములచే ధూసరితములైన వియునగు ఈ సుగంధవాయువులు రాజులవలె వనవాటికలందు విహరించుచున్నవి.

మధురం వంశవిశ్రాన్తో గాతుమేష వనానిలః
ప్రవృత్తః పాణ్డనగరనారీభిరివ శిక్షితః. 7

ఓ రాజా ! హస్తినాపురపు గానవిద్యాకుశలలగు స్త్రీలనుండి శిక్షను బడిసినదానివలె ఈ వెదుళ్ళవనమున విశ్రమించు వాయువు మధురముగఁ బాడుట కుపక్రమించుచున్నది చూడుము!

నికారః కర్ణికారేణ పవనస్య యదా కృతః
తదా పరిహరన్త్యేనం భ్రమరా అపి దూరతః. 8

ఓ రాజా ! ఎపుడు కర్ణికార (కొండగోఁగు) వృక్షము సుగంధ, పరాగాదుల నొసంగక యీ వాయువును దిరస్కరించివైచినదో అపుడు తుమ్మెదలున్ను నద్దానిని దూరమునుండియే త్యజించివైచుచున్నవి.

న దదాతి ఫలం కించిదర్థినే న చ పల్లవమ్
తాలః స్తమ్భితయాఽఽరమ్భం హ్యరూపైవ వినాఽఽకృతిః. 9

ఈ తాళవృక్షము స్తంభమును బోలియున్నదై, ఎక్కుటకుఁ గష్టసాధ్యమగుటచే అర్థించువారికి ఫల, పల్లవముల నొసంగనందున, ఉన్నతాకారము గలిగియున్నప్పటికిని రూప రహితమైనదానివలె (శోభింపక) నున్నది.

రాగ ఏవ హి శోభాయై నిర్గుణానాం జడాత్మనామ్
రాజేవ రాజతే రాజన్నాగేణైవైష కింశుకః. 10

ఓ రాజా ! ఔదార్యాది గుణశూన్యులగు మూర్ఖులయొక్క వస్త్రాలంకారాద్యాడంబర ముచే శరీరరంజనమే శోభించును గాని తదితర మెద్దియు శోభించనట్లు ఈ గంధరహితమగు పుష్పించినకింశుక (మోదుగు) వృక్షమున్ను తనరక్తవర్ణముచేతనే రాజువలె శోభించుచున్నదిగాని గంధాది గుణములచే గాదు.

ఆగచ్ఛ కర్ణికారోఽయం వికారస్యైవ భాజనమ్
నిరామోదః కిమేతేన నిర్గుణేనేవ జన్తునా. 11

ఓ తుమ్మెదా ! రమ్ము ! గుణహీనుఁడగు మనుజునివలె, సుగంధ రహితమగు ఈ కర్ణికార (కొండగోఁగు) పుష్పము దీనిననుసరించుట వ్యర్థము అనునట్టి దుఃఖరూపమగు చిత్త వికారమునే గలిగించుచున్నదని యెఱుఁగుము.

విలోలమఞ్జరీ జాలతడిత్పఙ్క్తిస్థితోఽసితః
చాతకస్యామ్బుదభ్రాన్తిం తమాలః కురుతే యథా. 12

చలించు పుష్పపల్లవాదుల సమూహమను మెఱపుతోఁగూడియున్న యీ శ్యామవర్ణ యుక్తమగు తమాలవృక్షమను మేఘము చాతకపక్షికి వ్యర్థముగ భ్రమను గలిగింపఁజేయుచున్నది.

పత్రాలా ఘనసంఘాతాః సచ్ఛాయావృతభూభృతః
గుణానాం మహతాం యోగ్యా వంశా వంశా ఇవోన్నతాః. 13

పత్ర, వాహనములచే భూషితములును, దుర్భేద్యములైన సమూహములు గలవియు, ఉత్తమచ్ఛాయచేఁ బర్వతముల నాశ్రయించునవియు (లేక, సత్పురుషులకు ఛాయనొసంగుటకై రాజుల నాశ్రయించునవియు) నగు యీ వెదుళ్ళు, ఉన్నతవంశములవలె గొప్ప సన్మానములకు యోగ్యములైయున్నవి.

హేమసాన్వాసనస్థోఽగ్ర్యో వాతవ్యాధితటోఽమ్బుదః
తడిత్పీతామ్బరం ధత్తే క్షుబ్ధం హరిరివోద్భవః. 14

సువర్ణమయశిఖరమను అసనముపై స్థితినొందియున్నదియు, ఉత్తమమైనదియు, వాయువను వ్యాధి తటమందుగలదియు, సంక్షోభయుక్తమైనదియు, మహదైశ్వర్యసంపన్నుఁడగు విష్ణువువలె మెఱపను పీతాంబరమును ధరించియున్నదియునై యీ మేఘము వెలయుచున్నది.

ప్రవేశ నిర్గమవ్యగ్రతరత్ఖగ శిలీముఖః
ప్రఫుల్లకింశుకో భాతి వీరో రక్తం ఇవాసృజా. 15

ఓ రాజా! ఈ వికసించిన కింశుక (మోదుగ) వృక్షము, ప్రవేశ, నిర్గమనములందు వ్యగ్రములగు పక్షులను బాణములను ధరించియున్నదై, యుద్ధమున రక్తప్రవాహముచే రక్తవర్ణ యుతుఁడైన యోధునివలె భాసించుచున్నది.

మన్దారమఞ్జరీపుఞ్జపిఞ్జరామ్భోదమన్దిరే
మహేన్ద్రమస్తకే మత్తాః సుప్తా గన్ధర్వకామినః. 16

కల్పద్రుమవనచ్ఛాయా విశ్రాన్తా వితతాన్వితాః
పశ్య పార్థివ గాయన్తి సిద్ధవిద్యాధరాధ్వగాః. 17

పశ్య కల్పద్రుమస్యాస్య పల్లవే పల్లవే వనే
విశ్రాన్తాః సుగసున్దర్యో గాయన్తి చ హసన్తి చ. 18

ఓ రాజా! మందారపుష్పసమూహమువలె బంగారుకాంతిగలిగిన మేఘమను మందిరమును ధరించియున్న యీ మహేంద్రపర్వతశిఖరముపై కాముకులగు ఈ గంధర్వులు మధ్యపానముచేఁ బ్రమత్తులై నిదురించుచున్నారు చూడుఁడు! మఱియు, కల్పవృక్షవనచ్ఛాయయందు విశ్రమించినవారును ఉత్తమవీణాదివాద్యములతోఁ కూడినవారునగు యీ సిద్ధ, విద్యాధర పథికులు గానమొనర్చుచున్నారు. వీక్షింపుఁడు! ఇంకను, ఈ కల్పవృక్షముయొక్క పల్లవితవనమందు విశ్రమించుచున్న దేవతాస్త్రీలు పాడుచు. నవ్వుచునున్నారు గాంచుఁడు!

మన్దిరం మన్దపాలస్య మన్దరే మృదుమన్దిరే
మునేరిదముదారస్య భార్యా సా యస్య పక్షిణీ. 19

ఓ రాజా! ఉత్తమమందిరములతోటి శోభించునట్టి యీ మందరపర్వతముపై, ప్రసిద్ధయైన జరితయను గృధ్రపక్షి భార్యగాఁగల్గిన యుదారచరితుఁడగు మందపాలుఁడను మునియొక్క మందిరమిదియే చూడుఁడు!

అన్యోన్యామతసింహేభనకులోరగ కేలికామ్
పశ్య మున్యాశ్రమశ్రేణిం సర్వర్తుకుసుమద్రుమామ్. 20

ఓ రాజా! పరస్పరవిరోధులైనను సింహఁగజములు, నకుల (ముంగిస) సర్పములు మున్నగునవి పరస్పరము ఆడుకొనుచున్నట్టి యీ మున్యాశ్రమపంక్తిని వీక్షింపుడు!

విద్రుమద్రుమమిశ్రాణామమ్భోధితటవీరుధామ్
బిమ్బితార్కాః కచన్త్యేతే పల్లవేషూదబిన్దవః. 21

వీచయో రత్నమాణిక్యపదేష్వావర్తవృత్తిభిః
విలసన్తి విలాసిన్యో వక్షఃస్వివ విలాసినామ్. 22

నాగలోకేన్ద్రలోకస్త్రీగమనాగమనోద్భవః
దివ్యో భూషణఝాంకారః శ్రూయతే నభసః శృణు. 23

శ్రవణోపాన్తవిభ్రష్టమదమత్తాలినిస్వరైః
ఐరావణస్నానభువో గాయన్తీవ గుహా గిరేః. 24

హసతోఽనుదినం కృష్ణపక్షే కృష్ణాన్తలేఖికాః
దృశ్యన్తే కృశగాత్రస్య వాస్తుకావలయోఽమ్బుధేః. 25

ఓ రాజా! పగడపుచెట్లతోఁ గూడుకొనియున్న సముద్రతీరమందలి లతలయొక్క పల్లవములందు ప్రతిబింబించినట్టి సూర్యుఁడుగల్గిన యీ జలబిందువు లెట్లు శోభించుచున్నవో యవలోకింపుఁడు! మఱియు, విలాసవంతులగు నిజపతుల వక్షస్థలములపై విలాసవతులగు స్త్రీలు క్రీడించునట్లు, రత్నమాణిక్యాదులకు నిలయములైనట్టి యీ తరంగములు నిరంతర పరివర్తనములచే క్రీడించుచున్నవి. ఓ రాజా! నాగలోక, ఇంద్రలోకములందలి స్త్రీలయొక్క గమనాగమనములచే నుత్పన్నమైన దివ్యమగు ఆభరణముల ఝుంకారశబ్దము ఆకసమునుండి వినఁబడుచున్నది. యాకర్ణింపుఁడు! గండస్థలమునుండి జారినమదజలముచే మదించినట్టి తుమ్మెదలయొక్క ధ్వనులచే ఐరావతగజము యొక్క స్నానభూమియైనట్టి పర్వతముయొక్క యీ గుహలు పాడుచున్నట్లున్నవి. గాంచుఁడు! ఓ రాజా! కృష్ణపక్షచంద్రుని ననుసరించి తగ్గుచునున్న కృశించినశరీరముగల సముద్రముయొక్క నివాసయోగ్యమైనట్టి యీ తీరమున నలుపువర్ణముగల రేఖలు కానుపించుచున్నవి చూడుఁడు!

ఆమోద గన్ధశ్వసనా సచ్ఛాయా శీతలాఙ్గికా
ఏకాన్తదర్శితాకారా నానాకుసుమపూరితా. 26

వనవిన్యాసవసనా నిర్ఝరామలహాసినీ
ఆస్తీర్ణపుష్పాస్తరణా ధన్యా వనవిలాసినీ. 27

ఓ రాజా! పుష్పముల సుగంధముచే సుగంధితమైనట్టి వాయువను శ్వాసగలదై, ఉత్తమచ్ఛాయయను శీతలశరీరముతోఁగూడినదై, ఏకాంతమునఁ దనయాకారమును దర్శింపఁజేయునదై వివిధపుష్పములచేఁ బరిపూర్ణయై, వనరచనయను వస్త్రమును ధరించినదై, సెలయేళ్ళను నిర్మల హాస్యముగల్గియున్నదై, పఱవఁబడిన పుష్పములను శయ్యతోఁ గూడినదై యీ వనంబను విలాసవతియైన స్త్రీ శోభించుచున్నది.

రమన్తే నన్దనోద్యానే న తథోదార బుద్ధయః
యథోపశాన్తశబ్దాసు శుద్ధాసు వనభూమిషు. 28

ఓ రాజా! ఉదారబుద్ధులగు దేవతాదులు, నిశ్శబ్దములును, శుద్ధములునగు వనభూములందెట్లు ప్రీతిఁగొందురో అట్లు నందనవనమందును బ్రీతిఁగొనరు.

సువిరక్తం మునేశ్చేతో రక్తం చ విషయార్థినః
రమయన్తి సమం రమ్యా విజనా వనభూమయః. 29

రమణీయములును, జనశూన్యములునగు వనభూములు, అతివిరక్తుఁడగు మునియొక్క చిత్తమునకును, విషయార్థియగు కాముకుని చిత్తమునకును సమముగనే ప్రీతిఁగలుగఁజేయును.

సలిలాధౌతవప్రాణామమ్భోధితటభూభృతామ్
నూపురైరివ రత్నౌఘైః పాదా భాన్తి ధ్వనన్తి చ. 30

పుంనాగనగవిశ్రాన్తాః కాన్తకాఞ్చనకాన్తయః

హేమచూడాః ఖగా భాన్తి దివి దేవగణా ఇవ. 31
భ్రమరామ్భోదధూమాఢ్యాః ఫుల్లచమ్పకకాననాః
కమ్పన్తే పశ్య వాతేన జ్వలితా ఇవ పర్వతాః. 32
కుర్వన్తం కరవీరాగ్రలతాన్దోలావదోలకమ్
కోకిలం కోకిలాలిఙ్గ్య లోలాలాపయతి ప్రియమ్. 33
లసత్కలకలారావమేతా లావణసైన్ధవీః
పూర్ణాస్తటభువో భూపైః పశ్యోపాయన పాణిభిః. 34

ఓ రాజా! సముద్రజలముచే బాగుగఁ గడుగఁబడిన తీరస్థపర్వతములయొక్క క్రింది భాగముననున్న అల్పపర్వతములను పాదములు రత్నసమూహములచే, నూపురము (అందె)లచే వలెశబ్దించుచు ప్రకాశించుచున్నవి చూడుఁడు! మఱియు, పున్నాగమను పర్వతముపై విశ్రమించు నవియు, మనోహరమైన సువర్ణముయొక్క కాంతిగలవియునగు 'హేమచూడ' పక్షులు, స్వర్గమున దేవతలవలె భాసిల్లుచున్నవి యవలోకింపుడు! ఓ రాజా! తుమ్మెదలు మేఘములను ధూమముచేఁ బరిపూర్ణములై వికసించిన చంపకవనములతోఁగూడి వాయువుచేఁ గంపించుచు ఈ పర్వతములు జ్వలించుచున్నవివలెఁ గన్పట్టుచున్నవి వీక్షింపుఁడు! మఱియు, కరవీర (గన్నేరు) వృక్షము యొక్క యూర్ధ్వ శాఖయను నూయెలపై నూగుచున్నట్టి కోకిలను సద్దాని ప్రియురాలగు ఆఁడు కోకిల కౌఁగిలించుకొని మధురగీతమును బాడుచున్నది. చూడుఁడు! ఓ రాజా! శోభాయమానము లగు కలకలశబ్దములతోఁ గూడిన యీ లవణ సముద్రతీరప్రదేశములు హస్తములందుఁ గానుక లిడుకొనిన రాజులచేఁ బూర్ణములై వెలయుచున్నవి గాంచుఁడు!

ఆ పూర్వాదా పరస్మాల్లవణజలనిధేరోత్తరాద్దక్షిణాద్వా
దేవో దగ్రాజిశిష్టా ఇహ నరపతయః పాదపీఠీక్రియన్తామ్
దీయన్తాం మణ్డలానాం దిశిదిశి చ యథాశాస్త్రమస్త్రాణ్యవన్యా
రక్షాయై శాన్తిపూర్వం చిరమతులబలం శాన్తయా శాసనాని. 35

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే
దిగన్తరవృత్తివాయ్వాదివర్ణనం నామ వింశత్యధికశతతమః సర్గః ॥ 120 ॥

దేవా! లవణసముద్రముయొక్క పూర్వతీరమునుండి పశ్చిమతీరమువఱకును, ఉత్తర తీరమునుండి దక్షిణతీరమువఱకును ఈ జంబూద్వీపమున ఈ భయంకర యుద్ధమున మిగిలినట్టి రాజు లెవరుగలరో వారందఱును శిరస్సులపై పాదార్పణముద్వారా తమచే ననుగ్రహింపఁ బడుదురుగాక! మఱియు పృథివియందలి ఆ యామండలములయొక్క ప్రతిదిశయందును చిరకాల రక్షణముకొఱకై తాము రాజనీతిననుసరించి సమాధానపూర్వకముగ శాంతబుద్ధితో శాసనముల గావింపుఁడు; అస్త్రములను నుంచుడు గొప్ప సైన్యమును స్థాపింపుఁడు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అవి॥ఉప॥దిగంతరవృత్తివాయ్వాదివర్ణనమను నూటయిరువదవ సర్గము ॥ 120 ॥

ఏకవింశత్యధిక శతతమః సర్గః

[అత్ర మణ్డలమర్యాదాం సంస్థాప్యాగ్నిముపేయుషామ్
వరాదాగ్నేర్దిగన్తానాం దర్శనోద్యోగ ఈర్యతే.

దేశముయొక్క మర్యాదను స్థాపింపఁజేసి ఆవిపశ్చిత్తులు అగ్నియొక్క వరముచేఁ దమకు సంప్రాప్తమైనట్టి దిగంతదర్శనమునుగూర్చి ప్రయత్నించుట యిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

అథ త్వేషర్ణవతటేష్వేతే భూమౌ విపశ్చితః
ఉపవిశ్యైతదఖిలం చక్రూ రాజ్యప్రయోజనమ్. 1
తదా తత్రైవ తే వాసభూమిం కృత్వా యథాక్రమమ్
తస్థుర్మణ్డలమర్యాదాం స్థాపయామాసురక్షతామ్. 2

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! తదుపరి యా విపశ్చిద్రాజులు నలువురున్ను సముద్రతీరముయొక్క భూమిపైఁ గూర్చొని మంత్రులచే నివేదింపఁబడినట్టి రాజ్యమర్యాదాస్థాపన మను కార్యమును బూర్ణముగ నొనర్చిరి. అపుడు వారచ్చోటనే భూమిపై వసించుచు అక్షయమైనట్టి రాజ్య మర్యాదను స్థాపించిరి.

అథ వర్ణయితుం శ్రీమాంస్తత్ప్రతాపమివాగతమ్
సంప్రవిశ్య సముద్రాన్తరన్యలోకాన్తరం రవిః. 3
ఆయయౌ యామినీశ్యామా మేఘలేఖేవ తానవమ్
సంపాదితాహర్వ్యాపారాస్తస్థుం స్వశయనేషు తే. 4
ఆసముద్రం సదీవాహా ఇవ దూరాదుపాగతాః
ఇదం సంపాదయామాసుర్విస్మయాకులచేతసః. 5
అహో ను దూరమధ్వానం ప్రాప్తా వయమయత్నతః
ప్రభావాద్దేవదేవస్య వహ్నేర్దివ్యైః స్వవాహనైః. 6

అటుపిమ్మట, శ్రీమంతుఁడగు సూర్యభగవానుఁడు ఆవిపశ్చిత్తుల ప్రతాపమును వర్ణించుటకాయనునట్లు సముద్రమునఁ బ్రవేశించి లోకాంతరమున కేగెను. మఱియు, మేఘ పంక్తివలె, శ్యామవర్ణముగల రాత్రి విస్తారమును బొందెను. అపుడావిశ్చిత్తులు నలువురున్ను దైనిక కార్యములను నెరవేర్చి తమ తమ శయనములపైఁబరుండి విస్మయపూర్ణచిత్తులై, మనస్సు లందిట్లు చింతించుకొనిరి. నదీప్రవాహమువలె అతిదూరమగు సముద్రమువఱకు మన మిప్పు డేతెంచితిమి. ఆహా! దేవదేవుఁడగు అగ్నిదేవునియొక్క ప్రభావముచే, పరిశ్రమలేకయె మనము మన దివ్యవాహనములచే నింతదూరపుమార్గమును దాఁటగల్గితిమి.

కియతీ స్యాత్ప్రవిస్తీర్ణా దృశ్యశ్రీరియమాతతా
ఇతః సముద్రాన్తదను ద్వీపభూరమ్బుధిః ప్రభుః. 7
ఇతో ద్వీపం తతోఽమ్భోధిః కిమన్తే స్యాత్తతోఽపి చ
కియతీ కీదృశీ వా స్యాన్మాయేయం చేత్యరూపిణీ. 8

ఈ విశాలమగు దృశ్యమెంతవఱకు వ్యాపించియున్నది? ఈ జంబూద్వీపమున కావల లవణసముద్రముగలదు; దాని కావల ప్లక్షద్వీపము గలదు, ఆ తరువాత లవణసముద్రమునకు రెండింతలై నట్టి గొప్ప 'ఇక్షు' (చెఱకురస) సముద్రము గలదు, దానికావల కుశద్వీపము గలదు, దానివెనుక సురోదసముద్రము గలదు — ఇట్టి క్రమముచే, తుదకు సప్తద్వీపఁ సముద్రముల పిదప యేమి గలదు? ఈ చేత్య (దృశ్య)రూపిణియగు మాయ యెంతపరిమాణముగలది? వస్తు వైచిత్ర్యముచే నెట్టి స్వరూపముగలది?

తత్ప్రార్థయామహే దేవం హుతాశం తద్వరాదిమాః
ప్రేక్షామహే దిశః సర్వా అపర్యన్తమఖేదినః. 9

అదియంతయు నెఱుఁగుటకై అగ్నిదేవునిగూర్చి ప్రార్థించెదము. అతని వరముచే దిగంతములన్నింటిని దుఃఖరహితులమై గాంచగలము?

ఇతి సంచిన్త్య తే సర్వే యథాస్థానమవస్థితాః
సమమేవాహ్వయామాసుర్భగవన్తం హుతాశనమ్. 10

ఇట్లు నిశ్చయించి యా విపశ్చిత్తులు నలుగురున్ను క్రమముగ నాల్గు సముద్రముల తీరములపైఁ గూరుచుండి యొకేకాలమున భగవంతుఁడగు అగ్నిదేవుని నాహ్వానించిరి.

బభూవ భగవానేషామథ దృశ్యో హుతాశనః
ఆకారవాన్వరం పుత్రాః ప్రగృహ్ణీతేత్యువాచ హ. 11

అపుడా నలువురికిని అగ్నిభగవానుఁడు దర్శనమొసంగి పుత్రులారా! వరమును గ్రహింపుఁడని చెప్పెను

విపశ్చిత ఊచుః :—

పఞ్చభూతాత్మకస్యాస్య దృశ్యస్యాన్తం సురేశ్వర
దేహేన మన్త్రదేహేన తదన్తే మనసాపి చ. 12
యావత్సంవేదనం యావత్సంభవం యావదాత్మకమ్
పశ్యేమ ఇతి నో దేవ దీయతాముత్తమో వరః. 13

అంత నావిపశ్చిత్తులిట్లనిరి — దేవేశ్వరా! ఈ పంచభూతమయమగు దృశ్యముయొక్క అంతమును ఎంతవఱకు దేహముతోటి చూడశక్యమగునో యంతవఱకుదేహముతోను, ఆ పిదప వైదికమంత్రప్రభావ సంస్కారముతోఁగూడిన యీ దేహముతోను, ఆ తరువాత మనస్సుచేతను జూచునట్లును, ఇట్లు ప్రత్యక్ష, అనుమాన, శ్రుత్యాదిగమ్యమగు జగంబంతయు వీక్షింపఁగల్గునట్లును ఉత్తమవరంబొసంగ ప్రార్థన!

ఆసిద్ధగమ్యమధ్వానం పశ్యేమ వపుషా వయమ్
తదన్తే మనసైవాథ దృశ్యం పశ్యేమ భో ప్రభో. 14
ఆసిద్ధగమ్యమధ్వానం మృత్యురస్మాకమస్తు మా
అధ్వన్యసంభవద్దేహే మన ఏవ ప్రయాతు నః. 15

ప్రభూ! యోగులయొక్క యోగప్రభావముచేఁ బొందఁబడు మార్గమునంతయు మే మీశరీరముచేతనే గాంచునట్లును! అట్లు పొందఁబడని మార్గమును మనస్సుచే గాంచునట్లును

ననుగ్రహింపుడు! కావున యోగప్రభావగమ్యమగు మార్గమువఱకు మా యీదేహమే పోవుగాక, ఆ పిదప మరణించియే పోవశక్యమైనట్టి ఉత్తరాయణ, దక్షిణాయన మార్గములందో మా మనస్సే పోవుగాక!

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

తథైవమస్త్వితి ప్రోచ్య పావకః సహసాగమత్
క్షణాదౌర్వతయా యాతుం సముద్ర ఇవ సత్వరః. 16

[illegible]పుడు:— ఓ రామచంద్రా! వారి యా ప్రార్థనవిని అగ్నిదేవుఁడు 'అట్లేయగు గాక' [illegible] బడబాగ్ని రూపముచే శీఘ్రముగ సముద్రమందుఁ బ్రవేశించుటకా యనునట్లుగ వెడలి[illegible]ను.

[illegible]ర్గగామాథ సమాజగామ నిశా విలమ్బ్యాథ జగామ సాపి
సమాజగామాపి రవిర్జగామ తేషాం చ ధీరార్ణవలఙ్ఘనేహా. 17

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే విపశ్చిన్నిర్ణయో నామైకవింశత్యధికశతతమః సర్గః ॥ 121 ॥

అట్లు అగ్నిదేవుఁడు వెడలినపిదప రాత్రియయ్యెను. రాత్రిగడచి వెనుక సూర్యభగవానుఁడుదయించెను. అపుడు తోడనే యా నలుగురు విపశ్చిద్రాజులకున్ను సముద్రమును దాట నభిలాష జనించెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అవి॥ విప॥ విపశ్చిన్నిర్ణయమను నూటయిరువదియొకటవ సర్గము ॥ 121 ॥

ద్వావింశత్యధిక శతతమః సర్గః

[పద్భిరబ్ధితరఙ్గేషు గచ్ఛన్తోఽత్ర విపశ్చితః
విదార్యావర్తమకరాన్నిర్యాతాః సాధువర్ణితాః.

సముద్రతరంగములందు ఆవర్త, మకరాదులను ఛేదించుచు విపశ్చిత్తులు నలువురు కాలినడకచే సముద్రముపై నేగుట యిచట బాగుగ వర్ణింపఁబడుచున్నది.]

శ్రీ వసిష్ఠ ఉవాచః—

తతః ప్రభాతే ప్రసభం పృథివ్యాః కృత్వా యథాశాస్త్రమలంవ్యవస్థామ్
ఆవిష్టదేహా ఇవ తే రసేన నిషేధ్యమానా ఇవ మన్త్రిముఖ్యైః. 1
నివార్య సర్వం పరివారమాత్రమాక్రన్దమానం వదనై రుదద్భిః
నిరస్య చాస్నేహతయాభిమాన మాత్సర్యలోభాభిభవైషణాది. 2
దిగన్తమాలోక్య సముద్రపారే క్షణాత్సమాయామ ఇతి బ్రువన్తః
స్వమన్త్రశక్త్యోత్తమతాం గతైస్తై రద్భిః పద్భిరేవ తదా ప్రవిష్టః. 3

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! అటుపిమ్మట, ప్రాతఃకాలమున రాజనీతి శాస్త్రాను సారము పృథివియొక్క వ్యవస్థను విశేషముగ గావించి, ప్రధానమంత్రుల చేష్టలద్వారా నివారింపఁబడి నప్పటికిని దిగంతదర్శనాభిలాషచే గ్రహావిష్టులవలెనున్న యానలుగురు విపశ్చిద్రాజులున్ను, విలపించుచున్న పరివారవర్గమునంతటిని నిషేధించి, అభిమాన మాత్సర్య, లోభాదులను, శత్రుపరాభవ, రాజ్య, ధనాదులఁగూర్చిన యభిలాషను విరాగపూర్వకముగఁ ద్యజించి, 'సముద్రమున కావల దిగంతములను జూచి శీఘ్రముగఁ దిరిగివచ్చెదమని చెప్పుచు, తమ మంత్రశక్తిచే భూజలాదుల జయమను సిద్ధత్వమును బొందినవారై, పాదములచేతనే సముద్రమును బ్రవేశించిరి.

విపశ్చితస్తే దిశిదిశ్యనల్పైర్భృత్యైః సముద్రం ప్రవిశద్భిరేవ
భృత్యైశ్చ కైశ్చిత్త్వనుగమ్యమానా యయుర్యథా వారిణి పద్భిరేవ. 4

తరఙ్గజాలేషు పదానికృత్వా పృష్ఠేస్థలస్యేవ జలస్య చాన్తః
చత్వార ఏకైకతయైవ యుక్తా భృశం వియుక్తా నిజసేనయా తే. 5

పదక్రమేణైవ మహార్ణవాన్తస్తావత్ప్రవిష్టా అవలోకితాస్తే
తటస్థితై ర్యావదదృశ్యభావం శరన్నభో మేఘలవా ఇవాపుః. 6

స్నేహాతిశయముచే ప్రతిదిక్కునందును తమ్ము వెంబడించుచు సముద్రమును బ్రవేశించి యేతెంచుచున్నట్టి యనేక భృత్యులతో గూడినవారై యా విపశ్చిత్తులు నలువురున్ను కాలి నడకచేతనే పోయిరి. భూమిపైవలెనే తరంగసమూహములపైఁ బాదములిడుచువారు నలువురున్ను వేఱ్వేఱుగ ప్రయత్నపరులైపోవుచు, క్రమముగ నిజసైన్యముచేఁ బూర్ణముగవిడువఁబడిరి. తీరమున నున్న భృత్యులు వారిని, శరత్కాలమేఘఖండములవలె అదృశ్యభావమును బొందనంత వఱకును వీక్షించుచునేయుండిరి.

తమథ్వానమథోహుస్తే జలధౌ పాదచారిణః
వితతాధ్యవసాయేన బద్ధకక్షాహరా ఇవ. 7

ఉన్నతావనతామద్రిసమారోహావరోహణైః
శ్రియం వారితరఙ్గాణాం హరన్తో హరిమూర్తయః. 8

ఆవర్తేషు తృణానీవ భ్రాన్తా విగత సంభ్రమమ్
చిరం చఞ్చలమత్తా భ్రచన్ద్రమణ్డలశోభిషు. 9

దృఢనిశ్చయముతోఁ గూడుకొనినవారై, పాదచారులై మావటివాని ప్రేరణచే బంధింపఁబడిన త్రాటినిలాగుకొనిపోవు గజములవలె, వారందఱును ఆ సముద్రమార్గమునుదాటిరి. పర్వతములవంటి నిమ్నోన్నతతరంగములయొక్క ఆరోహణ (ఎక్కుట) అవరోహణ (దిగుట) క్రమముచే వారాతరంగములశోభను, సముద్రమథనకాలమందు విష్ణువుయొక్క శరీరమువలె గ్రహించుచుండిరి. భ్రమరహితులై దట్టమైన మేఘములందుఁ బ్రవేశించిన చంద్రమండలమువలె, వారా సముద్రముయొక్క ఆవర్తములందు తృణములవలె చిరకాలము సంచరించుచుండిరి.

మన్త్రవిద్యాబలౌజోభిర్దుర్జయాః శస్త్రపాణయః
క్వచిత్క్వ[illegible]గిరోద్గీర్ణదేహకాః. 10

మంత్రవిద్యాబలముయొక్క తేజములతోఁగూడినవారును, కావుననే దుర్జయులును హస్తములందు శస్త్రములను ధరించియున్నవారునగు ఆ రాజు లొక్కొకచోట మదించిన మొసళ్ళచే మ్రింగబడుచుండిరి. కాని అగ్నిదేవుని కృపచే జీర్ణింపఁబడఁజాలక మరల వెలిగ్రక్కఁబడుచుండిరి.

జలకల్లోలవిశ్రాన్తవాతోత్సారితమూర్తయః
నీతానీతాః క్షణేనైవ యోజనానాం శతం శతమ్. 11

జలకల్లోలమాతఙ్గతుఙ్గితాఙ్గతయా తయా
దధానా నిజరాజ్యేభపృష్ఠరోహస్థితిశ్రియమ్. 12

వి స్తీర్ణోర్మిఘటాపట్టపాటపట్టనపాటవైః
దర్శయన్తో జలామ్భోదనిష్క్రాన్తిం మారుతా ఇవ. 13

తరత్తరలమాతఙ్గతరఙ్గౌఘవిఘట్టితాః
అత్యజన్తో నిజం ధైర్యం వేలావరతటా ఇవ. 14

మహోర్మిముక్తామాణిక్యమణ్డలప్రతిబిమ్బితాః
ఏకాకినోఽపి పరితః పౌరుషేయవృతా ఇవ. 15

జలతరంగములందు విశ్రమించునట్టియు, వాయువుచేఁ బ్రేరితములైనట్టియు దేహములు గలవారు క్షణకాలములోనే వేలకొలఁది యోజనముల దూరము గొనిపోఁబడిరి. జలతరంగములను నేనుఁగులపైనెక్కి, వారు తమరాజ్యమందలి గజారోహణముయొక్క అపూర్వశోభనుధరించుచు సముద్రముపై నేగుచుండిరి. మఱియు వారు విశాలములైన తరంగసమూహములను శిలలను ఛేదించుచు వాని నధోముఖులుగఁ గావించుటయందలి నిపుణత్వముచే, జలమను మేఘమునుండి వెలువడిన వాయువుచే నుద్దీపితములైన మెఱపులవలెఁ జూపట్టుచుఁ జనుచుండిరి. చలించుగజములఁ బోలియున్న గొప్పతరంగ సమూహములచే మర్దింపఁబడినప్పటికిని, వారు తీరమందలి పర్వతములవలె తమ ధైర్యమును గోల్పోవకయే సాగుచుండిరి. మఱియు, గొప్పతరంగములందును ముక్తమాణిక్యసమూహములందును ప్రతిబింబించుటచే నేకాకులైయున్నను. వారనేకజనులచే నావరింపఁబడియున్నట్లు గోచరించుచుండిరి.

పాణ్డుడిణ్డీరపిణ్డేషు కుర్వన్తో లాఘవాత్పదమ్
శ్వేతపద్మపరిస్రస్తరాజహంసశ్రియం దధుః. 16

ఘననిర్ఘాతనిర్ఘోష భీషణార్ణవఘుంఘుమాత్
న భీతా భూభృతస్తత్ర వేలావలనజృమ్భితాత్. 17

అభ్రంలిహజలాద్రీన్ద్రపాతోత్పాతవిఘట్టితా
క్షణం పాతాలమాజగ్ముః క్షణమర్కాస్పదం యయుః. 18

అశఙ్కితోత్పతద్వారి పూరపాతపటావృతాః
ఉత్పాత పాతనిపతద్వితానకవృతా ఇవ. 19

తెల్లని సముద్రపు నురుఁగుముద్దలపై తేలికగ పాదములిడుచు, తెల్లనికమలములపై నారూఢములగు రాజహంసలయొక్క శోభనువారు ధరించుచుండిరి. తీరమునకు గొట్టుకొనుటచే

విజృంభించు పిడుగుప్రోఁతవంటి శబ్దమునుబోలిన సముద్రశబ్దముచే వారుపర్వతములభంగి భీతిల్లకయేయుండిరి. మేఘమండలమును దాఁకునట్టి జలమయములగు మహాపర్వతముల నెక్కుట చేతను, దిగ్గుటచేతను మర్దితులై వారుక్షణములోఁ బాతాళమునకేగుచు, క్షణములో సూర్యమండలమును జేరుచునుండిరి. మఱియు, అకస్మాత్తుగలేచునట్టి జలప్రవాహముయొక్క పతనమను వస్త్రముచే, గప్పఁబడినవారై వారు ఉత్పాతమేతెంచ పడునట్టి మేఘపటములచే నావరింపఁబడినట్లు భాసించుచుండిరి.

ప్రక్రాన్తాస్తేమ్బురాశౌ సహచరమకరాః శూరనక్రైః కులీరై
ర్వ్యాప్తావర్తావివృత్తాః సలిలతరులతాసీకరైరన్తరాలైః
కుర్వన్తః కాన్తియుక్తం వపురివ కుసుమైర్భ్రాన్తమాణిక్యముక్తై
ర్వ్యక్తావ్యక్తాంశుజాలైః ప్రతిపదమితరైరభ్రరూపైరదభ్రైః. 20

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే
జలపరిభ్రంశో నామ ద్వాదశాధికశతతమః సర్గః ॥ 122 ॥

ఓ రామచంద్రా! పెక్కు మేఘరూపములగు వ్యక్త, అవ్యక్త కిరణసమూహములతోఁగూడి చలించు మాణిక్యములచేతను, ముత్తెములచేతను, అంతరాళమున జలమయ వృక్షలతాప్రాయములగు తరంగములయొక్క జలబిందువులచేతను పుష్పములచేవలెశరీరముల నలంకరించుకొనుచు, మొసళ్ళచేతను ఎండ్రకాయలచేతను వ్యాప్తములైయున్న అపర్తములందంతటఁ దిరుగాడుచున్న మొసళ్ళను సహచరులు గలవారై యా విపశ్చిత్తులు సముద్రమునఁ బయనమై పోవుచుండిరి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
అవి॥ విప॥ అర్ణవపరిక్రమణమను నూటయిరువదిరెండవ సర్గము ॥ 122 ॥

త్రయోవింశాధిక శతతమః సర్గః

[ఇహ ద్వీపసముద్రేషు ప్రయాతానాం విపశ్చితామ్
పాశ్చాత్యాది క్రమాత్ప్రాప్తా వర్ణ్యన్తే వివిధా దశాః.

సముద్ర, ద్వీపములందుఁ జనుచున్న యా విపశ్చిత్తులయొక్క, పశ్చిమాదిదిశాక్రమమున సంప్రాప్తించిన వివిధదశలిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

ఇత్యేతే దృశ్యరూపాయా అవిద్యాయా విచారణే
ప్రవృత్తాః పాదచారేణ సముద్రద్వీపగామినః. 1

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఈ ప్రకారముగ సముద్ర, ద్వీపములందుఁ బాదచారులై చరించుటద్వారా యా విపశ్చిత్తులు దృశ్యరూపమైన అవిద్యయొక్క యంతమునుగూర్చిన విచారణయందుఁ బ్రవృత్తులై

అబ్ధేర్ద్వీపం పునర్ద్వీపాదబ్ధిం ద్వీపం గిరిం వనమ్
లాఘవాల్లఙ్ఘయామాసు శ్ఛేదభేదవివర్జితాః. 2

సముద్రమునుండి ద్వీపమును, ద్వీపమునుండి సముద్రమును, మరల యటనుండి యింకొక ద్వీపమును బొందుచు, పర్వత. వనముల నతిశీఘ్రముగ దాఁటుచు ఛేదన, భేదనరహితులై వారు చనుచుండిరి.

పీతో విపశ్చిత్పాశ్చాత్యో మీనేనామరమానినా
విష్ణుమీనకులోత్థేన వితస్తావాహనౌజసా. 3

క్షీరోదం ప్రాప్య మత్స్యేన తేనోద్గీర్ణః సుదుర్జరః
తేన క్షీరోదముల్లఙ్ఘ్య గతో దూరం దిగన్తరమ్. 4

అట, పశ్చిమదిగంతమును దర్శించుటకై ప్రవృత్తుఁడైన విపశ్చిత్తును మత్స్యావతారధారియగు విష్ణుభగవానుని కులమున జనించినదియు, నిజపరాక్రమముచే నౌకకంటెను శీఘ్రముగఁ బోవునదియు, తనకు మరణములేదను అభిమానము గలదియునగు ఒక మత్స్యము మ్రింగివైచెను. కాని, అయ్యది క్షీరసముద్రమును బొందినదై, అతనిని జీర్ణింపఁజేసికొనుట యసాధ్యమని యెఱిఁగి క్రక్కివైచెను. అంత నా విపశ్చిత్తు క్షీరసముద్రమును దాటి దిగంతరమున నతిదూరమేగెను.

దక్షిణో యక్షనగరే సంప్రేక్ష్యేక్షురసార్ణవే
శిక్షాదక్షిణయాక్షిప్య యక్షిణ్యా కాముకీకృతః. 5

ఇఁక, దక్షిణదిగంతమును గాంచుటకై ప్రవృత్తుఁడైన విపశ్చిత్తును, ఇక్షురససముద్రమునన్న యక్షనగరమున వశీకరణవిద్యయందు నిపుణయగు యొకయక్షిణి చూచి తద్విద్యాబలముచే నాతనిని వశపఱచుకొని తన కాముకుఁడగు పతిగ నొనర్చుకొనెను.

పూర్వో మకరమాక్రమ్య యదా గఙ్గాం నికృత్తవాన్
గఙ్గయా స తదానీయ కాన్యకుబ్జే సముజ్ఝితః. 6

అట్లే, తూర్పుదిక్కుయొక్క యంతమును జూచుటకై యేగిన విపశ్చిత్తు గంగానదియొక్క సహస్రముఖభేదములను గ్రమముగఁ గాంచుచు, తన్ను మ్రింగఁదలంచిన యొకమొసలిపై బలాత్కారముగ నాక్రమణము సల్పి, దానిని గంగానదిలోనికిఁ దీసికొనివచ్చి చీల్చివైచెను. అపుడు గంగానది తన ప్రవాహముచే నాతనిని గొనిపోయి కాన్యకుబ్జనగరమునఁ బడవేసెను.

ఉత్తరస్తూత్తరకురూనారాధ్య ప్రాప్తవాఞ్శ్రియమ్
తం తయైనం న బాధన్తే దిగన్తే మృతభీతయః. 7

తయా మకరమాతఙ్గనిగీర్ణోద్గీర్ణమూర్తిమాన్
అతిచక్రామ సుబహూన్ద్వీపాన్తరకులాచలాన్. 8

ఉత్తరదిగంతము నవలోకించుటకై యేగిన విపశ్చిత్తు ఉత్తరకురుదేశములందు దేవీసహితుఁడగు శివుని యారాధించి అణిమాద్యైశ్వర్యములను బొందెను. కావుననే దిగంతదర్శనమునఁ బ్రవృత్తుఁడైనను నాతనిని మరణముగాని. భయములుగాని బాధింపకయుండెను. త్రోవలో

నాతఁడు గజ, మకరాదులచే మ్రింగఁబడినను, ఆ యణిమాదుల ప్రభావముచే మరల మూర్తిమంతుఁడుగనే వెలిగ్రక్కఁబడుచు, క్రమముగ ననేక ద్వీపాంతరములను, కులపర్వతములను దాటిపోయెను.

పశ్చిమః పృష్ఠమారోప్య హేమచూడేన పక్షిణా
కుశద్వీపే కుశాఙ్గశ్రీస్తరసా తారతోఽర్ణవాన్. 9

పశ్చిమదిక్కునందలి విపశ్చిత్తు హేమచూడ (గరుడ) పక్షియొక్క వీపుపైనెక్కి, గరుత్మంతుని యారాధనచే, సువర్ణదర్భయొక్క కాంతివంటి దేహకాంతి గలవాఁడై శీఘ్రముగ ద్వీప, సముద్రములను దాఁటివైచెను.

క్రౌఞ్చద్వీపాచలే పూర్వో నిగీర్ణో రక్షసా వనే
తద్రక్షః పాటితం తేన హృదయేఽన్త్రవికర్తనైః. 10

తూర్పుదిక్కున కేగిన విపశ్చిత్తు క్రౌంచద్వీపమునందలి ప్రసిద్ధమగు వర్షసీమాపర్వతముపై నొకరాక్షసునిచే మ్రింగఁబడెను. కాని యాతండా రక్కసుని ప్రేవులఁ జీల్చివైచి హృదయమును భేదించుకొనిపోయెను.

దక్షిణో దక్షశాపేన యక్షతామాగతః క్షణాత్
శాకద్వీపే శతేనాసౌ వర్షాణాం మోక్షమాగతః. 11

దక్షిణదిక్కునందలి విపశ్చిత్తు దక్షుని శాపముచేఁ వెంటనే యక్షుఁడాయెను. కాని, మరల శాకద్వీపమున నూఱుసంవత్సరములకు, తచ్ఛాపవిమోచనమును బొందెను.

ఉత్తరస్తరసోత్తీర్ణతారావరతరఙ్గిణః
మహార్ణవసువర్ణోర్వ్యాం సిద్ధశాపాచ్ఛిలాం గతః. 12
తతో వర్షశతేనాసౌ ప్రసాదాజ్జాతవేదసః
తేనైవోన్మోచితస్తత్ర సిద్ధేన రతిమాప్తవాన్. 13

ఉత్తరదిక్కునందలి విపశ్చిత్తు వేగముగ చిన్నవియు, పెద్దవియునగు అనేక సముద్రములను దాఁటి మహాసముద్రముయొక్క సువర్ణమయ భూమిపై నొకసిద్ధుని శాపముచే శిలయైపోయెను. కాని, నూఱుసంవత్సరములైన పిదప, అగ్నియొక్క యనుగ్రహముచే నా సిద్ధుఁడే మరల యాతనిని శాపవిముక్తునిగఁజేయనంత నాతఁడు మనఃప్రీతిని బొందినవాఁడాయెను,

వర్షాణ్యష్టావభూద్రాజా నాలికేరనివాసినామ్
పూర్వః పరమధర్మిష్ఠః ప్రాప్తవాన్ప్రాక్స్మృతిం తతః. 14

పూర్వదిశకుఁ జనిన విపశ్చిత్తు కాన్యకుబ్జనగరమున కుత్తరముగాఁబోయి యచట నారికేళ ప్రధానదేశవాసుల కెనిమిదివత్సరములు అతిధర్మాత్ముఁడగు రాజయ్యెను. అపుడాతనికిఁ దనపూర్వకాల వృత్తాంతము స్మృతికివచ్చెను.

కల్పవృక్షవనే మేరోరుత్తరేఽప్సరసా సహ
ఉవాస దశవర్షాణి నాలికేరఫలాశనః. 15

నారికేళఫలములను భుజించునట్టి యుత్తరదిక్కునందలి విపశ్చిత్తు మేరుపర్వతముయొక్క కల్పవృక్షవనమున నొకయప్సరసతోటి పదిసంవత్సరములు వసించెను.

విహగాశ్వాసతత్త్వజ్ఞః శాల్మలిద్వీపశాల్మలౌ
పశ్చిమః పక్షిణీనీడే క్రీడయా న్యవసత్సమాః. 16
మన్దరాద్రౌ మృదుతలే మన్దారతరుమన్దిరే
కింనరీ మన్దరీనామ్నీ దినమేకమసేవత. 17

పక్షులను వశీకరించుటయందు నిపుణుఁడగు పశ్చిమదిక్కునందలి విపశ్చిత్తు శాల్మలిద్వీపమున శాల్మలివృక్షముపై నొకయాఁడుపక్షియొక్క గూటియందద్దానితోటి క్రీడించుచుఁ బదివత్సరములు నివసించెను, అటుపిమ్మట మందరపర్వతమును బొందిన ఆవిపశ్చిత్తుతో కోమలలతాయుక్తమగు మందార వృక్షమందిరమున మంచరియను కిన్నరి నొకదినము సమాగమము గావించెను.

క్షీరోద వేలావనకల్పవృక్షవనావలీనన్దనదేవతాభిః
సార్ధం సమాః సప్తనిమప్సరోభిర్నినాయ కామాకులితోఽథ పూర్వః. 18

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే
దిగ్విహరణం నామ త్రయోవింశాధికశతతమః సర్గః ॥ 123 ॥

పూర్వదిశయందలి విపశ్చిత్తు నారికేళవనమునుండి క్షీరసాగరతటమును బొందినవాఁడై, అటనున్న కల్పవృక్షవనసమూహములందు నందనవనదేవతలగు అప్సరసలతోటి కామముచే వ్యాకులుఁడై దెబ్బది వత్సరములు గడపెను.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
అవి॥ విప॥ దిగ్విహరణమను నూటయిరువదిమూఁడవ సర్గము ॥ 123 ॥

చతుర్వింశత్యధిక శతతమః సర్గః

[ఏకస్యాపి చతుర్దేహైర్వ్యవహారః సమర్థ్యతే
ద్వీపేషు నానాశైలేషు విహారశ్చ విపశ్చితామ్.

జీవాత్మ యొకటియేయైనను నాలుగు శరీరములతోటి యా విపశ్చిత్తులయొక్క వివిధ ద్వీప, పర్వతములందు విహరించుటయు, వ్యవహరించుటయు నిచట సమర్థింపఁబడుచున్నది.]

శ్రీరామ ఉవాచః—

ఏకసంవిన్మయాః సర్వ ఏవైకవపుషోఽపి తే
వివిధేచ్ఛాః కథం బ్రహ్మన్సంపన్నా ఏకదేహినః. 1

శ్రీరాముడు:— మహాత్మా! ఒకే సాక్షిచైతన్యముతోటి పరిపూర్ణులై, ఒకే జీవుఁడు గలవారై, (నాలుగు రూపములను బొందిన) ఒకేదేహముతోఁ గూడియున్నట్టి యావిపశ్చిత్తులకు భిన్నభిన్నములైన కోర్కెలెట్లు సంభవించెనో వచింపుఁడు?

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

ఏకసంవిద్ఘనాకాశమప్యనానైవ సర్వగమ్
స్వయం నానేవ సంపన్నం సుప్తే చిత్తమివాత్మని. 2

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఒకే జీవుడు స్వప్నమున అవిద్యచే వివిధదేహాది కల్పనను, శత్రుమిత్రాదుల రూపముతోటి వివిధేచ్ఛాకల్పనను బొంది వ్యవహరించునట్లు, జాగ్రత్తునందును చిద్ఘనాకాశరూపమై, సర్వవ్యాపకమై, ఏకమైనట్టి బ్రహ్మము వాస్తవముగ వివిధరూప, ఇచ్ఛలఁ బొందకయున్నప్పటికిని, స్వయముగఁ బొందినట్లు) అవిద్యచేఁ గానుపించుచున్నది.

తస్యాచ్ఛత్వాత్తథాభూతమాత్మైవాత్మని బిమ్బతి
తాదృశస్య తథాభూతా ముకురస్యేవ నిర్మలా. 3

ఆ చిద్ఘనాకాశము అద్దమువలె అతినిర్మలమై యుండుటవలన అద్దమందు పర్వతనద్యాదులతో గూడిన మహాకాశము ప్రతిబింబించునట్లు, అట్టినిర్మలాత్మ స్వయముగ తనయందే వివిధరూపములఁ బొందినట్లు ప్రతిబింబించుచున్నది.

ఏకలోహమయా ఏవ యథాదర్శాః పరస్పరమ్
తథైతే ప్రతిబిమ్బన్తి పదార్థాః పారమార్థికాః. 4

ఒకేలోహముచేఁ బరిపూర్ణములైన అద్దములు పరస్పరము ప్రతిబింబించునట్లు, పరమార్థమునచిద్రూపములేయైనను, ఈ సమస్తపదార్థములున్ను మాయాశక్తిచే చైతన్యమున ప్రతిబింబించుచున్నవి.

తేన యస్య యదా యద్యత్పురో భవతి వస్త్వసౌ
యదర్థం యుజ్యతే తేన చిద్ఘనైకస్వభావతః. 5

ఇక్కారణముననే అధ్యస్తమగు భోగ్యజగదాకారముగ వివర్తితమైన [illegible]ఘనమగు బ్రహ్మము ఎపుడేయే భోగ్యపదార్థములు ఇంద్రియములయొక్క సామీప్యమును [illegible]ందుచున్నవో, అయావస్తువుల భోగార్థము తగుచున్నది. (భోగ్యవస్తువులేనిచో భోగమే తగదనుట.)

ఇత్యనానైవ నానేదం నానానానా చ వస్తుతః
నచ నానా న చానానా నానానానాత్మకం తతః. 6

ఈ ప్రకారముగ బ్రహ్మమొకటియేయైనను బెక్కురూపము[illegible] భాసించుచున్నది. వాస్తవముగ ఈ బ్రహ్మమందు ఏకత్వ, అనేకత్వములు రెండును లేవు. మాయా ప్రభావముచేతనే యిది ఏక, అనేకరూపములచే భాసిల్లుచున్నది.

తేన యస్య యదాయాతం పురోవస్తు విపశ్చితః
న తేన సంవిన్మయతామేత్య తద్వశమాగతః. 7

కావున ఒకేజీవునకు ఏకకాలముననే వివిధభోగదాయకమగు కర్మయొక్క పరిపాకము సంభవించుటచే ఏ విపశ్చిత్తుని సమ్ముఖమున నేవస్తువు సంప్రాప్తించెనో, అతని సంవిత్తు అద్దానియందు తన్మయముకాఁగా నాతఁడు దానికి వశుడయ్యెను.

ఏకదేశగతా విష్వగ్వ్యాప్య కర్మాణి కుర్వతే
యోగినస్త్రిషు కాలేషు సర్వాణ్యనుభవన్త్యపి. 8

యోగులగువారు ఏకదేశమున నున్నప్పటికిని త్రికాలములందును వివిధ దేశములందలి సమస్త విషయముల ననుభవించుచుండ నిఁక భిన్నభిన్న దేశములందున్నట్టి విపశ్చిత్తు లనుభవించుటఁ గూర్చి వేఱు చెప్పవలెనా?

అబ్దోఽపి వ్యాప్తిమానేకస్తుల్యకాలం పృథక్ క్రియాః
అహ్లాదస్తేన పాదేన కరోత్యనుభవత్యపి. 9

ఉష్ణముచేఁ దపించువారి నాహ్లాదపఱచునట్టి మేఘ మొకటియేయైనను అనేక దేశములందు వ్యాపించి యేకకాలమున నాయాయంశములచే నొకచోట క్షాళనము, ఒకచోట భేదనము, ఒకచోట జలవర్ధనము ఒకచోట సస్యపోషణము మున్నగువివిధ క్రియలనెట్లు, గావించుచున్నదో, మఱియు, ఆ మేఘాభిమానియగు జీవుఁడు 'నే నీక్రియలఁ గాంచితినని' యెట్లనుభవించుచున్నాఁడో అట్లే యా విపశ్చిత్తులఁగూర్చియు నెఱుఁగనగును.

తుల్యకాలమసంఖ్యాతమీశ్వరప్రతియోగినః
కర్మజాలం జగజ్జాతం కుర్వన్త్యనుభవన్తి చ. 10

అణిమాద్యైశ్వర్యములఁ బొందుటచే ఈశ్వరసదృశులకు యోగులు ఏక కాలముననే అసంఖ్యాతములగు కర్మలను, జగత్సమూహములను రచించుచు, వాని ననుభవించుచు నున్నారు.

ఏకో విష్ణుశ్చతుర్భిః స్వైర్బాహుభిర్వా శరీరకైః
పృథక్కుర్వన్క్రియాః పాతి జగద్భృత్యైః వరాఙ్గనాః. 11

ఒకేవిష్ణుభగవానుఁడు తన నాలుగు భుజములచేతను, లేక, నాలుగు శరీరములచేతను, (ఒకచోట యోగనిద్రనొందుచు, ఒకచోటఁ దపంబొనరించుచు, ఒకచోట నింద్రుని సోదరుఁడై యాతనికి సాయమొనర్చుచు, ఒకచోట వైకుంఠమున భోగముల ననుభవించుచు ఈ ప్రకారముగ) వేర్వేరుక్రియలఁ గావించుచు జగత్తును బాలించుచున్నాఁడు. ఉత్తమవనితల ననుభవించుచున్నాఁడు.

బహుబాహుర్యదా ద్వాభ్యాం హస్తాభ్యాం ద్వ్యర్థసంగ్రహమ్
కరోతి బహుభిర్బాహ్యైః సంగ్రామం సతతం కరైః. 12

అనేకబాహువులు గలవాఁడగు విష్ణువు, రెండేప్రయోజనములు తటస్థించునపుడు తన రెండుబాహువులతోనే యా కార్యముల నెరవేర్చును; కాని యుద్ధాదికార్య ప్రసంగములందు సమస్తబాహువుల నుపయోగించి నిరంతర మాకార్యములఁ జేయుచుండును.

తథైవ తైర్విపశ్చిద్భిః సర్వదిక్కం తథా స్థితైః
తథా వ్యవహృతం ప్రాప్త మేకసంవిన్మయైరపి. 13

అట్లే, ఒకేసంవిత్తుచేఁ బరిపూర్ణులైయున్నను, ఆ విపశ్చిత్తులు నలువురు నలుదిక్కు లందును యథాప్రాప్తములైన సుఖదుఃఖాది వ్యవహారముల నాచరించిరి.

సుప్తం తైర్భూమిశయ్యాసు భుక్తం ద్వీపాన్తరేషు చ
విహృతం వనలేఖాసు ప్రక్రాన్తం మరుభూమిషు. 14

ఉషితం గిరిమాలాసు భ్రాన్తం సాగగకుక్షిషు
విశ్రాన్తం ద్వీపలేఖాసు నిలీనం ఘనమాలిషు. 15

రూఢమర్ణవమాలాసు వాత్యాసు జలవీచిషు
క్రీడితం భూభ్రదబ్ధీనాం తటీషు నగరీషు చ. 16

ఆ నలువురు విపశ్చిత్తులున్ను భూమిపైశయనించిరి; ద్వీపాంతరములందు లభించిన వస్తువుల్లను భుజించిరి. వనపంక్తులందు విహరించిరి. మరుభూములందు సంచరించిరి; పర్వతములపై నివసించిరి. సముద్రములందు పరిభ్రమించిరి; ద్వీపసమూహములందు విశ్రమించిరి. మేఘాచ్ఛాదితములగు పర్వతశిఖరములపై దాఁగుకొనిరి; మహావాయు, తరంగయుక్తములగు సముద్రములందును వసించిరి. పర్వత, సముద్రతీరములందును, నగరములందును క్రీడించిరి.

శాకద్వీపోదయగిరితటే సప్తవర్షాణిసుప్తం
పూర్వేణాన్తర్విదలగహనే యక్షసంమోహితేన
పాషాణామ్బు ప్రసభమమునైవాత్ర పీత్వా దృషత్త్వా
మాగత్యాన్తః స్థితమథ సమాః సప్తజాత్యేన భూమేః. 17

తూర్పుదిక్కునకేగిన విపశ్చిత్తు శాకద్వీపమునందలి ప్రసిద్ధమగు ఉదయాచలపర్వత తటమున పత్రరహితములగు స్నుహీ (జెముడు) వృక్షముల భయంకర వనమందొకయక్షునిచే సంమోహితుఁడై యేడు వత్సరములు నిదురించెను. మఱియు, ఆ విపశ్చిత్తే యా పర్వతముపై నొకానొకచోట శిలాకారకమగు జలమును ద్రావి బలాత్కారముగ శిలారూపమును బొందినవాఁడై యేడు సంవత్సరములు భూమియందు వసించెను.

శాకద్వీపేఽస్తశైలస్య శిరస్యభ్రగుహాగృహే
పిశాచాప్సరసా మాసం పాశ్చాత్యః కాముకీకృతః. 18

పశ్చిమదిక్కునందలి విపశ్చిత్తు శాకద్వీపమునందలి అస్తాచలముయొక్క శిఖరమున మేఘసహితమగు గుహాగృహమున పిశాచముల అప్సరసచే నెలదినములు కాముకుఁడుగాఁ గావింపఁబడెను.

యత్ర శాన్తభయే వర్షే జలధారే మహాగిరౌ
హరీతకీవనే వర్షం పూర్వోఽస్థా[illegible]మాయయా. 19

అత్ర రైవతకే శైలే వర్షే శిశిరనామని
దశరాత్రమభూత్సింహః పూర్వో యక్షవశీకృతః. 20

అత్ర కాఞ్చనశైలాదిదరీదర్దురతాం గతః
పిశాచమాయాచలితో దశవర్షాణ్యువాస సః. 21

పూర్వదిశయందలి విపశ్చిత్తు జలధారా, మహాపర్వత సంయుక్తమగు 'శాంతభయ' మను బేరుగల ప్రదేశమందొకానొక మునియొక్క శాపముచే హరీతకి (కరక) వృక్షమై జనులచేఁ గాంచఁబడక డెబ్బదివత్సరములుండెను. పిమ్మట నాతఁడు శిశిరమను ప్రదేశమందలి రైవతక పర్వతముపై నొక యక్షునిచే వశీకృతుఁడై పదిరాత్రులు సింహముగఁ గావింపఁబడెను. అతఁడే మరల పిశాచముల మాయకు వశుఁడై యా ప్రదేశమందలి సువర్ణపర్వత గుహయందు కప్పగ పదిసంవత్సరములు వసించెను.

కౌమారం వర్షమాసాద్య శ్యామాద్రే రుత్తరస్తటమ్
శాకద్వీపేఽన్ధకూపేఽన్ధో న్యవసచ్ఛరదాం శతమ్. 22

ఉత్తరదిక్కునందలి విపశ్చిత్తు శాకద్వీపమందలి కౌమారమను ప్రదేశమునుబొంది యచటి నీలగిరియొక్క యుత్తరతటమునగల అంధకార సంయుక్తమగు నూయియందుఁ గ్రుడ్డి కప్పయై నూఱు సంవత్సరములు నివసించెను.

మరీబకేఽకరోద్వర్షే వర్షాణ్యత్ర చతుర్దశ
విద్యాధరత్వం పాశ్చాత్యః స విద్యాధరవిద్యయా. 23

రతక్లమక్లాన్తపురారిలక్ష్మీచలాఙ్గలేఖాగ్రమశీకరార్తమ్
ఏలాలతాలిఙ్గనలబ్ధగన్ధమాలమ్బ్య వేలావనగన్ధవాహమ్. 24

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే
ద్వీపేషు విపశ్చిద్వ్యవహారో నామ చతుర్వింశత్యధిక
శతతమః సర్గః ॥ 124 ॥

పశ్చిమదిక్కునందలి విపశ్చిత్తు విద్యాధరత్వమును గలుగఁజేయు విద్యచేమరీబకమను ప్రదేశమున విద్యాధరుఁడై పదునాలుగు వత్సరములు వసించెను. రతిశ్రమచే నలసిన శివునియొక్క శోభాతిశయముతోఁగూడిన చంచలములగు అవయవములనుండి క్రమముగ నుత్పన్నములైన జలకణములతోటి మిళితమైనదియు, ఏలకతీఁగెలయొక్క స్పర్శచేలభించిన సుగంధమును గ్రహించునదియు, సముద్రతీరవనములందలి యుత్తమగంధమును వహించునట్టిదియునగు వాయువు నవలంబించి యానందంబొందుచు నాతఁడా విద్యాధరపదవిని గడపెను.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
అవిద్యోపాఖ్యానాంతర్గత విపశ్చిదుపాఖ్యానే ద్వీపేషు విపశ్చిద్వ్యవ
హారమను నూట యిరువది నాల్గవ సర్గము ॥ 124 ॥

పఞ్చవింశత్యధికశతతమః సర్గః

[పరస్పరోపకారిత్వం విపద్యత్ర విపశ్చితామ్
విష్వగర్థక్రియా జీవన్ముక్తానాం చోపవర్ణ్యతే.

ఆ నలుగురు విపశ్చిత్తులయొక్క విపత్తునందలి పరస్పర యుపకారిత్వము సర్వత్ర అర్థ క్రియాసమర్థత జీవన్ముక్తులయొక్క వృత్తాంతము, ఇచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

వర్షే శాన్తభయాభిఖ్యే జలధారే గిరౌ తరౌ
శాద్వృక్కర్తరి పానీయం శాకద్వీపే పిబన్ స్థితః. 1

పూర్వోఽథ వర్షసప్తత్యా పాశ్చాత్యేనైక్యమోక్షితః
విద్యయా క్రకచేనేవ భిత్త్వా వృక్షత్వమక్షతః. 2

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! తూర్పుదిక్కునందలి విపశ్చిత్తు శాకద్వీపమున శాంతభయమను బ్రదేశమున జలధారాయుక్తమగు పర్వతముపై మునిశాపముచే హరీతకి (కరక) వృక్షమై, కత్తెరవంటి మూలప్రదేశమునుండి జలమును ద్రావుచునుండ, పశ్చిమదిక్కునందలి విపశ్చిత్తు ఆ వృత్తాంతమెఱిఁగి యటకేతెంచి శాపమిచ్చిన మునిని సంతోషపఱచి యాతఁడొసంగిన విద్యచే అంపముచేవలె ఆ వృక్షమును ఛేదించి శాశ్వతముగ నాతనిని వృక్షత్వమునుండి విముక్తునిగఁజేసెను.

పాశ్చాత్యః శిశిరే వర్షే పాషాణత్వముపాగతః
మోచితో దక్షిణేనాశు గోమాంసాది ప్రయోగతః. 3

పశ్చిమదిక్కునందలి విపశ్చిత్తు శిశిరమను బ్రదేశమున పిశాచపతియొక్క శాపముచే శిలయైయుండ, దక్షిణదిశయందలి విపశ్చిత్తేతెంచి గోమాంసాదుల ప్రయోగముచే ఆ పిశాచపతిని సంతోషపఱచి యాతనికి శిలాత్వమునుండి విమోచనమును గావించెను.

శివేఽస్తాచలపారస్థే వర్షే వర్షేణ పశ్చిమః
మోచితో దక్షిణేనైత్య గోపిశాచ్యా వృషీకృతః. 4

అస్తాచలతటముననున్న శివమగు బ్రదేశమున గోరూపధారిణియగు పిశాచిచే పిశాచ విద్యద్వారా పశ్చిమదిక్కునందలి విపశ్చిత్తు వృషభము (ఎద్దు) గావింపఁబడ, ఒకవత్సరమున కటకు దక్షిణదిశయందలి విపశ్చిత్తేతెంచి యాతని ఆ వృషభత్వమునుండి విముక్తునిగఁజేసెను.

అత్రైవ క్షేమకే వర్షే ఆమ్బికేయగిరౌ తరౌ
రక్షితో యక్షతాం యాతో మోక్షం యక్షేణ లబ్ధవాన్. 5

క్షేమకమను బ్రదేశమున 'అంబికేయ' పర్వతముపైని వృక్షముపై దక్షిణదిక్కునందలి విపశ్చిత్తు పిశాచమైయుండ నాతనిని పశ్చిమదిక్కునందలి విపశ్చిత్తు పిశాచపతిని బ్రసన్నునిగఁ జేయుటద్వారా పిశాచత్వమునుండి విడుదలచేసెను.

అత్రైవ వృషకే వర్షే శైలే కేసరనామని
కేసరిత్వం గతః పూర్వః పాశ్చాత్యేనైవ మోచితః. 6

ఆ శాకద్వీపముననే వృషకమను బ్రదేశమున కేసరమను పర్వతముపై తూర్పు దిక్కునందలి విపశ్చిత్తు సింహమై వసించుచుండ నాతనిని పశ్చిమ దిశయందలి విపశ్చిత్తు సింహత్వమునుండి విడుదల గావించెను.

శ్రీరామ ఉవాచః—

ఏకదేశగతా విష్వగ్వ్యాప్య కర్మాణి కుర్వతే
యోగినస్త్రిషు కాలేషు సర్వాణి భగవన్కథమ్. 7

శ్రీరాముఁడు;— మహాత్మా! ఒకేప్రదేశమున నున్నవారైనను యోగులు సర్వత్రవ్యాపించి అనుగ్రహాది సర్వకాలములను త్రికాలమందును నెట్లు చేయగలుగుచున్నారో వచింపవేఁడెద?

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఇహ రామ ప్రబుద్ధానాం యదస్త్యస్త్వలమేవ నః
తేన యత్తు ప్రబుద్ధానాం తదిదం శృణు కథ్యతే. 8

శ్రీవసిష్ఠుఁడు:— ఓ రామచంద్రా! ఈ ప్రపంచమున అజ్ఞానుల దృష్టియందేది (భౌతికాది స్థూలపదార్థము) గలదో, దానితోటి మనకేప్రయోజనమున్ను లేదు. జ్ఞానుల దృష్టి యందేది (చిన్మాత్రవస్తువు) గలదో యద్దానిని వచించుచున్నాను వినుము.

చిన్మాత్రసత్తాసామాన్యాదృతేఽన్యన్నాత్మ తద్విదామ్
దృశ్యాత్యన్తాభావబోధే సర్గాసర్గదృశోః క్షయే. 9

చిన్మాత్రసత్తాసామాన్యే విశ్రాన్తస్య నిరన్తరమ్
సర్వేశస్యేహ సర్వత్వం సర్వాత్మత్వం చ సర్వదా. 10

తత్త్వవేత్తల దృష్టియందు సత్తా సామాన్యమగు చిన్మాత్రముకంటె వేఱుగ ఈ జగత్తునకు మఱియేస్వరూపమున్ను లేదు. ఏలయనిన, దృశ్యముయొక్క అత్యంతాభావమును గూర్చిన బోధకలుగ సృష్టియొక్కయు, దాని అభావములయొక్కయు దృష్టి శమింప చిన్మాత్రమగు సత్తా సామాన్యమున నిరంతరము విశ్రమించునట్టి సర్వేశ్వర స్వరూపుఁడగు జ్ఞాని కీప్రపంచమున నంతయు సదా చిద్రూపమైన ఆత్మగనే వెలయుచుండును గాని అన్యముగాదు.

వద కేన కథం కుత్ర కదా కిమివ రోధ్యతే
సర్వగస్త్వథ సర్వాత్మా యత్ర భాతి యదా యథా. 11

తథా భాతి తదా తత్ర సర్వాత్మని కిమస్తి నో
అతీతం వర్తమానం చ భవిష్యత్స్థూలమవ్యణు. 12

అట్టి స్థితియందు అనగా సర్వము ఆత్మమయమై యున్నపుడిఁక దేనిచే నెయ్యది యెపుడెచట నెట్లు నిరోధింపఁబడఁగలదు? మఱియు, సర్వవ్యాపకమై, సర్వరూపమైనట్టి ఆత్మ

యెపుడెచట నెట్లు భాసించునో, అపుడచట నట్లే సమస్తమున్ను భాసింపఁదొడఁగును. సర్వరూపుఁడగు చిత్పురుషుఁడు భూత భవిష్యద్వర్తమాన, స్థూల సూక్ష్మ రూపమగు జగత్తునందేది కాక యున్నాఁడు? (సర్వమునై యున్నాఁడని భావము).

తథా దూరమదూరం చ నిమేషః కల్ప ఏవ చ
సర్వరూపమజహత్యేవ సామాన్యే తాని సర్వదా. 13

ఆ చిద్రూపమగు ఆత్మ తన వాస్తవ స్వరూపమును ద్యజింపకయే దూర, సమీప, నిమేష, కల్ప, భూత, భవిష్యద్వర్తమాన, స్థూల, సూక్ష్మాదులన్నిఁటిని సత్తా సామాన్యరూపమున సదా ధరించుచున్నది.

సర్వాత్మని స్థితాన్యేవ పశ్య మాయావిజృమ్భితమ్
అజాతమనిరుద్ధం చ యథాస్థిత మవస్థితమ్. 14

ఓ రామచంద్రా! సర్వరూపమగు ఆ యాత్మయందు భూత భవిష్యద్వర్తమాన స్థూల సూక్ష్మాదు లన్నియు స్థితిగల్గియున్నవి. మాయయొక్క ప్రభావము చూడుము! ఉత్పన్నము గాకయే, నశింపకయే యీ జగత్తు యథారీతి ఆత్మయందు వెలయుచున్నది!

విజ్ఞానఘనమేవేదమత ఏవ జగత్త్రయమ్
నభస్త్వమత్యజంశ్చైవ సర్వాత్మైవ నభః స్థితమ్. 15

కావుననే యీ ముల్లోకములున్ను విజ్ఞానఘన స్వరూపములే యైయున్నవి. చిదాకాశము తన చిదాకాశ స్వరూపమును ద్యజింపకయే యిట్లు సర్వ జగద్రూపముతోటి స్థితి గల్గియున్నది.

జగదాత్మా జగద్రూపం ద్రష్టృదృశ్యతయోదితమ్
విశ్వాత్మదృగ్వపుర్యత్స్యాత్తత్కిం కేన కథం కదా. 16

మాయాశబలితమగు పరమాత్మ ద్రష్టృ దృశ్యత్వములచే జగద్రూపముగ నుదయించినది. అట్టి జగదాత్మయగు పరమేశ్వరునియొక్క యేదృక్ (శుద్ధ చిత్) మాత్రరూపముగలదో. అది దేనిచేత ఎట్లు ఎపుడు ఏమికాగలదు? (శుద్ధరూపమున పరిణామ వివర్తాదు లసంభవములుగనుక.)

దుఃసాధ్యం బ్రూహి తత్త్వజ్ఞ సాధ్యాసాధ్య స్వరూపిణః
తస్మాదస్యాః సదైకస్యా విపశ్చిద్రాజసంవిదః. 17

తత్త్వజ్ఞుడవగు రామచంద్రా! సాధ్యరూపమును, అసాధ్యరూపమును రెంటినిగూడ ధరించు మాయాశబలిత పరమాత్మకు అసాధ్యమెద్ది గలదో వచింపుము? కావున అట్టి చిద్రూపమగు విపశ్చిద్రాజుయొక్క సంవిత్తు ఒకటియేయైనను, ఉపాధిద్వారా యనేక స్థానము లందనేక కార్యములను గావించెను.

ప్రబోధమనుగచ్ఛన్త్యా అప్రాప్తాయాః వరం వదమ్
ఏకస్యా అప్యనేకస్యాః సర్వం సర్వత్ర యుజ్యతే. 18

ఈశ్వరచైతన్యమే యుపాధి భేదముచే విపశ్చిదాది జీవభావ మొందియుండుటవలన ప్రబోధమువైపునకుఁ జనుచున్నదియు, పరమాత్మపదము నింకను బొందనిదియు, ఒకటియే యైనను

వివిధోపాధులచే ననేకభావములను బొంది నదియునగు విపశ్చిద్రాజుయొక్క సంవిత్తునకు, అగ్న్యాదుల యనుగ్రహముచే సర్వత్ర సర్వకార్యములున్ను తగియేయున్నవి.

బోధాబోధాత్మరూపే హి కిం నామాస్తి పరాత్మని
అప్రాప్తాయాః పరం బోధం పదార్థాకులతోచితా. 19

బోధాబోధరూపమగు మాయాశబలిత పరమాత్మయందు అసాధ్యమైనదేది గలదు? మఱియు పరమార్థబోధమును బొందనివానికి పదార్థపరిపూర్ణత్వము (దృశ్యత్వము) ఉచితమే యగును.

కించిద్బోధం ప్రవిష్టాయాః సిద్ధతాప్యుచితైవ సా

ఒకింత బోధ సంప్రాప్తించిన యా విపశ్చిత్సంవిత్తునకు సిద్ధత్వమున్ను ఉచితమేయగును

ఏవం తే సర్వదిక్సంస్థాః సర్వమేవ పరస్పరమ్. 20
పశ్యన్త్యనుభవన్త్యాశు చికిత్సన్తే చ సంకటమ్

ఈ ప్రకారముగ, సర్వదిశలందును నున్నట్టి యా విపశ్చిత్తులు పరస్పరమంతయు, జూచుకొనుచు, అనుభవించుచు, సంకటములందు శీఘ్రముగఁ చికిత్సగావించుకొనుచు నుండిరి.

బోధాకాశః స్వకాద్రూపాదీషచ్చ్యుత ఇవాశు చేత్. 21
తదన్యతామివాదత్తే సుస్థితోఽపి యథా స్థితమ్

ఏలయనిన, చిదాకాశము తన స్వరూపమునుండి శీఘ్రముగ నొకింతచ్యుతినొందిన దానివలెనగుచో, తన నిజస్వరూపముననే యున్నప్పటికి అన్యమగు (మనోజగదాది) రూపమును గ్రహించిన దాని చందమున నగును.

శ్రీరామ ఉవాచః—

విపశ్చితః ప్రబుద్ధాశ్చేత్కథం సింహవృషాదితామ్. 22
దిక్షు యాన్తీతి మే బ్రహ్మన్బోధాయ కథయాశ్వలమ్

శ్రీరాముఁడు :— మహాత్మా! ఆ నలుగురు విపశ్చిత్తులున్ను జ్ఞానులైనచో దిక్కులందు సింహ, వృషభాదిరూపముల నేల పొందిరో బోధకొఱకు నాకు శీఘ్రముగఁ బూర్ణరీతి వచింపప్రార్థన?

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ప్రబుద్ధాః కథితా యే తే యోగినస్తే మయానఘ. 23
ప్రసఙ్గరూపాన్తరతో న ప్రబుద్ధా విపశ్చితః
విపశ్చితో మహాబాహో ప్రబుద్ధా నిపుణం న తే. 24

శ్రీ వసిష్ఠుఁడు :— పాపరహితుఁడవగు రామచంద్రా! ఒకేప్రదేశమున నున్నను సర్వత్ర సర్వకార్యములను జేయుచుందురను విషయము ప్రబుద్ధులైన యోగులఁ గూర్చియే నేను నీకుఁ దెలిపితిని. ప్రసంగవశమున నది యీ విపశ్చిచ్చరితమునఁ జెప్పవలసివచ్చినది. అంతేగాని యా నలుగురు విపశ్చిత్తులున్ను పూర్ణజ్ఞానులుకారు.

బోధాబోధదృశోర్మధ్యే తే హి దోలాయితాః స్థితాః
మోక్షచిహ్నాని దృశ్యన్తే బన్ధచిహ్నాని చాఖిలః. 25

ఆ విపశ్చిత్తులు జ్ఞానాజ్ఞానదృష్టుల రెంటిమధ్యను నూఁగులాడుచున్నారు. వారి యందంతట (వివేకాది) మోక్షచిహ్నములును, (రాగాది) బంధచిహ్నములునుగూడఁ గానుపించు చున్నవి.

నిత్యధర్మప్రబుద్ధానాం తథా భూతతయా తయా
విపశ్చితో ధారణయా యోగినో న పరం గతాః 26

వారు అగ్నిదేవుని కృపచే ధారణామాత్రమును బొందిన యోగులేగాని పారంగతులైన ఆత్మజ్ఞానులుకారు.

ధారణాయోగినస్తే హి ధారణాప్రాప్తసిద్ధయః
యే పరం బోధమాయాతా యేష్వవిద్యా న విద్యతే. 27

హృదయాది ప్రదేశములందు అగ్నిదేవునియందు చిత్తమును నిరోధించుటవలన వారు అతని యనుగ్రహముచే సిద్ధులను పొందినవారైరి. కావున వారు ధారణాయోగులే యగుదురుగాని పూర్ణజ్ఞానులుకారు. ఏలయనిన, పరమబోధను బొందినవారియందు అవిద్య యుండనేరదు.

కిమవిద్యామవేక్షన్తే తే తామరసలోచన.
ధారణాయోగినో హ్యేతే వరేణ ప్రాప్తసిద్ధయః. 28
అవిద్యా విద్యతే తేషాం తేన తేఽతద్విచారిణః

కమలనేత్రుఁడవగు రామచంద్రా! జ్ఞానయోగులగువారు అవిద్య నెందునిమిత్తము గాంచుదురు? కాఁబట్టి అవిద్యను గాంచనెంచు యిచ్చునుబట్టి వారింకను బూర్ణజ్ఞానులు కారని తెలియుచున్నది. ధారణాపరిపాకముచే వారు అగ్నిదేవుని కృపవలన వరదానముచే సిద్ధులఁ బడసిన యోగులే యగుదురు. వారియం దవిద్యయుండియే యున్నది. కావున వారు ఆత్మవిచార శూన్యులేయని యెఱుఁగనగును.

అన్యచ్ఛృణు హే రామ జీవన్ముక్తశరీరిణామ్.
భవేద్వ్యవహృతావేవ పదార్థాన్తరవేదనమ్ 29

ఓ రామచంద్రా! ఇంకను వినుము - జీవన్ముక్తులకు వ్యవహార (వ్యుత్థాన) కాలమందే దేహాది అన్యపదార్థములు భాసించునుగాని సమాధియందుఁగాదు.

మోక్షోఽపి చేతసో ధర్మశ్చేతస్యేవ స తిష్ఠతి.
న దేహే దేహధర్మస్తు న దేహాద్వినివర్తతే 30

మోక్షమున్ను చిత్తముయొక ధర్మమే గావున నయ్యది (ఏకాగ్ర) చిత్తమందే స్థితిగల్గి యున్నదిగాని దేహమందుగాదు. (బంధింపఁబడునది చిత్తమేగాని ఆత్మ కాదు. గనుక మోక్షమున్ను ఆ చిత్తముయొక్క ధర్మమేయగును.) దేహధర్మము (వ్యవహారాదులు) జీవన్ముక్తునకును దేహము ... [illegible]త్రింపదు.

న కదాచన నిర్ముక్తం చేతో భూయో నిబధ్యతే. 31
యత్నేనాపి పునర్బద్ధం కేన వృన్తచ్యుతం ఫలమ్

ముక్తచిత్తము మరల యెన్నఁటికిని బంధింపఁబడదు. తొడిమనుండి జారిపడిన ఫలము మరల ప్రయత్నముచేనైనను ఎవనిచేతను ఆ తొడిమకు బంధింపఁబడఁజాలదు.

దేహస్తు దేహధర్మేణ జీవన్ముక్తిమతామపి. 32
గృహ్యతే తద్గతం తేషాం చేతస్త్వచలమేవ తత్

[illegible]లకున్ను దేహము దేహధర్మముతోఁ గూడియేయుండును. కాని వారిచిత్తము నిశ్చల[illegible]ముండును.

మోక్షో హి న పరజ్ఞేయో ధారణాదిప్రయోగవత్. 33
ఆత్మసంవేద్య ఏవాసౌ మధ్వాద్యాస్వాదసౌఖ్యవత్

కాఁబట్టి యట్టి వారితరులచే వీరు జీవన్ముక్తులని తెలియఁబడఁజాలరు. ధారణాదులతోఁ గూడిన యోగులైతే యితరులచే నెఱుఁగఁబడుదురు. కాని, మోక్షము ధారణాదులవలె నితరులచే నెఱుఁగఁబడునదికాదు. అది మధురపదార్థాదుల ఆస్వాదనసౌఖ్యమువలె స్వాత్మైక వేద్యమే యైయున్నది.

సుఖదుఃఖైర్యుతో యోఽసౌ స్వయం బద్ధానుభూతిమాన్. 34
తన్ముక్తౌ ముక్త ఇత్యుక్తః స్వానుభూతిప్రదస్త్వసౌ

సుఖదుఃఖాది మనోధర్మములను తనయందు అధ్యాసముగావించుకొని ఆత్మ బంధాను భవము నొందుచున్నది. మనస్సు ముక్తినొందినపుడు ఈ స్వానుభూతి ప్రదమగు ఆత్మయందును ముక్తి నొందెనను, వ్యవహారము సంభవించుచున్నది.

అన్తఃశీతలచిత్తో హి ముక్త ఇత్యభిధీయతే 35
బన్ధః సంతప్తచిత్తేతి దేహాదేస్తన్న దృశ్యతే

అభ్యంతరమున శీతలత్వము (శాంతి) తోఁగూడిన చిత్తమే ముక్తమనియు, సంతప్త చిత్తమే బద్ధమనియుఁ జెప్పఁబడుచున్నది. కావున బంధమోక్షములు చిత్తాధీనములే గాని దేహాధీన ములు కావు. ఆ బంధమోక్షములు దేహాదులందులేవు.

శరీరే కణశః కృత్తే రాజ్యే వా వినియోజితే. 36
రుదతో హసతశ్చైవ జీవన్ముక్తమతేరిహ
న దుఃఖం న సుఖం కించిదన్తర్భవతి తత్ప్రితమ్. 37

శరీరము ముక్కలుముక్కలుగా గోయఁబడినను లేక రాజ్యాదులందు నియోగింపఁబడి నను లేక, ఏడ్చుచున్నను, నవ్వుచున్నను జీవన్ముక్తునకు అంతఃకరణమున, తద్దేహప్రయుక్తమగు దుఃఖముగాని, సుఖముగాని యొకింతైనను నుండదు.

గ్రస్తాత్తోఽప్యనుభూతిస్తు తత్రైవైషాస్తి నాపరే
దృష్ట్వా నైవజ్ఞితా భగ్నా రూపాన్తరముపాగతాః. 38

సుఖదుఃఖాదుల యనుభవమును దేహమందు గ్రహించుచున్నప్పటికి మనుజునకు 'నేను సుఖవంతుఁడను, నేను దుఃఖవంతుఁడను' అను ఈప్రకారముగ ఆత్మయందే ఆయనుభవము పర్యవసించుటఁబట్టి యట్టిసుఖదుఃఖాదుల అధ్యాసమునకు ఆత్మయే ఆశ్రయముగాని బాహ్యములగు దేహాదులుకాదు. కావుననే దేహాదులందలి ఆత్మాభిమానమువలన రూపాంతరమును బొందిన చార్వాక, నైయాయికాదులు మోక్షోపాయము లభింపమి పరాజితులై కానుపించుచున్నారు.

దేహాది జీవన్ముక్తానాం స్వభావాన్న కదాచన
మృతోఽపి నైవ మ్రియతే రుదన్నపి న రోదితి. 39

విహసన్న హసత్యేవ జీవన్ముక్తో మహోదయః
వీతరాగాః సరాగాభా అకోపాః కోపసంయుతాః. 40

నిత్యమై, అశరీరమైనట్టి ఆత్మయొక్క స్వభావమును బొందియుండుటచే జీవన్ముక్తులకు దేహాదిభావన యెపుడును నుండనేరదు. కావుననే దేహము మరణించినను మహోదయుఁడగు అట్టి జీవన్ముక్తుఁడు మరణింపకయే యున్నాఁడు. ఏడ్చుచున్నప్పటికిని వాస్తవముగ నేడ్వకయే యున్నాడు. నవ్వుచున్నను నవ్వకయేయున్నాడు; క్రోధయుక్తుడై యున్నను, క్రోధరహితుఁడయై యున్నాడు; రాగసహితుఁడైయున్నను రాగవర్జితుఁడేయై యున్నాఁడు.

అమోహా మోహవలితా దృశ్యన్తే తత్త్వదర్శినః
ఇదం సుఖమిదం దుఃఖమిత్యాదికలనాస్తు తాః. 41

అలం దూరగతాస్తేషామఙ్కురా నభసో యథా

తత్త్వజ్ఞులు మోహముచేఁ జుట్టబడినను మోహరహితులేయైయుందురు. ఏలయనిన, ఇది సుఖము ఇది దుఃఖము' అను నీమున్నగు కల్పనలు వారికి, ఆకాశముయొక్క అంకురములవలె దూర్ణముగఁ దొలఁగిపోయినవి.

జగదాత్మా చ నాస్త్యేవ యస్యైకం సర్వమస్తి చ. 42
సుఖదుఃఖాది తస్యేతి వాగ్వ్యోమవిటపోపమా

మఱియు, ఏ ఆత్మజ్ఞాని అగు జీవన్ముక్తునియొక్క దృష్టియందు జగత్తుయొక్క స్వరూపముగాని, దాని మూలమగు అజ్ఞానముగాని లేకయున్నవో, అంతయు ఏకరసమైన సద్రూపమగు ఆత్మయైయున్నదో, అట్టి జీవన్ముక్తునకు సుఖదుఃఖాదులు కలవను ఈ వాక్యము ఆకాశవృక్షశాఖలు కలవను వాక్యముచందముననే యుండును.

అశోకా ఏవ శోచన్తే జీవన్ముక్తా జయాన్వితాః. 43

శోకమోహాదులను జయించినవారగుటఁబట్టి జీవన్ముక్తులు శోకించుచున్నను శోకరహితులేయైయుందురు.

అచ్ఛిన్నా ఏకసద్భావా దృశ్యన్తే తత్త్వదర్శినః
శిరః కమ[illegible] [illegible]నుగాయనతత్పరమ్. 44

హరో నఖేన చిచ్ఛేద సుకుమారమివామ్బుజమ్
శక్తోఽపి న పునర్బ్రహ్మా జనయామాస తచ్ఛిరః. 45

తత్త్వజ్ఞానులు, తమ అవయవములు ఛేదింపఁబడినప్పటికిని ఛేదింపఁబడని వారిచందముననే ఏకరసస్వభావులై అచ్ఛేద్యమగు ఆత్మయందే నెలకొనియుందురు. చూడుము, ఉన్నత స్వరముతోటి సామగానమునఁ దత్పరుఁడగు బ్రహ్మదేవునియొక్క శిరమును కోమలకమలమును వలె [illegible] తనగోటిచేఁ ద్రుంచివేయ, మరల యద్దానిని బుట్టింప సమర్థుడైనను బ్రహ్మదేవుఁ డట్లు [illegible] న్నాఁడు!

వ్యర్థమైకతాస్య చిద్వ్యోమ్నో ముధా మూర్ధ్నేతరేణ కిమ్
నైవ తస్య కృతేనార్థో నాకృతే నేహ కశ్చన. 46

ఏలయనిన, చిదాకాశముతోటి సమత్వమును బొందియుండుటచే ఆ బ్రహ్మదేవునకు వ్యర్థమైన మిథ్యాభూతమగు ఆ పంచమశిరస్సుచే నేమి ప్రయోజనము గలదు? మఱియు, తక్కిన నాల్గుశిరస్సులతోటి యాతనియొక్క వేదోపదేశము గావించుట యేదికలదో, అద్దానిని జేయుటచే గాని చేయకుండుటచేగాని యాతనికి ప్రపంచమున నేప్రయోజనమున్ను లేదు.

యద్యథా నామ సంపన్నం తత్తథా స్త్వితరేణ కిమ్
ధత్తే వపుషి దుగ్ధాబ్ధిరుప్తామృతకలామివ. 47

ప్రాణుల కర్మవశముచే నే విషయమెట్లు సిద్ధించియున్నదో, అది యట్లే యుండుగాక మఱియొకదానిచే నేమిప్రయోజనము? క్షయింపని బాణములు గలిగియుండునట్లు అనుగ్రహింపఁ బడిన మన్మథుని వశముచే శివుఁడు మృగనేత్రియగు పార్వతిని తన అర్ధశరీరమున, గుప్తమగు అమృతకళను క్షీరసముద్రము తనయందు ధరించునట్లు, ధరించుచున్నాఁడు. మఱియు మన్మథుఁడు పరాజితుఁడు కాఁగా నిరుపద్రవమగు సమాధియొక్క ప్రవృత్తిచే ఆనందాశ్రువులనున్న నట్లే దేహమున ధరించుచున్నాఁడు.

శక్తోఽపి రాగితామేష న త్యజత్యుత్తమాశయః
పశ్చేషుదాహసమయే దృష్టా నీరాగతాగుణాః. 48

త్యజించుటకు సమర్థుఁడైనను పవిత్రాంతఃకరణయుక్తుఁడగు ఈ శివుఁడు రాగమును త్యజించుటలేదు. మన్మథుని దహనకాలమున ఈతనిరాగరాహిత్యాది గుణములు వీక్షింపఁబడినవిగదా!

నైవ తస్య కృతేనార్థో నాకృతనేహ కశ్చన
న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః. 49

ఆ శివునకు ఈ ప్రపంచమున నేదేని కార్యము చేయుటచేగాని చేయకుండుటచేగాని ప్రయోజనమెద్దియును లేదు. మఱియు సమస్తభూతములందును ప్రయోజననిమిత్త మాశ్రయింప వలసిన పదార్థమొకటియైనను నాతనికిలేదు.

రాగితైషాస్తు మా వాస్య కిమరాగితయాన్యయా
యద్యథా నామ సంపన్నం తత్తథాస్త్వితరేణ కిమ్. 50

ఆ శివునకు రాగముండినను, లేకుండినను రెండును సమానములే? అట్టిచో రాగరాహిత్యముచేగాని, లేక అన్యవిధమగు రాగముచేగాని యాతనికేమి ప్రయోజనము? ఏది యెట్లు సిద్ధించి యున్నదో, అది యట్లేయుండుగాక ! మఱియొకదానిచే నేమి ప్రయోజనము?

కరోతి కారయత్యుచ్చైర్మ్రియతే మార్యతేఽపి చ
జాయతే వర్ధతేఽజస్రం జీవన్ముక్తో జనార్ధనః. 51

జీవన్ముక్తుఁడగు విష్ణుభగవానుఁడు అసురాదుల నిగ్రహమును స్వయముగఁ జేయుచున్నాఁడు. ఇంద్రాదులచే లెస్సగఁ జేయించుచున్నాఁడు, అవతార సమాప్తియందు మరణము నంగీకరించు చున్నాఁడు. లుబ్ధకాదులచే వధింపఁబడుచునున్నాఁడు నిరంతరము జనించుచు, వర్ధిల్లుచునున్నాఁడు.

న చాజవం జవీభావం త్యక్తుం శక్తోఽప్యసౌ న తమ్
తేన త్యక్తేన నైవార్థస్తస్య నైవాశ్రితేన చ. 52

ప్రాణుల కర్మవశముచే సంప్రాప్తించిన వ్యవహారవ్యగ్రత్వమును సమర్థుఁడైనను విష్ణుభగవానుఁడు త్యజించుటలేదు. దానిని త్యజించుటచేగాని గ్రహించుటచేగాని యాతనికేప్రయోజనమున్నులేదు.

తద్యథాస్థిత మేవాస్తు ఇహ ఇత్యస్తవాసనమ్
హరిర్నిరిచ్ఛ ఏవాస్తే శుద్ధచిన్మాత్రరూపభృత్. 53

'ఈ ప్రపంచమున నేదియెట్లున్నదో, అదియట్లేయుండుగాక !' అనితలంచి విష్ణుభగవానుఁడాయాకార్యములఁ జేయుచున్నప్పటికిని వాసనారహితుఁడై, ఏ కోర్కెయు లేక, శుద్ధ చిన్మాత్రరూపధారియై యున్నాఁడు.

ఆత్మానిమాన్దోలయతి కాలకన్దుకతాం గతమ్
అజస్రం నిత్యమాదిత్యో జగద్గృహనభోఙ్గణే. 54

ఈ జగత్తను గృహముయొక్క ఆకాశమను ముంగిటియందు కాలముయొక్క కందుక (బంతి) రూపత్వమును బొందినవాఁడై సూర్యభగవానుఁడు నిరంతరము తన్ను పరిభ్రమింపఁ జేసికొనుచున్నాఁడు,

నచ రోధయితుం దేహం న సమర్థో దినేశ్వరః
నిరిచ్ఛ ఏవ నిర్వాణస్తథాప్యాస్తే యథాస్థితమ్. 55

సమర్థుడైనను దినపతియగు సూర్యభగవానుఁడు తన యా దేహమును నిరోధింపకయే యున్నాఁడు. జీవన్ముక్తుఁడగుటచే నాతఁడిచ్ఛారహితుఁడై యథారీతి వర్తించుచున్నాఁడు.

చన్ద్రోఽనుభవతి వ్యర్థమాకల్పం క్షయమక్షయమ్
జీవన్ముక్తతయాఽఖిన్నో యథా స్థితమవస్థితః. 56

మఱియు, చంద్రుఁడు కల్పాంతమువఱకు వ్యర్థముగ వృద్ధిక్షయముల ననుభవించుచున్నను, జీవన్ముక్తుఁడైన కారణమున దుఃఖరహితుఁడై ఎప్పటియట్లే స్థితినొందియున్నాఁడు.

మరుత్తహవ్యగౌరీశవీర్యగ్రాసాదిఖేదితామ్
జీవన్ముక్తో [illegible] సమస్థితిః. 57

మరుత్తునియజ్ఞమును పండ్రెండు వత్సరములవఱకు నిరంతరము ఏనుఁగుతొండమంత ప్రమాణమున ఘృతధారాదులు పడుటవలన గలిగిన అజీర్ణతచేతను, కుమారస్వామియొక్క జనన ప్రసంగమున శివుఁడు పార్వతితోటి సమాగమమునుగావించునపుడు దేవతలచే విఘ్నమొనర్పఁబడ వీర్యము తన స్థానమునుండి క్షుభితముకాఁగా బ్రహ్మదేవుని యాజ్ఞచే నద్దానిని ద్రావుటచే లోన జనించిన దాహముచేతను, దేవతాదులచే నిరంతర మొసంగఁబడుచుండు హవ్యపదార్థములను వహించుటచేతను, (ఈ మొదలుగా గలవానిచే జనించినట్టి ఖేదమును అగ్నిదేవుఁడు జీవన్ముక్తుఁడగుటవలననే సమస్థితితోటి వహించుచు యథారీతి వెలయుచున్నాఁడు.

బహ్వీభిర్విజిగీషాభిః కృపణావివ తిష్ఠతః
జీవన్ముక్తావపి రుషా లోకే శుక్రబృహస్పతీ. 58

జీవన్ముక్తులైనను, గురువులగు శుక్రాచార్య, బృహస్పతు లిరువురును కృపణులవలె లోకమున పరస్పరము జయించుకొనుటఁగూర్చిన యనేకయభిలాషలతోఁ గూడియున్నారు.

కరోతి జనకో రాజ్యం జీవన్ముక్తమనా మునిః
జగత్యామాజిషూగ్రాసు దేహం జర్జరతానయన్. 59

ఈ ప్రపంచమున జీవన్ముక్తమానసుఁడైన మునియగు జనకమహారాజు భయంకర యుద్ధములందుఁ దన శరీరమును శిథిలమొనర్చుకొనుచు రాజ్యమును బాలించుచున్నాఁడు.

నలమాన్ధాతృసగరదిలీపనహుషాదయః
జీవన్ముక్తాశ్చిరం రాజ్యం చక్రురాకులితా ఇవ. 60

జీవన్ముక్తులైనను నల, మాంధాతృ, సగర, దిలీప, నహుషాది రాజులు వ్యాకులత్వముతోఁగూడినవారివలెఁ జిరకాలము రాజ్యమేలిరి.

వ్యవహారేయథైవాజ్ఞస్తథైవ ఖలు పణ్డితః
వాసనావాసనే ఏవ కారణం బన్ధమోక్షయోః. 61

వ్యవహారమందు జ్ఞానియు, అజ్ఞానియు నిరువురును సమానముగనే వర్తించుదురు. కేవలము వాసనా, వాసనారాహిత్యములే క్రమముగ బంధ, మోక్షములకు కారణములైయున్నవి.

బలిప్రహ్లాదనముచివృత్రాన్ధకమురాదయః
జీవన్ముక్తాః స్థితిం చక్రుర్వీతరాగాః సరాగవత్. 62

జీవన్ముక్తులును, రాగవర్జితులునైనను బలి, ప్రహ్లాద, నముచి, వృత్ర, అంధక మురాద్యసురులు రాగయుక్తులవలె ఈ ప్రపంచమున స్థితిగల్గియుండిరి.

తస్మాదసత్త్వేసత్త్వే చ రాగద్వేషక్షయోదయే
న మనాగపి భేదోఽస్తి జ్ఞ ఖం ప్రతిస్వరూపిణి. 63

కావున, చిదాకాశస్వరూపమును బొందినట్టి జీవన్ముక్తులకు రాగద్వేషముల యొక్క క్షయ ఉదయములందును, సుచారిత్ర, దుశ్చారిత్రములందును, మోక్షవిషయమున సందేహమొకింతైనను లేదు.

జ్ఞానేనాకాశశుద్ధేన ధర్మాన్యే గగనోపమాన్
విన్దన్తి జీవన్ముక్తానాం తేషాం భేదమతిః కుతః. 64

చిదాకాశమువలె శుద్ధమైనట్టి అంతిమ సాక్షాత్కార వృత్తిరూపమగు జ్ఞానముతోఁ గూడి దేహ, మనః, ప్రాణేంద్రియాది ధర్మములను ఏ జీవన్ముక్తులు అద్వయపరిపూర్ణ బ్రహ్మభావముతో చిదాకాశతుల్యములుగ ధరించుచున్నారో, అట్టి జీవన్ముక్తుల కిఁక భేదబుద్ధి యెచట?

భాస్వరం శక్రకోదణ్డం యథా నానేవ శూన్యకం
ఆభాసమాత్రమేవాయం తథా దృశ్యాత్మకో భ్రమః. 65

మేఘపటలమందున్న సూర్యకిరణములు శూన్యరూపములైనను, వివిధ వర్ణములచేఁ బ్రకాశమానమగు ఇంద్రధనుస్సువలె నెట్లు గోచరించుచున్నవో, అట్లే యీ దృశ్య భ్రమయున్ను ఆభాసమాత్రమే యైయున్నది.

శక్రచాపే యథా భాన్తి నానావర్ణా నభోఙ్గణే
తథా శూన్యాత్మకా ఏవ బ్రహ్మాణ్డపరమాణవః. 66

ఆకాశమగు ముంగిటియందు ఇంద్రధనుస్సునందు వివిధ వర్ణములు భాసించినను, వాస్తవముగ నవి యెట్లు శూన్యరూపములే యైయున్నవో, అట్లే యీ బ్రహ్మాండములను పరమాణువులున్ను శూన్యరూపములే యైయున్నవి.

ఇదం జగదసద్భాతి సదివ వ్యక్తిమాగతమ్
అజాతమనిరుద్ధం చ యథా శూన్యత్వమమ్బరే. 67

ఎన్నఁడును బుట్టనిదియు, నశింపనిదియునగు అసత్తైన యీ జగత్తు సత్తువలె ప్రకటమైనదై ఆకాశమందు శూన్యత్వమువలె భాసించుచున్నది.

సాద్యన్తమప్యనాద్యన్తమశూన్యమపి శూన్యకమ్
జగజ్జాతం తథా జాతమరుద్ధం రుద్ధమేవ చ. 68

ఈ జగత్తు (వాస్తవముగ నిత్య, కూటస్థ, అసంగ, అద్వయ, పరిపూర్ణ, బ్రహ్మరూపమే గావున) ఆద్యంతములతోఁ గూడినట్లున్నను, అనాదియై, అనంతమైనదియు అశూన్యమై (పదార్థ సహితమై) యున్నను, శూన్య (పదార్థరహిత) మైనదియు, ఉత్పన్నమైనట్లున్నను, ఉత్పన్నము కానిదియు నశించినట్లున్నను, నశింపనిదియునైయున్నది.

జాతం నిరుద్ధమస్త్యేవం బ్రహ్మవ్యోమైవ భాసతే
యథా దారుమయః స్తమ్భస్తథా తచ్ఛాలభఞ్జికా. 69

స్తంభము దారు (కొయ్య) మయమగు దారువే అయియున్నట్లును, అందు ఏకదేశమున నున్న ప్రతిమయు దారువేయై వెలమునట్లును, ఉత్పన్నమై, నశించుచున్నట్లు కల్పనచే భాసించు ఈ జగత్తంతయు వాస్తవముగ చిదాకాశమే యైయున్నది.

సమస్తకలనోన్ముక్తం సమం నిర్నిద్రమాసనమ్
యదేకాన్తచిదాకాశం తద్విద్యాత్తన్మయం జగత్. 70

సర్వకల్పనా వర్జితమై, సర్వత్ర ఏకరసమై, కేవల చిదాకాశ రూపమై నిద్రారహితమైనట్టి సమాధికాలమందలి యే స్థితిగలదో. అద్దానిచేఁ బరిపూర్ణమై (తన్మయమై) యీ జగత్తు వెలయుచున్నదని యెఱుఁగవలయును.

దేశాద్దేశాన్తరప్రాప్తౌ యన్మధ్యే సంవిదో వపుః
అనున్మేషం చిదాకాశం తద్విద్యాత్తన్మయం జగత్. 71

ఒక ప్రదేశమునుండి దూరముననున్న మఱియొక ప్రదేశమునకు నేత్రేంద్రియముద్వారా బుద్ధివృత్తి చనునపుడు ఆ రెండు ప్రదేశముల మధ్యనుండు నిర్విషయమగు సంవిత్తుయొక్క స్వరూప మేదిగలదో, అట్టి నిశ్చల చిదాకాశముచేఁ బరిపూర్ణమై (తన్మయమై) ఈ జగత్తు విలసిల్లుచున్నదని యెఱుగవలయును.

తత్ర యద్ద్వైతమైక్యం తన్మన్యే తదపి నైవ చ
తద్వ్యోమ కేవలం భాతి మన్యే తదపి నైవ వా. 72

అట్టి చిదాత్మయందు ద్వైత (విశేషరూప) ఐక్య (సామాన్యరూప)ము లెవ్వి భాసించుచున్నదో అవియు. ఆ చిదాకాశ స్వభావమువలననే లేవనియే నిశ్చయించుచున్నాను. మఱియు దానియందు శూన్యత్వ మెయ్యది భాసించుచున్నదో అదియును లేదనియే నమ్ముచున్నాను. (పూర్ణానందైకరస స్వరూపమున శూన్యత్వము అసంభవము గనుక.)

జగదాకాశమేవేదమాత్మైవాత్మని వా స్థితమ్ :
భవిష్యత్పురవద్దృష్టమపి స్ఫారమపి స్ఫుటమ్. 73

జలశూన్యమగు ఘటము లేక జలముచేఁ బూర్ణమగు ఘటము అను వ్యవహారమువలె శూన్యత్వ, పూర్ణత్వములు రెండును మఱియొక 'ప్రతియోగి' నపేక్షించి వర్తించును. కాఁబట్టి అయ్యవి అద్వయమగు ఆత్మయందు సంభవింపనేరవు. భవిష్యన్నగరమువలె విశాలస్పష్ట దేశకాలాదులతోఁగూడి కానుపించు ఈ జగత్తు, అధిష్ఠానదృష్టిచే చిదాకాశరూపమగు బ్రహ్మమే (ఆత్మయే) అయియున్నది.

ఆకాశకోశ విశదాశయ దృశ్యజాతం
మౌనాత్మ తిష్ఠతి శిలాఘనమేవ శాన్తమ్
యన్నామ తస్య జగదిత్యభిధాం విధాయ
స్వాత్మైవ మోహిత ఇవాయమహో ను మాయా. 74

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే
జీవన్ముక్తకలనం నామ పఞ్చవింశత్యధిక శతతమః సర్గః ॥ 125 ॥

ఆకాశకోశమువలె విశాలమైనట్టి ఆశయముగల ఓ రామచంద్రా! శిలాఘనమువలెఁ బ్రశాంతముగను, మౌనముగను నున్నట్టి బ్రహ్మరూపమే యగు ఈ దృశ్య సమూహ మెద్దిగలదో, అద్దానికి స్వాత్మయే జగత్తను పేరును విధించి స్వమాయచే మోహితమైనదానివలె నున్నది. ఆహా! ఈ మాయ యెంత ప్రబలమైనది.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అవి ॥ విప ॥ జీవన్ముక్తకలనమను నూటయిరువదియైదవ సర్గము ॥ 125 ॥

❖❖❖❖❖❖❖❖❖❖

షడ్వింశాధికశతతమః సర్గః

[మృతానామిహ సర్వేషాం స్వాన్తః సంసృతివిభ్రమః
ఉత్తరస్య తమఃఖాతదర్శనాన్తోఽనువర్ణ్యతే.

మరణించినట్టి విపశ్చితులందఱియొక్క అంతఃకరణమునందలి సంసారభ్రమ, ఉత్తర దిక్కునందలి విపశ్చిత్తుయొక్క అంధకారమయమగు కందకముయొక్క దర్శనమువఱకునైన భ్రమ యిచట వర్ణింపఁబడుచున్నవి.]

శ్రీరామ ఉవాచ :—

అనన్తరం మునిశ్రేష్ఠ కుర్వన్తః కిం విపశ్చితః
ఆసంస్తేషు దిగన్తేషు సద్వీపాబ్ధివనాద్రిషు. 1

శ్రీరాముఁడు:— ఓ మునీంద్రా! అటుపిమ్మట ద్వీప, సముద్ర, వన పర్వతాదులతోఁ గూడిన యా దిగంతములందు ఆ విపశ్చిత్తు లేమిచేయుచుండిరి?

శ్రీవసిష్ఠ ఉవాచ :—

శృణు కిం వృత్తమేతేషాం తాత తత్ర విపశ్చితామ్
తాలీతమాలమాలాఢ్య ద్వీపాద్రివనచారిణామ్. 2

శ్రీవసిష్ఠుఁడు:— ప్రియుఁడవగు రామచంద్రా! అచట తాళ, తమాలాది వృక్షములచేఁ బూర్ణములగు ద్వీప, వన, పర్వతాదులందు సంచరించు ఆ విపశ్చిత్తులయొక్క వృత్తాంతమునుగూర్చి వినుము!

క్రౌఞ్చద్వీపగిరేరేకో విపశ్చిత్పశ్చిమే తటే
కటేనాద్రితటే పిష్టః కరిణా కమలం యథా. 3

ఆ విపశ్చిత్తులందొకనిని 'క్రౌంచ' ద్వీపమందలి ప్రసిద్ధమగు వర్షసీమ పర్వతముయొక్క పశ్చిమభాగమునగల యొకానొక శిలపై నొక గజము తన గండస్థలముచే, కమలమునువలెఁ బొర్లమొసిపైచెను.

ద్వితీయో నభసానీతో రక్షసా విక్షతాఙ్గకః
నిక్షిప్తో వాడవే వహ్నౌ తత్ర భస్మత్వమాగతః. 4

రెండవ విపశ్చిత్తును ఒక రాక్షసుఁడు యుద్ధమున భగ్నశరీరునిగఁ గావించి యాకసమునకుఁ గొనిపోయి యటనుండి సముద్రమందలి బడబాగ్ని మధ్యమునఁ బడవేయ అచట నాతఁడు భస్మీభూతుడాయెను.

తృతీయస్త్రైదశం దేశం నీతో విద్యాధరేణ వై
గతోఽప్రణామకుపితశక్రశాపేన భస్మతామ్. 5

మూఁడవ విపశ్చిత్తును ఒక విద్యాధరుఁడు స్వర్గమున నింద్రసభకుఁ గొనిపోవ అచట నమస్కారము గావింపనందున ఇంద్రుఁడు కుపితుఁడై శపించి యాతనిని భస్మము చేసివైచెను.

చతుర్థశ్చతురం గచ్ఛన్కుశద్వీపగిరేస్తటే
దుర్వారేణ నదీకచ్ఛే మకరేణాష్టధా కృతః. 6

నాల్గవ విపశ్చిత్తును 'కుశ' ద్వీపమందలి యొకానొక పర్వతముయొక్క సమీపమున గల నదీతటమున నొక మొసలి యెనిమిది తునుకలు గావించి చంపివైచెను.

ఇతి తే పఞ్చతాం ప్రాప్తా దిఙ్ముఖేష్వాకులాశయాః
క్షయే చతుర్షు చత్వారో భూపాలా లోకపాలవత్. 7

ఈప్రకారముగ దిగంతములందు వ్యాకుల చిత్తులగు ఆ నలుగురు విపశ్చిద్రాజులున్ను కల్పాంతమందు లోకపాలురవలె మృతినొందినవారైరి.

అథ తేషాం దదర్శాసౌ వ్యోమ్న్యేవ వ్యోమరూపిణామ్
సంవిత్ప్రాక్తనసంస్కారాద్వ్యోమాత్మావని మణ్డలమ్. 8

మరణానంతరము వారి సంవిత్తు ఆకాశరూపమును బొందినదై, ఆ యాకాశమందే పూర్వసంస్కారముచే భూమండలమును వీక్షించెను.

సప్తద్వీపాబ్ధివలయం పురపత్తనభూషణమ్
సురశైలశిరఃపీఠం బ్రహ్మలోక శిరోమణిమ్. 9

చన్ద్రార్కబిమ్బనయనం తారాముక్తాకలాపకమ్
విలోలమేఘవసనం నానావనతనూరహమ్. 10

సప్తద్వీప, సప్తసముద్రములను కంకణముగలదియు, నగర, పట్టణములను భూషణములచే నొప్పునదియు, సుమేరు పర్వతమను శిరఃస్థానముచే శోభించునదియు, బ్రహ్మలోకమను శిరోమణిగలదియు, చంద్రసూర్యులను నేత్రములు గల్గియున్నదియు, నక్షత్రములను ముత్యాల హారముచే నలంకృతమైనదియు, చంచల మేఘములను వస్త్రముల ధరించినదియు, వివిధ వన వృక్ష లతాదులను రోమసమూహము గలదియునగు భూమండలమును వారి సంవిత్తపుడు గాంచెను.

దేహాన్విపశ్చితాం సంవిద్దదర్శ చతురోఽపి సా
ప్రాగ్వత్కల్పపరావృత్తౌ ద్యౌర్దిగన్తానివాతతాన్. 11

సృష్ట్యారంభకాలమునఁ బ్రథమమున సృష్టింపఁబడిన ప్రజాపతులు ఆకాశమున విశాల దిగంతములను వీక్షించునట్లు ఆ నలుగురు విపశ్చిత్తులయొక్క సంవిత్తున్ను తన దేహములను బూర్వమువలెనే గాంచెను.

ఆతివాహికసంవిత్తేస్తేఽ వ్యోమ్ని వ్యోమ్ని వ్యోమతాత్మకాః
ఆధిభౌతికదేహత్వభావాన్దదృశురగ్రతః. 12

ఆకాశరహితమగు చిదాత్మయందు, ఆకాశ ప్రతీతిరూపులగు ఆ విపశ్చితులు మానస ప్రతిభాసమాత్రముయొక్క విషయమగు ప్రాతిభాసిక (సూక్ష్మ) దేహమున, అధిభౌతిక (స్థూల) దేహ సంబంధములగు స్థూల, జడపదార్థముల నపుడు తమయెదుట గాంచిరి.

అస్యాత్మకత్వే విద్యేయం కియతీ స్యాదితీక్షితుమ్
చత్వారోఽపి ప్రవృత్తాస్తే సంస్కారవశతః పురః. 13

'ఈ దేహమునకు ఆత్మజ్ఞానములేనిచో ఈ పృథ్వ్యాది దృశ్యరూపమైన అవిద్య యెంత పరిమాణము గల్గియుండునను' విషయము నవలోకించుటకై వారపుడు తమపూర్వకాలిక సంస్కారముచేఁ బ్రవృత్తులైరి.

దృశ్యదర్శనయోరుర్వీ మణ్డలానుభవాకృతేః
నిష్ఠాం ద్రష్టుమవిద్యాయా భ్రేముర్ద్వీపాన్తరాణి తే. 14

దృశ్యదర్శనముల మధ్య భూమండలరూపమైన అనుభవాకారమగు అవిద్యయొక్క పరిమాణ మెంతయై యుండునని గాంచుటకై వారొక ద్వీపమునుండి మఱియొక ద్వీపమునకు పరిభ్రమించుచునుండిరి.

ద్వీపసప్తకముల్లఙ్ఘ్య సమహార్ణవసప్తకమ్
విపశ్చిత్పశ్చిమః ప్రాప ఘనభూమౌ జనార్దనమ్. 15

సప్త మహాసముద్రములతోఁ గూడిన సప్త ద్వీపములను దాటి పశ్చిమ దిశయందలి విపశ్చిత్తు స్వర్ణమయమగు భూమిని బొంది యట క్రీడించుచున్న విష్ణుభగవానుని సౌభాగ్య వశముచేఁ గాంచెను.

తస్మాదనుపమం జ్ఞానం సమాసాద్య దిగన్తరే
తస్మిన్నేవ సమాధానే సోఽతిష్ఠద్వర్షపఞ్చకమ్. 16

తతో దేహం పరిత్యజ్య చిత్తే సత్తాముపాగతే
స తత్రాప్రాణ ఇవాకాశం పరం నిర్వాణమాయయౌ. 17

ఆ విష్ణుభగవానునివలన నాతఁడు నిరుపమానమగు బ్రహ్మజ్ఞానమును బడసి, ఆ దిగంతరమందే ఐదు సంవత్సరముల వఱకు సమాధినిష్ఠుడై యుండెను. ఆ పిదప దేహమును ద్యజించి చిత్తము సన్మాత్ర రూపముకాఁగా నాతఁడు విదేహముక్తిని బడసెను. మఱియు నాతని ప్రాణమపుడు ఆకాశరూపమును బొందినదాయెను.

పూర్వః పర్వణి శీతాంశుబిమ్బపార్శ్వే స్థితం వపుః
చిన్తయంశ్చిరమున్నష్టదేహశ్చన్ద్రపురే స్థితః. 18

పూర్వదిశయందలి విపశ్చిత్తు పూర్ణ చంద్రబింబముయొక్క సమీపమందుఁ దన శరీరమును శుద్ధ చంద్రరూపముగ భావించుకొనుచుండ చిరకాలమునకు శరీరము నశింప, ఆ చంద్రలోకముననే స్థితిగల్గియుండెను.

దక్షిణః శాల్మలిద్వీపే రాజన్నుత్పన్నశాత్రవః
కరోత్యద్యాపి న సతో విస్మృతాన్యవినిశ్చయః. 19

దక్షిణదిక్కునందలి విపశ్చిత్తు శత్రువుల నందఱిని నశింపఁజేసి, నేటికిని శాల్మలిద్వీపమున రాజ్యము సల్పుచునున్నాఁడు తత్త్వజ్ఞానములేమి బాహ్యపదార్థముల విస్మరణ మాతనికి లేక యున్నది.

ఉత్తరస్తరలాస్ఫాలకల్లోలే సప్తమామ్బుధౌ
సహస్రమేకం వర్షాణామువాస మకరోదరే. 20

మకరోదరమాంసాశీ మృతే మకరనాయకే
మకరోదరతోఽబ్ధేశ్చ నిర్గతో మకరో యథా. 21

ఉత్తరదిక్కునందలి విపశ్చిత్తు విశాల, చంచల తరంగయుక్తమగు సప్తమ (స్వాదూద) సముద్రమున నొక మొసలిచే మ్రింగఁబడి యద్దాని యుదరమున వేయి సంవత్సరములవఱకు నివసించెను అచ్చోట నాతఁడా మొసలియొక్క మాంసమునే భుజించుచునుండి, క్రమముగ ఆమకరనాయకుఁడు మరణింప, అద్దానియుదరమునుండియు, సముద్రమునుండియు మకరము (మొసలి)వలె బయటకు వచ్చెను.

తతోఽశీతిసహస్రాణి యోజనానాం ఘనావనిమ్
హిమకల్ప జలామ్భోధేరుల్లఙ్ఘ్య సుఘనోదరీమ్. 22

ప్రాప్తో దశసహస్రాణి యోజనానాం మహామహీమ్
సౌవర్ణీం సురసంచారసరణిం మృతవానసౌ. 23

తదుపరి, మంచువలె శీతలమైనట్టి జలముగల స్వాదూద మహాసముద్రము యొక్క తక్కిన యెనుబదివేల యోజనముల దూరమునుగూడ దాటివైచి యాతఁడు, విశాలమైన యుదరము గలదియు, పదివేలయోజనముల విస్తీర్ణముగలదియు, దేవతలుసంచరించు మార్గమున్నునగు సువర్ణమయమైన గొప్ప భూప్రదేశమునుబొంది యచట మరణించెను.

తస్యాం భూమౌ చ మధ్యే చ విపశ్చిన్నాకితామగాత్
ఉత్తమామగ్నిమధ్యస్థం క్షణాత్కాష్ఠమివాగ్నితామ్. 24

అట్లాభూమిపై మరణించినపిమ్మట, అగ్నిమధ్య యందున్న కాష్ఠము క్షణకాలములో అగ్నిరూపత్వముఁ జెందునట్లు, ఆతఁడు ఉత్తమదేవ రూపమునుబొందెను.

ప్రధానదేవో భూత్వాసౌ లోకాలోకగిరిం గతః
అస్య భూమణ్డల తరోరాలవాలమివ స్థితమ్. 25

స పఞ్చాశత్సహస్రాణి యోజనానాం సమున్నతః
ఆలోకాలోకాచారాఢ్యో భాగ ఏకోఽస్య నేతరః. 26

ప్రధానదేవతయై యాతఁడటు పిమ్మట తన పూర్వకాలపు దిగంతసంచార వాసనచే లోకాలోక పర్వతమునకుఁజనెను. అయ్యది మేరుపర్వతమువలె నున్నతమగుటచే ఈ భూమండలమను వృక్షముయొక్క ఆలవాలము (పాదు) వలెఁ జూపట్టుచుండెను. మఱియు, నది యేఁబదివేల యోజనముల యెత్తుగలదైయున్నది. ఆ లోకాలోక పర్వతముయొక్క ప్రథమభాగము మాత్రము సూర్య ప్రకాశముతోఁగూడినదై జనుల వ్యవహారముచేఁ బూర్ణమైయున్నదిగాని తక్కిన భాగములుకాదు.

లోకాలోకశిరః ప్రాప్తం తారకామార్గ సంస్థితమ్
అధఃస్థితా అపశ్యం స్తముచ్చనక్షత్రశఙ్కయా. 27

నక్షత్రమార్గమునను న్నట్టి యా పర్వతముయొక్క అత్యున్నతమైన శిఖరమునుబొందిన యావిపశ్చిత్తును క్రిందనున్న ప్రాణులు నక్షత్రమనుశంకచే నవలోకించిరి.

తస్మాత్ప్ర దేశాత్తత్పారే తమ స్తస్య మహాగిరేః
చతుర్దిక్కం మహాఖాతం నభః శూన్యమన న్తకమ్. 28

ఆ లోకాలోక మహాపర్వతముయొక్క యా ప్రదేశమున కావలిభాగమున, అంధకారమయమైనదియు నలువైపుల నతివిశాలమై అనేకయోజనములవఱకు విస్తరించియున్నదియు, సర్వప్రాణిరహితమై ఆకాశమువలె శూన్యమై యొప్పుచున్నదియునగు కందకము (అగడ్త) వంటి యాకృతిగల గర్తము (గోయి) కలదు.

తతో భూగోలకోఽయం హి సమాప్తో వర్తులాకృతిః
నభఃశూన్యం మహాఖాతం తత స్తిమిరపూరితమ్. 29

అచ్చోట, వర్తులాకారముగల యీ భూగోళము సమాప్తమైనది. కేవలము అంధకారముచే బూర్ణమై, ఆకాశమువలె శూన్యమైనట్టి గొప్ప కందకము మాత్రము గలదు.

తత్రకాలికజ్జల తమాలన భో స్తరాల నీలం తమో న చ మహీ న చ జంగమాది
నాలమ్బనం న చ మనాగపి వస్తుజాతం కించిత్క్వచిదపి సంభవతీతి విద్ధి. 30

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే విపశ్చిజ్జన్మాన్తరాచరణం నామ షడ్వింశాధిక శతతమః సర్గః ॥ 126 ॥

ఓ రామచంద్రా! ఆ కందకమున తుమ్మెదవలెను, కాటుకవలెను, తమాలవృక్షము (చీఁకటిమ్రాను) వలెను నల్లనైనట్టి యాకాశముయొక్క మధ్యమున అంధకారము మాత్రమేగలదు. అచట భూమిగాని, జంగమాది ప్రాణి సముదాయముగాని, ఏదైన ఆశ్రయముగాని లేదు. మఱియు, ఆ ప్రదేశమున నెపుడును ఏ వస్తువున్ను సంభవింపనేరదని యెఱుఁగుము.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున అవి॥ విప॥ విపశ్చిజ్జన్మాంతరాచరణమను నూటయిరువదియాఱవ సర్గము ॥126॥

సప్తవింశాధిక శతతమః సర్గః

[భూమినక్షత్రచక్రాదేః స్థితిస్తత్పరతో నభః
బ్రహ్మాణ్డఖర్పరద్వన్ద్వస్థితిశ్చాత్రోపవర్ణ్యతే.

భూమియొక్కయు, నక్షత్రాదులయొక్కయు, పైవచించిన కందకమున కావలగల యాకాశముయొక్కయు, బ్రహ్మాండముయొక్క యిరుకపాలములయొక్కయు, స్థితియిచట వర్ణింపఁబడుచున్నది.]

శ్రీరామ ఉవాచ:—

భగవన్కథయైతన్మే కథం భూగోలకం స్థితమ్
కథమృక్షగణో యాతి లోకాలోకః కథంగిరిః. 1

శ్రీరాముఁడు:— మహాత్మా! నిరాధారమగు ఈ భూగోళమెట్లు స్థితినొందియున్నది? నక్షత్రమండలమున్ను నిరాధారముగ నెట్లు పరిభ్రమించుచున్నది(మఱియు) లోకాలోకమను పేరు ఆ పర్వతమున కెట్లు కలిగినది? వచింప ప్రార్థన,

శ్రీవసిష్ఠ ఉవాచ:—

యథా సంకల్పరచితా శిశోర్వ్యోమని తిష్ఠతి
పీఠా చిన్మాత్రబాలేన కల్పితా భూస్తథామ్బరే. 2

శ్రీవసిష్ఠుడు:— ఓ రామచంద్రా! బాలుని సంకల్పముచే రచితమగు ఆకాశమున కందుకము (బంతి) యెట్లు స్థితినొందియుండునో, అట్లే చిన్మాత్రబాలకుని (హిరణ్యగర్భునిచే కల్పితమగు ఈ భూలోకమున్ను ఆకసమున స్థితి నొందియున్నది.

యథా తిమిరికాక్షాణాం కేశచన్ద్రాదిదర్శనమ్
చిదాకాశస్య సర్గాదౌ తథా పృథ్వ్యాదిదర్శనమ్. 3

తిమిరరోగగ్రస్తములగు నేత్రములుగలవారికి ఆకసమున కేశ చంద్రాదులు కనుపించునట్లు అవిద్యచే సృష్ట్యాదియందు చిదాకాశమునకు పృథ్వ్యాదులు కానుపించుచున్నవి.

యథా సంకల్పనగరం ధార్యమాణం న దృశ్యతే
ధార్యతేఽధార్యతే మా చ తథోర్వ్యనుభవశ్చితేః. 4

ఎట్లు సంకల్పసగరము ధరింపఁబడినప్పటికిని సంకల్పించువానికంటె వేఱైనవానిచే నయ్యది యనుభూతముగాక యున్నదో. మఱియు. సాంకల్పిక స్తంభాదులచే నది ధరింపఁబడినప్పటికిని అట్టి స్తంభాదులు మిథ్యయగుటఁబట్టి ధరింపఁబడకయే యెట్లున్నదో, అట్లే చైతన్యముయొక్క యీ పృథ్వ్యాదుల యనుభవమును గూర్చియు నెఱుఁగవలయును.

యద్యథా యావదాభాతి చితి చిత్త్వాత్స్వభావతః
తత్తథా తావదాభాతి తత్ర తత్ర తదాత్మకమ్. 5

చైతన్యము నిజచిత్స్వభావమువలన నెచటెచట నేయేరూపముచే నెంతెంత ఆయువుతో గూడి వర్తించునో, అచటచట నాయారూపముచే నంతంతయాయువు వఱకయ్యది భాసించును.

తమిరాత్రకా న్తనేత్రస్య కేశోణ్డ్రకమివామ్బరే
చిన్మాత్రస్య మహీగోలో యో భాతః స తథా స్థితః. 6

తిమిరరోగగ్రస్తములగు నేత్రములుగలవానికి ఆకాశమున కేశచంద్రాదులు కన్పించునట్లు, అవిద్యచే చిన్మాత్రమునకే భూగోళ మేరీతి కానుపించుచున్నదో, అది ఆరీతిగనే స్థితిగల్గియున్నది.

ఊర్ధ్వం వహన్త్యః సరిత స్తదధస్తాద్ధుతాశనః
చితి చేత్స్వప్నవద్భాతి తత్తథా తత్థితం భవేత్. 7

నదీజలము ఊర్ధ్వముఖముగా, ప్రవహించుట, అగ్నియధోముఖముగా జ్వలించుట అను ఈ విపరీతస్వభావము సృష్ట్యాదియందొకవేళ చైతన్యమున భాసించుచో, అది స్వప్నమందువలె, నేఁటికిని నట్లే యుండునుగాని అన్యముగఁగాదు.

తస్మాత్పతన్తి భూర్భాతా పతత్యేవానిశంజగత్
ఉత్పతన్తి తు చిద్భాతా తథా నానాత్మికా భవేత్. 8

ఇక్కారణముననే అయావాదులయొక్క, భూగోళమునుగూర్చిన నిరంతరపతన, యూర్ధ్వగమన, భ్రమణాది వివిధకల్పనలు వారివారి బుద్ధ్యవచ్ఛిన్నమగు చైతన్యసత్తనుబట్టి సత్యములే యగును.

స్తబ్ధభాతా స్థితా స్తబ్ధా సాలోకా తు ప్రకాశినీ
నిరాలోకా నిరాలోకాలోకానామాత్మని స్థితా. 9

ఈ భూగోళము కొందఱుజీవులకు నిశ్చలముగను, రాత్రిందినములు అప్రతిహత దృష్టిగల మఱికొందఱికి నిరంతరము ప్రకాశమయముగను, జాత్యంధులకు సదా యంధకారమయముగను భాసించుచున్నది. ఇవ్విధముననది ఆయాజీవుల బుద్ధ్యవచ్ఛిన్న చైతన్యమున వివిధరీతుల స్థితిగల్గియున్నది.

చిద్భానైకానుసారేణ తారాచక్రం తథా మహీ
అనదేవ సదైవేదం భాతీదమవిఖణ్డితమ్. 10

ఈ ప్రకారముగ అసద్రూపములగు ఈ నక్షత్రమండలము, భూమి చైతన్యముయొక్క భావము (ప్రకాశము) ననుసరించి సదా అఖండరూపముగ భాసించుచున్నవగును.

ఆలోకాలోకమేవాథ నభఃభాతం తతో మహత్
తమ ఏకార్ణవాకారం స్థితం తత్ర క్వచిత్క్వచిత్. 11

ఈ భూమి లోకాలోక పర్వతముపఱకుఁగలదు; ఆ పిమ్మట అకాశరూపమగు వలయాకారమైన గొప్పకందకముగలదు. అచట మహాసముద్రాకారముగ అంధకారము వ్యాపించియున్నది. అచటచట ఆ పర్వత శిఖరములమధ్యయం డొకింతసూర్య ప్రకాశమున్ను ప్రవేశించుచున్నది.

దూలత్వాదృక్షచక్రస్య కరాలత్వాన్మహాగిరేః
క్వచిత్తమః క్వచిత్తేజ స్తత్రావాచత్వరేఽపి చ. 12

నక్షత్రమండలము అతిదూరమున నుండుటచేతను, అమహాపర్వతము అత్యున్నతమై యుండుటవలనను, ఆ పర్వతమున నొకచోట అంధకారము, ఒకచోట నుపరిభాగమందలి సమభూమివఱకు ప్రకాశము వ్యాపించియున్నవి. కావుననే, అయ్యది 'లోకాలోక' మనఁబడినది

లోకాలోకగిరేః పారే స్థితాదాకాశమణ్డలాత్
దశదిక్కం సుదూరేణ ఋక్షచక్రం వివర్తతే. 13

ఆ లోకాలోక పర్వతముయొక్క చివరనున్న యాకాశ మండలమునుండి దశదిశలందును చాలదూరమున నక్షత్రచక్రము తిరుగుచున్నది.

అపాతాలదివోనద్ధమృక్షచక్రం తదమ్బరే
దశదిక్కం ప్రసరతి పతధూర్వాదృతేఽభితః. 14

పాతాళమునుండి మొదలుకొని స్వర్గమువఱకును నక్షత్రచక్రము ఆ పర్వతాకాశమున గ్రుచ్చబడినదై దశదిశలందును వ్యాపించియున్నది. మఱియు ఆ పర్వతము సర్వోన్నతమగుటచే ధ్రువనక్షత్రముతప్ప తక్కిన నక్షత్రములన్నియుఁ దానిచుట్టును పరిభ్రమించుచున్నవి.

భూలోకమేవ పాతాలయుతం నక్షత్రమణ్డలమ్
పర్యేతి లోకాలోకాన్తే నాన్యచ్చిత్కల్పనాచ్చ తత్. 15

ఇట్టి నక్షత్రమండలమంతయును, పాతాళసహిత సమస్తభూలోకమున్ను లోకాలోక పర్వతముయొక్క చివర ప్రదక్షిణముచేయుట యేదిగలదో, అది చైతన్యము యొక్క కల్పనతప్ప మఱేమియును గాదు.

సలోకాలోకభూలోకద్విగుణాచ్ఛాదనస్తరమ్
పక్వాక్షోటస్య భిస్సేవ స్థితం నక్షత్రమణ్డలమ్. 16

లోకాలోక పర్వత సహితమగు ఈ భూలోకము కంటె రెండు రెట్లధికమైన ఆకాశమునకావల నక్షత్రమండలము పక్వమగు 'అక్షోట' (అక్రోటు) ఫలముయొక్క బీజావరణ భాగమువలె స్థితినొందియున్నది.

ద్విగుణా నభ స్తస్మాదృక్ష చక్రస్య వృష్టజా
దశదిక్కం వినరతో బిల్వత్వక్సదృశస్థితేః. 17

భూలోకమునకంటె రెండు రెట్లధికమగు ఆ యాకాశముకంటె నక్షత్రమండలము రెండురెట్లధికముగ అంతర్భాగమున విస్తరించినదై దశదిశలందును పరిభ్రమించుచు బిల్వ (మారేడు) ఫలము యొక్క చర్మమువలె వెలయుచున్నది.

సంవిద్ఘనస్య కచనం యాదృశం కల్పనాత్మకమ్
యదిత్థం సంనివేశేన నన్వియం జాగతీ స్థితిః. 18

మాయాశబలిత బ్రహ్మముయొక్క సత్యసంకల్పరూపమగు స్ఫురణమేదిగలదో, అదియే యిట్లు బ్రహ్మాండ రూపముగ వర్తించు జగత్తుయొక్క స్థితియైయున్నది.

నక్షత్ర చక్రాద్ద్విగుణం తతోఽన్యద్విద్యతే నభః
తచ్చ క్వచిత్ప్రకాశాఢ్యం క్వచిత్సాన్ద్రతమోమయమ్. 19

ఆ నక్షత్రమండలమున కావల మరల దానికి రెండురెట్లధికమగు మఱియొక యాకాశముగలదు. అయ్యది యొకచోట ప్రకాశముచేఁ బరిపూర్ణమైయు, మఱియొకచోట దట్టమగు అంధ అంధకారముచే వ్యాప్తమైయు నున్నది

పర్యన్తే తస్య నభసః స్థితం బ్రహ్మాణ్డఖర్పరమ్
ఏకమూర్ధ్వే పరమధో గగనం మధ్యమేతయోః. 20

ఆ యాకాశముయొక్క చివరపైననొకటి, క్రిందనొకటి బ్రహ్మాండకపాలములుగలవు. ఆ రెంటి మధ్యను అకాశముగలదు.

యోజనానాం కోటిశతం పుష్టం వజ్రదృఢం చ తత్
స్థితం సంవేదనమయం వ్యోమ్ని వ్యోమమయాత్మకమ్. 21

ఆ బ్రహ్మాండకపాల మధ్యభాగము నూఱుకోట్ల యోజనముల పరిమితిగలదై వజ్రమువలె దృఢముగ విస్తరించియున్నది. ఇట్టియ్యది భౌతికరూపముతో కనుపించినప్పటికిని, పరమార్థమున చిదాకాశమే చిదాకాశమున నివ్విధమున వెలయుచున్నదగును.

సర్వదిక్కం మహాగోలే నభసి స్వర్కతారకమ్
కిమత్రోర్ధ్వమధః కిం స్యాత్సర్వ మూర్ధ్వ మధశ్చ వా. 22


మహాగోళాకారమగు ఆకాశమున సూర్యచంద్రాది సహితముగ ఈజ్యోతిశ్చక్రమంతయు సర్వదిశలందును స్థితినొందియున్నది. ఇట్లుండ, శూన్యాకారమగు ఈ యాకాశమున ఊర్ధ్వము గాని, అధస్త్వముగాని యేమియుండఁగలదు? ఒకవేళ యుండుచో అంతయు ఊర్ధ్వమే, అంతయు అధస్సే.

పతనముత్పతనం గగనం స్థితం చిత ఇతి స్ఫురితం నతు వస్తు తత్
పతనమస్తి న చోత్పతనం న వా గగనమాగమనం స్థితమిత్యపి. 23

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే మోక్షోపాయేషు
నిర్వాణప్రకరణే ఉత్తరార్ధే అవిద్యోపాఖ్యానాన్తర్గత విపశ్చిదుపాఖ్యానే
భూగోలనిర్ణయోనామ సప్తవింశాధికశతతమః సర్గః ॥ 127 ॥

ఓ రామచంద్రా! ఈ పృథ్వ్యాదులయొక్క పతన ఉత్పతన, భ్రమణ, స్థిత్యాదు లెవ్వి భాసించుచున్నవో, నవియన్నియు చైతన్యముయొక్క ప్రతిభాసమాత్రములేయగును. వాస్తవముగ, పతనముగాని, ఉత్పతనముగాని, గమనాగమనములుగాని, స్థితిగాని యెకింతైననులేవు. (అద్వయమగు బ్రహ్మముమాత్రమేగలదు.)

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు నిర్వాణప్రకరణమున నుత్తరార్ధమున
అవి॥ విప॥ భూగోళనిర్ణయమను నూటయిరువదియేడవ సర్గము ॥ 127 ॥



మహర్షి సద్గురు శ్రీమలయాళస్వాములవారు



శ్రీ వ్యాసాశ్రమము
ఏర్పేడు, చిత్తూరు జిల్లా - 517 621,
ఫోన్: 08578-287528, ఫ్యాక్స్: 287647